కవిసార్వభౌమ శ్రీనాథ విరచిత

శ్రీ శివరాత్రి మాహాత్మ్యము

వ్యాఖ్యాత
డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు
ఎం.ఏ., పిహెచ్.డి.



తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్‌గార్డెన్స్, నాంపల్లి
హైదరాబాదు - 500 004.

కవిసార్వభౌమ శ్రీనాథ విరచిత

శ్రీ శివరాత్రి మాహాత్మ్యము

(సుకుమార చరిత్రము)

(చంద్రికా వ్యాఖ్యాసహితము)

వ్యాఖ్యాత
డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు
ఎం.ఏ., పిహెచ్.డి.




తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్‌గార్డెన్స్, నాంపల్లి
హైదరాబాదు - 500 004.

SRINATHA'S
SRI SIVARATHRI MAHATMYAMU
COMMENTARY BY
JONNALAGADDA MRITYUNJAYA RAO

తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ సంఖ్య - 167

ప్రతులు - 2000
ప్రథమ ముద్రణ - 1995

వెల: 70/-



ప్రతులకు:
రిజిస్ట్రార్,
తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్‌గార్డెన్స్, నాంపల్లి,
హైదరాబాదు - 500 004.

ముద్రణ:
ఉషాలేజర్ గ్రాఫిక్స్,
G- 18, సావరిన్ షల్టర్స్
లకిడీకాపూల్,
హైదరాబాదు - 500 004.

I.S.B.N : 81-86073-13-2

ఆచార్య పేర్వారం జగన్నాథం
ఉపాధ్యక్షులు

తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాదు

ముందుమాట

తెలుగు భాషా సాహిత్య కళా సంస్కృతుల సర్వతోముఖ వికాసానికి ఏర్పడిన విశిష్ట విద్యాసంస్థ తెలుగు విశ్వవిద్యాలయం. బోధన, పరిశోధన, ప్రచురణ మొదలైన వివిధ కార్యక్రమాలను చేపట్టి గత పది సంవత్సరాలుగా క్రమక్రమంగా వృద్ధి పొందుతున్నది.

తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ కార్యక్రమంలో భాగంగా అలభ్యంగానూ, అముద్రితంగానూ ఉన్న గ్రంథాలను ముద్రించే కార్యక్రమాన్ని చేపట్టి ఎన్నో ప్రముఖ గ్రంథాలను ప్రచురించింది.

ప్రాచీన తెలుగు సాహిత్య వైభవానికి మణిదర్పణాలైన ఆంధ్ర మహాభారతం, ఆంధ్ర మహాభాగవతం, పండితారాధ్య చరిత్ర, రంగనాథ రామాయణం, పారిజాతాపహరణం వంటి ప్రాచీన గ్రంథాలు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణల్లో చోటు చేసుకున్నాయి.

డా॥ బి. ఆర్. అంబేద్కర్ రచనలు - ప్రసంగాలు 12 సంపుటాలు తెలుగులోకి అనువదించే బాధ్యతను విశ్వవిద్యాలయం చేపట్టి ఇప్పటికి 9 సంపుటాలను ప్రకటించింది. మిగతా సంపుటాలు ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయి.

విశ్వవిద్యాలయం చేపట్టిన 'వ్యాఖ్యాప్రవంతి' పథకంలో సుప్రసిద్ధ పండితులచే క్లిష్టమైన కావ్య ప్రబంధాలకు వ్యాఖ్యలు రాయించి ప్రకటించడం జరుగుతున్నది. ఈ ప్రణాళికలో ఇప్పటికి కుమార సంభవం, కాశీ ఖండం మొదలైన కావ్యాలను వ్యాఖ్యాన సహితంగా విశ్వవిద్యాలయం ప్రకటించింది.

విశ్వసాహిత్యంలోని ప్రముఖ గ్రంథాలను తెలుగులోనికి, తెలుగులోని ప్రముఖ గ్రంథాలను ఇతర భాషల్లోకి అనువదించే కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. ఇటీవల పత్రికా భాషా నిఘంటువును ప్రచురించింది. ఆరె భాషా నిఘంటువు అతి త్వరలో వెలువడనున్నది.

ప్రస్తుత గ్రంథం 'వ్యాఖ్యాప్రవంతి పథకం' కింద ప్రకటింపబడుతున్న శ్రీనాథుని

సమగ్రంగా లభ్యమౌతున్నది. సుప్రసిద్ధ పండితులు శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయ రావు గారు ఐదాశ్వాసాలకు సంతరించిన వ్యాఖ్యానంతో ఈ కావ్యాన్ని ప్రకటిస్తున్నాం. వ్యాఖ్యాతలు శ్రీ రావుగారికి మా ధన్యవాదాలు.

తెలుగు పాఠకలోకం ఈ గ్రంథాన్ని ఆదరిస్తుందని విశ్వసిస్తున్నాము.

హైదరాబాదు
3-10-1995
యువ, విజయదశమి

(పేర్వారం జగన్నాథం)

విషయ సూచిక

శివరాత్రి మాహాత్మ్యము
(సుకుమార చరిత్రము)
పీఠిక

శ్రీనాథ కవిసార్వభౌముని కావ్యజాలములో నిందనుక వ్యాఖ్యాతములు గాని వానిలో శివరాత్రి మాహాత్మ్య మొకటి. దానిని వ్యాఖ్యానించు భాగ్యమును నాకు కల్పించినవారు తెలుగు విశ్వవిద్యాలయమువారు. అందులకు వారికి నే నెంతయు కృతజ్ఞుడను.

ఏతత్కావ్యకర్త శ్రీనాథుడు. ఇతని కృతుల నంకితము గొన్నవారి చరిత్రమును బట్టి యీతని జీవితకాలమును క్రీ. శ. 1385-1470గా విద్వద్విమర్శకులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి ప్రభృతులు నిర్ణయించిరి.

శ్రీనాథుడు తన తాత కమలనాభామాత్యుడనియు, అతడు కాల్పట్టణమున కధీశ్వరు డనియు, పద్మపురాణ సంగ్రహ కళాప్రావీణ్యుడయిన కవితా విద్యాధరుడనియు చెప్పెను. అందుచే నీతని జన్మస్థలము కాల్పట్టణమని విద్వాంసులు నిశ్చయించిరి.

ఆంధ్ర సాహిత్యాకాశమున ధ్రువతారగా నిలిచియున్న యీ విద్వత్కవి వైదుష్యమును గూర్చి దగ్గుపల్లి దుగ్గన తన నాచికేతూపాఖ్యానమున నిట్లు ప్రశంసించినాడు.

`సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్య
          భాషాపరిజ్ఞాన పాటవంబు
పన్నగపతి సార్వభౌమ భాషిత మహా
          భాష్య విద్యా సమభ్యాసబలము
అక్షపాద కణాద పక్ష్మలోదీరిత
          న్యాయ కళా కౌశలాతిశయము
శ్రుతి పురాణాగమ స్మృతి సాంఖ్య సిద్ధాంత
          కబళన వ్యుత్పత్తి గౌరవంబు

పూర్వ కవి ముఖ్య విరచితాపూర్వకావ్య
భావ రస సుధా చర్వణ ప్రౌఢతయునుఁ
గందళింపంగఁ గాశికాఖండనైష
ధ ప్రముఖ వివిధ ప్రబంధము లొనర్చి.'

ఇంతటి యుద్దండపండితుడగు నీ కవి పలుమఱు దేశాటన మొనర్చి వివిధరాజాస్థానముల నలంకరించినాడు. ఈతడనుభవింపని భోగములు గాని, పొందని రాజసమ్మానములు గాని లేవనిన నతిశయోక్తి కాదు.

కాశీఖండమునందలి

`ఈ క్షోణిన్ నినుఁబోలు సత్కవులు వేరీ నేఁటి కాలంబునన్
దక్షారామ చళుక్య భీమవర గంధర్వాప్సరో భామినీ
వక్షోజద్వయ గంధసార మసృణ ద్వైరాజ్యభారంబు న
ధ్యక్షించున్ గవిసార్వభౌమ ! భవదీయ ప్రౌఢ సాహిత్యముల్

అను పద్యమున కృతిభర్తయగు వీరభద్రారెడ్డి చేసిన ప్రశంస యీ కవి యెడ సర్వథా సార్థకము.

ప్రౌఢదేవరాయల యాస్థానమగు వీరభద్రారెడ్డి ముత్యాలశాలలో గౌడడిండిమ భట్టు కంచుఢక్కను పగులగొట్టి దీనారటంకాల తీర్థమాడిన మహాకవి శ్రీనాథుడు.

కొండవీటిలో పెదకోమటి వేమారెడ్డి యాస్థానమున నీతడించుమించు రెండు దశాబ్దములు విద్యాధికారి పదము నధిష్ఠించినాడు.

`బ్రాహ్మీదత్తవర ప్రసాదుఁడ వురు ప్రజ్ఞావిశేషోదయా
జిహ్మస్వాంతుఁడ వీశ్వరార్చన కళా శీలుండ వభ్యర్హిత
బ్రహ్మాండాది మహాపురాణ చయ తాత్పర్యార్థ నిర్ధారిత
బ్రహ్మజ్ఞాన కళా నిధానమవు; నీ భాగ్యంబు సామాన్యమే?'

బ్రహ్మజ్ఞాన కళా నిధానమవు; నీ భాగ్యంబు సామాన్యమే?అని నైషధ కృతి భర్తయగు మామిడి సింగన పలికినపలుకులు శ్రీనాథుని వైదుష్యమును చాటును.

`హరచూడా హరిణాంక వక్రతయుఁ, గాలాంతస్ఫురచ్చండికా
పరుషోద్గాఢ పయోధర స్ఫుట తటీ పర్యంత కాఠిన్యమున్,
సరసత్వంబును సంభవించెననఁగా సత్కావ్యముల్ దిక్కులం
జిరకాలంబు నటించుచుండుఁ గవిరాజీ గేహరంగంబులన్'

అను పద్యమునందలి లక్షణములన్నియు నీ కవిరాజు కావ్యములన్నిటను కనుపట్టును.

పూర్వాంధ్ర కవీశ్వరులలో నొక్కొక్కరి ప్రధాన లక్షణ మీ కవిసార్వభౌముని కవితలో కానవచ్చునని కాశీఖండ కృతిపతియగు నల్లాడ వీరభద్రారెడ్డి -

వచియింతు వేములవాడ భీమన భంగి
నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్ట మార్గంబున
నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము రసా
భ్యుచిత బంధముగ నొక్కొక్కమాటు

పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేప
　　　సూక్తివైచిత్రి నొక్కొక్క మాట

అని చెప్పిన మాటవలన తెలియుచున్నది.

ఈ క్రింది చాటువు వలన నితని నాదరించిన ప్రభువతంసులును, అతడనుభవించిన భోగములును తెలియును.

కాశికావిశ్వేశు గలిసె వీరారెడ్డి
　　　రత్నాంబరంబు లే రాయఁడిచ్చు?
కైలాసగిరిఁ బంట మైలారు విభుఁడుండె
　　　దినవెచ్చ మే రాజు తీర్పఁగలఁడు?
రంభఁ గూడెఁ దెనుంగు రాయ రాహుత్తుండు
　　　కస్తూరి కే రాజుఁ బ్రస్తుతింతు?
స్వర్గస్థుఁ డయ్యె విస్సనమంత్రి మఱి హేమ
　　　పాత్రాన్న మెవ్వని పంక్తిఁ గలదు?

ఇన్ని మహాభోగము లనుభవించిన యీ మహాకవి యవసానదశలో నొడ్డె రాజుల కి వలసిన యేడునూర్ల టంకముల నీ లేక పలు బాములు పడి యెంతయో దైన్యము ననుభవించెను.

శివరాత్రిమాహాత్మ్య రచనాకాలము

శ్రీనాథుడు తాను రచించిన గ్రంథములను కాశీఖండములో నొక సీసపద్యమున చెప్పెను.

చిన్నారి పొన్నారి చిఱుత కూఁకటినాఁడు
　　　రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగు మీసాల నూత్నయౌవనమున
　　　శాలివాహన సప్తశతి నొడివితి
సంతరించితి నిండు జవ్వనంబునయందు
　　　హర్షనైషధ కావ్య మాంధ్రభాషఁ
బ్రౌఢ నిర్భర వయః పరిపాకమునఁ గొని
　　　యాడితి భీమనాయకుని మహిమ
ప్రాయమింతకు మిగులఁ గై ప్రాలకుండఁ
　　　గాశికాఖండ మను మహాగ్రంథ మేను
దెనుఁగుఁ జేసెదఁ గర్ణాట దేశ కటక
　　　పద్మవన హేళి శ్రీనాథభట్ట సుకవి.

ఈ పద్యములో నతడు పేర్కొన్నవానిలో మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి యిందనుక లభ్యములు గాలేదు. పండితారాధ్య చరిత్ర, హరవిలాసము, పలనాటి వీరచరిత్ర అను గ్రంథముల నా పద్యమున పేర్కొనలేదు. శివరాత్రి మాహాత్మ్యమును గూడ పేర్కొనలేదు. శ్రీనాథుడు ధనంజయ విజయ మనుపేరుగల గ్రంథమును దంతులూరి గన్న భూపాలుని పేర రచించినట్లు దంతులూరి బాపిరాజ రచిత మూర్తిత్రయోపాఖ్యాన ప్రబంధమున కలదు. అదియు లభ్యమగుట లేదు. ధనంజయవిజయమున కిరాతార్జునీయకథ వర్ణితమై యుండవచ్చును.

శివరాత్రి మాహాత్మ్యము శ్రీనాథుని బాల్యకవితయని శ్రీ నాగపూడి కుప్పు సామయ్యగా రనగా, దానిని హరవిలాస నైషధములకు పిదపను, భీమఖండమునకు మునుపును రచించెనని శ్రీ వీరేశలింగము పంతులుగా రనిరి. ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు శ్రీనాథుని కృతులలో నిది కనిష్ఠమని నిర్ణయించిరి. శ్రీ కట్టి సాంబమూర్తి శాస్త్రిగారును, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారును నిది శ్రీనాథుని యంత్యకృతి యనియే నిర్ణయించిరి. ఇది నిశ్చయమని నిరూపించుటకు తగిన యాధారములు తమకు లభింప లేదనుచు, శ్రీ చాగంటి శేషయ్యగారు కూడ శ్రీ శాస్త్రులవారితో నేకీభవించి యేతద్గ్రంథ రచనాకాలమును క్రీ. శ. 1440 ప్రాంతమని తలచిరి.

స్కాంద పురాణాంతర్గత మగు నీశాన సంహితలో 336 అనుష్టుప్పులు గల మూడధ్యాయముల యితివృత్తమును సముచిత వర్ణనలతో పెంచి యైదాశ్వాసములుగా శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యమును రచించెను. శివరాత్రి మాహాత్మ్యమునకే సుకుమార చరిత్రమని నామాంతరము గలదు. సంహితలో 61అనుష్టుప్పులలో వర్ణింపబడిన సుకుమార చరిత్రము శివరాత్రి మాహాత్మ్యమున మూడాశ్వాసములలో మున్నూటపది పద్యగద్యములలో విపులీకరింపబడినది.

ప్రత్యాశ్వాసేతివృత్తము

ప్రథమాశ్వాసము; శౌనకాది మహామునులు శివరాత్రి మాహాత్మ్యమును చెప్పుమని సూతు నడుగగా నతడిట్లు చెప్పనారంభించెను. శివుడష్టాదశవిద్యలను తొలుత బ్రహ్మ కుపదేశించెను. అనంతరము శంకరాజ్ఞాప్రచోదితుడై కృష్ణద్వైపాయను డావిర్భవించి సర్గ ప్రతిసర్గాది పంచలక్షణ లక్షితంబులగు నష్టాదశ పురాణములను నాలుగు లక్షల పరిమితి గలవానిని రచించెను. అందు స్కాందము లక్ష పరిమాణముగలది. శివరాత్రి మాహాత్మ్యము దానిలోనిదే. `ఆ శివరాత్రి వ్రత మెవ్వరాచరించిరి? దానివలన గలుగు ఫలమేమి? చెప్పు'మని మును లభ్యర్థింప సూతుడు మొదట ప్రళయమును వర్ణించెను. ప్రళయాంతమున శ్రీ మహావిష్ణువు వరాహరూపమును ధరించి భూమి నుద్ధరించి గర్వముతో క్షీరసముద్రమున పాపసెజ్జపై పవళించెను. బ్రహ్మ నిద్ర మేల్కాంచి, సృష్టి చేయదలచి, తత్త్రమ మెఱుగక చీకాకుపడి చివరకు శివధ్యానమున

లబ్ధప్రజ్ఞుడై చరాచరాత్మక ప్రపంచమునంతను సృజించి తానే జగత్కర్తనని గర్వించి స్వనిర్మితమగు సృష్టి నాలోకింప హంసము నధిరోహించి యెల్లలోకములు విలోకించుచు వచ్చి క్షీరసాగరమున పవ్వళించి యున్న విష్ణువును గాంచి 'నీ వెవ్వడవు? జగత్కర్తనైన నన్ను జూచియు నేల లేచి గౌరవింప?'వని ప్రశ్నించెను. విష్ణువు తానే జగత్కర్తనని బ్రహ్మను తిరస్కరించెను. అంత వారిరువురును యుద్ధ మొనరించి పరస్పర విజిగీషువులై యొండొరులపై పాశుపతాస్త్రములను ప్రయోగించుకొనిరి. తదస్త్ర జ్వాలా దహ్యమానములగు లోకములను రక్షింపను, బ్రహ్మ విష్ణువుల గర్వము మాన్పను నస్త్రముల నడుమ మాఘకృష్ణ చతుర్దశీ నిశిని - అనగా శివరాత్రి నాడు శివలింగ మనుష్ణాశీత మగు నగ్నికంబముగా ప్రాదుర్భవించెను. బ్రహ్మ విష్ణువు లా స్తంభము నాద్యంతములు కనుగొన జాలక శివుని స్తుతించిరి. శివుడు వారికి శివరాత్రి వ్రతముపదేశించెను. పూర్వ మొక బ్రాహ్మణుడు మహాపాపియయ్యు శివరాత్రివ్రత దర్శనమున శివలోకమున కేగెను. అని సూతుడు చెప్పగా నా కథ వినిపింపు మని శౌనకాదులగు మునులు సూతు నడిగిరి.

ద్వితీయాశ్వాసము : వింధ్య పర్యంత భూమి యందలి దండకారణ్యా మధ్యమున రత్నపుర మను నొక పట్టణ ముండెను. దానిని హేమాంగదుడను శబరరాజు పాలించుచుండెను. అతనికి యజ్ఞదత్తుడను మంత్రి కలడు. ఆ మంత్రి భార్య సుశీల. పెక్కువ్రతము లాచరింపగా చిరకాలమునకు సుశీల గర్భవతియై సుకుమారుడను కుమారుని గనెను. ఆ బాలుడు పెరిగి యౌవనవంతుడై సిగ్గు విడిచి విచ్చలవిడిగా తిరుగుచుండ తల్లిదండ్రులతనికి నీతులు గఱపిరి.

తృతీయాశ్వాసము: సుకుమారుని దుష్టవర్తనము పెచ్చుపెరిగెను. ప్రజల విన్నపముపై రాజాతనిని దేశ బహిష్కృతుని గావించెను. సుకుమారుడు కీకటదేశమున కొన్ని దినము లుండి హూణదేశమునకు బోవుచు మార్గమధ్యమున అతి క్షుత్పిపాసా పరవశుడై యొక తటాకమున చేర నరిగెను. అచ్చటి కొక చండాల కన్యక స్నానార్థ మరుదెంచెను. చండాలీ సుకుమారు లన్యోన్య మనురక్తులైరి. సుకుమారుడు భద్రకాళి కాలయమున నుండి చండాలితో రహస్యముగా కాపురము సాగించుచుండెను. అచ్చట సుకుమారుని దుర్వర్తనము మితిమీఱిపోయి హూణమండల మంతయు తెలియవచ్చెను. ఆ కాముకు లిరువురును మఱియొకచోటికి పోవనెంచిరి.

చతుర్థాశ్వాసము : సుకుమారుడు చండికి జాతర చేసి నాటి రాత్రి చండాలితో హూణదేశమును విడిచి కిరాతమండలము నందలి వణిక్పథ పురమును జేరి యందలి బ్రహ్మపురివాడలో కాపురము పెట్టెను. అతనికి చండాలియం దిరువురు కూతులు పుట్టిరి. చండాలి కొంతకాలమునకు మరణించెను. సుకుమారుడు కూతులతోనే కామవ్యాపారమును సాగించి వారియందిరువురు కొడుకులను గూడ పడసెను. ఈతని

పాపకృత్యములకు బ్రహ్మపురివాడలోని విప్రు లుత్తప్తకృచ్ఛ చాంద్రాయణ వ్రతాది ప్రాయశ్చిత్తము లాచరించిరి. కొంతకాలమునకు పిమ్మట నత డచటికి గవ్యూతి దూరమున నున్న యాది మధ్యాంత నాగేశ మనెడి పుణ్య తీర్థమునందలి నాగేశ్వరాలయమున శేష ప్రతిష్ఠితుడైన నాగేశ్వరలింగమును గాంచెను. సుకుమారు డచట శివరాత్రినాడు గాలికి తూలిన కేతకిపుష్పధూళి మేన నలముకొన పాశుపత దీక్ష గైకొనెనా యనునట్లుండెను. అతడర్ధ రాత్రము వఱకును జాగరముండి యచ్చటి శివరాత్ర్యుత్సవ వైభవము నీక్షించి విగత కల్మషుడై నాటినుండి తన తొల్లిటి దుర్వ్యాపారముల నుడిగెను. కొంతకాలమున కతడు ఘోరవ్యాధి పీడితుడై మరణించెను. యమ భటులతనిని కొనిపోవరాగా శంకర కింకరులు వారి నడ్డగించిరి. వారికి ఘోర యుద్ధము జరిగెను. అందు యమభటులోడిరి. ప్రమథులు సుకుమారుని కైలాసమునకు గొని పోయిరి. సుకుమారుడు శివుని స్తుతించి ప్రమథుడయ్యెను.

పంచమాశ్వాసము : యముడు తన భటుల యోటమిని విని చిత్రగుప్తునితో విచారించి తన వృథాధికారమును శివునికే విన్నవింప కైలాసమున కేగెను. యముడు శివుని స్తుతించి సుకుమారుని పాప కార్యముల నతనికి వినిపించెను. శివుడు యమునకు శివరాత్రి మాహాత్మ్యమును, శివభక్తుల లక్షణములను అభివర్ణించెను, యముడు నిజ లోకమున కరిగి తన భటులకు శివరాత్రి మాహాత్మ్యమును, శివభక్తులను గుఱుతుపట్టు విధమును చెప్పి వారి జోలి కింక నెన్నడును పోవవలదని హెచ్చరించెను.

ఇప్పుడు మూలగ్రంథమగు నీశాన సంహితలోని కథకును, శివరాత్రి మాహాత్మ్యములోని కథకును గల పోలికలును, భేదములును వివరింపబడును.

సంహితయందు `మహాపాపము లొనరించిన యెట్టివారయినను లఘూపాయమున శివలోక మొందు నుపాయ మేదయిన గలదా?'యని మునులు ప్రశ్నింప, సూతుడు పార్వతి యీ యర్థమునే ప్రశ్నింప నామెకు శివుడు శివరాత్రి వ్రత విధాన ముపదేశించె ననియు, అమె దానిని కుమారస్వామికి చెప్పెననియు, తాను కృష్ణద్వైపాయనునివలన నా కథను వింటిననియు చెప్పి దానిని వారి కిట్లు వివరించెను. నాలుగువేల యుగములు బ్రహ్మ కొక పగలును, అంతే కాలము రాత్రియును నగును. విష్ణువు వరాహరూపమున భూమి నుద్ధరించి పాలకడలిపై పరుండి విశ్రాంతి గైకొనుచుండెను యథాక్రమముగా సృష్టిచేసి బ్రహ్మలోకము లాలోకించుచు వచ్చి నారాయణుని గాంచెను. వారిరువురు నెవరికి వారే సృష్టికర్తలమని పలుకుచు నొండొరుల నధిక్షేపించుకొని యుద్ధము చేసిరి. వారొకరిపై నొకరు పాశుపతాస్త్రములను ప్రయోగించుకొనిరి. ఆ యస్త్ర సంపాతమును వారించి వారిని రక్షింప శాంభవ మగు స్తంభము వారి నడుమ నావిర్భవించెను. దానిని జూచి కోప ముడిగి యాస్తంభము నాద్యంతములు చూడ బ్రహ్మ హంసరూపమున పైకిని, విష్ణువు వరాహ రూపమున క్రిందికిని పోయి

కనుగొనలేక తిరిగి వచ్చిరి. అంత శివుడు లింగమధ్యమునుండి వినిర్గతుడై వారికి ప్రత్యక్షము కాగా, వారాతనిని స్తుతించిరి. శివుడు ప్రసన్నుడై `మీ రస్త్రములు ప్రయోగించుటవలన వాని తేజస్సుచే మీ తేజస్సులు దగ్ధములయినవి. కావున మీరు మీ మీ పదముల కనర్హులరు. మీరు శివరాత్రి వ్రతమొనరించుచో మరల మీ మీ పదములను మీ కొసగెదను."అని పలికి వారి ప్రార్థనమున శివరాత్రి కాల నిర్ణయమును, తద్వ్రత విధానమును వారి కానతిచ్చెను.

ఈ వృత్తాంతమునకు సంహితలో శివరాత్రి ప్రాదుర్భావ తద్వ్రత విధానములని నిర్దేశింపబడగా, శివరాత్రి మాహాత్మ్యమున ఉరులింగోద్భవమను సంజ్ఞ నిర్దేశింపబడినది.

రెంటను మునులు `శివరాత్రివ్రత మే ఫలము నొసంగు' నని యడుగ సూతుడు వారికి తత్ఫలమును చెప్పి అందుల కుదాహరణముగా సుకుమార చరిత్రమును చెప్పినట్లు కలదు.

సంహితయందు సుకుమారుని జన్మభూమి వింధ్యోత్తర దిగ్భాగమున నిరావతీ శతద్రూ విపాట్ సింధు వితస్తా నదులు ప్రవహించు రమణీయమైన దేశమున సింధునదీతీరమున కుబ్జాభిధాన నగరమని కలదు. ఆ పుర మేలు రాజు వ్యవహారార్థము నయకోవిదుడైన బ్రాహ్మణు నొకనిని స్థాపించెను. అతనికి సుకుమారుడను పేరుగల కుమారుడుండెను - అని చెప్పబడెనే కాని తద్రాజామాత్య తద్భార్యలను గూర్చి యింకేమియు వర్ణింపబడలేదు. కాని శివరాత్రి మాహాత్మ్యమున వింధ్య పర్యంత భూవిపిన మధ్యమున రత్నపుర మను రాజధాని గలదనియు, దానిని హేమాంగదుడను శబరరాజు పాలించుచుండెననియు, నతనికి యజ్ఞదత్తుడను మంత్రి గలడనియు, నా మంత్రి భార్య సుశీల యనియు, నా దంపతులకు, పెక్కు వ్రతము లాచరింప సుకుమారు డుదయించెననియు, నా పట్టణము చుట్టును నిరావతీ శతద్రు విపాట్సింధు నదీ మాతృకములగు జనపదములు గలవనియు, తత్ప్రత్యన ప్రాంతమున నర్మదానదీ తీరకాంతార భూమిని మత్తియను పేరి కల్పద్రుమమునీడ నోంకారనాథుడు శంభుడు పాయకయుండు ననియు సువిపులముగా వర్ణింపబడినది.

సుకుమారుని విద్యాభ్యాసము, యౌవన మదోద్ధతుడై దుర్మార్గ గామియైన యాతడు ప్రభునిష్కాసితుడై దేశాంతర మరుగుటయు రెంటను సమమే.

తొలుత నేదో యొక దేశమునకును తరువాత హూణమండలమునకును చనినట్లు సంహితయం దుండగా, తొలుత గీకట దేశమునకును, తరువాత హూణమండలమునకును చనినట్లు మాహాత్మ్యమున గలదు.

చండాలీ సమాగమము మొదలుకొని యత డామెను గూడి నానావిధ మాంసము లాహరించుచు, బాటసారులగు బ్రాహ్మణులను సంహరించి వారి ధనము

లపహరించుచు దుష్కార్యము లొనరించుచుండెనని సంహిత యందు కలదు. ప్రథమ సమావేశానంతరము మాలెత నిర్దేశించిన భద్రకాళీ నికేతనమున కరిగి యచ్చట బ్రాహ్మణులతో నివసించుచు; పలు విధములైన విద్యలచే వారిని మెప్పించుచు, వంచన బయల్పడకుండులాగున మాలెత మాల బాలకునిచే పంపిన విందులు గుడుచుచు, ప్రతిదినమును రేపైన మా పైన తనవారి నెట్లో కనుబ్రామి వచ్చిన మాలెతతో సంభోగించుచు, బ్రాహ్మణుల కెఱుకపడనీకయే పక్కణ శబరులను గూడి మృగయా వినోదమును సాగించుచు, నొంటి పాటున వచ్చు విప్రులను మొత్తి వారి ద్రవ్యము నపహరించుచు, కొంతకాలము తన దుష్కృత్యములు బయలుపడకుండ నుండినట్లు మాహాత్మ్యమున గలదు.

హూణ మండలమందుండినపుడే యాత డా మాలెతయందు పంచ పాతకముల వంటి కొడుకులను, నిరువురు కూతులనే బడసినట్లును, ఆ మాలెత కాలగతి నొందిన పిదప నతడు తన కూతులనే రమించుచు నిరువురు కొడుకులను గనినట్లును, ఒకనాడు రాజుచే బహుధన మొంది వచ్చు నూర్వుర విప్రులను పరిమార్చి వారి ధన మపహరించి తద్వార్తాశ్రవణమునకుపితుడైన రాజుచే తన్ను చంప దూతలు పంపబడిరని కూతు నొక్కతను దోడుకొని కిరాత దేశమునకు పయన మయినట్లును, ఒక్క శివరాత్రినాడు శివపూజాదు లవలోకించి విగతపాపుడయినట్లును సంహితయందు గలదు. హూణ మండలమున తన దుర్వ్యాపారములు సర్వ విదితము లగుటయు నట వసింపనోడి యతడా చండాలితో గూడి హూణమండలము విడిచిపోయినట్లును, అనంతర మిరువురు సుతులను, నిరువురు సుతలను గనినట్లును, చండాలీ మరణానంతరము తనయల నిరువురనే రమించుచు నిరువురు కొడుకులను పడసినట్లును మాహాత్మ్యమున గలదు.

మహాపాతకుడగు వీని దుశ్చర్యలకు హూణమండల బ్రాహ్మణు లుత్తప్త కృచ్ఛ్ర చాంద్రాయణ వ్రతాది ప్రాయశ్చిత్తము లాచరించినట్లు మాహాత్మ్యమున గలదు. సంహితయం దీ వృత్తాంతమే లేదు.

హూణమండలమును విడిచి సుకుమారుడు కిరాత దేశమున కేగిన పిమ్మట, నట వణిక్పథమున కనతి దూరమున నాగేశ్వరా హ్వాయుడను శివుని యాలయమున శివరాత్రి వ్రతాదుల నాలోకించినట్లు సంహితయందు గలదు. మాహాత్మ్యమున దుర్గమాటలీ విషమమైన హూణమండలము గడచి యెడనెడ వణిక్పథమునకు గవ్యూతి మాత్ర దూరమున నాది మధ్యాంత నాగేశ్వరాహ్వాయ పుణ్యక్షేత్రమున శేషప్రతిష్ఠితుడై యనేక కల్పములనుండి వెలసియున్న నాగేశ్వరాలయమున శివరాత్రినాడు శివపూజాదు లాలోకించి విగతకల్మషుడయినట్లు కలదు.

సుకుమారుని మరణానంతరము యమునానతిని యమకింకరు లేతెంచి వాని లింగ శరీరమును బంధించి కొని పోవుచుండ శివ దూతలు శివాజ్ఞా చోదితులై వచ్చి వారి నాగి యుద్ధమున జయించినట్లు చెప్పబడిన పిదప `అత్ర గ్రన్థపాతః' అని సంహితయందు గలదు. మాహాత్మ్యమునందు శివదూతలును, యమకింకరులును తుముల సమరము గావించుతఱి నొక యమభటుడు యముని కడకేగి యుద్ధ వృత్తాంతము విన్నవింప నతడులుంబరుడను సేనానిని, పెక్కు సైన్యములను, నూఱు మృత్యువులను శివగణములపైకి పంపినట్లును, వారెల్లరును ప్రమథులచే భంగపడినట్లును వర్ణింపబడి, `భటులు, ప్రమథులచే నట్లు భంగపడిన, చిన్నవోయి యముడేమి చేసెఁ బిదప' అని మునులు సూతుని ప్రశ్నించుటతో చతుర్థాశ్వాసము ముగిసినది.

పంచమాశ్వాసము బయలు పడక పూర్వము శివరాత్రి మాహాత్మ్యము దీనితో పరిసమాప్త మయ్యెనని తలపబడినది కాని యిప్పుడు పంచమాశ్వాసము లభించినది.

ఈ పంచమాశ్వాస వృత్తాంతము సంహితయందలి డెబ్బది మూడవ యధ్యాయము నందలి వృత్తాంతముతో తుల్యముగా నున్నది.

శివరాత్రిమాహాత్మ్యము - గ్రంథపరిమాణము.

శివరాత్రి మాహాత్మ్యమును అంధ్ర సాహిత్య పరిషత్తువారు (కాకినాడ) ముమ్మాఱు ప్రకటించిరి. మొదటి రెండు ముద్రణములను విద్వాన్ శ్రీ కట్టి సాంబమూర్తి శాస్త్రిగారు పరిష్కరించిరి. వానిలో వారి పీఠికలుగూడ నున్నవి. మూడవ ముద్రణమున గూడ నా రెండు పీఠికలే కలవు. ఆ మూడు ముద్రణములలోను కావ్యము నాలుగాశ్వాసముల వఱకే కలదు. శ్రీనాథుడు మొదట ప్రతిజ్ఞ చేసిన విధముగా (1-44) `ఉరులింగోద్భవంబును, శివరాత్రి మాహాత్మ్యంబు'నను కథలు నాలుగవ యాశ్వాసముతో ముగిసి పోయినవి కావున దానిని శ్రీనాథు డంతవఱకే రచించియుండు ననియు (కావున నది సమగ్రకావ్యమే యనియు శ్రీ సాంబమూర్తి శాస్త్రిగా రభిప్రాయపడిరి. కాని చతుర్థాశ్వాసాంతమున తన భటులు శివభటులచే భంగపడుట చూచిన యముండేమి చేసెనని శౌనకాది మునులు సూతు నడిగినట్లు కలదు. "భటులు ప్రమథులచే భంగపడుట చూచి చిన్నవోయి యముడేమి చేసెఁ బిదప?" (4-93). దీనిచే కావ్యమంతటితో ముగియక పంచమాశ్వాసమున కావశ్యకత యేర్పడుచున్నను, శ్రీనాథుని ప్రతిజ్ఞయగు శివరాత్రి మాహాత్మ్యము దీనితో ముగిసినదనియు తన్మూలమగు నీశానసంహితాధ్యాయాంత్య పద్యాను రోధమున నా మునుల ప్రశ్నమును గూడ నెవరో గ్రంథమున చొప్పించియుందు రనియు, గ్రంథమంతవరకే యుండుటకు శ్రీనాథుని మృతి కూడ కారణము గావచ్చుననియు శ్రీ శాస్త్రిగా రభిప్రాయపడిరి.

కాని డాక్టర్ శ్రీ బిరుదురాజు రామరాజుగారి ధర్మమా యని శివరాత్రి మాహాత్మ్య మిప్పుడు పంచమాశ్వాసముతో ప్రకటితమయినది. నాలుగవ యాశ్వాసము చివర నున్న మునుల ప్రశ్నమునకు సమాధాన మేర్పడినది. శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యమును పంచాశ్వాస సంభరితముగా రచించెనను సిద్ధాంతము స్థాపింపబడినది.

పంచమాశ్వాసము శ్రీనాథునిది కాకపోయినచో నందలి పద్య గద్యముల శయ్య శ్రీనాథుని దానికి భిన్నముగా నుండవలయును. కాని యా యాశ్వాసమునందలి రచనను పరిశీలించినవారికి అది తప్పక శ్రీనాథునిదే యని తోపకమానదు.

"జూదంబు లాడెను శూద్రాన్నము భుజించెఁ
గలవారి గృహములు కన్నపెట్టె" (5-5)

"విడువరో యెందేని విహరింపఁ జనుఁగాని
కరవాఁడి ముక్కుల కాకిపిండు" (5-8)

"ఎవ్వానియందుండు నెల్ల భూతంబులు
సింధువునందు వీచికలు వోలె" (5-24)

మున్నగు సీసము లన్నిటను శ్రీనాథుని బాణీయే కొట్టవచ్చినట్లు కానవచ్చుచున్నది.

మఱియు నీ కావ్యమునందలి యాశ్వాసాద్యంత పద్యములును, అవతారికయందలి పద్యములును శ్రీనాథునివి కావనియు, కృతి భర్తయగు నుప్పలపు (పువ్వలపు - పూ.ము)ముమ్మడి దేవయ్య శాంతుడు అవతారికా రహితమైన శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్య కావ్యము నెటులో సంపాదించి, నిజవంశావతార వర్ణనము గల యవతారికా భాగమును దన్యులచే రచింపజేసి యందు చేర్చియుండునని శ్రీ సాంబమూర్తి శాస్త్రిగారభిప్రాయపడిరి. వారి తలపునకు కారణ మా పద్యములు దోష భూయిష్ఠములుగను, అన్వయ రహితములుగను నుండుట యని నుడివిరి. వారా పద్యములలో పంద్రెండు దోషములను గూడ చూపిరి. కొన్ని యట్లున్నమాట నిజమే కాని యవి యన్నియును దోషములు కావనియే నా యభిప్రాయము. వారు చూపినవి దోషములెట్లు కావో దిగువ చూపబడును.

`సుతుని స్నుద్యుక్త శాంతాత్మునిన్`-ఇది 'సర్వము న్నతని దివ్యకళామయమంచు విష్ణునందుల్లముజేర్చి' యను పోతన ప్రయోగమువంటిది కాదా? దీనికి ప్రౌఢవ్యాకరణ కర్త `కొన్ని యెడలఁ బ్రామాణిక ప్రయోగంబులం ద్రుతంబున కచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి' అని సూత్రము (ప్రౌ. సంధి. 3)ను గూడ రచించెను గదా!

`కృతి పతులగు కవిముఖ్యుల' కృతిపతులైన కవిశ్రేష్ఠులు తిక్కన వంటివారు లేరా?

'మల్లికార్జును కుత్పలం బర్థిఁబడసె' - ఇది `అండజాధీశ్వరు కొసఁగఁబోలు' అను జక్కన ప్రయోగము వంటిదే కదా!దీనికిగూడ ప్రౌఢ వ్యాకరణము సూత్రము చేసియుండెను గదా! `కువర్ణకంబు పరంబగునపుడు కవిత్రయంబువారి ప్రయోగంబులం దక్కం దక్కిన మహా కవి ప్రయోగములందునుం గొన్నియెడల నగాగమంబు చూపట్టదు' (ప్రౌ. శబ్ద. 19)

`నేర్పరతఁడు' - నేర్పరి + అతఁడు - అని దీని నిత్యసంధిగా సాధింపవచ్చును గదా!

`నల్వీటుచింత' - నల్వ + ఇటు - `అచ్చికంబులం బదమధ్యంబుల నలడరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు. (బాల. ప్ర. 17) అను సూత్రముచే 'నలువ' నుండి నల్వ సాధించి పిమ్మట అత్వసంధిచే `నల్వీటు'అను దానిని సాధింపచ్చును గదా!

`కాకోదర గ్రామణి కంఠ గ్రైవేయు' -గ్రామణీ యనునది లేఖక ప్రమాదము వలన గ్రామణి యై యుండనోపు. పైగా నిది గద్య భాగములోనిది కావున గ్రామణీ యనియే కవి ప్రయోగించియుండె ననవచ్చును. శ్రీ రామరాజుగారు పరిష్కరించిన ప్రతిలో `కాకోదర గ్రామణీ కంఠగ్రైవేయు'ననియే యున్నది.

`సకల సద్గుణ విఖ్యాత సారసాఖ్య - మహిత పంచాక్షరీ మంత్ర మానసాత్మ' అనుదానికి `సకల సద్గుణ విఖ్యాత సౌమనస్య - మహిత పంచాక్షరీ మంత్ర మంజులాత్మ'యను పాఠాంతరము గలదు. దీని యందు దోష మేమియో తెలియదు.

`వైభవ ప్రఖ్యాత వర హరిశ్చంద్రుండు', `పరమపాతివ్రత్య భావంబు తలపంగ, గౌరి గాబోలు నీ కాంత తలంప, `ఘనుడు కొమరగిరీంద్రుండు గలిగియుండు' అనునవి దోషములెట్లయ్యెనో నా కంతుపట్టుట లేదు.

ఇక వారు దోషములని పేర్కొన్నవానిలో మిగిలినవి రెండు. అవి 'వడి ప్రాస విడంబ బంధమై' అనునదియు, 'పుణ్యాఋషీశ్వర సప్తతుల్యులం బోలిన' అనునదియు `వడి'యనుటకు మాఱుగా `వళి'శబ్దమును స్వీకరించుచో నా సమాసమునందలి దోషము పోవును. `వళి'శబ్దము సంస్కృతమే. `పుణ్యా ఋషీశ్వర సప్త' అని కాక `పుణ్యా ఋషీశ్వర సప్తక' యని యుండవలసినదే.

ఇట్లు శ్రీ సాంబమూర్తి శాస్త్రిగారు పేర్కొన్న దోషములన్నిటికి నాభాసత్వ మేర్పడుచున్నది.

అవతారికా పద్యములు గూడ శ్రీనాథునివే యని యభిప్రాయము. అందలి కొన్ని భాగములు శిథిలములు కాగా వాని నెవడో యప్రౌఢుడు పూరించియుండును. ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు కూడా 'శాంతయ్య యట్టి చౌర్యమున కొడిగట్టి యుండునని చెప్పుట కష్టము. కృతి ప్రదానము జరిపిన పిమ్మట శ్రీనాథుని పరోక్షమున శాంతయ్యగాని, యాతని పరోక్షమున నాతని వంశీయులు గాని మొదట నసతి విస్తరముగా నుండిన యవతారికను పెంచి వ్రాయించి యుందు'రని యభిప్రాయపడిరి.

అవతారికా పద్యములున్నంత యప్రౌఢముగా నాశ్వాసాద్యంత పద్యములు లేవు.

ఈ కావ్యమును గూర్చిన వివాదాంశములు మఱి రెండు గలవు. మొదటిది శివరాత్రి మాహాత్మ్యమునకు మూలగ్రంథమేది? యనునది. రెండవది శ్రీనాథుడు పువ్వులపు శాంతయ్యకు కృతి యిచ్చెనా? లేక శ్రీనాథుని యనంతరము శాంతయ్య యెవరి చేతనో కృత్యాదిని తన కంకిత మగునట్లు వ్రాయించుకొనియెనా? యనునది. ఈ విషయములపై శ్రీ సాంబమూర్తి శాస్త్రిగారికిని, శ్రీ బండారు తమ్మయ్యగారికిని ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలలోను, ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రికలోను వాదోపవాదములు జరిగెను.

ఈ కావ్యమునకు మూల గ్రంథము ఈశాన సంహితయని యొకచోటను, శంకర సంహితయని యింకొక చోటను కావ్యముననే కలదు. 'స్కాందంబున నీశాన సంహితం జెప్పంబడ్డ యురు లింగోద్భవంబును' చెప్పెద శంకర సంహితా కథా - దీపిత భవ్యమార్గమునఁ దేటపడన్ మొదలింటి నుండియున్'.

ఈశాన సంహితయు, శంకర సంహితయు నొక్కటే యని శ్రీ బండారు తమ్మయ్యగారి వాదము. అవి రెండును వేఱనియు, నీశాన సంహితయే శివరాత్రి మాహాత్మ్యమున కాధార మనియు శ్రీ సాంబమూర్తి శాస్త్రిగారి వాదము. శ్రీనాథుడు 'ఈశాన' శబ్దమునకు పర్యాయముగా నింకొకచో శంకర శబ్దమును ప్రయోగించెననియును, రెండును నొక్కటే యనియును ఆ యభిప్రాయమును, ఈ శాన సంహితలో సుకుమార చరిత్రమునకు సంబంధించిన కథా భాగమంతయు నఱువది యొక్క అనుష్టుప్పులలో కలదు. దానిని శ్రీనాథుడు మూడాశ్వాసములలో మున్నూట పది గద్యములలో ప్రబంధోచితములగు వర్ణనలతో విస్తృతపఱిచి వర్ణించినాడు.

శ్రీ సాంబమూర్తిశాస్త్రి గా రంతతో నూరకుండక యీశానసంహితకే శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యము మూలమనియు నిశ్చయించిరి. దానికి వారు చెప్పిన కారణము వారితో వాదించిన శ్రీ బండారు తమ్మయ్య గారు గాని తదితరులు గాని యీశానసంహిత యొకటి కలదని తెలుపక పోవుటయే యట. ఈ యీశాన సంహితను చూచియే

శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యమును రచించెనని యంగీకరించుచో నాతడిప్పుడు మనకుపలబ్ధమైన ప్రతిని చూచియే యాంధ్రీకరించి యుండవలయుననియు, అట్టిచో సంహితయం దెటనెట పాతములు గలవోయవి యట్లే మాహాత్మ్యమున నుండుట సంభవింప దనియు, మఱియు నాల్గవయాశ్వాసము చివరనున్న `చిన్నవోయి యముండేమి చేసెఁ బిదప?' నను మునుల ప్రశ్నమునకు సమాధానమగు భాగము నాతడేల విడుచుననియు, పెక్కు స్థలములందు సంహితలోని భాగములకు మెఱుగుపెట్టిన మహాకవి కొన్ని గ్రంథపాతములను పూరించుకొనలేక పోయెనా యనియు ప్రశ్నించి శ్రీ శాస్త్రిగారు శ్రీనాథు డీశానసంహిత నాంధ్రీకరింపలేదని నిర్ణయించిరి. ఇప్పు డుపలభ్యమానమగు నీశానసంహితను శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యమును చూచి యప్రౌఢుడెవడో - అందలి గ్రంథపాతములను సవరించుకొనలేనివాడు - సంస్కృతీకరించియుండు ననియు నభిప్రాయపడిరి. మఱియు వారు `అత్ర గ్రన్థపాతః 'అనుదానిలో `అత్ర' అనుదానికి `శివ రాత్రి మాహాత్మ్య గ్రంథమున'నని యర్థము చెప్పిరి.

శ్రీ శాస్త్రిగారి నాటికి శివరాత్రి మాహాత్మ్యమునందలి పంచమాశ్వాసము బయలుపడలేదు కావున వారట్లు తలచిరి. కాని యిప్పుడది శ్రీ రామరాజుగారిచే ప్రకటితమయినది. కావున వారి యూహము సరికాదని అనగా నీశాన సంహితయే మూలమనియు, శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యము దాని కాంధ్రీకరణమే యనియు మనము నిశ్చయింపవచ్చును.

రెండవ యంశము శ్రీనాథుడు పువ్వులపు శాంతయ్యకు దానిని కృతియిచ్చెనా? అనునది. శ్రీశైలమున జంగమమఠ మొకడున్నది. దానికి భిక్షావృత్తి యని పేరు. ఈ మఠమునకు జంగములే పరిపాలకులుగా నుందురు. వారి నామమునకు, తుదను `భిక్షావృత్తి' యను శబ్దమును చేర్చుచుందురు. శ్రీనాథుని కాలమున నీ మఠమును పరిపాలించునాతడు శాంత భిక్షావృత్తి యతీశ్వరుడు. గౌరన కవిచే నవనాథ చరిత్రమును శ్రీ మల్లికార్జునస్వామికి, గృతి యిప్పించిన దీతడే. పువ్వులపు శాంతయ్య యీతనికి మూలభృత్యుడు.

శ్రీశైలమున క్రీ.శ. 1511లో ప్రజాపతి సంవత్సర మాఘ బహుళ ౧౪ సోమవారంనాటి శాసన మొకటి యున్నది. ఈ శాసనకర్త శాంతలింగము. ఇతడు శివరాత్రి మాహాత్మ్యకృతిపతియగు శాంతయయే యని శ్రీ సాంబమూర్తి శాస్త్రిగా రభిప్రాయపడగా, శ్రీ తమ్మయ్యగారు శాంతయ కొడుకు లింగయ్యయని యభిప్రాయపడిరి. శివరాత్రి మాహాత్మ్య గ్రంథ రచనాకాలము క్రీ.శ. 1440 ప్రాంతముగా నెల్లరు నంగీకరించిరి కావున శ్రీ సాంబమూర్తి శాస్త్రిగారి వాదము సత్యమయినచో నీ గ్రంథమును శ్రీనాథుడు శాంతయకు కృతి యీలేదని స్పష్టమయినచో నీ గ్రంథమును శ్రీనాథుడు శాంతయకు కృతి యీలేదని స్పష్టపడును. క్రీ.శ. 1440 నాటికి శాంతయ్యకు

ముప్పది సంవత్సరముల వయిసు నుండి యుండుననియు, నాతని కేబదియవయేట లింగయ జన్మించె ననియు, నాతని యేబదియవయేట పయి శాసనమును వ్రాయించె ననియు కాలమును సరిపెట్టుకొనవచ్చును. ఇది యస్వాభావికముగానే కనపట్టును గాని యసంభవము గాదు. కావున నంగీకార్య మగును.

ఈ శాంతయ్యదే తాడిపర్తియందొక శాసనమున్నది. అందాతని తండ్రి పేరు దేవయ యనియే యున్నది. ఇది క్రీ.శ. 1472వ సంవత్సరమునాటిది. దీనిని బట్టి శాంతయ సిద్ధ భిక్షావృత్తి యొద్ద నుద్యోగిగా నుండెనని తెలియుచున్నది. కాని శివరాత్రి మాహాత్మ్యమున పేర్కొనబడినవాడు శాంత భిక్షావృత్తి గాని సిద్ధ భిక్షావృత్తికాదు. ఇతడు శాంత భిక్షావృత్తి పిమ్మట నధికారమునకు వచ్చియుండవచ్చును. ఈ శాసనమునాటికి శాంతయ్యకు నలువది సంవత్సరముల వయసుండె నన్నచో, నతని కుమారుడైన లింగము తన నలువదవయేట పయి శ్రీశైలశాసనమును వ్రాయించెనని తలపవచ్చును. కాని యా పక్షములో శ్రీనాథుడు శాంతయ్యకు తన గ్రంథమును కృతి యీలేదనియు, నాతని యనంతరము శాంతయ్య తనపేర నీ కృతిని వెలయించెననియు స్పష్టమగును. నైషధమందు `సకల విద్యాసనాథ శ్రీనాథ' యని యున్న గద్య భీమేశ్వర పురాణ హరవిలాసాది గ్రంథములలో `సుకవిజనవిధేయ శ్రీనాథనామధేయ'యని మార్పు నందినది. ఈ మార్పు గమనింపని వారెవరో శివరాత్రి మాహాత్మ్యమున గూడ నైషధ గద్యనే యుంచియుందురని తేలుచున్నది. దీనిని బట్టి యీ గద్యము, దానితోపా టాశ్వాద్యంత పద్యములును శ్రీనాథునివి కావని యనవలసివచ్చును.

తాడిపర్తి శాసనమును శాంతయ్య డెబ్బది యేండ్లకు పైబడిన వయస్సున వ్రాయించె ననుకొన్నచో, నతని కొడుకగు లింగయ్య తన నలువదియవయేట (1511) శ్రీశైల శాసనములను వ్రాయించెనని తలపవచ్చును.

శివరాత్రి మాహాత్మ్యమున సత్యహరిశ్చంద్రుడనియు, కృత్యాకృత్య వివేకి యనియు పరమ పరిజ్ఞాన నిధి యనియు, పావనమతి యనియు కొనియాడబడిన శాంతయకు చౌర్యదోష మాపాదించుట న్యాయము కాదు. శ్రీనాథుడే శాంతయ్యకు శివరాత్రి మాహాత్మ్యమును కృతి యిచ్చెనని తలపవచ్చును.

కావ్యపరామర్శ

సుకుమార చరిత్రమున శ్రీనాథుడు నైషధము, కాశీఖండము, మున్నగు తన పూర్వకావ్యములనుండియే కాక భట్టబాణుని కాదంబరీ మహాకావ్యమునందలి రసవద్భాగము లనేకములను స్వీకరించెను. కావుననే శ్రీనాథుడవతారికలో పూర్వకవిస్తుతి యొనర్చు సందర్భమున మొదటనే `బాణు నద్భుత శాస్త్ర బహుకళా పారీణు'నని భట్ట బాణుని కొనియాడెను. ఆ యనుసరణము లీ దిగువ చూపబడును.

గీ. `వానిఁ గలలోనఁ గానని వనజముఖియు
వాని మార్పునఁ బేర్కొని మానవతియు
వానిఁగా నాత్మ భావించి వరునిఁగవయ
నప్పళింపని సతియు లేదయ్యె నచట.'

అను శృంగారనైషధము నందలి (1-62)పద్యభావమే శివరాత్రి మాహాత్మ్యమున రసవత్తరముగా విస్తరింపబడినది.

సీ. హృదయ ముర్విళ్ళూర నేకాంతమున నుండి
వానిఁజింతింపని వనజముఖియు
నొకమాఱు తనిఁ జూచి యొండొక్కమఱి చూడ
నభిలషింపని విద్రుమాధరియునుఁ
గలలోన వానిఁ జిక్కఁగఁ గౌఁగిటను జేర్చి
ముకుళితేక్షణ గాని ముద్దియయును
నతని రూపంబుఁ గుడ్యములందు లిఖియించి
యందంబుఁ జూడని యంగనయును

గీ. జెలులచేతను, బ్రోదిరాచిలుక చేత
వాని గుణములు విని కుచద్వంద్వ సీమఁ
జాదుకొనఁబులకింపని పైదలియును
బన్నిదము వ్రేసినను లేదు పట్టణమున. శివ.మా. 2-94

కాశీఖండములోని గుణనిధిచరిత్రమునందలి

చ. అరుణగభస్తిబింబ ముదయాద్రిపయింబొడతేర గిన్నెలోఁ
బెరుఁగును వంటకంబు వడపిందియలుం గుడువంగఁ బెట్టు ని
ర్భరకరుణాధురీణ యగు ప్రాణము ప్రాణము తల్లి యున్నదే
హర హర! యెవ్వరింకఁ గడు పారసి పెట్టెద రీప్సితాన్నములో?
కాశీ. 4-114

అను పద్యమే శివరాత్రి మాహాత్మ్యములో తృతీయాశ్వాసనమున యథాతథముగా పందొమ్మిదవ పద్యమయినది.

కాశీఖండమున శివదూతలకును, యమదూతలకును జరిగిన సంవాదము నందలి పద్యములోని కొన్ని మాటలు శివరాత్రిమాహాత్మ్యమున చేరుట చూడనగును.

గీ. అభవు కింకరులార! మహాత్ములార!
తగవు ధర్మంబు పాడి పంతంబు దెలియు

మీకు నడ్డంబు గలదె ముల్లోకములను?
నెంతవారము మేము మీ యెదుర నిలువ? కాశీ. 4-127

తగవు ధర్మంబుబాడి పంతంబు దెలిసి' శివ.మా4-73

పుష్పదంతకృత శివమహిమ్న స్తవమునందలి

అతీతః పన్థానం తవ చ మహిమా వాఙ్మనసయో
రతద్వ్యావృత్త్యా యం చకిత మభిధత్తే శ్రుతి రపి
స కస్య స్తోతవ్యః కతివిధగుణః కస్య విషయః
పదే త్వర్వాచీనే పతతి న మనః కస్య న వచః' అను రెండవ శ్లోకము నందలి మాటలును, సనత్కుమార సంహితాంతర్గత శివతత్త్వ సుధానిధి యందలి *శివనామస్మరణాధ్యాయమునందలి*

`హర శమ్భో మహాదేవ విశ్వే శామరవల్లభ
శివ శఙ్కర సర్వాత్మన్ నీలకణ్ఠ నమోస్తు తే' అను శ్లోకమును శ్రీనాథుడు శివరాత్రిమాహాత్మ్యమునందలి (5-21) సంస్కృత రగడలో స్వీకరించెను.

కాళిదాసు మహాకవి కుమార సంభవము నందలి కొన్ని శ్లోకముల యనుకరణము గూడ శివరాత్రి మాహాత్మ్యమున కనుపట్టును.

హితోపదేశమునందలి కతిపయశ్లోకముల యాంధ్రీకరణములును నిందు గనవచ్చును.

భట్టబాణుని కాదంబరి నుండి శ్రీనాథుడెన్నో వర్ణనములను శివరాత్రి మాహాత్మ్యమున గ్రహించెను. కాదంబరీ మహాకావ్యరసలోలుపతచే దానినే శివరాత్రి మాహాత్మ్య రచనా వ్యాజమున నాంధ్రీకరింప నెంచెనా యనిపించును. అందలి పెక్కు ఘట్టములను, పలు పాత్రములను వర్ణించుటకే, - యంతగా నావశ్యకత లేకున్నను, శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యమున కల్పించుకొని యథాతథముగా వాని నాంధ్రీకరించెనా యని తోచును. వ్యాఖ్యానించునెడ నాయా ఘట్టముల నెక్కడవాని నక్కడ ప్రదర్శించుట జరిగినది. కాదంబరిలోని వివిధపాత్రములు శివరాత్రి మాహాత్మ్యమున పరివర్తనము చెందిన విధమిప్పుడు చూపబడును.

కాదంబరిలోని శూద్రక తారాపీడులే శివరాత్రి మాహాత్మ్యమున హేమాంగదు డాయెను. తారాపీడుని పట్టమహిషియగు విలాసవతియు శూద్రకుని భార్యయు నిందు యజ్ఞదత్తామాత్యుని భార్యయగు సుశీలగా పరిణమించిరి. కాదంబరిలోని శుకనాసుడే యిందలి యజ్ఞదత్తుడు. అందలి చంద్రాపీడ వైశంపాయను లిందు విద్యాభ్యాసకాలపు సుకుమారుడైరి. కాదంబరిలో శుకమును దీసికొని వచ్చిన చండాలదారికా రూపిణి యగు మహాలక్ష్మి యిందు కథానాయిక యగు మాలెతగా నవతరించినది. అందలి

పక్కణమే యిందలి పక్కణము. అందలి శబరసేనాపతియగు మాతంగు డిందు మాలెతతో కాపుర ముండినప్పటి సుకుమారు డయ్యెను. అందలి శబరసైనికు లిందు వృద్ధ సుకుమారుని సహచరులు. కాదంబరిలోని తారాపీడుని మహిషి విలాసవతి సంతాన రహితయై పరితపించుట భర్త యామె నోదార్చుట, తాంబూల కరండవాహిని తత్పరితాపకారణమును చెప్పుట, శివాలయ పురాణ శ్రవణము, దానధర్మాదిక మాచరించుట, గర్భప్రాప్తి, సూతికా గృహము, ప్రసవము, ప్రసూతి కాలబలి విధానము, కుమారసంరక్షణము, శైశవక్రీడలు మున్నగునవి యెల్ల దీని యందట్లే యజ్ఞదత్తుని భార్య సుశీల, తత్కుమారుడు సుకుమారుడు ననువారి విషయమున వర్ణింపబడినవి.

ఈశాన సంహింతయందతి సంగ్రహముగా నున్న కథను గైకొని సముచిత వర్ణనల నాయా ప్రకరణములందు జొప్పించి శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యము నొక ప్రబంధమునుగా తీర్చినాడు. అవతారికలో నిష్టదేవతాభివందనము, పూర్వ కవిస్తుతి, కుకవినింద, కృతిపతి వంశాభివర్ణనము, షష్ఠ్యంతములు గలవు. పురము, రాజు, సరోవరము, మధుపానము, విప్రలంభము, యుద్ధము, జలక్రీడ, హేమంత శిశిరవసంతములు, సూర్యాస్తమయము, చంద్రోదయము మున్నగు వానిని వర్ణించి యించు మించుగా నీ కావ్యమున తత్కాల సంఘము ప్రతిఫలించుచుండును. శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యమున నట్లే యాతని నాటి సాంఘికాచారము లెన్నియో తెలియుచున్నవి. నాటి సీమంతోత్సవ విధానము, కాపురుషుల వివిధ వినోదోపాయములు, బ్రాహ్మణుల యాచారములు మున్నగునవెన్నియో యిందు వర్ణింపబడి యీ కావ్యము నాటి సాంఘికజీవనమున కద్దమగుచున్నది.

ఈ వ్యాఖ్యను రచించుటలో నాకు తోడ్పడిన గ్రంథములు.

ఆ గ్రంథకర్తలందఱకును నా కృతాజ్ఞతాభివందనములు

1. శ్రీ డాక్టర్ బిరుదురాజు రామరాజుగారు పరిష్కరించిన శివరాత్రిమాహాత్మ్యము.
2. శ్రీ విద్వాన్ కట్టి సాంబమూర్తిశాస్త్రిగారు పరిష్కరించిన శివరాత్రిమాహాత్మ్యము.
3. ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రికలో 'శివరాత్రిమాహాత్మ్యము కావ్యత్వము' అను శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారి వ్యాసములు.
4. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి శృంగారశ్రీనాథము
5. శ్రీ చాగంటి శేషయ్యగారి ఆంధ్రకవితరంగిణి
6. ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతము గారి ఆంధ్రసాహిత్యచరిత్ర
7. అమరనిఘంటువు.
8. సూర్యరాయాంధ్రనిఘంటువు

9. Apte's English - Sanskrit Dictionary
10. శ్రీనాథరచిత శృంగారనైషధ, భీమేశ్వరపురాణ, కాశీఖండములు.
11. బాలప్రౌఢ వ్యాకరణములు
12. శ్రీ డాక్టర్ దివాకర్ల వేంకటావధాని గారు రచించిన సంస్కృతవ్యాకరణము.

పాఠకులకు సౌకర్యార్థము శివరాత్రి మాహాత్మ్యమునకు మూలమగు నీశాన సంహిత యీ దిగువ నీయబడుచున్నది.

ఈశాన సంహితా

ఋషయః :

కృతాని పాతకానీహ త్వయోక్తాని మహామతే
యై రచిన్త్యాశ్చ జాయన్తే క్రిమయః పక్షిణస్తథా 1

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రా వా యతినోఽపి వా
మూర్ఖో వా పణ్డితో వాపి శ్రీమాన్వా నిర్ధనోఽపివా 2

విలోమజాశ్చ యే కేచి త్తథా చై వానులోమజాః
ఏవంవిధానాం పాపానాం రాశిం మే రూపమంక్షణాత్ 3

కేనాగ్నినా చ దగ్ధ్వా తం శివలోకం వ్రజన్తి తే
లఘూపాయం హి నో బ్రూహి లోకానాం హితకామ్యయా 4

సూతః :

వక్ష్యామ్యహం మునిశ్రేష్ఠా స్సర్వపాప ప్రణాశనం
ఉపాయం సర్వమర్త్యానా మయత్నేన చ ముక్తిదమ్. 5

పురా కైలాసశిఖరే సాంబస్సానుచరశ్శివః
బ్రహ్మాదిభి స్సురగణై స్సేవ్యమాన స్సదైవ హి 6

ఏకదా తు మహాదేవీ శివ మక్షర మవ్యయం
ప్రణిపత్య త మీశాన మపృచ్ఛ ద్వృషభధ్వజమ్ 7

శ్రీదేవ్యువాచ :

సన్తి పాపాని దేవేశ బహూని వివిధాని చ
తాని పాపాని దగ్ధ్వా తు త్వత్సాయుజ్యం కథం వ్రజేత్ 8

దేవదేవ మహాదేవ వద కారుణ్యమస్తి చేత్.

సూతః:

ఉక్తో దేవ్యా మహాదేవః పార్వతీ మభినన్ద్య చ
శివరాత్రివ్రతం తస్యై ప్రోక్తవాన్ శఙ్కరస్స్వయమ్ 9

షణ్ముఖాయ పురా ప్రోక్తం పార్వత్యా శివభాషితమ్
తదేవ కథయిష్యామి ద్వైపాయనముఖాచ్ఛ్రుతమ్ 10

శివరాత్రివ్రతం నామ సర్వపాపతృణానలం
అచణ్డాలమనుష్యాణాం భుక్తిముక్తిప్రదాయకమ్ 11

ఋషయః :

కదా ప్రసిద్ధి మభవ ద్వ్రత మేత న్మహామునే
వ్రతస్యైవ చ మాహాత్మ్యం విధాన ముఖిలం వద 12

సూతః:

ఏవ మేత న్మయా పృష్టః పురా ద్వైపాయనో మునిః
కారణం చైవ మాహాత్మ్యం విధానం ప్రోక్తవాన్ మమ 13

శృణుధ్వం మునయ స్సర్వే వ్యాసోక్తం కథయామి వః
చతుర్యుగ సహస్రం తు బ్రహ్మణో దిన ముచ్యతే 14

తద్వ ద్యుగసహస్రంతుతథా రాత్రి రితి శ్రుతిః
వరాహరూప మాస్థాయ స్సశైలవనకాననామ్ 15

ఉద్ధృత్య స్థాపయామాస యథాపూర్వం గదాధరః
త దాహ జగతాం కర్తా సర్వలోక పితామహః 16

మయా సమధికో వాపి నాస్తి లోకే సురోత్తమః
ఏవం గర్వాన్వితో విష్ణు స్సుష్వాప క్షీరసాగరే 17

నిశాసుప్తోత్థితో బ్రహ్మా సంసృజ్య సకలాః ప్రజాః
భూ రాది సప్తలోకాంశ్చ తథా పాతాళసప్తకమ్ 18

విస్మయేనాన్వితో బ్రహ్మా ఉవా చై వాత్మ నాత్మని
తదాహం జగతాం కర్తా మత్కర్తా స్తీతి నాపరః 19

మయా సమధికో వాపి నాస్తి లోకే సురోత్తమః
ఏవం దృష్ట్వా తు లోకాంస్తు బ్రహ్మాహఙ్కారమాగతః 20

సముద్రాన్ సరితో ద్రష్టుం క్షీరోదధి ముపాగమత్
త త్రాపశ్య ద్ధరిం సుప్తం శేషపర్యఙ్కశాయినమ్ 21

నారాయణ మనాద్యన్తం యోగనిద్రాపరాయణమ్
ఉత్తిష్ఠోత్తిష్ఠ కిం శేషే కస్త్వం కథయ మే స్ఫుటమ్ 22

తతః ప్రబోధితో విష్ణు రువాచ చతురాననమ్
తదాహం జగతాం కర్తా కో భవాన్ చతురానన 23

కిమిర్థ ఇహ సంప్రాప్తః కస్త్వం కథయ మే స్ఫుటమ్
తచ్ఛ్రుత్వా మోహతామ్రాక్షో బ్రహ్మా ప్రాహ జనార్దనమ్ 24

మయి స్థితే జగన్నాథే భవాన్ లోకేశ్వరః కథమ్
మాం జిత్వా సమరే శీఘ్రం భవాన్ లోకేశ్వరో భవ 25

బ్రహ్మణో వచనం శ్రుత్వా విష్ణుః కోపసమన్వితః
ఏహి యోధయ దుర్బుద్ధే శిర శ్ఛేద్యామి తే యుధి 26

ఇత్యుక్త్వా స హృషీకేశో యుద్ధోద్యోగం చకార చ
శార్ఙ్గధన్వా హృషీకేశో ధనురారోప్య వేగవాన్ 27

జ్యాఘోషం తలఘోషం చ చకార మధుహా పునః
జ్యాఘోష తలఘోషాభ్యాం పూరయామాస రోదసీ 28

శరమారోప్య ధనుషి వికృష్య సశరందనుః
బ్రహ్మణే ప్రేరయామాస శరానాశీవిషోపమాన్ 29

శీఘ్రం చిచ్ఛేద బాణాంస్తాం స్తత్ర విష్ణో శ్చతుర్ముఖః
బ్రహ్మా చ శస్త్రవర్షాణి వవర్ష హరిమూర్ధని. 30

త దస్త్ర మఖిలం విష్ణు శ్చిచ్ఛేద సంయుగే
బాణై రాశీవిషాకారై స్సమరే విధి మర్దయన్ 31

హరిణా ప్రేరితాన్ బాణాన్ దృష్ట్వాపి చతురాననః
కుశాగ్రేణైవ చిచ్ఛేద హరిం సమరమూర్ధని 32

ముసలై రాయసై శ్శూలై శ్ఛాదయామాస సఙ్గరే
తై రర్దితో హరిః క్రుద్ధో బ్రహ్మణో వధకాఙ్క్షయా 33

చక్రం ముమోచ వేగేన హతోఽ సీ త్యవద ద్ధరిః
విష్ణునా ప్రేరితం చక్రం దృష్ట్వా తత్ర చతుర్ముఖః 34

అస్త్రం బ్రహ్మశిరో నామ ప్రత్యస్త్ర మసృజ ద్విధిః
త దస్త్ర తేజసా చక్రం భగ్నం దృష్ట్వా గదాధరః 35

క్రోధేన మహతా యుక్తో హన్తుం బ్రహ్మాణ మాహవే
అస్త్రం పాశుపతం నామ సస్మార భయవిహ్వలః 36

అస్త్రం పాశుపతం నామ విససర్జ విధి స్తదా
త దస్త్రయుద్ధ మభవ ద్దివ్యాబ్దానాం శతం పురా 37

విష్ణునా ప్రేషితాస్త్రస్య జ్వాలాః పేతుస్సమన్తతః
త దస్త్రజ్వాలయా దగ్ధం త్రైలోక్య మఖిలం తదా 38

విష్ణునా ప్రేషితం చాస్త్రం బ్రహ్మాణం హన్తు మాగతః
బ్రహ్మణా ప్రేషితం చాస్త్రం విష్ణుం హన్తు ముపాగమత్ 39

జ్వాలామాలా సమాకీర్ణౌ బ్రహ్మవిష్ణూ తదా స్థితౌ
హితాయ సర్వలోకానాం విధే ర్విష్ణో శ్చ యః పితా 40

స శివ స్సర్వలోకానాం కృపాం చక్రే తయో రపి
తద్యుద్ధ శమనార్థం తు తయో స్సంరక్షణాయ చ 41

మాఘ కృష్ణ చతుర్దశ్యాం తయో ర్మధ్యే మహానిశి
ఆత్మానం దర్శయామాస లిఙ్గరూపం తదా కిల 42

అధోభాగ మహం యాస్యే త్వం చోర్ధ్వం చతురానన
స చోర్ధ్వం భగవాన్ బ్రహ్మ హంసరూపీ తదా కిల 43

వరాహరూప మాస్థాయ ద్రష్టుం హరిరధో యయౌ
బహు వర్ష సహస్రాణి గత్వా దృష్ట్వా గతౌ పునః 44

బ్రహ్మస్థితో దక్షిణతో వామభాగే హరి స్థితః
స్వాత్మనోః కారణం మత్వా శివం తు ప్రీతి సంయుతౌ 45

కృతాఞ్జలిపుటౌ భూత్వా శివం స్తోతుం సముద్యతౌ
తయో ర్బ్రహ్మ పురా విప్రాః స్తోతుం సముపచక్రమే 46

బ్రహ్మోవాచ :

నమస్తే సర్వలోకానామాదికర్త్రే మహాత్మనే
పురుషాయ పురాణాయ పరంజ్యోతిస్స్వరూపిణే 47

చక్రభ్రమణ కర్తా త్వం సదా శమ్భో నమోఽస్తు తే
ప్రేరక స్సర్వజగతా మన్తర్యామీ హృది స్థితః 48

త్వన్మాయయాపహృతజ్ఞానో న జానే త్వాం మహేశ్వరమ్
మమ కర్తా త్వ మేవాసి కర్తా విష్ణో స్త్వమేవ చ 49

వాచా మగమ్యతాం యాతో విశ్వరూపోఽపి సర్వగః
అతః స్తోతుం న శక్నోమి యోఽపి సోఽపి నమోస్తు తే 50

ఏవం స్తుత్వా పద్మయోని స్తూష్ణీమాస ద్విజోత్తమాః
తత శ్శివం ప్రభుం విష్ణుః స్తోతుం సముపచక్రమే 51

విష్ణురువాచ :

సర్గస్థితివినాశానాం కర్తా త్వం సర్వదా శివ
త్వ న్మాయయామోహితో దేవ న జానే త్వాం మహేశ్వర 52

పశవో హి వయం సర్వే సదేవాసురమానవాః
పతిస్త్వ మేవ సర్వేషాం పశూనాం పరమేశ్వర 53

హతాని విష్ణుబృన్దాని గీర్వాణా బ్రహ్మకోటయః
త్వ యైకేన సదా శమ్భో పాహి మాం భక్తవత్సల 54

అసమర్థో యథా ద్రష్టుం లోకో హి రవిమణ్డలమ్
త థైవ త్వా మహం ద్రష్టు మసమర్థో మహేశ్వర 55

వికారషట్క రహిత నిరుద్యోగి బృహద్వపుః
దైత్య వర్జిత విద్రూప యోఽసి సోఽసి నమోస్తు తే 56

సూతః :

ఏవం స్తుత స్తదా తాభ్యాం కృపయా పరమేశ్వరః
లిఙ్గమధ్యా ద్వినిష్క్రమ్య శఙ్కర స్స్వాత్మనో వపుః 57

బభాషే భగవాన్ శమ్భుః మహాదేవో ఘృణానిధిః
తదా సందర్శయామాస వపుషా చాత్మన స్తయోః 58

ఆవిర్భూత మజం శమ్భుం బ్రహ్మా విష్ణుశ్చ సామ్మతమ్
ననన్దతు స్తౌ తత్రస్థౌ దృష్ట్వా సామ్బం సదాశివమ్ 59

అర్ధనారీశ్వరం దేవం త్రిణేత్రం నీలలోహితమ్
వరదాభయహస్తం చ మృగటఙ్కధరం ప్రభుమ్ 60

సర్వాభరణ సంయుక్తం చన్ద్రకోటి సమప్రభమ్
కోటిసూర్యప్రతీకాశం బాలచన్ద్రావతంసకమ్ 61

దృష్ట్వా విస్మయ మాపన్నౌ భక్త్యా సంపూజ్య శఙ్కరమ్
నీలరుద్రేణ రుద్రేణ త్వరితేన మహేశ్వరమ్ 62

శిఖయాధర్వశిరసా సూక్తై ర్బహువిధై రపి
స్తుత్వా బహువిధై స్స్తోత్రైః కృతాఞ్జలిపుటౌ స్థితౌ 63

బ్రహ్మా విష్ణుశ్చ దేవేశం సర్వలోక మహేశ్వరమ్
హరికేశ స్తదా తాభ్యాం భక్త్యా పరమయా స్తుతః 64

ఉవాచ వచనం చారు పరిపూర్ణార్థ మీశ్వరః
శృణు పద్మజ మద్వాక్యం త్వం విష్ణో గరుడధ్వజ 65

అహమేవ జగత్కర్తా యువయోః కారణం త్వహమ్
మత్ప్రసాదా త్త్విదం లబ్ధం బ్రహ్మన్ విష్ణో త్వయానఘ 66

ఉభయో రస్తతేజోభి ర్దగ్ధం తద్యువయోః పదమ్
శివరాత్రివ్రతం నామ యువాభ్యాం సుకృతం త్విదమ్ 67

తస్మా త్త్వతః పదం దాస్యే యువయో ర్లోకపూజితౌ

బ్రహ్మావిష్ణూ ఊచతుః

వ్రత స్యాస్య విశేషేణ తిథిం బ్రూహి మహేశ్వర 68

యస్మిన్ కృత్వా వ్రతం సమ్యక్ త్వత్సాయుజ్య మవాప్నుయాత్

ఈశ్వరః :

యువయో రైక్య శాన్త్యర్థం శస్త్రాగ్ని శమనాయ చ 69

మాఘ కృష్ణ చతుర్దశ్యాం మహాదేవో మహానిశి
అభవ ల్లి ఙ్గరూపేణ భక్తానా మనుకమ్పయా 70

లిఙ్గమధ్యే సమభవ మర్ధనారీశ్వరోఽ ప్యహమ్
తత్కాలవ్యాపినీ గ్రాహ్యా శివరాత్రివ్రతే తిథిః 71

తత్ర కృత్వా మహాపుణ్యం భవిష్యతి న సంశయః
ఉదయాదిః క్వచి ద్రా హ్యా క్వచి దస్తమయాన్వితా 72

వ్రతిభి స్త్రిథయో యత్నా ద్వర్జయిత్వా వ్రతం త్విదమ్
అర్ధరాత్రా దధ శ్చోర్ధ్వం. నాస్తి యత్ర చతుర్దశీ 73

నైవ తత్ర వ్రతం కుర్యా దాయురైశ్వర్యహానృథ
వ్యాప్యార్ధరాత్రం యస్యాం హి లభ్యతే యా చతుర్దశీ 74

తస్యా మేవ వ్రతం కార్యం మత్ప్రసాదార్థిభి ర్నరైః
పూర్వేద్యు రపరేద్యు ర్వా మహానిశి చతుర్దశీ 75

వ్యాప్తా సా దృశ్యతే యస్యాం తస్యాం కుర్యాద్వ్రతం త్విదమ్
లిఙ్గా విర్భావకాలే తు వ్యాప్తా గ్రాహ్యా చతుర్దశీ 76

త దూర్ధ్వా ధోన్వితా వాపి సా గ్రాహ్యా వ్రతిభి స్సదా
శివరాత్రివ్రతం కార్యం భూతాన్విత మహానిశి 77

అస్మిన్నేత ద్వ్రతం కృత్వా మమ సాయుజ్యమాప్నుయాత్

బ్రహ్మవిష్ణూ :

వ్రత స్యాస్య మహాదేవ విధానం సకలం వద 78
తత్ర పూజావిధిం ద్రవ్యం విస్తరేణ మహేశ్వర

ఈశ్వరః :

శృణు బ్రహ్మన్ వ్రతవిధిం శృణు విష్ణో గదాధర 79

మమ ప్రియకరీ హ్యేషా మాఘకృష్ణ చతుర్దశీ
మహానిశ్యన్వితా యత్ర తత్ర కుర్యా ద్వ్రతం త్విదమ్ 80

పూర్వేద్యు రేకదాశ్నీయా ద్దన్త ధావన పూర్వకమ్
అద్రోహణాన్వితః కుర్యా ద్బ్రహ్మచర్యవ్రతం వ్రతీ 81

బ్రాహ్మే ముహూర్తే చోత్థాయ కృతశౌచవిధిక్రమః
అభివాద్య గురుం భక్త్యా తదనుజ్ఞా మవాప్య చ 82

శివస్య సన్నిధిం గత్వా ప్రణమ్య వృషకేతనమ్
శివరాత్రివ్రతం దేవ కరిష్యే తవ సన్నిధౌ 83

నిర్విఘ్నం కురు దేవేశ భక్తిగ్రాహ్య మహేశ్వర
ఏవం సంకల్ప్య విధివ చ్ఛాన్తో భూతహితే రతః 84

పూజోపకరణం ద్రవ్యం సర్వం సంపాదయేత్తథా
మధ్యాహ్నకాలే సంప్రాప్తే నదీం గత్వా సముద్రగామ్ 85

సరిత్కుల్యాదికం గత్వా స్నాయాదేవం విధానతః
నిత్యం దేవార్చనం కుర్యా ద్గృహ మాగత్య భక్తితః 86

శివస్య యజనస్థాన మలంకృత్య సమాహితః
సమ్మార్జ నానులేపాద్యై శ్శోధయే త్కుడ్యమేవ చ 87

వితానధ్వజ మాల్యైశ్చ ఫల పక్వాన్న లమ్బితైః
అలంకుర్యా చ్చతుర్దిక్షు వస్త్రకాంస్యాదితోరణైః 88

పూజోపకరణం ద్రవ్య మాదాయ సుసమాహితః
పూజాగృహం ప్రవిశ్యాథ ప్రణమ్య శివ మీశ్వరమ్ 89

ఉపవి శ్యాసనే శుద్ధే ప్రాణా నాయమ్య వాగ్యతః
వామహస్తే వినిక్షిప్య భసితం సిత ముత్తమమ్ 90

శివం దేవం చ సంస్మృత్య విమృజ్యాఙ్గాని సంస్పృశేత్
పున ర్భస్మ సమాదాయ వామహస్తే వినిక్షిపేత్ 91

త్రియమ్బకేన చామన్త్ర్య తత స్సమృజ్య వారిణా
త్రిపుణ్డ్రం ధారయే త్తేన లలాటాదిష్వనుక్రమాత్ 92

రుద్రాక్షాన్ ధారయే త్పశ్చా ద్వ్రతీ నియమమాశ్రితః
మద్భక్తాంశ్చ సమాహూయ దద్యాత్పూజనసాధనమ్ 93

భక్తై స్సంభూయ దేవేశం పూజయేచ్చ సమాహితః
స్వగురూక్తేన మార్గేణ యజే ద్దేవం ప్రయత్నతః 94

ఆసనం పాద్య మర్ఘ్యం చ మధుపర్కాదికం తతః
ద త్త్వాథ స్నాపయే ద్దేవం బ్రాహ్మ్యా (?) స్నానేన భక్తితః 95

పఞ్చామృతేన సంస్నాప్య స్నాపయేచ్చ ఫలోదకైః
పుష్పోదకై ర్గన్ధతోయై స్స్నాపయే త్కుఙ్కుమాదిభిః 96

రత్నోదకై శ్చ దేవేశం తథా కర్పూరవారిభిః
లేపయే దవచూర్ణైశ్చ ఘర్షయే ద్బిల్వపత్రకైః 97

పుష్పోదకేన సంస్నాప్య స్నాపయే చ్ఛీతలామ్బుభిః
వస్త్రం దద్యాచ్చ దేవాయ సోపవీతం చ భక్తితః 98

దద్యా దాచమనం భక్త్యా పాద్య మర్ఘ్యాదికం తతః
కర్పూరకుఙ్కుమోపేతం గన్ధం దద్యాచ్ఛివాయ చ 99

భూషణై ర్భూషయే ద్దేవం హేమరత్నాది నిర్మితమ్
అఖణ్డై ర్బిల్వపత్రై శ్చ మరుకోమలపత్రకైః 100

పుష్పై స్సంపూజయే ద్దేవం కమలోత్పలపూర్వకైః
కున్ద పున్నాగవకుళ శిరీషాశోక కింశుకైః 101

అర్కద్రోణై రపామార్గైః శమీ బృహతి పూర్వకైః
అన్యై ర్నానావిధైః పుష్పైః పూజయే దమ్బికాపతిమ్ 102

ఘృతాక్తం గుగ్గులుం దద్యా ద్దీప మాజ్యేన యోజితమ్
గోధూమపిష్టరచితం పరమాన్నాదిసంయుతమ్ 103

లేహ్యచోష్యాదిసంయుక్త మాజ్యేనాన్విత మాదరాత్
నానావిధ ఫలోపేతం దద్యా న్నైవేద్య ముత్తమమ్ 104

సకర్పూరం చ కస్తూరీయుక్తం తామ్బూల మేవ చ
దద్యా న్నీరాజనం దీపై ర్భక్త్యా కర్పూర దీపకైః 106

పురాణ వచనై శ్చైవ కుర్యా జ్జాగరణం వ్రతీ
ఏవమేవ యజే ద్దేవ ముపచారై ర్వ్రతీ నిశి 107

ఏవమేవ యజేద్దేవ ముపచారై ర్వ్రతీ నిశి
జాగరం చోపవాసం చ తస్మిన్ కుర్యా ద్వ్రతీ పుమాన్ 108

ఏవమేవ తదా రాత్రి పూజా జాగరణం నయేత్
పూజాన్తేన జపేత్ స్తోత్ర మభిత శ్చాఞ్జలిం క్షిపేత్ 109

ఋషయః :

కిం తత్ స్తోత్రం మహాభాగ కాని నామాని సువ్రత
తత్సర్వం కథయాస్మాకం లోకానాం హితకామ్యయా 110

సూతః :

శృణ్వన్తు ఋషయ స్సర్వే వ్యాసేనోక్తం వదామ్యహమ్
యస్య వై పాఠమాత్రేణ వ్రతస్యైవ ఫలం లభేత్ 111

నమ స్సకలకల్యాణదాయినే శూలపాణయే
విషయార్ణవ మగ్నానాం సముద్ధరణసేతవే 112

అఘ్నివా స్నేహరూపాయ వార్తా తిక్రాన్తివర్తినే
స్వభావోదార ధీరాయ చిద్రూపాయ నమో నమః 113

యత్ర సర్వం యతస్సర్వం యత్ర స సర్వతః
లోకకల్లోలసలిలం దేవం శమ్భుం మహోదధిమ్ 114

దిశి రక్షణమారుహ్య ధీ సద్మాని వికాసయన్
ఉదితో భాతి యోఽ భ్యస్త స్తం దేవం శమ్భుభాస్కరమ్ 115

హృదయాకాశ సంక్రాన్త మహామోహాభ్రమావికమ్
బాధయే ద్యస్తు తరసా వన్దే శమ్భుం మహానిలమ్ 116

వామదక్షిణపార్శ్వే తు సంజాతాది విమర్దికా
యస్య దేవస్య తం వన్దే సర్వకారణకారణమ్ 117

భవామయ పరిక్రాన్త మర్త్యానాం స్మృతిమాత్రతః
భవం హరతి యో నిత్యం వన్దే భవభిషక్ తకమ్ (?) 118

యస్మిన్ సూర్యో న భాతీశే చన్ద్రమా నానిలోఽపి వా
యస్య భాసా విభాతీదం తం వన్దే శివమవ్యయమ్ 119

ఆత్మారామం మహాత్మానం సర్వభూత హృది స్థితమ్
చేత స్యేవం శివం దేవం మహాదేవం నమామ్యహమ్ 120

ఏకోఽపి బహుధా భాతి ప్రతిదేహ సముద్రకే
హృది స్థితోఽపి యో దూర స్తం నమస్యే సదాశివమ్ 121

బ్రహ్మ విష్ణ్వాది దేవేషు నృ పక్షి మృగయోనిషు
యత్పాద పద్మనప్రమాణా మల్పం విష్ణ్వాదికం పదమ్ 122

త్రసరేణూపమం ప్రాహుస్తం వన్దే శివ మవ్యయమ్
స్రష్టా త్వమేవ లోకానాం పాలకో జగతామపి 123

అత్మకోఽపి త్వమేవేశ నమామి త్వాం మహేశ్వర
అపరాధసహస్రాణి క్రియన్తేఽ హర్నిశం మయా 124

పాహి మా మపరాధేభ్యః పితా పుత్ర మివ ప్రియమ్
ఏతత్ స్తోత్రం పఠే ద్యస్తు భక్త్యా యస్తు శృణోతి వా 125

శివరాత్రివ్రతఫలం తయో ర్దాస్యతి శఙ్కరః
కథయామి మునిశ్రేష్ఠా శ్శివనామాని భక్తితః 126

వ్రతస్య పరిపూర్ణార్థం శివప్రియకరాణి చ
శివో రుద్రః పశుపతి ర్నీలకణ్ఠో మహేశ్వరః 127

హరకేశో విరూపాక్షః పినాకే త్రిపురాన్తకః
శమ్భు శ్శూలీ మహాదేవః నామాన్యేతా న్యనుక్రమాత్ 128

చతుర్థ్యన్తం సముచ్చార్య దద్యా త్పుష్పాఞ్జలిం ప్రతీ
ఏవ మేవ సముచ్చార్య యామే యామే గతే నిశి

స్తోత్రై స్స్తుత్వాఞ్జలిం దత్వా నమస్కుర్యాచ్చ నామభిః 129
సుకృతాం శివపూజాం చ శివాయ వినివేదయేత్

ప్రభాతే సమనుప్రాప్తే శివపూజాం సమాప్య చ 130
ప్రాతః పూజాం విధాయైవం శివాయ వినివేదయేత్

యద్వ్రతం మన్త్రహీనం చ యచ్చ భక్త్యా వినా కృతమ్ 131
యచ్చ దక్షిణయా హీనం పూర్ణం కురు మహేశ్వర

ఏవమేవ వ్రతం కుర్యా త్ప్రతిసంవత్సరం ప్రతీ 132
సర్వాన్ కామా నవాప్నోతి ప్రీత్యా దేవేషు మానవః

ఓ మిత్యాది మహాపురాణే శ్రీ స్కాన్దే ఈశాన సంహితాయాం 133
శివరాత్రి ప్రాదుర్భావ తద్వ్రత పూజా విధానం నామ
సప్తతితమోఽధ్యాయః

శరచ్చన్ద్ర ప్రకాశేన వపుషా శీతలద్యుతిమ్ 134

వన్దే సింహాసనాసీన ముమయా సహితం శివమ్ 135

ఋషయః :

ఏవ ముక్త ప్రకారేణ శివరాత్రివ్రతం త్విదమ్ 136

కృత్వా యత్ఫలమాప్నోతి తన్నో వద మహామతే 137

సూతః:

ఏవం కృత్వా మునిశ్రేష్ఠా శ్శివరాత్రివ్రతం త్విదమ్
విధినానేన సహితం యత్ఫలం సమవాప్యతే 138

రాజసూయాయుతం కృత్వా యత్ఫలం లభతే నరః
శివరాత్రివ్రతం కృత్వా తత్ఫలం సమవాప్నుయాత్ 139

కపిలా దాన కోటీనాం కర్తా యల్లభతే ఫలమ్
శివరాత్రి వ్రతం కృత్వా తత్ఫలం లభతే నరః 140

సప్తసాగరపర్యన్తాం మహీం దృష్ట్వా తు యత్ఫలమ్
బ్రహ్మహత్యాయుతం కృత్వా స్తేయానా మయుతం తథా 141

శివరాత్రి వ్రతం కృత్వా సద్యో ముచ్యేత బన్ధనాత్
సురాపాన సహస్రాణి భ్రూణహత్యాయుతాని చ 142

వీరహత్యాసహస్రాణి నశ్యన్తి వ్రతదర్శనాత్
గవాం హత్వా సహస్రాణి నశ్యన్తి చణ్డాల గమనాయుతమ్ 143

శివరాత్రివ్రతం కృత్వా తాని నశ్యన్తి తత్క్షణాత్
శ్రూయతే హి పురా కశ్చిద్బ్రాహ్మణః పాపకృత్తమః 144

మహాపాతకలక్షైశ్చ ఉపపాతక కోటిభిః
శివరాత్రి వ్రతం దృష్ట్వా ముక్తశ్శివపురం యయౌ 145

ఋషయః :

శివరాత్రివ్రతం దృష్ట్వా కథం పాతక కోటిభిః
ముక్త శ్శివపురం ప్రాప్త స్తన్నో విస్తరతో వద 146

సూతః :

అస్త్యస్మిన్ వసుధాపీఠే దేశో విపులకోటిశః
విన్ధ్యా దుత్తర దిగ్భాగే నానాజనపదావృతే 147

ఇరావతీ నామ నదీ శతద్రూశ్చ విపాట్తథా
సిన్ధు రిత్యపి విఖ్యాతా వితస్తా చేతి నామతః 148

వహన్తి సరితో యత్ర నానాశ్చర్య మనోహరాః
తాసాం సిన్ధునదీతీరే నగరం కుబ్జకాభిధమ్ 149

తస్మి న్నివసతి శ్రీమాన్ రాజా పరపురంజయః
కల్పద్రుమసమోఽర్థీనాం స్త్రీణాం కామ ఇవాపరః 150

వ్యవహార విచారార్థం సర్వశాస్త్రవిశారదమ్
స్థాపయామాస భూపాలో బ్రాహ్మణం నయకోవిదమ్ 151

సుకుమార ఇతి ఖ్యాతో బ్రాహ్మణస్యాభవత్సుతః
స తు కామకళాశాస్త్రం సర్వమభ్యస్య రాగవాన్ 152

షిద్గో భూత్వా తు తత్రైవ నాగరాణాం ప్రియో వసన్
సర్వానార్య స్త్ర మాహూయ తే నైవ సహ రేమిరే. 153

బ్రాహ్మణ క్షత్ర వైశ్యానాం శూద్రాదీనాం స్త్రియస్తథా
సర్వాన్ త్యజన్తి భార్యాశ్చ భర్తౄ నుత్సృజ్య రేమిరే 154

తతోఽథ నాగరా స్సర్వే స్వభార్యా వినివారణే
అశక్తా స్సర్వ ఏ వాథ రాజపార్శ్వ ముపాగమన్ 155

నాగరాః :

ఆకర్ణయ మహీపాల వృత్తాన్త మయశస్కరమ్
ధర్మస్య యశసశ్చైవ కశ్చి చ్ఛత్రు రిహాస్తి నః 156

కామశాస్త్ర కళాభిజ్ఞ షిద్గః కశ్చి న్మహీపతే
జారో భూత్వా తు న స్స్త్రీణాం ధర్మస్య యశసోఽన్తకః 157

చతుర్ణాం బ్రాహ్మణాదీనాం సఙ్కరాణాం తథైవ చ
సర్వాసా మన్త్యనారీణాం షిద్గో భర్తృత్వ మాగతః 158

న సమర్థా వయం సర్వే నారీణాం శిక్షణే నృప
న భర్తౄన్ ప్రతిగచ్ఛన్తి తస్మిన్ సతి దురాత్మని 159

అన్యాయసదృశం దణ్డం తస్య శీఘ్రం నిపాతయ
నోచే దపయశోయుక్తో నరకం చైవ గచ్ఛతి 160

సూతః:

ఏత చ్ఛ్రుత్వా మహీపాల స్త మాహూయాథ సత్వరమ్ 161
వాగ్దణ్డై ర్దణ్డయిత్వా తం స్వదేశాన్నిరవాసయత్

రాజ్ఞావమానితః పాపీ కఞ్చి ద్దేశ మథాగమత్
తస్మా ద్దేశా త్త థాక్రమ్య హూణమణ్డల మావిశత్ 162

స కదాచి ద్వనోద్దేశే సరసం దృష్టవా న్నరః
హంసకారణ్డవాకీర్ణం చక్రవాకోపశోభితమ్ 163

కమలోత్పలకల్హారైః పుష్పైఃరన్యైస్సమావృతమ్
తస్మి న్నథ జలక్రీడాం కర్తు మాగత్య సంస్థితః 164

తస్మి న్నేవ తదా కాలే స్నానార్థం కాచి దఙ్గనా
చన్ద్రబిమ్బాభవదనా బిమ్బోష్ఠీ చ కృశోదరీ 165

రూపయౌవనసమ్పన్నా చణ్డాలీ చ రజస్వలా
స్నానార్థమాగతం షిద్గం రూపయౌవనసంయుతమ్ 166

నారీచిత్తప్రమథనే దక్షం కామమివాపరమ్
తాం దృష్ట్వా కామసన్తుష్టా తస్య పార్శ్వ ముపాగతా 167

తాం దృష్ట్వా రూపసమ్పన్నాం కామస్య దయితా మివ
కామసంతప్తహృదయః గృహీత్వా తాం రహో యయౌ 168

తదా సురత సంయోగం యథేష్టం కృతవాంస్తదా
సా తేన సురతం కృత్వా మనసా తోషమాగతా 169

ప్రణయే నాపి తం షిద్గం యావద్దేహ మిదం మమ
తవ భార్యా భవిష్యామి మామేవ భజ సున్దర 170

ఏవ ముక్త స్తయా సోఽథ తథా చక్రే హి పాపకృత్
తతః ప్రభృతి షిద్గోఽ సౌ చణ్డాల్యా సహ సంగతః 171

నానావిధాని మాంసాని బుభుజే చ తయా సహ
మృగాన్ నానావిధాన్ హత్వా పక్షిణోఽథ జలేచరాన్ 172

గవాం శతసహస్రాణాం కపిలానాం సహస్రకమ్
తేషాం మాంసాని పాపాత్మా బుభుజే చ తయా సహ 173

అశ్వమాంసాదికం సర్వం బుభుజే కామమోహితః
వనోద్దేశేషు మార్గేషు హత్వా విప్రాన్ సహస్రశః 174

తేషాం విత్తం సమాదాయ బుభుజే చ తయా సహ
ఏవంవిధాన్యనేకాని కుర్వన్ పాపాని భూరిశః 175

బుభుజే విషయాన్ సర్వాన్ చణ్డాల్యా సహ పాపకృత్
ఏవం సప్తతివర్షాణి చణ్డాల్యా సహ సంయుతః 176

తయా సహైవ పాపాని కృతవాన్ బహుశః పురా
పుత్రా నుత్పాదయామాస పఞ్చపాతక సన్నిభాన్ 177

యాని యానీహ పాపాని శాస్త్రేషూక్తాని సూరిభిః
తాని సర్వాణి కృతవాన్ చణ్డాల్యా సహ పాపకృత్ 178

సాతు కాలేన చణ్డాలీ తత్ర పాపసహా పరి (?)
ద్వే కన్యే రూపవత్యౌ చ చణ్డాలీ సుషువే పురా 179

రేమే తాభ్యాం స పాపాత్మా కామభోగా ననేకశః
తత్రాప్యుత్పాదయామాస పాపీ పుత్రద్వయం తథా 180

రాజ్ఞ స్సకాశా దాదాయ విప్రా బహువిధం ధనమ్
స్వదేశం ప్రస్థితా గన్తుం శతం బ్రాహ్మణపుఙ్గవాః 181

తాన్ విదిత్వా తు పాపాత్మా పుత్రై రన్యైశ్చ సంయుతః
మార్గ మారుధ్య తాన్ హత్వా తద్విత్తం హృతవాన్ బహు 182

చోరై శ్చ నిహతాన్ విప్రాన్ శ్రుత్వా తద్దేశ భూపతిః
పథార్థం ప్రేషయామాస చోరాణాం స్వబలం మహత్ 183

జ్ఞాత్వా స పాపీ వృత్తాన్తం సర్వాన్ బన్ధూన్ విసృజ్య చ
స కార్యం (?) గతవాన్ శీఘ్రం సుతా మాదాయ పాపకృత్ 184

కిరాతదేశం సంప్రాప్య స తత్ర విచచార హ
వణిక్పథ మితి ఖ్యాతం పట్టణం సుశ్రుతం భువి 185

తత్రస్థాశ్చ నరా స్సర్వే సమ్పన్నా ధనదోపమాః
పట్టణ స్యాతిదూరే తు లిఙ్గం గవ్యూతిమాత్రతః 186

నాగేశ్వర మితి ఖ్యాత మస్తి త్రైలోక్యపూజితమ్
మాఘకృష్ణ చతుర్దశ్యాం సర్వే పట్టణవాసినః 187

రాత్రౌ జాగరణం కర్తుం భార్యాపుత్రాదిసంయుతాః
అలంకృతాశ్చ తే సర్వే నాగేశ్వర ముపాగతాః 188

సర్వే సంపూజ్య తం లిఙ్గం జాగరం తత్ర చక్రిరే
ఖాత్వా బహువిధం మాంసం సురాపానం ముహుర్ముహుః 189

సురతేన సుతాం రన్తుం పుష్పాణ్యాహర్తు మాగతః
గీతవాదిత్ర ఘోషేణ రాత్రౌ జాగరణం తథా 190

వ్రతిభిః క్రియామాణం తు తన్మహానిశి దృష్టవాన్
దూరా ద్దేశాత్ స్థిత స్సర్వం మహానిశి కృతార్చనమ్ 191

దృష్ట్వాభినన్ద్య దేవేశం గతవాన్ శ్వపచాలయమ్
ఏవం హి వసత స్తస్య చాయుః క్షీణ మభూత్తదా 192

తథాపి మృత్యునా సర్వే యమదూతా యమాజ్ఞయా
పాశముద్గరసన్నద్ధాః ఖడ్గతోమరపాణయః 193

బధ్వా పాశేన తం పాపం గృహీత్వా గన్తు ముద్యతాః
ఏతస్మి న్నేవ కాలే తు శివదూతా శ్శివాజ్ఞయా 194

తం నేతు మాగతా శ్శీఘ్రం శతశోఽథ సహస్రశః
శుద్ధస్ఫటికసఙ్కాశాః సునేత్రాస్సుకపర్దినః 195

చతుర్భుజా మహాకాయా శ్శూలముద్గరధారిణః
కేచి దఙ్కుశహస్తాశ్చ గదాహస్తా స్తథాపరే 196

ధనుర్ధరా స్తథా చాన్యే కేచి త్పరిఘపాణయః
భిణ్డివాలై స్తథా చాన్యే కేచి త్పరిఘపాణయః 197

వ్యాఘ్రచర్మపరీధానా నాగాభరణభూషితాః
భస్మోద్ధూళిత సర్వాఙ్గా స్త్రిపుణ్డ్రాఙ్కితమస్తకాః 198

తే సమేత్య తదా సర్వే దదృశు ర్యమకిఙ్కరాన్
బద్ధ్వా పాశేన తం పాపం గ్రహీతుం గన్తు ముద్యతాన్ 199

శివదూతాః :

యస్య ప్రసాదలేశేన బ్రహ్మా బ్రహ్మత్వ మాగతః
విష్ణు ర్విష్ణుత్వ మాపన్న స్తస్య దూతా వయం భటాః 200

యమకిఙ్కరాః:

శివదూతా భవన్తో హి కిమర్థ మిహ చాగతాః
యే యజన్తి మహాదేవ మనన్యమనసోఽమలాః 201

తేషా మానయనార్థాయ భవదాగమనం యతః
అయం త్వతీవ పాపిష్ఠ స్సర్వలోకవిగర్హితః 202

అనేన యాతనాః కష్టా భోక్తవ్యా బహుకాలికాః
యస్యాజ్ఞయా వయం ప్రాప్తాః కర్తుం శాసనమస్య తు 203

వయమేవ న ముఞ్చామో భవన్తో గన్తుమర్హథ. 204

సూతః :

ఏతచ్ఛ్రుత్వాతి వేగేన శివదూతా మహాబలాః
ఊచుః క్రోధాన్వితా స్సర్వే కల్పాన్తానిలసన్నిభాః 205

శివదూతాః :

హరికేశాజ్ఞయా ప్రాప్తా నేతుమేనమకల్మషమ్
ముఞ్చతైనం మహాభాగం యది జీవితు మిచ్ఛథ 206

సూతః :

గణేశ్వర వచ. శ్శ్రుత్వా భటా దర్ప సమన్వితాః
అత్ర గ్రన్థపాతః

ఏవంవిధోఽపి పాపాత్మా గత శ్శివపురం కథమ్
స్వబలం చ హతం దృష్ట్వా పాపిష్ఠస్యోత్తమాం గతిమ్ 1

భీతాత్మా విస్మయావిష్టో లోకనాథం దిదృక్షయా
చిత్రగుప్తాదిభిస్సార్థం శివలోకం యయౌ యమః 2

త్రయోవింశతిసఙ్ఖ్యాకాన్ స్వర్గలోకానతీత్య చ
మునిమణ్డలమాక్రమ్య మహర్లోకమతీత్య చ 3

సత్యలోకం దదర్శాథ బ్రహ్మైశ్వర్య మనోహరమ్
తస్మా దూర్ధ్వ మ థాక్రమ్య విష్ణులోకం దదర్శ హ 4

బ్రహ్మైశ్వర్య సమాయుక్తం పశ్య న్నూర్ధ్వం యయౌ యమః
శివలోకం దదర్శాథ సర్వలోకోత్త మోత్తమమ్ 5

ద్వాత్రింశత్కోటిసంస్థానం యోజనై రతి విస్తరమ్
జామ్బూనద విమానైశ్చ సౌవర్ణై రవ్యలఙ్కృతమ్ 6

మణిరత్నమయై ర్యానై ర్వజ్ర వైడూర్య నిర్మితైః
కల్ప వృక్షాసనై ర్యుక్తై పపరాజన సంయుతైః 7

బహ్వైశ్వర్యగణై ర్యుక్తం శివలోక మనుత్తమమ్ 8

ప్రవిశ్య చ దదర్శాథ శివస్య మహతీం సభామ్
కోటియోజనవిస్తీర్ణాం చతుర్ద్వారసమన్వితామ్ 9

చతుస్తోరణసంయుక్తాం హేమరత్నోప శోభితామ్
దివ్యరత్నవితానాఢ్యాం దివ్యచ్ఛత్రోపశోభితామ్ 10

దివ్య రత్నమయై స్స్తమ్భైః స్ఫటికై రుపశోభితామ్
అనన్తైశ్వర్య సంయుక్తాం ప్రవివేశ తతో యమః 11

దదర్శ నన్దినం తత్ర పూర్వద్వారస్థితం ప్రభుమ్
భస్మోద్ధూళితసర్వాఙ్గం త్రిపుణ్డ్రాఙ్కిత మస్తకమ్ 12

సుయశోదయితం శాన్తం శూలనేత్రధరం ప్రభుమ్
తస్మై ప్రణామం కృత్వా తు ధర్మః కార్యం వ్యజిజ్ఞపత్ 13

ద్రష్టు మభ్యాగతో దేవం సర్వలోక మహేశ్వరమ్
తవ ప్రసాదా త్ర్వక్ష్యామి భృత్యభూతోఽ ప్యహం తవ 14

ధర్మేణ భాషితం శ్రుత్వా గత్వా చైవ శివాన్తికమ్
కృత్వా ప్రణామం దేవస్య కృతాఞ్జలి రువాచ హ 15

ప్రసీద మే జగన్నాథ యమ స్త్వాం ద్రుష్టు మాగతః
చిత్రగుప్తాదిభి స్సార్థం కి మాగచ్ఛతు గచ్ఛతు 16

శివస్యేఙ్గిత మాజ్ఞాయ నన్దీశ్వర ఉపాగమత్
యమం ప్రావేశయామాస చిత్రగుప్తాదిభి స్సహ 17

దేవస్య పూర్వదిగ్భాగే దీవ్యమానవపుర్ధరాన్
గణేశ్వరాన్ దదర్శాథ ధర్మరాజో మహాయశాః 18

తత్ర పాశుపతా శ్చైవ శైవాః కేచి త్తథాపరే
కాలాముఖా స్తథా చాన్యే కేచిన్మాహేశ్వరా జనాః 19

దివ్యాభరణసంయుక్తా దివ్యస్రగనులేపనాః
చతుర్భుజా స్త్రిణేత్రాశ్చ శైవసిద్ధాన్తకోవిదాః 20

శుద్ధస్ఫటికసఙ్కాశ జటాచన్ద్రార్ధధారిణః
అనేకకోటిసఙ్ఖ్యాతా శ్శివతుల్యపరాక్రమాః 21

బ్రహ్మణ్డ మాలాభరణాన్ మహాదేవ పరాయణాన్
యమో దృష్ట్వాతిహృష్టాత్మా తదా విస్మయ మాగతః 22

దేవస్య దక్షిణే పార్శ్వే యే స్థితా స్తాన్ దదర్శ హ
చరాచరమిదం సర్వం జగజ్జాలం యదిచ్ఛయా 23

చతుర్వేదా ముఖం యస్య స దేవః కమలాసనః
అష్టాదశ ప్రభేదేన లోకం వ్యాప్య తు యా స్థితా 24

సరస్వత్యా తయా సార్థం బ్రహ్మా దక్షిణ మాస్థితః
అఙ్గిరో వామదేవశ్చ వసిష్ఠాద్యా మునీశ్వరాః 25

కపిలాద్యా మహాసిద్ధా స్సనకాద్యాశ్చ యోగినః
ఏతే చాన్యే చ బహవ శ్శివదక్షిణత స్స్థితాః 26

యమ స్తా నఖిలాన్ దృష్ట్వా పశ్చిమాం దిశ మాగతః
తత్ర స్థితాన్ మహాకాయాన్ శివతుల్య పరాక్రమాన్ 27

భూతేశాన్ ప్రమథాధీశాన్ బలప్రమథనాదికాన్
బ్రాహ్మ్యాది మాతర స్సర్వాః కుమారస్యాపి మాతరః 28

సుమాలీ మాలతీముఖ్యాః పార్వత్యా మాతర స్స్థితాః
కరాళీ వికరాళీ చ బల ప్రమథనీ తథా 29

కాళరాత్రీ ప్రచణ్డాఖ్యా మాతర స్తత్ర సంస్థితాః
పచణ్డ శ్చణ్డ కోపశ్చ కాలభైరవ స ఞ్జ్ఞకాః 30

చణ్డోదర ప్రచణ్డోఽర్చి రస్త్రం పాశుపతం తథా
ఏతే చాన్యే చ బహవ స్సిద్ధా స్సంహార కర్మణి 31

తాన్ దృష్ట్వా విస్మితో భూత్వా యమోఽభ్యన్తర మావిశత్
తత్ర స్థితాన్ మహాభాగాన్ యమ స్సర్వాన్ దదర్శ హ 32

శఙ్ఖచక్రధరం దేవం పీతవాసస మచ్యుతమ్
చతుర్భుజ ముదారాఙ్గం కౌస్తుభోద్భాసితోరసమ్ 33

కిరీట కటకోపేతం రత్నమౌళివిరాజితమ్
ఏకవింశతి భేదేన లోక మాపూర్య యా స్థితా 34

లక్ష్మ్యా తయా సమాసీనం దదర్శ చ హరిం యమః
వసవోఽ ష్టౌ స్థితా స్తత్ర రుద్రా ఏకాదశ స్థితాః 35

సర్వేశ ద్వాదశాదిత్యా స్సిద్ధ విద్యా ధరాదయః
గన్ధర్వాప్సరసో యక్షా భుజఙ్గా గుహ్యకాస్తథా 36

సర్వానేవాథ తాన్ దృష్ట్వా శివ స్తోత్రరత స్స్థితాన్
హృషితాత్మా యమ స్తూర్ణం శివసారూప్య మాగతాన్ 37

తత్ర స్థితాన్ మహాభాగాన్ శివసారూప్య మాగతాన్
వేదోక్తేన విధానేన కృత్వా పాశుపతం శుభమ్ 38

విచ్ఛిన్న పాశాన్ నిర్ద్వన్ద్వాన్ జితమాయా నకల్మషాన్
పరమాద్వైత తత్త్వజ్ఞా నాత్మారామాన్ శివాత్మకాన్ 39

దృష్ట్వా యమః ప్రహృష్టాత్మా మహాదేవం దదర్శ హ
దివ్యసింహాసనాసీనం సర్వదేవై స్సమన్వితమ్ 40

సంసారసాగరం ఘోరం యయా సన్తార్య మానవాః
కైవల్యం ప్రతిపద్యన్తే తయా దేవ్యా [illegible]

యయా సంజాయతే విశ్వం యయా చ స్థీయతే జగత్
యయా విశ్వ మిదం నశ్యేత్తయా దేవ్యా సమన్వితమ్ 42

కోటిసూర్య ప్రతీకాశం సర్వాభరణభూషితమ్
నీలగ్రీవం త్రిణేత్రం చ చన్ద్రార్థకృత శేఖరమ్ 43

దృష్ట్వా యమ స్తదా దేవం దణ్డముద్రాం నివేద్య చ
పపాత పాదయో ర్భక్త్యా సామ్బస్య జగతీపతేః 44

యమ స్తత స్సముత్థాయ భక్త్యా పరమయా యుతః
కరాభ్యా మఞ్జలిం కృత్వా స్తోతు మే వోపచక్రమే 45

యమః:

నమ స్సకల లోకానాం సర్గ స్థిత్యన్త హేతవే
సర్వజ్ఞాయ వరేణ్యాయ భక్తిగమ్యాయ శమ్భవే 46

యత్పాదం సకృ దభ్యర్చ్య పాపినోఽపి గతైనసః
శివలోకం ప్రపద్యన్తే తం నమామి సదాశివమ్ 47

యత్పాదపఙ్కజం నత్వా పాపిష్ఠా ఽపి మానవాః
తీర్త్వా తే నరకం ఘోరం ప్రయాన్తి శివమన్దిరమ్ 48

యన్నామ సకృ దుచ్చార్య మహాపాతకినో నరాః
నిష్కల్మషా భవిష్యన్తి తం ప్రపద్యే మహేశ్వరమ్ 49

మణిలిఙ్గే య మభ్యర్చ్య మోహిన్యాం విద్యయా సహ
ఇన్ద్రనీలే యమభ్యర్చ్య ధ్రువేణ శతతారకే 50

విష్ణుత్వం ప్రాప్తవాన్ విష్ణుః తం నమామి మహేశ్వరమ్
పద్మరాగే య మభ్యర్చ్య కృత్తికాయాం తు భద్రయా

అగ్నిత్వం ప్రాప్తవానగ్నిః తం నమామి మహేశ్వరమ్
నీలలిఙ్గే యమభ్యర్చ్య జ్యేష్ఠాయాం వజ్రభృ ద్యయా 51

శక్రత్వం ప్రాప్తవాన్ శక్ర స్తం నమామి మహేశ్వరమ్
మణిలిఙ్గే య మభ్యర్చ్య మమాయాం వసువిద్యయా 52

అహం యమత్వ మాపన్న స్తం నమామి మహేశ్వరమ్
యస్య ప్రసాదలేశేన సర్వేషాం ప్రాణినామహమ్ 53

శాస్తా ప్రఖ్యాపితో లోకే తం నమామి మహేశ్వరమ్
అయోలిఙ్గే య మభ్యర్చ్య దైత్యదానవరాక్షసాః 54

అసఙ్ఖ్యా బల మాపన్నా స్తం నమామి మహేశ్వరమ్
ధర్మార్థ కామమోక్షాఖ్యాన్ పురుషార్థాన్ భజన్తి తే 55

యస్మిన్ స్థిత మిదం విశ్వం వీచిమాలా య థామ్బసి
సర్వదేవమయం శమ్భుం ప్రణమామి మహేశ్వరమ్ 56

ఏకోఽస్తి సర్వభూతేషు తరఙ్గేషు యథా పయః
సర్వాత్మకం మహాదేవం తం సదా ప్రణమామ్యహమ్ 57

ఏక ఏవ హి యో దేవ స్సర్వ భూతహృది స్థితః
ఆకాశవ దమేయాత్మా తం నమామి మహేశ్వరమ్ 58

ఏకోఽపి బహుధా దేవో దృశ్యతే రవి చన్ద్రవత్
అజ్ఞానా వృత చిత్తానాం తం నమామి మహేశ్వరమ్ 59

యమాహుః ప్రాప్య విజ్ఞానాః విజ్ఞానమితి యం ప్రభుమ్
తం నమామి మహాదేవం స దై వాలజ్జ్యశాసనమ్ 60

యమాహుః పురుషం సాఙ్ఖ్యాస్సదా తత్త్వార్థచిన్తకాః
తం నమామి మహేశానాం సర్వలోకైక నాయకమ్ 61

య మాహు ర్బ్రహ్మశబ్దేన సర్వ వేదాన్త వేదినః
వేదాన్త వేద్య మీశానాం ప్రణమామి మహేశ్వరమ్ 62

విష్ణుం సర్వజ్ఞ ముత్పత్తి స్థితి సంహారకారణమ్
తం నమామి మహేశానం సర్వలోకైక నాయకమ్ 63

పుష్కలాగమ తత్త్వజ్ఞా య మాహు శ్చతురాననమ్
జగత్స్రష్టార మీశానం తం నమామి సదాశివమ్ 64

యే కేచ నాగ్ని రిత్యాహు స్సూర్య ఇత్యేవ కేచన
అన్యే వాయు రితి ప్రాహు స్తం నమామి మహేశ్వరమ్ 65

అన్యే పశుపతిం ప్రాహు స్త మీశం ప్రణమా మ్యహమ్
నానావిధఘటే ష్వన్తః ఖం విలీనం యథా నభః 66

భూతే ష్వన్త స్త థైక స్త్వాన్తం ప్రపద్యే సదాశివమ్
స్రష్టా త్వమేవ జగతాం రక్షక స్త్వం మహేశ్వర 67

సంహర్తా జగతాం దేవ త్వ మే వైకో మహేశ్వర
శాసనార్థం తు పాపానాం త్వ యై వాహం నియోజితః 68

తతః ప్రభృతి దేవేశ సర్వే పాపసమన్వితాః
పాపానురూప దణ్డేన నరకే శిక్షితా మయా 69

త్వ దాజ్ఞయాహం దేవేశ సర్వత్రాలఙ్ఘ్యశాసనః
ఇదానీం భఙ్గితాజ్ఞోఽ హం సుకుమారకృతే ప్రభో 70

కి మేత దితి సంచిన్త్య త్వాం ద్రష్టు మహ మాగతః
అనేన హింసితా దేవ ప్రాణినో లక్ష సఙ్ఖ్యయా 71

పాపాశ్చ విప్రా బహవః (?) సుకుమారేణ పాపినా:
సహస్రశః కృతం స్తేయ మనే నైవ చ పాపినా 72

అసేవతాసౌ చాణ్డాలీం సమానాం షష్టిసఙ్ఖ్యయా
పుత్రా న్పుత్రాదయామాస పఞ్చపాతక సన్నిభాన్ 73

తస్యా మపత్యం పాపిష్ఠో జనయమాస వైధురే
చణ్డాల్యా పీతశేషం తు తావత్కాలం పపౌ సురామ్ 74

మేఘచ్యుతా యథా ధారా న గణ్యన్తే న మానవైః
గగనే తారకా యద్వ ద్గఙ్గాయాం సికతా యథా 75

లోకే గణయితుం శక్యం న మనుష్యై స్సురాసురైః
కృతా న్యనేన పాపాని పాపినా కోటిసఙ్ఖ్యయా 76

కల్పకాలేతి తచ్ఛక్యం (?)యథా వక్తుం కథఞ్చన
ఏకేన హి కృత స్యాస్య పాపస్య పరమేశ్వర -77

ప్రాయశ్చిత్తం న పశ్యన్తి సర్వశాస్త్రేషు సూరయః
ఏవం విధోఽసౌ పాపాత్మా కథం ప్రాప్త స్త వాన్తికమ్ 78

యోగినా మప్యలభ్యం యత్త త్పాపీ ప్రాప్తవాన్ కథమ్
స్వతన్త్రో ఽపి మహాదేవ స్సర్వదేవేషు కీర్తితః 79

సుకుమారప్రసఙ్గేణ స్వతన్త్రత్వం ప్రకాశితమ్ 80

సూతః:

ఇత్యుక్త్వా దణ్డముద్రాం తాం శివాయ వినివేద్య చ
పపాత దణ్డవద్భూమౌ ప్రసీదేతి వద న్ముహుః 81

త మువాచ మహాదేవం ప్రహసన్ కరుణానిధిః
కరాభ్యాం చ సముత్థాప్య పాదయోః పతితం యమమ్ 82

ఈశ్వరః :

ఆశ్చర్య మత్ర మా కార్షీ స్సుకుమారకృతే యమ
వైషమ్య మత్ర మే నాస్తి శృణు వక్ష్యామి కారణమ్ 83

అనేన సుకుమారేణ య దిదం దుష్కృతం కృతమ్
సఙ్ఖ్యా మయా ప్యశక్యం యద్వ్యామ్ని తారకషణ్డవత్ 84

న తస్య దుష్కృతి ర్దృష్టా సర్వ శాస్త్రేషు సామ్ప్రతమ్
తథావిధం మహాపాపం దగ్ధ్వా సర్వం క్షణేన తు 85

శివరాత్రివ్రతం దృష్ట్వా మత్సమీప ముపాగమత్ 86

యమః:

ఏవంవిధోఽ సౌ పాపాత్మా శుద్ధోఽ భూ ద్వ్రతదర్శనాత్
తద్వ్రతం బ్రూహి మే దేవ కదా కార్యం మనీషిభిః 87

ఈశ్వరః:

మాఘకృష్ణ చతుర్దశ్యాం రాత్రౌ జాగరణాన్వితః
వ్రతం కార్యం మహాప్రాజ్ఞ ప్రాజాపత్య ఫలప్రదమ్ 88

వేదసారేణ సంపూజ్య శివరాత్రౌ మహేశ్వరమ్
శివరాత్రివ్రతం కృత్వా బ్రహ్మా బ్రహ్మత్వ మాగతః 89

విద్యాసారేణ మన్త్రేణ శివరాత్రౌ మహేశ్వర
శివరాత్రి వ్రతం కృత్వా విష్ణు ర్విష్ణుత్వ మాగతః 90

శివరాత్రౌ శివం పూజ్య మృత్యు మోచన విద్యయా
కల్పాయు రభవ త్పూర్వం మార్కణ్డేయో మహామునిః 91

అష్టౌ చ వసవ స్సర్వా రుద్రా ఏకాదశ స్మృతాః
వేదసారేణ సంపూజ్య సర్వ దేవత్వ మాగతాః 92

బహు నాత్ర కిముక్తేన సారభూతం వచ శ్శృణు
ఆచణ్డాల మనుష్యాణాం పాపానాం దహనక్షమమ్ 93

మేరు మన్దర తుల్యస్య రాశిః పాపస్య కర్మణః
సఞ్చిత స్సుకుమారేణ సర్వలోకస్య పశ్యతః 94

మాఘకృష్ణ చతుర్దశ్యాం మహానిశి మహేశ్వరమ్
చణ్డాలీ మాత్మజాం రన్తుం పుష్పాణ్యాహర్తు మాగతః 95

సంపూజ్యమానం వ్రతిభి స్తస్మిన్ కాలే దదర్శ సః
నానాసుగన్ధి కుసుమై శ్చన్దనాది విలేపనైః 96

భక్ష్య భోజ్యాన్న పానైశ్చ తామ్బూలై శ్చన్ద్ర సంయుతైః
గీతవాద్య నినాదైశ్చ పురాణైః స్తోత్ర పాఠకైః 97

సంపూజ్యమానం వ్రతిభి శ్శివలిఙ్గం మహానిశి
దదర్శ సుకుమారోఽ సౌ యుక్తః పాతకకోటిభిః 98

వ్యాజేనాపి తదా ప్రాప్తి స్త త్క్షణా ద్దగ్ధ కల్మషః
సర్వయజ్ఞ తపోదాన వ్రతా నా మాప్తవాన్ ఫలమో 99

సర్వసారేణ ధర్మేణ యుక్తో వా సుకుమారకః
మ మాన్త్రిక మనుప్రాప్య గాణాపత్యం చ లబ్ధవాన్ 100

యథా ప్రజ్వలితో వహ్ని శ్శుష్కమాత్రం చ నిర్దహేత్
జ్ఞానాజ్ఞానకృతం పాపం వ్రతం దహతి దర్శనాత్ 101

సన్దేహం మా కృథాః కిఞ్చిత్ సుకుమారకృతే యమ
మహాపాతకలక్షాణి పాతకాని కృతాని చ 102

శివరాత్రివ్రతం దృష్ట్వా యత్పుణ్యం ప్రాప్తవాన్ ద్విజః
తత్పుణ్యేన ప్రదగ్ధా శ్చ మహాపాతకకోటయః 103

రాజసూయ సహస్రస్య ఆశ్వమేధాయుతస్య చ
కపిలాకోటి దానస్య భూమేః కృత్స్నస్య యత్ఫలమ్ 104

శతవర్ష సహస్రాణి తప స్తప్త్వా తు యత్ఫలమ్
పుణ్యక్షేత్ర నివాసాచ్చ సర్వ తీర్థావగాహనాత్ 105

ఏతేషాం యత్ఫలం ప్రోక్తం శాస్త్రేషు వివిధేష్వపి
తత్పుణ్యం కోటి గుణితం సుకుమారోఽపి లబ్ధవాన్ 106

శివరాత్రి వ్రతం దృష్ట్వా పుష్పవ్యాజేన చాగతః
తపస్విభ్యోఽధికో హ్యేషః యజ్వభ్యో వ్యాధికో మతః 107

సర్వేభ్యః పుణ్యకృద్భ్యశ్చ సుకుమారోఽధికో మతః
తేన పుణ్యేన మహతా గణేశ్వరపదం గతః 108

భోగాన్ భుక్త్వాన్ సువిపులాన్ కల్పాన్తం మమ సన్నిధౌ
తత శ్చాపి చ్యుతః కాలా దధికాఖ్యో భవిష్యతి 109

తత్ర మాహేశ్వరో భూత్వా జ్ఞానం లబ్ధ్వా మదాత్మకమ్
మహిమ్నా విష్ణునా జ్ఞేయో మమ సాయుజ్య మేష్యతి 110

మద్భక్తాస్తు విశేషేణ పూజనీయా స్సదా యమ

యమః :

త్వద్భక్తాః కీదృశా దేవ కింనిష్ఠాః కేన లక్షితాః
కిం తేషాం లక్షణం బాహ్య మాన్తరం లక్షణం వద 111

ఈశ్వరః :

శృణు ధర్మ ప్రవక్ష్యామి భక్తానాం లక్షణం మమ
భస్మోద్ధూళిత సర్వాఙ్గాః త్రిపుణ్డ్రాఙ్కిత మస్తకాః 112

రుద్రాక్ష మాలాభరణా శ్శివ పూజా పరాయణాః
బాహ్య లక్షణ సంయుక్తాః పూజ్యా స్సర్వే త్వయా మమ 113

ప్రణవాభ్యాసనిరతా స్త్రయీ పాఠ పరాయణాః
శివ సూక్త జపాసక్తా శ్శత రుద్రీయ పాఠకాః 114

ఆథర్వణీం శిఖాం యే చ పఠన్తి శిరస శ్శ్రుతిమ్
పౌరుషం యః పఠే త్సూక్తం పవమానం చ యః పఠేత్ 115

త్వరితం నీలరుద్రం చ శివసఙ్కల్ప మేవ చ
మహాదేవాది నామాని జిహ్వాగ్రే యస్య వర్తతే 116

మమ ప్రియతరా హ్యేతే పూజ్యా స్సర్వే త్వయా మమ
త్రికాల మేకకాలం వా యే వా ధ్యాయన్తి శఙ్కరమ్ 117

నృత్యమానం త్రయీనేత్రం చన్ద్రార్ధ కృత శేఖరమ్
ఉమా మహేశ్వరం రూపం దక్షిణామూర్తి మేవ వా 118

మృగటఙ్కధరం దేవం నీలకణ్ఠ మథాపి వా
పఞ్చాననమయీం మూర్తిం హృది ధ్యాయన్తి యే నరాః 119

మమ పూజ్యతమా హ్యేతే యది పాపాన్వితా అపి
పూజ యైతా న్సదా భక్త్యా మమ చే దిచ్ఛసి ప్రియమ్ 120

యథా పృష్టం తథా ప్రోక్తం కిం భూయ శ్శ్రోతు మిచ్ఛసి 121

యమః:

శ్రుతం దేవ మయా సర్వం కథ్యమానం త్వయా శివ
శివరాత్రివ్రత స్యాస్య విధిం మాహాత్మ్య మేవ చ 122

ఉద్ధూళనస్య మాహాత్మ్యం త్రిపుణ్డ్రస్య క్రమం మయా
రుద్రాక్షాణాం చ మాహాత్మ్యం లిఙ్గపూజావిధేః ఫలమ్ 123

త్వద్భక్తానాం చ మాహాత్మ్యం మన్త్రాణాం చ శ్రుతం మయా
త్వ న్నామ కీర్తనా త్సద్యః పతితోఽపి విముచ్యతే 124

కిం పు నర్యే మహాత్మానః త్వయి భక్తి సమన్వితాః
యజ్ఞేషు హూయమానోఽ గ్ని శ్శ్మశానస్థోఽపి వా శిఖీ 125

సర్వై స్సంపూజ్యతే విప్రై రనిన్ద్యో హి యథా నలః
దుర్వృత్తా వా సువృత్తా వా శ్వపచా వా ద్విజా యది 126

మమ పూజ్యతమా భక్త్యా మహాదేవ తవాజ్ఞయా
సుకుమారప్రస్రజ్ఞేణ జిజ్ఞాసార్థ మిహాగతః 127

సర్వసారతమాన్ ధర్మాన్ శ్రుతవాన్ త్వత్ప్రసాదతః
ఇదానీం గత సన్దేహః కృతార్థోఽస్మి మహేశ్వర 128

ఈశ్వరః :

యమ సంయమనీం గచ్ఛ దణ్డముద్రాసమన్వితః
పాపిష్ఠానాం చ సర్వేషాం శాసనం కురు యత్నతః 129

సూతః:

ఏతచ్ఛ్రుత్వా వచ స్సత్యం మహాదేవేన భాషితమ్
ప్రణిపత్య మహాదేవం స్తుత్వా చ వివిధైస్స్తవైః
దణ్డముద్రాం సమాదాయ స్వాం పురీం ప్రయయౌ యమః 130

ఓ మిత్యాది మహాపురాణే శ్రీ స్కాన్దే ఈశాన సంహితాయాం శివరాత్రి మాహాత్మ్యే శఙ్కరయమసంవాదో నామ త్రిసప్తతితమోఽధ్యాయః

శ్రీరస్తు

శ్రీరస్తు

శివరాత్రి మాహాత్మ్యము

(సుకుమార చరిత్రము)

చంద్రికాఖ్య వ్యాఖ్యానము

ప్రథమాశ్వాసము

ఇష్టదేవతా ప్రార్థనాదికము

శా. శ్రీ(గౌరీస్తన గంధసారఘుసృణ శ్రీ)'వాసితోరస్స్థలీ
నాగాధీశ విశిష్ట సంస్తవ లస న్నాళీక పాదద్వయ
ప్రాగల్భ్యుండగు శంకరుండు మనుచుం బ్రత్యక్షమై యెప్పుడున్
యోగీంద్రాఖ్యుని ముమ్మడీంద్ర సుతుని న్నుద్యుక్త శాంతాత్మునిన్

అర్థము: శ్రీ.......ప్రాగల్భ్యుండు: శ్రీ = శోభాయుక్తయగు, గౌరీ = పార్వతి యొక్క, స్తన = పాలిండ్లయందలి, గంధసార = చందనము యొక్కయు, ఘుసృణ = కుంకుమ పువ్వు యొక్కయు, శ్రీ = సంపదచేత, వాసిత = పరిళము గలదిగా జేయబడిన, ఉరస్ + స్థలీ = వక్షస్స్థలమునందలి, నాగ + అధీశ = సర్పరాజగు శేషుని యొక్క, విశిష్ట = సంస్తుతి చేత, లసత్ = ప్రకాశించుచున్న, నాళీక - పాద = తామరలవంటి అడుగుల యొక్క, ద్వయ = జంట యొక్క, ప్రాగల్భ్యుండు = ప్రతిభగలవాడు, అగు, శంకరుండు = శివుడు, ఎప్పుడున్, ప్రత్యక్షము + ఐ = ఎదురతోచినవాడయి, ఉద్యుక్త = మిక్కిలి యోగ్యమగు, శాంత + ఆత్మునిన్ = శాంతగుణము స్వరూపముగా గలవాడును, ముమ్మడి + ఇంద్ర-సుతునిన్ = ముమ్మడీంద్రుని కొడుకును, అగు, యోగీంద్ర = ఆఖ్యునిన్ = యోగీంద్రుడను పేరు గలవానిని, మనుచున్ = రక్షించుగాక.

తాత్పర్యము : పార్వతి అలంకారార్థము తన పాలిండ్లయందు మంచి గందమును, కుంకుమ పువ్వును పూసికొనెను. ఆమెను ఈశ్వరుడు కౌగిలించు కొనుటచే, ఆ సుగంధ ద్రవ్యముల పరిమళము వాని ఱొమ్మునకు సంక్రమించినది. అతని వక్ష స్స్థలమున నాగేంద్రుడున్నాడు. ఈశ్వరుడు నాగాభరణుడు గదా! తనకు ఆ పరిమళాస్వాద భాగ్యమును కలిగించినందులకు నాగేంద్రుడు కృతజ్ఞతాబుద్ధితో ఈశ్వరుని

---

1 [illegible]

పాద పద్మ ద్వయమును మిక్కిలి స్తుతించెను. ఇట్లు ప్రగల్భుడైన ఈశ్వరుడు ఎల్లప్పుడును ప్రత్యక్షమై శాంతగుణస్వరూపుడును, ముమ్మడీంద్రుని పుత్త్రుడును అగు యోగీంద్రుడను పేరి కృతిభర్తను రక్షించుగాక !

విశేషములు: కావ్యాదిని శ్రీకారము నుంచుటయు, మగణము నుంచుటయు శుభప్రదము. కావ్యముఖమున ఆశీర్నమస్క్రియా వస్తు నిర్దేశముల ఏదో ఒకటి ఉండవలయునను నియమము చెప్పున ఇందు ఆశీరూపమంగళా చరణము గావింపబడినది. కావ్యము మంగళాది, మంగళ మధ్యము, మంగళాంతముగా నుండవలయునని నియమము. వణిక్పథ పురమునకు సమీపమున నాగేశ క్షేత్రము గలదు. అందు శేషప్రతిష్ఠితమయిన నాగేశ్వరలింగముండుటచే, ఆ క్షేత్రమునకు ఆ పేరు వచ్చెను. అందలి శంకరుడు నాగేశ్వరుడు.

గీ. అందు శేషప్రతిష్ఠితుఁ డమృత దివ్య
లింగ మంగళమూర్తి ఖట్వాంగపాణి
యర్ధ శశిమౌళి నాగేశ్వరాహ్వయుండు
ప్రతివసించు ననేకకల్పములనుండి శి.రా.మా.4-76.

అందుచేతనే ఇందు 'శంకరుడు' నాగాధీశునిచే స్తుతింపబడినాడనుట.

ఇందు 'శంకరుడు' అను విశేష్యము సాభిప్రాయముగా ప్రయోగింపబడినది. శంకరుడనగా ఆముష్మిక సౌఖ్యకరుడని అర్థము. అతడు శంకరుడు కావుననే కృతిభర్తను మనుపగలడని భావము. విశేష్యము సాభిప్రాయ మగుటచే ఇందలి అలంకారము పరికరాంకురము.

.సుతునిన్ + ఉద్యుక్త -సుతునిన్నుద్యుక్త - ఇందలి ద్రుతద్విత్వమునకు సూత్రము. 'కొన్నియెడలంబ్రామాణిక ప్రయోగంబులం ద్రుతంబున కచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి' (ప్రౌ.వ్యా. సంధి .3పోతన్నగారి `సర్వమున్నతని'వంటిది. 'నాళీక పాద' - ఇందు ఉపమానము పూర్వపదముగా నున్నది. ఉపమాన పూర్వపద కర్మధారయములు తెలుగుననే కాని సంస్కృతమున నుండవు. సంస్కృతమున 'పాదనాళీక' అనియే ఉండవలయును. ఇందు అందులకు భిన్నముగా 'నాళీక పాద'అని ఉండుట విశేషము.

'మనుచుంగాక' అను ఆశీరర్థమున 'మనుచు' అను తద్ధర్మార్థక రూపము ప్రయోగింపబడినది.

పెద్దన మనుచరిత్రమునందలి 'శ్రీవక్షోజకురంగ నాభ మెదపైఁ జెన్నొంద' అనుదానిలోని భావము ఇట్టిదే. 'శ్రీస్తనాఞ్చిత కస్తూరీ పఙ్క సఙ్కలితోరసే అనుదానిలోని భావము గూడ ఇట్టిదే.

శా. శ్రీరామారమణుం డశేష జగతీ క్షేమంకర ప్రక్రియా
భారాయత్త మనస్కుఁ డార్యజనస౦ం భావ్యుండు భవ్యాత్ముఁడై
గారామారగఁ నుమ్మమాంబిక సుతున్ గౌరీశభక్తాగ్రణిన్
ధీరున్ ముమ్మయశాంతునిన్ మనుచు సందీర్ఘాయు రర్థాఢ్యుఁగన్. 2

అర్థము : అశేష ....మనస్కుండు: అశేష =ఎల్ల, జగతీ = లోకముల యొక్క, క్షేమంకర = మేలు చేయుట యనెడు, ప్రక్రియా = గొప్పపని యొక్క, భార = బరువునకు, ఆయత్త = అధీనమైన, మనస్కుఁడు = మనస్సుగలవాడును, ఆర్య-జన-సంభావ్యుండు = పూజ్యులైన జనుల చేత సమ్మానింపదగినవాడును, (అగు), శ్రీ-రామా-రమణుండు = లక్ష్మి యనెడు స్త్రీ యొక్క భర్త (విష్ణువు), భవ్య + ఆత్ముఁడు + ఐ = శుభమైన స్వరూపము గలవాడయి, గారాము + ఆరంగన్ = ప్రేమము నిండగా (సంపూర్ణ ప్రేమముతో),ఉమ్మమాంబిక-సుతున్ = ఉమ్మమాంబ కొడుకును, గౌరీ + ఈశ = పార్వతి భర్తయగు శివుని యొక్క, లేదా పార్వతీశ్వరుల యొక్క, భక్త + అగ్రణిన్ = భక్తులలో ముఖ్యుడైన వాడును, ధీరున్ = ధైర్యము గలవాడును, (అగు), ముమ్మయశాంతునిన్ = ముమ్మయ శాంతుని (కృతి భర్తను), సందీర్ఘ + ఆయున్ + అర్థ + ఆఢ్యున్ + కన్ = మిక్కిలి చిరమైన ఆయువు, ధనము గలవానినిగా, మనుచున్ = రక్షించుగాక.

తాత్పర్యము: సర్వలోకములకు మేలు చేయుట యను భారమును వహించిన మనస్సు గలవాడును, పూజ్యులగు జనులచే సమ్మానింపదగిన వాడును అగు విష్ణువు మంగళ స్వరూపుడయి ఉమ్మమాంబ కొడుకును, పార్వతీశ భక్తాగ్రేసరుడును, ధైర్యవంతుడును అగు ముమ్మయశాంతుని (కృతి భర్తను) సంపూర్ణప్రేమముతో దీర్ఘాయుష్మంతుని గను, ధనవంతునిగను చేసి రక్షించుగాక.

విశేషములు: విష్ణువనక 'శ్రీరామ రమణుం'డని సంపద ధిష్ఠాన దేవత యగు లక్ష్మి భర్తయని చెప్పుట కృతి భర్తను అర్థాఢ్యునిగా చేయుననుటకు. ఎల్ల జగముల క్షేమమును చేయుట యను గొప్ప భారమును వహించినవానికి ఒక్క కృతి భర్తను మనుచుట పెద్ద బరువు కాదు. ముమ్మయ శాంతుడు గౌరీశ భక్తుడు. శ్రీరామ రమణుడతనిని మనుచుట యనగా తన భక్తుని తాను మనుచుటయే. ఏలయిన శివుడే విష్ణువు, విష్ణువే శివుడు 'శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే' అని అందురు కదా! గారాము - గారవము రూపాంతరము. గారవము గౌరవ శబ్ద భవము.

ఆయుస్ + అర్థ, పదాంతమందలి సకార మేదయిన వర్ణము పరమైనప్పుడును, అవసానమందును విసర్గముగా మాఱును. ఆయుః + అర్థ అ ఆ లు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులు గాని, మృదుహల్లులు గాని పరము లగునపుడు రేఫ మాదేశమగును. ఆయురర్థ. క్షేమంకర - ఉపపదసమాసము క్షేమ శబ్ద ద్వితీయకు లోపము రాలేదు. కావున అలుక్కు.

ఉ. నాలుగు మోములం దనర నాలుగు వేదము లభ్యసించుచున్
నాలుగు నైదు రూపముల నవ్య సుఖస్థితి సృష్టి[1]చేయుచు
న్నాలిని బుక్కిటందిడి విహాయస వీథిని నంచ నెక్కి తాఁ
జాలఁ జరించు బ్రహ్మ ఘనశాంతుఁడు శాంతనఁ బ్రోచుఁగావుతన్ 3

అర్థము: నాలుగు- మోములన్ = నాలుగు ముఖముల చేతను, తనరన్ = ఒప్పునట్లుగా, నాలుగు వేదములు = ఋక్కు, యజుస్సు, సామము, అథర్వము అనెడు వేదములు నాలుగును, అభ్యసించుచున్ = అభ్యాసము చేయుచు, నాలుగున్ +ఐదు - రూపములన్=తొమ్మిది ఆకారములతో, నవ్య-సుఖ - స్థితిన్ = క్రొత్తదియగు సౌఖ్యము యొక్క ఉనికిని, సృష్టిచేయుచున్ = సృజించుచు, ఆలినిన్ = భార్యను (సరస్వతిని), పుక్కిలి + అందున్ = నోటిలోపల, ఇడి = ఉంచి, విహాయస వీథినిన్ = ఆకాశప్రదేశమున, అంచన్ = హంసమును, ఎక్కి, తాన్ = తాను, చాలన్ = మిక్కిలి, చరించు = తిరుగునట్టి, ఘన - శాంతయ అను పేరుగల కృతి భర్తను, ప్రోచున్ + కావుతన్ = రక్షించుగాక.

తాత్పర్యము: నాలుగు ముఖములతోను ఋగ్యజుస్సా మాథర్వములనెడి నాలుగు వేదములను ఒప్పుగా అభ్యసించుచు, తొమ్మిది రూపములతో ఎప్పటి కప్పుడు క్రొత్తది యనిపించు సౌఖ్యము గల స్థితిని సృజించుచు, తన భార్యయైన సరస్వతిని ముఖమునం దిడి, ఆకాశ వీథిలో తన వాహనమైన హంసను ఎక్కి మిక్కిలి విహరించు మహాశాంతమూర్తియగు బ్రహ్మ కృతి భర్త యగు శాంతయ్యను రక్షించుగాక.

విశేషములు: బ్రహ్మ చతుర్ముఖుడు. ఒక్కొక్క ముఖముతో ఒక్కొక్క వేదము చొప్పున నాలుగు ముఖములతో నాలుగు వేదములను ఆయన అభ్యసించును. అదియే ఆ తనరుట.

బ్రహ్మలు తొమ్మండ్రు. వారు భృగువు, పులస్త్యుడు, పులహుడు, అంగిరసుడు, అత్రి, క్రతువు, దక్షుడు, వసిష్ఠుడు, మరీచి. ఒక్కడే యగు బ్రహ్మ తొమ్మిది రూపములతో సృష్టి కార్యము నిర్వహించుచుండును. అది యెప్పటి కప్పుడు క్రొత్తగను, సౌఖ్యవంతముగను ఉండును. `ధాతా యథాపూర్వమ కల్పయత్'. భార్య యగు

---

1 ము. చేసెయున్.

సరస్వతిని బ్రహ్మ తన ముఖమునందు నిలుపును, ఆయన వాహనము హంస, దానిపై నతడు ఆకాశమున విహరించు చుండును. రక్షకుడు (బ్రహ్మ) ఘనశాంతుడు కావుననే రక్ష్యుడైన శాంతనను బ్రోచునని స్వారస్యము.

చేయుచున్ + అలిని = చేయుచున్నాలిని - ఇందలి ద్రుతద్విత్వము `సుతుని న్నుద్యుక్త'లోని దానివంటిదే. చూడు 1ప. వ్యాఖ్య; పుక్కిటందున్. పుక్కిలి = అందున్. పుక్కిలి శబ్దము ఔప విభక్తికము గావున 'అందున్' అను సప్తమీ విభక్తి పరముగా `టి' వర్ణము అంతా దేశ మగును. పుక్కిటి + అందున్. పిమ్మట అంద్వవగాగమ సంధి. కృతి భర్తను బ్రోచు త్రిమూర్తులలో మొదట ఈశ్వరుడు, తరువాత విష్ణువు, ఆ వరుసలో ఇందు బ్రహ్మ చెప్పబడుట గమనింపదగినది. హంస శబ్ద వికృతి అంచ. పెద్దన మనుచరిత్రము నందలి`నాలుగు మోములన్ నిగమ నాదము లుప్పతిలన్' అను పద్యమును స్ఫురింపజేయు పద్యమిది.

చ. హరిహర పద్మజాదులగు నాద్యులు సంతతభక్తియుక్తులై
చిర మగు నిష్ట సంపదలఁ జేకొని లోకములన్ సృజింపఁగా
నరుదుగఁ బ్రేమఁ బ్రోవ లయ మందగ జేయఁగఁ గర్తలైరి నీ
[1]పరమహనీయతత్త్వ మనివార్యము సద్గుణశీల పార్వతీ! 4

అర్థము: సత్ + గుణ - శీల = మంచి గుణములతోడి స్వభావము గల దానా, పార్వతీ (సంబుద్ధి), హరి-హర - పద్మజ + ఆదులు = విష్ణువు, శివుడు, తామరనుండి పుట్టినవాడగు బ్రహ్మ మున్నగువారు, అగు, ఆద్యులు = మొదటి వారు, సంతత - భక్తి - యుక్తులు + ఐ = నిరంతరమైన భక్తితో గూడిన వారయి, చిరము + అగు = బహుకాలముండునవి యైన, ఇష్ట - సంపదలన్ = కోరిన సంపదలను, చేకొని = గ్రహించి, లోకములన్, సృజింపఁగాన్ = పుట్టించుటకును, అరుదుగన్ = ఆశ్చర్యముగా, ప్రేమన్ = ప్రీతితో, ప్రోవన్ = రక్షించుటకును, లయము + అందఁగన్ + చేయఁగన్ = నాశన మందునట్లు చేయుటకును కర్తలు = చేయువారు, ఐరి, నీ = నీ యొక్క పర- మహనీయ - తత్త్వము = శ్రేష్ఠమయినట్టియు, గొప్పది యయినట్టియు స్వభావము, అనివార్యము = అడ్డగింపరానిది.

తాత్పర్యము : మంచి గుణములు స్వభావముగా గల ఓ పార్వతీ! విష్ణువు, శివుడు, బ్రహ్మ మున్నగు ఆదిపురుషులు నీయందు ఎల్లప్పుడును భక్తి గల వారయి, నీ వలన తాము కోరిన సంపదలను పొంది లోకములను పుట్టించుటకును, ఆశ్చర్యకరముగా ప్రీతితో రక్షించుటకును, నశింపజేయుటకును సమర్థులగు చున్నారు. మిక్కిలి గొప్పది యగు నీ తత్త్వము అడ్డులేనిది.

1. తా.వర

ఆయుస్ + అర్థ, పదాంతమందలి సకార మేదయిన వర్ణము పరమైనప్పుడును, అవసానమందును విసర్గముగా మాఱును. ఆయుః + అర్థ అ ఆ లు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులు గాని, మృదుహల్లులు గాని పరము లగునపుడు రేఫ మాదేశమగును. ఆయురర్థ. క్షేమంకర - ఉపపదసమాసము క్షేమ శబ్ద ద్వితీయకు లోపము రాలేదు. కావున అలుక్కు.

ఉ. నాలుగు మోములం దనర నాలుగు వేదము లభ్యసించుచున్
నాలుగు నైదు రూపముల నవ్య సుఖస్థితి సృష్టి[1]చేయుచు
న్నాలిని బుక్కిటందిడి విహాయస వీథిని నంచ నెక్కి తాఁ
జాలఁ జరించు బ్రహ్మ ఘనశాంతుఁడు శాంతనఁ బ్రోచుఁగావుతన్ 3

అర్థము: నాలుగు- మోములన్ = నాలుగు ముఖముల చేతను, తనరన్ = ఒప్పునట్లుగా, నాలుగు వేదములు = ఋక్కు, యజుస్సు, సామము, అథర్వము అనెడు వేదములు నాలుగును, అభ్యసించుచున్ = అభ్యాసము చేయుచు, నాలుగున్ ఐదు - రూపములన్=తొమ్మిది ఆకారములతో, నవ్య-సుఖ - స్థితిన్ = క్రొత్తదియగు సౌఖ్యము యొక్క ఉనికిని, సృష్టిచేయుచున్ = సృజించుచు, ఆలినిన్ = భార్యను (సరస్వతిని), పుక్కిలి + అందున్ = నోటిలోపల, ఇడి = ఉంచి, విహాయస వీథినిన్ ఆకాశప్రదేశమున, అంచన్ = హంసమును, ఎక్కి, తాన్ = తాను, చాలన్ = మిక్కిలి, చరించు = తిరుగునట్టి, ఘన - శాంతయ అనుపేరుగల కృతి భర్తను, ప్రోచున్ + కావుతన్ = రక్షించుగాక.

తాత్పర్యము: నాలుగు ముఖములతోను ఋగ్యజుస్సా మాథర్వములనెడి నాలుగు వేదములను ఒప్పుగా అభ్యసించుచు, తొమ్మిది రూపములతో ఎప్పటి కప్పుడు క్రొత్తది యనిపించు సౌఖ్యము గల స్థితిని సృజించుచు, తన భార్యయైన సరస్వతిని ముఖమునం దిడి, ఆకాశ వీథిలో తన వాహనమైన హంసను ఎక్కి మిక్కిలి విహరించు మహాశాంతమూర్తియగు బ్రహ్మ కృతి భర్త యగు శాంతయ్యను రక్షించుగాక.

విశేషములు: బ్రహ్మ చతుర్ముఖుడు. ఒక్కొక్క ముఖముతో ఒక్కొక్క వేదము ఒప్పున నాలుగు ముఖములతో నాలుగు వేదములను ఆయన అభ్యసించును. అదియే ఆ తనరుట.

బ్రహ్మలు తొమ్మండ్రు. వారు భృగువు, పులస్త్యుడు, పులహుడు, అంగిరసుడు, అత్రి, క్రతువు, దక్షుడు, వసిష్ఠుడు, మరీచి. ఒక్కడే యగు బ్రహ్మ తొమ్మిది రూపములతో సృష్టి కార్యము నిర్వహించుచుండును. అది యెప్పటి కప్పుడు క్రొత్తగను, సౌఖ్యవంతముగను ఉండును. 'ధాతా యథాపూర్వమ కల్పయత్'. భార్య యగు

1. ము. చేసియున్.

సరస్వతిని బ్రహ్మ తన ముఖమునందు నిలుపును. ఆయన వాహనము హంస, దానిపై నతడు ఆకాశమున విహరించు చుండును. రక్షకుడు (బ్రహ్మ) ఘనశాంతుడు కావుననే రక్ష్యుడైన శాంతనను బ్రోచునని స్వారస్యము.

చేయుచున్ + ఆలిని = చేయుచున్నాలిని - ఇందలి ద్రుతద్విత్వము `సుతుని న్నుద్యుక్త'లోని దానివంటిదే. చూడు 1ప. వ్యాఖ్య; పుక్కిటందున్. పుక్కిలి = అందున్. పుక్కిలి శబ్దము ఔప విభక్తికము గావున 'అందున్' అను సప్తమీ విభక్తి పరముగా `టి' వర్ణము అంతా దేశ మగును. పుక్కిటి + అందున్. పిమ్మట అంద్వవగాగమ సంధి. కృతి భర్తను బ్రోచు త్రిమూర్తులలో మొదట ఈశ్వరుడు, తరువాత విష్ణువు, ఆ వరుసలో ఇందు బ్రహ్మ చెప్పబడుట గమనింపదగినది. హంస శబ్ద వికృతి అంచ. పెద్దన మనుచరిత్రము నందలి`నాలుగు మోములన్ నిగమ నాదము లుప్పతిలన్' అను పద్యమును స్ఫురింపజేయు పద్యమిది.

చ. హరిహర పద్మజాదులగు నాద్యులు సంతతభక్తియుక్తులై
చిర మగు నిష్ట సంపదలఁ జేకొని లోకములన్ సృజింపఁగా
నరుదుగఁ బ్రేమఁ బ్రోవ లయ మందగ జేయఁగఁ గర్తలైరి నీ
[1]పరమహనీయతత్త్వ మనివార్యము సద్గుణశీల పార్వతీ! 4

అర్థము: సత్ + గుణ - శీల = మంచి గుణములతోడి స్వభావము గల దానా, పార్వతీ (సంబుద్ధి), హరి-హర - పద్మజ + ఆదులు = విష్ణువు, శివుడు, తామరనుండి పుట్టినవాడగు బ్రహ్మ మున్నగువారు, అగు, ఆద్యులు = మొదటి వారు, సంతత - భక్తి - యుక్తులు + ఐ = నిరంతరమైన భక్తితో గూడిన వారయి, చిరము + అగు = బహుకాలముండునవి యైన, ఇష్ట - సంపదలన్ = కోరిన సంపదలను, చేకొని = గ్రహించి, లోకములన్, సృజింపఁగాన్ = పుట్టించుటకును, అరుదుగన్ = ఆశ్చర్యముగా, ప్రేమన్ = ప్రీతితో, ప్రోవన్ = రక్షించుటకును, లయము + అందఁగన్ + చేయఁగన్ = నాశన మందునట్లు చేయుటకును కర్తలు = చేయువారు, ఐరి, నీ = నీ యొక్క పర- మహనీయ - తత్త్వము = శ్రేష్ఠమయినట్టియు, గొప్పది యయినట్టియు స్వభావము, అనివార్యము = అడ్డగింపరానిది.

తాత్పర్యము : మంచి గుణములు స్వభావముగా గల ఓ పార్వతీ! విష్ణువు, శివుడు, బ్రహ్మ మున్నగు ఆదిపురుషులు నీయందు ఎల్లప్పుడును భక్తి గల వారయి, నీ వలన తాము కోరిన సంపదలను పొంది లోకములను పుట్టించుటకును, ఆశ్చర్యకరముగా ప్రీతితో రక్షించుటకును, నశింపజేయుటకును సమర్థులగు చున్నారు. మిక్కిలి గొప్పది యగు నీ తత్త్వము అడ్డులేనిది.

---

1. తా.వర

విశేషములు: *పార్వతి ఆదిశక్తి, ఆమెయందు భక్తిగలవారయి, ఆమె అనుగ్రహమును పొందిన వారగుట చేతనే బ్రహ్మ, హరి, హరుడు లోకముల సృష్టి స్థితి లయకార్యములను చేయగలుగుచున్నారనుట. అట్టి శక్తులను వారి కనుగ్రహించుటచేతనే ఆ ఆదిశక్తి పార్వతి తత్త్వము అడ్డులేనిదనుట. హరిహర పద్మజుల కార్యములు క్రమముగా స్థితి లయసృష్టులు ఇందు సృష్టి స్థితి లయము లనుటచే క్రమము తప్పినది. అగు + అద్యులు = అగునాద్యులు, అగు + ఇష్ట = అగునిష్ట - ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరంబగునపుడు నుగాగ మంబగు - బా.వ్యా. సంధి. 33సూ. పార్వతి తత్త్వ మనివార్య మను సమర్థనీయార్థమును హరి హర బ్రహ్మలు ఆమె దయవలననే తమ తమ కార్యములందు సమర్థులగు చున్నారను హేతువును చూపి సమర్థించుటచే ఇందలి అలంకారము కావ్యలింగము. 'సమర్థనీయస్యార్థస్య కావ్యలిఙ్గం సమర్థనమ్'చంద్రా.

గీ. మదనుఁ గన్నతల్లి మాధవు నిల్లాలు
బ్రతుకు లెల్లఁ దానె పట్టి చూడ
ముఖ్యమైన లక్ష్మి ముమ్మయ శాంతాత్మ
మందిరంబునందు మసలుచుండు. 5

అర్థము: మదనున్ = మన్మథుని, కన్నతల్లి = కనిన తల్లి, మాధవు + ఇల్లాలు = విష్ణువు యొక్క భార్య, పట్టి చూడన్ = పరిశీలింపగా, బ్రతుకులు + ఎల్లన్ = బ్రతుకు లన్నియు, తాను + ఎ = తానే, ముఖ్యము + ఐన = ప్రధానమయిన, లక్ష్మి, ముమ్మయ శాంతాత్మ = కృతి భర్తయైన ముమ్మయ శాంతయ్య యొక్క, మందిరంబునందున్ = గృహమునందు, మసలుచుండున్ = వర్తిలుచుండుగాక.

తాత్పర్యము: మన్మథుని గన్న తల్లియు, విష్ణుని భార్యయు, ప్రాణుల బ్రతుకు లన్నిటను తానే ప్రధాన మయినట్టి లక్ష్మీదేవి ముమ్మయ శాంతయ్య అను కృతిభర్త గృహమున వర్తిలుచుండుగాక!

విశేషములు : సర్వ సృష్టికి హేతు భూతుడైన మన్మథుని గన్నతల్లి అనుట చేతను, రక్షణ శీలుడగు విష్ణుని భార్య అనుటచేతను బ్రతుకు లన్నిటికి లక్ష్మి తానే యెట్లు ప్రధానురాలయ్యెనో తెలియుచున్నది. మాధవు + ఇల్లాలు - షష్ఠీ సమాసంబునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు. బా.వ్యా.సంధి, 34సూ.

చ. కవి కవితాబ్ధిలోన ముఖ గహ్వర మోడయు, జిహ్వ త్రెడ్డు, హృ
త్పవనుఁడు పీలికాఁడు, మృదు భాషలు రత్నములై చెలంగఁగాఁ,
గవి పరమాత్మ వర్తకుని కైవడి నీకు విశేష సత్కృతుల్
గవయఁగ[1]వచ్చె నీ వలనఁ గావ్య [2]సుఖాత్ముఁడ [ప్రోలె]భారతీ. 6

1. ము. నిచ్చె. 2. ము. సుఖస్థితి యిచ్చుఁగావుతన్

అర్థము: భారతీ = ఓ సరస్వతీ!, కవి = కవియొక్క, కవితా + అబ్ధిలోనన్ = కవిత్వమనెడి సముద్రములో, ముఖ - గహ్వరము = గుహవంటి నోరు, ఓడయున్ = పడవయును, జిహ్వ = నాలుక, త్రెడ్డు = పడవ త్రోసెడు పలక, హృత్ + పవనుండు = హృదయమునందలి గాలి, పీలికాఁడు = పడవ చుక్కాను త్రిప్పువాడు, కర్ణధారుడు, మృదు - భాషలు = మెత్తని మాటలు, రత్నములు, ఐ = అయి, చెలంగఁగాన్ = ఒప్పుగా, కవి-పరమాత్మ- కవి యనెడు పరమాత్మ, వర్తకుని-కైవడిన్ = వర్తకుని విధమున, నీ వలనన్ = (భారతి) నుండి, కావ్య-సుఖ + ఆత్ముఁడు + అ-పోలెన్ = కావ్యానందమును పొందినవాడే అనునట్లు, నీకున్, విశేష-సత్ + కృతుల్ = గొప్పవి యైన మంచి కావ్యములు, కవయఁగన్ = కలుగునట్లు, (కవయఁగన్ అనుదానికి బదులు `కవియఁగన్' అని యుండవచ్చునేమో, ఇచ్చున్. `వచ్చె'నను పాఠముకంటె `ఇచ్చె'నను పాఠమే మేల్తరమని తోచుచున్నది.

తాత్పర్యము: సరస్వతీ! కవిత్వ మనెడి సముద్రమున కవి ముఖమే ఓడ, అతని జిహ్వయే దానిని నడపు త్రెడ్డు, అతని హృదయము నందలి వాయువే చుక్కాను త్రిప్పువాడు, అతని మృదు భాషలే రత్నములు. కవి యనెడు పరమాత్మ ఓడ వర్తకుని విధమున నీ వలన కావ్య సుఖమును పొందినవానివలె నీకు గొప్ప సత్కావ్యముల' నిచ్చెను.

విశేషములు: కవిత = అబ్ధి, ముఖము-ఓడ, జిహ్వ-త్రెడ్డు, పవనుడు-పీలికాడు, మృదుభాషలు-రత్నములు, కవి-పరమాత్మ-ఇట్లు ఉపమేయోప మానములకు అభేదము చెప్పబడుటచే రూపకాలంకారము. వర్తకుడు ఒకరి దగ్గ నుండి ఏదేని వస్తువును పొంది, వారికి తన దగ్గఱ నున్న వస్తువు నిచ్చును. అట్లే ఇచ్చట కవి తాను వాగ్దేవి నుండి కావ్యానందమును పొంది, ఆమెకు గొప్ప కావ్యముల నిచ్చెను. తాను ఆమె నుండి పొందిన దాని కనురూపమైన దానినే ప్రతిగా నిచ్చుట గమనింపదగినది. కవి...... - వర్తకునికైవడి అనుచో ఉపమాలంకారము, పీలికాడు-`మాలిమికాఁడనఁ బీలికాఁడన నోడవాఁడన నావికా హ్వయము చెలఁగు'-ఆంధ్ర భాషావర్ణము-ప్ర.కాం.

క. యుక్తా యుక్త నిరీక్షణ
శక్తుఁడు గాఁ డీతఁడన కజస్రముఁ గరుణా
సక్తమతి మమ్ముఁ బ్రోవుము
భక్త పరాధీన వీరభద్ర స్వామీ! 7

అర్థము: భక్త - పరాధీన = భక్తులకు వశమయినవాడా! వీరభద్ర స్వామీ!, ఈతఁడు, యుక్త + అయుక్త - నిరీక్షణ - శక్తుఁడు = ఉచితము, అనుచితము అనువాని యొక్క చూచుటయందు సమర్థుడు, మంచి చెడ్డల నరయగలవాడు,

కాదు, అనక, అజస్రమున్, ఎల్లప్పుడును, కరుణా-సక్త-మతిన్ = దయతోగూడిన మనస్సుతో, మమ్మున్, ప్రోవుము = రక్షింపుము.

తాత్పర్యము: భక్తులకు లోబడియుండు నో వీరభద్రస్వామి! ఈ జనుడు మంచి చెడ్డల నరయగలవాడు కాడని యెంచక ఎల్లప్పుడును దయాబుద్ధితో మమ్ము రక్షింపుము.

విశేషములు: దక్షుని యాగమును నాశనము చేయుటకు శివునిచే సృజింపబడిన మహావీరుడైన యొక ప్రమథుడు వీరభద్రుడు. మానవులకు యుక్తాయుక్త విచక్షణ జ్ఞానము చాలా ముఖ్యము. అది చాలమంది కుండదు. అది దక్షునకు లేకపోవుటచేతనే గదా శివుడతనిని శిక్షించెను! అదిలేదు గదా యని మమ్ము దక్షుని శిక్షించినట్లు శిక్షింపవలదని వీరభద్రస్వామికి మనవి. ఆ స్వామి భక్త పరాధీనుడు గావున తప్పక ప్రోచునని విశ్వాసము.

సీ. ప్ర[కట]గర్జారౌద్ర భాసిత చంచలో
ద్దామ నీలాంబుద శ్యామదేహు
దనుజ దర్ప ధ్వాంత దారుణ సప్తార్చిఁ
బన్నగ కేయూరుఁ బ్రకటమూర్తి
దారిత శ్రీ స్థిరాదర [వరహ]స్తుని
దక్షాధ్వరాటవీదావదహను
శమన జిహ్వాభీల సంకాశ ఘోరాసి
దక్షిణ దోర్దండ ధారు వీర

అ.వె. భద్రు భక్తచిత్తపరిపూర్ణు వాసవ
వం[ది తాం]ఘ్రి యుగ్ము వారణాసు
రారి మూర్తి యైన యభినవరూపుని
సన్నుతింతు నేను సరస మెసఁగ 8

అర్థము: ప్రకట....దేహు: ప్రకట = ప్రసిద్ధమైన, గర్జా = (ఉరుము)చే, రౌద్ర = భయంకరమయి వట్టియు, నీల + అంబుద = నల్లని మేఘము వలె, శ్యామ = నల్లని, దేహున్ = శరీరము గలవానిని, దనుజ.......సప్తార్చిన్:దనుజ = రాక్షసుల యొక్క, దర్ప - ధ్వాంత = గర్వమనెడు చీకటికి, దారుణ = భయంకరుడైన, సప్తార్చిన్ = అగ్నియైన వానిని, పన్నగ - కేయూరున్ = పాములు భుజకీర్తులుగా గలవానిని, ప్రకట-మూర్తిన్ = ప్రసిద్ధమైన ఆకారము గలవానిని, దారిత......హస్తునిన్! దక్షా.......దహున్: దక్ష + అధ్వర + అటవీ = దక్షుని యొక్క, యజ్ఞ మనెడి, అడవికి, దావ-దాహనున్ = కార్చిచ్చు అయినవానిని; శమన............ఘోరాసిన్:

శమన = యమునియొక్క, జిహ్వా = నాలుకవలె, ఆ భీల =భయంకరము, సంకాశ = మిక్కిలి ప్రకాశము గల, ఘోర = భయంకరమైన, అసి = కత్తిగల, దక్షిణ = కుడి, దోస్ + దండ-ధారున్ = కఱ్ఱవంటి భుజమును ధరించిన వానిని; భక్త - చిత్త -పరిపూర్ణున్ = భక్తులయొక్క, మనస్సులందు, నిండినవానిని; వాసవ......యుగ్మున్: వాసవ = ఇంద్రునిచేత, వందిత + అంఘ్రి-యుగ్మున్ = నమస్కరింపబడిన, పాదములయొక్క, జంట గలవానిని; వారణ + అసుర + అరి-మూర్తి = గజాసురవైరియైన శివుని ఆకారము గల వాడు, ఐన, అభినవ-రూపునిన్ = క్రొత్తరూపము గలవానిని, వీరభద్రున్, నేను, సరసము + ఎసగన్ = అందము ఒప్పగా, సన్నుతింతున్ = సంస్తుతింతును.

తాత్పర్యము: కవి ఇందు వీరభద్రుని వర్ణించుచున్నాడు. వీరభద్రుడు (ఉఱుముచే) భయంకరము, ప్రకాశించు మెఱుపులచే ఉద్దామము నైన నీలమేఘము వలె నల్లనైన శరీరము గలవాడు. రాక్షసుల గర్వమనెడి చీకటికి భయంకరమైన అగ్నియైనవాడు, పాములు భుజకీర్తులుగా గలవాడు. ప్రసిద్ధమైన మూర్తిగలవాడు. దక్షుని యజ్ఞమనెడు అడవికి కార్చిచ్చు అయినవాడు. యముని నాలుకలవలె భయంకరమై మిక్కిలి ప్రకాశించు కత్తిని దాల్చిన కుడి భుజము గలవాడు. భక్తుల మనస్సులందు నిండినవాడు. ఇంద్రునిచే నమస్కరింపబడిన పాదముల జంట గలవాడు. గజాసురవైరి యగు శివుని ఆకారము వంటి క్రొత్త ఆకారము గలవాడు. అట్టి వీరభద్రుని నేను సంస్తుతింతును.

విశేషములు: దనుజ దర్పధ్వాంతదారుణ సప్తార్చి, దక్షాధ్వరాటవీ దాన దహను అనుచోట్ల రూపకాలంకారము గలదు. దోస్ + దండ = దోః + దండ = దోర్దండ-2వ పద్యమునందలి `ఆయురర్థ' ప్రక్రియ చూచునది.

సప్తార్చిస్: సప్తార్చి ర్దమునా శ్శుక్ర శ్చిత్రభాను ర్విభావసుః-అమరము. జిహ్వారూపములైన కాళి, కరాళి, విస్ఫులింగిని, ధూమ్రవర్ణ, విశ్వరుచి, లోహిత, మనోజవ అను ఏడు జ్వాలలు గలవాడు-అగ్ని.

సీ. దక్షాధ్వర ధ్వాంత ద[ళన]భద్రోద్రేక
సప్తాశ్వుఁడే దేవు చండహేతి
భుగ్న స్ఫుటాభీల భువన సంక్షోభైక
గరళ మే దేవు నాక్రమ్య భుక్తి
నిఖిలావనీ భార నిర్మల నిర్మాణ
కరణంబు లే [దేవు కం]కణంబు
లంధకా,సుర భీమ హంకార పాథోధి
బాడబం బే దేవు భయద శూల

ఆ.వె. మమర వర కిరీట విమల కోటీరట
న్నిబిడ మణి మయూఖ ని[వ]హరుచిర
పాదపద్ముఁడైన పలివెల కొప్పయ్య
నర్థితోడఁ గొల్తు నహరహంబు. 9

అర్థము: ఏ దేవు = ఏ కొప్పయ యొక్క, చండహేతి = తీక్ష్ణమైన కత్తి, దక్షా.....సప్తా శ్వుండు; దక్ష + అధ్వర = దక్షునియొక్క యజ్ఞ మనెడి, ధ్వాంత = చీకటి యొక్క, దళన = ఖండనమునందు, భద్ర = శ్రేష్ఠమయిన, ఉద్రేక = విజృంభణము గల, సప్తాశ్వుండు = సూర్యుడు ఏ దేవు = ఏ కొప్పయ యొక్క, అక్రమ్య-భుక్తి = అక్రమింపదగిన, భోజనము, భుగ్న.......గరళము: భుగ్న = వంకరయైనది, స్ఫుట = స్పష్టమైనది, ఆభీల = భయంకరమయినధి, భువన = లోకముల యొక్క, సంక్షోభ = అధికమైన కలతకు, ఏక = ముఖ్యమైనది, అగు, గరళము = హాలాహలము.

ఏ దేవు = ఏ కొప్పయ యొక్క, కంకణంబులు = హస్తాభరణములు, నిఖిలా......కరణంబులు: నిఖిల = ఎల్ల, అవనీ = భూమియొక్క, భార = బరువుయొక్క, నిర్మల = స్వచ్ఛమైన, నిర్మాణ = నిర్మితికి, కరణంబులు = సాధనములు.

ఏ దేవు, భయద-శూలము = వెఱపుగొలుపు శూలము, అంధక.........బాడబంబు: అంధక + అసుర = అంధకుడను రాక్షసునియొక్క, భీమ=భయంకరమైన, హంకార = పాథోధి = అహంకార మనెడి సముద్రమునకు, బాడబంబు = బడబాగ్ని.

అమర......పద్ముఁడు: అమర వర = దేవతా శ్రేష్ఠులయొక్క, కిరీట = కిరీటములందలి, విమల = స్వచ్ఛములయిన, కోటీ = అంచులయందు, రటత్ = ధ్వనించుచున్న, నిబిడ = సాంద్రము లయిన, మణి = రత్నముల యొక్క, మయూఖ = కిరణములయొక్క, నివహ = సమూహముచేత, రుచిర = కాంతిమంతములయిన, పాద-పద్ముండు = తామరలవంటి అడుగులు గలవాడు, ఐన, పలివెలకొప్పయ్యన్ = పలివెల గ్రామమునందలి కొప్పు లింగేశ్వరస్వామిని, అహరహంబున్ = ప్రతిదినమును, అర్థితోడన్ = కోరికతో, కొల్తును = సేవింతును.

తాత్పర్యము: పలివెల గ్రామమునందలి ఈశ్వరుడు కొప్పులింగేశ్వర స్వామి. అతని తీక్ష్ణమైన కత్తి దక్షుని యజ్ఞమనెడి చీకటిని నశింపజేయునట్లు ఆతని కత్తి దక్ష యజ్ఞమును నశింపజేసె నని భావము. ఆ స్వామి భోజనము లోకములను కలత పెట్టు భయంకరమైన హాలాహలము. ఆ దేవుని హస్తాభరణములయిన పాములు సర్వ భూభారమును వహించునట్టివి. ఆతని భయంకరమైన శూలము అంధకాసురుని అహంకార మనెడి సముద్రము నింకింపజేయుటయందు బడబాగ్ని యైనది. అనగా బడబాగ్ని సముద్రమును ఇంకింపజేయునట్లు ఆతని శూలము అంధకాసురుని

అహంకారమును అడగించిన దని భావము. అతని అడుగుదామరలు దేవతా శ్రేష్ఠులు శిరములు వంచి నమస్కరించుటచే వారి శిరములపై నున్న కిరీటములందలి మణుల కాంతి కిరణములచే కాంతిమంతములైనవి. అట్టి ఆ కొప్పులింగేశ్వరస్వామిని ప్రతిదినమును సేవింతును.

విశేషములు: పలివెల యందలి ఈశ్వరుడు అగస్త్యేశ్వరుడు. ఆ స్వామి నర్చించు పూజారి వేశ్యాలోలుడు అతడా యూరి రాజునకు శివనిర్మాల్యమని చెప్పి వేశ్య కొప్పునందలి పూదండను ఇచ్చెను. అందు వేశ్య శిరోజ మొకటి కానవచ్చెను. అది యేమని రాజు గద్దింప ఆ పూజారి ఈశ్వరుని శిరస్సున కొప్పు గల దనెను. తన భక్తుని మాట చెల్లించుటకై ఆ ఈశ్వరుడు శిరస్సున కొప్పును ధరించి కొప్పులిగేశ్వరుడయ్యెనను ఐతిహ్యము ఇట అనుసంధింపదగినది. ఆ లింగమునకు నేటికిని కొప్పుండి నట్లు శిలకు నొక బొడిపెవలె నెత్తుగ కానవచ్చును.

దేవదానవులు అమృతము కొఱకు క్షీరసముద్రమును మథించినప్పుడు మొదట హాలాహలము పుట్టి లోకములను కలత పెట్టెను, ఈశ్వరుడు ఆ విషమును మ్రింగి కంఠమున బెట్టుకొనెను. ఈశ్వరుని హస్తా భరణములు అనంతుడు మున్నగు నాగములు. అష్టదిగ్గజములు, సప్త కులపర్వతములు, అనంతుడు, ఆది కూర్మము, ఆదివరాహము భూభారమును వహించుచుండునని పురాణములు. సముద్ర గర్భమున అగ్నియుండి సముద్రము విజృంభింపకుండ దానిని శోషిల్లజేయుచుండును. ఆ అగ్ని బడబ (ఆడు గుఱ్ఱము)ఆకారమున నుండుటచే దానికి బాడబమని పేరు. సూర్యుని రథమును ఏడు గుఱ్ఱములు వహించుచుండుటచే నతనికి సప్తాశ్వుడను పేరు వచ్చెను. `భాస్వ ద్వివస్వత్సప్తాశ్వ హరిదశ్వోష్ణరశ్మయః' - అమరము. అహరహరంబు-అహన్ + అహన్ - శబ్దమునందలి నకారమునకు విభక్తి ప్రత్యయము పరము కానిచో, నెల్లయెడల రేఫాదేశమగును.అహర్ + అహః-అహరహః, తత్సమము అహరహము.

చ. పృథివిని భూధరావలి గభీరము సాగరసప్తకంబు త
త్ప్రథిత నిబంధనంబు వియదంతర మెల్ల కటిప్రదేశ మా
పృథుతరలోకసంఘములు భీమపిచండ మజాండ మాలికా
గ్రథనము నీదు మస్తమని కాంతురు సిద్ధివినాయకాధిపా 10

అర్థము: సిద్ధి-వినాయక + అధిపా = ఓయి సిద్ధి వినాయక ప్రభూ!, పృథివినిన్ = భూమియందలి, భూధర + ఆవలి = పర్వతముల వరుస, గభీరము = లోతయినది, (అగు,), సాగర-సప్తకంబు = ఏడుసముద్రములు, తత్ + ప్రథిత = నిబంధనంబు = దానియొక్క (భూమియొక్క), ప్రసిద్ధమైన, ఏర్పాటు, వియత్ + అంతరము = ఆకాశమధ్యభాగము, ఎల్ల-కటి-ప్రదేశము = సమస్తమైన మొల (పిఱుదు)చోటు, ఆ-పృథుతర-లోక-సంఘములు = ప్రసిదములైన, లోకములయొక్క, సమూహములు,

భీమ-పిచండము = భయంకరమైన (పెద్ద), కడుపు, అజ + అండ-మాలికా-గ్రథనము = బ్రహ్మాండ మాలల కూర్పు, నీదు మస్తము = నీ యొక్క తల, అని, కాంతురు = చూతురు.

తాత్పర్యము: ఓయి సిద్ధివినాయకప్రభూ! భూమియందలి పర్వతముల వరుస, గంభీరమైన ఏడు సంద్రములు, ఆ భూమి యేర్పాటు, ఆకాశమునడిమిచోటు నీ యెల్ల మొల యనియు, పెద్దవియగు ఆ లోకముల సమూహములు నీ వెలుపు గొలుపు పెద్ద బొజ్జ యనియు, బ్రహ్మాండ మాలల కూర్పు నీ శిరస్సనియు భావింతురు.

విశేషములు: పర్వతములతోను, సప్తసముద్రములతోను గూడిన భూమియు, ఆకాశపునడిమిచోటును కటి ప్రదేశముగా గల వినాయకుని శరీర పరిమాణపు బృహత్త ఊహింపనగును. సాగర సప్తకము - లవణ, ఇక్షు, సురా, సర్పిస్ (నేయి),దధి, క్షీర, జల సముద్రములు. `పిచణ్డ కుక్షిజఠరోదర తున్దమ్' - అమరము.వ్యు. పచతి అన్నం స్వగతాగ్నినా ఇతి పిచణ్డః-తనయందుండెడు అగ్నిచేత అన్నమును పక్వము చేయునది. అపి చమత్యాహార మితి వా పిచణ్డః-ఆహారమును భక్షించునది అనియైనను. వియద్విష్ణుపదం వా తు పుం స్యాకాశ విహాయసీ-అమరము. వ్యు. వియచ్ఛతి నోపరమత ఇతి వినయత్-ఎడతెగక యుండునది- ఆకాశము. విఘ్నములు తొలగించి కార్యములు సిద్ధింపజేయును గావున వినాయకుడు సిద్ధి వినాయకుడు. వ్యు. వినయతి శిక్షయతి దుష్టాన్ విఘ్నాంశ్చేతి వినాయకః-దుష్టులను, విఘ్నములను శిక్షించువాడు. వినాయకో విఘ్నరాజ ద్వైమాతుర గణాధిపాః-అమరము. నీదు మస్తము-`యుష్మదస్మ త్తాత్మార్థకంబుల కుత్తరపదంబు పరంబగునపుడు దుగాగమంబు విభాషనగు. బా.వ్యా. సమా- 11.త-త్ధిత.....వియదంతర-అఖండయతి. ఇట్టిది యితని భీమఖండమునను గలదు. `వెస వసుధా స్థలిం గవీంద్రులు కొందరు......భీమ.ప్ర.12.

కం. భావమునఁ దలఁతు మద్గురు
భావితలోకుని మదీశుఁ బరమేశసమున్
శైవ మత గర్వ నిర్వహ
ణా విష్కృత కీర్తిఁ బండితారాధ్యవరున్.

అర్థము: భావిత-లోకునిన్ = దైవధ్యానముచే పవిత్రీకృతములైన లోకములు గలవాడును, మత్ + ఈశున్ = నాయొక్క స్వామియు, పరమేశసమున్ = పరమేశ్వరునితో సమానుడైనవాడును, శైవ.....కీర్తిన్: శైవ-మత = శైవ మనెడి మతము యొక్క, గర్వ = గొప్పతనము యొక్క, నిర్వహణ = నిర్వహించుట చేత, ఆ విష్కృత = ప్రకటింపబడిన, కీర్తిన్ = కీర్తి గలవాడును, మత్ + గురున్ = నా యొక్క గురువును, (అగు), పండితారాధ్యవరున్ = పండితారాధ్యుడను శ్రేష్ఠుని, భావమునన్ = మనస్సునందు, తలంతున్.

తాత్పర్యము: దైవధ్యానముచే లోకములను పవిత్రీకరించినవాడును, నా స్వామియు, పరమేశ్వర సమానుడును, శైవవతము నాధిక్యమును నిర్వహించుటచే ప్రకటింపబడిన కీర్తి గలవాడును, శ్రేష్ఠుడును అగు నా గురువును పండితారాధ్యుని మనస్సున స్మరింతును.

విశేషములు: పండితారాధ్యుని పూర్తి పేరు మల్లికార్జున పండితారాధ్యుడు. ఇతడు పండిత త్రయములో నొకడు. ఈయనకు వీరశైవమత ప్రచారమునకయి శివుడే తనకుగల మహాశక్తుల నన్నిటిని క్రోడీకరించి పండితునిగా సృజించెను. కావున పండితుడు ఘటనా ఘటన సమర్థుడు. శాపానుగ్రహ సమర్థుడు. ఇతడు రచించిన ఏకైకగ్రంథము శివతత్త్వసారము.

సీ. బాణు నద్భుత శాస్త్ర బహు కలా పారీణుఁ
ప్రకట వర కవితా[భ్యాసు వ్యాసు]
బంధుర గాంభీర్య'బంధు సుబంధు వి
స్ఫురిత మహోన్నతి స్తోము సోముఁ
జిరతర మతి భద్రుఁ జెన్నారు శివభద్రు
నతుల గుణస్ఫారు న మ్మయూరు
వరనీతి చాతురీ వాగ్భూతి భవభూతి
(ముఖ్య సజ్జన దయా)మోఘు మాఘు

గీ. ఘన వినూత్న వికాసు శ్రీకాలిదాసు
దండి కావ్యానులాప వాగ్దండి దండిఁ
జిత్ర వాగ్జృంభణ ప్రఖ్యుఁ జిత్తపాఖ్యుఁ
దగిలి మలహణు బిలహణు c దలఁతు నెపుడు 12

అర్థము: అద్భుత.......పారీణున్: అద్భుత = ఆశ్చర్యకరములైన, శాస్త్ర = మీమాంసాది శాస్త్రము లందును, బహు = పెక్కు, కలా = కళల యందును, పారీణున్ = పారమును ముట్టినవాడు (పండితుడు), అగు, బాణున్ = బాణుని; ప్రకట ....భ్యాసున్: ప్రకట = ప్రసిద్ధ మయిన, వర = శ్రేష్ఠమయిన, కవితా + అభ్యాసున్ = కవిత్వము యొక్క అభ్యాసము గలవాడు, అగు, వ్యాసున్ = వ్యాసుని; బంధుర = ఒప్పిదమైన, గాంభీర్య = గాంభీర్యమునకు, బంధున్ = చుట్టమైనవాడు, అగు, సుబంధున్ = సుబంధుని, విస్ఫురిత.......స్తోమున్: విస్ఫురిత = మిక్కిలి ప్రకాశించు, మహా (మహత్) + ఉన్నతి = గొప్ప ఉన్నతులయొక్క, స్తోమున్ = సమూహములు గలవాడు, అగు, సోమున్ = సోముని, చిరతర = మిక్కిలి చిరమైన,

మతి = బుద్ధిచేత, భద్రున్ = శుభుడైనవాడు, అగు, అమ్మయూరున్ (అ + మయూరున్) = ప్రసిద్ధుడైన మయూరుని, వర.........భూతిన్: వర = శ్రేష్ఠమైన, నీతి = నీతియొక్క చాతురీ = నేర్పుగల, వాక్ + భూతిన్ = వాక్సంపద గల వాడు, అగు, భవ భూతిన్ = భవభూతిని, ముఖ్య.......మోఘున్ ముఖ్య = ప్రధానులైన, సత్ + జన = పండిత జనుల యొక్క, దయా = దయచేత, అమోఘున్ = వ్యర్థముగానివాడు, అగు, మాఘున్ = మాఘుని, ఘన = గొప్పది, వినూత = మిక్కిలి క్రొత్తది, అగు, వికాసున్ = వికాసము గలవాడు, అగు, శ్రీ కాలిదాసున్ = శ్రీ కాళిదాసుని, దండి కావ్య + అనులాపవాక్ + దండిన్ = దండిన్ = దండిని, చిత్ర-వాక్ + జృంభణ - పఖ్యున్ = చిత్రములైన వాక్కులయొక్క విజృభణమునందు ప్రసిద్ధుడు, అగు, చిత్త ప + ఆఖ్యున్ = చిత్త పుడను పేరుగల వానిని, మలహణున్ = మల్హణుని, బిలహుణున్ = బిల్హణుని, తగిలి = ఆసక్తి గలిగి, ఎపుడున్, తలంతున్.

తాత్పర్యము: ఇందు కవి సంస్కృత కవీంద్రులను స్తుతించుచున్నాడు. శాస్త్రములయు, పెక్కు కళలయు పారమును ముట్టినవాడగు బాణుని, మహోన్నతుడగు సోముని, భద్రమతియగు శివభద్రుని గుణాధికుడగు మయూరుని, చతుర వాక్సంపదగల భవభూతిని, శ్రేష్ఠులైన పండిత జనుల దయచే నమోఘుడయిన మాఘుని, నూతన వికాసము గల కాళిదాసుని, దండిని, చిత్రవాగ్విజృంభణముగల చిత్తపుని, మల్హణుని, బిల్హణుని ఎప్పుడును తలతును.

విశేషములు: బాణుడు కాదంబరి యను పేరుగల ప్రౌఢ గద్య గ్రంథమును సంస్కృతమున రచించెను. మకుటతాడికము హర్షచరితము, చండికా శతకము. పార్వతీపరిణయము, అనువానిని గూడా రచించెను. కన్యాకుబ్జము నేలిన హర్షవర్ధనుని ఆస్థానమున నుండెను. ఆఱవ శతాబ్దమున నుండినవాడు. వ్యాసుడు మహాభారతమును, మహాభాగవతమును, అష్టాదశపురాణములను రచించెను. వేద విభాగమును గావించినవాడు. సుబంధుడు గద్యకావ్యకర్తలలో ప్రథముడు. వాసవదత్తయను పేరుగల కథను నిబంధించినవాడు. మయూరుడు సూర్యశతకమును రచించెను. భవభూతి ఉత్తరరామ చరిత నాటకమును, మాలతీమాధవమును, మహావీర చరిత నాటకమును రచించెను. మాఘుడు శిశుపాలవధ మహాకావ్యమును రచించెను. కాళిదాసు ఋతుసంహార, కుమారసంభవ, మేఘసందేశ, రఘువంశము లనెడి శ్రవ్యకావ్యములను, విక్రమోర్వశీయ, మాళవికాగ్నిమిత్రమును, అభిజ్ఞాన శాకుంతలము లనెడి దృశ్య కావ్యములను రచించెను. దండి కావ్యాదర్శమను లక్షణ గ్రంథమును దశకుమార చరిత్ర మను గద్య గ్రంథమును రచించెను. ఆఱవ శతాబ్దమునుత్తరార్థమున నుండిన వాడు బాణుని సమకాలికుడు మల్హణుడు. బిల్హణుడు కాశ్మీరదేశీయుడైన మహావిద్వత్కవి. విక్రమాంక దేవచరితమను పదునెనిమిది సర్గములు పద్యకావ్యమును రచించెను. ఆహవమల్లు నాస్థానమున నుండి విద్యాపతి బిరుదము నందెను.

సత్-విద్వా న్విపశ్చి ద్దోషజ్ఞస్సన్ సుధీః కోవిదో బుధః - అమరము.

శ్రీనాథుడు తన భీమఖండమున గూడ కాళిదాసుని, బాణుని, శివ భద్రుని, మాఘుని, మల్హణుని, బిల్హణుని, చిత్తపుని, దండిని స్తుతించెను.

బాణు రీణు(అ)భ్యాసు-వ్యాసు, స్తోము-సోము, మతిభద్రు-శివభద్రు, స్ఫారు-(మ)యూరు, భూతి-భవభూతి, (అ)మోఘు-మాఘు,(వి) కాసు-కాళిదాసు దండి-, ప్రఖ్యు-చిత్తపాఖ్యు-అనుచోట్ల అంత్యప్రాసము.

ఉ. ఉన్నతమైన [1]యంధ్రకవితోక్తుల నెంతయుఁ బ్రోడలైన యా
నన్నయ భట్టుఁ దిక్క కవి నాయకుఁ [2]దత్సము శంభుదాసుని
న్పన్నగుఁ బోలు నా కమలనాభునిఁ జేరి భజింతు నెంతయున్
సన్నుతశబ్దశాస్త్రముల సంఘటనంబు ఘటించు వేడుకన్ 13

అర్థము: సత్ + నుత = పండితులచే పొగడబడిన, శబ్ద = మాటలతోడి, శాస్త్రముల (యొక్క), సంఘటనంబు = కూర్పు, ఘటించు = కూర్చునట్టి, వేడుకన్ = కోరికతో, ఉన్నతము + ఐన = గొప్పవియగు, ఆంధ్ర-కవితా + ఉక్తులన్ = ఆంధ్రకవిత్వపు మాటలయందు, ఎంతయున్ = మిక్కిలి, ప్రోడలు + ఐన = నేర్పరులగు, ఆ = ప్రసిద్ధులయిన, నన్నయ భట్టున్, తిక్కకవి నాయకున్ = కవి ప్రభుడగు తిక్కనను, తద్ + సమున్ = వారి యిరువురితో సమానుడగు, శంభుదాసునిన్ = శంభు దాసుడను బిరుదుగల ఎఱ్ఱనను, పన్నగున్ + పోలు = పామయిన అనంతుని పోలునట్టి, ఆ = ప్రసిద్ధుడైన, కమలనాభునిన్ = కమలనాభామాత్యుని, చేరి = ఒఱగి, ఎంతయున్ = మిక్కిలి, భజింతున్ = సేవింతును.

తాత్పర్యము: ఈ పద్యమున కవి ఆంధ్రకవులను స్తుతించు చున్నాడు. గొప్పది యగు ఆంధ్రకవిత్వమునందు మిక్కిలి ప్రౌఢులైన నన్నయను, తిక్కనను, వారి యిరువురితో సమానుడైన శంభుదాస బిరుదాంచితుడగు ఎఱ్ఱనను, అనంతునిబోలు కమలనాభామాత్యుని వినమ్రుడనై సేవింతును. ఏతత్కావ్యకర్త యగు శ్రీనాథునకు పూర్వులైన మహాకవులీ నలువురే. సాహితీ ప్రపంచమున నన్నయ, తిక్కన, ఎఱ్ఱన యుగముల తరువాతిది శ్రీనాథయుగమే. కమల నాభుడు శ్రీనాథుని తాత. శ్రీనాథుడతని ననంతునితో పోల్చుచున్నాడు కావున, అతడు మహావిద్వాంసుడై యుండవలయును. శ్రీనాథుడు తన భీమఖండమున గూడ కనకక్ష్మాధరధీరుడనియు, వారిధి తటీ కాల్పట్టణాధీశ్వరుడనియు, ఘనుడనియు, పద్మపురాణ సంగ్రహాకళా కావ్యప్రబంధాధిపుడనియు, వినమత్ కాకతి సార్వభౌముడనియు, కవితా విద్యాధరుడనియు, తన అనుగు తాత అనియు, ప్రదాత అనియు శ్రీ కమలనాభామాత్యుని నుతించియున్నాడు.

---

1. ము. యాంధ్ర 2. ము. దెఱ్ఱన.

మ. కనకక్ష్మాధరధీరు వారిధితటీ కాల్పట్టణాధీశ్వరున్
ఘనునిన్ బద్మపురాణ సంగ్రహ కళా కావ్యప్రబంధాధిపున్
వినమ త్కాకతి సార్వభౌముఁ గవితా విద్యాధరుం గొల్తు మా
యనుంగుఁదాతఁ బ్రదాత శ్రీకమలనాభామాత్యచూడామణిన్. 110

కాని అతడు రచించెనని చెప్పబడు ఆ పద్మపురాణ ప్రబంధ మిప్పుడు లభించుటలేదు.

కం. కృతిపతులగు కవిముఖ్యుల
సతతముఁ గొనియాడి వారి సన్నుత (కరుణా
మతికిన్ బాత్రుఁడ నేనే
వితతంబగు కవిత చెప్ప వెరవని మతితోన్)

అర్థము: వెరవని - మతితోన్ = భయపడని మనసుతో, వితతంబు + అగు= విస్తృతమగు, కవిత = కవిత్వము, చెప్పన్ = చెప్పుటకు, కృతి-పతులు + అగు = కృతిపతులైన, కవి-ముఖ్యులన్ = కవిశ్రేష్ఠులను, సతతమున్ = ఎల్లప్పుడును, కొనియాడి = పొగడి, వారి (యొక్క), సన్నుత-కరుణా-మతికిన్ = మిక్కిలి పొగడబడిన దయాబుద్ధికి, నేనే, పాత్రుడన్ = అర్హుడను.

తాత్పర్యము : జంకుగొంకులు లేని మనస్సుతో విస్తృతముగా కవిత్వమును చెప్పుటకు కృతి పతులైన కవిశ్రేష్ఠుల నెల్లప్పుడును ప్రశంసించి వారి సన్నుతదయా బుద్ధికి నేనే యర్హుడ నగుదును.

కం. (ఉఱవైన సుకవి)కోటుల
తెఱఁ[1]గిది యని. తప్పులెల్లఁ దీర్తురు వశులై
యెఱుఁగరు సుకవులఁ గుకవులు
కఱకులు [2]పలుకుటయ నేర్పు గర్వప్రౌఢిన్. 15

అర్థము: కుకవులు = కా కవులు, ఉఱవు + ఐన = యోగ్యులైన, సుకవి - కోటులన్ = సత్కవుల సమూహముల యొక్క, తెఱఁగు = విధము, ఇది, అని, వశులు + ఐ = ప్రాబల్యము గల వారయి, తప్పులు + ఎల్లన్ = దోషముల నన్నిటిని, తీర్తురు = దిద్దురు, సుకవులన్ = సత్కవులను, ఎఱుగరు = తెలియరు, (కుకవులకు), గర్వ - ప్రౌఢిన్ = గర్వాతిశయముతో, కఱకులు = పురుషములు, పలుకుట + అ = పలుకుటయ = పలుకుటయే, నేర్పు = నైపుణ్యము.

తాత్పర్యము: కుకవులు యోగ్యులైన సత్కవుల విధమిది యని ప్రాబల్యము

1. ము. గిదే. 2. తా.గలుగుటయె-------------

గలవారై వారి యందలి తప్పుల నన్నిటిని దిద్దుదురు. వారికి సుకవుల సంగతి తెలియదు. గర్వాతిశయముతో పరుషవాక్యములు పలుకుటయందే వారికి నైపుణ్యాము.

విశేషములు: సుకవుల దోషముల నెన్నుటయే కుకవుల పని. వారి కవితా మాధుర్యమును కుకవు లెఱుగజాలరు. వారు గర్విష్ఠులై సుకువులను గూర్చి కఱకు పలుకులను పలుకుటలో నేర్పు చూపుదురు. కఱకులు = కఱకు పలుకులు 'విశేషణంబులు కొన్నియెడల విశేష్యలక్షకంబులగు'. ప్రౌఢ. శబ్ద. 12

ఉ. పద్యగణాక్షర ప్రకర భావరసార్థ గుణ (ప్రపూర్ణమై
హృద్య విలాస)శబ్ద పద హేతు కళారస సత్క్రియాఢ్యమై
యాద్యులు చన్న మార్గమున నా వళిప్రాస విడంబ బంధమై
చోద్యము గాఁగఁ జెప్పు కృతి శ్రోత్రసుఖావహ మెల్లచోటులన్ 16.

అర్థము: పద్య.....ప్రపూర్ణ: పద్య = ఉత్పలమాలాది పద్యముల యొక్కయు, గణ = సూర్యేంద్రాది గణముల యొక్కయు, అక్షర = అకారాద్యక్షరముల యొక్కయు, ప్రకర = సమూహముతోను, భావ = భావములతోను, రస = శృంగారాది రసములతోను, ప్రపూర్ణము + ఐ = నిండినదయి, హృద్య......యాఢ్యమై:హృద్య = మనసునకు ఇంపయినట్టి, విలాస = విలాసములతో గూడిన, కళా-రస-సత్-క్రియా + ఆఢ్యము + ఐ = కళలు, రసములు, సత్క్రియలు అనువానితో సంపన్నమయి, ఆ -వళి-ప్రాస-విడంబ-బంధము గల దయి, ఆద్యులు = మొదటివారు, (కవులు), చన్న = పోయిన, మార్గమునన్ =త్రోవయందు, చోద్యము+కాఁగన్ =ఆశ్చర్యమగునట్లు, చెప్పు = రచించునట్టి, కృతి = కావ్యము, ఎల్ల-చోటులన్ = ఎల్లెడలను, శ్రోత్ర-సుఖ + ఆవహము = చెవులకు సౌఖ్యమును గలిగించునది.

తాత్పర్యము: పద్యములు, గణములు, అక్షరములు, భావములు, రసములు, గుణములు, అనువానితో నిండినదయి, హృదయంగమములయిన శబ్దములు, పదములు కారణములుగా గల కళలు, రసములు అనువానితో గూడినదయి, యతి ప్రాసములు గలిగి, పూర్వ కవుల మార్గమున చెప్పునట్టి కావ్యము ఎల్లెడలను చెవులకు ఇంపును గూర్చును.

విశేషములు: రసములు-ఇవి తొమ్మిది. శృంగారము, హాస్యము, కరుణము, వీరము, రౌద్రము, భయానకము, బీభత్సము, అద్భుతము, శాంతము. గుణములు - ఇవి పది, శ్లేషము, ప్రసాదము, మాధుర్యము, సౌకుమార్యము, సమత, అర్థదీపనము, ఔదార్యము, కాంతి, ఓజస్సు, సమాధి; ఆద్యులు = నన్నయ మొదలయిన తెలుగు కవులు. వళి = యతి. పద్యపాదాద్యక్షరము. ప్రాసము :పద్యపాద ద్వితీయాక్షరము.

శా. (జాతా జాత చరాచర (ప్రతతికిన్) [1]సంభూతక స్థానమై
ఖ్యాతంబై బుధ హృద్య మంగళ కవీంద్రాచార్య సంసేవ్యమై
యాతారార్క సుధాంశువై కమలజాతాకల్పమై యెప్పుడున్
జ్యోతిశ్చక్రముఁ బోలెఁ గ్రాలవలదా సొంపారి కావ్యం బిలన్) 17

అర్థము: ఇందు కవి కావ్యమును జ్యోతిశ్చక్రముతో పోల్చుచున్నాడు కావున ఇందలి ప్రతిపదమును జ్యోతిశ్చక్ర పరముగను, కావ్యపరముగను అన్వయింపవలయును. జాతా.......స్థానమై: జాత = పుట్టిన, అజాత = పుట్టని చర = తిరుగునవి, అచర = తిరుగనివి, అగువాని, ప్రతతికిన్ = సమూహమునకు;సంభూతక-స్థానము + ఐ = జన్మస్థానమయి, జ్యోతిశ్చక్రము పుట్టిన, పుట్టని; తిరిగెడు, తిరుగని వాని సమూహమునకు మూలమయి యుండును. కావ్యముననుజాతాజాతములు, చరా చరములు నగునవి వర్ణింపబడుటచే అదియు వానికి మూల స్థానమయి యుండును, ఖ్యాతంబు + ఐ = ప్రసిద్ధమయి, ఇది ఉభయార్థములకును సామాన్యము, బుధ.....సంసేవ్యమై: జ్యోతిశ్చక్ర పరము - బుధ = బుధగ్రహముచే, హృద్య = మనోహరము, మంగళ = అంగారక (కుజ)గ్రహము, కవి = శుక్ర గ్రహము, ఇంద్ర + ఆచార్య = గురుగ్రహము, అనువానిచే, సంసేవ్యము + ఐ = మిక్కిలి సేవింపదగినదయి, కావ్యపరము: బుధ = పండితులకు, హృద్య = హృదయంగమము, మంగళ = మంగళకరము, నయి, కవి + ఇంద్ర + శ్రేష్ఠులయిన కవులచేతను, ఆచార్య = గురువుల చేతను, సంసేవ్యము + ఐ = మిక్కిలి సేవింపదగిన దయి, ఆ - తారా + అర్క-సుధాంశువు + ఐ = నక్షత్రములు, సూర్యుడు, చంద్రుడు ఉండునంతవఱకు నుండునదియై, ఇది యుభయార్థములకును సామాన్యము, కమల జాత + ఆకల్పము + ఐ = బ్రహ్మకల్పము వఱకు నుండునదియై, ఇది యుభయార్థములకును సామాన్యము, ఎప్పుడున్, కావ్యంబు, సొంపు + అరి = ఒప్పినదయి జ్యోతిస్ + చక్రమున్ + పోలెన్ = చంద్ర సూర్యాది, గ్రహనక్షత్ర మండలము వలె, ఇలన్ = భూమియందు, క్రాలన్ + వలదు + ఆ = ప్రవర్తిల్ల వలదా? ప్రవర్తిల్లవలయు ననుట.

తాత్పర్యము: జాతా జాతములు, చరాచరములు అగువానికి జన్మస్థానమయి, ప్రసిద్ధమయి, బుధుడు, కుజుడు, శుక్రుడు, గురుడు అను గ్రహములచే సేవిపందగిన దయి, నక్షత్రములు, సూర్యుడు, చంద్రుడు నుండునంత వఱకు నుండునదయి, బ్రహ్మకల్పముగా నుండు జ్యోతిశ్చక్రమువలె కావ్యమును జాతాజాత చరాచరములకు స్థానమయి, ప్రసిద్ధమయి, పండితుల చేతను, కవిశ్రేష్ఠులచేతను, ఆచార్యుల చేతను సేవింపదగినదయి భూమియందు ఆ చంద్రతారకార్కముగా బ్రహ్మకల్పముగా ఎప్పుడును ప్రవర్తిల్లవలయును.

1. తా. సంఘాతక

విశేషములు: బుధ, మంగళ, కవి శబ్దములకు అర్థద్వయము చెప్ప వలయుటచే అలంకారము శ్లేషము. నానార్థ సంశ్రయః శ్లేషః. ఆ తారార్క సుధాంశువు-ఇందు`ఆ' అనునది అభివిధ్యర్థకము.`వఱకు' అను నర్థము గలది. తారార్క సుధాంశువులు ఉండు వఱకు. అవ్యయీభావ సమాసము. జ్యోతిస్ + చక్రము- పదాంతమందలి సకారము ఏదయిన వర్ణము పరమయినప్పుడును, అవసానమందును విసర్గముగా మాఱును, జ్యోతిః + చక్రము. ఊష్మ పరకములు గాని చఛ, టఠ,తథలు పరములగు నప్పుడు విసర్గము సకారముగా మాఱి, చఛలు పరములగునపుడు శ్చుత్వమును, టఠలు పరములగునపుడు ష్టుత్వమును పొందును-జ్యోతిశ్చక్రము.

వ. అని యిష్టదేవతా ప్రార్థనంబును, గురు ప్రశంసయు, గవీశ్వర ప్రస్తుతియుం, గుకవి నిరాకరణంబునుం జేసి యొక్క కవితా విధానంబు శైవంబుగా సుకుమార చరిత్రంబు (చెప్పంబూనిన యవసరంబున)స్వస్తి శ్రీ పర్వత స్వయంభూ శ్రీలింగ చక్రవర్తి శ్రీమన్మల్లికార్జున మహాదేవుని ముఖ మండపంబున సుఖాసీనులయి యంచు గండ (దేవ) పృథ్వీ మహా(మహత్తును, నానాదేశాగతానేక (బ్రాహ్మణ) భక్త ప్రకరంబులును, విజయ సదృక్షులగు శుద్ధ క్షత్రియులును, ధనపతి సమాన సంపద్భాసితులగు వైశ్యులును, నిర్వక్ర పరాక్రములగు వీరభటులును, [1](శంకర పురాధ్యక్షులును)స్థానాధికారులును బాహత్తరి) నియోగంబును, గుండలి దండ లాసక[2]ప్రేరణి ప్రేంఖణంబులైన చతుర్విధ నృత్త గీత వాద్యాభిజ్ఞులును, గళా విలాస [3]కరణాసన బంధుర బంధ భేదంబులం [4]గందర్ప సంగర ప్రవీణలయిన (కురంగలోచనలును బలసి) యుండ, శ్రీశాంతభిక్షావృత్తి యతీశ్వరుండు శివకథా విధానంబులం[5] బ్రొద్దులు పుచ్చుచుం దన మూల భృత్యుం డగు [6]నుప్పలపు ముమ్మడి దేవయ్య శాంతునింగనుంగొని నీ పేర (నంకితంబుగా నంధ్రభాషా) కవిత్వంబున నీ కథ యుపన్యసింపు మనిన మహాప్రసాదంబని సత్కవి సార్వభౌముండగు శ్రీనాథ కవి వరేణ్యునిం గృపా విశేషంబునం గాంచి శ్రీమన్మల్లికార్జున మహా దేవ (దేవు పాద పద్మారాధకులగు) అంచుగండ ముఖ్య [7]రేవమ సిద్ధ యేకోరామేశ్వర పండితారాధ్యాది చాతుర్వర్ణ్యంబులం గలిగిన (మత్రంబుల)యందు (పండితారాధ్య హస్త సంభూత వంశంబులయందు నుద్భవం)బందిన మల్లి నాథగురుండు.

అర్థము: అని, ఇష్ట-దేవతా-ప్రార్థనంబును = ప్రియులైన వేల్పుల నమస్కారమును, గురు-ప్రశంసయున్ = గురువుయొక్క స్తోత్రమును, కవి + ఈశ్వర-ప్రస్తుతియున్ = శ్రేష్ఠులయిన కవుల యొక్క పొగడ్తను, కుకవి-నిరాకరణంబునున్ = దుష్కవుల తిరస్కారమును, చేసి, ఒక్క, కవితా-విధానంబు = కవిత్వ పద్ధతి-కావ్యము, శైవంబు

---

1. తాళపత్రమున లేదు. 2. తా. ప్రేరణ ప్రేక్ష్యకంబులైన 3. ము. కరుణబంధుర. 4. గంధర్వసంగర 5. తా. బ్రొద్దుపుచ్చుచు. 6. ము పువ్వలపు. 7. ము. వరుణా.......లోష్ఠ

+ కాన్ = శివసంబంధియగునట్లు, సుకుమార-చరిత్రంబు = సుకుమారుడను వాని చరిత్ర, చెప్పన్ + పూనిన-అవసరంబునన్ = చెప్పయత్నించు సమయమునందు-

తాత్పర్యము: అని యిష్టులైన వేల్పులను ప్రార్థించి, గురువును ప్రశంసించి, కవి శ్రేష్ఠులను ప్రస్తుతించి, కుకవులను నిరాకరించి, సుకుమారుడను వాని చరిత్రము నొక శైవకావ్యముగా రచింపయత్నించు సమయమునందు.

విశేషములు: కుకవి-కుత్సితుడైనకవి. కాకవి, కింకవి అనియు నుండును.

అర్థము: స్వస్తి = శుభము, శ్రీపర్వత-స్వయంభూ - శ్రీలింగచక్రవర్తి = శ్రీశైలమునందలి, స్వయంభువుఐన, శ్రీలింగరాజు, (అగు), శ్రీమత్ + మల్లికార్జున మహాదేవుని = శ్రీమంతుడైన మల్లికార్జునుడను పేరుగల ఈశ్వరుని యొక్క, ముఖ-మండపంబునన్ = ముందటి చావడి యందు, అంచుగండదేవ పృథ్వీమహామహత్తును. నానా-దేశ + ఆగత + అనేక-బ్రాహ్మణ-భక్త-ప్రకరంబులును = అనేక దేశములనుండి వచ్చిన పెక్కండ్రు బ్రాహ్మణ భక్తుల సమూహములును, విజయ-సదృక్షులు = అర్జునినితో సమానులు, అగు, శుద్ధ = క్షత్రియులును = నిజమైన క్షత్రియులును, ధనపతి-సమాన-సంపద్ + భాసితులు = కుబేరునితో సాటి వచ్చు సంపదచే ప్రకాశించువారు, అగు, వైశ్యులును = కోమట్లును, నిర్వక్ర-పరాక్రములు = వంకరలేని (గొప్పదియగు), విక్రమము గలవారు, అగు, వీర-భటులును = వీరులైన యోధులును, శంకరపుర + అధ్యక్షులును స్థాన + అధికారులును; బాహత్తరి-నియోగంబును = మహత్తరులైన అధికారులును, కుండలి-దండ లాసక-ప్రేరణి-ప్రేంఖణంబులు + ఐన = ఆ పేరుగల, చతుర్విధ..... భిజ్ఞులును: చతుర్విధ = నాలుగు విధములయిన, నృత్త = నృత్తము, గీత = సంగీతము, వాద్య + అభిజ్ఞులును = వాద్యములు తెలిసినవారును, కళా భేదంబులన్: కళావిలాసము, కరణాసనము, బంధుర బంధము అను వివిధములైన, కందర్ప-సంగర-ప్రవీణలు = మన్మథ యుద్ధమునందు (రతిక్రీడయందు), నేర్పరులు, అయిన, కురంగ లోచనలును = లేడి కన్నులవంటి కన్నులుగల స్త్రీలును, సుఖ + ఆసీనులు = సుఖముగాగూర్చున్న వారు, అయి, బలసి + ఉండన్ += చుట్టియుండగా

తాత్పర్యము: స్వస్తి శ్రీశైలమునందలి స్వయంభూలింగరాజగు శ్రీమల్లికార్జున మహాదేవుని ముఖమండపమునందు అంచుగండదేవ పథ్వీ మహామహత్తును, పలు దేశములనుండి వచ్చిన పెక్కండ్రు బ్రాహ్మణ భక్తుల గుంపులును, అర్జునునితో సమానులగు నిజమైన క్షత్రియులును, కుబేరునితో సాటివచ్చు సంపదచే ప్రకాశించు కోమట్లును, అఖండ పరాక్రమవంతులగు వీరులును, శంకరపురాధ్యక్షులును, స్థానాధికారులును, మహత్తరులైన అధికారులును, కుండలి, దండలాసక, ప్రేరణి, ప్రేంఖణము లనెడి నాలుగు విధములైన నృత్త గీత వాద్యములు తెలిసినవారును,


కళావిలాసము, కరణాసనము, బంధురబంధము అను వివిధ రతిక్రీడలందు నేర్పరులయిన స్త్రీలును చుట్టియుండగా,

విశేషములు: శ్రీశైలమునందలి శివలింగము స్వయంభువము. ఆ శివుని పేరు శ్రీమల్లికార్జునుడు. కుండలి = కుండలార నృత్యము-గొండ్లి, దండలాసకము = కోలాటము అను నృత్యవిశేషము, ప్రేరణి = పేరణి = భాండోపరి నృత్యము, ప్రేంఖణము = ప్రెక్కణము =పెక్కణము = అభినయముతోడి నృత్యము.

అర్థము: శ్రీశాంతభిక్షావృత్తి యతి + ఈశ్వరుండు = శ్రీశాంత భిక్షావృత్తి అను యతి శ్రేష్ఠుడు, శివ-కథా-విధానంబులన్ = శివునియొక్క, కథల, రీతులతో, ప్రొద్దులు-పుచ్చుచున్-దినములు, కడపుచు, తన = తనయొక్క, మూల భృత్యుండు = మొదటి సేవకుడు, అగు, ఉప్పలపు ముమ్మడి దేవయ్య శాంతునిన్, కనుంగొని = చూచి, నీ పేరన్, అంకితంబు + కాన్, ఆంధ్రభాషా కవిత్వంబుననన్, - నీకథ, ఉపన్యసింపుము = విస్తరించి చెప్పుము, అనినన్, మహాప్రసాదంబు = అని = గొప్ప అనుగ్రహమని, సత్ + కవి సార్వభౌముండు + అగు = మంచి కవులలో సార్వభౌముడైన, శ్రీనాథ-కవి-వరేణ్యునిన్ = కవులలో శ్రేష్ఠుడైన శ్రీనాథుని, కృపా-విశేషంబునన్ = దయాధిక్యముచేత, కాంచి = చూచి, శ్రీమత్ + మల్లికార్జున-మహాదేవదేవు = శ్రీమంతుడైన, మల్లికార్జునుడను పేరుగల మహేశ్వరుని యొక్క, పాద-పద్మ + ఆరాధకులు = తామరలవంటి అడుగులను పూజించు వారు, అగు, అంచుగండ ముఖ్య, రేవణ సిద్ధ, యేకోరామేశ్వర, పండితారామేశ్వర, పండితారాధ్య మున్నగు నాలుగు వర్ణములందును, కలిగిన = ఉన్న, మతంబుల + అందున్, పండితారాధ్య-హస్త-సంభూత-వంశంబుల + అందున్ = పండితారాధ్యుని యొక్క, చేతినుండి, పుట్టిన, వంశములందు, ఉద్భవంబు + అందిన = పుట్టుగాంచిన, మల్లినాథ-గురుండు = మల్లినాథుడను పేరుగల గురువు.

అర్థము: శ్రీశాంత భిక్షావృత్తి యనుపేరుగల యతిశ్రేష్ఠుడు శివుని కథలతో కాలము గడపుచు తన ప్రధాన భృత్యుడగు ఉప్పలపు ముమ్మడిదేవయ్య శాంతుని జూచి, 'నీ కంకితముగా నీ కథను తెలుంగున నుపన్యసింపు' మనగా, నతడు 'మహాప్రసాద'మని' కవిసార్వభౌముడగు శ్రీనాథ కవిశ్రేష్ఠుని, వాని దయచే జూచి, శ్రీమన్మల్లికార్జున మహాదేవుని పాదపద్మములను పూజించు అంచగండ ముఖ్యరేవణ సిద్ధ యేకోరామేశ్వర పండితారాధ్యులు మున్నగు నాలుగు వర్ణములందును గల మతములందు పండితారాధ్య హస్తము నుండి పుట్టిన వంశముల జననమందిన మల్లినాథుడను గురుడు-పయి పద్యముతో నన్వయము.

విశేషములు : కృతిభర్త యింటిపేరు పువ్వులపువారని పూర్వముద్రణమున నున్నది. కాని పరిష్కర్తలకు లభించిన తాళపత్రమున నుప్పలపువారని యుండుటచే నదియే స్వీకృతము. 'ఉత్పలము'నకిది వికృతిగానోపు' కృతి భర్త తండ్రి మూలపురుషుడైన



పోలి దేవయ్య `మల్లికార్జున కుత్పలం బర్థిఁబడసె'(1-22)అని యుండుటచే నిదియే సమంజసమని తోచుచున్నది. చూ. పీఠిక.

సీ. లింగార్చన క్రియాలీల నే ప్రొద్దును
గరికాల [1]చోడని కరణివాఁడు
జంగమారాధనాసక్తిమై (నేపారు
బల్లాణ భూనాథు పాడివాఁడు
పరమ శైవాచార పాండిత్య విస్ఫూర్తి
సంగన బసువయ్య) సరణివాఁడు
వర ధర్మ చాతురీ వైభవఖ్యాతిచేఁ
[2]జెన్నయ రాయని చెలువువాఁడు

గీ. నసఁగ నిద్ధాత్రి నింపారు నఖిలకళల
సకల నిర్మాణ విద్యాప్రశస్తుఁ డనఁగ
మానితైశ్వర్య సంప్రాప్త (మహితయశుఁడు)
మల్లికార్జునయోగి సమాజ[3]వరుఁడు. 19

అర్థము: మాని.....యశుండు: మానిత + ఐశ్వర్య = మన్నింపబడిన ప్రభుత్వము చేత, లేదా సంపదచేత, సంప్రాప్త = పొందబడిన, మహిత = గొప్పదియగు, యశుఁడు = కీర్తిగలవాడు, (అగు), మల్లి......వరుఁడు:మల్లికార్జున-యోగి-సమాజ-వరుఁడు = మల్లికార్జునుడను పేరుగల యోగి సంఘశ్రేష్ఠుడు, సకల......ప్రశస్తుఁడు: సకల-ఎల్ల, నిర్మాణ-విద్యా=నిర్మితి విద్యలచే, మిక్కిలి పొగడబడినవాడు, అనంగన్, లింగ = అర్చన-క్రియా-లీలన్ = శివలింగము యొక్క పూజ యనెడు పనియొక్క విలాసమునందు, ఏ-ప్రొద్దును = ఎల్లప్పుడును, కరికాలచోడని కరణివాఁడు = కరికాలచోడనివంటివాడు. జంగమ + ఆరాధన + ఆసక్తి-మైన్ = జంగమ = జంగము వారి యొక్క, పూజయందలి కోరికతో, ఏపారు = అతిశయించు, బల్లాణ-భూనాథు పాడివాడు = బల్లాణ రాజువంటివాడు. పరమ-శైవ + ఆచార-పాండిత్య-విస్ఫూర్తియందు, వీరశైవాచార పాండిత్యాతిశయమునందు, సంగన బసువయ్య సరణివాఁడు = సంగన బసువయ్య విధము వాడు. వర-ధర్మ-చాతురీ-వైభవ-ఖ్యాతిచేన్ = శ్రేష్ఠములైన, ధర్మములందలి, నేర్పు అనెడు, సంపద వలని, కీర్తిచేత, చెన్నమ రాయని చెలువు వాఁడు= చెన్నమరాయని విధమువాడు.

అనంగన్, అఖిల-కళలన్ = ఎల్ల విద్యలయందును, ఇద్ధాత్రిన్ (ఈ+ధాత్రిన్) = ఈ భూమియందు, ఇంపారున్ (ఇంపు + ఆరున్) = ఒప్పును.

1.తా. భూనాథు. 2. ము.సేవను.

తాత్పర్యము: మున్నింపబడిన ఐశ్వర్యమువలన పొందిన గొప్పకీర్తి గల వాడగు మల్లికార్జునుడను యోగిశ్రేష్ఠుడు ఎల్ల నిర్మాణ విద్యలయందును ప్రసిద్ధి కెక్కినవాడనియు, జంగమ దేవరల పూజయందు బల్లాణ రాజువంటివాడనియు, వీరశైవాచార పాండిత్యమునందు సంగన బసవయ్య వంటి వాడనియు, ఉత్తమ ధర్మములందలి చాతుర్యముచే చెన్నమరాయని వంటివాడనియు ఈ భూమియందు ఎల్ల విద్యలయందు నొప్పారును.

విశేషములు: కరికాలచోడడు, బల్లాణుడు, సంగన బసువయ్య, చెన్నమ రాయడు అనువారు వీరశైవులలో గొప్పవారు. లింగార్చనము, జంగమా రాధనము, శైవధర్మాచరణము అనునవి వీరశైవులు పాటించు కార్యములు.

క. ఆతని వంశంబునఁ బ్ర
[1]ఖ్యాత చరిత్ర ప్రతాప కలనా ధర్ముం
డాతత విక్రమ శీలుఁడు
భూతలమునఁ గొమ్మవిభుఁడు పొలుపై వెలసెన్ 20

అర్థము: ఆతని-వంశంబునన్ = ఆ మల్లికార్జునుని వంశమునందు, ప్రఖ్యాత....ధర్ముండు: ప్రఖ్యాత = ప్రసిద్ధమైన, చరిత్ర = చరిత్రము, ప్రతాప = పరాక్రమము (అనువాని యొక్క), కలనా = పొందుట గల ధర్ముండు = ధర్మము గలవాడు, ఆతత-విక్రమ శీలుఁడు = గొప్పది యగు, పరాక్రమము, స్వభావముగా గలవాడు, (అగు),కొమ్మ విభుఁడు = కొమ్మప్రభువు, భూతలమునన్ = భూమియందు, పొలుపు + ఐ = ఒప్పి, వెలసెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము: ఆ మల్లికార్జునుని వంశమునందు ప్రసిద్ధమైన చరిత్రము, ప్రతాపము అనువానితో, గూడిన ధర్మము గలవాడును, గొప్ప పరాక్రమము గలవాడును అగు కొమ్మవిభుడు భూమియందు వెలసెను.

వ. తదనుసంభవుండు 21

అర్థము: తద్ = ఆ కొమ్మవిభునియొక్క, అనుసంభవుండు = తమ్ముడు.

తాత్పర్యము: ఆ కొమ్మవిభుని తమ్ముడు. (పోలి దేవయ్య)

సీ. [2]చేఁపూరి భీమేశుఁ జెలువార గుండెలఁ
బూజ గావించిన పుణ్యమూర్తి
కడిమిమై నిరువత్తు గండనిచే మల్లి
కార్జును కుత్పలం బర్థిఁ బడసెఁ

1. ము. ఖ్యాతిగఁజరితప్రభావ. 2. చేవూరి.

గొలని రామారెడ్డి వలన (శ్రీగిరినాథు
కర్పించె భరణాలు గ)రిమతోడ(?)
భక్తి రాజాఖ్యుచేఁ బర్వతేశ్వరునకు
నర్పించెఁ[1]జెరువాలు నాతుకూరు.

గీ. ధరణిఁ ద్రిపురాంతకున కాముదాలవల్లి
రాయ వేశ్యా[2]భుజంగు వల్లావ యిచ్చె
నిట్టి పౌరుష (సంపన్నుఁ డిద్ధయశుఁడు)
పోలి దేవయ్య చెన్నారుఁ బుణ్యమూర్తి. 22

అర్థము: చేఁపూరి-భీమేశున్ = చేఁపూర్ణి యందలి భీమేశ్వరుని, చెలువారన్ (చెలువు + ఆరన్) = ఒప్పునట్లుగా, గుండెలన్ = గుండెలతో, పూజ, కావించిన = చేసిన, పుణ్యమూర్తి = పున్నెము యొక్క స్వరూపము గలవాడు. కడిమి మైన్ = పరాక్రమముచేత, ఇరువత్తుగండనిచేన్, మల్లికార్జునుకున్ = మల్లికార్జునస్వామికి, ఉత్పలంబు = ఉత్పలమను గ్రామమును అర్థిన్ = కోరికతో, పడసెన్ = పొందెను. కొలని రామారెడ్డి వలనన్, శ్రీగిరినాథుకున్ = శ్రీశైల మల్లికార్జున స్వామికి, భరణాలు = జీతములు, గరిమతోడన్ = గొప్పతనముతో, అర్పించెన్ = చెల్లించెను. భక్తిరాజ + ఆఖ్యుచేన్ = భక్తి రాజను పేరుగల వానిచేత, పర్వత + ఈశ్వరునకున్ = శ్రీశైల స్వామికి, చెరువాలున్, ఆతుకూరున్ (అను గ్రామములను), అర్పించెన్ = ఇచ్చెను. ధరణిన్ = భూమియందు, త్రిపురాంతకునకున్ = ఈశ్వరనకు (మూడు పురములను అంతమొందించినవానికి), ఆముదాలవల్లి, రాయవేశ్యా భుజంగు వల్లావ, అను గ్రామములను, ఇచ్చెను. ధరణిన్ = భూమియందు, త్రిపురాంతకునకున్ = ఈశ్వరునకు (మూడు పురములను అంతమొదించిన వానికి),ఆముదాలవల్లి, రాయవేశ్యా భుజంగు వల్లావ, అనుగ్రామములను, ఇచ్చెన్. ఇట్టి, పౌరుష- సంపన్నుఁడు = పౌరుషమనెడి సంపద గలవాడు, ఇద్ధ-యశుఁడు = స్వచ్ఛమైన కీర్తి గలవాడు, పుణ్యమూర్తి = పున్నెము రూపుగాంచినవాడు, (అగు), పోలిదేవయ్య చెన్నారున్ = ఒప్పును.

తాత్పర్యము: కొమ్మ విభుని తమ్ముడగు పోలిదేవయ్య చేపూరి భీమేశ్వరుని గుండెలతో పూజించిన పుణ్యస్వరూపుడు. పరాక్రమమున నిరువత్తు గండని గెలిచి యతని నుండి మల్లికార్జునస్వామి కుత్పలము గ్రామమును సాధించినవాడు. కొలని రామారెడ్డి నుండి శ్రీశైల స్వామికి భరణముల నర్పించెను. భక్తిరాజను పేరుగలవానిచే శ్రీశైల దేవునకు చెరువాలు, ఆతుకూరు గ్రామముల నిప్పించెను. ఆ యీశ్వరునకు ఆముదాలవల్లి, రాయవేశ్యా భుజంగు వల్లావ ఇచ్చెను. ఇట్టి పౌరుష సంపన్నుడు, నిర్మల యశస్సుగలవాడు అగు పోలిదేవయ్య పుణ్యమూర్తియై యొప్పును.

1. ము. జెరువాడు 2.తా. భుజంగమల్లావ.

విశేషములు: మల్లి కార్జును కుత్పలంబు = మల్లికార్జును + కున్ + ఉత్పలంబు `కువర్ణకంబు పరంబగునపుడుకార ఋకారంబులకు నగాగమంబగు' అను బా. వ్యా తత్సమ- 28చే నగాగమమో దానిని బాధించి 'ఋమంతంబునకు ద్వితీయాద్యేకవచనంబు పరంబగునపుడు నిగాగమంబు సర్వత్ర విభాషనగు' అను బా. వ్యా. తత్సమ- 23 నిగాగమమో వచ్చి వచ్చి మల్లికార్జునుకున్, అనికాని, మల్లికార్జునికిన్ అనికాని కావలసియుండగా, 'కువర్ణకంబు పరంబగునపుడు కవిత్రయంబువారి ప్రయోగంబులందక్క దక్కిన మహాకవి ప్రయోగంబులందునుం గొన్నియెడల నగాగమంబు చూపట్టదు'. అను ప్రౌ.వ్యా. శబ్ద-19చే మల్లికార్జునుకున్ అను రూపము ఏర్పడినది. ఇట్లే `శ్రీగిరినాథుకున్'అను రూపమును.

'రాయవేశ్యాభుజంగు వల్లావ యిచ్చె' అనుపాఠమున 'ర-ల' యతి నంగీకరింప వలసివచ్చును. 'రాయవేశ్యాభుజంగ మర్లావ యిచ్చె'అనుపాఠమును స్వీకరించుచో యతిమైత్రి నిర్బాధమగును.

వ. ఆ గురుస్వామి నిజవంశాచారంబునకుం దగిన తలోదరిం బరిణయం బయ్యె నంత. 23

అర్థము: ఆ-గురు-స్వామి = ఆ పోలిదేవయ్య అను గురువర్యుడు, నిజ - వంశ+ఆచారంబునకున్ = తనదైన కులముయొక్క నడకకు, తగిన, తలోదరిన్ = స్త్రీని, పరిణయంబు + అయ్యెన్ = వివాహమాడెను, అంతన్ = తరువాత

తాత్పర్యము: పోలిదేవయ్య అను ఆ గురువర్యుడు తన కులము నాచారమునకుదగిన యింతిని పెండ్లియాడెను. తరువాత-పయి పద్యముతో నన్వయము.

విశేషములు: తలోదరి-అరచేతివలె పలుచని ఉదరముగలది-స్త్రీ

సీ. గౌరీతలోదరి గాఁబోలు నీ భామ
కారుణ్య విస్ఫూర్తి గలిగియుండు
శ్రీలక్ష్మి గాఁబోలు, జెలువ సౌభాగ్యంబు
దిక్కుల నెల్లనుఁబిక్కటిల్లు
వాగ్దేవి గాఁబోలు'వామాక్షి బహుశాస్త్ర
పాండిత్య విస్ఫూర్తిఁ బరిఢవించు
నింద్రాణి గాఁబోలు నిందునిభాస్య తా
బావన) ఖ్యాతిమైఁ బరఁగుచుండు

గీ. ననఁగ నే ప్రొద్దు గుణముల నతిశయిల్లి
²పరఁగు శ్రీశైలనాథుని పట్టణమునఁ
బోలిదేవయ్య కులసతి పుణ్యచరిత
ముదిత³సజ్జననికురుంబ ముమ్మమాంబ. 24

1. ము. వర్ణిత. 2. ము. పరగ. 3 తా. పరిణజిన కదంబ

గొలని రామారెడ్డి వలన (శ్రీగిరినాథు
కర్పించె భరణాలు గ)రిమతోడ(?)
భక్తి రాజాఖ్యుచేఁ బర్వతేశ్వరునకు
నర్పించెఁ [1]జెరువాలు నాతుకూరు.

గీ. ధరణిఁ ద్రిపురాంతకున కాముదాలవల్లి
రాయ వేశ్యా[2]భుజంగు వల్లావ యిచ్చె
నిట్టి పౌరుష (సంపన్నుఁ డిద్ధయశుఁడు)
పోలి దేవయ్య చెన్నారుఁ బుణ్యమూర్తి. 22

అర్థము: చేఁపూరి-భీమేశున్ = చేఁపూర్ని యందలి భీమేశ్వరుని, చెలువారన్ (చెలువు + ఆరన్) = ఒప్పునట్లుగా, గుండెలన్ = గుండెలతో, పూజ, కావించిన = చేసిన, పుణ్యమూర్తి = పున్నెము యొక్క స్వరూపము గలవాడు. కడిమి మైన్ = పరాక్రమముచేత, ఇరువత్తుగండనిచేన్, మల్లికార్జునుకున్ = మల్లికార్జునస్వామికి, ఉత్పలంబు = ఉత్పలమను గ్రామమును అర్థిన్ = కోరికతో, పడసెన్ = పొందెను. కొలని రామారెడ్డి వలనన్, శ్రీగిరినాథుకున్ = శ్రీశైల మల్లికార్జున స్వామికి, భరణాలు = జీతములు, గరిమతోడన్ = గొప్పతనముతో, అర్పించెన్ = చెల్లించెను. భక్తిరాజ + ఆఖ్యుచేన్ = భక్తి రాజను పేరుగల వానిచేత, పర్వత + ఈశ్వరునకున్ = శ్రీశైల స్వామికి, చెరువాలున్, అతుకూరున్ (అను గ్రామములను), అర్పించెన్ = ఇచ్చెను. ధరణిన్ = భూమియందు, త్రిపురాంతకునకున్ = ఈశ్వరనకు (మూడు పురములను అంతమొందించినవానికి), ఆముదాలవల్లి, రాయవేశ్యా భుజంగు వల్లావ, అను గ్రామములను, ఇచ్చెను. ధరణిన్ = భూమియందు, త్రిపురాంతకునకున్ = ఈశ్వరునకు (మూడు పురములను అంతమొదించిన వానికి),ఆముదాలవల్లి, రాయవేశ్యా భుజంగు వల్లావ, అనుగ్రామములను, ఇచ్చెన్. ఇట్టి, పౌరుష- సంపన్నుఁడు = పౌరుషమనెడి సంపద గలవాడు, ఇద్ధ-యశుఁడు = స్వచ్ఛమైన కీర్తి గలవాడు, పుణ్యమూర్తి = పున్నెము రూపుగాంచినవాడు, (అగు), పోలిదేవయ్య చెన్నారున్ = ఒప్పును.

తాత్పర్యము: కొమ్మ విభుని తమ్ముడగు పోలిదేవయ్య చేపూరి భీమేశ్వరుని గుండెలతో పూజించిన పుణ్యస్వరూపుడు. పరాక్రమమున నిరువత్తు గండని గెలిచి యతని నుండి మల్లికార్జునస్వామి కుత్పలము గ్రామమును సాధించినవాడు. కొలని రామారెడ్డి నుండి శ్రీశైల స్వామికి భరణముల నర్పించెను. భక్తిరాజనుపేరుగలవానిచే శ్రీశైల దేవునకు చెరువాలు, అతుకూరు గ్రామముల నిప్పించెను. ఆ యీశ్వరునకు ఆముదాలవల్లి, రాయవేశ్యా భుజంగు వల్లావ ఇచ్చెను. ఇట్టి పౌరుష సంపన్నుడు, నిర్మల యశస్సుగలవాడు అగు పోలిదేవయ్య పుణ్యమూర్తియై యొప్పును.

1. ము. జెరువాడు 2.తా. భుజంగమర్లావ.

విశేషములు: మల్లి కార్జును కుత్పలంబు = మల్లికార్జును + కున్ + ఉత్పలంబు `కువర్ణకంబు పరంబగునపుడుకార ఋకారంబులకు నగాగమంబగు' అను బా. వ్యా తత్సమ-28చే నగాగమమో దానిని బాధించి 'డుమంతంబునకు ద్వితీయాద్యేకవచనంబు పరంబగునపుడు నిగాగమంబు సర్వత్ర విభాషనగు' అను బా. వ్యా. తత్సమ-23 నిగాగమమో వచ్చి వచ్చి మల్లికార్జునుకున్, అనికాని, మల్లికార్జునికిన్ అనికాని కావలసియుండగా, 'కువర్ణకంబు పరంబగునపుడు కవిత్రయంబువారి ప్రయోగంబులందక్క దక్కిన మహాకవి ప్రయోగంబులందునుం గొన్నియెడల నగాగమంబు చూపట్టదు'. అను ప్రౌ.వ్యా. శబ్ద-19చే మల్లికార్జునుకున్ అను రూపము ఏర్పడినది. ఇట్లే `శ్రీగిరినాథుకున్'అను రూపమును.

'రాయవేశ్యాభుజంగు వల్లావ యిచ్చె' అనుపాఠమున 'ర-ల' యతి నంగీకరింప వలసివచ్చును. 'రాయవేశ్యాభుజంగ మర్లావ యిచ్చె'అనుపాఠమును స్వీకరించుచో యతిమైత్రి నిర్బాధమగును.

వ. ఆ గురుస్వామి నిజవంశాచారంబునకుం దగిన తలోదరిం బరిణయం బయ్యె నంత. 23

అర్థము: ఆ-గురు-స్వామి = ఆ పోలిదేవయ్య అను గురువర్యుడు, నిజ - వంశ+ఆచారంబునకున్ = తనదైన కులముయొక్క నడకకు, తగిన, తలోదరిన్ = స్త్రీని, పరిణయంబు + అయ్యెన్ = వివాహమాడెను, అంతన్ = తరువాత

తాత్పర్యము: పోలిదేవయ్య అను ఆ గురువర్యుడు తన కులము నాచారమునకుదగిన యింతిని పెండ్లియాడెను. తరువాత-పయి పద్యముతో నన్వయము.

విశేషములు: తలోదరి-అరచేతివలె పలుచని ఉదరముగలది-స్త్రీ

సీ. గౌరీతలోదరి గాఁబోలు నీ భామ
కారుణ్య విస్ఫూర్తి గలిగియుండు
శ్రీలక్ష్మి గాఁబోలు, జెలువ సౌభాగ్యంబు
దిక్కుల నెల్లనుఁబిక్కటిల్లు
వాగ్దేవి గాఁబోలు'వామాక్షి బహుశాస్త్ర
పాండిత్య విస్ఫూర్తిఁ బరిఢవించు
నింద్రాణి గాఁబోలు నిందునిభాస్య తా
బావన) ఖ్యాతిమైఁ బరఁగుచుండు
గీ. నసఁగ నే ప్రొద్దు గుణముల నతిశయిల్లి
[2]పరఁగు శ్రీశైలనాథుని పట్టణమునఁ
బోలిదేవయ్య కులసతి పుణ్యచరిత
ముదిత[3]సజ్జననికురుంబ ముమ్మమాంబ. 24

1. ము. వర్ణిత. 2. ము. పరగ. 3 తా. పరిణజిన కదంబ

అర్థము: ఈ-భామ = ఈ స్త్రీ (ప్రోలిదేవయ్య భార్య యగు ముమ్మమాంబ), కారుణ్య-విస్ఫూర్తి = దయయొక్క, అతిశయము, కలిగి + ఉండున్, గౌరీ-తలోదరి = పార్వతి యనెడు స్త్రీ, కాన్ + పోలున్ = అయియుండును. చెలువ = స్త్రీ యొక్క, సౌభాగ్యంబు = సుభగత్వము, దిక్కులన్ + ఎల్లను = అన్నిదిక్కులను, పిక్కటిల్లున్ = నిండును, శ్రీ - లక్ష్మి = శోభాయుక్తయగు లక్ష్మీదేవి, కాన్ + పోలున్. వామాక్షి = స్త్రీ, బహు.....విస్ఫూర్తిన్:బహు = పెక్కు, శాస్త్ర = శాస్త్రములందలి, పాండిత్య-విస్ఫూర్తిన్ = పాండిత్యముయెక్క అతిశయమును పరిఢవించున్ = నడుపును, వాక్ + దేవి = సరస్వతీ దేవి, కాన్ + పోలున్ ఇందు-నిభ + ఆస్య = చంద్రునితో సమానమైన ముఖముగలది స్త్రీ, తాన్ = తాను, పావన-ఖ్యాతిమైన్ = పవిత్రమైన కీర్తితో, పరఁగుచున్ + ఉండున్ = ఒప్పుచుండును, ఇంద్రాణి = ఇంద్రుని భార్యయగు శచీదేవి, కాన్ + పోలున్ అనంగన్, పుణ్య-చరిత = పవిత్రమైన నడవడి గలది, ముదిత-సత్ + జన-నికురుంబ = సంతోషించిన మంచివారి (పండిత జనుల), సమూహము గలది, లేదా, ముదిత = స్త్రీ, సజ్జన నికురుంబ = విద్వాంసుల సమూహము గలది, లేదా, ముదిత = స్త్రీ, సజ్జన నికురుంబ = కులసతి = పోలిదేవయ్య యొక్క కులస్త్రీ, ముమ్మమాంబ, ఏ-ప్రొద్దున్ = ఎల్లప్పుడును, గుణములన్ = మంచి గుణములతో, అతిశయిల్లి, శ్రీ శైలనాథుని = శ్రీశైల ప్రభువగు మల్లికార్జునుని యొక్క, పట్టణమునన్ = పట్టణమునందు, శ్రీశైలమున, పరఁగున్ = ఒప్పును.

తాత్పర్యము; [1]ఈమె దయా విశేషము గలిగి యుండును. గౌరి కాబోలును. ఈమె సౌభాగ్యములు ఎల్ల దిక్కులను నిండును. లక్ష్మీదేవి కాబోలును. ఈమె పలు శాస్త్రములందలి పాండిత్యాతిశయమును నడపును. సరస్వతీదేవి కాబోలును. ఈమె పవిత్రమైన కీర్తి గలిగి యొప్పును. శచీదేవి కాబోలు' అనునట్లు పోలిదేవయ్య కులస్త్రీయును, పవిత్రచరితయు, సంతుష్టులైన విద్వజ్జనుల సమూహముగలదియు నగు ముమ్మమాంబ యెల్లప్పుడును సద్గుణములతో నతిశయిల్లి శ్రీశైలేశ్వరుడగు మల్లికార్జునుని పట్టణమున నొప్పును.

విశేషములు: ఒక్కతెయే యగు ముమ్మమాంబ పెక్కంద్రతో పోల్ప బడుచున్నది కావున నుల్లేఖాలంకారము. ఆమెను ఒక్కొక్కరితోను హేతువుచే సమర్థించుచు పోల్చుటజేసి కావ్యలింగము. ఆమెను ఒక్కొక్కరిగా నూహించుటచే నుత్ప్రేక్షయు ఉత్ప్రేక్షోల్లేఖములకు సంకరము. వామాక్షి (వామ + అక్షి) = స్త్రీ, చక్కని కన్నులు గలది 'వల్గువామం హారి శాలి రమణీయం మనోరమమ్'-అమరము. పరిఢలిల్లు, అప్రేరణము. పరిఢవించు-ప్రేరణము 'రంజాదుల యించు కృకారంబునకు సబిందుకంబున క ప్రేరణంబున ద్విరుక్తలకారంబగు బా.వ్యా. క్రియ.71 ఇంద్రాణి -ఇంద్ర, వరుణ, భవ, శర్వ, రుద్ర, మృడ, హిమ, అరణ్య, యవ యవన, మాతుల, ఆచార్య శబ్దములకు 'ఈ'ప్రత్యయమును, అంతకుముందు 'ఆన్' అను నాగమమును వచ్చును.

ఇంద్రాణీ అనగా నింద్రుని భార్యయని యర్థము. ముదిత-స్త్రీయను నర్థమున తెలుగు. ముదిత సజ్జన నికురుంబ అని సమాసము చేసినచో సంస్కృతము `సజ్జన'విశేషణము. వాక్ + దేవి = వాగ్దేవి, అనునాసికాంతస్థ వర్ణములు తప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని అచ్చులు కాని పరమగునపుడు ఆ హల్లుల వర్గమునకు చెందిన తృతీయ వర్ణ మాదేశముగా వచ్చును. సత్ + జన = సద్ + జన-సకార త వర్గములకు శవర్గ చ వర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్గ చవర్గ వర్ణము లాదేశమగును. సజ్ + జన- సజ్జన.

ఉ *పోలయ ముమ్మమాంబికలు పుణ్యాచరిత్రుల రక్తియుక్తులం
బోలఁగఁ గాంచి రేడ్వురను బుణ్యా ఋషీశ్వర సప్తతుల్యులం
బోలిన పుత్త్రసప్తకము భూత హితార్థగుణ ప్రవృత్తికై
లాలిత విక్రమోన్నతుల లక్షణ దివ్య విచక్షణాత్ములన్ 25

అర్థము: పోలయ ముమ్మమాంబికలు=పోలిదేవయ్యయును, ముమ్మమాంబయును, భూత......కై: భూత = ప్రాణులయొక్క, హిత అర్థ = మేలుకొఱకైన, గుణ = గుణములయొక్క, ప్రవృత్తికై = ప్రవర్తనము + ము కయి. పుణ్యా-చరిత్రులన్ = పవిత్రమయిన నడవడిగల వారును, భక్తి-యుక్తులన్ = భక్తితో కూడుకొన్నవారును, పుణ్యా....తుల్యులన్: పుణ్యా = పవిత్రులైన, ఋషి + ఈశ్వర-సప్త = ఏడుగురు మునిశ్రేష్ఠులతో, తుల్యులన్ = సమానులైనవారును, లాలిత-విక్రమ + ఉన్నతులన్ = మనోహరమైన, పరాక్రమముచే, గొప్పవారును, లక్షణ......ణాత్ములన్:లక్షణ = స్వభావముచే, దివ్య = ఒప్పునదియైన, విచక్షణ + ఆత్ములన్: లక్షణ = స్వభావముచే, దివ్య = ఒప్పునదియైన, విచక్షణ + ఆత్ములన్ = జ్ఞానము స్వరూపముగాగల వారును, (అగు)పోలిన = ఒప్పిన, పుత్త్ర-సప్తకమున్ = ఏడుగురు కొడుకులను, ఏడ్వురను, పోలఁగన్ = ఒప్పునట్లు, కాంచిరి = కనిరి.

తాత్పర్యము: పోలి దేవయ్యయు, ముమ్మమాంబయు ప్రాణులమేలుకొఱకైన గుణముల ప్రవర్తనముకయి యేడుగురు కొడుకులను గనిరి. వారు పవిత్రమైన నడవడి గలవారు, భక్తిగలవారు, పుణ్యాత్ములైన సప్తర్షులతో సమానులు, మనోహరమైన పరాక్రమముచే ఉన్నతులు, ఒప్పెడు జ్ఞానము స్వరూపముగా గలవారు.

విశేషములు: ఋషీశ్వర సప్త: మరీచి, అత్రి, అంగిరుడు, పులస్త్యుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని వసిష్ఠుడు అని యింకొక క్రమము.`పోలఁగఁగాంచి రేడ్వురను'అన్న తరువాత మరల `పుత్త్ర సప్తకము' అనుట అనావశ్యకము. పుణ్యా

* ఈ పద్యము తాళపత్రగ్రంథమున లేదు.

ఋషీశ్వర సప్తతుల్యులన్-పుణ్య ఋషీశ్వర సప్తకతుల్యులన్ అనుట బాగు. కాని గణభంగ మగును.

సీ. రామామనోహరరతిరాజ[1]నిభుఁడు శ్రీ
మల్లినాథాఖ్యుండు మహిమ వెలయు
(ధర్మార్థ సం)చార నిర్మల స్వాంతుండు
శ్రీగిరి నాథయ్య చెలువు మీఱుఁ
బరమ శైవాచార పాండిత్య గరిమల
[2]సెట్టి దేవాఖ్యుండు చెన్ను మీఱు
వైభవ ప్రఖ్యాత వర హరిశ్చంద్రుండు
భీమేశ్వర స్వా(మి పెంపు మీఱు)

గీ. వెలయు ముమ్మడి దేవయ్య వినుతకీర్తి
ఘనుఁడు కొమరగిరీంద్రుండు గలిగియుండు
(భూతిఁ)బోతలింగాఖ్యుండు పొలుపు మీఱు
సప్త ఋషులకు నే ప్రొద్దు సము (లనంగ.) 26

అర్థము: సప్త + ఋషులకున్, ఏ-ప్రొద్దున్=ఎల్లప్పుడును, సములు + అనంగన్: సమానులనునట్లు రామా....నిభుండు: రామా = స్త్రీలయొక్క, మనస్(సః) + హర = మనస్సును హరించునట్టి, రతి-రాజ = రతిదేవి భర్త యైన మన్మథునితో, నిభుండు = సమానుండు; (అగు), శ్రీ మలినాథ + ఆఖ్యుండు = శ్రీ మల్లినాథుడను పేరుగలవాడు, మహిమన్ = గొప్పతనముతో, వెలయున్ = ప్రకాశించును. ధర్మార్థ........స్వాంతుండు: ధర్మ + అర్థ = ధర్మమనెడి పురుషార్థము యొక్క, సంచార = మంచి ఆచరణముచే, నిర్మల = స్వచ్ఛమైన, స్వాంతుండు = మనస్సుగలవాడు, (అగు),శ్రీగిరినాథయ్య, చెలువు-మీఱున్ = మిక్కిలి యొప్పును. పరమ......గరిమలన్: పరమ = గొప్ప, శైవ + ఆచార = శైవమతము యొక్క ఆచరించుట యందలి, పాండిత్య = పాండిత్యము యొక్క, గరిమలన్ = గొప్పతనము (ల)చేత, సెట్టి దేవ + ఆఖ్యుండు = సెట్టిదేవయ్య అనుపేరుగలవాడు, చెన్ను-మీఱున్ = మిక్కిలి యొప్పును. వైభవ.......హరిశ్చంద్రుండు: వైభవ = సంపదచే, ప్రఖ్యాత = ప్రసిద్ధుడైన, వర = శ్రేష్ఠుడైన, హరిశ్చంద్రుండు, (అగు), భీమేశ్వర-స్వామి, పెంపు-మీఱున్ = మిక్కిలి అతిశయించును. ముమ్మడి దేవయ్య, వినుత-కీర్తిన్ = మిక్కిలి స్తుతింపబడిన కీర్తిచే, వెలయున్ = ప్రకాశించును, ఘనుడు = గొప్పవాడు, అగు, కొమరగిరి + ఇంద్రుండు = కొమరగిరి స్వామి, భూతిన్ = సంపదను, కలిగి + ఉండున్. పోతలింగ + ఆఖ్యుండు = పోతలింగయ్య అనుపేరగలవాడు, పొలుపు-మీఱున్ = మిక్కిలి యొప్పును.

1.తా. నిభుఁడనా. 2.తా. చిట్టి

తాత్పర్యము: ముమ్మమాంబా పోలిదేవయ్యలకు ఎప్పుడును సప్తర్షులతో సమానులనదగిన కొడుకు లేడుగురు గలరు. వారిలో శ్రీ మల్లినాథుడను పేరుగల వాడు ఇంతుల మనస్సులను హరించు మన్మథునితో సమానుడు. శ్రీ గిరినాథుడు ధర్మాచరణముచే స్వచ్ఛమైన మనస్సు గలవాడు, సెట్టి దేవయ్య వీరశైవాచార పాండిత్య గరిమచే మిక్కిలి యొప్పును. భీమేశ్వర స్వామి వైభవమునందు హరిశ్చంద్రుడై పెంపొందును. ముమ్మడి దేవయ్య గొప్పకీర్తి గలిగి వెలయును. కొమరగిరి సంపద గలిగి యొప్పును. పోతలింగయ్య పొలుపారును.

క. వారల లోపల సెట్టియ
ధారుణి శ్రీపర్వతేశు దండాధీశుం
డారయ ననగా వెలసెను
గారణజన్ముండు. నవ్య కావ్యా సక్తిన్ 27

అర్థం: వారలలోపలన్ = ఆ యేడుగురు కొడుకులలోను, కారణ జన్ముండు = ఒక మహాకావ్యమును నిర్వహించుటకు కారణమైన జన్మము గలవాడు, సెట్టియ =సెట్టిదేవయ్య, ధారుణిన్ = భూమియందు, అరయన్ = చూడగా, శ్రీపర్వత + ఈశు = శ్రీశైలేశ్వరుడైన మల్లికార్జునుని యొక్క, దండ + అధి + ఈశుండు = సేనాధిపతి, అనగాన్, నవ్య-కావ్య + ఆసక్తిన్ = క్రొత్త కబ్బములందలి కోరికలతో, వెలసెను = ప్రకాశించెను.

తాత్పర్యము: ఆ యేడుగురు కొడుకులలోను కారణ జన్ముడైన సెట్టిదేవయ్య శ్రీశైలేశ్వరుని సేనాధిపతియనగా నవీన కావ్యములందాసక్తి గలవాడై ధరణిలో వెలసెను.

సీ. (శివరాత్రి నిత్యంబుఁ జెల్లించు విఖ్యాతి
బసువయ్య దండాధిపాటివాఁడు)
లింగార్చన క్రియా (లీలల నే ప్రొద్దు
సురియ చౌడాధీశు సొబగువాఁడు)
పరమలింగ ధ్యాన పారీణ సద్బుద్ధి
నల్లమ ప్రభులీల నలరువాఁడు
[1]రుచ్యర్పణ క్రియా రూఢి నిద్ధారణి
మాదర చెన్నయ్య మహిమవాఁడు

గీ. చెలఁగె గురులింగజంగమ సేవకుండు
మల్లికార్జున శివునకు మంత్రి యనఁగఁ
దూర్పునా డెల్లఁ బాలించు నేర్ప రతఁడు
శ్రీ సమేతుఁడు పోలయసెట్టి విభుఁడు 28

1. తా రిచ్యయన క్రియాలీలల నిద్రాత్రి

అర్థము: గురులింగ జంగమ సేవకుండు = గొప్పదియగు లింగము గల జంగము దేవర యొక్క సేవకుడు, శ్రీ-సమేతుండు = సంపదతోగూడు కొన్నవాడు, (అగు)పోలయసెట్టి-విభుఁడు = పోలయకొడుకైన సెట్టి ప్రభువు. శివరాత్రిన్ = శివరాత్రి విధిని, నిత్యంబున్ = ఎల్లప్పుడును, చెల్లించుట యనెడి, పనియొక్క, విలాసములందు, ఏ-ప్రొద్దున్ = ఎల్లప్పుడును, సురియ-చౌడ + అధి + ఈశు = సురియ చౌడప్రభువుయొక్క, సొబగువాడు=అందము గలవాడు-చౌడాధీశుని వంటివాడని భావము. పరమ.....సద్బుద్ధిన్: పరమ = ఉత్కృష్టమగు, లింగ =శివ లింగము యొక్క, ధ్యాన = ధ్యానము యొక్క, పారీణ = పారమును ముట్టిన, సత్ + బుద్ధిన్ = మంచి బుద్ధియందు, అల్లమ-ప్రభు-లీలన్ = అల్లమ రాజు విధమున, అలరువాడు = ఒప్పునట్టివాడు. రుచ్య.......రూఢిన్ = రుచి + అర్పణ = చవియైనదాని యొక్క ఇచ్చుట యనెడు, క్రియా = పనియొక్క, రూఢిన్ = ప్రసిద్ధియందు, ఇద్ధారణిన్ (ఈ+ధారణిన్) = ఈ భూమియందు, మాదర చెన్నయ్య-మహిమ-వాఁడు = మాదర చెన్నయ్య మహిమవంటి మహిమగలవాడు. మల్లికార్జున-శివునకున్ = మల్లికార్జునుడనెడి శ్రీశైలేశునకు, మంత్రి + అనంగన్, చెలంగెన్ = ఒప్పెను. అతఁడు = ఆ సెట్టి దేవయ్య, తూర్పునాడు = ఎల్లన్ = తూర్పుదేశమంతయు, పాలించు = ఏలు, నేర్పరి.

తాత్పర్యము : లక్ష్మీ యుక్తుడగు పోలయసెట్టి దేవయ్యా గొప్పదియైన శివలింగమును ధరించిన జంగము దేవర సేవకుడైనవాడు శ్రీశైల మల్లికార్జునుని మంత్రియన నొప్పెను. అతడు తూర్పుదేశము నంతను పాలించు నేర్పుగలవాడు. అతడు శివరాత్రి విధిని నిత్యమును చెల్లించుటలో బసువయ్యా దండనాయకుని వంటివాడు. శివలింగ పూజయందెల్లప్పుడును సురిచౌడప్రభువును బోలినవాడు. పరమలింగధ్యాన పారంగతమైన సద్బుద్ధియందు అల్లమరాజువంటి వాడు. చవిగల వస్తువు నర్పించుటయందు మాదర చెన్నయ్య మహిమగలవాడు.

విశేషములు: నేర్పరతండు-నేర్పరి + అతడు. ఇత్వసంధిగా సాధింపవచ్చును.

వ. అమ్మహాత్ముండు దన [1]వర్ణంబునకుం దగిన వర్ణనీయయగు సాధ్వి వివాహంబయ్యెనంత. 29

అర్థము: ఆ + మహత్(మహా) + ఆత్ముండు = ఆ మహానుభావుండు(సెట్టి దేవయ్య), తన = తనయొక్క, వర్ణంబునకున్ = రూపమునకు, (కులమునకు), తగిన, వర్ణనీయ + అగు = వర్ణింపదగినదియగు, సాధ్విన్ = పతివ్రతను, వివాహంబు + అయ్యెన్ = పెండ్లియాడెను, అంతన్ = తరువాత.

తాత్పర్యము: గొప్పవాడగు ఆ సెట్టిదేవయ్య తన రూపము (కులము)నకు తగిన ఉత్తమురాలిని పెండ్లాడెను. పిమ్మట-పయి పద్యముతో నన్వయము.

1. ము. వర్ణనంబునకు.

సీ. పార్వతీమూర్తియు భారతీదేవియు
నిందిరారూపంబు నింద్రుసతియు
రోహిణీదేవియు రుక్మిణీ[1]దేవియు
స్వాహా స్వధా తుల శక్తిచయము
గంధర్వసతులును గందర్పు భామయుఁ
గశ్యపు సాధ్వులుఁ గ్రతువు[2]సతియు
వర వసిష్ఠుని రాణి ధరఁ గుంభసంభవు
రామయు నాదిత్యు రమణిఁ గూడి

గీ. ధరణి నొక్కటఁ బుట్టించె ధాత[3]యనఁగ
మగువ సెట్టి దేవాఖ్యుని మారమాంబ
సకల సద్గుణ విఖ్యాత[4]సౌమనస్య
మహిత పంచాక్షరీ మంత్ర[5] మంజులాత్మ. 30

అర్థము: సెట్టి దేవ + ఆఖ్యుని =సెట్టి దేవయ్య అనుపేరుగలవాని యొక్క, మారమాంబ = (భార్యయైన)మారమ, (అగు), మగువ = స్త్రీ పార్వతీ-మూర్తియున్ = పార్వతీదేవి యొక్క ఆకారమును, భారతీ -దేవియున్ = సరస్వతీ దేవియు, ఇందిరా -రూపంబున్ = లక్ష్మీదేవి సౌందర్యమును, ఇంద్రు సతియున్ = ఇంద్రుని భార్యయైన శచియు, రోహిణీ-దేవియున్ = చంద్రునిభార్య యగు రోహిణియు, రుక్మిణీ-దేవియున్ = శ్రీకృష్ణుని భార్యయగు రుక్మిణియు, స్వాహా-స్వధా + అతుల శక్తి-చయమున్=స్వాహా, స్వధ అను అగ్నిదేవుని భార్యలయొక్క, సాటిలేని, శక్తుల యొక్క, సమూహమును. గంధర్వ-సతులును = గంధర్వాంగనలును, కందర్పు-భామయున్ = మన్మథుని ఇంతి (భార్య)యగు రతీదేవియును, కశ్యపు-సాధ్వులున్ = కశ్యపప్రజాపతి యొక్క భార్యలగు దితి, అదితియును, క్రతువు-సతియున్ = క్రతువనెడి పేరు గల ఋషి భార్యయగు క్రియయును. వర-వసిష్ఠుని-రాణి = శ్రేష్ఠుడైన వసిష్ఠమహర్షియొక్క భార్య యగు అరుంధతియు, కుంభ సంభవు-రామయున్ = అగస్త్యుని స్త్రీ (భార్య)యగు లోపాముద్రయు, ఆదిత్యు-రమణిన్ =సూర్యుని భార్యయగు ఛాయాదేవియు, ధరన్ = భూమియందు, కూడి-కలిసి, ధాత = బ్రహ్మ, ధరణిన్ = భూమియందు, ఒక్కటన్ = ఏకకాలమున, పుట్టించెన్ + అనంగన్ = పుట్టించెననునట్లు, సకల-సత్ + గుణ-విఖ్యాత = ఎల్ల మంచి గుణములచే ప్రసిద్ధి కెక్కిన, సౌమనస్య = సుమనోభావము గలది, మహిత.......మంజులాత్మ: మహిత = గొప్పదియగు, పంచాక్షరీ-మంత్ర = నమశ్శివాయ అను అయిదక్షరముల మంత్రము వలె, మంజుల = మనోహరమైన, ఆత్మ = మనస్సు గలది.

1. తా. నాతియు. 2. ము. సతులు. 3. తా. నాఁగ. 4. ము. సారసాఖ్య 5. మానసాత్మ.

తాత్పర్యము : పార్వతిని, సరస్వతిని, లక్ష్మిని, శచిని, రోహిణిని, రుక్మిణిని, స్వాహా స్వధల శక్తులను, గంధర్వాంగనలను, రతిని, దితిని, అదితిని, క్రియను, అరుంధతిని, లోపాముద్రను, ఛాయను బ్రహ్మ ఒక్కట గూర్చి సెట్టి దేవయ్య భార్యయగు మారమను భూమియందు పుట్టించెనాయనునట్లు ఆమె యెల్ల సద్గుణములచే ప్రసిద్ధమైన సుమనోభావము గలిగి మహిత పంచాక్షరీ మంత్రమువలె మనోహరయై యొప్పును.

విశేషములు : పద్యము 'ధరన్,' 'ధరణిన్,' అను ఏకార్థకములయిన శబ్దములు రెండునిట అనావశ్యకమని తోచుచున్నది. సుమనసః భావః-సౌమనస్యమ్. దేవత్వము. సుమనశ్శబ్దమునకు పుష్పమను నర్థము కూడగలదు గాని యిచ్చట దేవుడను నర్థమే పొసగునని తోచుచున్నది. ఏలయన ఇందు చెప్పబడిన స్త్రీలందఱు దేవతలే. బ్రహ్మ అయా స్త్రీల నందఱన్ నొక్కచోట గూర్చి మారమను జేసెనాయని కావున అలంకారము ఉత్ప్రేక్ష మారమను ...

ు = తామరవంటి చయి, శంకర......పాదము
...జచేత. ప్రశస్త = ప్రసిద్ధి కెక్కిన, దీక్షా =
జనులకు సంతోషము. అనగన్, పండిత - చెన
మల్లికార్జునునకున్ = పండితుడైన చెన మల్లి కార్జునునకు, పౌత్త్ర-రత్నంబు = శ్రేష్ఠుడైన మనుమడు, సెట్టి-య-ప్రభు-సుతుండు = పోలయ సెట్టి విభుని యొక్క కొడుకు, మారమాంబా-తనూజుండు = మారమాంబ కొడుకు, మహిత-యశుడు = గొప్పకీర్తి గలవాడు, వినుత-కీర్తి = విశేషముగా స్తుతింపబడిన కీర్తిగలవాడు, అగు, ముమ్మడి దేవయ్య, వెలయున్ = ప్రకాశించును.

తాత్పర్యము: పండితుడైన చెన మల్లికార్జునుని పౌత్త్రుడును, పోలయ సెట్టి కొడుకును, మారమాంబ కుమారుడును గురువును అగు ముమ్మడి దేవయ్య గొప్ప కీర్తికలవాడయి వెలయును-అతని సంభాషణలు పంచాక్షరి మంత్రమనెడి పారిజాతవృక్షము నుండి పుట్టిన ఫలములు. అతని మహిమ ప్రభావాధారముచే విమలమైన మార్గముచేత మిక్కిలి శాశ్వతము. అతని అడుగుల జంట ఎల్లదేశముల ప్రభువుల నమస్కారములకు ముఖ్యముగా యోగ్యమైనది. అతని కేలు దమ్మి ఈశ్వర పూజచే ప్రశస్తమైన దీక్షగల జనులకు సంతోషదాయకము.

విశేషములు: పంచాక్షరీ మంత్ర పారిజాత -పంచాక్షరీ మంత్రమనెడి పారిజాతము రూపకాలంకారము. హస్తాంబు జాతము- అంబుజాతము వంటి హస్తము -ఉపమానోత్తరపద కర్మధారయము.

అర్థము : సెట్టియ-భీముఁడు = సెట్టి దేవయ్య కొడుకగు భీముడు, పారావార-గభీరుఁడు = సముద్రమువలె గంభీరుడును, నారీ-జన-మన్మథుండు = స్త్రీల యొక్క సమూహమునకు మన్మథుడైన వాడును, నర-నుతుడు = మనుష్యులచే పొగడబడువాడును, అనగాన్, ఎపుడున్ = ఎప్పుడును, వారక = అవశ్యము, వైభవము + అలరన్ = విభవము, ఒప్పగా, ధారణిన్ + భూమియందు, వర్ధిల్లున్ = వృద్ధిపొందును.

తాత్పర్యము: సెట్టి దేవయ్య కొడుకగు భీముడు సముద్రమువలె గంభీరుడును

...నులపాలిటి మన్మథుడును, మనుష్యులచే పొగడబడు

తప్పక విభవ మొప్పగా

అనువానియందలి, అంచిత......ప్రసంగతిని: అంచిత = ఒప్పిన, ధర్మ = ధర్మములకు సంబంధించిన, కథా = కథల యొక్క, కూడికయందును, యాగ-విశేష-సూత్రములన్ = యజ్ఞ సంబంధి విశిష్టములైన సూత్రములందును, ఆయత-శక్తి-సుభక్తి-యుక్తుఁడు + ఐ = ఎక్కువయగు శక్తి, గొప్ప భక్తియనువానితో కూడు కొన్నవాడయి, చెప్పన్ + ఒప్పెడున్ = ప్రశంసించుటకు తగును.

తాత్పర్యము: శ్రీశైలమునకు తూర్పున సద్భక్తి మహత్త్వము, ఆగమవేదశాస్త్రములందలి ధార్మిక కథల కూడిక యందును యజ్ఞ సంబంధి విశిష్ట సూత్రములందును గొప్పశక్తి భక్తులతో కూడుకొన్నవాడయి ప్రోల గురుని కొడుకగు సెట్టి దేవయ్య కుమారుడైన ముమ్మడి దేవయ్య ప్రశంసార్హుడగును.

విశేషములు : ఈ పద్యమును నన్వయ మంత తృప్తికరముగా లేదు.

క. వారక (సెట్టియ వీరన)
సారార్థము లయిన [1]కృతుల సభలోపలఁ దా
గారా మారఁగఁ బలికిన
శారద యీ[2]రూ పనంగ జగతిఁ జరించున్ 36

అర్థము: సెట్టియ వీరన = పోలయ సెట్టి కుమారుడగు వీరన, వారక = అడ్డులేకుండగా, సార + అర్థములు = శ్రేష్ఠములయిన అర్థములు గలవి, అయిన, కృతులన్ = కావ్యములను, సభలోపలన్, తాన్ = తాను, గారాము + అరఁగన్ = గొప్పతనము నిండగా, పలికినన్ = పలుకగా, శారద = సరస్వతి, ఈ -రూపు + అనంగన్ = ఈ రూపమనగా, జగతిన్ = జగమునందు, చరించున్ = వర్తిల్లును.

1.తా. శ్రుతుల. 2.తా. రూపునందు.

గీ. మనఁగఁ బండిత చెన మల్లికార్జుననకుఁ
బౌత్త్ర రత్నంబు సెట్టియ ప్రభుసుతుండు
మారమాంబా తనూజుండు మహితయశుఁడు
వెలయు ముమ్మడి దేవయ్య వినుత కీర్తి 34

అర్థము: ఏ-గురువు = ఏ గురువు యొక్క (గురువైన ఏ ముమ్మడి దేవయ్య యొక్క), సంభాషణములు = మాటలు, పంచా......ఫలములు: పంచాక్షరీ-మంత్ర = నమశ్శివాయ'అనెడి అయిదక్షరముల మంత్రమనెడి, పారిజాత + ఉద్భూత = పారిజాత వృక్షము నుండి పుట్టిన, ఫలములు = పండ్లు. ఏ -గురు-స్వామి = ఏగురు శ్రేష్ఠుని యొక్క, మహిమ, వీర.....శాశ్వతంబు: వీర-శైవ + ఆచార = వీరశైవమతము యొక్క ఆచరణముచే, విమల = స్వచ్ఛమైన, మార్గ = త్రోవచేత, అనూన = తక్కువ కాని విధమున, శాశ్వతంబు = స్థిరము. ఏ-గురు మూర్తి = ఏ గురువు యొక్క, పాద-యుగళి = అడుగుల జంట. నిఖి....పాత్రము:నిఖిల = ఎల్ల, దేశ = దేశముల యొక్క, అధీశ = రాజులయొక్క, నివహ = సమూహము యొక్క, ప్రణామ = నమస్కారములకు, ఏక = ముఖ్యమైన పాత్రము = యోగ్యము. ఏ-గురువు = ఏగురువు యొక్క, హస్త + అంబు జాతము = తామరవంటి చేయి, శంకర......హ్లాదము: శంకర =శివుని యొక్క, పూజా = పూజచేత, ప్రశస్త = ప్రసిద్ధి కెక్కిన, దీక్షా = దీక్షకల, జన + అహ్లాదము = జనులకు సంతోషము. అనగన్, పండిత - చెన మల్లికార్జుననకున్ = పండితుడైన చెన మల్లి కార్జుననకు, పౌత్త్ర-రత్నంబు = శ్రేష్ఠుడైన మనుమడు, సెట్టి-య-ప్రభు-సుతుండు = పోలయ సెట్టి విభుని యొక్క, కొడుకు, మారమాంబా-తనూజుండు = మారమాంబ కొడుకు, మహిత-యశుడు = గొప్పకీర్తి గలవాడు, వినుత-కీర్తి = విశేషముగా స్తుతింపబడిన కీర్తిగలవాడు, అగు, ముమ్మడి దేవయ్య, వెలయున్ = ప్రకాశించును.

తాత్పర్యము: పండితుడైన చెన మల్లికార్జునుని పౌత్త్రుడును, పోలయ సెట్టి కొడుకును, మారమాంబ కుమారుడును గురువును అగు ముమ్మడి దేవయ్య గొప్ప కీర్తికలవాడయి వెలయును-అతని సంభాషణలు పంచాక్షరీ మంత్రమనెడి పారిజాతవృక్షము నుండి పుట్టిన ఫలములు. అతని మహిమ వీరశైవాచారముచే విమలమైన మార్గముచేత మిక్కిలి శాశ్వతము. అతని అడుగుల జంట ఎల్లదేశముల ప్రభువుల నమస్కారములకు ముఖ్యముగా యోగ్యమైనది. అతని కేలు దమ్మి ఈశ్వర పూజచే ప్రశస్తమైన దీక్షగల జనులకు సంతోషదాయకము.

విశేషములు: పంచాక్షరీ మంత్ర పారిజాత -పంచాక్షరీ మంత్రమనెడి పారిజాతము రూపకాలంకారము. హస్తాంబు జాతము- అంబుజాతము వంటి హస్తము -ఉపమానోత్తరపద కర్మధారయము.

ఉ. శ్రీగిరి తూర్పుదేశమునఁ జెన్నగు భక్తి మహత్త్వ (మర్థిఁదా
నాగమ వేదశాస్త్రముల నంచిత ధర్మ కథా ప్రసంగతిన్
(యాగ)విశేష సూత్రముల నాయత శక్తి సుభక్తి (యుక్తుఁడై)
శ్రీ గురుఁడైన ప్రోలగురు సెట్టియ ముమ్మయ చెప్పనొప్పెడున్. 35

అర్థము; శ్రీగురుడు + ఐన = శోభాయుక్తుడైన గురుడగు, ప్రోలగురు-సెట్టియ-ముమ్మయ = ప్రోలామాత్యుడును గురుని యొక్క కుమారుడగు సెట్టి దేవయ్య కొడుకగు ముమ్మయ, శ్రీ-గిరి = శ్రీశైలమునకు, తూర్పుదేశమునన్ = తూర్పుగా నున్న దేశమునందు, చెన్ను + అగు = అందమగు-ఒప్పునట్టి, భక్తి-మహత్త్వము = భక్తియొక్క గొప్పతనము, అర్థిన్ = కోరికతో, తాను, ఆగమ-వేద-శాస్త్రములన్ = దేవపూజావిధానమును దెలుపు శాస్త్రములు, వేదములు, మీమాంసాది శాస్త్రములు అనువానియందలి, అంచిత......ప్రసంగతిన్: అంచిత = ఒప్పిన, ధర్మ = ధర్మములకు సంబంధించిన, కథా = కథల యొక్క, కూడికయందును, యాగ-విశేష-సూత్రములన్ = యజ్ఞ సంబంధి విశిష్టములైన సూత్రములందును, ఆయత-శక్తి-సుభక్తి-యుక్తుఁడు + ఐ = ఎక్కువయగు శక్తి, గొప్ప భక్తియనువానితో కూడు కొన్నవాడయి, చెప్పన్ + ఒప్పెడున్ = ప్రశంసించుటకు తగును.

తాత్పర్యము: శ్రీశైలమునకు తూర్పున సద్భక్తి మహత్త్వము, ఆగమవేదశాస్త్రములందలి ధార్మిక కథల కూడిక యందును యజ్ఞ సంబంధి విశిష్ట సూత్రములందును గొప్పశక్తి భక్తులతో కూడుకొన్నవాడయి ప్రోల గురుని కొడుకగు సెట్టి దేవయ్య కుమారుడైన ముమ్మడి దేవయ్య ప్రశంసార్హుడగును.

విశేషములు : ఈ పద్యమును నన్వయ మంత తృప్తికరముగా లేదు.

క. వారక (సెట్టియ వీరన)
సారార్థము లయిన [1]కృతుల సభలోపలఁ దా
గారా మారఁగఁ బలికిన
శారద యీ[2]రూ పనంగ జగతిఁ జరించున్ 36

అర్థము: సెట్టియ వీరన = పోలయ సెట్టి కుమారుడగు వీరన, వారక = అడ్డులేకుండగా, సార + అర్థములు = శ్రేష్ఠములయిన అర్థములు గలవి, అయిన, కృతులన్ = కావ్యములను, సభలోపలన్, తాన్ = తాను, గారాము + ఆరఁగన్ = గొప్పతనము నిండగా, పలికినన్ = పలుకగా, శారద = సరస్వతి, ఈ -రూపు + అనంగన్ = ఈ రూపమనగా, జగతిన్ = జగమునందు, చరించున్ = వర్తిల్లును.

1.తా. శ్రుతుల. 2.తా. రూపునందు.

తాత్పర్యము : పోలయ సెట్టి కుమారుడగు వీరన సభలో సారవంతములయిన యర్థములుగల కావ్యములను గొప్పగా చెప్పగా నితడు సరస్వతి యన లోకమున సంచరించును.

ఆ.వె. (వారిలోన వెలసె వరజయ గండఁడు
జ్జ)లాఖ్య మాన భీకరుండు
బసవ శంకరుండు వరవాది మండూక
భయదపన్నగుండు [1]భక్తి ఘనుఁడు 37

అర్థము: వారిలోనన్ = వారిలోపల, వరజయగండఁడు = వరజయ గండడను బిరుదగల, బిజ్జల + అఖ్య = బిజ్జలుడను పేరుగల, మాన-భీకరుండు = కోపముచే భయము గల్గించువాడు, బసవ శంకరుండు, పరవాది.......పన్నగుండు: పరవాది = శత్రువులయిన వాదించువారు అనెడు, మండూక = కప్పలకు, భయద = భయంకరమైన, పన్నగుండు = పామయినవాఁడు, భక్తి-ఘనుఁడు = భక్తిచేత, గొప్పవాడు.

క. [2]శ్వేతాంబరుఁ బొలియించిన
ఖ్యాతచరిత్రుండు జైనకాకోదర తా
ర్క్ష్యా తత బిరుదాంకుఁడు సం
జాత ప్రవిలీన బిరుద [3]సమ్మతుఁ డెలమిన్ 38

అర్థము: శ్వేత + అంబరున్ = జైన మతస్థుని, పొలియించిన = చంపిన, ఖ్యాత - చరిత్రుండు = ప్రసిద్ధమైన చరిత్ర గలవాడు, జైన .....దాంకుండు: జైన = జైన మతస్థులనెడు, కాకోదర = పాములకు, తార్క్ష్య = గరుత్మంతుడు, అను, అతత బిరుద = గొప్ప, బిరుదు, అంకుఁడు = గుఱుతుగా గలవాడు సంజాత .....సమ్మతుఁడు సంజాత ప్రవిలీన - బిరుద = సంజాత ప్రవిలీన' అను బిరుదుచే సమ్మతుడు = అంగీకరింపబడినవాడు, ఎలమిన్ = సంతోషముతో

తాత్పర్యము: 'జైనమతస్థుని చంపిన ప్రసిద్ధ చరిత్రుడును, జైనులనెడు పాములకు గరుత్మంతు డను గొప్ప బిరుదు గలవాడును, సంజాత ప్రవిలీన 'అను బిరుదుచే సమ్మతుడును అగు నతడు సంతోషముతో - పయి పద్యముతో నన్వయము.

చ. పరిణయ మయ్యెఁ గాంత గులబా[illegible]ని రుద్రయ పుత్త్రి శాంకరిన్
[4]సరసకలాభిరామ కుల సంస్తుత పుణ్య చరిత్ర యుక్తయై
యరయఁగఁ బుట్టినట్టి త్రిపురాంబిక కూఁతురు భాగ్యదేవతన్
బరమ పతివ్రతా నిలయ భాసుర నిర్మల గాత్రి నర్థిమై 39

అర్థము : కాంతన్ = కోరదగిన దానిని (స్త్రీని)- మిగుల జక్కని దానిని,

1. తా. భక్త 2. ము. పీతాంబరు 3. తా. సమ్మదు. 4. తా. సరళకులాభిరామ.

కుల-భామినిన్ = కులస్త్రీని, రుద్రయ పుత్త్రిన్ = రుద్రయ కొమార్తెను, శాంకరిన్, శంకరునకు సంబంధించిన దానిని, శంకర భక్తురాలిని, సరస ......యై: సరస = రసవంతమైన, కలా = కళలచే, అభిరామ = మనోహరమైన, కుల = కులమునందు, సంస్తుత = మిక్కిలి పొగడబడిన, పుణ్య = పవిత్రమైన చరిత్ర = నడవడితో, యుక్త + ఐ = కూడినదయి, అరయఁగన్ = చూడగా, పుట్టిన + అట్టి, త్రిపురాంబిక-కూతురు(ను), భాగ్య-దేవతన్ = అదృష్ట దేవతను, పరమ - పతివ్రతా -నిలయన్ = గొప్ప పాతివ్రత్యమునకు స్థానమైన దానిని, భాసుర ....గాత్రిన్:భాసుర = ప్రకాశించునట్టియు, నిర్మల = స్వచ్ఛమమయినట్టియు, గాత్రిన్ = శరీరము గలదానిని, అర్థిమైన్ = కోరికతో, పరిణయము + అయ్యెన్ = వివాహమాడెను.

తాత్పర్యము : అతడు కాంతయు, కులస్త్రీయు, రుద్రయపుత్త్రియు, శంకర భక్తురాలును, కళలచే మనోహరమైన కులమునందు పొగడబడిన పవిత్ర చరిత్రముతో గూడినదియు, త్రిపురాంబిక కూతురు, భాగ్యదేవతయు, పరమ పాతివ్రత్యమునకు స్థానమయినదియు, ప్రకాశించునట్టియు, నిర్మలమయినట్టియు శరీరము గలదియు నైన స్త్రీని వివాహమాడెను.

విశేషములు: కాంతన్, కులభామినిన్......మున్నగు విశేషణము లన్నియు ద్వితీయాంతములయి యుండగా `త్రిపురాంబిక కూఁతురు' అనునది ప్రథమాంతముగా నుండుట విచార్యము. ద్వితీయాంత మయినచో `కూఁతును' అనియుండవలయును. పరమ పతివ్రతా నిలయన్ అనుచో పాతివ్రత్యమను భావార్థక రూపమునకు బదులు పతివ్రత యని ప్రయోగించుట గమనింపదగినది.

సీ. పరమ పాతివ్రత్య భావంబు తలఁపంగ
గౌరి గాఁబోలు నీ కాంత తలఁప
సకల సంప త్స్ఫూర్తి చాతుర్య మహిమల
నిందిర గాఁబోలు నిందువదన
సకల విద్యాప్రౌఢి సడిసన్న గరిమల
భారతి [1]గాఁబోలు భామ యెపుడు
సర్వలక్షణగుణసంపన్నతోన్నతి
నింద్రాణి గాఁబోలు నిగురుబోణి

గీ. యనఁగ నిద్ధాత్రి నే ప్రొద్దు నతిశయిల్లెఁ
బరఁగ ముమ్మడి దేవయ్య భామ జగతిఁ
[2]గామితార్థైక సంధాన కల్పవల్లి 40
యుజ్జ్వలద్గుణ నికురుంబ యొమ్మమాంబ.

1. తా. యననొప్పు. 2. ము. కామితార్థక.

అర్థము: తలఁపంగన్ = ఆలోచింపంగా, ఈ -కాంత = ఈ స్త్రీ (ఒమ్మమాంబ)పరమ -పాతివ్రత్య-భావంబు = గొప్పదియగు, పాతివ్రత్య లక్షణము, తలఁపన్ = చూడగా, గౌరి = పార్వతి, కాన్ + పోలున్ = కాదగును. ఇందు-వదన = చంద్రునివంటి ముఖము గలది - స్త్రీ, (ఒమ్మమాంబ), సకల.....మహిమలన్: సకల = ఎల్ల, సంపద్ = సంపదల యొక్క, స్ఫూర్తి = తోచుట యొక్క, చాతుర్య = నేర్పుయొక్క, మహిమలన్ = గొప్పతనములందు, ఇందిర = లక్ష్మి, కాన్ +పోలున్. భామ = స్త్రీ (ఒమ్మమాంబ), ఎపుడున్, సకల - విద్యా-ప్రౌఢిన్ = ఎల్ల, విద్యలయందలి, నేర్పుచేత, సడి సన్న = నింద్యము కాని, గరిమలన్ = గొప్పతనముల చేత, భారతి = సరస్వతి, కాన్ + పోలున్. ఇగురుబోణి = చిగురువంటి శరీరము గలది -స్త్రీ (ఒమ్మమాంబ), సర్వ...తోన్నతిన్ ;సర్వ = ఎల్ల, లక్షణ = లక్షణముల యొక్కయు, గుణ = మంచి గుణముల యొక్కయు, సంపన్నతా + ఉన్నతిన్ = కలిమి యొక్క ఔన్నత్యమునందు, ఇంద్రాణి = శచి, కాన్ + పోలున్ అనంగన్, ఇద్ధాత్రిన్ (ఈ + ధాత్రిన్) = ఈ భూమియందు, ఏ -ప్రొద్దున్ = ఎల్లప్పుడును, ముమ్మడి దేవయ్య - భామ = ముమమ్మడి దేవయ్య - స్త్రీ (భార్య), కామి....వల్లి; కామిత = కోరబడిన, అర్థ = ప్రయోజనముల యొక్క, ఏక = ముఖ్యమైన, సంధాన = కూర్పునకు, కల్ప -వల్లి = కల్పవృక్షపుతీగ, ఉజ్జ్వలత్ + గుణ-నికురంబ = ప్రకాశించు చున్న, గుణ = మంచి గుణములయొక్క, నికురుంబ = సమూహము గలది (అగు)ఒమ్మమాంబ, పరంగన్ = ఒప్పునట్లుగా, జగతిన్ = లోకమునందు, అతిశయిల్లెన్ = మించెను.

తాత్పర్యము : కోరిన కోరికలను తీర్చుటలో కల్పలతయు, ప్రకాశించు గుణముల సమూహము గలదియు, ముమ్మడి దేవయ్య భార్యయు నగు ఒమ్మమాంబ పాతివ్రత్యమున పార్వతియు, సకలసంపదలయందును లక్ష్మియు, ఎల్ల విద్యల అతిశయమునందును సరస్వతియు, సకల సద్గుణ సంపయందు శచియు ననునట్లు ఈ లోకమున మించెను.

విశేషములు : భర్త సామేన వర్తిల్లు గౌరి పాతివ్రత్యమున పేర్కొనదగినది ఇగురుబోణి-`బహువ్రీహిని స్త్రీ వాచ్యం బగుచో నుపమానంబుమీది మేనునకు బోఁడియగు'-బా.వ్యా సమా. 23`అలరుఁబోఁడీత్యాదు లుపమాన పూర్వపద కర్మధారయంబులు 'ప్రౌ.వ్యా. సమా. 19

ఇద్ధాత్రిన్, జగతిన్ అను రెండు స్థలవాచక శబ్దములు అనావశ్యకములు కామిత + అర్థ + ఏక = కామితార్థైక - సవర్ణదీర్ఘ వృద్ధిసంధులు,

ఉ. ముమ్మడి దేవచంద్రునకు ముఖ్యతలోదరి యొమ్మ[1]మాంబకున్
సమ్మద శైవ శాస్త్ర పరిసంచిత నిర్మల శుద్ధ[2]యుక్తికిన్
ఇమ్మహి నెల్ల వారలకు నీప్సిత వస్తువిధాయియై ధరన్
సమ్మతి నుద్భవిల్లె [3]వర శాంతుఁడు శాంతన [4]యగ్రగణ్యుఁడై. 41

అర్థము : ముమ్మడి దేవ చంద్రునకున్ = శ్రేష్ఠుడయిన ముమ్మడి దేవయ్యకు ముఖ్య-తలోదరి = ప్రధానస్త్రీ (భార్య), అగు, ఒమ్మమాంబకున్, సమ్మద....యుక్తికిన్: సమ్మద = సంతోషముతోగూడిన, శైవ = శివ సంబంధములయిన, శాస్త్ర = శాస్త్రములందు, పరి సంచిత = కూడబెట్టబడిన, నిర్మల-స్వచ్ఛమైన, శుద్ద = దోషములేని, యుక్తికిన్ = ఉపాయము గలదానికి, ఇమ్మహిన్ (ఈ + మహిన్) = ఈ భూమియందు, ఎల్ల - వారలకున్ = అందఱకును, ఈప్సిత-వస్తు-విధాయి + ఐ = కోరబడిన, వస్తువుల యొక్క, విధించువాడు (ఇచ్చువాడు) అయి, వర-శాంతుఁడు = శ్రేష్ఠమయిన, శాంతగుణము గలవాడు, అగు, శాంతన, అగ్ర-గణ్యుఁడు + ఐ = మొదట లెక్కింపదగిన వాడయి, ధరన్ = భూమియందు, సమ్మతిన్ = సమ్మతితో, ఉద్భవిల్లెన్ = పుట్టెను.

తాత్పర్యము: శైవ శాస్త్రములందలి నిర్దుష్టమైన జ్ఞానముగల ముమ్మడి దేవయ్య ప్రధాన భార్యయగు ఒమ్మమాంబకు ఎల్ల వారల కోరికలను దీర్చువాడయి గొప్పశాంతగుణముగల శాంతన అగ్రగణ్యుడై పుట్టెను.

విశేషములు: యుక్తికకిన్ + ఇమ్మహి - ఇందు విసంధి గానున్నది. `యుక్తి కిన్నిమ్మహి'అనురీతి ద్రుతద్విత్వ సంధి ఇందే పలుతావుల చేయబడినది.

సీ. పరవాది మత్తేభ పంచాననాఖ్యుండు
పరవాది మండూక పన్నగుండు
పరవాది నవమేఘ పవమాన ధీరుండు
పరవాది సాగర బాడబుండు
పరవాది [5]కుత్కీల భాసుర దంభోళి
పరవాది కేంధన పావకుండు
పరవాది చయ తమః పటలోగ్ర భానుండు
పరవాది భోగి సుపర్ణుఁ డనఁగఁ

గీ. జటుల జైన కోలహల సమర బిరుద
ఘనుఁడు సంగ్రామపార్థుండు వినుతయశుఁడు
శుభుఁడు ముమ్మడి దేవయ్య సుతఁడనంగ
వెలసె శాంతయ్య విక్రమవీరవరుఁడు 42

1. తా. సానికిన్ 2. తా. మూర్తి 3. ముఁబర. 4. ము.వా. 5. తా. కుత్కూట.

అర్థము: పరవాది.....ఖ్యుండు: పర-వాది = శత్రువులైనవాదులనెడు, మత్త + ఇభ = మదించిన యేనుగులకు, పంచానన + ఆఖ్యుండు = సింహమను పేరు గలవాడు, పరవాది, మండూక = పరవాదులనెడు కప్పలకు, పన్నగుండు = పాము. పరవాది, నవ-మేఘ = పరవాదులనెడి తొలకరి మబ్బులకు, పవమాన = వాయువను, ధీరుండు = ధైర్యము గలవాడు, పరివాది, సాగర = పరవాదులనెడి సముద్రములకు, బాడబుండు = బడబాగ్ని. పరవాది, కుత్కీల = పరవాదులనెడి కొండలకు, భాసుర = ప్రకాశించు, దంభోళి = వజ్రాయుధము, పరవాదిక, ఇంధన = పరవాదులనెడి చిదుగులకు, పావకుండు = అగ్ని. పరవాది-చయ = శత్రు వాదుల యొక్క సమూహమనెడు, తమస్ + పటల = చీకట్ల సమూహమునకు, ఉగ్ర = భయంకరమైన, భానుండు = సూర్యుడు. పరవాది, భోగి = పరవాదులనెడి పాములకు, సుపర్ణుండు = గరుత్మంతుడు, అనంగన్, చటుల......ఘనుండు:చటుల = పటువైన, జైన = జైన మతస్థులతోడి, కోలాహల = పెద్దమ్రోతగల, సమర = యుద్ధముగలవాడు అనెడి బిరుద = బిరుదుచే, ఘనుడు = గొప్పవాడు, సంగ్రామ-పార్థుండు = యుద్ధమున, అర్జునుడు, వినుత-యశుఁడు = పొగడబడిన కీర్తి గలవాడు, శుభుఁడు, ముమ్మడి దేవయ్య (యొక్క) సుతుడు = కొడుకు, అనంగన్, విక్రమ-వీర-వరుడు = పరాక్రమమునందు శ్రేష్ఠుడైన వీరువరుడు, శాంతయ్య, వెలసెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము: ముమ్మడి దేవయ్య కొడుకైన శాంతయ్య పరాక్రమమునందు వీరశ్రేష్ఠుడు. అతడు శత్రువాదు లనెడు మద గజములకు సింహము. కప్పలకు పాము. తొలకరి మబ్బులకు వాయువు. సముద్రమునకు బడబాగ్ని. కొండలకు వజ్రాయుధము. కట్టెలకు అగ్ని. చీకటులకు తీక్ష్ణ భానుడు. పాములకు గరుత్మంతుడు జైనులతో తీవ్రమైన యుద్ధము గలవాడను బిరుదుచే ఘనుడు. యుద్ధమునం దర్జునుని వంటివాడు. వినుతమైన కీర్తి గలవాడు అన ప్రకాశించెను.

విశేషములు: పరవాది మత్తేభ పంచానన.......ఈ సమాసము లందన్నిటను రూపకాలంకారము గలదు. పంచానన -పంచం విస్తృత మానన మస్యేతి పంచాననః -విస్తృతమైన ముఖము గలది-సింహము. `సింహో మృగేన్ద్రః పఞ్చాస్యో హర్యక్షః కేసరీ హరిః -అతురము కుత్కీలము -`అగ కుత్కీల జీమూత సానుమన్నగ పర్వతాః -అమరము?(అప్పకవి)కోర్భూమే రుత్కీలః కుత్కీలః-భూమికి పయిమేకువంటిది-కొండ. దంభోళి 'శతకోటిః స్వరు శ్శంబో దంభోళి రశని ర్ద్వయోః-వ్యు. దంభా దాటోపాల్లీయత ఇతి దంభోళిః ఆటోపము వలననే లయింపజేయు నట్టిది. లేదా దభ్నాతి ఖేదయ త్యరీ నితి -శత్రువులను దుఃఖ పెట్టునది-వజ్రాయుధము పరవాది-పరవాదిక-కపత్యయ మల్పత్వమును తెలుపును. లేదా స్వార్థమున కప్రత్యయము.

గీ. వేడ్కఁ గవిసార్వభౌముని విమలచరిత
స్కాంద పౌరాణికంబైన కథలలోన
ఘనత శివరాత్రి చరితంబుఁ దెనుఁగు గాఁగఁ
గరుణఁ జేయుము శ్రీనాథ కవివరేణ్య 43

అర్థము : కవి సార్వభౌముని -విమల చరిత = కవిసార్వభౌముడను బిరుదము యొక్క స్వచ్ఛమైన చరితము గలవాడా! శ్రీనాథ-కవి-వరేణ్య = శ్రీనాథుడను పేరుగల కవిశ్రేష్ఠుడా!, స్కాంద-పౌరాణికంబు = స్కంద పురాణమునకు సంబంధించినది, ఐన, కథలలోనన్, శివరాత్రి చరితంబున్, తెనుఁగు-కాఁగన్ = తెనుగు అగునట్లు, వేడ్కన్ = వేడుకతో, ఘనతన్ = గొప్పతనముతో, కరుణన్ = దయతో, చేయుము.

తాత్పర్యము: కవిసార్వభౌముడను బిరుదు గల నిర్మల చరిత్రుడా!శ్రీనాథ కవి శ్రేష్ఠుడా!స్కాందపురాణాంతర్గతములయిన కథలలోని శివరాత్రి చరితమును వేడుకతోను, దయతోను, గొప్పగాను తెనుగుచేయుము.

విశేషములు: కవి సార్వభౌముని విమల చరిత-అనునది పద్యమున నే విధముగను అన్వయింపక పోవుటచే దీనిని గూడ సంబుద్ధిగా భావించుట అయినది. కవిసార్వభౌముని విమల చరితు అని ఆంధ్ర సాహిత్య పరిషత్తతి పాఠము. అయినను అన్వయ సౌఖ్యము లేదు. శివరాత్రి మాహాత్మ్య మను నీ వృత్తాంతము స్కాందపురాణము నందలి ఈశాన సంహితలోనిది. స్కాందము అష్టాదశపురాణములలో నొకటి.

వ. అనవుడు నమ్మహీసురాగ్రగణ్యుండు కమలనాభామాత్య పౌత్త్రుండును మారయామాత్య పుత్త్రుండును నగు శ్రీనాథకవి వరేణ్యుండును[1]సంతుష్టమానసుండై శాంతస్వామి యొసంగిన కర్పూరతాంబూల జాంబూన దాభరణంబులు స్వీకరించి [2]స్కాందంబున నీశాన సంహితయందుం జెప్పంబడిన యురులింగోద్భవంబును, శివరాత్రి మాహాత్మ్యంబును (సుకుమారోత్పత్తియు, యమ శంకర సంవాదంబును, యమ శివదూత సంబోధనంబును నను పంచమాశ్వాసాను కీర్ణంబై యొప్పు)[3] కథానిధానంబున కథీశ్వరుంగా (శాంతదేశికేశ్వరుం బరిగ్రహించి.) 44

అర్థము: అనవుడు....స్వీకరించి: అనవుడున్ = శాంతన పయివిధముగా అనినంతనే, ఆ + మహీసుర + అగ్రగణ్యుండున్ = ఆ, బ్రాహ్మణులలో, మొదట లెక్కింప దగినవాడును, కమలనాభ + అమాత్య-పౌత్త్రుండును = కమలనాభామాత్యుడను వాని కొడుకు కొడుకును, మారయ + అమాత్య = పుత్త్రుండును = మారయ అను మంత్రికుమారుడును, అగు, శ్రీనాథ-కవి-వరేణ్యుడును = శ్రీనాథుడను కవిశ్రేష్ఠుడును, సంతుష్ట-మానసుండు + ఐ = సంతోషించిన మనస్సు గలవాడయి, శాంత-స్వామి =

1. తా.నగు సంతోష. 2. తా. యందంబుగ. 3. తా. కథావిధానంబున

శాంతన అను ప్రభువు, ఒసంగిన = ఇచ్చిన, కర్పూర-తాంబూల-జాంబూనద + ఆభరణంబులు = కర్పూరముతోగూడిన తాంబూలము, బంగారు భూషణములు, స్వీకరించి = తీసికొని.

తాత్పర్యము: శివరాత్రి మాహాత్మ్యమును తెనుగుచేయమని శాంతయ్య కోరగానే బ్రాహ్మణ శ్రేష్ఠుడును, కమలనాభామాత్యుని మనుమడును, మారయామాత్యుని కుమారుడును అగు ఆ శ్రీనాథ కవివర్యుడు మనస్సున సంతోషించి శాంతయ్య ఇచ్చిన కప్పురపుతాబూలమును, బంగారునగలను పరిగ్రహించి.

విశేషములు: జాంబూనద- `రుక్మం కార్తస్వరం జామ్బూనద మష్టాపదోఽ స్త్రియామ్'-అమరము వ్యు. జంబూఫలరసోత్పన్న నదీ భవత్వా జ్జాంబూనదమ్. నేరేడుపండ్ల రసముచేత పాఱిన నదియందు పుట్టినది-బంగారము.

అర్థము: స్కాందంబున........బరిగ్రహించి స్కాందంబునన్ = స్కాందమను పురాణము నందుగల, ఈశాన సంహిత యందున్, చెప్పబడిన, ఉరులింగ + ఉద్భవంబును = పెద్దది యగు శివలింగము యొక్క, పుట్టుకయును, శివరాత్రి-మాహాత్మ్యంబును, సుకుమార + ఉత్పత్తియున్ = సుకుమారుడనువాని జననమును, యమ-శంకర-సంవాదంబును = యముడు, శివుడు అనువారి సంవాదమును, యమ-శివ-దూత సంబోధనంబును = యముని, శివుని దూతల పిలుపును, అను, పంచమ + ఆశ్వాస + అనుకీర్ణంబు + ఐ = అయిదవ అశ్వాసమునందు వ్యాపించినదయి, ఒప్పు, కథా-నిధానంబునకున్ = కథయనెడి నిధికి, అధి + ఈశ్వరున్ + కాన్ = భర్తనుగా, శాంత దేశిక + ఈశ్వరున్ = శాంతయ్య అను గురుస్వామిని పరిగ్రహించి = స్వీకరించి.

తాత్పర్యము: స్కాందమను పురాణమునందలి ఈశాన సంహితయందు చెప్పబడిన గొప్ప శివలింగమును నుత్పత్తియు, యమ శివుల సంవాదమును, యమ శివదూతల పిలుపును, అను అయిదాశ్వాసముల వ్యాపించి యొప్పునట్టి కథకు భర్తనుగా శాంతయ్య అను గురుస్వామిని స్వీకరించి.

విశేషములు: 'పంచమాశ్వాస' మనగా నయిదవ ఆశ్వాసము. అట్లుగాక `పంచాశ్వాస' అనియున్నచో అయి దాశ్వాసములని యర్థము సరిపడును.

షష్ఠ్యంతములు: షష్ఠి + అంతములు + షష్ఠీ విభక్తి అంతమందు గలవి. కృతి భర్తకున్ అను షష్ఠీ విభక్త్యంత విశేష్యమునకు ఈ పద్యములలో చెప్పబడిన వన్నియు విశేషణములయి షష్ఠీ విభక్త్యంతములుగానుండును. కావున వీనికి షష్ఠ్యంతములని పేరు.

క. (సత్య హరిశ్చంద్రునకును
నిత్యా ప్రతిమాన)దాన నిర్మల మతికిం
గృత్యా కృత్య వివేకికిఁ
బ్రత్యర్థి ద్విరద దళన పంచాస్యునకున్ 45

అర్థము: సత్య - హరిశ్చంద్రునకును = సత్య వాక్యమునందు, హరిశ్చంద్రుడయిన వానికిని, నిత్యా......మతికిన్ : నిత్య = శాశ్వతమైన, అప్రతిమాన = సాటి లేనట్టియు, దాన = ఈవిచేత, నిర్మల = స్వచ్ఛమయిన, మతికిన్ = మనస్సుగలవానికిని, కృత్య + అకృత్య-వివేకికిన్ = చేయదగిన, చేయదగని పనుల మంచి చెడ్డల జ్ఞానము గలవానికిని, ప్రత్యర్థి...పంచాస్యునకున్: ప్రత్యర్థి = శత్రువులనెడు, ద్విరద = ఏనుగులయొక్క, దళన = ఖండించుటయందు, పంచాస్యునకున్ = సింహమయిన వానికిని.

తాత్పర్యము: సత్యవాక్యమునందు హరిశ్చంద్రుడును, ఎల్లప్పుడును సాటిలేని యీవిచే నిర్మలమైన మనస్సుగలవాడును, కృత్యము అకృత్యము అనువాని మంచి చెడ్డల జ్ఞానము గలవాడును, శత్రువులనెడు గజములకు సింహమయినవాడును అగు కృతిభర్తకు.

విశేషములు: ఈ షష్ఠ్యంతము లయిన విశేషణము లన్నియు పయి వచనమునందలి `అభ్యుదయ పరంపరాభివృద్ధియు'నను దానితో నన్వయించును.

క. రామామన్మథమూర్తికి
రామత్రయ [1]లీనమతికి రమ్యాత్మునకున్
[2]సోమవ్రతవరకాంతికి
భీమజయోత్కట విశేషభీకర మతికిన్. 46

అర్థము: రామా = స్త్రీలకు, మన్మథ-మూర్తికిన్ = మన్మథుని ఆకారమువంటి ఆకారము గల వానికిని, రామ-త్రయ-లీన-మతికిన్ = పరుశురాముడు, శ్రీరాముడు, బలరాముడు అను ముగ్గురు రాములందును లయించిన (తదేకాయత్తమయిన)మనస్సు గలవానికిని, రమ్య + ఆత్మునకున్ = ఒప్పిదమయిన మనస్సు గలవానికిని, సోమ-వ్రత-వర-కాంతికిన్ = చంద్రుని యొక్క, శివునియొక్క, వ్రతము చేత, శ్రేష్ఠమయిన కాంతిగలవానికి, భీమ.....మతికిన్ భీమ = భయంకరమయిన, జయ = గెలుపుచేత, ఉత్కట = మదించిన, విశేష = గొప్ప, మతికిన్ = మనస్సుగలవానికిని.

తాత్పర్యము: స్త్రీలకు మన్మథుడయినవాడును, పరుశురామ శ్రీరామ బలరాములనెడు ముప్వురు రాములందును ఏకాయత్తమయిన మనస్సు గలవాడును,

---

1.ము. లీల. 2. తా. సోమావ్రత

ఒప్పిదమయిన మనస్సు గలవాడును, శివవ్రతముచే శ్రేష్ఠమయిన కాంతి గలవాడును, గొప్పగెలుపుచే మదించిన మనస్సు గలవాడును అగు కృతిభర్తకు.

విశేషములు: సోమశబ్దమునకు చంద్రుడనియే కాక శివుడను నర్థము కూడగలదని సూ.ని. ఏమయినను `సోమ.......కాంతికి', భీమ.......మతికిన్' అనువానికి చెప్పిన యర్థములు తృప్తికరముగా లేవు.

క. శైవాగమ శాస్త్రాది
ప్రావీణ్యాగణ్యపుణ్యభరితాత్మునకున్
భావాభావవివేకికి
భావితవంశావతార పరమాత్మునకున్ 47

అర్థము: శైవా....తాత్మునకున్: శైవ = శివసంబంధములయిన, ఆగమ = దేవపూజావిధానమును దెలుపునట్టి శాస్త్రములు, శాస్త్ర = మీమాంసాది శాస్త్రములు, ఆది = మున్నగు వాని యందలి, ప్రావీణ్య = నేర్పు వలని, అగణ్య = గణింపరాని (అత్యధికమైన), పుణ్య = పున్నెముతో, భరిత = నిండిన, ఆత్మునకున్ = మనస్సు గలవానికిని, భావ + అభావ-వివేకికిన్ = కలిమి లేముల విభేదజ్ఞానము గలవానికిని, భావిత -వంశ + అవతార-పరమాత్మునకున్ = భావింపంబడిన, వంశమునందు, పుట్టుకగల, పరమాత్మునకును.

తాత్పర్యము: శివసంబంధములయిన ఆగమములు, మీమాంసాది శాస్త్రములు మున్నగువాని యందలి నేర్పువలని యధికమైన పుణ్యము గలవాడును, భావాభావముల వివేకము గలవాడును, సద్వంశమునం దుదయించిన పరమాత్ముడును అగు కృతిపతికి

క. జంభాంతక వైభవునకు
సంభృత శాస్త్ర [1]ప్రతాప శైలోన్నతికిన్
శుంభత్ప్రాభవరతికిన్
దంభోళి స్ఫురిత తీవ్రతర ఖడ్గునకున్ 48

అర్థము: జంభ + అంతక-వైభవునకున్ = జంభుడను రాక్షసుని అంతమొందించిన వాని (ఇంద్రుని) సంపదవంటి సంపదగలవానికిని, సంభృత..... న్నతికిన్: సంభృత = లెస్సగాపొందబడిన, శాస్త్ర = శాస్త్రములందలి, ప్రతాప = శౌర్యమునందు-పాండిత్యమునందు, శైల = పర్వతము యొక్క, ఉన్నతికిన్ = ఎత్తుగలవానికి-శాస్త్ర పాండిత్యమునందు కొండంతవానికి, శుంభత్ + ప్రాభవ-రతికిన్ = ప్రకాశించుచున్న ప్రభుత్వమునందు-సంపదయందు, ఆసక్తిగలవానికిని, దంభోళి....ఖడ్గునకున్: దంభోళి = వజ్రాయుధము వలె, స్ఫురిత = తోచిన, తీవ్ర-తర = మిక్కిలి తీక్ష్ణమయిన, ఖడ్గునకున్ = కత్తిగలవానికిని.

1. తా. ప్రతాపోన్నతి.

తాత్పర్యము: ఇంద్రుని వైభవము వంటి వైభవము గలవాడును, శాస్త్ర పాండిత్యమునందు కొండవలె ఉన్నతుడయినవాడును, ప్రకాశించు ప్రభుత్వమునందు కోరికగలవాడును, వజ్రాయుధమును దలంపించు మిక్కిలి తీక్ష్ణమయిన ఖడ్గము గలవాడును అగు కృతిపతికి.

విశేషములు: జంభాంతక = ఇంద్ర `జమ్భబేధీ హరిహయ స్స్వారాణ్ణముచి సూదనః' - అమరము.

క. [1]వర ముమ్మయ శాంతునకుం
బరమ [2]పరిజ్ఞాన నిధికిఁ బావనమతికిన్
నిరుపమవిక్రమయశునకుఁ
గరుణారసపూరితాత్మ కవితాంగునకున్ 49

అర్థము: వర = శ్రేష్ఠుడయిన, ముమ్మయ శాంతునకున్ = ముమ్మడి దేవయ్యాకు డుకగు శాంతయ్యకును, పరమ-పరిజ్ఞాన,-నిధికిన్ = గొప్పదియగు, విజ్ఞానమునకు, నిధియైనవానికిని, పావన-మతికిన్ = పవిత్రమయిన మనస్సుగల వానికిని, నిరుపమ-విక్రమ-యశునకున్ = సాటిలేని, పరాక్రమము వలని, కీర్తి గలవానికిని, కరుణా-తాంగునకున్;కరుణా-రస = దయ యనెడు రసముతో, పూరిత = నిండిన, ఆత్మ మనస్సుతో, కలిత = కూడిన, అంగునకున్ = దేహము గలవానికిని.

తాత్పర్యము: ఉత్కృష్టమయిన విజ్ఞానమునకు నిధియైనవాడును, పవిత్రమనస్కుడును, సాటిలేని పరాక్రమము వలని కీర్తి గలవాడును, దయారసముతో నిండిన మనసుగలవాడును అగు ముమ్మయ శాంతన అను కృతిభర్తకు.

వ. అభ్యుదయ పరంపరాభివృద్ధియు, నభిమతార్థ సిద్ధియు, సత్య ధర్మ క్రియావృద్ధియు నగునట్లష్టాదశ వర్ణనా గర్భంబుగా నత్యాశ్చర్యకరంబై యుండ నా రచియింపంబూనిన కథా నిధానంబు సకల పాప నిర్ముక్తంబై [3]సర్వవస్తుసంధానంబై, పరమ ధర్మోత్కృష్టంబై, సర్వాగమానూన సంభావిత సంస్తుతంబై, పరమ ధర్మోత్కృష్టంబై, పరమేశ్వర ప్రియంబై, పార్వతీ మనోహరంబై, శ్రీనాథ సేవితంబై, *బ్రహ్మ రుద్రాది దేవతా సంస్తూయమానంబై) శోభిల్లు నిప్పుణ్యాచారిత్రంబు *(దశదోష వివర్జితంబుగా)నా నేర్చిన విధంబున రచియించెదనది యెట్టి దనినం బూర్వోక్తమార్గంబునం బరిపూర్ణంబై యథావిధి శోభిల్లు*(నిప్పుణ్య చారిత్రంబుంబోలి)నట్టి ధర్మక్షేత్రంబును మహాతీర్థంబును నగు గంగా కాళిందీ సంగమంబున[4]సంశ్రితాత్ములు సత్యవ్రత పరాయణులు నగు శౌనకాది మహామునులు దీర్ఘసత్రంబు నందుం గూడియుండ (నవ్వేళ)వేదవ్యాస ప్రియశిష్యుండు రోమహర్షణ తనయుండు పౌరాణికుండు సూత్యాహి సంభవుండు

1. తా.ధర. 2. ము. వర 3. సర్వాగమానిర్ముక్తంబై * తాళపత్రమున లేదు. 4. తా. సంస్థితాత్ములు

సూతుండేతెంచిన సంప్రహృష్టమానసులయి యమ్మహాముని లాసనార్ఘ్య పాద్యాదులం బూజించి యతని కిట్లనిరి 50.

అర్థము: అభ్యుదయ...రచియించెద: అభ్యుదయ-పరం పరా + అభివృద్ధియున్ = శుభములయొక్క, వరుసయొక్క, పెంపును, అభిమత + అర్థ-సిద్ధియున్ = కోరిన ప్రయోజనముల యొక్క నెఱవేఱుటయును, సత్య.-ధర్మ-క్రియా-వృద్ధియున్-సత్యము యొక్కయు, ధర్మము యొక్కయు పనుల పెంపును, అగునట్లు అష్టాదశ-వర్ణనా-గర్భంబు-కాన్ = పదునెనిమ్మిది వర్ణనలు లోనుండునట్లుగా-కూడుకొనియుండునట్లుగా, అతి + ఆశ్చర్యకరంబు + ఐ + ఉండన్ = మిక్కిలి వింత గొలుపునది యైయుండగా, నా-రచియింపన్ + పూనిన = నేను రచింపబూనుకొనిన, కథా-నిధానంబు = కథల నిధి, సకల-పాప-నిర్ముక్తంబు + ఐ = ఎల్లపాపములచేత విడువబడిన దయి-ఎల్లపాపములు లేని దయి, సర్వ-వస్తు-సంధానంబు + ఐ = ఎల్ల, వస్తువుల యొక్క, కూర్పుగలదయి, సర్వ లక్షణ-సంపన్నంబు + ఐ = ఎల్ల, శుభ లక్షణములతో గూడు కొన్నదయి, సర్వ + ఆగమ + అనూన-సంభావిత-సంస్తుతంబు + ఐ = ఎల్ల, శాస్త్రములచేత, తక్కువగా గాకుండ, సమ్మానింపబడిన, అందుచేతనే, మిక్కిలి పొగడబడినదయి, పరమ-ధర్మ + ఉత్కృష్టంబు + ఐ = ఉత్తమములయిన, ధర్మములచేత, గొప్పదియయి, పరమ + ఈశ్వర-ప్రియంబు + ఐ = శివునకు ఇష్టమయినదయి, పార్వతీ-మనోహరంబు + ఐ = పార్వతివలె చక్కని దయి, శ్రీ-నాథ-సేవితంబు + ఐ + లక్ష్మి భర్తయగు విష్ణునిచే సేవింపబడినదయి, బ్రహ్మ-రుద్ర + ఆది-దేవతా-సంస్తూయ మానంబు + ఐ = బ్రహ్మ, రుద్రుడు మున్నగు దేవతలచే పొగడబడుచున్నదయి, శోభిల్లు = ప్రకాశించునట్టి, ఈ + పుణ్య-చారిత్రంబు = ఈ పవిత్ర చరిత్రము దశ-దోష-వర్జితంబు-కాన్-పది కావ్య దోషములు లేకుండునట్లుగా నా-నేర్చిన-విధంబునన్ = నేను నేర్చిన రీతిని రచియించెదన్.,

తాత్పర్యము: శుభపరంపర పెంపును, కోరిన అర్థముల సిద్ధియు, సత్య ధర్మకార్యముల పెంపును) గలుగు నట్లు పదునెనిమిది వర్ణన లుండునట్లుగా మిక్కిలి అచ్చెరువు గూర్చునదిగా నుండ నేను రచింపబూనిన కథ పాపరహితమై, ఎల్ల వస్తువులను గూర్చునదియై, ఎల్ల లక్షణములతో గూడుకొనినదయి, ఎల్ల శాస్త్రములచే మిక్కిలి సంభావితమయి, గొప్ప ధర్మములచే గొప్పదియయి, పరమేశ్వరునకు ప్రియమైనదయి, పార్వతి వలె చక్కనిదయి; విష్ణువుచే సేవింపబడిన దయి, బ్రహ్మ, రుద్రుడు మున్నగు దేవతలచే నుతింపబడుచున్నదయి ప్రకాశించు నీ పవిత్ర చరిత్రము పది కావ్యదోషములు లేకుండునట్లు నాకు చేతనయినరీతిని రచింతును.

విశేషములు: అష్టాదశ వర్ణనలు:పుర, సముద్ర, శైల, ఋతు, సూర్యోదయ, చంద్రోదయ, సరఃక్రీడా, వనక్రీడా, వసంత, రతి ప్రసంగ, విరహ, పరిణయ, పుత్రోదయ, నయవిరచన (సంధి విగ్రహాదులు), దండయాత్రా, యుద్ధ, దౌత్య, ప్రభు

వర్ణనలు పదునెనిమిది. ఇందు మత భేదములు గలవు. అప్పకవి యిరువది రెండింటిని చెప్పెను.

నా రచియింపంబూనిన - `ధాతుజ విశేషణ భావార్థక పూర్వ వ్యవహి తావ్యవహిత కర్తృ పద ప్రథమకుం దఱచుగ యొక్క షష్ఠియగు'ప్రౌ.వ్యా.కారక- 15`యొక్కకు లోపంబు బహుళంబు'-ప్రౌ.వ్యా. కారక- 16.

దశదోషములు: కావ్యదోషములు పద వాక్యార్థ దోషములని త్రివిధములు. అందు పద దోషములు పదునేడు. వాక్యదోషములు ఇరువది నాలుగు.అర్థదోషములు పదునెనిమిది. మొత్తము మీద వానిలో ప్రధానములు పదియని `దశదోష'అని యుండవచ్చును.

`నా నేర్చిన విధంబున' ఇదియు`నా రచియింపంబూనిన'వంటిదే.

అర్థము: అది యెట్టిదనిన.....కిట్లనిరి:అది = ఆ పుణ్యాచారిత్రము, ఎట్టిది, అనినన్, పూర్వ + ఉక్త-మార్గంబునన్ = పూర్వులచే, చెప్పబడిన విధమున, పరిపూర్ణంబు + ఐ = సమగ్రమయి, యథావిధి = విధి నతిక్రమింపక, శోభిల్లు = ప్రకాశించు, ఈ + పుణ్య-చారిత్రంబున్ = ఈ పవిత్ర చరిత్రమును, పోలిన + అట్టి, ధర్మక్షేత్రమును, = ధర్మములకు స్థానమును, మహా-తీర్థంబును = గొప్ప పుణ్యక్షేత్రమును, అగు, గంగా-కాళిందీ-సంగమంబునన్ = గంగా యమునా నదుల కూటమి యందు, సంశ్రిత + ఆత్మలున్ = ఆశ్రయింపబడిన పరమాత్మకలవారును, సత్యవ్రత-పరాయణులున్ = సత్యమనెడి నియమమునందు ఆసక్తిగలవారును, అగు, శౌనక + ఆది-మహా (మహత్)-మునులు = శౌనకుడు మొదలగు గొప్ప మునులు, దీర్ఘ-సత్రంబునందున్ = చిరకాలము చేయు యజ్ఞమునందు, కూడి + ఉండన్, ఆ + వేళన్ = ఆ సమయమునందు, వేద-వ్యాస-ప్రియ-శిష్యుడు = వేదవ్యాస మహర్షి యిష్ట శిష్యుడు, రోమహర్షణ-తనయుండు = రోమహర్షణుడనువాని కుమారుడు, పౌరాణికుండు = పురాణముల నెఱిగినవాడు, సూత్యాహి సంభవుండు. సూతుండు = సూతుండను పేరుగల మహర్షి, ఏతెంచినన్ = వచ్చిన, సంప్రహృష్ట-మానసులు + అయి = మిక్కిలి సంతోషించిన మనస్సు గలవారయి, ఆ + మహా(మహత్)-మునులు, ఆసన + అర్ఘ్య-పాద్య + పూజాద్రవ్యములు, కాళ్లు కడిగికొన నీరు మున్నగు వానిచేత, పూజించి, అతనికిన్, ఇట్లు అనిరి.

తాత్పర్యము: నేను రచింపబూనిన ఆ పుణ్య చరిత్ర మెట్టిదనగా పూర్వ కవులు చెప్పిన మార్గమున సమగ్రమయి, ఉండవలసిన రీతిగా నొప్పు నీ పుణ్య చరిత్రమును పోలినట్టి ధర్మక్షేత్రము, పుణ్యతీర్థమునగు గంగా యమునానదుల సంగమ ప్రదేశమున శౌనకుడు మున్నగు మహర్షులు దీర్ఘసత్రము చేయగూడి యుండగా, నా సమయమున వ్యాసమహర్షి ప్రియ శిష్యుడును, రోమహర్షుణుని కుమారుడును,

పురాణములు చెప్పువాడును అగు సూతుడు రాగా, సంతోషించిన మనస్సులు గలవారయి యా మహర్షులు వానిని ఆసనము, అర్ఘ్యము, పాద్యము మున్నగువానితో పూజించి అతనితో నీ రీతిగా ననిరి.

విశేషములు: యథావిధి-విధి మనతిక్రమ్య-విధి నతిక్రమింపక-అవ్యయీ భావ సమాసము.

సీ. సర్వజ్ఞ రోమహర్షణ తనూభవ సూత
యఖిల పురాణ విద్యా ప్రగల్భ
పంచావయవ యుక్త భవ్య కావ్య విదగ్ధ
యాశ్చర్య హేతువులైన కథలు
[1]రత్నాకరమునందు రత్నంబులును బోలెఁ
గలవు నీయందుఁ బొగడ్త గాదు
నీ వెఱుగని విద్య లీ విశ్వమున లేవు
తర్కించి యెన్ని విధములఁ జూడ

గీ. నుత్తరోత్తర[2]సత్కృత్య మొప్పు నీకుఁ
గాలనిర్ణయకలన నీ కరతలంబు
పూర్వమున మేము సేసిన పుణ్య మెల్ల
ఫలితముగ[3]నేఁ గుదెంచితే ప్రార్థనంబు. 51

అర్థము: సర్వజ్ఞ = అన్నియు దెలిసినవాడా!, రోమహర్షణ-తనూభవ = రోమహర్షణుని కుమారుడా! సూత = సూతుడా!, అఖిల-పురాణ-విద్యా-ప్రగల్భ = ఎల్ల పురాణములయొక్క జ్ఞానము నందును ప్రవీణుడా!, పంచా......విదగ్ధ:పంచ = అయిదయిన, అవయవ = లక్షణములతో, యుక్త = కూడిన, భవ్య = శుభమైన, కావ్య గ్రంథములందు(పురాణములందు), విదగ్ధ = నేర్పరియైనవాడా!, రత్నాకరము నందున్ = రత్నములకు నిలయమైన సముద్రమునందు, రత్నంబులును + పోలెన్ = రత్నములవలె, నీ యందున్, ఆశ్చర్య-హేతువులు = ఆశ్చర్యమునకు కారణములు, ఐన, కథలు, కలవు, పొగడ్త, కాదు, ఎన్ని, విధములన్, తర్కించి = ఊహించి, చూడన్ = చూడగా-ఎన్నివిధముల తర్కించి చూచినను, నీవు, ఎఱుగని, విద్యలు, ఈ -విశ్వమునన్ = ఈ ప్రపంచమునందు, లేవు.

నీకున్, ఉత్తర + ఉత్తర-సత్కృత్యము = పైపై మంచిపని, ఒప్పున్, నీ - కరతలంబు. మేము, పూర్వమునన్ = ఇదివఱకు, చేసిన, పుణ్యము + ఎల్లన్ = పున్నెమంతయును, ఫలితముగన్ = పండినది కాగా, ఏగుదెంచితి + ఏ = వచ్చితివా? ప్రార్థనంబు = వేడికోలు.

1. తా. రత్నాకరంబందు. 2. తా. సత్కృతి. 3. ము. నేగుదెంచితి

తాత్పర్యము: అన్నియు దెలిసినవాడా! రోమహర్షణుని కుమారుడా! ఎల్ల పురాణముల జ్ఞానమునందును ప్రావీణ్యముగలవాడా! పంచలక్షణ సమన్వితమగు పురాణములందు నేర్పరియైనవాడా! సూతుడా!, రత్నాకరమున రత్నములవలె నీ యందు అచ్చెరువు గొలుపు కథలు గలవు. ఇది స్తుతికాదు. ఎన్ని విధముల తర్కించి చూచినను నీకు తెలియని విద్య లీ విశ్వమున లేవు. నీకు పోవ పోవ సత్కృత్య మొప్పును. పూర్వజన్మమున మేము చేసిన ఎల్ల పున్నెమునకు ఫలముగా నీవు వచ్చితివా? ఒక్క వేడికోలు.

విశేషములు: పంచావయవ యుక్త భవ్యకావ్య - పురాణము 'పురాణం పంచ లక్షణమ్' `సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ, వంశానుచరితం చైవ పురాణం పఞ్చ లక్షణమ్' ఇవి పదునెనిమిది. `రత్నాకరమునందు రత్నంబులును బోలె నీయందుం గాథలు గలవు' ఉపమ.

వ. వేదంబులు నాలు గంగంబు లాఱు మీమాంసా న్యాయ విస్తర పురాణ ధర్మశాస్త్రంబు లాయుర్వేద ధనుర్వేదంబు లర్థశాస్త్రంబులను నష్టాదశ విద్యా నిధానంబులకు నాది కర్త సదాశివుండా శూలపాణి యమ్మహాస్థానంబులు బ్రహ్మ కుపదేశించె. అనంతరంబ శంకరాజ్ఞా ప్రచోదితుండై కృష్ణద్వైపాయనాభి ధానంబున ననాది నిధనుండు పుండరీకాక్షుండును, నరణి యందు వైశ్వానరుండునుం బోలె ద్వాపరాంతంబున సత్యవతి యందావిర్భవించె. వేదార్థోప [1]బృంహణార్థంబు సర్గ ప్రతిసర్గ వంశ మన్వంతర వంశాను చరితంబులను పంచలక్షణంబులం గలిగి *బ్రాహ్మంబు, వైష్ణవంబు, శైవంబు, భాగవతంబు, భవిష్యంబు, నారదీయంబు, మార్కండేయం, బాగ్నేయంబు, పాద్మంబు, బ్రహ్మకైవర్తంబు, లైంగంబు, వారాహంబు, స్కాందంబు, వామనంబు, కౌర్మంబు, మాత్స్యంబు, గారుడంబు, బ్రహ్మాండంబు నను మహాపురాణంబులు పదునెనిమిది కల్పించె నవియును 52

అర్థము: వేదంబులు......కుపదేశించె: వేదంబులు నాలుగు = ఋగ్యజు స్సామాథర్వములు, అంగంబులు + ఆరు = వేదాంగములు ఆఱు, అవి, శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము, అనునవి. మీమాంసా.....అర్థశాస్త్రంబులు: మీమాంసా = కర్మబ్రహ్మ ప్రతిపాదక శాస్త్రము, న్యాయ-విస్తర = న్యాయశాస్త్ర శబ్దశాస్త్రాలు, పురాణ ధర్మశాస్త్రంబులు, ఆయుర్వేద ధనుర్వేదంబులు, అర్థశాస్త్రంబులు, అను, అష్టాదశ - విద్యా-నిధానంబులకున్- పదునెనిమిది విద్యలనెడి నిధులకును, ఆది-కర్త = మొదటి కర్త, సదాశివుండు = పరమేశ్వరుడు, ఆ - శూలపాణి = ఆ శివుడు (శూలము పాణియందు గలవాడు),ఆ + మహా (మహత్) + స్థానంబులు = స్థానంబులు = ఆ గొప్ప శాస్త్రములు,

---

1. తా. బహృద్వర్ణనార్థంబు *తాళపత్రమున నీ పురాణముల పేరులు ముందు వెనుకలుగా నున్నవి.

బ్రహ్మకున్, ఉపదేశించెన్ = బోధించెను.

తాత్పర్యము: నాలుగు వేదములు, షడంగములు, మీమాంస, న్యాయ శబ్దశాస్త్రములు, పురాణము, ధర్మశాస్త్రము, ఆయుర్వేదము, ధనుర్వేదము, అర్థశాస్త్రము- అను పదునెనిమిది విద్యలను మొదటచేసినవాడు పరమేశ్వరుడు. అతడు ఆ మహాశాస్త్రములను బ్రహ్మ కుపదేశించెను.

అర్థము: అనంతరంబు.........ఆవిర్భవించెను: అనంతరంబు + అ = తరువాతనే, శంకర + ఆజ్ఞా-ప్రచోదితుండు + ఐ = ఈశ్వరుని యొక్క, ఆదేశముచేత, ప్రేరేపింపబడినవాడయి, కృష్ణద్వైపాయన + అభిధానంబునన్ + కృష్ణద్వైపాయనుడు (వ్యాసుడు) అనుపేరితో, అనాది నిధనుండు = ఆది అంతము లేనివాడు, అగు, పుండరీక + అక్షుండును = తెల్లదామరల వంటి కన్నులు గలవాడు-విష్ణువును, అరణి + అందును = త్రచ్చి నిప్పుపుట్టించెడు కొయ్యయందు, వైశ్వానరుండునున్ + పోలెన్ + అగ్నివలె, ద్వాపర + అంతంబునన్ = ద్వాపర యుగము చివర, సత్యవతి + అందున్ = సత్యవతి యనుపేరుగల స్త్రీ యందు, ఆవిర్భవించెన్ = పుట్టెను.

తాత్పర్యము : పిమ్మటనే శివుని యాదేశముచే ప్రేరితుడై వ్యాసుడను పేరితో ఆద్యంతములు లేని వాడగు విష్ణువును అరణియందు అగ్నివలె ద్వాపరయుగము చివర సత్యవతియందుదయించెను.

విశేషములు : కృష్ణద్వైపాయనుండు = కృష్ణ(నల్లని) ద్వీపమునందు పుట్టినవాడు - వ్యాసుడు, ద్వాపర-కృత, త్రేతా, ద్వాపర, కలి-అను నాలుగు యుగములలో మూడవది. సత్యవతిని అరణితో పోల్చుటచే నామె పవిత్రత తెలియును, అరణియందు......పోలె-ఉపమాలంకారము. సత్యవతీ పరాశరుల సమాగమము వలన నొక నల్లని ద్వీపమున వ్యాసమహర్షి ఉదయించెను.

అర్థము: వేదార్థో.....అవియును. వేద + అర్థ + ఉపబృంహణ + అర్థంబు = వేదముల యొక్క అర్థము యొక్క సంవృద్ధి కొఱకు, సర్గ....పంచలక్షణంబులన్: సర్గ-ప్రతి సర్గ-వంశ-మన్వంతర-వంశానుచరితంబులు = సర్గము, ప్రతి సర్గము, వంశము, మన్వంతరము, వంశాను చరితము అను, పంచ-లక్షణంబులన్ = అయిదు లక్షణములను, కలిగి, బ్రాహ్మంబు...బ్రహ్మాండంబున్: బ్రాహ్మంబు = బ్రహ్మపురాణము, వైష్ణవంబు = విష్ణుపురాణము, శైవంబు = శివపురాణము, భాగవతంబు, భవిష్యంబు, నారదీయంబు, మార్కండేయంబు, ఆగ్నేయంబు = అగ్ని పురాణము, పాద్మంబు = పద్మపురాణము, బ్రహ్మకైవర్తంబు, లైంగంబు = లింగపురాణము, వారాహంబు = వరాహపురాణము, స్కాందంబు = స్కందపురాణము, వామనంబు, కౌర్మంబు = కూర్మ పురాణము, మాత్స్యంబు = మత్స్య పురాణము, గారుడంబు = గరుడపురాణము, బ్రహ్మాండంబు - అను, మహాపురాణములు, పదునెనిమిది కల్పించెన్, అవియును.

తాత్పర్యము: వేదములు ప్రతిపాదించు నర్థమును విపులీకరించుటకయి, సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరము, వంశానుచరితము అనునైదు లక్షణములు కలిగి, బ్రాహ్మము, వైష్ణవము, శైవము, భాగవతము, భవిష్యము, నారదీయము, మార్కండేయము, ఆగ్నేయము, పాద్మము, బ్రహ్మకైవర్తము, లైంగము, వారాహము, స్కాందము, వామనము, కౌర్మము, మాత్స్యము, గారుడము, బ్రహ్మాండము అను పదునెనిమిది మహాపురాణములను కల్పించెను. అవియును తరువాతి పద్యముతో నన్వయము.

గీ. గ్రంథసంఖ్య ꣳబురాణసంఘంబు గూడి
[1]నాల్గు లక్షలౌ నీ పురాణములలోన
నూఱువేల్గ్రంథములలోన, నుతి వహించి
శ్రీ మహాస్కాంద సంహిత శివునిꣳ జెప్పు 53


అర్థము: పురాణ-సంఘంబు + కూడి = పురాణముల యొక్క సమూహము కూడి, గ్రంథ-సంఖ్యన్ = గ్రంథము యొక్క సంఖ్యచేత, నాల్గు లక్షలు + ఔ = నాలుగు లక్ష లగు, ఈ -పురాణములలోనన్, నూఱు వేలు + గ్రంథములలోన్ = లక్ష సంఖ్యగల గ్రంథములో, నుతి-వహించి = పొగడ్త పొంది, శ్రీ మహాస్కాంద-సంహిత = శ్రీమహాస్కాంద పురాణమునందలి ఈశాన-సంహిత, శివునిన్, చెప్పున్.

తాత్పర్యము; మొత్తము పురాణములన్నియు గలిసి నాలుగు లక్షల గ్రంథమగును. అందు ఒక లక్ష గ్రంథమగు శ్రీ మహాస్కాందపురాణమునందలి ఈశానసంహిత శివుని గూర్చి చెప్పును.

విశేషములు: సంహిత = పురాణములో కొంతభాగము.

వ. అందు శివరాత్రి మాహాత్మ్యంబు చెప్పంబడియుండు నమ్మహావ్రతం బెట్టి దెవ్వరాచరించి రే ఫలంబు నొసంగు మాకుం బరిపాటి తేటపడ వివరింపుమనిన నక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె. 54.

అర్థము: అందున్ = ఈశాన సంహితయందు, శివరాత్రి మాహాత్మ్యంబు, చెప్పంబడి + ఉండున్, ఆ + మహా(మహత్) + వ్రతంబు, ఎట్టిది, ఎవ్వరు ఆచరించిరి, ఏ ఫలంబున్, ఒసంగున్, మాకున్, పరిపాటి = క్రమము, తేటపడన్ = స్పష్టపడునట్లు, వివరింపుము + అనినన్, ఆ + కథకుండు = ఆ కథ చెప్పువాడయిన సూతుడు, శౌనక + ఆది-మహా(మహత్) + మునులకున్ = శౌనకుడు మొదలగు గొప్ప మునులకు, ఇట్లు + అనియెన్.



1.ము. నాల్గు లక్షల

తాత్పర్యము: `ఈశాన సంహితయందు శివరాత్రి మాహాత్మ్యము చెప్పబడి యున్నది. ఆ మహావ్రత మెట్టిది? పూర్వ మెవరాచరించిరి? అది యే ఫలము నిచ్చును?మాకు క్రమముగా స్పష్టపడునట్లు చెప్పుము,. అని శౌనకుడు మున్నగు మహర్షులు సూతు నడుగగా, నతడు వారికిట్లు చెప్పెను.

ఉ. తాపస సార్వభౌములు సదా శివరాత్రి మహావ్రతంబు[1]దో
షాప హృతిక్షమంబు వినుఁడాదరణంబున నేను సద్గురు
శ్రీపద పద్మము ల్దలంచి చెప్పెద శంకర సంహితా కథా
దీపిత భవ్య మార్గమునం దేటపడన్ మొదలింటనుండియున్.

అర్థము: తాపస-సార్వభౌములు = ఓ ముని చక్రవర్తులారా! శౌనకాదులారా! శివరాత్రి మహా (మహత్) + వ్రతంబు, సదా = ఎల్లప్పుడును, దోష + అపహృతి-క్షమంబు = దోసములయొక్క (పాపములయొక్క) అపహరణమునందు (తొలంగించుటయందు), సమర్థమయినది, నేను, సత్ + గురు-శ్రీ-పద-పద్మముల = మంచి గురువులయొక్క (వ్యాసమహర్షుల యొక్క, శోభాయుక్తములయిన, అడుగుదామరలను, తలంచి, శంకర.....మార్గమునన్: శంకర-సంహిత = ఈశాన సంహితయందలి, కథా = కథచేత, దీపిత = ప్రకాశింపజేయబడిన, భవ్య = శుభమైన, మార్గమునన్ = విధమున, తేటపడన్ = స్పష్టపడునట్లు మొదలింటినుండియున్ = మొదటి నుండియు, చెప్పెదన్ ఆదరణంబునన్ = ప్రీతితో, వినుడు.

తాత్పర్యము: ఓ శౌనకాది ముని చక్రవర్తులారా! శివరాత్రి మహావ్రతము ఎప్పుడును పాపములను హరింప సమర్థమయినది. నేను సద్గురువులైన వ్యాసమహర్షుల దివ్య పాదపద్మములను దలచి యీశాన సంహిత యందలి కథల పద్ధతిని మొదటినుండియు తేటపడునట్లు చెప్పెదను. ప్రీతితో వినుడు.

విశేషములు: తాపస సార్వభౌములు వినుండు:`మధ్యమ పురుష యోగంబునం దారగాగమంబు విభాషనగు' బాల. వ్యా. తత్సమ 37

గీ. ప్రళయకాలంబు[2]తుదఁ గాళరాత్రి చనిన
[3]నపరమగు సర్గమునకు బీజాంకురంబు
శీతమును నుష్ణమును[4]గాక చిలుప చిలుప
గంధవాహంబు [5]వీచె నిర్గంధ మగుచు 56

అర్థము: ప్రళయ-కాలంబు-తుదన్ = ప్రళయసమయము చివర, కాళరాత్రి = చీకటిరేయి, చనినన్ = కడవగా, అపరము + అగు = మఱియొకటి యగు,

---

1.ము. దోషాపహృతి క్రమంబు. 2. తా. తుదిం. 3. తా. పరమమగు స్వర్గమునకు. 4. ము. గాఁగఁ. 5. ము. వీఁచు.

సర్గమునకున్ = సృష్టికి, బీజ + అంకురంబు = విత్తనపు మొలక, శీతమును + చల్లనిది, ఉష్ణమును-వేడిదియును, కాక = కాకుండునట్లు, గంధవాహంబు = వాయువు, నిర్గంధము + అగుచున్ = వాసన లేనిదియగుచు, చిలుప చిలుప =అత్యల్పముగా, వీచెన్.

తాత్పర్యము: ప్రళయ సమయాంతమున చీకటి రేయి కడచిన పిమ్మట మరల సృష్టి జరుగుటకయి విత్తనపు మొలక చల్లనిది వేడిది కాకుండునట్లు వాయువు వాసనారహితముగా అత్యల్పముగా వీచెను.

విశేషములు: విత్తనము మొలకెత్తవలయు నన్న అతిశైత్యము, అత్యౌష్ణ్యము పనికిరావు. వాయువు నిర్గంధముగను, అత్యల్పముగను వీచుట ఆవశ్యకము. ప్రళయ సమయమున జగత్తంతయు జలమయముగను, అంధకారబంధురముగను నుండును. ప్రళయాంతమున నంధకారము పోయిన పిమ్మట ధాత మరల సృష్టిచేయ నారంభించెను.

సీ. మూలముట్టుగను[1] నున్మూలనంబును బొంది
మహీధరంబులు రూపుమాలియుండఁ
ద్రిభువనంబులఁ జలత్తృణ రాశియునుఁ బోలె
సప్తార్చిచేత భస్మంబు గాఁగం
బుష్కలావర్త కాంభోధరంబులు వృష్టి
విశ్వప్రపంచంబు వెల్లి గొనఁగ
భూర్భువస్స్వర్లోకములు మహర్లోకంబు
జనలోక మెక్కి విశ్రాంతి మెఱయ

గీ. నఖిల దిక్కులు ముంచి బ్రహ్మాండ గోళ
మప్పళింపుచు సప్తార్ణ (వాంబువులును)
నిండికొని యుండఁగా రిత్తనింగితోడఁ
గొంతకాలంబు శూన్యమై గొడ్డుపోయె 57

అర్థము: మహీధరంబులు = కొండలు, మూలముట్టుగన్ = సమూలముగా, ఉన్మూలనంబును = పెల్లగిల్లుటను, పొంది, రూపుమాలి + ఉండన్ = రూపము చెడి యుండగా, త్రిభువనంబులన్ = మూడులోకములును (స్వర్గ, మర్త్య, పాతాళములు),చలత్ + తృణ-రాశియును + పోలెన్ = కదలుచున్న, గడ్డియొక్క, ప్రోవు విధమున, సప్తార్చి చేతన్ (సప్త + అర్చి) = అగ్నిచేత, భస్మంబు + కాఁగన్ = బూడిదకాగా, పుష్కల + ఆవర్తక + అంభోధరంబులు = పుష్కలము, ఆవర్తకము అను పేర్లుగల మేఘములు, వృష్టిన్ = వర్షముతో, విశ్వ-ప్రపంచంబున్ = సర్వ

1. తా. సమున్మూలాంజనము బొంది.

జగత్తును, వెల్లి-కొనఁగన్ = ప్రవాహమున ముంపంగా, భూః + భువః +స్వః + లోకములున్ = భూలోక, భువర్లోక, స్వర్గలోకములును, మహః + లోకంబున్ = మహర్లోకమును, జనలోకము, ఎక్కి, విశ్రాంతిన్ = విశ్రాంతిచేత, మెఱయన్ = ప్రకాశింపగా. సప్త + అర్ణవ + అంబువులును = ఏడు సముద్రముల యొక్క జలములును, అఖిల-దిక్కులున్ = ఎల్ల దిశలను, ముంచి, బ్రహ్మాండ-గోళము = గోళాకారముగల బ్రహ్మాండమును, అప్పళింపుచున్ = ఆక్రమించుచు, నిండికొని + ఉండగాన్, రిత్త-నింగి తోడన్ = వట్టి ఆకాశముతో, కొంత-కాలంబు, శూన్యము + ఐ = ఏమియు లేనిదయి, గొడ్డు-పోయెన్ = వ్యర్థమయ్యెను.

తాత్పర్యము: కొండలు సమూలముగా పెల్లగిల్లి రూపు చెడియుండగను, స్వర్గ మర్త్య పాతాళములనెడి ముల్లోకములను చలించు గడ్డి మేటివలె అగ్నిచేత బూడిద కాగను, పుష్కలము, ఆవర్తకము అను పేరుగల మేఘములు వర్షముచే సర్వప్రపంచమును ప్రవాహమున ముంచి వేయగను, భూలోక, భువర్లోక, స్వర్లోకములును, మహర్లోకమును జనలోకము నెక్కి విశ్రాంతి గొని ప్రకాశింపగను, ఏడు సముద్రముల జలములను ఎల్ల దిక్కులను ముంచి బ్రహ్మాండ గోళము నాక్రమించుచు నిండి యుండగను, వట్టి యాకాశముతో కొంతకాలము శూన్యమయి గొడ్డువోయెను.

విశేషములు: కవి ఈ పద్యమున ప్రళయ సమయ బీభత్సమును వర్ణించెను. పుష్కల - పుష్కలమను మేఘాధిపతి భేదము -సూ.ని తక్కిన నిఘంటువులయందు ఈ యర్థమున పుష్కరమను శబ్దమే కలదు. పుష్కల శబ్దము గానరాదు. 'పుష్కరావర్తకాదిష' కు. సం. 2-50 వెల్లిగొనంగన్-`వెల్లిగొలుప'నను ప్రేరణార్థమున స్వార్థరూపము ప్రయుక్తము. భూలోక, భువర్లోక, స్వర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్త్వలోకములను నేడును ఊర్ధ్వలోకములు. అతల, వితల, సుతల, రసాతల, మహాతల, తలాతల, పాతాళము లేడును అధోలోకములు. భూలోకమంతయు ప్రళయ సమయమున జలమయము కాగా, అదియును, దాని పయిలోకములును జనలోకమున విశ్రాంతి గైకొనుచుండును. అప్పళింపుచున్ -అప్పళించు ధాతువునకు ముత్తు గాక, శత్రర్థకచువర్ణకము పరమగుచున్నది కావున ఇంచు కృకారమునకు పత్వాదేశము గలుగదు. కావు అప్పళించుచున్ సాధురూపము. ఈ సందర్భమున అప్పళించుచు వనియున్నను ఛందోభంగము కాదు. సప్తార్ణవములు: చూడు 10వ పద్యవ్యాఖ్య.

వ. అప్పుడు బహ్మ, నారాయణుండై శివయోగ ముద్రా ముద్రిత లోచనుండగుచు సముద్రంబు నడుమం బవ్వళించిన 58

అర్థము: అప్పుడు = ప్రళయ సమయమునందు, బ్రహ్మ, నారాయణుండు + ఐ = విష్ణు వయి, శివ-యోగ-ముద్రా-ముద్రిత-లోచనుండు = శివయోగమనెడి ముద్రచే చిహ్నితమైన కన్నులు గలవాడు, అగుచున్, సముద్రంబు-నడుమన్, పవ్వళించినన్ = పరుండగా.

తాత్పర్యము: ప్రళయ సమయమునందు బ్రహ్మ విష్ణు రూపమున శివ యోగ మనెడి ముద్రచే ముద్రితములైన కన్నులు గలవాడగుచు సముద్ర మధ్యమున పరుండగా - తరువాతి పద్యముతో నన్వయము.

క. జనలోక మెక్కి సిద్ధులు
వినుతించిరి జలధిసలిలవీచి[1]రింఖ
ద్ఘనజాతయోగనిద్రా
వినిమీలితదీర్ఘనయను విషధరశయనున్ 59

అర్థము: సిద్ధులు = దివ్యపురుషులు, జనలోకము + ఎక్కి, జలధి.....నయనున్: జలధి = సముద్రము యొక్క, సలిల -వీచీ = నీటి అలల చేత, రింఖత్ = నృత్యము చేయుచుండుటచే, ఘన = గొప్పగా-అధికముగా, జాత = పుట్టిన, యోగ-నిద్రా = యోగ నిద్రచేత, వినిమీలిత = విశేషముగా మూయబడిన, దీర్ఘ-నయనున్-పొడవైన కన్నులు గలవానిని, విషధర-శయనున్ = పాము సెజ్జగా గలవానిని - విష్ణువును, వినుతించిరి = మిక్కిలి పొగడిరి.

తాత్పర్యము: సిద్ధులనబడు దేవయోని విశేషములు, జనలోకము నెక్కి సముద్రపు టలల ఊపుచే ఎక్కువగా పుట్టిన యోగ నిద్రచే విశేషముగా మూయబడిన కన్నులు గలవాడు అగు పాప సెజ్జ గలవానిని - విష్ణువును మిక్కిలి పొగడిరి.

విశేషములు: సముద్రపు టలలు ఊగుచున్నవి. వాని యూపుచే నందు పాప సెజ్జపై శయనించిన విష్ణుమూర్తికి అధికముగా నిద్రవచ్చి కన్నులు మూతపడినవి. నయను-శయను-అంత్యప్రాసము.

గీ. దేవతలు సంస్తుతింపంగఁ దెల్లవాఱఁ
గల్పసంహారకాలంబు కాళరాత్రి
యంత మేల్కని కూర్చుండె నాదిపురుషుఁ
డాదిమబ్రహ్మ జగము సేయంగఁ దలఁచి 60

అర్థము: దేవతలు, సంస్తుతింపగన్-మిక్కిలి స్తోత్రము చేయగా, కల్ప-సంహార-కాలంబు = ప్రళయ సమయమునందలి, అగు, కాళరాత్రి = చీకటి రేయి, తెల్లవాఱన్, అంతన్ = తరువాత, ఆది-పురుషుఁడు=మొదటి పురుషుడు, అగు, ఆదిమ-బ్రహ్మ = మొదటి బ్రహ్మ, జగము + చేయంగన్ = లోకమును నిర్మింప, తలఁచి, మేల్కని (మేలు+కని), కూర్చుండెన్.

తాత్పర్యము: దేవతలు స్తోత్రము చేయుచుండగా ప్రళయ సమయపు చీకటి రేయి తెల్లవాఱెను. అంత ఆదిపురుషుడైన ప్రథమబ్రహ్మ లోకమును నిర్మింపదలచి నిద్రమేలుకొని కూర్చుండెను.

---

1. తా. రింఖో.

విశేషములు: మేల్కని-మేలు + కని-శబ్ద పల్లవము. `పదాంతంబు లయి యసంయుక్తంబు లయిన ను లు రు ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల వ్యా ప్ర. 16.

గీ. అభినవోన్మేషజిహ్మమైనట్టి దృష్టి
దిశలు వీక్షించెఁ ద్రిభువనాధీశ్వరుండు
[1]చింతనొందె లోకంబు[2]సృజించువెఱవు
హృదయమున (నిట్టిదని నిశ్చయింపలేక.) 61.

అర్థము; త్రిభువన + అధి + ఈశ్వరుండు=ముల్లోకములకు ప్రభువయిన బ్రహ్మ, అభినవ + ఉన్మేష-జిహ్మము = క్రొత్తగా, లేచుటచే, మందము, ఐన + అట్టి, దృష్టిన్ = చూపుతో, దిశలు = దిక్కులు, వీక్షించెన్ = చూచెను, లోకంబున్ = జగత్తును, సృజించు = పుట్టించునట్టి, వెఱవు = ఉపాయము, హృదయమునన్ = మనస్సునందు, ఇట్టిది + అని, నిశ్చయింపన్ + లేక = నిర్ణయింపజాలక, చింతన్ + ఒందెన్ = విచారించెను.

తాత్పర్యము: మూడులోకములకు నధిపతియైన బ్రహ్మ అప్పుడే లేచుటచే మందమయిన చూపుతో దిక్కులు చూచెను. లోకమును నిర్మించు నుపాయ మిదియని నిర్ణయింపజాలక అతడు విచారము నొందెను.

విశేషములు: దిశలు వీక్షించెఁ ద్రిభువనాధీశ్వరుండు-ఉభయవళులలో ప్రాదియతి, వెవు:వెరవు అని సాధురేఫ మధ్యగతముగా నుండవలయును, వెఱవు అను శబ్దము లేదు.

ఉ. (ఎక్కడఁ బోయెనో ధరణి యిందు విభాకరు)లెందణంగిరో
చుక్కల సుద్ది యెద్ది [3]యొకొ చూడఁగఁ గందుమె పర్వతంబులన్
దిక్కుల చాయలెవ్వి యని ధీరత నల్వీటు చింత[4]నొందె నే
(సక్కటి చూచినం దిమిరసం)హతి విశ్వము ముంచియుండగన్ 62

అర్థము: ఏ + చక్కటి-చూచినన్ = ఏ దిక్కు చూచినను, తిమిర + సంహతి = చీకటుల సమూహము, విశ్వమున్ = లోకమును, ముంచి + ఉండగన్, ధరణి = భూమి, ఎక్కడన్ + పోయెనో, ఇందు-విభాకరులు = చంద్రుడును, సూర్యుడును, ఎందున్, అణంగిరో = దాగిరో, చుక్కల = నక్షత్రములయొక్క, సుద్ది = మాట, ఎద్ది+ ఒకొ = ఏదియో, పర్వతంబులన్ = కొండలను, చూడగన్ + కందుము + ఎ = చూడ గలమా? దిక్కుల-చాయలు = దిక్కుల యొక్క జాడలు, ఎవ్వి=ఏవి, అని ధీరతన్ = గట్టి పూనికతో, నల్వ = బ్రహ్మ, ఇటు, చింతన్ + ఒందెన్ = విచారించెను.

1. ము. చింతనొంది. 2. ము. సృజింప. 3. తా. యకొ. 4. ము. నొందఁగా.

తాత్పర్యము: ఆ కాళరాత్రి యందు ఏ దిక్కు చూచినను చీకటుల ప్రోవు లోకమును ముంచి యుండగా బ్రహ్మ భూమి యెక్కడకు పోయెనో, చంద్రసూర్యు లెట డాగిరో, నక్షత్రముల వార్త యేదియో, కొండలను చూడగలమా, దిక్కుల జాడలేవి,'యని గట్టి పూనిక గలవాడయి చింతించెను.

విశేషములు: నల్వ = నలువ-`అచ్చికంబులం బదమధ్యంబుల నలడరల యత్వంబునకు లోపంబు బహుళంబుగానగు ప్ర.17. బహువ్రీహి నాలుగు + వా. వా = ముఖము-చతుర్ముఖుడు. `బహువ్రీహిని సమాసాంత కార్యంబులుం గానంబడియెడి' బాల సమాస. 22వృత్తియందు హల్లు పరమగుచుండగా `నాలుగు'నకు `నలు' ఆదేశము. `వా' అనునది హ్రస్వమగుటయే యిందలి సమాసాంతకార్యము; నల్వ + ఇటు = నల్వీటు-అత్వసంధి, ఏ + చక్కటి = ఏ సక్కటి-గసడదవాదేశము, సంహతి-`స్త్రియాం తు సంహతి ర్బృన్దం నికురుమ్బం కదమ్బకమ్'-అమరము. నలువ ధీరుడు గావుననే పరిస్థితి అంత అస్త వ్యస్తముగా నున్నను పూనిక విడువలేదు, నల్వ పదమిట సాభిప్రాయము `నాలుగు ముఖములతో నన్వేషించినను'అను స్వారస్యము లభించుచున్నది.

క. అంతఃకరణంబున నటు
చింతిలి యుండుచుం బ్రపంచ సృష్టికినిఁ [1]గ్రియో
దంతమ్ము లేక దుర్వ్యథ
సంతన కట్టంగ విధాత చాలం డయ్యెన్. 63

అర్థము : విధాత = బ్రహ్మ, అంతఃకరణంబునన్ = మనస్సునందు, అటు = ఆ రీతిగా, చింతిలి + ఉండుచున్ = విచారించుచు, ప్రపంచ-సృష్టికినిన్ = లోకము యొక్క నిర్మాణమునకు, క్రియా + ఉదంతమ్ము-ఉపాయము/అరంభము యొక్క సుద్ది, లేక, దర్వ్యథన్ = భరింపరాని వెతతో, సంతన-కట్టంగన్ = సిద్ధపడుటకు, చాలండు + అయ్యెన్ = సమర్థుడు గాకుండెను.

తాత్పర్యము: బ్రహ్మ తన మనస్సుననట్లు విచారించుచు, జగన్నిర్మాణమునకు నుపాయముగానక భరింపరాని వెతతో నందులకు సిద్ధపడుటకు సమర్థుడు గాకుండెను.

వ. వెండియు బహువిధంబుల నూహాపోహ లొనర్చియుం బుండరీక సంభవుండు భువన నిర్మాణ క్రియారంభంబునకు నుపాయంబు గానక చీకాకు పడి కాకోదర గ్రామణీ గ్రైవేయు భగవంతుం గృతాంత ఘస్మరు సంస్మరించి తత్ప్రసాదంబున వసుంధరా గోళంబు మహాంధకారమగ్నం బగుట యెఱిగి యజ్జగద్ధాత్రుల నుద్ధరింపం దలంచి.

---

1. తా. క్రియావంతవ్యుని కంతర్వ్యథ.

అర్థము: వెండియున్ = మఱియు పుండరీక-సంభవుండు = తెల్లదామర నుండి పుట్టినవాడు (బ్రహ్మ), బహు-విధంబులన్ =పెక్కురీతుల, ఊహ + అపోహలు = తర్కవితర్కములు, ఒనర్చియున్ = చేసియు, భువన-నిర్మాణ-క్రియా + ఆరంభమునకున్ + లోకము యొక్క, సృజించుట, అనెడి, పనియొక్క, ప్రయత్నమునకు, ఉపాయంబున్, కానక, చీకాకు పడి = కలతజెంది, కాకోదర-గ్రామణీ-గ్రైవేయున్ = పాములలో శ్రేష్ఠుడగు వాసుకి కంఠహారముగా గలవాడును, కృతాంత-ఘస్మరున్- యమాంతకుడును, అగు, భగవంతున్ = భగవంతుడైన ఈశ్వరుని, సంస్మరించి + తలంచి, తద్ + ప్రసాదంబునన్ = అతని అనుగ్రహముచేత, వసుంధరా-గోళంబు = భూవలయము, మహా (మహత్) + అంధకార-మగ్నంబు = గొప్ప చీకటిలో మునిగినది, అగుట, ఎఱిగి, ఆ + జగత్ + ధాత్రులన్ = ఆ జగత్తును, భూమిని ఉద్ధరింపన్ = పయికి లేవ నెత్తుటకు, తలంచి.

తాత్పర్యము: మఱియు ననేకరీతుల తర్కవితర్కములు గావించియు బ్రహ్మ లోక సృష్టి ప్రయత్నమున కుపాయముగానక కలత చెంది భుజగ రాజ కంఠహారుడును, యమాంతకుడు నగు భగవంతుని శివుని స్మరించి యతని యనుగ్రహమున భూవలయము పెను చీకటి మునిగియుండుట తెలిసి ఆ జగత్తును, భూమిని పయికి లేవనెత్త నెంచి -తరువాతి పద్యముతో నన్వయము.

శా. క్రోడాకారముఁ దాల్చి కంఠభవఘుర్ఘుర్ధ్వాన విస్ఫూర్తిఁ బా
తాళక్రోడ మహా[1]కటాహమున సందారింపఁ దత్కంధరా
గోళ స్థాయినియైన భూమి పృథువక్షోజ ప్రదేశంబున
న్లీలా సత్పులకాంకురంబు లెగయ న్వెన్నుండు మున్నీటిలోన్. 65

అర్థము: వెన్నుండు = విష్ణుడు, క్రోడ + ఆకారమున్ = వరాహము యొక్క రూపమును, తాల్చి = ధరించి, కంఠ.....స్ఫూర్తిన్; కంఠ = కుత్తుకయందు, భవ = పుట్టిన, ఘర్ఘుర్-ధ్వాన = ఘుర్, ఘుర్ అను ధ్వనియొక్క, విస్ఫూర్తిన్ = ప్రకాశముతో, విజృంభణముతో, పాతాళ.....హమునన్: పాతాళ-క్రోడ-మహా(మహత్) -కటాహమునన్ = గొప్ప కడవవంటి పాతాళలోకము యొక్క అంతర్భాగమునందు, సందారింపన్ = చీల్పగా, తద్ + కంధరా-గోళ-స్థాయిని = దాని యొక్క, గోళము వంటి మెడయందు నిలిచినది, ఐన, భూమి = భూదేవి యొక్క పృథు-వక్షోజ-ప్రదేశంబునన్ = పెద్ద, ఱొమ్ములయందు, లీలా-సత్-పులక + అంకురంబుల = విలాసముగల గగుర్పాటు యొక్క మొలకలు, ఎగయన్ = పొటమరింపగా, మున్నీటిలోన్ = మును + నీటిలోన్ = సముద్రమునందు.

తాత్పర్యము: విష్ణువు, వరాహ రూపమును ధరించి కంఠమునందు పుట్టిన

1.ము.కటాహము సముద్ఘాటింప. తా. కటాహమున సంధానింప.

ఘుర్, ఘుర్ ధ్వని విజృంభణముతో గొప్ప కడవవంటి పాతాళాంతర్భాగమునందు చీల్పగా, ఆ గోళమువంటి మెడయందు నిలచిన భూదేవి గురుకుచమండలమున విలాసపు గగుర్పాటు పొటమరింపగా, సముద్రమునందు-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: `ఘుర్ఘుర' వరాహ ధ్వన్యను కరణ శబ్దము. నేలను సందారించుట వరాహము పని. ఆది వరాహము భూమిని తన కోలపై బెట్టుకొని నట్లు పురాణములు చెప్పుచుండ, ఇందు కవి కంధరాగోళస్థాయిని యని చెప్పుచున్నాడు. ఆ వక్షోజములు భూమివి కావున `పృథు'శబ్దము సార్థకము. వెన్నుడు నాయకుడు. భూమి నాయిక, నాయకుని శృంగార చేష్టలకు నాయిక వక్షోజాదులపై పులక లెగయుట సహజము. ఇచ్చట లోతు మున్నీటి నీతలాడుటయే నాయకుని శృంగారచేష్ట. ఇందు డ,ళ,ల లకు ప్రాసమైత్రి చెల్లినది కావున నిది అభేదప్రాసము. మును + నీరు = మున్నీరు. నీరు బ్రహ్మ తొలిసృష్టి `యా సృష్టిః స్రష్టు రాద్యా' అభి. శా. కాళిదాసు.

గీ. లోఁతు మున్నీటిలోపల నీఁతలాడెఁ
గూట [1]కోలావతారుఁడై కైటభారి
చటుల వాల కశా ఘాత సంప్రభూత
[2]నీర మడ్డుస్వనంబున నింగి యద్రువ 66

అర్థము: కైటభ + అరి = కైటభుడను రాక్షసునకు శత్రువు - విష్ణువు, కూట - కోల+అవతారుఁడు + ఐ = కపట వరాహము యొక్క అవతారము గలవాడయి, చటుల....స్వనంబునన్: చటుల = చంచలమయిన, వాల = తోక యనెడి, కశా = చబుకు (కొరడా) యొక్క, ఘాత = దెబ్బలవలన, సంప్రభూత = పుట్టిన, నీర = నీరు అనెడి, మడ్డు = గుమ్మెట యొక్క, స్వనంబునన్ = ధ్వనితో, నింగి = ఆకాశము, అద్రువన్ = అదురగా, లోతు-మున్నీటి లోపలన్ = లోతయిన సముద్రము లోపల, ఈ తలు + ఆడెన్.

తాత్పర్యము: విష్ణువు కపట వరాహవతారమును దాల్చి లోతయిన సంద్రమునం దీదులాడెను. దాని చంచలమైన తోక యనెడి చబుకుతో నీట గొట్టగా, అప్పుడు పుట్టిన ధ్వని గుమ్మెట వాయించి నట్లుండెను. ఆ ధ్వనికి మిన్ను అదరుచుండెను.

విశేషములు: నీటిని కొరడాతో గొట్టినప్పటి ధ్వని సరిగా గుమ్మెటను వాయించినప్పుడు పుట్టు ధ్వని వలెనే ఉండును. `వాల'మే `కశ' యని యభేదము చెప్పబడినది కావున రూపకాలంకారము. మడ్డుః- A kind of drum-Apte.సముద్రపు నీటిని గొట్టినప్పుడేర్పడు ధ్వనికి నింగి అద్రుచెననగా, నా ధ్వని యెంత పెద్దదో

1.ము. క్రోడావతారుఁడై. 2. తా. నీరవండు స్వరంబున.

యూహింపవచ్చును. `అద్రుచు'లో 'అ' గురువుకాదు. 'చుక్ప్రరక రువర్ణంబునకు ముందరి దువర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాషనగు నగుచో తత్పూర్వంబు గురువు గాదు' బాల. ప్రకీర్ణ.20 పద్రుచు ఇట్టిదే.

సీ. కాఁడి పాటిన మేని గరులు బ్రహ్మాండంబు
 [1]కడప పూబంతి కక్కజము దోఁప
ఖురపుటంబునఁ గీలుకొని మేరుకుధరంబు
 మువ్వలోపలి[2] ఙాతి మురువు[3]పడయ
దీర్ఘకంఠకఠోరఘుర్ఘురస్వనమునఁ
 బాతాళగోళంబు బాతళింప
నీలాంబుదశ్యామ నిబిడదేహచ్ఛాయ
 [4]బ్రళయాంధకారంబు దొలకరింప

గీ. సప్తపాతాళముల క్రిందఁ జాఁగి పడిన
యవని నెత్తె నిశాత దంష్ట్రాంకురమున
నభినవస్తబ్ధరోమ దివ్యావతారుఁ
డంబురుహలోచనుండు కల్పాదియందు. 67

అర్థము: కల్ప + ఆది + అందున్ = ప్రళయ సమయమునకు పిమ్మటి కల్పారంభమునందు, అభినవ.....తారుండు: అభినవ = నూతనమైన, స్తబ్ధరోమ = వరాహము యొక్క, దివ్య = దేవతా సంబంధమయిన, అవతారుఁడు = అవతారము గలవాడు, అగు, అంబురుహ-లోచనుండు = తామరలవంటి కన్నుల గల వాడు-విష్ణువు. కాడి-పాటిన-మేని-గరులు = గరిపొడిచిన ఒడలి గగ్గురులు, బ్రహ్మాండంబు-కడప-పూబంతికిన్ = బ్రహ్మాండమనెడి కడిమి పూబంతికంటె, అక్కజము + తోపన్ = ఆశ్చర్యమును కలిగింపగా, మేరు-కుధరంబు = మేరు పర్వతము, ఖుర-పుటంబునన్ = దొప్పలవంటి గొరిజయందు, కీలుకొని = తగులుకొని, మువ్వలోపలి = మువ్వయందలి, ఙాతి = ఙాతియొక్క, మురువు = అందము, పడయన్ = పొందగా, దీర్ఘ = పొడవైన (స్వనవిశేషణము), కంఠ = కుత్తుక యందలి, కఠోర = కఠినమైన, ఘుర్ఘుర = ఘుర్ఘుర అనెడి, స్వనమునన్ = ధ్వనిచేత, పాతాళ-గోళంబు = గోళాకారమయిన పాతాళలోకము, బాతళింపన్ = తత్తఱపడగా,. నీలాం.....చ్ఛాయన్: నీల = నల్లని, అంబుద = మేఘమువలె, శ్యామ = నల్లనిదియు, నిబిడ = దట్టమయినదియు, అగు, దేహ + ఛాయన్ = శరీరము రంగుచే, ప్రళయ + అంధకారంబు = ప్రళయకాలపుచీకటి, తొలకరింపన్ = వర్షింపగా. నిశాత-దంష్ట్రా + అంకురమునన్ = వాడియైన కోఱ మొలకచేత, సప్త-పాతాళముల క్రిందన్ = ఏడు

1. ము.కనుప. 2. తా. రాయి. 3. నెరయ. 4. ము. ప్రళయాంతకాలంబు

అధోలోకములక్రింద, చాగిపడిన = వ్రాలిపడియున్న, అవనిన్ = భూమిని, ఎత్తెన్.

తాత్పర్యము: ప్రళయ సమయావసానము కల్ప ప్రారంభమున నూతన వరాహరూపమును దాల్చిన విష్ణువు గఱిపొడిచిన తనమేని గగ్గురుపాటు బ్రహ్మాండమనెడి కడిమి పూబంతిని మించి ఆశ్చర్యమును కలిగింపగను, తన కాలి గొరిజయందు తగులుకొన్న మేరు పర్వతము మువ్వలోపలిఱాతి యందము నొందగను, తన కుత్తుక నుండి వెడలు నిడుపును, కఠినము నైన ఘుర్ఘురధ్వనిచేత పాతాళ గోళము తత్తఱ పాటు నొందగను, నల్లని మేఘమువలె శ్యామ వర్ణము గల తన మేని కాంతిచే ప్రళయాంధకారము వర్ధింపగను, ఏ డధో లోకముల క్రింద వ్రాలిపడియున్న భూమిని తన వాడియైనకోఱ మొలకచే నుద్ధరించెను.

విశేషములు: గగుర్పొడిచిన శరీరమును పూచిన కడిమితో పోల్చుట వాడుక. తనమేని ముండ్లను ఱిక్కించిన ముండ్లపంది మేనికి కడిమి పూవుతోడి పోలిక, పెద్ద మేరుపర్వతము చిక్కుకొని చిన్నఱాయివలె నున్నదనగా, నా ఖురమెంత పెద్దదో, అదిగల ఆ వరాహమెంత పెద్దదో ఊహింపనగును. దీర్ఘ, ఘుర్ఘుర శబ్దములలోని ఘకారావృత్తి వలన వరాహ కంఠ ధ్వని కఠోరత ధ్వనితము. అంబుదము నల్లగానుండును. అందుచేతనే `నీల'.దానివలె వరాహ దేహచ్ఛాయ నిబిడము. ఆకాశము మేఘావృతమయినప్పుడు అంధకారము వ్యాపించును. వరాహము మహాకాయము గావున తద్దేహ`నిబిడ'నైల్యముచే సామాన్యమయినది గాక ప్రళయాంధకారము వ్యాపించుచున్నది. అంబుదము గావున `తొలకరించు'ననుట. సప్త పాతాళముల క్రింద-ఎక్కడనో అట్టడుగునపడియున్న అనుట. అంత అడుగున పడియున్న దానిని లేవనెత్తుటకు వలయు సాధనము వాడిగా నుండవలయును. అందుచేతనే నిశాత'దంష్ట్ర పూబంతి కక్కజము-పంచమ్యర్థమున`కు'వర్ణకము, దేహ + ఛాయ = దేహచ్ఛాయ. హ్రస్వమునకు పరమైన `ఛ'కారము ద్విత్వమగును. `స్తబ్ధరోమ'-`దంష్ట్రీ ఘోణీ స్తబ్ధరోమా క్రోడో భూదార ఇత్యపి-అమరము.

వ. ఇవ్విధంబున మహాపర్వత సన్నిభంబును,*(నీలమేఘ ప్రతీకాశంబును, దంష్ట్రాదండ దారుణంబును, విపుల వృత్త ఘనస్కంధంబును, సమున్నతకటి తటంబును, హ్రస్వ వృత్తోరు జంఘాగ్రంబును, దీక్ష్ణ ఖురమండలంబును, పద్మరాగ సదృశేక్షణంబును, దృఢ దీర్ఘమహాప్రోథంబును, సముదీర్ణోచ్ఛ్వాస నిశ్వాస విఘూర్ణిత ప్రళయార్ణవంబును,) విద్యుచ్ఛటా పాటల (సటా)చ్ఛన్న కపోల స్కంధ బంధురంబును 'నయిన వరాహరూపం బావహించి రసాతలంబున సలిలమగ్న యగు పృథివి నుద్ధరించిన. 68

అర్థము: ఈ + విధంబునన్ = ఈ రీతిగా, మహా (మహత్) + పర్వత-సన్నిభంబును = గొప్పకొండవంటిదియు, నీల-మేఘ-ప్రతీకాశంబును = నల్లని మబ్బు

* తాళపత్రమున లేదు. ము. నట. 1.తా.నై.

వంటిదియును, దంష్ట్రా-దండ-దారుణంబును = దండము (క)వంటి కోలచే, భయంకరమును, విపుల-వృత్త-ఘన-స్కంధంబును = పెద్దది, గుండ్రనిది, గొప్పది యైన మూపు గలదియును, సమున్నత-కటి-తటంబును = మిక్కిలి యెత్తయిన మొల ప్రదేశము గలదియును, హ్రస్వ-వృత్త + ఉరు, జంఘా + అగ్రంబును = పొట్టివి, గుండ్రనివి, పెద్దవి యగు పిక్కల కొనలు గలదియు, తీక్ష్ణ = ఖుర-మండలంబును = వాడియైన వలయములవంటి గొరిజలు గలదియు, పద్మరాగ-సదృశ + ఈక్షణంబును = పద్మరాగమణుల వంటి (ఎఱ్ఱని)కన్నులు గలదియు, దృఢ-దీర్ఘ-మహా-ప్రోథంబును = గట్టిది, నిడుపయినది, పెద్దది యు ముట్టె గలదియును, సముదీర్ణ + ఉచ్ఛ్వాస-నిశ్వాస-విఘూర్ణిత-ప్రళయ + అర్ణవంబును = మిక్కిలి గొప్పది, యగు, లో వెలి ఊర్పులచే, మిక్కిలి తిరుగుడువడునట్లు చేయబడిన, ప్రళయ సమయమునందలి, సముద్రములు గలదియును, విద్యు....బంధురంబును:విద్యుత్ + ఛటా =మెఱపుల యొక్క, గుంపులవలె, పాటల = తెలుపు మించిన యెఱుపు గల, సటా = జూలుచే, ఛన్న = కప్పబడిన, కపోల = చెక్కిళ్ల చేతను, స్కంధ = మూపుచేతను, బంధురంబును = ఒప్పినదియును, అయిన, వరాహ-రూపంబు = పందియొక్క ఆకారము, ఆవహించి = ధరించి, రసాతలంబునన్ = పాతాళ లోకమునందు, సలిల-మగ్న = నీటియందు, మునిగినది, అగు, పృథివిన్ = భూమిని, ఉద్ధరించినన్ = లేవనెత్తగా-తరువాతి పద్యముతో నన్వయము.

తాత్పర్యము: ఈ రీతిగా చను గొండవలె నున్నదియు, నల్లని మబ్బు వలె నున్నదియు, కోలచే వెఱపించునదియు, పెద్ద గుండ్రని మూపు గలదియు, ఎత్తయిన మొల గలదియు, పొట్టిది గుండ్రనివి పెద్దవి యగు పిక్కలు గలదియు, వాడియైన గొరిజలు గలదియు, పద్మరాగ మణుల వలె నెఱ్ఱని కన్నులు గలదియు, గట్టి పొడవైన పెద్ద ముట్టె గలదియు, మిక్కిలి గొప్పవియగు లో వెలి యూర్పులచే తిరుగుడు వడునట్లు చేయబడిన సముద్రములు గలదియు, మెఱుపుల సమూహము వలె పాటల వర్ణముగల జూలుచే కప్పబడిన చెక్కిళ్లు మూపు గలదియు నైన వరాహాకారమును ధరించి పాతాళమున నీట మునిగియున్న భూమిని లేవనెత్తగా-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ఈ వర్ణనచే మహా వరాహము రూపమును కన్నులకు గట్టించినాడు కవిసార్వభౌముడు. ప్రోథ-`ఘోణా తు ప్రోథ మస్త్రియామ్'అని అమరమున ప్రోథమునకు గుఱ్ఱపు ముక్కు అనియే అర్థమున్నను, Apteనిఘంటువులో The snout of a hogఅనియు కలదు. విద్యుత్ + ఛటా-విద్యుచ్ఛటా-సకార త వర్గములకు శవర్ణ చ వర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శ వర్ణ చ వర్గ వర్ణము లాదేశ మగును. సటా + ఛన్న = సటాచ్ఛన్న, సటాఛన్న`ఆ'మా`ల యందు దప్ప మిగిలిన పదాంత దీర్ఘాచ్చులకుపరమైన ఛకారము ద్విరుక్త మగుట

వైకల్పికము.

గీ. దానవారాతి దంష్ట్ర నెత్తంగఁ బడిన
[1]యుర్వి సూపట్టు జలధి నీ రోడిగిలఁగ
పసిఁడికామ హత్తించిన పంబుతోడి
(క్రొత్త)వెలిపట్టు జగజంపు గొడుగువోలె 69

అర్థము: దానవ + అరాతి = రాక్షసులకు శత్రువైన విష్ణువు యొక్క, దంష్ట్రన్ = కోఱచేత, ఎత్తంగబడిన, ఉర్వి = భూమి, జలధి-నీరు = సముద్రపునీరు, ఓడిగిలఁగన్ = కాఱిపోఁగా, పసిఁడి-కామ = బంగారు కామ, హత్తించిన = పెట్టించిన, పంబు తోడి = గుబ్బతోగూడిన, క్రొత్త-వెల-పట్టు, = క్రొత్త తెల్ల పట్టు జగజంపు =పెద్దజాలరుగల, గొడుగు + పోలెన్ = గొడుగు విధమున, చూపట్టున్ = కనుపట్టును.

తాత్పర్యము: విష్ణుని కోఱచే నెత్తబడిన భూమి, సముద్రపు నీరంతయు కాఱిపోగా, బంగరు కామ పెట్టించిన గుబ్బతోగూడిన క్రొత్త తెల్లపట్టు పెద్ద జాలరుగల గొడుగువలె కనుపట్టెను.

విశేషములు: ఉర్వి గొడుగు వోలె చూపట్టు ననుటచే నుపమాలంకారము. విష్ణువు కోఱచే నుర్వి నెత్తగనే దానిపై నున్న సంద్రపు నీరంతయు కాఱిపోయినది-నీటిలో నున్న బంతిని పయికెత్తగనే దాని కంటిన నీరంతయు కాఱి పోవునట్లు విష్ణునికోఱ బంగరుకామ వలెను, దాని పయినున్న భూమి కామపై విచ్చుకున్న గుబ్బవలెను, ఓడిగిలు జలధినీరు వెలిపట్టు జగజంపు వలెను నున్నవనుట. ఉర్వి గుండ్రనిదయి, విప్పిన గొడుగు గుబ్బవలెనే ఉండును. పంబు = పంబు నట్టిది-వ్యాపించునట్టిది కావున పంబు గొడుగు గుడ్డ కూడ విప్పినప్పుడు పంబును. జగ-జంపు-`జగ'జగము (=పెద్ద)లోని మువర్ణకమునకు వృత్తిని లోపము. జంపు = ముత్యములు మొదలగువాని జల్లి, జాలరు. `జగజం పనంగను జల్లి నా జంపన ఝుల్లరీ నామమై యుల్లసిల్లు.'ఆం.భా.

సీ. జయ జయధ్వనులతో సనకాదిమునికోటి
వేదాక్షరంబుల వినుతి సేయ
బహుళ సౌరభ(పరంపర)లుప్పతిల్లంగ
విద్యాధ(రులు పుష్పవృష్టి)గురియ
దివ్య దుందుభి సముత్థిత నినాదంబుల
(భువన నిష్కం)భంబు బోరు కలఁగ

1. ము.తా సుట్టను.

జోకయై యప్సర స్సుదతీ కదంబంబు
నింగిమీఁదఁ బ్రమోదనృత్త మాడ

గీ. జద్దు వడి యుండె నొక కొంత ప్రొద్దు వేడ్క
నవయవంబులు గరుదాల్ప నచ్యుతుండు
ప్రళయ జలనిధి క్రింద (లోఁబ)డిన యట్టి
యుర్వి దంష్ట్రాంకురంబున నుద్ధరించి. 70

అర్థము: అచ్యుతుండు = విష్ణువు, ప్రళయ-జలనిధి క్రిందన్ = ప్రళయ సమయము నాటి సముద్రము అడుగున, లో బడిన + అట్టి = వశపడినట్టి, ఉర్విన్ = భూమిని, దంష్ట్రా + అంకురంబునన్ = కోఱ మొలకచే, ఉద్ధరించి = లేవనెత్తి, జయజయ ధ్వనులతోన్ = జయ జయ అను నినాదములతో, సనక + ఆది-ముని-కోటి = సనకుడు, మొదలగు, మునుల యొక్క, సమూహము, వేద + అక్షరంబులన్ = వేదములందలి, అక్షరములతో, వినుతి + చేయన్ = స్తుతింపగా, విద్యాధరులు = విద్యాధరులను పేరుగల దేవయోని విశేషము, బహుళ-సౌరభ-పరంపరలు = అధికములయిన, పరిమళముల యొక్క, వరుసలు, ఉప్పతిలంగన్ = పుట్టునట్లు, పుష్ప-వృష్టి = పూలవాన కురియన్, దివ్య-దుందుభి-సముత్థిత-నినాదంబులన్ = దేవతా సంబంధములయిన, భేరుల వలన పుట్టిన, ధ్వనులచే, భువన-ని (వి)ష్కంభంబులు = లోకముల యొక్క విరివి, (నిష్కంభము గాక విష్కంభ మయియుండవచ్చును), బోరు కలఁగన్ = మ్రోగగా, అప్సరస్ + సుదతీ-కదంబంబు = అచ్చరలనెడు, స్త్రీలయొక్క, సమూహము, జోక + ఐ = మొత్తమయి, నింగి-మీఁదన్ = ఆకాశముపయిని, ప్రమోద-నృత్తము + ఆడన్ = సంతోషముతోడి నృత్యము చేయగా, వేడ్కన్ = వేడుకతో, అవయవంబులు=అంగములు, గరు-తాల్పన్ = గగుర్పాటు చెందగా, ఒక-కొంత-ప్రొద్దు = కొంచెము సేపు, జద్దువడి + ఉండెన్ = పారవశ్యము చెందును.

తాత్పర్యము : విష్ణుమూర్తి ప్రళయకాలపు సముద్రము నడుగునబడి యున్న భూమిని తన కోఱచే నెత్తి, సనకుడు మున్నగు మునుల సమూహము జయజయ నాదములతో వేదవాక్కులతో స్తోత్రము చేయుచుండగను, విద్యాధరులు తఱుచయిన పరిమళము పుట్టునట్లు పూలవాన కురియుచుండగను, దేవతల భేరులవలనపుట్టు ధ్వనులచే లోకము లన్నియు, మ్రోగుచుండగను, అచ్చరలు మొత్తమయి ఆకాశముపై సంతోషముతో నృత్యము చేయుచుండగను, వేడుకతో అంగములు గగుర్పాటు చెంద నొకకొంతసేవు పారవశ్యము చెంది యుండెను.

విశేషములు: విద్యాధరులు-వారిలో స్త్రీలును పురుషులును. 'నిష్కంభ' శబ్దము కనబడలేదు. అది విష్కంభమయి యుండవచ్చును. విష్కంభమనగా విరివి-విస్తృతి,

జద్దువడు, = జడ్డువడు-రెండు నున్నను ప్రాసయతి చెల్లుటకు` జద్దువడియుండె 'ననునదియే సరియైన పాఠము.

గీ. సురలు తన మీఁదఁ బువ్వులసోన గురియఁ
జూడ నొప్పా[1]రె హరి[2]శఠక్రోడ మూర్తి
కందరంబుల ఖద్యోతగణము మెఱయఁ
జాల నొప్పారు నంజనాచలమువోలె 71

అర్థము: శఠ-క్రోడ-మూర్తి = కపట వరాహము నాకారము గలవాడు, అగు, హరి = విష్ణువు, సురలు = దేవతలు, తనమీదన్, పువ్వుల-సోన = పూలవాన, కురియన్, కందరంబులన్ = గుహలయందు, ఖద్యోత-గణము = మిడుగురుల, గుంపు, మెఱయున్ = ప్రకాశింపగా, చాలన్ = మిక్కిలి, ఒప్పారు = ఒప్పునట్టి, అంజన + అచలము + పోలెన్ = కాటుకకొండ వలె, చూడన్ = చూచుటకు, ఒప్పారెన్ = ఒప్పెను.

తాత్పర్యము: కపట వరాహమూర్తియగు విష్ణువు దేవతలు తనపై పూలవాన కురియగా, గుహలలోపల మిడుగురులు ప్రకాశించుచుండగా మిక్కిలి యొప్పు కాటుకకొండవలె నొప్పెను.

విశేషములు: ఉపమాలంకారము హరి-అంజనాచలము, పుష్పములు-ఖద్యోతములు హరి నల్లనివాడుగావున నల్లని అంజనాచలముతో పోలిక, శరీరముపైబడిన పువ్వులు, కందరములలో మెఱయు మిడుగురులవలె నుండెను. `ఖద్యోతో జ్యోతిరిఙ్గణః' - అమరము. మిణుగురుపురుగు

వ. ఇవ్విధంబునం బ్రళయ సలిలోపద్రవం బు[3]డిపి ధాత్రి[4]బూర్వస్థానంబున సంస్థాపించి సర్వ సర్వంసహాభార*(వహన)నంబునం బ్రభవించిన ప్రయాసఖేదం బుజ్జగించుట[5]కయి పాఁపసెజ్జపై మున్నీటి నట్టనడుమఁ బవ్వళించి నారాయణుండు నిజాంతరంగంబున

అర్థము: ఈ + విధంబునన్ = ఈ రీతిగా, ప్రళయ-సలిల + ఉపద్రవంబున = ప్రళయ సమయము నందలి నీటి హావడి, ఉడిపి = పోగొట్టి, ధాత్రిన్ = భూమిని, పూర్వ = స్థానంబునన్ = ఎల్ల భూమి యొక్క బరువు యొక్క మోయుటచేత, ప్రభవించిన = పుట్టిన, ప్రయాస-ఖేదంబు = శ్రమము వలని దుఃఖము, ఉజ్జగించుటకయి = విడుచుటకయి, నారాయణుండు = విష్ణువు, పాపసెజ్జపైన్ = పాము పాన్పుపై, మున్నీటి-నట్టునడుమన్ = సముద్ర మధ్యమున, పవ్వళించి = పరుండి, నిజ + అంతర్గతంబునన్ = తన మనస్సునందు.

---

1. తా.రు. 2. తా. శ్వేత. 3. ము. ఁదీర్చి 4. తా. నుద్ధరించి 5. తా.పై.

తాత్పర్యము: ఈ రీతిగా విష్ణుమూర్తి ప్రళయకాలపు నీటి హావడిని పోగొట్టి, భూమిని యథా పూర్వ స్థానమున నిలిపి, ఎల్లభూభారవహనముచే పుట్టిన అలసట వలని వంతను పోగొట్టుకొనుటకయి పాప పానుపుపై సముద్రమధ్యమున పరుండి తన మనస్సునందు-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: సర్వంసహ = భూమి 'సర్వంసహా వసుమతీ మసుధోర్వీ వసున్ధరా' -సర్వం సహత. ఇతి సర్వంసహా-సర్వమును సహించునట్టిది కావుననే బరువెక్కువ. అందుచేతనే త ద్వహన ప్రయాసఖేదము. పాము + సెజ్జ = పాఁ పసెజ్జ• కొండకొచో సమాసంబులందు నా మ్వాది కనుమ్వాదుల మువర్ణంబులు పజ్ ప వర్ణబులగు బాల. సమాస19.

శయ్య ప్రకృతి. సెజ్జ వికృతి. నట్టనడుము-నడుము + నడుము-'ఆమ్రేడితంబు పరంబగునపుడు కడాదులం దొలియచ్చు మీఁది వర్ణంబుల కెల్ల నదంతంబగు ద్విరుక్తటకారంబగు 'బాల. సంధి.40

నారాయణుండు-నారా ఆపః అయనం స్థానం యస్య, సః నారము = జలము అయనం స్థానం యస్య సః. నారము = జలము అయనము = స్థానముగా గలవాడు-విష్ణువు ఈ శబ్దమిచ్చట సుష్ఠు ప్రయుక్తము.

శా. దుర్వారోద్యమభంగి దంష్ట్రికతుదిన్ దూరంబుగా [1]నెత్తియేఁ
బూర్వస్థానమునందుఁ బెట్టితి యథాపూర్వంబుగా నిప్పుడీ
యుర్వీమండలి నెట్టివాఁ డ నొకొ యోహోయంచుఁ జిత్తంబునన్
గర్వించెన్ మధుకైటభాంతకు డు[2]దన్వద్వారి మధ్యంబునన్. 73

అర్థము: ఏన్ + నేను, ఇప్పుడు, ఈ-ఉర్వీ-మండలిన్ = ఈ భూమండలమును, దుర్వార + ఉద్యమ-భంగిన్ = అడ్డగించుటకు, శక్యముకాని, పూనిక యొక్క విధమున, దంష్ట్రిక-తుదిన్ = కోఱ చివర, దూరంబుగాన్ = దవ్వుగా, మిక్కిలి పైకి, ఎత్తి, యథా పూర్వంబుగాన్ = మునుపెట్లో యట్లు, పూర్వ స్థానంబునన్ = వెనుకటిచోట, పెట్టితిన్, ఎట్టి-వాడన్ + ఒకొ = ఎంతగొప్పవాడనో, ఓహో = ఆహా, అంచున్, మధు-కైట భాంతకుఁడు = మధుకైటభులను రాక్షసుల నంతమొందించినవాడు, అగు, విష్ణువు, ఉదన్వత్-వారి-మధ్యంబునన్ = సముద్రము యొక్క, నీటి యొక్క, నడుమ, చిత్తంబునన్ = మనసునందు, గర్వించెన్ = గర్వమునొందెను.

తాత్పర్యము: 'ఎవరును ఆపరాని పూనికతోనే నిప్పుడు కోఱతుదిని ఈ భూమండలమును మిక్కిలి పైకెత్తి యథాపూర్వ స్థానమునపెట్టితిని. ఆహా నే నెంత

1. ముసైతి 2. తా. హృద్యద్వారి..

గొప్పవాడను' అని విష్ణువు సముద్రజలమధ్యమున నుండి మనసులో నహంభావమును పొందెను.

విశేషములు: ఆ యుద్యమము దుర్వారము గనుకనే విష్ణున కంతటి అహంభావము. దూరంబుగాన్ = సముద్రమున కట్టడుగున నున్న భూమిని మిక్కిలిపైకి ఉదన్వత్. ఉదన్వంతుడు(తత్సమము) = సముద్రుడు `ఉదన్వా నుదధి స్సిన్ధు స్సరస్వాన్ సాగరోర్ణవః'-అమరము `ఉదక మస్మి న్నస్తీత్యుదన్వాన్' ఉదకము గలిగినది. ఉదన్వత్ + వారి = ఉదన్వద్వారి-అనునాసికాంతస్థ వర్ణములు తప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (ఝల్లులకు)మృదుహల్లులు (హశ్శులు)కాని అచ్చులు కాని పరములగునపుడు ఆ హల్లుల వర్గమునకు చెందిన తృతీయ వర్ణ మాదేశమగును. యథా పూర్వము - పూరమనతిక్రమ్య, లేదా పూర్వ మనుసృత్య-పూర్వమును అతిక్రమింపక-పూర్వమునను సరించి-అవ్యయీభావసమాసము దంష్ట్ర-దంష్ట్రిక-స్వార్థమున కప్రత్యయము.

గీ. అంతనిటఁ దానతానగు నబ్జభవుఁడు
దంభ[1]కోలావతారుండు ధాత్రి [2]యెత్తఁ
జాగెఁ బ్రారబ్ధమార్గానుసారమునను
మొదలుకొని యెల్ల విష్టపములు[3] సృజింప 75

అర్థము: అంతన్ = తరువాత, ఇటన్ = ఇక్కడ, తాను + అగు = తానేతానగు అబ్జభవుఁడు = తామర నుండి పుట్టినవాడు, బ్రహ్మ, దంభ-కోల + అవతారుండు = కపట వరహరూపమును దాల్చినవాడు, అగు, విష్ణువు, ధాత్రి = భూమి, ఎత్తన్ = ఎత్తగా, ప్రారబ్ధ-మార్గ + అనుసారమునను = ప్రారంభింపబడిన త్రోవననుసరించి, మొదలుకొని = మొదలుపెట్టి, ఎల్ల -విష్టపములున్ = ఎల్ల లోకములును, సృజింపన్ = పుట్టించుటకు, చాగెన్ = సాగెను.

తాత్పర్యము: కపట వరాహావతారుడగు విష్ణువు భూమి నెత్తగా, నంత నిక్కడ అతడే యాతడైన బ్రహ్మ ప్రారంభింపబడిన మార్గము ననుసరించి మొదలిడి యెల్ల లోకములను నిర్మింపసాగెను.

వ. [4]మహత్సర్గంబు*(భూతసర్గంబు వైకారిక సర్గంబు నను)బుద్ధిపూర్వకంబులగు మూడును ప్రాకృత సర్గంబులు, ముఖ్య సర్గంబు, తిర్యక్సర్గంబు, దేవసర్గంబు, మానుష సర్గంబు, గ్రహసర్గంబును నా[5]నైదును బుద్ధి పూర్వకంబులు వైకృత సర్గంబులు; కౌమార సర్గంబు ప్రాకృత సర్గంబు ఈ తొమ్మిదియు నసాధకంబులు సాధకత్వంబును నైహికాముష్మిక హితాహిత తదుపాయ తత్ప్రతికార విరహితంబునం జేసి[6]ప్రయోజనంబు

1. ము. క్రోడావతారుఁడై. తా. కోలావతారుఁడై 2. ము. యెత్తి, సాగె 3. తా. సృజించె 4. తా. మహత్సరంబునాను. * తాళపత్రమున లేదు. 5 ము. నేడును. 6. తా. నిష్ప్ర

లగుట నీ తొమ్మిది సర్గంబుల వలననుఁ బ్రయోజనంబు గానక కనకగర్భుండు మహేశ్వరునిం బ్రస్తుతించి తత్ప్రసాదంబునం బురాణ ప్రజాపతుల*(కశ్యప)మరీచి భృగ్వాంగిరస పులస్త్య పులహ క్రతు దక్ష వసిష్ఠుల మానసంబునం దొమ్మండ్రను ధర్మా ధర్మ సంకల్పంబుల మూఁటినిం గూడఁ బన్నిద్దఱు పుత్త్రులంగాంచె. ఆ పన్నిద్దఱి వలననుం బండ్రెండు దివ్యవంశంబులు ప్రజావంతంబులుం గ్రియావంతంబులు నై ప్రవర్తిల్లె నందు*(దేవ)దైత్య దానవ ముని యక్ష గరుడ గంధర్వ కిన్నర కింపురుష సిద్ధ విద్యాధర కర్మదేవ తాప్సరః కామినీ రక్షో భూత పిశాచ మనుష్య పశు పక్షి మృగోరగ కీటక గిరి గ్రావ వృక్ష లతా గుల్మాదులును, గాయత్రీ త్రిష్టు ప్సామరథం తరంబులును, అగ్నిష్టోమ హయ మేధ వాజ పే యాతిరాత్ర పౌండరీకాదులు లోనుగాఁ గలుగు చరాచరంబులు ప్రాజాపత్యాంగోపాంగ ప్రత్యంగంబుల జన్మించె నివ్విధంబున నఖిల ప్రపంచంబు నిర్మించి విరించి నిజాంతర్గతంబున.

అర్థము: మహత్సర్గంబు......నసాధకంబులు: మహత్సర్గంబు, భూత సర్గంబులు, వైకారిక సర్గంబును, అను బుద్ధి పూర్వకంబులు + అగు, మూడును, ప్రాకృత సర్గంబులు, ముఖ్య సర్గంబు, తిర్యక్సర్గంబు, దేవసర్గంబు, మానుష సర్గంబు, గ్రహసర్గంబును, నాన్ = అనగా, ఐదును, బుద్ధి పూర్వకంబులు, వైకృత సర్గంబులు, కౌమార సర్గంబు, ప్రాకృత సర్గంబు, ఈ -తొమ్మిదియున్, అసాధకంబులు.

తాత్పర్యము: సర్గము ప్రాకృత మనియు, వైకృత మనియు రెండు విధములు. ఇవి రెండును బుద్ధి పూర్వకములు, అందు ప్రాకృత సర్గములు నాలుగు. అవి మహత్సర్గము, భూతసర్గము, వైకారిక సర్గము, కౌమార సర్గము. వైకృత సర్గములు ఐదు. అవి ముఖ్యసర్గము. మొత్తమీ తొమ్మిదియు అసాధకములు.

అర్థము: సాధకత్వంబును.....గాంచె: సాధకత్వంబును, ఐహిక + ఆముష్మిక = ఇహలోక, పరలోక సంబంధమైన, హిత + అహిత, తద్ + ఉపాయ, తద్ + ప్రతికార, విరహితంబునన్ + చేసి = సాధకత్వము, ఐహికము, ఆముష్మికము, హితము, అహితము, దాని ఉపాయము, దానికి ప్రతికారము అనునవి లేకపోవుటచేత, అప్రయోజనంబులు = ఉపయోగము లేనివి, అగుటన్ = అగుటచేత, ఈ, తొమ్మిది, సర్గంబుల వలనను, ప్రయోజనంబు, కానక, కనకగర్భుండు = బ్రహ్మ, మహేశ్వరునిన్, ప్రస్తుతించి, తద్ + ప్రసాదంబునన్ = ఆ యీశ్వరుని యనుగ్రహమువలన, పురాణ-ప్రజాపతులన్ = పురాతన బ్రహ్మలను, కశ్యప, మరీచి, భృగు + అంగిరస, పులస్త్య, పులహ, క్రతు, దక్ష వసిష్ఠులన్ = కశ్యపుడు, మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు, వసిష్ఠుడు అనువారిని, మానసంబునన్ = మనస్సుచేత, తొమ్మండ్రను = తొమ్మండుగురను, ధర్మ, అధర్మ, సంకల్పంబులనన్

= ధర్మము, అధర్మము, సంకల్పము అనువానిని, మూటినిన్, కూడన్ = కలిపి, పన్నిద్దఱు = పండ్రెండుగురు, పుత్త్రులన్ = కొడుకులను, కాంచెన్.

తాత్పర్యము: సాధకత్వము, ఐహికము, ఆముష్మికము, హితము, అహితము, తదుపాయము, తత్ప్రతికారము లేకపోవుటచేత పయి తొమ్మిదియు, నిష్ప్రయోజనములు అగుటచే వానివలన నుపయోగమును గానక బ్రహ్మ పరమేశ్వరుని వినుతించి తదను గ్రహమున కశ్యపుడు, మరీచి, భృగువు, ఆంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు, వసిష్ఠుడు అను తొమ్మండ్రు పురాతన ప్రజాపతులను, ధర్మము, అధర్మము, సంకల్పము, అను ముప్పురు గూడగా నైన పండ్రెండుగురు పుత్రులను గాంచెను.

అర్థము: ఆ పన్నిద్దరు.....ప్రవర్తిల్లె:అ, పన్నిద్ద వలననున్ = ఆ పండ్రెండుగురు పుత్త్రుల వలనను, పండ్రెండు, దివ్య, వంశంబులు, ప్రజావంతంబులన్, క్రియావంతంబులన్ + ఐ, ప్రవర్తిల్లెన్.

తాత్పర్యము: ఆ పండ్రెండుగురు కొడుకుల వలనను పండ్రెండు దివ్యవంశములు ప్రజావంతములును, క్రియావంతములు నయి ప్రవర్తిల్లెను.

అర్థము: అందు.....జన్మించె:అందున్ =ఆ పండ్రెండు వంశములందును, దేవ, దైత్య, దానవ, ముని, యక్ష, గరుడ, గంధర్వ, కిన్నర, కింపురుష, సిద్ధ, విద్యాధర, కర్మ, దేవతా, అప్సరః కామినీ, రాక్షస, భూత, పిశాచ, మనుష్య, పశు, పక్షి, మృగ + ఉరగ, = పాము, కీటక, గిరి, గ్రావ = ఱాయి, వృక్ష, లతా, గుల్మ = పొద, + ఆదులును, గాయత్రీ, త్రిష్టుప్, సామ, రథంతరంబులును, అగ్నిష్టోమ, హయమేధ, వాజపేయ, అతిరాత్ర, పౌండరీక + ఆదులున్ = అగ్నిష్టోమము, హయమేధము, వాజపేయము, అతి రాత్రము, పౌండరీకము మున్నగునవియును, లోనుగాన్ = మున్నుగా, కలుగు, చర + అచరంబులు = చరములు, అచరములు (కదలనివి), ప్రాజాపత్య = ప్రజాపతి సంబంధము లయిన, అంగ + ఉపాంగ-ప్రత్యంగంబులన్ = అంగములు, ఉపాంగములు, ప్రత్యంగములు ననువానియందు, జన్మించెన్.

తాత్పర్యము: ఆ పండ్రెండు వంశములందును దేవతలు, దైత్యులు, దానవులు, మునులు, యక్షులు, గరుడులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు, సిద్ధులు, విద్యాధరులు, కర్మ దేవతలు, అప్సరసలు, రాక్షసులు, భూతములు, పిశాచులు, మనుష్యులు, పశువులు, పక్షులు, మృగములు, ఉరగములు, కీటకములు, గిరులు, గ్రావములు, వృక్షములు, లతలు, గుల్మములు, మున్నగునవియును, గాయత్రి, త్రిష్టుప్పు, సామము, రథంతరములును, అగ్నిష్టోమము, హయమేధము, వాజపేయము, అతిరాత్రము, పౌండరీకము మున్నగునవియును, అగు చరములు, అచరములునైనవి ప్రజాపతుల అంగములనుండియు, ఉపాంగముల నుండియు, ప్రత్యంగములనుండియు జనించెను.

విశేషములు: అగ్నిష్టోమము = వసంతకాలమందు ఐదు దినములలో చేసి ముగించెడి యాగ విశేషము. హయమేధము = అశ్వమేధము = అశ్వమును పశువుగా నేర్పఱిచి సార్వభౌముడు చేయు యాగవిశేషము, వాజపేయము = యాగ విశేషము, అతిరాత్రము = జ్యోతిష్టోమమందలి ఒక భాగమగు యజ్ఞము, పౌండరీకము = యజ్ఞభేదము.

అర్థము: ఇవ్విధంబున నిజాంతర్గతంబున ఈ + విధంబునన్ = ఈ రీతిగా, అఖిల-ప్రపంచంబున్ = ఎల్లప్రపంచమును, నిర్మించి, విరించి = బ్రహ్మ, నిజ + అంతర్గతంబునన్ = తన మనస్సునందు.

తాత్పర్యము: ఈ రీతిగా ప్రపంచమునంతటిని సృజించి బ్రహ్మ తన మనస్సునందు - తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. ఏ నధికుండ నాకుఁ బ్రతియెవ్వరు నిర్జరకోటిలోన నేఁ
[1]గాని జగత్ప్రపంచపరికల్పన సేయఁగలేఁడు తక్కొరుం
డే నఖిలేశ్వరుండ నని యెవ్వరునుం బ్రతికోటి లేమిఁ దాఁ
దాన యహంకరించెను విధాత సదా[2]శివు మాయ పెంపునన్ 76

అర్థము: ఏను=నేను, అధికుండన్ = గొప్పవాడను, నాకున్, నిర్జర-కోటి లోనన్ = దేవతల సమూహము లోపల, ప్రతి = మాఱు, ఎవ్వరు, ఏన్ + కాని = నేనుగాని, తక్కు + ఒరుండు = తక్కిన యితరుడు, జగత్ + ప్రపంచ-పరికల్పన = లోకము యొక్క విస్తృతి యొక్క నిర్మాణము, చేయంగన్ + లేడు = చేయజాలడు, ఏను, అఖిల + ఈశ్వరుండన్ = నేను సర్వాధిపతిని, అని, ఎవ్వరునున్, ప్రతికోటి = మాఱుసమూహము, లేమిన్ = లేకపోవుట చేత, విధాత = బ్రహ్మ, సదాశివు = ఈశ్వరుని యొక్క, మాయ-పెంపునన్ = మాయ యొక్క అతిశయము చేత, తాన్ + తాన్ + అ = తనకుదానే, అహంకరించెను = గర్వించెను.

తాత్పర్యము: 'నేను గొప్పవాడను, నాకు దేవతలలో మాఱెవ్వరు? నేను తప్ప తక్కినవాడెవ్వడును లోక విస్తృతిని నిర్మింపజాలడు. నేను సర్వేశ్వరుడ' నని తన కెవ్వరును ఎదురు లేక పోవుటచేత నీశ్వరుని మాయపెంపుచే బ్రహ్మ తనకుతానే గర్వించెను.

విశేషములు; నిర్జర = దేవ. 'అమరా నిర్జరా దేవా స్త్రిదశా విబుధాస్సురాః- అమరము 'న విద్యతే జరా యేషాం తే -నిర్జరాః - ముదిమి లేనివారు ప్రపంచ - విపర్యాసే విస్తరే చ ప్రపఞ్చః'-అమరము. ప్రపంచ శబ్దము వైపరీత్యమునకును, విరివికిని పేరు.

1. తా.గాన. 2. తా. శివ

వ. ఇవ్విధంబున నవష్టంభంబు గైకొని యంభోరుహసంభవుండు తాను సృజియించిన భువన(భవన)నంబులు వీక్షింపం దలంచి రాయంచతే రెక్కి దిక్కులం జరించువాడు ముందట 77

అర్థము: ఈ + విధంబునన్, అంభోరుహ-సంభవుండు = పద్మభవుడు-బ్రహ్మ, అవష్టంభంబు = గర్వము, కైకొని = వహించి, తాను, సృజియించిన = పుట్టించిన, భువనంబులు = లోకములు, వీక్షింపన్ + తలంచి = చూడనెంచి, రాయంచ-తేరు + ఎక్కి = హంసవాహనము నెక్కి, దిక్కులన్ = దెసలందు, చరించువాడు = తిరుగువాడు, ముందటన్ = ఎదుట-

తాత్పర్యము: ఈ విధముగా బ్రహ్మ గర్వించి తాను నిర్మించిన లోకములను జూడనెంచి తన రాజహంస వాహనము నెక్కి దిక్కులందు తిరుగువాడు ముందట-తరువాతి పద్యముతో నన్వయము.

మహాస్రగ్ధర

అటఁ గాంచెం[1]బద్మగర్భుం డహిమ కరఘులీ హస్తి నక్రాది యాదః
పటలీ ధాటీ విహార ప్రచలిత మహిభృ త్పక్ష విక్షేప లీలా
[2]చటులో ర్మి వ్యాప్త ఘోషా సము పచిత దిశా సౌధ వీథీవిటంకా
వటు సంఘాటా ప్రతి [3]శ్రుద్భయ కలితజగద్వ్యాప్తి లబ్ధిన్ సుధాబ్ధిన్ 78

అర్థము: పద్మగర్భుండు = తమ్మిచూలి-బ్రహ్మ, అహిమకర.....లబ్ధిన్; అహి = (నీటి)పాములు, మకర = మొసలులు, ఘులీ = ఆడు తాబేళ్లు, హస్తి = ఏనుగులు, నక్ర = ఏనుగులను బట్టు జలజంతువులును, ఆది = మొదలుగా గల, యాదస్ (కః) = క్రూర జల జంతువుల యొక్క, పటలీ = సమూహము యొక్క, ధాటీ = దాడియును, విహార = విహరించుట చేత, ప్రచలిత = మిక్కిలి చలించిన, మహిభృత్ = కొండల యొక్క, పక్ష = ఱెక్కల యొక్క, విక్షేప-లీలా = ఆడించుట యనెడు క్రీడచే, చటుల = చలించు, ఊర్మి = అలలనుండి, వ్యాప్త = వ్యాపించిన, ఘోషా (ఘోష) = ధ్వనితో, సముపచిత = బాగుగా నిండిన, దిశా = దిక్కులనెడు, సౌధ = మేడలయొక్క, వీథీ = వరుసయొక్క, విటంక = కొనల యొక్క, అవటు = గోతులయొక్క, సంఘటా = లోపలిభాగములయందు, ప్రతిశ్రుత్ = ప్రతిధ్వనులచే, భయ = వెఱపుతో, కలిత = కూడికొనిన, జగత్ = లోకము నందు, వ్యాప్తి = వ్యాపించుట యొక్క, లబ్ధిన్ = పొందుట గలది, అగు, సుధా + అబ్ధిన్ = క్షీరసముద్రమును, అటన్ = అక్కడ, కాంచెన్ = చూచెను.

తాత్పర్యము: బ్రహ్మ అక్కడ క్షీర సముద్రమును చూచెను. ఆ క్షీర సముద్ర

1. తా.కంజ. 2. తా. చటులోర్మీ వ్యాపి. 3. తా. ద్వ్యతికలిత

మెట్లున్నదనగా -అందు నీటిపాములు, మొసళ్లు, ఆడుతాబేళ్లు, ఏనుగులు, నక్రములు మున్నుగాగల క్రూరజలజంతువులుండెను. అవి దాడిచేయుచుండుటచే నందలి పర్వతములు మిక్కిలి చలించు చుండెను. ఆ పర్వతముల తెక్కలు ఇటునటు కదలుచుండెను. ఆ క్రీడచే నందలి అలలు చలించుచుండెను. దానివలన పుట్టి వ్యాపించు రొదతో దిక్కులనెడి మేడల వరుసల కొనలయందలి పల్లపుప్రదేశములు ప్రతిధ్వనించుచుండెను. ఆ ప్రతిధ్వనుల వలని వెఱపుతో జగము నిండియుండెను.

విశేషములు: `అహిమకర---లబ్ధిన్'అను సుదీర్ఘసమాసము ఒక్కటే పద్యమంతయు నావరించి సుధాబ్ధి ఆయతత్వ గంభీరత్వములను సూచించు చున్నది. యాదస్- అథ యాదాంసి జలజన్తవః.' `యాన్తీతి యాదాంసి' = చరించునవి. అమరము. లేదా యతన్తే బాలమత్స్యాలే హన్తుమితి-యాదాంసి. బాలమత్స్యములను హింసించు కొఱకు యత్నము చేయునవి అనియైనను. జలజంతువులు. యాదశ్శబ్దము నిత్యబహువచనము. యాదస్ + పటలీ = యాదఃపటలీ-పదాంతసకారమునకు విసర్గా దేశము. ఇందలి విసర్గము పకార పరకము గావున నుపధ్మానీయము. క్రూర జల జంతువుల దాడిచే నచలములే చలించు చున్నవనగా తద్ధాటి ఉద్ధతి ఊహ్యము. పర్వతముల కొకప్పుడు తెక్కలుండెడివి. వాని నింద్రుడు తన వజ్రాయుధముచే తెగ్గొ గొట్టెను. ఇది యంతకు ముందు మాట కావచ్చును. లేదా సముద్రగర్భస్థలములయి కొన్ని పర్వతములింకనుతెక్కలను గలిగి యుండవచ్చును. పర్వతములు కదలుటచే వాని తెక్కలు నిటునటు నల్లాడుచుండెను. వానిచే సంద్రము నలలు మిక్కిలి చలించి పెద్దరొద పుట్టుచుండెను. ఆ రొదతో దిక్సౌధములు నిండుచుండెను. ఆ ప్రతిధ్వనుల విటంకముల (కొన)నున్న అవటువుల (గోతుల) సంఘటలు (పల్లపుప్రదేశములు) ఆ రొదకు ప్రతిధ్వనించు చుండెను. ఆ ప్రతిధ్వనులు జగద్భయంకరములుగా నుండెను; లబ్ధిన్-సుదాబ్ధిన్-అంత్యప్రాసము. ఘోషా-ధ్వన్యర్థకము `ఘోషః'ఆకారంతము పులింగము ఇటు ధ్వన్యర్థకమై ఆకారంతముగా నుండుట విచార్యము. విటంక-`కపోతపాలికాయాం తు విటఙ్కం పుంనపుంసకమ్' వీన్ పక్షిణః టంకమతి బధ్నాతీతి విటంకమ్. పక్షులను బంధించునది. ఇది మేడలు మొదలైన విహారస్థానములందుండును. (అమరము)విటంకము = పర్వత శిఖరము (సూ.ని.)అవటు- నేలలోని భొఱియ - (స్సూ.ని) A hole in the ground -Apte.సంఘటా-ఘాట యనగా శరీరమస్తకముల సంధిని ఘటించునది-పెడతల, ముచ్చిలిగుంట. ఘాట- సంఘాట రెండు నొక్కటే. `అవటు ర్ఘాటా కృకాటికా'-అమరము. ముచ్చిలిగుంట పల్లముగానుండును గాన పల్లపు ప్రదేశమని యిక్కడ అర్థము చెప్పబడినది. ప్రతిశ్రుత్- ప్రతిధ్వని-సూ.ని. `స్త్రీ ప్రతిశ్రు త్ప్రతిధ్వానే'ప్రతి శ్రూయతే ఇతి ప్రతిశ్రుత్-ఎదురుగా వినబడునది. ప్రతిధ్వని-అమరము. జగత్ + వ్యాప్తి-ప్రతిశ్రుత్ + భయ -ఝల్లునకు(త్) మృదు హల్లు (వ్యా)పరమగు చుండగా తద్వర్గ తృతీయ వర్ణాదేశము-జగద్వ్యాప్తి.

ప్రతిశ్రుద్భయ. ఛందస్సు-మహాస్రగ్ధర. ప్రతిపాదమునను ప, త, త, న, స, ర, ర, గ అను గణములుండును. 1-9-16 అక్షరములను యతిమైత్రి. ప్రాసనియమము గలదు.

లయగ్రాహి.

తోయజభవుండు మదిఁ బాయని యహంకరణ
మాయను[1] జగంబుల[2] కపాయము ఘటింప
జేయ సమకట్టి ఫణిశాయి నిరుపాధి శుభ
దాయకు సురాసుర నికాయ మకుటాగ్రో[3]
స్థాయి కురువింద సముదాయ ఘృణి[4]కోటి విశ
దాయత పదద్వయుం గళాయుతుని శ్రీనా
రాయణు రమారమణు డాయంజని నిద్దురకు
రాయిడిగ, నెవ్వఁడవురా యనుచుఁ బల్కెన్ 79

అర్థము: తోయజ-భవుండు = తమ్మిచూలి, బ్రహ్మ, మదిన్ = మనస్సునందు, పాయని = విడువని, అహంకరణ-మాయను = గర్వమువలని అవిద్యచేత, జగంబులకున్ = లోకములకు, అపాయము = చెఱుపు, ఘటింపన్ = చేయన్ = కలిగింప, సమకట్టి = పూని, ఫణి-శాయిన్ = పాముపయి పరున్నవాడును, నిరుపాధిన్ = ఉపాధి లేనివాడును, జాతి గుణక్రియా సంజ్ఞా రహితుడు, శుభ-దాయకున్ = శుభముల నిచ్చువాడును, సురా....ద్వయున్ సుర + అసుర = దేవతల యొక్కయు, రాక్షసుల యొక్కయు, నికాయ = సమూహము యొక్క, మకుట = కిరీటముల యొక్క, అగ్ర = కొనలందు, స్థాయి = ఉండు, కురువింద = మాణిక్యవిశేషములయొక్క, సముదాయ = సమూహముయొక్క, ఘృణి = కిరణముల యొక్క కోటి = సమూహము చేత, విశద + ఆయత = స్పష్టమైన-ప్రకాశించు, పద-ద్వయున్ = పాదముల జంటగలవాడును, కళా-యుతునిన్ = కళలతో(విద్యలతో) గూడుకొన్నవాడును, రమా-రమణున్ = లక్ష్మీనాథుడును, అగు, శ్రీ నారాయణున్ = శ్రీ విష్ణుమూర్తిని, డాయన్ + చని = సమీపింపవేగి, నిద్దురకున్ = నిద్రకు, రాయిడిగన్ = భంగమగునట్లు, ఎవ్వండవురా, అనుచున్, పల్కెన్.

తాత్పర్యము: బ్రహ్మ మనసున వీడని గర్వము వలని అజ్ఞానముచే లోకములకు హాని చేయబూని భుజగశయనుడును, ఉపాధిరహితుడును, శుభపదయుగము గలవాడును (దేవదానవులచే నమస్కరింపబడువాడును), కళలతో గూడుకొన్నవాడును, లక్ష్మీనాథుడును అగు శ్రీ విష్ణువును సమీపించి యతనికి నిద్రాభంగమగునట్లు `ఎవడవురా నీవు? 'అనుచు పలికెను.

---

1. తా.తి. 2. తా.న. 3. తా. గ్రా 4. తా. జాల వికటాయత

విశేషములు: లయగ్రాహి లక్షణము: ప్రతిపాదమునకు భ, జ, స, న, భ, జ, సన, భ, య గణములుండవలయును. ప్రతిపాదమునను నాలుగు ప్రాసయతులుండ వలయును. (1-9-17-25)ప్రాసనియమము గలదు.

క. లేలేమ్మెక్కడి వాండవు
పాలసముద్రమున భోగిపర్యంకమునం
దేలెద వొక్కండవు[1] ననుఁ
ద్రైలోక్యాధీశు[2]నెఱుంగుదా పరమేష్ఠిన్? 80

అర్థము: లే లెమ్ము, ఎక్కడి వాడవు, పాలసముద్రమునన్, భోగిపర్యంకమునన్ = పాపసెజ్జపై, ఒక్కండవు, తేలెదవు, త్రైలోక్య + అధి + ఈశున్ = ముల్లోకములకు అధిపతిని, పరమేష్ఠిన్, = బ్రహ్మను, ననున్, ఎఱుంగుదా =ఎఱుగుదువా?

తాత్పర్యము: లేలే ఎక్కడివాడవు? పాలసంద్రమున పాపసెజ్జ పై నొక్కడవు తేలియాడుచున్నావు. ముల్లోకములకు నధిపతిని, బ్రహ్మము నన్ను ఎఱుగుదువా?

విశేషములు: లే లెమ్ము = లెమ్ము + లెమ్ము. అనాదరార్థమున ద్విరుక్తి (ప్రౌఢ.శబ్ద.113) `ఆమ్రేడితంబు పరంబగునపుడు కృతహ్రస్వంబునుకు దీర్ఘంబగు'ప్రౌఢ. సంధి23. త్రైలోక్య-త్రిలోకముల సమాహారము, త్రిలోక-భావార్థకము ఎఱుంగుదువు+ఆ-లిఙ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాషనగు. బాల.క్రి.24 ఎఱుంగుదు + ఉ + ఆ-అందువగా గమంబులం దప్ప నపదాది స్వరంబు పరంబగునపు డచ్చునకు సంధియగు. బాల. సంధి. II -ఎఱుంగుదా పరమేష్ఠి- `బ్రహ్మాత్మభూః సురజ్యేష్ఠః పరమేష్ఠీపితామహః' -అమరము. `పరమే ఉత్కృష్టే పదే బ్రహ్మలోకాఖ్యే తిష్ఠతీతి పరమేష్ఠీ.' ఉత్కృష్ట స్థానమునందుండువాడు-బ్రహ్మ.

సీ. పాతాళభువనసప్తకము నిర్మించితి
వానితి విశ్వవిశ్వంభరయును
దిక్చక్రవాళ మెత్తితిం జక్కంజేయఁగాఁ
[3]బాఁతు కొల్పితి గోత్ర పర్వతముల
వరుసఁ దీర్చితి నేడు శరనిధానములకు
నారువోసితి నరణ్యములు పెక్కు
గ్రహతార నక్షత్ర గతు లేఱు పఱిచితి
సరణు లేర్చితి నభస్స్వంతమునకుఁ

1. తా. నన్. 2. ము. నెఱుంగురా. 3. తా. ము. పాదుకొల్పితి.

గీ. గదియఁ గూర్చితి బ్రహ్మాండకర్పరంబు
పరిధిగా [1]వాలిచితి మహావరణ జలము
నిట్టి నేఁ జేర వచ్చిన నెదురుకొనవు
పాన్పు డిగ్గవు దురవలేపమున నీవు. 81

అర్థము: పాతాళ-భువన-సప్తకమున్ = క్రిందిలోకముల నేడింటిని, నిర్మించితిన్ = సృజించితిని, విశ్వ-విశ్వంభరయును = సమస్త భూమిని, వానితిన్ = చేసితిని. దిక్ + చక్ర వాళము = దిక్కులయొక్క మండలము, చక్కన్ + చేయంగాన్ = చక్కబఱుచుటకు, ఎత్తితిన్ = పూనితిని, గోత్ర-పర్వతములన్-కుల పర్వతములను, పాదు కొల్పితిన్ = నెలకొల్పితిని. ఏడు, శర-నిధానములకున్ = సముద్రములకును, వరుసన్ = క్రమమును, తీర్చితిన్, అరణ్యములు = అడవులు, పెక్కు = అనేకములు, నారు + పోసితిన్ = మొక్కలు నాటితిని. గ్రహ-తార-నక్షత్ర-గతులు = సూర్యాది గ్రహముల యొక్కయు, అశ్విన్యాది నక్షత్రములయొక్కయు గమనములు, ఏఱు పఱితిన్ = స్పష్ట పఱిచితిని, నభస్వంతమునకున్ = వాయువునకు, సరణులు = త్రోవలు, ఏర్చితిన్ = ఏర్పఱిచితిని. బ్రహ్మాండ-కర్పరంబు = కొప్పెరవంటి బ్రహ్మాండము, కదియన్ + కూర్చితిన్ = ఘటించితిని, మహా-(మహత్) + ఆవరణ-జలమున్ = గొప్పదియగు ఆవరించుకొనియుండు నీటిని, పరిధిగాన్ = చుట్టుగా, వాలిచితిన్ = వంచితిని. ఇట్టి నేను = ఇంత గొప్పవాడనగు నేను, చేరన్ + వచ్చినన్ = సమీపింపగా, నీవు, దుస్ (దుర్) + అవలేపమునన్ = దుర్గర్వముచే, ఎదురు కొనవు = ఎదురురావు, పాన్పు-డిగ్గవు = ప్రక్కదిగవు.

తాత్పర్యము: `అధోలోకముల నేడింటిని సృజించితిని. సర్వభూమిని చేసితిని. దిఙ్మండలమును చక్కబఱుపబూనితిని. కులపర్వతములను నెలకొలిపితిని. సప్త సముద్రములకును క్రమము నేర్పరిచితిని. పెక్కడవులకు నాఱుపోసితిని. గ్రహములకు నక్షత్రములకు గమనములను కటాహమును ఘటించితిని. మహావరణ జలమును పరిధిగా వంచితిని. ఇట్టి ఘనుడనైన నేను సమీపింపగా, నీవు దుర్మదమున నెదురు రావు. పాన్పు దిగవు!

విశేషములు: పాతాళ భువన సప్తకము-అతల, వితల, సుతల, రసాతల, మహాతల, తలాతల, పాతాళములు వాను-(కుండలు)చేయు, విశ్వంభర-`భూ ర్భూమి రచలానన్తా రసా విశ్వమ్భరా స్థిరా' -అమరము`విశ్వం బిభర్తీతి విశ్వంభరా'విశ్వమును భరించునది. `విశ్వ మశేషం కృత్స్నం సమస్త నిఖిలాఖిలాని నిశ్శేషమ్'అమరము. చక్రవాళ-చక్రవాళం తు మణ్డలమ్-అమరము. పాదు కొల్పితి-పాంతు కొల్పితి-పాఠాంతరము, గోత్రపర్వతములు-మహేన్ద్రో మలయస్సహ్యః శ్శుక్తిమాన్ గన్ధమాదనః

1. ము. వాల్చితిని

విన్ధ్యశ్చ పారియాత్రశ్చ సప్తైతే కులపర్వతాః-నాఱు సరియైన రూపము. నభస్వంతము-వాయువు.

`నభస్వ ద్వాత పవన పవమాన ప్రభంజనాః' -అమరము. నభః కారణత్వాత్ నభోఽస్యాస్తీతి నభస్వాన్. ఆకాశము ఉత్పత్తిస్థానముగా గలవాడు. బ్రహ్మాండ కర్పరము-కర్పరమువంటి బ్రహ్మాండము-ఉపమానోత్తరపదకర్మధారయము.

గీ. ఎవ్వఁడవు చెప్పు మనిన లే నువ్వు నవ్వి
యిందిరావల్లభుండు బ్రహ్మ కిట్లు లనియె
నే జగత్కర్తనై యుండ నెట్లు నీవు
కర్త నని పల్కెదవు సిగ్గు గాదె చెపుమ 82.

అర్థము: ఎవ్వడవు, చెప్పుము, అనినన్, ఇందిరా-వల్లభుండు = లక్ష్మీ ప్రియుడు-విష్ణువు, లే నవ్వు (లేత + నవ్వు) = చిఱునవ్వు నవ్వి, బ్రహ్మకున్, ఇట్టులు, అనియెన్, ఏన్, జగత్ + కర్తను + ఐ + ఉండన్ = లోకములయొక్క సృష్టి కర్త నయి యుండగా, నీవు కర్తనని యెట్లు పలికెదవు. సిగ్గు లేదా చెప్పుము.'

విశేషములు: లేఁత + నవ్వు. `సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చు మీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు' బాల సంధి 36 లేనవ్వు

గీ. విని యెఱుంగవె కల్పాంతరవేళ నేను
దంభకోలావతార ముద్ధతి వహించి
సర్వ సర్వంసహాతల చక్ర[2] భరము
భరము దాల్చినాఁడను దంష్ట్రికాదండకోటి 83.

అర్థము: కల్ప + అంత-వేళన్ = ప్రళయ సమయమునందు, ఏను, ఉద్ధతిన్ = గర్వముతో, దంభ-కోల + అవతారము = కపట వరాహరూపమును, వహించి = ధరించి, సర్వ-సర్వం సహా-తల-చక్ర-భరమున్ = ఎల్లభూమండలము యొక్క బరువును, దంష్ట్రికా-దండ-కోటిన్ = కఱ్ఱవంటి కోఱ అంచున, తాల్చినాడను, విని, ఎఱుంగవె.

తాత్పర్యము: `ప్రళయకాలమున నేను గర్వముతో కపట వరాహరూపమును ధరించి యెల్ల భూభారమును కోఱ యంచున వహించితిని. విని తెలియవా?'

విశేషములు: దంభ-కపటోఽస్త్రీ వ్యాజ దమ్భోపధయ శ్ఛద్మకైతవే.-అమరము. కోల-`వరాహస్సూకరో ఘృష్టిః కోలః పోత్రీ కిరిః కిటిః'-అమరము. కోటి- `కోణస్తు స్త్రియః పాళ్యశ్రిః కోటయః'అమరము.

1. ము. క్రోడా. 2. ము. సరణి

శా. ఏలా వచ్చెదు డాయ, నెవ్వఁడవు నీ, వెచ్చోటికిం బోయె,[1]ది
ట్లేలా మ్రొక్కవు నాకు, గర్వ మింక నెంతే నోర్వ[2]కుందుంజుమీ,
త్రైలోక్యాధి[3]పుఁడన్, సురాసుర శిరోరత్న ప్రభామండలీ
వ్యాలీఢాంఘ్రి సరోరుహుండ, విడు, గర్వారంభసంరంభమున్ 84

అర్థము: డాయన్ = సమీపింప, వచ్చెదు = వచ్చెదవు, ఏలా, ఎవ్వఁడవు, నీవు, ఏ + చోటికిన్, పోయెదు, ఇట్లు, నాకున్, మ్రొక్కవు, ఏలా, ఇంకన్, గర్వము, ఎంత + ఏన్, ఓర్వక + ఉందున్ + చుమీ = మిక్కిలి సహింపనుసుమా, త్రైలోక్య + అధిపుండన్ = ముల్లోకములకును ప్రభంజను, సురా....రుహుండన్: సుర + అసుర = దేవదానవుల యొక్క, శిరస్ = శిరస్సులందలి (కిరీటములందలి), రత్న = మణులయొక్క, ప్రభా = కాంతులయొక్క, మండలీ = సమూహముచేత, వ్యాలీఢ = విశేషముగా నాకబడిన-మిక్కిలి స్పృశింపబడిన, అంఘ్రి-సరోరుహుండన్ = పద్మముల వంటి పాదములు గలవాడను, గర్వ + ఆరంభ-సంరంభమున్ = అహంకారము యొక్క, పూనిక యొక్క, ఆటోపమును, విడు = విడువుము.

తాత్పర్యము: `నీవు నా దగ్గఱ కేలవచ్చితివి? నీ వెవ్వడవు?ఎచ్చటికి బోయెదవు? నాకు నీ విట్లు ఏల నమస్కరింపవు? నీ గర్వము నింక నేనెంతమాత్రమును సహింపనుసుమా! నేను ముల్లోకములకును ప్రభుడను. దేవదానవుల కిరీటములందలి రత్నముల కాంతుల సమూహముచేత మిక్కిలి స్పృశింపబడిన పాదపద్మములు గలవాడను. అనగా వారు తమ శిరస్సులు నా పాదపద్మములకు సోక నమస్కరింతురనుట నీవు నీ గర్వాటోపమును విడువుము'.

విశేషములు: వచ్చెదు-వచ్చెదవు, పోయెదు-పోయెదవు - లిడ్లాట్టుల వకారంబునకు లోపము విభాషనగు. పిమ్మట అంద్వవగాగమసంధి. విడు = విడుము. `మధ్యమ పురుషమువర్ణకంబునకు హలవ సానంబులు పరంబులగునపుడు లోపము విభాష నగు' బాల. సం.47

గీ. అని వసుంధర నుద్ధరించిన బలంబు,
భువన సర్గం బొనర్చిన పూనికయునుఁ
గారణంబులుగాఁగ నాగ్రహము పూని
యచ్యుతుండు నజుండు గర్వాంధులగుచు 85

అర్థము: అని, వసుంధరన్ = భూమిని, ఉద్ధరించిన = లేవనెత్తిన, బలంబున్ = శక్తియును, భువన-సర్గంబు = లోకముల యొక్క సృష్టి, ఒనర్చిన = చేసిన, పూనికయును = ప్రయత్నమును, కారణంబులు, కాఁగన్, (క్రమముగా), అచ్యుతుండున్

1. ము.దీవేలా 2. తా. కుండంజుమీ 3. తా. పతిన్

= విష్ణువును, అజుండున్ = బ్రహ్మయును, గర్వ + అంధులు = గర్వముచే, కానని వారు, అగుచున్, ఆగ్రహము = కోపము, పూని.

తాత్పర్యము: అని భూమి నుద్ధరించిన బలము కారణముగా విష్ణువును, లోకసృష్టి చేసిన ప్రయత్నము కారణముగా బ్రహ్మయును గర్వము వహించి కన్నులు గానక కోపముబూని-తరువాతి వచనముతో నన్వయము.

విశేషములు: యథాసంఖ్యాలంకారము.

వ. [1]ఒండొరుల నెఱింగియు నయ్యిద్దఱు, మహేశ్వరు* (మాయా) ప్రభావంబున 86

అర్థము: ఒండొరులన్ = ఒకరి నొకరు, ఎఱింగియున్ = తెలిసియు, ఆ + ఇద్దఱున్ = హరి బ్రహ్మ లిరువురును, మహేశ్వరు = ఈశ్వరుని యొక్క, మాయా-ప్రభావంబునన్ = మాయయొక్క మహిమచేత-తరువాతి పద్యముతో నన్వయము.

గీ. నన్ను గెల్చి కదా నీవు నలిననాభ
యఖిల లోకేశ్వరుండవౌట యనియె బ్రహ్మ;
నన్ను గెల్చి కదా నీవు నలిన గర్భ
యఖిల లోకేశ్వరుండ వౌట యనియె శౌరి. 87

అర్థము: బ్రహ్మ నలిన-నాభ = తామర నాభియందుగలవాడా! ఓ విష్ణుమూర్తి! నీవు, అఖిల-లోక + ఈశ్వరుడవు = సర్వలోకప్రభుడవు, ఔట = అగుట, నన్నున్, గెల్చి-కదా! = గెల్చినప్పుడు కదా! అనియెన్, శౌరి = విష్ణువు, నలినగర్భ = తమ్మిచూలీ, నీవు, అఖిల-లోక + ఈశ్వరుడవు, ఔట, నన్నున్, గెల్చికదా, అనియెన్.

తాత్పర్యము: 'నన్ను గెల్చినప్పుడు కదా నీవు సర్వలోకేశ్వరుడవగుట!' అని హరి బ్రహ్మ లొకరితో నొకరు పలికిరి.

విశేషములు: నలిననాభ-నాభిశబ్దమునకు సమాసాంతమున కొన్నిచోట్ల 'అచ్'ప్రత్యము వచ్చును. నలిననాభుడు, దాని సంబోధనరూపము నలిననాభ.

వ. *(అని యవష్టంభ విజృంభణమున) 88

అర్థము: అని, అవష్టంభ = గర్వము యొక్క, విజృంభణమునన్ = అతిశయము చేత.

తాత్పర్యము: అని గర్వాతిశయముతో-తరువాతి పద్యముతో నన్వయము.

* తాళపత్రమున లేదు 1. ము ఒండరు నెఱింగిన యయ్యిద్దరు.

గీ. ఇందిరా నాయకుండు శార్ఙ మెక్కువెట్టి
గాండివము సజ్యముగం జేసెంగమలభవుండు
శరము లిద్దఱుం గాలాగ్ని సన్నిభంబు
లేసి రొండొరుపై శౌర్య మెసక మెసంగ 89

అర్థము: ఇందిరా-నాయకుండు = లక్ష్మి యొక్క భర్త-విష్ణువు, శార్ఙ్గము = శార్ఙ్గమను పేరుగల విల్లు, ఎక్కు + పెట్టెన్, కమల భవుండు = బ్రహ్మ, గాండివమున్ = సజ్యముగన్ = ఎక్కుపెట్టినదానినిగా, చేసెన్, ఇద్దఱున్, శౌర్యము = పరాక్రమము, ఎసకము + ఎసంగన్ = అతిశయింపగా, కాల + అగ్ని-సన్నిభంబులు = ప్రళయ సమయమునందలి, అగ్నితో, సమానములు, అగు, శరములు=బాణములు, ఒండొరుపైన్ = ఒకరిపై నొకరు, ఏసిరి = ప్రయోగించిరి.

తాత్పర్యము; విష్ణువు శార్ఙము నెక్కుపెట్టెను. బ్రహ్మ గాండివము నెక్కుపెట్టెను. ఇద్దఱును పరాక్రమ మతిశయింపగా నొకరిపై నొకరు ప్రళయానల సదృశములైన బాణములను ప్రయోగించిరి.

విశేషములు: శార్ఙము-చాప శ్శార్ఙ్గం మురారేస్తు-అమరము, సజ్యము = జ్యా(వింటినారి) సహితము.

మ. జవ మేపా[1]ర మురారి పద్మజ భుజా చక్రీభవచ్ఛార్ఙ్గగాం
డివ కోదండ వినిర్గత[2] ప్రబల సందీప్తాస్త్ర సంఘాతముల్
భువన క్రోడము నిండి భాను కిరణంబుల్ దూఱనీకుండుటం
బవలుం బర్వె మహాంధకారములు పైపై సూచినిర్భేద్యముల్. 90

అర్థము: మురారి........సంఘాతముల్: మురారి = విష్ణువు యొక్కయు, పద్మజ = బ్రహ్మయొక్కయు, భుజా = భుజములందలి, చక్రీభవత్ = వలయాకారముగా నగుచున్న, శర్ఙ్గ, గాండివ = శార్ఙము, గాండివము అనెడి, కోదండ = విండ్లనుండి, వినిర్గత = బయలు వెడలిన, ప్రబల = మిక్కిలి బలము గల, సందీప్త = మిక్కిలి ప్రకాశించు, అస్త్ర-సంఘాతముల్ = బాణములయొక్క సమూహములు, భువన-క్రోడము = లోకము యొక్క అంతర్భాగము, నిండి, భాను-కిరణంబుల్ = సూర్యునియొక్క కిరణములు, తూఱనీక + ఉండుటన్ = చొరనీక పోవుటచేత, సూచి-నిర్భేద్యముల్ = సూదిచే భేదింపరానివి, అగు, మహత్ (మహ) + అంధకారములు = గొప్ప చీకటులు పవలున్ = పగటి వేళగూడ, = జవను = వేగము, ఏపారన్ = అతిశయింపగా, పైపై = మిక్కిలి, పర్వెన్ = వ్యాపించెను.

---

1. ము. రి. 2. ము. ప్రభల

తాత్పర్యము: విష్ణు బ్రహ్మల భుజములందలి వలయాకారముగా నగుచున్న శార్ఙ్గ గాండివములనెడి విండ్ల నుండి వెలువడిన ప్రబలములు, మిక్కిలి ప్రకాశించునవియైన అస్త్రముల సమూహములు జగత్త్రితయు నిండి సూర్యకిరణములు గూడ చొరనీక పోవుటచేత అల్పమైన సూదిచే గూడ భేదింపరానంత దట్టముగా గాఢములైన చీకటులు పగటివేళ గూడ వేగమతి శయింపగా మిక్కిలి వ్యాపించెను.

విశేషములు: అస్త్రములు సూర్యకిరణములు చొచ్చుటకు వీలులేని విధముగా వ్యాపించుటచేతనే మహాంధకారములు సూదికిగూడ ఎడము లేని విధముగా వ్యాపించెను. పవలున్-రాత్రి యెట్లును అంధకారములుండును. పగలుండుట విశేషము తూ ధాతువు వాడుకలో సరళాదియై దూఱు అయినది. గాం-డివ........సందీప్త-అనుస్వార సంబంధయతి.

గీ. గాండివము తేరిపైఁ బెట్టి కమలభవుఁడు
శార్ఙ్గమున నచ్యుతుం డేయు సాయకములఁ
గర్కశంబైన కుశపూలకమున [1]వ్రేసి
ఖండ[2]ఖండంబులుగఁ జేసెఁ గదనవీథి 91

అర్థములు: కమలభవుఁడు = బ్రహ్మ, గాండివము, తేరిపైన్ = రథముమీద, పెట్టి, అచ్యుతుండు = విష్ణువు, శార్ఙ్గమునన్ = శార్ఙ్గముతో, ఏయు = ప్రయోగించు, సాయకములన్ = బాణములను, కదన-వీథిన్ = యుద్ధరంగమున, కర్కశంబు + ఐన = కఠినమైన, కుశపూలకమునన్ = దర్భల గడ్డి మోపుచే, వ్రేసి = కొట్టి, ఖండ-ఖండంబులుగన్ = ముక్కలుముక్కలుగా, చేసెన్.

తాత్పర్యము: బ్రహ్మ గాండివమును రథముపై బెట్టి, విష్ణువు శార్ఙ్గముతో ప్రయోగించు బాణములను యుద్ధరంగమున పరుషమయిన దర్భల గడ్డి మోపుతో కొట్టి ముక్కలు ముక్కలుగా చేసెను.

విశేషములు: పూలకము-పూలము రూపాంతరము A bundle - Apte.

క. వాలిక మెఱుఁగుం దూపులు
నాళీకాసనుఁడు[3]కినుక నారాయణుపైఁ
గీలుకొనఁ జేసి యార్చెను
నాలుగు మోములను [4]త్రిభువనములు వడంకన్ 92

అర్థము: నాళీక + ఆసనుండు = పద్మము ఆసనముగా గలవాడు-బ్రహ్మ, కినుకన్ = కోపముతో, నారాయణుపైన్ = విష్ణువుపైని, వాలిక = వాడివి, మెఱుంగు = ప్రకాశించునవి, అగు, తూపులు = బాణములు, కీలు కొనన్ + చేసి = నాటుకొనునట్లు చేసి, త్రిభువనములు = ముల్లోకములు, వడంకన్, నాలుగు -మోములను = నాలుగు

1. తా. వేసి. 2. ము. ఖండములుగ. 3. తా. గిన్క 4. ము. త్రిభువనము వణఁకాడన్

ముఖములతో, ఆర్చెను = జయోత్సాహముతో పెద్దగా నఱచెను.

తాత్పర్యము: బ్రహ్మ కోపమున వాడివి, మెఱయు నట్టివి యగు బాణములను విష్ణువుపై నాటుకొనజేసి ముల్లోకములును భయమున వడకగా నార్చెను.

వ. ఇవ్విధంబున విధాత[5] యార్చి పేర్చినం, గోపాటోపంబునంగట కటంబడి కైట భాంతకుండు లలాట వీథి విటంకంబున భ్రుకుటి నటింపం, గల్పాంత వేళా సముజ్జ్వల జ్వలన జ్వాలా జాల లీలా క్రీడావహ మహా ప్రభామండల మధ్యవర్తియు, విబుధరిపు వధూవైధవ్య దాన దీక్షా ధురంధర ప్రభా పరాక్రమ క్రీడా నిర్వక్రపరాక్రమంబగు చక్రం బతని మీదం బ్రయోగించిన 93

అర్థము: ఈ + విధంబునన్, విధాత = బ్రహ్మ, ఆర్చి = అచి, పేర్చినన్ = విజృంభింపగా, కైటభ + అంతకుండు = కైటభుడను రాక్షసు నంతమొందించిన వాడగు విష్ణువు, కోప + ఆటోపంబునన్ = కోపము వలని సంభ్రమముతో, కటకటంబడి = బాధపడి, లలాట-వీథీ-విటంకంబునన్ = నుదుటి ప్రదేశము యొక్క శిఖరమునందు, భ్రుకుటి = బొమముడి, నటింపన్ = నాట్యముచేయగా, కల్పాంత.... వర్తియున్: కల్ప + అంత = ప్రళయము యొక్క వేళా = సమయమునందు, సముజ్జ్వలత్ = బాగుగా మండుచున్న, జ్వలన = అగ్నియొక్క, జ్వాలా=మంటలయొక్క, జాల = సమూహము యొక్క, లీలా = విలాసము గల, క్రీడా ఆటను, ఆవహ = కలిగించునట్టి, మహా (మహత్) = గొప్ప ప్రభా =కాంతుల యొక్క, మండల = సమూహమునందు, వర్తియున్ = ఉన్నదియును, విబుధ.....పరాక్రమంబు: విబుధ-రిపు = దేవతల శత్రువులైన రాక్షసుల యొక్క, వధూ = స్త్రీ (భార్య)లకు, వైధవ్య = ముండమోపితనము యొక్క, దాన = ఇచ్చుట యనెడు, దీక్షా = గట్టి పట్టుదల అనెడు, ధురంధర = భారమును వహించిన, ప్రభా = దీప్తికలట్టియు, పర + ఆక్రమ = శత్రువుల యొక్క, ఆక్రమణమనెడి (శత్రువులనాక్రమించుట యనెడు), క్రీడా = ఆటయందు, నిర్వక్ర = వంకరలేని దియు పరాక్రమంబు = శౌర్యముగలది, అగు, చక్రంబు = సుదర్శనము, అతనిమీదన్ = బ్రహ్మమీద, ప్రయోగించినన్ = పయోగింపగా.

తాత్పర్యము: ఈ విధముగా బ్రహ్మ అర్చి విజృంభింపగా, విష్ణువు కోపాతిశయమున బాధపడి, నొసట బొమముడి నాట్యము చేయ, ప్రళయాగ్ని జ్వాలల వలె క్రీడించు గొప్పకాంతుల సమూహము నడుమ నుండునదియు, రాక్షస స్త్రీలకు వైధవ్యము నొసగుట యనెడు దీక్షను వహించి శత్రువుల ఆక్రమణ మనెడు క్రీడయందు గొప్పపరాక్రమము గలట్టియు సుదర్శనా యుధమును బ్రహ్మపై నేయగా-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: అర్చి-పేర్చి-అనుప్రాసము. ఆటోప-కటకట-కైటభ-లలాట విటంక-

5. తా. యార్చినఁ బేర్చిన.

భ్రుకుటి-నటింప-ఈరీతియైన టకారపునః పునరావృత్తి పారుష్యమును గలిగించి కోపమును సూచించి ప్రకరణోచితముగా నున్నది. విబుధరిపు వధూ వైధవ్య దాన-రాక్షస వధయే భంగ్యంతరమున నిట్లు చెప్పబడినది కావున పర్యాయోక్తాలంకారము, కల్పాంత.....లీలా అనుదానిలో లకారము, పరాక్రమ క్రీడా నిర్వక్రమ పరాక్రమము అనుదానిలో క్రవర్ణము వృత్త్యనుప్రాసము.

మ. దిశలున్ నింగియు నేలయు న్బహుల దీప్తి వ్యాప్తి నంతర్భవిం
ప శతానందుని మీఁద సాగుటయు న ప్పద్మాసనుండేసె బ్ర
హ్మ శిరో నామక మైన యస్త్రము సమస్తా-స్త్రాధి దైవంబు న
వ్విశిఖం బుద్ధతి మ్రింగె నద్భుతగతిన్ వేవేగ నా చక్రమున్ 94.

అర్థము: దిశలున్ = దిక్కులును, నింగియున్ = ఆకాశమును, నేలయును, బహుల-దీప్తి వ్యాప్తిన్ = అధికమైన ప్రకాశము యొక్క వ్యాప్తియందు, అతర్భవింపన్ = చొరగా, శతానందుని మీదన్ = బ్రహ్మపై, సాగుటయున్ = వెడలగా (దీనికి కర్త చక్రము), ఆ + పద్మ + ఆసనుండు = ఆ బ్రహ్మ, సమస్త + అస్త్ర + అధిదైవంబున్ = ఎల్ల అస్త్రములకు అధిష్ఠానదైవము, అగు, బ్రహ్మశిరస్ + నామకము = బ్రహ్మశిరస్సు అను పేరుగలది, ఐన, అస్త్రమున్, ఏసెన్, ఆ + విశిఖంబు = ఆ బాణము, అద్భుత-గతిన్ = ఆశ్చర్యకరమగు విధమున, వేవేగన్ = మిక్కిలి శీఘ్రముగా, ఆ-చక్రమున్, ఉద్ధతిన్ = గర్వముతో, మ్రింగెన్.

తాత్పర్యము: విష్ణువు చక్రమును ప్రయోగింపగా దాని యధికమైన ప్రకాశము వ్యాపించినది. దిక్కులు, ఆకాశము, భూమి తద్దీప్తిలో నుండినది. ఇట్లా చక్రాయుధము బ్రహ్మపైకి సాగగా, నా బ్రహ్మ ఎల్ల అస్త్రములకు అధిష్ఠానదైవమగు బ్రహ్మశిరస్సనెడు పేరుగల అస్త్రమును ప్రయోగించెను. ఆ అస్త్రము అతి శీఘ్రముగా నా సుదర్శనమును ఆశ్చర్యకరముగా నుద్ధతితో మ్రింగెను.

విశేషములు; శతానందుండు-`శతానన్ద శ్శతధృతి ర్విరిఞ్చోఽ జో విరిఞ్చ నః అమరము. బ్రహ్మశిరోనామక - శిరస్ + నామక-పదాంత సకారమునకు విసర్గము-శిరః+నామక, హ్రస్వ అకారము తరువాత వచ్చు విసర్గమునకు హ్రస్వ అకారము కాని, మృదు హల్లులు (హశ్శులు)కాని పరములగునపుడు ఉ అదేశముగా వచ్చి పూర్వ అకారముతో గూడి గుణసంధియై ఓ గా మాఱును. అద్భుతగతిన్, వేవేగన్, `మ్రింగు'టయే దాని ఉద్ధతి.

గీ. హరి విధాత[1]పైఁ బాశుపతాస్త్ర మేసె
నజుఁడు హరిమీఁదం బాశుపతాస్త్ర మేసె
నమ్మహాస్త్రంబు (లొండొంటి నాక్రమింపఁ
జనియెఁ బరిపాటి దివ్యవర్షములు నూఱు) 95.

1. తా. మై

అర్థము: హరి = విష్ణువు, విధాతపైన్ = బ్రహ్మమీద, పాశుపతాస్త్రము + ఏసెన్ = పాశుపత మనెడిఅస్త్రమును ప్రయోగించెను, అజుఁడు = బ్రహ్మ, హరిమీదన్, పాశుపత + అస్త్రము, ఏసెన్, ఆ + మహా (మహత్) + అస్త్రంబులు = ఆ గొప్ప అస్త్రములు, ఒండొంటిన్ = ఒకదాని నొకటి, ఆక్రమింపన్, పరిపాటిన్ = క్రమముగా, దివ్య వర్షములు = దేవతాసంవత్సరములు, నూఱు, చనియెన్ = కడచెను.

తాత్పర్యము: విష్ణువు బ్రహ్మపై పాశుపతాస్త్రమును ప్రయోగించెను. బ్రహ్మయు విష్ణువుపై పాశుపతాస్త్రమును ప్రయోగించెను. ఆ మహాస్త్రము లొకదాని నొకటి ఆక్రమింపగా నూఱు దివ్యవత్సరములు కడచెను.

విశేషములు: పశుపతి (శివుడు)కి సంబంధించినది పాశుపతము. దివ్య వర్షములు = మనుష్యుల సంవత్సరము దేవతల కొక దినము, అట్టి దినములతో నేర్పడు సంవత్సరము దివ్య సంవత్సరము. అట్టి సంవత్సరములు నూఱు. ఆక్రమించ- ఛందోభంగము గలుగదు కాన ఆక్రమింప అను సురూపమే గ్రహింపబడినది. నూరు- శతమను నర్థమున శకటరేఫయుక్తము.

చ. పటుతర విక్రమస్ఫురణఁ బాశుపతంబులు రెండుఁ బోరఁగాఁ
జిటిలిన విస్ఫులింగములఁ జిల్లులు వోయె నభఃస్థలంబు ది
క్తటము(లు మండె నంబుధులు గ్రాఁగె రసాతల)గర్భ గోళ సం
పుటములు వొక్కె నుమ్మదము పుట్టెఁ జెమర్చెఁ బురాణకూర్మమున్. 96

అర్థము: పాశుపతంబులు, రెండున్, పటుతర -విక్రమ-స్ఫురణన్ = తీవ్రతరమైన పరాక్రమము యొక్క విజృంభణముతో, పోరఁగాన్, చిటిలిన = చిట్లిన, విస్ఫులింగములన్ = అగ్నికణములచేత, నభస్ + స్థలంబు = ఆకాశప్రదేశము, చిల్లులు + పోయెన్ = చిల్లుపడెను, దిక్ + తటములు = దిక్కుల ప్రదేశములు, మండెన్, అంబుధులు = సముద్రములు, క్రాగెన్ = మఱిగెను, రసాతల-గర్భ-గోళ- సంపుటములు = బరణులవంటి పాతాళ గర్భ గోళములు, పొక్కెన్, ఉమ్మదము + ఊష్మము, పుట్టెన్, పురాణ-కూర్మమున్ = ఆది కూర్మము (తాబేలు)కూడ, చెమర్చెన్.

తాత్పర్యము: హరి బ్రహ్మలొండొరులపై ప్రయోగించిన పాశుపతాస్త్రములు రెండును తీవ్రతరమైన పరాక్రమముతో పోరగా అగ్నికణములు చిట్లెను. వానిచే నాకాశము చిల్లుపడెను. దిక్కులు మండిపోయెను. సముద్రములు క్రాగెను. పాతాళగర్భము పొక్కెను. ఊష్మము పుట్టెను. ఆదికూర్మము సైతము చెమర్చెను.

విశేషములు: సంపుటములు + పొక్కె-సంపుటములు వొక్కె. గసడదవాదేశము ఉమ్మదము -ఉమ్మలికము మ్మలింపుబ్బు నుమ్మ యుక్క, యుమ్మదంబావి యావిరి యుమ్మలికయ, నంగ నూష్మాఖ్య లౌ. ఆం.భా. పురాణ కూర్మమున్- మందరాద్రిని

మోసినట్టిది కూడననుట, చెమర్చుట అప్పుడు పుట్టిన ఉమ్మదము చేతను, భయముచేనైన కావచ్చును.

ఉ. పాశుపతాస్త్రరాజము లభంగధృతిం దమలోనఁ బోర ఘో
రాశని ఖండ సన్నిభములైన తదీయ కృపీట సంభవో
ల్కా శతముల్ పరస్పర విఘట్టనం జిచ్చుఱ కోలలై వెసం
గేశవు మేన బ్రహ్మ మెయిఁగేలి యొనర్చె నపారవేదనన్! 97.

అర్థము: పాశుపత + అస్త్ర-రాజములు = అస్త్ర శ్రేష్ఠములయిన పాశుపతములు, అభంగ-ధృతిన్ = భంగముకాని ధైర్యముతో, తమలోనన్ + పోరన్ = తమలో దాము పోరగా, ఘోర + అశని-ఖండ-సన్నిభములు = భయంకరమైన వజ్రపు ముక్కలతో సమానములు, ఐన, తదీయ-కృపీట సంభవ + ఉల్కా-శతముల్ = వాని సంబంధములయిన నూర్ల కొలది మిడుగుఱుల వంటి నిప్పులు, పరస్పర-విఘట్టనన్-ఒకదాని నొకటి రాసుకొనుటచే, చిచ్చు-కోలలు + ఐ = కొఱకచ్చులయి, వెసన్ = శీఘ్రముగా, కేశవు = విష్ణువు యొక్క, మేనన్ = శరీరమునందు, బ్రహ్మ-మెయిన్ = బ్రహ్మయొక్క శరీరమునందును, అపార-వేదనన్ = మిక్కిలి బాధతో, కేలి + ఒనర్చెన్ = క్రీడించెను.

తాత్పర్యము: విష్ణువు, బ్రహ్మ ప్రయోగించిన అస్త్ర శ్రేష్ఠములగు పాశుపతములు తమలోదాము పోరగా భయంకరములయిన వజ్ర శకల సమానములయిన మిడుగురుల వంటి నిప్పులు నూర్లకొలది పుట్టెను. అవి తమ్ముదాము రాసికొనుటచే కొఱవులయి శీఘ్రముగా వారి శరీరములపై క్రీడించి యపారమైన బాధను గలిగించెను.

విశేషములు: అశని-`శతకోటి స్స్వరు శ్శంబో దంభోళి రశని ర్ద్వయోః' - అమరము. అశ్యతే భుజ్యతే త్రైలోక్య మనే నేత్యశనిః-ముల్లోకములు దీనిచే భుజింపబడుచున్నవి-వజ్రము, కృపీట సంభవ-అగ్ని `కృపీట యోని ర్జ్వలనో జాతవేదా స్తనూనపాత్-అమరము. కృపపీట ముదకం యోనిః కారణం యస్య సః-నీరు కారణముగా గలవాడు. అగ్ని నీటి నుండి పుట్టెను. కృపపీటముల నుండి సంభవము గలవాడు, చిచ్చు = అగ్నిమయము.

ఉ. కాంచనగర్భుఁడున్ నరకఘస్మరుఁడున్ బహుకాల మీక్రియం
గాంచిరి నొచ్చి పాశుపత కాండయుగ ప్రభవాగ్ని కీలలన్
జంచల చిత్త వృత్తి బహుసంపద పెంపున [1]'మూరిఁబోయి' ద
ర్పించిన యట్టి వారి కివి పెద్దలె యచ్చెరు వంద[2]నేటికిన్! 98

1. ము. మూరివోయి. 2. తా. వారికిన్

అర్థము: కాంచన గర్భుఁడున్ = బ్రహ్మయును, నరక-ఘస్మరుఁడున్ = నరకుడను రాక్షసుని నశింపజేసినవాడు (విష్ణువు)ను, బహు-కాలము = చాలకాలము, ఈ-క్రియన్ = ఈ విధముగా, పాశు....కీలలన్: పాశుపత-కాండ = పాశుపతములనెడు అస్త్రములయొక్క, యుగ = జంట నుండి, ప్రభవ = పుట్టుకగల (పుట్టిన), అగ్ని-కీలలన్ = అగ్నిజ్వాలల చేత, నొచ్చి = బాధచెంది, చంచల -చిత్త-వృత్తిన్ = అస్థిరమైన మనస్సు యొక్క వర్తనమును, కాంచిరి = పొందిరి, బహు-సంపద-పెంపునన్ = ఎక్కువ సంపదయొక్క అతిశయముచే, మూరిబోయి = విజృభించి, దర్పించిన+అట్టి-వారికిన్ = గర్వించినవారికి, ఇవి = ఇట్టి దుస్థితులు, పెద్దలు + ఎ = ఎక్కువయినవా? కావనుట, అచ్చెరువు + అందన్ + ఏటికిన్ = ఆశ్చర్యపడుట యెందులకు? ఆశ్చర్యపడనక్కలేదనుట.

తాత్పర్యము: బ్రహ్మయును, విష్ణువును చాలకాల మీ విధముగా పాశుపతాస్త్ర ద్వయమునుండి పుట్టిన అగ్నిజ్వాలలచే నొచ్చి మనశ్చాంచల్యమును పొందిరి. అధిక సంపద గలిగి విజృంభించి గర్వించినవారి కిట్టి దుస్స్థితులు పెద్దవి కావు. అతి సామాన్యములు. ఈ విషయమున నాశ్చర్యపడనక్కరలేదు.

విశేషములు: కాంచన గర్భుడు = హిరణ్యగర్భుడు = బ్రహ్మ హిరణ్యగర్భో లోకేశ స్స్వయంభూశ్చతురాననః-అమరము. హిరణ్మయో గర్భో యస్య సః-హిరణ్య (కాంచన)మయమైన గర్భము గలవాడు, ఘస్మరః-భక్షకో ఘస్మరోఽద్మరః-అమరము. ఘసతి తాచ్ఛీల్యేన ఘస్మరః-భక్షించు స్వభావము గలవాడు. విశేషాంశమును సామాన్యాంశముచే సమర్థించుటచే అర్థాంతర న్యాసాలంకారము. ఆశ్చర్యము (ప్రకృతి) అచ్చెరువు (వికృతి).

గీ. పాశుపతములు రెండు[1]నీ భంగిఁ బోర
నజుఁడు హరియును వారింప నలవి గాక
విస్ఫులింగచ్ఛటావళి వేష్టనమున
స్రుక్కుచుండిరి యంగముల్[2] పొక్కిపడఁగ 99.

అర్థము: పాశుపతములు, రెండున్, ఈ -భంగిన్ = ఈ విధముగా, పోరన్, అజుడున్ = బ్రహ్మయును, హరియును, వారింపన్ = అడ్డుపెట్టుటకు, అలవి + కాక = శక్యముగాక, విస్ఫు....నమునన్: విస్ఫులింగ = అగ్నికణముల యొక్క, ఛటా = కాంతులయొక్క, ఆవళి = వరుసలయొక్క, వేష్టనమునన్ = చుట్టుకొనుట చేత, అంగముల్ = అవయవములు, పొక్కి పడగన్ = బొబ్బ లెక్కగా, స్రుక్కుచున్ + ఉండిరి = బాధపడుచుండిరి.

1. తా. నిబ్బంగి. 2. ము. సొక్కి

తాత్పర్యము: హరిబ్రహ్మ లేసిన పాశుపతములు రెండును ఈ రీతిగా పోరగా, వారిరువురును వారింప శక్యముగాక అగ్నికణముల కాంతుల సమూహములు చుట్టుముట్టుటచే నవయవములు బొబ్బలెక్కగా బాధపడుచుండిరి.

విశేషములు: విస్ఫులింగ + ఛటా = విస్ఫులింగచ్ఛటా, హ్రస్వమునకు పరమైన ఛకారము ద్విరుక్త మగును.

గీ. త్రిభువనంబును భయమందె దేవదైత్య
ఖచర సిద్ధ గంధర్వులు కలఁగఁబడిరి
అస్త్ర రాజద్వయంబు సంహారకాల
దహనుభంగి నేకాంగయుద్ధంబు సేయ 100.

అర్థము: అస్త్ర-రాజ-ద్వయంబు = శ్రేష్ఠములయిన పాశుపతాస్త్రముల జంట, సంహార-కాల-దహను-భంగిన్ = ప్రళయ సమయమునందలి అగ్ని విధమున, ఏకాంగ-యుద్ధంబు + చేయన్ = పరస్పర యుద్ధము చేయగా, త్రిభువనంబును = ముల్లోకములును, భయము + అందెన్, దేవ-దైత్య - ఖచర - సిద్ధ - గంధర్వులు = దేవతలు, రాక్షసులు, ఖేచరులు, సిద్ధులు, గంధర్వులు, కలగబడిరి = కలగిరి.

తాత్పర్యము: అస్త్ర శ్రేష్ఠములయిన పాశుపతములు రెండును ప్రళయకాలాగ్నివలె పరస్పరము యుద్ధము చేయగా ముల్లోకములును భయపడెను. దేవతలు, రాక్షసులు, గగనచరులు, సిద్ధులు, గంధర్వులు కలతచెందిరి.

విశేషములు: త్రిభువనంబు-త్రయాణాం భువనానాం సమాహారః = త్రిభువనమ్. సమాహారార్థకమగు ద్విగు వేకవచనాంతమును నపుంసకము నగును. కలగబడిరి. `పడుజీ/కొను /లొకానొకచో స్వార్థంబునం దనుప్రయుక్తంబగు' బా.క్రి. 109

గీ. అస్త్రయుద్ధము మాన్ప హర్యజులఁ గావఁ
దలఁచి యర్ధేందుమౌళి యత్యంతకరుణ
నస్త్రములు రెంటినడుమ నయ్యవసరమున
సంభవించెఁ[1] మహానలస్తంభమూర్తి 101

అర్థము: అయ్యవసరమునన్ (ఆ + అవసరమునన్) = ఆ సమయమునందు, అర్ధ + ఇందు-మౌళి = సగము చంద్రుడు శిరమున గలవాడు-శివుడు, అత్యంత-కరుణన్ = మిక్కిలి దయతో, అస్త్ర-యుద్ధమున్ = అస్త్రములతోడి యుద్ధమును, మాన్పన్ = మాన్పుటకును, తలఁచి, హరి + అజులన్ = విష్ణువును, బ్రహ్మను, కావన్ = రక్షించుటకును, తలంచి-ఎంచి, అస్త్రములు రెంటి నడుమన్ = రెండు

1. ము. మహాస్తంభ శంభుమూర్తి.

పాశుపతాస్త్రముల నడుమను, మహా (మహత్) + అనల-స్తంభ-మూర్తిన్ = గొప్ప అగ్నికంబము నాకారముతో, సంభవించెన్ = పుట్టెను.

విశేషములు: హర్యజులు-హరియును, అజుడును-ద్వంద్వము,యణాదేశసంధి, అర్ధేందుమౌళి-అర్ధేందుడు మౌళియందుగలవాడు-శివుడు బహువ్రీహి, అస్త్రములు రెంటి (యొక్క) - `సర్వనామ సంఖ్యాభి ధాన తద్వి శేష్యంబులయం దెయ్యది ముందు ప్రయోగింపంబడు దాని ద్వితీయాదులకుం బ్రథమ బహుళంబుగానగు.'బాల. కారక.26

స్రగ్ధర. *స్తంభం బావిర్భవించెన్ జ్వలదనలశిఖాజాలముల్ దిక్కులందున్
జృంభించెన్ భూర్భువస్స్వ స్స్థిరతర జఠర క్షేత్రముల్ చంచదుల్కా
సంభారోద్యత్ స్ఫులింగ స్థగితములుగ నా శంక విశ్వంభరుండున్
శంభుండున్ సంభ్రమింపం జటుల తరతటి త్సన్నిభ స్ఫూర్తిమూర్తిన్. 102.

అర్థము: భూర్భువ......క్షేత్రముల్: భూః + భువః + స్వః = భూలోక, భువర్లోక, స్వర్లోకముల యొక్క, స్థిరతర = మిక్కిలి నిలుకడగల, జఠర = గర్భములనెడి, క్షేత్రముల్ = ప్రదేశములు, చంచ.....స్థగితములు + కన్ = చంచత్ = చలించుచున్న, ఉల్కా = కొఱకచ్చుల యొక్క, సంభార = సమూహమువలె, ఉద్యత్ = ఉద్యమించుచున్న, స్ఫులింగ = అగ్నికణములచేత, స్థగితములు + కన్ = కప్పబడినవి కాగా, అ శంకన్ = భయముతో, విశ్వంభరుండున్ = విష్ణువును, శంభుండున్ = బ్రహ్మయును, సంభ్రమింపన్ = వేగిరపడగా, చటుల....మూర్తిన్: చటుల తర = మిక్కిలి చలించు, తటిత్=మెఱుపుతో, సన్నిభ=సమానమైన, స్ఫూర్తి=ప్రకాశముగల, మూర్తిన్ = ఆకారముతో, స్తంభంబు, ఆవిర్భవించెన్=పుట్టెను, జ్వలత్ + అనల-శిఖా-జాలముల్ = మండుచున్న, అగ్నియొక్క, జ్వాలలయొక్క, సమూహములు, దిక్కులందున్, జృంభించెన్ = చెలరేగెను.

విశేషములు: మహాస్తంభావిర్భావ వర్ణన కనుగుణమయిన వృత్తము స్రగ్ధర. ఇందలి సుదీర్ఘ సమాసములు స్తంభ విజృంభణ సూచకములు. స్రగ్ధరావృత్తమున ప్రతిపాదమునను మ, ర, భ, న, య, య, య గణము లుండును. 1-8-15 అక్షరములకు యతిమైత్రి. ప్రాసనియమము గలదు. విశ్వంభర-విశ్వంభరః కైటభజి ద్విధుః శ్రీవత్సలాంఛనః' అమరము. విశ్వం బి భర్తీతి-విశ్వంభరః.

శంభు శబ్దము ఈశ్వరునియందే గాక బ్రహ్మయందును వర్తించును. శమ్భూ బ్రహ్మత్రిలోచనౌ' అమరము-నానార్థవర్గు. ఈ స్తంభము శివునిది గావున నిచట శంభు శబ్దమునకు బ్రహ్మయని యర్థము చెప్పబడినది.

---

* తాళపత్రమున లేదు

సీ. సప్తపాతాళవిష్టపము[1]లు భేదించి
ధరణిచక్రంబు బిందంబొనర్చి
భూర్భువస్స్వర్లోకములు సమాస్ఫోటించి
ధ్రువమండలంబుఁ దుత్తుమురుచేసి
పరమేష్ఠిపదవి కుద్భ్రాంతి యాపాదించి
హరిపదంబున కార్తి యావహించి
బ్రహ్మాండకుహరకర్పరము వ్రక్కలు వాపి
యావరణంబు లందంద చించి

గీ. [2]పరఁగఁ బుష్కరమార్గంబు పాయఁబట్టి
యెగసి యెచ్చోట కేఁగెనో యెఱుఁగరాదు
శాతకుంభాద్రి కూటాగ్ర సన్నిభంబు
శాంభవంబైన పావకస్తంభ మపుడు. 103

అర్థము: శాత.....సన్నిభంబు: శాతకుంభ + అద్రి = బంగరుకొండయగు మేరువు యొక్క, కూట = శిఖరము యొక్క, అగ్ర = కొనతో, సన్నిభంబు = సమాన మయినది, శాంభవంబు = శంభు(శివ)సంబంధ మయినది, ఐన, పావక-స్తంభము = అగ్గికంబము, అపుడు సప్త-పాతాళ-విష్టపములు-ఏడు అధోలోకములు, భేదించి = చీల్చి, ధరణి = చక్రంబు = భూవలయము యొక్క బిందంబు-ఉపద్రవము, ఒనర్చి = చేసి, భూః + భువః + స్వర్లోకములు = భూలోక, భువర్లోక స్వర్లోకములు, సమాస్ఫోటించి = బ్రద్దలుచేసి, ధ్రువ-మండలంబున్, తుత్తుమురుచేసి = పొడి చేసి, పరమేష్ఠి-పదవికిన్ = బ్రహ్మయొక్క స్థానమునకు, ఉద్భ్రాంతి = తిరుగుబాటును, ఆపాదించి = కలిగించి, హరి-పదంబునకున్ = విష్ణువు స్థానమునకు, ఆర్తి = పీడ, ఆవహించి = కలిగించి. బ్రహ్మాండ-కుహర-కర్పరము = కటాహము వంటి బ్రహ్మాండ గుహ, వ్రక్కలు + వాపి = ముక్కలు చేసి, ఆవరణంబులు = అచ్ఛాదనములు, అందంద = మఱిమఱి, చించి = చింపి, పరగన్ = ఒప్పునట్లుగా, పుష్కర-మార్గంబు-ఆకాశపు దారి, పాయన్ + పుట్టి = విడిచిపెట్టి, అతిక్రమించి, ఎగసి = ఎగిరి, ఏ + చోటికిన్ =ఎక్కడకు, ఏగెనొ = వెడలెనో, ఎఱుఁగన్ + రాదు = తెలియరాదు.

తాత్పర్యము: మేరు శిఖర సదృశము, శంభు సంబంధము నైన అగ్గికంబమపుడు అధోలోకముల నేడింటిని భేదించి, భూవలయమున కుపద్రవము గలిగించి, భూలోక, భువర్లోక, స్వర్లోకములను బ్రద్దలుచేసి, ధ్రువ నక్షత్రమండలమును మిక్కిలి పొడి చేసి, బ్రహ్మ పదవికి తిరుగుబాటు గలిగించి, విష్ణుని స్థానమునకు కీడు గలిగించి,

1. తా. లుద్భేదించి. 2. తా. పరమ పుష్కరమార్గంబు పాయఁదట్టి

బ్రహ్మాండ కటాహమును ముక్కలు చేసి, ఆవరణములను మఱిమఱి చింపివైచి ఆకాశమార్గము నతిక్రమించి, పైపైకిబోయి తుదకెచ్చటి కేగెనో తెలియరాదు.

విశిష్టములు: విష్టపము-`అధో జగతీ లోకో విష్టపం భువనం జగత్. అమరము విశం త్యస్మిన్నితి విష్టపమ్-దీనియందు ప్రవేశింతురు. బిందము-భిన్న శబ్దభవము, తుత్తుమురు,-తుమురు+తుమురు-`అందదుకు ప్రభృతులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు' బా.సం. 42

ఆవరణములు-పృథివి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశము, అహంకారము, మహత్త్వము-అని సప్తావరణములు. `ప్రకృతి'తో అష్టావరణములగును. పుష్కర-`వ్యోమ పుష్కర మమ్బరమ్'అమరము. పుష్క ముదకం రాతీతి పుష్కరమ్. ఉదకము నిచ్చునది-ఆకాశము. ఎచ్చోటకున్ = ఎచ్చోటికిన్-అని యుండవలయును-చోటు శబ్దమాపవిభక్తికము కావున శాతకుంభ-`తపనీయం శాతకుమ్భం గాంగేయం భర్మకర్బురమ్' అమరము. శతకుంభాఖ్యే పర్వతే భవం శాతకుంభం-శతకుంభమను పర్వతమున పుట్టినది, శమ్భోః ఇదమ్-శామ్భవమ్.

గీ. పాలు గల [1]యగ్గి కంబంబు ప్రభవ [2]మంది
యుష్ణమును శీతమును గాక యుండెఁ గాని
యహహ పెట్లు జగం బుష్ణ మయ్యె నేని
శిశిర మగునేని వణఁకును సీతు వట్టి 104

అర్థము: పాలు, కల, అగ్గికంబంబు, ప్రభవము + అంది = పుట్టి, ఉష్ణమును = వేడియును, శీతమును = చల్లనయును, కాక + ఉండెన్, కాని, అహహ, ఉష్ణము + అయ్యెన్ + ఏనిన్, జగంబు, పెట్లున్ = కాలిబ్రద్దలగును, శిశరము + అగున్ + ఏనిన్ = చల్లనయగుచో, సీతు + పట్టి = చలి యేర్పడి, వణకును.

సీ. అద్భుతం బందిరి హరియుఁ బద్మభవుండుఁ
దమలోని తీవ్ర దోషములు మాని
పుష్కలావర్తకాంభోదవ్రాతంబు
గురిసెఁ గల్పకలతా కుసుమవృష్టి
జయ జయ ధ్వనులతో సనకాది యోగీంద్రు
లభినుతించిరి ప్రస్ఫుటాక్షరముల
నమరదుందుభి నినాదములు దిక్కుల నిండె
గంభీరతరమహాఘనరవముల

1. తా. యట్టి. 2. తా. మందె.

గీ. నడఁగె నస్త్రద్వయంబు నభ్యంతరమున
[1]నగ్గికంబంబులోఁ గాన[2]నయ్యె శివుఁడు
వలిపె తెరలోన నున్న భావంబు దోఁప
మాఘకృష్ణచతుర్దశీ మధ్య రజని. 105

అర్థము: మాఘ-కృష్ణ-చతుర్దశీ-మధ్యరజనిన్ = మాఘమాసమున, బహుళ చతుర్దశి నాటి అర్ధరాత్రమునందు-శివరాత్రినాటి నడురేయి, వలిపె-తెరలోనన్ = సన్నని తెల్లని తెరలోపల, ఉన్న, భావంబు, తోపన్, శివుడు, అగ్గి-కంబంబులోన్, కానన్ + అయ్యెన్ = కనబడెను. (అప్పుడు),హరియున్ = విష్ణువును, పద్మభవుండున్ = బ్రహ్మయును తమలోని, తీవ్ర-దోషములు, మాని = విడిచి, అద్భుతంబు + అందిరి = ఆశ్చర్యపడిరి. పుష్కల + ఆవర్తక + అంభోధర-వ్రాతంబు = పుష్కల (ర)ము, ఆవర్తకము అనెడి మేఘముల సమూహము, కల్పక-లతా-కుసుమ-వృష్టి = కల్పవృక్షపు తీగల పూలవాన, కురిసెన్. సనక + ఆది-యోగి + ఇంద్రులు = సనకుడు మున్నగు యోగిశ్రేష్ఠులు, జయజయ-ధ్వనులతోన్ = `జయ జయ' అను ధ్వనులతో, ప్రస్ఫుట + అక్షరములన్ = మిక్కిలి స్పష్టములైన అక్కరములతో, అభినుతించిరి = స్తోత్రముచేసిరి. అమర-దుందుభి-నినాదములు = దేవతలయొక్క, భేరుల యొక్క ధ్వనులు, గంభీరతర -మహా-ఘన-రవములన్ = మిక్కిలి గంభీరములైన, మిక్కిలి గొప్ప (మేఘ), ధ్వనులతో, దిక్కులన్, నిండెన్. అస్త్ర-ద్వయంబున్ = పాశుపతాస్త్రములు రెండును, అభ్యంతరమునన్ = నడుమ, అడగెన్.

తాత్పర్యము: మాఘ బహుళ చతుర్దశి శివరాత్రి. ఆనాటి నడురేయి శివుడు, తెల్లని తెరలోపల నున్నట్లు స్ఫురింపగా, అగ్గికంబములో కాననయ్యెను. అప్పుడు విష్ణుబ్రహ్మ లిరువురును తమలోని తీవ్ర దోషములను విడిచి ఆశ్చర్యపడిరి. పుష్కలా(రా)వర్తకమేఘములు కల్పవృక్షపుపూలను వర్షించెను. సనకుడు మున్నుగాగల మునిశ్రేష్ఠులు స్పష్టములైన అక్షరములతో జయ జయ ధ్వనులు గావించి స్తోత్రము చేసిరి. దేవతల భేరుల ధ్వనులు గంభీర తరములైన గొప్ప (మేఘ)ధ్వనులతో దిక్కుల నిండెను. పాశుపతములు రెండును దిక్కుల నడుమ నడగెను.

విశేషములు: పుష్కల -పుష్కర-చూడు57వ పద్యవ్యాఖ్య. ఘన శబ్దమునకు మేఘమనియేని అర్థము చెప్పవచ్చును. స్తంభము-ప్రకృతి, కంబము వికృతి. వలిపె-వలిప-1 వలిపె'రూపమునకు నిర్ధారకము గానరాదని సూ.ని. రజని - `విభావరీ తమస్విన్యౌ రజనీ యామినీ తమీ' అమరము. రంజన్తి కామినోఽత్ర రజనీ. కాముకులు దీనియందు రంజిల్లుదురు.

---

1. తా. నగ్నికంభంబు 2. తా. బడియె

గీ. హంసరూపంబు దాల్చెఁ బద్మాసనుండు
దంష్ట్రి రూపంబు గైకొనె దనుజరిపుఁడు
పోయి రంబరమున కధోభువనమునకు
నూర్ధ్వమును గ్రిందుఁ గానఁగ నుత్సహించి 106

అర్థము: పద్మ + ఆసనుండు = బ్రహ్మ, హంస-రూపంబు = హంస యొక్క ఆకారమును, తాల్చెన్ = ధరించెను, దనుజ - రిపుడు = రాక్షసుల శత్రువు - విష్ణువు, దంష్ట్రి = రూపంబు = వరాహము నాకారమును, కైకొనెన్ = స్వీకరించెను, ఊర్ధ్వమును = పైని, క్రిందున్ = క్రిందును, కానఁగన్ = చూచుటకు, ఉత్సహించి = వేడుకగొని, (బ్రహ్మ)అంబరమునకున్ = ఆకాశమునకును, (విష్ణువు), అధస్(కః) + భువనమునకున్ = క్రిందిలోకమునకును, పోయిరి.

తాత్పర్యము: ఈశ్వరుని మీదను, క్రిందను చూడవేడుకపడి హంసరూపమును దాల్చి బ్రహ్మ ఆకాశమునకును, వరాహరూపమును దాల్చి విష్ణువు క్రిందిలోకమునకు పోయిరి.

విశేషములు: యథా సంఖ్యాలంకారము. దంష్ట్రములు గలది దంష్ట్రిన్ = పంది. అధస్ + భువన = అధః + భువన = అధోభువన = చూడు పూర్వవ్యాఖ్య.

క. బహు వర్ష సహస్రంబులు
ద్రుహిణుండును హరియు [1]నధ్యధోభువనములన్
బహుళక్రియ శోధించిరి
దహనస్తంభంబు తుదయుఁ దన్మూలంబున్ 107

అర్థము: ద్రుహిణుండును = బ్రహ్మయును, హరియున్ = విష్ణువును, అధి + అధస్ + భువనములన్ = పయి, క్రింది లోకములందు, దహన-స్తంభంబు = అగ్నిస్తంభముయొక్క, తుదయున్ = కొనను, తద్ + మూలంబున్ = దాని మొదలును, బహు-వర్ష-సహస్రంబులు = పెక్కువేల యేండ్లు, బహుల-క్రియన్ = అధికమైన పనితో, శోధించిరి = వెదకిరి.

తాత్పర్యము: బ్రహ్మయు, విష్ణువును పయి క్రింది లోకములందు అగ్నికంబము తుద మొదలులను పెక్కువేలేండ్లు మిక్కిలి పనిబూని వెదకిరి.

విశేషములు: వర్ష-పుం నపుంసకము లయినపుడు సంవత్సరము, వాన. ఆకారాంత స్త్రీలింగమయినచో వానకాలము, ద్రుహిణుడు - బ్రహ్మ `ధాతాబ్జయోని ర్ద్రుహిణో

1. తా. దివియధో

విరిఞ్చిః కమలాసనః' - అమరము. ద్రుహ్యతి హింస త్యసురేభ్యో ద్రుహిణః-యణాదేశ సంధి, తద్+మూలంబు = తన్మూలంబు-అనునాసికసంధి. అలంకారము యథాసంఖ్యము.

వ. శోధించి యాద్యంతంబులు పొడగానక హరి విరించులేతెంచి వామదక్షిణ భాగంబుల నిలిచి జగత్కారణంబయిన యమ్మహాదేవు నిట్లని స్తుతియించిరి.108

అర్థము: హరి-విరించులు = విష్ణువును, బ్రహ్మయు, శోధించి = వెదకి, ఆది + అంతంబులు = మొదలును, తుదియును, పొడగానక = కానలేక, ఏతెంచి = వచ్చి, వామ -దక్షిణ-భాగంబులన్ = ఎడమ, కుడివైపుల, నిలచి, జగత్ + కారణంబు = లోకములకు మూలమయిన, ఆ + మహాదేవున్ = ఆ పరమశివుని, ఇట్లు + అని = ఈ రీతిగా, స్తుతియించిరి = స్తోత్రము చేసిరి.

తాత్పర్యము: విష్ణు బ్రహ్మలు వెదకి అగ్గి కంబము తుదమొదలు లను గానక తిరిగి వచ్చి ఎడమ కుడి భాగములందు నిలచి లోకములకు హేతుభూతుడైన యా పరమశివునిట్లు స్తోత్రము చేసిరి.

విశేషములు: ఆది + అంతములు = ఆదియును, అంతమును ద్వంద్వము-యణాదేశ సంధి, ఆది,- హరి, అంతము - వివరించి హరి - వామ, వివరించి-దక్షిణ అని క్రమము. స్తుతి + ఇంచు ధాతుత్వ వివక్షయందు`స్తుతి'యను నామమున కించుక్కు. `గురువి రహితంబులయి యయాంతంబులయిన యేక స్వర ద్విస్వరంబుల యించు గ్వ్రక్రంబుల కియుడాగమంబు విభాష నగు' -స్తుతియించు స్తుతించు-ఇయుడాగమవిరహితరూపము.

సీ. [1]శర్వ లోకాధీశ చంద్రార్ధ శేఖర
పురుష పురాణ శంకర మహేశ
యభవ యంతర్యామివై[2] ప్రేరకత్వము
చేపట్టి జనుల శాసింతు[3]వీవు
భవదీయమాయాప్రభావంబు కతమున
నెఱుఁగ లే మైతిమి యేము నిన్ను
మాకుఁ గర్తవు నీవు మాకు భర్తవు నీవు
మాకు హర్తవు నీవు మాటలేల

గీ. నీ మహత్త్వంబు వర్ణింప నేర మేము
నిన్నుఁ దెలియంగనేరము నిజముగాఁగ
నభవ యాద్యంత[4]వాద్యుఁ డవగుదు గాన
నట్టి నీ కాచరింతు ముపాస్తి యెపుడు 109

1. తా. సర్వ. 2. తా. ప్రేరకత్వంబు. 3. తా. తీవ. 4. తా. వైతివి.

అర్థము: శర్వ = ఈశ్వరా, లోక + అధి + ఈశ = లోకములకు ప్రభువా, చంద్ర + అర్ధ-శేఖర = సగము చంద్రుడు తలపూవుగా గలవాడా-చంద్రకళావతంసా, పురుష, పురాణ = పురాతనుడా, శంకర = శుభములను గలిగించువాడా మహేశా. అభవ = పుట్టుకలేనివాడా - ఈశ్వరా, ఈవు, అంతః + యామివి + ఐ = లో నున్నవాడవయి, ప్రేరకత్వము = ప్రేరేపించుట, చేపట్టి = కైకొని, జనులన్, శాసింతువు. ఏము, భవదీయ-మాయా-ప్రభావంబు-కతమునన్-నీదయిన, మాయయొక్క, మహిమ, కారణముగా, నిన్నున్, ఎఱుఁగన్ + లేముఐతిమి = తెలియలేకపోయితిమి. నీవు, మాకున్, కర్తవు, నీవు, మాకున్, భర్తవు = భరించువాడవు, నీవు, మాకున్, హర్తవు = హరించువాడవు-సృష్టిస్థితి లయములు చేయువాడవు నీవే యనుట, మాటలు + ఏల? అభవ, ఆద్యుడు = మొదటివాడవు, ఆఢ్యుడు = సంపన్నుడవు, అగుదు(వు) + కానన్ + అగుదురు కావున, ఏము, నీ-మహత్త్వంబున్ = నీ మహిమను, వర్ణింపన్ + నేరము = కొనియాడలేము, నిజము + కాగన్, నిన్నున్, తెలియగన్ = ఉపాస్తి = సేవ, ఆచరింతుము = చేయుదుము.

తాత్పర్యము: శర్వా, లోకేశ్వరా, చంద్రకళావతంసా, పురాణపురుషా, శంకరా, మహేశా, అభవా, నీవు అంతర్యామివయి ప్రేరకుడవై జనులను శాసింతువు. నీ మాయా ప్రభావము వలన నిన్ను మే మెఱుగలేమయితిమి. ఇన్నిమాటలేల? మాకు కర్తవు, భర్తవు, హర్తవు నీవే అభవా! నీ వాద్యుడవు, ఆఢ్యుడవు నగుదువు కావున మేము నీ ప్రభావమును వర్ణింపలేము నిన్ను తెలియజాలము. నిజము. అట్టి మహానుభావుడవగు నీకు మే మెప్పుడును సేవజేయుదుము.

విశేషములు: శర్వ-`ఈశ్వర శ్శర్వ ఈశాన శ్శంకర శ్చంద్రశేఖరః-అమరము. ప్రళయే భూతాని శృణాతి హినస్తీతి శర్వః'-ప్రళయమున భూతములను హింసించువాడు.

గీ. పశువులము [1]మేము హర పశుపతివి నీవు
పశువులకు నెక్కడిది బుద్ధి ఫాలనయన
రాజశేఖర నేర్పు నేరములు చూడ
కరసి రక్షింపు మమ్ము నత్యంతకరుణ 110

అర్థము: హర, మేము, పశువులము = జీవులము, నీవు, పశుపతివి, ఫాల-నయన = నొసట కన్ను గలవాడా! ముక్కంటీ!, పశువులకున్, బుద్ధి, ఎక్కడిది, రాజ-శేఖర = చంద్రుడు తలపూవుగా గల వాడా - ఈశ్వరా!, నేర్పు-నేరములు = తెలియుట, తెలియకపోవుట అనునవి, చూడక, అత్యంత-కరుణన్ = మిక్కిలి దయతో, అరసి = చూచి, మమ్మున్, రక్షింపుము.

1. తా.నేము

తాత్పర్యము; హరా! మేము పశువులము. నీవు పశుపతివి. ముక్కంటీ! పశువులకు బుద్ధి యెక్కడిది? చంద్రశేఖరా!నీవు మా నేర్చుట, నేరక పోవుట చూడక మమ్ము మిక్కిలి దయతో గాపాడుము.

విశేషములు: పశుపతి-పశూనాం జీవానాం పతిః-పశుపతిః-పశువులనగా ప్రమథులు, జంతువులు-వానికి ప్రభువు. పశవః క్షేత్రజ్ఞాః-తేషాం పతిః త్రాతా సంసార బంధనాత్-పశువులనగా జీవులు-వారిని సంసారబంధమునుండి రక్షించువాడు.

గీ. విష్ణుమూర్తులు [1]కడచన్న వేళలందు
నజుని మూర్తులు[2]కడచన్న యవసరమున
[3]జిష్ణుమూర్తులు పర్యవసించినపుడు
[4]కలదె నీకు నపాయంబు కాలకంఠ 111.

అర్థము: కాల-కంఠ = నల్లని కంఠము గలవాడా - ఈశ్వరా!, విష్ణు-మూర్తులు = విష్ణుని యొక్క ఆకారములు, కడచన్న = నశించిన, వేళలందున్, అజుని-మూర్తులు = బ్రహ్మ ఆకారములు, కడచన్న, అవసరమునన్ = సమయమునను, జిష్ణు-మూర్తులు = ఇంద్రుని ఆకారములు, పర్యవసించిన + అపుడు = ముగిసిన సమయమున, నీకున్, అపాయంబు = నాశనము, కలదె?-లేదనుట.

తాత్పర్యము: ఓయి గరళకంఠా! విష్ణుని మూర్తులును బ్రహ్మమూర్తులును, ఇంద్రుని మూర్తులును నశించినప్పుడును నీకు నాశనము లేదు.

విశేషములు: జిష్ణు-`జిష్ణు ర్లేఖర్షభ శ్శక్ర శ్శతమన్యు ర్దివస్పతిః' జయశీలో జిష్ణుః' - జయించు శీలము గలవాడు ఇంద్రుడు.

గీ. అమరవంద్య! దివాభీత మనెడి పులుఁగు
హేళిమండల మీక్షింప నెట్లు నేర్చు?
నేము[5] నిన్నుఁ బరీక్షింప నెంతవార?
మిమ్మహాపరాధము క్షమియింపవలయు 112

అర్థము: అమర-వంద్య = దేవతలచేత, నమస్కరింపదగినవాడా!, దివాభీతము = గ్రుడ్లగూబ, అనెడి, పులుగు = పక్షి, హేళి-మండలము = సూర్యమండలము, ఈక్షింపన్ = చూచుటకు, ఎట్లు, నేర్చున్, ఏము = మేము, నిన్నున్, పరీక్షింపన్, ఎంతవారము? ఈ + మహా (మహత్) + అపరాధమున్ = ఈ గొప్పనేరమును, క్షమియింపన్ వలయున్.

1 2. తా. గడసన్న. 3 ము. విశ్వమూర్తులు వి బుధులు వెడలునపుడు 4. ము. కలదు 5.ము. నిను వినుతింపఁగ

తాత్పర్యము: దేవతలచే నమస్కరింపదగిన ఓ ఈశ్వరా! గ్రుడ్లగూబ సూర్యమండలమును జూడలేనియట్లే, మేము నిన్ను పరీక్షింప నెంతవారము? నిన్ను పరీక్షింపబూనిన మా మహాపరాదమును క్షమింపగోరుచున్నాము.

విశేషములు: దివాభీతము-`దివాన్థః కౌశికో ఘూకో దివాభీతో నిశాటనః దివాభీతః-పగలు భయపడునది-గ్రుడ్లగూబ. దివాభీతము హేళి మండలము నీక్షింపలేదు. మేము నిన్ను పరీక్షింప లేము - ఇట్లు ఉపమానోపమేయ వాక్యముల వేఱువేఱుగు ధర్మములు బింబప్రతిబింబ భావముచే చెప్పబడుటచే నిందలి అలంకారము దృష్టాంతము హేళి-కిరణమాలీ విరోచన హేలయో దినమణి స్తరణిశ్చ దినప్రణిః, హారావళి - సూర్యుడు

వ. అని స్తుతియించినం బ్రసన్నుండై విరూపాక్షుం డాక్షణంబ లింగ మధ్యంబున వెడలి యర్ధనారీశ్వరుండును, త్రినేత్రుండును, నీలలోహితుండును, వరదాభయ [1]మృగధరుండును, సర్వాభరణ భూషితుండును, బ్రమథ గణ సమన్వితుండును, గోటి సూర్య[2]ప్రకాశుండును, బాల చంద్రావతంసుండును నై సన్నిధి యగుటయుం బెన్నిధిం గన్న పేదల*(విధంబుం)బోలి విరించినారాయణు లిట్లనిరి. 113.

అర్థము: అని, స్తుతియించినన్ = స్తోత్రముచేయగా, విరూప + అక్షుండు = మూడు విధములయిన కన్నులు గలవాడు-శివుడు, ప్రసన్నుండు + ఐ, ఆ-క్షణంబు + అ = అప్పుడే, లింగ-మధ్యంబునన్-వెడలి = లింగమునడుమ నుండి వెడలి, అర్ధనారీశ్వరుండును, త్రినేత్రుండును = మూడు కన్నులు గలవాడును, నీలలోహితుండును = శివుడు, వరద + అభయ-మృగధరుండును = సర్వ + ఆభరణ-భూషితుండును =ఎల్ల అభరణములచే నలంకరింపబడిన వాడును, ప్రమథ-గణ-సమన్వితుండును = ప్రమథుల సమూహములతో గూడుకొన్నవాడును, కోటి-సూర్య-ప్రకాశుడును = కోటి సూర్యులయొక్క కాంతి గలవాడును, బాల-చంద్ర + అవతంసుండుననున్ = బాలుడైన చంద్రుడు(చంద్రకళ)శిరోభూషణముగా గలవాడును, ఐ, సన్నిధి + అగుటయున్ = చేరువకాగా, పెన్నిధిన్ = పెద్దనిధిని, కన్న = చూచిన, పేదల = బీదవారియొక్క, విధంబున్ = రీతిని, పోలి, విరించి నారాయణులు = బ్రహ్మయును విష్ణువును, ఇట్లు + అనిరి.

తాత్పర్యము: అని విష్ణు బ్రహ్మలు స్తోత్రముచేయగా, శివుడు వారికి ప్రసన్నుడై ఆ క్షణమే లింగము నడుమనుండి బయల్వెడలి అర్ధనారీశ్వరుడును, ముక్కంటియు, నీలలోహితుడును. ఎల్ల భూషణములచే నలంకరింపబడినవాడును, ప్రమథ గణములతో గూడిన వాడును, కోటి సూర్యుల కాంతి గలవాడును, చంద్రకళ శిరోభూషణముగా గలవాడును, అయి, చేరువకాగా, పెద్ద నిధానమును జూచిన పేదవారి విధమును

* తాళపత్రమున లేదు 1. తా. మృగాంకధరుండును. 2. తా. ప్రతీకాశుండును.

బోలి బ్రహ్మయును విష్ణువును వానితో నిట్లు పలికిరి.

విశేషములు; విరూపాక్షుండు-విరూపాక్ష స్త్రిలోచనః" -అమరము. సూర్యచంద్రాగ్ని రూపములైన మూడు విధములైన కన్నులు గలవాడు-శివుడు, నీలలోహితుండు`ధూర్జటి ర్నీలలోహితః"- బ్రహ్మ హోమము చేయునపుడు లలాట స్వేదమువలన గలిగిన తేజము అగ్నియందుబడి నీలవర్ణమై పిమ్మట రక్తవర్ణమాయెను. అందువలన పుట్టినవాడు గనుక నీలలోహితుడు. లేదా నీలఃకణ్ఠే, లోహితః కేశే ష్వస్యేతి-కంఠమందు నీలవర్ణంబును, కేశములయందు రక్తవర్ణంబును గలవాడు-శివుడు - అమరము. సర్వాభరణ భూషితుండు సర్వాభరణ భూషితుడు కావచ్చునా?

సీ. ఇభచర్మపరిధాన యే భక్తి చేసిన
సంతసం బందు నీ యంతరంగ
ముడురాజమౌళి యే యుపచారములు నీకుఁ
బ్రియములై యుండు నెంతయును గరిమ
నగరాజకన్యకాప్రాణేశ నీకు నే
కెలనఁ బో సర్వాంగకృప జనించుఁ
గ్రతువైరి నీకు నే వ్రతముఖ్య మొనరింపఁ
గౌతుకోన్మేషంబు గలిగియుండు

గీ. నంధకాసురదమన నీ కభిమతంబు
లే యనుష్ఠానములు శర్వ యే మఖంబు
లాచరించిన[1]నీ వార మగుదు మట్టు
లభవ దాక్షిణ్యపరత మా కానతిమ్ము 114

అర్థము: ఇభ-చర్మ-పరిధాన = ఏనుగు యొక్క తోలు వస్త్రముగా గలవాడా!-శివా, ఏ-భక్తి = ఎట్టి భక్తి, చేసినన్ = చేసినచో, నీ-అంతరంగము = నీ మనస్సు, సంతసంబు + అందున్ = సంతోషించును. ఉడు-రాజ-మౌళి = నక్షత్రేశుడు(చంద్రుడు) శిరస్సునందు గలవాడా!, ఏ-ఉపచారములు = ఏ సమ్మానములు, ఊడిగములు, నీకున్, ఎంతయును గరిమన్ = మిక్కిలి గొప్పతనముతో, ప్రియములు + ఐ + ఉండున్ = ఇష్టములయి యుండును. అగ-రాజ-కన్యకా-ప్రాణేశ = పర్వతరాజగు హిమవంతుని కూతురగు పార్వతికి ప్రాణేశ్వరుడైనవాడా!, ఏ -కెలనన్ + పోన్ = ఏ దిక్కునపోవ, నీకున్, సర్వ + అంగ-కృప = ఎల్ల అవయవముల దయ-లేదా, సర్వాంగ-ఓయి శివా! కృప = దయ, జనించున్ = కలుగును. క్రతు-వైరి = యజ్ఞమునకు శత్రువైనవాడా!, ఏ-వ్రత-ముఖ్యము=ఏ వ్రత శ్రేష్ఠము, ఒనరింపన్ = చేసినచో, నీకున్,

1. ము. నీవారమగుట యట్టు.

కౌతుక + ఉన్మేషంబు = సంతోషముయొక్క వికాసము, కలిగి + ఉండున్. అంధక + అసుర-దమన = అంధకుడను రాక్షసుని సంహరించినవాడా!, ఏ + అనుష్ఠానములు = ఏ ఆచరణములు, నీకున్, అభిమతంబులు = ఇష్టములు, శర్వ = శివా! ఏ-మఖంబులు = ఏ యజ్ఞములు, ఆచరించినన్ = చేసినచో, నీవారము, అగుదుము, దాక్షిణ్య -పరతన్ = దయాపరత్వముతో, ఆనతి + ఇమ్ము + సెల్వవిమ్ము.

తాత్పర్యము: ఓయి గజచర్మ వసనుడా! ఎటువంటి భక్తిగాంచినచో నీ మనస్సు సంతోషించును?చంద్రమౌళీ! ఏ సేవలు చేసినచో నీకు ప్రీతి గలుగును? పార్వతీ ప్రాణవల్లభా! ఏ విధముగా నడచినచో నీకు సంపూర్ణమైనదయ కలుగును? క్రతుధ్వంసీ! ఏ వ్రత శ్రేష్ఠము లాచరించినచో నీకు సంతోషము గలుగును? అంధకాసురవైరీ!ఏ యనుష్ఠానములు నీకిష్టములు? శర్వా! ఏ మఖములు చేసినచో మేము నీ వారమగుదుము? అభవా! ఆ ప్రకారమును మాకు నీవు దయతో నానతిమ్ము.

విశేషములు: ఇభ చర్మ పరిధాన-శివుడు గజాసురుని చంపి వాని చర్మమ్మును వస్త్రముగా ధరించెను, క్రతువైరి=దక్షుని యజ్ఞమును ధ్వంసము చేసిన వాడు-శివుడు. అగరాజ కన్యకా ప్రాణేశ-నిత్యసమాస విశ్రాంతి.

వ. అనినం [1]బ్రీత చేతస్కుండై *(శివుండు)విశ్వంభరాంభోరుహ సంభవుల కిట్లనియె.

అర్థము: అనినన్, ప్రీత-చేతస్కుండు + ఐ = సంతోషించిన మనస్సు గలవాడయి, శివుడు, విశ్వంభర + అంభోరుహ సంభవులకున్ = విష్ణువునకును, పద్మభవునకును (బ్రహ్మకును), ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: అని విష్ణు బ్రహ్మలు పలుకగా శివుడు సంతోషించి వారి కిట్లు పలికెను.

మ. అవధానంబున నాకు [2]సత్ప్రియము సేయన్ సర్వదా మీకు [3]స
ద్వ్యవసాయం బొనఁగూడె నేని వినుఁడా యంభోజదృగ్భారతీ
ధవులారా! విని యాచరింపుఁడు మదిం దాత్పర్య మొప్పంగ శ్రీ
శివరాత్రి వ్రత మస్మదీయ మది దాక్షిణ్యంబునం జెప్పితిన్ 116

అర్థము: అంభోజ దృక్ + భారతీ-ధవులారా! = పద్మముల వంటి కన్నులు గల ఓ విష్ణూ! సరస్వతీ దేవికి భర్తవైన ఓ బ్రహ్మా! నాకున్, అవధానంబునన్ = ఎచ్చరికతో, సత్ + ప్రియము = మంచి యిష్టము, చేయన్ = చేయుటకు, సర్వదా = ఎల్లప్పుడును, మీకున్, సత్ + వ్యవసాయంబు = మంచి పూనిక, ఒనగూడెన్ +

---

*తాళపత్రమున లేదు. 1. తా. బ్రచేతస్కుండై 2. ము.సంశయము. 3. ము. నద్వ్యవసాయం

ఏనిన్ = కలిగినచో, వినుడా = వినుడు, విని, శ్రీ-శివరాత్రి-వ్రతము, మదిన్ = మనస్సునందు, తాత్పర్యము = తత్పరత్వము, ఒప్పంగన్ = ఒప్పునట్లు, ఆచరింపుడు = చేయుడు, అది = ఆ శివరాత్రి వ్రతము, అస్మదీయము = నాకు సంబంధించినది, దాక్షిణ్యంబునన్ = దయతో, చెప్పితిన్.

తాత్పర్యము: ఓ విష్ణుబ్రహ్మలారా! మీరు నాకు ఎల్లప్పుడును శ్రద్ధతో ప్రీతి చేయబూనితిరేని వినుడు. విని శ్రీ శివరాత్రి వ్రతమును శ్రద్ధాళువులయి ఆచరింపుడు. అది నాకు సంబంధించిన వ్రతము. నేను మీకు దయతో చెప్పితిని.

వ. బ్రాహ్మముహూర్తంబునందు మేల్కొని శౌచక్రియలు నడపి గురున కభివాదనంబు సేసి సంకల్పంబు నడిపి పూజోపకరణ ద్రవ్యంబులు సమకూర్చుకొని [1]నదీస్నానం బొనర్చి నిత్యనైమిత్తి కాద్యనుష్ఠానంబులు దీర్చి [2]యలంకృతుండయి[3]యజన స్థానంబును సమ్మార్జన లేపనాదుల శోధించి వితాన ధ్వజంబు లెత్తించి [4]పతాకావలులు *(గట్టి)తోరణంబులు[5]సంఘటించి (కదలీఫల పూగఫల పనసఫల నారికేళంబులు తోరణంబులుగాఁ గట్టి) దేవాలయంబు ప్రవేశించి మౌనియై భసితత్రిపుండ్రంబును భస్మోద్ధూళనంబును గావించి రుద్రాక్షమాలికలు ధరియించి శివభక్తుల రావించి గురూపదేశ మార్గంబున [6]నాసనంబుం బాద్యం బర్ఘ్యంబు[7]మధుపర్కంబునిచ్చి [8]పంచవదనంబులుం బంచామృతంబుల నభిషేకించి ఫలోదక పుష్పోదక గంధోదక కుంకుమోదక రత్నోదక కర్పూరోదకంబుల నభిషేకించి వస్త్రం బుపవీతం బాచమనంబు గంధంబు భూషణంబు పుష్పంబు ఫలాహారంబు నీరాజనంబు ధూపంబు వ్యజనంబు వాదిత్రంబు దర్పణంబు స్తోత్రంబు మొదలుగాఁ గల [9]షోడశోపచారంబుల నుపచరించి నాలుగు జాములును జాగరంబు సేయునది (ఇది శివరాత్రి)వ్రతచర్య ప్రకారంబు.117

అర్థము: బ్రాహ్మ ముహూర్తంబు నందున్ = అరుణోదయమునకు పూర్వము రెండు గడియల కాలమునందు, గడియ = 24 నిముషములకాలము, మేల్కని = మేలుకాంచి, శౌచ-క్రియలు = పారిశుద్ధ్యమునకు సంబంధించిన పనులు, నడపి, గురునకున్, అభివాదనంబు = నమస్కారము, చేసి, సంకల్పంబు నడిపి, పూజా + ఉపకరణ-ద్రవ్యంబులు = పూజకు వలయు సాధనములు, సమకూర్చుకొని, నదీ-స్నానంబు + ఒనర్చి, నిత్య-నైమిత్తిక + ఆది + అనుష్ఠానంబులు = నియతములు, నిమిత్తము ననుసరించినవి మున్నుగా గల ఆచరణములు, తీర్చి, అలంకృతుండు + అయి = అలంకరింపబడిన వాడయి, యజన-స్థానంబును = పూజా స్థానమును, సమ్మార్జన-లేపన + ఆదులన్ + తుడుచుట, అలుకుట మున్నగువాని చేత, శోధించి

1. ము. నదీ స్నానంబువొనర్చి 2. తా. యలంకృతులై 3. తా. అజన స్నానంబున. 4. తా. ఫలావలులు 5. తా. గాగట్టి 6. తా. నాసనార్ఘ్య పాద్యంబుల. 7. తా. మధుపర్కంబిచ్చి. 8. తా. పంచవదను. 9. తా. యశేషోపచారంబుల.

= శుద్ధిచేసి, వితాన-ధ్వజంబులు = మేల్కట్టులు, ధ్వజములు, ఎత్తించి, పతాకా + ఆవలులు = టెక్కెముల వరుసలు, కట్టి, తోరణంబులు, సంఘటించి =కూర్చి, కదలీ-ఫల = అరటిపండ్లు, పూగ-ఫల = పోకలు, పనస ఫల = పనస ఫలములు, నారికేళంబులు = కొబ్బరికాయలు తోరణంబులుగాన్, కట్టి, దేవాలయంబు, ప్రవేశించి, మౌని + ఐ = మౌనము గలవాడయి, భసిత-త్రిపుండ్రంబును = విబూదితోడి మూడురేఖలును, భస్మ ఉద్ధూళనంబును = బూది పూతయును, కావించి = చేసి, రుద్రాక్ష-మాలికలు = రుద్రాక్షల పేరులు, ధరియించి, శివభక్తులన్, రావించి, గురు + ఉపదేశ-మార్గంబునన్ = గురువుపదేశించిన విధమున, ఆసనంబున్ = పీఠమును, పాద్యంబు = కాళ్లుకడిగికొననీరు, అర్ఘ్యంబు = పూజా ద్రవ్యము, మధుపర్కంబున్ = పెరుగు, నేయి, నీరు, తేనె, పంచదార అనునైదు వస్తువుల సముదాయమును, ఇచ్చి, పంచ-వదనంబులున్ = ఐదు ముఖములును, పంచ + అమృతంబులన్ = ఆవుపాలు, నేయి, పెరుగు, చక్కెర, తేనె యను నైదు పదార్థములతోను, అభిషేకించి = స్నానముచేయించి, ఫల + ఉదక = ఫలముల నీరు, పుష్ప + ఉదక = పూలనీరు, గంధ + ఉదక = మంచి గందపు నీరు, కుంకుమ + ఉదక = కుంకుమపునీరు, కర్పూర + ఉదకంబులన్ = కప్పురపునీరు-అనువానితో, నభిషేకించి, వస్త్రంబు, ఉపవీతంబు = జందెము, ఆచమనంబు, గంధము, భూషణము, పుష్పము, ఫలాహారము, నీరాజనంబు = హారతి, ధూపంబు, వ్యజనంబు = వీవన, వాద్రితంబు = వాద్యము, దర్పణంబు = అద్దము, స్తోత్రంబు, మొదలుగాన్ + కల, షోడశ + ఉపచారంబులన్ = పదునాఱు సేవలతో, ఉపచరించి =సేవించి, నాలుగు-జాములును, జాము మూడుగంటలకాలము, జాగరంబు = మేలుకొనియుండుట, చేయునది, ఇది, శివరాత్రి-వ్రత-చర్య-ప్రకారంబు = శివరాత్రివ్రతము చేయు విధము.

తాత్పర్యము: బ్రాహ్మముహూర్తమునందు మేలుకాంచి, శౌచక్రియలు నిర్వర్తించి, గురువునకు నమస్కరించి, సంకల్పించి, పూజకు వలయు వస్తువులను సమకూర్చుకొని, నదియందు స్నానముచేసి, నిత్యములు, నైమిత్తికములు నైన యనుష్ఠానములు చేసి, అలంకరించుకొని, పూజాస్థానమును తుడుచుట అలుకుట మున్నగు వానిచే శుద్ధిచేసి, వితాన ధ్వజము లెత్తించి, జెండాలు కట్టి, తోరణములు కట్టి, అరటి, పోక, పనస, నారికేళ ఫలములము తోరణములుగా గట్టి, దేవాలయమును ప్రవేశించి, మౌనము వహించి విబూది రేకలను, బూది పూతను గావించి రుద్రాక్షమాలలు ధరించి, శివ భక్తులను రావించి, గురూపదేశమార్గమున ఆసనమును, పాద్యమును, అర్ఘ్యమును, మధుపర్కమును, ఇచ్చి, ఐదుముఖములను పంచామృతములతో నభిషేకించి, ఫల పుష్పగంధకుంకుమ రత్న కర్పూరోదకములతో నభిషేకము చేసి, వస్త్రము, జందెము, ఆచమనము, గంధము, భూషణము; పుష్పము, ఫలాహారము, నీరాజనము, ధూపము, వీవన, వాద్యము, దర్పణము, స్తోత్రము మున్నుగాగల పదునాఱు విధములయిన

సేవలతో సేవించి రేయి నాలుగు జాములును మేలుకొని యుండవలయును. ఇది శివరాత్రివ్రతము చేయు విధము.

గీ. బ్రహ్మహత్యాయుతము సురాపానశతము
వీరహత్య గోహత్యలు వేనవేలు
శిశువధంబు[1]జనంగమ[2]స్త్రీ నిషేవ
మాది యగు పాపములఁ[3]దోలు నభవురాత్రి 118

అర్థము: అభవు-రాత్రి = శివరాత్రి, బ్రహ్మ-హత్యా + అయుతము = పదివేల బ్రహ్మ హత్యలు, సురా-పాన-శతము = నూఱు మద్యపానములు, వీర-హత్య-గో-హత్యలు = వీరులను చంపుట, ఆవులను చంపుట, వేనవేలు = పెక్కువేలు, శిశు-వధంబు = పిల్లలను చంపుట, జనంగమ-స్త్రీ = చండాల స్త్రీ యొక్క, నిషేవము = అనుభవము, ఆది + అగు = మొదలగు, పాపములన్, తోలున్ = పోగొట్టును.

తాత్పర్యము : శివరాత్రి పదివేలు బ్రహ్మహత్యలు, నూఱు మద్యపానములు, వీరులయు, గోవులయు వధలు పెక్కువేలు, శిశుహత్య, చండాలస్త్రీ సంభోగము మున్నగు పాపములను పోగొట్టును.

వ. తొల్లి యొక్క బ్రాహ్మణుడు మహా[4]పాపంబులు సేసి సర్వజనంబుల చేత నిందితుండై యొక్క శివరాత్రి[5]వ్రతదర్శనంబున శివ పురంబునకుం జనియెననిన శౌనకాదు లక్కథకున కిట్లనిరి. 119

అర్థము : తొల్లి = పూర్వము, ఒక్క, బ్రాహ్మణుండు, మహాపాపంబులు, చేసి, సర్వ - జనంబులచేతన్ = ఎల్లజనులచేతను, నిందితుండు + ఐ = నిందింపబడిన వాడయి, ఒక్క, శివరాత్రి - వ్రత - దర్శనంబునన్ = శివరాత్రి వ్రతము యొక్క చూచుటచేత, శివ పురంబునకున్ - శివుని పురమైన కైలాసమునకు, చనియెన్ = వెడలెను, అనినన్, ఆ + కథకునకున్ = కథ చెప్పునట్టి ఆ సూతునకు, శౌనక + ఆదులు = శౌనకుడు మున్నగువారు, ఇట్లు + అనిరి.

తాత్పర్యము: 'పూర్వము ఒక బ్రాహ్మణుడు మహాపాపములు చేసి, ఎల్లర చేత నిందింపబడిన వాడయి, ఒక శివరాత్రి వ్రత దర్శనము చేత కైలాసమున కేగెను.' అని కథ చెప్పు సూతుడు చెప్పగా, వానికి శౌనకుడు మున్నగువారు ఇట్లనిరి.

---

1. తా. భుజంగము, 2. ము. శ్రీవినాశ, తా.స్త్రీ నిషేధ, 3. తా. బొల్చు, 4. తా. పాతకంబులు, 5. తా. వ్రతంబాచరించి.

విశేషములు: మహాపాపములు అయిదు. అవి - బ్రహ్మహత్యా సురాపానం స్తేయం గుర్వంగనాగమః, మహాంతి పాతకాన్యాహుః సంసర్గశ్చాపి తైస్సహ. బ్రహ్మహత్య, సురాపానము, స్తేయము, గురుపత్నీగమనము, అవి చేయువారితో మైత్రి.

గీ. అద్భుతం [1]బయ్యెడిని మాకు నగ్రజన్ముఁ
డెట్టు పాతకములు సేయు నెట్టు[2]లట్టి
పాపి శివరాత్రి వ్రత మెట్టు పరఁగఁ జూచె
నంతయును విస్తరింపుమా [3]యనినఁ బ్రీతి. 120

అర్థము : మాకు, అద్భుతంబు = ఆశ్చర్యము, అయ్యెడిని, అగ్రజన్ముఁడు = బ్రాహ్మణుడు, ఎట్టు, పాతకములు = పాపములు, చేయుట, ఎట్టులు? అట్టి, పాపి, శివరాత్రి వ్రతము, ఎట్టు, పరగన్ = ఒప్పుగా, చూచెన్, అంతయును, విస్తరింపుమా = వివరింపుమా, అనినన్ = అని శౌనకాదులు అడుగగా, ప్రీతిన్ = సంతోషముతో.


తాత్పర్యము : 'మాకు చాల ఆశ్చర్యముగా నున్నది. బ్రాహ్మణుడెట్లు? పాపములు చేయుటెట్లు? అట్టి పాపాత్ముడు శివరాత్రి వ్రతమును ఎట్లు చూచెను? అంతయును వివరింపు' మని శౌనకాదులు సూతునడుగగా, నతడు సంతోషముతో - ద్వితీయాశ్వాసములోని మొదటి వచనముతో నన్వయము.

విశేషములు: బ్రాహ్మణుడెట్లు? పాపములు చేయుటెట్లు - అననురూపములైన వానికి ఘటన వర్ణింపబడుటచే విషమాలంకారము. 'విషమం వర్ణ్యతే యత్ర ఘటనాఽననురూపయోః.'

శా. జీమూతాన్వయరాజధైర్య సుమహాక్షీరాబ్ధి గాంభీర్య[4]సు
త్రామ ప్రోద్భవ గాఢ శౌర్య సుమనోధన్వాతి సౌందర్య శౌ
లోమీ నాయక తుల్య భోగయుత[5]సుశ్లోకద్రుజిత్త్యాగ భా
షా మాధుర్య మతిప్రకాశధిషణా నిత్యార్థసంభాషణా. 121

అర్థము : జీమూ ... ధైర్య : జీమూత = కొండల యొక్క, అన్వయ = కులమునకు, రాజ = రాజు యొక్క, ధైర్య = ధీరత్వముగలవాడా! కొండలతేని ధైర్యము వంటి ధైర్యము గలవాడా!, సు.... గాంభీర్య : సు - మహా - (మహత్) - క్షీర + అబ్ధి - గాంభీర్య = మంచిది, గొప్పది యగు పాల సంద్రము యొక్క, గాంభీర్యము గలవాడా!, సుత్రా ... శౌర్య : సుత్రామ = ఇంద్రుని నుండి, ప్రోద్భవ (ప్ర + ఉద్భవ) = పుట్టుకగల అర్జునుని యొక్క, గాఢ = అధికమైన, శౌర్య = పరాక్రమము గలవాడా! సుమనో .... సౌందర్య, సుమనస్ + ధన్వాన్ = సుమనోధన్వ

1. తా. బది నీవు మాకు. 2. తా. లట్టిపాటి. 3.తా. కవిక [illegible] 4. [illegible] 5. తా. సుశ్లోకచ్ఛటాభూష, ము.సుశ్లోకారి. జిత్త్యాగ.



= పూవింటివాడైన, మన్మథుని యొక్క, అతి = మిక్కిలి, సౌందర్య = అందముగల వాడా!, పౌలోమీ ... యుత : పౌలోమీ = శచీదేవియొక్క, నాయక = భర్తయైన ఇంద్రునితో, తుల్య = సమానమైన, భోగ = సుఖముతో, యుత = కూడినవాడా! సుశ్లోక ------ త్యాగ : సుశ్లోక = మంచికీర్తిగల - ప్రసిద్ధికెక్కిన, ద్రు = చెట్టును (కల్ప వృక్షమును), జిత్ = జయించు నట్టి, త్యాగ = ఈవి గలవాడా! త్యాగగుణమునందు కల్పవృక్షమును జయించువాడా అనుట, భాషా మాధుర్య = వాక్కునందు తీయదనము గలవాడా! మతి - ప్రకాశ - ధిషణా! = బుద్ధి యొక్క దీప్తియందు బృహస్పతి యైనవాడా!, నిత్య + అర్థ - సంభాషణా - ఎల్లప్పుడును తగిన మాటలు గలవాడా! ఇవియన్నియు కృతి భర్తయగు ముమ్మయశాంతయ్యకు విశేషణములైన సంబుద్ధులు.

తాత్పర్యము : కొండలోని ధైర్యము వంటి ధైర్యము గలవాడా! పాలసముద్రము గాంభీర్యము వంటి గాంభీర్యము గలవాడా! ఇంద్రసుతుడగు నర్జునుని పరాక్రమము వంటి పరాక్రమము గలవాడా! పుష్పబాణుని సౌందర్యము వంటి సౌందర్యము గలవాడా! శచీభర్తయగు నింద్రునితో సమానమగు భోగములు గలవాడా! కల్పవృక్షమును త్యాగమునందు జయించినవాడా! వాఙ్మాధుర్యము గలవాడా! బుద్ధి వికాసమున బృహస్పతియైన వాడా! ఎల్లప్పుడు నర్థమైన సంభాషణము గలవాడా! ఓకృతిపతీ, ముమ్మయశాంతయ్యా!

విశేషములు: జీమూత శబ్దము మేఘమునందును, పర్వతమునందును వర్తించుచున్నది. జీమూతౌ మేఘ పర్వతౌ. సుత్రామన్ - `సుత్రామా గోత్రభి ద్వజ్రీ వాసవో వృత్రహా వృషా' -అమరము. సుష్ఠు త్రాయత ఇతి సుత్రామా. లెస్సగా రక్షించువాడు - ఇంద్రుడు. సుమనోధన్వా - సుమనస్సు (పువ్వు) ధనుస్సుగా గలవాడు - మన్మథుడు. బహువ్రీహిని ఉత్తరపదమైన ధనుశ్శబ్దమునకు ధన్వ న్ అనునది యాదేశమగును. పౌలోమీ - పులోమజా శచీ న్ద్రాణీ- అమరము. పులోముని కూతురు-శచి, ద్రువు-పలాశీద్రుద్రుమాగమాః- అమరము. ద్రూయతే ద్రుః - పొందబడునది-చెట్టు. ధిషణ- `బృహస్పతి స్సురాచార్యో గీష్పతి ర్ధిషణో గురు' - అమరము. ధిషణా బుద్ధి రస్యాస్తీతి ధిషణః - మంచి బుద్ధి గలవాడు - బృహస్పతి. ధైర్య - గాంభీర్య - శౌర్య - సౌందర్య... అంత్యాను ప్రాసము. ధిషణా - భాషణా - అంత్యానుప్రాసము.

క. నిత్యయశశ్శ్రీ సుందర
మత్యమరాచార్యవర్య మాన్యచరిత్రా
భృత్యజనావన తత్పర
సత్యహరిశ్చంద్ర సరససాహిత్యనిధీ. 122

అర్థము: నిత్య - యశస్ + శ్రీ - సుందర = శాశ్వతమైన కీర్తి సంపదచే అంద మయినవాడా!, మతి + అమర + అచార్య - వర్య = బుద్ధియందు దేవ గురుశ్రేష్ఠుడా - బృహస్పతీ!, మాన్య - చరిత్రా = మన్నింప దగిన చరిత్రము గలవాడా!, భృత్య - జన + అవన - తత్పర = సేవక జనుల యొక్క రక్షణమునందు ఆసక్తిగలవాడా!, సత్య - హరిశ్చంద్ర = సత్యమునందు హరిశ్చంద్రుడైన వాడా! సరస - సాహిత్య - నిధీ = రసవంతమైన సాహిత్యమునకు నిధానమైనవాడా.

తాత్పర్యము: శాశ్వతమైన కీర్తి సంపదచే నొప్పారువాడా! బుద్ధియందు బృహస్పతియైన వాడా! మాన్యమైన చరిత్ర గలవాడా! భృత్యజన రక్షణమునందాసక్తి గలవాడా! సత్యపాలనమున హరిశ్చంద్రుడైన వాడా! రసవంతమైన సాహిత్యమునకు నిధానమైనవాడా!.

మాలిని. అమితహితసుభాషా స్వాంతవిద్యావిశేషా
సమరముఖదిలీపా చంద్రకందర్పరూపా
కమలనయ[న]వీర్యా కాంచనాహార్యధైర్యా
విమలరుచిరకీర్తీ విశ్రుతానందమూర్తీ 123

అర్థము = అమిత - హిత - సు - భాషా = అపారమైన మేలు గలమంచి వాక్కు గలవాడా, స్వాంత - విద్యా - విశేషా = అధ్యాత్మ విద్యయొక్క ఆధిక్యము గలవాడా. సమర- ముఖ - దిలీపా = అని మొనయందు దిలీప చక్రవర్తి యైనవాడా! చంద్ర - కందర్ప - రూపా = చంద్రుడు, మన్మథుడు అనువారి ఆకారము వంటి ఆకారముగలవాడా. కమల - నయన - వీర్యా = తామరలవంటి కన్నులు గలవాడు (విష్ణుడు) - అతని పరాక్రమమువంటి పరాక్రమము గలవాడా! కాంచన అహార్య ధైర్యా = బంగరుకొండ (మేరువు) ధైర్యము వంటి ధైర్యము గలవాడా, విమల- రుచిర- కీర్తీ = స్వచ్ఛము, మనోహరమునైన యశస్సు గలవాడా, విశ్రుత-ఆనంద- మూర్తీ = ప్రసిద్ధమైన ఆనందము యొక్క ఆకారమయినవాడా - ముమ్మయశాంతయ్యా.

తాత్పర్యము: అధికమైన మేలు గల మంచి వాక్కు గలవాడా! అధ్యాత్మ విద్యా విశేషము గలవాడా, అని మొనయందు దిలీపుని వలె పరాక్రమము చూపు వాడా, చంద్రమన్మథుల వలె సుందరుడా, విష్ణుని వీర్యము వంటి వీర్యము గలవాడా, మేరు ధీరుడా, నిర్మలము మనోహరమునైన కీర్తిగలవాడా, ప్రసిద్ధమైన ఆనందము రూపమయినవాడా - ముమ్మయ శాంతయ్యా అని కృతి పతి సంబోధనములు. మాలిని. ప్రతిపాదమునను న,న,మ,య,య అను గుణములుండును. మొదటి యక్షరమునకును తొమ్మిదవ యక్షరమునకును యతిమైత్రి. ప్రాసనియమము గలదు.

గద్యము:

ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్త్ర సకలవిద్యాసనాథ శ్రీనాథనామధేయ ప్రణీతంబయిన శివరాత్రిమాహాత్మ్యంబునందు

ప్రథమాశ్వాసము

అర్థము : ఇది, శ్రీమత్ + కమలనాభ - పౌత్ర = శ్రీమంతుడైన కమలనాభుని యొక్క పుత్త్రుని పుత్త్రుడు, మారయ + అమాత్య - పుత్త్ర = మారయ, యను మంత్రి యొక్క, కుమారుడు, సకల - విద్యా - సనాథ = ఎల్లవిద్యలతో, గూడుకొన్నవాడు, (అగు), శ్రీనాథ - నామధేయ - ప్రణీతంబు = శ్రీనాథుడను పేరుగల వానిచేత. రచింపబడినది, అయిన, శివరాత్రి మాహాత్మ్యంబునందున్, ప్రథమ + ఆశ్వాసము = మొదటి ఆశ్వాసము.

తాత్పర్యము: ఇది శ్రీకమలనాభుని పౌత్త్రుడును, మారయమంత్రి పుత్త్రుడును, సకల విద్యాసనాథుడును అగు శ్రీనాథుడను పేరుగల వానిచే రచింపబడిన శివరాత్రి మాహాత్మ్యమను కావ్యమునందు మొదటి ఆశ్వాసము.

గీ. అమల జొన్నలగడ్డ వంశాబ్ధివిధుఁడు
ఖ్యాత మృత్యుంజయాభిఖ్యుఁడైన వాఁడు
పరఁగ శ్రీనాథ కవిసార్వభౌమ రచిత
భవ్యశివరాత్రిమాహాత్మ్య కావ్యవరముఁ
బ్రతిపదార్థవిశేష తాత్పర్య కలన
స్పష్ట మొనరించు `చంద్రికా' వ్యాఖ్య యిద్ది.



శివరాత్రి మాహాత్మ్యము
(సుకుమార చరిత్రము)
ద్వితీయాశ్వాసము

క. శ్రీ హిమవద్గిరి పుత్త్రి మ
నోహరపదభక్తి జాత నూతన సరస
వ్యాహార కావ్యనాయక
మోహన తనుజితజయంత ముమ్మయశాంతా. 1

అర్థము : శ్రీ ..... నాయక : శ్రీ = శోభావంతుడగు, (హిమవత్ + గిరి = హిమవంతుడను పర్వతము యొక్క, పుత్త్రి = కూతురైన పార్వతి యొక్క, మనోహర = భర్తయైన శివుని యొక్క, పద = అడుగుల యందలి, భక్తివలన, జాత = పుట్టిన, నూతన = క్రొత్త, సరస = రసవంతమయిన, వ్యాహార = మాటలు గల, కావ్య = కావ్యమునకు, నాయక = పతియైన వాడా! మోహన - తను - జిత - జయంత = సుందరమైన, శరీరము చేత, జయింపబడిన, జయంతుడు (ఇంద్రుని కొడుకు) గలవాడా! ముమ్మయశాంతా!

తాత్పర్యము : పార్వతీ పతి పదభక్తి వలన గలిగిన నూతనము, సరసము నైన మాటలు గల కావ్యమునకు నాయకుడైన వాడా! శరీరసౌందర్యముచే జయంతుని జయించినవాడా! ముమ్మయశాంతా! అని కృతిపతి సంబోధనము.

వ. అక్కథకుండు శౌనకాది మహామునుల కిట్లని చెప్పందొణంగె. 2.

అర్థము: ఆ + కథకుండు = సూతుడు, శౌనక + ఆది - మహా - మునులకున్, ఇట్లు + అని, చెప్పన్ + తొణంగెన్ = చెప్ప దొడగెను.

తాత్పర్యము: కథ చెప్పునట్టి ఆ సూతుడు శౌనకుడు మున్నగు మహర్షుల కీరీతిగా చెప్పనారంభించెను.

సీ. కాంచనాచలముతో గర్వించి యే కొండ
[1]పెరిగె బ్రహ్మాండకర్పరము మోవ

---

1. తా. పెరిగి

నే కొండ చఱులపై హిమశైలకన్యక
చెంచులేమలఁ గూడి సంచరించు
వజ్రాల కమరుఁ దేవ విడంబనము సేయు
నే కొండ మొలచుట్టు నిందుతనయ
యల్లోనేరెడు దీవి యవనీధ్రములలోన
నేకొండ కైశ్వర్య మెక్కుడయ్యె.

గీ. నట్టి వింధ్యనగేంద్ర పర్యంతభూమి
దండకారణ్య విపినమధ్యంబునందు
రత్నపురమనఁ గల దొక రాజధాని
కిన్నరాధీశు నగరికిఁ గీసవెలితి 3

అర్థము: = ఏ కొండ = ఏ వింధ్య పర్వతము, బ్రహ్మాండ - కర్పరమున్ = కొప్పెర (వెడల్పు మూతిగల పెద్ద పాత్రము - కటాహము) వంటి బ్రహ్మాండమును, మోవన్ = మోచుటకు, కాంచన + అచలముతోన్ = బంగారు కొండ యగు మేరువుతో, గర్వించి, పెరిగెన్. ఏ కొండ = ఏ వింధ్య పర్వతము యొక్క చఱులపైన్ = చఱియల (తటముల) మీద, హిమశైల - కన్యక = మంచు గొండ కూతురు - పార్వతి, చెంచులేమలన్ = చెంచితలను, కూడి, సంచరించున్ = తిరుగును, ఏ కొండ, మొలచుట్టున్ = మొల యొక్క చుట్టును, ఇందు - తనయ = చంద్రుని కూతురు - నర్మదానది, వజ్రాల - కమరు - తేవన్ = వజ్రాల మొలనూలు నొప్పిదమును, విడంబనము + చేయున్ = అనుకరణము చేయును. ఏ కొండకున్, అల్లోనేరెడు దీవి = జంబూద్వీపము నందలి, అవనీధ్రములలోనన్ = కొండలలోపల, ఐశ్వర్యము = ప్రభుత్వము, సంపద, ఎక్కుడు + అయ్యెన్ = అధికమయ్యెను. అట్టి, వింధ్య - నగ + ఇంద్ర - పర్యంత - భూమిన్ = వింధ్య పర్వత శ్రేష్ఠపు, పరిసర ప్రదేశమునందు, దండక + అరణ్య - విపిన - మధ్యంబు + అందున్ = దండకారణ్యము అను పేరు గల అడవి నడిమి ప్రదేశమున, కిన్నర + అధి + ఈశు = కిన్నరుల ప్రభువుయొక్క (కుబేరుని యొక్క), నగరికిన్ = పురమగు అలకకు, కీస = కొంచెము, వెలితి = తక్కువ, అగు, రత్నపురము + అనన్, ఒక, రాజధాని, కలదు.

తాత్పర్యము: బ్రహ్మాండ కటాహమును మోచుటకు మేరు పర్వతముతో గర్వించి పెరిగి నట్టియు, హిమవత్పుత్త్రిక చెంచితలను గూడి చఱియలపై విహరించు నట్టియు, నర్మదా నది వజ్రాలమొల నూలి యొప్పున మొలను చుట్టు నట్టియు, జంబూద్వీపము నందలి కొండలలో నైశ్వర్య మెక్కువ గలట్టియు, వింధ్య పర్వతము పరిసర ప్రదేశమునందలి దండకారణ్యము నడుమ అలకాపురికి కొంచెము తక్కువ యనిపించు రత్నపురమను నొక రాజధాని గలదు.

విశేషములు: చఱి - చఱియ రూపాంతరము. కమరు - కమ్మరు రూపాంతరము. ఇందు తనయ - `రేవా తు నర్మదా సోమోద్భవా మేఖల కన్యకా' అమరము. సోమ (ఇందు) వంశమున పుట్టిన పురూరవుడను రాజుచేత భూమికి దేబడినది - నర్మద. అల్లోనేరెడు = జంబూ, దీవి = ద్వీపము, ఐశ్వర్యము - ఈశ్వరస్యభావః - ప్రభుత్వము. ఆ విపినము పేరే దండకారణ్యము. కిన్నరులు - అశ్వ ముఖము, నరశరీరమును గల దేవయోని విశేషము. అశ్వముఖత్వాత్ కుత్సితా నరాః కింనరాః - గుఱ్ఱపు మోము గలవారు గాన ఏవగింప దగినవారు. వజ్రాల కమరు రేవ నిందుతనయ విడంబనము సేయు - ఉపమాలంకారము.

గీ. స్ఫటికమాణిక్యపాషాణఘటితమైన
యప్పురము కోట యాకాశ మంటి యొప్పు
వేడ్కఁ బాతాళభువనంబు వెడలి వచ్చి
[1]చుట్టుముట్టిన యట్టి వాసుకియుఁ బోలె 4

అర్థము: స్ఫటిక - మాణిక్య - పాషాణ - ఘటితము = స్ఫటికములు, మణులు అను శిలలచే నిర్మింపబడినది, ఐన, ఆ + పురము - కోట = ఆ రత్నపురము నందలి కోట, వేడ్కన్ = వేడుకతో, పాతాళ - భువనంబున్ = పాతాళలోకము నుండి, వెడలి వచ్చి = వెలువడి వచ్చి, చుట్టుముట్టిన, అట్టి వాసుకియున్ + పోలె = వాసుకి విధమున, ఆకాశము, అంటి = తాకి, ఒప్పున్.

తాత్పర్యము: స్ఫటిక శిలలతోను మాణిక్యములతోను నిర్మింపబడిన ఆ రత్నపురమునందలి కోట పాతాలలోకమునుండి వేడుకతో బయల్వెడలి వచ్చి చుట్టుముట్టిన వాసుకివలె నాకాశమునంటి యొప్పెను.

విశేషములు: అప్పురము కోట యాకాశమంటి యొప్పు - సంబంధాతి శయోక్త్యలంకారము. సంబన్ధాతిశయోక్తిస్స్యా దయోగే యోగకల్పనమ్. వాసికియు బోలె నొప్పు - ఉత్ప్రేక్ష - సంభావనా స్యా దుత్ప్రేక్షా. పాతాళభునంబు వెడలి వచ్చి - పాతాళభువనంబు వలన నుండి వెడలి వచ్చి - ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగా నగు - బాల. కారక. 11. పాతాళభువనంబు నుండి వెడలి వచ్చి.

వలన కాదేశంబగు ద్వితీయాసప్తములమీది యుండికి లోపంబు బహుళంబుగా నగు. ప్రౌఢ. కారక. 11

గీ. [2]పట్టణంబున దేవతాభవనకోటి
తుహినగిరి కూటములతోడఁ దులలు తూఁగు

1. ము. చుట్టుచుట్టిన యట్టి, 2. తా. పటెనంబున

నమరగంగాపయఃప్రవాహములఁ బోలు
దచ్ఛిరస్స్థాపితోన్నత ధ్వజపటములు. 5

అర్థము: పట్టణంబునన్ = రత్నపురమను పట్టణమునందు, దేవతా - భవన - కోటి = దేవాలయముల యొక్క సమూహము, తుహిన - గిరి - కూటముల తోడన్ = మంచు గొండ కొనలతో, తులలు తూగున్ = సమానముగా నుండును, తద్.... పటములు : తద్ = ఆ దేవాలయముల యొక్క; శిరస్ = పయిభాగములందు, స్థాపిత = నిలుపబడిన, ఉన్నత = ఎత్తయిన, ధ్వజ - పటములు = టెక్కెపు గుడ్డలు, అమర - గంగా - పయస్ - ప్రవాహములన్ = ఆకాశగంగా నదీ జల ప్రవాహములను, పోలున్ = పోలును.

తాత్పర్యము: రత్నపురమునందలి దేవాలయముల సమూహము మంచు గొండ శిఖరములతో తులతూగుచుండును. ఆ ఆలయములపైని నిలుప బడిన టెక్కెముల వస్త్రములు ఆకాశగంగానదీజలప్రవాహములను పోలును.

విశేషములు: పట్టణము - పత్తనము సంస్కృతము. పయస్ + ప్రవాహము = పయః + ప్రవాహము - పదాంత సకారమునకు విసర్గము. పకారపరకము గావున నీ విసర్గము ఉపధ్మానీయము. తద్ + శిరస్ - వర్గముల మొదటి నాల్గక్షరముల (ఝయ్యుల) కంటె పరమగు శవర్ణమునకు అచ్చులుగాని, అంతఃస్థములుగాని అనునాసికములుగాని హకారముగాని (అట్టులు) పరమై యున్నప్పుడు ఛకారము వైకల్పికముగా నాదేశమగును. తద్ + ఛిరస్. సకార త వర్గములకు శవర్ణ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్ణ చ వర్గ వర్ణము లాదేశము లగును. తచ్ఛిరస్. `పట్టణంబున...... తులలు తూగు' - ఉపమాలంకారము. `అమరగంగా ..... ధ్వజపటములు' - ఉపమాలంకారము.

సీ. [1]ప్రణత దేవకిరీట మణిమయూఖచ్ఛటా
పటల కిమ్మీరాంఘ్రిపంకజుండు
వికట పాటలజటా మకుటకోటిఘటిత
కోమల [2]తారకా కాముకుండు
గంధ దంతావళ క్రవ్యాదరాట్కృత్తి
కంథాధురంధర కంధరుండు
కుంభినీధరసుతా కుచకుంభ మృగమద
స్థాసకస్థగితవక్షస్స్థలుండు

1. ము. తా. మకుట, 2. తా. తోరణకోవిదుండు.

గీ. శంభుఁ డోంకారనాథుండు శాశ్వతుండు
పాయకయ యుండు నవ్వీటి పరిసరమున
నర్మదాసింధుతీరకాంతారభూమి
మఱ్ఱియను పేరి కల్పద్రుమంబు [1]నీడ. 6

అర్థము: ప్రణత.... పంకజుండు : ప్రణత = నమస్కరించిన, దేవ = దేవతల యొక్క, కిరీట = కిరీటము లందలి, మణి = మణుల యొక్క, మయూఖ = కిరణముల యొక్క, ఛటా = కాంతులయొక్క, పటల = సమూహము చేత, కిమ్మీర = చిత్రవర్ణములుగల, అంఘ్రి - పంకజుండు = పద్మముల వంటి పాదములు గలవాడు వికట .... కాముకుండు : వికట = మిక్కిలి వంకరయైన, పాటల = తెలుపు మించిన యెఱుపు వర్ణముగల, జటా = జడలనెడి, మకుట = కిరీటము యొక్క, కోటి = అంచున, ఘటిత = కూర్పబడిన, కోమల = మృదువైన, తారకా - కాముకుండు = తారానాథుడు (చంద్రుడు) కలవాడు. గంధ....... కంధరుండు : గంధ - దంతావళ = మదించిన యేనుగు అనెడి, క్రవ్యాద - రాట్ = రాక్షసరాజు యొక్క, కృత్తి = చర్మము రూపమైన, కంథా = బొంతయొక్క, ధురంధర = భారము వహించిన, కంధరుండు = మెడ గలవాడు. కుంభినీ...... స్స్థలుండు : కుంభినీ ధర = కొండ యొక్క (హిమవంతుని యొక్క), సుతా = కూతురైన పార్వతి యొక్క, కుచ - కుంభ = కడవలవంటి పాలిండ్ల యందలి, మృగమద = కస్తూరి చేతను, స్థాసక = కుంకుమచేతను, స్థగిత = కప్పబడిన, వక్షస్ + స్థలుండు = ఱొమ్ము గలవాడు.

శంభుడు = ఈశ్వరుడు, ఓంకారనాథుండు = ఓంకారనాథుడను పేరుగలవాడు, శాశ్వతుండు = స్థిరుడు, ఆ + వీటి - పరిసరమునన్ = ఆ ఊరి సమీపమున, నర్మదా - సింధు - తీర - కాంతార - భూమిన్ = నర్మదయను నది యొక్క ఒడ్డునందలి అడవి ప్రదేశమున, మఱ్ఱి + అను - పేరి - కల్పద్రుమంబు - నీడన్ = మఱ్ఱియనెడి కల్పవృక్షము యొక్క నీడయందు, పాయక + అ = విడువకయే, ఉండున్.

తాత్పర్యము: ఆ రత్నపురమునకు సమీపమున నర్మదా నదీ తీరమందలి అడవిలో కల్ప వృక్షమువంటి మఱ్ఱి చెట్టు నీడలో - నమస్కరించు దేవతల కిరీటములందలి మణుల కిరణముల కాంతుల సమూహముచే చిత్రవర్ణములు గల పాద పద్మములు గలవాడును, మిక్కిలి వంకరయైనవి, పాటల వర్ణములు గలవి యైన జడలనెడి కిరీటమున ఘటింప బడిన చంద్రుడు గలవాడును, మత్త గజాసుర

1. ము. మొదల

చర్మకంథభారమును వహించిన వాడును, పార్వతీ స్తన కుంభములందలి కస్తూరి, కుంకుమలచే కప్పబడిన వక్షస్థలము గలవాడును, శాశ్వతుడును అగు ఓంకారనాథుడను నీశ్వరుడు వీడకయే యుండును.

విశేషములు: ప్రణత దేవే త్యాది వర్ణనముచే నోంకారనాథేశ్వరుని సర్వదేవతా పూజనీయతాధికతలును, వికట పాటవేత్యాది వర్ణనముచే తద్భక్త పరితాపోప శమక్షమత్వమును, గంధదంతా వళేత్యాది వర్ణనముచే తద్దుష్టశిక్షణ శీలతయును, కుంభినీధరేత్యాది వర్ణనముచే తత్సరసత్వమును తెలియుచున్నవి. మయూఖ + ఛటా = మయూఖచ్ఛటా - చూడు. పూర్వవ్యాఖ్య.

వ. అప్పట్టణంబునకుం జుట్టును జనపదంబు [1]లైరావతీ శత ద్రు విపాశా సింధునదీ మాతృకంబులును, విశ్వవిశ్వంభరా భ్రూలతా నుకారి సేతు రేఖాలంకారంబులును, దటాక తరు కుసుమ కేసర క్షర దమంద మకరంద ధారా ధోరణీ సహ [2]సంవర్ధిత కుల్యా సలిల కల్లోల మాలికా [3]స్ఫుట స్ఫాయత్కాయమాన నానావిధోద్యాన వాటికా సంఘటితాకాల కాలాంధకారంబులును, నారామ చూతపోత నికర సుకుమార కిసలయాస్వాద కషాయకంఠ కలకంఠకామినీ కోమల కుహూకార కోలాహలాంకురిత పంచమ రాగ రాజంబులును, రాజాన్న కలమషాష్టిక పతంగ[4]ప్రియ నానావ్రీహి సస్యో[5]ప్రశస్తంబులును, ప్రవర్ధమాన వనంబులును, [6]నిబిడిత సారసికంబులును, గుళుత్థాభ్యుత్థానంబులును, సముద్గత ముద్గ సామగ్రీ సంగ్రహంబులును, [7]అణుక చణక చణంబులును, సిద్ధార్థ [8]శ్యామాక గోధూమ [9]గర్ముత్తిల జర్తిలంబులును, అదూషిత [10]మాషకోర దూషితకోన్మేషంబులును, [11]కుసుంభ కుసుమ గుచ్ఛచ్ఛాయాచ్ఛటా [12]భృంగణ శోణభంగో మాణు శృంగారిత జాంగల క్షేత్రంబులునునై దాశరథి [13]చరిత్రంబునుంబోలె సీతావృత్తి [14]సరళంబును, జంద్రోదయంబునుంబోలె గర సహసంవర్ధిత [15]రత్నాలయంబును, యదు వంశంబునుంబోలె గులక్రమాగత శూరపురుషోత్తమబలాభిపాలితంబును నై యుండు వెండియు. 7

అర్థము : ఆ + పట్టణంబునకున్, చుట్టును, జనపదంబులు = గ్రామములు, ఐరావతీ - శతద్రూ - విపాశా - సింధు - నదీ - మాతృకంబులును = ఐరావతి, శతుద్రువు, విపాశ, సింధు అను పేర్లు గల నదులచే పండ్రెండు పైర్లు గలవియు, విశ్వా....... రంబులును : విశ్వ = సమస్తమైన, విశ్వంభరా = భూ దేవి యొక్క, భ్రూ - లతా = తీగవంటి కనుబొమలను, అనుకారి = అనుకరించు నట్టి, సేతు -

1. ము. తా. లీలావతీ శతద్రువిపాట్సింధు, 2. తా. సువర్ధిత, 3. తా. స్ఫాల, 4. తా. ప్రాయ, 5. తా. ప్రస్థంబులును, 6. తా. నిపిడితకాసార సేకంబులును, 7. తా. సనకోచణక చణకంబులును, 8. తా. శ్యామ, 9. ము. శర్మరాతిల, 10. ము. మహాకోర, 11. ము. కుస్తుంబురు, 12. ము. భృంగ, 13. తా. చరిత్రంబులునుంబోలె, 14. తా. సరళంబులును, 15. తా. రత్నాలయంబులును.

రేఖా - అలంకారంబులును = నీటికట్టల యొక్క, పంక్తులు, అలంకారములుగా గలవియును,

తటాక...... కారంబులును: తటాక = చెఱువు (గట్టు)లందలి, తరు = చెట్లయొక్క, కుసుమ = పువ్వుల యొక్క, కేసర = అకరువుల నుండి, క్షరత్ = కాఱుచున్న, అమంద = తక్కువకాని, మకరంద = పూదేనెలయొక్క, ధారా = ప్రవాహము యొక్క, ధోరణీ = పంక్తులయొక్క, సహస్ర = వేయిచేత (వేయి ప్రవాహ పంక్తుల చేత), సంవర్ధిత = బాగుగా పోషింపబడిన, కుల్యా = కాలువలయందలి, సలిల = నీటియొక్క, కల్లోల - మాలికా = అలల శ్రేణుల చేత, స్ఫుట - స్ఫాయత్ = స్పష్టముగా వృద్ధిపొందుచున్న, కాయమాన = పందిరులు గల, నానా - విధ = పెక్కురీతులయిన, ఉద్యాన - వాటికా ఉపవన ప్రదేశములచే, సంఘటిత = కూర్చబడిన, అకాల = అసమయమందయిన, కాల + అంధకారంబులును = కాఱు చీకట్లు గలవియును, ఆరామ...... రాజంబులును : ఆరామ = తోటలయందలి, చూత - పోత = మామిడి గున్నల యొక్క, నికర = సమూహము యొక్క, కిసలయ = చిగుళ్ల యొక్క, ఆస్వాద = రుచిచూచుట (తినుట) చేత, కషాయ - కంఠ = ఇంపయిన ధ్వని గల యెలుగు గల, కలకంఠ = కామినీ = ఆడుకోయిల యొక్క, కోమల = మృదువైన, కుహూ కార = కుహూకుహూ అను వాని, యొక్క, కోలాహల = కలకలము చేత, అంకురిత = పుట్టిన, పంచమ - రాగ - రాజంబులును = శ్రేష్ఠములయిన పంచమ స్వరము గలవియును, రాజాన్న .... ప్రశస్తంబులును : రాజాన్న = రాజనములు, కలమ = కలమములు, షాష్టిక = అఱువది దినములలో పండు ధాన్య విశేషములు, పతంగ ప్రియ = ధాన్యవిశేషములు, అను, నానా = అనేకములయిన, వ్రీహి = ధాన్యములచేత, సస్య = పైరుల చేత, ప్రశస్తంబులును = ప్రసిద్ధికెక్కినవియును, ప్రవర్ధమాన - వనంబులును = మిక్కిలి వృద్ధి పొందుచున్న తోటలు గలవియు, నిబిడిత - సారసికంబులును = దట్టముగా చేయబడిన, తామరలుగలవియును, కుళుత్థ + అభ్యుత్థానంబులును = ఉలవలయొక్క లేచుట (వృద్ధి) గలవియును, సముద్గత...... సంగ్రహంబులును : సముద్గత = బయల్వెడలిన, ముద్గ = పెసల యొక్క, సామగ్రీ = సమగ్రత యొక్క, సంగ్రహంబులును = సమ్యగ్గ్రహణము గలవియును (పెసలు సమగ్రముగా బండినవియును), అణుక - చణక - చణంబులును - సన్నని సెనగలచే ప్రసిద్ధమయినవియును, సిద్ధార్థ .... లంబులును : సిద్ధార్థ = తెల్లావలు, శ్యామాక = చామలు, గోధూమ = గోధుమలు, గర్ముత్ = గంటెలు, తిల = నువ్వులు, జర్తిలంబులును = అడవి నువ్వులు గలవియును, అదూషిత..... షంబులును : అదూషిత = నిందింపబడని (మంచివియగు), మాష = మినుముల యొక్కయు, కోరదూషితక = అళ్ళ యొక్కయు, ఉన్మేషంబులును = వికాసము గలవియును, కుసుంభ ....క్షేత్రంబులునున్ : కుసుంభ = కుంకుమ

చెట్టు యొక్క, కుసుమ - పూల యొక్క, గుచ్ఛ = గుత్తుల యొక్క, ఛాయా = నీడల యొక్క, ఛటా = ఐ, దాశరథి = దశరథుని కుమారుడైన శ్రీరాముని యొక్క, చరిత్రంబునున్ + పోలెన్ = వృత్తాంతము వలె, సీతా వృత్తి - సరళంబును = సీతా దేవి యొక్క, వర్తనము చేత, సరళమయినదియు, సీతా = దున్నబడినభూముల యొక్క, వృత్తి = ఉనికి చేత, సరళంబును = తిన్ననైనదియును, చంద్ర + ఉదయంబునున్ + పోలెన్ = చంద్రుని యొక్క, ఉదయంబునున్ + పోలెన్ = అభ్యుదయమువలె, కర - సహ - వర్ధిత - రత్నాలయంబును = కిరణముల వేయి చేత వృద్ధి పొందింప బడిన సముద్రము గలదియును, కర = కప్పముల యొక్క, సహస్ర = వేల చేత, సంవర్ధిత = మిక్కిలి వృద్ధి పొందింపబడిన, రత్న + ఆలయంబును = రత్నముల నిలయము గలదియును, యదు - వంశంబునున్ + పోలెన్ = యాదవ కులమువలె,

కుల.... పాలితంబునున్ : కుల = కులము యొక్క, క్రమ = వరుసననుసరించి, ఆగత = వచ్చిన, శూ ర = శూరుడనువాడు, పురుషోత్తమ = శ్రీకృష్ణుడు, బల = బలరాముడు (వీరు ముప్పురును యదు వంశము వారు) అను వారి చేత, అభిపాలితంబునున్ = రక్షింపబడినదియును, కుల - క్రమ + ఆగత = కులము వరున యందు వచ్చిన, శూర = పరాక్రమవంతులు, పురుష + ఉత్తమ = పురుషశ్రేష్ఠులు, అగు వారి యొక్క, బల = బలముచేత, అభిపాలితంబును = రక్షింపబడినదియును, ఐ = అయి, ఉండున్, వెండియున్ = మఱియును.

తాత్పర్యము: రత్నపురమను ఆ పత్తనమునకు చుట్టును గల గ్రామములు ఇరావతి, శతద్రువు, విపాశ అనెడి నదుల జలములచేత పండునట్టి పైరులు గలిగియుండును. సమస్త భూమి యనెడు స్త్రీ యొక్క బొమతీవలను అనుకరించునట్టి ఆనకట్టల వరుసలు అలంకారములుగా గలిగియుండును. చెఱువుగట్టులందలి చెట్లపూల అకరువులనుండి కాఱు అధికమైన పూదేనేల ప్రవాహములచే నేర్పడు కాలువలందలి అలలచే వృద్ధి పొందుచున్న పందిరులు గల పలురీతులయిన ఉపవనములచే నకాలమయిన కాఱు చీకట్లు గలిగి యుండును. తోటల యందలి గున్న మామిడుల చివురులను మెసవుటచే నింపయిన యెలుగు గల ఆడు కోయిలల మృదు కుహూ ధ్వనుల కలకలముచే పుట్టిన పంచమస్వరము గలిగియుండును. రాజనములు, కలమములు, షాష్టికములు, పతంగప్రియములు అను పెక్కు ధాన్యపు బైరులచే ప్రసిద్ధి కెక్కినవి. అందు తోటలు వృద్ధి పొందుచుండును. తామరలు దట్టముగా నుండును. ఉలవలు, పెసలు, సెనగలు, తెల్లావలు, చామలు, గోధుమలు, గంటెలు, నువ్వులు, అడవి నువ్వులు పండుచుండును. మినుములు, అళ్ళు పండును.

ఆ పత్తనము దాశరథి చరిత్రము వలె సీతావృత్తి చే సరళమయి యుండును.

చంద్రోదయము వలె కర సహస్ర సంవర్ధిత రత్నాలయమయి యుండును. యదువంశము వలె కులక్రమాగత శూర పురుషోత్తమబల రక్షితమై యుండును. మఱియును పయి పద్యముతో నన్వయము.

విశేషములు: సీతావృత్తి, కర..... రత్నాలయము, శూర పురుషోత్తమ బల అను చోట్ల అర్థద్వయముండుటచే శ్లేషాలంకారము గలదు. `నానార్థ సంశ్రయః శ్లేషః'

మ. పరలోకస్థుఁ [1]బతిన్ ఝషాంకుఁ బ్రతికింపంగోరి యోంకారశం
కరుమ్రోలన్ రతి [2]ముక్త కంఠముగ నాక్రందించు నా[3]నొప్పు న
ప్పుర బాహ్యోపవనాంత దీర్ఘికల రేపున్ మాపు వీతెంచు పు
ష్కరకింజల్కభుజిక్రియాసుఖితహంసక్రేంక్రియారావముల్. 8

అర్థము: అప్పుర ...... దీర్ఘికలన్ : అ + పుర = ఆరత్నపురమందలి, బాహ్య = వెలుపలి, ఉపవన + అంత = ఉద్యానవనములలోపల నున్న దీర్ఘికలన్ = దిగుడు బావులయందు, రేపున్ - మాపున్ = ఉదయ సాయంకాలములందు, వీతెంచు = వినవచ్చునట్టి, పుష్కర.... రావముల్: పుష్కర = తామర పువ్వులందలి, కింజల్క = కేసరములను, భుజిక్రియా = తినుట చేత, సుఖిత = సుఖము నొందిన, హంస = అంచలయొక్క, క్రేంక్రియా = క్రేంకారముల యొక్క, ఆరావముల్ = ధ్వనులు, పర - లోకస్థున్ = పరలోకము నందున్న (స్వర్గస్థుడైన), పతిన్ = భర్తను, ఝష + అంకున్ = చేప చిహ్నముగా గల వానిని (మన్మథుని), బ్రతికింపన్ + కోరి, ఓంకారశంకరు - మ్రోలన్ = ఓంకారేశ్వరుని ఎదుర, రతి = మన్మథుని భార్య, ముక్త - కంఠముగన్ = బిగ్గరగ, ఆక్రందించున్ + నాన్ = మొఱపెట్టునను నట్లు, ఒప్పున్.

తాత్పర్యము: ఆ రత్నపురమునందు వెలుపలి యుద్యానవనములలోని దిగుడు బావులందు తామరల అకరువులను మెసవుటచే సుఖము నొందిన హంసలు ఉదయ సాయంకాలములందు క్రేంకార ధ్వనులను చేయుచుండును. ఆ ధ్వనులు స్వర్గస్థుడైన తన భర్తయగు మన్మథుని బ్రతికింపుమని ఓంకారేశ్వరుని యెదుట మన్మథుని భార్యయగు రతి బిగ్గరగా జేయు నాక్రందన ధ్వనులా యనునట్లుండెను.

విశేషములు: హంసల క్రేంక్రియా రావములను రతి ఆక్రందన ధ్వనులనుగా కవి ఊహించుచున్నాడు గావున నిందలి యంలకారము ఉత్ప్రేక్ష. `సంభావనా స్యాదుత్ప్రేక్షా.' రతి ఆక్రందన ధ్వనులను హంసల క్రేంక్రియా ధ్వనులతో పోల్చు చుండుటచే నామె కంఠ మాధుర్యము తెలియుచున్నది. అయిన నొక్క భేదము. హంసలు

---

1. తా. మదిన్. 2 తా. కంఠముక్తముగ. 3. తా. నప్పురీపుర బాహ్యోపవన.

కడుపునిండ తామరల కేసరములను మెసవి ఆ సుఖముచే చేయు క్రేంకారములు రతి చచ్చిపోయిన తన భర్త కొఱకు దుఃఖమున చేయు నాక్రందన ధ్వనులు. ఆ ధ్వనులే స్థితిలోనివయినను ఒకలాగున నున్నవనుట. హంస లా పురము బాహ్యోపవన దీర్ఘికలలో క్రేంకారములను చేయును. ఓంకారేశ్వరుని ఆలయము కూడ నా పురమునకు సమీపమున వెలుపలనే ఉండును. హంసలు క్రేంకారములను రేపునుమాపును చేయుచుండెననగా నవి పొందు అలత, సుఖము, దాని వలన నా దిగుడు బావుల యందలి తామరల బాహుళ్యము తెలియుచున్నది. రతి రేపును మాపును విలపించుచున్న దనుటచే నామె భర్తకొఱకు పొందు ఆత్యంతికమైన దుఃఖము తెలియుచున్నది. రతి ఓంకారేశ్వరునితో మొఱపెట్టుకొనుట యేలనగా, నా దేవుడే తన భర్త మరణమునకు గారణము గనుక. ముక్తకంఠముగ నాక్రందించుటయు నామె దుఃఖాతిశయమును సూచించును. ఝషాంకుడు - మీనకేతనుడు - మన్మథుడు - 'మదనో మన్మథో మారః ప్రద్యుమ్నో మీనకేతనః' - అమరము.

మ. ధరణీచక్రముపోలె నప్పురము విస్తారంబు నాయామమును
బరికింపంగ నశక్యమైన గరిమం బాథోధి గంభీరతం
బరిఖామండల మంబురాశి నుపమింపం బాత్రమై యొప్పు నం
బరకల్లోలలుఠత్తిమింగిలఝులీమత్స్యాహినక్రోద్ధతిన్. 9

అర్థము: ఆ + పురము - విస్తారంబున్ - ఆయామమున్ = ఆ రత్నపురము యొక్క విరివియు, నిడివియు, పరికింపంగన్ = చూడగా, ధరణీ - చక్రము + పోలెన్ = భూ వలయము వలెను, పరిఖా - మండలము = ఆ పురము నందలి అగడ్తల సమూహము, అశక్యము + ఐన - గరిమన్ = అసాధ్యమయిన గొప్పతనముతో, పాథోధి - గంభీరతన్ = సముద్రగాంభీర్యము వంటి గాంభీర్యముతో, అంబర.... నక్రోద్ధతిన్ : అంబర = ఆకాశమునందలి, కల్లోల = అలల యందు, లుఠత్ = దొరలుచున్న తిమింగిల = తిమింగిలముల యొక్కయు, ఝులీ = అడుతాబేళ్ల యొక్కయు, మత్స్య = చేపల యొక్కయు, అహి = పాముల యొక్కయు, నక్ర = మొసళ్ల యొక్కయు, ఉద్ధతిన్ = గర్వముతో, అంబురాశిన్ = సముద్రముతో, ఉపమింపన్ = పోల్చుటకు, పాత్రము + ఐ = తగినదయి, ఒప్పున్.

తాత్పర్యము: ఆ రత్నపురము విరివిని, నిడివిని పరికింపగా, నది భూ వలయము వలె నున్న దనవచ్చును. ఇక అందలి అగడ్తలు చూడగా వాని గొప్పతన మసాధ్యము. అవి సముద్రమువలె గంభీరములు. సముద్రము నందు వలెనే ఆ అగడితలందును అలలు ఆకసము నంటుచుండును. తిమింగిలములు, అడుతాబేళ్లు చేపలు, పాములు, మొసళ్లు సముద్రములో వలెనే, అగడ్తలందును ఉద్ధతిజూపుచుండును అందుచేతనే వానిని సముద్రముతో పోల్చుట యుక్తముగా నుండును.

విశేషములు: రత్నపురము ధరణీ చక్రములో నేకదేశమయినను, అది అంత వైశాల్యము గలిగి యున్నదనుటచే సంబంధాతి శయోక్త్యలంకారము. అంబురాశి వలెనే అందలి అగడ్తలకును అశక్యమైన గరిమము, గాంభీర్యము, అంబర కల్లోలములు, తిమింగిలాదుల ఉద్ధతి ఉండుటచే వానిని సముద్రముతో నుపమించుటకు 'పాత్ర'మై యొప్పుననుట. తిమి = నూఱు యోజనముల పొడుగు గల చేప. దానిని మ్రింగునట్టిది తిమింగిలము. తిమిం గిల తీతి తిమింగిలః - తిమిని మ్రింగునది. సంస్కృతమున 'ఢులీ' అనియుండ, నా శబ్దమును 'ఢులి' యని తెలుగు కవులు వాడి యున్నారు. (సూ.ని.) కాని యీ శబ్దము అమరమున 'ఢులిః' అని ఇకారాంత స్త్రీ లింగముగా పేర్కొనబడినది. 'కమఠీ ఢులిః' జలమును జల్లునది. 'డులిః' అనునది పాఠాంతరముగా చూపబడినది.

గీ. భద్రజాతి యేనుంగు లప్పట్టణమునఁ
ప్రకటితస్ఫూర్తి నొప్పు సిబ్బములతోడ
విమలరాశిఫేనఖండములతోడి
కవ్వపుంగొండ బందులో కాక యనఁగ 10

అర్థము: ఆ + పట్టణమునన్ = ఆ రత్న పురమునందు, భద్ర - జాతి + ఏనుంగులు = భద్రమను జాతి యేనుగులు, సిబ్బములతోడన్ = సిబ్బెము (తెల్లని పొడ) లతో, విమల - వారాశి = నిర్మలమైన సముద్రము నందలి, ఫేన = నురుగుయొక్క, ఖండముల తోడి = ముక్కలతో గూడిన, కవ్వపుంగొండ (కవ్వము + కొండ) మంథాద్రి యొక్క, బందులు + ఓ + కాక, తప్పక = చుట్టములా అనగన్, ప్రకటిత - స్ఫూర్తిన్ = ప్రసిద్ధమయిన తోచుటతో, ఒప్పున్.

తాత్పర్యము: ఆ రత్నపురమునందలి భద్రజాతి గజములు మేనిపై తెల్లని పొడలు గలిగి, సముద్రము నందలి నురుగు శకలములతో గూడిన మంథ పర్వతమునకు చుట్టములే తప్పక యన ప్రకటముగా స్ఫురించుచు నొప్పును.

విశేషములు: భద్రజాతి గజములు మేని పొడలతో ఫేన ఖండములతోడి మంథాద్రి చుట్టములే యనునట్లుండెననుటచే అలకారముపమ. కవ్వపుగొండతో పోల్చుటవలన నా యేనుగుల ఔన్నత్యము, దార్ఢ్యము తెలియుచున్నవి. కవ్వపు గొండ నురుగు శకలములతో గూడియున్నట్లే యేనుగులకు మేన పొడలు గలవు. కవ్వపుగొండ సముద్రమును మథించినప్పుడు నురువు ముక్కలు దాని కంటుకొన్నవి. 'సిబ్బము' అని యిచ్చట కవి ప్రయోగించెను. కాని నిఘంటువులయందు 'సిబ్బెము' = ఒక దినుసు పొడ అనియే కలదు. 'సోబె సిబ్బె మనఁ బొల్చును గిలాసము' - సాంబ నిఘంటువు. 'సిబ్బెములతోడ' అనుచో యతి భంగమగును. సిబ్బెమునకు సిబ్బియము మొదటి రూపము. 'ఇయకు మాఱుగా నామాంతంబున కెత్వంబు

బహుళంబుగానగు. బాల. అచ్చిక. 23. సిబ్బియము - సిబ్బెము. `ఇయశబ్దంబునం దికారలోపంబు కొందఱు వక్కాణించిరి.' అని చెప్పి చిన్నయ ముత్తియ శబ్దము నందు మాత్రమే ఇకార లోపము నంగీకరింపగా, ప్రౌఢవ్యాకరణము `ముత్తియ శబ్దేతరంబులందును దఱచుగ నిత్వలోపంబు గానంబడియెడి' ప్రౌ.శబ్ద. 49. అనుటచే, సిబ్బియమునుగూడ వానిలో చేర్చి, ఇత్వలోపమును జేసి, సిబ్యమును సాధింపవచ్చును. అప్పుడు `ప్ర' తో యతి మైత్రి సిద్ధించి నిర్బాధమగును. వార్ + రాశి = వారాశి - రేఫమునకు రేఫము పరమగు నపుడు లోపము గలుగును. `బందు'= చుట్టము. దీని కేకవచనాంతమున ప్రయోగము కానరాదు. దీని రూపాంతరములు = బందువు, బందుగు, బందుగుండు, బందువుండు. బంధువు ప్రకృతి. కవ్వపు గొండ వలె నున్న వనక, తద్బంధువులన నుండెననుట, కవ్వపు గొండ ఒక్కటియే యుండును గావున.

ఉ. లక్షల సంఖ్యలప్పురి కెలంకులయందు గొలంకు లొప్పు వాః
పక్షిగరుచ్ఛటా పవన పాత వికంపిత పంకజంబులై
[1]వీక్షణ కౌతుకంబు ప్రభవింపుచునుండును లీలమై సహ
స్రాక్షుఁడు విశ్వరూపమహిమాద్భుతముం బ్రకటించెనో యనన్ 11

అర్థము: వాః.... లై : వార్ + పక్షి = జల పక్షుల యొక్క, గరుత్ + ఛటా = ఱెక్కల యొక్క సమూహము వలని, పవన = గాలియొక్క, పాత = పడుటచేత, వికంపిత = విశేషముగా చలించిన, పంకజంబులు + ఐ = పద్మములు గలవయి, ఆ + పురి = ఆ రత్నపురము యొక్క, కెలంకులయందున్ = పార్శ్వములందు, కొలంకులు = సరస్సులు, లక్షల సంఖ్యలు = లక్షల కొలది, ఒప్పున్, లీలమైన్ = విలాసముతో, సహస్ర + అక్షుడు = వేయికన్నులు గలవాడు - ఇంద్రుడు, విశ్వరూప - మహిమ + అద్భుతమున్ = విశ్వరూపము యొక్క ప్రభావము వలని ఆశ్చర్యమును, ప్రకటించెనో + అనన్ = వెల్లడించెనా యనునట్లు, వీక్షణ - కౌతుకంబు = చూడవలయుననెడి వేడుక, ప్రభవింపుచున్ + ఉండును = కలుగుచుండును.

తాత్పర్యము: ఆ రత్నపురము పార్శ్వములందు లక్షలకొలది సరస్సులుండును. అందలి పద్మములు జలపక్షుల ఱెక్కలగముల గాలి విసరులచే విశేషముగా కంపించుచుండును. విలాసార్థము వేయి కన్నుల వేల్పు తన విశ్వరూపము నద్భుతముగా ప్రదర్శించెనా యనునట్లు అవి చూడ ముచ్చట గొలుపుచుండును.

విశేషములు: కెలంకులు బహువచనము. దీని యేకవచనము కెలను, కెలంకు, కెలంకు. ఇట్లే కొలంకులు బహువచనము. కలను, కొలకు, కొలంకు ఏకవచన

1. తా. వీక్షణుఁ గ్రౌతుకంబు

రూపములు. `కలన్వాదుల నువర్ణంబు కుజ్జగు. బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు.' బాల. అచ్చిక. 18. గరుత్ + ఛటా - సకార తవర్గములకు శవర్ణ చ వర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగు నపుడు క్రమముగా శవర్ణ చవర్గ వర్ణము లాదేశమగును. గరుచ్ఛటా. ప్రభవింపుచున్ - ఇందలి ఆగమ చకారమునకు ముత్తుగాక, శత్రర్థక చువర్ణకము పరమగుచున్నది కావున, పత్వము రాదు. ప్రభవించుచున్ అని యుండుట లెస్స. సహస్రాక్షుఁడు = బహువ్రీహిని దేహావయవార్థకములైన అక్షిన్, సక్థిన్ శబ్దముల తుది అచ్చునకును, హల్లుతోగూడిన తుది అచ్చునకును `అ' అను ప్రత్యయ మాదేశముగా వచ్చును. సహస్రాక్షునకు మెయినిండ గన్నులు గలవు. కన్నులను పద్మములతో పోల్తురు. పద్మమయమైన కొలను మెయినిండ పద్మములుగల సహస్రాక్షుని విశ్వరూపమువలె నుండెననుట. వాఃపక్షి..... పంకజంబులై : స్వభావోక్త్యలంకారము. `స్వభావోక్తి స్స్వభావస్య జాత్యాది స్థస్య వర్ణనమ్'. సహస్రాక్షుండు.... ప్రకటించెనో యనన్.' ఉత్ప్రేక్షాలంకారము. `సంభావనా స్యాదుత్ప్రేక్షా.'

శా. ఆవింధ్యాచల దుర్గ[1]మేలు శబరాధ్యక్షుండు హేమాంగదుం
డా వార్ధి ద్వితయద్వయావధిగఁ జక్రాధీశ్వరుల్ గొల్వ నా
శా వేదండ ఘటా కపోల తల మూర్ఛ ద్దాన ధారా జల
ప్లావ ప్రక్రమ సంవిశుద్ధ బహుల ప్రస్ఫూర్తిమత్కీర్తియై. 12

అర్థము: శబర + అధ్యక్షుండు = బోయవాండ్ర ప్రభువు అగు, హేమాంగదుండు, ఆశా.... కీర్తియై : ఆశా - వేదండ = దిగ్గజముల యొక్క, ఘటా = సమూహము యొక్క, కపోల - తల = చెక్కిళ్ల ప్రదేశమునందుండి, కటముల నుండి మూర్ఛత్ = పెరుగుచున్న, దాన - ధారా - జల = మద ప్రవాహముల జలమునందు, ప్లావ = మునుగుట యొక్క, ప్రక్రమ = క్రమము చేత, సంవిశుద్ధ = మిక్కిలి నిర్మలమై, బహుల = అధికమైన, ప్రస్ఫూర్తిమత్ = మిక్కిలి ప్రకాశముగల, కీర్తి = కీర్తిగలవాడు, ఐ, ఆవార్ధి - ద్వితయ - ద్వయ + అవధిగన్ = నాలుగు సముద్రముల మేర వఱకు, చక్ర + అధి + ఈశ్వరుల్ = చక్రవర్తులు, కొల్వన్ = సేవించుచుండగా, ఆ - వింధ్య + అచల - దుర్గము = ప్రసిద్ధమైన వింధ్య పర్వత దుర్గమును, ఏలున్ = పాలించును.

తాత్పర్యము: బోయవాండ్రకు ప్రభువైన హేమాంగదుడా వింధ్య పర్వత దుర్గమును నాలుగు సముద్రములు హద్దుగా చక్రవర్తులు కొలుచుచుండగా పాలించు చుండును. అతని కీర్తి దిగంతములవఱకు వ్యాపించినది. అతని కీర్తి దిగ్గజముల కపోల తలముల నుండి అధికముగా స్రవించు మదజలప్రవాహమున మునుగుటచే

1. తా. మేలె.

మిక్కిలి నిర్మలమై అధికముగా ప్రకాశించుచుండును.

విశేషములు: వార్ధిద్వితయము యొక్క ద్వయము - నాలుగు సముద్రములు. ఆవార్ధి..... ఇచ్చట 'ఆ' మర్యాదార్థకము - వార్ధిద్వితయద్వయా వధి వఱకు. వేదండ - వేద + అండ - పరరూప సంధి. వేదాండ అని సవర్ణదీర్ఘము రాదు. వేదః సామవేదః అండః జననకారణం యస్య సః వేదండః - ఏనుగు సామవేదము నుండి పుట్టినదని ప్రసిద్ధి. సామజము = ఏనుగు. ఘటా శబ్దమున కేనుగుల సమూహమని యర్థము. ఆశావేదండములు ఎనిమిది. అవి - ఐరావతము, పుండరీకము, వామనము, కుముదము, అంజనము, పుష్పదంతము, సార్వభౌమము, సుప్రతీకము. ఏదయిన వస్తువును నీట గడిగినపుడు అది మాలిన్యమును విడనాడి ప్రకాశవంతమగును. అట్లు హేమాంగదుని కీర్తి దిగ్గజ మద జలక్షాళితమై బహుల ప్రస్ఫూర్తిమంతమయినది. ఏనుగులకు తొండము, కటములు, మేఢ్రము, నేత్రములు అను వాని నుండి మదజలము వించును. కరాత్కటాభ్యాం మేఢ్రాచ్చ నేత్రాభ్యాం చ మదస్రుతిః. కీర్తి మొదలు తెల్లనిది. అది జల ప్లావితమయిది కావున బహులప్రస్ఫూర్తి మంతమగును. ఆశా ..... కీర్తియై అను సుదీర్ఘ సమాసము పద్యాంతమువఱకు వ్యాపించి ఆ రాజు కీర్తి దిగంతములవఱకును వ్యాపించుటను స్ఫురింపజేయుచున్నది.

సీ. శివుని కైవడి [1]మహాసేనానుయాతుండు
 బలభేదిపగిది [2]నపవ్యపాయుఁ
డరవిందహితులీల [3]నధిగతాభ్యుదయుండు
 [4]బుధునిక్రియ నజహాత్పుష్కరుండు
గంగాప్రవాహంబు కరణిఁ బావనమూర్తి
 భుజగాధిపునిభంగి భోగశాలి
యేనుంగుచందాన దానధారాశోభి
 శౌరిలాగున శంఖచక్రపాణి

గీ. కర్త యాశ్చర్యములకు, నాకరము నీతి,
కఖిల విద్యాగమములకు నాస్పదంబు,
పగ కుత్పాత కేతువు, బంధుకోటి
కమరలోకద్రుమంబు హేమాంగదుండు. 13.

అర్థము: హేమాంగదుండు - కర్త. శివునికైవడిన్ = శివుని వలె, మహాసేనా + అనుయాతుండు = మహాసేనునిచే (కుమారస్వామిచే), అనుసరింపబడువాడు, మహా (మహత్) + సేనా + అనుయాతుండు = గొప్పసైన్యముచే ననుసరింపబడువాడు.

1. ము. మహాసేనానియాత్ముండు, తా. మహాసేనానియాతండు, 2. తా. నవవ్యపాయు, 3. తా. నధికరాభ్యుదయుండు, 4. తా. బుద్ధుని క్రియ జయత్పుప్పుశరుఁడు.

మహాసేనాను యాతుడుగుటచే నా రాజు శివుని కైవడినున్నాడనుట. తక్కినవియు నిట్లే గ్రహించునది. బలభేది - పగిదిన్ = బలాసురునకు శత్రువగు నింద్రుని విధమున, అపవ్యపాయుఁడు = వ్యపాయము (సమాప్తి, ముగింపు) లేనివాడు. అరవింద - హితు - లీలన్ = పద్మబాంధవుడుగు సూర్యుని విధమున, అధిగత + అభ్యుదయుండు = పొందబడిన ఉదయము గలవాడు - పొందబడిన శుభములు గలవాడు, బుధుని - క్రియన్ = బుధుని వలె, అజహత్ + పుష్కరుండు = విడువని ఆకాశము గలవాడు - బుధగ్రహము ఆకాశమును విడువకుండును - అజహత్ = విడువని - పుష్కరుండు = కత్తివాదర గలవాడు. గంగాప్రవాహంబు - కరణిన్ = గంగానదీ ప్రవాహము విధమున, పావన - మూర్తి = పవిత్రమైన ఆకారము గలవాడు. భుజగ +అధిపుని - భంగిన్ = పాప ఱేని విధమున, భోగ - శాలి = పడగచే - ఒప్పువాడు. భోగ - శాలి = సౌఖ్యముచే నొప్పువాడు. ఏనుంగు - చందానన్ = ఏనుగు విధమున, దాన - ధారా - శోభి = మదజలము యొక్క ప్రవాహముచే ప్రకాశించువాడు. దాన - ధారా - శోభి = దానమిచ్చునప్పటి జలధారచే ప్రకాశించువాడు. శౌరి - లాగునన్ = విష్ణువువలె, శంఖ - చక్ర - పాణి = శంఖము, సుదర్శనము చేతి యందు గలవాడు, శంఖము, చక్రము అను శుభసూచక రేఖలు హస్తము నందు గలవాడు. అశ్చర్యములకున్ = వింతలకు, కర్త = చేయువాడు, నీతికిన్, ఆకరము = స్థానము, అఖిల - విద్యా + ఆగమములకున్ = ఎల్లవిద్యలకును, శాస్త్రములకును, ఆస్పదంబు = చోటయినవాడు, పగకున్ = శత్రువులకు, ఉత్పాత - కేతువు = ఉపద్రవ సూచకమగు తోకచుక్క అయినవాడు, బంధు - కోటికిన్ = చుట్టముల సమూహమునకు, అమర - లోక - ద్రుమంబు = దేవలోక వృక్షము - కల్పవృక్షము. కోరిన కోరికలు తీర్చువాడనుట.

తాత్పర్యము: ఆ రత్నపురము నేలు హేమాంగదుడు శివుని విధమున మహాసేనాను యాతుడు (శివుని పక్షమున - మహాసేనునిచే ననుయాతుడు, రాజుపక్షమున మహాసేనచే నను యాతుడు. ఇంద్రుని వలె అపవ్యపాయుఁడు. (ఇం.) సమాప్తి లేనివాడు (రా) అపాయము లేనివాడు. సూర్యుని విధమున అభ్యుదయము నొందినవాడు. (సూ.) ఉదయము నొందినవాడు. (రా.) శుభముల నొందిన వాడు. బుధుని విధమున పుష్కరమును విడువని వాడు. (బు) పుష్కరము = ఆకాశము. (రా.) పుష్కరము = కత్తివాదర. గంగా ప్రవాహమువలె పవిత్రమూర్తి. పాపఱేని వలె భోగశాలి. (పా.) పడగచే నొప్పువాడు. (రా.) సుఖములచే నొప్పువాడు. ఏనుగువలె దానధారలచే శోభిల్లువాడు. (ఏ.) దాన - ధారా - శోభి = మదజలప్రవాహములచే ప్రకాశించువాడు. (రా.) ఈవి జలధారచే ప్రకాశించువాడు. శౌరి విధమున శంఖ చక్రములు చేతియందు గలవాడు. (శౌ) = శంఖము, సుదర్శన చక్రము చేతియందు గలవాడు. (రా.) శంఖము, చక్రమునకు రాజత్వ చిహ్నరేఖలు చేతియందు గలవాడు. అతడాశ్చర్యకరుడు.

నీతి కాకరము. అఖిల విద్యలకు, ఆగమములకు నాస్పదము. శత్రువులకు ఉపద్రవకారియగు ధూమకేతువు. బంధుసమూహమునకు కల్పవృక్షము.

విశేషములు = మహాసేన - `కార్తికేయో మహాసేన శ్శరజన్మా షడాననః' - అమరము. మహతీ సేనా యస్య సః - గొప్పదండుగల వాడు - కుమారస్వామి. బలభేది = `వాస్తోష్పతి స్సురపతిర్బలా రాతి శ్శచీపతిః' అమరము. బలాఖ్యస్య అసురస్య అరాతి ర్బలా రాతిః. బలుడను రాక్షసునకు శత్రువు. ఇంద్రుడు. ఇక్కడ బలస్య భేదీ - బలభేదీ. బలం భినత్తీతి - బలభేదీ. పుష్కర - `పుష్కరం కరి హస్తాగ్రే వాద్యభాణ్డముఖే జలే,

వ్యోమ్ని ఖడ్గఫలే పద్మే తీర్థౌషధివిశేషయోః - అమరము. భోగ - `భోగ స్సుఖే స్త్ర్యాది భృతావహేశ్చ ఫణకాయయోః' అమరము. భోగమనగా పాము పడగ, పాము శరీరము. దాన - `త్యాగో విహాపితం దాన ముత్సర్జన విసర్జనే.' `మదో దానమ్'. అమరము. శౌరి - దేవకీ నన్దనః శౌరిః' - అమరము. శూర ఇతి వసుదేవస్య పితా తస్య గోత్రాపత్యం శౌరిః - వసుదేవుని తండ్రి శూరుడు - అతని వంశమువాడు శౌరి - విష్ణువు. శంఖ చక్రాకారరేఖలు హస్తమున నున్నవాడు చక్రవర్తి యగునని సాముద్రిక శాస్త్రము. మహాసేన, అభ్యుదయ, పుష్కర, భోగ, దాన, శంఖ, చక్ర, శబ్దముల కర్థద్వయము చెప్పవలయుటచే నలంకారము శ్లేషము. `నానార్థసంశ్రయః శ్లేషః' అన్ని పాదములందును ఉపమాలంకారము. ఉల్లేఖాలంకారము. ఏకేన బహుధోల్లేఖేప్యసౌ విషయభేదతః.

గీ. ఆ నృపాలుండు నీతి విద్యా నిరూఢిఁ
జారదృష్టియౌగాని విచారదృష్టి
సమధికైశ్వర్య వైభవోజ్జ్వలత నాతఁ
డష్టమూర్తియౌ గాని యనష్టమూర్తి. 14

అర్థము: ఆ - నృపాలుండు = ఆ రాజు - హేమాంగదుడు, నీతి - విద్యా -నిరూఢిన్ = రాజనీతి యను విద్యయందలి ప్రావీణ్యము చేత, చార - దృష్టి = గూఢచారులు కన్నులుగా గలవాడు - అనగా గూఢచారులవలన నన్నియు జూచువాడు, ఔన్ = అగును, కాని, విచారదృష్టి = ఆలోచనతో గూడిన చూపు గలవాడు, సమధిక + ఐశ్వర్య - వైభవ + ఉజ్జ్వలతన్ = మిక్కిలి యెక్కువయిన యైశ్వరము యొక్కయు, విభవము యొక్కయు ప్రకాశమునందు, అతడు - అష్టమూర్తి = శివుడు (ఎనిమిది మూర్తులు గలవాడు), ఔన్, కాని, అనష్టమూర్తి = నాశనములేని మూర్తి గలవాడు.

తాత్పర్యము: ఆ హేమాంగదుడను రాజు రాజనీతి వైశారద్యముచేత గూఢచారులచే నంతయు నరయువాడు. విచారముతో గూడిన దృష్టిగలవాడు.

గొప్పయైశ్వర్యము నందు అష్టమూర్తి యైన ఈశ్వరుడు (ఈశ్వరభావము ఐశ్వర్యము). నష్టముగాని మూర్తిగలవాడు.

విశేషములు: చారదృష్టి యౌనుగాని విచారదృష్టి - విచార దృష్టి యనగా చారదృష్టి కానివాడు. అందుచే విరోధమేర్పడుచున్నది. కాని విచార దృష్టి యనుదానికి విచారము (ఆలోచన) తోడి దృష్టిగలవాడని యర్థము చెప్పినచో నా విరోధము తొలగి దానికాభాస మేర్పడుచున్నది. కావున విరోధాభాసము అలంకారము. `ఆభాసత్వే విరోధస్య విరోధాభాస ఉచ్యతే.' ఇట్లే అష్టమూర్తియౌ గాని అనష్టమూర్తి అనుచో గూడ అష్టమూర్తి యైన వాడు అనష్టమూర్తి (అష్టమూర్తి కానివాడు) అనుటచే విరోధమేర్పడుచున్నది. కాని అనష్టమూర్తి యను పదమునకు నష్టముగాని మూర్తి గలవాడను నర్థము చెప్పుచో నా విరోధమున కాభాస మేర్పడుచున్నది. కావున నిచ్చటను విరోధాభాసాలంకారము గలదు. అష్టమూర్తి - `అష్టమూర్తి రహిర్బుధ్న్యో మహాకాలో మహానటః' - అమరము. ఎనిమిది మూర్తులు గలవాడు. అష్టమూర్తులు - పంచభూతములు, సూర్యచంద్రులు, యజమానుడు.

యజ్ఞదత్త చరిత్రము

వ. ఆ రాజునకు నఖిలశాస్త్ర విద్యాకళా [1]పావనగంభీరబుద్ధి యజ్ఞ దత్తుండను బ్రాహ్మణుండు దేవేంద్రునకు బృహస్పతియును వృషపర్వు నకు శుక్రుండును దశరథునకు వసిష్ఠుండును రామునకు విశ్వామిత్రుం డును నజాత శత్రునకు ధౌమ్యుండును [2]నలునకు సుమతియుం బోలెఁ బ్రధానియై రాజ్యభారంబు భరియించి యుండు నమ్మంత్రి భార్య వినయ వతియు వివేకవతియు విభ్రమవతియు విలాసవతియు సౌభాగ్య వతియు లక్షణవతియు నౌదార్యవతియు గాంభీర్యవతియు లజ్జా వతియు నై సర్వగుణసంపూర్ణ సుశీలాభిధానయగు [3]భామా రత్నం బతనికిం [4]ప్రేమాస్పదంబై 15
యుండు.

అర్థము: ఆ రాజునకు..... భరియించి యుండును : ఆ రాజునకున్ = ఆ హేమాంగదుడను రాజునకు, అఖిల ..... బుద్ధి : అఖిల = ఎల్ల, శాస్త్ర - విద్యా - కళా = శాస్త్రములు, విద్యలు, కళలు అనువానిచే, పావన = పవిత్రమైనట్టియు, గంభీర = లోతయినట్టియు, బుద్ధి = బుద్ధి గలవాడు, యజ్ఞదత్తుండు, అను, బ్రాహ్మణుండు, దేవేంద్రునకున్, బృహస్పతియును, వృషపర్వునకున్ = వృషపర్వుడను పేరుగల రాక్షసరాజునకు, శుక్రుండును, దశరథునకున్, వసిష్ఠుడును, రామునకున్, విశ్వామిత్రుండును, అజాతశత్రునకున్ = పుట్టని శత్రువులు గలవానికి (ధర్మరాజునకు),

1. తా. పావగాహబుద్ధి. 2. తా.హరిశ్చంద్రునకు సత్యకీర్తియును. ము. నలునకు దమనుండునుంబోలె.
[illegible]

ధౌమ్యుండును, నలునకున్, సుమతియున్, పోలెన్ = వలె, ప్రధాని + ఐ = మంత్రియయి, రాజ్యభారంబు, భరియించి + ఉండున్ = వహించియుండును.

తాత్పర్యము: ఆ హేమాంగదుడను రాజునకు యజ్ఞదత్తుడనెడి బ్రాహ్మణుడు మంత్రియై యుండెను. అతడు సర్వశాస్త్రములు, విద్యలు, కళలు నెఱిగిన వాడగుటచే, పవిత్రము, గంభీరము నైన బుద్ధిగల వాడు. అతడు దేవేంద్రునకు బృహస్పతివలెను, వృషపర్వునకు శుక్రునివలెను, దశరథునకు వసిష్ఠునివలెను, రామునకు విశ్వామిత్రుని వలెను, ధర్మరాజునకు ధౌమ్యునివలెను, నలునకు సుమతివలెను హేమాంగదునకు మంత్రియై రాజ్యభారమును వహించుచుండును.

విశేషములు: కాశీఖండమున గుణనిధి వృత్తాంతము గలదు. అతడును ఈ సుకుమారునివంటివాడే. అతని తండ్రి పేరుగూడ యజ్ఞదత్తుడే.

ఈ యజ్ఞదత్తుని వర్ణనము కాదంబరి శుకనాసవర్ణనమున కెంతగా ననుకరణమో కాననగును.

`తస్య రాజ్ఞో నిఖిలకలాకలాపావగాహన గభీరబుద్ధిః...... బృహస్పతి రివ సునాసీరస్య కవిరివ వృషపర్వణః వసిష్ఠ ఇవ దశ రథస్య విశ్వామిత్ర ఇవ రామస్య ధౌమ్య ఇవాజాతశత్రోః దమనక ఇవ భీమస్య సుమతి రివ నలస్య సర్వకార్యే ష్వ ప్రతిహతమతి రమాత్యో బ్రాహ్మణః శుకనాసో నామాభవత్.'

అర్థము: అమ్మంత్రి భార్య...... యుండు. ఆ + మంత్రి - భార్య = ఆ యజ్ఞదత్తుడను మంత్రి భార్య, వినయవతియున్ = అడకువగలదియు, వివేక వతియున్ = విచారణ చేసెడి శక్తిగలదియు, విభ్రమవతియున్ = సౌందర్యము గలదియును, విలాసవతియున్ = విలాసములు గలదియును, సౌభాగ్యవతియున్ = వైభవముగలదియును, లక్షణవతియున్ = శుభలక్షణములు గలదియున్, ఔదార్యవతియున్ = దానగుణము గలదియును, గాంభీర్యవతియున్ = ఎడదలోతుగలదియును, లజ్జావతియున్ = సిగ్గుగలదియును, ఐ, సర్వ - గుణ - సంపూర్ణ = ఎల్ల సుగుణములచే నిండయినది, సుశీలా + అభిధాన = సుశీలయను పేరుగలది, అగు, భామా - రత్నంబు = రత్నమువంటి స్త్రీ, అతనికిన్ = యజ్ఞదత్తునకు, ప్రేమ + ఆస్పదంబు = ప్రేమకుచోటు, ఐ, ఉండున్.

తాత్పర్యము: ఆ మంత్రి భార్య వినయము, వివేకము, సౌందర్యము, విలాసము, సౌభాగ్యము, శుభలక్షణములు, ఔదార్యము, గాంభీర్యము, లజ్జ అను గుణములు గలిగి, సర్వసుగుణ సంపూర్ణయై అతనికి ప్రేమాస్పదురాలయి యుండును.

విశేషములు: `సత్యపి రూప విలాసాసోపహసిత రతివిభ్రమే లావణ్యావతి వినయ వ త్యన్వయవతి హృదయహారిణి చావరోధజనే' అను కాదంబరిలోని గద్యభాగమున

కిది యనుసరణమనుట తెలియును. మూలమున వర్ణితమయినది యవరోధజనము కాగా, దానిని శ్రీనాథుడు మంత్రిభార్యనుగా మార్చి, మూలస్థసప్తమ్యంత విశేషణముల నామెకు ప్రథమాంతవిశేషణములుగా మార్చుట గమనింపదగినది.

గీ. అన్ని భాగ్యంబు[1]లున్న నా యబ్జముఖికి
శ్రీమహాలక్ష్మి గలుగంగ నేమి సెలవు
పుత్ర వదనావలోకనో ద్భూత మైన
యొక్క సౌఖ్యంబు బ్రాఁతియై యుండుగాన. 16

అర్థము: అన్ని భాగ్యంబులు = అన్ని యదృష్టములు, ఉన్నన్ = ఉన్నను, ఆ + అబ్జముఖికిన్ = తామర (చంద్రుని) వంటి ముఖముగల ఆ సుశీలకు, పుత్ర - వదన + అవలోకన + ఉద్భూతము = కొడుకుయొక్క, ముఖము యొక్క, చూచుటవలన, పుట్టినది, ఐన, ఒక్క, సౌఖ్యంబు = ఆనందము, బ్రాఁతి + ఐ = దుర్లభములు, ఉండున్ = కానన్ = ఉండునుగనుక, శ్రీ - మహాలక్ష్మి = గొప్పసంపద, కలుగంగన్ = కలుగగా, కలిగినను, ఏమి సెలవు = ఏమి యుపయోగము ? ఏమియు ఉపయోగము లేదనుట.

తాత్పర్యము: ఆ పద్మముఖికి సుశీలకు అన్నిభాగ్యములున్నను - పుత్రముఖదర్శనము వలని యానందము మాత్రము దుర్లభమయి యుండెను. శ్రీమహాలక్ష్మి కలిగినను ఏమియు ప్రయోజనము లేకుండెను.

విశేషములు: సెలవు = ఉపయోగము. ఒండు పనులకు సెలవు లేకునికి జేసి - భార. విరా. 1-140 బ్రాఁతి. ఇది ఇందు సానుస్వారముగా నున్నది. కాని నిరనుస్వారమనుటకు భారతాది ప్రయోగములు నిర్ధారకములు. `నీకేబ్రాతియే వెన్నలుంబాలున్ - హరి.పూ 5-234 అబ్జముఖి = చంద్రముఖి అనియేని చెప్పవచ్చును. అబ్జ = పద్మము, చంద్రుడు.

గీ. [2]తనయసంతానలబ్ధి దౌదవ్వు గాగ
విభవ సంపత్తి గల్గియు విన్నబోయి
వనిత నిష్ఫల పుష్పదర్శనము [3]దాల్చె
శరలతా కాననము వోలె జవ్వనంబు. 17

అర్థము: తనయ - సంతాన - లబ్ధి = పుత్ర సంతతి యొక్క లాభము, దౌదవ్వు + కాగన్ = దూరదూరముకాగా, విభవ - సంపత్తి = ధనసంపద, కల్గియున్ = కలిగియుండియును, విన్నబోయి - దైన్యము నొంది వనిత = స్త్రీ

1. తా. లుంగల. 2. తా. తనయ. 3. తా.దాల్చి.

(సుశీల), నిష్ఫల - పుష్ప - దర్శనమున్ = ఫలము లేని రజస్సుయొక్క దర్శనము గలదానిని, జవ్వనంబున్ = యౌవనమును, శర - లతా - కాననము + పోలెన్ = తెల్లుతీగల అడవి వలె, తాల్చెన్ = ధరించెను.

తాత్పర్యము: పుత్త్ర సంతాన ప్రాప్తి మిక్కిలి దూరము కాగా, ధనసంపద గలిగియు, దైన్యము నొంది, సుశీల ఫలింపని రజస్సుగల యౌవనమును, తెల్లు తీవల యడవివలె తాల్చెను.

విశేషములు: తెల్లునకు ఫలము లుండవు కావున పుత్త్ర ఫలశూన్యమైన యామె యౌవనము తెల్లు వనముతో పోల్ప బడినది. ఉపమాలంకారము. దౌదవ్వు - భృశార్థమున నిచ్చట నామ్రేడితము. మిక్కిలి దవ్వని యర్థము. ఉ. దవ్వు - దవు - దౌ. రూపాంతరములు. `అచ్చికంబులం దయియవులకు వక్రతమంబులు బహుళంబుగా నగు. బా.క్రి. 103. జవ్వనము వికృతి - యౌవనము ప్రకృతి. శరము (నానా) = తెల్లు, బాణము, నీరు. పుష్పము = పూవు, స్త్రీ రజస్సు (నూ.ని) స్యా ద్రజః పుష్ప మార్తవమ్.' - అమరము. పుత్త్రాఖ్యఫలహేతు త్వాత్పుష్పమ్. పుత్త్రాఖ్యఫలమునకు హేతువయినది. లేదా పుష్పతే వికసతి యోని రనే నేతి పుష్పమ్. దీనిచేత యోని వికసించును.

`ఏకంతు తనయముఖకమలదర్శన సుఖం తు న లేభే. తథా సంభుజ్య మాన మపి నిష్ఫల పుష్పదర్శనం శరవణమి వాంతఃపురమభవత్` అను కాదంబరిలోని భాగమునకిది యనుకరణ మగుట తెలియదగును.

సీ. కాంత పుష్పాదిభోగంబు [1]లింపనివను
　　　వైరాగ్యవిధికిఁ దా వాల్చుఁ జిత్త
మన్వయంబునకు దా నాలంబమయ్యెనుం
　　　దను నిరాలంబగాఁ దలఁచు నింతి
ప్రొద్దునఁ [2]దగినట్టి భోజనం బొల్లక
　　　యుపవాస [3]నియమంబు నువిద దలఁచు
సంపత్పరంపర సంభవిల్లిన నైన
　　　సంతోష మొదవదు చామ [4]మదికి.

గీ. కోమలాంగుళ దళ హస్తతామరసము
కర్ణపూరత్వలీలకై కాలు సాప
గండతల దర్పణంబున గదియఁ జేర్చి
[5]తరుణి చింతించు [6]సుతలబ్ధి తడయుటకును. 18.

1. ము. లింపెనఁ గిన, తా. లింపనినను. 2. తా. దగునట్టి, 3. ము. నంబుండ, 4. ము. మతికి, 5 ము. పడఁతి. 6. ము. సుతలబ్ధి పడయుటకును.

అర్థము: కాంత = స్త్రీ (సుశీల), పుష్ప + ఆది - భోగంబులు = పువ్వులు మున్నగు భోగములు, ఇంపనివి = ఇంపుగా నివి, అనున్ = అనును, తాన్ = తాను, వైరాగ్య - విధికిన్ = వైరాగ్యరీతికి, చిత్తమున్ = మనస్సును, వాల్చున్ = మ్రొగ్గజేయును. అన్వయంబునకున్ = వంశమునకు, తాను, ఆలంబు + అయ్యును = ఆధారమైనను, ఇంతి = స్త్రీ (సుశీల నిరాలంబన్ + కాన్ = నిరాధారనుగా, తలచున్, ఉవిద = స్త్రీ, (సుశీల) ప్రొద్దునన్ = ఉదయమున, తగిన + అట్టి, భోజనంబు, ఒల్లక = అంగీకరింపక, ఉపవాస - నియమంబున్ = ఆహారము తినకుండు నియమమును, తలంచున్. సంపద్ + పరంపర = సంపదల వరుస, సంభవిల్లినన్ + ఐనన్ = కలిగినను, చామ - మతికిన్ = స్త్రీ (సుశీల) మదికి, సంతోషము, ఒదవదు = కలుగదు. తరణి = యువతి (సుశీల), కోమల + అంగుళ - దళ - హస్త - తామరసము = మృదువైన, వ్రేళ్లనెడి, తేకులు గల, పద్మము వంటి చేయి, కర్ణ - పూరత్వ - లీలకై = చెవి కమ్మయొక్క విలాసమునకు, కాలు + చాపన్ = ప్రయత్నింపగా, గండ - తల - దర్పణంబునన్ = అద్దము వంటి, చెక్కిలి ప్రదేశమునందు కదియన్ + చేర్చి = కూడు నట్లు చేర్చి, సుతు- లబ్ధి = పుత్రప్రాప్తి, తడయుటకును = ఆలస్యమగుటకు, చింతించున్ - దుఃఖించును.

తాత్పర్యము: సుశీల పుష్పములు మున్నగు భోగముల నిచ్ఛగింపదు. ఆమె మనస్సును వైరాగ్యము వైపు మ్రొగ్గజేయును. తాను వంశమున కాధారమయ్యును, తన్ను నిరాధారనుగా నెన్నుకొనును. ప్రొద్దున తగిన భోజనమును చేయక యుపవాసనియమమును పాటించును. సంపదలపై సంపదలు గలిగినను ఆమె మనస్సునకు సంతోషము కలుగదు. మృదువులయిన వ్రేళ్లనెడు తేకులు గల హస్తపద్మ మామెకు కర్ణపూరమగునట్లు, ఆమె తన చెక్కుటద్దములపై చేయి చేర్చి పుత్రప్రాప్తి ఆలస్యమగుటకు చింతించును.

విశేషము: `భోగంబు లింపని వను' అను పాఠముకంటె ముద్రిత ప్రతిలోని `భోగంబు లింపెసంగిన' అను పాఠమే బాగుగా నున్నది. భోగము లింపతిశయించినను, ఆమె తన చిత్తమును వైరాగ్యమువైపు మరలించునని భావము. ఉవిద వికృతి - యువతి ప్రకృతి, సంపద్ + పరంపర - అనునాసికాంతస్థ భిన్నములగు హల్లులకు (ఝల్లులకు) కఠిన హల్లులు (ఖ్రరులు) పరము లగునపుడు వాని వర్గములందలి ప్రథమ వర్ణములు (చ్రరులు) ఆదేశముగా వచ్చును. సంపత్పరంపర. చామ - `చామ జవరాలు కొమరిత జవ్వని యన సుందరికిఁ జెల్లు. (సాం.ని.) కాలు సాఁచు - యత్నించు. `కైవల్యపదవికై కాలుసాఁచి' - హర. 3-44. కోమలాంగుళదళ------- చింతించు - స్వభావోక్తి. `స్వభావోక్తి స్స్వభావస్య జాత్యాదిస్థస్య వర్ణనమ్'. కర్ణపూరము పుష్పాదులచేయబడిన కర్ణభూషణము - సూ.ని.

ఉ. సంతతి లేని దుఃఖమున సామజరాజ ఘటాంత వైభవం
బెంతయుఁ గల్గియున్ సరసిజేక్షణ [1]విన్నగఁ బోయియుండు సీ
మంతిని బోటికత్తెలకు మానసవృత్తి యెఱుంగఁ జెప్పదై
[2]కాంతిక కేళి శయ్యపయిఁ గాంత గుణించు మనోరథార్థముల్. 19

అర్థము: సరసిజ + ఈక్షణ = పద్మములవంటి కన్నులు గల యా సుశీల, సంతతి - లేని - దుఃఖమునన్ = సంతానము లేని విచారముచేత, సామజ-రాజ - ఘటా + అంత - వైభవంబు = శ్రేష్ఠములయిన యేనుగుల గుంపుతో నంతమగు విభవము, ఎంతయున్ + కల్గియున్ = మిక్కిలిగా నున్నను, విన్నగఁ బోయి + ఉండున్ = దీనురాలయి యుండును, సీమంతిని = స్త్రీ (సుశీల), బోటికత్తెలకున్ = చెలికత్తెలకు, మానస-వృత్తి=(తన) మనస్సు యొక్క వర్తనము, ఎఱుంగన్+ చెప్పదు = తెలియజేయదు, ఐకాంతిక - కేళి - శయ్యా-పయిన్= ఏకాంత క్రీడకైన పాన్పుమీద, కాంత=స్త్రీ (సుశీల), మనోరథ+అర్థముల్ = కోరికలయొక్క విషయములు. గుణించున్=ఎక్కువగా చింతించును.

తాత్పర్యము: సంతానములేని దుఃఖముచే నేనుగులవఱకుగల వైభవ మెంతయో కలిగినను, ఆ సుశీల దీనురాలయియుండును. ఆమె తన చెలిమికత్తెలకు తన మనసులోని యభిప్రాయమును తెలుపదు. ఆమె యేకాంత శయ్యపై పరుండి తన కోరికలనుగూర్చి చింతించుచుండును.

విశేషము: సీమంతిని - `స్త్రీ యోషిదబలా యోషా నారీ సీమన్తినీ వధూః' అమరము. సీమంతం అస్యా అస్తీతి సీమన్తినీ - సీమంతమనగా పాపట. అదిగలది - స్త్రీ బోటికత్తె - స్వార్థమున కత్తె ప్రత్యయము. `కాకత్తియలు కొండొకవానికి స్వార్థంబునం జూపట్టెడు.' బాల. తద్ధిత. 13

ఉ. [3]ఆ చపలాయతాక్షి కనకాంబురుహంబులఁ[4] బూజసేయు విం
ధ్యాచల కందరా నిలయు నద్రిసుతాప్రియనాథు నర్మదా
వీచి పరంపరా సలిల విప్రుషదాశ్రయ శీతగంధవా
హాచమన ప్రవృద్ధ భుజగాధిపకంకణు నోంకృతీశ్వరున్. 20

అర్థము: ఆ - చపల + ఆయత + అక్షి = చంచలములు, దీర్ఘములు నైన కన్నులు గల ఆ సుశీల, వింధ్యా-----నిలయున్: వింధ్య + అచల = వింధ్యమను పర్వతము యొక్క, కందరా = గుహ, నిలయున్ = ఆలయముగా గలవాడును, అద్రి-సుతా-ప్రియ- నాథున్ = కొండకూతురైన పార్వతికి ప్రియ భర్తయైనవాడును,

1. ము. చిన్నగ. 2. ము. కాంతము. 3. తా. అ చపలాక్షి దాను. 4. తా. బూని.

నర్మదా----- కంకణున్: నర్మదా = నర్మదా నది యొక్క, వీచి = అలల యొక్క, పరంపరా = వరుసల యొక్క, సలిల = నీటి యొక్క, విప్రుషత్ = బొట్టులుగా నగుచున్న, ఆశ్రయ = ఇల్లగుటచే, శీత = చల్లనైన, గంధవాహ = వాయువు యొక్క, ఆచమన = తినుటచే, ప్రవృద్ధ = మిక్కిలి పెరిగిన, భుజగ + అధిప = పాములఱేడు, కంకణున్ = హస్తాభరణముగా గలవాడును, అగు, ఓంకృతి + ఈశ్వరున్ = ఓంకారేశ్వరుని, కనక + అంబురుహంబులన్ = బంగారు తామరలతో, పూజ + చేయున్ = పూజించును.

తాత్పర్యము: చంచలములు, దీర్ఘములు నైన కన్నులు గల ఆ సుశీల వింధ్య పర్వత గుహ నిలయముగా గలవాడును, పార్వతికి ప్రియభర్త యైన వాడును, నర్మదానది అలల జలబిందువులతో గూడిన చల్లని వాయువు నారగించుటచే మిక్కిలి వృద్ధిపొందిన పాములఱేడు హస్తాభరణముగా గలవాడును అగు ఓంకారేశ్వరుని బంగరు తామరలతో పూజించును.

విశేషములు: ఈశ్వరుని కనకాంబురుహములతో పూజించుట సుశీల సంపత్సమృద్ధిని, శ్రద్ధాభక్తులను సూచించును. పార్వతీ ప్రియనాథు ననుటచే నామె పార్వతీ సమేతుడైన యీశ్వరుని పూజించెనని తెలియుచున్నది. భుజగమున కాహారము గాలి. అందును చల్లని గాలి. రత్నపురము నందలి ఓంకారేశ్వరుని ఆలయము నర్మదా నదీ తీర కాంతార భూమిలో మఱ్ఱిచెట్టు నీడనున్నది. కావున నా యీశ్వరునకు హస్తాభరణమైన భుజగమునకు గాలి నర్మదానది నుండి వీచుటచే చల్లనైనది. ఈ పద్యమునందలి యీశ్వరుని విశేషణములు తన్మహిమమునే కాక, శ్రీనాథ కవి సార్వభౌముని ఈశ్వరార్చన కళాశీలతను గూడ స్పష్టము చేయుచున్నవి. వీచిః, వీచీ అని అల అను నర్థమున ఇకారాంత, ఈకారాంత స్త్రీలింగ రూపములు రెండును గలవు. విప్రుష్ - షకారాంత స్త్రీలింగశబ్దము = నీటిబొట్టు.

సీ. అభిషేక మొనరించు నలినీలకుంతల
  శంభు సోమోద్భ[1] వా సలిలధార
నెలఁత యభ్యర్చించు నీలోత్పలంబులఁ
  దరుణనిర్మలసుధాధామమౌళిఁ
గరళకూటగ్రాస కల్మాషకంధరు
  మేన గంధ మలందు మీన[2]నేత్ర
యర్పించు దివ్యోపహారంబు లెనాంగ
  కుటిల [3]కుండలిరాజకుండలునకు

---

1 తా.వ. 2 తా. నేత్రి 3. తా. కుంతలి

గీ. నతివ దిరుగుఁ బ్రదక్షిణం బభవు[1]గుడికిఁ
గుచభరంబున నరగౌను[2] గూనుగిలఁగ
[3]రవలి మట్టెల మ్రోఁతతో రాయిడింపఁ
జరణనూపుర ఝుళఝుళంఝుళరవంబు. 21

అర్థము: అలి - నీల - కుంతల = తుమ్మెదలవలె నల్లనైన శిరోజములు గలది - స్త్రీ (సుశీల), సోమ+ఉద్భవా- సలిల-ధారన్ = నర్మదా నదీ జలధారతో, శంభున్ = ఈశ్వరుని, అభిషేకము+ఒనరించున్= స్నానము చేయించును. నెలఁత = స్త్రీ(సుశీల), తరుణ - నిర్మల - సుధాధామ - మౌళిన్ = లేతవాడును, స్వచ్ఛమైన వాడును అగు అమృతకిరణుడు (చంద్రుడు), శిరస్సునందుగలవానిని - శివుని, నీల+ఉత్పలంబులన్ = నల్లని కలువలతో, అభి+అర్చించున్ = పూజించును. మీన నేత్ర = చేపలవంటి కన్నులు గలది - స్త్రీ (సుశీల), గరళ-------- కంధరు: గరళకూట = కాలకూట మనెడి విషముయొక్క గ్రాస = తిండిచే (కాల కూటమును దినుటచే), కల్మాష = నల్లనైన, కంధరు = కంఠము గలవాని యొక్క (శివుని యొక్క), మేనన్ = శరీరమునందు, గంధము, అలదున్ = పూయును. ఎలనాగ = స్త్రీ (సుశీల), కుటిల - కుండలిరాజ - కుండలునకున్ = వంకరయైన, పాపఱేడు, చెవుల పోగులుగాగలవానికి (శివునకు), దివ్య + ఉపహారంబులు = ఒప్పునవియైన కానుకలు, అర్పించున్ = ఇచ్చును.

అతివ = స్త్రీ (సుశీల), కుచ-భరంబునన్ = స్తనముల, బరువుచే, అర + కౌను = సగమైన నడుము (కృశించిన సన్నని నడుము), గూనుగిలఁగన్ = గూనుకాగా, వంగగా, చరణ - నూపుర - ఝుళఝుళంఝుళ - రవంబు = కాలి, అందెల, ఝుళఝుళ ఝుళ అను ధ్వని, రవలి-మట్టెల - మ్రోతతోన్ = ధ్వనించు మట్టెల ధ్వనితో, రాయిడింపన్ = వివాదపడగా అభవు - గుడికిన్ = శివుని ఆలయమునకు, ప్రదక్షిణంబు - తిరుగున్ = ప్రదక్షిణములు చేయును.

తాత్పర్యము: సుశీల నర్మదా నదీ జలముచే నా యూరియందలి ఓంకారేశ్వరు నభిషేకించును. నల్లని కలువలతో నా దేవుని పూజించును. ఆ దేవుని శరీరమున గంధము పూయును. ఆ స్వామికి గొప్పకానుకలను సమర్పించును. ఆమె కృశించిన నడుము స్తనభారముచే గూనుకాగా, నామె పాదములకు ధరించిన అందెల ఝుళం ఝుళనాదము ధ్వనించు మట్టెల చప్పుడుతో వివాదపడగా నామె ఆ శివాలయమునకు ప్రదక్షిణములు చేయును.

విశేషములు : ఇందు భగవంతునకు చేయు షోడశోపచారములలో అభిషేకము, పుష్పము, గంధము, ఉపహారము, ప్రదక్షిణము అనునవి కొన్ని చెప్పబడినవి.

1. తా. నకును 2. తా. గూనిగిలఁగ 3. తా. రవణి

అలినీలకుంతల, మీననేత్ర అనునవి తత్సౌందర్యద్యోతకములు. కుచభరంబున నరగౌను గూనుగిలంగ - పూజాసమయమున గూడ శ్రీనాథుడించుక శృంగారమును భక్తితో మేళవించుచుండును. తరుణ నిర్మలసుధాధామ - తరుణుడు గనుకనే నిర్మలంబైన - మచ్చ పూర్ణ సుధాధామునియందే యుండును. తరుణునిలో (చంద్రకళలో) ఉండదు. ఎలనాగ - `నాతి పైదలి యెలనాగ లేమ' - స్త్రీ - సాం.ని. కల్మాష - కలయతి కాంక్షతే అనేకవర్ణానితి కల్మాష శబ లైతాశ్చ కర్బురే'- అమరము. కల్మాషము = నలుపు - శ.ర., సూ.ని., కుండలి - `కుణ్డలీ గూఢపా చ్చక్షు శ్శ్రవాః కాకోదరః ఫణీ '- అమరము - కుండలాకారం వపు రస్యేతి కుణ్డలీ - కుండలాకారమైన శరీరము గలది - పాము కౌను - `కౌనన నడు మనంగా నభిధానములగు మధ్యమునకు' - ఆం.నా.సం. అరగౌను = సన్నని నడుము (సూ.ని.) గూనుగిలు = వంగు - సూ.ని. రవలి - `అలుకుడు రవళిం తనంగ ధ్వనికి'- సాం.ని. రాయిడించు - అల్లరిపెట్టు - శ.ర. `రవలి మట్టెల మ్రోతలు రాయిడింప'. వి.పు. 5 ఆ. కలహించు, వివాదపడు - `కనక నూపుర రణత్కార నిక్వాణంబు రవలి మట్టియలతో రాయిడింప - ఇటు ఉపమాద్యోతకము - హర. 5.45. సూ.ని.

వ. ఒక్కనాఁడోంకారనాథునకుం బ్రదక్షిణం బాచరిం[1]చుచు నప్పద్మాక్షి ప్రాకార పురః ప్రఘాణంబున నొక్క పౌరాణికుండు శ్రీ మహాభారతంబు వక్కాణించువాఁ [2]డపుత్త్రకులకుం బుణ్య లోకంబు లేదని కథానుకథన ప్రసంగంబునం బలికిన నయ్యింతి సంతానవిరహవేదనా దూయమానమానసయై మందిరంబున కేతెంచి యేకాంతభవనంబున [3]విహారశయ్యాపై మేను వైచి చింతాక్రాంతయై యుండె నంత యజ్ఞదతత్తుండమ్మత్తకాశిని నన్వేషించి. 22

అర్థము: ఒక్కనాఁడు, ఆ - పద్మ + అక్షి = ఆ తామరల వంటి కన్నులు గలది - స్త్రీ (సుశీల), ఓంకారనాథునకున్, ప్రదక్షిణంబు, ఆచరించుచున్ = చేయుచు, ప్రాకార - పురస్ = ప్రఘాణంబునన్ - ప్రహరి ముందటి తలవాకిటికిం బ్రక్క నుండెడు చిన్న గదియందు, ఒక్క, పౌరాణికుండు = పురాణము చెప్పువాడు, అపుత్త్రకులకున్ = కొడుకులు లేని వారికి, పుణ్య-లోకంబు, లేదు + అని, కథా + అనుకథన - ప్రసంగంబునన్ = కథ వెంబడి కథ చెప్పు ప్రస్తావమున, పలికినన్, ఆ + ఇంతి = ఆ స్త్రీ (సుశీల), సంతాన ------ మానస : సంతాన = సంతతి యొక్క, విరహ = లేమివలని, వేదనా = బాధచేత, దోదూయమాన = బాధపెట్టుబడుచున్న, మానస = మనస్సు గలది, ఐ, మందిరంబునకున్ = ఇంటికి, ఏతెంచి = వచ్చి, ఏకాంత - భవనంబునన్ = రహస్యగృహమున, విహార - శయ్యాపైన్ = విహరించు పాన్పు మీద, మేను = శరీరము, వైచి, చింతా +

1. తా. పుచు 2. తా. దపుత్తులైనవారలకు 3. ము. విరహశయ్యాపై

గీ. నతివ దిరుగుఁ బ్రదక్షిణం బభవు[1]గుడికిఁ
గుచభరంబున నరగౌను[2] గూనుగిలఁగ
[3]రవలి మట్టెల మ్రోఁతతో రాయిడింపఁ
జరణనూపుర ఝుళఝుళంఝుళరవంబు. 21

అర్థము: అలి - నీల - కుంతల = తుమ్మెదలవలె నల్లనైన శిరోజములు గలది - స్త్రీ (సుశీల), సోమ+ఉద్భవా- సలిల-ధారన్ = నర్మదా నదీ జలధారతో, శంభున్ = ఈశ్వరుని, అభిషేకము+ఒనరించున్= స్నానము చేయించును. నెలఁత = స్త్రీ(సుశీల), తరుణ - నిర్మల - సుధాధామ - మౌళిన్ = లేతవాడును, స్వచ్ఛమైన వాడును అగు అమృతకిరణుడు (చంద్రుడు), శిరస్సునందుగలవానిని - శివుని, నీల+ఉత్పలంబులన్ = నల్లని కలువలతో, అభి+అర్చించున్ = పూజించును. మీన నేత్ర = చేపలవంటి కన్నులు గలది - స్త్రీ (సుశీల), గరళ-------- కంధరు: గరళకూట = కాలకూట మనెడి విషముయొక్క గ్రాస = తిండిచే (కాల కూటమును దినుటచే), కల్మాష = నల్లనైన, కంధరు = కంఠము గలవాని యొక్క (శివుని యొక్క), మేనన్ = శరీరమునందు, గంధము, అలదున్ = పూయును. ఎలనాగ = స్త్రీ (సుశీల), కుటిల - కుండలిరాజ - కుండలునకున్ = వంకరయైన, పాపఱేడు, చెవుల పోగులుగాగలవానికి (శివునకు), దివ్య + ఉపహారంబులు = ఒప్పునవియైన కానుకలు, అర్పించున్ = ఇచ్చును.

అతివ = స్త్రీ (సుశీల), కుచ-భరంబునన్ = స్తనముల, బరువుచే, అర + కౌను = సగమైన నడుము (కృశించిన సన్నని నడుము), గూనుగిలఁగన్ = గూనుకాగా, వంగగా, చరణ - నూపుర - ఝుళఝుళంఝుళ - రవంబు = కాలి, అందెల, ఝుళఝుళ ఝుళ అను ధ్వని, రవలి-మట్టెల - మ్రోతతోన్ = ధ్వనించు మట్టెల ధ్వనితో, రాయిడింపన్ = వివాదపడగా అభవు - గుడికిన్ = శివుని ఆలయమునకు, ప్రదక్షిణంబు - తిరుగున్ = ప్రదక్షిణములు చేయును.

తాత్పర్యము: సుశీల నర్మదా నదీ జలముచే నా యూరియందలి ఓంకారేశ్వరు నభిషేకించును. నల్లని కలువలతో నా దేవుని పూజించును. ఆ దేవుని శరీరమున గంధము పూయును. ఆ స్వామికి గొప్పకానుకలను సమర్పించును. ఆమె కృశించిన నడుము స్తనభారముచే గూనుకాగా, నామె పాదములకు ధరించిన అందెల ఝుళం ఝుళనాదము ధ్వనించు మట్టెల చప్పుడుతో వివాదపడగా నామె ఆ శివాలయమునకు ప్రదక్షిణములు చేయును.

విశేషములు : ఇందు భగవంతునకు చేయు షోడశోపచారములలో అభిషేకము, పుష్పము, గంధము, ఉపహారము, ప్రదక్షిణము అనునవి కొన్ని చెప్పబడినవి.

1. తా. నకును 2. తా. గూనిగిలఁగ 3. తా. రవణి

అలినీలకుంతల, మీనవేత్ర అనునవి తత్సౌందర్యద్యోతకములు. కుచభరంబున నరగౌను గూనుగిలcగ - పూజాసమయమున గూడ శ్రీనాథుడించుక శృంగారమును భక్తితో మేళవించుచుండును. తరుణ నిర్మలసుధాధామ - తరుణుడు గనుకనే నిర్మలంబైన - మచ్చ పూర్ణ సుధాధామునియందే యుండును. తరుణునిలో (చంద్రకళలో) ఉండదు. ఎలనాగ - `నాతి పైదలి యెలనాగ లేమ' - స్త్రీ - సాం.ని. కల్మాష - కలయతి కాంక్షతే అనేకవర్ణానితి కల్మాష శబ లైతాశ్చ కర్బురే' - అమరము. కల్మాషము = నలుపు - శ.ర., సూ.ని., కుండలి - `కుణ్డలీ గూఢపా చ్చక్షు శ్శ్రవాః కాకోదరః ఫణీ ' - అమరము - కుండలాకారం వపు రస్యేతి కుణ్డలీ - కుండలాకారమైన శరీరము గలది - పాము కౌను - `కౌనన నడు మనంగా నభిధానములగు మధ్యమునకు' - ఆం.నా.సం. అరగౌను = సన్నని నడుము (సూ.ని.) గూనుగిలు = వంగు - సూ.ని. రవలి - `అలుకుడు రవళిం తనంగ ధ్వనికి' - సాం.ని. రాయిడించు - అల్లరిపెట్టు - శ.ర. `రవలి మట్టెల మ్రోతలు రాయిడింప'. వి.పు. 5 ఆ. కలహించు, వివాదపడు - `కనక నూపుర రణత్కార నిక్వాణంబు రవలి మట్టియలతో రాయిడింప - ఇటు ఉపమాద్యోతకము - హర. 5.45. సూ.ని.

వ. ఒక్కనాcడోంకారనాథునకుం బ్రదక్షిణం బాచరిం[1]చుచు నప్పద్మాక్షి ప్రాకార పురః ప్రఘాణంబున నొక్క పౌరాణికుండు శ్రీ మహాభారతంబు వక్కాణించువాc [2]డపుత్త్రకులకుం బుణ్య లోకంబు లేదని కథానుకథన ప్రసంగంబునం బలికిన నయ్యింతి సంతానవిరహవేదనా దూయమానమానసయై మందిరంబున కేతెంచి యేకాంతభవనంబున [3]విహారశయ్యాపై మేను వైచి చింతాక్రాంతయై యుండె నంత యజ్ఞదతత్తుండమ్మత్తకాశిని నన్వేషించి. 22

అర్థము: ఒక్కనాcడు, ఆ - పద్మ + అక్షి = ఆ తామరల వంటి కన్నులు గలది - స్త్రీ (సుశీల), ఓంకారనాథునకున్, ప్రదక్షిణంబు, ఆచరించుచున్ = చేయుచు, ప్రాకార - పురస్ = ప్రఘాణంబునన్ - ప్రహరి ముందటి తలవాకిటికిం బ్రక్క నుండెడు చిన్న గదియందు, ఒక్క, పౌరాణికుండు = పురాణము చెప్పువాడు, అపుత్త్రకులకున్ = కొడుకులు లేని వారికి, పుణ్య-లోకంబు, లేదు + అని, కథా + అనుకథన - ప్రసంగంబునన్ = కథ వెంబడి కథ చెప్పు ప్రస్తావమున, పలికినన్, ఆ + ఇంతి = ఆ స్త్రీ (సుశీల), సంతాన ------ మానస : సంతాన = సంతతి యొక్క, విరహ = లేమివలని, వేదనా = బాధచేత, దోదూయమాన = బాధపెట్టబడుచున్న, మానస = మనస్సు గలది, ఐ, మందిరంబునకున్ = ఇంటికి, ఏతెంచి = వచ్చి, ఏకాంత - భవనంబునన్ = రహస్యగృహమున, విహార - శయ్యాపైన్ = విహరించు పాన్పు మీద, మేను = శరీరము, వైచి, చింతా +

1. తా. పుచు 2. తా. దపుత్త్రులైనవారలకు 3. ము. విరహశయ్యాపై

ఆక్రాంత + ఐ + విచారము చేత, ఆక్రమింపబడినదై, ఉండెన్, అంతన్, యజ్ఞదత్తుడు, ఆ + మత్తకాశినిన్ = ఆ ఉత్తమ స్త్రీని (సుశీలను), అన్వేషించి = వెదకి.

తాత్పర్యము: సుశీల ఒకనాడు ఓంకారనాథదేవునకు ప్రదక్షిణించుచు, ప్రాకారము ముందటిగదిలో నొక పౌరాణికుడు శ్రీ మహాభారతమును పురాణము చెప్పుచు పుత్రులు లేనివారికి పుణ్యలోకము లేదని కథలు చెప్పుప్రసంగమున పలికిన, నామె సంతతి లేమికి బాధపడుచు నింటికి వచ్చి రహస్య గృహమున పాన్పుపై మేను పడవైచి దుఃఖించుచుండెను. అంత యజ్ఞదత్తుడామెను వెదకి - తరువాత పద్యముతో నన్వయము.

విశేషము: మత్తకాశిని - 'వరారోహా మత్తకాశి న్యుత్తమా వరవర్ణినీ -' అమరము. - మధుపానం వినా మత్తేవ కాశత ఇతి మత్తకాశినీ - మధుపానము లేకయే మత్తురాలివలె ప్రకాశించునది ఉత్తమ స్త్రీ.

ఉ. కాంత సరోజనాళలతికాతను పాండుశరీరయష్టి నే
కాంత గృహాంతరస్థితఁ బ్రియాంగనఁ జేరఁగ వచ్చె మంత్రి క
ల్పాంతరమునన్ రసాతల గుహాకుహరంబున [1]డాంగియున్న భూ
కాంత వరాహమూర్తి హరి గ్రచ్చఱ డాయంగ వచ్చుకైవడిన్. 23

అర్థము: మంత్రి = మంత్రియైన యజ్ఞదత్తుడు, కల్ప + అంతమునన్ - ప్రళయమునందు, రసాతల - గుహా - కుహరంబునన్ = పాతాళమనెడి గుహ యొక్క, లోపలి భాగమునందు, డాగి + ఉన్న = దాగికొనియున్న, భూ-కాంతన్ = భూమియను స్త్రీని, వరాహ - మూర్తి = పంది యాకారముగలవాడయిన, హరి = విష్ణువు, క్రచ్చన్ = శీఘ్రముగా, డాయగన్ + వచ్చు - కైవడిన్ = సమీపింపవచ్చు విధమున, కాంత --------- యష్టిన్ : కాంత = మనోహరమైన, సరోజ - నాళ = తామర తూడువలెను, లతికా = తీగవలెను, తను = సన్ననిదియును, పాండు = తెల్లనిదియును, అగు, శరీర - యష్టిన్ = కొట్టువంటి మేనుగలదానిని, ప్రియ+అంగనన్ = ప్రియభార్యను, (సుశీల), చేరఁగన్ + వచ్చెన్ = సమీపించెను.

తాత్పర్యము: మంత్రి యజ్ఞదత్తుడు వరాహావతారుడగు విష్ణువు ప్రళయ సమయమున పాతాళ మనెడి గుహలోపల డాగియున్న భూకాంతను సమీపించువిధమున పద్మనాళము వలెను, పద్మలతవలెను సన్నని దియు, తెల్లనిదియు నైన శరీరము గలట్టియు, రహస్యగృహములోపల నున్నట్టియు తన ప్రియురాలైన సుశీలను చేరవచ్చెను.

విశేషము : తన భార్యను చేరబోయిన యజ్ఞదత్తుని వరాహమూర్తియైన విష్ణునితో పోల్చుటవలన వాని గొప్పతనము తెలియుచున్నది. వరాహమూర్తి భూమి

1. తా. డస్సియున్న

నుద్ధరించి యామె నానంద పఱచినట్లు యజ్ఞదత్తుడును నామె కానందమును గూర్పగలడని యా యుపమానముచే తెలియనగును. ఏకాంత గృహము చీకటితో నిండియుండుటచే పాతాళగుహతో పోలిక. సుశీల శరీరమును తామరతూటితోను, తామరతీగతోను పోల్చుటచే పుత్త్రరాహిత్యము వలని యామె కృశత్వము తెలియుచున్నది. శరీరమును యష్టితో పోల్చుట కవిసమయము. సుశీలను భూకాంతతో పోల్చుటవలన నామెయందు తత్సహనాది లక్షణముల కలిమి తెలియుచున్నది. `క్షమయా ధరిత్రీ' యజ్ఞదత్తుడేకాంత గృహమున నున్న సుశీలను వరాహావతారుడగు విష్ణువు పాతాళగృహమున నున్న భూకాంతను చేరవచ్చుటతో నుపమించుటచే నలంకారముపమ.

వ. డాయవచ్చినఁ గృతప్రత్యుత్థానయగు నప్పంకజాక్షియుం దానునుం బర్యంకంబున గూర్చుండి యవిరళాశ్రుపాతార్ద్రీ కృత దుకూలయు ననలంకృతయునైన సుశీలం జూచి యజ్ఞదత్తుండిట్లనియె. 24

అర్థము: డాయన్ + వచ్చినన్ = సమీపింపగా, కృత - ప్రతి + ఉత్థాన + చేయబడిన యెదురేగుట గలది - ఎదురేగినది, అగు, ఆ - పంకజ + అక్షియున్ = పద్మములవంటి కన్నులు గల ఆ సుశీలయును, తానునున్, పర్యంకంబునన్ = మంచముమీద, కూర్చుండి, అవిరళ ----- దుకూలయున్: అవిరళ = అధికమైన, అశ్రు = కన్నీటి యొక్క, పాత = పడుటచే, ఆర్ద్రీకృత = తడిసినదిగా చేయబడిన, దుకూలయున్ = సన్ననివస్త్రము గలదియును, అనలంకృతయున్ (న+ అలంకృతయున్) = అలంకరింపబడనిదియును, ఐన, సుశీలన్, చూచి, యజ్ఞదత్తుండు, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: యజ్ఞదత్తుడు సుశీలకడకు వచ్చి యామెయు తానును మంచముపై కూర్చుండి యధికమైన కన్నీటిచే తడిసిన సన్ననివస్త్రము గలదియు, నలంకరించుకొననిదియు నగు సుశీలను జూచి యిట్లనెను.

విశేషములు: ఉత్థానము - ఉద్ + స్థానము - ఉద్ అను ఉపసర్గకు పరమైన స్థా, స్తంభ్ ధాతు రూపముల సకారమునకు లోపము కలుగును. ఉద్ + థానము - అనునాసికాంతస్థభిన్నములైన హల్లులకు (ఝల్లులకు) కఠిన హల్లులు (ఖర్రులు) పరములగునపుడు వాని వర్గములందలి ప్రథమ వర్ణములు (చర్రులు) ఆదేశములగును. ఉత్థానము. ప్రతి + ఉత్థానము = ప్రత్యుత్థానము - యణాదేశ సంధి. అప్పంకజాక్షియు తానును పర్యంకంబున కూర్చుండి------ యజ్ఞదత్తుడిట్లనియె - `ఆత్మార్థం బభిహితం బగుచో దల్లింగ సంఖ్యాభిధాయి వచనంబు ధాతు విశేషణంబులకగు' బాల. క్రి. 120. పర్యంకము - పల్యంకము రూపాంతరము. పర్యంక - 1 మఞ్చ పర్యఙ్కపల్యఙ్కాః ఖట్వయా సమాః1

గీ. ఏల యేడ్చెదు చెప్పవే యిందువదన
విపులశోకభరంబున వెక్కివెక్కి
త్రాట గ్రుచ్చిన [1]క్రొత్త ముత్యాలవోలెఁ
[2]జన్నుఁగవ నున్న యీ బాష్పజలకణములు. 25

అర్థము : ఇందు - వదన = చంద్రుని వంటి ముఖము గలదానా! సుశీలా! విపుల - శోక - భరంబునన్ = అధికమగు, దుఃఖముయొక్క, అతిశయముచేత, వెక్కివెక్కి, ఏల, ఏడ్చెదు, చెప్పవే, ఈ -భాష్ప - జల - కణములు = ఈ కన్నీటి బిందువులు, త్రాటన్ = దారముతో, గ్రుచ్చిన, క్రొత్త - ముత్యాల + పోలెన్, చన్నుఁగవన్ = స్తనద్వయమునందు, ఉన్నవి.

తాత్పర్యము : బాష్పజలకణములను ముత్యములతో పోల్చుట రమణీయము. బాష్పములు ప్రత్యగ్రములు కావున, `క్రొత్త' ముత్యాలతో పోలిక. త్రాట గ్రుచ్చిన వనుట బాష్పకణముల అనుస్యూతిని సూచించును. ముత్యము పూర్వరూపము గూడ నీరే, ముత్యాలదండ స్తనములపై బడును. బాష్పజలమును స్తనములపైనే పడును. ముత్యాలు - ముత్యము + లు. `లు ల న లు పరంబులగునపు డొకానొకచో ముగాగమంబునకు లోపంబును, దత్పూర్వస్వరంబునకు దీర్ఘంబును విభాషనగు. `బాల. తత్సమ - 43. ముత్తెము - ముత్తియము - `ఇయ' శబ్దంబునం దికారలోపంబు కొందఱు వక్కాణించిరి. ముత్తియ శబ్దంబునందు మాత్ర మిత్వలోపంబు గానంబడియెడి.' బాల. ఆచ్ఛిక. 23. త్రాట ----- కణములు. అలంకారముపమ.

సీ. కుదురు నిండిన మంచి గుబ్బచన్నుల మీఁద
ధరియింపవేల ముత్యాల పేరు
ఫాలేందురేఖపైఁ బచరింప విదియేల
కుంకుమంబున బొట్టు గోరఁ దీర్చి
[3]యానబంధోద్ధురంబగు నితంబంబున
సవరింపవేల వజ్రాల[4]కమరు
పాయవట్టములతోఁ బసిఁడి నూపురములఁ

గీ. [5]బంచవన్నియ రాచిల్కఁ బంజరమున
నేల సదివింప[5]వనురాగ మెసక మెసఁగ
నేల చింతించెదవు [6]చెప్పు మిందువదన
గండపాళికఁ గెంగేలు గదియఁ జేర్చి. 26

1. ము. ముత్యాల దండవోలె, 2. తా. చన్నులవి నున్నయవి బాష్పజల కణములు. 3. ము. యానచక్రోద్ధురంబగు నితంబము మీఁద. 4. తా. కమలు. 5. తా. పచ్చ 6. తా. చెప్పె యిందు వదన.

అర్థము : ఇందు - వదన = ఓ చంద్రముఖీ - సుశీలా! కుదురు - నిండిన = ఫొందికగా నున్న, మంచి, గుబ్బ - చన్నుల మీదన్ = గుండ్రని స్తనములపై, ముత్యాల పేరు = ముత్యముల హారము, ధరియింపవు + ఏల = ఎందులకుతాల్పవు? కుంకుమంబునన్ - కుంకుమముతో, బొట్టు, గోరన్ = గోరితో, తీర్చి = దిద్ది, ఫాల + ఇందు - రేఖపైన్ = చంద్రకళవంటి నుదుటిమీద, పచరింపవు = కలుగజేయవు, ఇది+ఏల? యాన-బంధ + ఉద్ధురంబు + అగు + గమనము యొక్క, కట్టునందు (గమనము నరికట్టుట యందు), మిక్కిలి బరువైనది యగు, నితంబంబునన్ = మొలయందు, వజ్రాల కమరు = వజ్రముల ఒడ్డాణము, సవరింపవు + ఏల + ధరియింపవేల? పాయవట్టములతోన్ = కాలియందెలతో, పసిడి - నూపురములు = బంగారు అందెలు, పాద+అంబుజములన్ = తామరలవంటి, అడుగులయందు, హత్తింపవు + ఏల = కూర్పవేల? పంజరమునన్, పంచ - వన్నియ - రా చిల్కన్ = అయిదు వర్ణముల రామ చిలుకను, అనురాగము = ప్రేమము, ఎసకము + ఎసఁగన్ = అతి శయింపగా, ఏల+చదిలింపవు, గండ-పాళికన్ =చెక్కిలి ప్రదేశమునందు, కెంగేలు (కెంపు+కేలు) = ఎఱ్ఱనిచేయి, కదియన్ + చేర్చి = సమీపించునట్లు చేర్చి, ఉంచి, ఏల - చింతించెదవు = ఎందులకు దుఃఖింతువు, చెప్పుము.

తాత్పర్యము:ఓ చంద్రముఖీ! కుదురయినట్టియు, గుండ్రనైనట్టియు నీ అందమైన స్తనములందు ముత్యాల హారమును ధరింపవేల? చంద్రకళ వంటి నుదుటిపై కుంకుమముతో గోరితో తీర్చి బొట్టు పెట్టవేల? గమనము నడ్డునట్టి మిక్కిలి బరువైన మొల యందు వజ్రాలు తాపిన యొడ్డాణమును ధరింపవేల? కాలియందెలతో బంగారు టందెలను నీ అడుగుదామరలందు ధరింపవేల? పంజరము నందలి అయిదు వర్ణముల రామచిలుకను అనురాగ మతిశయింపగా చదివింపవేల? నీ చెక్కిలియందు ఎఱ్ఱని చేతిని చేర్చి దుఃఖింతువేల? చెప్పుము.

విశేషములు : పేరు - `హారమ్మునకు నగును నభిధానములు పేరులను సరులునా' - ఆం.నా.సం. నితంబ - పశ్చాన్నితంబః స్త్రీ కట్యాః - స్త్రీమొలకు వెనుక భాగము - పిఱుదు. అమరము. కటి, మొల. సూ.ని. పాయవట్టము = కాలియందె - శ.ర. కెంగేలు = కెంపు + కేలు - `సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బా.సంధి. 36 కె+కేలు: `లుప్తశేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.' బా.సం.37. కె + ను + గేలు. బాల.సం. 16. ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు. బా.సంధి. 17. కెంగేలు. గండపాళికఁగెంగేలు కదియఁజేర్చి - స్వభావోక్తి.

గీ. నెలఁత నులివేఁడియైన నీ నిడుద యూర్పు
మాటిమాటికి నిపుడు నా మానసంబుఁ
గంపమొందించుచున్నది కల్ల గాదు
ప్రబలభవదీయవక్షో[1]భవంబుఁ బోలె. 27

అర్థము: నెలఁత = ఓ ఇంతీ! సుశీలా! నులి-వేడి + ఐన = ఇంచుక వెచ్చనైన, నీ-నిడుద+ఊర్పు = నీ, పొడవైన ఊర్పు - నిట్టూర్పు, ఇపుడు, మాటిమాటికిన్, ప్రబల - భవదీయ - వక్షస్ + భవంబున్ + పోలెన్ = పెద్దదియైన, నీదయిన, స్తనమును వలె, నా - మానసంబున్ = నా మనస్సును, కంపము + ఒందించుచున్ + ఉన్నది + వడకించుచున్నది, కల్ల + అసత్యము, కాదు.

తాత్పర్యము : ఓ యింతీ! సుశీలా! ఇంచుక వెచ్చనైన నీ నిట్టూర్పు పెద్దదియైన నీ స్తనమునువలె నా మనస్సును మాటిమాటికి వడకించుచున్నది. నిజము.

విశేషములు: నులి = ఉలి (విశేషణము) = అల్పము, మాటిమాటికిన్ - మాటికిన్ + మాటికిన్ - `ఆమ్రేడితంబు పరంబగునపుడు విభక్తిలోపంబు బహుళంబుగా నగు' బాల. సంధి. 41. వక్షోభవము = వక్షోజము. ఇందు మానసమును వక్షోభవముతో పోల్చుటచే అలంకారముపమ.

క. అపరాధము సేయఁగదా
చపలాయత[2] నేత్ర![3] యేను జనవుననేనిన్
నిపుణతతోఁ జింతించిన
నెపమేమియుఁ గానరాదు నీ నెగులునకున్. 28

అర్థము: చపల + ఆయత - నేత్ర = చంచలములు, దీర్ఘములునైన కన్నులు గలదానా! నీ యెడ ప్రణయాపరాధము చేయనుగదా! నిపుణతతోన్ = నేర్పుతో, చింతించినన్ = ఆలోచించినచో, నీ - నెగులునకున్ = నీ దుఃఖమునకు, నెపము = కారణము, ఏమియున్, కానన్ + రాదు = కనబడదు.

తాత్పర్యము: ఓ చంచలాక్షీ! సుశీలా ! నేను నీవలని ప్రేమముచే నైనను నీ విషయమున తప్పుచేయను గదా! బాగుగా నాలోచించినచో, నీ దుఃఖమునకు కారణమేమియు కానబడదు.

విశేషములు: అపరాధము - ప్రణయాపరాధము, నెగులు = దుఃఖము. `సిలు గుత్తలపాటు వంత సేగి నెగులో-------- దుఃఖాఖ్యల్.' ఆం.నా.సం. నెపము = `ఓల నెపంబు సాకనంగ వ్యాజంబమరు'. సాం.ని.

---

1. తా. భరంబు, 2. తా. నేత్రి, 3. తా. నేను జను నొరునేనిన్.

క. భవదాయత్తము విభవము
భవదాయత్తంబు సువ్వె ప్రాణము నాకున్
భవదాయత్తము సర్వము
ధవళాంబుజ[1]పత్రనేత్ర తథ్యంబరయన్. 29

అర్థము: ధవళ+అంబుజ - పత్ర - నేత్ర = తెల్లని తామరరేకులవంటి కన్నులు గలదానా! సుశీలా! నాకున్, విభవము = సంపద, భవత్ + ఆయత్తము = నీ అధీనము, ప్రాణము, భవత్ + ఆయత్తము, చువ్వె = చుమ్మీ, నిశ్చయమనుట, సర్వమున్ = సమస్తమును, భవత్ + ఆయత్తము, అరయన్ = ఆలోచింపగా, తథ్యంబు = నిజము.

తాత్పర్యము: తెల్లదామరలవంటి కన్నులు గలదానా! సుశీలా! నా సంపద నీ యధీనము. నా ప్రాణము నీ యధీనము సుమా! నా సమస్తమును నీ యధీనము. పరిశీలింపగా ఇది నిజము.

విశేషములు: భవత్ + ఆయత్తము - అనునాసికాంతస్థ వర్ణములు తప్ప తక్కిన పదాంత గత హల్లులకు (ఝల్లులకు) మృదు హల్లులు (హశ్శులు) కాని, అచ్చులు కాని పరములగునపుడు ఆ హల్లుల వర్గమునకు చెందిన తృతీయవర్ణ మాదేశముగా వచ్చును. భవదాయత్తము. ఆయత్తంబు + చువ్వె - ఆయత్తంబు సువ్వె. 'ప్రథమమీది పరుషములకు గసడదవలు బహుళముగా నగు' బాల.సం.13. చువ్వె - చూడవె, చూడవే అను వాని లుప్తశేష రూపము. చువ్వె = చూవె రూపాంతరములు. నిశ్చయమును తెలుపును. తథ్యంబు, అరయన్ = తథ్యమరయగా అని యైనను, అరయన్ తథ్యంబు అనియైనను అన్వయింపవచ్చును. ధవళాంబుజ పత్రనేత్ర యను పాఠమే సాధువు ------ నేత్రి సాధువుకాదు. అంగాదులకు దప్ప సంయోగోపధంబులకు జీప్రత్యయంబు లేమింజేసి మీననేత్రి పద్మనేత్రి ఇత్యాదుల సాధువులు. బాల. తత్సమ. 85

వ. ఈ దుఃఖంబునకుం గారణం[2]బేమి చెప్పు మని[3]యడుగుటయుం బ్రత్యుత్తరం బీకయూరకున్న దాని తాంబూలకరండ వాహిని మంత్రితో నిట్లను "దేవ దైవంబు కరుణ లేమింజేసి పెద్దకాలం బిమ్మహాదేవి సంతాన లాభంబు దూరం బగుట కారణంబుగా శయనాసన[4]పాన భోజన విభూషణ పరిధానాది సముచిత వ్యాపారంబులు పరిజన ప్రయత్నంబునం బ్రతిదినంబు నెట్టకేల[5]కు నిర్వర్తించుచు దేవరకు హృదయ[6]వేదన గావింపనేప[7]క యనవరతంబు దోఁపకుండఁ జరియించు చున్నయది [8]నిన్నటి రేపు తపనమండలంబు కుపిత కపికపోల క్రోడ తామ్రంబై యుదయగిరి

1.తా. నేత్రి. 2. తా.బు 3. తా. యడిగినం. 4. తా. స్నాన. 5 తా. కునికి వర్తించుచు 6. తా.పీ.డ
7 తా. కనారతంబు, నేకారణంబు 8. తా.నిన్నరేప్రు

కవాట విటంకంబు [1]నలంకరింప వింధ్యాచల నితంబ బింబంబునకు మణిమేఖలా కలాపంబునుం బోలిన నర్మదా ప్రవాహంబునం గ్రుంకి యోంకారేశ్వరు శశాంకరేఖాలంకారు హేమపంకజంబులం బూజించి గుడికిం బ్రదక్షిణంబు సేయునది దేవభవన ప్రాకార గోపుర ప్రఘాణంబునం బౌరాణికుండు మహాభారతంబు వక్కాణింపుచుం [2]గథానుకథన ప్రసంగంబున నపుత్త్రకులకుఁ బుణ్యాలోకంబులు లేవని పలికిన నప్పలుకులు నెమ్మనంబునం గీలుకొని వాలంప [3]ములుకులుం బోలె వేదన యుత్పాదింప భవనంబునకు వచ్చి [4]'యేకాంతంబు యిచ్చోట నవిరళ బాష్పధారా దుర్దినాంధకారితముఖియై యీ దుర్దశం బొందియున్నయది' యనుటయు. 30

అర్థము: ఈ, దుఃఖంబునకున్, కారణంబు, ఏమి, చెప్పుము, అని, అడుగుటయున్, ప్రతి + ఉత్తరంబు = సమాధానము, ఈక = ఈయక, ఊరక + ఉన్నన్ = సుశీల ఊరకుండగా, దాని = ఆ సుశీలయొక్క, తాంబూల - కరండ - వాహిని = తాంబూలపు బరణిని మోయు స్త్రీ, మంత్రితోన్ = యజ్ఞదత్తునితో, ఇట్లు, అనిన్, దేవ = ప్రభూ!, దైవంబు - కరుణ = దేవుని దయ, లేమిన్ + చేసి = లేకపోవుటచేత, పెద్ద - కాలంబు = చాలా కాలము, ఈ + మహా - దేవి, సంతాన - లాభంబు = సంతతి యొక్క లబ్ధి, దూరంబు + అగుట, కారణంబుగాన్, శయనా ----- రంబులు: శయన = పరుండుట, ఆసన = కూర్చుండుట, పాన = త్రాగుట, భోజన = తినుట, విభూషణ = అలంకారములు, పరిధాన = వస్త్రములు, ఆది = మొదలగు, సముచిత = మిక్కిలి తగిన, వ్యాపారంబులు = పనులు, పరిజన - ప్రయత్నంబునన్ = పరివారము యొక్క కడక చేత, ప్రతిదినంబున్, ఎట్టకేలకున్ = చివరకు, నిర్వర్తించుచున్ = చేయుచు, దేవరకున్ = ప్రభువువారికి, హృదయ - వేదన = మనోవ్యథ, కావింపన్ + ఓపక = చేయజాలక, అనవరతంబున్ = నిరంతరమును, తోపక +ఉండన్ = కనబడకుండ, చరియించుచున్ + ఉన్న + ఆది = వర్తించుచున్న ఆమె, నిన్నటి రేపు = నిన్న ప్రాతఃకాలము, తపన - మండలంబు = సూర్యుని యొక్క బింబము, కుపిత-------- తతామ్రంబు + ఐ : కుపిత = కోపించిన, కపి = కోతి యొక్క కపోల - క్రోడ = చెక్కిళ్ల యొక్కలోపలి భాగమువలె తామ్రంబు + ఐ + ఎఱ్ఱనిదయి, ఉదయ - గిరి - కవాట - విటంకంబున్ = తూర్పుకొండయొక్క, ద్వారము యొక్క, శిఖరమును, అలంకరింపన్, వింధ్య + అచల - నితంబ - బింబంబునకున్ = వింధ్యము అను పర్వతము యొక్క, కటక (నడిమి) ప్రదేశమునకు, మణి-మేఖలా - కలాపంబునున్ = రత్నాల మొలనూలి ఆభరణమును, పోలిన, నర్మదా - ప్రవాహంబునన్ = నర్మదా నది యొక్క

1. తా.ల. 2. తా కథాకథన 3. ము. ములికియుంబోలె 4. తా. యేకాంతంబున నిచ్చోట 5. తా.కారముఖి

ప్రవాహమునందు, క్రుంకి = మునిగి, ఓంకార + ఈశ్వరున్, శశాంక - రేఖా + అలంకారున్ = చంద్రుని యొక్క, కళ, అలంకారముగా గలవానిని (ఈశ్వరుని), హేమ - పంకజంబులన్ = బంగారు, తామరలచే, పూజించి, గుడికిన్, ప్రదక్షిణంబు + చేయు + అది = ప్రదిక్షణము చేయునట్టియామె, దేవ - భవన - ప్రాకార - గోపుర - ప్రఘాణంబునన్ = దేవాలయము యొక్క, ప్రహరియొక్క, గోపురము నందలి, తలవాకిటి ప్రక్కనుండెడు చిన్నగది యందు, పౌరాణికుండు = పురాణము చెప్పువాడు, మహాభారతంబు, వక్కాణింపుచున్ = చెప్పుచు, కథా + అనుకథన - ప్రసంగంబునన్ = కథలను చెప్పు సందర్భమునందు, అపుత్రకులకున్ = పుత్త్రులు లేని వారికి, పుణ్యా - లోకంబులు, లేవు + అని, పలికినన్, ఆ + పలుకులు, నెమ్మనంబునన్ = నిండు మదియందు, కేలుకొని = నాటుకొని, వాలు + అమ్ము - ములుకులన్ + పోలెన్ = వాడియైన బాణములయొక్క కొనల వలె, వేదన = బాధ, ఉత్పాదింపన్ = పుట్టింపగా, భవనంబునకున్ - ఇంటికి, వచ్చి, ఏకాంతంబు+ అ = ఒంటరిగానే, ఈ + చోటన్, అవిరళ -- ముఖి + ఐ = అవిరళ = అధికమైన, బాష్ప = కన్నీటి యొక్క, ధారా = ప్రవాహము చేతనైన, దుర్దిన = ముసురుచేత, అంధకారిత = చీకటిగా చేయబడిన, ముఖి + ఐ = ముఖము గలదియయి, ఈ, దుర్దశన్ = దుస్థితిని, పొంది + ఉన్న + అది = పొందియున్నది, అనుటయున్.

తాత్పర్యము: ఈ విచారమునకు కారణమేమి చెప్పు మని యజ్ఞదత్తుడడుగగా సుశీల సమాధానము చెప్పక యూరకుండెను. అప్పుడామె తాంబూలపు బరణిని మోచునామె మంత్రితో నిట్లు పలికెను. `ప్రభూ! దైవకృప లేక చిరకాల మీదేవి సంతానరహితయై శయనము, ఆసనము, పానము, భోజనము మున్నగు పనులు పరిజనుల ప్రయత్నమున నెట్టకేలకు చేయుచు దేవరకు హృదయవేదన గావింప జాలక వర్తిలునామె నిన్న సూర్యోదయ సమయమున వింధ్యపర్వత కటకమునకు మణిమయమైన మొలనూలివలెనున్న నర్మదానదియందు స్నానము చేసి, దేవాలయ ప్రాకారగోపురమునందలి చిన్నగదిలో పౌరాణికుడు మహాభారతమునందలి కథలను చెప్పు సందర్భమున `పుత్రహీనులకు పుణ్యాలోకములు లేవ'ని పలుకగా నా పలుకులు మనస్సున నాటుకొని వాడిబాణములవలె బాధింపగా నింటి కేతెంచి యొంటరియై యిచ్చట సంతతధారగా కన్నీరు కార్చుచు నీ దురవస్థను పొందియున్నది.' అని చెప్పగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ప్రత్యుత్తరము = ప్రతి + ఉత్తరము - యణాదేశ సంధి, ప్రతిదినము - దినదినము - అవ్యయీభావసమాసము, రేపు = ప్రాతఃకాలము, మఱుసటి దినము, క్రోడ = లోపలిభాగము - `నాభి పంకరుహ క్రోడమిళింద బృందము'- ఆము. 1.5. నితంబ - `కటకో స్త్రీ నితమ్బో౽ద్రేః.' అమరము. నెమ్మనము - నె + ప్రఘాణము - ప్రఘణావిన్దా బహిర్ద్వార ప్రకోష్ఠకే' అమరము.

మనము - `అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచో గానంబడియెడి.' బాల. సంధి - 39., ములికి - ఏకవ. - ములుకులు -బహు వ. `వికృతి యందికారాంతముల యుపోత్తమేత్వంబునకు బహువచనము పరంబగునపుడుత్వంబగు బాల. తత్సమ. 46., దుర్దిన - A shower (of anything) - Apte

అథ తస్యా స్తామ్బూల కరఙ్క వాహినీ సతత ప్రత్యాసన్నా మకరికా నామ రాజాన మువాచ. ప్రథమ మపి స్వామినీ దానవశ్రీ రివ సతతనిన్దితసురతా శయనాసనస్నానభోజనభూషణపరిగ్రహాదిషు సముచితేషు దివసవ్యాపారేషు కథంకథ మపి పరిజన ప్రయత్నా త్తవర్తమానా సశోకేవాసీత్. దేవ హృదయపీడా పరిజిహీర్షయా చ న దర్శితవతీ సా వికారమ్.... అద్యతు చతుర్దశీతి భగవన్తం మహాకాల మర్చి మితోతు గతయా తత్ర మహాభారతే వాచ్యమానే శ్రుతం అపుత్రాణాం కిల గతి ర్నాస్తి న వా సన్తి లోకాః' అను కాదంబరీ కావ్యస్థ వచనముల నిట స్మరింపదగును.

ఆ.వె. మంత్రి యొక ముహూర్తమాత్రంబు చింతించి
యుష్ణదీర్ఘమైన యూర్పు నిగుడ
[1]నెంత చింత దీనికిది మహాబలవంత
మేమి సేయవచ్చు నిందువదన 31

అర్థము: మంత్రి = యజ్ఞదత్తుడు, ఒక, ముహూర్త - మాత్రంబు = ఇంచుక సేపు, చింతించి = విచారించి, ఉష్ణ-దీర్ఘము + ఐన = వేడిదియు, నిడుపైనదియునైన, ఊర్పు, నిగుడన్ = `వ్యాపింపగా, ఇందు - వదన = చంద్రముఖీ, సుశీలా!, దీనికిన్ = ఈ విషయమునకు, ఎంత, చింత = దుఃఖము, ఇది = ఈ దుఃఖము, మహతీ (మహా) + బలవంతము = చాల అశక్యమయినది, ఏమి + చేయవచ్చున్?

తాత్పర్యము : మంత్రియగు యజ్ఞదత్తు డొక క్షణకాలము చింతించి, వేడి నిట్టూరుపు పుచ్చి, `చంద్రముఖీ! ఈ విషయమున నీ కెంతటి దుఃఖము గలిగినది! ఇది యశక్యము. దీనికి ప్రతికార మేమి చేయవలయును?'

విశేషములు: ముహూర్తము = నలువది యెనిమిది నిమిషముల కాలము. ఇక్కడ స్వల్పకాలమని భావము, ఉష్ణదీర్ఘము - ఉష్ణమును, దీర్ఘమును - విశేషణోభయ-పదకర్మధారయ సమాసము, ఏమి + చేయ = ఏమి సేయ - గసడదవాదేశము.

ఉ. ఊరకొకుంద నేమిటికి నోంకృతినాథుఁడు నర్మదానదీ
తీరనివాసి భక్తజన దివ్యమహీరుహా[2]మున్నవాఁడు నీ
రేరుహనేత్ర తత్పదపరిష్టి యభీష్టశుభాభివృద్ధికిం
గారణ మౌ[3]టెఱుంగవె వికారము దక్కు భజింపు శంకరున్. 32

1. తా. దీనొకొటులైన దేవుండు బలవంత. 2. తా. యేద్వ. 3. మున్సదాశివున్ సారసనేత్ర.

అర్థము: నీరేరుహ - నేత్ర = పద్మముల వంటి కన్నులు గలదానా! సుశీలా! ఊరక = మానక, కుందన్ + ఏమిటికిన్ = విచారింపనేల?, నర్మదా - నదీ - తీర - నివాసి = నర్మద యను నదియొక్క యొడ్డున నివసించువాడును, భక్త - జన - దివ్య - మహీరుహము = భక్తులైన, జనులకు, దేవతాసంబంధమైన చెట్టు (కల్పవృక్షము) అయినవాడును, (అగు), ఓంకృతినాథుడు = ఓంకారేశ్వరుడు, ఉన్నవాడు = ఉన్నాడు, తద్ + పద - పరీష్టి = ఆ దేవుని యొక్క, పాదముల యొక్క, పూజ, అభీష్ట - శుభ + అభివృద్ధికిన్ = కోరబడిన, శుభముల యొక్క, పెంపునకు, కారణము + ఔట = కారణమగుట, ఎఱుంగవు + ఎ = ఎఱుగవా? వికారము = మార్పు (దుఃఖము), తక్కు = విడువుము, శంకరున్ = ఈశ్వరుని, భజింపు = సేవింపుము.

తాత్పర్యము: ఓ పద్మాక్షీ! సుశీలా! నర్మదానదీతీరమున నివసించు నట్టివాడును, భక్తజనుల పాలిటి కల్పవృక్షమైనవాడును అగు ఓంకారేశ్వరుడుండగా నేల మానక విచారింతువు ? ఆ దేవుని పాదపూజ కోరిన శుభముల అభివృద్ధికి కారణ మగుట నీవెఱుగవా? అందుచే దుఃఖమును విడిచి యా శంకరుని భజింపుము.

విశేషములు: ఓంకారేశ్వరుడు భక్తజన దివ్య మహీరుహము కావుననే నీ కోరిక తీఱుట కతనినే భజింపవలయుననుట. భక్త......రుహమను ఓంకృతినాథ విశేషణము సాభిప్రాయమగుటచే అలంకారము పరికరము. `అలఙ్కారః పరికర స్సాభిప్రాయ విశేషణైః' నీరేరుహ - అలుక్సమాసము, పరీష్టి = `పర్యేషణా పరీష్టిశ్చాన్వేషణా చ గవేషణా.' అమరము. పరీష్టి = పరిచర్య - సూ.ని. Respect, worship, homage - Apte,

వికారము - దుఃఖరూపమైన వికారము, శంకరున్ - శం సుఖం కరోతీతి శంకరః, సుఖమును కలుగజేయువాడు - ఈశ్వరుడు. `శంకరున్' అను విశేష్యము సాభిప్రాయమగుటచే నలంకారము పరికరాంకురము. `సాభిప్రాయే విశేష్యే తు భవే త్పరికరాఙ్కురః'.తక్కు, భజింపు - ముపర్ణకలోపము. `మధ్యమ పురుష ముపర్ణకంబునకు హలవసానంబులు పరంబులగు నపుడు లోపము విభాషనగు.' బాల. సంధి. 47

గీ. ఈశ్వరుండద్రిజానాథుం డిందుమౌళి
కరుణ[1]లేకున్న మనకెట్లు కలుగ నేర్చు
జంద్రచందనచంద్రికా శైత్యమైన
పుత్రపరిరంభ సౌఖ్యంబు పువ్వుబోణి? 33.

అర్థము: పువ్వుబోణి = పువ్వువంటి మేనుగలదానా! సుశీలా! ఈశ్వరుండు = ఐశ్వర్యయుక్తుడును, అద్రి - జా - నాథుడు = కొండ కూతురగు పార్వతి యొక్క

1. ము. లేకను, సుతుంజెట్లు.

భర్తయు, అగు, ఇందు - మౌళి = చంద్రుడు శిరస్సునందుగల శివుని యొక్క, కరుణ = దయ, లేక + ఉన్నన్ = కలిగియుండక పోయినచో, చంద్ర ----- శైత్యమైన: చంద్ర = చంద్రుని యొక్కయు, చందన = మంచి గంధము యొక్కయు, చంద్రికా = వెన్నెల యొక్కయు, శైత్యము = చల్లదనము గలిగినది, ఐన, పుత్త్ర - పరిరంభ - సౌఖ్యంబు = కొడుకు యొక్క, కౌగిలింతవలని, సౌఖ్యంబు = సుఖము, మనకున్, ఎట్లు, కలుగన్ + నేర్చున్ = కలుగగలదు?

తాత్పర్యము: ఓ పూబోడి! సుశీలా! పార్వతీపతియు, చంద్రమౌళియు నైన ఓంకారేశ్వరుని దయ లేకపోయినచో, చంద్రుని వలెను, చందనము వలెను, వెన్నెల వలెను చల్లనిదైన పుత్త్రాలింగన సౌఖ్యము మనకెట్లు కలుగగలదు? కలుగజాలదనుట.

విశేషములు: పుత్త్ర పరిష్వంగ సుఖమును వర్ణించిన యీ భావము వ్యాస భారతములోని శకుంతలోపాఖ్యానము నందలిది.

మలయా చ్చన్దనం జాత మతిశీతం వదన్తి వై,
శిశోరాలిఙ్గ్యమానస్య చన్దనాదధికం భవేత్.

దీనిని నన్నయ తెలిగించిన విధము:

మ. విపరీత ప్రతిభాషలేమిటికి నుర్వీనాథ యీ పుత్త్రగా
త్ర పరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహార కర్పూర సాం
ద్ర పరాగప్రసరంబు జందనము జంద్రజ్యోత్స్నయుంబుత్త్రగా
త్ర పరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే? ఆది. చ. 91.

శ్రీనాథుని పద్యమునకు మూల మిదియేయని చెప్పవచ్చును.

`ఇందుమౌళికరుణ' అను షష్ఠీ సమాసాంతర్గత విశేష్యమైన `ఇందుమౌళి' విశేషణములైన ఈశ్వరుడు, అద్రిజానాథుడు ప్రమాంతములుగా నున్నవి. `ఒక్కచో సమాసాంతర్గత విశేష్యంబుల కగు విశేషణంబుల షష్ఠికిని బ్రథమ చూపట్టెడి.' - ప్రౌఢ. కారక. 21

పువ్వుబోణి - పువ్వు వంటి మేను గలది - బహువ్రీహియని చిన్నయ `బహువ్రీహిని స్త్రీ వాచ్యం బగుచో నుపమానంబు మీది మేనునకు బోడి యగు.' బాల. సమాస. 23. పువ్వువలె మనోజ్ఞురాలైనది. కర్మధారయమని ప్రౌఢవ్యాకరణము. `అలరుబోడీత్యాదులుపమాన పూర్వపద కర్మధారయంబులు.' ప్రౌఢ. సమాస. 19 పోణి - పోడి రూపాంతరము.

చంద్రచందన..... సౌఖ్యంబు - ఉపమ.

గీ. గురుజనంబుల [1]సేవింపు కువలయాక్షి
[2]కమలలోచన ముక్కంటి కరుణజేసి
[3]మున్ను గురు నుపదేశంబు మొనయఁగాంచి
రభిమతార్థంబు లెందఱే [4]ననుదినంబు.

అర్థము : కువలయ + అక్షి = కలువలవంటి కన్నులు గలదానా!, గురు - జనంబులన్ = పెద్దలను, సేవింపు = సేవింపుము, కమల - లోచన = పద్మముల వంటి కన్నులు గలదానా! ముక్కంటి = ఈశ్వరుని (మూడుకన్నులు గలవాని) యొక్క, కరుణన్ = చేసి = దయచేత, మున్ను = ముందు, గురు + ఉపదేశంబున్ = గురువు యొక్క ఉపదేశము, మొనయన్ = కలుగగా, ఎందు + ఏన్ = ఎందో, అనుదినంబున్ = ప్రతి దినమును, అభిమత + అర్థంబులు = కోరబడిన కోరికలు, కాంచిరి = పొందిరి.

తాత్పర్యము: ఓ పద్మాక్షి! సుశీలా! పెద్దలైన వారిని సేవింపుము. ఈశ్వరుని దయచేత ముందు పెద్దల యుపదేశము కలుగగా నెందఱో ప్రతిదినమును కోరిన కోరికలను పొందిరి.

విశేషములు : సుశీల సౌందర్యము నెంత వర్ణించినను యజ్ఞదత్తునకు తృప్తిలేదు కావున `అనుదినంబు' అను పాఠముకంటె, `అబ్జవదన' అను పాఠమే మేలని తోచుచున్నది. ముక్కంటి - బహువ్రీహి. `న్ను' అను దానికి `టి' ఆదేశము సమాసాంతకార్యముగా నైనది. కరుణ జేసి - `కొన్ని యెడల జేత విభక్త్యర్థక వర్ణకంబులకును, వలన వర్ణకంబునకును దఱచుగ జేసి యనుప్రయుక్తంబగు.' ప్రౌఢ. కారక. 4. ఇచ్చట ద్వితీయకు జేసి అనుప్రయుక్తమయినది. సేవింపు - సేవింపుము - హల్లు పరమగుచుండగా మధ్యమపురుషమువర్ణకలోపము. గురు + ఉపదేశంబు - `షష్ఠీ సమాసంబునం దుకార ఋకారంబుల కచ్చు పరంబగునపుడు నుగాగమంబగు' బాల. సంధి. 34.

వ. సర్వజగత్ప్రసిద్ధంబు గదా యితిహాసంబు తొల్లి చండకౌశికు వరప్రసాదంబున మగధాధిపతియగు [5]బృహద్రథుండు జనార్దను గెలువందగినట్టి శౌర్యనిధి జరాసంధుం గాంచె; దశరథుండు విభాండకతనయుండగు ఋశ్యశృంగు నారాధించి దిగ్గజంబు లం బోలిన కుమారుల సకలలోకహితంబుగా నలుగురం[6] బడసె సమారాధిత గురుదేవతాప్రసాదవశంబున. 35

1. తా. సేవించు, 2. తా. నలినముఖి నిష్ఠ మీర సంతతమనీష, 3. తా. మునిజనంబుల భజియించి మున్నుగాంచి, 4. ము. నబ్జవదన, 5. ము. రాజదైతేయకుల విమర్దను 6. తా.తెంచె

అర్థము: ఇతిహాసంబు = చరిత్ర, సర్వ-జగత్ - ప్రసిద్ధంబు + కదా = ఎల్లలోకములందును ప్రసిద్ధమైనది, తొల్లి = పూర్వము, చండ కౌశికు - వర - ప్రసాదంబునన్ = చండకౌశికుడను వాని యొక్క, వరము యొక్క, అనుగ్రహముచేత, మగధ + అధిపతి = మగధదేశము యొక్క రాజు, అగు, బృహద్రథుండు, జనార్దనున్ = కృష్ణుని, గెలువన్, తగిన + అట్టి, శౌర్య - నిధిన్ = పరాక్రమమునకు నిధియైనవానిని, జరాసంధున్, కాంచెన్, దశరథుడు, విభాండక - తనయుండు = విభాండకుడను మునియొక్క కొడుకు, అగు,

ఋశ్యశృంగున్, ఆరాధించి = పూజించి, దిగ్గజంబులన్ (దిక్+గజంబులన్) = దిక్కులయందలి యేనుగులను, పోలిన, కుమారులన్ = కొడుకులను, సకల-లోక-హితంబుగాన్ = ఎల్లలోకములకు మేలు అగునట్లు, నలుగురన్ = నలుగురను, రామలక్ష్మణ భరత శత్రుఘ్నులను వారిని, పడసెన్ = పొందెను, సమ్ + ఆరాధిత - గురు - దేవతా - ప్రసాద - వశంబునన్ = లెస్సగా పూజింపబడిన గురువు అనెడి దేవతయొక్క, అనుగ్రహముచేత,

తాత్పర్యము : పూర్వము చండకౌశికుని వరము వలన మగధరాజయిన బృహద్రథుడు శ్రీకృష్ణుని గెలువ దగినట్టి కుమారుని జరాసంధుని గాంచెను. దశరథుడు విభాండకుని కొడుకగు ఋశ్యశృంగుని పూజించి దిగ్గజములను పోలు కుమారులను రామలక్ష్మణభరత శత్రుఘ్నులను పేరులుగలవారిని నలువురను పొందెను. ఈ యితిహాసములు సకల లోక ప్రసిద్ధములు గదా! గురువనెడి దేవుని లెస్సగా పూజించినచో వాని యనుగ్రహముచేత తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ఇతిహాసము - పూర్వచరిత్ర ప్రతిపాదక గ్రంథము - భారతాది. జనార్దనుడు - 'విష్వక్సేనో జనార్దనః' అమరము. సముద్ర మధ్యవర్తినో జవనామ్నో ఽసురా నర్దితవానితి జనార్దనః. సముద్ర మధ్యమందుండెడు జనులనెడు నసురుల పీడించిన వాడు. ప్రళయకాలే జనాన్ సర్వానపి అర్దయతీతి వా జనార్దనః. ప్రళయకాలమందెల్ల జనులను పీడించువాడు - విష్ణుడు. బృహద్రథుడను మగధ రాజు చండకౌశికుడను మునిని సంతానము కొఱకు ప్రార్థించి యతడిచ్చిన మామిడిపండును రెండు సమాన భాగములుగా చేసి తన యిరువురు భార్యలకు నిచ్చెను. వారు వానిని భుజించి గర్భవతులై ఒక్కొక్క రొక్కొక్క శిశుఖండమును గనిరి. వారు వెఱచి వానిని వీధిలో పాఱవేయించిరి. ఆహారము కొఱకు తిరుగు జరయను రాక్షసి వానిని చూచి యెత్తికొనగా నా శకలములు గలిసి యొక శిశువయ్యెను. జరచేత సంధింపబడినవాడుగావున నతడు జరాసంధుడయ్యెను. అతడు మహాపరాక్రమవంతుడై పదునేడు సారులు కృష్ణునిపై దండెత్తెను. కృష్ణుడీతనికి భయపడి దాగియుండెడివాడు. పదునెనిమిదవసారి యితడు కృష్ణునోడించెను. దిగ్గజములెనిమిదియై యుండ నాలుగనుట యప్రసిదము.

దిక్కులు నాలుగింటిని తీసివేయగా దిక్కులు నాలుగే కావున నట్లు సమర్థింప వచ్చును. ఈ వచనము కాదంబరీ మహాకావ్యమునందలి యీ క్రింది వచన భాగమున కెట్లాంధ్రీకరణమో పరికింపనగును. కాదంబరిలో తారాపీడ మహారాజు సంతాన రహితయైన తన భార్య నూరార్చిన విధమునే శ్రీనాథుడు తన శివరాత్రి మాహాత్మ్యమున యజ్ఞదత్తుడు, సంతానహీనయైన తన భార్యను సుశీల నూరార్చిన సందర్భమున తెనుగుచేసెను.

"యత్నేన ఆరాధితాః యథా సమీహిత ఫలానా మతి దుర్లభానా మపి వరాణాం దాతారో భవన్తి. శ్రూయతే హి పురా చణ్డ కౌశికప్రభావాన్మగధేషు బృహద్రథో నామ రాజా జరాసన్ధం నామ తనయం లేభే. దశరథశ్చ రాజా పరిణతవయా విభాణ్డక మహామునిసుతస్య ఋష్యశృఙ్గస్య ప్రసాదాదవాప చతురఃపుత్త్రాన్. అన్యేచ రాజర్షయః తపోధనా నారాధ్య పుత్త్రదర్శనామృతసుఖభాజో బభూవుః"

గీ. వెలఁది పుత్త్రోదయారంభ వేళయందు
నిన్ను నెన్నఁడు చూతునో కన్నులార
విమలచంద్రోదయారంభ వేళయందుఁ
బూర్ణిమా [1]యామినిని బోలెఁ బుణ్యగరిమ 36

అర్థము : వెలది = ఓ యింతీ! సుశీల!, విమల - చంద్ర - ఉదయ - ఆరంభ - వేళ + అందున్ = నిర్మలుడైన, చంద్రుని యొక్క, ఉదయము యొక్క, ప్రారంభము యొక్క, సమయమునందు, పూర్ణిమా - యామినినిన్ + పోలెన్ = పున్నమ రాత్రిని వలె, పుణ్య - గరిమన్ = పుణ్యముయొక్క, గొప్పతనముచేత, పుత్త్ర+ఉదయ+ఆరంభ - వేళ + అందున్ = కొడుకు యొక్క, పుట్టుట యొక్క, ప్రారంభము యొక్క, సమయమునందు, నిన్నున్, కన్నులు + ఆరన్ = కన్నులు తనియునట్లు, ఎన్నడు - ఏనాడు, చూతునో.

తాత్పర్యము : ఓ యింతీ! సుశీల! విమల చంద్రోదయ సమయమున పున్నమినాటి రాత్రిని వలె పుణ్యాతిశయముచే పుత్త్రోదయ సమయమున నిన్ను కన్నులపండువుగా నెన్నడు చూతునో!

విశేషములు: పుత్త్రోదయారంభ...... యామినిని బోలె - అలంకారముపమ. ఉపమా యత్ర సాదృశ్యలక్ష్మీ రుల్లసతి ద్వయోః' యామినీ శబ్దము స్త్రీలింగ మగుటచే సుశీలకు పోలిక `విభావరీ తమస్విన్యౌ రజనీ యామినీ తమీ.' అమరము. యామా అస్యాం సంతీతి యామినీ. యామములు గలిగినది. పుణ్యగరిమ - పుణ్యాతి శయముచేత గాని పుత్త్రోదయము సంభవింపదనుట. చంద్రోదయారంభ సమయమున

1. తా. యామినియు.

పూర్ణిమా యామిని ప్రకాశించుచుండును. అట్లే సుశీలయు పుత్త్రోదయ సమయమున సంతోషముతో వెలుగొందును. అట్టి యామెను యజ్ఞదత్తుడు చూచుట కన్నులకు పండువు. అందుచేతనే `కన్నులార'.

వ. దేవీ శోకంబు విడువుము. ధైర్యమవలంబింపుము. ధర్మంబు నడుపుము. దానంబు సేయుము. [1]వ్రతంబులు సలుపుము. సత్యంబు పలుకుము. మన పాలి దేవతలు మన కభీష్టలాభంబు బొందింపగల వారు; భవ్యసంతాన లాభంబున సంతోషంబు వహింపగలవని [2]దుఃఖాపనోదన నిపుణంబులు ధర్మోపదేశగర్భంబులు[4] చాటు మధురంబులు నగు మాటల నూరార్చి, కాంచన కలశోదకంబులు కరపల్లవంబున ధరియించి [5]నయనంబులు దుడిచి యగ్గజయానకు ముఖప్రక్షాళనం బాచరించి మందీభూతదుఃఖ యగుట యెఱింగి మంత్రి యంతఃపురంబు వెడలి సముచిత వ్యాపారంబులం బ్రవర్తిల్లె నది యాదిగ [6]నాగమోక్త ప్రకారంబున సభక్తి వినయతాత్పర్యంబున 37

అర్థము: దేవీ, శోకంబు, విడువుము, ధైర్యంబు + అవలంబింపుము, ధర్మంబు, నడుపుము, దానంబు + చేయుము, వ్రతంబులు, సలుపుము, సత్యంబు, పలుకుము, మన పాలి - దేవతలు, మనకున్, అభీష్ట - లాభంబులు = కోరిక యొక్క, లాభములు, పొందింపగల వారు, భవ్య - సంతాన - లాభంబునన్ = మంచిదియగు, సంతతి యొక్క, ప్రాప్తి చేత, సంతోషంబు, వహింపగలవు, అని, దుఃఖ + అపనోదన - నిపుణంబులు = విచారము యొక్క, తొలగించుట యందు, నేర్పుగలవి, ధర్మ + ఉపదేశ - గర్భంబులు = ధర్మము యొక్క ఉపదేశముతో గూడినవి, చాటు - మధురంబులు = ప్రియములును, తీయనివియునైనవి, అగు, మాటలన్ = మాటలతో, ఊరార్చి = ఓదార్చి, కాంచన - కలశ + ఉదకంబులు = బంగారు పాత్రమునందలి నీరు, కర - పల్లవంబునన్ = చిగురువంటి చేతియందు, ధరియించి = తాల్చి, నయనంబులు = కన్నులు, తుడిచి, ఆ +గజ - యానకున్ = ఏనుగు నడక వంటి నడకగల ఆ సుశీలకు, ముఖ - ప్రక్షాళనంబు = మొగముయొక్క, తుడుచుట, ఆచరించి, = చేసి, మందీభూత - దుఃఖ = తక్కువయైన విచారము గలది, అగుట, ఎఱింగి, మంత్రి, అంతఃపురంబున్, వెడలి, సముచిత - వ్యాపారంబులన్ = తగిన, పనులందు, ప్రవర్తిల్లెన్, అది, ఆదిగన్ = మొదలుగా, ఆగమ + ఉక్త - ప్రకారంబునన్ = శాస్త్రములందు, చెప్పబడిన, విధమున, సభక్తి - వినయ - తాత్పర్యంబునన్ = భక్తి, వినయము, తత్పరత్వము అనువానితో.

తాత్పర్యము: `దేవీ! సుశీలా! శోకము విడువుము. ధైర్య మవలంబింపుము.

1. తా. నేమంబున నోములు నోముము, 2. ము. దుఃఖోపశమన భాషణంబులు, 3. తా. నిపుణంబులు, 4. ము. చారు, 5. తా. తాన యమ్మానినీరత్నంబునకు, 6. తా. సుశీల పరమభక్తితాత్పర్యంబున.

ధర్మము నడుపుము. దానము చేయుము. వ్రతములు సలుపుము. సత్యము పలుకుము. మనపాలి దేవతలు మన కోరిక తీర్తురు. సత్సంతాన ప్రాప్తిచే సంతోషింపగలవు' అని దుఃఖమును పోగొట్టునవియు, ధర్మోపదేశముతో గూడుకొన్నవి, ప్రియములు, మధురములు నగు మాటలతో నామె నోదార్చి బంగరు పాత్రమునందలి నీటిచే నామె కన్నులు తుడిచి, ముఖము కడిగి, ఆమె దుఃఖముపశమించుట తెలిసి మంత్రి అంతఃపురము నుండి వెడలి తన పనులయందు ప్రవర్తిల్లెను. అది, మొదలుగ శాస్త్రోక్తరీతిని భక్తివినయ తాత్పర్యములతో - పయి పద్యముతో నన్వయము.

విశేషములు: చాటువు - ప్రియమైన వాక్యము, అంతఃపురంబు వెడలి - అంతఃపురము నుండి వెడలి - 'వలన కాదేశంబగు ద్వితీయా సప్తముల మీది యుండికి లోపంబు బహుళంబుగానగు.' ప్రౌఢ - కారక - 11

ఉ. ఆ ధవళాయతాక్షి వసుధామరకోటి భజించు; దేవతా
రాధన మాచరించు; మునిరాజి కుపాస్తి యొనర్చు; [1]మంత్రవి
ద్యాధరులన్ నుతించుఁ; గొనియాడును యోగిజనంబు; వర్ధమా
నాధిక భక్తి భావమున నాత్మజసంతతిఁలబ్ధి కామనన్.' 38

అర్థము: ఆ -ధవళ + ఆయత + అక్షి = తెల్లనివియును, నిడుపులునునైన కన్నులు గల ఆ సుశీల, వర్ధమాన + అధిక - భక్తి - భావమునన్ = వృద్ధి పొందుచున్న, ఎక్కువయైన, భక్తిభావముతో, ఆత్మజ - సంతతి - లబ్ధి - కామనన్ = పుత్త్ర సంతానము యొక్క, లాభమునందలి, కోరికతో, వసుధా + అమర - కోటిన్ = బ్రాహ్మణుల యొక్క, సమూహమును, భజించున్ = సేవించును, దేవతా + ఆరాధనము = దేవతలయొక్క, పూజ, ఆచరించున్ = చేయును, ముని = రాజికిన్ = మునుల యొక్క, సమూహమునకు, ఉపాస్తి = సేవ, ఒనర్చున్ = చేయును, మంత్ర - విద్యాధరులన్ = మంత్రశాస్త్రము నందు, పండితులను, నుతించున్ = పొగడును, యోగి - జనంబున్ = యోగులైన, జనులను, కొనియాడును = పొగడును.

తాత్పర్యము: ఆ సుశీల అధికమగుచున్న భక్తి భావముతో పుత్త్ర సంతానమును కోరి బ్రాహ్మణులను భజించును. దేవతల సమూహమును పూజించును. మునుల సమూహము నుపాసించును. మంత్రశాస్త్రపండితులను నుతించును. యోగిజనులను ప్రస్తుతించును.

విశేషములు: ఉపాస్తి = ఉపాసన, = పూజనము, కామన = ఇచ్ఛ. పుత్త్ర సంతాన ప్రాప్తికై సుశీల చేసిన పనుల వర్ణనచే నామె భక్తి వినయ తాత్పర్యములును, వానిని బట్టి యామె కోర్కి యెంత బలమయినదియు స్పష్టములగుచున్నవి.

---

1. ము. మంత్ర విద్యాధృత బుద్ధిఁగాంచు.

గీ. ఎఱుంగునే నీడకన్నును నెండకన్నుఁ
[1]జెలఁగి పూచునే కర్మువంచిన లతాంగి
యెట్టి క్లేశంబులకునైన [2]నీడఁ బోదు
తన మనంబున [3]నిగ్రుచు సంతానకాంక్ష. 39

అర్థము: లతా + అంగి = తీగ వంటి శరీరము గలది - సుశీల, నీడ కన్నును, ఎండకన్నున్ - ఎఱు గునే = రాణి వాసమునుండి బయటికి రానిది, తన - మనంబునన్ = తన మనసునందు, ఇగ్రుచు = అంకురించు, సంతాన - కాంక్షన్ = సంతతియందలి కోరికతో, ఏ - కర్మువు = ఏపని, అంచినన్ = పంచినను, ఆజ్ఞాపించినను, చెలఁగి = ఉత్సహించి, పూ చున్ = పూనును, ఎట్టి, క్లేశంబులకున్ + ఐనన్ = కష్టములకైనను, ఈడఁ బోదు = వెనుదీయదు.

తాత్పర్యము: తీవబోడియైన ఆ సుశీల ఎండకన్నును, నీడకన్నును ఎఱుగనిది. అనగా రాణివాసమునుండి బయటికి రానిది. అసూర్యంపశ్యయని భావము. ఆమె తన మనస్సునందంకురించిన సంతాన కాంక్షతో ఏపని చేయుమని యాజ్ఞాపించినను ఉత్సాహముతో పూ నును. ఆమె యెట్టి కష్టములు వచ్చినను వెనుదీయదు.

విశేషములు: నీడకన్నును నెండకన్నును ఎఱుంగ కుండుట - రాణి వాసమును వీడి బయటికి రానిదని భావము. అసూర్య పశ్యయనుట. కర్మవంచిన అను పాఠము కంటె, కర్మ మంచిన (కర్మము + అంచిన), కర్మ వంచిన (కర్మువు + అంచిన) అను పాఠములు లెస్స. కర్మ+పంచిన అనుచో కర్మన్ శబ్ద తత్సమరూపము ముపర్ణక రహితముగా నుండవలసి వచ్చును. అంచిన = అనిచిన రూపాంతరము. ఈడఁ బోదు - `ఆహవోన్ముఖతకు నోల మాసగొనక మితివియ కీడం బోకనం బేళ్లు దనరు.' ఆం.నా.శే. ఇక్కడ ఆహవము లేకున్నను, కార్యోన్ముఖత అని చెప్పవలయును. ఇగ్రుచు = ఇగురుచు - అంకురించు, పుట్టు. `గు' లోని ఉత్వమునకు లోపము వచ్చిన రూపము. అగ్రుచు వంటిది. `చుక్కరక' రువర్ణంబునకు ముందఱి దువర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాషనగు, నగుచోఁ దత్పూర్వంబు గురువుగాదు. బాల. ప్రకీర్ణ - 20 ఇందు దువర్ణమునకు మాత్రమే చెప్పిన ఉత్వలోపము గువర్ణమునకు జరుగుచున్నది. ఇవర్ణము గురువు కాదు.

సీ. భక్తితో మాతృకాభవనంబులకు నేఁ గు
గావించు [4]నతి దిశాదేవతలకు
వాయసంబులకు నిర్వర్తించు దధిబలిం
గొలుచు జ్యేష్ఠాదేవి నలఘుమహిమఁ

1.తా. చాలవ కూచిన కడవంచునే లతాంగి, 2. తా. నీడజోదు, 3. తా. నిగుర్చు. 4. ము. నతిథి సత్కారములను,

జదివించుకొను బుణ్యసంహితావ్రాతంబు
మూలికామాణిక్యములు ధరించుఁ
[1]దాంబూలగంధాక్షతలు చిరంటుల కిడు
[2]విప్రశ్నికల గారవించు దఱచుఁ

గీ. గుమ్మరావంబు కడవలు కొల్ల విడుచు
బాలురకుం దియ్యపండులు పంచి యిచ్చుఁ
జెలులు దానును[3]రేలు పోచిళ్ళు వోవుఁ
దామరస[4]నేత్ర పుత్త్రసంతానకాంక్ష 40

అర్థము: తామరస - నేత్ర = తామరల వంటి కన్నులు గలది, సుశీల, పుత్త్ర - సంతాన - కాంక్షన్ = మగ సంతతి యందలి కోరికతో, మాతృకా - భవనంబులకున్ = పార్వతీ దేవి ఆలయములకు లేదా సప్త మాతృకల ఆలయములకు, భక్తితోన్, ఏగున్, దిశా - దేవతలకున్ = దిక్కులయందలి దేవతలకు - ఇంద్రుడు మున్నగు దిక్పాలకులకు, నతిన్ = నమస్కారమును, కావించున్ = చేయును. వాయసంబులకున్ =కాకులకు, దధి-బలిన్ = పెరుగు బలిని, నిర్వర్తించున్ = చేయును, జ్యేష్ఠా - దేవిన్ = పెద్దమ్మను, అలఘు - మహిమన్ = తక్కువకాని (గొప్ప) మహిమ గలదానిని, కొలుచున్ = సేవించును. పుణ్య - సంహితా - వ్రాతంబున్ = పవిత్రమైన, వేదభాగములయొక్క, సమూహమును, చదివించుకొనున్, మూలికా - మాణిక్యములు = మూలి కలను, మణులను, ధరించున్. చిరంటులకున్ = ముత్తయిదువులకు, తాంబూల - గంధ + అక్షతలు = తాంబూలమును, గంధమును, అక్షతలును, ఇడున్ = ఇచ్చును, తఱచున్ = తఱచుగా, విప్రశ్నికలన్ = సోదె చెప్పువారిని, గారవించున్ = ఆదరించును. కుమ్మర + ఆవంబు = కుమ్మరి కాల్చుట కేర్పఱిచిన కుండల దొంతర యందలి, కడవలు = కుండలు, కొల్ల విడుచున్ = యథేచ్ఛముగా ననుభవింపనిచ్చును, బాలురకున్, తియ్యపండులు, పంచి + ఇచ్చున్ = పంచి పెట్టును. రేలు = రాత్రులు, చెలులున్ + తానును =చెలికత్తెలును దానును, పోచిళ్ళు+పోవున్ = శకునము చూచుటకై యిరుగు పొరుగిండ్ల మీద అక్షతలు నీళ్లు చల్లును.

తాత్పర్యము : పద్మాక్షి యగు నా సుశీల పుత్త్ర సంతాన కాంక్షతో భక్తితో, పార్వతీదేవి యాలయములకు నేగును. దిక్పాలకులకు నమస్కరించును. కాకులకు పెరుగు బలిని నిర్వర్తించును. గొప్ప మహిమ గల జ్యేష్ఠాదేవి నర్చించును. పవిత్రములైన వేద భాగములను చదివించుకొనును. మూలికలను మాణిక్యములను, ధరించును. ముత్తయిదువులకు తాంబూలము, గంధము, అక్షతలు నిచ్చును. తఱచుగా సోదె

1 ము. దన్వంగి, 2. తా. విప్రకన్యలు, 3. ము. వ్రతములు సలుపుచుండు, 4. తా. నేత్రి.

చెప్పు వారిని ఆదరించును. కుమ్మరి వాని ఆవమందలి కుండలను యథేచ్ఛముగా ననుభవింప నిచ్చును. బాలురకు తీయని పండ్లు పంచిపెట్టును. రాత్రి వేళల చెలులను గూడి యిరుగు పొరుగిండ్ల మీద అక్షతలు, నీళ్లు చల్లును.

విశేషములు: శ్రీనాథుని నాటి సంఘమున పుత్త్ర సంతానార్థులగు వారు చేయు పనులన్నియు నిందు చెప్పబడినవి. మాతృక = పార్వతి (శ.ర.) బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ - అను సప్తమాతృక లని యేని చెప్పవచ్చును. దిశాదేవతలు - ఇంద్రుడు, అగ్ని,యముడు, నిరృతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానుడు. జ్యేష్ఠాదేవి లక్ష్మి యక్క, ఒకానొక శివశక్తి (వై.ని.), సంహిత = మంత్ర రూపమయిన (ఛందోబద్ధమైన) వేద భాగము, చిరంటి - `చిరణ్టీ తు సువాసినీ-' అమరము. చిరిణోతి హినస్తి అమఙ్గళాని - చిరంటీ. అమంగళములను చెఱుచునది. చెలులు దానును పోచిళ్లు వోవు - ఆత్మార్థం బభిహితంబగుచో దల్లింగ సంఖ్యాభిధాయి వచనంబు ధాతు విశేషణంబుల కగు. బాల. క్రియ. 120. రేయి (ఏక) - రేలు (బహు.వ.)

వ. ఇవ్విధంబునం [1]బుణ్యోపవాస వ్రత దాన ధర్మ దేవతారాధనంబులం[2] బ్రతిబంధ దోషంబులుం బాసిన[3] నా సుశీలా దేవియందుం బ్రతిమా చంద్ర బింబంబు సరసియందునుంబోలె గర్భం బావిర్భవించిన. 41

అర్థము: ఈ + విధంబునన్ = ఈ రీతిగా, పుణ్య+ఉపవాస - వ్రత - దాన - ధర్మ - దేవతా + ఆరాధనంబులన్ = పుణ్యములైన యుపవాసములు, వ్రతములు, దానములు, ధర్మములు, దేవతా పూజలు ననువానిచేత, ప్రతిబంధ - దోషంబులున్ = గర్భము గలుగుట కాటంకములైన దోషములు, పాసినన్ = తొల గ గా, ఆ - సుశీలా దేవియందున్, ప్రతిమా - చంద్ర - బింబంబు = ప్రతిబింబమైన చంద్రమండలము, సరసియందునన్ + పోలెన్ = సరస్సు నందు వలె, గర్భంబు = చూలు, ఆవిర్భవించినన్ = పుట్టగా.

తాత్పర్యము: ఈ రీతిగా పుణ్యములైన వ్రతములు, దానములు, ధర్మములు, దేవతా పూజలు ననువానిచేత గర్భము గలుగుటకాతంకములు తొలగుటతో సరస్సునందు చంద్ర బింబము ప్రతిబింబము వలె నా సుశీలదేవియందు చూలేర్పడగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ప్రతిమా చంద్ర బింబంబు సరసియందునుంబోలె - ఉపమ. సరసియని స్త్రీలింగ శబ్దమునువాడుట సుశీలాదేవితోడి ఔపమ్యము కొఱకు. సరసియందు నుంబోలె - `కొన్ని యెడల ద్రుతంబుమీద నకారంబు గానంబడియెడి.' - బాల. సంధి. 21

1. తా. పుణ్యవ్రతోపవాస, 2. తా.లు., 3. ము. నా సుదతీలలామంబు మెఱసి.

సీ. అభ్యంతరస్థాగ్ని యగు శమీలతవోలె
నిధిగర్భ యగు నబ్ధి[1]నేమివోలె
[2]నంతస్థ్స దిగ్దంతి యగు వియన్నదివోలె
శశికుక్షి యగు నస్త సంధ్యవోలె
నాలీన హర్యక్షయగు నద్రిగుహవోలెం
వినయధారిణి యగు[3] విద్యవోలె
[4]జలదాంతరిత యగు నలినాప్తరుచివోలె
సూనృతాభిధ యగు సూక్తివోలె

గీ. నాదిమబ్రహ్మ సంభరితోదర యగు
కైటభారాతి నాభ్యబ్జ[5] కళిక వోలె
నధిగతాగస్త్య యగు దక్షిణాశవోలెఁ
బ్రథమగర్భంబు ధరియించెఁ బల్లవోష్ఠి

అర్థము: పల్లవ + ఓష్ఠి = చిగురు వంటి పెదవి గల సుశీల, అభ్యంతర - స్థ+ అగ్ని + అగు = లోపలనున్న అగ్ని కలది యగు, శమీ - లత+పోలెన్ = జమ్మి తీగవలెను, నిధి - గర్భ + అగు = నిధి గర్భమందు గలది అగు, అబ్ధి - నేమి + పోలెన్ =సముద్రము నేమి (పట్టా) గా గలది - భూమివలె, అంత - స్థ- దిక్+దంతి + అగు = లోపల దిగ్గజములు గలది యగు, వియత్+నది+పోలెన్ = ఆకాశగంగా నది వలె, శశి-కుక్షి+అగు = చంద్రుడు గర్భమందుగల, అస్త-సంధ్య+ పోలెన్ = సాయంసంధ్యవలె, ఆలీన - హర్యక్ష+ అగు = లోపల నున్న సింహము గలదియగు, అద్రి - గుహ + పోలెన్ = కొండ గుహవలె, వినయ - ధారిణి + అగు = వినయమును ధరించినది యగు, విద్య + పోలెన్ = విద్యవలె, జలద + అంతరిత + అగు = మేఘము లోపల నున్నది యగు, నలిన+ఆప్త - రుచి + పోలెన్ = తామరలకు బంధువైన సూర్యుని యొక్క కాంతివలె, సూనృత + అభిధ + అగు = సత్యమును వహించునట్టి, సు+ఉక్తి + పోలెన్ = మంచి మాటవలె, ఆదిమ..... అగు: ఆదిమ = మొదటి, బ్రహ్మ =బ్రహ్మతో, సంభరిత = నిండిన, ఉదర + అగు = మధ్యభాగము గలది యగు, కైటభ... పోలెన్: కైటభ + అరాతి = కైటభుడను రాక్షసుడు శత్రువుగా గల విష్ణువు యొక్క, నాభి+అబ్జ-కళిక + పోలెన్ = తామరమొగ్గవంటి నాభివలె. అధిగత + అగస్త్య = పొందబడిన అగస్త్యుడు (అగస్త్య నక్షత్రము) గలది, అగు, దక్షిణా + ఆశ + పోలెన్ = దక్షిణ దిక్కువలె, ప్రథమ -గర్భంబున్ = తొలిచూలును, ధరియించెన్ = తాల్చెను.

---

1. ము. నిలయ, 2. తా. నసమగ్న 3. ము. వినత, 4. ము. నస్తాంతరితయగు, 5. ము. కమును బోలె.

తాత్పర్యము: చిగురువంటి పెదవి గల సుశీల శమీలత అగ్నిని వలెను, భూమి నిధిని వలెను, ఆకాశగంగ దిగ్గజములను వలెను, సాయంసంధ్య చంద్రుని వలెను, పర్వతగుహ సింహమునువలెను, విద్య వినయమును వలెను, సూర్యకాంతి మేఘమును వలెను, సూక్తి సత్యమును వలెను, విష్ణుని నాభికమలకళిక ప్రథమ బ్రహ్మను వలెను, దక్షిణదిక్కు అగస్త్యనక్షత్రమును వలెను తొలిచూలిని ధరించెను.

విశేషములు: ఒక్క సుశీలను బహు వస్తువులతో పోల్చుట వలన నుల్లేఖాలంకారము. `ఏకేన, బహుధోల్లేఖేప్యసౌ విషయభేదతః'. సుశీలకు చెప్పిన ఉపమానముల వలన నామె గొప్పతనము, పవిత్రత తెలియుచున్నవి. అవి. శమీలత, అబ్ధినేమి, వియన్నది, అస్త సంధ్య, విద్య, నలినాప్తరుచి, సూక్తి, కైటభారాతి నాభ్యబ్జ కళిక, దక్షిణాశ అనునవి. సుశీలకు చెప్పబడిన ఉపమానములన్నియు స్త్రీలింగ శబ్దములగుట గమనింప దగినది. సుశీలా గర్భస్థ పిండమునకు చెప్పబడిన యుపమానములు అగ్ని , నిధి, దిగ్దంతి, శశి, హర్యక్షము, వినయము, జలదము, సూనృతము, ఆదిబ్రహ్మ, అగస్త్యుడు అనునవి కూడ ఉదారమయినవే. అయినను తద్గర్భ సంజాతుడగు సుకుమారుడు తద్భిన్ను డగుట వింత. శమీ గర్భమున నగ్నియుండుననుట ప్రసిద్ధము అగ్నిగర్భాం శమీ మివ'. శిశు. 4-2. అబ్ధినేమి = The earth. Apte. `అజయ దేకరథేన స మేదినీ ముదధినేమి మధిజ్యశరాసనః' రఘు. 9-10. నేమిః, నేమీ రెండును గలవు. వియత్ + నది = వియన్నది - అనునాసిక సంధి, వినయ సమన్విత యగు విద్యయే శోభిల్లును. సూనృత యుక్తయగు సూక్తియే యొప్పును. సంభరిత + ఉదర = సంభరితోదర - గుణసంధి, కైటభ + అరాతి = కైటభారాతి - సవర్ణదీర్ఘసంధి. నాభి + అబ్జ = నాభ్యబ్జ - యణాదేశ సంధి. సు + ఉక్తి = సూక్తి - సవర్ణదీర్ఘసంధి. పల్లవ + ఓష్ఠి = పల్లవోష్ఠి - సమాసమున అకారాంత పదములకు ఓతు, ఓష్ఠ అను పదములు పరములగునపుడు వృద్ధ్యాదేశము వైకల్పికము. వృద్ధి రానియపుడు పరరూప మేకాదేశమగును. పల్లవోష్ఠి - పరరూపము, పల్లవౌష్ఠి - వృద్ధి. సూనృతాభిధయగు సూక్తివోలె - ప్రాదియతి.

గీ. [1]పలుచఁ బాఱెను గండదర్పణయుగంబు
నవ మధూక ప్రసూనంబు [2]నవ మధుకర
[3]మానుగతిఁ జూచుకంబులు నసితమయ్యె
నవతి పూబోండ్ల యాననాబ్జముల తోడ. 43

అర్థము: గండ - దర్పణ - యుగంబు = అద్దముల వంటి, చెక్కిళ్ల, జంట, పలుచబాఱెను = కృశించెను, నవ-మధుకరము = క్రొత్త తుమ్మెద, నవ- మధూక - ప్రసూనంబున్ = కొత్త ఇప్ప పువ్వును, అను -గతిన్ = త్రావు విధమున,

1. తా. పలచ, 2. తా. నవమతించె.

చూచుకంబులున్ = చనుమొనలుకూడ, సవతి - పూబోండ్ల = సవతులైన స్త్రీల యొక్క, ఆనన + అబ్దములతోడన్ = పద్మములవంటి ముఖములతో పాటు, అసితము + అయ్యెన్ = నల్లబడెను.

తాత్పర్యము: ఆ సుశీలకు అద్దములవంటి చెక్కిళ్ళు పలుచబడెను. క్రొత్త యిప్పపువ్వును కొదమ తుమ్మెద అనునట్లు ఆమె స్తనాగ్రములును సవతుల ముఖపద్మములతో పాటు నల్లబడెను.

విశేషములు: నవ మధూక ప్రసూనంబు నవమధుకర మానుగతి జూచుకములు నసిత మయ్యె సవతి పూబోండ్ల యాననాబ్దములతోడ - సహోక్తి. `సహోక్తి స్సహభావశ్చే ద్భాసతే జనరఞ్జనః.' సహభావము జనరంజకముగా నుండునేని సహోక్త్యలంకారము. సవతుల ముఖపద్మములతోపాటు సుశీల స్తనాగ్రములును నల్లబడెనని యాహ్లాదకరమైన సహభావము చెప్పబడినది గావున నది సహోక్తి యగుచున్నది. సుశీల గర్భవతి యయ్యెనను నసూయచే సవతుల ముఖములు మాడి పోయెనని భావము. మధూకము = ఇప్ప. `దూర్వావతా పాణ్డుమధూకదామ్నా' కుమా. సం. 7-14. నవ మధూకము - మధూకము `నవ' మయినచో ఇంచుక స్థిరముగా పువ్వుపైనాని మధువానుచు, పుష్పమే నల్లబడెనను భ్రాంతిని గలిగించును. పూబోడి ఏకవ. పూబోండ్లు. బహువ. సమానము బహువ్రీహి - చూడు పూర్వవ్యాఖ్య. చెక్కిళ్లు పలుచబడుటయు, చూచుకములు నల్లబడుటయు గర్భవతుల లక్షణము.

చ. మనమున నుత్సవం బొసగె మంత్రికిఁ [1]బట్టపుదేవి గర్భశో
భనమునఁ [2]జేసి వెల్వెలగఁ బాఱిన ముద్దుల నెమ్మొగంబుతో
ఘనసమయంబునందుఁ బొడకట్టిన చల్లని తూర్పు గాలిచే
ననిచిన కన్నె గేదగికి నచ్చిన కూరిమి చుట్టమో యనన్. 44

అర్థము: పట్టపు - దేవి = పట్టమహిషి - సుశీల, గర్భ - శోభనమునన్ + చేసి = గర్భమనెడి శుభముచేత, వెల్వెలగఁ బాఱిన = వెలవెల బోయిన, ముద్దుల - నెమ్మొగంబుతోన్ = సుందరమైన నిండు మోముతో, ఘన-సమయంబునందున్ = మేఘకాలమున - వర్షాకాలమున, పొడకట్టిన = కనబడిన, చల్లని - తూర్పుగాలికిన్ = తూర్పు వైపు నుండి వీచు చల్లని గాలికి, ననిచిన = పూచిన, కన్నె - గేదగికిన్ = లే మొగలి పువ్వునకు, నచ్చిన = ప్రియమైన, కూరిమి - చుట్టము + ఓ = ఆప్త బంధువా, అనన్ = అనునట్లు, మంత్రికిన్ = మంత్రియైన యజ్ఞదత్తునకు (భర్తకు), మనమునకున్ = మనస్సునకు, ఉత్సవంబు + ఒసగెన్ = వేడుక కలిగించెను.

తాత్పర్యము: గర్భవతి యగుట యనెడి శుభము చేత వెలవెల బోయి

1. తా. బట్టము దేవి. 2. ము. బల్చనై చెలువుపైకొను.

సుందరమైన నెమ్మొగముతో సుశీల వర్షాకాలమున వీచెడి చల్లని గాలిచే పూచిన మొగలి పువ్వునకు ప్రియబంధువా యనునట్లు మంత్రి మనస్సునకు సంతోషమును కలిగించెను.

విశేషములు: గర్భవతి యైన సుశీల నెమ్మొగమును వర్షాకాలమున చల్లని తూర్పుగాలికి పూచిన లే మొగలి పూవా యనునటులున్నదని సంభావించుటచే నలంకార ముత్ప్రేక్ష. సంభావనా స్యా దుత్ప్రేక్షా. గర్భవతి మోము వెలవెల బాఱుట సహజము. మొగలి వర్షాకాలమున పూచును. కన్నెగేదగికి నచ్చిన కూరిమి చుట్టము-ఉపమాద్యోతకము. శోభనమునన్ + చేసి = `కొన్నియెడలం జేత విభక్త్యర్థక వర్ణకంబులకును వలన వర్ణకంబునకును దఱచుగఁ జేసి యను ప్రయుక్తంబగు. ప్రౌఢ.కారక. 4. వెల్వెలబాఱు - వెలవెలం బాఱు రూపాంతరము. నెమ్మొగము = నెఱ + మొగము. `అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచోఁ గానంబడియెడి.' బాల. సంధి. 39. కన్నె - గేదంగి = లేత గేదగి. `కన్నె మామిడి చెట్టు జేర్చి'- విప్ర. 3-19.

గీ. గర్భభారాలసాంగియై కంబుకంఠి
చెవి శిరీషప్రసూనంబు [1]చేర్పనోప
దెట్లు ధరియింపగానోపు హేమరత్న
కంఠికాహార కేయూర[2]కటకములను. 45.

అర్థము: కంబు - కంఠి = శంఖము వంటి కంఠము గలది - సుశీల, గర్భ - భార + అలస + అంగి + ఐ = చూలు యొక్క, బరువుచే, అలసమైన (సోమరియైన), శరీరము గలదియై, చెవిన్ = చెవియందు, శిరీష - ప్రసూనంబున్ = దిరిసెన పువ్వును, చేర్పన్ + ఓపదు = పెట్టజాలదు, హేమ - రత్న - కంఠికా - హార - కేయూర - కటకములను = బంగారము, రత్నములు ననువానితో చేయబడిన కంఠహారములను, అంగదములను, కడియములను, ఎట్లు - ధరియింపగాన్ + ఓపున్ = ఏ విధముగా -ధరింపగలదు? ఏ విధముగను ధరింపజాలదనుట.

తాత్పర్యము : శంఖమువంటి కంఠము గల యా సుశీల గర్భభారముచే నలసమైన శరీరము గలదై చెవియందు అతి సుకుమారమైన దిరిసెన పూవునే ధరింప లేకపోవుచుండగా, బంగారుతోను, రత్నములతోను చేయబడిన కంఠహారములను, కేయూరములను, కడియములను ధరింపజాలదని వేఱుగా చెప్పవలయునా?

విశేషములు : అలంకారము కావ్యార్థాపత్తి. కైముత్యేనార్థసంసిద్ధిః కావ్యార్థాపత్తి

1. తా. ఁజతచనోప, 2. తా. కంకణములు

రిష్యతే.' కైముత్యముచే నర్థసంసిద్ధి యగునేని. కావ్యార్థాపత్త్యలంకార మగును. కిముత శబ్దము యొక్క భావము కైముత్యము. `కిముత' అనగా `ఇంకెంత' అని అర్థము. అతి సుకుమారమై తేలికదైన దిరిసెన పువ్వునే ధరింపజాల కుండెనని చెప్పునప్పుడామె మిక్కిలి బరువైన హేమరత్నాభరణములను మొదలే ధరింపజాలదని వేఱుగా చెప్పవలయునా యనుటచే నిందలి యలంకారము కావ్యార్థాపత్తి. పుష్పములలో శిరీష మతి మృదువైనది. `శిరీషపుష్పాధిక సౌకుమార్యౌ బాహూ తదీయావితి మే వితర్కః.' కు.సం. 1-41. కేయూర - భుజాభరణములు, కటకములు - పాదాభరణములు.

క. ఎలదోఁట తీగె యుయ్యేల
కలకంఠికిఁ [1]చిన్ననాటి కతలై తోఁచెం
జెలువకుఁ బాదాంబుజములు
[2]గిలిగింతలు వోవు ఁగేలిగిరివార్తలకున్. 46

అర్థము: కలకంఠికిన్ = మనోజ్ఞమైన కంఠముగల సుశీలకు, ఎల-తోఁట - తీగె -ఉయ్యేల = ఉద్యాన వనమునందలి తీగె ఉయ్యేల, పిన్న - నాటి - కతలు + ఐ = చిన్ననాటి కథలు మాత్రమేయయి, చెలువకున్ = స్త్రీకి (సుశీలకు), పాద + అంబుజములు = పద్మముల వంటి పాదములు, కేలి - గిరి - వార్తలకున్ = క్రీడా పర్వతము యొక్క సమాచారమునకు, గిలిగింతలు + పోవున్ = చక్కిలిగింతలు గలది యగును. గర్భవతి కాక ముందు బాగుగా క్రీడా పర్వత విహారము చేసి యుండుటచే, ఇప్పుడట్లు చేయజాలమి, ఆ మాట వినగనే ఆమె పూర్వస్మృతి కలిగి ఆమెకు పాదములు గులగులలాడును.

తాత్పర్యము: గర్భవతియగు సుశీల కుద్యానవనమునందలి తీగె యుయ్యేల నూగుట పిన్ననాటి కథలుగా తోచెను. అనగా చిరకాలపు కథలుగా ననిపించెను. ఆమెకు క్రీడాపర్వతవిహారవార్తలను వినిన మాత్రముననే పాదపద్మములకు చక్కిలిగింత పెట్టినట్లగును.

విశేషములు: ఎల + తోట = లేత తోట - ఎల యంద్రు తరుణ మనుటకు'- ఆం. నా.శే. ఉయ్యేల - ఊయెల, ఉయేల, ఊయేల, ఉయ్యేల, ఊయాల, ఉయాల, ఉయ్యాల, ఊయాల, ఉయ్యాల రూపాంతరములు. `ఊయేల యూయాలల చాపుల నొండొంటికిం గుఱుచ యొండెనగు.' బా.ప్ర. 4. `ఊయేలాదులం దొలియచ్చుమీది హల్లునకు ద్విర్వచనం బొండెనగు.'- బా. ప్ర. 6. చిన్ననాటి కతలు - ఇప్పటివి కావు. కేలిః, కేలీ - రెండును కలవు.

1. ము. చిన్ననాఁటి 2. గిలిగింతలు గొలుపుఁగేలిగిరి గుహలందున్

శా. ఆ సారంగవిలోలలోచనను గాఢాలింగనక్రీడల
న్వాసాగారము కేలితల్పము పయి న్మన్నించి మంత్రీశుఁ డ
త్యా[1]సక్తిం జవిచూచు నెట్టుకొని మృత్స్నాస్వాదన ప్రక్రియా
వ్యాసంగంబు[2]నఁ గమ్మనైన యదసీయంబైన బింబోష్ఠమున్. 47

అర్థము: మంత్రి + ఈశుండు = మంత్రులలో శ్రేష్ఠుడైన యజ్ఞదత్తుడు, ఆ - సారంగ - విలోల - లోచనను = లేడి కన్నుల వలె, మిక్కిలి చంచలము లయిన, కన్నులు గల యా సుశీలను, గాఢ + ఆలింగన - క్రీడలన్ = బిగువైన, కౌగిలింతలనెడి, ఆటలచేత, వాస + అగారము = నివసించు నింటి యందలి, కేలి - తల్పముపయిన్ = క్రీడార్థమయిన పాన్పు మీద, మన్నించి = ఆదరించి, మృత్స్నా+ఆస్వాదన = ప్రక్రియా - వ్యాసంగంబునన్ = మంటియొక్క - తినుట - అను పని యొక్క - సంబంధముచేత - మంటిని తినుటచేత, కమ్మన + ఐన +కమ్మని రుచిగలదైన, అదసీయంబు + ఐన = దీని (సుశీల) సంబంధమైన, బింబ + ఓష్ఠమున్ = దొండపండు వంటి క్రింది పెదవిని, అతి + ఆసక్తిన్ = మిక్కిలి కోరికతో, నెట్టుకొని = విజృంభించి, చవిచూచున్ = రుచి చూచును.

తాత్పర్యము: మంత్రి శ్రేష్ఠుడైన యజ్ఞదత్తుడు లేడి కన్నుల వలె చంచలములైన కన్నులు గల యా సుశీలను ఇంటి యందలి పాన్పుపై బిగి కౌగిలింతలచే నాదరించి, మంటిని తినుటచే కమ్మనైన యామె దొండపండువంటి క్రింది పెదవిని మిక్కిలి యాసక్తితో రుచిచూచును.

విశేషములు: భర్త భార్య నాదరించు విధము స్వభావసుందరముగా వర్ణింపబడుటచే నిందలి యలంకారము స్వభావోక్తి. `స్వభావోక్తి స్స్వభావస్య జాత్యాదిస్థస్య వర్ణనమ్.' సారంగ - సార + అంగ - పరరూప సంధి. శకంధ్వాదులలోనిది. `సారాణ్యఙ్గాని యస్య సః సారంగః - అమరము. `సారంగ శ్చాతకే భృంగే కురంగే చ మతంగజే - అమరము. అత్యాసక్తి - అతి + ఆసక్తి - యణాదేశ సంధి. గర్భవతులు మట్టిని తినుటయందు మక్కువ జూపుదురు. మృత్స్నా - `ప్రశస్తా తు మృత్సా మృత్స్నా చ మృత్తికా'- అమరము. ప్రశస్తమైన మట్టిపేరు. మృత్సా - రూపాంతరము. అదసీయము - అదస్ + ఈయ, సంబంధార్థమున `ఈయ' ప్రత్యయము. బింబోష్ఠము = బింబ + ఓష్ఠము. చూడు - 42 లోని పల్లవోష్ఠి వ్యాఖ్య. ఓష్ఠబింబము - అని ఉపమానోత్తరపద కర్మధారయముగా నుండుటకు బదులు, బింబోష్ఠమని ఉపమాన పూర్వపదముగా నుండుట విశేషము. `ఉపమానోత్తర పదంబులు గలవు గాని విపరీతంబులు సిద్ధంబులు లేవని యెఱుంగునది.' బాల. సమాస. 3.

---

1. ము. సంగం బొనరించె ముద్దుగొనె. 2. తా.ను.

క. జలరుహనాభుని వక్ష
స్థ్సలి కౌస్తుభమునను, [1]మృడుని జడముడి యుడురా
ట్కలికాలంకృతి వోలెం
బొలఁతుక ప్రత్యగ్రగర్భమున నొప్పారెన్ 48.

అర్థము: జలరుహ - నాభుని = పద్మము నాభియందు గలవాని యొక్క, (విష్ణువుయొక్క), వక్షస్ + స్థలి = ఱొమ్ము ప్రదేశము, కౌస్తుభమునను = కౌస్తుభమనెడి మణి చేతను, మృడుని - జడముడి = ఈశ్వరుని - జటాజూటము, ఉడురాట్ + కళికా + అలంకృతిన్ = చంద్రకళ అనెడి అలంకారముచేతను, పోలెన్ = విధమున, పోలఁతుక = స్త్రీ, (సుశీల), ప్రత్యగ్ర - గర్భమునన్ = నూతన గర్భము చేత, ఒప్పారెన్ = ఒప్పెను.

తాత్పర్యము: విష్ణుని వక్షస్థలి కౌస్తుభమణి చేతను, ఈశ్వరుని జడముడి చంద్రకళ అనెడి అలంకారముచేతను వలె సుశీల నూతనగర్భము చేత నొప్పెను.

విశేషములు: జలరుహనాభ - బహువ్రీహి సమాసాంతమున `నాభి' శబ్దమునకు అచ్ ప్రత్యయము వచ్చును. కౌస్తుభ - కుం స్తోభత ఇతి కుస్తుభో హరిః, తస్యాయం కౌస్తుభః, భూమిని నిలిపిన విష్ణుని సంబంధమైనది. లేదా కుం స్తుభ్నాతి వ్యాప్నోతి కుస్తుభ స్సముద్రః - తత్ర భవతీతి కౌస్తుభః. సముద్రమందు పుట్టినది. `కౌస్తుభో మణిః.' అమరము. మృడ - `భూతేశః ఖండపరశుర్గిరిశో గిరిశో మృడః.' అమరము - మృడతి సుఖయతి భక్తా నితి మృడః - భక్తులను సుఖింపజేయువాడు. ఉడురాట్ = ఉడువులకు నక్షత్రములకు రాజు - చంద్రుడు. కలికా = కళ - సూ.ని. - స్థలి = స్త్రీలింగ శబ్దము సుశీలతోడి ఔపమ్యమునకు. పొలఁతుక - పొలతి + ఉక - `ఉకవర్ణకంబు చిఱుతాదులకు స్వార్థంబు నందగు.' బాల. తద్ధిత. 10. ప్రత్యగ్ర - `ప్రత్యగ్రోఽ భినవో నవ్యో నవీనో నూతనో నవః, నూత్నశ్చ' ప్రతిగత మగ్ర మస్యేతి - ప్రత్యగ్రః - పొందబడిన కొనగలిగినది - అమరము. అలంకారము ఉపమ.

వ. ప్రతిదివసోప [2]చీయమానగర్భనిర్భర [3]యగు న య్యాదిగర్భేశ్వరి కౌముదీ [4]మహోత్సవంబునం బ్రియసఖీవిలోచన చకోరి[5]కలం గోరికలు నిండించి వెండియు.49

అర్థము: ప్రతి .... నిర్భర : ప్రతిదివస = ప్రతిదినమును, ఉపచీయమాన = వర్ధిలుచున్న, గర్భ = చూలుచే, నిర్భర = పూర్ణమైనది, అగు, ఆ + ఆదిగర్భేశ్వరి = ఆ ఆగర్భశ్రీమంతురాలయిన సుశీల, కౌముదీ - మహా - (మహత్) + ఉత్సవంబునన్ = కౌముదీ మహోత్సవమునందు, ప్రియ..... చకోరికలన్: ప్రియ - సఖీ =

1. ము.దీప్తిఁ దనరెడు మణిరా. 2. తా. నీయమాన. 3. ము. యగుచు నయ్యాది 4. ము. విలసనంబునుం బోలె 5. ము. కలకు.

అనుగుజెలియొక్క, విలోచన - చకోరికలన్ = ఆడు జక్కవలవంటి కన్నులయందు, కోరికలు, నిండించి = తీర్చి, వెండియున్ = మఱియును.

తాత్పర్యము: దినదినము నభివృద్ధి పొందుచున్న చూలుచే నిండైనది యగు ఆ ఆగర్భశ్రీమంతురాలు సుశీల కౌముదీ మహోత్సవమున తన యనుగుజెలివైన ఆడుజక్కవలవంటి కన్నులయందు కోరికలు తీర్చి, మఱియును - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ఉపచీయమాన - `ఉప' తో గూడిన `చి' ధాతువు కర్మణ్యర్థక శత్రంత రూపము = వృద్ధిపొందింపబడు చున్న. ఆ + ఆది - యడాగమ త్రికసంధులు - ఆయ్యాది. `సంధి లేనిచోట స్వరంబుకంటెంబరంబయిన స్వరంబునకు యడాగమం బగు.' బాల. సంధి. 3. ఆ + యాది. `త్రికంబు మీది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు.' బాల. సమాస. 14. ఆ+య్యాది. `ద్విరుక్తంబగు హల్లు పరంబగునపు డాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు.' బాల. సమాస. 13 అయ్యాది. చకోరిక - ఆడు జక్కవ - వెన్నెల పులుగు. కౌముదీ మహోత్సవము గావున విలోచనములకు చకోరికలతో పోలిక. సుశీలను నిండు చూలాలినిగా చూచుటయే చెలి కన్నుల కోరికలను నిండించుట.

చ. బహుదినముల్ మహాసచివు [1]పట్టపుదేవికి వృద్ధింబొఁదె దు
స్సహనవగర్భ[2] చిహ్నములు సాగి సఖుల్ ప్రియ మందగా ముహు
ర్ముహురనుబద్ధజృంభితసముద్గతవిహ్వల[3]లోలనేత్రముల్
జహదజహ త్సమగ్ర పురుషాయితకేలి విజృంభణంబు[4]లై. 50

అర్థము: మహా (మహత్) - సచివు - పట్టము - దేవికిన్ = మహామంత్రి యగు యజ్ఞదత్తుని యొక్క, పట్టపుదేవియైన సుశీలకు, ముహుః...... నేత్రముల్ : ముహుః + ముహుః = మాటిమాటికి, అనుబద్ధ = అనుబంధించినట్టి (ఒకటి తరువాత నొకటిగా వచ్చునట్టి), జృంభిత = ఆవులింతల వలన, సముద్గత = బయల్వెడలినట్టియు, విహ్వల = స్వాధీనత తప్పినట్టియు, లోల = చంచలములైన, నేత్రముల్ =కన్నులు గలిగినవియును, జహ...... విజృంభణంబులై : జహత్ + అజహత్ = విడుచుచున్న, విడువని, సమగ్ర = సంపూర్ణమైన, పురుషాయిత - కేలి = పురుషునివలె నాచరించు క్రీడయొక్క, విజృంభణంబులు + ఐ = అతిశయము గలవియునై, దుస్సహ - నవ - గర్భ - చిహ్నములు = సహించుటకు శక్యముకాని, తొలి, చూలి, చిన్నెలు, బహు - దినముల్ = పెక్కునాళ్లు, సాగి = ప్రవర్తిల్లి, సఖుల్ = సుశీల చెలికత్తెలు, ప్రియము + అందగాన్ = సంతోషింపగా, వృద్ధిన్ + పొందెన్ = అధికమయ్యెను.

1. తా. పట్టముదేవికి. 2. ము. సంగ్రహము. 3. ము. నేత్రపద్మముల్ 4. ము.లున్

తాత్పర్యము : మహామంత్రి యగు యజ్ఞదత్తుని భార్యయైన సుశీలకు మాటిమాటికి నొకటి తరువాత నొకటిగా వచ్చు నావులింతల వలన కలిగిస్వాధీనత తప్పి చంచలములైన కన్నులు గలిగినవియును, విడుచు చున్న, విడువని సంపూర్ణ పురుషాయిత క్రీడయొక్క అతిశయము గలవియునైన దుర్భరములైన తొలిచూలి చిన్నెలు ఆమె చెలికత్తెలు సంతోషింపగా పెక్కునాళ్లు సాగి అధికమయ్యెను.

విశేషములు: ఇందు అధస్సూచికలోని `చిహ్నములు' అను పాఠము గ్రహింపబడి, సంగ్రహము అనుపాఠము త్యక్తమయినది. పరిష్కర్త కల్పితమైన `జాడ'కు బదులు `సాగి' యను పాఠము కల్పింపబడినది. అప్పుడు `ముహుర్ముహు.....నేత్రముల్, జహదజహత్.....విజృంభణంబులు' అను నవి `చిహ్నములు' అనుదానికి విశేషణములై అన్వయము కొంత సుగమమయినది. సుశీలకు రాకరాక వచ్చిన గర్భమగుటచే నామె చెలికత్తెలకు సంతోషము. గర్భభారము వలని అలసటచే మాటిమాటికి, ఒక దాని వెంబడి నొకటిగా నావులింతలును, వానివలన కన్నులు స్వాధీనత తప్పుటయు కలుగును. గర్భవతి కాక పూర్వమామె సమగ్ర పురుషాయిత క్రీడచే భర్తను సంతోషపెట్టు చుండెడిది. ఇప్పుడు ఆమె గర్భవతియై నెలలు గడచుకొలదియు గర్భభార మధికమై ఆ సమగ్ర పురుషాయితక్రీడ విడుచు చున్నది. విడిచి పెట్టలేకున్నదియు. ఆ చిన్నెలు `బహుదినములు' సాగెను. అవి సాగిన కొలది ఆమె చెలకత్తెలకు ప్రియము. పురుషాయిత - సంభోగ సమయమున స్త్రీ పురుషుని వలె నాచరించుట, ఆ సమయమున నది యొక ముచ్చట. పురుషాయితము = ఉపరతి. తెలుగు `మగలాగు, మగపాడి' పురుషాయితకేలి-పురుషవ దాచరితా కేలిః -పురుష శబ్దము క్యఙ్ప్రత్యయాంత మయినది. ఇందు `ష' కారమునకు దీర్ఘము వచ్చినది కాని దాని పై `ఆ' కారము లేదు. కావున షకారమునకే `యతిమైత్రి చెల్లును గాని అకారమునకు చెల్లదు. అందుచేతనే `జ - షా.' లకు మైత్రి పొసగెను. పట్టము + దేవి = పట్టపుదేవి - `కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు.' సుశీలను పట్టపుదేవి యనుటచే, `సవతి పూబోండ్ల యానవాల్లములతోడ' ననుట (43 ప.).ముహుః + ముహుః + అనుబద్ధ-`అ, ఆ లు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులుకాని, మృదుహల్లులుకాని పరములగునపుడు రేఫ మాదేశమగును. జహత్ + అజహత్-అనునాసికాంతస్థ వర్ణములు తప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని, అచ్చులు కాని పరమగునపుడు ఆ హల్లుల వర్గమునకు చెందిన తృతీయ వర్ణమాదేశముగా వచ్చును. విజృంభణంబులు ను + ఐ = ఇచ్చట సముచ్చయమునకు లోపము. నామములకు గడపల సముచ్చయమునందు ను శబ్దంబు తఱచుగనగు ననుటచే కొన్నిటి కొకప్పుడు వచ్చును. ఒకప్పుడు రాదని యర్థము గ్రహింపవలెను. ప్రౌఢ. శబ్ద. 116. ఇది శ్రీనాథుని మహా రసికతకును, లోకజ్ఞతకును నిదర్శనము. గర్భవతిని స్వభావరమణీయముగా వర్ణించుటచే నిందలి యలంకారము స్వభావోక్తి

గీ. [1]అల్లనల్లన మెలఁగు ఁబద్మాయతాక్షి
సముదితంబైన గర్భభారము కతమున
సమ్యగాపీత జలరాశి సలిల[2]మైన
ప్రావృడారంభనవమేఘపంక్తివోలె. 51

అర్థము: పద్మ + ఆయత + అక్షి = తామరలవలె నిడుపులైన కన్నులు గల సుశీల, సమ్ + ఉచితంబు + ఐన = లెస్సగా గలిగిన, గర్భ - భారము - కతమునన్ = చూలి బరువు కారణముగా, సమ్యక్ + ఆపీత - జలరాశి - సలిలము = లెస్సగా, త్రావబడిన, సముద్రమునందలి, నీరు గలది, ఐన, ప్రావృట్ + ఆరంభ -నవ - మేఘ - పంక్తి + పోలెన్ = వర్షాకాలము యొక్క, ప్రారంభమునందలి, క్రొత్త మేఘముల యొక్క వరుస వలె, అల్లన + అల్లనన్ - మెల్లమెల్లగా, మెలఁగున్ = సంచరించును.

తాత్పర్యము: సముద్ర జలములను లెస్సగా త్రావిన తొలకరి మేఘముల పంక్తివలె సుశీల గర్భభారమువలన మెల్లమెల్లగా సంచరించును.

విశేషములు: గర్భభారాలసయైన సుశీలను సమ్యగాపీత .....నవ మేఘపంక్తితో పోల్చుటవలన అలంకారముపమ. `ఉపమా యత్ర సాదృశ్యలక్ష్మీ రుల్లసతి ద్వయోః .' మేఘమనక మేఘ పంక్తి యనుట స్త్రీలింగస్వారస్యము కొఱకు. సమ్య........సవిలము - ఐన మేఘపంక్తి - `మహతీతరంబులగు.' `పంక్తి' స్త్రీలింగమయినను, మహతి గావున తద్విశేషణమైన `సమ్యగాపీత..... సలిల' కు క్లీబత్వ మయినది. `సలిల యైన' పాఠమున స్త్రీత్వమే అయినది. గర్భభారముచే గర్భిణుల గమనమును, జల భారముచే మేఘముల గమనమును మందమగును. గర్భవతిని వర్షామేఘముతో పోల్చుట రమ్యము. మేఘము నీరు మోయునట్లే, స్త్రీయు నీరు మోయును. గర్భవతి = నీరు మోసినది. సమ్యక్ + ఆపీత, ప్రావట్ + ఆరంభ - పదాంత ఝల్లునకు అచ్చుపరమగుచుండగా తృతీయవర్ణాదేశము. ఆ పీత - మిక్కిలి త్రాగబడిన. మిక్కిలిగా,త్రావిన గాని భారముండదు. ప్రావృట్ - `స్త్రియాం ప్రావృట్ '- ప్రవర్షంతి ఘనా అత్రేతి ప్రావృట్ మేఘములు దీనియందు మిక్కిలి వర్షించును. వర్షర్తువు. నవమేఘ - నవమైన మేఘమే జలముతో బరువెక్కును.

శా. [3]సీమంతోన్నయనంబు ఁబుంసవనముంజేయించె శ్రీయజ్ఞద
త్తామాత్యాగ్రణి[4]చే నృపాలకుఁడు వింధ్యాధీశ్వరుండర్మిలి
న్సామంతక్షితిపాలమంత్రు లసమానంబైన ప్రేమంబునన్
భామాహేమ తురంగ రత్నములు పైపై ఁబావడ ల్దేఁగన్. 52

1. ము. అట్లు ధవు నొద్ద 2. తా. యైన 3. ము. సీమంతోన్నతసంభ్రమంబు వెలయం. 4. ము. కన్నుపాలకుఁడు, తా. కిన్. 5.ము. సింధు.

అర్థము: వింధ్య + అధి + ఈశ్వరుండు = వింధ్య పర్వత దుర్గ ప్రభువు,అగు, నృపాలకుఁడు = రాజు (హేమాంగదుడు), అర్మిలిన్ = ప్రీతితో, సామంత - క్షితిపాల - మంత్రులు = సామంతులైన రాజులును, మంత్రులును, అసమానంబు + ఐన = సాటిలేని దగు, ప్రేమంబునన్ = ప్రీతితో, భామా - హేమ - తురంగ - రత్నములు = స్త్రీలను, బంగారమును, గుఱ్ఱములను, మణులను, పైపైన్ = అధికముగా, పావడల్ = కానుకలు, తేరఁగన్ = తీసికొని రాగా, శ్రీ - యజ్ఞదత్త + అమాత్య + అగ్రణిచేన్ = శ్రీయజ్ఞదత్తుడను మంత్రి శ్రేష్ఠునిచేత, (సుశీలకు), సీమంత + ఉన్న యనంబున్ = సీమంతోత్సవమును, పుంసవనమును చేయించెను.

విశేషములు: సీమంతోన్నయనము = గర్భవతులకు చేయు పంద్రెండు సంస్కారములలో నాలుగవ, లేక ఆఱవ, లేక ఎనిమిదవ నెలలో పాపట తీయునుత్సవము. సీమంతమనగా పాపట. ఇది గర్భవతిని పవిత్రీకరించుట కుద్దిష్టమైన సంస్కార విశేషము, సీమంతోత్సవమునే యిప్పటి వాడుకలో పూలు ముడిపించుట యందురు. పుంసవనము = గర్భచిహ్నము తెలిసిన తోడనే పురుషప్రజగా పుట్టవలెనని చేసెడి యొకానొక శుభకర్మము. అర్మిలి - `పేర్మి యర్మిలి మక్కువ కూర్మి నెమ్మి, నెనరు గాదిలి గారాము నెయ్యమింపు, ప్రేముడి యనుంగు ముద్దనం బ్రియమునకును నామధేయంబు లయ్యె -' ఆం.నా.శే. పావడలు = వస్త్రములు. పావడము = కానుక. కాని యిట కానుక యను నర్థమున పావడయని మువర్ణక రహితముగనే ప్రయుక్తమగుట విశేషము. తేరఁగన్ - తెచ్చు ధాతువు తుమంతరూపము - `తే తేరులు తెచ్చున కగు'. బాల. కి. 93 సామంతక్షితిపాల మంత్రులు అను దానికి సామంతక్షితి పాలురయొక్క మంత్రులు అని షష్ఠీతత్పురుషముగాను విగ్రహము చెప్పవచ్చును.

సీ. కమ్మగొజ్జఁగి నీట గలయంపి చల్లిరి
[1]మేగి మెత్తిరి క్రొత్త మృగమదమున
రంగవల్లులు కప్పురపు[2] ధూళిఁ దీర్చిరి
[3]కిరించి రొగి మాల్యతోరణములు
తరుణరంభా తరుస్తంభంబు లెత్తిరి
కట్టి రెల్లెడ ఁబట్టుకలువడములు
కలువచందన మాలికల [4]వినిర్మించి రు
త్తంభించి రున్నతధ్వజపతాక

1. తా. మ్రోకువెట్టిరి, 2. ము. మ్రుగ్గువెట్టిరి, 3. తా. దోరించి రొగిఁదల్యతోరణములు, 4. ము. ను నిర్మించిరి. స్తంభించి రుత్తమ దర్పణములు.

గీ. [1]లాలిఖించిరి గేహకుడ్యములయందు
సర్వతోభద్రమకరికాస్వస్తికములు
పరిజనంబులు రాజాజ్ఞ ఁబట్టణమున
యజ్ఞదత్తుని ప్రథమకల్యాణవేళ. 53

అర్థము: యజ్ఞదత్తుని ప్రథమ - కల్యాణ - వేళన్ = యజ్ఞదత్తుని, తొలి, శుభ సమయమున, రాజ+ఆజ్ఞన్ = రాజగు హేమాంగదుని యాజ్ఞచే, పరిజనంబులు = పరివారము, పట్టణమునన్ = పురమునందు, కమ్మ - గొజ్జంగి - నీటన్ = పరిమళముగల, పన్నీటితో, కలయంపి = కలాపి, చల్లిరి, క్రొత్త - మృగమదమునన్ = క్రొత్త కస్తూరితో, మేగి = పూసి, మెత్తిరి. కప్పురము + ధూళిన్ = కర్పూరపు పొడితో, రంగవల్లులు = ముగ్గులు, తీర్చిరి = పెట్టిరి, మాల్య - తోరణములు = దండలును, తోరణములును, ఒగిన్ = క్రమముగా, కేరించిరి (?) = కట్టించిరి, తరుణ - రంభా - తరు - స్తంభంబులు = లేత, అరటి, చెట్ల, కంబములు, ఎత్తిరి = ఎత్తించిరి, ఎల్ల + ఎడన్ = అంతటను, పట్టు - కలువడములు = పట్టు మేల్కట్టులు, కట్టిరి. కమల - చందన - మాలికలు = పద్మములయొక్కయు, మంచి గంధము యొక్కయు దండలు, వినిర్మించిరి = కట్టించిరి, ఉన్నత -ధ్వజ - పతాకలు = ఎత్తయిన, టెక్కెపు కంబముల జెండాలు, ఉత్తంభించిరి = నిలిపిరి. గేహ - కుడ్యములయందున్ = ఇండ్లగోడలందు, సర్వతః+భద్ర - మకరికా - స్వస్తికములు = అంతటను మంగళకరములైన మకరాకారము వంటి మంగళవస్తువులు, ఆలిఖించిరి = వ్రాసిరి.

తాత్పర్యము: యజ్ఞదత్తుని తొలి శుభ సమయమున రాజాజ్ఞచే పరిజనులు పట్టణమున పరిమళవంతమైన పన్నీటితో కలాపి చల్లిరి. క్రొత్త కస్తూరితో పూసి మెత్తిరి. కప్పురపు పొడితో ముగ్గులు పెట్టిరి. మాల్యములు, తోరణములు కట్టించిరి. లేత యరటిచెట్ల కంబముల నెత్తించిరి. ఎల్లెడలను మేల్కట్టులను గట్టిరి. కమల చందన మాలికలు నిర్మించిరి. ఉన్నత ధ్వజ పతాకల నిలిపిరి. ఇండ్లగోడలయందు అంతటను మంగళకరములైన మకరాకార మంగళ వస్తువులను లిఖించిరి.

విశేషములు: గొజ్జంగి, గొజ్జంగ, గొజ్జెంగ రూపాంతరములు. కుబ్జకః సంస్కృతము. `కుబ్జంబు గొజ్జంగి గొజ్జెంగ నాఁ జను....' ఆం.భా. 2-52.

గొజ్జంగి నీరు = పన్నీరు. కలయంపి - కలాపి -రూపాంతరములు. మేగు - మ్రేగు = పూయు. క్రొత్త మృగమదమున - నిలువయున్నచో వాసన తగ్గును. కీరించి అనియున్ననే ప్రాసయతి కుదురును. కీరించి...... తోర.... కాని `కీరించి' పదము

1 తా. అభిలిఖించిరి.

కనబడలేదు. `కిలించి' అందమన్న యతిభంగము. తాళపత్రము నందలి `దోరించి రొగి ఁదల్యతోరణములు - మొదలే అర్థమగుటలేదు. కలువడము - కల్వడము - కలువడము `చందువా మేలుకట్టనంగ, నతిశయిల్లు వితానాహ్వయములు సాంబ'. సాం.ని. మాన.19., కలువపూదండ (కైరవ వటః సం.) పట్టణము - తెలుగు, పత్తనము - సంస్కృతము. కాని పట్టణము సంస్కృత పదముగా గూడ ప్రయుక్తమయినది. `క. ఇట్టట్టన నేటికిఁ దత్పట్టణముననున్న యట్టి ప్రజలు' - కళా. 1.22. మంత్రి యింటి శుభకార్యమునకు నగరము నలంకరింప రాజాజ్ఞ యైన దనుటచే, నా రాజమంత్రుల పరస్పర సత్సంబంధము నూహించుకొనవచ్చును. ప్రథమ కల్యాణ - తొలి శుభము - కల్యాణము - శుభము, మంగళము, వివాహము. (సూ.ని.)

గీ. [1]వేడ్క నృత్యంబు లాడిరి వీథులందుఁ
బాడి [2]ఎత్తిలి పిక కుహూ పంచమమునఁ
[3]బంజళంబున ధవళప్రబంధ గీతి
[4]కనుమ యవ్వలి కర్ణాటకమలముఖులు. 54

అర్థము: కనుమ + అవ్వలి = లోయ కావల నున్న, కర్ణాట - కమల ముఖులు = పద్మములవంటి ముఖములు గల కర్ణాట స్త్రీలు, వీథులందున్ = వీథులలో, వేడ్కన్ = వేడుకతో, నృత్యంబులు + ఆడిరి = నృత్యము చేసిరి, పంజళంబునన్ = పంచాలియను గీత విశేషములతో, ధవళప్రబంధ గీతి = ఒక దినుసు పాట గల ప్రబంధగీతమును, పిక- కుహూ - పంచమమునన్ = కోకిల యొక్క కుహూ ధ్వనియొక్క పంచమ స్వరమున, ఎత్తిలి = గట్టిగా, పాడిరి.

తాత్పర్యము: విధ్య పర్వతపు లోయ కావల నున్న కర్ణాట స్త్రీలు వేడుకతో వీథులందు నృత్యములు చేసిరి. కోకిల పంచమ స్వరమున పంచాలి యను గీత విశేషముతో ధవళములను ప్రబంధగీతములను గట్టిగా పాడిరి.

విశేషములు: పంజళము తెలుగు - పంచాలీ - సంస్కృతము - గీత విశేషము. ధవళము - స్త్రీలు వివాహాదులందు పాడెడి యొక విధమగు పాట. `ధవళంబింపుగఁ బాడుచున్'... రా.వి. 5-51

మ. *అదన న్వచ్చిరి సంభ్రమంబునను ఁబంచారామ లీలావతుల్
పదునాల్గాతుల యప్సరోంగనలునుం బాలిండ్లపై హారముల్
గదలం, బెన్నెఱి సేస కొప్పుల పయింగహ్లార గుచ్ఛంబు లొ
ప్పఁ, దదీయత్వర గండభాగములఁ గంపం బొందఁదాటంకముల్ 55.

---

1. తా. వెలఁది వెన్నలఁ బ్రాసాద వీథులందు, 2. తా. రొత్తిలి, 3. తా. పంజరంబున, 4. ము. కముల నవ్వేళ. *. ఈ పద్యము తాళపత్రమునలేదు.

అర్థము: పంచారామ - లీలావతుల్ = పంచారామములందలి స్త్రీలు, పదునాల్ + జాతుల - అప్సరస్ + అంగనలునున్ = పదునాలుగు జాతుల అప్సరఃస్త్రీలును, పాలిండ్లపైన్ = స్తనములమీద, హారముల్ =ముత్యాల పేర్లు,కదలన్ = కదలుచుండగను, పెను + నె - సేస కొప్పుల - పయిన్ = పెద్దవెండ్రుకలు గల కొండెసిగలమీద, కహ్లార - గుచ్ఛంబులు =కలువ పూల గుత్తులు, ఒప్పన్ = ఒప్పగా, తదీయ - త్వరన్ = వారిదైన తొందరలో, గండ - భాగములన్ = చెక్కిళ్ల ప్రదేశములందు, తాటంకముల్ = చెవి కమ్మలు, కంపంబు + అందన్ = చలన మొందగా, సంభ్రమంబునన్ = వేగిర పాటుతో, అదనన్ = సమయమునందు, వచ్చిరి.

తాత్పర్యము : సుశీల గర్భవతి యయినప్పటి వేడుకను జూడ పంచారామము లందలి యొయ్యారులును, పదునాలుగు జాతుల అప్సరఃస్త్రీలును స్తనముల మీది ముత్యాల పేరులు కదలుచుండగను, పెద్దవెండ్రుకలుగల కొండెసిగలమీద కలువపూల గుత్తులొప్పుచుండగను, వారి గమనత్వరచేత చెక్కిళ్లయందు చెవి కమ్మలు కంపించుచుండగను వేగిరపాటుతో నా సమయమున వచ్చిరి.

విశేషములు: పెను + నెఱి = పెన్నెఱి - 'తఱుచుగఁ గర్మధారయ సమాసంబునం బెన్వాదుల కడ హల్లున కచ్చు పరంబగునపుడు ద్విత్వంబు గానంబడియెడి.' ప్రౌఢ. సంధి. 9., అదనన్ - అదను + అందున్ - 'ఔపవిభక్తికముల తృతీయాసప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగానగు.' బాల. అచ్చిక. 38., అప్సరస్ + అంగనలు = అప్సరః + అంగనలు - పదాంత సకారమునకు విసర్గాదేశము. హ్రస్వ అకారము తరువాత వచ్చు విసర్గమునకు హ్రస్వ అకారముకాని, మృదుహల్లులు (హశ్శులు) కాని పరములగునపుడు ఉ ఆదేశముగా వచ్చి పూర్వమం దున్న అకారముతోగూడి గుణసంధియై ఓ గా మాఱును. అప్సరోంగనలు. సేసకొప్పు = కొండెసిగ - 'సేసకొప్పున జాఱు చెంగల్వమొగడలు' - వసు. 4.79

కహ్లార - ఇంచుక యెఱుపును తెలుపును గలిగి మిక్కిలి పరిమళించు కలువ - సౌగంధికము. కల్హారమనియు రూపము (శ.ర.) 'సౌగన్ధికం తు కహ్లారం' - అమరము. కే జలే హ్లాదతే కహ్లారం - జలమందు సంతోషించునది. తాటంకము - దంతములోనగు వానితో చేయబడిన చెవి కమ్మ (సూ.ని.) స్త్రీలు తొందరతో వచ్చినప్పటి శృంగారమును రసజ్ఞశేఖరుడగు శ్రీనాథుడు వర్ణించుట విడిచి పెట్టడు. ఇట్టి శృంగార వర్ణనల వలననే శ్రీనాథునకు శృంగారియను మాట వచ్చినది. స్త్రీలు వచ్చునప్పటి సొగసు స్వభావరమణీయముగా వర్ణింపబడినది కావున నిందలి యలంకారము స్వభావోక్తి. 'స్వభావోక్తి స్స్వభావస్య జాత్యాదిస్థస్య వర్ణనమ్. అప్సరోంగనలునుంబాలిండ్లపై - 'కొన్ని యెడల' ద్రుతంబు మీద నకారంబు గానంబడియెడి బాల. సంధి 21

సీ. [1]పూజెకుండలు నిల్పెఁ బువ్వుఁబోఁడి యొకర్తు
శుభవితర్దిక చతుష్కోణములను
[2]జాజాలపాలికల్ సర్వౌషధుల నించి
ప్రోక్షించె జలము పద్మాక్షి యొకతె
కాంత యొక్కతె సన్నెకలుఁ బొత్తరంబును
[3]దోరించె వటశాఖతోడఁ గూడఁ
బీఠికంబులు[4]వెట్టి బింబోష్ఠి యొక్కతె
మడుగుఁ బుట్టము[5]గప్పె నడుగుమునుఁగ

గీ. రమణి యొక్కతె వింజామరంబు దాల్చెఁ
దరుణి యొక్కతె తాళవృంతంబు పూనె
లలన యొక్కతె పసిండిసఁబెల ధరించె
నాలవట్టంబు [6]వహియించె నతివ యోర్తు. 56

అర్థము: పువ్వుఁబోఁడి = పువ్వువంటి మేను గలది - స్త్రీ, ఒకర్తు = ఒకతె, శుభ - వితర్దిక - చతుః + కోణములను = శుభకరమైన అరగుయొక్క నాలుగు మూలలందును, పూజెకుండలు = ఐరేనికుండలు, నిల్పెన్ = నిలిపెను. పద్మ + అక్షి = తామరలవంటి కన్నులు గలది - స్త్రీ, ఒకతె, జాజాల - పాలికల్ = నవధాన్యముల నాటుగల మూకుడులను, సర్వ + ఓషధులన్ = ఎల్ల మూలికలతో, నించి = నిండించి, జలము = నీరు, ప్రోక్షించెన్ = చిలుకరించెను. కాంత + ఒక్కతె = ఒక స్త్రీ, వట - శాఖతోడన్ + కూడన్ = మఱ్ఱికొమ్మతో గూడ, సన్నెకలున్ = సన్నెకంటిని, పొత్తరంబును = పాత్రమును, దోరించెన్ = త్రిప్పెను. బింబ + ఓష్ఠి + ఒక్కతె = దొండపండువంటి పెదవిగల యొక స్త్రీ, పీఠికంబులు = పీఠములు, పెట్టి, అడుగు = క్రింది భాగము, మునుగన్ = మునుగునట్లు, మడుగు + పుట్టము = ఉదికిన వస్త్రమును, కప్పెన్. రమణి + ఒక్కతె = ఒక స్త్రీ, వింజామరంబు = తెల్లని చామరము, తాల్చెన్, తరుణి + ఒక్కతె = ఒక యువతి, తాళవృంతంబు - సంచెల = బంగారు అడపము (వక్కలాకుల తిత్తి), ధరించెన్ = తాల్చెను, అతివ + ఓర్తు = స్త్రీ యొకతె, ఆలవట్టంబు = వస్త్రముతో గుండ్రముగా చేసిన విసనకఱ్ఱ, వహియించెన్ = తాల్చెను.

తాత్పర్యము: ఒక స్త్రీ శుభ ప్రదమైన అరగు నాలుగు మూలలందును ఐరేని కుండలను నిలిపెను. ఒకతె నవధాన్యముల మూకుళ్లను సర్వవిధములైన యోషధులతో నించి నీటిని చిలుకరించెను. ఒక కాంత మఱ్ఱి కొమ్మలతో గూడ సన్నెకంటిని,

1.తా. పూజగుండలు నిల్పెఁబూబోడి యొక్కతె, 2. జాజాల పాలెల సర్వౌషధులు, 3. తా. దోలించె, 4. తా. పెట్టి, 5. తా. లిచ్చెగడలు మునుఁగ, 6. ము. ధరియించె.

పాత్రమును త్రిప్పెను. ఒక స్త్రీ పీఠములు పెట్టి దానిపై నడుగు మునుగునట్లు ఉదికిన వస్త్రమును కప్పెను. ఒకతె వింజామరమును తాల్చెను. ఇంకొకతె విసనకఱ్ఱను పూనెను. మఱియొకతె బంగారు అడపమును తాల్చెను. వేఱొకతె వస్త్రముతో చేసిన విసనకఱ్ఱను పట్టుకొనెను.

విశేషములు : ఈ పద్యము శ్రీనాథుని నాటి సాంఘికాచారములను ప్రతిఫలింప జేయ నద్దము వంటిది. ఇన్ని విషయములు తెలియుటకు కవి కెంతయో లోకజ్ఞత ఆవశ్యకము. శ్రీనాథునకది పుష్కలముగా గలదనుట కీ పద్యము నిదర్శనము. పూజెకుండలు - ఐరేని కుండలు - పూజె = ఘటాదుల మీది చిత్రము. అట్టి చిత్రములు గల కుండలు. పువ్వుబోడి - చూడు పూర్వవ్యాఖ్య. చతుః + కోణములు - ఇ, ఉ అను నచ్చుల తరువాత వచ్చు ప్రత్యయములకు సంబంధింపని విసర్గము క ప వర్గములకు జెందిన కఠినహల్లులు (క, ఖ, ప, ఫ లు) పరము లగునపుడు షకారముగా మాఱును. చతుష్కోణములు. జాజాల పాలిక = అంకురార్పణ శరావము. `పాలిక జాజాల పాలిక నాఁగను నంకురార్పణ శరావాఖ్యఁ దనరు.'ఆం.భా. 2.179. సర్వ + ఓషధుల = సర్వౌషధుల - వృద్ధి సంధి, `అఆలకు ఏఐలు పరములగునపుడు ఐకారమగును , ఓఔలు పరములగునపుడు ఔ కారమును ఏకాదేశముగా వచ్చును. బింబోష్ఠి - చూడు పూర్వవ్యాఖ్య. మడుగు + పుట్టము - `సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమంబులకును, పుంపులకును బరుష సరళంబులు పరంబులగునపుడు నుగాగమంబగు.' బాల. సంధి. 25.

మడుగు + ను + పుట్టము. `ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు బాల. సంధి. 16 మడుగు + ను + పుట్టము. `ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.' బాల. సంధి. 17. వింజామరము = వెల్ల + చామరములు - `అచ్ఛిక సమాసంబులం దఱచుగ వర్ణలోపాగమాదేశవికారంబు నిత్యవైకల్పికములుగా బెక్కులు గానంబడియెడి.' ప్రౌ. సమాస. 36.

పసిడి - పయిడి - పైడి - రూపాంతరములు. సంబెల - సంబెళ రూపాంతరము. ఆలవట్టము - తెలుగు. ఆలావర్తమ్ సంస్కృతము =వీవన.

గీ. మంత్రి [1]వేల్పించె గృహ్యోక్త మార్గ మొప్ప
బ్రహ్మపదమునఁ గూర్చుండి బ్రాహ్మణుండు
హోమములు రెండు ఋగ్యజుస్సామ వేద
మంత్ర[2]మాది జయాదిహోమంబు తుదగ 57

1. తా. గల్పించె గుహ్యోక్త. 2. తా. వేద.

అర్థము: బ్రాహ్మణుండు = పురోహితుడు, బ్రహ్మ - పదమునన్ = బ్రహ్మస్థానమున, కూర్చుండి, గృహ్య + ఉక్త - మార్గము = కర్మబోధక గ్రంథము నందు, చెప్పబడిన, విధము, ఒప్పన్ = ఒప్పునట్లు, ఋక్ + యజుః + సామ -వేద - మంత్రము + ఆది = ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము అనువాని యందలి మంత్రము మొదలు, జయ + ఆది - హోమంబు = `చిత్తం చ స్వాహా' మున్నగు మంత్రములతో చేయు హోమము, తుదగన్ = చివరయగునట్లు, హోమములు - రెండు = రెండు హోమములు, మంత్రిన్ = మంత్రియగు యజ్ఞదత్తుని, వేల్పించెన్ = వేల్చునట్లు చేసెను.

తాత్పర్యము: పురోహితుడు అగు బ్రాహ్మణుడు బ్రహ్మస్థానమున కూర్చుండి గృహ్యగ్రంథమున చెప్పబడిన విధమొప్పునట్లు ఋగ్యజుస్సామ వేద మంత్రము మొదలుగా, జయాదిహోమము తుదగా రెండు హోమములను మంత్రియగు యజ్ఞదత్తునిచే వేల్పించెను.

విశేషములు: గృహ్యము = స్మార్తకర్మబోధకమగు గ్రంథము - సూ.ని.

మ. [1]చెవికిం గేలివతంసకోత్పలదళశ్రీలై, కపోలంబులన్
నవకాలాగరు [2]పత్రరేఖలయి, మేనం గమ్మకస్తూరియై,
ధవళాంభోరుహ[3]నేత్రపైఁ గురిసె నుద్యల్లీల సీమంతపుం
సవ నాజ్యాహుతి హోమసంప్రభవచంచద్వహ్నిధూమచ్ఛటల్. 58.

అర్థము : సీమంత - చ్ఛటల్ : సీమంత = సీమంత మనెడి యుత్సవము నందును, పుంసవన = పుంసవన మనెడి యుత్సవమునందును (గల), ఆజ్య = నేతి యొక్క, ఆహుతి = వేల్చుట కల, హోమ = యజ్ఞము నుండి. సంప్రభవ = పుట్టుక గల, చంచత్ = చలించుచున్న, వహ్ని = అగ్ని యొక్క, ధూమ + ఛటల్ = పొగల, సమూహములు, ఛెవికిన్ = (సుశీల) చెవికి, కేలి.... శ్రీలై : కేలి = విలాసార్థమై, వతంసక = సిగబంతియైన, ఉత్పల = కలువయొక్క, దళ = పత్రమనెడి, శ్రీలు + ఐ = సంపదలయి, కపోలంబులన్ = చెక్కిళ్ళ యందు, నవ + కాల + అగరు - పత్ర - రేఖలు + ఐ = క్రొత్తనైన, నల్లని, అగరువుల యొక్క, పత్రభంగములు అయి, మేనన్ = శరీరము నందు, కమ్మ - కస్తూరి + ఐ = పరిమళము గల కస్తూరియయి, ధవళ + అంభోరుహ - నేత్రపైన్ = తెల్లదామరలవంటి కన్నులు గల సుశీలపై, ఉద్యత్ + లీలన్ = గొప్పవిలాసముతో, కురిసెన్ = అధికముగా వ్యాపించెను.

---

1. చెవులంగేతిని. 2. తా. చిత్ర. 3. తా. నేత్రిపైఁ బొలసె.

తాత్పర్యము: గర్భవతి యైన సుశీలకు సీమంతోత్సవమును, పుంసవనోత్సవమును చేయునప్పుడగ్ని యందు నేతిని వేల్చుటచే పుట్టిన పొగల గుంపు ఆమె చెవియందు వ్యాపించి విలాసము కొఱకైన కలువరేకు చందము వహించెను.. ఆమె చెక్కిళ్ల యందు వ్యాపించి నవకాలాగురుపత్రభంగముల యందమును వహించెను. ఆమె శరీరమున వ్యాపించి పరిమళవంతమైన కస్తూరిశోభను వహించెను.

విశేషములు: ధూమచ్ఛటలు నల్లగా నుండును. కావుననే వానిని నల్లని వైన కలువరేకులతోను, కాలాగురు పత్రభంగములతోను, కస్తూరితోను పోల్చుట. ఆజ్యమున హోమము చేసినప్పుడు వెడలు ధూమములు పరిమళభరితము లగుటచే, నవి పరిమళవంతములయిన కలువరేకులతోను, కాలాగురు పత్రములతోను, కమ్మని కస్తూరితోను సముచితముగా పోల్పబడినవి. ధూమచ్ఛటల వ్యాప్తిని వర్ణించిన విధమద్భుతము. కాళిదాసు కుమార సంభవమున పార్వతీశ్వరుల వివాహ సందర్భమునందలి యగ్ని నుండి వెలువడిన ధూమములిట్లే యామె కలంకారములయ్యెనని వర్ణింపబడినవి.

కపోలసంసర్పిశిఖః స తస్యా
ము హూర్తకర్ణోత్పలతాం ప్రపేదే.' కుమార. సం. 7.81

తదీషదార్ద్రారుణగణ్డలేఖ
ముచ్ఛ్వాసికాలాఞ్జనరాగ మక్ష్ణోః,
వధూముఖం క్లాన్తయవావతంస
మాచారధూమగ్రహణాద్బభూవ. కుమార. సం. 7.82

శ్రీనాథుడింకను విశేషించి తన ప్రతిభను చాటుకొనెను.

స్త్రీలు విలాసము కొఱకు కలువను తలపూవుగా ధరింతురు. చెక్కిళ్లపై అగురు గంధముతో పత్రభంగములను రచించుకొందురు.

ఆంధ్ర సాహిత్యపరిషత్ప్రతిలో `సీమంతపున్ సవనాజ్యాహుతి' అని కలదు. అప్పుడు `సీమంతమనెడి సవన' మని యర్థము చెప్పవలయును. సీమంతము + సవన - `కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు.' బాల. సంధి. 32

సీమంతపు + సవన `పుంపులకుఁ బరుష సరళములు పదములగునపుడే నుగాగమము కావలసియున్నను, ఇచ్చట స్థిరము (సకారము) పరమగుచుండుటచే - ఈ యాగమం బొకానొక చోట స్థిరంబు పరంబగుచో గానంబడియెడి' నను వృత్తియందలి వాక్యమునకిది యుదాహరణ మగుచున్నది.

మేన కస్తూరిని పూసికొందురు. అగరువు - అగురువు రూపాంతరము. ధవళాంభోరుహ = పుండరీక, కురిసెననగా నిచ్చట నధికముగా వ్యాపించెనని భావము. ఉద్యత్ + లీల = తవర్గ వర్ణములకు లకారము పరమగుచో పరసవర్ణ మాదేశమగును. ఉద్యల్లీల. చంచత్ + వహ్ని. అనునాసికాంతస్థవర్ణములు తప్ప తక్కిన పదాంతగత హల్లు లకు(ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని, అచ్చులు కాని పరమగునపుడు ఆ హల్లుల వర్గమునకు చెందిన తృతీయ వర్ణమాదేశమగును. చంచద్వహ్ని. ధూమ + ఛట - హ్రస్వమునకు పరమైన ఛ కారము ద్విరుక్త మగును. ధూమచ్ఛట. ధూమచ్ఛటలు ఉత్పలదళ శ్రీలును, కాలాగరు పత్రరేఖలును, కమ్మకస్తూరియు నయ్యెనని చెప్పబడుటచే నుపమేయమైన ధూమచ్ఛటలకును, ఉపమానములైన ఉత్పలదళకాలా గరు కస్తూరులకును నభేదము చెప్పబడినది కావున రూపకాలంకారము.

మ. చెలికత్తెల్ చిఱునవ్వు చెక్కులపయిం[1]జెల్వార వీక్షింప నొ
జ్జలు మంత్రంబులు [2]సెప్ప ప్రెగ్గడ శరత్సంపూర్ణ చంద్రాస్యకున్
వలి చన్నుంగవమీఁద ముత్పులకముల్వర్ధిల్లఁ [3]గేల్వంచుచున్
శలలీకంటక మెత్తి యొదలపయిన్ సంధించె సీమంతమున్. 59

అర్థము: చెలికత్తెల్, చిఱునవ్వు, చెక్కులపయిన్ = చెక్కిళ్ళమీద, చెల్వారన్ = ఒప్పునట్లు, వీక్షింపన్ = చూచుచుండగను, ఒజ్జలు = పురోహితులు, మంత్రంబులు + చెప్పన్ = మంత్రములు చదువుచుండగను, ప్రెగ్గడ = మంత్రి (యజ్ఞదత్తుడు), శరత్ + సంపూర్ణ - చంద్ర + ఆస్యకున్ = శరత్కాలమునందలి, నిండు చంద్రుని వంటి ముఖము గల సుశీలకు, వలి - చన్నుంగవమీదన్ = చల్లని చనుగవపై, ముద్ + పులకముల్ = ఆనందమువలని గగుర్పాటు, వర్ధిల్లన్ = వృద్ధి పొందగా, కేల్ + వంచుచున్ = తన చేయి వంచుచు, శలలీ - కంటకము = ఏదుపంది ముల్లు, ఎత్తి, ఔదలపయిన్ = నడునెత్తి మీద సీమంతమున్ = పాపటను, సంధించెన్ = ఏర్పఱిచెను.

తాత్పర్యము: చెలికత్తెలు చెక్కిళ్లపై జిఱునగవొప్ప చూచుచుండగను, పురోహితులు మంత్రములు చదువుచుండగను, మంత్రియైన యజ్ఞదత్తుడు శరత్కాలమునందలి నిండుచంద్రుని వంటి ముఖము గల తన భార్య సుశీలకు గర్భవతికి చల్లని చనుదోయి మీద నానందము వలని గగుర్పాటు అధికము కాగా చేయి వంచుచు నేదుపంది ముల్లెత్తి నడునెత్తిని పాపటను దీర్చెను.

విశేషములు : శ్రీనాథుని కాలమున గర్భవతియైన స్త్రీకి చేయు సీమంతోత్సవము స్వరూప మీ వర్ణనవలన తెలియుచున్నది. ఈ విధానము వలన నా క్రియకు

1. తా. జిర్వార. 2. తా. చెప్పనప్పుడు, 3. తా. వ గేల్సాచుచున్

సీమంత మను పేరు సార్థకమగుచున్నది. భర్త కేలు వంచి శలలీ కంటకముతో నెత్తిపై సీమంతమును తీర్ప నా స్పర్శముచే సుశీలకు ఆనందము వలన స్తనద్వయముపై పులకలేర్పడినవి. వీలయిన సందర్భములందెల్ల శృంగారమును వర్ణించుట శ్రీనాథునకు పరిపాటి. సీమంతోత్సవమును స్వభావ రమణీయముగా వర్ణించుటచే నిందలి యలంకారము స్వభావోక్తి. `స్వభావోక్తి స్స్వభావస్య జాత్యాదిస్థస్య వర్ణనమ్.' చెలికత్తె - చెలిశబ్దమునకు స్వార్థమున కత్తె ప్రత్యయము. బా. తద్ధిత. 13. చెక్కు - `చెంప దవుడ చెక్కు చెక్కిలనంగ దగుc గపోలము.' - సాం.ని.మా. వర్గు. చెల్వార = చెల్వు + ఆర - చెలువు = చెల్వు. `అచ్చికంబులంబదమధ్యంబుల నలడరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బా. ప్రకీర్ణ. 17. ఒజ్జ - తెలుగు. ఉపాధ్యాయుడు సంస్కృతము. మంత్రంబులు + చెప్పన్ - `ప్రథమ మీది పరుషములకు గసడదవలు బహుళముగా నగు.' మంత్రంబులు సెప్పన్. ప్రెగ్గడ - ప్రెగడ రూపాంతరము. `ప్రెగ్గడ నిజోగి ప్రెగడ మంతిరి నా మంత్రి పేర్లు వెలయు.' చన్నుంగవ - చన్ను + కవ - సమాసమున నుదంతస్త్రీసమము (చన్ను) నకు పరుషము (క) పరమగుచుండగా నుగాగమము, పిమ్మట ద్రుతకార్యము. ముద్ + పులకముల్ - ఝల్లు(ద్)నకు కఠిన హల్లు (ఖ(రు) పరమగునపుడు చ(రు (త్) ఆదేశమయి ముత్పులకముల్ అయినది. పులకము (సం.) పులక - తెలుగు. కేల్వంచుచున్ - కేలు + వంచుచున్ - `పదాంతంబులయి యసంయుక్తంబులయిన నలురుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగనగు.' బాల. ప్రకీర్ణ. 16. శలలీ - `శలలీ శలలం శలమ్' అమరము. శలతీతి శలలీ - వేగముగా పోవునది గనుక శలలి - ఏదుపంది ముల్లు. ఔదల = అవుదల రూపాంతరము.

క. కుటిలాలక [1]కుడి నాసా
పుటరంధ్రము[2]నందు మూడు బొట్టులు[3]విడిచెన్
వటఫలదళరస మధిపతి
కటకఝుణత్కార మెసcగc గరపద్మము[4]లన్ 60

అర్థము: అధిపతి = భర్త (యజ్ఞదత్తుడు), కుటిల + అలక = వంకరలైన ముంగురులుగల సుశీల యొక్క, కుడి, నాసా - పుట - రంధ్రమునందున్ = దొప్పవంటి ముక్కుయొక్క రంధ్రమునందు, కటక -ఝుణత్కారము = కంకణముల ఝుణఝుణ ధ్వని, ఎసగన్ = ఒప్పగా, కర-పద్మములన్ = తామరలవంటి చేతులతో, వట - ఫల - దళ - రసము = మఱ్ఱిపండ్లయొక్కయు, ఆకులయొక్కయు రసము, మూడు బొట్టులు = మూడు చుక్కలు, విడిచెన్ = ఒక్కొక్కటిగా విడిచెను.

1. ము. కును, 2. ము. లందు, 3. ము. విడిచె, 4. తా. నన్

తాత్పర్యము: భర్తయైన యజ్ఞదత్తుడు గర్భవతి యగు సుశీల కుడి ముక్కు రంధ్రములో మఱ్ఱి పండ్లు, మఱ్ఱి యాకుల రసమును మూడు చుక్కలు కంకణములు ఝుణఝుణ ధ్వని చేయుచుండగా తామరలవంటి చేతులతో విడిచెను.

విశేషములు: ఇదియు శ్రీనాథుని నాడు సీమంతోత్సవ సమయమున చేయు దన కావ్యమున ప్రతిఫలింప జేసిన శ్రీనాథుని లోకజ్ఞత ప్రశంసనీయము. మిడుచు - ద్రవద్రవ్యమును బొట్టుబొట్టుగా నిచ్చు (సూ.ని.) `పెరువు పాలింట నేడ్చిన బిడ్డకైన, మిడువలేదు. హరి.పూ. 5.219. కటక - కడియము. హస్తాభరణ విశేషము.

గీ. మృదులగోధూమసరులతో మేలవించి,
వన్నె కుచ్చులపేరుతో [1]వక్కరించి,
పుష్పదుండుకంబుతోఁ బొత్తు[2]పడసి,
పడఁతి పాలిండ్లపై[3] నొప్పెఁ బసిఁడి పేరు. 61

అర్థము: పసిడి - పేరు = బంగారు హారము, మృదుల - గోధూమ - సరులతోన్ = మెత్తని గోధుమ దండలతో, మేలవించి = కలిసి, వన్నె - కుచ్చుల - పేరుతోన్ = రంగు కుచ్చులు గల దండతో, వక్కరించి = తిరుగబడి, పుష్ప - దుండుభకంబుతోన్ = పూలదుండుభముతో, పొత్తు + పడసి = కూడియుండి, పడతి = స్త్రీ (సుశీల) యొక్క, పాలిండ్లపైన్ = స్తనములమీద, ఒప్పెన్.

తాత్పర్యము: సుశీల కంఠమున ధరించిన బంగారు హారము మెత్తని గోధుమల హారముతో గలిసి, రంగు కుచ్చుల దండతో మాఱుమలసి, పూలదుండుభముతో గూడి యామె పాలిండ్లపై నొప్పెను.

విశేషములు: పుష్ప - డుండుభకము = డుండుభకము = రెండుతలల పాము. `నిర్విషా డుండుభాః స్మృతాః.' `సమౌ రాజిలడుండుభౌ' డుండతీతి డుండుభః - అమరము. అణగియుండునది. ఇరుదల శిఖండి పేర్లు. పుష్పదుండుభకము - పూల డుండుభకము - డుండుభాకారముగా నల్లబడిన పూలమాల కావచ్చును. ఆంధ్రసాహిత్య పరిషత్తిలో `పుష్పదుండుభకంబుతోఁ బొత్తువచ్చుఁ. బడతి పాలిండ్లపై నొప్పు పసిడి పేరు' అనుపాఠము గలదు. దానికి `సుశీల పాలిండ్లపై నొప్పెడి పసిడిపేరు గోధుమ హారముతోను, వన్నె కుచ్చుల దండతోను గూడి పూల డుండుభమువలె నుండె'నని చెప్పవలయును. ఆలోచింపగా నీ పాఠమే సమంజసమని తోచుచున్నది. గోధూమ సరులు - గోదుమపూసలు - స్త్రీ కంఠభూషా విశేషము (శ.ర.) గోధూమ సంస్కృతము, సరులు తెలుగు. వైరి సమాసము. వక్కరించు =

1. తా. వక్కడించి, 2. ము. వచ్చు, 3. ము. నొప్పు

తిరుగబడు, మాఱుమలయు (శ.ర.) `జక్కవ కవతోడ వక్కరించు.' - విక్ర. 8. ఆ. వక్కళించు రూపాంతరము. పసిడిపేరు స్థితి. స్వభావరమణీయముగా వర్ణింపబడినది కావున స్వభావోక్తి. పసిడిపేరు పుష్పదుండుభకముతోఁ బొత్తువచ్చు - ఉపమ. పొత్తువచ్చు - ఉపమావాచకము. పసిడి - పయిడి - పైడి - రూపాంతరములు. పేరు - హారము, నామము, పెద్ద - నానార్థములు.

గీ. తగవు లిచ్చిరి [1]పుట్టింటి తల్లి ప్రజలు
వీళ్ళొసంగిరి చుట్టాలు వేనవేలు
[2]కట్టనిచ్చె నృపాలుండు కన్నుదనియఁ
బరమహీపాలు రిచ్చిరి పావడములు. 62

అర్థము: పుట్టింటి - తల్లి - ప్రజలు = పుట్టినింటి వారు, తగవులు = బహుమానములు, ఇచ్చిరి, వేనవేలు = వేలకువేలు, చుట్టాలు, వీళ్ళు = కట్నములు, ఒసంగిరి = ఇచ్చిరి, నృపాలుండు = రాజు (హేమాంగదుడు) కన్ను + తనియన్ = కంటికి తృప్తి కలుగగా, కట్టన్ + ఇచ్చెన్ = కట్టుటకు (వస్త్రము), ఇచ్చెన్, (కట్నము + ఇచ్చెన్ అనుపాఠము బాగు. కానుక నిచ్చెను.) పర - మహీపాలురు = ఇతర రాజులు, పావడములు = కానుకలు ఇచ్చిరి.

తాత్పర్యము: పుట్టినింటివారు తగవులొసగిరి. వేనవేలు చుట్టములు కానుకల నిచ్చిరి. రాజగు హేమాంగదుడు కంటికి తృప్తి యగునట్లు కట్నమిచ్చెను. ఇతర రాజులు కానుకలనిచ్చిరి.

విశేషములు: పుట్టింటి = పుట్టినింటి - `సిరికిం బుట్టింటి నెచ్చెలు లౌట మనవికి, డాసెనా మకరకుండలము లమర.' (ఆముక్త. 4-11), వీళ్ళు - వీడు +లు = కట్నములు - `వీడు చదివించె నయ్యేడ, వీడని వేడుక బలారి.' వసు. 6-35. పావడములు = కానుకలు - `పండువా సురతాణి పావడంబిచ్చిన భద్రేభములు వీథిఁబాలెముండు.' భీమ. 1.37. వీడు + లు = వీళ్ళు - `బహువచనము పరంబగునపుడసంయుక్తంబులయి యుదంతంబులయిన డ-ల-ర-ల కలఘు లకారంబు బహుళంబుగా నగు. బా. ఆచ్ఛిక. 13. మహీపాలురు - `అదంతంబయి దీర్ఘపూర్వలో పధంబయిన మహత్తు మీది విభక్తి లకారంబునకు రేఫంబగు.' - బాల. తత్సమ. 38. చుట్టాలు - చుట్టలు రూపాంతరము. చుట్టము + లు - లులనలు పరంబులగునపుడు డొకానొకచోట ముగాగమంబునకు లోపంబును దత్పూర్వస్వరంబునకు దీర్ఘంబును విభాషనగు. బాల. తత్సమ. 43.

1. తా. పుట్నింటి. 2. కట్నమిచ్చె.

సీ. క్ష్మామండలము తురంగమఘట్ట మయ మయ్యెఁ
గరిమయంబయ్యె దిక్చక్రవాళ
మంబరంబాతపత్రావళిమయ మయ్యె
సౌరభమయ మయ్యె మారుతంబు
పరివారమయ మయ్యె బ్రహ్మ ప్రపంచంబు
జయశబ్దమయ మయ్యె సకల[1]జగము
లాత[2]పంబు విభూషణాలోక మయ మయ్యె
సంతోషమయమయ్యె జనుల మనము

గీ. వింధ్యపర్వత మేలు పృథ్వీవరుండు
దానుఁ బట్టంపుదేవియుఁ దగవు గలిగి
సచివునింటికి [3]నేతెంచి సమ్మదమున
నొద్దనుండి యా శోభన మొనరుచుటయు. 63

అర్థము: వింధ్య పర్వతమ, ఏలు = పాలించునట్టి, పృథ్వీ - వరుండు = భూపతి (రాజు అగు హేమాంగదుడు), తానున్, పట్టంపు దేవియున్ (పట్టము + దేవియున్) = పట్టపురాణియును, తగవు + కలిగి = యుక్తత కలిగి, సచివు + ఇంటికిన్ = మంత్రియగు యజ్ఞదత్తుని యింటికి, ఏతెంచి = వచ్చి, సమ్మదమునన్ = సంతోషముతో, ఒద్దన్ + ఉండి = దగ్గఱనుండి, ఆ - శోభనము = ఆ సీమంతోత్సవ మనెడి శుభము, ఒనరుచుటయున్ = చేయింపగా - క్ష్మా - మండలము = భూ వలయము, తురంగమ - ఘట్ట - మయము = గుఱ్ఱముల, సమూహములతో, నిండినది, అయ్యెన్, దిక్ + చక్రవాళము = దిక్కుల మండలము, కరి - మయంబు = ఏనుగులతో నిండినది, అయ్యెన్. అంబరంబు = ఆకాశము, ఆతపత్ర + ఆవళి - మయము - గొడుగుల వరుసలతో నిండినది, అయ్యెన్, మారుతంబు = గాలి, సౌరభ-మయము = పరిమళముతో నిండినది, అయ్యెన్. బ్రహ్మ - ప్రపంచంబు = బ్రాహ్మణుల విస్తారము, పరివార - మయము = పరిజనముతో నిండినది, అయ్యెన్, సకల - జగమున్ = ఎల్ల జగత్తును, జయ - శబ్ద - మయము = 'జయ' అను శబ్దముతో నిండినది, అయ్యెన్. ఆతపంబు = ఎండ, విభూషణ + ఆలోక - మయము = అలంకారముల యొక్క, ప్రకాశముతో, నిండినది, అయ్యెన్, జనుల - మనము = జనుల మనస్సు, సంతోష - మయము - అయ్యెన్ = సంతసముతో నిండినదయ్యెను.

---

1. తా. జనము, 2. ము. పత్ర, 3. తా. నేతెంచు.

తాత్పర్యము : వింధ్యపర్వతము నేలు రాజగు హేమాంగదుడు తన పట్టపురాణితో మంత్రియగు యజ్ఞదత్తుని యింటికి వచ్చి సంతోషముతో నా సీమంతోత్సవ శుభమును చేయింపగా భూభాగమంతయు గుఱ్ఱముల సమూహములతో నిండెను. దిక్సమూహము ఏనుగులతో నిండెను. ఆకాశము గొడుగులతో నిండెను. గాలి పరిమళముతో నిండెను. బ్రాహ్మణుల సమూహము పరిజనముతో నిండెను. ఆతపము విభూషణముల ప్రకాశముతో నిండెను. జనుల మనస్సులు సంతోషముతో నిండెను.

విశేషములు: క్ష్మా - `క్ష్మాౙ వని ర్మేదినీ మహీ' క్షమతే భారం క్ష్మా - భారము నోర్చునది - భూమి. తురంగమ - `తురగ తురంగాశ్వ తురంగమాః' - `తురం త్వరితం గచ్ఛతీతి తురంగమః.' - అమరము. త్వరితముగా బోవునది - గుము. ధట్టము = సమూహము. `తురగ ధట్ట ఖలీన.......' ఉ.హరి. 4.223 మయ - మయట్ ప్రత్యయము. ప్రాచుర్యార్థమున నగును. చక్రవాళము (నానా) = మండలము, లోకాలోకపర్వతము. అంబరము = (నానా) ఆకాశము, వస్త్రము. పట్టము + దేవి = పట్టంపుదేవి - `కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు.' బాల. సం. 32. సచివు + ఇంటికి - `షష్ఠీ సమాసమునందుకార ఋకారములకచ్చు పరమగునపుడు నుగాగమంబగు' - బాల. సం. 34. ఒద్ద - వద్ద.

గీ. [1]జవిలె నరఁ బూలు ముడిచిన సాధ్వి యొకతె
[2]యొలగందంపుఁ బసపున నూన్చెఁ గదిసి
పసిడి యుత్తర[3]జందెముల్[4] పాయఁబట్టి
రాచప్రెగ్గడ బ్రహ్మసూత్రమున నగుచు. 64

అర్థము: జవిలెన్ = తిన్నెయందు, నరన్ = తెల్లబాఱిన వెంట్రుకలయందు, పూలు, ముడిచిన, సాధ్వి = పతివ్రత, ఒకతె, కదిసి = సమీపించి, నగుచున్ = నవ్వుచును, పసిడి - ఉత్తర - జందెముల్ = బంగారు ఉత్తరజందెములను, పాయన్ + పట్టి = విడదీసి, రాచ - ప్రెగ్గడ = రాజు మంత్రి యొక్క, బ్రహ్మసూత్రమనన్ = యజ్ఞోపవీతము నందు, ఓలగందము + పసపునన్ = పూతపసపున, ఊన్చెన్ = వహింపజేసెను.

తాత్పర్యము: తిన్నెపై తెల్లబాఱిన వెంట్రుకలయందు పూలు ముడిచిన యొక సాధ్వి సమీపించి నవ్వుచు మంత్రి బంగారు ఉత్తర జందెములను విడదీసి వానికి పూత పసపును పూసెను.

విశేషములు : జవిలె ....యొకతె - తిన్నెపై గూర్చున్న యొక పెద్దముత్తైదువ.

1. తా. జరఢ నరమూల ముడిచిన, 2. ము. యుల్లగందంబు, 3. తా. జంధ్యాలు, 4. తా. వాయఁబెట్టి

జవిలె -జగిలె - జగ్గిలె - రూపాంతరములు. నర = తెల్ల వెంౖడుక. `నరలు గలకామున్నైనను....' భార. ఆది. 3.194. ఓలగందము - పూత పసుపు.

`అనుదినంబును ౖబాత రారంభవేళల నోలగందమ్ము తోనుదకమాడి' కాశీ. 3.212. ఊన్చు - ఊను ౖపేరణార్థకము. ఊను + చు. ఉత్తరజందెములు - యజ్ఞోపవీతమువలె ధరించు ముత్యాలహారము. జందెము - జన్నిదము. మిౖశవిశేష్యము. ఇదియు నానాటి యాచారము.

గీ. దశరథుని వాజపేయంబు ధర్మసూను
రాజసూయంబు నుపమింప [1]ౖబాఁతియెయని
[2]పట్టణంబును దేశంబు బరిధవింపఁ
బెట్టె దొడ్డుగ[3] నామెత ౖపెగడగారు 65

అర్థము: ౖపెగడగారు = మంౖతిగారు (యజ్ఞదత్తుడు) దశరథుని - వాజపేయంబున్ = దశరథుడు చేసిన వాజపేయమను యాగము, ధర్మసూను = ధర్మరాజుయొక్క, రాజసూయంబున్ = రాజసూయ యాగమును, ఉపమింపన్ = పోల్చుటకు, ౖబాఁతియె = అధికమా, అని, పట్టణంబును = నగరమును, దేశంబున్, పరిధవింపన్ = అతిౖకమింపగా, దొడ్డుగన్ = గొప్పగా, ఆమెత = విందు, పెట్టెన్ = చేసెను.

తాత్పర్యము: దశరథుడు చేసిన వాజపేయమను యజ్ఞమును, ధర్మరాజు చేసిన రాజసూయ యాగమును పోల్చుటకు గొప్పవాయను రీతిని పట్టణమును దేశమును అతిౖకమించులాగున మంౖతియగు యజ్ఞదత్తుడు గొప్ప విందు చేసెను.

విశేషములు: ౖబాఁతియని సానుస్వారముగా శ.ర.లో గలదు. ౖబాతి యని నిరనుస్వారముగా సూ.ని.లో గలదు. దొడ్డు - దొడ్డ రూపాంతరము. ఆమెత - `ఆమెత పండుగ పబ్బం బనఁగ నుత్సవమున కలరు.' సాం.ని.మా.వర్గు. ౖపెగడ - గారు - `తఱచుగా స్త్రీసమంబులగు దేశ్యశబ్దంబులకు గడపల గొన్నింటి కేకవచనంబునం బూజ్యతయందు గారు శబ్దం బగు.' ౖపౌఢ. శబ్ద. 39 ౖపెగడ - ౖపెగ్గడ. వ. అంత.66

సుకుమారుని జననము

క. నవమాసంబులు నిండిన
ధవళేక్షణ గాంచె సుతు సుధాకరతారా
[4]రవి బుధ ధిషణ విధుంతుద
[5]కవు లుచ్చగముగను నమృతఘటికలు నడువన్. 67

1. తా. ౖపాప్తమైన, 2. తా. పట్టణంబున దేశంబు పరిణమింప, 3. తా. నామిత, 4. ము. రవిసుత, 5. ము. కవులుభికములుగ నవమ ఘటికలు నడువన్.

అర్థము: ధవళ + ఈక్షణ = తెల్లని కన్నులు గలది - సుశీల, నవ - మాసంబులు = తొమ్మిది నెలలును, నిండినన్ = నిండగా సుధాకర .... కవులు: సుధాకర = చంద్రుడును, తారా = నక్షత్రములును, రవి =బృహస్పతియును, విధుంతుద =రాహువును, కవులు = శుక్రుడును, ఉచ్చగముగను = ఉన్నతముగా, అమృత - ఘటికలు = శుభములయిన గడియలు, నడువన్ = ప్రవర్తిల్లుచుండగా, సుతున్ - కొడుకును, కాంచెన్ = కనెను.

తాత్పర్యము: తొమ్మిది నెలలు నిండగా సుశీల చంద్రుడును, నక్షత్రములును, సూర్యుడు, బుధుడు, బృహస్పతి, రాహువు, శుక్రుడు అను గ్రహములును ఉచ్చస్థితియందుండగా, అమృతపుగడియలు ప్రవర్తిల్లగా సుతుని కనెను.

విశేషములు: ధవళేక్షణ - ఈక్షణములను నల్లనివిగను, తెల్లనివిగను కవులు వర్ణింతురు. ఘటిక సంస్కృతము - గడియ - తెలుగు. అన్ని గ్రహము లుచ్ఛస్థితి యందుండగా, అమృతఘటికలలో పుట్టిన సుకుమారుడట్టివాడేలయ్యెనో!

వ. ఇవ్విధంబున సుశీలాదేవి నందనుగాంచిన వార్త [1]యంతఃపుర పరిచారిణి యొకర్తె విన్నవించిన నమృత రసధారామయం బయిన యమ్మాటకు సద్యః ప్రరూఢరోమాంకురనికరకంటకితగాత్రుండును దరస్మితవికసితకపోలమండలుండును నై మంత్ర్యాఖండలుండు 68

అర్థము : ఈ + విధంబునన్ = ఈ రీతిగా, సుశీలా - దేవి, నందనున్ = కొడుకును, కాంచిన - వార్త = కనినదను వార్త, అంతఃపుర - పరిచారిణి = అంతిపురమునందలి సేవకురాలు, ఒకర్తె, విన్నవించినన్ = మనవి చేయగా, అమృత - రస - ధారా - మయంబు + అయిన = అమృతరస ప్రవాహముతో నిండినదైన, ఆ+మాటకున్, మంత్రి + ఆఖండలుండు = ఆఖండలుని (ఇంద్రుని) వంటి మంత్రి శ్రేష్ఠుడు అగు యజ్ఞదత్తుడు, సద్యః..... గాత్రుండును : సద్యః = వెంటనే, ప్రరూఢ = మొలచిన, రోమాంకుర = పులకల యొక్క, నికర = సమూహముచే, కంటకిత = ముండ్లుగలదిగానైన, గాత్రుండును = అవయవములు గలవాడును, దర ..... మండలుండును : దర = చిఱు, స్మిత = నవ్వుచే, వికసిత = వికసించిన, కపోల - మండలుండును = చెక్కిళ్ళప్రదేశము గలవాడును, ఐ = అయి.

తాత్పర్యము : ఈ రీతిగా సుశీలాదేవి కొడుకును గనెనను వార్తను రాణివాసపు పరిచారిక యొకతె విన్నవింపగా, నమృత రస ప్రవాహముతో నిండిన యా వార్తకు మంత్రి శ్రేష్ఠుడైన యజ్ఞదత్తుడు వెంటనే గగుర్పొడిచిన అవయములుగలవాడును, చిఱునగవుచే వికసించిన చెక్కిళ్లుగలవాడునయి - తరువాతి పద్యముతో నన్వయము.

---

3. తా. యంతఃపురపరిచారిణి యొక్క చకోరనేత్రి విన్నవించిన నవ్వాక్యంబు.

విశేషములు : ఇవ్విధము (ఈ + విధము) అమ్మాట (ఆ + మాట) త్రిక సంధులు. సద్యస్ - అవ్యయము. `సద్యస్సపది తత్క్షణే' - అమరము. రోమ + అంకుర - రోమాంకుర - రోమముల యొక్క మొలకలు అనగా గగుర్పాటు. గాత్ర శబ్దము శరీరమునందును, అవయవము నందును ప్రవర్తిల్లును. మంత్రి + ఆఖండలుడు = మంత్ర్యాఖండలుడు - యణాదేశ సంధి. ఇ, ఉ, ఋ, అను నచ్చులకు, అవి హ్రస్వములగునపుడు క్రమముగా య్, వ్, ర్, ల్ అనునవి ఆదేశములగును. ఆఖండలుని వంటి మంత్రి. ఉపమితి సమాసము. ఆఖండలశబ్దము శ్రేష్ఠతా వాచకము. ఆఖండలుడు - `ఆఖణ్డలః సహస్రాక్ష ఋభుక్షాః' `ఆఖండయతి అహీన్ భినత్తీతి ఆఖండలః' శత్రువులను ఖండించువాడు - ఇంద్రుడు - అమరము. అంతఃపురము (ప్ర) అంతిపురము (వి.)

ఆ.వె. తాను గట్టినట్టి చీనాంబరంబులుఁ
దాను బెట్టినట్టి మేని తొడవుఁ
బ్రమద మొప్ప నిచ్చెఁ బారితోషికముగ
మంత్రి యంతిపురము మానవతికి. 69

అర్థము: మంత్రి = యజ్ఞదత్తుడు, అంతిపురము - మానవతికిన్ = అంతః పుర స్త్రీకి - శుభవార్త చెప్పిన పరిచారికకు, తాను, కట్టిన + అట్టి, చీన + అంబరంబులన్ = చీన దేశము నందలి వస్త్రములును - పట్టుబట్టలును, తాను, పెట్టిన + అట్టి = తాల్చినట్టి, మేని - తొడవున్ = శరీరాభరణమును, ప్రమదము = అధిక సంతోషము, ఒప్పన్ = ఒప్పగా, పారితోషికముగన్ = బహుమానముగా, ఇచ్చెన్.

తాత్పర్యము: యజ్ఞదత్తుడు తనకు పుత్త్రోదయ మయినదను శుభవార్త చెప్పిన అంతఃపుర పరిచారికకు తాను గట్టిన పట్టువస్త్రములను, తాను దాల్చిన ఆభరణమును. సంతోషముతో కానుకగా నిచ్చెను.

విశేషములు: చీనాంబరములు - చీన (చైనా) పట్టు వస్త్రములకు ప్రసిద్ధి. తొడవు - `సొమ్మనఁ దొడవనగా రవణమ్మన నగుఁ బేళ్లు భూషణమ్ములకును.' (ఆం. నా. శే. స్థావరవర్గు) ప్రమదము - `ముత్ప్రీతిః ప్రమదో హర్ష ప్రమోదామోదసంమదాః `ప్రకృష్టో మదః ప్రమదః' అధికమైన సంతోషము' - అమరము.

సీ. [1]తలయంపి ధవళముద్రాకుంభ మిడువారు
రక్షా భసిత రేఖ వ్రాయువారు
గౌర సర్షప రాజి కలయఁ జల్లెడువారు
బలి విధానంబులఁ బరఁగు వారు

1. తా. తలయంటి ధవళనిద్రాకుంభ

లవణంబు నింబపల్లవము ద్రిప్పెడు వారు
[1]ప్రేము మంచంబుతోఁ బెనచువారు
[2]గవల ధూపంబు సంఘటియించు వారును
[3]మంచి ముట్టెడద యోజించువారు

గీ. గదిసి దీవించువారును [4]గంధతైల
[5]మలఁదుకొనువారు గాయంబు లందువారు
బాడు వారును బరిహాస మాడువారు
నైరి శుద్ధాంతసతు లరిష్టాలయమున. 70

అర్థము: అరిష్ట + ఆలయమునన్ = పురుటింటి యందు, శుద్ధాంత - సతులు = అంతఃపురస్త్రీలు, తలయంపిన్ = తలాపిదిక్కున, ధవళ - ముద్రా - కుంభము = తెల్లని ముద్రలతోడి కడవ, ఇడువారున్ = పెట్టువారును, రక్షా - భసిత - రేఖ = రక్షణము కొఱకైన భస్మరేఖ, (వ్రాయువారున్), గౌర - సర్షప - రాజి = తెల్లావాల సమూహమును, కలయన్ = అంతటను, చల్లెడువారున్, బలి - విధానంబులన్ = పూజార్థ మైన కానుకలనిచ్చు విధములందు, పరగువారున్ = ప్రవర్తిల్లు వారును, లవణంబున్ = ఉప్పును, నింబ - పల్లవమున్ = వేపచిగురును, త్రిప్పెడు వారున్, ప్రేము = పేము, మంచంబుతోన్, పెనచు వారున్ = అల్లెడు వారును. గవల - ధూపంబు = ఎనుప కొమ్ముల ధూపము, సంఘటియించు వారును - సమకూర్చువారును, మంచి ముట్టు - ఎడదన్ = హృదయమునందు, యోజించువారున్ = కూర్చువారును, కదిసి = సమీపించి, దీవించువారును, గంధ - తైలము = వాసననూనెను, అలందుకొనువారున్ = పూసికొనువారును, కాయంబులు = బాలెంతల కిచ్చెడి మందును, అందువారున్, పాడువారును, పరిహాసము + ఆడవారున్ = పరియాచికములాడు వారును, ఐరి = అయిరి.

తాత్పర్యము: పురుటింటియందు అంతఃపుర స్త్రీలు కొందఱు తలాపి దిక్కున ధవళముద్రలు గల కుంభముంచిరి. కొందరు రక్ష కొఱకు భస్మరేఖ వ్రాసిరి. కొందఱు తెల్లావాలను అంతటను చల్లిరి. కొందఱు పూజోపహార విధానములచే నొప్పిరి. కొంతమంది ఉప్పును వేపచివురును త్రిప్పిరి. మఱికొందరు మంచమునకు పేమునల్లుచుండిరి. మఱికొంత మంది మంచిముట్టెదపై నుంచుచుండిరి. కొందఱు దగ్గఱకు వచ్చి దీవించుచుండిరి. కొందరు గంధతైలము నలదుకొనుచుండిరి. కొందఱు బాలెంత కాయము నందుచుండిరి. కొందరు పాటలు పాడుచుండిరి. కొందఱు పరియాచికముల నాడుచుండిరి.

---

1 తా. ప్రేమ మువ్వంబుతో, 2. తా. గమల, 3. తా. మంచి ముట్టెదుర, 4. ము. గండతైల, 5.ము. మందుకొనువారు.

విశేషములు : ఈ యాచారములన్నియు శ్రీనాథుని నాడు సంఘమున నుండెడివి. వీనిలో గొన్నియిప్పటికిని పల్లెటూళ్లలో పురుటిండ్ల గానవచ్చును. ఈ సూతికా గృహవర్ణన బాణభట్టువిరచిత కాదంబరి యందలి సూతికా గృహవర్ణనను పోలి యున్నది. తల యంపి - తలాపి - తల్లంపి - రూపాంతరములు. పండుకొనునపుడు తల యుంచు కొను దిక్కు (సూ.ని.), శుద్ధాంత - `స్త్ర్యగారం భూభుజా మన్తఃపురం స్యా దవ రోధనమ్ శుద్ధాన్త శ్చావరోధశ్చ.' శుద్ధాఃపరిశుద్ధాః రక్షకాః అంతే సమీపే అస్యేతి శుద్ధాంతః అమరము. పరిశుద్ధులైన రక్షకులు సమీపమందు గలది. - అంతః పురము. అరిష్ట - `అరిష్టం సూతికాగృహమ్.' `మంత్రాదినా కృత రక్షత్వాత్ గ్రహై ర్నరిష్యతే న హింస్యతే బాలకాది రత్రే త్యరిష్టమ్.' అమరము. మంత్రాదులచేత జేయబడిన రక్షణ గలుగుట వలన పిశాచాదుల చేత పీడింపబడని బాలకాదులు గలిగినది - పురుటిల్లు.

సీ. కర్పూర సమ్మిశ్ర గంధసారంబునఁ
జఱచె [1]జప్పట భిత్తిఁ జామ యొకతె
[2]వెలికిలం బెట్టె నుత్పలగంధి యొక్కర్తు
గప్పు గర్భగృహోపకంఠ భూమి
జ్యేష్ఠాధిదేవత సేవించె నొక యింతి
పసపు బుట్టముగట్టి భక్తిగరిమ
బటముపై లిఖియించెఁ బాటలాధర యోర్తు
క్రొత్తలత్తుక [3]శశాంకుని ఖరాంశు

గీ. [4]జరఠ మేంఠంబు కంఠదేశమున జుట్టె
బుష్ప డుండుభముల నొక్క పువ్వుబోఁడి
యంబుజానన యొకతె నె య్యభిఘరించె
భుజగనిర్మోక మొకతె నిప్పులం గమర్చె 71.

అర్థము: చామ + ఒకతె = ఒక స్త్రీ, కర్పూర-సమ్మిశ్ర-గంధసారంబునన్ = కర్పూరముతో గలిసిన మంచిగందముతో, భిత్తిన్ = గోడమీద, చప్పట = పిడుక,చఱచెన్.

ఉత్పల - గంధి - ఒక్కర్తు = కలువపూల పరిమళమ వంటి పరిమళముగలది - స్త్రీ. ఒకతె, గర్భ - గృహ + ఉపకంఠభూమిన్ = పురుటింటి సమీప ప్రదేశమున, కప్పన్ = కప్పను, వెలకిలన్ + పెట్టెన్ = వీపు క్రిందికుండునట్లు పెట్టెను.

ఒక + ఇంతి = ఒక స్త్రీ, పసపు + పుట్టమున్ = పసపు బట్టను, కట్టి, భక్తి-గరిమన్ = మిక్కిలి భక్తితో, జ్యేష్ఠా + అధిదేవతన్ = జ్యేష్ఠాదేవిని, సేవించెన్.

---

1. తా. నప్పటి. 2. తా. వెలకెలం., 3. తా. శశాంకశేఖరాంశు. 4. తా. జరఠమేఢ్రంబు

పాటల + అధర = తెలుపు మించిన యెఱుపు వర్ణము గల క్రింది పెదవి గలది-స్త్రీ, ఓర్తు = ఒకతె, క్రొత్త-లత్తుకన్ = క్రొత్త లాక్షారసముతో, శశాంకునిన్ = చంద్రుని, ఖర + అంశున్ = తీక్ష్ణమైన కిరణములుగల వానిని (సూర్యుని), పటముపైన్ = వస్త్రము మీఁదఁ, లిఖియించెన్ = వ్రాసెను.

ఒక్క-పువ్వుఁబోఁడి = ఒక, పువ్వువంటి మేనుగలది-స్త్రీ, జరఠ-మేంఠంబు = ముసలి పొట్టేలు యొక్క, కంఠ-దేశమునన్ = మెడలో, పుష్ప-డుండుభములన్ = ఇరుదల పాములవంటి పూలమాలలను, చుట్టెన్.

అంబుజ + ఆనన = పద్మమువంటి ముఖము గలది-స్త్రీ, ఒకతె, నెయ్యి, అభిఘరించెన్ = మిడిచెను (కొంచెముగా వేసెను). ఒకతె, భుజగ-నిర్మోకము = పాఁప కుబుసమును, నిప్పులన్ = నిప్పులందు, కమర్చెన్ = కాల్చెను.

తాత్పర్యము: ఆ పురుటింట నొక స్త్రీ కర్పూరముతోఁ గలిసిన మంచి గంధముతో గోడపై పిడుకలు చఱచెను. మఱియొకతె పురుటింటికి సమీపమున కప్పను వెలికిల పరుండబెట్టెను. వేఱొకతె పసపు వస్త్రమును ధరించి మిక్కిలి భక్తితో జ్యేష్ఠాదేవి నర్చించెను. ఇంకొకతె క్రొత్త అలక్తకముతో చంద్ర సూర్యులను వస్త్రముపై లిఖించెను. మఱియొక యింతి ముసలి పొట్టేలు మెడలో రెండు తలల పాములవంటి పూలమాలలను గట్టెను. ఇంకొకతె నేయభిఘరించెను. వేఱొకతె పాఁప కుబుసమును నిప్పులలో కాల్చెను.

విశేషములు: ఇందు పేర్కొనబడిన యాచారము లన్నియు శ్రీనాథుని నాఁట సంఘమున బురుటింట చేయునవి కావచ్చును. ఇవి యన్నియు తెలిసిన కవి సార్వభౌముని లోకజ్ఞత మెచ్చదగినది. అధునాతన వైద్యాలయములలో పురుళ్లుపోయు నేటి కాలమున నవి యన్నియు మఱుగయి పోయినవి. పల్లెలలో నిప్పటికి నిందు కొన్ని కానవచ్చును. గర్భగృహము = పురుటిల్లు (గర్భాగారము = పురుటిల్లు = సూ.ని.), జ్యేష్ఠాధిదేవత-పెద్దమ్మ, లక్ష్మీదేవి యక్క, ఒకానొక శివశక్తి-(సూ.ని) పసపుఁబుట్టము = పసవు + పుట్టము. ఉదంత స్త్రీ సమమునకు పరుషము పరమగుచున్నది కావున నుగాగము-పిమ్మట (ద్రుతకార్యము. మేంఠము-మేంఠః మేండః- An elephant Keeper మేంఢః = A ram Apte జరఠమేఢ్రంబు - అని తాళ పత్ర ప్రతి పాఠము. మేఢ్రము = పొట్టేలు.

ఉ. మంగళ రత్నదీపముల మధ్యమునం బురుటింటి పాన్పుపై
నంగజసన్నిభుండు సచివాగ్రణి నందనుఁడొప్పె నెంతయు
న్నింగిఁ బ్రదోషవేళ నతి నిర్మల తారక [1]చక్రవాళముల్
సంగతి జుట్టునుం గొలువఁ జాలగ నొప్పు శశాంకుకైవడిన్ 72.

1. తా. చక్రవాకముల్

అర్థము : ప్రదోష - వేళన్ = మునిమాపు వేళ, నింగిన్ = ఆకాశమునందు, అతి - నిర్మల - తారక - చక్రవాళముల్ = మిక్కిలి స్వచ్ఛములైన నక్షత్రముల సమూహములు, సంగతిన్ = కూడికతో, చుట్టును, కొలువన్ = ఓలగింపగా, చాలగన్ = మిక్కిలిగా, ఒప్పు, శశాంకు - కైవడిన్ = చంద్రునివలె, అంగజ - సన్నిభుండు = మన్మథునితో సమానుడు (అగు), సచివ + అగ్రణి - నందనుడు = మంత్రి శ్రేష్ఠుడైన యజ్ఞదత్తుని కొడుకు, మంగళ - రత్న - దీపముల - మధ్యమునన్ = శుభకరములైన మణులనెడి దివ్వెల నడుమ, పురుటింటి - పాన్పుపైన్ = పురుటింటి యందలి సెజ్జపై, ఎంతయున్ = మిక్కిలి, ఒప్పెన్.

తాత్పర్యము : మునిమాపు సమయమున నాకాశమున మిక్కిలి నిర్మలములయిన నక్షత్రముల సమూహము కూడి చుట్టును ఓలగింపగా నెంతయు నొప్పెడి చంద్రుని విధమున, మన్మథతల్యుఁడగు మంత్రి పుత్త్రుడు శుభకరములయిన మణులనెడి దివ్వెల నడుమ పురుటింటి సెజ్జపై నధికముగా నొప్పెను.

విశేషములు : మంత్రి పుత్త్రునకు శశాంకునితో పోలిక గావున నుపమాలంకారము. మంత్రిపుత్త్రుడంగజ సన్నిభుడు. శశాంకుడు కూడ జక్కని వానిక్రింద లెక్క. ప్రదోష - సాయం సంధ్య. పురుటిల్లు గూడ జీకటి గనే యుండును. మంగళరత్నదీపములు - అతి నిర్మల తారక చక్రవాళములు. పాన్పు - నింగి - ఇట్లుపమేయోపమానములు రమ్యములుగా నున్నవి. పురుటింటనున్నవి రత్నములు. అవి దీపములవలె వెలుగొందుచున్నవి. లేదా ఆ దివ్వెలు మణిమయములని యైన జెప్పవచ్చును. పురుటింటి - పురుడు + (యొక్క) + ఇంటి పురుడు శబ్ద మౌపవిభక్తికము గావున యొక్క విభక్తి పరమగుచుండగా నంత్యవర్ణమునకు `టి' వర్ణమాదేశమై పురు + టి + (యొక్క) + ఇంటి అగును. `టి తి వర్ణంబుల పరంబులగునపు డుత్వంబున కిత్వంబగు.' (బాల. అచ్చిక. 36) నను సూత్రముచే పురిటింటి కావలయును. 'కొండొకచో నత్వంబున కిత్వంబు చూపట్టదు' - నెత్తుటికి - దీనిని గూడ నందు జేర్చుకొన్నచో పురుటింటి కావచ్చును.

గీ. బాలకుండు చంద్రచంద్రికా పాండు[1]వయిన
[2]పాన్పుపై నొప్పెఁ బొత్తులపై శయించి
యమృత వారాశిలోన శేషాహి మీదఁ
బవ్వళించిన కౌస్తుభాభరణుబోలి 73.

అర్థము : బాలకుండు = పిల్లవాడు (యజ్ఞదత్తుని కొడుకు), చంద్ర - చంద్రికా - పాండువు + అయిన = చంద్రుని యొక్క, వెన్నెలవలె, తెల్లనైన

1. తా. వైన. 2. ము. పాన్పుంబొత్తులపై నొప్పెఁబవ్వళించి.

పాన్పుపైన్ = సెజ్జమీద, పొత్తులపైన్ = మెత్తని గుడ్డలపై, శయించి = పండుకొని, అమృత - వారాశిలోనన్ = క్షీరసముద్రములో, శేష + అహి మీదన్ = శేషుడను పాముపయి, పవ్వళించిన = పరుండిన, కౌస్తుభ + ఆభరణున్ + పోలి = కౌస్తుభమనెడి మణి అలంకారముగా గలవాడగు విష్ణునిబోలి, ఒప్పెన్.

తాత్పర్యము : చంటి పిల్లవాడు చంద్రుని వెన్నెల వలె దెల్లనైన సెజ్జమీది మెత్తని గుడ్డలపై పరుండి, క్షీర సముద్రములో శేష తల్పముమీద పండుకొని యుండిన విష్ణునివలె నొప్పెను.

విశేషములు : బాలకుడు కౌస్తుభాభరణుబోలి యొప్పెను - ఉపమాలంకారము. బాలకుడు - కౌస్తుభాభరణుడు, చంద్ర చంద్రికా పాండువయిన పాన్పు - అమృతవారాశి, పొత్తులు = శేషాహి శయించి - పవ్వళించి - ఔపమ్యము మనోహరముగా నున్నది. అమృతవారాశి తెలుపు. పాన్పుగూడ చంద్రచంద్రికా పాండువు. శేషాహి మెత్తన. పొత్తులును మెత్తన. అమృతము = క్షీరము - Apte.

వారాశి = వార్ +రాశి. రేఫము పరమగుచుండగా పూర్వరేఫమునకు లోపము. కౌస్తుభము = విష్ణుని మణి కౌస్తుభ శబ్దవ్యుత్పత్తికి-చూడు 2-48 వ పద్యవ్యాఖ్య.

గీ. దాన ధర్మంబు లొనరించి త్యాగ మిచ్చి
ప్రసవగేహంబు లొనరించి త్యాగమిచ్చి
[1]యంబు పావక సంస్పర్శ మాచరించి
ప్రథమతనయు ముఖేందుబింబంబు సూచె. 74

అర్థము : భూపాల - మంత్రి = రాజగు హేమాంగదుని యొక్క మంత్రియగు యజ్ఞదత్తుడు, దాన - ధర్మంబులు, ఒనరించి = చేసి, త్యాగము + ఇచ్చి = ఔదార్యము చూపి, ప్రసవ - గేహంబు = పురిటిల్లు, చొచ్చి = ప్రవేశించి, అంబు - పావక - సంస్పర్శము = నీటియొక్కయు, అగ్ని యొక్కయు తాకుడు, ఆచరించి = చేసి, ప్రథమ - తనయు = మొదటి కొడుకు యొక్క, ముఖ + ఇందు - బింబంబ = చంద్రమండలము వంటి మొగమును, చూచెన్.

తాత్పర్యము : మంత్రియగు యజ్ఞదత్తుడు దానధర్మములు చేసి, ఔదార్యమును జూపి, పురిటిల్లు ప్రవేశించి, నీటిని, అగ్నిని తాకి తన మొదటి కొడుకు చంద్ర బింబము వంటి ముఖమును చూచెను.

విశేషమలు : త్యాగము (ప్ర.) - చాగము (వి). గేహంబు + చొచ్చి = గేహంబు సొచ్చి, బింబంబు + చూచె = బింబంబు సూచె - `ప్రథమ మీది పరుషములకు గసడదవలు బహుళముగానగు.' ప్రసవము - (నా.నా.)కాన్పు, పువ్వు,

1. ము. యప్పు

బిడ్డ. దానధర్మములు - దానమును, ధర్మమును - ద్వంద్వములు, ముఖేందు బింబము - ఇందు బింబము వంటి ముఖము - ఉపమానోత్తరపద కర్మధారయము. పుత్రముఖ ప్రథమ సందర్శనమునకు ముందు నీటిని, అగ్నిని స్పృశింపవలయునను ఆచారము తెలియుచున్నది.

గీ. పురుడు చెల్లంగఁ బుణ్యాహమును నొనర్చె
నిలయదైవతములఁ గొల్చి నిజసుతునకు
మారసన్నిభునకు సుకుమారుఁడనెడి
పేరు వెట్టెఁ బ్రధానబృందారకుండు. 75

అర్థము : పురుడు, చెల్లంగన్ = ముగియగా, ప్రధాన - బృందారకుండు = మంత్రిశ్రేష్ఠుడు (యజ్ఞదత్తుడు), పుణ్యాహమున్ = మంగళార్థము చేయు శుభకార్యమును, ఒనర్చెన్ = చేసెను, నిలయ - దైవతములన్ = ఇలువేల్పులను, కొల్చి = సేవించి, మార - సన్నిభునకున్ = మన్మథునితో సమానుడు (అగు), నిజ - సుతునకున్ = తన కొడుకునకు, సుకుమారుండు + అనెడి, పేరు + పెట్టెన్.

తాత్పర్యము : పురిటి శుద్ధియైన పిమ్మట మంత్రిశ్రేష్ఠుడగు యజ్ఞదత్తుడు పుణ్యాహవాచనము చేసి, యిలువేలుపులను పూజించి మన్మథ సమానుడైన తన కొడుకునకు సుకుమారుడను పేరు పెట్టెను.

విశేషములు : ప్రధాన బృందారకుండు- బృందారకుని వంటి ప్రధానుడు ఉపమానోత్తరపద కర్మధారయము. బృందారకుడు - `బృందారకా దైవ తాని' `శోభనం బృందం యేషాం తే - బృందారకాః - మంచి సమూహము గలవారు - దేవతలు - అమరము. బృందారక శబ్దమిట శ్రేష్ఠతావాచకము. శ్రేష్ఠుడైన, ప్రధానుడని యర్థము. పుణ్యాహమునన్ + ఒనర్చి - ద్రుతముమీద నకారము, పురుడు = సాటి (నా.నా.)

గీ. పసపుఁబుట్టంబు ధరియించి పద్మనయన
సుతుని నుత్సంగమునఁ దాల్చి చూడనొప్పెఁ
దరణి బింబ హారిద్ర వార్ధరముతోడ
లలితరుచి నొప్పు నాకాశలక్ష్మి వోలె. 76

అర్థము : తరణి - బింబ - హారిద్ర - వార్ + ధరముతోడన్ = సూర్య బింబము వలన, పసపు వర్ణముగల, మేఘముతో, లలిత - రుచిన్ = మనోహరమైన కాంతితో, ఒప్పు, ఆకాశ - లక్ష్మి + పోలెన్ = ఆకాశ మనెడి లక్ష్మి వలె, పద్మ - నయన = తామరల వంటి కన్నులు గలది. స్త్రీ - సుశీల, పసపు + పుట్టంబున్ = పసపు బట్టను, ధరియించి, సుతునిన్ = కొడుకును, ఉత్సంగమునన్ = ఒడియందు, తాల్చి, చూడన్, ఒప్పెన్.

తాత్పర్యము : సూర్యబింబము వలన పసపు వర్ణము గల మేఘముతో మనోహరకాంతి గలిగి యొప్పునాకాశమనెడి లక్ష్మి వలె, దామరలవంటి కన్నులుగల సుశీల పసపు బట్టను ధరించి కొడుకు నొడిలో పెట్టుకొని చూడనొప్పెను.

విశేషములు : పద్మనయన ఆకాశ లక్ష్మి వోలె చూడనొప్పెను - ఉపమాలంకారము. సుశీల బాలెంత కావున పసపు పుట్టమును ధరించినది. ఆకాశలక్ష్మియు హారిద్రమైన (పసపు వర్ణమగల) వార్ధరముతో గూడినది. సుశీల సుతు నుత్సంగమున దాల్చినది. ఆకాశ లక్ష్మి తరణి బింబముతో గూడినది. ఆకాశమనక ఆకాశలక్ష్మి యనుట సుశీలతోడి ఔపమ్యము కొఱకు. ఆకాశ లక్ష్మి - ఆకాశ మనెడి లక్ష్మి - రూపకము. పసపు + పుట్టము - ఉదంత స్త్రీసమమునకు బరుషము పరమగుచున్నది కావున నుగాగమము. పిమ్మట ద్రుత కార్యము - పసపుబుట్టము. తరణి - `ద్యుమణిస్తరణిర్మిత్ర శ్చిత్ర భాను ర్విరోచనః' `తరం త్యనేన తమ ఇతి తరణిః' - అంధకారము నితని చేత తరింతురు. సూర్యుడు - అమరము. నానా. నావ. హారిద్ర - హారిద్ర గలది. సుశీల కొడుకు అప్పుడే పుట్టిన వాడుగావున తరణి ఉదయించు చున్నవాడని తలపవలయును. అప్పుడు సూర్యుడు పసుపు వన్నె గలిగియుండును. వానిచే వార్ధరము హారిద్రమయినది. ఒప్పు + ఆకాశలక్ష్మి - `ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చుపరమగునపుడు నుగాగమంబగు. బా.సం. 33.

గీ. పల్లవాధర మడుగైన యొల్లె గట్టెఁ
గొంగు మణి హేమ కంఠికా కోటిఁ జెరివి
సొబగుంగాటుక బొట్టుతోఁ జూడ నొప్పె
వింత చెలువునఁ బచ్చి బాలెంత[1]రాలు 77.

అర్థము : పల్లవ + అధర = చిగురువంటి క్రింది పెదవి గలది - స్త్రీ - సుశీల, కొంగున్ = చెంగును, మణి - హేమ - కంఠికా - కోటిన్ = మణులతోను, బంగారముతోను నిర్మింపబడిన కంటె యొక్క అంచునందు, చెరివి = సంఘటించి, మడుగు + ఐన = శుద్ధమైన, ఒల్లెన్ = చీరను, కట్టెన్, పచ్చి బాలెంతరాలు, సొబగు + కాటుక - బొట్టుతోన్ = అందమైన కాటుక బొట్టుతో, వింత - చెలువునన్ = క్రొత్తయందముతో, చూడన్, ఒప్పెన్.

తాత్పర్యము: చిగురు వంటి వాతెరగల సుశీల కొంగును మణిహేమ మయమైన కంటెయంచున గ్రుచ్చి పరిశుద్ధమైన వస్త్రమునుధరించెను. పచ్చి బాలెంత య గు నామె సుందరముగ కాటుక బొట్టును పెట్టుకొని క్రొత్త యందముతో చూడ నొప్పెను.

విశేషములు : మడుగు - మణుగు (రూ.) ఒల్లె - ఒల్లియ (రూ.) సొబగు + కాటుక - ఉదంత స్త్రీ సమంబునకు బరుషము పరమగుచుండగా నుగాగమము,

1. ము. యపుడు.

పిమ్మట ద్రత కార్యము. సొబగు గాటుక. బాలెంతరాలు - బాలెంత + అలు. `పేదాది శబ్దంబుల కాలు శబ్దంబు పరంబగునపుడు కర్మధారయంబునందు. రుగాగమంబగు.' బా. సంధి. 30 అలంకారము స్వభావోక్తి.

ఉ. [1]రక్షకుఁ బుండరీక నఖరంబు సువర్ణలతా నిబద్ధమున్
వక్షమునన్ ధరించి సచివ ప్రియసూనుఁడు చూడనొప్పె ను
గ్రక్షతి సంభ్రమోద్ధతిగ [2]గాఁడి విడంబితమైన (మర్త్య) హ
ర్యక్షుని గోరు పేరురమునందు ధరించిన దైత్యుకైవడిన్ 78

అర్థము : సచివ - ప్రియ - సూనుడు = మంత్రియగు యజ్ఞదత్తుని యొక్క, అనుగు, కొడుకు, రక్షకున్ = రక్షణము కొఱకు, సువర్ణ - లతా - నిబద్ధమున్ = బంగరు దీగ తో గూర్పబడినది. అగు, పుండరీక - నఖరంబున్ = పులిగోరిని, వక్షమునన్ = ఱొమ్మునందు, ధరించి = తాల్చి, ఉగ్ర - క్షతి - సంభ్రమ + ఉద్ధతిగన్ = భయంకరమైన ఛేదించుట యందు వేగిరపాటుతో గూడిన పెద్ద దెబ్బగలది. యగునట్లు, కాడి = నాటుకొని,. విడంబి తము + ఐన = మించిన దైన, మర్త్య - హర్యక్షుని = నరసింహుని యొక్క, గోరు, పేరు + ఉరమునందున్ = పెద్ద ఱొమ్మునందు, ధరించిన = తాల్చిన, దైత్యు - కైవడిన్ = రాక్షసుని (హిరణ్యాకశిపుని) విధమున, చూడన్, ఒప్పెన్.

తాత్పర్యము : మంత్రియగు యజ్ఞదత్తుని యనుగు గొడుకు రక్షార్థము బంగరు దీగతో గూడిన పులిగోరిని ఱొమ్మునందు దాల్చెను, అప్పుడతడు - భయంకరముగా ఛేదించినప్పుడు కాడి మించిన నరసింహుని గోరిని దనపెను ఱొమ్మునందు ధరించిన హిరణ్యాకశిపుని విధమున చూడనొప్పెను.

విశేషములు : రక్షార్థము చంటిపిల్లలకు మెడలో బంగారమునుదాపిన పులిగోరి పతకమును వేయుట యిప్పుడును గలదు. సచివ ప్రియసూనుడు...........దైత్యుకైవడి జూడనొప్పెను - ఉపమాలంకారము. పిల్లవాడు ధరించినది పుండరీక నఖరము. దైత్యుడు ధరించినది సింహము గోరు. ఏవయిన నేమి ? రెండును గోరులేకదా! క్షతి = ఛేదించుట. ఛేదన సంభ్రమములో నరసింహుని గోరు హిరణ్యాకశిపుని వక్షమున పెద్దగాయ మగునట్లు నాటుకొని మించినది. విడంబితము - విడంబించు = అతిశయించు (సూ.ని.) అని కలదు గావున దీనికి మించిన అనునర్థము చెప్పబడినది. పేరు + ఉరము = పేరురము, పేరుటురము -` కర్మధారయంబునందు బేర్వాది శబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాషనగు.' బాల. సంధి. 29. హర్యక్షము - `హర్యక్షఃకేసరీ హరిః' `హరిణీ కపిలవర్ణే అక్షిణీ అస్య హర్యక్షః' కపిలవర్ణములైన

1. ము. అక్షయ వర్ణితాఖ్యుడు గరంబు(?) సువర్ణ, 2. మునిగాండివధన్వుని తండ్రియౌ సహస్రాక్షుని వైరి పేరురమునందు.

కన్నులు గలది - సింహము. అమరము. ఇచ్చట దైత్యుడు హిరణ్యకశిపుడు. ఇతని కొడుకు ప్రహ్లాదుడు. కొడుకు విష్ణుభక్తుడు. తండ్రి విష్ణుద్వేషి. 'ఈస్తంభమున విష్ణువు గలడా?' యని దానిని హిరణ్యకశిపుడు భేదింప, విష్ణువు దానియందు నరసింహావతారమున నావిర్భవించి యతనిని తనగోరులతో చీల్చి చంపెను. పుండరీకము = బెబ్బులి. తెల్లదామర, వెల్లగొడుగు. (నానా.) నఖర - 'పునర్భవః కరరుహో నఖోఽస్త్రియామ్.' గోరు. అమరము.

గీ. రత్నవేదికపై మంత్రిరాజసుతుడు
తల్లి హృదయంబు[1] దృష్టియుందన్ను గొలువ
[2]ఫాలతలమున రావ్రేక పరిణటింప
జాను చంక్రమణక్రీడ సంచరించె 79

అర్థము: మంత్రి -రాజ- సుతుడు = మంత్రిశ్రేష్ఠుడైన యజ్ఞదత్తుని కొడుకు, రత్న - వేదికపైన్ = మణిమయమైన యరగుపై, తల్లి = సుశీల యొక్క, హృదయంబున్ = మనస్సును, దృష్టులున్ = చూపులును, తన్నున్ + కొలువన్ = తన్ను ధ్యానించుచుండగా, ఫాల-తలమునన్ = నుదుటి ప్రదేశమునందు, రావ్రేక - రావిరేక (పిల్లలకు ముందు నిగయందుంచు రావియాకువంటి ఆభరణవిశేషము), పరిణటింపన్ = నాట్యము చేయుచుండగా, జాను - చంక్రమణ - క్రీడన్ = మోకాళ్ళపై దిరుగుటయను నాటతో, (మోకాళ్లపై బ్రాకుట యను నాటతో), సంచరించెన్ = తిరిగెను.

తాత్పర్యము : మంత్రి శ్రేష్ఠుడైన యజ్ఞదత్తుని కొడుకు, మణిమయమైన యరగుపై తల్లి సుశీల మనస్సును జూపును దనయందే యుండగా, నుదుట రావిరేకయల్లలాడుచుండగా, మోకాళ్లపై ప్రాకుచు తిరిగెన్ను.

విశేషములు : రావ్రేక - రావిరేక, రారేక (రూపాంతరములు), పరి - నటింప. రేఫము వలన నకారమునకు ణత్వము వచ్చినది. స్వభావోక్తి.

మ. వలిచన్నుల్ వడఁకాడ వేనలులు గ్రైవాలంగఁ గారాపుదా
దులలు త న్నేమఱ[3] కంతనంతఁ దిరుగన్ ధూర్తుండు తానుద్ధతిన్
గలకాంచీమణి కింకిణీకలకలా[4]త్కారంబు తోరంబుగా
గలహంసంబుల బట్ట[5]బాఱును వడిం[6]గక్ష్యావిభాగంబులన్ 80

అర్థము : గారాము + దాదులు = ప్రియధాత్రులు, వలి - చన్నుల్ = గుండ్రని పాలిండ్లు, వడంకాడన్ (వడకు + ఆడన్) = చలింపగా, వేనలులు = కొప్పులు, క్రైవాలంగన్ = ఒఱుగగా, తన్నున్, ఏమక = ఉపేక్షింపక, అంతన్ +

1. ము. దృష్టులు, 2. ము. సకలజనులును బంధులు సంతసింప. 3. ము. కంతలంతలను వేడ్కల్ మీఱి చూడగందా 4. తా. రావంబు. 5 తా. జారువడినిం, 6. తా. కక్ష్యాదిభాగంబులన్.

అంతన్ = కొలది దూరమున, తిరుగన్ = సంచరింపగా, ధూర్తుండు = వంచకుడు, తాను = సుకుమారుడు, ఉద్ధతిన్ = గర్వముతో, కల-కాంచీ - మణి - కింకిణీ - కలకలాత్కారంబు = అవ్యక్తమధురమైన (ధ్వనిగల), కాంచీ = మొలనూలి యందలి, మణి = రత్నమయములైన, కింకిణీ = చిఱుగంటల (మువ్వల) యొక్క, కలకలాత్కారంబు = కలకలయను ధ్వని, తోరంబు + కాన్ = అధికముకాగా, కక్ష్యా - విభాగంబులన్ = ఇంటిలోపలి భాగములందు, కలహంసంబులన్ = రాజహంసములను, పట్టన్, వడిన్ = వేగముతో, పాఱును = పరుగెత్తును.

తాత్పర్యము : అనుంగుదాదులు తమ గుంౘని పాలిండ్లు చలించుచుండగను, కొప్పులు ఒఱగగను తన్నుపేక్షింపక కొలది దూరమున తిరుగుచుండగా నా మోసగాడయిన పిల్లవాడు సుకుమారుడు, అడకువలేని వాడయి అవ్యక్త మధురమైన మొలనూలి మణిమయములైన మువ్వల కలకలధ్వని అధికము కాగా ఇంటి లోపలి భాగములందు రాయంచలను పట్టుకొనుటకు వేగముగా పరువెత్తును.

విశేషములు : వలిచన్నులు వడకాడుట తద్భారము వలన. వేనలులు కూడ గొప్పవే యగుటచే తిరుగుటవలన గ్రైవాలు చుండెను. గారాము- గారాబము, గారాబు- రూపాంతరములు. గారాము + దాదులు-`కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు.' బాల.సంధి.32. దాది- (వి),ధాత్రి (ప్ర). దాదిలి రూపాంతరము. చంట పిల్లలను కావ నియుక్తలైన స్త్రీలు. ఏమఱక - బాలునకే యపాయముగలుగునోయని. ఏమయిన జరిగినచో దమకు దండనము. అంతనంతదిరుగన్ - కొంతదూరమున దిరుగుట వానికి స్వేచ్ఛ యుండుట కొరకు. వానితోదాము తమ స్తనకచ భారములతో బరువిడజాలక పోవుటయు హేతువు కావచ్చును. ధూర్తుడు = వంచకుడు - తను వెంటనంటు దాదులకు జిక్కక వారిని మోసగించువాడు. ఈ పదమిట వాని భావి దుర్వర్తన సూచకము. ఉద్ధతిన్ = తాను దాదులకు జిక్కమికి-తన్నెవ్వరును బట్టలేరని గర్వము. కలకలాత్కారంబు తోరంబుగాన్-ఆ ధ్వని తోరమగుట పాఱుట యందలి `వడి' వలన. కలకలాత్కారము - `కారము' ధ్వనిని జెప్పునప్పుడు వచ్చు ప్రత్యయము. ఫూత్కారము,ఝణత్కారము ఇట్టివే. `కలకాంచీ...త్కారంబు' అన సమాసమున నా మువ్వలధ్వని వినబడుచున్నది. కలహంసము-ధూసర వర్ణములయిన ఱెక్కలు గలిగిన హంస.(సూ.ని.)రాయంచ అనియు.(సూ.ని.)వడి-అవి దొరకక పాఱుటచే. కక్ష్యా-మంత్రి గారిది పెద్ద గృహమగుటచే కక్ష్యలు పెక్కు. అలంకారము స్వభావోక్తి. కలాత్కారంబు తోరంబు-అంత్యప్రాసము. క్రైవాలు=కయిౙాలు, క్రైవాలు, కయివాలు (రూ.)

వ. అంత నా సుకుమారుండు [1]నత్యంత సంతోషవంతులగు తలిదండ్రుల మనోరథంబు ఫలియింప ననుదిన ప్రవర్ధమానుండై వర్ధమాన సంపదనపూపంబు[2]లగు

1. తా. ననంత సంతోషాక్రాంత స్వాంతులగు దంపతుల. 2. ము. గఁగుమారరత్నంబునకుం గ్రమ.

నైశ్వర్యానుభవంబులు గలిగి క్రమంబునం గృతచౌలోపనీతుండై యాచార్యగృహంబున కరిగి 81

అర్థము : అంతన్, ఆ - సుకుమారుండున్, అత్యంత - సంతోషవంతులు + అగు = మిక్కిలి సంతసము గలవారగు, తలిదండ్రుల (యొక్క), మనోరథంబు = కోరిక, ఫలియింపన్ = నెఱవేఱగా, అనుదిన - ప్రవర్ధమానుండు + ఐ = దినదినమునను వృద్ధిపొందు చున్నవాడయి, వర్ధమాన- సంపద్ + అనురూపంబులు + అగు = వృద్ధిపొందుచున్న సంపదకు దగినవి యగు, ఐశ్వర్య + అనుభవంబులు = భోగముల యొక్క పొందుటలు, కలిగి క్రమంబునన్, కృత-చౌల + ఉపనీతుండు + ఐ = చేయ బడిన, చూడాకర్మము (ఉపనయనమునకు ముందు చేయదగిన కేశసంస్కారము),వడుగు, కలవాడయి, ఆచార్య -గృహంబునకున్ = గురువు యొక్క ఇంటికి, అరిగి = వెడలి.

తాత్పర్యము : పిమ్మట నా సుకుమారుడును ఎంతయు సంతసించు తల్లిదండ్రుల కోరిక ఈడేఱునట్లు దినదినమునకు నెదుగుచున్న వాడయి, పెరుగుచున్న సంపదకు తగినవైన భోగముల ననుభవించుచు క్రమముగా చౌలము, ఉపనయనము ననుసంస్కారములను పొందినవాడయి యాచార్యునింటి కేగి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : పుత్త్రుడు గలిగినందులకే మిక్కిలి సంతోషించు నా తల్లిదండ్రుల మనోరథము వాని భోగానుభూతి ఫలించినది. వర్ధమాన - వృధ్ధాతు శతృప్రత్యయాంత రూపము. కృతచౌలోపనీతుడు

ఉపనయనము - వేదపఠనార్థము బాలుని గురు సమీపమునకు పంపుటకైన సంస్కారము.

సీ. చదివె వేద మెఱింగెం బదము [1]వాక్యంబుం బ
 మాణంబు దివ్యాగమములు చూచెం
దరిచె నాదిపురాణ ధర్మ శాస్త్రంబులు
 నేర్చె వీణా వేణు నృత్యకళలు
వాదవశ్యాంజన[2]వదనికాదులును జూ
 దంబును గణితశాస్త్రంబు దెలిసె
సరహస్యముగ నింద్ర[3]జాల మంత్రక్రియా
 తంత్రమంత్రములు జిత్తరువు గంచె

1. ము. వక్కాణించె మహనీయ. 2. ము. వదని కాదులు జూద మాదంగ నెఱింగెను మదన శాస్త్ర. తా. వదనికాదులును జూదంబు గణిత సముద్రంబు దెలిసె. 3. ము. జాలంబు యంత్రక్రియా మంత్ర తంత్ర చిత్తరువు గఱచె

గీ. గ్రోల్చె యోగంబు, సాధించె రుద్రభూమి
[1]సకల శస్త్రాస్త్ర సంచయ సమితి నేర్చె
[2]నాకళించెను విపుల వైద్యక్రమంబు
సంగ్రహించెం గవిత్వంబు సచివసుతుండు 82

అర్థము : సచివ - సుతుండు = మంత్రి కొడుకు - సుకుమారుడు, వేదము, చదివెన్, పదమున్, వాక్యంబున్ + ప్రమాణంబున్ = పదమును, వాక్యమును, ప్రమాణమును, ఎఱింగెన్, దివ్య + ఆగమములు = దేవతాసంబంధి శాస్త్రములు, చూచెన్ = చదివెను.

ఆది - పురాణ - ధర్మ - శాస్త్రంబులు, తరిచెన్ = మథించెను, వీణా - వేణు - నృత్య - కళలు = వీణవాయించుట, పిల్లన గ్రోవి యూదుట, నాట్యము చేయుట అను కళలు, నేర్చెన్. వాద వశ్య + అంజన వదనికా + ఆదులును, జూదంబును, గణిత శాస్త్రంబున్, తెలిసెన్. స- రహస్యముగన్ = రహస్యములతో గూడ, ఇంద్రజాల - మంత్ర - క్రియా - తంత్ర - మంత్రములున్ = ఇంద్రజాలము, మంత్రసహితక్రియలు, తంత్రములు, మంత్రములును, చిత్తరువున్ = చిత్రలేఖనమును, కఱచెన్ = అభ్యసించెను. యోగంబు = యోగశాస్త్రమును, క్రోల్చెన్ = పఠించెను, రుద్రభూమి, సాధించెన్, సకల - శస్త్ర + అస్త్ర - సంచయ - సమితిన్ = ఎల్ల శస్త్రములయు, అస్త్రములయు, రాశులయొక్క, సమూహమును, నేర్చెన్, విపుల - వైద్య - క్రమంబున్ - విస్తారమైన, వైద్యశాస్త్రము యొక్క, విధమును, ఆకళించెను = తెలిసికొనెను, కవిత్వంబున్ = కవనమును, సంగ్రహించెన్ = లెస్సగా తెలిసికొనెను.

తాత్పర్యము: మంత్రి కొడుకగు సుకుమారుడు వేదమును పఠించెను. పదవాక్యప్రమాణముల నెఱిగెను. దివ్యములైన శాస్త్రములను చూచెను. ప్రాచీనములయిన పురాణములను, ధర్మశాస్త్రములను మథించెను. వీణావేణు వాదనములను, నృత్యకళను అభ్యసించెను వాదవశ్యా జన వదనికాదులును, జూదమును, గణితశాస్త్రమును తెలిసెను. ఇంద్రజాలమును, మంత్రతంత్రములను తద్రహస్యములతో గ్రహించెను. చిత్రలేఖనమును నేర్చెను. యోగశాస్త్రము నభ్యసించెను. ఎల్ల శస్త్రాస్త్రములను నేర్చెను. విస్తారమగు వైద్యశాస్త్రప్రకారమును తెలిసికొనెను. కవిత్వమును నేర్చెను.

వ. ఇవ్విధంబున సర్వవిద్యాపరిశ్రమంబునం[3]బ్రాగల్భ్యంబు వహించిన సుకుమారునకు శైశవంబు సరిగడచుటయుం బ్రదోషంబునకుం జంద్రోదయంబును, [4]జలధరంబునకు శక్రచాపంబునుం,[5]బుష్పంబునకు వాసనాప్రకారంబును,

---

1. తా. కరభటజ్ఞాన వీథికిం గాలుసాచె, 2. తా. అభ్యసించెను విపుల వైద్యములు నేర్చె. 3. ము. పారీణుండై యుండు నక్కుమారునకు. 4. తా. సజల ధరంబునకుం జక్రవాకంబును, 5. తా. కల్ప పాదపంబునకుం గుసుమ ప్రకారంబును.

గమలవనంబునకు సూర్యో దయంబును,గంధ గజంబునకు దానంబును, విజ్ఞానంబునకు మౌనంబును, [1]నవధ్యునకు గేయంబును, రాజ్యబలంబునకు నాజ్ఞాబలంబునుంబోలె భువనసమ్మోహనంబైన సౌందర్యంబున [2]కనురూపంబై జవ్వనంబావిర్భవించిన. 83

అర్థము: ఈ + విధంబునన్, సర్వ - విద్యా - పరిశ్రమంబునన్ = ఎల్లవిద్యలయందలి కృషియందును, ప్రాగల్భ్యంబు = నేర్పు, వహించిన = పొందిన, సుకుమారునకున్, శైశవంబు = బాల్యము, సరి - కడుచుటయును = ముగియగా, ప్రదోషంబునకున్ = ముని మాపునకు, చంద్ర + ఉదయంబును = చంద్రుని పొడుపును, జలధరంబునకున్ = మేఘమునకు, శక్ర - చాపంబును = ఇంద్రధనుస్సును, పుష్పంబునకున్ = పువ్వునకు, వాసనా - ప్రకాంబును = గంధము యొక్క విధానమును, కమల - వనంబునకున్ = తామరలతోపునకు, సూర్య + ఉదయంబును = సూర్యుని యొక్క ఉదయమును, గంధ - గజంబునకున్ = మదపు టేనుగునకు, దానంబును = మదజలమును, విజ్ఞానంబునకున్ = ప్రజ్ఞకు, మౌనంబును = మాటాడకుండుటయు, అవధ్యునకున్ = వధింపదగని వానికి, గేయంబును, రాజ్య - బలంబునకున్, ఆజ్ఞా - బలంబునున్ + పోలెన్, భువన - సమ్మోహనంబు + ఐన= లోకములయొక్క, ఆకర్షణము గలదియైన - లోకములనాకర్షించునట్టిదియైన, సౌందర్యంబునకున్ = అందమునకు, అనురూపంబు + ఐ + తగినదై, జవ్వనంబు = యౌవనము, ఆవిర్భవించినన్ = కలుగగా.

తాత్పర్యము: ఈ రీతిగా నెల్ల విద్యలందును కృషిచే నేర్పు సంపాదించిన సుకుమారునకు బాల్యము గడవగా - మునిమాపునకు చంద్రోదయము వలెను, మేఘమున కింద్ర ధనువువలెను, పూవునకు పరిమళము వలెను, తామరల సమూహమునకు ప్రొద్దుపొడుపు వలెను, మదపుటేనుగునకు దానజలము వలెను, విజ్ఞానమునకు మౌనము వలెను, రాజ్యబలమునకు అధికారబలము వలెను, లోకాకర్షక మయిన యతని సౌందర్యమునకు తగినవిధమున యౌవనము కలుగగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ఉపమాలంకారము. ఇవి పెక్కులున్నవి కావున మాలోపమ. మొదట బాల్యము - తరువాత యౌవనము. అట్లే మొదట ప్రదోషము - పిమ్మట చంద్రోదయము. ఇటులే తక్కిన వాని విషయమునను. భువన సమ్మోహనంబయిన సౌందర్యము - పుట్టినప్పుడే యిత `డంగజసన్నిభుడు' గదా!

ఈ సందర్భమున కాదంబరీ మహాకావ్యమునందలి చంద్రాపీడ యౌవనారంబ వర్ణనము పరికింపదగినది.

---

1. తా. దానంబునకు నాత్మ శ్లాఘాది పర్యంబును 2. తా. కనురాగంబైన యవ్వనం బావిర్భ.

`ఏవం తస్య సర్వవిద్యాపరిచయ మాచరత శ్చన్ద్రాపీడస్య త్రిభువన విలోభనీయోఽమృతరస ఇవ సాగరస్య, సకలలోక హృదయ నయనానంద జనన శ్చన్ద్రో దయ ఇవ ప్రదోషస్య, బహువిధరాగవికార భంగురః సురధనుః కలాప ఇవ జలధరసమయస్య, మకరధ్వజాయుధభూతః కుసుమప్రసవ ఇవ కల్పపాదపస్య, అభినవాభివ్యజ్యమాన రాగరమణీయః సూర్యోదయ ఇవ కమలవనస్య, వివిధలాస్య విలాసయోగ్యః కలాప ఇవ శిఖణ్డినో యౌవనారమ్భః ప్రాదుర్భవన్ రమణీయస్యాఽపి ద్విగుణాం రమణీయతాం పుపోష.'

ఇందు `సర్వవిద్యా పరిచయ మాచరతశ్చన్ద్రాపీడస్య - `సర్వవిద్యా పరిశ్రమంబునం బ్రాగల్భ్యంబు వహించిన సుకుమారునకు. `సకలలోక ..... ప్రషస్య' - `ప్రదోషంబునకుం జంద్రోదయంబును.' `బహువిధ.... జలధర సమయస్య' - `జలధరంబునకు శక్రచాపంబును' `మకరధ్వజా యుధభూతః....కల్పపాదపస్య' - `కల్పపాదపంబునకు గుసుమ ప్రకారంబును.' (ఈ పాఠము తాళపత్రప్రతిలోనిదని యధస్సూచికలో నీయబడినది. ఈ పాఠమే మేలని తోచుచున్నది.) `అభినవ కమలవనస్య '-`కమల వనంబునకు సూర్యోదయంబును' అను అనుసరణములు గుఱుతింపదగినవి.

గీ. బాల్యమునయందుఁ గలుగు సౌభాగ్యరేఖ
నినుమడించిన సౌందర్య మెసక మెసఁగ
సచివతనయుండు [1]తారుణ్యసంక్రమమునఁ
[2]బద్మముఖులకుఁ గన్నులపండువయ్యె. 84

అర్థము: బాల్యమునయందున్ = శైశవమునందు, కలుగు, సౌభాగ్య - రేఖన్ = సౌందర్యము యొక్క నిండు దనమును, ఇనుమడించిన = రెట్టించిన, సౌందర్యము = అందము, ఎసకము + ఎసంగన్ = అతి శయింపఁగా, సచివ - తనయుండు = మంత్రికొడుకు - సుకుమారుడు, తారుణ్య - సంక్రమమునన్ = యౌవనము యొక్క, ప్రవేశముచే, పద్మ -ముఖులకున్ = తామర వంటి ముఖము గలవారికి - స్త్రీలకు, కన్నుల - పండువు + అయ్యెన్ = నేత్రోత్సవమయ్యెను.

తాత్పర్యము: బాల్యమునందే యున్న సౌందర్యమును రెట్టించు యౌవనము కలుగగా మంత్రికొడుకగు సుకుమారుడు తామరలవంటి మొగములు గల స్త్రీలకు కనువిందు చేయుచుండెను.

విశేషములు: సుకుమారుడు శైశవముననే అంగజసన్నిభుడని చెప్పబడినాడు. యౌవనప్రాప్తిచే నిపుడతని సౌందర్యమినుమడించినది. తరుణభావము తారుణ్యము.

1. ము. తా నొప్పి బారులీలఁ, 2. ము. పౌరజనులకు.

శా. పంచారామవిలాసినీధవళదృక్పాఠీన జాలాయమా
నాంచ [1]త్కోమలనిర్నిబంధన మనోజ్ఞాకార రేఖా (కళా)
పంచాస్త్రుండగు నా[2]కుమారుఁడురుదర్పస్ఫూర్తి నవ్వీటిలో
సంచారం బొనరించెం గాంచనమహాసౌధాగ్రభాగంబులన్ 85

అర్థము: పంచా.... పంచాస్త్రుండు : పంచారామ = పంచారామములందలి, విలాసినీ = ఒయారుల యొక్క, ధవళ - దృక్ + పాఠీన = తెల్లని చూపులనెడి వేయి కోఱల చేపలకు, జాలాయమాన = వలవలెనాచరించుచున్న, అంచత్ = ఒప్పుచున్న, కోమల = మృదువైన, నిర్నిబంధన = అడ్డులేని, మనోజ్ఞ = మనోహరమైన, ఆకార - రేఖా - కళా = రూపరేఖా విలాసము చేత, పంచ + అస్త్రుండు = మన్మథుడు (అయిదు బాణములు గలవాడు), అగు, ఆ - కుమారుండు = ఆ సుందరుడు, ఆ + వీటిలోన్ = ఆ పట్టణములో, కాంచన - మహా (మహత్) + సౌధ + అగ్ర - భాగంబులన్ = బంగారు గొప్పమేడలయొక్క పై భాగములందు, ఉరు - దర్ప - స్ఫూర్తిన్ = గొప్పగర్వము యొక్క ప్రకాశముతో, సంచారంబు + ఒనరించెన్ = సంచరించెను.

తాత్పర్యము: పంచారామములందలి యొయారుల తెల్లని చూపు లనెడి కొఱ్ఱ చేపలకు వలయగుచున్న మృదువైనదియు, అడ్డు లేనిదియు, మనోహరమయినదియునగు సౌందర్యము చేత మన్మథుడగు నా సుందరుడు సుకుమారుడు ఆ పట్టణములోని బంగారు మేడల పయి భాగములందు మిక్కిలి గర్వముతో సంచరించెను.

విశేషములు: పంచారామములందలి స్త్రీల చూపులనెడి కొఱ్ఱచేపలకు సుకుమారుని మన్మథసౌందర్యము వల యగుచుండెను. అనగా నా యింతుల చూపులను వశపఱుచుకొన గల సౌందర్యమతనిదియని భావము. ధవళదృక్ - చూపులను తెల్లనివిగను, నల్లనివిగను గూడ కవులు. వర్ణింతురు. చూపులు తెల్లగానుండుననుటకు -

`శుభ్రాణి భారతీధర్మ శేషేశ తరుణేన్దవః,
రేణుః కేతకఖర్జూర్యోః కటాక్షాహాస భస్మనీ', కావ్య కల్పలత `చంద్రికల్,దనుకం
జూచె లతాంగి భూసురుంబ్రఫుల్ల న్నేత్రపద్మంబులన్.'మను.చ.2.30
నల్లని వనుటకు -

`వేశ్యా స్త్వత్తో నఖపదసుఖాన్ ప్రాప్య వర్షాగ్రబిన్దూన్,
ఆమోక్ష్యన్తే త్వయి మధురకరశ్రేణిదీర్ఘాన్ కటాక్షాన్.' మేఘ.సం. 1.39.
`పూనెం బ్రేక్షణమాలికామధుకరీపుంజంబు నిర్వంకలన్'. వసు చ. 2.47

1. ము. త్కారము, 2. ము. రకుండు

సుకుమారుని ఆకారరేఖ `నిర్నిబంధనము' - స్వేచ్ఛాయుతమైనది. లేక లేక పుట్టినవాడు. మంత్రిగారి కొడుకు - కావున స్వేచ్ఛ. పంచాస్త్రుడు - మన్మథుడు - మన్మథుని అస్త్రపంచకము - `అరవిన్ద మశోకం చ చూతం చ నవమల్లికా,నీలోత్పలం చ పఞ్చైతే పఞ్చబాణస్య సాయకాః'. `ఉరుదర్పస్ఫూర్తి' - స్త్రీల చూపులు తన సౌందర్యమనెడి వలలో చిక్కుచున్నవి కావున తనకంటె నందగాడు లేడని గర్వము. ఆ - కుమారుడు - అందమున మన్మథుని క్రిందుపఱుచువాడు - సుందరుడు (సూ.ని.) సంచారం బొనరించెం గాంచన `మహాసౌధాగ్రభాగంబులన్ - అతని శ్రీమత్త్వాతిశయమును సూచించును. ధవళదృక్ పాఠీన - రూపకము - ధవళదృక్కులనెడి పాఠీనములు. జాలాయమాన - `జాల' అను నామమునకు ధాతుత్వవివక్షయందు `యమాన' ప్రత్యయము. ఉపమాన మైన `జాల' అను నజంత శబ్దమునకు కర్త్రర్థమున వర్తమానార్థమునందు ఆచారార్థమన `యమాన' ప్రత్యయము పరమయి, పూర్వాచ్చునకు దీర్ఘము రాగా `జాలాయమాన' అయినది. `జాలము (వల) వలె ఆచరించుచున్న అని యర్థము. అవ్వీటిలో - ఆ + వీటిలో - త్రికసంధి. వీడుశబ్ద మౌప విభక్తికముగావున `లో' అను సప్తమ్యర్థకప్రత్యయము పరముకాగా ఔపవిభక్తిక టి వర్ణ మంతాదేశము.

గీ. ఆదిగర్భేశ్వరత్వంబు యౌవనంబుఁ
జక్కఁ దనమును నతిసాహసంబుంజనువు
నొక్కఁడొక్కం[1]డు చాలు దోషోత్కరమున
కన్నియునుఁ [2]గూడియున్నవి యతనియందు. 86

అర్థము : ఆది - గర్భ + ఈశ్వరత్వంబున్ = ప్రథమ గర్భమందునికి యాదిగా ఐశ్వర్యము గలిగియుండుటయు, (అనాదిగా ఐశ్వర్యవంతుల కడుపుననే పుట్టుచు పుట్టినప్పటి నుండి యైశ్వర్యమే అనుభవించుట. అనుట) ఇట ఈశ్వరశబ్దమునకు `స్వామి' యను నర్థము గ్రహింపవలయును.),యౌవనంబున్ పడుచుదనమును, చక్కదనమును, అతి - సాహసంబున్ = మిక్కిలి చొరవయును, చనవున్ = అధికారమును, ఒక్కండు + ఒక్కండు = ఒక్కటొక్కటి, దోష + ఉత్కరమునకున్ = తప్పుల సమూహమునకు, చాలున్ = సమర్థమగును, అనగా వానిలో నొక్కొక్కటియే పెక్కుతప్పుల నొనరింప జేయుననుట, అతని +అందున్ = ఆ సుకుమారుని యందు, అన్నియును = పయిని చెప్పిన లక్షణములన్నియును, కూడి + ఉన్నవి = కలిసియున్నవి. ఇకనాతడు తప్పులకుప్పలను చేయునని వేఱుగా చెప్పవలయునా యనుట.

తాత్పర్యము: పుట్టినదాదిగా ఐశ్వర్యము, పడుచుదనము, చక్కదనము, పెను చొరవ, అధికారము అనువానిలో నొక్కొక్కటియే పెక్కు తప్పులను చేయింపగలుగ,

1. తా. డ చాలు దోషోష్ఠమదమున. 2. తా. రూఢి

నవియన్నియు నమరియున్న యా సుకుమారుడు తప్పులను కుప్పలుగా నొనరించునని వేఱుగా చెప్పవలయునా? చెప్పనక్కఱలేదని భావము.

విశేషములు: ఈ పద్యమునందలి భావము `హితోపదేశము'నందలి -

యౌవనం ధనసమ్పత్తిః ప్రభుత్వమవివేకితా,
ఏకైకమప్యనర్థాయ కిము యత్ర చతుష్టయమ్'.

అనుశ్లోక భావము ననుసరించి యున్నది. మఱియు కాదంబరి యందలి శుకనాసోపదేసము నందలి - `గర్భేశ్వరత్వ మభినవ యౌవనత్వమప్రతిమ రూపత్వ మమానుష శక్తిత్వం చేతి మహతీయం ఖల్వనర్థపరంపరా, సర్వావినయానా మేకైక మప్యేషా మాయతనం, కిముత సమవాయః' అను వాక్యము భావము ననుసరించినది. సుకుమారుడు మంత్రిగారి యేకైక పుత్త్రుడు గావున నతని కాదిగర్భేశ్వరత్వమున్నది. యౌవనము వచ్చినది. సౌందర్యమున్నది. మిక్కిలి చొరవగలదు. చనవు = అధికారముగలదు. ఇట్లతనియందన్నియు గూడియున్నవి. ఇక దోషోత్కరమునకు లోపము లేదనుట. ఆదిగర్భేశ్వరత్వాదులలో నొక్కొక్కటియే దోషోత్కరమునకు చాలియుండగా, నన్నియుగూడిన చెప్పవలయునా యనుటచే నలంకారము కావ్యార్థాపత్తి. కైముత్యేనార్థసంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే.

సీ. ఒక కొంత ప్రొద్దు కందుకకేళి యొనరించుఁ
గంకణంబుల ఝుణత్కార మెసఁగ
నొక కొంత ప్రొద్దు వల్లకి నఖాగ్రంబుల
బహురాగముల నేర్పుఁ [1]బ్రస్తరించు
నొక కొంత ప్రొద్దు [2]కొండిక జనంబు లొనర్పు
పరిహాసగోష్ఠికిఁ బల్లవించు.
నొక కొంతప్రొద్దు లోకకథాప్రహేళికా
బిందుమత్యాదులఁ బిచ్చలించుఁ

గీ. గొంత ప్రొద్దు వినోదించు [3]గొఱఁతలయిన
తోడివేడుక కాండ్రతో మేడమీద
విమలచంద్రోదయారంభవేళయందు
[4]బిల్లదీవాటలను ముల్లొ[5]పెనఁగుటలను. 87

అర్థము: సుకుమారుడు కర్త అధ్యాహార్యము. కంకణంబుల = హస్తాభరణముల యొక్క, ఝుణత్కారము = `ఝుణ' యను ధ్వని, ఎసంగన్ = అతిశయింపగా, ఒక - కొంత - ప్రొద్దు = కొంతసేపు, కందుక - కేళి = బంతి యాట, ఒనరించున్ =

1. తా. ప్రౌఢి చూపు., 2. ము. భాండక, 3. తా. ప్రౌఢలైన 4. తా. పిల్లదీపాటలను, 5. తా. వెలుంగుటలును.

చేయును. ఒక కొంత ప్రొద్దు, వల్లకిన్ = వీణయందు, నఖ + అగ్రంబులన్ = గోరుల కొనలతో, బహు - రాగముల = పలు రాగములయొక్క, నేర్పున్, ప్రస్తరించున్ = విస్తరించును. ఒక కొంత ప్రొద్దు, కొండిక - జనంబులు = అల్పులైన జనులు, ఒనర్చు = చేయునట్టి, పరిహాస- గోష్ఠికిన్ = పరియాచకపు సల్లాపమునకు, పల్లవించున్ = రక్తిని పొందును.

ఒక కొంత ప్రొద్దు, లోక - కథా -ప్రహేళికా - బిందుమతి + ఆదులన్ = లోకకథ, ప్రహేళిక (గూఢముగా నుంచబడిన యర్థముగల కావ్య విశేషము), బిందుమతి మున్నగువానిచేత, పిచ్చలించున్ = ఆనందించును. కొంత - ప్రొద్దు, మేడమీందన్, విమల - చంద్ర + ఉదయ + ఆరంభ - వేళ +అందున్ = నిర్మలమైన చంద్రోదయప్రారంభసమయమున, కొంతలు + అయిన = అల్పులయిన,తోడి - వేడుకకాండ్రతోన్ = సహక్రీడాసక్తులతో, పిల్లదీవి + ఆటలను = బాలక్రీడా విశేషముల తోను, మల్లు పెనంగుటలను = మల్లయుద్ధములతోను, వినోదించున్ = క్రీడించును.

తాత్పర్యము: సుకుమారుడు చేతి వలయముల ఝణఝణ ధ్వని అతిశయింపగా కొంతసేపు బంతియాట నాడును. కొంత సేపు వీణపై గోరికొనలతో పలు రాగములను నేర్పుతో పలికించును. కొంతసేపు అల్పులు చేయు పరియాచక సల్లాపమందు రాగిల్లును. కొంత తడవు లోక కథ, ప్రహేళిక, బిందుమతి మున్నగు వానిచే ఆనందించును. కొంత కాలము చంద్రోదయ ప్రారంభ సమయమున మేడమీద తోడియాటకాండ్రతో పిల్లదీవియాటలతోను, మల్లయుద్ధములతోను క్రీడించును.

విశేషములు: `ప్రహేళయతి సూచయతి భావం నత స్వరూపార్థమితి ప్రహేళికా" - స్వరూపార్థమును అనగా అర్థస్వరూపమును తెలుపక భావమును మాత్రము సూచించునది ప్రహేళిక. ఇది పొడుపు కథవంటిది.'రసస్య పరిపంథిత్వా న్నాలం కారః ప్రహేళికా.' ఇది కావ్యజీవన భూతమగు రసమునకు శత్రువగుటవలన నలంకారము కాదు. క్రీడా గోష్ఠివినోదములందును, రహస్యసంభాషణములందును పెక్కండ్రున్నచోట పరవ్యామోహమునకై యిది ఉపయోగపడును. ఇవి పదునాఱు భేదములని దండి చెప్పెను. సాహిత్య దర్పణమున అఱు భేదములు తెలుపబడెను. వానిలో `బిందుమతి' యొకటి. బిందువులను (సున్నలను) ఇచ్చినచో పద్యమును కనుగొనుట బిందుమతి.

వ. ఇవ్విధంబునం దృష్ణావిషవల్లి [1]కాలవాలంబును, నింద్రియగుణంబులకు శరణంబును, మోహ[2]నిద్రకు విభ్రమ శయనంబును, శాస్త్రదృష్టికిం దిమిరోద్గమంబును, దోషాశీవిషంబులకు[3]నావాస వల్మీకంబును, (సుగుణ కలహంసంబులకుం బ్రావృట్కాలంబును) గపట నాటకంబునకుం [4]బ్రస్తావనయు, ధర్మేందు మండలంబు నకు రాహువక్త్రంబును నైన యౌవనారంభంబున. 88

1. తా. కావలంబంబును, 2. తా. నిద్రలకు, 3. తా.నివాస, 4. తా. ప్రస్థాపనయు.

అర్థము: ఈ + విధంబునన్, తృష్ణా = విషవల్లికిన్ = ఆశయనెడు విసపుదీగకు, ఆలవాలంబును = పాదును, ఇంద్రియ - గుణంబులకున్ = ఇంద్రియముల యొక్క గుణములకు, శరణంబును = ఇల్లును, మోహ - నిద్రకున్ = అజ్ఞానమనెడి నిద్రకు, విభ్రమ - శయనంబును = విలాసవంతమైన పాన్పును, శాస్త్ర - దృష్టికిన్ = శాస్త్రమనెడి చూపునకు, తిమిర + ఉద్గమంబును = అంధత్వోదయమును, దోష + ఆశీవిషంబులకున్ = దోషములనెడి పాములకు, ఆవాస - వల్మీకంబును = నివాసమైన పుట్టయును, సుగుణ - కలహంసంబును = మంచి గుణములనెడి రాయంచలకు, ప్రావృట్ + కాలంబును = వర్షాకాలమును, కపట - నాటకంబునకున్ = మోసపు నాటకమునకు, ప్రస్తావనయున్ = ఆముఖమును, ధర్మ + ఇందు - మండలంబులకున్ = ధర్మమనెడి చంద్రబింబమునకు, రాహు - వక్త్రంబునున్ = రాహువుముఖమును, ఐన యౌవన + ఆరంభంబునన్ = పడుచుదనపు ప్రారంభమునందు.

తాత్పర్యము : ఈ రీతిగా ఆశయమనెడి విసపు దీగకు పాదును, ఇంద్రియముల గుణములకు నిలయమును, అజ్ఞాన మనెడి నిద్రకు విలాసపు పాన్పును, శాస్త్రమనెడి చూపునకు అంధత్వోదయమును, దోషములనెడి పాములకు నివాసస్థానమైన పుట్టయును, సద్గుణములనెడి రాజహంసములకు వర్షాకాలమును, కపట మనెడి నాటకమునకు ఆముఖమును, ధర్మమనెడి చంద్రబింబమునకు రాహుముఖమును అగు యౌవన ప్రారంభమునందు. తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : తృష్ణావిషవల్లి, మోహనిద్ర, శాస్త్రదృష్టి, దోషాశీవిషంబులు, సుగుణ కలహంసంబులు, కపటనాటకము ధర్మేందు మండలంబు - అను వానియందు రూపకాలంకారము. శాస్త్రము దృష్టియనుటకు-

అనేకసంశయోచ్ఛేది పరోక్షార్థస్య దర్శకమ్,
సర్వస్య లోచనం శాస్త్రం యస్య నాస్త్యన్ధ ఏవ సః. హితోప ప్ర.11

ఆశీవిషము - 'ఆశీవిషో విషధర శ్చక్రీ వ్యాళ స్సరీసృపః' - ఆశిషి దంష్ట్రాయాం విషమస్యాస్తీతి ఆశీవిషః, కోఱయందు విషముగలది - పాము. అమరము. నాటకము - రూపకభేదము. ప్రస్తావన - నాటకమున నొక యంగము. సూత్రధారుడు తా నుపక్షేపింపబోవు కార్యమును గూర్చి వాక్చమత్కారము మెఱయ నటీ మారిష విదూషకులలో నొకరితో ప్రస్తావించుట ప్రస్తావన లేక ఆముఖము అనబడును. కపట నాటకంబునకు ప్రస్తావనయు - 'ప్రస్తావనా ఇయం కపటనాటకస్య' - మాలతీ మాధవము - 2.4. 'ప్ర' కు 'వృట్' పదము పరమగునేని దీర్ఘమగును - ప్రావృట్.

"ఇయం సంవర్ధనవారిధారా - తృష్ణా విషవల్లీనాం, వ్యాధగీతి రిన్ద్రియ మృగాణాం, పరామర్శ ధూమలేఖా సచ్చరిత చిత్రాణాం, అకాల ప్రావృట్ గుణ కలహంసకానాం, ప్రస్తావనా కపటనాటకస్య, రాహుజిహ్వా ధర్మేన్దు మణ్డలస్య' అను

కాదంబరీ కావ్యస్థభాగమిట స్మర్తవ్యము.

సీ. ఆజాను దీర్ఘబాహార్గళస్తంభుండు
కోమలాళివినీలకుంతలుఁడు
కర్ణాంతవిశ్రాంత కమలాయతాక్షుండు
పరిఫుల్లచంపక [1]ప్రసవనసుఁడు
బహుళాష్టమీశశిప్రతిమ ఫాలతలుండు
కంబుసన్నిభచారుకంధరుండు
పరిపక్వ బింబికా[2]ఫల పాటలోష్ఠుండు
గంధవారణకుంభకఠిన భుజుఁడు

గీ. సచివతనయుండు కుపితధూర్జటిలలాట
చక్షు రనలార్చి రుద్గమ సంప్రభూత
విస్ఫులింగచ్ఛటా[4]ఘటా వేష్టనమునఁ
బసిమి దప్పని వలరాజు పగిది నొప్పె. 89

ఆజాను....స్తంభుండు: ఆజాను = మోకాళ్ల వఱకును, దీర్ఘ = పొడవులైన, బాహా + అర్గళ - స్తంభుండు = గడియమ్రాని కైన స్తంభము వంటి భుజములు గలవాడు, కోమ....... కుంతలుండు : కోమల = మృదువులైన, అళి = తుమ్మెదలవలె, వినీల = మిక్కిలి నల్లనైన, కుంతలుండు = తలవెంట్రుకలు గలవాడు. కర్ణాంత....... క్షుండు : కర్ణ + అంత = చెవుల కొనలందు, విశ్రాంత = విశ్రమించిన, కమల + ఆయత + అక్షుండు = పద్మములవలె, నిడుపులైన, కన్నులు గలవాడు, పరిఫుల్ల..... నసుండు:పరిఫుల్ల = మిక్కిలి వికసించిన, చంపక - ప్రసవ - నసుండు = సంపెంగపువ్వువంటి ముక్కు గలవాడు. బహు..... తలుండు: బహుళ = కృష్ణ పక్షమునందలి, అష్టమీ = అష్టమీ తిథినాటి, శశి = చంద్రునితో, ప్రతిమ = పోలికగల, ఫాల - తలుండు = నొసటి ప్రదేశముగలవాడు, కంబు..... కంధరుండు: కంబు = శంఖముతో, సన్నిభ = సమానమైన, చారు = మనోహరమైన, కంధరుండు = మెడ (కంఠము) గలవాడు. పరి..... లోష్ఠుండు : పరిపక్వ = బాగుగా పండిన, బింబికా - ఫల = దొండపండువలె, పాటల = తెలుపు మించిన యెఱుపు వర్ణము గల, ఓష్ఠుండు = పెదవిగలవాడు, గంధ .... భుజుండు: గంధ - వారణ = మదపు టేనుగు యొక్క, కుంభ = కుంభస్థలమువలె, కఠిన = గట్టివైన, భుజుండు = భుజములు గలవాడు (అగు) సచివ = తనయుండు = మంత్రి కొడుకు, సుకుమారుడు, కుపిత .... వేష్టమునన్ : కుపిత = కోపించిన, ధూర్జటి = శివుని యొక్క, లలాట = నుదుటియందలి, చక్షుః = (మూడవ) కంటి యొక్క, అనల =

1. తా. ప్రసవకా 2. ము పరిపాట లోష్ఠుండు. 3 తా. కరిభుజుండు. 4. ము. వలీ

అగ్నియొక్క, అర్చిః = జ్వాలయొక్క, ఉద్గమ = వెలువడుటనుండి, సంప్రభూత = పుట్టిన, విస్ఫులింగ + ఛటా = మిడుగుఱుల యొక్క, కాంతుల యొక్క, ఘటా = సమూహము యొక్క వేష్టనమునన్ = ఆవరించుటచేత, పసిమి + తప్పని = నవకము కోల్పోవని, వలరాజు - పగిదిన్ = మన్మథుని విధమున, ఒప్పెన్.

తాత్పర్యము: మోకాళ్ల వరకును దీర్ఘములైన గడియమ్రాకులవంటి బాహువులు గలవాడును, కోమలములును, తుమ్మెదలవలె నల్లనివియునైన శిరోజములు గలవాడును, చెవుల కొనలందు విశ్రమించినవి (చెవుల వరకు వ్యాపించినవి) పద్మముల వలె దీర్ఘములు నైన కన్నులు గలవాడును, బాగుగా వికసించిన సంపెంగ పూవును బోలిన ముక్కు గలవాడును, శంఖముతో సమానమై మనోహరమైన కంఠము గలవాడును, బాగుగా పండిన దొండపండు వలె పాటల వర్ణము గల పెదవి గలవాడును, మదపు టేనుగు కుంభస్థలము వలె దృఢమైన భుజములు గలవాడును అగు మంత్రి కొడుకు సుకుమారుడు కోపించిన శివుని నొసట కంటి మంటలనుండి పుట్టిన మిడుగుఱుల కాంతుల సమూహము ఆవరించుకొనుటచే కమలి నవకము కోలుపోవని మన్మథునివలె నొప్పెను.

విశేషములు: ఆజాను = జానువుల వఱకు - మర్యాదాభివిధులందు పదాది యందు `ఆఙ్' వచ్చును. `ఙ్' లోపించును. ఇందు మర్యాదార్థమునందు ఆఙ్వచ్చినది. అవ్యయీభావము. ఇది బాహా అర్గళస్తంభ పదములతో సమసించి బహువ్రీహిగా నంతమగు చున్నది. బాహార్గళస్తంభుండు - అర్గళస్తంభముల వంటి బాహులు = ఉపమిత సమాసము. నసా = నాసిక, కంధరము, కంధర రూపాంతరములు. కంధరము = (నానా) మెడ, మేఘము. బింబిక - బింబ = స్వార్థమున కప్రత్యయము. పాటల + ఓష్ఠ - అకారమునకు ఓతువు, ఓష్ఠము అను శబ్దములు పరమగునేని ఔకారము వికల్పముగా నేకాదేశము కావచ్చును. పక్షమున ఓకారమే ఏకాదేశమగును. కుపిత ...... వలరాజు పగిది - ఉపమావాచకమైన `పగిది' లేనిచో న్యూనాభేద రూపకము. `పగిది' ఉన్నందువలన నుపమాలంకారమగుచున్నది. చక్షుస్ + అనల, అర్చిస్ + ఉద్గమ - పదాంత సకారమునకు విసర్గాదేశము. అఆ లు తక్కతక్కిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులుకాని మృదుహల్లులు కాని పరములగునపుడు రేఫమాదేశమగును. చక్షురనల, అర్చిరుద్గమ. విస్ఫులింగ + ఛటా = హ్రస్వమునకు పరమైన `ఛ' కారమునకు ద్విత్వము. విస్ఫులింగ - `త్రిషు స్ఫులింగోఽగ్నికణః.' స్ఫూకారేణ లింగతి గచ్ఛతీతి స్ఫులింగః - స్ఫూకారము చేత పోవునది లేదా స్ఫులతీతి స్ఫులింగః చలించునది. మిణుగుఱు - అమరము. విస్ఫులింగ-స్ఫులింగ (రూపాలు). వలరాజు-`చందమామ యల్లుడు వలరాజు మరుడు లచ్చి, కొమరుండనుపేళ్ల నొప్పును గుసుమధన్వి.' (ఆం.నా.సం.దేవ) వలపు + రాజు.

సీ. [1]చరిగొన్న వెలిపట్టు జన్నిదంబులతోడ
[2]రత్నాల తారహారము ధరించి
వలిప నీర్కావి దోవతిపైఁ బదార్వన్నె
[3]కళయైన పసిడిమేఖల[4]ఘటించి
గంగమట్టియమీదఁ గస్తూరిరసమునఁ
బుండ్రకంబు లలాటమున నమర్చి
[5]విమలసన్మణికుండలముల పార్శ్వములందు
లలితంబులగు [6]నొంటు లలవరించి

గీ. యాత్మవంశపరంపరాయాతమైన
వైదికాచారమార్గంబు వక్కణించి
[7]యారజము రాచఱికమున నలవరించి
నగరి వీథులఁ జరియించుఁ బ్రెగడ సుతుఁడు 90

అర్థము: ప్రెగడ - సుతుడు = మంత్రి కొడుకు - సుకుమారుడు, చరిగొన్న =? సరిగొన్న (ముద్రితప్రతి పాఠము) = సమముగా నున్న? వెలి - పట్టు = తెల్లపట్టు, జన్నిదంబులతోడన్ = జందెములతో, రత్నాల - తార - హారమున్ = రత్నమయమైనట్టియు, పెద్దవియు, పరి శుద్ధములు నైనట్టియు ముత్తెముల సరమును, ధరించి = తాల్చి,వలిప - నీర్కావి - దోవతిపైన్ = పరిశుద్ధమైనదియు, కొంచె మెఱ్ఱనిదియునైన, దోవతిపైన్ = దోతిపై (పంచెమీద), పదార్వన్నె కళ = (పది +ఆర్ + వన్నె) = పదియాఱు వన్నెకళగల, పసిడి = బంగారు, మేఖలన్ - మొలనూలిని, ఘటించి = కూర్చి, గంగమట్టియ మీదన్ = గంగ మట్టిమీద, కస్తూరి - రసమునన్ = కస్తూరి ద్రవముతో, లలాటమునన్ = నుదుట, పుండ్రకంబున్ = నామమును, అమర్చి = అమరునట్లు చేసి, - పెట్టి, విమల -సత్ + మణి - కుండలముల - పార్శ్వములందున్ = నిర్మలములైన మంచి మణులతో చేయబడిన చెవిపోగుల యొక్క పక్కలందు, లలితంబులు + అగు + అందమైనవియగు, ఒంటులు = కర్ణభూషణములు, అలవరించి = ధరించి. ఆత్మ - వంశ - పరంపరా + ఆయాతము + ఐన = తనయొక్క, కులము యొక్క, వరుసనుండి, వచ్చినది యగు, వైదిక + ఆచార - మార్గంబున్ = వేదవిహితమైన, అనుష్ఠానము యొక్క, త్రోవను, వక్కణించి = వచించి, ఆరజమున్ = దుర్విలాసమును, రాచఱికమును = రాజధర్మమును, అలవరించి = వహించి, నగర - వీథులన్ = పురవీథులలో, చరియించున్.

తాత్పర్యము : సమత గలిగిన తెల్ల పట్టు జందెములతో రత్నమయమైన

1. ము. సరి, 2. తా. ముత్యాలతారహారములు దాల్చి, 3. తా. కళలైన, 4. తా. నటింప, 5. ము. కమలకర్ణిక, 6. తా. చెంపలలవరింప. 7. తా. అవజముతో చెరికమువలనడంగ

పెద్దముత్యాల సరమును ధరించి, పరిశుద్ధమైన యించుక యెఱ్ఱని పంచెపై పదియాఱు వన్నెబంగరు మొలనూలు దాల్చి, గంగమట్టిమీద కస్తూరి ద్రవముతో నుదుట నామమును దిద్ది, విమలమణి కుండలముల ప్రక్కలందులలితములైన యొంట్లను ధరించి, స్వీయకుల క్రమాగతమైన వేదవిహితానుష్ఠానమును వచించి, దుర్విలాసము, రాజత్వము వహించి మంత్రికుమారుడైన సుకుమారుడు పురవీథులలో సంచరించును.

విశేషములు : `చరిగొన్న' తెలియలేదు. ముద్రిత ప్రతిలోని `సరిగొన్న' = సమతవహించిన అనుపాతము సరియైనదా? ఆలోచనీయము. వెలి = తెల్లని. `తెలుపు తెల్లవెల్ల తెలివెలి నాగనా -వ్వాయము లమరు ధవళ వర్ణమునకు.' (ఆం.నా.సం.స్థావర) జన్నిదము - యజ్ఞోపవీతము - జందెము, జందియము, నీర్కావి - నీరుకావి (రూ.), దోవతి = దోతి (రూ.) గంగ మట్టియ - మట్టియ - మట్టి - మట్టె - మృత్తికా, శబ్దభవము. `కల్పింపనేర్చిరి గంగ మట్టియమీదంగస్తూరికాపత్రములు నొసల' భీ. 1. ఆ. సన్మణి - సత్ + మణి - అనునాసిక సంధి. సద్మణి కూడకావచ్చును. అలవరించు = అలంకరించు -`హంసకంబుల నిజపదం బలవరించి) వేం. పంచ. 4.233., ధరించు - `బలుపాంపతలచుట్టలలవరించినవారు' - పాండు 1-165 వక్కణించు = వచించు.

ఇది వక్కళించు, వక్కరించు = ప్రతిఘటించు, తిరుగబడు. అయి యుండునా?

గీ. సచివనందను కర్ణపాశముల వ్రేలు
కుండలంబుల ముత్యాల గుళిక లొప్పు
నన్యలోకస్థుఁడగు శంబరారి కేడ్చు
రతిమహాదేవి యశ్రుపూరములువోలె 91

అర్థము: సచివ - నందను = మంత్రి కుమారుడైన సుకుమారుని యొక్క, కర్ణపాశములన్ = సుకర్ణములయందు- అందమైన చెవుల యందు, వ్రేలు = వ్రేలాడు, కుండలంబుల - చెవిపోగుల యందలి, ముత్యాల - గుళికలు = ముత్యాల ఉండలు, అన్య- లోక.- స్థుడు = పరలోకమందున్నవాడు, అగు, శంబర + అరికిన్ = శంబరుడను రాక్షసునకు శత్రువైన మన్మథుని కొఱకు, ఏడ్చు, రతి - మహా (మహత్) - దేవి = రతి మహాదేవి యొక్క, అశ్రు - పూరములు + పోలెన్ = కన్నీటి (బిందు) సమూహము వలె, ఒప్పున్.

తాత్పర్యము: సుకుమారుడు తన అందమైన చెవులకు ధరించిన కుండలములందలి ముత్యాలు పరలోకస్థితుడగు తన భర్త మన్మథుని కొఱకేడ్చు రతీదేవి కన్నీటిబిందువులవలె నొప్పెను.

విశేషములు: కర్ణ - పాశ. `పాశ' యను తద్ధిత ప్రత్యయము కర్ణ శబ్దపూర్వకమైనప్పుడు శోభ - కర్ణపాశము = సుకర్ణము. కేశ పర్యాయశబ్దపూర్వకమైనపుడు తత్సమూహము -కేశపాశము = కేశసమూహము. `పాశ' నిందార్థమున గూడ వచ్చును. భిషక్పాశుండు = చెడ్డవైద్యుడు. ముత్యాల గుళికలు - వీనికి అశ్రుపూరములు ఉపమానము. అశ్రుబిందువులు గూడ ముత్యాల వలెనే తెల్లగను, గుండ్రముగను నుండును. శంబరారి - `శంబరారి ర్మనసిజః కుసుమేషు రనన్యజః' - శంబర స్యాసురస్యారిః - శంబరుడను రాక్షసునకు శత్రువు - మన్మథుడు. అమరము. రతి - ఇకారాంత స్త్రీలింగ శబ్దము. అలంకార ముపమ. ముత్యాలు - ముత్యములు. `లు' పరమగుచుండగా ముగాగమునకు లోపము, తత్పూర్వస్వరమునకు దీర్ఘము. పూరములు + పోలె - పూరములువోలె - గసడవాదేశము.

క. కుసుమాయుధనిభుండగు నా
రసికునిపై వ్రాలు సానురాగముతోడన్
బిసరుహనయనల చూపులు
భసలంబులు పూవుందోంటపయి వ్రాలుగతిన్ 92

అర్థము: కుసుమ + ఆయుధ = నిభుఁడు = పూవులు బాణములుగా గల మన్మథునితో సమానుడు, అగు ఆ - రసికునిపైన్ = ఆ శృంగారపురుషుని మీద, బిసరుహ - నయనల = తామరలవంటి కన్నులు గలవారి (స్త్రీల) యొక్క, చూపులు, భసలంబులు = తుమ్మెదలు, పూవు + తోటపయిన్ = పూదోట మీద, వ్రాలు - గతిన్ = వ్రాలు విధమున, స+ అనురాగముతోడన్ = ప్రేమముతో, వ్రాలున్.

తాత్పర్యము: మన్మథాకారుడగు నా శృంగారపురుషునిపై పద్మాక్షుల చూపులు తుమ్మెదలు పూదోటపై వ్రాలునట్లు అనురక్తితో వ్రాలును.

విశేషములు: కుసుమాయుధనిభుడు - సుకుమారుడట్టివాడు గావుననే పద్మాక్షుల చూపు లతనిపై ననురక్తితో వ్రాలుట. అతని కందమే కాదు రసికతకూడ గలదు గావున స్త్రీల చూపులతనిపై మఱియు వ్రాలును. బిసరుహ - `బిసప్రసూన రాజీవ' - అమరము. తామర తూటినుండి మొలచినది - తామరపువ్వు. భసలములతో పోల్చుట వలన చూపులు నలుపని తెలియదగును. చూపులను తెల్లని వనియు కవులు వర్ణింతురు. చూడు పూర్వవ్యాఖ్య. కుసుమాయుధనిభుడు - పూవు దోట - పూదోట నిండ కుసుమములే యుండునుగాన నదియు కుసుమాయుధనిభమే. అలంకార ముపమ. పూవు + తోట - ఉదంత స్త్రీ సమమునకు పరుషము (తో) పరమగుచున్నది. కావున నుగాగమము, పిమ్మట ద్రుతకార్యము. స + అనురాగము = సానురాగము = సవర్ణదీర్ఘసంధి. బిసరుహనయన - బహువ్రీహి.

గీ. భావ మభిరామ రూపైక[1]పక్షపాతి
యౌవనము దోషముల కెల్ల నాస్పదంబు
మన్మథుఁడు [2]కోపి యెటు నియమంబు నిలుచు
సుదతులకు వానిఁ గడకంటఁ జూచినపుడు 93.

అర్థము: భావము = మనస్సు, అభిరామ - రూప + ఏక - పక్షపాతి = మనోహరమైన ఆకారమునందే పక్షము వహించునట్టిది, యౌవనము = పడుచుదనము, దోషములకున్ + ఎల్లన్ = అన్నితప్పులకును. ఆస్పదంబు = స్థానము, మన్మథుండు, కోపి = కోపము గలవాడు, (ఇక), సుదతులకున్ = స్త్రీలకు (మంచి పలువరుస గలవారు స్త్రీలు), వానిన్ = అతనిని (సుకుమారుని), కడ - కంటన్ = క్రీగంటితో, చూచిన + అపుడు, - నియమ బు = కట్టుబాటు, నిలుచున్.

తాత్పర్యము: మనస్సునకు మనోహరాకృతి యందే పక్షపాతము పడుచుదనము తప్పులన్నిటికి చో . మన్మథుడు కోపముగలవాడు. ఇంక సుందరాంగులు వానిని కంట జూచినప్ప తమ్ముదామెట్లు నిగ్రహించుకొందురు? నిగ్రహించుకొన జాలరని . మము.

విశేషములు: వానిని క్రీగంట జూచిన స్త్రీలకు నియమము నిలువదను సమర్థనీయార్థము మూడు హేతువులచే సమర్థింపబడినది. కావున అలంకారము కావ్యలింగము -`భావ..... పాతి ..... వ్యక్తి గుణములుగాక తత్సౌందర్య మొక్కటే మోహకారణమగుననుట. మన్మథడు కోపి - ప్రేయసీప్రియులపై పుష్పబాణములను ప్రయోగించుటయే యతని పని గావున, కోపియనుట. సుదతి -`సు' శబ్దమనకు, పరమైన `దంత' శబ్దమునకు బహువ్రీహియందు `దత్' ఆదేశమగును. సుదత్ +ఙీ - సుదతీ. ' భనాః దన్తాః యస్యాః సా.శోభనములైన దంతములు గలది- స్త్రీ బహువ్రీహి.

సీ. హృదయ ముప్పొంగార నేకాంతమున నుండి
వానిఁ [3]జింతింపని వనజముఖియు
నొకమాఱు తనిఁ జూచి యొండొక్క మఱి చూడ
[4]నభిలషింపని విద్రుమాధరయునుం
గలలోన వానిఁ జిక్కఁగఁ గౌగిటనుఁ జేర్చి
ముకుళితేక్షణ గాని ముద్దియయును
నతని రూపంబుం గుడ్యములందు లిఖియించి
[5]యందంబుం జూడని యంగనయునుఁ

1. ము పాతకంబు 2. తా. కోటపెట్టు నేమంబు నిలుచు. 3. తా. చింతించని, 4. తా. అభిలషించని
5. తా. అద్దంబు చూడనియంగనయును.

గీ. [1]చెలులచేతను బ్రోది రాచిలుక చేత
వాని గుణములు విని కుచద్వంద్వసీమ
[2]జాదుకొనఁ బులకింపని పైదలియును
బన్నిదము వ్రేసినను లేదు పట్టణమున. 94

అర్థము: హృదయము = డెందము, ఉవ్విళ్లూరన్ = ఉవ్విళ్లు + ఊరన్ = త్వరపడగా, ఏకాంతమునన్ = రహస్యప్రదేశమునందు, ఉండి, వానిన్ = అతనిని (సుకుమారుని), చింతింపని = తలపని, వనజ - ముఖియున్ = తామరవంటి ముఖముగలది (స్త్రీ)యును,

ఒక - మాఱు, అతనిన్, చూచి, ఒండు + ఒక్క - మఱి = మఱియొక మారు, చూడన్ = చూచుటకు, అభిలషింపని = కోరని, విద్రుమ + అధరయును = పగడమువంటి క్రిందిపెదవిగలది (స్త్రీ) యును. కలలోనన్, వానిన్, చిక్కగన్ = బిగువుగా, కౌగిటను = కౌగిటియందు, చేర్చి, ముకుళిత + ఈక్షణ = ముడువబడిన కన్నులు గలది, కాని, ముద్దియయును = స్త్రీయును. అతని - రూపంబున్ = అతని ఆకారమును, కుడ్యముల + అందున్ = గోడలమీద, లిఖియించి = వ్రాసి, అందంబున్, చూడని అంగనయును = స్త్రీయును.

చెలుల చేతను = చెలికత్తెల వలనను, ప్రోది రాచిలుక చేతన్ = పెంపుడు శ్రేష్ఠమైన చిలుకవలనను, వాని - గుణములు, విని, కుచ- ద్వంద్వ - సీమన్ = చనుగవయందు, జాదుకొనన్ = తఱచగునట్లు, పులకింపని = గగుర్పాటు చెందని, పై దలియును = స్త్రీయును. పట్టణముననన్, పన్నిదము = పందెము, వ్రేసినను = వేసినను, లేదు.

తాత్పర్యము = డెందము తొందరపెట్టగా రహస్యప్రదేశమున నుండి ఆ సుకుమారుని తలపని పద్మవదనయు, ఒకమాఱు అతనిని చూచి యింకొకమాఱు చూడగోరని స్త్రీయును, కలలో వానిని బిగి కౌగిటను చేర్చి పారవశ్యమున కన్నులు మూసికొనని స్త్రీ యును, వాని ఆకారమును గోడలపై వ్రాసి ఆ సౌందర్యమును జూడని స్త్రీయును, చెలికత్తెలవలనను, పెంపుడు రాచచిలుకవలనను వాని గుణములు విని చనుదోయి యందు తఱచగునట్లు గగుర్పాటు చెందని స్త్రీయును పందెము వైచినను పట్టణమున లేదు.

విశేషములు: ఏకాంతమున - ఎవరును లేకుండ - ఎవరైన నున్నచో చింతా భంగము. ఒకమాఱతని.... అభిలషింపని - ఒకమాఱు చూచినపిమ్మట మరల జూడగోరుట అందమునకు పరాకాష్ఠ. ద్రౌపది భీమునితో నకులుని సౌందర్యమును గూర్చి - తన

1. తా. చెలువచేతను, 2. తా. జాదుకొనంబులకించని.

యొప్పెదురంగన్నం దగిలి యెవ్వరికైన మలంగి క్రమ్మఱజూడ వలయువాడు' అనుట పరికింపదగినది. సుకుమారుడు మఱిమఱి చూడదగిన సౌందర్యముగలవాడనుట. విద్రుమాధర = అధరమునకు విద్రుమముతో పోలిక యందమున. ముకుళితేక్షణ యగుట పారవశ్యము చేత. కుడ్యము లందు లిఖించుట - నిరంతరమును తత్సౌందర్యమును చూడకలగుటకు. ఇదియును వాని మహా సౌందర్యమునకు గుఱుతు. వినుకలి చేతనే కుచద్వంద్వ సీమ పులకితమగుచున్న దన్న నింక గనుకలి నేమగునో! పులకించుట ఆనందాతిశయము చేత. జాదుకొను = దట్టమగు. `జాదుకోంబులకించె నజ్జనవిభుండు శృం.నైష. 3.48. పైదలి - పయిదలి (రూ.) పన్నిదము వ్రేసినను లేదు - పన్నిదము వైచినవా రోడిపోవుట నిశ్చయమనుట. వ్రేయు - వేయు (రూ.)

ఈ పద్యము ఇతనిదేయైన శృంగారనైషధమునందలి

గీ. వానిఁ గలలోనఁగానని వనజముఖియు
వాని మార్పునఁ బేర్కొని మానవతియు
వానిగా నాత్మ భావించి వరునిఁ గవయ
నప్పళింపని సదియు లే దయ్యెనచట. శృ.నై. 1-60

అను పద్యమును పోలియుండుట గమనింపదగినది. ఆ పద్యమునందలి భావమే యిందు ప్రసంగింపబడినది.

సీ. ద్యూతకేలియ వినోదోపాయ[1]మయ్యెను
బరదారగమనంబు ప్రౌఢియయ్యె
నాత్మభార్యాపరిత్యాగంబు ధృతి యయ్యె
[2]నాఖేటలీల విహార మయ్యె
గురుతిరస్కా[3]రంబ గరిమ[4]యయ్యెను నట
విటకీర్తనంబులే[5] పటిమ యయ్యెఁ
బానంబె యధ్యాత్మ పరతయై[6] విలసిల్లెఁ
దరలతాగతియ యుత్సాహ మయ్యె

గీ. గుణము[7]దోషంబు దోషంబు గుణము నయ్యె
నపుడు సుకుమారునకుఁ దద్వయస్యులకును
నాదిగర్భేశ్వరత్వంబు యౌవనంబు
[8]సవురు ధనమును జనవు హేతువులు గా గ 95

1. తా. మైతోంచె, 2. ము. ంజేలవిహారంబుసేమమయ్యె, 3. ము. రంబు, 4. ము. మయ్యె, 5. ము. లు., 6. యయ్యె సమస్త, 7. ము. లకునెల్ల, 8. తా. సవరదనమును జనువు.

అర్థము: ‹ . .. = ఆసమయమున, సుకుమారునకున్, తద్ + వయస్యులకును = ఆతని చెలికాండ్రకును, ఆదిగర్భేశ్వరత్వంబున్ యౌవనంబున్ సవురును = అందమును, చనువున్ = అధికారమును, హేతువులు = కారణములు, కాంగన్ = కాగా, ద్యూత - కేలి + అ = జూదమాడుటయే, వినోద + ఉపాయము = కాలక్షేపమునకైన వెరవు, అయ్యెను, పర-దార-గమనంబు = ఇతర స్త్రీ సంభోగము, ప్రౌఢి = నేర్పు, అయ్యెన్. ఆత్మ - భార్యా - పరిత్యాగంబు = తన భార్య యొక్క(ను) విడుచుట, ధృతి = సంతోషము, అయ్యెన్, ఆఖేట - లీల = వేటయను క్రీడ, విహారము = వినోదము, అయ్యెన్. గురు - తిరస్కారంబు + అ = పెద్దల నవమానించుటయే, గరిమ = గొప్పతనము, అయ్యెను, నట - విట - కీర్తనంబులు + ఏ = నటులను, విటులను పొగడుటయే, పటిమ = చతురత, అయ్యెన్. పానంబు + ఎ = (మద్యము) త్రాగుటయే, అధ్యాత్మ - పరత = బ్రహ్మజ్ఞానమునందాసక్తి, ఐ, విలసిల్లెన్ = ప్రకాశించెను, తరలతా - గతి + ఐ = చంచలత్వముతోడి వర్తనమే, ఉత్సాహము = అభిలాషము, అయ్యెన్.

గుణము, దోషంబున్, దోషంబు, గుణమున్, అయ్యెన్.

తాత్పర్యము: ఆ సమయమున సుకుమారునకును, అతని చెలికాండ్రకును, పుట్టుకనుండియు నైశ్వర్యము గలిగియుండుటయు, పడుచుదనమును, సౌందర్యమును, ధనమును, అధికారమును కారణములుగా జూదమాడుటయే కాలక్షేపోపాయమయ్యెను. పరస్త్రీ సంభోగమే నేర్పయ్యెను. స్వీయ భార్యావిసర్జనమే సంతోషమయ్యెను. వేటాడుట వినోదమయ్యెను. పెద్దలగువారి నవమానించుటయే గొప్పతనమయ్యెను. నటవిటులను ప్రశంసించుటయే చతురత్వమయ్యెను. మద్యపానమే బ్రహ్మజ్ఞానాసక్తి యయ్యెను. చంచల వర్తనమే అభిలాష మయ్యెను. గుణమును దోషముగను, దోషమును గుణముగను భావించుట జరిగెను.

విశేషములు: సుకుమారుడును, తద్వయస్యులును కించిదూనముగా పంచ మహాపాతకులగుట యిందు చెప్పబడినది. పంచమహాపాతకములు - 'బ్రహ్మహత్యా సురాపానం స్తేయం గుర్వంగనాగమః, మహాన్తి పాతకాన్యాహుః సంసర్గశ్చాపిపాతైస్సహ.' వీనిలో బ్రహ్మహత్య, స్తేయము, గుర్వంగనాగమము తప్ప తక్కినవి చెప్పబడినవి. మఱియు వ్యసనసప్తకము వారి కలవడినదని చెప్పబడెను. సప్తవ్యసనములు -

వెలది, జూదంబు, పానంబు, వేట, పలుకు
ప్రల్లదంబును, దండంబు, బరుసదనము,

సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ముసేంత - భార. ఉద్యోగ. 2.44
ఆదిగర్భేశ్వరత్వంబు.... చూడు 86 వ్యాఖ్య. సవురు - సౌరు (రూ.)

గీ. [1]తమ్మమానుష కాలోచితంబులైన
కీర్తనంబుల[2]మ్మై పులకించుకొంద్రు
తా రమర్త్యులుగా మదిఁదలఁతు రహహ
విత్తమదమత్త చిత్తులై వెఱ్ఱిజనులు .96

అర్థము: అహహ = ఆహాహా, విత్త - మద - మత్త - చిత్తులు + ఐ = ధనము వలని, గర్వముచే, మదించిన, మనస్సులు గలవారయి, వెఱ్ఱిజనులు = అమాయికులైన జనులు, తమ్మున్, అమానుష -కాల + ఉచితంబులు = మనుష్యసంబంధులు, సమయమునకు దగినవి కానివి, ఐన, కీర్తనంబులన్ = పొగడ్తలచేత, మై = శరీరము, పులకించు కొంద్రు = గగుర్పాటు చెందించికొందురు - పొంగిపోవుదురు. తారు = తాము, అమర్త్యులు + కాన్ = దేవతలుగా, మదిన్ = మనస్సునందు, తలంతురు = భావింతురు.

తాత్పర్యము: అమాయికులైన జనులు ధనగర్వితులై తమ్ము అమానుషములు సమయోచితములు కానివి యైన యితరుల పొగడ్తలతో పులకిత శరీరులను గావించుకొందురు. తమ్ము దేవతలనుగా భావించుకొందురు.

విశేషములు: సకుమారునకును, వాని చెలికాండ్రకును సంబంధించిన విశేషాంశమును, వెఱ్ఱిజనులు పొగడ్తలతో పులకించు కొనుట, అమర్త్యులనుగా భావించుట యను సామాన్యాంశముతో సమర్థించుటచే నలంకార మర్థాంతరన్యాసము. తమ్మున్ మై పులకించు కొంద్రు - `క్రియాన్వయంబున రెండు పదంబులకు స్వస్వామి సంబంధంబు గలచో సంబంధిపదంబు షష్ఠికి ద్వితీయ యగు.' ప్రౌఢ. కారక 23. తాము శబ్దము షష్ఠికి దీనిచే ద్వితీయయై `తమ్ము' అయినది. పులకించుకొంద్రు. `సంస్కృతంబునకంగలాదుల కించుక్కగు.' బాల.క్రి. 63. పులకించు. `క్రియాఫలంబు కర్తృగామి యగుచోఁగొనుధాతు వనుప్రయుక్తంబగు.' బాల.క్రి. 52. పులకించుకొను. `తద్ధర్మాదులందు లాట్టగు.; బాల. క్రి. 5. పులకించుకొను + లాట్టు. `లకారంబునకు డుఙ్పురును ముఙ్గగు.' బాల.క్రి. 8. పులకించుకొను + రు.(ప్రథమ బహువచనముకావున). `లాట్టురుఙ్గ పరంబగునపుడు దుగాగమంబగు. బాల. క్రియ. 22. పులకించుకొను + దు + రు. `తిదుటలు పరంబులగనపు దన్వాదుల ను స్థానంబున సున్నయు నుండు డు లోపంబును విభాషనగు.' బాల.క్రి. 58. పులకించుకొందురు. `ఇట బిందువు మీది తదలకు నిత్యవైకల్పికంబులయి టడలగు.' బాల. క్రియ.59. పులకించుకొండురు. `రు వర్ణకంబు పరంబగునపుడు సున్నమీది తదడల యుత్వంబునకు లోపంబు విభాషనగు.' బాల. క్రి. 62. పులకించుకొంద్రు.

1.తా తమ్ము. 2. తా. మయి పులకించుకొనుచు.

ఈ సందర్భమున కాదంబరియందలి యీ వాక్యములు స్మర్తవ్యములు. `అపరే తు.... ప్రతారణ కుశలై ర్ధూర్తై రమానుషోచితాభిః స్తుతిభిః ప్రతార్యమాణా విత్త మదచిత్తా నిశ్చేతనతయా తథే త్యాత్మన్యారోపితాలీకాభిమాననా...'

ఇతరుల పొగడ్తలు నిజమని నమ్ముట వెఱ్ఱితనమనుట.

సీ. అయ్యా నీవు చతుర్భుజావతారుఁడ వన్నఁ
దమ భుజాదండపార్శ్వములఁ జూతు;
రయ్యా నీవు త్రిలోచనావతారుఁడ వన్న
ఫాల మంటుదురు దోఃపల్లవమున;
నయ్యా నీవు గజాననావతారుఁడ వన్నఁ
గుంభపీఠము లంటికొనందలంతు;
రయ్యా నీవు [1]చతుర్ముఖావతారుఁడ వన్న
[2]నద్దంబు జూడంగ నభిలషింతు;

గీ. రవసరం బిచ్చుట యనుగ్రహంబు గాఁగ,
మోముఁ జూచుట యుపకారముగను బలుకు
మైత్రిగా నప్పుడధిక [3]సమ్మానముగఁద
లంతు రైశ్వర్య[4]వైభవవంతు లుబ్బి. 97

అర్థము: ఐశ్వర్య - వైభవ - వంతులు = ప్రభుత్వము, సంపదగలవారు, ఉబ్బి = పొంగిపోయి. అయ్య = అయ్యా, నీవు, చతుర్ + భుజా + అవతారుండవు = నాలుగు భుజములు గల విష్ణువు యొక్క అవతారమవు, అన్నన్ = అనగా, తమ (యొక్క), భుజా - దండ - పార్శ్వములన్ = కఱ్ఱవంటిభుజముల యొక్క పక్కలను, చూతురు = చూచి కొందురు. అయ్యా, నీవు త్రిలోచన + అవతారుండవు = ముక్కంటి యొక్క అవతారమవు, అన్నన్, దోస్ + పల్లవమునన్ = చిగురు వంటి చేతితో, ఫాలము = నుదురు, అంటుదురు = తాకుదురు. అయ్యా, నీవు, గజ + ఆనన + అవతారుండవు = ఏనుగు మోముగలవానియొక్క (విఘ్నేశ్వరుని యొక్క), అవతారమవు, అన్నన్, కుంభ = పీఠములు = కుంభముల యొక్క పీఠములు, అంటుకొనన్ + తలంతురు = తాకనెంతురు. అయ్యా, నీవు, చతుర్ + ముఖ + అవతారుండవు = నాలుగు మోములవాని (బ్రహ్మయొక్క) అవతారమవు, అన్నన్, అద్దంబున్, చూడంగన్ = చూచుటకు, అభిలషింతురు = కోరుదురు. అవసరంబు = సమయము, ఇచ్చుట, అనుగ్రహంబు + కాగన్ = దయ చూపులు కాగా, మోమున్ = ముఖమును, చూచుట, ఉపకారముగను, పలుకు = మాట, మైత్రి +

1. ము. చరాచరావతారుండవన్న, 2. ము. నందంబు. 3. ము. తరార్థముగ, 4. ము. మదబల.

కాన్ = స్నేహముగను, అప్పుడు, `అధిక - సమ్మానముగన్ = ఎక్కువ గౌరవముగా తలంతురు = ఎంతురు.

తాత్పర్యము: కార్యార్థులు ప్రభుత్వము, సంపదగలవారితో `నయ్యా! నీవు చతుర్భుజావతారుడవు (నాలుగు భుజములు గల శ్రీమహావిష్ణువవు' అని నంతనే మరి రెండు భుజములున్నవేమోయని వారు తమ భుజముల పార్శ్వములను చూచుకొందురు. అయ్యా! నీవు త్రిలోచనావతారుడవు (మూడు కన్నులు గల యీశ్వరుడవు) అనగానే వారు తమ చివురు చేతితో మూడవకన్నున్నదేమో యని నొసలు తడవికొందురు. అయ్యా! నీవు గజాననావతారుడవు (విఘ్నేశ్వరుడవు) అని నంతనే వారు తమ కుంభపీఠములను తాక నెంతురు. అయ్యా! నీవు చతుర్ముఖావతారుడవు (నాలుగు మోములుగల బ్రహ్మవు) అనగానే నాలుగు మోములున్నవేమోనని వారు అద్దములో చూచుకొన గోరుదురు. తామవకాశమిచ్చుటయే యనుగ్రహముగను, ముఖమును జాచుటే యుపకారముగను, పలుకుటయే మైత్రిగను గొప్పసమ్మానముగను, పొగడ్తలకు పొంగిపోయి భావింతురు.

`విశేషములు: పూర్వ పద్యమున కార్యార్థుల యమానుష కాలోచితములైన కీర్తనములతో మై పులకింప `ప్రభువులుబ్బితమ్మెట్లు అమర్త్యులుగా తలచుకొందురో యీ పద్యమును, వానిని నిజమని గుడ్డిగా నమ్ము ప్రభువుల `వెట్టి' తనమును కవి యిందు చమత్కారమగా నిరూపించినాడు. నీవు చతుర్భుజుడవు, ముక్కంటివి, గజముఖుడవు, చతుర్ముఖుడవు అనగానే నమ్మి యొడలు దడవు కొనువారు వెట్టి వారుగాక మఱేమి? చతుర్భుజుడు, ముక్కంటి, గజముఖుడు, చతుర్ముఖుడు అను విశేషణములు సాభిప్రాయములుగాన నలంకారము పరికరము. `అలఙ్కారః పరికర స్సాభిప్రాయ విశేషణైః.'దోఃపల్లవము - పల్లవము వంటి దోస్. ఉపమానోత్తరపద కర్మధారయము. దోస్ + పల్లవము - పదాంత సకారమునకు విసర్గము. ఈ విసర్గము పకారపరకముగావున ఉపధ్మానీయము.

`అంతఃప్రవిష్టాపర భుజద్వయమివాత్మబాహు యుగళం సమ్భావయన్తి. దర్శన ప్రదానమప్యనుగ్రహం గణయన్తి. దృష్టిపాత మప్యుప కారపక్షే స్థాపయన్తి. సంభాషణ మపి సంవిభాగమధ్యే కుర్వన్తి. అజ్ఞా మపి వరప్రదానం మన్యన్తే.' అను కాదంబరీ మహాకావ్యమునందలి వాక్యము లిచట స్మరింపదగినవి.

ఉ. సంపద పేరి కట్టిఁడి పిశాచము సోఁకిన మానవుండు పూ
జింపడ భీష్టదేవత, భజింపడు సజ్జనులైన వారి, మ
న్నింపడు మిత్రు, బంధుల గణింపఁడు, ధర్మరహస్యముల్
విచారింపడు, (ప్రేమముం దగజరిం)ప,దహంకరణంబు పెంపునన్. 98

అర్థము: సంపద - పేరి - కట్టడి - పిశాచము = సంపదయను పేరుగల క్రూరమైన పిశాచము, సోకిన = ఆవహించిన, మానవుండు = మనుష్యుడు, అహంకరణంబు = పెంపునన్ = గర్వాతి శయముతో, అభీష్ట - దేవతన్ = ఇష్టదైవమును, పూజింపడు సత్ + జనులు + ఐనవారిన్ = మంచివారిని, భజింపడు, సత్ +జనులు +ఐనవారిన్ = మంచివారిని, భజింపడు = సేవింపడు, మిత్రున్ = చెలికానిని, మన్నింపడు = అదరింపడు, బంధులన్ = చుట్టములను, గణింపడు = లెక్క చేయడు, ధర్మ - రహస్యముల్ = ధర్మములందలి రహస్యములు, విచారింపడు = ఆలోచింపడు, నేమమన్ = కట్టుబాటును తగన్ = ఒప్పునట్లు, చరింపడు = ఆచరింపడు.

తాత్పర్యము: సంపదయనెడి క్రూరపిశాచ మావహించిన మనుష్యుడు గర్వాతిశయముతో నిష్టదైవమును పూజింపడు, మిత్రుని ఆదరింపడు, చుట్టములను లెక్క చేయడు. ధర్మ రహస్యములను గూర్చి ఆలోచింపడు, నియమములను తగురీతిని పాటింపడు.

విశేషములు: సంపద పేరి కట్టిడి పిశాచము - రూపకము. సత్ + జనులు అనునాసికాంతస్థ వర్ణములు తప్ప మిగిలిన పదాంత గత హల్లులకు (ఝుల్లులకు) మృదు హల్లులు (హశ్శులు) కాని, అచ్చులు కాని పరము లగునపుడు ఆ హల్లుల వర్గమునకు చెందిన తృతీయ వర్ణమాదేశముగా వచ్చును. సద్ + జనులు. `సకార త వర్గములకు శవర్ణ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్ణ చ వర్గ వర్ణములాదేశమగును.' - సజ్జనులు. బంధు + లు - బంధువులు, బంధులు `వు వర్ణ కేతర విభక్తి పరమగుచో నుకారాంతంబులకు బహుళంబుగా, గోశబ్దంబునకు నిత్యంబుగా వుగాగమంబగు.' బాల. తత్సమ. 49 నేమము (వికృతి) నియమము (ప్రకృతి). విశేషాంశమైన సుకుమారుని విషయము, సామాన్యాంశముచే సమర్థింపబడుచున్నది కావున నలంకార మర్థాంతరన్యాసము. `మిథ్యా మాహాత్మ్య గర్వ నిర్భరాశ్చ న ప్రణమన్తి దేవతాభ్యః కించ న పూజయన్తి మాన్యాన్ నార్చయ న్త్యర్చనీయా న్నాభివాదయ న్త్యభివాదనార్హాన్ నాభ్యుత్తిష్ఠన్తి గురూన్.' అను కాదంబరీ కావ్యస్థవాక్యము లిట స్మరణీయములు.

గీ. ఉద్దంతుం[1]డయి సుకుమారుఁ డుండలేక
[2]వీటఁ జక్కని జవరాలి వెదకి వెదకి
వలపు పుట్టించి సంకేతములకుఁ దార్చి
[3]చలుపు రతికేలి బహుళపక్షంబు రేలు. 99.

---

1. తా.డైన 2. తా.వింట జిక్కని జవరాలి 3. తా. సలుపు

అర్థము: సుకుమారుడు, ఉద్ధతుండు + అయి = గర్వితుడయి, ఉండన్ = లేక = ఆగలేక, వీటన్ = పురమందు, చక్కని, జవరాలిన్ = జవ్వనిని, వెదకి - వెదకి, వలపు, పుట్టించి, బహుళ- పక్షంబు - రేలు = కృష్ణపక్షరాత్రులందు, సంకేతములకున్ = ఏర్పఱచుకొన్న స్థలములకు, తార్చి = వచ్చునట్లు చేసి, రతి - కేలి = సంభోగక్రీడ, చలుపున్ = చేయును.

తాత్పర్యము: సుకుమారుడు గర్వితుడయి యాగలేక పురమునందు అందమైన యువతిని వెదకి వెదకి ఆమెకు వలపు పుట్టించి కృష్ణపక్షరాత్రులందు సంకేత స్థలమునకు రావించి ఆమెను సంభోగించును.

విశేషములు: బహుళ పక్షంబు రేలు - ఎవరికంట బడకుండుటకు చీకటి రేలు. ఉద్ధతుండయి ---- లేక. ఉండలేక పోవుట కతని ఔద్ధత్యము కారణము. వీట - వీడు + అందున్ - వీడు శబ్ద మౌపవిభక్తికము గావున `అందువర్ణకము పరమగుచుండగా టి వర్ణమంతా దేశము - వీటి + అందున్. `ఔపవిభక్తి కముల తృతీయాసప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు.' బాల. అచ్చిక. 38. వీటి + అన్ - `అంద్వవగాగమంబులందప్ప నపదాది స్వరంబు పరంబగునపుడచ్చునకు సంధియగు' బాల. సం.॥ వీటన్. జవరాలు - జవ్వని + ఆలు. `పేదాది శబ్దంబుల కాలు శబ్దము పరంబగునపుడు కర్మధారయంబునందు రుగాగమంబగు.' బాల. సం.30. జవ్వని శబ్దమునకు `జవ' ఆదేశము. జవరాలు. వెదకి వెదకి - భృశార్థమునందు ద్విరుక్తి - మిక్కలి వెదకి. చలుపు - సలుపు (రూ.) రేలు - `కాలాధ్వములకుం బ్రాయికంబుగాం బ్రథమయగు.' బాల. కారక. 25 రేయి (ఏకవ.) రేలు (బహువ) `బహువచనంబు పరంబగునపుడు రేయి ప్రభృతుల తుది యక్షరంబు లోపించు.' బాల. అచ్చిక. 21

గీ. పద్మనాభుండు మదనగోపాలమూర్తి
ఘోషమున [1]నెట్లు వలపించె గొల్లసతుల
నెట్టుకొని [2]యట్లు వింధ్యాద్రి పట్టణమునఁ
బరపురంధ్రుల [3]వలపించె బ్రాహ్మణుండు. 100

అర్థము: మదన - గోపాల - మూర్తి, పద్మనాభుండు = పద్మమునాభి యందుగలవాడు - శ్రీకృష్ణుడు, ఘోషమునన్ = గొల్ల పల్లెయందు, గొల్ల సతులన్ = గోపికా స్త్రీలను, ఎట్లు, వలపించెన్ = వలపించునట్లు చేసెనో. అట్లు బ్రాహ్మణుండు- సుకుమారుడు వింధ్యాద్రి - పట్టణమునన్ = వింధ్యపర్వత ప్రాంత పట్టణమునందు, నెట్టుకొని = చెలరేగి, పర - పురంధ్రులన్ = ఇతరులయొక్క స్త్రీలను, వలపించెన్.

1. తా.నెట్టు 2. తా.యట్లు 3. ము. వలపించు

తాత్పర్యము: మదన గోపాలుడగు శ్రీకృష్ణుడు గొల్లపల్లెలో గొల్లయిల్లాండ్రను వలపించినట్లే, బ్రాహ్మణుడైన సుకుమారుడును విజృంభించి వింధ్య పర్వత ప్రాంత పత్తనమగు రత్నపురమున పరస్త్రీలను వలచునట్లు చేసెను.

విశేషములు : పరస్త్రీలను వలపించుటలోనే సుకుమారుడు శ్రీకృష్ణునంతవాడు. ఉపమాలంకారము. పరపురుషునితో గూడినను వారు గొల్ల 'సతు'లే. శ్రీకృష్ణుడు ఎంతమందితో గూడినను బ్రహ్మచారియే. ఆ మాహాత్మ్యము సుకుమారుని విషయమున లేదు. పరస్త్రీలను వలపించు వఱకే యతనికి శ్రీకృష్ణుని తోడి సామ్యము. పద్మనాభుడు - బహువ్రీహి సమాసమున 'నాభి శబ్దమునందలి ఇకారమునకు బహుళముగా అకార మాదేశమగును. బహువ్రీహి కానిచో అకార మాదేశము కాదు. అందుచే 'శ్రీ వక్షోజకురంగ నాభమెదపై' అను మనుచరిత్ర పద్యమునందలి కురంగనాభము చింత్యము.

సీ. యమునా నదీసైకతమున జాలరి కన్య
చనుదోయి నంటడే శక్తిసుతుఁడు
నందవ్రజంబులో నలిననాభుండెట్లు
విహరించెఁ బదియాఱువేల సతుల
దేవదారువనంబులో విరూపాక్షుండు
మునిభామినుల నెట్లు మోసపుచ్చెఁ
గొక్కొరొకోయని కోడియై యెలుఁగించి
యమరనాయకుండెట్లహల్యఁగలిసె

గీ. మొలకచన్నుల పాయంపు ముద్దుంగూంతుఁ
బట్టుకొనె నెట్లు పైకొని పద్మభవుఁడు
చందురుండెట్లు వొందె నాచార్యులేమ
ననుచు విప్రుండు[1] రమియించె నన్యసతుల 101

అర్థము: యమునా - నదీ సైకతమునన్ = యమునా నది యిసుక తిన్నెపై, శక్తి - సుతుండు = శక్తి యొక్క కుమారుడు - పరాశరుడు, జాలరి - కన్య = జాలరుల పడుచయిన సత్యవతి యొక్క, చను - దోయిన్ = చనుల జంటను, అంటడే = తాకడా ? నలిన - నాభుండు = తామరపువ్వు నాభియందుగల వాడు - శ్రీకృష్ణుడు, నంద - వ్రజంబులోన్ = నందవ్రజమను వ్రేపల్లెలో, పదియాఱు - వేల - సతులన్ = పదాఱువేవుర గొల్లతలను, (తో) ఎట్లు, విహరించెన్ = క్రీడించెను. దేవదారు - వనంబులోన్, విరూప + అక్షుండు = ఎగుడు దిగుడు కన్నులు గలవాడు - ముక్కంటి - ఈశ్వరుడు, ముని -భామినులన్ = మునులయొక్క

1. ము. రమియించు



పత్నులను, ఎట్లు, మోసపుచ్చెన్. అమర - నాయకుడు = దేవతల యొక్క ప్రభువు - ఇంద్రుడు, కోడి + ఐ, కొక్కొరొకో + అని, ఎలుగించి = కూసి, అహల్యన్, ఎట్లు, కలిసెన్ = కూడెను. పద్మ - భవుడు = తామరనుండి పుట్టినవాడు - బ్రహ్మ, మొలక - చన్నుల - పాయము + ముద్దు + కూతున్ = పొటమరించు చన్నులుగల వయస్సునందున్న అనుంగు గూంతును - సరస్వతిని, పైకొని = విజృంభించి, ఎట్లు పట్టుకొనెన్చందురుండు = చంద్రుడు, ఆచార్యు - లేమన్ = గురువైన బృహస్పతి భార్యను, తారను, ఎట్లు, పొందెన్. అనుచున్, విప్రుండు = బ్రాహ్మణుడు - సుకుమారుడు, అన్య - సతులన్ = పరస్త్రీలను(తో), రమియించెన్ = సంభోగించెను.

తాత్పర్యము: యమునానది యిసుక తిన్నెపై శక్తియను మునికుమారుడైన పరాశరుడు జాలరిపడుచగు సత్యవతి చనుగవ నంటలేదా? శ్రీకృష్ణుడు నందవ్రజములో పదాఱు వేవుర గొల్లభామలతో నెట్లు క్రీడించెను? ముక్కంటి దారుక వనములో మునిపత్నుల నెట్లు మోసగించెను? ఇంద్రుడు కోడిరూపుధరించి కొక్కొరొకో యని కూసి గౌతముని భార్యయగు నహల్యతో నెట్లు కూడెను? తమ్మిచూలి అంకురించుచున్న స్తనములు గల ప్రాయమందున్న యనుగు గూతుతో నెట్లు కూడెను? చంద్రుడు గురువగు బృహస్పతి భార్యయైన తారతో నెట్లు రమించెను? అని బ్రాహ్మణుడైన సుకుమారుడు పరస్త్రీలతో సంభోగించెను.

విశేషములు: శక్తి యను ముని కొడుకు పరాశరుడు. ఇతడు జాలరుల నాయకుడగు దాశరాజు కూతురైన సత్యవతి నావ నడపు చుండగా నామెను చూచి కామించి యమునా నది యిసుక తిన్నెపైకూడెను. వారికి పుట్టిన వాడే వ్యాసుడు. శ్రీకృష్ణుడు వ్రేపల్లెలో పదాఱువేలమంది గొల్లతలతో విహరించుట ప్రసిద్ధమే. ఈశ్వరుడు దారుకవనములో మునిపత్నులను గూడెను. ఇంద్రుడు కోడిరూపు ధరించి యర్ధరాత్రమున కొక్కొరొకో యని కూసెను. తెల్లవాఱినదనుకొని గౌతముడు స్నానార్థమరిగెను. అంత నింద్రుడు గౌతమపత్నియగు నహల్యను కూడెను. బ్రహ్మ తాను పుట్టించిన తన కూతురగు సరస్వతినే రమించెను. చంద్రుడు తన గురువగు బృహస్పతి భార్యయైన తారతో సంభోగించి బుధుని గనెను.

మనుష్యుడు తాను చేయు తప్పుపనిని పెద్దవారి యుదాహరణములను తీసికొని వచ్చి సమర్థించుకొనుట లోకమున నున్నది. అట్లే ఇట సుకుమారుడును చేయుచున్నాడు. వానికి దొరకిన యుదాహరణీయులందరు గొప్పవారే. ఒక్కరును తక్కువవారుగారు. పరాశరుడు, శ్రీకృష్ణుడు, శివుడు, ఇంద్రుడు, బ్రహ్మ, చంద్రుడు. అంతటి వారు చేయగా చెల్లి పోయినప్పుడు తాను మాత్రమేల చేయరాదని వాని తలంపు. మను చరిత్రమున పెద్దన వరూధినిచే నిట్టి భావమునే చెప్పించెను. 'వెలివెట్టిరే బాడబులు పరాశరుంబట్టి దాశకన్యా కేళిం, దప్పుంజేసి.....' మను 2.73.

జాలరి - జాలము + అరి - `అరివర్ణకంబు మతు బర్థంబున జాలాదుల కగు.' బాల. తద్ధిత. 17 నలిన నాభుండు - బహువ్రీహి సమాసమున నాభి శబ్దమున కకారాంతత్వము. పదియాఱువేల సతుల - `సర్వనామ క్రియా పదంబుల బహువచనంబు మహత్తునకుంబోలె మహతి కగు.' బాల. అచ్చిక. 26 `మహద్విశేషణ సంఖ్యావాచకం బులకుం గొన్నియెడల నమహత్కార్యంబు చూపట్టెడి.' ప్రౌఢ.శబ్ద. 104.

విరూపాక్షుండు - బహువ్రీహి సమాసమందు సక్థిన్, అక్షిన్, ద్విత్రి పూర్వక మూర్ధన్ శబ్దముల ఇన్, అన్ లకు అ (మచ్)కారమంతా దేశమగును. విరూపాణి అక్షిణి యస్య సః - విరూపాక్షః. మోసపుచ్చు - మోసము + పుచ్చు - `పద్యాదులు పరంబులగునపుడు మువర్ణకంబునకు లోపపూర్ణ బిందులు విభాషనగు.' బాల.సంధి. 46. ఎలుగించు - ఎలుగు + ఇంచు - `సంస్కృతంబున కంగలాదుల కించుక్కగు.' బాల.క్రియ. 63 `ఇత్వంబు గాని యెత్వంబుగాని కూడుచో ననాద్యం బయిన యుత్వంబున కిత్వంబగు.' బాల. క్రియ. 85. ఎలిగించు అని యుండవలయును. `ఎలుగించు' అని ఉన్మధ్యము కూడ పెక్కు ప్రయోగములలో కన్పట్టుచున్నది.' (సూ.ని.). ప్రాయము - పాయము (రూ.) పాయము + ముద్దు - పాయంబు ముద్దు. `కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు.; బాల. సంధి. 32. ముద్దు + కూతున్ - ముద్దుగూతున్ - ఉదంత స్త్రీసమమునకు పరుషము (కూ) పరమగుచుండగా నుగాగమము, పిమ్మట ద్రుతకార్యము. కూతు శబ్దము ద్వితీయైక వచనాంతరూపము - కూంతును. `కూతురిని' అను రూపము తప్పు. చందురుండు (వికృతి - చంద్రుండు (ప్రకృతి) అన్య - సతుల - అన్యులయొక్క సతులనని షష్ఠీతత్పురుషము.

సీ. [1]సంధ్యాభివందన శ్రద్ధ యుద్వాసించె,
గాయత్రి దవ్వులఁ గట్టిపెట్టె,
నగ్నిహోత్రముమీఁది యాస నుత్పాటించె,
నఘమర్షణస్నాన మరసి[2]మానె,
[3]నిహపరసామగ్రి నీయఁజాలెడు నట్టి,
విధి దేవతార్చన వీటఁబుచ్చె,
[4]వేదపాఠము మానె, వివిధ సత్కర్మాది,
సత్కలాపంబులు జాఱవిడిచె,

---

1. తా. సంధ్యాదివందన, 2. ము. మాసె, 3. తా. వైశ్వదేవము మీఁది విశ్వాసము త్యజించె. హంతకారము బుద్ధినపనయించె, 4. తా. దేవతార్చనము మీఁది ప్రయత్నమును మానె చదువుశాస్త్రముసారుసారుపరచె

గీ. [1]సిగ్గుఁ బోకార్చెఁ, గుక్కలఁ జేతఁ బట్టె,
[2]నిలిచి యుండియు మూత్రించెఁ, గలిసె లజ్జఁ,
[3]గాలపరిపాటి ప్రారబ్ధకర్మ వశతఁ
బయిసికొట్టనఁబడియె నా బ్రాహ్మణుండు. 102

అర్థము: అ - బ్రాహ్మణుండు, (సుకుమారుడు), సంధ్యా + అభివందన్న-శ్రద్ధ = సంధ్యావందనమాచరించుట యందలి శ్రద్ధను, ఉద్వాసించెన్ = విడిచిపెట్టెను. గాయత్రిన్ = గాయత్రీ మహామంత్రమును, దవ్వులన్ = దూరమున, (ఎప్పుడో) కట్టిపెట్టెన్ = మానివైచెను. అగ్నిహోత్రము - మీది + ఆసన్ = అగ్నికార్యమునందలి కోరికను, ఉత్పాటించెన్ = పెకలించివైచెను, అఘమర్షణ - స్నానము = పాపము నశించుటకైన మంత్రము జపించుచు చేయు స్నానము, ఆరసి = అరయుట (భావార్థమున క్త్వార్థ), మానెన్. ఇహ - పర - సామగ్రిన్ = ఈ లోకమునకు, పరలోకమునకు వలయు సాధన సంపదను, ఈయన్ + చాలెడు + అట్టి = ఈగలుగునట్టి, విధిన్ = విహితకృత్యమును, దేవతా + అర్చనన్ = దైవపూజను, వీటిన్ + పుచ్చెన్ = విడిచిపెట్టెను. వేద - పాఠమున్ = వేదములను చదువుట, మానెన్, వివిధ - సత్ + కర్మ + ఆది - సత్ + కలాపంబులు = పెక్కురీతులగు మంచి పనులు మున్నగునవి అనెడు మంచి ఆభరణములు, జాఱన్ + విడిచెన్. సిగ్గున్, పోకార్చెన్ = విడిచెను. కుక్కలన్, చేతన్ + పట్టెన్, నిలిచి యుండియున్, మూత్రించెన్ = మూత్రము విసర్జించెను. లజ్జన్ + కలిసెన్ = లజ్జితుండయ్యెను(?), కాల - పరిపాటిన్ = కాలక్రమమున, ప్రారబ్ధ - కర్మ - వశతన్ = ప్రారంభింపబడిన కర్మముల యొక్క అధీనత చేత - ప్రారబ్ధకర్మముల కధీనుడై యుండుటచేత, బయిసి కొట్టు = దౌర్భాగ్యుడు, అనబడియెన్.

తాత్పర్యము: అ బ్రాహ్మణుడు సుకుమారుడు సంధ్యావందనమందు శ్రద్ధవిడిచి పెట్టెను. గాయత్రీ మహామంత్రము నెప్పుడో కట్టిపెట్టెను. అగ్ని కార్యము నందాశను పెకలించెను. అఘమర్షణ స్నానము నాచరించుట మానివైచెను. ఇహపరలోకములకు వలయు సాధన సంపదను ఈగలుగునట్టి దేవపూజావిధిని విడిచి పెట్టెను. వేదపఠనమును త్యజించెను. వివిధ సత్కర్మములనెడి సద్భూషణములను జాఱవిడిచెను. సిగ్గు విడిచెను. కుక్కలను చేతబట్టెను. నిలిచియుండియే మూత్రమును విసర్జించుచుండెను. లజ్జితుడయ్యెను. కాలక్రమమున ప్రారబ్ధకర్మవశుడై దౌర్భాగ్యుడనబడెను.

విశేషములు: కలాపము = ఆభరణము. సమూహము, నెమలి పింఛము - (నానా.) నిలిచి యుండియు మూత్రించె - తిష్ఠ న్మూత్రత దోషము. కలిసె లజ్జ -

1. ము. దనకు మరగినవార సుందరవనితల, 2. ము. నిరతసల్లాప సంభోగనిపుణతాను. 3. ము. ఖానురాగనిమగ్నుడై నిత్యకర్మమైతనర్చెను సుకుమారధరణిసురుండు.

అర్థము స్పష్టము గాలేదు. లజ్జితుడయ్యెను - అవమానితుడయ్యెను. అని వ్రాయబడినది. ప్రారబ్ధ - కర్మము ప్రారబ్ధము, ఆగామి, సంచితము అని మూడు విధములు. అందు ప్రారబ్ధము అనుభవించియే తీఱదగినది. బయిసి కొట్టు - అర్థముగాలేదు. బయిసి - బైసి - బవిసి. రూపాంతరములు. భాగ్యమని యర్థము. బయిసి కొట్టు - భాగ్యములేనివాడు - దౌర్భాగ్యుడు అని సందర్భమును బట్టి చెప్పబడినది. అరసిమానె - అరసి = అరయుట - అని క్త్వార్థమునకు భావార్థము చెప్పబడినది.

ఈ సందర్భమున నిట్టివాడేయైన గుణనిధిని కాశీఖండమున శ్రీనాథుడే వర్ణించిన తీరు గమనింపదగినది. `బ్రాహ్మణాచారంబు పరిహాసకము చేయు...... సిగ్గు విడిచి.' కాశీ. 4.81 ఇట్టివాడే యైన నిగమశర్మను వర్ణించుటలో రామకృష్ణుడు శ్రీనాథునే అనుకరించుచు, మహాప్రతిభావంతుడుగాన, క్రొత్తదనము చూపెను. `ఉష్ణాని హోమాగ్ని యూదనొల్లడుగాని విరహజ్వరార్తిచే వెచ్చనూర్చు.....ఆ దుర్విహారహారి.' పాండు. 3.12.

ఈ భాగమున ముద్రితప్రతిలోనివి యున్నవి.

వ. ఇవ్విధంబునం గుమారుండు విహరింపంజూచి.

అర్థము: ఈ + విధంబునన్, కుమారుండు = కొడుకు, విహరింపన్ = క్రీడించుట, చూచి.

తాత్పర్యము: ఈ రీతిగా కొడుకు విహరించుట చూచి -

క. ప్రేమమునంగూర్చు సుతునకు, వేమఱు సద్బుద్ధి చెప్పవినమికి వగచున్,
సామగ్ర్య దుర్గుణాళి క, దా మధురత యొసంగు విషమమగు చలమునకున్.

అర్థము: ప్రేమమునన్ = అనురాగముతో, కూర్చు - సుతునకున్ = అనుగుగొమరునకు, వేమఱు = పెక్కుమాఱులు, సత్ + బుద్ధి = మంచిబుద్ధి, చెప్పన్, వినమికిన్ = వినకుండుటకు, వగచున్ = చింతించును, విషమము + అగు = దుష్టమైన, చలమునకున్ = పట్టుదలకు, సామగ్ర్య - దుర్గుణ + ఆళి - కదా = సంపూర్ణతగల దుర్గుణముల వరుస కదా, మధురత = తీయదనము, ఒసంగున్ = ఇచ్చును.

తాత్పర్యము: అనుగు కొమరునకు ప్రేమముతో మంచి బుద్ధులు చెప్పగా నతడు వినకుండుటకు చింతించెను. దుష్టమైన పట్టుదలకు దుర్గుణములే యింపుగా నుండును.

విశేషములు: ఇందు సామాన్యాంశముచే విశేషాంశము సమర్థింపబడు చున్నది కావున నలంకార మర్థాంతరన్యాసము.

వ. ఇవ్విధంబున దృగున్మీలనంబునుం బోలె మార్గంబు దప్పి, జిహ్వాచ్ఛేద నంబునంబోలె మూంగై, ఇంద్రజాల పింఛికా ప్రచారంబునం బోలెం దత్త్వం బెఱుంగక, దాహజ్వరంబునంబోలె [1]నసంబద్ధంబు లాడుచు, లోకాయత విద్యాభ్యాసంబుననుం బోలె నధర్మంబు మరగి, పైశాచగ్రహణంబునంబోలె గళవళింపుచు, మదనావేశంబునం గావరం బెత్తి వర్తింపుచున్న సుకుమారు రావించి యజ్ఞదత్తుండు సుశీలాదేవి. [2]సమక్షంబున వానికిట్లనియె. 103

అర్థము: ఈ + విధంబునన్, దృక్ + ఉన్మీలనంబునున్ (నన్?) + పోలెన్ = చూపులయొక్క వికాసముచేత వలె, మార్గంబు + తప్పి = త్రోవతప్పి, చూపు వికసించినచో సరియైన త్రోవబోవును గాని త్రోవతప్పుట జరుగదు. కావున నది దృక్ + ఉన్మూలంబునన్ + పోలెన్ + చూపుల పూర్తినాశనము చేత - అయియుండునా?, జిహ్వా + ఛేదనంబునన్ + పోలెన్ = నాలుకయొక్క కోతచేత వలె, మూగ + ఐ = మాటాడలేనివాడయి, ఇంద్రజాల - పింఛికా - ప్రచారంబునన్ + పోలెన్ = కనుకట్టు విద్యయందలి, నెమలిపురియొక్క ఆడించుటచేత వలె - ఇంద్రజాలికుడు పింఛము నాడించుచు నొక వస్తువు నింకొకదానిగా భ్రమింప జేయును, తత్త్వంబు = సత్యము, ఎఱుంగక = తెలియక, దాహ - జ్వరంబునన్ + పోలెన్ = తాపమును గలిగించు జ్వరము చేతవలె, అసంబద్ధంబులు + ఆడుచున్ = సంబంధములేని మాటలు - సంధిమాటలు, మాటాడుచు, లోకాయత - విద్యా + అభ్యాసంబుననున్ + పోలెన్ = నాస్తిక విద్యనభ్యసించుట చేతవలె, అధర్మంబున్, మరగి = అలవాటు పడి, పైశాచ - గ్రహణంబునన్ + పోలెన్ = పిశాచము పట్టుకొనుట చేత వలె, కళవళింపుచున్ = తొట్రుపాటు నొందుచు, మదన + ఆవేశంబునన్ = మన్మథుడావేశించుటచే, కావరంబు + ఎత్తి = మద మతిశయించి, వర్తింపుచున్ + ఉన్న = ప్రవర్తిల్లుచున్న, సుకుమారున్, రావించి = రప్పించి, యజ్ఞదత్తుండు, సుశీలాదేవి - సమక్షంబునన్ = సుశీల యెదుర, వానికిన్ = సుకుమారునకు, ఇట్లు, అనియెన్.

తాత్పర్యము: ఈ రీతిగా చూపు పూర్తిగాబోవుటచే వలె త్రోవ తప్పి, నాలుక కోతచే వలె మూగవాడయి, ఇంద్రజాలమున నెమలిపురి నాడించుట చేత వలె సత్యము తెలియక, తాపమును గలిగించు జ్వరము చేతవలె సంధిమాటలు మాటాడుచు, నాస్తిక విద్యనభ్యసించుట చేతవలె నధర్మమున కలవాటు పడి, పిశాచము సోకుటచే వలె తొట్రుపాటు నొందుచు, మన్మథావేశముచే పొగరెక్కి ప్రవర్తిల్లుచున్న సుకుమారుని రావించి యజ్ఞదత్తుడు సుశీలాదేవి యెదుర నతనితో నిట్లు పలికెను.

---

1. తా. అసంబంధములాడుచు, 2. తా. సక్షమంబున

విశేషములు: సుకుమారుడు త్రోవ తప్పుట మున్నగు వానికి దృగున్మీలనాదులు హేతువులు గావు. హేతువులు గాని వానిని హేతువులుగా నూహించుటచే హేతూత్ప్రేక్షాలంకారము. ఇచ్చట హేతువులసిద్ధములుగావున అసిద్ధ హేతూత్ప్రేక్ష. దృక్ + ఉన్మీలనము = ఝల్లునకు అచ్చుపరమగుచున్నది గావున దాని తృతీయవర్ణమాదేశమై దృగున్మీలనము అయినది. కళవళింపుచు, వర్తింపుచు - వీనిలో నాగమచకారమునకు ముత్తుగాక శత్రర్థక చువర్ణకము పరమగుచున్నది గావున ప త్వము గాదు. కళవళించుచు, వర్తించుచు అనుట సరియైనవి, అసంబద్ధంబులు = అసంబద్ధములైన మాటలు - `విశేషణంబులు కొన్నియెడల విశేష్యలక్షకంబులగు.' ప్రౌఢ. శబ్ద. 12.

గీ. అన్న సుకుమార! యేలయ్య యనుదినంబు
. గొఱకుఁ దనమున ధూర్తులఁగూడి తిరిగె?
దకట! మీ యమ్మ గాంచె ని న్నధికనియతిఁ
గోరి వీరవ్రతంబున గొడ్డు వీఁగి 104

అర్థము: అన్న = నాయనా, సుకుమార, అనుదినంబున్ = ప్రతిదినమును, గొఱకు + తనమునన్ = దౌష్ట్యముతో, ధూర్తులన్ = వంచకులను, కూడి, తిరిగెదు = తిరిగెదవు, ఏల + అయ్య, అకట = అయ్యో, మీ + అమ్మ, అధిక - నియతిన్ = గొప్పనియమముతో, కోరి = కావలయునని, వీర - వ్రతంబునన్ = సడలబాటులేని వ్రతముతో, గొడ్డు-వీంగి = గొడ్రాలితనము విడిచి, నిన్నున్, కాంచెన్.

తాత్పర్యము: నాయనా ! సుకుమారా! నీవు ప్రతిదినమును దుష్టత్వమున వంచకులైన వారితో గూడి తిరిగెద వెందులకయ్యా! అయ్యో ! మీ యమ్మ గొప్పనియమములను పాటించి వీరవ్రతమాచరించి నిన్ను కోరి కని తన గొడ్రాలి తనమును విడిచినది.

విశేషములు: అనుదినము - అవ్యయీభావము. గొఱకు + తనము. `ఉదంత స్త్రీ సమంబులకును బుంపులకు నదంత గుణవాచకంబు లకును దనంబు పరంబగునపుడు నుగాగమంబగు.' బాల. సం.35 పిమ్మట ద్రుతకార్యము. తిరిగెదు + అకట. తిరిగెదవు + అకట `లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాషనగు.' బాల.క్రి. 24

తిరిగెద + ఉ + అకట. అంద్వవగాగమ సంధి. బాల. సం.॥ తిరిగెదు + అకట - `ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధి యగు.' బాల. సం.॥ తిరిగెదకట.

సీ. ఓరి నీకాచార్యుఁడుపదేశ మిచ్చెనో?
దర్శించితెట్లు శాస్త్రములలోన?

ధర్మంబుపార్జింపఁ దగిన మార్గమె యిది?
తపము వర్ధిల్లునే తనరఁ దీనఁ?
గైవల్యపదవి యెక్కఁ గవచ్చునే దీనఁ?
గంటె నాకమునకుఁ గారణముగఁ?
గాదేని [1]నియమంబు క్రమమే యిది దలంప?
భవదుఃఖములు దీనఁ బాయుటెట్లు?

గీ. మూర్ఖుండైనను శిశువైన మూఢుడైనఁ
దన కరిష్టకంబుఁ దలఁచునే మనమునందు?
నంతరహితుల యార్గురయందు ఘనుఁడు
మన్మథుండు; తద్వికారంబు మానుమిపుడు. 105

అర్థము: ఓరి, నీకున్, ఆచార్యుడు = గురువు, ఉపదేశము, ఇచ్చెనో = ఇచ్చెనా ? శాస్త్రములలోనన్, ఎట్లు, దర్శించితి = చూచితివి ? ఇది, ధర్మంబు, ఉపార్జింపన్ = సంపాదించుటకు, తగిన, మార్గము + ఎ = త్రోవయా? దీనన్ = దీనిచే, తపము, తనరన్ = ఒప్పునట్లు, వర్ధిల్లునే = వృద్ధి పొందునా? దీనన్, కైవల్య - పదవి = మోక్షస్థానము, ఎక్కగన్ + వచ్చునే = అధిష్ఠింప వీలగునా ? నాకమునకున్ = స్వర్గమునకు, కారణముగన్, (దీనిని) కంటె = కంటెవా ? కాదు + ఏనిన్ = కాకపోయినచో, తలంపన్, ఇది, నియమంబు - క్రమము + ఏ = కట్టుబాటుయొక్క తీరా? దీనన్, భవ - దుఃఖములు = సంసారమునందలి బాధలు, పాయుట = పోవుట, ఎట్లు? మూర్ఖుడు + ఐనను = అవివేకి యైనను, శిశువు + ఐనన్ = బాలుడైనను, మూఢుడు + ఐనన్ = అజ్ఞానియైనను, మనమునందున్ = మనస్సునందు, తనకున్, అరిష్టంబున్ = కీడును తలచునే, మన్మథుండు = కాముడు, అంతః + అహితుల = లోపలి శత్రువుల, ఆర్గుర + అందున్ = ఆఱుగురి యందు, ఘనుండు = గొప్పవాడు, తద్ + వికారంబున్ = ఆ (మన్మథ)వికారమును, ఇపుడు, మానుము.

తాత్పర్యము: ఓరీ సుకుమారా ! ఈ మార్గమును నీకు గురువు ఉపదేశించెనా? లేనిచో దీనిని శాస్త్రములందెట్లు చూచితివి ? ఇది ధర్మసంపాదనమునకు తగిన మార్గమా ? దీనిచే తపస్సు వృద్ధిపొందునా ? దీని మూలమున మోక్షస్థానము నధిష్ఠింపవచ్చునా ? దీనిని స్వర్గకారణముగా నెంచితివా ? లేక యిది తలపగా నియమవిధానమా ? సంసార దుఃఖములు దీనిచే నెట్లు తొలగును ? మూర్ఖుడైనను, శిశువైనను, మూఢుడైనను మనస్సునందు అశుభమును గోరునా ? ఆఱుగు రంత శ్శత్రువులందును కామము గొప్పది. ఆ కామవికారమును ఇపుడు మానుము.

---

1. తా. నియమక్రమంబేది

విశేషములు: ఓరి - సంబోధనముననగు `ఓ'కు పురుషామంత్రణమునందు రి వర్ణమంతాగమము. (బాల. తత్సమ. 14,15) `ఓరి యోసి మైత్రి యందుం గలవు.' బాల. తత్సమ. 16. ఓయి మొదలయిన వానికి స్వతంత్ర ప్రయోగముం గలదు. (బాల. తత్సమ 16 వృత్తి) దర్శించితి + ఎట్లు - దర్శించితివి + ఎట్లు. లిట్టువకారమునకు లోపము (బాల. క్రియ 24) పిమ్మట అంద్వవగాగమ సంధి (బాల. సంధి. 11), పిమ్మట `మధ్యమ పురుష క్రియల యందిత్తునకు సంధి యగును.' - బాల. సంధి. 7 దర్శించి తెట్లు. కంటె - కను ధాతువు. భూతంబున లిట్టగు. బాల. క్రి. 3. కను + లిట్. `లకారంబునకు డుఙ్రువురును ముజ్ఞాగు.' బాల. క్రియ. 8. మధ్యమ పురుషైకవచనము గాన - కను + వు. `లిట్టు వు జ్ఞుపరంబగునపుడు తివర్ణకంబగు.' బాల.క్రియ. 18 కను + తి + వు. `ఇకారంబు మీది కునువు క్రియా విభక్తుల యుత్వంబున కిత్వంబగు.' బాల. తత్సమ. 26 కను + తివి. `తిదుటలు పరంబులగునపుడ న్వాదుల నుస్థానంబున సున్నయు నుండు డు లోపంబును విభాషనగు.' బాల. క్రి. 58 కం +తి.వి. `ఇట బిందువు మీది తదలకు నిత్య వైకల్పికంబులయి టడలగు. కంటివి +ఎ. ఇప్పుడు లిడ్వకారమునకు లోపము (బాల. క్రి. 24) కంటి + ఇ + ఎ. అంద్వవగాగమ సంధి సూత్రము చే (బాల. సంధి.11) కంటె సిద్ధించును. అరిష్టము = (నానా.) కీడు, పురిటిల్లు, కాకి మనస్సు, మనసు, మనము (రూపాం.) అంతస్ + అహితులు - పదాంత సకారమునకు విసర్గము. పిమ్మట అచ్చు పరమగుచున్నది కావున విసర్గమునకు రేఫాదేశము - అంతరహితులు - వారు ఆఱుగురు. కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము.

సీ. రత్నాంశుదీపాంకురములచేఁ బాయదు
యౌవనోద్భూతమైనట్టి తమము
శిశిరోపచారంబుచేత సాధ్యము గాదు
ప్రత్యగ్రమైన దర్పజ్వరంబు
మంత్రమూలములచే మణులచేఁ దేఱదు
విషయవిషాస్వాదవిషమమూర్ఛ
సలిలాభిషేకశౌచములచేఁ బోవదు
ఘనభోగ మను పూతిగంధకళిక

గీ. యామవతి తెల్లవారిన నణఁగిపోవ
దుదర సుఖసన్నిపాత నిద్రోదయంబు
బ్రతిదినంబును లక్ష్మీసురామదంబు
విరియనేరదు పరిణామవేళయందు 106.

అర్థము: యౌవన + ఉద్భూతము = పడుచుదనము వలన బుట్టి నది, ఐన + అట్టి, తమము = చీకటి (అజ్ఞానము) రత్న + అంశు - దీప + అంకురములచేన్ = రత్నముల యొక్క, కిరణములనెడి, దీపముల మొలకలచేత, పాయదు = పోదు. పత్యగ్రము + ఐన = క్రొత్తదియగు, దర్ప -జ్వరంబు = గర్వమనెడి తాపము, శిశిర + ఉపచారంబు చేతన్ = శీతలములైన చికిత్సలచేత, సాధ్యము + కాదు = తగ్గునది కాదు. విషయ - విష + ఆస్వాద - విషమ - మూర్ఛ = ఇంద్రియములనెడి విసము యొక్క త్రాగుట వలని తీవ్రమైన సొమ్మసిల్లుట, మంత్ర - మూలములచేన్ = మంత్రముల చేతను, వేరులచేతను, మణులచేన్, తేఱదు = స్వస్థత నొందదు. ఘన - భోగము = గొప్ప భోగము, అను = అనెడి, పూతి గంధకలిక = దుర్గంధపు మొగ్గ, సలిల + అభిషేక - శౌచములచేన్ = నీటితో తడుపుట, శుద్ధి చేయుట అను వానిచేత, పోవదు. ఉదర - సుఖ - సన్నిపాతనిద్రా + ఉదయంబు = పొట్ట సౌఖ్యమనెడి యపస్మారము యొక్క ఉదయము, యామవతి = రాత్రి తెల్లవాఱినన్ = తెల్లవాఱినను, అణగిపోవదు = నశింపదు. ప్రతిదినంబును, లక్ష్మీ - సురా - మదంబు = సంపదయనెడి కల్లుకైపు, పరిణామ - వేళ + అందున్ = ముగింపు సమయము నందు, విరియన్ + నేరదు = తొలగజాలదు.

తాత్పర్యము: పడుచుదనము వలన పుట్టిన చీకటి రత్నాంశువులనెడి దీపాంకురముల చేత నశింపదు. నూతనముగా వయసుతో పుట్టిన గర్వమనెడి తాపము శీతలోపచారములచేత పోదు. ఇంద్రియ విషాస్వాదనము వలన కలిగిన తీవ్రమైన మూర్ఛ మంత్రములు, వేరులు, మణులు నను వానిచే తేఱు కొనదు. గొప్ప భోగమనెడి దుర్గంధపు మొగ్గ జలాభిషేకము చేతను, శుద్ధిచేతను పోదు. ఉదర సౌఖ్యమనెడి యపస్మారము నుదయము రాత్రి తెల్లవాఱగనే యడగదు. సంపదయనెడి కల్లు కైపు ప్రతిదినమును ముగింపుసమయమున అడగదు.

విశేషములు: తమము = చీకటి, అజ్ఞానము - శ్లేషము, యౌవనము - (ప్రకృతి) - జవ్వనము (వికృతి) దర్పజ్వరము - దర్పమనెడి జ్వరము - రూపకము. విషయ - విష = విషయములనెడి విష - రూపకము. ఘనభోగమను పూతిగంధకలిక - రూపకము. యామవతి - యామములుగలది - రాత్రి. ఉదరసుఖ సన్నిపాత నిద్ర = ఉదరసుఖమనెడి సన్నిపాత నిద్ర, లక్ష్మీ సురామదము - లక్ష్మి యనెడి సురామదము - రూపకములు. ప్రతిదినము - అవ్యయీభావము.

క. [1]ఏమగు నొకొ బాంధవమున
నామలకశలాటురసము యౌవనలక్ష్మీ
సామగ్రికి నా యొగరు గ
దా మధురత యొసంగు విషయమను జలమునకున్. 107

1. తా. ఏమఉనొకొ.

అర్థము = ఆమలక - శలాటు - రసము = పచ్చి యుసిరిక కాయరసము, యౌవన - లక్ష్మి - సామగ్రికిన్ = యౌవన సంపద యొక్క సముదాయమునకు, బాంధవమునన్ = చుట్టఱికముచే, ఏమి +అగున్ + ఒకొ = ఏమికావలయునో!, ఆ - ఒగరు +కదా = ఆ ఒగరు రుచియేకదా, విషయము = ఇంద్రియము, అను = అనెడి, జలమునకున్ = నీటికి, మధురత = తీయదనము, ఒసగున్ = ఇచ్చును.

తాత్పర్యము: యౌవన లక్ష్మికి పచ్చియుసిరికాయరస మెట్టిచుట్టమో కదా ! ఇంద్రియమనెడి నీటికి ఆ యొగరే కదా తీయదనమును గలిగించునది!

విశేషములు: ఆమలక శలాటు వనగా పచ్చియుసిరిక కాయ. దీనికి సంస్కృతమున అమృత, వయస్థ అనియు పేర్లు గలవు. `తిష్యఫలా త్వామలకీ త్రిషు. అమృతా చ వయస్థాచ.' అమరము. అమృతా - అమృతము వంటి రసము గలది - ఉసిరిక. రాచ యుసిరిక కాయ తిని నీరు త్రాగినచో ఆ నీరు తీయగా నుండును. అందుచే దానికి అమృత యనుపేరు సార్థకము. వయస్థా - యౌవనము దీని చేత స్థిరమగును - ఉసిరిక. ఆమలక శలాటు రసమునకును యౌవన సంపదకును గల సంబంధ మెట్టిదో యని ప్రశ్నించుకొని దానికి సమాధానముగా కవియే దాని రసము నొగరు రుచియే కదా విషయమనెడి నీటికి మాధుర్యము నొసగునని చెప్పుచున్నాడు. అనగా యౌవనమునకును నామలక శలాటురసము నకును దగ్గఱిచుట్టఱికమే కలదనుట. అయిన నీ సందర్భమున నీ యామలక శలాటు ప్రసక్తి కేమి కారణమో! యౌవనలక్ష్మి, విషయమను జలము - రూపకములు.

గీ. [1]జవ్వనమునను సదుపదేశములు గావు
తిత్తిఁ (బోసిన సలి) లంబు తెఱఁగు దోఁప
శంబరారాతిపుష్పాస్త్రసంప్రహార
జర్ఝరీభూతమగు మనస్సంపుటమున 108

అర్థము: జవ్వనమునను = యౌవనమునందు, శంబ..... భూతము : శంబర + అరాతి = శంబరాసురునకు శత్రువు అగు మన్మథుని యొక్క పుష్ప + అస్త్ర = పూవుటమ్ముల యొక్క, సంప్రహార = దెబ్బలవలన, జర్ఝరీ భూతము = తూట్లు పడినది, అగు, మనస్ + సంపుటమునన్ = బరణివంటి మనస్సునందు, తిత్తిన్ = చేపలను బట్టు బుట్టయందు, పోసిన, సలిలంబు = నీటి యొక్క, తెఱంగు = విధము, తోంపన్ = తోంచగా, సత్ + ఉపదేశములు = మంచి హితబోధలు, కావు = పనికిరావు - నిరుపయోగములు. నిలువవనుట.

తాత్పర్యము: యౌవనమునందు మన్మథుని పూవుటమ్ములచే తూట్లు పడిన బరణివంటి మనస్సునందు చేపలను బట్టు బుట్టయందు పోసిన నీటి విధమున మంచి హితబోధములు నిష్ప్రయోజనములు - వ్యర్థములు.

విశేషములు : శంబరారాతి... జర్ఝరీ భూతమగు మనస్సంపుటము, సదుపదేశములు - ఉపమేయములు. వానికి వరుసగా తిత్తి, సలిలము ఉపమానములు. `కావు' సామాన్యధర్మము. తెలుగు దోప - ఉపమావాచకము - కావున సంపూర్ణోపమ. తిత్తి - బుట్టవలె దాటి యీనెలతో నల్లిన మత్స్యగ్రహణ సాధన విశేషము. తిత్తియందు, నీరెట్లు నిలువదో, పుష్పాయుధుని యమ్ములచే తూట్లుపడిన మనస్సునందును హితోపదేశములు నిలువవనుట. చేసిన హితోపదేశములు వ్యర్థములగు నని భావము. యౌవనము (ప్రకృతి) - జవ్వనము (వికృతి). శంబర + అరాతి = శంబరారాతి - సవర్ణదీర్ఘసంధి. సత్ + ఉపదేశ = సదుపదేశ - పదాంత గత ఝల్లునకు (త్), అచ్చు (ఉ) పరమగుచున్నది కావున తృతీయ వర్ణాదేశము. జర్ఝరీ భూత - జర్ఝర + భూత - అభూత తద్భావార్థమున వికృతి వాచకపదమునకు పరముగా కృ, భూ ధాతు కృదంత రూపములు వికల్పముగా వచ్చును. అప్పుడు వికృతి వాచకాంతమునందున్న `అ, ఆ' కారములకు `ఈ' కారమును, ఇ, ఉ కారములకు దీర్ఘమును, `ఋ' కారమునకు `రీ' వర్ణమును వచ్చును. దీనికి `చ్వి' ప్రత్యయాంతమని పేరు. (అజర్ఝరం జర్ఝరం భూతమ్).

వ. తండ్రి! గురూపదేశం బఖిల మల ప్రక్షాళనక్షమంబైన తీర్థ స్నానంబు. జరా మరణ వైకల్యంబు లేని వార్ధకంబు. మేదో భారంబు లేని గౌరవంబు, సువర్ణ రచన లేని కర్ణాభరణంబు, నుద్వేగంబు లేని ప్రజాగరంబు. 109

అర్థము: తండ్రి = నాయనా! సుకుమారా!, గురు + ఉపదేశంబు = గురువు యొక్క హిత బోధనము, అఖిల - మల - ప్రక్షాళన - క్షమంబు = ఎల్ల (పాపములయొక్క) కడుగుట యందు (నశింపజేయుట యందు) సమర్థము, ఐన, తీర్థ - స్నానంబు = పుణ్యోదక స్నానము, జరా - మరణ - వైకల్యంబు = చిక్కుట, చావు, అను, లోపము, లేని, వార్ధకంబు = ముసలితనమును మేదస్ +భారంబు = క్రొవ్వు వలని బరువు, లేని, గౌరవంబు = గురుత్వమును, సువర్ణ - రచన = మంచి రంగు యొక్క యేర్పాటు, లేని, కర్ణ + ఆభరణంబు = చెవి యలంకారమును, ఉద్వేగంబు = వ్యాకులత, లేని, ప్రజాగరంబు = మేలుకొనుటయు.

తాత్పర్యము: `నాయనా! సుకుమారా! గురువును పదేశము ఎల్లమురికిని కడుగుట యందు - ఎల్ల పాపములను నశింపజేయుటయందు - సమర్థమైన పుణ్యోదక స్నానము. గురూపదేశము పుణ్యోదక స్నానము వలె సర్వపాపహరమని భావము; కృశించుట, చచ్చుట లేని ముసలితనము. క్రొవ్వు వలని బరువులేని

గురుత్వమును. మంచి రంగు నేర్పాటు లేని చెవుల యలంకారము, వ్యాకులత లేని మేలుకొనుటయును.

విశేషములు: మల శబ్దమునకు ముఱికి, పాపము అని అర్థ ద్వయము. ముఱికియనెడి పాపమని శ్లిష్టరూపకమ్ము జరామరణ వైకల్యంబు లేని వార్ధకంబు - ఇచ్చట జరా శబ్దమునకు కృశించుట, జీర్ణమగుట యను నర్థము సమంజసముగా నుండును. మేదోభారము లేని - క్రొవ్వు వలని బరువులేని, గౌరవంబు = గురుత్వము. క్రొవ్వుపట్టని శరీర గురుత్వమా - లేక క్రొవ్వెక్కని గొప్పతనమా - ఏదియైనా గావచ్చును. సువర్ణరచన లేని కర్ణాభరణము - కర్ణాభరణమునకు సువర్ణ = బంగారము, మంచిరంగు అనువానిలో నేదియైనను - గుణమేకాని దోషము కాదు గదా! అదిలేని కర్ణాభరణమెటులొప్పును? అది `సువర్ణ రచన' కాక `సువర్ణక రచన'= ఇత్తడి తోడి నిర్మాణము - అయియుండునా?

"గురూపదేశశ్చ నామ పురుషాణా మఖిలమల ప్రక్షాళన క్షమ మజలం స్నానమ్. అను పజాత పలితాది వైరూప్యం అజరం వృద్ధత్వమ్. అసువర్ణ విరచనం అగ్రామ్యం కర్ణాభరణమ్"అను కాదంబరీ మహాకావ్యస్థ భాగమున కిది తెనుగు

వ. [1]ఇది యభవ్యులకు సలిలంబునుంబోలెం గర్ణస్థితంబై యుప ద్రవంబు నాపాదించు. నీ విటవట్టి నెట్టుకొని పెద్దలమాట వినుము. వింటేని ధూర్తులు నిన్ను[2]బ్రశానింపలేరు. *(కుటిలులు నన్నలమరింపలేరు) వంచకులు నిన్ను వంచింపలేరు. పల్లవులు నిన్ను వలపింప లేరు. మదంబు నిన్ను గదల్పలేదు.[3]విషయంబులు నిన్ను నాశ్లేషింపలేవు.

అర్థము: ఇది = గురూపదేశము, అభవ్యులకున్ = అయోగ్యులకు, సలిలంబునున్ + పోలెన్ = నీరువలె, కర్ణ - స్థితంబు + ఐ = చెవియందు నిలిచిన దయి, ఉపద్రవంబున్ = హానిని, ఆపాదించున్ = కలిగించును, నీవు, ఇట + పట్టి = ఇది మొదలుకొని, నెట్టుకొని = పూని, పెద్దల - మాట, వినుము, వింటి + ఏనిన్ = వింటివేని, నిన్నున్, ధూర్తులు = జూదరులు, ప్రశానింపన్ + లేరు = ఆజ్ఞాపింపజాలరు, కుటిలులు = కపటులు, నిన్నున్, అలమరింపన్ + లేరు = బాధపెట్టలేరు, వంచకులు = మోసగాండ్రు, నిన్నున్, వంచింపన్ + లేరు = వలచునట్లు చేయలేరు, మదంబు = గర్వము, నిన్నున్, కదల్పన్ + లేదు = కదలింపజాలదు, విషయంబులు = ఇంద్రియములు, నిన్నున్, ఆశ్లేషింపన్ + లేవు = కౌగిలింపలేవు, చుట్టుకొనలేవు.

తాత్పర్యము: గురూపదేశము అయోగ్యులకు చెవుల నిలిచినదయి నీరువలె హాని గలిగించును. నీ విది మొదలుగా పూని పెద్దల మాట వినుము. వింటివేని

---

1. తా. ఇట 2. ము. బ్రశంసింప 3.ము. యంబు

జూదరులు నిన్ను శాసింపజాలరు. కపటులు నిన్ను బాధింపలేరు. మోసగాండ్రు నిన్ను మోసగింపలేరు. విటులు నిన్ను వలపింపలేరు. గర్వము నిన్ను కదలింపలేదు. ఇంద్రియములు నిన్ను అలముకొనలేవు.'

విశేషములు: ఇది యభవ్యులకు....యుపద్రవంబు నాపాదించు - ఉపమాలంకారము. ఇది + గురూపదేశము, - ఉపమేయము, సలిలము - ఉపమానము. వింటివి + ఏనిన్ - లిద్వకారమునకు లోపము - బాల. క్రియ. 24, వింటి + ఇ + ఏనిన్ - అపదాదిస్వరసంధి బాల.సంధి.11, వింటి + ఏనిన్ - మధ్యమ పురుషక్రియేత్సంధి. బాల. సంధి.7.

`ఇది యభవ్యులకు సలిలంబునుంబోలెం గర్ణస్థితంబై యుపద్రవంబు నాపాదించు." ఇది కాదంబరిలోని యీ వాక్యమున కనువాదము. "గురువచన మమలమపి సలిలమివ మహదుపజనయతి శ్రవణ స్థిత శూలమభవ్యస్య."

వ. విను మనూచానా చారంబును, నాముష్యాయణాం బును [1]నామేధితామ్నా యంబును, నధీతాశేష శాస్త్రంబును, [2]నలింగవృత్తియు, [3]ననవ కీర్ణంబు, ననభ్యుదితంబును, ననభిష్టుతంబును నైన [4]యాయావర వంశంబునం బ్రభవించినం బ్రభవించినవాడవు. మూఢుండవై యనుష్ఠాన బంధంబులగు విషయోప భోగంబులయందు సుఖబుద్ధి యారోపించెదవు. నీయట్టి [5]దుర్బుద్ధి శీలురు గదా నిస్త్రింశంబు జూచి కువలయమాల యని యును, గృష్ణసర్పంబు వీక్షించి కాలాగురు ధూమరేఖయని యును, నంగారంబు[6]దర్శించి బంగారం బనియును భ్రాంతిం బొందుదురు. దుందుమార [7]కరంధమ మాంధాతృ నహుష నాభాగ సన్నిభుండు వింధ్యాచలపతి హేమాంగదుండు మనల గురుస్థానంబుగా మన్నింపుచున్నవాడు. మన వంశంబునకు నీ వొక్కండవ సంతాన బీజంబ వింతయు నెఱింగి బుద్ధిమం తుండవై మమ్ము నుద్ధరింపవలదా యని * (పలికి) మంత్రి కన్నీరు దొరంగ ముహూర్తమాత్రం బూరకుండె సుశీలా దేవియు

109

అర్థము: వినుము, అనూచాన + ఆచారంబును = సాంగవేదాధ్యయనము చేసిన బ్రాహ్మణుల యొక్క సంప్రదాయము గలదియు, ఆముష్యాయణంబును = ప్రఖ్యాత వంశమున నుద్భవము గలదియు, ఆమేధిత + ఆమ్నాయంబును = తెలిసికొనబడిన వేదములు గలదియును, అధీత + అశేష - శాస్త్రంబును = చదువబడిన, ఎల్ల, శాస్త్రములు గలదియును, అలింగ - వృత్తియున్ = వంచకులు లేని దియు, అనవకీర్ణంబున్ = నాశము నొందనిదియు, (చెల్లాచెదరుకానిదియు), (తా:అనవకీర్ణియున్)

1. తా. నామ్రేడితామాయనంబు. 2. తా. నాలింగ 3. తా.ననవకిర్ణియు. 4. ము. యార్య 5. తా. దుర్బుద్ధియు. 6. తా. ధరియించి. 7. సముండు.

= వ్రతభ్రష్టులైన బ్రహ్మచారులు లేనిదియు), అనభ్యుదితంబును = అభ్యుదితులు (= సూర్యోదయ సమయమున నిద్రించువారు) లేనిదియును, అనభిష్టుతంబునున్ = స్తుతింపబడనిదియును ఐన, యాయావర - వంశంబునన్ = యాయావరమను పేరుగల కులమునందు, ప్రభవించిన వాడవు = పుట్టినవాడవు, మూఢుండవు + ఐ = తెలివిమాలినవాడవయి, అనుష్ఠాన - బంధంబులు = ఆచరణమునకు అడ్డంకులు, అగు, విషయ + ఉపభోగంబుల + అందున్ = ఇంద్రియ సౌఖ్యముల యనుభవమునందు, సుఖ - బుద్ధి = సుఖము యొక్క తలపు, ఆరోపించెదవు = (లేనిది) కల్పింతువు, నీ + అట్టి = నీవంటి, దుర్బుద్ధి - శీలురు - కదా = దుష్ట స్వభావులు గదా, నిస్త్రింశంబున్ = కత్తిని, చూచి, కువలయ - మాల = నల్లకలువల దండ, అనియును, కృష్ణ - సర్పంబున్ = నల్లత్రాచును, వీక్షించి = చూచి, కాల + అగురు - ధూమ - రేఖ = నల్లఅగరు పొగయొక్క గీత, అనియును, అంగారంబున్ = నిప్పును, దర్శించి = చూచి, బంగారంబు, అనియును, భ్రాంతిన్ = భ్రమమును, పొందుదురు, దుందుమార, (ధుంధుమార) కరంధమ, మాంధాతృ, నహుష, నాభాగ - సన్నిభుండు = దుందుమారుండు, కరంధముడు, మాంధాత, నహుషుడు, నాభాగుడు - అనువారితో సమానుడు, అగు, వింధ్య + అచల - పతి = వింధ్యపర్వత దుర్గ ప్రభువు, హేమాంగదుడు, మనలన్, గురు-స్థానంబుగాన్ = గురుసామ్యముగా, మన్నింపుచున్ + ఉన్నవాడు = గౌరవించుచున్నాడు, మన - వంశంబునకున్ = మన కులమునకు, నీవు + ఒక్కండవు + అ = నీవొక్కడవే, సంతాన - బీజంబవు = సంతతికైన విత్తనమవు, ఇంతయున్, ఎఱింగి, బుద్ధిమంతుండవు + ఐ, మమ్మున్, ఉద్ధరింపన్ + వలదా = పయికెత్తవలదా, అని, పలికి, మంత్రి = యజ్ఞదత్తుడు, కన్నీరు (కన్ + నీరు), తొరంగన్ = కాఱగా, ముహూర్త - మాత్రంబు = నిమేషమాత్రకాలము, ఊరక + ఉండెన్, సుశీలా దేవియున్.

తాత్పర్యము: వినుము. సాంగవేదాధ్యయనము చేసిన బ్రాహ్మణుల సంప్రదాయముగలదియు, ప్రఖ్యాతవంశమునుండి యుద్భవించినదియు, వేదముల నెఱిగినదియు, సర్వశాస్త్రములను చదివినదియు, వంచకులు లేనిదియు, నాశనము నొందనిదియు, సూర్యోదయ సమయమున నిద్రించువారు లేని దియు, స్తుతింపబడనిదియును అయిన యాయావరమను పేరుగల వంశమునందు బుట్టిన వాడవు. అట్టి నీవు తెలివి మాలినవాడవయి ఆచరణమున కడ్డంకులైన యింద్రియ సౌఖ్యాను భూతి మంచిదని. భ్రమించుచున్నావు. నీ వంటి దుష్ట స్వభావులు కదా కత్తిని జూచి నల్లకలువపూలమాల యనియును, నల్లత్రాచును జూచి నల్ల అగరు పొగ గీత యనియును, నిప్పును జూచి బంగరు వనియు భ్రమింతురు. ధుంధుమారుడు, కరంధముడు, మాంధాత, నహుషుడు, నాభాగుడు అనువారితో సమానుడైన వింధ్యపర్వత

దుర్గాధిపతి హేమాంగదుడు మనలను గురు సమానులనుగా గౌరవించుచున్నాడు. మన వంశమునకు నీ వొక్కడవే సంతతికైన మొలకవు. ఇంతయును నెఱిగి నీవు బుద్ధిమంతుడవయి మమ్ముద్ధరింప వలదా?' యని పలికి మంత్రి యజ్ఞదత్తుడు కన్నీరు కార్చుచు నొక్కనిమేషమాత్రకాల మూరకుండెను. అంత సుశీలాదేవియును - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: యాయావర మను వంశము గొప్పదియై యుండవలయును. కానిచో నిప్పుడు సుకుమారునకు దానిని గూర్చి చెప్పనేల? అట్టి యున్నతవంశము అనవకీర్ణ అననేమి? అవకీర్ణము = నాశము నొందినది. చెల్లాచెదరయినది. అనవకీర్ణము - అట్టిది కానిది - నాశమునొందనిది. చెల్లచెదరుకానిది. తాళపత్రప్రతిలో 'అనవకీర్ణయు అనికలదు. అవకీర్ణి = వ్రత భ్రష్టుడైన బ్రహ్మచారి. అట్టివారు లేనిదియనవలయును. అనభ్యుదితము - అభ్యుదితము కానిది - అభ్యుదయము లేనిది. అట్లు చెప్పుట సరికాదు గదా! అభ్యుదితులు = సూర్యోదయ సమయమున నిద్రించువారు లేనిది అనాచార వంతులు లేనిది అనభ్యుదితము అని చెప్పుట మంచిదని తోచినది. అట్లే అనభిష్టుతము - అభిష్టుతము (అభి+స్తుతము) = పొగడబడినది కానిది. ఇదియెట్లు సరిపడునో! దుర్బుద్ధి శీలురు - దుర్బుద్ధిశీల +లు - 'అదంతంబయి దీర్ఘ పూర్వలోపధంబయిన మహత్తుమీది విభక్తి లకారంబునకు రేఫంబగు.' బాల. తత్సమ. 38. నిస్త్రింశంబు జూచి కువలయమాల, కృష్ణసర్పంబు వీక్షించి కాలాగురుధూమ రేఖ, అంగారంబు దర్శించి బంగారంబు - భ్రాంతిమంతము. దుందుమారుండు - ధుంధుమారుండు? ఇతడు బృహదశ్వుని కుమారుడు. మొదటిపేరు కువలాశ్వుడు. ధుంధువను రాక్షసుని నుత్తంకముని కోరికపై సంహరించినవాడు.

కరంధముడు-ఖనీనేత్రుని పెద్ద కొడుకు. మొదటి పేరు కర్దముడు. ప్రజాకంటకుడగు ఖనీనేత్రుని రాజ్యభ్రష్టుని గావించి ప్రజలీతనికి పట్టము గట్టిరి. ఇతడు తండ్రివలెగాక ప్రజలకు విశేషధనము లిచ్చి తాను ధనహీనుడయ్యెను. శత్రువులు ముట్టడింప నితడరణ్యముల కేగి తపస్సుచేసి తన కరము మథించు దుండి చతురంగ బలము ప్రతిదిన ముద్భవింప జొచ్చెను. కరము మథించుటచే నతనికి కరంధము డను పేరు వచ్చెను. ఆసేనతో నతడు శత్రువులను సంహరించి తన రాజ్యమును మరల గెలిచికొనెను.

మాంధాత - ఇతడు యువనాశ్వునికి బుట్టినవాడు. తన భార్యలకుద్దిష్టమైన మంత్రపూత జలమును యువనాశ్వుడు తెలియక త్రావి గర్భమును ధరించెను. అతని గర్భమును జీల్చుకొని మాంధాత బైటబడెను. మాంధాత రావణునోడించి బంధించెను. బ్రహ్మ వారికిరువురికి సంధిగావించి రావణునోడించి బంధించెను. బ్రహ్మ వారి కిరువురికి సంధి గావించి రావణుని విడిపించెను. మాంధాత బలగర్వమున

నింద్రునిపైకి దండెత్తెను. ఇంద్రుడు `భూలోకమును రావణు నోడించి నామీదికి ర' మ్మన, మాంధాత రావణునిపై నెత్తిపోయి వానిచే నోడెను.

నహుషుడు - ఇతడు పెక్కు క్రతువులు చేసి యింద్ర పదవి నందెను. ఇతడు మిక్కిలి గర్వించి శచీదేవిని కామించెను. శచి మునివాహనుడవై వచ్చినచో నీ పొందు నంగీకరింతు ననెను. నహుషుడు గర్వాంధుడై తానెక్కిన యందలమును మోయుడని సప్తర్షుల నాజ్ఞాపించెను. నహుషుడు `సర్ప సర్ప'= కదలుము కదలుము అన, నగస్త్యుడు `సర్పమవు కమ్మని వానిని శపించి, `సర్పరూపుడవై నీవు వేయు ప్రశ్నముల కెవడుత్తరమిచ్చునో వానివలన నీకు శాపమోక్షమగు' నని యగస్త్యుడానతిచ్చెను. సర్పరూపుడైన నహుషున కొకనాడు భీముడు చిక్కెను. వానిని విడిపించుకొన వచ్చిన ధర్మజుడు నహుషుని ప్రశ్నములకు సదుత్తరము లొసగ నహుషునకు శాపమోక్షమయ్యెను. నాభాగుండు - మనువు కుమారుడైన భగుని కొడుకు. ఇతని సత్యప్రియత్వమునకు మెచ్చి యీశ్వరుడితనికి అంతర్ధిత్వము, బ్రహ్మజ్ఞానము గలుగునట్లు వరమిచ్చెను. మన్నింపుచున్నవాడు - మన్నించు ధాతువునందలి యించుగాగమ చకారమునకు ముత్తుగాక శ్చుత్వర్గక చువర్గకము పరమగుచున్నది కావున పత్వము రాదు. మన్నించు చున్నవాడు సరియైన రూపము.

సీ. రవల యుంగరముల రత్నాంకురము లొత్తఁ
  గేల్దమ్మి చెక్కులఁ గీలుకొల్పి
మొకరి తుమ్మెద మూతి ముట్ట నోడెడి వేఁడి
  నిశ్వాసపవనంబు నివ్వటిలఁగ
అకర్ణదీర్ఘంబు లగు క్రాలు గన్నులఁ
  బరిపాటలచ్ఛాయ పల్లవింపఁ
గంతగోళంబు గద్గదికాను[1]బద్ధమై
  బాష్పభారంబు నిబ్బరముగాఁగ

గీ. బక్ష్మములు జాఱి గండదర్పణము లొరసి
వ్రాలి పాలిండ్లపై నశ్రువాః కణములు
హారలతలకు నాతిథ్య మాచరింప
గుబ్బతిల నేడ్చి [2]నొత్తిలి కువలయాక్షి. 110

అర్థము: కువలయ + అక్షి = నల్ల కలువల వంటి కన్నులు గలది - స్త్రీ - సుశీల. రవల - ఉంగరముల = వజ్రపుటుంగరములయొక్క, రత్న + అంకురములు = మణుల మొలకలు, ఒత్తన్ = నొక్కగా, కేల్ + తమ్మి = తామరవంటి చేయి,

---

1. తా. బంధమై. 2. ము.నత్తటిం.

చెక్కులన్ = చెక్కిళ్లయందు, కీలుకొల్పి = ఘటించి, మొకరి - తుమ్మెద = మ్రోయునట్టి తుమ్మెద, మూతిన్ + ముట్టన్ = మూతితో ముట్టుటకు - వాసనచూచుటకు, ఓడెడి = జంకెడి, వేడి - నిశ్వాస - పవనంబు = వేడి నిట్టూర్పుగాలి, నివ్వటిలగన్ = అతిశయింపగా, ఆ - కర్ణ - దీర్ఘంబులు = చెవుల వఱకు నిడుపులయి నవి, అగు, గ్రాలు + కన్నులన్ = చలించు కన్నుల యందు, పరిపాటల + ఛాయ = అంతటను తెలుపు మించిన యెఱుపు వర్ణము, పల్లవింపన్ = అతిశయింపగా,

కంఠ - గోళంబు = గోళము వంటి కంఠము. గద్గదికా + అను బద్ధము + ఐ = డగ్గుత్తికతో దగిలియున్నదయి, బాష్ప - భారంబు = కన్నీటి యొక్క బరువు, నిబ్బరము + కాంగన్ = అధికముకాగా.

అశ్రు - వార్ + కణములు = కన్నీటి బిందువులు, పక్ష్మములు - జాఱి = ఱెప్పల వెంట్రుకల నుండి జాఱి, గండ - దర్పణములు = అద్దముల వంటి చెక్కిళ్లు, ఒరసి = రాచి, పాలిండ్లపైన్ = స్తనముల మీద, వ్రాలి = దిగి, హార - లతలకున్ = తీగలవంటి హారములకు, ఆతిథ్యము = అతిథి సత్కారము, ఆచరింపన్ = చేయగా, ఒత్తిలి = గట్టిగా, గుబ్బతిలన్ = ఉప్పొంగునట్లు, ఏడ్చెన్.

తాత్పర్యము: కలువ కంటి యగు సుశీల వజ్రపుటుంగరములందలి మణుల మొలక లొత్తునట్లుగా హస్తపద్మమును చెక్కిళ్లయందు చేర్చి, మ్రోయు తుమ్మెద వాసన చూచుటకు జంకు వేడి నిట్టూర్పుగాలి యతిశయింపగా, చెవుల వఱకు వ్యాపించినవి యగు చలించు కన్నులందు పాటల వర్ణము విరివికాగా, కంఠము డగ్గుత్తికవడి కన్నీరు అధికము కాగా బాష్ప జలబిందువులు ఱెప్పల నుండి జాఱి అద్దముల వంటి చెక్కిళ్లపై జాఱి పాలిండ్లపై దిగి లతలవంటి హారములకు అతిథి సత్కారము చేయగా పొంగిపొంగి గట్టిగా నేడ్చెను.

విశేషములు: సుశీల యేడ్చిన విధమును స్వభావసిద్ధముగా వర్ణించెను గావున నిందలి యలంకారము స్వభావోక్తి. వజ్రపుటుంగరములందు మణులు పొదుగ బడినవి. ఆమె తన చేతిని చెక్కుల జేర్చి నప్పుడా మణులు చెక్కిలి నొత్తుచుండెను. ఆమె నిశ్వాసపవనము గంధిల మగుటచే తుమ్మెదల కిష్టమే. కాని యిప్పుడు దుః ఖాతిశయముచే నది వేడిగా నుండి తుమ్మెదలు వాసన చూడ జంకుచుండెను. కన్నులందు పాటల వర్ణము వ్యాపించుట దుఃఖాతిరేకము వలన. కన్నీ రధికమై యెలుగు డగ్గుత్తిక వడినది. ఱెప్పల నుండి జాఱు నశ్రు జలకణముల పతన క్రమ వర్ణనము కాళిదాసు కుమారసంభవములో తపస్సు చేయు పార్వతి పై బడు ప్రథమోద బిందువుల పతనక్రమమును వర్ణించిన విధమును తలపింపజేయు చున్నది.

స్థితాః క్షణం పక్ష్మసు తాడితాధరాః
పయోధరోత్సేధ నిపాతచూర్ణితాః
వలీషు తస్యాః స్ఖలితాః ప్రపేదిరే
చిరేణ నాభిం ప్రథమోదబిన్దవః కుమార.5.24

అశ్రువాఃకణములు పాలిండ్లపై నున్న హారలతలను తడుపుచుండుట వాని కామెత లిడుటగా వర్ణించుట రమ్యము. కేల్దమ్మి - కేలు + తమ్మి - గసడదవాదేశము. కేలు + తమ్మి. పదాంత లువర్ణోత్వమునకు లోపము. బాల. ప్రకీర్ణ 16 కేల్దమ్మి. తమ్మివంటి కేలు - ఉపమానోత్త పద కర్మధారయము. ఆకర్ణ దీర్ఘ - మర్యాదార్థమున `ఆఙ్'. కర్ణముల వఱకు నని యర్థము. అవ్యయీ భావము. నిబ్బరము (వికృతి) - నిర్భరము (ప్రకృతి). పాటల + ఛాయ = పాటలచ్ఛాయ. హ్రస్వమునకు పరమైన ఛకారము ద్విత్వము. గండ దర్పణములు = దర్పణముల వంటి గండములు - ఉపమానోత్తర పద కర్మధారయము. ఒత్తిలి కళయైన అవ్యయము. కువలయాక్షి - కువలయములవంటి అక్షులు గలది - స్త్రీ. బహువ్రీహి.

వ. ఇవ్విధంబునం దల్లియుందండ్రియుం[1]దనకు హితోపదేశంబు చేసి తన సౌమనస్య సౌముఖ్యంబులతోఁ దగిన ప్రత్యు త్తరం [2]బీయమి నిర్వేదించుట యెఱింగి.
111

అర్థము: ఈ + విధంబున్, తల్లియున్, తండ్రియున్, తనకున్, హిత + ఉపదేశంబు = హితబోధ, చేసి, తన, సౌమనస్య = సుమనస్సు యొక్క భావము, సౌముఖ్యంబులతోన్ = సుముఖతలతో, తగిన, ప్రతి + ఉత్తరంబు = సమాధానము, ఈయమిన్ = ఈ కుండుటచే, నిర్వేదించుట = దుఃఖించుట, ఎఱిగి.

తాత్పర్యము: ఈ రీతిగా తల్లిదండ్రులు తనకు హితబోధ చేయగా తాను వారికి మంచి మనస్సుతోను, సుముఖతతోను సమాధానము చెప్పక దుఃఖించుట తెలిసి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: తన ..... ప్రత్యుత్తరం బీయమి - తాను ... ప్రత్యుత్తరంబీయమి. `ధాతుజ విశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్తృపద ప్రథమకుం దఱచుగ యొక్క షష్ఠియగు.' ప్రౌఢ.కారక. 15 `యొక్కకు లోపంబు బహుళంబు.' ప్రౌఢ.కారక. 16 పయి పాఠమున నన్వయక్లేశము గలదు. ఉన్నపాఠము ననుసరించి `నిర్వేదించు' అను దానికి దల్లిదండ్రులును, `ఎఱింగి' అనుదానికి సుకుమారుండును కర్తలు కావలసి వచ్చుచున్నది. కాని క్రింది పద్యము నందలి మాటలు తల్లిదండ్రులవి. అందుచే `ఎఱింగి' అనుదానికిని కర్త తల్లిదండ్రులే అనవలయును. మఱి నిర్వేదించిన

1. తా. తనకుచితోపదేశంబు, 2. తా. బీక నివేదించుట

వారును తల్లిదండ్రులేకదా! ఈ క్లేశమును నివారించు పాఠాంతర మేదైన లభించు నేమో! తాళపత్రపాతముగూడ నంతమాత్రముగనే యున్నది.

సీ. ధర్మశాస్త్రాభ్యాస తాత్పర్యమున నైన
సంస్కార[1]మెట్లౌరుసౌరు పడియె
నిరుపాధి నిస్సీమ నిర్నిబంధన[2] శక్తి
గల మహాప్రతిభ యే కాటఁగలిసెఁ
బంచేంద్రియ[3]విజయోపాయ భూతములైన
వినయంబు లే ప్రయోజనము దీర్చె
నవ యౌవనాంకు[4] రోన్నతవంశదవమైన
[5]శ్రుతివైభవం బేమి హితవు చేసెఁ

గీ. జిన్ని వయసున [6]గురులు శిక్షించి నట్టి
పుణ్యవాసన నేలఁ గోల్పోయె మనసు
కటకటా! నందనుండ [7]వొక్కఁడవ కల్గి
గురుల నేడ్పించుచున్నావు [8]కోరగమున. 112

అర్థము: ధర్మ - శాస్త్ర + అభ్యాస - తాత్పర్యమునన్ = ధర్మ శాస్త్రముల యొక్క నేర్చుట యందలి యాసక్తిచేత, ఐన = కలిగిన, సంస్కారము = సామర్థ్యము, ఎట్లు, ఔరు సౌరు పడియెన్ = క్షీణించెను. నిరుపాధి = నిష్కపటము, నిస్సీమ = అపారము, నిర్నిబంధన = అడ్డులేనిది, (అగు), శక్తి = సామర్థ్యము, కల, మహత్ (మహా) ప్రతిభ = గొప్పబుద్ధి, ఏ - కాటన్ + కలిసెన్ = ఏ శ్మశానమున కలిసెను? - ఎచ్చట నశించెను. పంచ + ఇంద్రియ - విజయ + ఉపాయభూతములు = అయి దింద్రియముల యొక్క, గెలుపునకు (పంచేంద్రియములను గెలుచుటకు), సాధనము లైనవి, ఐన, వినయంబులు = యోగ్యతలు, ఏ - ప్రయోజనమున్ = ఏ యుపయోగమును, తీర్చెన్ = కలిగించెను. నవ - యౌవన + అంకుర + ఉన్నత - వంశ - దవము = క్రొత్త జవ్వన మనెడి మొలకలుగల గొప్ప కులమనెడి వెదురునకు కార్చిచ్చు, ఐన, శ్రుతి - వైభవంబు = వేద సంపద, ఏమి - హితవు - చేసెన్ = ఏమి మేలు గూర్చెను. చిన్ని - వయసునన్ = బాల్యమునందు, గురులు = ఉపాధ్యాయులు, శిక్షించిన + అట్టి = బోధించినట్టి, పుణ్య - వాసనన్ = పవిత్రమైన సంస్కారమును, మనసు, ఏల - కోల్పోయెన్ = ఎందుచేత పోగొట్టుకొనెను. కటకటా = అయ్యయ్యో, నందనుండవు = కుమారుడవు, ఒక్కండవు + అ =

1. తా. మెప్డౌరుసౌరు, 2. ము. వృత్తి, 3. తా. జయోపాయభూతములైన, 4. శాహవనదమైన నీ. 5. ము. శ్రుతివైభవములేమి. 6. తా. ము. గురులనీక్షించి, 7. ము. ఒక్కడవునీవు, 8. ము. గోరముగను

ఒక్కడవే, కల్గి = ఉండి, కోరగమునన్ = ఈ పదము నిఘంటువులందు కనబడలేదు. గోరముగను = ఘోరముగా, గురులన్ = తల్లిదండ్రులను, ఏడ్పించుచున్ + ఉన్నావు.

తాత్పర్యము: `సుకుమారా! ధర్మ శాస్త్రములను నేర్చుటచే గలిగిన నీ సామర్థ్యమేరీతిగా క్షీణించినది? నిష్కపటము, నిరవధికము, నిర్నిబంధనము నైన సామర్థ్యముగల నీ గొప్పబుద్ధి యే వల్లకాట నశించెను? పంచేంద్రియములను గెలువ సాధనములైన నీ యోగ్యత లేమి యుపయోగమును గలిగించెను? నూత్న యౌవన మనెడి మొలకలు గల యున్నత వంశ (కుల) మనెడి వంశము (వెదురు) నకు కార్చిచ్చైన నీ వేద పాండిత్య సంపద నీ కేమి మేలు గూర్చెను? బాల్యమున నుపాధ్యాయులు గఱపినట్టి పవిత్ర సంస్కారమును నీ మనసేల కొల్పోయెను? అయ్యయ్యో! మాకు ఒక్కడవే కుమారుడవైన నీవు తల్లిదండ్రులమైన మమ్ము ఘోరముగా ఏడిపించుచున్నావు.

విశేషములు: ఔరు సౌరు పడు - అవురు సవురు పడు - క్షీణించు, నశించు, కాటగలియు = కాటియందు గలియు - నశించు. కాడు శబ్ద మౌపవిభక్తికము గావున దానికి సప్తమ్యేకవచనము `అందున్' పరముగా (బాల. అచ్చిక 31) టి వర్ణమంతా దేశమయి, ఆ సప్తమికి (బాల. అచ్చిక 38 చే) `అవర్ణమాదేశమై, అపదాది స్వర సంధి (బాల. సంధి 11) జరిగి `కాటన్' అగును. పంచేంద్రియ - శ్రోత్రము, త్వక్కు, చక్షువు, జిహ్వా, నాసిక - అనునైదును జ్ఞానేంద్రియములు. (కొందఱి మతమున మనస్సును). వాక్కు, పాణి, పాదము, పాయువు (గుదము), ఉపస్థము (రహస్యావయవము) అనునైదును కర్మేంద్రియములు. నవ యౌవనమనెడి అంకురములు గల ఉన్నత వంశ (కుల)మనెడి వంశము (వెదురు) నకు దవము - కార్చిచ్చు - కార్చిచ్చు వంశాంకురములను (వెదురు మొలకలను) దహించునట్లే, శ్రుతి వైభవము నూత్నయౌవనమునకు భంగకర మనుట. యౌవనాంకుర - రూపకము (యౌవన మనెడి అంకురము) వంశ = వంశ(కుల) మనెడి వంశము (వెదురు) శ్లిష్టరూపకము. దవ - `దావస్తు దవో వనహుతాశనః' `దునోతీతి దవః' తపింపజేయునది కనుక దవము - కార్చిచ్చు - అమరము. కోల్పోయె - కోలుపోయె. పదాంత లు వర్ణోత్వమునకు లోపము. బాల. ప్రకీర్ణ 16. గురు శబ్దము ఉపాధ్యాయుని యందును, తల్లిదండ్రుల యందును వర్తించును. కోరగమున - ఈ పదము నిఘంటువులందు కనబడలేదు. గోరముగను - ఘోరముగ = అధికముగా అను ముద్రితప్రతి పాఠము స్వీకరింపబడినది.

వ. అనినం దల్లిదండ్రులకుం బ్రణామంబు చేసి యింత నుండి మీయాజ్ఞ [1]శిరంబున ధరియించి బుద్ధిమంతుండనై యుండెద మీరు [2]వగవకుండుండని పలికి

---

1. ము. శిరసున. 2. తా. వగవకుండని

సముచితప్రకారంబున వీడుకొనియె ననిన నటమీది వృత్తాంతం[1]బెట్టిదని యడిగిన 117

అర్థము: అనినన్ = అని తల్లిదండ్రులనగా, తల్లి దండ్రులకున్ = తల్లికిని తండ్రికిని, ప్రణామంబు = నమస్కారము, చేసి, ఇంత నుండి = ఇది మొదలుగా, మీ + ఆజ్ఞన్ = మీ ఆనను, శిరంబునన్ = శిరస్సుచేత, ధరియించి = తాల్చి - శిరసావహించి యనుట, బుద్ధిమంతుండను + ఐ,ఉండెదన్, మీరు, వగవక +ఉండుండు = దుఃఖించపకుండుడు, అని, పలికి, సముచిత - ప్రకారంబునన్ = తగిన విధమున, వీడుకొనియెన్ = విడిచి పెట్టెను, అనినన్ = అని ఆ కథకుడు అగు సూతుడు చెప్పగా, అటమీది = తరువాతి, వృత్తాంతంబు = కథ, ఎట్టిది, అని, అడిగినన్ = శౌనకాదిమును లడుగగా.

తాత్పర్యము: అని తల్లిదండ్రులు సుశీలా యజ్ఞదత్తులు పలుకగా సుకుమారుడు వారి నమస్కరించి `యిది మొదలు నేను మీ యానతిని శిరసావహించి, బుద్ధి గలిగి యుందును. మీరు విచారింపకుడు' అని పలికి తగిన విధమున వారికడ సెలవుగైకొనెను. అని సూతుడు చెప్పగా విని శౌనకాదిమునులు తరువాతి వృత్తాంతమును చెప్పుమని వేడగా - పయి తృతీయాశ్వాసమునందలి రెండవ వచనముతో నన్వయము.

విశేషములు: తల్లిదండ్రులు - తల్లియును, తండ్రియును - ద్వంద్వము. `ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవలగు.' బాల. సంధి. 15

అజ్ఞ (ప్రకృతి) - ఆన (వికృతి), శిరస్సు, శిరము రూపాంతరములు.

మ. వరశైవైకవిధాన [2]దానకథన వ్యాపార పారంగత
స్థిరలక్ష్మీనవశారదోదయ దయాధీనాయతాలోక లో
కరమాపాదన పాదపద్మవినతక్ష్మాపాలసంశీల శ్రీ
లరతిప్రస్ఫుటశాంత శాంతనవకల్పద్వీర వీరాగ్రణీ! 114

అర్థము: వర - శైవ - ఏక - విధాన = శ్రేష్ఠమైన, శైవమతము, ముఖ్యమైన విధముగా గలవాడా! దాన.... దయ : దాన = ఈవి, కథన = చెప్పుట (కవిత్వాదికము), అను, వ్యాపార = పనులయందు, పారంగత = ఆవలి దరిని దాకిన (మిక్కిలి సమర్థమైన) స్థిర - లక్ష్మీ = నిలుకడగల సంపదయొక్కయు, నవ = క్రొత్త దియగు, శారదా = సరస్వతి యొక్కయు, ఉదయ = వృద్ధిగలవాడా, దయా + అధీన + ఆయత + ఆలోక = కనికరమునకు వశమైన దీర్ఘము లయిన చూపులు గలవాడా, లోక - రమా - ఆపాదన = లోకము (జనులు) నందు, సంపదయొక్క, కలిగించుట గలవాడా - జనులను సంపదగలవారినిగా జేయువాడా యనుట, పాద - పద్మ -

1. తా. బెట్టని. 2. ము. పాత్రకవితా

వినత - క్ష్మాపాల - సంశీల = తామరలవంటి పాదములందు, నమస్కరించువారయిన, రాజులు గలిగి యుండుట యను మంచి స్వభావము గలవాడా, శీల - రతి - ప్రస్ఫుట - శాంత = మంచి స్వభావము నందలి, ఆసక్తిచే, మిక్కిలి స్పష్టమయిన, శాంతగుణము గలవాడా, శాంత - నవ - కల్పత్ + వీర = వీర + అగ్రణీ = వీరులలో శ్రేష్ఠుడా.

తాత్పర్యము: శ్రేష్ఠమైన శైవమతమే ప్రధానముగా గలవాడా! ఈవి యందు స్థిర సంపదయు, కథన వ్యాపారమున నపర శారదయు నభ్యుదయములు గలవాడా! దయ కఠినమైన చూపులు గలవాడా! జనులను సంపన్నులనుగా జేయువాడా! పాదపద్మములకడ వినతులైన రాజులు గలవాడా! శీలమున శాంతగుణము ప్రస్ఫుటముగా గలవాడా! వీరశ్రేష్ఠుడా! ఇవియన్నియు కృతిభర్తయైన ముమ్మడి శాంతయ్యకు విశేషణములు.

విశేషములు: దానవ్యాపారమునందు స్థిరలక్ష్మ్యుదయమును, కథన వ్యాపారము నందు నవశారదోదయమును గలవాడని క్రమాన్వయ ముండుటచే యథా సంఖ్యాలంకారము. ముక్తపదగ్రస్తము.

క. ధీమ త్కవితా విస్తర
ధామాయిత నిరుపమానదానాంబుద హృ
ద్భీమ జయోత్కల సీమా
రామా మన్మథవిశేషరాజితమూర్తీ! 115

అర్థము: ధీమత్ = తెలివిగల, కవితా = కవిత్వము యొక్క, విస్తర = విరివికి, ధామాయిత = నిలయమువలె నాచరించు వాడా! నిరుపమాన - దాన + అంబుద = సాటిలేని, యీవియందు, మేఘమయినవాడా ! హృద్ + భీమ - జయ + ఉత్కల - సీమా = హృదయమునకు, భయంకరమైన, గెలుపుగల ఉత్కలదేశము గలవాడా! రామా - మన్మథ = స్త్రీలకు మన్మథుడైనవాడా! విశేష - రాజిత - మూర్తీ! = అధికముగా ప్రకాశించు, ఆకారము గలవాడా! లేదా మొత్తమునంతను నొకే సమాసముగాజేసి రామా = స్త్రీలకు, మన్మథ = మన్మథుని వలె, విశేష = అధికముగా, రాజిత = ప్రకాశించిన, మూర్తీ = ఆకారముగలవాడా అని యైనను చెప్పవచ్చును.

తాత్పర్యము: ధీమంతమైన కవిత్వ విస్తృతికి నిలయమైనవాడా! అను పమాన దానమునకు మేఘమైన వాడా! మనోభయంకరముగ నుత్కల దేశమును జయించినవాడా! స్త్రీలకు మన్మథునివలె ప్రకాశించు నాకారముగలవాడా!

---

1. ము. రూఢిలీలావతారా, 2. తా. మృతిస్వచ్ఛ. * తాళపత్రమున లేదు. 3. ము. హేలా.

విశేషములు: ధామాయిత - ధామ + యిత. ఉపమానమైన అజంత, హలంత కర్తృవాచక పదములకు ఆచారార్థమున యిత ప్రత్యయము వికల్పముగా వచ్చును. అప్పుడు పూర్వాచ్చునకు దీర్ఘము వచ్చును. ఇది క్యజ్జంతమనబడును. ధామాయిత = ధామము వలె నాచరించు.

లింగార్చ[1]నారూఢలీలావిశాలా
గంగాంబు [2]సుస్వచ్ఛకావ్యైక జాలా
*సంగీత సాహిత్య సౌహిత్యలోలా
శృంగారసద్భక్త సేవాను[3]పాలా. 116

అర్థము: లింగ + అర్చనా - రూఢ - లీలా - విశాలా = శివలింగము యొక్క, పూజచే, ప్రసిద్ధికెక్కిన, విలాసముచే, నిండియున్నవాడా! గంగా + అంబు - సుస్వచ్ఛ - కావ్య + ఏక -జాలా = గంగాజలము వలె, మిక్కిలి స్వచ్ఛమైన, కావ్యము యొక్క, ముఖ్యమైన సమూహముగలవాడా, సంగీత - సాహిత్య - సౌహిత్య - లోలా = సంగీతము, సాహిత్యము అనువాని యొక్క స్నేహమునందు, మిక్కిలి యాసక్తి గలవాడా! శృంగార - సత్ + భక్త - సేవా + అనుపాలా = సొగసైన, మంచి భక్తుల సేవయొక్క రక్షణము గలవాడా!

తాత్పర్యము: శివలింగపూజచే ప్రసిద్ధములైన విలాసముల విరివిగలవాడా, గంగాజలము వలె మిక్కిలి స్వచ్ఛమైన కావ్య సమూహముగలవాడా ! సంగీత సాహిత్యముల కలయిక యందు మిక్కిలి ఆసక్తి గలవాడా! సొగసైన సద్భక్తుల సేవను పాలించువాడా!

గద్యము

ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సకలవిద్యాసనాథ శ్రీనాథనామధేయ ప్రణీతంబయిన శివరాత్రిమాహాత్మ్యంబునందు ద్వితీయాశ్వాసము.

దీని వ్యాఖ్య పూర్వాశ్వాంతగద్యవ్యాఖ్యకు వలెనే.

ఇది.... రెండవ యాశ్వాసము.

గీ. అమల జొన్నలగడ్డ వంశాబ్ధి విధుఁడు
ఖ్యాత మృత్యుంజయాభిఖ్యుఁడైన వాడు
పరఁగ శ్రీనాథ కవి సార్వభౌమ రచిత
భవ్య శివరాత్రి మాహాత్మ్య కావ్యవరముఁ
బ్రతి పదార్థవిశేషతాత్పర్యకలన
స్పష్ట మొనరించు 'చంద్రికా' వ్యాఖ్య యిద్ది.

శివరాత్రి మాహాత్మ్యము
(సుకుమార చరిత్రము)
తృతీయాశ్వాసము

క. శ్రీ దోరంతర [1]దేవ
ప్రాదితభాషా విశేష భాసుర కీర్తి
శ్రీదార్ఢ్య వివిధ పూజా
మోదిత గిరిదుహితృకాంత ముమ్మయ శాంతా! 1.

అర్థము: శ్రీ.... ధార్ఢ్య : శ్రీ = లక్ష్మీదేవి యొక్క దోస్ + అంతర = భుజముల యొక్క నడుమగలవాడు, అగు, దేవ = విష్ణుదేవుని వలన, ప్రాదిత = (ఈ శబ్దము స్వరూపము తెలియ కున్నది. అధస్సూచికలో నున్న ప్రోదిత అయియుండునా? `ప్రోదిత' అయినచో యతిభంగము. ప్రోదిత అని యుండగా యతిమైత్రి కొఱకు ప్రాదిత అని మార్చబడినదా?) ప్రోదిత = పుట్టిన, భాషా - విశేష = భాషా విశేషము (వేదము) చే, భాసుర = ప్రకాశించు, కీర్తి - శ్రీ = యశస్సంపదయొక్క, దార్ఢ్య = దృఢత్వము గలవాడా!, వివిధ..... కాంత : వివిధ = పెక్కురీతులయిన, పూజా = పూజలచేత, మోదిత = సంతోషపెట్టబడిన, గిరి = దుహితృ - కాంత = కొండ కూతురైన పార్వతి యొక్క భర్త (శివుడు) కలవాడా! ముమ్మయ శాంతా.

తాత్పర్యము: శ్రీదేవి వక్షమునందు గల విష్ణుదేవుని నుండి పుట్టిన వేదములచే ప్రకాశించు కీర్తి సంపద యొక్క దృఢత్వము గలవాడా! వేద విద్యచే ప్రకాశించు దృఢమైన కీర్తి సంపదగలవాడా యనుట. వివిధ పూజలచే శివుని సంతోషపెట్టిన వాడా! ఓయి ముమ్మయశాంతా! కృతిపతి సంబోధనము.

వ. అక్కథకుండు శౌనకాది మహామునుల కిట్లనియె నట్లు తల్లిదండ్రుల నూరార్చి వెడలి సుకుమారుండు నిజాంతర్గతంబున 2.

అర్థము: అ + కథకుండు = కథ చెప్పువాడయిన ఆ సూతుడు, శౌనక + ఆది = శౌనకుడు మొదలగు, మహామునులకున్ = గొప్పమునులకు, ఇట్లు, అనియెన్, అట్లు, తల్లిదండ్రులన్, ఊరార్చి = ఓదార్చి, వెడలి, సుకుమారుడు, నిజ +

---

1. తా. వేదప్రోదిత,

అంతర్గతంబునన్ = తనదైన మనస్సునందు.

తాత్పర్యము: కథను చెప్పునట్టి యా సూతుడు శౌనకుడు మున్నుగా గల గొప్పమునుల కిట్లు పలికెను. ఆరీతిగా సుకుమారుడు తల్లిదండ్రుల నోదార్చి వెడలి తన మనస్సులో - తరువాతి పద్యముతో నన్వయము.

గీ. పోయె నుపదేశకాలంబు పూర్వముననె
కడచె ధైర్యంబు [1]జఠర విక్రాంత మయ్యె
శీల సంపత్తి యింక నేమి సేయువాఁడ
భామినీ[2]సక్తి మన్మథుబారిఁబడితి 3.

అర్థము: ఉపదేశ - కాలంబు = హితోపదేశములు విను సమయము, పూర్వముననే = ఇదివఱకే, పోయెన్ = కడచెను, ధైర్యంబు, కడచెన్ = పోయెను, శీల - సంపత్తి = సుగుణ సంపద, జఠర - విక్రాంతము = పొట్టకే యెక్కువ ప్రాధాన్య మిాబడిన దనుట, భామినీ - సక్తిన్ = స్త్రీలయందలి కోరికచే, మన్మథు - బారిన్ = మన్మథుని దృష్టియందు, పడితిన్, ఇంకన్, ఏమి + చేయువాడన్.

తాత్పర్యము: నాకు హితోపదేశములు వినుకాల మెప్పుడో పోయెను. ధైర్యము పోయినది. శీలసంపదకంటె పొట్టయే బలవత్తరమయ్యెను. స్త్రీల యందలి యాసక్తిచే మన్మథునకు లక్ష్యభూతుడ నైతిని. ఇక నేమి చేయుదును?

విశేషములు: ఉపదేశకాలము - ఒకరు చెప్పుట నేను వినుట గల సమయము. జఠర ..... సంపత్తి: జఠరము శీలమును మించినదనుట. జఠరము కొఱకు శీలము త్యాజ్యమగుచున్నదనుట.

శా. [3]పంతం బోడదు ధర్మముం దగవునుం బాడింగులంబున్ విచా
రింతున్ వేదపురాణశాస్త్ర మతపారీణుండఁగా నెట్లు క
ల్పాంతద్వాదశభానుమత్కిరణ దాహక్రూర కామవ్యథా
సంతాపజ్వరవేదనాభరమునం జాకుంట [4]సిద్ధించినన్ 4.

· **అర్థము .** కల్పాంత... భరమునన్ : కల్ప + అంత = ప్రళయ సమయమునందలి, ద్వాదశ = పండ్రెండుగురు, భానుమత్ = సూర్యుల యొక్క, కిరణ = కిరణముల యొక్క, దాహ = కాకవలె, క్రూర = కఠినమైన, కామ = మన్మథుని వలని, వ్యథా = బాధయనెడు, సంతాప - జ్వర = మహాతాపము అనెడి జ్వరము వలని, వేదనా - భరమునన్ = బాధయొక్క అతిశయముచే, చాక + ఉంట = చావకుండుట,

---

1. తా. జడత, 2. తా. సఖి. 3. తా. పుంతంబున్దధు ధర్మముం, 4. తా. సిద్ధించునే.

సిద్ధించినన్ = లభించినచో, ధర్మమున్, విచారింతున్ = ఆలోచింతును, ఫంతంబు + ఓడదు = పట్టుదల సడలదు - అనగా బ్రదికియే యున్నచో ధర్మాదులను గూర్చి పట్టుదలతో నాలోచింతు ననుట, వేద - పురాణ - శాస్త్ర - మత - పారీణుండన్ = వేదములు, పురాణములు, శాస్త్రములు, మతము అనువానియందు పారమును ముట్టిన వాడను - మిక్కిలి కుశలుడను, కాను + ఎట్లు = ఏవిధముగా గాను? ఏవిధముగా నైన నగుదుననుట.

తాత్పర్యము: ప్రళయ సమయమునందలి పన్నిద్దఱు సూర్యుల కిరణముల కాకవలె పరుషమైన మన్మథతాపమనెడు జ్వరము వలని బాధాతి శయముచే నేను చావకుండటయే తటస్థించుచో, ధర్మమును, న్యాయమును, యోగ్యతను, కులాచారమును గూర్చి పట్టుదల వీడక విచారింతును. నేను వేదములు, పురాణములు, శాస్త్రములు, మతము ననువానియందు మిక్కిలి కుశలుడను గానా? అగుదుననుట.

విశేషములు: ప్రళయ సమయమున ద్వాదశాదిత్యు లుదయింతురని పురాణములు. ఒక్క సూర్యుని కిరణముల దాహమే క్రూరము. అట్టిచో నొకేసారి పన్నిద్దఱు సూర్యుల కిరణముల దాహ మెంత క్రూరమో చెప్పనలవి కాదు. కామవ్యథ అంత క్రూర మనుట. `ఆ జ్వరముచే నేను చావకుండుట పొసగనే పొసగదు. ఒకవేళ అట్టిది పొసగినచో తక్కినవానిని గూర్చిన విచారము' లనుట. `అట్టిదియే తటస్థించుచో ధర్మాదులను గూర్చి పంతము బట్టి ఆలోచింతును. నేనేమి ఆలోచింపలేని వాడనా? వేదపురాణాదుల యందు పారంగతుడనే కదా!' సుకుమారుడు ధర్మాదులందు మిక్కిలి కుశలుడనుటకు అతని తండ్రి వచనమే ప్రమాణము - `ధర్మశాస్త్రాభ్యాస తాత్పర్యమున నైన సంస్కారమెట్లోరు సౌరు పడియె' 1-112, `దర్శించి తెట్లు శాస్త్రములలోన?' - 1-105 భానుమత్ - భానువులు (కిరణములు) గలవాడు - సూర్యుడు. కల్పాంత ..... భరము - సమాస భరముచే వేదనాభరము సూచితము. చాక చచ్చు + కణి - `చావునోవులు చచ్చు నొచ్చుల కగు.' బాల. క్రి. 94 `జీత్తు పరంబగునపుడు వాని వువర్ణంబు విభాషను లోపించు.' బాల. క్రి. 95 ఉంట - ఉండు + ట - `తి దు ట లు పరంబులగునపు డన్వాదుల నుస్థానంబున సున్నయు నుండు డు లోపంబును విభాషనగు.' బాల. క్రి. 58 చాక + ఉంట = చాకుంట - `అత్తునకు సంధి బహుళముగా నగు.' బాల. సం. 4 ద్వాదశ - ద్వి + దశన్ - దశన్, వింశతి, త్రింశత్ శబ్దములు పరములగునపుడు నిత్యముగాను, చత్వారింశత్, పంచాశత్, షష్టి సప్తతి, నవతి శబ్దములు పరములగునపుడు వికల్పముగాను ద్విశబ్దమునకు సమాసమున `ద్వా' ఆదేశమగును. `అశీతి' పరమగుచో ద్వాదేశము కాదు.

సీ. చాండాలుతోఁ బుల్కసత్వంబు గైకొను
బ్రహ్మహత్య. యొనర్చి బ్రాహ్మణుండు
క్రిమియై పతంగమై కీటమై జన్మించు
నాసవంబాని భూమిసురుండు
క్రవ్యాదసత్త్వసర్గమున నుద్భవమందు
విప్రుఁడాచార్యుని వెలఁది గలిసి
శ్యామచారుండు పిశాచమౌ బాడబుం
డన్యుని విత్తంబు నపహరించి

గీ. యయిన [1]నేమగు వీనిలో నన్నిటికిని
సుఖము దుఃఖము జర్చించి చూచినప్పు
డెల్ల సంసారులకుఁ (బోలె) హెచ్చు (గుందు)
లేక యుండుట గందుమో లేదొ జగతి 5.

అర్థము: బ్రాహ్మణుండు, బ్రహ్మ - హత్య = బ్రాహ్మణ వధ, ఒనర్చి = చేసి, చాండాలుతోన్ = చండాలుతో (మాలవానితో), పుల్కసత్వంబున్ = అస్పృశ్యతను, కైకొనున్ = పొందును. భూమి సురుండు = బ్రాహ్మణుడు, ఆసవంబు = కల్లు, ఆని = త్రావి, క్రిమి + ఐ = కృమి (పురుగు) అయి, పతంగము + ఐ = పక్షియయి, కీటము + ఐ = క్రిమి విశేషమయి, జన్మించున్ = పుట్టును. విప్రుండు = బ్రాహ్మణుండు, ఆచార్యుని = గురువు యొక్క, వెలదిని = స్త్రీని (భార్యను) కవిసి = కూడి, క్రవ్యాది - సత్త్వ - సర్గమునన్ = మాంసమును తిను జంతువు (క్రూరమృగము యొక్క).. పుట్టువు నందు, ఉద్భవము + అందున్ = పుట్టును. బాడబుండు = బ్రాహ్మణుడు, అన్యుని = ఇతరుని యొక్క, విత్తంబున్ = ధనమును, (బంగారమును) అపహరించి = దొంగిలించి, శ్యామ చారుండు = రాక్షసుండు(?), పిశాచము = భూతము ఔన్ = అగును. అయినన్ = అయినను - పయిని చెప్పిన నీచ జన్మముల నందినను, ఏమి + అగున్ = ఏమి కొంపమునుగును? పెద్ద ప్రమాద మేమియు లేదనుట, వీనిలోన్ = ఈ పుట్టువులలో, అన్నిటికిని, సుఖమున్, దుఃఖంబున్, చర్చించి = విమర్శించి, చూచిన + అప్పుడు = చూచినచో, జగతిన్ = లోకమునందు, ఎల్ల - సంసారులకున్ + పోలెన్ = ఎల్లప్రాణులకు వలె, హెచ్చు - కుందు = ఎక్కువ, తక్కువ లేక + ఉండుట, కందుమో - లేదొ = చూతుమా లేదా - చూతుమనుట.

తాత్పర్యము: బ్రాహ్మణుడు బ్రాహ్మణుని చంపి చండాలునితో పాటు అస్పృశ్యతను పొందును. అతడు మద్యమును సేవించి క్రిమిగను, పక్షిగను, కీటకముగను

1. ము. నేమిగా.

పుట్టును. అతడు గురుభార్యను గూడి మాంసమును తిను క్రూరమృగమయి పుట్టును. పరధనము నపహరించి యతడు రాక్షసుడు, పిశాచము నగును. అయినను - అట్టి నికృష్ట జన్మముల నందినను ఏమి కొంప మునుగును? ఈ పుట్టువులలో నన్నిటికిని సుఖదుఃఖములను విమర్శించి చూచినచో లోకమున గల ప్రాణుల కన్నిటికిని ఎక్కువ తక్కువలు లేకుండుట (సమానమగుట) చూతుమే కదా!

విశేషములు: ఈ పద్యములో బ్రాహ్మణుడు బ్రహ్మహత్య, సురాపానము, గురుదారగమనము, స్వర్ణస్తేయము, వీని నాచరించు వారితో చెలిమి అను పంచమహాపాతకములలో మొదటి నాల్గింటి నాచరించుచో నేమగునో చెప్పబడినది. చాండాల = చండాల. `చణ్డాల ప్లవ మాతఙ్గ దివాకీర్తి జనంగమాః, నిషాద శ్వపచా వన్తేవాసి చాణ్డాల పుల్కసాః' - `చండతే కుప్యతీతి చండాలః' - కోపగించు కొనువాడు - మాలవాడు. అమరము. చండాల ఏవ చాండాలః మహాన్తః, తాన్ స్పర్శనేన కస్తే శాతయతీతి పుల్కసః - పెద్దలను స్పర్శము చేత చెఱుచు వాడు - మాలవాడు. అమరము. బ్రహ్మ = బ్రాహ్మణ. `ద్విజాత్యగ్ర జన్మ భూదేవ బాడబాః విప్రశ్చ బ్రాహ్మణః' - బ్రహ్మణి పరబ్రహ్మణి నిష్ఠావత్త్వాత్ బ్రహ్మణః కులే భవత్వాత్ - బ్రాహ్మణః బ్రహ్మ కులమందు పుట్టినవాడు. క్రిమి =కృమి; మందం క్రామ తీతి క్రిమిః = మెల్లగాపోవునది. కీటకము క్రిమి విశేషము. క్రవ్యాద - క్రవ్యం మాంస మత్తీతి క్రవ్యాదః - మాంసమును భక్షించునది - అమరము. విప్ర - విశేషేణ పాపేభ్యః ఆత్మానం పరం చ పాతీతి విప్రః - తన్నును పరునిని విశేషముగా పాపమునుండి రక్షించువాడు. శ్యామచారుడు. శ్యామ యనగా రాత్రి. అందు సంచరించువాడు రాక్షసుడు. కాని శ్యామాశబ్దము ఆకారాంత స్త్రీలింగము. శ్యామాచారుండని యుండుటకు బదులు శ్యామచారుడెట్లున్నదో! బాడబ - బడబాగ్నిరివాతృప్తో బాడబః - బడబాగ్నివలె తృప్తి లేనివాడు - లేదా బడబా బ్రాహ్మణీ తస్యా అపత్యమితి బాడబః - బడబ యనగా బ్రాహ్మణ స్త్రీ. ఆమె సంతానము బాడబుడు. విత్తము = స్వర్ణము. సంసారి = ప్రాణి, జంతువు (సూ.ని.) సుఖదుఃఖము లన్ని ప్రాణులకు సమానము లయినప్పుడు, ఎట్టి యకృత్యమాచరించి, యే ప్రాణిగా జనించిన నేమి? యని సుకుమారుని తర్కము.

గీ. వామదేవుండు శుకుఁడు [1]గేవలము దక్క
ముక్తు లెవ్వరు వింటిమే ముజ్జగమున
జంతువుల కెల్ల [2]సరియ సంసారయాత్ర
విధినిషేధంబులకుఁ జొప్పు వెదక నేల? 6

---

1. తా. కేవలమతంక, 2. తా. సరియె.

అర్థము: ముజ్జగమునన్ (మూడు + జగములు) మూడులోకములందును, వామదేవుండున్ = వామదేవుడను పేరుగల ఋషియును, శుకుండున్ = శుక మహర్షియును, కేవలము - తక్కన్ = ఆ యిద్దఱే తప్ప, ముక్తులు = మోక్షము నందినవారు, ఎవ్వరు, వింటిమి + ఏ = వింటిమా? వినలేదనుట, సంసార - యాత్ర = ప్రపంచజీవ యాత్ర, జంతువులకున్ + ఎల్లన్ = అన్ని ప్రాణులకును, సరి + అ = సరియ = సమానమే, విధి - నిషేధములకున్ = ఈ పని చేయవలయును, ఈ పనిని చేయరాదు అనువానికి, చొప్పు = కారణము, వెదకన్ + ఏల = వెదకు టెందులకు? వెదకనక్కఱలేదనుట.

తాత్పర్యము: వామదేవుడును, శుకుడును మాత్రము తప్ప మూడులోకములందును మఱియెవ్వరైన మోక్షము నందినట్లు వినియుంటిమా? ప్రపంచ జీవయాత్ర యెల్ల ప్రాణులకును సమానమే. అట్టియెడ నిది చేయవలయును, ఇది చేయరాదు అను వానికి కారణమును వెదకుటెందులకు?

విశేషములు: వామదేవుడు - దశరథునికి పురోహితుడైన యొక ఋషి. శుకుడు - వ్యాసుని కుమారుడు. ముజ్జగము - మూడు + జగములు `సమానాధికరణంబగు నుత్తర పదంబు పరంబగునపుడు మూడు శబ్దము డు వర్ణంబునకు లోపంబును మీది హల్లునకు ద్విత్వంబు నగు.' బాల. సమాస. 17 మూ + జ్జగములు. `ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు' బాల. సమాస. 13. ముజ్జగములు అని కావలసి యుండగా నిక్కడ `ముజ్జగము' అని ప్రయోగింపబడినది. `ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగా నగు మిశ్రంబునకు గాదు.' బాల. సమాస. 18 ఇది మిశ్రద్విగువగుటచే దీని కేకవచనము కారాదు. కాని ప్రౌఢవ్యాకరణము `ఒక్కచో ద్విగువు మిశ్రం బేక వచనాంతము నగు' ప్రౌఢ. సమాస. 20 అని యేక వచనాంతములగు మిశ్రద్విగువులను గొన్నిటిని చూపెను. విధి నిషేధములు విధియును, నిషేధమును - ద్వంద్వము. విధినిషేధములకు చొప్పు వెదక నక్కఱలేదనుట జంతువుల కెల్ల సంసారయాత్ర సరియే యను దానిచే సమర్థింపబడినది కావున నలంకారము కావ్యలింగము.

శా. ఆతంకంబున కేమి కారణము బ్రాహ్మ్యం?[1] బింతయుంజూచియే
తాతల్ గట్టిన చెర్వులే శ్రుతులు [2]బోధప్రక్రియల్ స్వల్పమే;
చేతోజాతు నుపాశ్రయించెదఁ; బరస్త్రీలన్ వినోదించెదన్;
మాతంగీపరమేశ్వరిం గొలిచెదన్; మద్యంబు సేవించెదన్. 7.

1. తా. బంతయున్, 2. తా. బుద్ధప్రక్రియల్, 3. తా. దు చిరసీల

అర్థము: ఇంతయున్ + చూచియే = ఇది యంతయు పరిశీలించియే - జంతువుల కెల్ల సంసారయాత్ర సమానమే, విధినిషేధములకు కారణమునన్వేషింప బనిలేదు - అనునది యంతయు చూచియే యనుట, బ్రాహ్మ్యంబు = బ్రహ్మత్వము, బ్రాహ్మణత్వము, ఆతంకంబు నకున్ = (సురాపాన వ్యభిచారాదికమునకు) అడ్డు, ఏమి - కారణము = కారణ మెట్లగును - కారణము కాదనుట, శ్రుతులు = వేదములు, తాతల్ = తాతలు, పూర్వులు, కట్టిన = నిర్మించిన, చెర్వులు + ఏ = తటాకములే, బోధ - ప్రక్రియల్ = హితబోధవిధానములు, స్వల్పమే = తక్కువయే - గొప్పదేమియు గాదనుట, (కావున), చేతస్ న(ః) + జాతున్ = మనసిజుని - మన్మథుని, (అంతఃకరణము చెప్పినదాని ననుట), ఉపాశ్రయించెదన్ = సేవించెదను, పర - స్త్రీలన్ = ఇతరుల భార్యలను, వినోదించెదన్ = క్రీడించెదను, మాతంగీ - పరమేశ్వరిన్ = మధుశాలిని యగు పార్వతీదేవిని, కొలిచెదన్ = సేవించెదను, మద్యంబున్ = కల్లును, సేవించెదన్ = అనుదును.

తాత్పర్యము: జంతువుల కన్నిటికిని సంసార యాత్ర సమానమే, విధి నిషేధముల కెట్టి కారణమునన్వేషింప పని లేదు - అను నంశముల నన్నిటిని బాగుగా పరిశీలించియే సురాపానాది కార్యములకు బ్రాహ్మణత్వమించుకేనియు నడ్డుటకు కారణము కాదని చెప్పుదును. వానిని నిషేధించు వేదములు తటాకములను సొంతముగా నిర్మించినట్లు మన తాతలు చేసినట్టివే, హిత బోధముల విధానము లేమియు గొప్పవికావు. అందుచే నేను మనసిజుని - నా అంతఃకరణము చెప్పిన దానిని ఆశ్రయించెదను. అన్యుల భార్యల ననుభవించెదను. మధుశాలిని యగు పార్వతీదేవిని కొలిచెదను. మద్యమును సేవించెదను.

విశేషములు: సుకుమారుడు తన యకృత్యాచరణమున కనుకూలమైన విధముననే తర్కించు చున్నాడు. సంసార యాత్ర జీవుల కన్నిటికిని తుల్యమే అయినప్పుడిక బ్రాహ్మణత్వము సురాపానాదికము నడ్డగింప కారణమెట్లగును? ఆ పనులను శూద్రుడెట్లు నిరాతంకముగా చేయవచ్చునో బ్రాహ్మణుడు నట్లే యథేచ్ఛముగా చేయ వచ్చుననుట. `అట్టిపనులను నిషేధించు వేదము మన తాతలు తటాకములను నిర్మించునట్లు తమ కిష్టమయిన రీతిని నిర్మించినవే. ఆకాశమునుండి యూడి పడ్డవి కావు. తద్బోధ ప్రక్రియలు నుత్కృష్టము లైనవి కావు. అందుచే నా మనస్సు చెప్పిన రీతిని మన్మథునాశ్రయింతును. పరస్త్రీల ననుభవింతును. మధుశాలిని యగు పార్వతీదేవిని కొలుతును. మద్యమును త్రావుదును.' మాతంగీ - పరమేశ్వరిన్ - ఉత్కృష్టదేవతయగు మాతంగిని - పార్వతిని. అమ్మవారి జాతరలలో నమ్మవారికి మద్యమును నైవేద్యము చేయుట, జంతువులను బలియిచ్చుట మనము చూచుచున్నదే. `మాతంగీ మధుశాలినీ' అని కలదు గదా! చేతో జాతు - అత్పూర్వక విసర్గమునకు హశ్శు(జా) పరమగుచుండగా ఉకారాదేశము, పిమ్మట గుణసంధి జరుగగా చేతోజాతు. చెఱువు - చెర్వు.

`అచ్ఛికంబులం బదమధ్యంబుల నలడరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణ 17 `అలఘురేఫము లుప్తాచ్కమగుచో లఘురేఫంబగు' ప్రౌఢ. ముక్త 2

గీ. [1]అష్టమావతారంబున నాదిపురుషుఁ
[2]డచ్యుతుండు విశ్వకర్త యనాదినిధనుఁ
డర్జునుండును దాను నేకాంతగోష్ఠి
విశ్వము నెఱుంగ [3]నొగలపై వినిచెఁగాదె. 8

అర్థము: అష్టమ + అవతారంబునన్ = ఎనిమిదవ యవతారము నందు - కృష్ణావతారమునందు, ఆది - పురుషుడు = మొదటి పురుషుడు, అచ్యుతుడు = విష్ణువు (తన పదమునుండి చ్యుతుడు గానివాడు) విశ్వకర్త = విశ్వమును చేసినవాడు, అనాది నిధనుడు = ఆదియు (పుట్టుకయు), నిధనము (చావును) లేనివాడు, అర్జునుండును, తానున్, ఏకాంత - గోష్ఠిన్ = రహస్యసల్లాపమున, నొగలపైన్ = రథము తొట్టిపై, విశ్వమున్ = లోకమును, ఎఱుంగన్ = తెలియునట్లు, వినిచెన్ + కాదె = వినిపించెనుగదా!

తాత్పర్యము: ఎనిమిదవ యవతారమగు శ్రీకృష్ణావతారమున ఆదిపురుషుడును, విశ్వకర్తయు, మొదట తుది లేనివాడును అగు విష్ణువు అర్జునుడును తానును రథము నొగపై నేకాంతమున నుండినప్పుడు లోకము నెఱుగజెప్పెను గదా!

విశేషములు: ధర్మము, పాడి, కులము, మతము అను వానికంటె లోక జ్ఞానము ప్రధానము. అందులకు సకుమారుడు శ్రీకృష్ణుడర్జునకు చేసిన బోధమును దాహరించుచున్నాడు. శ్రీకృష్ణుడర్జునకు నొగలపై నుండి యేకాంతమున చేసిన బోధము గీతోపదేశము. అందు శ్రీ కృష్ణుడర్జునకు లోకజ్ఞానము వలయునని చెప్పెనా? అంత గీతోపన్యాసములో నెక్కడనైన నొకచో నుండిన నుండవచ్చునేమో! కాని సుకుమారుడు తనకు ప్రతికూలములయిన వానినన్నిటిని విడిచి యనుకూలమైన విషయమును చెప్పెను గాన శ్రీకృష్ణున కన్ని ప్రశంసాత్మకవిశేషణములు.

`అచ్యుతుండు అర్జునుండును దాను... వినిచె. - `ఆత్మార్థం బభిహితంబగుచో దల్లింగ సంఖ్యాభిధాయి వచనంబు ధాతు విశేషణంబులకగు.' బాల. క్రియ. 120. నొగ - బండి కాడిగట్టు కఱ్ఱ - యుగంధరము (సంస్కృతము). అవి రెండుండుట చే నొగలు అని వాడుక (సూ.ని.) వినుచు - వినుధాతుప్రేరణార్థక రూపము. `చుగాగమం బాచ్ఛికంబున కసంయుక్త నలడరాంతంబునకుం బ్రేరణంబున బహుళంబుగా నగు.' బాల.క్రియ. 73 - వినిపించు రూపాం.

---

1. తా. అష్టమాదితోరంబున. 2. తా. దవ్యయుఁడు విశ్వకర్తయనుట నిధను. 3. ము. మొ...... నిధిగా. తా. మొగలిపూవిరిసెఁగాదె.

మ. బహువేదాంత మతానుసాధిత [1]మహంబ్రహ్మాస్మి యంచాడుదుర్
మహి మోహాంధులు గొందఱేని [2]యది బ్రహ్మం బెట్టు [3]దా రెట్టిరో
యహహా బ్రహ్మము[4]దారయే నులకశయ్యం ద్రెళ్ళి నిద్రింతురో
జహదుత్సర్గముగాఁగ ఁజేయుదురొ విష్ఠామూత్రనిర్మోక్షమున్. 9

అర్థము: మహిన్ = భూమియందు, మోహ + అంధులు = అజ్ఞానముచే కన్నులు కాననివారు, కొందఱు, అహం బ్రహ్మ + అస్మి = నేను బ్రహ్మమునగుదును, బహు - వేదాంత - మత + అనుసాధితము = అనేకములైన యుపనిషన్మతముల ననుసరించి సాధింపబడినది, అంచున్ = అనుచు, ఆడుదుర్ +ఏని = పలుకుదురేని, అది, బ్రహ్మంబు + ఎట్టు = బ్రహ్మమగుట యెట్లు, తారు = తాము, ఎట్టిరు + ఓ = ఎట్టివారో, అహహా = ఆహా ఆహా, బ్రహ్మము, తార + ఏన్ = తామే అయినచో, నులక - శయ్యన్ = నులకమంచము నందు, త్రెళ్ళి = పడి, నిద్రింతురో = నిద్రపోవుదురా? విష్ఠా...మున్ : విష్ఠా = మలము యొక్కయు, మూత్ర = మూత్రము యొక్కయు, నిర్మోక్షమున్ = విసర్జనమును, జహత్ + ఉత్సర్గము + కాగన్ = విడుచుచున్న విడపుగా, చేయుదురో = చేయుదురా? చేయరనట.

తాత్పర్యము: లోకములో నజ్ఞానాంధులు కొందఱు `అహం బ్రహ్మాస్మి?' అనునది యనేకోపనిషన్మతము ననుసరించి సాధింపబడిన దందురు. కాని బ్రహ్మమేమి? తామెవరు? ఆహా! తామే బ్రహ్మమగుచో, తాము నులకమంచముపై బడి నిద్రింతురా? మలమూత్రవిసర్జనము నప్రయత్నముగా చేయుదురా? చేయరనుట.

విశేషములు: `అహం బ్రహ్మాస్మి' అను వేదాంత వాక్యము ప్రామాణికమే. సందేహము లేదు. కాని ఆ వాక్యమును అర్థము చేసికొన్నందులకు నిదర్శనము ఆ వాక్యార్థమును జీవితమునందు పాటించుటయే. అట్లు పాటించినచో నిది హేయము, ఇది ఉపాదేయము అను భేదదృష్టి యుండరాదు. రెండింటిని సమానముగా చూడవలయును. కాని నూటికి తొంబదిమంది చెప్పుటయేకాని చేయుటలేదు. చేయగలిగినచో తల్పము మీదనే పరుండవలసిన యవసరము లేదు. విణ్మూత్రములను విడువ వలసిన యవసరమును లేదు. కారణము - అవి రెండును బ్రహ్మభావమునకు, భిన్నము కావు గాదా! ఇచ్చట `జహత్, ఉత్సర్గము' అని విసర్జనార్థమిచ్చు పదములు రెండును ఒకేచోట ప్రయోగింపబడినవి. ఇది కొంత పునరుక్తిగా తోచుచున్నది. అయినను దృఢప్రతీతి కొఱకు ప్రయోగించినట్లు భావింపవచ్చును.

---

1. తా. బ్రహ్మాస్మియంచాదురే, ము. మహాబ్రహ్మాహమం. 2. ము. యటె 3. తా. దారెట్టిదే. లహహా. 4. ము. వారయే

సీ. కల్పద్రుమంబుతోఁ గామధేనువుతోడ
నమృతాబ్ధి నవతారమయ్యెనెద్ది
బృందారవన మధ్యమందార తరుల[1]లో
హలపాణి కెద్ది ప్రత్యక్షమయ్యెఁ
ద్రిపురాంతకుని యర్ధదేహంబునకు నెద్ది
[2]మదసముల్లాససంపత్తి యయ్యె
నవసుధారూపమై పవనభుగ్భువనాధి
పతికెద్ది ప్రాణంబు ప్రాణమయ్యె

గీ. నట్టి భవభేషజము నాసవామృతంబుఁ
గన్నుఁగానక శపియించెఁ గాక యొకఁడు
తత్సమానములగు పదార్థములు గలవె
భూత భావి భవత్కాలముల ధరిత్రి 10

అర్థము: ఎద్ది = ఏది (మద్యము), కల్ప - ద్రుమంబుతోన్ = కల్పవృక్షముతోను, కామ - ధేనువు తోడన్ = వేల్పుటావుతోను, అమృత + అబ్ధిన్ = క్షీర సముద్రము నందుండి, అవతారము + అయ్యెన్ = పుట్టెను (నో), ఎద్ది, బృందార - వన - మధ్య - మందార - తరులలోన్ = మనోహరమైన, ఉద్యానము నడుమగల, మందార వృక్షములలో, హల - పాణికిన్ = హలము (నాగలి) పాణి (చేతియందు) గల వానికి - బలరామునకు, ప్రత్యక్షము + అయ్యెన్ = ఎదుట నున్నది అయ్యెనో. ఎద్ది, పవన - భుక్ + భువన + అధిపతికిన్ = పాముల లోకము యొక్క - పాతాళము యొక్క, ప్రభువునకు, నవ - సుధా - రూపము + ఐ = క్రొత్త అమృతము యొక్క ఆకారము గలదియై, ప్రాణంబు - ప్రాణము = ప్రాణసమానమైనది, అయ్యెన్. అట్టి = అటువంటి, భవ - భేషజమున్ = సంసారమునకు ఔషధమైనది, అగు, ఆసవ + అమృతంబున్ = అమృతము వంటి మద్యమును, ఒకడు = ఒకానొకడు, శుక్రుండు, కన్ను గానక = కన్నుకనిపింపక - గర్వించి, శపియించెన్ + కాక = నిందించెనుగాక, ధరిత్రిన్ = భూమియందు, భూత - భావి భవత్ + కాలములన్ = కడచిన, కడవనున్న, కడచుచున్న కాలములందు, తద్ + సమానములు + అగు = దానితో (మద్యముతో) తుల్యములైన, పదార్థములు = వస్తువులు, కలవె = ఉన్నవా?

తాత్పర్యము: కల్పవృక్షముతోను, వేల్పుటావుతోను క్షీర సముద్రమున నావిర్భవించి నట్టియు, మనోహరమైన ఉద్యానమునడుమగల మందార వృక్షములలో బలరామునకు

1. తా. తో, 2. ము. మదన సంఫుల్ల

ఎట్టయెదుట తోచినట్టియు త్రిపుర హరుడైన యీశ్వరుని అర్ధాంగమగు పార్వతికి మత్తు వలని సంతోషసంపద యయినట్టియు, పాతాళలోక ప్రభువునకు క్రొత్త అమృతరూపమై ప్రాణసమాన మయినట్టియు, సంసారమున కౌషధ మయినట్టియు నమృతము వంటి మద్యమును కన్ను గానని వాడయి ఒకడు (శుక్రుడు) నిందించిన నిందించెను గాక! కాని భూమియందు మద్యముతో సమానములయిన పదార్థములు జరగిన, జరగనున్న, జరుగుచున్న - (త్రికాలములందును) కాలములందు, కలవా? లేవనుట.

విశేషములు: మద్యము కల్పవృక్షకామధేనువుల తో పాటు క్షీరసముద్రమున పుట్టినదనుటచే, దాని గొప్పతనమును, సకల కామ ప్రదత్వమును తెలియుచున్నవి. నిజమునకు క్షీర సముద్రమును మథించినప్పుడు అందుండి హాలాహలాదులు పుట్టినవే కాని మద్యము పుట్టలేదు. అయినను అది పుట్టినట్లు చెప్పుట దానికి మహత్త్వము నాపాదించుటకు. బలరాముడు హలము (నాగలి) ఆయుధముగా గల వాడు. అతడు మద్యపాన ప్రియుడు. మద్యపాయు లింకను నెందరో యుండగా బలరాముని చెప్పుట మద్యమునకు మహత్త్వసిద్ధి కొఱకు. బలరాము డవతార పురుషుడు గదా! అట్టే పార్వతి యనక త్రిపురాంతకుని యర్ధాంగ మనుటయు మద్యమునకు ఘనత నాపాదించుటకే. పార్వతి మద్యప్రియ యగుటచేతనే జాతర లలో నమ్మవారికి భక్తుల మద్యనైవేద్యమును చేయుదురు. `నవ సుధా రూపమై'.... మద్యము అపర సుధ యనుట. మద్యము `భవభేషజ'మట. సంసారము అనెడి వ్యాధికి మందు అనుట. ఆసవము అమృతమట. మద్యప్రియుల దృష్టిలో నంతేమఱి! `కన్నుగానక' శుక్రాచార్యునకు ఒక కన్ను గ్రుడ్డిది. బలి వామనునకు మూడడుగుల నేలను ధారాపూర్వకముగా దానము చేయుచుండ, నతని గురువగు శుక్రుడు కమండలువులో దూఱి ధార కడ్డపడెను. అప్పుడు వామనుడు దర్భతో కమండలు ద్వారమును పొడువగా శుక్రుని యొక కన్ను లొట్టవడెను. `భూత' - భూధాతుక్తప్రత్య యాంత రూపము - `అయిన' అని యర్థము. `భవత్' - భూధాతు శత్రంత రూపము. `అగుచున్న' అని యర్థము. అమృతాబ్ధి నవతారమయ్యె - అమృతాబ్ధివలన - `ఉండి పదం బొకానొకచో వలన వర్ణకంబున కనుప్రయుక్తంబగు.' బాల. కారక. 10 అమృతాబ్ధి వలన నుండి. ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగనగు.' బాల. కారక. 11 - అమృతాబ్ధినుండి యవతార మయ్యె. `వలనకాదేశంబగు ద్వితీయా సప్తముల మీది యుండికి లోపంబు బహుళంబుగానగు.' ప్రౌఢ. కారక. 11 అమృతాబ్ధి నవతారమయ్యె. తరు శబ్దతత్సమ బహువచనాంత రూపములు. తరువులు, తరులు. `వువర్ణకేతర విభక్తి పరమగుచో నుకారాంతంబులకు బహుళంబుగా గోశబ్దంబునకు నిత్యంబుగా వుగాగమంబగు.' బాల. తత్సమ. 49 హలపాణి - హలము పాణి - హలము పాణి యందుగలవాడు - బహువ్రీహి.

`మదసముల్లాస సంపత్తి - బిందుమతి. పవనభుక్ + భువన - ఝల్లునకు హాశ్ను పరమగుచుండగా తృతీయ వర్ణాదేశము - పవనభుగ్భువన + సమాన - ఝల్లునకు ఖర్రు పరమగుచుండగా వర్గప్రథమవర్ణాదేశము - తత్సమాన.

వ. * అని

అర్థము: సుకుమారుడు పయివిధముగా పలికి. తరువాతి పద్యముతో నన్వయము.

సీ. కర్పూర రజము[1]లో గలిపి కేతకి ధూళి
నఖిలాంగకముల నభ్యంగమాడి.
జలజనాళీ తంతు సందానితములైన
యజ్ఞోపవీతంబు లఱుతఁదాల్చి
వారాంగనాస్తన[2]హార విభూషల
నక్షమాల్యముగఁ జే నలవరించి
కస్తూరికామిశ్రగంధసారంబున
నలికంబునఁ ద్రిపుండ్ర మనువుపఱిచి

గీ. చంద్రికావేళఁ బరిపాండు సౌధవీథి
శక్తిఁ బూజించి దేవీప్రసాద మధువు
పుచ్చుకొను విప్రుఁడాకంఠపూరితముగ
వెలఁదులును దాను నప్పుడు వినిమయముల 12

అర్థము: విప్రుండు = బ్రాహ్మణుడు - సుకుమారుడు, కర్పూర - రజములోన్ - కప్పురపుబొడిలో, కేతకి - ధూళిన్ = మొగలి పుప్పొడిని, కలిపి, అఖిల + అంగకములన్ = ఎల్లయవయవములందును, అభ్యంగము + ఆడి = తలంటుపోసికొని, జలజ - నాళీ - తంతు - సందానితములు - తామర తూటి దారములచే కట్టబడినవి, ఐన, యజ్ఞోపవీతంబులు = జందెములు, అఱుతన్ = కంఠమున - భుజమున, తాల్చి = ధరించి, వార + అంగనా - స్తన - హార - విభూషలన్ = వేశ్యల పాలిండ్ల యందలి ముత్యాల పేరుల యలంకారములను, అక్ష - మాల్యముగన్ = రుద్రాక్షమాలగా, చేన్ = చేతియందు, అలవరించి = తాల్చి, కస్తూరికా - మిశ్ర - గంధసారంబునన్ = కస్తూరితో గలిసిన మంచి గందముతో, అలికంబునన్ = నుదుట, త్రిపుండ్రము = నామము, అనువు పఱిచి = పెట్టి, చంద్రికా - వేళన్ = వెన్నెల తఱి, పరిపాండు - సౌధ - వీథిన్ = మిక్కిలి తెల్లనైన మేడయందు, శక్తిన్ = పార్వతిని, పూజించి, అప్పుడు, వెలదులును + తానున్ = స్త్రీలును దానును,

* తాళపత్రమునలేదు. 1. తా. తోఁగలియు. 2. తా. తారహారవిభూషయక్షమాల్యముగ.

వినిమయములన్ = ఒకరి దొకరు మార్చుకొనుటలతో, ఆకంఠపూరితముగన్ = పీకె వఱకు నిండునట్లుగా, దేవీ - ప్రసాద - మధువు = అమ్మవారికి నైవేద్యము పెట్టిన కల్లును, పుచ్చుకొనున్ = త్రాగును.

తాత్పర్యము: బ్రాహ్మణ కుమారుడైన సుకుమారుడు కప్పురపుబొడిలో మొగలి పుప్పొడిని గలిపి దానితో నెల్లయవయవములందున తలంటు పోసికొని, తామర తూటి దారములతో గూర్చబడిన జందెములను భుజమున వైచుకొని, వేశ్యల పాలిండ్లయందలి ముత్యాల పేర్లను రుద్రాక్షమాలగా చేతదాల్చి, కస్తూరితో కలిసిన మంచిగందముతో నుదుట నామమును బెట్టి, వెన్నెలలో తెల్లనైన మేడయందు శక్తిని పూజించి అప్పుడు వేశ్యలును తానును ఒకరిదొకరు మార్చుకొనుచు పీకెదాక అమ్మవారికి నైవేద్యము పెట్టిన కల్లును త్రాగును.

విశేషములు: ఈ పద్యమున నానాటి శృంగారి యువకుని వేషమును, చేష్టలను రమ్యముగా వర్ణింపబడినవి. కర్పూర రజము కేతక ధూళి - రెండును పరిమళద్రవ్యములే - ఆ మిశ్రమముతో తలంటు పోసికొనినచో నొడలంతయు గుమగుమలాడును. తామర తూటి దారము మిక్కిలి సన్నముగా నుండును. అంత సన్నగా వడుక బడిన జందెములను ధరించెను. వేశ్యాస్తన హారములే రుద్రాక్షమాలలు. నొసట పెట్టునామము విబూదితో గాదు. కస్తూరితో గలిసిన మంచి గందముతో - అల్లంత దూరమునకే గుబాళించును. అభ్యంగము, యజ్ఞోపవీత ధారణము, చేత రుద్రాక్షమాల, నొసట విబూది రేఖలు, శక్తిపూజ ప్రసాద స్వీకృతి - బ్రాహ్మణత్వమునకేమియు లోపము లేదు. కాని యది శృంగారమయము.

అఱుతన్ - అఱు + అందున్ - `అఱుమొదలగు శబ్దముల కంతాగమంబు తివర్ణంబును రేఫంబున కొక్కటికి లోపంబు నగు.' బాల. అచ్చిక 34 అఱు + తి + అందున్. `ఔపవిభక్తికముల తృతీయాసప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు.' బాల. అచ్చిక. 38. అఱు + తి + అన్ - `అంద్వవగాగమంబులం దప్ప నపదాది స్వరంబు పరంబగునపు డచ్చునకు, సంధి యగు' బాల. సంధి. 11 అఱుతన్. అలవరించు = అలవడు + ఇంచు - `శబ్దపల్లవంబగు పడున కించుక్కు విభాషనగు నగుచో డాకు లఘురేఫంబగు.' బాల. క్రియ. 83. అలవరు + ఇంచు - అంద్వవగాగమ సంధిచే అలవరించు. అనువు పఱుచు - `పడునకుం జుక్కును డా కలఘురేఫంబునగు.' దివర్ణకంబగు.' బాల. క్రియ. 38 అనువు పఱుచు + ఇ. `ఇత్వంబుగాని యెత్వంబుగాని కూడుచో ననాద్యబయిన యుత్వంబున కిత్వంబగు.' బాల. క్రియ. 85. అనువు పఱిచి. ఆకంఠ - మర్యాదయందు ఆజ్ - కంఠము వఱకు - అవ్యయీభావసమాసము.

విప్రుడు వెలదులును దాను మధువు పుచ్చుకొను - `ఆత్మార్థం బభిహితం బగుచోఁ దల్లింగ సంఖ్యాభిధాయి వచనంబు ధాతు విశేషణంబులకగు.' బాల. క్రియ. 120. పరిపాండు సౌధ - సుధా మయములుగాన మొదలే తెల్లనివి. వెన్నెలలో నింకను తెల్లగా మెఱయుచుండెననుట. అలంకారము స్వభావోక్తి.

క. వనితల [1]కంగప్రేంఖో
ళన మక్షివిఘూర్ణనంబు లజ్జావిగమం
[2]బనవస్థితి మధుపానం
బునను సురతమునను సదృశములు వక్త్రంబుల్. 13

అర్థము: వనితలకున్ = స్త్రీలకు, మధు - పానంబునను = కల్లుత్రాగుటయందును, సురతమునను = రతిక్రీడయందును, అంగ - ప్రేంఖోళనము = ఒడలూగుట, అక్షి - విఘూర్ణనంబు = కన్నులు తిరుగుట, లజ్జా - విగమంబు = సిగ్గులేమి, అనవస్థితి = నిలుకడలేమి - ఇట్లు, వక్త్రంబుల్ = ముఖములు, సదృశములు = సమానములు.

తాత్పర్యము : స్త్రీలకు మద్యపానము చేతను, రతిక్రీడయందును - ఒడలూగుట, కన్నులు తిరుగుట, సిగ్గుపోవుట, నిలుకడలేమి అనువానితో ముఖములు ఒకే విధమున నుండును.

విశేషములు: మధుపానమున నంగప్రేంఖోళనాదులు మత్తెక్కువగుట వలన. సురతమున పారవశ్యము చేత. అలంకారము స్వభావోక్తి.

గీ. త్రిసరకాస్వాదభవమదోద్రేకలహరి
ధరణిదేవుఁడా యోజ మత్తా వహించి
యారణాలు పఠింపంగ నాలకించి
శంబరారాతి రతి చేయి చఱచి నవ్వ. 14

అర్థము: త్రి - సరక + ఆస్వాద - భవ - మద + ఉద్రేక - లహరిన్ = మూడు సురాపానపాత్రికల సారాయి యొక్క, త్రావుటవలన, పుట్టిన, మత్తు యొక్క, అతిశయమనెడి, పెద్దయలచే, ధరణి - దేవుడు = బ్రాహ్మణుడు, ఆ + ఓజన్ = ఆ విధమున, మత్తా = కైపు, వహించి = ఎక్కి, ఆరణాలు = ఆరణ్యకములు, పఠింపంగన్ = చదువగా, శంబర + అరాతి = శంబరుడను రాక్షసుని యొక్క శత్రువు, అగు, మన్మథుడు, రతి - చేయి = రతిదేవి యొక్క చేయి, చఱచి, నవ్వన్.

1. తా. కంగంప్రేంఖో. ము. కంగప్ర, 2. తా. బు.

తాత్పర్యము : మూడు పానపాత్రముల మద్యమును త్రావుటచే పుట్టిన మత్తు నతిశయము వలన సుకుమారుడు ఆ రీతిగా కైపెక్కి అరణ్యకములు చదువ మొదలిడెను. అది విని మన్మథుడు రతి చేయి చఱచి నవ్వెను.

విశేషములు: సరకము = సురాపాన పాత్రిక - (సూ.ని.) - ఇది నేటి Peg కావచ్చును. త్రిసరకముల (మూడు పాయల) మధువు పుచ్చుకొనగా నతనికి మత్తధికమయ్యెను. మత్తా = మత్తు. `మదము రాజిలు మస్తు మత్తు మత్తాయన.' ఆం. భా. 2-195. మదోద్రేకముచే సుకుమారుడు ఒడలు తెలియని స్థితిలో పూర్వము వేదము చదివినవాడు గాన అరణ్యకము చదువ మొదలు పెట్టెను. సురాపాన మదోద్రిక్తులు తత్పానమునకు పూర్వము బుద్ధిలో పాదుకొనియున్న సంస్కారవశమున ప్రేలుచుండుట సహజము. అది చూచి మన్మథుడు - సుకుమారుడు తనకు వశంవదుడగుచున్నాడను సంతోషముతో - రతిదేవి చేత చప్పటులు చఱచుచు నవ్వినాడట. అలంకారము స్వభావోక్తి.

సీ. ఇంట నున్నాడొ వాఁడెచ్చోట నున్నాఁడొ
యొంటియో యెందఱే నున్నవారొ
మిన్నకున్నాడొ [1]యేమేఁబల్కుచున్నాఁడొ
నిద్రించినాడొ కన్దెఱచి నాఁడొ
[2]యడలుచున్నాఁడొ (ప్రహర్షింపుచున్నాడొ)
చించిలినాఁడొ గర్వించినాఁడొ
(శోకించినాఁడొ) యుత్సేకించినాఁడొ యు
ల్లాసించినాఁడొ కలంగినాఁడొ

గీ. యుత్సవమొ వైభవమొ లేమియో కలిమియొ
పగలొ రాత్రియొ యెఱుఁగఁడా బ్రాహ్మణుండు
నవమధూకప్రసూనసంభవపు మధువు
దలము దప్పంగం ద్రావి మత్తా వహించి. 15

అర్థము: ఆ - బ్రాహ్మణుండు = బ్రాహ్మణుడైన యా సుకుమారుడు, నవ - మధూక - ప్రసూన - సంభవము - మధువు = క్రొత్త యిప్ప పువ్వు నుండి పుట్టినది యగు మద్యము, తలము - తప్పంగన్ = శక్తికి మించునట్లు, త్రావి, మత్తా, వహించి, ఇంటన్ = ఇంటియందు, ఉన్నాడొ, వాఁడు, ఏ + చోటన్ = ఎచ్చోటన్ = ఏ ప్రదేశమున, ఉన్నాడొ, ఒంటియో = ఒక్కడో, ఎందు + ఏన్ = చాలామంది, ఉన్నవారొ, మిన్నక + ఉన్నాడొ = మాటాడకున్నాడొ, ఏమి + ఏన్ = ఏమయినను,

1. తా. యెమ్మెయింబల్కుకున్నాడొ. 2. ము. యాడుచున్నాడొ...... గర్వించియున్నాఁడొ. శోకించినాఁడొ.

పల్కుచున్ + ఉన్నాడొ, నిద్రించినాడొ, కన్ + తెఱచినాడొ = మెలకువగలగి యున్నాడో. అడలుచున్ + ఉన్నాఁడొ = దుఃఖించుచున్నాడో, ప్రహర్షింపుచున్ + ఉన్నాఁడొ = మిక్కిలి సంతోషించు చున్నాడో, చించిలినాఁడొ = (?) తరువాతి `గర్వించినాడొ' యను దానిని బట్టి దీనికి గర్వము లేక యున్నాడొ అనునర్థము నూహింపవలయును, గర్వించినాడొ, శోకించినాఁడొ = విచారించినాడో, ఉత్సేకించినాడొ = ఉప్పొంగినాడో, ఉల్లాసించి నాండొ = సంతోషించినాడో, కలంగినాఁడొ = కలతజెందినాఁడో,

ఉత్సవమొ = వెడుకయో, వైభవమొ, లేమియో = దారిద్ర్యమో, కలిమియొ = సంపదయో, పగలో, రాత్రియొ, ఎఱుంగడు.

తాత్పర్యము: బ్రాహ్మణుడైన యా సుకుమారుడు క్రొత్తయిప్ప పూవు మధువును తప్పద్రాగి మత్తుగొని తానింటి యందే యున్నాడో, మఱియెచ్చట నైన నున్నాడో, ఒంటరిగానున్నాడో, చాలమందితో నున్నాడో, ఊరకున్నాడో, ఏమయినను పలుకుచున్నాడో, నిద్రించినాడో, మేలుకొని యున్నాడో, అడలుచున్నాడో, సంతోషించుచున్నాడో, చించిలినాడో, గర్వించినాడో, శోకించినాడో, ఉప్పొంగినాడో, ఉల్లాసముగా నున్నాడో, కలత చెందినాడో, ఉత్సవమో, వైభవమో, లేమియో, కలిమియో, పగలో, రాత్రియో యెఱుగడు.

విశేషములు: మేరమీఱి పుష్పాసవము సేవించి మత్తెక్కిన వానికి దేశకాలాది విభాగవివేకము శూన్యమయిపోవు ననుట యిందు స్పష్టపఱుపబడినది.

నిద్రించినాండొ = నిద్రించిన + వాఁడొ - `ఉన్న కలజి న వర్ణకంబులు భవద్భావి శతృక్త్వ దర్థంబులందగు.' బాల. క్రియ. 46. `ఉన్న కల న వర్ణ కంబుల మీది తచ్ఛబ్ద వకారంబునకు లోపంబు విభాషనగు.'- బాల. క్రియ. 117. నిద్రించిన + అడొ. `అత్తునకు సంధి బహుళముగానగు.'`బాహుళకంబుచే నిట సంధి నిత్యంబు/ ' బాల. సంధి. 4, క్రియ, 117.

క. సుకుమారుఁడిట్లు నానా
[1]ప్రకరంబుల వీటిలోనఁ [2]బడుచై తిరుగన్
సకలజనులు మొఱవెట్టిరి
యొకనాఁడత్యాగ్రహమున నుర్వీశుసభన్. 16.

అర్థము: ఇట్లు, సుకుమారుఁడు, నానా - ప్రకారములన్ (ప్రకరంబుల అనుపాఠము కంటె, తాళపత్రప్రతిలోని `ప్రకారముల' అను పాఠమే మేలుగా నున్నది.

1. తా. ప్రకారముల 2. తా. బరుచై

కావున నదియే స్వీకరింపబడినది.) = అనేక విధముల, వీటిలోనన్ = పట్టణమునందు, పడుచు + ఐ = యువకుడై, (పడుచు + ఐ = దుష్టుడై) అనుపాఠమే మేలు, తిరుగన్ = వర్తిల్లగా, ఒకనాడు, సకల - జనులున్ - ఎల్లవారును, అతి + ఆగ్రహమునన్ = మిక్కిలి కోపముతో, ఉర్వీ + ఈశు = రాజుయొక్క, సభన్ = సభలో, మొఱ + పెట్టిరి.

తాత్పర్యము: ఈ విధముగా సుకుమారుడు పట్టణములో నానా విధములుగా దుష్టుడై తిరుగుచుండగా, నాయూరి వారందరు నతి కుపితులై యొకనాడు రాజుగారి సభలో మొఱవెట్టిరి.

విశేషములు: మొఱ + పెట్టిరి - `ప్రథమమీది పరుషములకు గసడదవలు బహుళముగా నగు.' బాల. సంధి. 13. మొఱవెట్టిరి. అతి + ఆగ్రహము. - యణాదేశసంధి - అత్యాగ్రహము. ఉర్వీ + ఈశు = ఉర్వీశు - సవర్ణదీర్ఘసంధి.

క. దేవర ప్రతినిధిఁగా సం
సేవింతుము యజ్ఞదత్తు [1]సిద్ధమతనిఁగా
భావింతుము తత్తనయుని
యౌవనసంప్రాప్తి లేని యటమున్నెల్లన్. 17

అర్థము: (మేము) కర్త, యజ్ఞదత్తున్ = మంత్రియగు యజ్ఞదత్తుని, దేవర - ప్రతినిధిన్ + కాన్ = ప్రభువుల ప్రతినిధినిగా, సంసేవింతుము = కొలుతుము, తద్ + తన యునిన్ = ఆ యజ్ఞదత్తుని కొడుకగు సుకుమారుని, యౌవన - సంప్రాప్తి = పడుచుదనము కల్గి, లేని + అటు - మున్ను + ఎల్లన్ = లేనప్పటి కంటె ముందెప్పుడును, పడుచువాడు కాకపూర్వమెల్ల ననుట, అతనిన్ + కాన్ = యజ్ఞదత్తునిగా, భావింతుము = తలతుము, సిద్ధము = నిజము.

తాత్పర్యము: ప్రభూ! మేము తమ మంత్రియగు యజ్ఞదత్తుని తమ ప్రతినిధిగా కొలుతుము. ఆతని కొడుకగు సుకుమారుని పడుచువాడు కాక మునుపెల్ల యజ్ఞదత్తుని వలె భావింతుము. ఇది నిశ్చయము.

విశేషములు: సుకుమారుడు పడుచువాడు కాకపూర్వము మావలన పొందిన గౌరవము పడుచుదనమేర్పడిన పిమ్మట పొందుట లేదనుట. పడుచువాడయిన పిమ్మట నతడు దుష్టుడై మా గౌరవమును కోలుపోయినాడనుట.

తద్ + తనయుని - ఝల్లునకు ఖర్రు పరమగుచుండగా వర్గ ప్రథమ వర్ణాదేశము. తత్తనయుని.

---

1. ము. సిద్ధమ యతనిన్

వ. అవధరింపుము. సుకుమార నామధేయుండైన మంత్రి నంద నుండు సౌందర్య వంతుండును, గామ శాస్త్రకళా[1]విధిజ్ఞుండునునై జారచోర విట ధూర్త వర్గంబులం గూడి వేడుకకాఁడై పుణ్యస్త్రీల [2]యీలువులు చెఱుచుచున్నవాఁడతని వారింపను నారీజనంబుల శిక్షింపను సమర్థులము గాకయున్నారఁ; మద్దురాత్మకుని నన్యాయ సదృశంబైన దండంబు(వలన) దండించునది యని విన్నవించిన, (నా) మహీపాలుండతని రప్పించి వాగ్దండనం బున దండించి పురంబును దేశంబును వెడల నడిపించిన,రాజావమానితుండై యప్పాపి కీ[క]ట దేశంబునకుంబోయి యందుం గొన్ని దివసంబు లుండి హూణమండలంబునకు నేతెంచువాఁడు కాంతారమధ్యంబున నతిక్షుత్పిపాసా పరవశుండై తనలో *(న) నిట్లు వితర్కించుచుండె. 18

అర్థము: అవధరింపుము = చిత్తగింపుము, సుకుమార - నామధేయుండు = సుకుమారుడను పేరుగల వాడు, ఐన, మంత్రి - నందనుండు = మంత్రికొడుకు, సౌందర్యవంతుండును = అందగాడును, కామ - శాస్త్ర - కళా - విధిజ్ఞుండునున్ = మన్మథశాస్త్ర మనెడి విద్యయందలి విధులు తెలిసిన వాడును, ఐ, జార - చోర - విట - ధూర్త - వర్గంబులన్ = వ్యభిచారులు, దొంగలు, విటకాండ్రు, జూదరులు అనువారి సమూహములతో, కూడి = కలిసి, వేడుక కాడు + ఐ = జారుడయి, పుణ్యా- స్త్రీల = పతివ్రతల యొక్క, ఈలువులు = పాతివ్రత్యములు, చెఱుచుచున్ + ఉన్నవాడు = పాడు చేయుచున్నాడు, అతనిన్ = ఆ సుకుమారుని, వారింపను = అడ్డగించుటకును, సమర్థులము = చాలినవారము, కాక + ఉన్నారము = కాకున్నాము, ఆ + దురాత్మకునిన్ = ఆ దుర్మార్గుని, అన్యాయ సదృశంబు = అతడు చేసిన దోషమునకు ఉచితమైనది, ఐన, దండంబు వలనన్ = దండముచే, దండించునది = శిక్షింపుము, అని, విన్నవించినన్ = మనవి చేయగా, ఆ - మహీ - పాలుండు = ఆరాజు (హేమాంగదుడు), అతనిన్ = సుకుమారుని, రప్పించి, వాక్ + దండనంబునన్ = నోటి శిక్షచే - తిట్టుటచే, దండించి = శిక్షించి, పురంబును = పట్టణమును, దేశంబునున్, వెడల నడిపించినన్ = వెడల గొట్టింపగా, రాజ + అవమానితుండు + ఐ = ప్రభువుచే నవమానింపబడినవాడయి, ఆ + పాపి = ఆదుష్టుడు, కీకట - దేశంబునకున్ = కీకటమనుపేరు గల దేశమునకు, పోయి, అందున్, కొన్ని - దివసంబులు - కొన్ని దినములు, ఉండి, హూణ - మండలంబునకున్ = హూణ మనెడి మండలమునకు, ఏతెంచు - వాడు = వచ్చువాడు, కాంతార - మధ్యంబునన్ - అడవి నడుమ, అతి -క్షుధ్ - పిపాసా - పరవశుండు + ఐ = మిక్కిలి ఆకలిదప్పులకు లోనైన వాడయి, తనలోనన్, ఇట్లు, వితర్కించుచున్ + ఉండెన్ = ఆలోచించుచుండెను.

---

2. తా. వంతుండును, 3 ము. నిలువరుస, * తాళపత్రమున లేదు.

తాత్పర్యము: `ప్రభూ! చిత్తగింపుము. సుకుమారుడను పేరుగల మంత్రికొడుకు అందగాడును, మన్మథ శాస్త్ర విధులు తెలిసినవాడు నయి జారులు, చోరులు, విటులు, జాదరులు నైనవారితో గూడి జారుడయి పుణ్యాంగనల పాతివ్రత్యములను పాడుచేయుచున్నాడు. అతని నడ్డగించుటకును, స్త్రీలను శిక్షించుటకును మేము చాలకున్నాము. ఆ దుర్మార్గుని అతడు చేసిన దోషమునకు యోగ్యమైన శిక్షచే శిక్షింపుము.' అని మనవి చేయ నా రాజు హేమాంగదుడు అతనిని రావించి మందలించి పురమునుండియు, దేశమునుండియు వెడలగొట్టించెను. ఆ దుష్టుడు రాజుచే నవమానింపబడినవాడయి కీకట దేశమునకు బోయి యచ్చట కొన్ని నాళ్లుండి హూణ మండలమునకు వచ్చుచు నడవి నడుమ మిక్కిలి ఆకలి దప్పులకు లోనయి తనలో నీ రీతిగా చింతించెను.

అన్యాయసదృశంబు = అన్యాయము = దోషము, సదృశము = ఉచితము. అతడు చేసిన దోషమున కుచితమైనది.

దండించునది - `విధియందు లూట్టునకు మాఱుగా నది యను తచ్ఛబ్దంబును ముందు నుగాగమంబునగు.' బాల.క్రియ 27. అప్పాపి - ఆ + పాపి - త్రికసంధి. క్షుధ్ + పిపాసా - ఝల్లునకు ఖర్రు పరమగుచుండగా వర్గప్రథమ వర్ణాదేశము - క్షుత్పిపాసా. పిపాసా - పాతు మిచ్ఛా - త్రాగకోరిక. `పా' ధాతుసన్నంత రూపము.

చ. అరుణగభస్తిబింబ ముదయాద్రిపయిం [1]బొడతేర గిన్నెలోఁ
బెరుగును వంటకంబు వడపిందియ[2]లుం గుడువంగ బెట్టు ని
ర్భరకరుణాధురీణ యగు ప్రాణము ప్రాణము తల్లియున్నదే
హరహర! యెవ్వరింకఁ గడుపారసి పెట్టెద రీప్సితాన్నములో? 19.

అర్థము: అరుణ - గభస్తి - బింబము = ఎఱ్ఱని కిరణములు గలవాని - సూర్యుని - యొక్క బింబము, ఉదయ + అద్రిపయిన్ = తూర్పుగొండమీద, పొడతేరన్ = కనుపట్టగా, గిన్నెలోన్, పెరుగును, వంటకంబున్, వడపిందియలున్ = ఊరబెట్టిన మామిడి పిందెలును, కుడువంగన్ = తినుటకు, పెట్టు - తినిపించునట్టి, నిర్భర - కరుణా - ధురీణ = సంపూర్ణమైన దయ యొక్క భారమును వహించునది, అగు, ప్రాణము - ప్రాణము = ప్రాణమునకు ప్రాణమైన, తల్లి, ఉన్నదే = ఉన్నదా? లేదుగదా యని భావము, హరహర = శివశివా, ఇంకన్ + ఎవ్వరు = మఱి యెవరు, ఈప్సిత + అన్నముల్ = కోరిన అన్నములు, కడుపు + ఆరసి = కడుపు తడవి చూచి, పెట్టెదరు. తల్లియే లేనిచో మఱియెవ్వరును వలయు నన్నములను పెట్టరనుట.

---

1. ము. గనుపట్టు 2. తా. నుం.

తాత్పర్యము: తెల్లవాఱగనే గిన్నెలో పెరుగు, వంటకము, వడపిందెలు పెట్టుకొని తినిపించు పూర్ణదయామూర్తియు ప్రాణప్రాణము నైన తల్లియే లేనప్పుడు శివశివా! మఱెవ్వరు కడుపుదడవి చూచి వలయు భోజ్యములను పెట్టుదురు? ఎవ్వరును బెట్టరనుట.

విశేషములు: అరుణగభస్తి ...... పొడతేర - సూర్యోదయ మగుటయే తడవుగా ననుట. వడపిందియలు - తాపము తీఱుటకై వాడెడు ఊరబెట్టిన మామిడి పిందెలు - వీనిని విశాఖ మండలమున నీరుకాయ లందురు. `సుగంధి శీతజలముల్ వడపిందెలు నీరు జల్లయున్' ఆముక్త 1-81 వేసవి భోజనము వర్ణన. ప్రాణము ప్రాణము - మిక్కిలి ప్రియము - ప్రాణము కంటె నధికము. కడుపారసి = నిండుగా నున్నదో, ఎండుగా నున్నదో కడుపు తడవిచూచి తల్లి బిడ్డకు కుడువబెట్టును. ఈప్సిత + అన్నముల్ - తన యిచ్చవచ్చినవి గాక బిడ్డకిష్టమైనవి వండి పెట్టు ననుట. ఈప్సిత - `ఆప్' ధాతు సన్నంత క్తాంత రూపము. అమ్మ యెంతచెప్పినను వినక ఆకలి వైచినప్పుడు మాత్ర మమ్మను గుర్తుచేసికొనుట గమనార్హము. శ్రీనాథుడు తానే రచించిన కాశీఖండమున సరిగా సుకుమారుని బోలిన వాడే యైన గుణనిధిచే సరిగా నిట్టిదే యగు ప్రకరణమున ననిపించిన పద్యమునే యిట సుకుమారుని చే చెప్పించుట పరికింపనగును. `హరహర' - ఇది దిక్కుతోచని తనమును సూచించు నట్టిదే కాని దైవనామస్మరణము కాదు.

పొడతేరన్ - పొడము ధాతువు. `తెంచు ధాతు వగ్వాదుల కను ప్రయుక్తంబగు నగుచో నుత్వంబు పయిని దాని తకారంబు దకారంబగు.' బాల. క్రియా. 110. పొడము తెంచు, పొడతెంచు - స్వార్థమున తెంచుధాత్వనుప్రయోగము. `పొడతెంచు' - `తుమర్థభావ లక్షణంబులందు నుఱియగు.' బాల.క్రియ. 40. ఇట భావలక్షణార్థమున నుడి పొడ తెంచు + నుఱి. `ముజ్జీత్తులు ముత్తు నాబడు'. బాల. క్రియా. 86. `అద్దానికి ముత్తు పరంబగునపుడు తే తేరు లగు' - బాల. క్రియ. 113. పొడతేరన్. ఈ పద్యము సంస్కృతకాశీఖండమునందలి గుణనిధిచరిత్రము లోని -

సదా హ్యాభ్యుదితే భానౌ ప్రసూర్మే మృష్టభోజనమ్,
దద్యా దద్యాత్ర కం యాచే యాచే హా జననీ న మే.'

అను శ్లోకమున కాంధ్రీకరణమగుట చూడదగినది.

వ. అని తనలోనం దలపోయుచుం జనిచని ముందట 20

అర్థము: అని, తనలోనన్, తలపోయుచున్ = చింతించుచు, చని - చని = పోయి పోయి, ముందటన్ = ఎదుట

తాత్పర్యము: సుకుమారుడు పలువిధముగా చింతించుచు పోయిపోయి యెదుట.

తరువాతి పద్యముతో నన్వయము.

సీ. స్ఫటికరత్నగృహంబు సర్వంసహాకాంత
కభిధాంతరంబు దుగ్ధాంబునిధికి
మణిదర్పణము నభోమణి మార్గలక్ష్మికిఁ
జంద్రాతపమునకు జన్మభూమి
యర్ధేందుమకు టాట్టహాసంబునకు జోడు
పౌలస్త్యగిరికి సబ్రహ్మచారి
ప్రతిబింబ మభ్రము ప్రభువారణమునకు
ననుఁగుఁజుట్టము శారదాభ్రములకుఁ

గీ. గమఠతిమినక్రవిక్రమక్రమవిహార
చటులతరవీచికాఘటా [1]సమధిరూఢ
హంసకుల సన్నినాద సంవ్యాప్త దిగ్వి
భాగ మీక్షించె నతఁడు తడాగ మెదుర. 21

అర్థము: అతఁడు = సుకుమారుడు - కర్త. సర్వంసహా - కాంతకున్ = భూమి యనెడి స్త్రీకి, స్ఫటిక - రత్న - గృహంబు = పటికపు మణుల యిల్లును, దుగ్ధ + అంబునిధికిన్ = పాల సముద్రమునకు, అభిధా + అంతరంబు = మాఱుపేరును, నభస్ + మణి - మార్గ - లక్ష్మికిన్ = సూర్యుని యొక్క మార్గమగు ఆకాశమనెడి లక్ష్మికి, మణి - దర్పణము = మణులతో చేయబడిన యద్దమును, చంద్ర + ఆతపమునకున్ = వెన్నెలకు, జన్మ - భూమి = పుట్టినచోటును, అర్ధ + ఇందు - మకుట + అట్టహాసంబునకున్ = అర్ధచంద్రుడు కిరీటముగా గలవాని - శివుని - యొక్క, పెద్ద నవ్వునకు, జోడు = సాటియును, పౌలస్త్య - గిరికిన్ = కుబేరుని యొక్క కొండయైన కైలాసమునకు, సబ్రహ్మచారి = సహపాఠి - సమానమును, అభ్రము - ప్రభు - వారణమునకున్ = అభ్రమువు యొక్క భర్తయగు ఐరావతమనెడి యేనుగునకు, ప్రతి - బింబము = ప్రతిఫలనమును - సాటియును, శారద + అభ్రములకున్ = శరత్కాలమునందు పుట్టు మేఘములకు, అనుంగు + చుట్టము = ప్రియబంధువును, కమఠ ...... దిగ్విభాగము : కమఠ = తాబేళ్లు, తిమి = తిములు, (పెద్దచేపలు) నక్ర = మొసళ్లు, - అనువాని యొక్క, విక్రమ = పరాక్రమముతోడి, క్రమ = పాదవిక్షేపముగల (ఆక్రమణము గల), విహార = సంచారముచేత, చటుల - తర = మిక్కిలి చలించు, వీచికా = అలల యొక్క, ఘటా = సమూహము చేత, సమధి రూఢ = మిక్కిలి పెరిగిన, హంస - అంచల యొక్క, కుల = సమూహము

1. ము. సమద

యొక్క, సన్నినాద = పెద్దధ్వనుల చేత, సంవ్యాప్త = మిక్కిలి వ్యాపించిన, దిక్ + విభాగము = దిక్కుల యొక్క ప్రదేశము గలది, అగు, తడాగము = సరస్సు, ఎదురన్ = ముందర, ఈక్షించెన్ = చూచెను.

తాత్పర్యము: సుకుమారుడు తన యెదుర నొక సరస్సును చూచెను. అది యెట్లున్నదనగా - భూమియనెడు స్త్రీ యొక్క స్ఫటికమణి మయమైన గృహము వలెను, క్షీర సముద్రమునకు మాఱుపేరనగను, ఆకాశమనెడు లక్ష్మికి మణిమయమైన అద్దము వలెను, వెన్నెలకు పుట్టినిల్లు అనునట్లును, చంద్ర కళాకిరీటుడగు శివుని పెద్దనవ్వువలెను, కైలాసమునకు సహపాఠివలెను, అభ్రమువు భర్తయైన యైరావత గజమునకు ప్రతిబింబముగను, శరత్కాల మేఘములకు ప్రియబంధువు గను, తాబేళ్లు, తిములు, మొసళ్లు అను జల జంతువుల బలమైన ఆక్రమణముగల సంచారముచే మిక్కిలి చలించు నలల సమూహముచే నధికమైన యంచల ధ్వనులతో వ్యాపించిన దిక్ప్రదేశములుగలదిగను ఉండెను.

విశేషములు: ఆ సరస్సు స్వచ్ఛమైన ఉదకము గలిగి తెల్లగా ప్రకాశించుచుండెను. అందుచేతనే దానికి తెల్లని వస్తువులతో పోలిక. స్ఫటిక శిలలు, క్షీరసముద్రము, మణిదర్పణము, వెన్నెల, అట్టహాసము, కైలాసము, ఐరావతము, శరన్మేఘములు - అన్నియు తెల్లనివే. హాసము తెలుపని కవి సమయము. అట్టహాస మింకను తెలుపు. అదియును తెల్లని శివునిది కావున చెప్పలేనంత తెలుపు. జోడు, సబ్రహ్మచారి, ప్రతిబింబము, అనుగుం జుట్టము అను నవి యిట సమానార్థకములు. స్ఫటిక.... కాంతకు, మణిదర్పణము ... . లక్ష్మికి, మున్నగు నవి యన్నియు రూపకాలంకారములు. ఒకటే వస్తువును (సరస్సును) వివిధ వస్తువులుగా నుల్లేఖించుటచే నిందలి యలంకార ముల్లేఖము. `ఏకేన బహుధోల్లేఖేఽ ప్యసౌ విషయ భేదతః'. ఆ సరస్సులో తాబేళ్లు, తిములు, పెద్దచేపలు, మొసళ్లు సంచరించుటచే నందలి యలలు మిక్కిలి చలించుచుండెను. వాని రొదచే నందలి యంచల గముల ధ్వను లధికమై దిక్కులందు వ్యాపించుచుండెను. తడాగము = తటాకము = తడాకము. ఈ సరోవర వర్ణనము కాదంబరీ మహాకావ్యము నందలి యచ్ఛోదనామక సరోవర్ణనమున కెంత సన్నిహితముగా నాంధ్రీకరింప బడినదో చూడనగును. `ప్రవిశ్య చ తస్య తరుషండస్య మధ్యభాగే మణి దర్పణ మివ త్రైలోక్య లక్ష్మ్యాః, స్ఫటిక భూమిగృహమివ వసుంధరా దేవ్యాః, ... కైలాస మివ ద్రవతా మాపన్నం, చంద్రా తప మివ రసతా ముపేతం, హరాట్టహాస మివ జలీభూతం, శరదభ్రబృంద మివ ద్రవీ భూయైకత్ర నిష్యందితం.... అచ్ఛోదం నామ సరో దృష్టవాన్.;

అభిధాంతరము - అన్యా అభిధా - `మయూరవ్యంస కాది సమాసము. నభోమణి మార్గమనెడి లక్ష్మి, సర్వంసహాయనెడు కాంత - రూపకములు. శరద్భవము శారదము.

అనుంగుజుట్టము - అనుంగు + చుట్టము - ఉదంత స్త్రీ సమంబునకు బరుషము పరమగుచుండగా నుగాగమము, పిమ్మట ద్రుత కార్యము. కమఠ ..... విభాగము - సమాస గాంభీర్య ధైర్యములచే సరోగాంభీర్య ధైర్యములు సూచితములు.

మ. వసుధానిర్జరుఁ [1]డమ్మహా సరసిలో వార్వీచులందేలెంద్రా
వె సుధా సన్నిభమైన వారిఁ దట పృథ్వీజావళి చ్ఛాయ[2]లన్
వసియించెన్, లహరీ సమీరముల నధ్వశ్రాంతి పోకారిచెన్,
బిసకాండంబులు[3]మేసెఁ, గూర్చెఁ జలువల్ నిర్మోకసంకాశముల్. 22.

అర్థము: వసుధా - నిర్జరుఁడు = భూసురుడు (సుకుమారుడు), ఆ + మహత్ (మహా) - సరసిలోన్ = ఆ పెద్ద సరస్సులో, వార్ + వీచులన్ = నీటి యలల యందు, తేలెన్ = స్నానము చేసెను, సుధా - సన్నిభము = అమృతముతో సమానము, ఐన, వారిన్ = నీటిని, త్రావెన్ = త్రాగెను., తట - పృథ్వీజ + ఆవళి + ఛాయలన్ = ఒడ్డునందలి చెట్ల వరుసల నీడలలో, వసియించెన్ = నివసించెను, లహరీ - సమీరములన్ = అలలగాలులచే, అధ్వ -శ్రాంతి = మార్గాయాసము, పోకారిచెన్ = నశింపజేసెను, బిస - కాండంబులు = తామర తూండ్ల సమూహములు, మేసెన్ = భుజించెను, నిర్మోక - సంకాశముల్ = పాము కుబుసముతో సమానములు, అగు, చలువల్ = చలువచేసిన వస్త్రములను, కూర్చెన్ = ధరించెను.

తాత్పర్యము: భూసురుడైన సుకుమారుడు ఆ పెద్ద సరస్సులోని యలలలో స్నానము చేసెను. అందలి యమృత సమానమైన జలమును త్రావెను. గట్లయందలి చెట్లనీడలలో నివసించెను. అలలగాలులచే మార్గాయాస మపనయించు కొనెను. తామరతూండ్లను భుజించెను. పాము కుబుసముల వలె మిక్కిలి పలుచనైన చలువచేసిన వస్త్రములను ధరించెను.

విశేషములు: ఆవళి + ఛాయ = ఆవళిచ్ఛాయ - హ్రస్వమునకు పర మగు ఛకారమునకు ద్విత్వము. పోకారుచు - పోకాడు ప్రేరణరూపము. `ఆడోడు కూడుల డకారంబునకుం జుక్కు పరంబగునపుడు రేఫంబగు. బాల. క్రియ. 80 పొకారుచు రూపాంతరము. `మేసె' ఆకటి పెల్లును సూచించును. నిర్మోక సంకాశముల్ - చాల పలుచనివియనుట.

---

1. ము. దున్మహా. 2. ము.లో. 3. తా. మేసె గుంజె వలువల్ నిర్మోకము మేనఁగూర్చె క

క. కర శీకరార్ద్ర పుష్కర
కరుఁడై యాతండు గంధకరిరాజు క్రియం
[1]బరిషేకానంతరమున
సరసిరుహాకరము వెడలి చాలఁగ నొప్పెన్. 23

అర్థము: కర శీకర + ఆర్ద్ర - పుష్కర - కరుఁడు + ఐన = ఏనుగు తొండము నుండి చిమ్మబడు నీటితుంపర (వమథువు) చేత, తడిసిన, తామర పువ్వు, చేతియందు గలవాడయి, ఆతండు = ఆ సుకుమారుడు, పరిషేక + అనంతరమునన్ = స్నానమునకు పిమ్మట, సరసిరుహ + ఆకరమున్ = పద్మాకరము (కొలని)నుండి, వెడలి = వెలువడి, గంధ - కరి - రాజు - క్రియన్ = మదించిన గజశ్రేష్ఠమువలె, చాలగన్ = మిక్కిలి, ఒప్పెన్.

తాత్పర్యము: ఏనుగు తొండము నుండి చిమ్మబడు నీటి తుంపరచే తడిసిన తామరపువ్వు చేత దాల్చినవాడయి యా సుకుమారుడు స్నానాంతరము కొలని నుండి వెలువడి మదించిన యేనికతేని వలె మిక్కిలి యొప్పెను.

విశేషములు: ఏనుగు కొలనిలో నీదులాడి తుండాగ్రమున తామరపువ్వును గొని కొలను వెలువడునట్లు, సుకుమారుడును స్నానముచేసి తామరపువ్వును చేతగొని కొలని నుండి వెలికి వచ్చెను. అందుచేతనే యతనికి గజరాజుతో పోలిక. గంధ కరిరాజు - ఏనుగు వలెనే యాతడును మదించి యున్నాడనుట. అలంకారముపమ. పుష్కరము =(నానా) పద్మము, తొండము చివర, ఆకాశము, నీరు. పరి + సేక = పరిషేక. క్రియ = విధము = ఈ యర్థము తెనుగుననే కలదు. (సూ.ని.)

సరసిరుహాకరము వెడల - `అపాయభయ జుగుప్సా పరాజయ ప్రమాద గ్రహణ భవనత్రాణ విరామాంతర్ధి వారణంబు లెద్దాన నగు దానికి వలన వర్ణకంబగు.' బాల. కారక. 9. సరసిరుహాకరము వలన వెడలి. `ఉండి పదం బొకానొకచో వలన వర్ణకంబున కనుప్రయుక్తంబగు.' బాల. కారక. 10. సరసిరుహాకరము వలన నుండి వెడలి. `ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు.' బాల. కారక. 11 సరసిరుహాకరము నుండి వెడలి. `వలన కాదేశంబగు ద్వితీయా సప్తముల మీది యుండికి లోపంబు బహుళంబుగా నగు.' ప్రౌఢ. కారక. 11. సరసిరుహాకరము వెడలి.

సీ. వైదూర్య మణిశిలా స్వచ్ఛోదకము గానఁ
గౌతుకం బొనరించెఁ గన్నుగవకు

1. ము. జరషేకాంతరమునఁదా.

*(శిశిర సంస్పర్శ వీచీ మారుతము గాన
నంగకంబులకు నింపావహించెఁ
గమలకేసరరేణుగంధోల్బణముగాన
ఘ్రాణేంద్రియమునకుఁ బ్రమద మొసఁగెఁ
గలహంసకులకలకలకల కులాయముగాన
శ్రుతిసంపుటములకు సుఖము నిచ్చె).

గీ. (మధుర) సలిలంబు[1]గాన సమ్మదముఁజేసె
నాలుకకు నప్పు డవని బృందారకునకు
సైకతారూఢ జల మానుషీ కదంబ
కాంక్షితార్క మయూఖంబు కమలసరసి. 24

అర్థము: సైకత .... ఖంబు: సైకత = ఇసుక తిన్నెను, అరూఢ = ఆరోహించిన, జల = నీరనెడి, మానుషీ = మనుష్య స్త్రీల యొక్క, కదంబ = సమూహము చేత, కాంక్షిత = కోరబడిన, అర్క = సూర్యుని యొక్క, మయూఖంబు = కిరణములుగలది, అగు, కమల = సరసి = తామర కొలను, అప్పుడు, అవని - బృందారకునకున్ = భూసురునకు - సుకుమారునకు. వైదూర్య - మణి - శిలా - స్వచ్ఛ + ఉదకము - కానన్ = వైదూర్య మణులనెడి, ఱాల వలె, నిర్మలమైన, నీరు గలది కావున, కన్ను + కవకున్ = కన్నుల జంటకు, కౌతుకంబు = వేడుక, ఒనరించెన్ = చేసెను. శిశిర - సంస్పర్శ - వీచీ మారుతము - కానన్ = చల్లని, తాకిడితోడి, అలల, గాలి గలది కావున, అంగకంబులకున్ = అవయవములకు, ఇంపు = సౌఖ్యము, ఆవహించున్ = కలిగించును. కమల - కేసర - రేణు - గంధ + ఉల్బణము - కానన్ = తామర పువ్వుల, కింజల్కముల యొక్క పుప్పొడి యొక్క, వాసనచే, అధికమై నది కావున, ఘ్రాణ + ఇంద్రియమునకున్ = ముక్కు అనెడి ఇంద్రియమునకు, ప్రమదము = సంతోషము, ఒసంగెన్ = ఇచ్చెను. కలహంస - కుల - కల - కలకల - కులాయము - కానన్ = రాజహంసముల యొక్క, సమూహము యొక్క, అవ్యక్త మధురమైన, కలకల యను ధ్వనులుగల, గూండ్లు గలది కావున, శ్రుతి - సంపుట ములకున్ = దొప్పలవంటి చెవులకు, సుఖమున్, ఇచ్చెన్. మధుర - సలిలంబు - కానన్ = తీయని జలముగలది కావున, నాలుకకున్, సమ్మదమున్ = సంతోషమును, చేసెన్.

తాత్పర్యము: అప్పుడు సుకుమారునకు ఇసుక తిన్నె నారోహించి జలమనెడి స్త్రీల సమూహముచేత కోరబడిన సూర్యకిరణములు గల తమ్మికొలను వైదూర్య

---

* ఈ పంక్తులు చాలినంత స్థలమూరక విడిచియున్నది. 1. ము. సమ్మోదమునను జేసె.

మణి శిలలవలె నిర్మలమైన నీరు గలది కావున కనుదోయికి వేడుక కలిగించెను. చల్లని తాకిడి గల యలల మీది నుండి వచ్చు గాలి గలది కావున నవయవములకు సౌఖ్యమును గూర్చెను. పద్మములకేసరముల పుప్పొడి వాసనల పెల్లుగలది కావున నాసేంద్రియమునకు సంతోషము నొసగెను. రాయంచల అవ్యక్త మధురము లయిన కలకలారావములు గల గూండ్లు గలది కావున చెవులకు సుఖము కలిగించెను. తీయని జలము గలది కావున నాలుకకు సంతోష మొదవించెను.

విశేషములు: ఆ కొలను సుకుమారుని పంచేంద్రియములకు సౌఖ్యమును కలిగించెనని తెలియుచున్నది. ఒక్కొక్క యింద్రియమును తృప్తి పఱుపగల యొక్కొక్క గుణ మా కొలనికి గలదు. ఉదక స్వచ్ఛతచే కన్నులకు, శీతల తరంగవాయు స్పర్శచే చర్మమునకు, పద్మముల పుప్పొడుల గంధముచే నాసికకు, కలహంసల కలకలారావములచే వీనులకు, జలమాధుర్యముచే నాలుకకు నా కొలను సౌఖ్యదాయక మగుచున్నది.

స్వచ్ఛ + ఉదక - స్వచ్ఛోదక, ఘ్రాణ + ఇంద్రియ - ఘ్రాణేంద్రియ - గుణ సంధులు. నాలుకకు నప్పుడవని బృందారకును - బిందుయతి.

క. కొలని దరి వటమునీడన్
శిలతల్పము నందుఁ గొంతసేపు శయించెం
జెలువమగు వలిపె దుప్పటి
తలగడఁగా జేసి సచివతనయుఁ[1]డంతన్. 25

అర్థము: అంతన్ = తరువాత, సచివ - తనయుఁడు = మంత్రి కుమారుడు - సుకుమారుడు, చెలువము + అగు = అందమగు, వలిపె - దుప్పటి = పరిశుద్ధమైన దుప్పటి (వలిసె గాక వలిప అయి యుండవచ్చును.) తలగడన్ + కాన్ = తలగడనుగా, చేసి, కొలని - దరి = సరస్సు సమీపము నందలి, వటము = మఱ్ఱిచెట్టు యొక్క, నీడన్ = నీడయందు, శిల - తల్పము + అందున్ = ఱాతి పాన్పుమీద, కొంతసేపు, శయించెన్ = పరుండెను.

తాత్పర్యము: అంత మంత్రి కుమారుడగు సుకుమారుడు అందమైనట్టియు, పరిశుద్ధమైనట్టియు దుప్పటిని తలగడగా జేసికొని సరస్సమీపమున నున్న మఱ్ఱిచెట్టునీడ ఱాతి పాన్పుపై కొంత సేపు పరుండెను.

విశేషములు: శిల తల్పము - శిలా తల్పమని యుండవలయును. శిలా శబ్ద మాకారాంతము. శయించు - శీధాతువు. 'సంస్కృతంబున కంగలాదుల కించుక్కగు'

1. ము. డలఁతన్

- బాల. క్రియ. 63 శీ + ఇంచు. `ఇ ఉ ఋ ల కించుక్కు పరంబగునపుడయుగవు గరుక్కు లగు.' బాల. క్రియ 64. శయించు. వలిపె శబ్దమునకు నిర్ధారకము గానరాదు. వలిప దుప్పటి యని యుండనగును. `వలిపము' నకు వృత్తి యందు ముపర్ణక లోపము.

ఇందలి `అంతన్' అను పాఠము కంటె, ముద్రిత ప్రతిలోని `అలఁతన్' = అలయికతో అను పాఠమే బాగు.

గీ. బహులపక్షక్షపాకదంబములలోనఁ
ప్రభవ మొందిన యంధకారంబువోని
కొలనిదరి కాననంబులోఁ గొంత[1]ప్రొద్దు
నలపు వాయంగ నిద్రించె యాజ్ఞదత్తి 26

అర్థము: యాజ్ఞదత్తి = యజ్ఞదత్తుని కొడుకైన సుకుమారుడు, బహుల - పక్ష - క్షపా - కదంబములలోనన్ = కృష్ణ పక్షరాత్రుల సమూహములలో, ప్రభవము + ఒందిన = పుట్టిన, అంధకారంబు + పోని = చీకటి వంటి, కొలని - దరి - కాననంబులోన్ = సరస్సుయొక్క తీరము నందలి అడవిలో, కొంత - ప్రొద్దున్ = కొంతసేపు, అలపు + పాయంగన్ = అలయిక పోవునట్లు, నిద్రించెన్ = నిద్రపోయెను.

తాత్పర్యము: సుకుమారుడు కృష్ణపక్షరాత్రులందు పుట్టిన చీకటి వంటి సరస్తీరారణ్యములో కొంతసేపు నిద్రించెను.

విశేషములు: కృష్ణపక్షమునందలి రేల నంధకారము మఱింత గాఢముగా నుండును. కొలని దరి కాన వృక్షసాంద్రతచే పగలుగూడ నంత గాఢాంధకారముగా నుండెననుట. అలంకారముపమ.

అంధకారంబు + పోని = అంధకారంబు వోని, అలపు + పాయంగ = అలపువాయంగ - గసడదవాదేశము. అంధకారంబువోని. `అట్టి పోని బోటి వంటి శబ్దంబులు వదర్థకంబులు. అట్టి ప్రభృతులు పరంబు లగుచో నట్లు ప్రభృతి పరక నామాదులకుం బలెఁబూర్వ పదంబులకు విభక్తులు త్రివిధంబులంబరంగు.' ప్రౌఢ. సమాస. 43 కొంత ప్రొద్దు నలపువాయంగ - ప్రొద్దు అను కాలవాచక శబ్దము ద్రుతాంత మగుట చింత్యము. `కాలాధ్వములకుం బ్రాయికంబుగాఁ బ్రథమయగు.' బాల. కారక. 25. సూత్రమున `ప్రాయిక' గ్రహణముచే రక్షితమా? క్షపా = రాత్రి. `నిశా నిశీథినీ రాత్రి స్త్రియామా క్షణదా క్షపా.' క్షపయతి సర్వ చేష్టా ఇతి క్షపా.' సర్వవ్యాపారములను క్షయింపజేయునది. అమరము. దరి - (వికృతి), తీరము (ప్రకృతి),

1. తా. వేళ

కాననము (ప్రకృతి) - కాన (వికృతి), యాజ్ఞదత్తి - యజ్ఞదత్తుని పుమపత్యము. అలయు ధాతు కృదంతరూపము - అలపు. `పువర్ణకంబు మాయ్యాదుల కగు.' బాల. కృదంత 11. పోని - పాలు, పోలిన అను క్రియాజన్య విశేషణము యొక్క సంక్షిప్త వికృతిరూపము. అలపు + పాయంగన్ - గసడదవా దేశము - అలపువాయంగన్ - బాల. సంధి.13.

గీ. [1]డప్పి దీఱంగ మధురకాండంబు [2]గ్రోలి
కడుపు నిండంగ [3]దూడుఁదీఁగలు భుజించి
యెండ వాలారునందాక నిండుకొలని
తీరమున మఱ్ఱి నీడ నిద్రించె నతఁడు. 27

అర్థము = అతఁడు = ఆ సుకుమారుడు, డప్పి = దగ (దాహము), తీఱంగన్ = తీఱునట్లు, మధుర - కాండంబున్ = తీయని నీటిని, గ్రోలి = త్రాగి, కడుపు, నిండంగన్, తూడున్, తీగలున్, భుజించి = తిని, ఎండ, వాలారు + అందాకన్ = ఉపశమిల్లు వఱకును, నిండు - కొలని - తీరమునన్ = నిండైన చెఱువు గట్టునందలి, మఱ్ఱి - నీడన్, నిద్రించెన్.

తాత్పర్యము: ఆ సుకుమారుడు దప్పితీఱునట్లు తీయని జలమును త్రావి, కడుపునిండ తూండ్లు తీగలు ఆరగించి, యెండ తగ్గు వఱకు నిండు కొలని యొడ్డున నున్న మఱ్ఱిచెట్టు నీడను నిద్రించెను.

విశేషములు: డప్పి - దప్పి. `దక్కులోనగు వాని దాకు డకారంబు విభాషనగు.' బాల. ప్రకీర్ణక. 14. డయ్యు కృదంతరూపము డప్పి. `డయ్యు దయ్యు నొచ్చు పుచ్చుల కివర్ణకంబగు. అగుచో వాని కడ హల్లులు పకారంబు లగు.' ప్రౌఢ. కృదంత. 1. కాండము = నీరు - `కృపీటం కాణ్డ మస్త్రీ స్యా జ్జీవనీయం కుశం విషమ్.' అమరము. ఎండ - ఎండు ధాతుకృదంతరూపము. `అవర్ణకంబు గిఱ్వాదుల కగు.' బాల. కృదంత. 18. కాండము - (నానా) జలము, బాణము, గ్రంథపరిచ్ఛేదము, దండము, కాండ.

చ. అపుడు విలంబమానమయి యంబరకోణతటాంతరంబునం
దపనుని మండలంబు బెడిదంబగు వేడిమి నొయ్య వీడ్కొనెం
గపిలములై మయూఖములు కార్తిక మాస[4]కళాపచేళిమ
త్రపుస లతా శలాటు సముదాయము చాయఁ దిరస్కరింపఁగన్. 28

అర్థము: అపుడు = ఆ సమయమునందు, మయూఖములు = (సూర్య) కిరణములు, కపిలములు + ఐ = పింగళ వర్ణముగలవై, కార్తిక..... చాయన్ : కార్తిక

1. తా.డప్పి వోవంగ మధురోదకంబు గ్రోలి. 2. తా. దొండి తీఁగలు. 3. ము. కలాపిపింఛమై

- మాస = కార్తికమనెడి మాసమునందలి, కళా = చంద్రకళ వలె (చంద్రునిలో పదునాఱవ భాగము కళ), పచేళిమ = తనంత పక్వమగు, త్రపుస = చేదుదోస యొక్క, లతా = తీగయొక్క, శలాటు = పచ్చికాయల యొక్క, సముదాయము - చాయన్ = సమూహము యొక్క కాంతిని, తిరస్కరింపఁగన్ = నిరాకరింపఁగా, తపనుని - మండలంబు = సూర్యబింబము, అంబర - కోణ - తట + అంతరంబునన్ = ఆకాశపుటంచు ప్రదేశములోపల, విలంబమానము + అయి = వ్రేలుచున్నదయి, బెడి - దంబు + అగు = తీక్ష్ణమైన, వేడిమిన్, ఒయ్యన్ = క్రమముగా, వీడ్కొనెన్ = విడిచిపెట్టెను.

తాత్పర్యము: ఆ సమయమున సూర్యుని కిరణములు పింగళ వర్ణము కలవయి కార్తికిక మాసమునందలి చంద్రకళవలె తనంత పక్వములైన చేదుదోస తీగకాయల సమూహము కాంతిని నిరాకరింపగా (మీఱగా) సూర్యబింబము ఆకాశపుటంచున వ్రేలుచున్నదయి తీవ్రమైన వేడిమిని క్రమముగా విడిచిపెట్టెను.

విశేషములు: సాయంసమయ సూర్యుని స్థితి యిందు వర్ణింపబడెను. సూర్యకిరణములు కపిల వర్ణము గలవియయ్యెను. వాని రంగు కార్తికిక మాస చంద్రకళవలె తనంత పక్వములైన చేదు దోసకాయల కాంతిని తిరస్కరించుచుండెను. అంబరము =(నానా.) ఆకాశము, వస్త్రము. తటము =(నానా) ప్రదేశము, కొండచఱియ, ఏటి యొడ్డు. బెడిదము - బెడిదము (రూపాం.) వేడిమి - వేడి + ఇమి - "పేర్వాదుల కిమివర్ణకంబగు/" బాల. తద్ధిత 5. అంద్వవగాగమ సంధి. బాల. సంధి. 11 ఒయ్యె = ఒయ్యన = ఓయన. వీడ్కొను = వీడుకొను. కార్తిక = కార్తికిక. కవి ఇందు సూర్యాస్తమయమును స్వభావసిద్ధముగా వర్ణించెను గావున నలంకారము స్వభావోక్తి. ఇందు ఉపమేయమైన మయూఖములకు ఉపమానమైన త్రపుస శలాటువుల కంటె ఆధిక్యము చెప్పబడినది కావున నలంకారము వ్యతిరేకము.

గీ. అంత[1]లో నిద్ర మేల్కాంచి యవనిసురుఁడు
జిగమిషాబుద్ధి [2]నీక్షించెఁ జిత్రభాను
నభినవోన్మేష కుటిల జిహ్మప్రకార
లోల తారకా కేకరాలోకనమున. 29

అర్థము: అంతలోన్ = సూర్యుడస్తమించులోపల, అవని సురుడు = భూదేవుడు (బ్రాహ్మణుడు) సుకుమారుడు, నిద్ర మేల్కాంచి = నిద్రమేల్కొని, జిగమిషా - బుద్ధిన్ = పోగోరు తలంపుతో, అభిన .... రాలోకనమున : అభినవ = క్రొత్తదియైన, ఉన్మేష = కాంతిచేత, కుటిల = వంకరయైనట్టియు, జిహ్మ = మందమయి నట్టియు,

1. తా. నా నిద్ర మేల్కొని. 2. తా. వీక్షించె

ప్రకార = విధముగల, లోల = చంచలమైన, తారక = కంటి నల్ల గ్రుడ్డు తోడి, ఆకేకర = కొంచెము ఓరయైన, ఆలోకనమునన్ = చూపుతో, చిత్రభానున్ = సూర్యుని, ఈక్షించెన్ = చూచెను.

తాత్పర్యము: సూర్యుడస్తమించునంతలో సుకుమారుడు నిద్ర మేలుకొని పోగోరు తలపుతో సూర్యుని చూచెను. లేచిన వెంటనే సూర్యకాంతిని జూచుటచే నతని చూపు వక్రమును మందము నైనది. 'నల్లగ్రుడ్డు చంచలమై చూపించుక యోర యయ్యెను.

విశేషములు: జిగమిషా - గన్తు మిచ్ఛా - పోగోరిక. గమ్ ధాతు సన్నంత రూపము. చిత్రభాను = 'చిత్రభాను ర్విభావసుః' 'చిత్రాః భానవో యస్య సః - అమరము. అభినవ + ఉన్మేష = అభినవోన్మేష - గుణసంధి. లేచిన వెంటనే సూర్యకాంతిని జూచుటతో నతని చూపు వక్రమయ్యెను. మందగించెను. కనుగ్రుడ్డు చలించెను. చూపించుక యోరయయ్యెను. అలంకారము స్వభావోక్తి. ఆకేకర - కొంచెము ఓరగా జూచునది (కన్ను) 'దృష్టి రాకేకరా కించిత్ స్ఫుటా పాంగే ప్రసారితా, మీలితార్ధపుటాలో కే తారా వ్యావర్తనోత్తరా.' (వాచ).

శా. కాంతారాంతర భూమిచెంత శబరగ్రామంబు పద్మాకర
ప్రాంతక్షోణి తలంబునంగలుగ[1]సంభావించె విప్రుం[2] డెదన్
దంతి స్కంధకపోల కుంభపలలాద క్రూర కౌలేయకీ
[3]సంతానాస్ఫుట కంఠఘర్ఘరతర ద్రాఘిష్ఠ నాదంబులన్. 30

అర్థము: విప్రుండు = బ్రాహ్మణుడు (సుకుమారుడు), దంతి ...... నాదంబులన్ : దంతి = ఏనుగుల యొక్క, స్కంధ = మూపులయొక్కయు, పలలాద = మాంస భక్షణముచే, క్రూర = భయంకరమైన, కౌలేయకీ = ఆడుకుక్కల యొక్క, సంతాన = సమూహముయొక్క, అస్ఫుట = అస్పష్టమైన, కంఠ = ఎలుగుల యొక్క, ఘర్ఘరతర = మిక్కిలి ఘర్ఘర యనెడి, ద్రాఘిష్ఠ = మిక్కిలి దీర్ఘములైన, నాదంబులన్ = ధ్వనులచేత, శబర - గ్రామంబు = కిరాతుల యూరు, కాంతార + అంతర - భూమి - చెంతన్ = అడవి నడిమి ప్రదేశము కడ, పద్మ + ఆకర - ప్రాంత - క్షోణితంబునన్ = తామర కొలని దరి భూమి యందు, కలుగన్ = ఉండునట్లు (ఉన్నదని), ఎదన్ = హృదయమున, సంభావించెన్ = ఊహించెను.

తాత్పర్యము: బ్రాహ్మణుడైన సుకుమారుడు ఏనుగుల మూపులు గండ స్థలములు, కుంభస్థలములు అనువానియందలి మాంసము తినుటచే భయంకరములైన ఆడుకుక్కల గుంపులయొక్క అస్ప ౦ులైన యెలుగుల ఘర్ఘర అనెడి సుదీర్ఘములైన ధ్వనులచే

1. తా. సంభావించి. 2. తా. డెదన్ 3. ము. సంతాన.

నా యడవి చెంత తమ్మికొలని సమీపమున కిరాతగ్రామ మున్నదని మనస్సులో నూహించెను.

విశేషములు: `సంతానాస్ఫుట' అను పాఠము కంటె ముద్రిత ప్రతిలోని `సంతానస్ఫుట' అను పాఠము మేలనిపించుచున్నది. `దంతి ......... నాదంబులన్' అను సుదీర్ఘసమాసము ఆ యాడుకుక్కల ద్రాఘిష్ఠ ఘుర్ఘర నాదములను స్ఫురింపజేయుచున్నది. ఘుర్ఘర - ధ్వన్యనుకరణ శబ్దము. ద్రాఘిష్ఠ = దీర్ఘ శబ్ద ఇష్ఠ ప్రత్యయాంతరూపము. దీర్ఘ - ద్రాఘీయస్, ద్రాఘిష్ఠ - తరతమ భావార్థకములు. కౌలేయక -`కౌలేయక స్సారమేయః కుక్కురో మృగదంశకః' - కులే గృహే భవః కౌలేయకః = కుక్క (ఇంటనుండునది) అమరము. కౌలే స్త్రీలింగ రూపము కౌలేయకి = ఆడుకుక్క. దంతి - స్కంధ = దంతి `సమూహ' మనియైన చెప్పవచ్చును. క్షోణి ఇకారాంత, ఈకారాంతములు రెండును గలవు. విప్రుండు - సుకుమారుని బ్రాహ్మణత్వము నడుగడుగునను కవి గుఱుతు చేయుట గమనింపదగినది.

వ. (ఆ సమయంబున) 31

అర్థము: అప్పుడు.

సీ. ఆదికాలమున మాయావిలాసినియైన
మురదైత్యదమనుని మూర్తి వోలె
ధరణీతలంబునఁ జరియింప నేర్చిన
పురుహూతమణిశిలాపుత్త్రివోలెఁ
గామినీరూపంబు గైకొన్న శంబరా
రాతి కాలాయసాస్త్రంబు వోలె
వేడ్కకై మానుషీవిగ్రహంబు ధరించి
విహరించు తొలుకారు వేళవోలె

గీ. నంధతామిస్రమును నవిద్యయునుఁ బోలె
భువనమోహనరూప వైభవము[1]లొలయ
లీల నేతెంచె నొక్క చండాలకన్య
కొలనఁ జిఱుబంతి పసపాఁడజెలియుఁ దాను. 32

అర్థము: ఆది - కాలమునన్ = పూర్వకాలము నందు, మాయా - విలాసిని + ఐన = కపటస్త్రీ యైన, ముర - దైత్య - దమనుని = మురుడను రాక్షసుని సంహరించినవాని - విష్ణుని యొక్క, మూర్తి + పోలెన్ = ఆకారము వలెను, ధరణీ

1. తా. వొలయ

- తలంబునన్ = భూప్రదేశము నందు, చరియింపన్ నేర్చిన = తిరుగుట నేర్చినట్టి, పురుహూత - మణి - శిలా - పుత్త్రి + పోలెన్ = ఇంద్రనీలమణిజాతి బొమ్మ వలెను,

కామినీ - రూపంబున్ = స్త్రీ యాకృతిని, కైకొన్న = స్వీకరించిన, శంబర + అరాతి - కాల + ఆయస + అస్త్రంబు + పోలెన్ = శంబరుడను రాక్షసునకు శత్రువగు మన్మథుని యొక్క, నల్లని, ఇనుపదియైన, అస్త్రము వలెను, వేడ్కకై = వినోదముకయి, మానుషీ - విగ్రహంబున్ = స్త్రీరూపమును, ధరించి = తాల్చి, విహరించు = సంచరించు, తొలుకారు - వేళ + పోలెన్ = తొలకరి (వానకారు) సమయమువలెను. అంధ - తామిస్రమునున్ = చిమ్మచీకటి రేయికి సంబంధించినదియును, అవిద్యయును + పోలెన్ = మాయయు వలె, భువన - మోహన - రూప - వైభవము = లోకమును మోహపెట్టు సౌందర్య సంపద, పొలయన్ = ఒప్పుగా, ఒక్క - చండాల - కన్య = ఒక మాల పడుచు, కొలనన్ = కొలని యందు, చిఱుబంతి పసపాడన్ = చాయపసుపు రాచికొని స్నానము చేయుటకు, చెలియున్ + తానున్ = చెలికత్తెయును, తానును, లీలన్ = విలాసముతో, ఏతెంచెన్ = వచ్చెను.

తాత్పర్యము: పూర్వము, కపట స్త్రీ (మోహిని) యయిన విష్ణుని మూర్తి వలెను, భూమి తిరుగాడ నేర్చిన యింద్రనీలమణిజాతి బొమ్మవలెను, స్త్రీరూపమును ధరించిన మన్మథుని నల్లని లోహమయమైన అస్త్రము వలెను, వినోదార్థము స్త్రీ రూపమును. ధరించి సంచరించు తొలకరి వేళ వలెను, చిమ్మచీకటి రేయి, మాయ వలెను జగన్మోహనమైన సౌందర్య సంపద యొప్పుగా నొక మాల పడుచు కొలనిలో చిఱుబంతి పసపు రాచికొని స్నానము చేయుటకు చెలికత్తెయును తానును విలాసముతో వచ్చెను.

విశేషములు: ఆది కాలమున .... మూర్తివోలె - క్షీర సముద్ర మథనమున పుట్టిన అమృతము రాక్షసుల వంచించి దేవతలకు పంచిపెట్ట విష్ణుమూర్తి మోహిన్యవతారము నెత్తిన వృత్తాంతము సూచితము.

మాలపడుచు నల్లనిది కావున నామె కుపమానములుగా నల్లని వానినే గ్రహించుట గమనార్హము. విష్ణునిమూర్తి, పురుహూతమణి, కాలాయసాస్త్రము, తొలుకారు వేళ, అంధతామిస్రము, అవిద్య - అన్నియు నల్లనివే. అవిద్యయు నల్లనిదని కవి సమయము. వైభవము లొలయ అను పాఠమే మేలనిపించి అది స్వీకరింపబడినది. చిఱుబంతి పసపాడు. 'సీ. సిద్ధవాహిని నీటఁ జిఱుబంతి పసుపాడి, శ్రీ విశాలాక్షి గైసేయఁ దొడఁగె.' భీమ. 2.28. 'సీ. సెలయేటి తెలినీటఁ జిఱు బంతి పసపాడి సేస క్రొమ్ముత్యాల్లం బచ్చికలు తుఱిమి.' హర. 5-37 కొలనన్ - కొలను + అందున్ -

`ఔపవిభక్తికము తృతీయాసప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు.' బాల. ఆచ్ఛిక. 38 కొలను + అన్ - అంద్వవగాగమ సంధి - బాల. సంధి. 11 - కొలనన్. అలంకారము ఉల్లేఖము. .... ఏతెంచె నొక్క చండాలకన్య....... చెలియు దాను. `ఆత్మార్థం బభిహితం బగుచోఁ దల్లింగ సంఖ్యాభి ధాయి వచనంబు ధాతు విశేషణంబుల కగు.' బాల. క్రియ. 120.

శా. ఆ చండాలకుల ప్రసూతయగు కన్యం గన్యకారత్నముం
జూచెన్ దవ్వుల యాజ్ఞదత్తి విపినక్షోణీ విభాగంబునన్
వాచాగోచర సౌకుమార్య నవ లావణ్యాన్వితం బుష్పనా
రాచుండిక్షుశరాసనంబు ఘన[1]దోర్దర్పంబునం గూర్పఁగన్. 33

అర్థము: పుష్ప - నారాచుండు = పువ్వులు బాణములుగా గల వాడు (అగు) మన్మథుడు, ఇక్షు - శరాసనంబు = చెఱకు విల్లు, ఘన - దోస్ + దర్పంబునన్ = గొప్పది యగు భుజాగర్వమున, కూర్పగన్ = ఎక్కుపెట్టగా, యాజ్ఞదత్తి = యజ్ఞదత్తుని కొడుకగు సుకుమారుడు, ఆ - చండాల - కుల - ప్రసూత = ఆ మాలకులమున బుట్టినది, అగు, కన్యన్ = పడుచును, కన్యకా - రత్నమున్ = మణివంటి పడుచును - శ్రేష్ఠురాలయిన పడుచును, వాచా + అగోచర - సౌకుమార్యన్ = మాటచేత, కనబడని, మృదుత్వము గలదానిని - మాటల కందని మృదుత్వము గలదానిని, నవ - లావణ్య + అన్వితన్ = క్రొత్తది యగు చక్కదనముతో గూడిన దానిని, దవ్వులన్ = దూరమున, విపిన - క్షోణీ - విభాగంబునన్ = అరణ్యభూ ప్రదేశమున, చూచెన్.

తాత్పర్యము: పుష్పబాణుడు చెఱకువింటిని గొప్పదియగు భుజా గర్వమున నెక్కుపెట్టగా, సుకుమారుడు కన్యా మణియు, మాటల కందని మృదుత్వము గలదియు, నూతన సౌందర్యముతో గూడినదియు నగు నా మాలకులమున బుట్టిన పడుచును దూరమున నడవిలో చూచెను.

విశేషములు: వాచా + అగోచర = మాటచేత కనబడని - సమాస పూర్వపదమగు వాక్శబ్దము తృతీయకు లోపము రాలేదు. అందుచే అలుక్ సమాసము. వాచాగోచర సౌకుమార్య నవ లావణ్యాన్వితన్ = మాటకు గానరాని సౌకుమార్యము, నవ లావణ్యము నను వానితో గూడిన దాని నని యొకే సమాసముగా నైన చెప్పవచ్చును. శర + ఆసనము = శరములను త్రోయునది - విల్లు. దోర్దర్పము - దోస్ + దర్పము - పదాంత సకారమునకు విసర్గము - దోః + దర్పము. అఆ లు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులుగాని మృదుహల్లులుగాని పరములగునపుడు రేఫమాదేశమగును - దోర్దర్పము. కన్యకారత్నము - రత్నము

1. ము. దోర్దండంబు

వంటి కన్యక. ఉపమానోత్తర పద కర్మధారయము. దవ్వు - దవు - దౌ (రూపాం.) యాజ్ఞదత్తి - యజ్ఞదత్తుని బిడ్డ అనునర్థమున అకారాంత ప్రాతిపదికములకు `ఇన్' ప్రత్యయము వచ్చును. నకారాంత ప్రత్యయములు పరమగునేని ప్రాతి పదికము యొక్క మొదటి యచ్చునకు వృద్ధి వచ్చును. వృద్ధివచ్చిన పిమ్మట నకారపు పొల్లు లోపించును. యాజ్ఞదత్త + ఇ. అజాది ప్రత్యయములు పరములగుచో ప్రాతి పదికాంతమందలి అ, ఆ, ఇ, ఈ లకు లోపము వచ్చును. యాజ్ఞదత్ + ఇ = యాజ్ఞదత్తి. లావణ్యము - ముత్తెములయందు వలె నవయవముల యందు నీడ ప్రతిఫలించునట్టి కాంతివిశేషము. (సూ.ని.)

ఉ. యోగ సమాధి తత్పరత నున్నవిధంబున[1]వ్రాసినట్లు మూ
ర్ఛాగమ[2]మీలితాత్ముఁడగు చాకృతినిశ్చలదేహయష్టియై
సోగ కనుంగొనల్ నుదురు చొక్కుల కిక్కలు గాఁగ నత్తఱిన్
రాగరసాతిరేకమున బ్రాహ్మణుఁడాదటఁ జూచె మాలెతన్ 34

అర్థము: ఆ + తఱిన్ = అత్తఱిన్ = ఆ సమయమునందు, బ్రాహ్మణుడు, - యోగ - సమాధి - తత్పరతన్ = ధ్యాన పారవశ్యముతో, ఉన్న - విధంబునన్ = ఉన్నరీతిగా, వ్రాసిన + అట్లు = లిఖించినట్లు, మూర్ఛా + ఆగమ - మీలిత + ఆత్ముడు = మూర్ఛ యొక్క రాకచే, మూయబడిన, మనస్సుగల వాడు, అగుచున్, ఆకృతి = ఆకారము, నిశ్చల - దేహ - యష్టి + ఐ = కదలని కఱ్ఱవంటి శరీరము గలదియై, సోగ - కనుంగొనల్ = పొడవులైన కంటితుదలును, నుదురు, చొక్కులకున్ = పారవశ్యములకు, ఇక్కలు + కాంగన్ = చోటులు కాగా, రాగ - రస + అతి రేకమునన్ = ప్రేమరసము యొక్క విజృంభణముతో. మాలెతన్ = మాల దానిని, ఆదటన్ = ప్రీతితో, చూచెన్.

తాత్పర్యము: ఆ సమయమున సుకుమారుడు ధ్యాన తత్పరతతో నున్న విధమున లిఖించినట్లు మూర్ఛ వచ్చుటచే మనసు మూతవడి కదలని యొడలు గల ఆకారము గలవాడయి, నిడుపులైన కన్నుదలును, నుదురును పారవశ్యమునకు స్థానములగుచుండగా, ప్రేమరసము విజృంభింప మాలెతను ప్రీతితో చూచెను.

విశేషములు: సుకుమారుడు మాలెతను ప్రేమాతిరేకమున ప్రీతితో జూడగా యోగ సమాధి యందున్న వాని వలెను, చిత్తరువున వ్రాయబడినట్లును ఉండెను. మూర్ఛవచ్చుటచే మనసు మీలితమయి ఆకారము నిశ్చల మయ్యెను. సోగలైన కనుగొనలను, నుదుటను పారవశ్యము గనుపట్టుచుండెను. సుకుమారునిది మ్లేచ్ఛాగతమైన శృంగారము గాన శృంగార రసాభాసము. ఇందు మన్మథ దశావస్థలలో దృక్కు, (చక్షుఃప్రీతి), మనస్సంగము, మూర్ఛ అనునవి వర్ణింపబడినవి.

1. ము. ఁబాసిల్లునట్లు. 2. తా. నాకృతిన్ తనువినిశ్చలదృష్టియు దేహయష్టియై

రసాభాసలక్షణము - ఏకత్రై వానురాగశ్చే త్తిరశ్మ్లేచ్ఛగతోఽపి వా
యోషితో బహుసక్తిశ్చే(ద్రసాభాస స్త్రిధా మతః.
మన్మథదశావస్థలు - దృఙ్మనస్సంగ సంకల్పా జాగరః కృశతాఽరతిః
హ్రీత్యాగోన్మాద మూర్ఛాంతా ఇత్యనఙ్గదశా దశ.

కనుంగొనలు - కన్ను + కొనలు - తుది ను క్రింది నకారమునకు లోపము. బాల. ప్రకీర్ణ. 7 కన్ను + కొనలు - ఉదంత స్త్రీసమంబునకు పరుషము పరమగుచుండగా నుగాగమము (బాల. సంధి.25). పిమ్మట ద్రుత కార్యము (బాల. సంధి. 16,17.), అత్తఱి - ఆ + తఱి - త్రికసంధి. బాల. సమాస. 14,13. మాలెత - మాల + త - `త వర్ణకంబు కులవాచకంబునకు స్త్రీ వాచ్యం బగునపుడు మతుబర్థంబునందగు.' బాల. తద్ధిత 19. `తవర్ణకంబు పరంబగుచో నొకానొకచో నెత్వంబు చూపట్టెడు. బాల. తద్ధిత. 20.

సీ. అప్సరః స్త్రీ వోలె [1]నకులీనయైన యీ
పైదలి కన్నుల పండువయ్యెఁ
[2]జామ యౌవనరూపసంపన్నయై [3]మోక
వనరేఖయును బోలెఁ బెనచె వేడ్కఁ
బాలతి[4]ప్రావృడ్వేళ వోలె నళివినీల
ఘనవేణియై యిది[5]కరము మెఱసె
నిభరాజ నిభయాన యిది [6]శరత్తనుఁ బోలెఁ
బుండరీకాక్షియై పొలుపు మిగిలె

గీ. ముట్టరానిది యైనట్టి మూర్తి వోలెఁ
జిత్తరువు వోలె దృష్టి కచ్చెరు వొనర్చె
మెలఁత మధుమాసకుసుమసమృద్ధివోలె
జాతివిరహిత [7]యయ్యు సంప్రీతి నొసఁగె. 35

అర్థము: అప్సరస్ + స్త్రీ + పోలెన్ = దేవవేశ్య వలె, అకులీన + ఐన = కులము లేనిదియైన, ఈ - పైదలి = ఈ స్త్రీ, కన్నుల - పండువు + అయ్యెన్ = నేత్రోత్సవము గావించెను. చామ = స్త్రీ, (మాలెత), యౌవన - రూప - సంపన్న + ఐ = పడుచు దనము, అందము అనువానితో గూడినదయి, మోక - వన - రేఖయును + పోలెన్ = మొక్కతోట వలె, వేడ్కన్ = కాంక్షను, పెనచెన్ = కూర్చెను.

1. ము. న కులయై యోరయీ 2. ము. జారు. 3 తా. మొక 4. తా.ప్రావృడ్వేళలవోలె నలినాక్ష పయినీల 5. ము. గరము. 6. ఘు. శరత్తువువోలె. 7. తా. యయ్యె.

పొలంతి - ఇది = ఈ స్త్రీ, ప్రావృట్ + వేళ + పోలెన్ = వర్షర్తువు వలె, అళి - వినీల - ఘన - వేణి + ఐ = తుమ్మెద వలె మిక్కిలి నల్లనైన గొప్ప జడగలదియై, (గొప్ప ప్రవాహము గలదియై యని వర్షర్తు పరమైన యర్థము), కరమున్ = మిక్కిలి, మెఱసెన్ = ప్రకాశించెను. ఇభ - రాజ - నిభ - యాన - ఇది = ఈ గజరాజగమన, శరత్తునున్ + పోలెన్ = శరదృతువువలె, పుండరీక + అక్షి + ఐ = తెల్లతామరలవంటి కన్నులు గలదియయి, పొలుపు - మిగిలెన్ = అందమతిశయించెను. ముట్టన్ + రానిది = తాకుటకు శక్యముగానిది, ఐన + అట్టి, మూర్తి + పోలెన్ = ఆకృతివలెను, చిత్తరువు + పోలెన్ = బొమ్మవలెను, అచ్చెరువు + ఒనర్చెన్ = ఆశ్చర్యము గలిగించెను. మెలఁత = స్త్రీ, జాతి - విరహిత + అయ్యున్ = కులము తక్కువదియైనను, మధుమాస - కుసుమ - సమృద్ధి + పోలెన్ = వసంతము నందలి, పుష్పముల, పెంపువలె, సంప్రీతిన్ = సంతోషమును, ఒసంగెన్ = ఇచ్చెను.

తాత్పర్యము: దేవవేశ్యవలె కుల విహీనమైన యీ యింతి కన్నుల పండువుగా నున్నది. ఈమె పడుచుదనము, అందము గలిగి మొక్కతోట వలె వేడుక గలిగించినది. వర్షర్తువు వలె తుమ్మెదవలె మిక్కిలి నల్లనైన గొప్ప జడగలదియై మిక్కిలి ప్రకాశించెను. ఈ గజరాజగమన శరదృతువు వలె తెల్లతామరలవంటి కన్నులు గలదియై అందగించెను. ఈమె అస్పృశ్యమూర్తి వలెను, చిత్తరువు వలెను ఆశ్చర్యము గలిగించెను. జాతి విరహితయైనను ఈమె వసంతసమయమునందలి పుష్పసమృద్ధివలె సంప్రీతిని కలిగించెను.

విశేషములు: వేశ్యకును ఒక కులమని ఉండదు. ఈమె మానవ వేశ్యవలె గాక దేవవేశ్యవలె నున్నది కావున గన్నుల పండువుగా నున్నది యనుట. కులీన = ఉత్తమ కులమున బుట్టినది. న + కులీన = అకులీన = ఉత్తమ కులమున బుట్టనిది. ప్రావృడ్వేళ - ప్రావృట్ + వేళ - ఝల్లునకు హశ్శు పరమగుచుండగా తృతీయ వర్ణాదేశము. వేణి - (నానా.) జడ, ప్రవాహము. ప్రావృడ్వేళ ప్రవాహము ఘనముగా నుండును. చిత్తరువు (వికృతి) - చిత్రము (ప్రకృతి), అచ్చెరువు (వికృతి) - ఆశ్చర్యము (ప్రకృతి). జాతి - (నానా.) - కులము, జాజి. ఘనవేణి,. జాతి విరహిత -శ్లేషము.ఉల్లేఖాలంకారము. చామ - `చాన తెఱవ వెలందుక చామ లేమ', పొలంతి- `మించుబోడి ముద్దులగుమ్మ పొలంతి కొమ్మ' -ఆం.నా. సం. చామ. (నానా) - సస్యవిశేషము, స్త్రీ. `చామ యన సస్యమునకును భామినికిని నాఖ్యయగుచుఁ బరఁగు.' పుండరీక (నానా.)-తెల్లతామర, పెద్దపులి, వెల్లగొడుగు, ఆగ్నేయదిక్కునందలి యేనుగు.

గీ. దీనిఁ గల్పించె నజుఁడభి ధ్యానమునను
నాతి మును ముట్టరాకుండ నంత్యజాతి
ముట్టుటయ కల్గెనేని యిమ్ముదితమేను
గందకుండునె పుష్పంబుకంటె మృదువు. 36

అర్థము: అజుఁడు = బ్రహ్మ, దీనిన్ - నాతిన్ = ఈ స్త్రీని, మును = ముందు, ముట్టన్ + రాక + ఉండన్ = తాకుటకు వీలులేకుండ, అంత్యజాతిన్ = కడజాతి యందు - మాల కులమున, అభిధ్యానమునను = కోరికతో, కల్పించెన్ = నిర్మించెను, ముట్టుట + అ = ముట్టుకొనుటయే, కల్గెన్ + ఏని = సంభవించెనేని, పుష్పంబు కంటెన్ = పూవు కంటెను, మృదువు = మెత్తనిది (అగు), ఈ + ముదిత = ఈ స్త్రీ యొక్క, మేను = శరీరము, కందక + ఉండునె = కందిపోవకుండునా - తప్పక కందిపోవునని భావము.

తాత్పర్యము: బ్రహ్మ యీ యింతిని తాకుటకు వీలులేకుండ కడజాతి యందు కావలయునని సృజించెను. తాకుటకు తగియున్నచో పుష్పముకంటె మృదువైన యీమె మేను తప్పక కందిపోయియుండెడిది.

విశేషములు: అజుడామెను అంత్యజాతి యందు కల్పించుటకు హేతువు ఆమె మేను కందిపోవుట కాకున్నను అట్లు చెప్పుటచే హేతూత్ప్రేక్షాలంకారము. మేను కందకుండెనె పుష్పంబు కంటె మృదువు - సంబంధాతిశయోక్తి. 'మేను కందకుండునె' అను సమర్థనీయాంశము 'పుష్పంబు కంటె మృదు' వనుదానిచే సమర్థింపబడినది కావున కావ్యలింగాలంకారము. 'నాతి మును ముట్ట రాకుండ నంత్యజాతి' - యతి మైత్రి చింత్యము. నాతి - 'నవలా కలువకంటి నాతిగోతి' ఆం.నా.సం., ముదిత - 'ముగుద వగలాడి సింగారి ముదిత యువిద.' (సాం.ని.) ఇమ్ముదిత - ఈ + ముదిత - త్రికసంధి.

వ. అని [1]విస్మృత నిమేషంబు గీలించి ముకుళిత పక్ష్మాంచ లంబును జిహ్మ[2]తర తరళ శాతోదరంబును నగు వీక్షణంబున నవ్వెలివాడ వ్రీడావతి నీక్షించుచు నవ్విప్రుండు మదన శర శలాకా శంకు[3]సంకలిత హృదయుండై స్తంభితునిభంగి విలిఖితుని చందంబున నుత్కీర్ణుని పగిది [5]నియతుని లాగున మూర్ఛితుని ప్రకారంబున (నున్మత్తుని తెఱంగున) దన్ను దా నెఱుంగక నివ్వెఱపడి నిశ్చలాంగుండై యుండె నమ్మచ్చెకంటియు నలవోక వోలె నతి స్వచ్ఛ సౌభాగ్యచ్ఛాయా వినిర్భర్త్సిత మత్స్యకేత నుండగు నా బ్రాహ్మణుం గనుంగొని [6]నిజాంతరంగంబున. 37

అర్థము: అని = పయి విధమున పలికి, విస్మృత - నిమేషంబు = మఱువబడిన ఱెప్పపాటును, కీలించి = కూర్చి, ముకుళిత - పక్ష్మ + అంచలంబును = ముడువబడిన -ఱెప్పవెండ్రుకల యొక్క, కొనలుగలదియు, జిహ్మతర - తరళ - శాత + ఉదరంబును = మిక్కిలి వంకరయైనదియును, చంచలమైనదియును, సుందరమయినదియునగు నడిమి భాగము గలదియును, అగు, వీక్షణంబునన్ = చూపుతో, అ + వెలివాడ -

1. ము. విస్తృత. 2. తా. తరళతర. 3. తా.సంకుపిత 4. తా. విధంబున. 5. తా. సంయతుని 6. తా.నిజాంతర్గతంబున

వ్రీడావతిన్ = ఆ మాల పడతిని, ఈక్షించుచున్ = చూచుచు, ఆ + విప్రుండు = ఆ బ్రాహ్మణుడు (సుకుమారుడు), మదన .... హృదయుండై : మదన = మన్మథుని యొక్క, శర = బాణముల యొక్క, శలాకా = కఱ్ఱల యొక్క, శంకు = గసికలతో, సంకలిత = కూడుకొనిన, హృదయుండు + ఐ = హృదయము గలవాడయి, స్తంభితుని - భంగిన్ = మ్రాన్పడిన వానివలె, విలిఖితుని - చందంబునన్ = చిత్తరువున వ్రాయబడిన వాని విధమున, ఉత్కీర్ణుని - పగిదిన్ = శిల్పముగా చెక్కబడిన వానివలె, నియతుని - లాగునన్ = కట్టబడినవాని విధమున, మూర్ఛితుని - ప్రకారంబునన్ = మూర్ఛపోయినవాని రీతిని, ఉన్మత్తుని - తెఱంగునన్ - కైపెక్కిన వానివలె, తన్నున్, తాను, ఎఱుంగక, నివ్వెఱపడి = నిశ్చేష్టుడయి, నిశ్చల + అంగుండు + ఐ = కదలని అవయవములు గలవాడయి, ఉండెన్, ఆ + మచ్చెకంటియున్ = ఆ చేపలవంటి కన్నులు గలదియు - స్త్రీయు, అలవోక + పోలెన్ = సవిలాసముగా, అతి ...... కేతనండు : అతి = మిక్కిలి, స్వచ్ఛ = నిర్మలమైన, సౌభాగ్య = సౌందర్యము చేతను, ఛాయా = కాంతి చేతను, వినిర్భర్త్సిత = మిక్కిలి తిరస్కరింపబడిన, మత్స్య - కేతనుండు = చేప ధ్వజముగా గలవాడు - మన్మథుడు గలవాడు, అగు, ఆ - బ్రాహ్మణున్ = ఆ సుకుమారుని, కనుంగొని = చూచి, నిజ + అంతరంగంబునన్ = తనదైన మనసునందు -

తాత్పర్యము: అని పలికి, ఱెప్పపాటును మఱచి, ఱెప్పల కొనలను ముడిచి, వక్రతరము, చంచలము, సందరము నైన చూపుతో నా సుకుమారుడు ఆ చండాల స్త్రీని చూచుచు, మన్మథ బాణము లనెడి గసికలతో గూడిన హృదయము గలవాడయి మ్రానుపడిన వానివలెను, చిత్తరువున వ్రాయబడిన వానివలెను, శిల్పమున చెక్క బడిన వాని వలెను, కట్టబడిన వాని వలెను, మూర్ఛపోయినవాని వలెను, కైపెక్కిన వాని వలెను తన్నుదాను ఎఱుగక నిశ్చేష్టుడై, నిశ్చలావయవుడయి యుండెను. ఆ మీనాక్షియు సవిలాసముగా మిక్కిలి నిర్మలమైన సౌందర్యము చేతను దేహకాంతి చేతను మన్మథుని తిరస్కరించిన యా బ్రాహ్మణుని జూచి తన మనస్సునందు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: `విస్మృతనిమేషంబు ..... నీక్షించుచు - స్వభావోక్తి. వ్రీడావతి - వ్రీడ = సిగ్గు, కలది, స్త్రీ. స్తంభితుని భంగి, విలిఖితుని చందంబున, ఉత్కీర్ణుని పగిది, నియతుని లాగున, మూర్ఛితుని ప్రకారంబున, ఉన్మత్తుని తెఱంగున - ఉత్ప్రేక్షలు. మచ్చెకంటి - మచ్చెముల వంటి కన్నులు గలది - స్త్రీ. బహువ్రీహి. `బహువ్రీహిని సమాసాంత కార్యంబులుం గానంబడియెడి.' - బాల. సమాస. 22. సౌభాగ్య + ఛాయా - సౌభాగ్య + చ్ఛాయా - హ్రస్వమునకు ఛకారము పరము కాగా, ఛకారమునకు ద్విత్వము.

గీ. విప్రవేషంబుం దాల్చిన విష్ణుఁ డొక్కొ
బ్రాహ్మణుండైన శంబరారాతి యొక్కొ
బాడబాన్వయరూప[1]సంప్రభవుఁడైన
చందురుండొక్కొ యితఁడతిస్వచ్ఛమూర్తి. 38

అర్థము: అతి - స్వచ్ఛ - మూర్తి = మిక్కిలి, నిర్మలమైన, ఆకారము గలవాడు, అగు, ఇతఁడు, విప్ర - వేషంబున్ = బ్రాహ్మణుని యొక్క, వేషమును, తాల్చిన = ధరించిన, విష్ణుడు + ఒక్కొ = విష్ణుడా, బ్రాహ్మణుండు + ఐన, శంబర + అరాతి + ఒక్కొ = శంబరాసురునకు శత్రువైన మన్మథుడా, బాడబ + అన్వయ - రూప - సంప్రభవుండు = బ్రాహ్మణ కులము వాని యొక్క ఆ కారమున పుట్టుక గలవాడు, - బ్రాహ్మణాకారుడై పుట్టిన వాడు, ఐన, చందురుండు + ఒక్కొ = చంద్రుడా.

తాత్పర్యము: మిక్కిలి నిర్మలమైన ఆకారము గలవాడగు నీతడు బ్రాహ్మణ వేషమును ధరించిన విష్ణువా? మన్మథుడా? చంద్రుడా?

విశేషములు: `అతిస్వచ్ఛమూర్తి' అను సమాసమును `ఇతఁడు' అను దానికి విశేషణముగా జేసి అర్థము చెప్పబడినది. అట్లుగాక `ఇతండు'`అతి స్వచ్ఛమూర్తిన్' = మిక్కిలి నిర్మలమైన ఆకారమునందు అనియే నర్థము చెప్పనగును. ఇతడు విష్ణువా, మన్మథుడా, చంద్రుడా యని సందేహించుటచే సందేహాలంకారము. `ద్విజాత్యగ్రజన్మ భూదేవ బాడబాః విప్రశ్చ బ్రాహ్మణః'. బాడబాగ్ని రివాతృప్తో బాడబః - బడబాగ్ని వలె తృప్తి లేనివాడు. లేదా బడబా బ్రాహ్మణీ తస్యా అపత్య మితి బాడబః. బడబ యనగా బ్రాహ్మణ స్త్రీ. ఆమె వలన పుట్టిన వాడు బాడబుడు అనియైన చెప్పవచ్చును. విప్ర - విశేషేణ పాపేభ్యః ఆత్మానం పరం చ పాతీతి విప్రః, తన్నును పరునిని విశేషముగా పాపమునుండి రక్షించు వాడు. బ్రాహ్మణ - బ్రాహ్మణి పరబ్రహ్మణి నిష్ఠావత్త్వాత్ బ్రాహ్మణః. పరబ్రహ్మయందు నిష్ఠగలవాడు. లేదా బ్రహ్మణః కులే భవత్వాత్ బ్రాహ్మణః - బ్రహ్మ కులమున పుట్టినవాడు. అమరము. బాడబ - (నానా.) బడబాగ్ని, బ్రాహ్మణుఁడు. విష్ణుఁడు (ప్రకృతి) - వెన్నుఁడు (వికృతి), బ్రాహ్మణుఁడు - (ప్రకృతి) - బాపడు, బాపనుడు, బాఁడు (వికృతి). చందురుండు (వికృతి), చంద్రుండు (ప్రకృతి).

వ. అని యంతంతం జేరవచ్చి యయ్యంత్యజాతి సీమంతిని యశేష జన పూజనీయులు బ్రాహ్మణులని తమ కులంబు [2]పెద్దల వలన వినుటం జేసియుందా [3]నెందే నొక్క పూర్వజన్మకృత పుణ్యసంస్కార విశేషంబుననో బాల్యంబు [4]నాటనుండియు

1. తా. సంప్రభవమైన 2. తా.బ్రాహ్మణులవలన. 3. తానెద్ది. 4. తా.నాది.

రూపంబు వినయంబు దాక్షిణ్యంబు మధురాలాప కౌశలంబు నిస్సంగత ప్రశాంత మహానుభావంబు శుచిత్వంబు గౌరవంబు సద్భావంబు గుణంబులు నైసర్గికంబులయి యుండుటనో భర్గ ఫాల నయన కృశాను జ్వాలా జాలహేలా చుళుకితావయవుండు గాని కుసుమ కోదండుండునుం బోలెం గన్నులపండువై తప్త కాంచన వర్ణంబును గోరోచనా గౌరంబును జాంపేయ కుసుమ కేసర రేణు త్రసరేణు విసరాపిశంగంబును నగు దేహ [2]ప్రభా ప్రవాహంబున గహన షండం బశేషంబును వెలిగించువాని నుద్భిన్న నవశ్మశ్రు[3] నభినవ యౌవనోద్భాసితు షోడశవర్ష దేశీయు నాదిగర్భేశ్వరు నమాత్యనందను సుకుమారుంగుమార సన్నిభుండప్పుక చూచి భయ సంభ్రమ డోలాయమాన దంత తాటంక వలయం బగునట్లుగా నిబ్బరంపు గుబ్బచన్నుల బిబ్బోబకంబు బాహు మూల కూలంకషంబై యూప ద్వీలోకనీయం[4]బుగఁగేలుదోయి సేవాంజలి పుటంబు లలాటంబునం గీలించి యయ్యగారికి నమస్కారంబని యధర కిసలయంబునకు దశన రత్నాంకుర జ్యోత్స్నా కుసుమ స్తబకంబుగా సహకారపల్ల వాస్వాద కషాయ కంఠ కల కంఠ కామినీ కోమల కుహూకార కోలాహల కరంబిత పంచమరాగ ప్రపంచంబునకు మించుంజూపు కంఠస్వరంబునంబలికిన. 39

అర్థము: అని = పయి విధమున బలికి, ఆ + అంత్యజాతి - సీమంతిని = ఆ కడజాతి స్త్రీ - మాలెత, అంతంతన్ = కొంచెము దూరముగా, చేరన్ + వచ్చి = సమీపించి, బ్రాహ్మణులు, అశేష - జన - పూజనీయులు = ఎల్ల జనులచే పూజింపదగిన వారు, అని, తమ - కులంబు - పెద్దల వలనన్ = తమ కులము నందలి పెద్దవారి వలన, వినుటన్ + చేసియు = వినుటచేతను, తాను, ఎందున్ + ఏన్ = ఎచ్చటనైన, ఒక్క, పూర్వ - జన్మ - కృత - పుణ్య - సంస్కార - విశేషంబుననో = వెనుకటి పుట్టువునందు, చేయబడిన, పుణ్య కర్మ ఫలము యొక్క ఆధిక్యముచేతనో, బాల్యంబు - నాట నుండియున్ = చిన్నతనమునుండి యును, రూపంబు = అందము, వినయంబు = అడకువ, దాక్షిణ్యంబు = ఒద్దిక, మధుర + ఆలాప - కౌశలంబు = తీయని మాటలందు నేర్పు, నిస్సంగత = ఇతరులతో గూడమి, ప్రశాంత - మహత్ (మహా) + అనుభావంబు = అధికమైన శాంత మనెడు గొప్ప బుద్ధి, శుచిత్వంబు = పరిశుద్ధత, గౌరవంబు = మన్నన, సత్ + భావంబు = మంచి తలంపు, గుణంబులు, నై సర్గికంబులు = సహజములు, అయి + ఉండుటనో = అయి యుండుటచేతనో, భర్గ .... తావయవుండు: భర్గ = ఈశ్వరుని యొక్క, ఫాల = నుదుటియందలి, నయన = కంటియందలి, కృశాను = అగ్నియొక్క, జ్వాలా = మంటలయొక్క, జాల = సమూహము యొక్క, హేలా = విలాసము చేత, చుళుకిత = పుడిసిలింప బడిన, అవయవుండు = అంగములు గలవాడు, కాని = కానియట్టి, కుసుమ కోదండుండునున్ + పోలెన్ = పువ్విలు కాని (మన్మథుని)

1. తా. ప్రసంగంబును 2. తా. ప్రభావంబున. 3. తా.నభినవ 4. తా.బగు.

వలె, కన్నులపండువు + ఐ = కనువిందుగలిగించు వాడయి, తప్త - కాంచన - వర్ణంబును = పుటమువేయబడిన, బంగారము, కాంతిగలదియు, గోరోచనా గౌరంబును = గోరో జనము వలె, పసుపు పచ్చనిదియు, చాంపేయ .... పిశంగంబును : చాంపేయ - కుసుమ = సంపెంగ పువ్వు యొక్క, కేసర = కింజల్కముల యొక్క, రేణు = పొడియొక్క, త్రసరేణు = ముప్పది పరమాణువుల కొలదుల, విసర = సమూహము వలె, పిశంగంబును = పింగళవర్ణము గలదియు, అగు, దేహ - ప్రభా - ప్రవాహంబునన్ = శరీరము యొక్క, కాంతి యొక్క, ప్రవాహము చేత, గహన - షండంబు = అడవి మొత్తమును, అశేషంబును = అంతను, వెలిగించు - వానిన్ = ప్రకాశింపజేయు వానిని, ఉద్భిన్న ..... శ్మశ్రున్ : ఉద్భిన్న = మొలచిన, నవ = క్రొత్తదియగు, శ్మశ్రున్ = మీసము, గడ్డము గలవానిని, అభినవ - యౌవన + ఉద్భాసితున్ = క్రొత్త, పడుచుదనముచే, ప్రకాశించువానిని, షోడశ - వర్ష - దేశీయున్ = కొంచెము తక్కువగా పదునాఱేండ్ల వయసు వానిని, ఆదిగర్భేశ్వరున్ = పుట్టుకతో నైశ్వర్యవంతుడయిన వానిని, అమాత్య - నందనున్ = మంత్రి కొడుకును, సుకుమారున్, కుమార - సన్నిభున్ = కుమార స్వామితో సమానుడైన వానిని, తప్పక - చూచి = తదేక దృష్టితో జూచి, భయ ...... వలయంబు: భయ = వెఱపు వలని, సంభ్రమ = వేగిరపాటుచేత, డోలాయమాన = ఊయల వలె నూగుచున్న, దంత - తాటంక - వలయంబు = దంతముతో చేయబడిన, చెవికమ్మల, కుండలములు గలది, అగు + అట్లు + కాన్, నిబ్బరపు - గుబ్బ - చన్నుల - బిబ్బోకంబు = దృఢములు, గుండ్రనివి యగు స్తనముల యొక్క, విలాసము, బాహుమూల - కూలంకషంబు + ఐ = చంకలను ఒరయునట్టి దయి, ఈషత్ + విలోకనీయంబుగన్ = కొంచెము కనదగినట్లుగా, కేలు - దోయి = చేతుల జంట యొక్క, సేవా + అంజలి - పుటంబు = దొప్పవంటి సేవనుదెలుపు దోయిలి, లలాటంబునన్ = నుదుట, కీలించి = ఘటించి, అయ్యగారికిన్, నమస్కారంబు + అని, అధర - కిసలయంబునకున్ = చివురువంటి క్రింది పెదవికి, దశన - రత్న + అంకుర - జ్యోత్స్న = మణుల మొలకల వంటి దంతము లనెడి వెన్నెల, కుసుమ - స్తబకంబు + కాన్ = పూలగుత్తి కాగా, సహకార ..... ప్రపంచంబునకున్: సహకార = తీయమామిడి చెట్టు యొక్క, పల్లవ = చివుళ్ల యొక్క, ఆస్వాద = తినుట చేత, కషాయ = ఒగరైన, కంఠ = ఎలుగుగల, కలకంఠ - కామినీ = ఆడుకోయిల యొక్క, కోమల = మృదువైన, కుహూకార = కుహూ యను ధ్వనుల యొక్క, కోలాహల = కలకలమునందు, కరంబిత = మిశ్రితమైన, పంచమ - రాగ = పంచమ రాగము యొక్క, ప్రపంచంబునకున్ = విస్తారమునకు, మించున్ + చూపు = అతిశయమును చూపు - పంచమ రాగవిస్తారమును మించునట్టి యనుట, కంఠ - స్వరంబునన్ = ఎలుగుతో, పలికినన్ = పలుకగా.

తాత్పర్యము: పయిరీతిగా పలికి ఆ కడజాతి నాతి యించుక దూరమున నిలిచి బ్రాహ్మణులు ఎల్ల జనులకును పూజింపదగిన వారని తమ కులమునందలి పెద్దవారి నుండి వినుట చేతను, దా నేదే నొక పూర్వజన్మము నందు చేసిన పుణ్యకర్మఫలా ధిక్యము చేతనో, చిన్న తనము నుండియు అందము, అడకువ, ఒద్దిక, తీయగా `మాటాడు నేర్పు, పెఱవారిని గూడమి, శాంతము, పరిశుద్ధత, మన్నన, మంచితలపు, సద్గుణములు సహజములయి యుండుట చేతనో, యీశ్వరుని నొసటి కంటి నిప్పుమంటల సమూహముచే దహింపబడని మన్మథుని వలె కనువిందు గలిగించు వాడయి, పుటములేయబడిన బంగారుకాంతి గలదియు, గోరోజనము వలె పసుపు పచ్చనిదియు, సంపెంగ పూవు పుప్పొడులవలె పింగళవర్ణము గలదియు నైన శరీరకాంతిచే నరణ్యప్రదేశము నంతను ప్రకాశింపజేయునట్టియు, నూనూగు మీసములు గడ్డము గలట్టియు, నూత్న యౌవనముచే నొప్పు నట్టియు, నించుక తక్కువగా పదునాఱేండ్ల ప్రాయము గలట్టియు, పుట్టుకతో నైశ్వర్యవంతుడయి నట్టియు, మంత్రికుమారుడగు సుకుమారుని కుమారస్వామితో సమానుడైన వానిని తదేక దృష్టితో చూచి, వెఱపు వలని వేగిరపాటుచే నూగులాడు చెవికమ్మలు గలుగునట్లుగా గొప్పదియు, గుండ్రనిదియునైన చనుదోయి చంకల వఱకు వ్యాపించినట్టిదయి యించుక కనిపించునట్లు రెండుచేతుల నెత్తి నమస్కారముగా నుదుట బెట్టి `అయ్యగారికి దండం'బని చివురువంటి క్రింది పెదవికి మణుల మొలకల వంటి దంతముల కాంతియను వెన్నెల పూలగుత్తి కాగా, తీయమామిడి చివురులను మెసవుటచే నొగరైన యెలుగు గల యాడుకోయిల మృదువైన కుహూధ్వనుల కలకలము నందు గూడిన పంచమ రాగమును మించునట్టి యెలుగుతో పలుకగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: అంతంతం జేర వచ్చి - తాను కడజాతిది, అతడగ్ర జాతివాడు అను భావముతో నించుక దూరముగనే సమీపించి, చుళుకితావయవుండు - శరీరావయవములు బూదియైనప్పుడు పుడిసిట నడగును. షోడశవర్షదేశీయు - `దేశీయ' యనుప్రత్యయ మించుక తక్కువ యను నర్థమున వచ్చును. ఇంచుక తక్కువగా పదునాఱేండ్లు గలవాడని యర్థము. ఈ యర్థమున కల్ప, దేశ్యప్రత్యయములును గలవు. త్రసరేణు = ముప్పది పరమాణువుల కొలది, అణు పరమాణువుల కొలది - సూ.ని., మాలెతయగునామెకు ఉత్తమ కులమున బుట్టిన సుకుమారుని చూడగనే భయసంభ్రమములు గలిగి చెవికమ్మలూగినవి. ఆమె కేలుదోయిని పయికెత్తి నొసట నమస్కారార్థము కీలించినప్పుడు బాహు మూలముల నొరయు నామె చనుదోయి యించుక కానవచ్చినది. అయ్యగారికి - ఈ మాటలో నామె సహజవినయము, తాను తక్కువ జాతి దాననను న్యూనభావము గోచరించుచున్నది. ఆమె అధరము కిసలయము వలె నున్నది. పలికినప్పుడామె దంత కాంతి దానికి పూలగుత్తి వలె నున్నది. ఆమె

యెలుగు కోయిల యొగరుటెలుగు నందలి పంచమస్వరమును మించి యున్నదనుట. అలంకారము స్వభావోక్తి.

గీ. వెలఁది మాలెత గాన దీవింపకయును
నొప్పెడిది గాన నూరకయుండకయును
ధరణిదేవుండు గైకొనె దాని మ్రొక్కు
గేలుఁదామర తిర్యగాందోళనమున 39

అర్థము: వెలఁది = స్త్రీ, మాలెత = మాలది, కానన్ = కావున, దీవింపకయును = ఆశీర్వదింపకుండను, ఒప్పెడిది =ఒప్పునట్టిది, కానన్, ఊరక + ఉండకయును = దీవింపకుండకయును, ధరణి -దేవుండు =బ్రాహ్మణుడు-సుకుమారుడు, దాని = అమాలెత యొక్క, మ్రొక్కు-కేలు + తామర = నమస్కరించునట్టి తామర వంటి చేయి, తిర్యక్ + ఆందోళమునన్ = అడ్డముగా నూపుటచే-కైకొనుటయా, మానుటయా అను మనసు ఉరియాటతో, కైకొనెన్ = స్వీకరించెను.

తాత్పర్యము: ఆమె అంత్యకులమునకు చెందినది కావున నామె నమస్కారమునకు ప్రతిగా దీవింపకుండను, ఆమె ఒప్పుచున్నది కావున దీవింపకుండకయును బ్రాహ్మణుడగు సుకుమారుడామె మ్రొక్కును స్వీకరించుటయా మానుటయా యను మనసు నురియాటతో స్వీకరించెను.

విశేషములు: తాను బ్రాహ్మణుడును, ఆమె మాలెతయుగావున నామె నమస్కరించినప్పుడు అంగీకార సూచకముగా నామెను దీవింపరాదు. కాని ఆమె ఆకారము చేతను గుణములచేతను ఒప్పుచున్నది కావున నామెను దీవింపకుండరాదు. ఇట్లు సుకుమారుని మనసు ఉరియాడి యామె మ్రొక్కుగైకొనెను. మ్రొక్కు+కేలు+తామర - ఉదంత స్త్రీ సమములకుం బరుషములు పరములగు చుండగా నుగాగమము, పిమ్మట ద్రుతకార్యము జరుగగా మ్రొక్కుం గేలుం దామర. సిద్ధించును. బాల సంధి 25, 16, 17తిర్యక్ + ఆందోళనము-ఝల్లునకు అచ్చుపరమగు చుండగా, తృతీయ వర్ణాదేశము-తిర్యగాందోళనము ఒప్పెడి + అది_అదియవి శబ్దంబుల యత్తునకు .వృత్తిని లోపంబు బహూళంబుగానగు. బాల . సంధి. 45

45 శంబరవైరిసన్నిభునిఁ జారుతరోజ్జ్వలమూర్తి విప్రర
త్నంబు మహాప్రధాను ప్రియనందునిన్ సుకుమారుఁ జూచి ప్రే
మంబు వహించియుం గొమరు మాలెత గన్నుల నవ్వు దేరగా
[1]సంబళి సంబళీ యళుకు సందడికిం దలమంచుఁ బల్కుచున్ 41

అర్థము: కొమరు-మాలెత = ఒప్పునట్టి -పడుచుదియగు, మాలెత, శంబర-వైరి-సన్నిభునిన్ = శంబరుడును రాక్షసునకు విరోధియగు మన్మథునితో సమానుడును,

1. తా. శంబళి శంబళీ యరకు

చారుతర + ఉజ్జ్వల-మూర్తిన్ = మిక్కిలి మనోహరము, ప్రకాశవంతమునైన ఆకారము గలవాడును, విప్ర-రత్నంబున్ = బ్రాహ్మణశ్రేష్ఠుడును, మహా - ప్రధాను-ప్రియ-నందునిన్ =మహామంత్రి అనుగు కొడుకును, (అగు), సుకుమారున్ = సుకుమారుని, చూచి, ప్రేమంబు = ప్రీతి, వహించియున్ = పూనియు, కన్నులన్ = కనులందు, నవ్వు, తేరగాన్ = పుట్టగా, సంబళి-సంబళీ = తొలగుడు తొలగుడు, అళుకు = భయము, సందడికిన్ = స్పర్శమునకు, తలము = అతిశయము, అంచున్ = అనుచు, పల్కుచున్ = పలుకుచు.

తాత్పర్యము: పడుచు మాలెత మన్మథ సమానుడును, మనోహరము, ప్రకాశవంతము నగు రూపము గలవాడును, బ్రాహ్మణ శ్రేష్ఠుడును, మహామంత్రి ప్రియ పుత్త్రుడును అగు సుకుమారుని చూచి ప్రీతి వహించియును కన్నులలో నవ్వు పొడమగా 'తొలగుడు తొలగుడు వెఱపు స్పర్శమును మించినది' యని పలుకుచు - పయి పద్యముతో నన్వయము.

విశేషములు: విప్రరత్నంబు = రత్నమువంటి విప్రుడు = ఉపమానోత్తర పద కర్మ ధారయము. విప్రుల రత్నమని షష్ఠీతత్పురుషముగా కూడ చెప్పవచ్చును కాని. షష్ఠీ సమాసాత్ కర్మధారయో బలీయాన్'అను న్యాయముచే కర్మధారయమే శాస్త్ర సమ్మతము. 'రత్నం చ అసౌ విప్రః-విప్రరత్నం' అనికాని విప్రః రత్నమివ అనికాని చెప్పవలయును. రత్నాది పదములు నియతలింగము లగుటచే లింగవ్యత్యయము లేకయే భిన్న లింగక పదములతో సామానాధి కరణ్యమును పొందును. కన్నుల నవ్వు దేరుట ప్రీతిమూలకము. శృంగార చేష్టా విశేషము. సంబళి, సంబళీ = తొలగుము. 'చనియె సంబళి సంబళి యనుచుఁ బంక, జాప్తకుల పుంగవుండు వచ్చు నంగడికిని' హరిశ్చం. 4.216. అళుకు సందడికిం దలము - అళుకు (భయము), సందడి (స్పర్శము) అనువానిలో అళుకే సందడిని మించినది. అనగా మాలెత బ్రాహ్మణుని తాకెనను భయమే మించినది కావున తొలగు డనుట.

గీ. బ్రాహ్మణుఁడు గాన లజ్జింపఁ బ్రాప్తి లేక
బాల ప్రౌఢయవోలెఁ దప్పకయ చూచి
చాటువడి యుండుమయ్య యీ సరిసిలోన
నుదక మాడెదఁ[1] గాక పిన్నదియు నేను 42

అర్థము: బ్రాహ్మణుఁడు-కానన్ = అతడు బ్రాహ్మణకులుడు కాబట్టి, లజ్జింపన్ = సిగ్గుపడుటకు, ప్రాప్తి = పొందుట, లేక, బాల = మాల పిల్ల, ప్రౌఢ + + పోలెన్ = ప్రోఢయే యనునట్లు, తప్పక + అ -చూచి = తదేక దృష్టితో చూచి, ఈ -

1. తా.గాని.

సరసిలోనన్ = ఈ సరస్సులో, పిన్నదియున్ = చిన్నదియగు నా చెలియును, ఏనున్ = నేనును, ఉదకము + ఆడెదన్ + కాక =స్నానము చేయుదును గాక, చాటు + పడి + ఉండుము + అయ్య = ముంగునకేగి యుండుము.

తాత్పర్యము: ఆ మాలెత అతడు బ్రాహ్మణుడు గావున సిగ్గుపడక ప్రౌఢాంగనయే యను విధమున నతనిని తదేక దృష్టితో చూచి `నేనును చెలియును, సరస్సులో స్నానము చేయుదుము. నీవు మఱుగున కేగుము.

విశేషములు: బ్రాహ్మణుడు గాన లజ్జింప బ్రాప్తిలేక - అతడు అగ్రజాతివాడును, తాను కడజాతిదియుగావున నతనివలన తన కెట్టి యాపదయును కలుగదని ధైర్యము. కావుననే యామె యతనిని జూచి యామె లజ్జింపలేదు. పైగా బాలయయ్యును ప్రౌఢవలె చూచినది. స్వజాతివానివలన భయపడవలయును గాని యస్పృశ్యయైన త న్నగ్రజాతి వాడేమి చేయునని యామెధైర్యము.`కాక' యను పాఠము కంటె `కాని' యను పాఠమే మేలనిపించుచున్నది. నేనును చెలియును స్నానము చేయుదుము గాని నీవు ముందున కరుగుము అనుట వ్యవహారమునకు దగ్గఱ. పిన్నదియు నేను ఉదక మాడెద. కర్త బహువచనమున నున్నది కావున క్రియయు `ఆడెదము' అను రీతిని బహువచనము నుండదగును. ఏకవచనమున నుండుట విచార్యము.

క. *అని పలుకుచుఁ గొలనికి డిగఁ
జని మాలప్రమద దాను సఖియు నొనర్చెన్
వనకేళి తరగ లురు
స్తనభారాస్ఫాలనమున జర్జరములు గాన్ 43

అర్థము: అని పలుకుచున్, మాల-ప్రమద = మాలెత, కొలనికిన్ = సరస్సులోనికి, డిగన్ + చని = దిగునట్లు వెడలి, సఖియున్ = చెలికత్తెయును, తానున్, తరంగలు = అలలు, ఉరు -స్తన-భార + ఆస్ఫాలనమునన్ = పెద్దది యగు, కుచముల, బరువు యొక్క, చఱచుటచె, జర్జరములు + కాన్ = తునియలు కాగా, వన-కేళి = జలక్రీడ ఒనర్చెన్ = చేసెను.

తాత్పర్యము: అని పలుకుచు నా మాలెత సఖీ సమేతముగా కొలనిలోనికి దిగి పెద్దవియగు తమ కుచముల బరువుల చఱపులచే నలలు తునియలు కాగా జలక్రీడలాడెను.

విశేషములు: మాల శబ్దము సంస్కృతము నను, తెలుగునను మార్పులేక ఒకే విధముగ నుండును. మాల ప్రమద యను సమాసమున సంస్కృతము మాల ప్రమద దాను సఖియు నొనర్చెన్ - 'ఆత్మార్థం బఖి హితం బగుచోఁదల్లింగ

---
* తాళపత్రమున లేదు.

సంఖ్యాభిధాయి వచనంబు ధాతు విశేషణంబుల కగు' బాల -క్రియ 120 ఉరుస్తన .....జర్జరములు గాన్' అనుటచే తత్స్తన ఘనతా కఠినతలు తెలియుచున్నవి.

చ. పడఁతి పసిండి డాలు[1] గనుపట్టు [2]హరిద్ర ప్రతి ప్రతీకముం
దొడసి సరోవరాంబువునఁ దోఁగి పయోనిధి తీరభూమికి
న్వెడలి ధరాసుపర్వునకు నేత్రమహోత్సవ మయ్యెనప్పుడ
ప్పుడు కలశాబ్ధి మధ్యమునఁ బుట్టిన యాదిమలక్ష్మియోయనన్. 44

అర్థము: అప్పుడు = ఆ సమయమున = స్త్రీ (మాలెత), పసిండి-డాలు = బంగారుకాంతి, కనుపట్టన్ = కనిపించునట్లు, హరిద్ర = పసుపు, ప్రతి - ప్రతీకమున్ = ప్రత్యవయవమును, తొడసి = కడిగి, సరోవర + అంబువునన్ = సరస్సు జలమునందు, తోఁగి = మునిగి, (స్నానము చేసి), పయోనిధి-తీర-భూమికిన్ = సరస్సు ఒడ్డుమీదికి, వెడలి, అప్పుడు + అ = అప్పుడే, కలశ + అబ్ధి - మధ్యమునన్ = క్షీరసముద్రము నడుమ, పుట్టిన, ఆదిమ - లక్ష్మి + ఓ = మొదటి లక్ష్మీదేవియో, అనన్ = అనునట్లు, ధరా -సుపర్వునకున్ = బ్రాహ్మణునకు - సుకుమారునకు, నేత్ర - మహత్ (మహా) + ఉత్సవము = కన్నులకు గొప్ప పండువు, అయ్యెన్.

తాత్పర్యము: ఆ సమయమున నా మాలెత బంగరు కాంతి కనబడునట్లు ప్రత్యవయమును పసుపు పోవునట్లు కడిగి సరస్సు జలములలో స్నానము చేసి యొడ్డు మీదికి వచ్చి అప్పుడే క్షీరసముద్రము నడుమ పుట్టిన మొదటి లక్ష్మియో యనునట్లు బ్రాహ్మణుడైన సుకుమారునకు కనువిందొనర్చెను.

విశేషములు: పయోనిధి తీరభూమికిన్ - పయోనిధియనగా సముద్రము. ఇచ్చట చెఱువను నర్థముననే ప్రయోగింపబడినది. అమృతము కొఱకు దేవదానవులు క్షీర సముద్రమును మథింపగా అందుండి లక్ష్మి వెలువడిన వృత్తాంతము నిట అనుసంధించునది. `అప్పుడ'అని కాక, మొదటి `అప్పుడు'ను `అయ్యెన్' అనుక్రియతోను, `అప్పుడ' అను దానిని `పుట్టిన' అను నసమాపకక్రియతోను అన్వయించుటయైనది.

గీ. కొలను వెలువడి తడి నూలు వలువ విడిచి
మఱుఁగు పుట్టంబు గట్టి యమ్మగువ యొప్పె
[3]జలద మెడవడి వర్షావసాన వేళఁ
గాశకుసుమాట్టహాస సంగతియుఁ బోలె 45

అర్థము: ఆ + మగువ = ఆ స్త్రీ (మాలెత), కొలను = వెలువడి = సరస్సునుండి వెలికి వచ్చి, తడి- నూలు-వలునన్ = తడసిన నూలు వస్త్రమును,

1. గలపచ్చ. 2. ము. హరిద్రముఁ దీరపంకముం 3. ము. తా జలధి వెలువడి

విడిచి, మణుగు-పుట్టంబు = ఉదికిన, వస్త్రము, కట్టి, జలదము = మేఘము, ఎడ+పడి = ఎడతెగి (పోయి), వర్షా+అవసాన - వేళన్ = శరత్కాలమునందు, కాశ - కుసుమ + అట్ట హాస - సంగతియున్ + పోలెన్ = తెల్లు, పూవు యొక్క, పెద్ద నవ్వు యొక్క, విధమువలె, ఒప్పెన్.

తాత్పర్యము: ఆ మాలెత సరస్సునుండి వెలికి వచ్చి తడి బట్టవిడిచి ఉదికిన చీర ధరించి, మబ్బులు పోయి శరత్కాలమునందలి తెల్లు పూల వికాసము వలె నొప్పెను.

విశేషములు: శరత్కాలమున మేఘము లుండవు. తెల్లుపూలు బాగుగా వికసించును కాశ-కుసుమాట్టహాసము - తెల్లుపూల పూతను జూడగా అట్టహాసము వలెనే యుండును. శరత్కాలమనక, వర్షావసానమనుట వర్షర్తువునతడిసి శరత్తు రాగానే వికసించు తెల్లుపూల పూతతో కొలన తడిసిన బట్ట విడిచి పొడి బట్ట ధరించిన మాలెతకు సామ్యము సిద్ధించుటకు. హాసము తెలుపని కవిసమయము తెల్లు పూలపూత తెల్లగా నుండి అట్టహాసము వలెనే యుండును. అలంకార ముపమ. కొలను వెడువడి - అపాయార్థమునం గొలను శబ్దమునకు వలన వర్ణకమై (బాల.కాంక్ష.9) దానికి `ఉండి' శబ్దమను ప్రయుక్తమై (బాల.కారక10), `ఉండి'పరముగా వలనకు ద్వితీయయై (బాల.కారక. 11), ఆ ద్వితీయ మీది `ఉండి'కిలోపము వచ్చి (ప్రౌఢ.కారక11)కొలను వెలువడి సిద్ధించును. మడుంగు -(రూపాం)మణుంగు. `అడంగ్వాదుల డాకు ణకారంబు విభాషనగు'(బాల. ప్రకీర్ణక. 13)సంగతి = లాగు, విధము, రీతి (సూ.ని.) `శిబి సంగతి, మాంధాతనయముననుు, యయాతి కరణి.......'హంస. 1-42

ఉ. ఆ కలకంఠి యొయ్యఁదడియార్చునెడన్ జఘనాంతికంబులై
[1]కేకికలాపలీల నణకించి మధువ్రత మాలికాకృతిం
గైకొని యింద్రనీలమణిఖండవిలాసమలిమ్లుచంబులై
చీకఁటి కొల్పె బ్రాహ్మణుని చిత్తము పెన్నెఱిసోగ వెంద్రుకల్ 46

అర్థము: ఆ -కలకంఠి = ఇంపైన కంఠధ్వని గల ఆ మాలెత, ఒయ్యన్ = మెల్లగా, తడి + ఆర్చు + ఎడన్ = తడి యాఱబెట్టు కొను సమయమున, పెను + నెఱి -సోగ -వెంద్రుకల్ =పెద్ద, అందమైన, పొడవైన శిరోజములు, జఘన + అంతికంబులు + ఐ = పిఱుదువఱకు సాగునవయి, కేకి -కలాప-లీలన్ = నెమలి, పింఛము యొక్క, విధమును, అణకించి = అపహసించి, మధు - వ్రత - మాలికా + అకృతిన్ = తుమ్మెదల యొక్క, పంక్తి యొక్క, ఆకారమును, కైకొని =స్వీకరించి,

1. తా. కేకరలోపలీల

ఇంద్రనీల-మణి-ఖండ-విలాస-మలిమ్లుచంబులు + ఐ = ఇంద్రనీల మణియొక్క, ముక్కల యొక్క, మెఱపు యొక్క, దొంగలయి, బ్రాహ్మణుని - చిత్తము = బ్రాహ్మణుడగు సుకుమారుని మనస్సు (ను), చీకటి -కొల్పెన్= అంధకారము చేసెను.

తాత్పర్యము: ఇంపయిన కంఠధ్వనిగల ఆ మాలెత తన రమ్యములు, దీర్ఘములు నైన శిరోజములను తడియాఱబెట్టుకొను సమయమున నవి పిఱుదులవఱకు సాగినవై, నెమలి పింఛము విధము నపహసించినవయి, తుమ్మెదల పంక్తి యాకారమును స్వీకరించినవై, ఇంద్ర నీల మణి శకలముల ప్రకాశమును దొంగిలించినవయి బ్రాహ్మణుడైన సుకుమారుని మనస్సు నంధకారము చేసెను.

విశేషములు: జఘనాంతికంబులై - వెండ్రుకల నిగతనమును సూచించును. 'కేకి కలాప లీల నణకించుట', మధువ్రతమాలికా కృతింగైకొనుట','ఇంద్రనీల మణిఖండ విలాసమలిమ్లుచము లగుట' ఆ వెండ్రుకల నైల్యమునకు సూచకములు. ఇంద్రనీల మణులనక, తత్ ఖండములనుట అధికతర నైల్య సంపాదనము కొఱకు. 'కేకికలాపలీల నణకించి'-ఉపమేయమయిన 'వెండ్రుకలకంటె' ఉపమానమైన 'కేకికలాపలీల'కాధిక్యము చెప్పబడుటచే వ్యతిరేకాలంకారము. 'మధువ్రతమాలికాకృతిం గైకొనుట, ఇంద్రనీలమణి ఖండ విలాసమలి మ్లుచము'లగుట అనువానియందు ఉపమాలంకారము. 'ఆకృతిం గైకొను','మలిమ్లుచంబులై' అనునవి ఉపమావాచకములు. వెండ్రుకలు నల్లనివి గావున సుకుమారుని చిత్తమును చీకటి కొల్పెను. అనగా నలుపు చేసెను. తమోమయము చేసెననుట.

ఆర్చు + ఎడన్ - 'ఉదంత మగు; తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు'బాల సంధి. 33 తడియార్చు నెడన్ పెను + నెఱి పదాంతంబులయి యసంయుక్తంబులయిన నులురుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు' బాల. ప్రకీర్ణక. 16. - పెన్నెఱి 'వెండ్రుకల'ను'మధువ్రత మాలికాకృతి'తోను, 'ఇంద్రనీల మణిఖండ విలాసము'తోను అనేక వస్తువులతో పోల్చుటచే నుల్లేఖమును.

గీ. చికురసంతతి నీరార్చి చెలువ తుఱిమె
సేసకొ ప్పాక (యింత దక్షిణము మలఁగ)
చన్నుగవ[1]సొంపు కక్ష[2]దేశముల మెఱుంగు
బ్రాహ్మణుని యాత్మఁ బల్లవింపంగఁ జేయ 47

అర్థము: చెలువ = స్త్రీ (మాలెత), చికుర-సంతతిన్ = వెండ్రుకల, సమూహమును, నీరు + ఆర్చి =. తడియాఱ బెట్టి, చన్ను + కవ = చనుదోయి యొక్క, సొంపు = అందము, కక్ష-దేశముల-మెఱుంగు = చంకలయొక్క కాంతి బ్రాహ్మణుని- ఆత్మన్

1. తా. నొప్పు. 2. తా. దేశమున.

= బ్రాహ్మణుడైన సుకుమారుని యొక్క మనస్సును, పలవింపన్ + చేయన్ = చివురించినట్లు చేయగా - ఆనందించునట్లు చేయగా, సేస - కొప్పు = కొండె సిగ, ఒక + ఇంత = కొంచెము, దక్షిణము - మలంగన్ = కుడివైపు తిరుగునట్లు, తుఱిమెన్ = ముడిచెను.

తాత్పర్యము: మాలెత తన వెంట్రుకలను తడియాఱజేసి, యించుక కుడివైపొఱగునట్లు కొండెసిగను ముడిచెను. ఆ పనిలో నామె చనుగవ సొంపును బాహుమూలముల కాంతియు నా సుకుమారుని కంటబడి యాతని మనస్సు ఆనందించెను.

విశేషములు: అలంకారము స్వభావోక్తి. చన్ను + కవ ఉదంత స్త్రీ సమమునకుం బరుషము పరమగుచుండగా నుగాగమము, (బాల. సంధి. 25), పిమ్మట ద్రుతకార్యము (బాల.సంధి. 16, 17)చన్నుంగవ.

గీ. దంతతాటంకచక్రమధ్యంబునందు
బాల కీలించెఁ గంకేళి పల్లవంబు
బాడబుని నేయఁదలంచు శంబర రిపునకుఁ
బ్రథమమదియ నమస్కారబాణ మయ్యె 48.

అర్థము: దంత-తాటంక-చక్ర-మధ్యంబు + అందున్ =దంత నిర్మితమైన చెవికమ్మల, వలయముల నడుమ, బాల = కన్య (మాలెత), కంకేళి - పల్లవంబున్ = అశోక వృక్షము యొక్క చిగురును, కీలించెన్ = పెట్టెను. అది + అ = ఆ కంకేళిపల్లవమే, బాడబునిన్ =బ్రాహ్మణుని - సుకుమారుని, ఏయన్ + తలంచు = కొట్టనెంచు, శంబర-రిపునకున్ = శంబరాసురునకు శత్రువైన మన్మథునకు, ప్రథమము = మొదటిది యగు, నమస్కార - బాణము, అయ్యెన్.

తాత్పర్యము: ఆ మాల పడుచు దంతనిర్మితమైన చెవికమ్మల వలయముల నడుమ నశోక వృక్షపుచివురును ధరించెను. అదియే బ్రాహ్మణుడైన సుకుమారుని గొట్టనెంచు మన్మథునకు మొదటి నమస్కారబాణ మయ్యెను.

విశేషములు: మాన్యులైన వారితో యుద్ధము చేయవలసి వచ్చినప్పుడు యోధులు మొదట వారిపై గౌరవ సూచకముగా నమస్కార బాణమును వేయుదురు. ఇచ్చట సుకుమారు డగ్రజాతివాడు గావున మన్మథునకు మాన్యుడు. అందుచే నతడు మొదట వానిపై నమస్కార బాణమును వేయవలయును. పుష్పబాణుడైన మన్మథునకు ఆ మాలెత చెవికమ్మలవలయములందు ధరించిన కంకేళి పల్లవమే సుకుమారునిపై ప్రయోగించు తొలి నమస్కార బాణముగా నయ్యెను. అనగా నామె చెవి కమ్మలందు ధరించిన కంకేళిపల్లవ మంత మోహజనకముగా నుండెనని భావము.

గీ. పూనెఁ గుచముల వెలివాడ పువ్వుబోణి
విప్పు గలయట్టి బండి గుర్వెంద సరముఁ
బ్రథమరాగ రసోద[1]య రక్తమైన
సచివనందను హృదయజసంగరమున 49

అర్థము: ప్రథమ-రాగ-రస + ఉదయ-రక్తము + ఐన = తొలి వలపునందు శృంగార రసము నుదయముచే ననురక్తమైన, సచివ - నందును =మంత్రి కొడుకైన సుకుమారుని యొక్క, హృదయజ -సంగరమునన్ = హృదయమునందుపుట్టిన యంగీకారముచే, వెలివాడ -పువ్వుబోణి = పూవువంటి మేను గల యా మాల పడుచు, కుచములన్ = స్తనములయందు, విప్పు-కల + అట్టి - బండి గుర్వెంద-సరమున్=విరిసిన మాధవీపుష్పముల దండను, పూనెన్ = తాల్చెను.

తాత్పర్యము: తొలివలపునందు శృంగార రసోదయముచే ననురక్తమైన సుకుమారుని మనస్సునందు పుట్టిన యంగీకారముచే పూబోడియగు నా మాలెత విరిసిన మాధవీపుష్పముల మాలను తన స్తనములందు తాల్చెను.

విశేషము: తొలి వలపునందు శృంగార రసముదయించి సుకుమారుని మనస్సనురక్తమయి యా మాలెతను పొందుటకు సమ్మతించెను ఆ సమయమున నా మాలపడుచు తన స్తనములందు విరిసిన బండి గురివెంద పూల మాలను ధరించెనని భావము.

వ. అప్పుడు సుకుమారుండు నిజాంతర్గతంబున 50

అర్థము: అప్పుడు, సుకుమారుండు, నిజ+అంతర్గతంబునన్ = తనదైన మనస్సునందు.

తాత్పర్యము: అప్పుడు సుకుమారుడు తన మనస్సులో తరువాతి పద్యముతో నన్వయము.

సీ. ఏల చేయండు శేషేంద్రియంబులు నాల్గు
నలిగినగర్భుండు లోచనములు గాఁగ
నెట్టు గల్గె విధాత కీ రూపనిర్మాణ
పరమాణువులు కోటి పరిమితంబు
లజుఁడు దీని సృజించి యాత్మ నువ్విళ్ళూర
కెట్లుండుఁ గూంతు మోహించినాఁడు
కల్పింపఁబోలు శృంగార [2]సర్గంబున
దీని వాక్పతి [3]యున్నతి ఫలియించె

1. తా యార్రక్తమైన. 2. తా. సర్వంబున 3. తా యున్మది భవించి

గీ. దీని [1]నిఖిలావయవములు తీర్చి తీర్చి
చేయునపుడు ప్రయాసంబుఁ జెందుటయును
నొయ్య నొయ్యన బ్రహ్మ నిట్టూర్పుపుచ్చె
నది సుమీ పుష్పసమయమందానిలంబు 51

అర్థము: నలిన - గర్భుడు = తమ్మిచూలి - బ్రహ్మ, శేష + ఇంద్రియంబులు - నాల్గున్ = కన్నులు గాక తక్కిన శ్రోత్రములు, త్వక్కు, కన్నులు గాక తక్కిన శ్రోత్రములు, త్వక్కు జిహ్వ, నాసిక అను జ్ఞానేంద్రియములు నాల్గును, లోచనములు = కన్నులు, కాఁగన్ = అగునట్లు, ఏల -చేయండు = ఎందులకు చేయడు? విధాతకున్ = బ్రహ్మకు, ఈ - రూప - నిర్మాణ- పరమ +అణువులు = ఈమె ఆకారము యొక్క సృష్టికైన పరమాణువులు, కోటి -పరిమితంబులు = కోట్ల కొలది గలవి, ఎట్టు = ఎట్లు, కల్గెన్ = కలిగెను? అజుఁడు =బ్రహ్మ, దీనిన్ = ఈమెను, నిర్మించి = సృజించి, కూతున్ = కొమారితను, మోహించినాడు = మోహించినట్టివాడు, ఆత్మన్ = మనస్సునందు, ఉవ్విళ్లు + ఊరక -ఎట్లు+ఉండున్ =తహతహపడకెట్లుండును? వాక్ + పతి = సరస్వతి భర్త - బ్రహ్మ, దీనిన్ =ఈమెను, శృంగార -సర్గంబునన్ = శృంగారము యొక్క నిర్మాణమున, కల్పింపన్ + పోలున్ = నిర్మించి యుండవచ్చును, ఉన్నతి = గొప్పతనమును, ఫలియించెన్ - పండెను. బ్రహ్మ, దీని = ఈమెయొక్క, నిఖిల + అవయవములు = ఎల్ల అంగములు, తీర్చి = మిక్కిలి చక్కఁజేచి, చేయు + అపుడు = నిర్మించువేళ, ప్రయాసంబున్ = శ్రమమును, చెందుటయును = పొందుట చేత, ఒయ్యన + ఒయ్యన = మెల్లమెల్లగా, నిడు + ఊర్పు-నిట్టూర్పు + పుచ్చెన్ = మిక్కిలి నిట్టూర్చెను, అది -సుమీ = ఆ నిట్టూర్పే సుమా, పుష్ప-సమయ-మందు + అనిలంబు = వసంతర్తువు నందలి మెల్లని గాలి.

తాత్పర్యము: తమ్మిచూలి కన్నులు గాక తక్కిన శ్రోత్రత్వగ్జిహ్వానాసికలనెడి జ్ఞానేంద్రియములను నాల్గింటిని నాకు కన్నులుగా నేల చేయడో! ఈ సుందరాకారమును నిర్మించుటకు వలయు కోట్ల కొలది పరమాణువులు సృష్టికర్తకెట్లు లభించెనో! కన్నకూతునే మోహించిన బ్రహ్మ యిట్టి సుందరాంగిని సృజించి తహతహపడకెట్లుండును. శృంగారమును నిర్మించుచు బ్రహ్మ యీమెను నిర్మించియుండవచ్చును. ఈమె నిర్మాణమున నతని యౌన్నత్యము ఫలించెను. ఈ సుందరి యంగముల నన్నిటిని మిక్కిలి తీర్చి దిద్దునప్పుడు బ్రహ్మ మిక్కిలి శ్రమపడి మెల్లమెల్లగా నిట్టూర్చి యుండును. ఆ నిట్టూర్పే వసంతర్తువు నందలి మందానిలము సుమా.

విశేషములు: తక్కిన నాలుగింద్రియములును కన్నులే అయినచో నామె

---

1. తా. యఖిలా.

సౌందర్యము నింకను నాలుగు రెట్లధికముగా జాచుటకు వీలుండెడిదియనుట. ఈ భావము కాదంబరిలోని కాదంబరీ దర్శన ముల్లాసియగు చంద్రాపీడుడనుకొనిన దాని కాంధ్రీకరణము. 'శేషేంద్రియాణ్యపి మే వేధసా కిమితి లోచనమయాన్యేవ న కృతాని?బ్రహ్మ మిగిలిన యింద్రియములను కన్నులుగా నేల చేయలేదు?'

ఇట్టి రూపమును నిర్మించుటకు కోట్ల కొలది పరమాణువులు కావలసియుండును. అవి యన్నియు సృష్టికర్త కెచ్చటి నుండి లభించెనో! ఇదియును కాదంబరిలోని భావమునకను కరణమే `అహో! చిత్రమేత దుత్పాదితం వేధసా సర్వరమణీయానా మేకం ధామ, కుత ఏతే రూపాతిశయపరమాణవః సమాసాదితా'

సరస్వతిని సృజించి కూతురైన యామె సౌంద్యమునకు ముగ్ధుడై యామెనే కామించిన బ్రహ్మ యీ సౌదర్యరాశిని నిర్మించి మనస్సున తహతహ పడకుండునా? శృంగారమును నిర్మింపదలచిన బ్రహ్మ యీమె నిర్మాణమున నౌన్నత్యమును వహించెను. ఈ మె రూపుగాంచిన శృంగార మనుట బ్రహ్మ యెంతయో శ్రమమున కోర్చి యీమె సకలావయవములను తీర్చి యుండును. అప్పుడతడు మెల్లగా పుచ్చిన నిట్టూర్పే వసంతము నందలి మందానిలము- ఉత్ప్రేక్ష; రూపకము -రెండింటికి సంకరము.

నలిన గర్భుండు -నలినము గర్భముగా గలవాడు - బహువ్రీహి. మోహించినాడు - మోహించిన +వాఁడు - `ఉన్న కలన వర్ణకంబుల మీఁది తచ్ఛబ్ద వకారంబునకు లోపంబు విభాషనగు. `బాల.క్రి. 177. మోహించిన + అండు -`అత్తునకు సంధి బహుళముగా నగు' బాల సంధి 4 బాహుళకంబుచే నిట సంధి నిత్యంబు. మోహించినాఁడు అనునది `అజుండు' విశేషణము. నిడు + ఊర్పు - `కుఱు చిఱు కడు నడు నిడు శబ్దంబుల ఱడల కచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు బాల. సంధి 12 నిట్ + ఉ + ఊర్పు - `ఉత్తున కచ్చుపరంబగునపుడు సంధియగు'- నిట్టూర్పు, నిట్టూర్పు + పుచ్చె - `ప్రథమమీది పరుషములకు గసడదవలు బహుళముగా నగు'బాల సంధి. 13 నిట్టూర్పు వుచ్చె.

వ. అని విచారిం[1]చుచు విప్రుండు చండాల కుల కన్యకా *(మణి) దుర్లభంబగు సౌభాగ్యంబునకు నద్భుతంబందుచు దానితో సంభాషింపఁ గోరి చేరువ [2]నిలిచె జనంగమకన్యాకారత్నంబును నతని కిట్లనియె. 52

అర్థము: అని, విచారించుచున్ = తలచుచు, విప్రుండు = బ్రాహ్మణుడు - సుకుమారుడు, చండాల -కుల-కన్యకా-మణి=మాల కులమందు పుట్టిన కన్యారత్నముయొక్క, దుర్లభంబు = పొంద శక్యము గానిది, అగు, సౌభాగ్యంబునకున్ = సౌందర్యమునకు, అద్భుతంబు + అందుచున్ = ఆశ్చర్యపడుచు, దానితోన్,

1. తా. పుచు. *తాళపత్రమున లేదు. 2. తా. నిలిచెదనని చనినం గన్యకా.

సంభాషింపన్ + కోరి = మాటాడగ గోరి, చేరువన్ = సమీపమున, నిలిచెన్, జనంగమ-కన్యకా-రత్నంబును = చండాల బాలామణియును, అతనికిన్ = సుకుమారునకు, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: అని తలచుచు నా బ్రాహ్మణుడు ఆ మాల పడుచు దుర్లభమైన సౌందర్యమున కాశ్చర్యపడుచునామెతో మాటాడగోరి యామె సమీపమున నిలిచెను. ఆ చండాలకన్యామణియు నతనితో నిట్లు పలికెను.

విశేషములు: దుర్లభము - దుఃఖముచే పొంద శక్యమయినది - దుఃఖేన లబ్ధుం శక్యం-దుర్లభమ్. పొంద శక్యము గానిదియని భావము. జనంగమ - `చణ్డాల ప్లవ మాతఙ్గ దివాకీర్తి జనఙ్గమాః, నిషాద శ్వపచా వన్తేవాసి చాణ్డాల పుల్కసాః' - అమరము. జనాద్గచ్ఛతీతి జనఙ్గమః - జనుల నుండి తొలగి పోవువాడు - మాలవాడు.

క. ఎందుండి [1]యేఁగు దెంచితి
రెందరిగెద రిచట నునికి కేమికతంబో
కందర్పరూపరేఖా
సౌందర్యవిలాసవిభవ [2]సర్వజ్ఞనిధీ. 53

అర్థము: కందర్ప ...... విభవ : కందర్ప = మన్మథుని యొక్క, రూప = ఆకారము యొక్క, రేఖా = విధము, సౌందర్య = అందము, విలాస = విలాసము అనువాని యొక్క, విభవ = వైభవము గలవాడా! సర్వజ్ఞ - నిధీ = సర్వము తెలిసిన వారికి నిధియైన వాడా!, ఎందున్ + ఉండి = ఎచ్చటి నుండి, ఏగుదెంచితిరి? = వచ్చితిరి?, ఎందున్ + అరిగెదరు = ఎచ్చటికి వెడలెదరు? ఇచటన్ = ఇచ్చట, ఉనికికిన్ = ఉండుటకు, ఏమి - కతంబు + ఓ = ఏమి కారణమో!

తాత్పర్యము: `మన్మథుని రూపరేఖా సౌందర్య విలాసముల వైభవము గలవాడా! సర్వజ్ఞులకు నిధియైన వాడా! మీరు ఎచ్చటి నుండి వచ్చితిరి? ఎచటికి పోవుదురు? ఇచ్చట నుండుటకేమి కారణము?'

విశేషములు: సర్వజ్ఞ నిధీ యనుదానికి చెప్పిన యర్థము తృప్తిగాలేదు. దానికి పాఠాంతరమైన `సర్వస్వనిధీ' కూడ నట్టిదే. ఏగుదెంచు - ఏగు + తెంచు - `తెంచుధాతు వగ్వాదుల కనుప్రయుక్తంబగు నగుచో నుత్వంబు పయిని దాని తకారంబు దకారంబగు - ఏగు + దెంచు. `అభ్యాగతి నరుగ్వాదుల కయ్యది, యను ప్రయుక్తంబగు నగుచోఁ గువర్ణంబు విభాషను లోపించు'. బాల. క్రియ. 110-111.

1. ము. యరుగుదెంచితి. 2. ము. సర్వస్వనిధీ

విశేషములు: `చింతకాయలకాజ్ఞ కాని, గుటకలకాజ్ఞయా' అనునది లోకోక్తి. అనగా ఒక వస్తువును సొంతము చేసికొనుట కొకరి యాజ్ఞకావలయునుగాని, దానిని దూరము నుండి చూచి గుటకలు మ్రింగుట కెవరి యాజ్ఞయు నక్కఱలేదు గదా! అట్లే బ్రాహ్మణుడవైన నిన్ను కడజాతి దాననగు నేను తాకి నా వానినిగా జేసికొనుట కొకరి యనుమతి గావలయునుగాని, నిన్ను దవ్వులనుండియే చూచి గుటకలు మ్రింగుట కెవరి యాజ్ఞయు నక్కఱలేదు గదా యనుట `చింతకాయల కాజ్ఞగాక, గ్రుక్కిళ్ల కాజ్ఞగలదె' యను సామాన్యాంశము `అంటరాకున్ననేమి యంతంతనిలిచి, చిత్తమలరంగ నన్ను వీక్షింపరాదె' యను విశేషాంశముచే సమర్థింపబడినది కావున నలంకారమర్థాంతరన్యాసము.

సీ. కమలినీ పత్ర [1]పాత్రములఁ గాసారోద
  కము దెచ్చి పాదపద్మములు గడుగఁ
జిలుక ముట్టని ఫలంబులు గోసికొని వచ్చి
  పరికించి యారగింపంగఁ బెట్ట
గాంతార[2]కర్పూర కదళికాదళముల
  సరసరీతులను వీజన మొనర్ప
నధ్వఖేదము వోవ హస్తద్వయంబున
  నూరుకాండము లొత్తి యుపచరింప

గీ. వేడ్క[3]యయ్యెడు వినయంబు విస్త[4]రిల్ల
[5]భక్తి గొనసాగఁ బ్రమదంబు పారమేద
నీకు విప్రోత్తమునకు నీ నెలవులందు
జెట్ట దుర్జాతి యది నన్నుఁ జెఱిచెఁ గాని. 57

అర్థము: చెట్ట - దుర్జాతి - అది = చెడ్డది యగు ఆ పాడు కులము, నన్నున్, చెఱిచెన్ + కాని = పాడుచేసెను గాని - తప్పని వారించెను గాని, వినయంబు = అడకువ, విస్తరిల్లన్ = వ్యాపింపగా, భక్తి, కొనసాగన్ = అతిశయింపగా, ప్రమదంబు = సంతోషము, పారము + ఏదన్ = ఆవలి యొడ్డు, పొందగా - సమగ్రముకాగా, విప్ర + ఉత్తమునకున్, నీకున్ = బ్రాహ్మణ శ్రేష్ఠుడవైన నీకు, ఈ - నెలవుల + అందున్ = ఈ చోటులందు, కమలినీ - పత్ర - పాత్రములన్ = తామర తీగల యొక్క ఆకులనెడి పాత్రములతో, కాసార + ఉదకమున్ = చెఱువు నీటిని, తెచ్చి, పాద - పద్మములు = తామరలవంటి అడుగులు, కడుగన్ = కడుగుటకును, చిలుక, ముట్టని = తాకని, ఫలంబులు = పండ్లు, కోసికొని వచ్చి,

1. పుటములన్. 2. తా. కల్హార. 3. తా. యయ్యెడి 4. తా. రింప 5. ము.భక్తి గొనంగఁ బ్రమోదంబు పారమేదు.

పరికించి = బాగుగా నున్నవో లేవో పరీక్షించి, ఆరగింపంగన్ + పెట్టన్ = తినిపించుటకును, కాంతార - కర్పూర - కదళికా - దళములన్ = అడవి యందలి కప్పురపుటరటి యాకులతో, సరస - రీతులను = అందమైన విధములతో, వీజనము + ఒనర్పన్ = విసరుట చేయుటకును - వీచుటకును, అధ్వ - ఖేదము = మార్గాయాసము, పోవన్ = పోవునట్లు, హస్త - ద్వయంబునన్ = కేలు దోయితో, ఊరు - కాండములు = దండముల వంటి తొడలు, ఒత్తి = పట్టి, ఉపచరింపన్ = సేవించుటకును, వేడ్క = వేడుక, అయ్యెడున్ = అగును.

తాత్పర్యము: పాడు మాలకులము నన్ను తప్పని వారించుచున్నది గాని వినయము, భక్తి, సంతోషము అతిశయింపగా బ్రాహ్మణోత్తముడవైన నీకు ఇచ్చట తామరపాకుల పాత్రములతో చెఱువు నీరు దెచ్చి యడుగుదామరలు కడుగను, చిలుకలు తాకని పండ్లు కోసికొని వచ్చి యాకులతో సవిలాసముగా వీవను, మార్గశ్రమము పోవునట్లు కేలుగవతో దండముల వంటి ఊరువులను బట్టి సేవింపను వేడుకగా నున్నది.

విశేషములు: పాద్యము, ఆరగింపు, వీజనము, పాదసంవాహనము అను నాతిథ్యవిధులు క్రమముగా చెప్పుట గమనింపదగినది.

అధ్వఖేదము + పోవన్ - గసడదవాదేశము - బాల. సంధి. 13 - అధ్వఖేదము వోవన్. ఊరు కాండములు - కాండముల వంటి ఊరువులు - ఉపమానోత్తర పద కర్మధారయము. విప్రోత్తముడు - విప్రులలో నుత్తముడు - షష్ఠీ తత్పురుషము లేదా విప్రులయందుత్తముడు - సప్తమీ తత్పురుషము. మాలెత అగ్రజాతి భక్తియు, అస్పృశ్యతా బుద్ధియు గమనార్హములు. వేడ్క - వేడుక. 'అచ్చికంబులం బదమధ్యంబుల నలడరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణక. 17

క. ఇది హూణమండలం [1]బ
వ్వది నున్నది చెంచుపల్లె వనమధ్యమునన్
మదననిభ! యీ పుళిందా
స్పదంబు వెలివాడ (జన్మ సదనము నాకున్) 58

అర్థము: ఇది, హూణ - మండలంబు, వన - మధ్యమునన్ = అడవి నడుమ, అ + వదిన్ = ఆ పల్లమున, ఉన్నది = ఉన్నట్టిది, చెంచు - పల్లె, మదన - నిభ = మన్మథునితో సమానుడా, ఈ - పుళింద + ఆస్పదంబు = ఈ చెంచు పల్లెలోని, వెలివాడ - మాల పల్లె, నాకున్, జన్మ - సదనము = పుట్టినిల్లు.

---

1. తా.బి

తాత్పర్యము = ఇది హూణ మండలము. అడవినడుమ ఆ పల్లమున నున్నది చెంచుపల్లె. మన్మథసమానుడా!ఈ చెంచు పల్లెలోని మాలపల్లె నాకు పుట్టినిల్లు.

తాళవృత్తము.

కనుఁగొనవలయును దొదవ్వ్యల నెడ[1]గలిగి నిలిచియైనను మా యిండ్లన్
వనమధ్యంబున విప్రోత్తమ వెలివాడవనితలకు నేత్రోత్సవమై
యనిభృత పరభృత నఖశిఖరోల్లిఖితాంగణ సహకారద్రుమ శాఖా
ఘనఫలరసధారామృత పానోత్కంఠ వివృత్తానన వటుకంబున్ 59

అర్థము: విప్ర + ఉత్తమ = ఓయి బ్రాహ్మణ శ్రేష్ఠుడా, వన - మధ్యంబునన్ = అడవి నడుమ, మా + ఇండ్లన్ = మా యిండ్లయందు, వెలివాడ = మాలపల్లె, వనితలకును = స్త్రీలకు, నేత్ర + ఉత్సవము + ఐ= కనుల పండువయి అనిభృత ...... వటుకంబున్ : అనిభృత = శబ్దముచేయుచున్నవైన, పరభృత = కోయిలల యొక్క, నఖ = గోరుల యొక్క, శిఖర = కొనలచేత, ఉల్లిఖిత = గీఱబడిన, అంగణ = ముంగిటనున్న, సహకార - ద్రుమ = తీయ మామిడి చెట్ల యొక్క, శాఖా = కొమ్మల యందలి, ఘన - ఫల = గొప్ప పండ్ల యొక్క, రస = రసము యొక్క, ధారా = ప్రవాహమనెడి, అమృత = అమృతము యొక్క, పాన = త్రాగుటయందు, ఉత్కంఠ = తహతహచే, వివృత్త + ఆనన = త్రిప్పబడిన నోరులు గల, వటుకంబున్ = బాలురుగల దానిని, దొదవ్వ్యలన్ = దూరదూరమున, ఎడ + కలిగి = ఎడము గలిగి, నిలిచి + ఐనను = నిలబడియైనను, కనుగొనన్ + వలయును = చూడవలయును.

తాత్పర్యము: ఓయి బ్రాహ్మణశ్రేష్ఠుడా! అడవి నడుమ మా యిండ్ల యందు మాల యింతులకు గనులపండువయి శబ్దము చేయుచున్న కోయిలల గోరుల కొనలచే గీబడిన ముంగిటి తీయమామిడి చెట్ల కొమ్మల యందలి పెద్దపండ్ల రసప్రవాహమనెడి యమృతమును తహతహతో ముఖములు తిప్పుకొని యుండు బాలురు గలదానిని వెలివాడను దూరదూరముగా నెడము గలుగునట్లు నిలబడియైన చూచి తీరవలసినదే.

విశేషములు: అనిభృత - నుట. ఫల రసధారామృత - పండ్లరసప్రవాహ మమృతమే. అందు చేతనే బాలురకు దానిని త్రావ `నుత్కంఠ'. కావుననే వారు `వివృత్తానను' లగుటయు. కోయిలలు తమ గోరులచే నా పండ్లను గీఱుటచే వాని రసము క్రిందికి నోడుచుండెను. ఆ బాలురకు కోసికొనవలసిన శ్రమలేదు. వారు రసమాన ముఖములు త్రిప్పుకొని యున్న చాలును. కోయిలలు వారికా సౌలభ్యమును

1. గలుగ

కలిగించినవి. ఆ దృశ్యమా వనితలకు `నేత్రోత్సవము' ను కలిగించును. ఆ దృశ్యమును చూడవలయునన్న చూపఱు దూరముగా నించుక యెడగలిగి నిలబడవలయును. వారు దగ్గఱగా వచ్చుచో నా బాలురు భయపడి పాఱిపోవుదురు. అప్పుడు వారి కాదృశ్యమును జూచు భాగ్యము గలుగదు. అలంకారము స్వభావోక్తి. ఈ తాళవృత్తమను ఛందస్సునందు నాలుగు పాదములు గలవు. ఒక్కొక్క పాదమునను ముప్పది రెండు మాత్రలుండును. మొదటి యక్షరమునకును పదునేడవ మాత్రకును యతి మైత్రి. ప్రాసనియమము గలదు.

క. [1]పాణసి వారము కమ్మని-
ప్రాణము నెఱజాణదేవరా వినవలదా
వీణావాద్యముఁ బాటయు
వేణుస్వానంబు వేనవేల్చందములన్. 60

అర్థము: నెజాణ - దేవరా = మిక్కిలి సమర్థుడవైన, శ్రేష్ఠుడా!, పాణసివారము = మాలజాతి వారము, కమ్మని - ప్రాణము = కమ్మనైన ప్రాణమగు, వీణా - వాద్యమున్ = వీణావాదనమును, పాటయున్, వేణు - స్వానంబున్ = మురళీ నాదమును, వేనవేల్ - చందములన్ = వేయి విధముల, వినకలదా,

తాత్పర్యము : మిక్కిలి సమర్థుడవైన శ్రేష్ఠుడా! మేము మాల జాతి వారము. మాకు కమ్మనైన ప్రాణమగు - నా వీణావాద్యమును, పాటను, వేణునాదమును పెక్కురీతుల వినవలదా?

వ. అని చండాల కన్యక పలికిన నవ్విప్రుండు భవితవ్యతాబలంబున. 61

అర్థము: అని, చండాల - కన్యక, పలికనన్, ఆ + విప్రుండు, భవితవ్యతా - బలంబునన్ = తప్పక కాదగినదాని శక్తిచేత.

తాత్పర్యము: అని మాలపడుచు పలుకగా నాబ్రాహ్మణుడు తప్పక కావగిన దానికి గల శక్తి చేత - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. ఇది యసజ్జనగోష్ఠి, యిది [2]మోహవిలసితం,
బిది[3]మహాపాతకం, బిది యకీర్తి,
యిది దుర్మదాంధత్వ, మిది [4]కామ విక్రియ,
(యిది యాగ్రహావేశ), మిది కుదృష్టి
యిది నారకద్వార, మిది ప్రమాద స్థలం,

---

1. తా. పాణచి 2. తా. యసమ్మత దృష్టి 3. తా. మోహసితం. 4. ము. యాగ్రహావేశ

ఔది మౌర్ఖ్యకారణం, బిది యనియతి,
యిది యధర్మముత్రోవ, యిది [5]పథప్రచ్యుతి,
ఇది యధోగతి హేతువిది యకృత్య

గీ. మని విచారింప కవనీసురాధముండు
కలికి చండాలకన్యపైఁ గన్నువైచెఁ
దీయతీయని వింట లేఁదేఁటి నారి
శంబరారాతి మోహనాస్త్రంబు[6]దొడుగ. 62

అర్థము: శంబర + అరాతి = శంబరుడను రాక్షసునకు శత్రువు - మన్మథుడు, తీయ - తీయని - వింటన్ = మిక్కిలి తీయనైన (చెఱకు) వింటియందు, లేఁదేఁటి - నారిన్ (లేత + తేటి - నారిన్) = కొదమ తుమ్మెదలనెడి వింటి త్రాటియందు, మోహన + అస్త్రంబున్ = తన బాణములలో నొకటి యగు మోహనమును, తొడుగన్ = తొడుగగా, అవనీ - సుర + అధముండు = అధముడైన బ్రాహ్మణుడు - సుకుమారుడు,

ఇది = మాలెతను కామించుట, అసత్ + జన - గోష్ఠి = దుర్జన సల్లాపము, ఇది, మోహ - విలసితంబు = అజ్ఞానము యొక్క పర్యవసానము, ఇది, మహా - పాతకంబు = గొప్పపాపము, ఇది, అకీర్తి = చెడ్డపేరు. ఇది, దుర్మద + అంధత్వము = దుర్గర్వము వలని గ్రుడ్డి తనము, ఇది, కామ - విక్రియ = వలపు యొక్క వికారము, ఇది, ఆగ్రహ + ఆవేశము = పట్టుదల వలని వేగిరపాటు, ఇది, కుదృష్టి = దుష్టమైన చూపు. ఇది, నారక - ద్వారము = నరకలోకము యొక్క మార్గము, ఇది, ప్రమాద - స్థలంబు = ఏమఱుపాటునకు చోటు, ఇది, మౌర్ఖ్య - కారణంబు = మూర్ఖత్వమునకు కారణము, ఇది, అనియతి = ఇంద్రియనిగ్రహము లేమి. ఇది, అధర్మము - త్రోవ, ఇది, పథ - ప్రచ్యుతి = మార్గమునుండి జాఱుపాటు, ఇది, అధోగతి - హేతువు = నరకమునకు కారణము, ఇది, అకృత్యము = చేయరానిది. అని, విచారింపక = ఆలోచింపక, కలికి = మనోజ్ఞురాలగు, చండాల - కన్యపైన్ = మాలపడుచుమీద, కన్ను - వైచెన్ = కోరిక గలిగియుండెను.

తాత్పర్యము: మన్మథుడు తన చెఱుకువింట కొదమ తుమ్మెదనారి యందు మోహనాస్త్రమును సంధింపగా నా నీచ బ్రాహ్మణుడు ఇది దుర్జనుల ప్రసంగము, ఇది అజ్ఞాన పర్యవసానము, ఇది మహాపాపము, ఇది చెడ్డపేరు తెచ్చునది, ఇది దుర్గర్వము వలని గ్రుడ్డితనము, ఇది కామవికారము, ఇద పట్టుదల వలని వేగిర పాటు, ఇది చెడ్డచూపు, ఇది నరకలోకమునకు మార్గము, ఇది ఏమఱుపాటుచోటు,

5. తా. పద. 6. ము. దొడిగి

ఇది మూర్ఖత్వమునకు కారణము, ఇది ఇంద్రియ నిగ్రహము లేమి, ఇది అధర్మమునకు మార్గము, ఇది మార్గము నుండి జాఱుపాటు, ఇది అధోగతికి కారణము, ఇది అకార్యము అని ఆలోచింపకే అందమైన మాలపడుచుమీద కన్నువేసెను.

విశేషములు: అసత్ + జన = ఝల్లులకు హశ్శులు పరములగుచుండగా తృతీయ వర్ణాదేశము - అసద్ + జన. `ద'వర్ణమునకు `జ,ఝ వర్ణములు పరములగునేని `జ' కారము వచ్చును -`అసజ్జన'. అవనీసురాధముడు - అధముడైన అవనీసురుడు - విశేషణోత్తర పద కర్మధారయము. కన్నువైచె - కోరికగలిగియుండెననుటకు లోకోక్తి. తీయతీయని వింట - మన్మథునిది చెఱకు విల్లుగావున నిట్లనుట. లేదేటి - లేత + తేఁటి -`సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగానగు.' బాల. సంధి. 36 లే + తేటి. `లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.' బాల. సంధి. 37. లే + ను + తేటి. పిమ్మట ద్రుతకార్యము (బాల. సంధి. 16, 17) లేఁదేఁటి. మోహనాస్త్రము - మన్మథుని అస్త్రములలో నొకటి మోహనము.

వ. [1]అప్పుడతఁడు నిజాంతర్గతంబున. 63

అర్థము: అతఁడు, నిజ + అంతర్గతంబున = తనదైన మనసున.

తాత్పర్యము: అప్పుడా సుకుమారుడు తన మనస్సునందు. తరువాతి పద్యముతో నన్వయము.

సీ. మాంసంబు భక్షింప మనసువెట్టిన నాఁడ
దాక్షిణ్యగుణము [2]విధ్వంసమయ్యె;
గంజాయి దినఁగ నుత్కంఠ చేసిననాఁడ
లజ్జాభిమానంబు లుజ్జగిల్లె;
హాలారసము గ్రోల నభిలషించిననాఁడ
సూనృతోక్తుల సుద్ది చూఱవోయెఁ;
బరకళత్రములపై బడఁదలంచిన నాఁడ
ప్రజ్ఞావిలాసంబు పదటఁగలిసె;

గీ. నింక నేటికి వంచింప [4]నిలుపు నాకు?
బరువె యీ పాపములలోనఁ బాప మొకటి?
వరుస వేయింటిమీఁద జవ్వాది కొమ్మ
తివుటఁ జండాల కన్యక గవయుఁ వాఁడ 64

1. ము. ఏయునప్పుడు. 2. తా.విధ్వస్తమయ్యె. 3. వెంబడ 4. తా. నిలువ

అర్థము: మాంసంబున్, భక్షింపన్ = తినుటకు, మనసు + పెట్టిన - నాడు + అ = అభిలషించినప్పుడే, దాక్షిణ్య - గుణము = దయయను గుణము, విధ్వంసము + అయ్యెన్ = నాశనమయ్యెను. గంజాయిన్, తినగన్, ఉత్కంఠ - చేసిన - నాడు + అ = తహతహపడినప్పుడే, లజ్జా + అభిమానంబులు = సిగ్గు, పౌరుషము, ఉజ్జగిల్లెన్ = పోయెను. హాలా - రసమున్ = మద్యమును, క్రోలన్ = త్రాగుటకు, అభిలషించిన - నాడు + అ = కోరినప్పుడే, సూనృత + ఉక్తుల - సుద్ది = సత్యవాక్యముల వృత్తాంతము, చూ + పోయెన్ = నశించెను. పర - కళత్రములపైన్ = ఇతరుల యొక్క, భార్యల మీద, పడన్ + తలంచిన - నాడు + అ = పడనెంచినప్పుడే, ప్రజ్ఞా - విలాసంబు = బుద్ధియొక్క, ప్రకాశము, పదటన్ + కలిసెన్ = బూడిద పాలయ్యెను. ఇంకన్, వంచింపన్ = మోసగించుటకు, నాకున్, నిలుపు = ప్రతిబంధకము, ఏటికిన్ = ఎందులకు? ఈ - పాపములలోనన్, పాపము + ఒకటి = ఇంకొక పాపము, బరువు + ఎ = భారమా? (కాదనుట), వరుసన్ = క్రమముతో, వేయింటిమీదన్, జవ్వాదికొమ్ము = జవ్వాదిముక్క. తివుటన్ = కోరికతో, చండాల - కన్యకన్ = మాలపడుచును, కవయువాఁడన్ = రమింతును.

తాత్పర్యము: మాంసమును దిన మనసు పడినప్పుడే దయాగుణము నశించెను. గంజాయిని తిన తహతహ పడినప్పుడే లజ్జాభిమానములు పోయెను. మద్యమును త్రావ గోరిననాడే సత్యభాషణము నశించెను. పరస్త్రీల గూడ దలచిన నాడే బుద్ధి వికాసము బూది పాలయ్యెను. ఇంక నీ మాలెతను కూడరాదను ప్రతి బంధకము, వంచనగాక, నాకేల? ఇన్ని పాపములలో నింకొక పాపము బరువా? వేయి సరకులు మోచుకొనిపోవునపు డొక జవ్వాది ముక్క బరువగునా? కోరికతో చండాల కన్యను కూడుదును.

విశేషములు: ఈ మాటల వలన మాంసభక్షణము, గంజాయి సేవించుట, మద్యపానము, పరస్త్రీ గమనము అను మహాపాపముల నతడు చేయుచుండెనని తెలియుచున్నది. ఇట్టి నాకు ఈ మాలెతను గూడరాదను `నిలుపు' = అడ్డు - వంచనయే యగుననుట.

నింకనేటికి వంచింప నిలుపు నాకు - యత్యక్షరము అచ్చే (ఇం) గాని హల్లు కాకపోవుటచే నీ యతిమైత్రి చింత్యము. ఇట్టివి శ్రీనాథునిలో నెడనెడ గలవు.

వ. అని పరమసాహసంబు చేసి సుకుమారుండు చండాల కన్యకం జేర వచ్చి యిట్లనియె. 65

అర్థము: అని, సుకుమారుండు, పరమ - సాహసంబు చేసి = బరితెగించి, చండాల - కన్యకన్, చేరన్ + వచ్చి = సమీపించి, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: అని యాలోచించి సుకుమారుడు బరితెగించి మాల కన్యను

సమీపించి యామెతో నిట్లు పలికెను.

కవిరాజ విరాజితము:

సరసిజలోచన! యొక్క మహాముని శాపవశంబున బాణచివై
ధర జనియించినదానవు నీ; విది తథ్యము; కిన్నర భామినివో,
గరుడపురంధ్రివొ, [1]ఖచరవధూటివొగాని జఘన్యవుగా; విఁకనన్
ధరణిసురోత్తము[2]ఁ దగ వరియింపు సుధాకరసూర్యులు సాక్షులుగాన్. 66

అర్థము: సరసిజ - లోచన = ఓ పద్మాక్షీ! నీవు, ఒక్క - మహత్ (మహా) - ముని - శాప - వశంబునన్ = ఒక మహర్షి యొక్క శాపమునకు లోనయి, పాణచివి + ఐ = మాల దానవయి, ధరన్ = భూమి యందు, జనియించిన దానవు = పుట్టిన దానవు, ఇది, తథ్యము = నిజము, కిన్నర - భామినివో = కిన్నర స్త్రీవో, గరుడ - పురంధ్రివొ = గారుడాంగనవో, ఖచర - వధూటివొ = దేవతా వనితవో, కాని, జఘన్యవు = కడజాతివి, కావు, ఇకన్, ధరణి సుర + ఉత్తమున్ - నన్ = బ్రాహ్మణ శ్రేష్ఠుడనైన నన్ను, సుధాకర - సూర్యులు = చంద్రసూర్యులు, సాక్షులుగాన్, తగన్ = తగునట్లు, వరియింపు = వరింపుము.

తాత్పర్యము: ఓ పద్మాక్షీ! నీ వొక మహర్షి యిచ్చిన శాపము ననుసరించి మాలదానవయి భూమిని పుట్టిన దానవు. ఇది నిజము. నీవు కిన్నరాంగనవో, గరుడ స్త్రీవో, దేవతా వనితవో కాని కడజాతి దానవు కావు. ఇంక బ్రాహ్మణోత్తముడనైన నన్ను చంద్రసూర్యులు సాక్షులుగా తగ వరింపుము.

విశేషములు: సుధాకర - సూర్యులు సాక్షులుగాన్ - మానవుల కర్మములకు ప్రత్యక్షసాక్షులుగాన వారిని చెప్పుట.

కవిరాజ విరాజితమున వరుసగా ప్రతిపాదమునను న, జ, జ, జ, జ, జ, జ, వ అను గణములుండును. 1-8-14-20 అక్షరములకు యతిమైత్రి. ప్రాసనియమము గలదు. సాక్షి (ప్రకృతి) - సాకిరి (వికృతి) పాణచి - పాణసి (రూపాం.) వరియింపు - `మధ్యమపురుష మువర్ణకంబునకు హలవ సానంబులు పరంబులగునపుడు లోపము విభాషనగు. బాల. సంధి. 47.

వ. సామాన్య స్త్రీ జనంబుల కిట్టి యమానుషలోకోచితంబు లైన సౌభాగ్యంబు[3]లుం గల్గునె? మునికోపవశంబున సముజ్ఝిత దివ్యశరీర లగు దేవ[4]కాంతలు శాపవశోపనీతంబైన శరీరంబు నధిష్ఠింతురు; తొల్లి [5]స్థూల శిరుండను మహాముని త్రిభువనలలామభూత యగు రంభ నేదేని యొక్క నిమిత్తంబున శపించె ననియును, దచ్ఛాపంబున

1. ము. యక్ష. 2. ము. ముని న్వరియింపు. 3. తా.లు గలుగ నేర్చునె. 4. తా. తా. తాంగనలు. 5. తా. స్థూలశరీరుండను.

నయ్యప్సరస బాడబ రూపంబు ధరియించి మృత్తికావతి యందు శరదన్వుండను రాజును సేవించుచుంబెద్ద కాలంబు మర్త్యలోకంబున నుండెననియును విందుము.67

అర్థము: సామాన్య - స్త్రీ - జనంబులకున్ = సాధారణ స్త్రీ సమూహములకు, ఇట్టి, అమానుష - లోక + ఉచితంబులు = మనుష్యలోకమునకు తగినవి కానివి - మనుష్యలోకా తీతములైన వనుట, సౌభాగ్యంబులున్ = వైభవములును, కలునె = ఉండునా?, ముని - కోప - వశంబునన్ = మునుల యొక్క, కోపమునకు, లోనయి, సముజ్ఝిత - దివ్య - శరీరలు = విడువబడిన, దేవతా సంబంధమైన, శరీరములు గలవారు, అగు, దేవ - కాంతలు = దేవతా స్త్రీలు, శాప - వశ + ఉపనీతంబు = శాపవశమున పొందబడినది, ఐన, శరీరంబున్, అధిష్ఠింతురు = పొందుదురు, తొల్లి = పూర్వము, స్థూల శిరుండు, అను, మహత్ (మహా) ముని, త్రిభువన - లలామ - భూత = ముల్లోకములకు అలంకారమైనది, అగు, రంభన్, ఏది + ఏని = ఏదో, ఒక్క - నిమిత్తంబునన్ = ఒక కారణమున, శపించెన్, అనియును, తద్ + శాపంబునన్ = ఆ శాపము చేత, ఆ + అప్సరస = ఆ దేవవేశ్య, (రంభ), బాడబ - రూపంబు = ఆడుగుఱ్ఱము సంబంధమగు రూపమును, ధరియించి = తాల్చి, మృత్తికావతి + అందున్ = మృత్తికావతియను ప్రదేశమున శరధన్వుడు, అను, రాజును, సేవించుచున్, పెద్ద - కాలంబు = చాలకాలము, మర్త్యలోకంబునన్ = మానవలోకమునందు, ఉండెన్, అనియును, విందుము.

తాత్పర్యము: సాధారణ స్త్రీల కిట్టి మనుష్య లోకాతీతము లయిన శుభలక్షణములుండునా? మునుల కోపమున కగ్గమై దేవతా స్త్రీలు తమ దివ్య శరీరముల నుజ్జగించి శాపవశమున నైన శరీరమును దాల్తురు. పూర్వము స్థూలశిరుడను మహాముని ముల్లోకములకు నలంకారమైన రంభ నేదో యొక కారణమున శపించెననియును ఆ శాపముచే నా యచ్చర యాడుగుఱ్ఱము రూపము ధరించి మృత్తికావతియందు శరధన్వుడను రాజును సేవించుచు చాలకాలము మనుష్య లోకమున నుండెననియును విందుము.

సీ. జలజగర్భుని మానసంబు, వేదంబులు,
దక్షప్రజాపతి, దర్పకుండు,
సౌదామనీవల్లి, చంద్రికాలోకంబు,
సప్తజిహ్వాజ్వాల సప్తకంబు,
రవి మయూఖములు, నీరవని, దుగ్ధాంభోధి,
మృత్యుదేవత, [1]నోరి మెఱుఁగుఁ బండ్లు,
ముని కరిష్టాఁపటకిని సంభవించిన
దివ్యగంధర్వజాతి ద్వయంబుఁ

1. తా. నోర.

గీ. గారణంబులుగాఁ బుట్టినారు [1]పదియు
నాల్గు కోట్లప్సరసలు నా నాకసతులు;
వారిలో నొక్కతెవు నీవు వారిజాక్షి!
యేమి దుష్కృతిఁ బుట్టితో హీనజాతి?

అర్థము: జలజగర్భుని - మానసంబున్ = బ్రహ్మయొక్క మనస్సును, వేదంబులున్, దక్ష - ప్రజాపతి = దక్షుడనెడి ప్రజాపతియును, దర్పకుండున్ = మన్మథుండును, సౌదామనీ - వల్లి = మెఱపు దీగ, చంద్రికా + ఆలోకంబు = వెన్నెల యొక్క ప్రకాశము, సప్త జిహ్వా - జ్వాల - సప్తకంబున్ = అగ్ని యొక్క యేడు జ్వాలలును, రవి - మయూఖములున్ = సూర్యుని యొక్క కిరణములును, నీరు, అవని = భూమి, దుగ్ధ + అంభోధి = క్షీర సముద్రము, మృత్యు - దేవత - నోరి - మెఱుంగు బండ్లున్ = మృత్యుదేవత యొక్క నోరి యందలి ప్రకాశించు దంతములును, మునికిన్ = కశ్యపునకును, అరిష్టాదేవికిని = అరిష్టయను పేరుగల తద్భార్యకును, సంభవించిన = పుట్టిన, దివ్య - గంధర్వ - జాతి - ద్వయంబున్ = దివ్యులు, గంధర్వులు అనెడి రెండు జాతులును, కారణంబులు + కాన్, నాక - సతులు = స్వర్గస్త్రీలు, పదియు - నాల్గుకోట్లు + అప్సరసలు - నాన్ = పదునాలుగు కోట్ల అచ్చర లనగా, పుట్టినారు. వారిజ + అక్షి = పద్మములవంటి కన్నులు గలదానా! నీవు, వారిలోన్, ఒక్కతెవు. ఏమి - దుష్కృతిన్ = ఏమి పాపకార్యముచేత, హీన - జాతిన్ = తక్కువ కులమునందు, పుట్టితో = పుట్టితివో?

తాత్పర్యము: బ్రహ్మమనస్సును, ఋగ్యజుస్సామాథర్వము లనెడి నాలుగు వేదములును, దక్షప్రజాపతియును, మన్మథుడును, మెఱపు దీగయును, వెన్నెలకాంతియును, అగ్ని యేడుజ్వాలలును, సూర్యుని కిరణములును, నీరును, అవనియును, క్షీర సముద్రమును, మృత్యుదేవత నోరిలోని మెఱయుదంతములును, కశ్యపమునికిని అరిష్టాదేవికిని బుట్టి దివ్యులు గంధర్వులు అను రెండు జాతులవారును కారణములుగా స్వఃకాంతలు పదునాలుగు కోట్ల అచ్చరలుగా పుట్టిరి. పద్మాక్షి! నీవు వారిలో నొకతెవు. ఏపాపము నొనర్చి యిట్లు తక్కువ కులమున పుట్టితివో!

విశేషములు: సౌదామని, సౌదామిని, సౌదామ్ని - (రూపం) 'తడి త్సౌదామనీ విద్యు చ్చఞ్చలా చపలా అపి.' సుదామ్నా ఐరావతేన సహ వర్తత ఇది సౌదామినీ - మెఱుపు. లేదా సుదామవ - సుదామమనగా నైరావతము. దానితో కూడియుండునది. మెఱుపు. లేదా సుదామవ దండవలె దీర్ఘాకారము గలది - మెఱుపు. అమరము. జ్వాలా ద్దీర్ఘాకారోఽస్యాస్తీతి. దండవలె దీర్ఘాకారము గలది - మెఱుపు. అమరము. జ్వాల - సప్తకము అనియు, జ్వాలః అనియు స్త్రీ పుంలింగములు రెండును గలవు. జ్వాల - సప్తకము : కాలి, కరాలి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, ఉగ్ర, ప్రదీప్త - అనునవి అగ్ని

1. తా. మరియు

యేడు జ్వాలలు. మెఱుంగు + పండ్లు - ఉదంత స్త్రీ సమమునకు బరుషము పరమగు చుండఁగా నుగాగమము (బా. సంధి. 25), పిమ్మట ద్రుతకార్యము (బాల. సంధి. 16,17). అరిష్టాదేవి - కశ్యపుని భార్య, దక్షప్రజాపతి కూతురు. అప్సరస (ప్రకృతి) - అచ్చర (వికృతి). పుట్టితో - పుట్టితివి + ఓ - లిడ్వకారమునకు లోపము. (బాల. క్రియ. 24), అపదాదిస్వర సంధి. (బాల. సంధి 11) - పుట్టితో.

గీ. తివుచుచున్నది భవదీయ దృగ్విలాస
మెత్తుకొనిపోవుచున్నవి యింద్రియములు
వెనుక ద్రొబ్బుచునున్నాడు మనసిజాతుఁ
డేమి సేయుదుఁ జెప్పవే యిందువదన! 69

అర్థము: ఇందు - వదన = చంద్రుని వంటి ముఖము గలదానా!, భవదీయ - దృక్ + విలాసము = నీదయిన కన్నుల యొక్క సౌందర్యము, తివుచుచున్ + ఉన్నది = లాగుచున్నది, ఇంద్రియములు, ఎత్తుకొని పోవుచున్ + ఉన్నవి = అపహరించుకొని పోవుచున్నవి, మనసి - జాతుఁడు = మన్మథుడు, వెనుకన్, ద్రొబ్బుచున్ + ఉన్నాడు = త్రోయుచున్నాడు, ఏమి + చేయుదున్, చెప్పవే.

తాత్పర్యము: ఓ చంద్రముఖీ! నీకన్నుల అందము నన్ను లాగుచున్నది. ఇంద్రియములు నన్నపహరించుకొని పోవుచున్నవి. మన్మథుడు నన్ను వెనుకనుండి త్రోయుచున్నాడు. నన్నేమి చేయు మందువో చెప్పుము.

విశేషములు: దృశ్ + విలాస - దృక్ + విలాసము. ఝల్లునకు హశ్శు పరమగు చుండగా తృతీయవర్ణాదేశము - దృగ్విలాసము. మనసి జాతుఁడు - సమాసమున సప్తమీ విభక్తిలోపము రాలేదు. అలుక్సమాసము. ఏమి + చేయుదు - గసడదవాదేశము (బాల. సంధి.13) ఏమి సేయుదు.

గీ. వనిత! నీ చిత్తమున నేను వత్తునేని
కామతంత్రంబునకు సంచకర్వు గాఁగఁ
జుంబనము సేయని మ్మోష్ఠబింబమిపుడు
గండుఁ గోయిల చిగురాకు గమిచినట్లు 70

అర్థము: వనిత = ఓయింతీ! నీ - చిత్తమునకున్ = నీ మనస్సునకు, ఏను, వత్తున్ +ఏని = నచ్చెదనేని, కామ - తంత్రంబునకున్ = మన్మథ సిద్ధాంతమునకు, సంచకర్వు = బయానాగా, గండు + కోయిల = మగకోకిల, చిగురు + ఆకున్, కమిచిన + అట్లు = కొఱికిన రీతి, ఇపుడు, ఓష్ఠ - బింబము = దొండపండు వంటి పెదవి, చుంబనము + చేయ నిమ్ము = ముద్దుపెట్టు కొననిమ్ము.

తాత్పర్యము: ఓ యింతీ! నేను నీ మనసునకు నచ్చితినేని, మన్మథ కార్యమునకు సంచకరువుగా పుంస్కోకిలము చిగురుటాకును కొఱికిన విధమున నిపుడు నన్ను నీ

దొండపండువంటి పెదవిని ముద్దుపెట్టుకొన నిమ్ము.

విశేషములు: చిత్తమునకు వచ్చు = ఇష్టమగు, కామ - తంత్రము = మన్మథకార్యము - సంభోగము, సంచకర్వు - సంచకరువు (రూపాం) బేరము స్థిరతకై మొదట నిచ్చెడి ధనము - బయానా (హిం.) ఓష్ఠ - బింబము - బింబమువంటి ఓష్ఠము - ఉపమానోత్తర పద కర్మధారయము. గండు + కోయిల - ఉదంత స్త్రీ సమమునకు పరుషము పరమగుచుండగా నుగాగమము. (బాల. సంధి. 25), పిమ్మట ద్రుత కార్యము (బాల. సంధి. 16,17). చిగురు + ఆకు - చిగురాకు, చిగురుటాకు. `కర్మధారయంబునందు బేర్వాది శబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాషనగు. (బాల. సంధి. 29.) అలంకారము ఉపమ. ఆమె ఓష్ఠము చిగురాకు వలె నున్నదనుటచే తన్మృదుత్వము తెలియుచున్నది.

గీ. అనుచు విప్రుండు తమకించి యంటుకొనియె;
సమ్మతించియ యుండె నా చంద్రవదన;
శూక లాశ్వంబు నస రేపఁ జొచ్చినప్పు
డనుమతింపదె యత్తళువైన బడబ? 71.

అర్థము: అనుచున్, విప్రుండు, తమకించి = తహతహపడి, అంటుకొనియెన్ = తాకెను, ఆ - చంద్ర - వదన = ఆ చంద్రముఖి - మాలెత, సమ్మతించి + అ + ఉండెన్ = అంగీకరించియే యుండెను, శూకల + అశ్వంబు = మచ్చికకు సాధ్యపడని దుష్టాశ్వము, నస - కామము, రేపన్ + చొచ్చిన + అప్పుడు = ఉద్రేకింప జేయ జొచ్చినప్పుడు, అత్తళువు = ఎదపోయినది, ఐన, బడబ = ఆడుగుఱ్ఱము, అనుమతింపదె = ఒడబడదా?

తాత్పర్యము: అని పలుకుచు బ్రాహ్మణుడైన సుకుమారుడు తహతహతో మాలెతను తాకెను. ఆ చంద్రముఖియు సమ్మతించియే యుండెను. మొండి మగ గుఱ్ఱము కామము నుద్రేకింప జొచ్చినప్పుడు ఎదపోయిన ఆడుగుఱ్ఱము ఒడబడదా?

విశేషములు: ఇందు విశేషాంశము సామాన్యాంశముచే సమర్థింప బడుటచే నలంకార మర్థాంతరన్యాసము. విప్రుడంటుకొనగా మాలెత సమ్మతించుట విశేషాంశము. శూకలాశ్వము నసరేపగా బడబ అనుమతించుట సామాన్యము. ఈ యుపమాన స్వారస్యముచే సుకుమారుని పాశవబుద్ధి తెలియుచున్నది.

వ. ధీరోదాత్త[1]యగుట నమ్మత్తకాశిని చిత్తజాయత్త యయ్యును దత్తఱపాటు లేక యతనితో నిట్లనియె. 72

1. తా. యగు

అర్థము: ఆ + మత్తకాశిని = ఆ ఉత్తమ స్త్రీ, ధీర + ఉదాత్త = ధీరయును, ఉదాత్తయును, అగుటన్ = అగుటచేత, చిత్తజ + ఆయత్త = మన్మథునకు అధీనురాలు, ఆయ్యును = అయినను, తత్తఱపాటు = వేగిరపాటు, లేక, అతనితోన్ = సుకుమారునితో, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: ఆ ఉత్తమస్త్రీ ధీరోదాత్త కావున మన్మథునకు వశపడిన దయ్యును వేగిరపాటు లేక సుకుమారున కిట్లనెను.

విశేషములు: మత్తకాశిని - `వరారోహా మత్తకాశిన్యుత్తమా వరవర్ణినీ' మధుపానం వినా మత్తేన కాశత ఇతి మత్తకాశినీ - మధు పానము లేకయే మత్తురాలివలె ప్రకాశించునది. లేదా శ్రోణీ గౌరవాత్ మత్త గజవత్ మందం కసతీతి మత్తకాసినీ - గొప్ప పిఱుదులు గల దౌటచే మదపుటేనుగువలె మెల్లగా నడచునది. ఉత్తమ స్త్రీ. అమరము. మాలెతకు విశేషణములైన ధీరోదాత్త, మత్త కాశిని అను పదములచే నామె ఉత్తమత్వము తెలియుచున్నది. మత్తకాశిని, మత్తకాశని, మత్తకాసిని - (రూపాం) తత్తఱము + పాటు = `పడ్వాదులు పరంబులగునపుడు ము వర్ణకంబునకు లోపపూర్ణ బిందువులు విభాషనగు' బాల. సంధి. 46

సీ. కలుగుచున్నవి యనేకములు వికల్పము,
లాడుచున్నవి యపాయంబు లెదుర,
నంతరాయము లసంఖ్యములు గన్పట్టెడు,
సందేహములు పెక్కు చాయవాఱె,
నంకురితము లయ్యె శంక లేరాళంబు,
వికృతు లెన్నేని యావిష్కరించె,
శాఖోపశాఖలఁ జాగుచున్నది రట్టు,
గుఱిలేక యుదయించె గోసనాస,

గీ. యిన్నిటికి నోర్చి నీ కోర్కి యేను దీర్తు;
నింతవానికి [1]నీకు నన్నీయ బరువె?
యెప్పటికి [2]నిత్తునో లేక యీ శరీర
మిప్పటికిఁ జాలునొ నిక్క మెఱుఁగఁ జెపుమ. 73

అర్థము: అనేకములు = పెక్కులు, వికల్పములు = సంశయములు, కలుగుచున్ + ఉన్నవి, అపాయంబులు = కీడులు, ఎదురన్ = ముందు, ఆడుచున్ + ఉన్నవి = కదలుచున్నవి. అసంఖ్యములు = లెక్కలేని, అంతరాయములు = విఘ్నములు, కన్పట్టెడున్ = కనబడుచున్నవి, సందేహములు = అనుమానములు, పెక్కు, చాయ

1. ము. నన్నీగుబెరలె. తా. నీకు 2. తా. నైన నిత్తునోయీ శరీర

+ పాటెన్ = పొడచూపెను. శంకలు = సందియములు, ఏరాళంబు = అధికముగా, అంకురితములు + అయ్యెన్ = పుట్టెను, ఎన్ని + ఏని = ఎన్నియో, వికృతులు = ఉద్దేశములు, మనస్సు అనువాని మార్పులు, ఆవిష్కరించెన్ = బయలువడెను. రట్టు = నింద, శాఖా + ఉపశాఖలన్ = చిలవలు పలవలుగా, చాగుచున్ + ఉన్నది = పెరుగుచున్నది, గోసున్ = గోసనాస = నిందను, ఆస = కోరిక, గుఱిలేక = లక్ష్యము లేక, ఉదయించెన్ = పుట్టెను. ఇన్నిటికిన్, ఓర్చి = సహించి, నీ - కోర్కి, ఏను, తీర్తున్, ఇంతవానికిన్, నీకున్, నన్నున్, ఈయన్, బరువు + ఎ = బరువా? కాదనుట, (నన్నున్), ఎప్పటికిన్ = శాశ్వతముగా, ఇత్తునో, లేక, ఈ - శరీరము, ఇప్పటికిన్, చాలునో, నిక్కము = నిజము, ఎఱుంగన్ + చెపుము + అ.

తాత్పర్యము: ఎన్నో సంశయములు గలుగు చున్నవి. కీడులు ముందు తోచుచున్నవి. లెక్కలేనన్ని విఘ్నములు కనబడుచున్నవి. పలు సందియములు పొడసూపెను. శంక లధికముగా నంకురించెను. ఎన్నియో మార్పులు బయలువడెను. నింద చిలవలు పలవలుగా వ్యాపించు చున్నది. లోకుల ఆఘోషయును, అభిలాషయును, అవధిలేక పుట్టెను. ఇన్నిటికిని సహించి నీ కోరిక నేను దీర్తును. ఇంతటి వానికి నీకు నన్నిచ్చుట భారము గాదు. అయిన నన్ను నీకు శాశ్వతముగా నర్పింతునా లేక యిప్పటికి శరీర మాత్రము చాలునా నిజము చెప్పుము.

విశేషములు: ఏరాళమ = ఏరాళముగానని యర్థము. `ఓ రాజ వదన యచటన, నీరాజన మబ్జనాభునికి నీ నున్నా, రేరాళము హరివల్లభలు' పాండు. 2. ఆ. హేరాళము (ప్రకృతి) - ఏరాళము (వికృతి) నీకు నేను శాశ్వతముగా గావలయునా? లేక యిప్పటికి శరీర మాత్రము చాలునా యనుట. అనగా నీకోరిక మానసికమా లేక కేవలము శారీరకమా? అనుట.

గీ. మొదలఁ గక్కుర్తి పడి [1]కూడి పిదపఁబాయు
నొక్క కమలాననకు డక్కి యుండఁ జాలఁ
డడవిఁ బెక్కు పుష్పంబులయందు వ్రాలు
చంచరీకంబు మగవాఁడు సరియు నువ్వె. 74

అర్థము: మొదలన్ = మొదట, కక్కుర్తి-పడి = ఆశపడి, కూడి = కలిసి, పిదపన్ = తరువాత, పాయు = వీడునట్టి, ఒక్క-కమల + ఆననకున్ = ఒక పద్మముఖికి-స్త్రీకి, డక్కి = వశపడి, ఉండన్ + చాలఁడు, అడవిన్ = అడవియందు, పెక్కు-పుష్పంబుల + అందున్ = పువ్వులయందు వ్రాలు = వ్రాలునట్టి చంచరీకంబున్ = తుమ్మెదయును,మగవాడున్ = పురుషుడును, సరి+అ-సువ్వె = సమానము సుమా!

1. తా. నీవు.

తాత్పర్యము: మొదట కక్కుఱితిపడి కూడి పిదప వీడెడు నొక స్త్రీకి పురుషుడు వశపడియుండజాలడు. అడవిలో ననేక పుష్పములపై వ్రాలు తుమ్మెదయు మగవాడు నొక్కఁటే సుమా.

విశేషములు: కక్కుర్తి - కక్కుఱితి-కక్కూఱితి-(రూపాం.) సామాన్యాంశము విశేషాంశముచే సమర్థింపంబడుచున్నది కావున నలంకారము అర్థాంతరన్యాసము.

ఉ. చందురు డంత చూడఁడు నిశా[1]సతిఁ, బున్నమనాఁడు గూడుచోఁ
గందళితానురాగుఁడయి కానఁగవచ్చు నవోదయంబులం
జందము దప్పి మీఁద నొక చాయకు వచ్చుఁ గ్రమక్రమంబునన్,
సుందరి పట్టునందుఁ బురుషుండును[2]నట్లయకాఁ దలంపుమీ 75

అర్థము: చందురుడు = చంద్రుడు, నిశా-సతిన్ = రాత్రియను స్త్రీని, పున్నమనాడు కూడుచోన్, అంత-చూడఁడు= అంతగా నాదరింపఁడు నవ+ఉదయంబులన్ = పాడ్యమి మున్నగు పొడుపులందు, కందళిత + అనురాగుండు+అయి =అంకురించిన యనురాగము (ఎఱుపు) గలవాడయి, కానఁగన్ + వచ్చున్ = కనబడును, చందము + తప్పి = విధము తప్పి, క్రమము తప్పి, మీదన్ = పిమ్మట, క్రమ-క్రమంబునన్ = క్రమక్రమముగా, ఒక - చాయకున్ = ఒక రీతికి, వచ్చున్, పురుషుండును = మగవాడును, సుందరి - పట్టు + అందున్ = స్త్రీ విషయమున, అట్లయ = అట్లే, కాన్ = అగునట్లు, తలంపుమీ = ఎంచుము.

తాత్పర్యము: పున్నమినాడు రాత్రియను స్త్రీ నంతగా నాదరింపడు. పాడ్యమినాడామెను గూడుచో నతడనురక్తుడై ఎఱ్ఱని వాడయిం కనుపట్టును. అతడు పిమ్మట విధముఁ దప్పి క్రమక్రమముగా నొక రీతికి వచ్చును. పురుషుడు కూడ స్త్రీ విషయమున నట్లే ప్రవర్తించునని యెంచుము.

విశేషములు: అలంకారము నిదర్శన. పౌర్ణమినాడు చంద్రుడు నిండుగా నుండి యనురక్తుడుగా గనుపట్టును. తక్కిన దినములం దతడు కృశించి క్రమముగా వృద్ధిపొందు చుండును. చంద్రుడు రాత్రి విషయమున నెట్లు కళాకళలుగా నుండునో, పురుషుడును స్త్రీ విషయమున నొకే రీతిగా ననురక్తుడై యుండక కళాకళలుగా నుండునని భావము.

వ. అనిన విని సుకుమారుండు 76

తాత్పర్యము: అని మాలెత పలుకగా విని సుకుమారుడు తరువాతి పద్యముతో నన్వయము.

---

1. ము. నటి. 2. తా. నిట్లయకా

క. మగవారల నిందింపకు
తగవునుఁ బంతంబు నిజము ధర్మముఁ గృపయున్
మగవారికె కాకెందును
మగువలకుం గలదె చంద్రమండలవదనా? 77

అర్థము: చంద్ర-మండల-వదనా=చంద్ర బింబము వంటి ముఖము గలదానా! మగవారలన్ = పురుషులను, నిందింపకు = తిట్టకుము, తగవును = న్యాయమును, పంతంబున్ = పట్టుదలయును, నిజమున్ = సత్యమును, ధర్మమున్, కృపయున్ = దయయును, మగవారికిన్ + ఎ-కాక = పురుషులకే గాని, ఎందును = ఎచ్చటనైనను, మగువలకున్ = స్త్రీలకు, కలదె = ఉన్నదా? లేదనుట

తాత్పర్యము: ఓ చంద్రబింబ ముఖీ! మగవారలను నిందింపకుము, తగవును, పంతమును నిజమును ధర్మమును, దయయును ఎచ్చటనైనను పురుషులకే గాని స్త్రీల కుండునా?

సీ. హరుని చిచ్చఱకంట నసమాస్త్రుఁ డీల్గిన
రతిదేవి యెట్లు జీవితముఁ జెందెఁ?
బాండుభూపాలుండు పరలోకగతుఁడైనఁ
గుంతి చావక యేమి కుడువనుండెఁ ?
బ్రథనాంగణమున సౌభద్రుండు చచ్చిన
బ్రతికెనెట్లు విరాటరాజతనయ?
సింధురా జస్తమించిన నేల దుస్సల
కాషాయ వస్త్రంబుఁ గట్టకొనియెఁ?

గీ. బంక్తిరథుఁ డన్యలోక సంప్రాప్తుఁడైన
నేల కౌసల్య ప్రాణ మీ నెఱుఁగ దయ్యెఁ?
దగవు, ధర్మంబు, పాడి, పంతంబు లెట్లు?
భామ లెట్లు? వృథానులాపంబు లేల? 78

అర్థము: అసమ + అస్త్రుండు = మన్మథుడు - విషమ సంఖ్య = ఐదు బాణములు గలవాడు, హరుని = శివుని యొక్క, చిచ్చఱ కంటన్ = అగ్నినేత్రముచేత, ఈల్గినన్ = చావగా, రతి-దేవి=అతనిభార్యయగు రతి, ఎట్లు, జీవితమున్ + చెందెన్ = బ్రతికెను? పాండు - భూపాలుండు = పాండురాజు, పర-లోక-గతుఁడు + ఐనన్ = కుడువన్ + ఉండెన్ = అనుభవించెను? సౌభద్రుడు = సుభద్ర కొడుకు - అభిమన్యుడు, ప్రథన + అంగణమునన్ = యుద్ధభూమియందు, చచ్చినన్, విరాట-రాజ-తనయ = విరాట రాజు కూతురు-ఉత్తర-అభిమన్యుని భార్య, ఎట్లు బ్రతికెన్?

సింధు-రాజు = సింధుదేశపు రాజు - సైంధవుడు, అస్తమించినన్ = చావగా, దుస్సల = అతని భార్యయగు దుస్సల, ఏల, కాషాయ - వస్త్రంబు = కావిబట్టను, కట్టుకొనియెన్?

పంక్తి-రథుడు = దశరథుడు, అన్య-లోక-సంప్రాప్తుండు + ఐనన్ = పరలోకగతుడు కాగా, కౌసల్య = దశరథుని భార్య, ఏల, ప్రాణము + ఈన్ + అయ్యెన్ = ప్రాణములు విడిచి పెట్టలేదు? తగవు, ధర్మంబు, పాడి = న్యాయము, పంతంబులు = నియమములు, లెట్లు, భామలు = స్త్రీలు, ఎట్లు, వృథా + అనులాపంబులు = వ్యర్థములైన మాటలు, ఏల?

తాత్పర్యము: శివుని మూడవ కంటి మంటకు మన్మథుడాహుతి కాగా నతని భార్యయగు రతి దేవి యెట్లు బ్రతికి యుండెను? పాండురాజు స్వర్గస్థుడుకాగా నతని భార్య కుంతి చావకయేమి యనుభవించెను? యుద్ధరంగమున నభిమన్యుడు హతుడు కాగా నతని భార్యయగు నుత్తర యెట్లు జీవించియుండెను? సైంధవుడు మరణింపగా నతని భార్య దుస్సల కావి బట్టలు గట్టుకొని వితంతువుగా నేలయుండిపోయెను? దశరథుడు స్వర్గస్థుడు కాగా నతని భార్య. కౌసల్య యేల ప్రాణములను గోలుపోవలేదు? కావున తగవు, ధర్మము, పాడి, పంతము లెక్కడ? స్త్రీ లెక్కడ? తగవు మున్నగు వానికిని స్త్రీలకును చాలదవ్వు.

విశేషములు: చిచ్చ - చిచ్చు (రూపాం)-అసమాస్త్రుడు = మన్మథుని బాణములైదు గావున నతడు బేసి సంఖ్యగల బాణములు గలవాడు. మన్మథుడు దేవతల పనుపున శివునికి పార్వతిపై ప్రేమము పుట్టింపయత్నించి యతని తపస్సునకు భంగము గలిగింప శివుడు వానిని తన మూడవ కంటి మంటచే దగ్ధుని గావించెను. పాండురాజు ముని శాపవశమున తన రెండవ భార్యయగు మాద్రితో గూడిన వెంటనే మరణింపగా నతని మొదటి భార్య కుంతి జీవించియే యుండెను. అర్జునుని కొడుకగు నభిమన్యుడు యుద్ధమున హతుడు కాగా, నతని భార్య యుత్తర యతనితోపాటు చావలేదు. సైంధవు డర్జున బాణ హతుడైనను నతని భార్య దుస్సల వితంతువుగా జీవించెను. దశరథునితో పాటతని భార్య కౌసల్య ప్రాణములను విడువలేదు. అందుచే స్త్రీలకు ధర్మాదులు లేవని సుకుమారుని యభిప్రాయము. మాలెత పురుషులను నిందింప, సుకుమారుడు స్త్రీలను నిందించుట చూడనగును.

గీ. అనినఁ జండాలకన్యక యాఁడు వారి
మంచితనమును మగవారి మంచితనము
సరియ కీడని మేలని చర్చలేల?
మనకు మన యాడికలు తప్పకునికి చాలు 79

అర్థము: అనినన్ = అని సుకుమారుడనగా, చండాల - కన్యక = మాలపిల్ల, ఆడువారి - మంచితనమును, మగవారి-మంచితనమున్ సరి +అ =సరే, వాని మాట యటుండనిమ్మనుట, కీడు + అని = చెడ్డది యని, మేలు = అని = మంచిది యని, చర్చలు + ఏల = వివాదము లెందులకు ? మనకున్ = మనయిరువురికిని, మన, ఆడికలు = నిందలు, తప్పక +ఉనికి = లేకుండుట, చాలున్.

తాత్పర్యము: అని సుకుమారుడు పలుకగా మాలెత `యాడువారి మంచితనము, మగవారి మంచితనము సరే కాని వాని కీడు మేళ్ల వివాదములు మనకెందులకు? మన యిరువురికిని మన నిందలు లేకున్న చాలు'

వ. విశ్వావసుడను గంధర్వరాజునకు మేనక యను నప్సరసకుం బ్రభవించిన ప్రమద్వర యను కన్యక స్థూలకేశాశ్రమంబునం బాదమర్దితం బగు పన్నగంబు గఱచినం బ్రవిలుప్త జీవిత యగుటయు భార్గవుండగు చ్యవనునకుం బౌత్రుండు ప్రమతి కొడుకు [1]రురుం డాయు రర్ధంబొసంగి యయ్యంగన బ్రతికించె ననియును, నర్జునుం డశ్వమే ధాశ్వానుసారియై యాత్మజుండగు బభ్రువాహనునిచేత నాహవాంగణంబున (నతి నిశాత) శరాహృత ప్రాణుండైన నులూచి యను నాగ కన్యక రసాతలంబునుండి యేతెంచి (యుపచరించి) యుపగత ప్రాణునింజేసెననియు విందుము. మంచితనంబు లాడువారికి మగవారికి సరియ యద్ది యటు లుండె నా పంతంబు వినుము. 80

అర్థము: విశ్వావసుండు + అను, గంధర్వ-రాజునకున్, మేనక, అను + అప్సరసకున్, ప్రభవించిన = పుట్టిన, ప్రమద్వర, అను, కన్యక, స్థూలకేశ + ఆశ్రమ - వనంబునన్ = స్థూలకేశుడను వాని యాశ్రమము తోటయందు, పాద-మర్దితంబు = అడుగుచే, త్రొక్కబడినది, అగు, పన్నగంబు = పాము, కఱచినన్, ప్రవిలుప్త-జీవిత = లోపించిన బ్రదుకు గలది- చచ్చినది, అగుటయున్ = కాగా, భార్గవుండు = భృగువంశము వాడు, అగు, చ్యవనునకున్, పౌత్రుండు = కొడుకు కొడుకు - మనుమడు, ప్రమతి - కొడుకు, రురుడు, ఆయుస్ (కః) + అర్ధంబు = ఆయువులో సగము, ఒసంగి = ఇచ్చి, ఆ + అంగనన్ = ఆ స్త్రీని - ప్రమద్వరను, బ్రతికించెన్ + అనియును, అర్జునుండు, అశ్వమేధ + అశ్వ + అనుసారి + ఐ = అశ్వమేధ యజ్ఞ తురగము ననుసరించినవాడయి, ఆత్మజుండు + అగు =కుమారుడైన, బభ్రువాహనుని చేతన్, ఆహవ + అంగణంబునన్ = యుద్ధరంగమునందు, అతి-నిశాత-శర + ఆహృత -ప్రాణుండు + ఐనన్ = మిక్కిలి, వాడియైన, బాణములచే, హరింపబడిన, ప్రాణము గలవాడు కాగా, ఉలూచి = అర్జునుని భార్య, అను, నాగ - కన్యక = పాపపడతి, రసా-తలంబున నుండి = పాతాళమునందుండి, ఏతెంచి =

1. తా. రురుండనువాఁడు తన యాయువందు నర్ధం బొసంగి.

వచ్చి, ఉపచరించి = సేవించి, ఉపగత - ప్రాణునిన్ = పొందబడిన ప్రాణము గలవానినిగా, చేసెన్ + అనియున్, విందుము, మంచితనంబులు, ఆడువారికిన్, మగవారికిన్, సరి + అ = సమానమే, అద్ది = అది, అటులు + ఉండెన్, నా - పంతంబు = శపథము, వినుము.

తాత్పర్యము: విశ్వావసుడను పేరుగల గంధర్వ రాజునకును, మేనకయను దేవవేశ్యకును పుట్టిన ప్రమద్వర యను కన్యక స్థూలకేశుని యాశ్రమము నందలి తోటలో నొక పామును త్రొక్కగా నది యామెను కఱచెను. దానితో నామె ప్రాణములను కోలుపోయెను. అప్పుడు భార్గవుడగు చ్యవనుని పౌత్రుడును, ప్రమతి యనువాని కొడుకును అగు రురుడను వాడు తన యాయువునందు సగ మామెకిచ్చి యామెను బ్రతికించెనని విందుము. మఱియును ధర్మరాజు చేసిన యశ్వమేధయాగమున విడిచిన యాగతురగము ననుసరించి వెడలిన అర్జునుడు తన కొడుకగు బభ్రువాహనునిచే యుద్ధరంగమున బాణములచే కొట్టబడి మరణింపగా, నతని భార్య యగు నులూచియను నాగాంగన పాతాళలోకమునుండి వచ్చి సేవించి యతనిని బ్రదికించెననియును విందుము. మంచి తనము లాడువారికి మగవారికి సమానమే. అది యట్లుండె నా శపథమును వినుము.

విశేషములు: పన్నగము - `ఉరగః పన్నగో భోగీ జిహ్మగః పవనాశనః' - పద్భ్యాం న గచ్ఛతీతి పన్నగః - పాదములతో పోవనిది లేదా పన్నం పతితం యథాతథా గచ్ఛతీతి పన్నగః - పడినట్టుగా పోవునది - పాము. అమరము. ఉలూచి, ఉలూపి రెండును గలవు. రసాతలంబున నుండి - రసాతలంబు వలన నుండి - `ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగ నగు.' బాల. కారక. 11.

ఉ. "నాకు మనంబు నిండ నొక నమ్మిక సేయుము (సర్వకాలమున్)
గైకొనవాడ[1]ని' న్ననుము కాదన కెక్కడకైన వచ్చెదన్
నీకొకటయ్యె నేని యవనీసుర మన్మథ! నిర్విశంకతన్
నాకము జూఱ[2]వెట్టెద ధనంజయతీవ్రశిఖా ముఖంబునన్." 81

అర్థము: అవనీసుర - మన్మథ = మన్మథునివలె సుందరుడైన బ్రాహ్మణుడా! నాకున్, మనంబు = మనస్సు, నిండన్ = (సంతోషముతో) నిండగా - లేదా నిండు మనస్సుతోననియేని, ఒక, నమ్మిక, చేయుము, సర్వ - కాలమున్ = ఎల్లకాలమును, నిన్నున్, కైకొనువాడన్ = స్వీకరింతును, అనుము = అని పలుకుము, కాదు + అనక, ఎక్కడకున్ + ఐనన్ = వచ్చెదన్, నీకున్, ఒకటి - అయ్యెన్ + ఏని = ఏదయిననొక అపాయము సంభవించె నేని, నిర్విశంకతన్ = నిస్సందేహముగా,

1. తా. నిన్ననిన. 2. తా. వట్టెద

ధనంజయ - తీవ్ర - శిఖా - ముఖంబునన్ = అగ్నియొక్క, భయంకరమైన, జ్వాలల ద్వారమున, నాకమున్ = స్వర్గమును, చూఱ + పెట్టెదన్ = కొల్లగొట్టెదను.

తాత్పర్యము: "మన్మథ సుందరుడవైన యో బ్రాహ్మణుడా! నాకు నీవు మనస్ఫూర్తిగా నొక మాటయిమ్ము. `నిన్ను ఎల్ల కాలమును గైకొందు'ననుము. నేను కాదనక నీతో పాటెక్కడకైనను వత్తును. నీకేదైన నొక యాపద - మరణము - సంభవించె నేని నిస్సందేహముగా నగ్నియందుదూకి స్వర్గమును చూఱగొందును.".

విశేషములు: నమ్మిక + చేయుము, చూఱ + పెట్టెద - గసడదవాదేశము. బాల. సంధి. 13 - నమ్మికసేయుము. నీకొకటయ్యెనేని - నీకు మరణము సంభవించెనేని - అమంగళము పలుకుట కిష్టము లేక యిట్లు సూచించుట. ధనంజయ - `వహ్ని ర్వీతి హోత్రో ధనఞ్జయః'. ధనం జయతీతి ధనంజయః - ధనమును జయించువాడు - అగ్ని - అమరము.

వ. అనిన విని సంతోషించి సుకుమారుండు 82

తాత్పర్యము: మాలెత పలుకులు విని సంతోషించి సుకుమారుడు, తరువాతి పద్యముతో నన్వయము.

సీ. "కలహంస సంపదగల కలక్రేంకార
కలకలంబైన యీ కొలను సాక్షి
ప్రసవసౌరభనట ద్భంభరంబైన యీ
[1]ఫలినీలతా మండపంబు సాక్షి
ప్రచ్ఛాయశీతలోపరిభాగమైన యీ
శశికాంతమణి శిలాస్థలము సాక్షి
తరులతాగుల్మసంతతపిధానాతప
వ్యాపారమైన యీ వనము సాక్షి

గీ. మకరకేతను పాదపద్మములు సాక్షి
రతిమహాదేవి జఘనభారంబు సాక్షి
సత్య మెన్నడు నినుఁ బాయ సమ్మతించి
కౌగిలింపగ నీఁగదే కమలవదన!" 83

అర్థము: కమల - వదన = ఓ పద్మముఖీ! కలహంస - సంపద - కల = రాయంచల సంపదగల, కల - క్రేంకార - కలకలంబు = అవ్యక్త మధురమైన -

1. ము. వలని.

కూతలయొక్క - సందడి గలదియగు, ఈ, కొలను, సాక్షి. ప్రసవ - సౌరభ - నటత్ - బంభరంబు = పూలయొక్క, పరిమళము కొఱకు, సంచరించుచున్న, తుమ్మెదలు గలది, ఐన = ఈ, ఫలినీ - లతా - మండపంబు = ప్రేంకణపు తీగల పొదరిల్లు, సాక్షి. ప్రచ్ఛాయ - శీతల + ఉపరిభాగము = ఎక్కువ నీడచే చల్లని, పయిభాగము గలది, ఐన, ఈ, శశికాంత - మణి - శిలా - స్థలము = చంద్రకాంతమణుల ఱాతి ప్రదేశము, సాక్షి. తరు ..... వ్యాపారము : తరు = చెట్లయొక్కయు, లతా = తీగలయొక్కయు, గుల్మ = పొదలయొక్కయు, సంతత = ఎడతెగని, పిధాన = కప్పుగల, ఆతప = ఎండయొక్క, వ్యాపారము = పని గలది, ఐన, ఈ, వనము = తోట, సాక్షి. మకర - కేతను = మొసలి ధ్వజముగా గల మన్మథుని యొక్క, పాద - పద్మములు = అడుగుదామరలు, సాక్షి. రతి - మహాదేవి = మన్మథుని భార్యయైన రతి మహాదేవి యొక్క, జఘన - భారంబు = పిఱుదుల ముందుభాగముయొక్క, బరువు, సాక్షి. సత్యము = నిజము, ఎన్నడున్, నినున్, పాయన్ = వీడను, సమ్మతించి = అంగీకరించి, కౌగిలింపగన్ + ఈగదే = కౌగిలించుకొననీవా?

తాత్పర్యము: "ఓ పద్మముఖీ! రాయంచల సంపద గలిగి, వాని క్రేంకారముల సందడితో గూడిన యీ కొలను సాక్షి. పూలపరిమళము కయి తిరుగు తుమ్మెదలు గల యీ ప్రేంకణపు దీగల పొదరిల్లు సాక్షి. అధికమైన నీడచే చల్లనైన పయిభాగము గల యీ చంద్రకాంత మణిశిలాప్రదేశము సాక్షి. చెట్లయు, తీగలయు పొదరిండ్లయు నెడ తెగని కప్పుచే నెండ తగులని యీ తోట సాక్షి. మన్మథుని యడుగు దామరలు సాక్షి. రతిదేవి జఘనభారము సాక్షి. నిజము. నిన్ను నేనెన్నడును వీడను. కావున నీ వంగీకరించి నిన్ను గౌగిలించుకొననీవా?"

విశేషములు: సుకుమారుడు తాను మాలెతనెన్నటికిని వీడననుటకు జూపిన సాక్షులు శృంగార రసోచితములై ప్రకరణానుగుణముగా నున్నవి. క్రేంకార - శారికాదిధ్వని (సూ.ని.) ఫలిని - ప్రియంగువు, ప్రేంకణము. `ప్రియఙ్గుః ఫలినీ ఫలీ' - ఫలతి విశీర్యత ఇతి ఫలినీ - పగులునది. `మంటపము' - ఈ తత్సమ రూపము గానరాదు. వికృతి యయి యుండనోపు. అప్పుడు `లతామంటపంబు' సమాసము. తప్పును. `మండపము' తత్సమ రూపముగావున `లతా మండపంబు' అనిన సరిపోవును. జఘనము - `క్లీబే తు జఘనం పురః' హన్యతే పురుషేణ తాడ్యత ఇతి జఘనమ్.' పురుషుని చేత పీడింపబడునది - స్త్రీల మొలముందరి చోటు. శ్రోణీ పశ్చాద్భాగ మనియు. సూ.ని. `అభ్యున్నతా పురస్తా దవగాఢా జఘనగౌరవాత్ పశ్చాత్ ..... పద పఙ్క్తిః' శాకుం. 3.6. సుకుమారుని సాక్షుల కేమి, శ్రీనాథకవి సార్వభౌముని మహారసికత కీ పద్యము సాక్షి.

వ. (అనిన) (చండాలి కరారవిందంబులు [1]మొగిడిచి సవినయంబును* (సగౌరవంబును) సానురాగంబును గా నతనికిట్లనియె. 84

అర్థము: అనినన్ = అని సుకుమారుడనగా, చండాలి = చండాల కన్యక, కర + అరవిందంబులు = తామరలవంటి చేతులు, మొగిడిచి = మోడ్చి, సవినయంబును = అడకువతోను, సగౌరవంబును = మన్ననతోను, స+ అనురాగంబును = వలపుతోను గూడికొనునట్లు, కాన్, అతనికిన్, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: అట్లు సుకుమారుడు పలుకగా నా మాలెత కేలు దమ్ములు మోడ్చి వినయగౌరవానురాగములతో నతనికిట్లనెను.

ఉ. "నేడు కృతార్థులైరి జననీ జనకు, ల్ఫలియించెఁ బుణ్యముల్
నేడు పురాకృతంబు, లవనీరుహమూలనివాసియైన కా
(్రే డిలు[2]వేల్పు నేడ యొనరించె మనోరథ సిద్ధి సంపదల్
నేడుగదా (సువారమిది నీకృప) గంటి ధరాసురోత్తమా!" 85

అర్థము: ధరా - సుర + ఉత్తమా = బ్రాహ్మణులలో శ్రేష్ఠుడా!, జననీ - జనకుల్ = తల్లిదండ్రులు, నేడు, కృతార్థులు + ఐరి = ధన్యులయినారు, నేడు, పురా - కృతంబులు = పూర్వము చేయబడినవి, పుణ్యముల్ = పుణ్యకార్యములు, ఫలియించెన్ = పండెను, అవనీరుహ - మూల - నివాసి = చెట్టుమొదట నివసించువాడు, ఐన, కాటి + ఱేడు (కాఱ్రేడు) = వేటకాండ్రు మున్నగు వారు కొలిచెడి శివరూప దేవత, ఇలు - వేల్పు = ఇంటిదైవము, నేడు + అ = నేడే, మనోరథ - సిద్ధి - సంపదల్ = కోరికలు తీఱుట యను సంపదలు, ఒనరించెన్ = చేసెను, నేడు + కదా, సువారము = సుదినము, ఇది, నీ - కృపన్ = నీ దయచేత, కంటిన్ = పొందితిని.

తాత్పర్యము: "ఓ బ్రాహ్మణోత్తమా! నేడు నా తల్లిదండ్రులు ధన్యులైరి. నేను పూర్వజన్మమున చేసిన పుణ్యకార్యములు నేడు ఫలించెను. వృక్షమూలమున నుండు మా యిలువేల్పు శివరూపదేవత నేడే నా కోరికలను సఫలములగావించెను. నేడుగదా సుదినము. నీ దయవలన దీనిని గంటిని."

విశేషములు: కాఱ్రేడు = కాటి + ఱేడు. మృగయులు మున్నగువారు కొలిచెడి శివరూపదేవత (సూ.ని.), సువారము = సు + వారము = సుదినము. సువారము = వంట. ఈ యర్థమిట పొసగదను తలపున చెప్పలేదు.

1. తా. మోడ్చి. * తాళపత్రమున లేదు. 2. ము. వేలుపొచు నొనరించె.

.ఉత్సాహ. "మలుసమర్త నంటకుండి మాలదాననగుటనేఁ
గలయ[1]నీళ్లనాడి కడవ గ్రంత యంటు కొనుటకై
. కొలనఁ గ్రుంకి పోవుచుండి కుసుమబాణనిభునిని
న్నలఘు(తేజు) లోచనంబు లలరఁ జూచి వలచితిన్". 86

అర్థము: ఏన్ నేను, మాలదానన్ + అగుటన్ = మాలదాననగుటచేత, మలు - సమర్తన్ = రెండవదియగు ముట్టు అంటక + ఉండి = దేనిని తాకకుండి, కలయన్ = బాగుగా, నీళ్ళనాడి = స్నానము చేసి, కడవ + క్రంత = కుండ, వస్తువు, అంటుకొనుటకై = తాకుటకయి, కొలనన్ = సరస్సునందు, క్రుంకి = మునిగి, పోవుచున్ + ఉండి = వెడలుచుండి, కుసుమ - బాణ - నిభునిన్ = పువ్వులు బాణములుగా గలమన్మథునితో సమానుని, అలఘు - తేజున్ = అధికమైన తేజస్సుగల వానిని, నిన్నున్, లోచనంబులు = కన్నులు, అలరన్ = సంతోషింపగా - కనువిందుగా, చూచి, వలచితిన్ = ప్రేమించితిని.

తాత్పర్యము: "నేను మాలదాననగుటచే రెండవదియగు ముట్టున దేనిని తాకకుండి, బాగుగా స్నానము చేసి కుండ, వస్తువులు, అంటుకొనుటకై కొలని యందు మునిగి యింటికి బోవుచు మన్మథ సమానుడవు, అధిక తేజస్కుడవునగు నిన్ను కన్నులపండువుగా జూచి వలచితిని."

విశేషములు: మలు సమర్త = రెండవ సారి ముట్టా? ముట్టు రెండవనాడా? ఏదియైనగావచ్చును. మాలది కావున స్నానము చేసి యన్నియును తాకవచ్చును. ఇతరలయినచో మూన్నాళ్ళు దేనిని ముట్టరాదు. క్రంత = పెండ్లి కొడుకువారు పెండ్లి కూతునకు తీసికొనిపోవు ప్రధానద్రవ్యము. (సూ.ని.) రజస్సమయమున స్నానము చేయనిదే కడవనుగాని, క్రంతను గాని ముట్టరాదు. ఉత్సాహవృత్తమున ప్రతిపాదమునను ఏడు సూర్యగణములు నొక గురువు నుండవలయును. మొదటి గణము మొదటి యక్షరమునకు అయిదవ గణము మొదటి యక్షరమునకును మొదటి యక్షరమునకు యతిమైత్రి. ప్రాసనియమము గలదు. మాలెత యయ్యు నాచారమును పాటించుట గమనింప దగినది. కొలనన్ - కొలను + అందున్ `ఔపవిభక్తికమల తృతీయా సప్తముల కత్వంబాదేశంబు బహుళంబుగా నగు.' బాల. అచ్చిక. 38 - కొలను + అన్. అపరాదిస్వరసంధి. బాల. సంధి. 11 కొలనన్.

గీ. "ఏమి సేయుదు? నీకు నెట్టెత్తు నన్నుఁ
[2]బచ్చి ముట్టున గలుగు బీభత్స మెఱిఁగి?
[3]యిచ్చగింపక యుండ నే నెట్లు నేర్తు
నధికతరమైన మన్మథాయత్తు నిన్ను?" 87

1 తా. నీళ్లాడికడువంగాంతయింటికొనుటకై 2. ము. బంచముని యింటఁగలు బీభత్సునెఱింగి, 3. తా. యిచ్చగించుకొనుండ నేనెంత నేర్తు

అర్థము: పచ్చి - ముట్టునన్ = రజస్స్రావము ఆగకుండునప్పుడు కలుగు, బీభత్సము = రోత, ఎఱింగి - తెలిపి, నన్నున్, నీకున్, కలుగు, బీభత్సము = రోత, ఎఱిఁగీ = తెలిసి, నన్నున్, నీకున్. ఎట్టు + ఇత్తున్, అధికతరము + ఐన = ఎక్కువయైన, మన్మథ + ఆయత్తున్ = మన్మథునకు వశపడినవానిని, నిన్నున్, ఇచ్చగింపక + ఉండన్ = అంగీకరింపకుండ, నేను, ఎట్లు, నేర్తున్, ఏమి + చేయుదున్.

తాత్పర్యము: రజస్స్రావగకుండగనె కలుగు రోత యెఱిగి నేను నన్ను నీకెటు లర్పింతును? మిక్కిలి మన్మథవశుడవైన నిన్ను అంగీకరింపకుండ నే నెటు లుండగలను? ఏమి చేయుదును?

విశేషములు: అధికతరమైన మన్మథాయత్తున్ - అధికతరముగా అని అర్థము చెప్పవలయును.

వ. అనిన సుకుమారుండు చండాలకన్యక కిట్లనియె. 88

అర్థ తాత్పర్యములు సుగమములు.

శా. "ఏ మాసించినఁ బ్రాణరక్షకయి యేమే బాపముల్సేసినన్
భామా! చెల్లుఁబురాణ సంహితలఁ జెప్పన్ విందుమే కాదె వి
శ్వామిత్రుం[1]డెడరైనచో శునకమాంసంబున్ భుజింపండె నీ
వ్యామగ్రాహ్యకుచంబు లంటి యిదె[2]నా ప్రాణంబు రక్షించెదన్." 89

అర్థము: భామా = ఓ యింతీ!, ఏమి + ఆసించినన్ = ఏమి అపేక్షించినను, ప్రాణ - రక్ష - కయి = ప్రాణములను గాపాడుటకయి, ఏమి + ఏన్ + పాపముల్ = ఏమయిన పాపకార్యములు, చేసినన్ = చేసినను, చెల్లున్ = ఒప్పును, (అని), పురాణ - సంహితలన్ = పురాణములందును, స్మృతులయందును, చెప్పన్ = చెప్పగా, విందుము + ఏ - కాదె = విందుమేకదా!, ఎడరు + ఐనచోన్ = ఆపద గలిగినప్పుడు, విశ్వామిత్రుండు, శునక = మాంసంబున్ = కుక్క మాంసమును, భుజింపఁడు + ఎ = తినడా?, నీ - వ్యామ - గ్రాహ్య - కుచంబులు = బారచే గ్రహింపదగిన స్తనములు, అంటి = పట్టి, ఇదె, నా, ప్రాణంబున్, రక్షించెదన్.

తాత్పర్యము: "ఓ యింతీ! దేని నపేక్షించినను, ప్రాణ రక్షణార్థము ఏమయినను పాపములు చేసినను ఒప్పునని పురాణములందును, స్మృతులందును చెప్పుట విందుమే కదా! ప్రాణముల్ల కాపద సంభవించినప్పుడు విశ్వామిత్రుని వంటి వాడే

1. తా. డెడలైనచో, 2. తా.నేఁ బ్రాణంబు

కుక్కమాంసమును తినలేదా! కావున నా ప్రాణములను రక్షించుటకొఱకు బార కందెడు నీ స్తనములను పట్టెదను."

విశేషములు: ఏమాసించినన్ = ఆ పాపములను చేయుటలో మఱే ఆపేక్ష ఇమిడి యున్నను ప్రాణరక్ష జరగుచేననుట. త్రేతా ద్వాపర సంధిని గొప్ప క్షామము సంభవింపగా విశ్వామిత్రుడు తినుట కేదియు దొరకక మాలపల్లెలో గొందు తినగా మిగిలిన కుక్కమాంసమును తినెను. `మహర్షివి నీ విట్లు చేయ వచ్చునా?' యని యడుగ నతడు ప్రాణరక్ష ముఖ్యమని చెప్పెను. సంహిత = ధర్మశాస్త్ర గ్రంథము, స్మృతి. లేదా వేద భాగము. వ్యామ - అడ్డముగా చాపబడిన చేతుల నడిమి కొలత, బార - (సూ.ని.) - మిక్కిలి పెద్దవియగు కుచములనుట. ధర్మరక్షకంటెను ప్రాణరక్ష మిన్నయనుట. `నీ కుచముల నంటుట ధర్మవిరుద్ధమయినను, అట్లు చేయనిచో నా ప్రాణములే పోవును గావున, నట్లు చేయుదుననుట.

వ. ఇదె యెదుర (ససంభ్రమ భ్రమ ద్భ్ర) మరకుల చరణనఖ శిఖా శిఖర ~ర్యమాణ కుసుమకేసర రేణు త్ర సరేణు విసర పిశంగి తోప కంఠంబు లతామండపం; బిదె వెనుకం గుటిల శుక త్రోటి కోటీ విపాటిత మధుర ఫల రస ధారా సార దుర్దినాయమా నాభ్యంతర ప్రదేశంబు చూత తరువాటికా భ్యాశం; బిదె కెలన మదకల మల్లికాక్ష పక్ష[1]పాళీ నవ పవన సంపాత కంపమాన కమల కేసర పరాగ ధూళీ విరచి తాళీక సంధ్యాను బంధ చకిత చక్రవాక నీడోద్భవ క్రీడా నీడంబులు సరససైకత వేతసీ నికుంజ క్రోడంబు; లిందు నీకు నింపు వుట్టినట్టియెడ నన్ను మన్నింపు; మంట కున్నదాన నని భయం బందకు; కుసుమ సమయంబు గదా ఫలావాప్తికి మూలం; బింక గాలక్షేపంబు చేసితేని కందర్పుండు దర్పాతిరేకంబున భవ ద్భ్రూవల్లీ మతల్లికిం దల్లి యగు [2]నించు వింటిం బద్ద దిగిచి కొదమ తుమ్మెద ఔక్కగ కట్టిన పూమిట్ట కోలల హృదయం బుద్ఘాటించి చంపు; జంపక కుసుమ గంధీ! ప్రాణంబు రక్షింపు; మిదె నీకు సేవాంజలి" యని కంకణ ఝణ ఝణత్కారంబు తోరంబుగా సుకుమారుండు నఖ కిరణ పరంపరా కుసుమ కుట్మ లాభిరామంబులగు కరకిసలయంబులు మోడ్చి ఫాలభాగంబునం గీలించిన. 90

అర్థము: ఇదె, ఎదురన్, ససంభ్రమ ...... మండపంబు : ససంభ్రమ = వేగిరపాటుతో, భ్రమత్ = సంచరించుచున్న, భ్రమర = తుమ్మెదల యొక్క, కుల = సమూహము యొక్క, చరణ = కాళ్ల, నఖ = గోరుల, శిఖా = సిగల, శిఖర = కొనలచే, విశీర్యమాణ = చెల్లా చెదరగుచున్న, కుసుమ = పూలయొక్క, కేసర = అకరువుల యొక్క, రేణు = పుప్పొడి యొక్క, త్రసరేణు = ముప్పది పరమాణువుల కొలదుల యొక్క, విసర = సమూహము చేత, పిశంగిత = పింగళ వర్ణము

1. తా. పాథివిక్షేప ప్రభవసంపాత 2. తా. నించువిల్లు దెగనిడందిగిచి

గలదిగా చేయబడిన, ఉపకంఠంబు = సమీపదేశము గలది, అగు, లతా - మండపంబు = తీవ మంటపము. ఇదె, వెనుకన్, కుటిల ..... ప్రదేశంబు: కుటిల = వంకరయైన, శుక - త్రోటి = చిలుకల ముక్కుల యొక్క, కోటీ = అంచులచేత, విపాటిత = కొట్టబడిన, మధుర = తీయని, ఫల = పండ్లయొక్క, రస = రసము యొక్క, ధారా = ప్రవాహములనెడి, ఆసార = జడివానలచేత, దుర్దినాయమాన = మబ్బులు క్రమ్మిన దినము వలెనగుచున్న, అభ్యంతర - ప్రదేశంబు = లోపలి ప్రదేశముగలది, అగు, చూత - తరు = మామిడి చెట్ల, వాటికా = తోటల యొక్క, అభ్యాశంబు = సమీపదేశము గలది. ఇదె, కెలనన్ = ప్రక్కను, మదకల...... నీడంబులు: మదకల =మదముచేత అవ్యక్త మధురమైన, మల్లికాక్ష = హంసలయొక్క, పక్ష = ఱెక్కల యొక్క, పాళీ = వరుసలవలన నైన,—నవ = క్రొత్తదైన, పవన = గాలి యొక్క, సంపాత = పాటుచే, కంపమాన = చలించుచున్న, కమల = పద్మముల యొక్క, కేసర = అకరువుల యందలి, పరాగ ధూళీ = పుప్పొడుల చేత, విరచిత = చేయబడిన, అళీక = కృత్రిమమైన, సంధ్యా = సంజయొక్క, అనుబంధ = సంబంధముచేత, చకిత = భయపడిన, చక్రవాక = జక్కవలనెడి, నీడోద్భవ = పక్షుల యొక్క, క్రీడా = ఆటలుగల, నీడంబులు = గూండ్లు కలవి, అగు, సరస = రమణీయమైన, సైకత = ఇసుక తిన్నెల యందలి, వేతసీ = ప్రబ్బలి చెట్ల, నికుంజ = పొదల యొక్క, క్రోడంబులు = లోపలి భాగములు. ఇందున్ = వీనిలో, నీకున్, ఇంపు + పుట్టిన + అట్టి + ఎడన్ = ఇష్టమగుచోట, నన్నున్, మన్నింపుము = ఆదరింపుము, అంటక + ఉన్నదానన్ + అని = ముట్టుతనుగదా యని, భయంబు + అందకు =వెఱవకుము, కుసుమ - సమయంబు + కదా! = ఋతు సమయముకదా, వసంతర్తువుగదా యని యర్థాంతరము, ఫల + అవాప్తికిన్ = ఫలప్రాప్తికి, మూలంబు = కారణము, ఇంకన్, కాల-క్షేపంబు = కాలయాపనము, చేసితి + ఏని = చేసితివేని, కందర్పుండు = మన్మథుడు, దర్ప + అతిరేకంబునన్ = గర్వాతిశయముతో, భవత్ + భ్రూవల్లీ - మతల్లికిన్ = నీదయిన, శ్రేష్ఠమగు తీవవంటి బొమకు, తల్లి = అమ్మ, అగు, దానిని పోలిన యనుట, ఇంచు - వింటిన్ = చెఱకు వింటిని, బద్ధ - తిగిచి = వంచి, కొదమ - తుమ్మెదల యొక్క, ఱెక్కగ + కట్టిన = ఈకలు గట్టిన, పూ - మిట్ట - కోలలన్ = పూవులనెడి వాడి బాణములచేత, హృదయంబు = మనస్సు, ఉద్ఘాటించి = కొట్టి, చంపున్, చంపక - కుసుమ - గంధీ = సంపెంగపూవు వాసన వంటి వాసన గలదానా, ప్రాణంబు, రక్షింపుము, ఇదె, నీకు, సేవా + అంజలి = సేవాపూర్వక నమస్కారము, అని, కంకణ = చేతికడియముల యొక్క, ఝణఝణత్కారంబు = ఝణఝణ యను ధ్వని, తోరంబు + కాన్ = అధికము కాగా, సుకుమారుండు, నఖ ......రామంబు: నఖ = గోరులయొక్క, కిరణ = కాంతుల యొక్క, పరంపరా = వరుసయనెడు,

కుసుమ - కుట్మల = పూమొగ్గలతో, అభిరామంబులు = మనోహరమైనవి, అగు, కర - కిసలయంబులు = చివురు చేతులు మోడ్చి, ఫాల - భాగంబునన్ = నొసటి ప్రదేశమునందు, కీలించినన్ = పెట్టగా.

తాత్పర్యము: "ఇదె యెదుర వేగిరపాటుతో తిరుగు తుమ్మెదల గుంపుల కాళ్లచేతను, గోరుల చేతను, సిగలచేతను చెల్లా చెదరగుచున్న పూల అకరువుల యందలి పుప్పొళ్ళ రాశులచే పింగళ వర్ణము గల సమీపదేశముగల తీవ మంటపము. ఇదె వెనుక చిలుకల వంకర ముక్కుల కొనలచే కొట్టబడిన తీయని పండ్లరసముల ప్రవాహములనెడి జడులచే మబ్బుక్రమ్మినటులగుచున్న నడిమి ప్రదేశము గల మామిడితోపు సామీప్యము. ఇవె ప్రక్కను మదముచే నవ్యక్తధ్వని చేయు హంసల ఱెక్కల యొక్క గాలి పాటుచే కదలుచున్న పద్మముల అకరువుల పుప్పొళ్ళచే చేయబడిన కృత్రిమ సంధ్యచే వెఱచిన జక్కవ పిట్టలు క్రీడించు గూండ్లు గల యిసుక తిన్నెలందలి ప్రబ్బలిపొదలలోపలి భాగములు.

వీనిలో నీకు నచ్చిన చోట నన్ను ఆదరింపుము. ముట్టుతను గదా తాకరాని దానని భయపడకుము. కుసుమ సమయమేకదా ఫలప్రాప్తికి మూలము. ఇంక కాలయాపనము చేసితివేని మన్మథుడు గర్వాతిశయమున నీ బొమతీవ వంటి చెఱకు వింటిని వంచి తుమ్మెద ఱెక్కల యీకలు కట్టిన వాడి పూవుటమ్ములచే నా హృదయమును గొట్టి నన్ను చంపును. సంపెంగపూవు పరిమళముగలదానా! నా ప్రాణమును రక్షింపుము. ఇదె నీకు నమస్కారము." అని చేతి కడియముల ఝుణఝుణ ధ్వనులధికముకాగా సుకుమారుడు గోరుల కాంతుల వరుసలనెడి పూ మొగ్గలతో మనోహరములైన చివురుజేతులు జోడించి నుదుట బెట్టిన - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ధారాసార - ధారలనెడి ఆసార - రూపకము, అభ్యాశము - అభ్యాసము (రూపాం.) కెలనన్ - కెలను + అందున్. `ఔప విభక్తికముల తృతీయాసప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగానగు.' బాల. అచ్చిక. 38. కెలను + అన్ - అపదాదిస్వర సంధి - బాల. సంధి.11. ఇంపు + పుట్టి - ఇంపు వుట్టి - గసడదవాదేశము. బాల. సంధి. 13. కుసుమ సమయంబు గదా ఫలావాప్తికి మూలంబు - శ్లేషము. అందకు - అందకుము - `వ్యతిరేకమధ్యమ ముపర్ణకంబున కెల్లయెడల లోపంబు విభాషనగు.' భవత్ + భ్రూవల్లి - ఝుల్లునకు హశ్ను పరమగుచుండగా తృతీయ వర్ణాదేశము. భవద్భ్రూవల్లి. మతల్లి - మతల్లిక, మత్తల్లిక (రూపాం.) `మతల్లికా మచర్చికా ప్రకాణ్ణ ముద్ధతల్లజౌ, ప్రశస్త వాచకా న్యమూని.' అమరము. శ్రేష్ఠతావాచకములు. ఇవి ఒక శబ్దమునకు విశేషణములైనను తమతమ లింగములను విడువక ఆ విశేష్యమునకు పరమైయుండును. ఝుణఝుణ - కంకణ

ధ్వన్యనుకరణ శబ్దము. కర - కిసలయములు - ఉపమానోత్తర పద కర్మధారయము - కిసలయముల వంటి కరములు.

శా. వాలాయంబుగ నద్ధరాసురుఁడు ద న్వాంఛించిన న్మందహా
సాలంకార మనోజ్ఞమైన ముఖ మొయ్యె న్వాం[1]చి చండాలి యా
లీలా[2]భావము కీలెఱింగి నవమల్లీకుంజమధ్యంబునం
గేలీతల్పముఁ దీర్చెఁ[3]బో మృదులకంకేలీప్రవాలంబులన్. 91.

అర్థము: ఆ + ధరా - సురుడు = ఆ బ్రాహ్మణుడు - సుకుమారుడు, వాలాయంబుగన్ = అనివార్యముగా, తన్ = తన్ను, వాంఛించినన్ = కోరగా, చండాలి = మాలెత, మంద -హాస + అలంకార - మనోజ్ఞము = చిఱునవ్వు అనెడి భూషణముచే మనోహరము, ఐన, ముఖము, ఒయ్యన్ = మెల్లగా, వాంచి = వంచి, ఆ - లీలా - భావము = ఆ శృంగార భావము యొక్క, కీలు + ఎఱింగి = మర్మము తెలిసి, నవ - మల్లీ - కుంజ - మధ్యంబునన్ = విరజాజి పొదల నడుమ, మృదుల - కంకేలీ - ప్రవాలంబులన్ = మెత్తని, అశోకపు; చివురులతో, కేలీ - తల్పమున్ = క్రీడార్థమయిన పానుపును, తీర్చెన్ + పో. అమర్చెనుగా.

తాత్పర్యము: ఆ బ్రాహ్మణుడు అనివార్యముగా తన్నుగోరగా నా మాలెత చిఱునవ్వనెడు భూషణముచే మనోహరమైన మొగమును మెల్లగా వంచి, అతని శృంగార భావము మర్మ మెఱిగి విరజాజి పొదల నడుమ మెత్తని యశోకపు జివురులతో క్రీడార్థమైన పాన్పునమర్చెను.

విశేషములు: వాలాయంబుగన్ - వారించినను లాభము లేదు కావున. మందహాస - అంగీకార సూచకము. ఆ లీలా భావము కీలెంగి - శృంగార భావము నెఱుగ గల జాణయే. నవమల్లీ ......మృదుల కంకేలీ ప్రవాలంబులన్ - రెండు జాతుల పుష్పములును మన్మథబాణములే - శృంగార సంబంధులే. పరిమళభరితములే. తీర్చెబోపో - అవ్యయముగా నుపయోగపడుచు `కదా' యను దాని యర్థము నిచ్చుచు నిశ్చయాశ్చర్యాదులను తెలుపును.

వ. అనంతరం [4]బధరీకృత కుసుమాయుధ రూప సంపన్నుడగు నవ్వసుధా నిలింపుం డపహసిత సుర సిద్ధ గంధర్వ విద్యాధర లీలా విలాసినీ విలాసవతియగు నవ్వెలివాడ చేడియంగూడి సురతసౌఖ్యం[2]బనుభవించె నంత. 92

అర్థము: అనంతరంబు = పిమ్మట, అధరీ ......సంపన్నుడు = అధరీకృత = క్రిందు చేయబడిన, కుసుమ + ఆయుధ = పుష్పబాణుని (మన్మథుని) యొక్క,

1. తా. చె 2. ము. భావమెఱింగి యేగి నతవల్లి. 3. తా. బోఁటి మృదుకంకేళి. 4. తా. బధఃకృత.

రూప. సంపన్నుడు = అకారముతో గూడిన వాడు, అగు, ఆ + వసుధా - నిలింపుండు = ఆ బ్రాహ్మణుడు, అపహసిత....విలాసవతి: అపహసిత = పరిహసింపబడిన, సుర = దేవతలయు, సిద్ధ = సిద్ధులయు, గంధర్వ = గంధర్వులయు, విద్యాధర = విద్యాధరులయు, లీలా = క్రీడార్థమైన, విలాసినీ = స్త్రీలయొక్క, విలాసవతి = విలాసములుగలది, అగు, ఆ + వెలివాడ - చేడియన్ = ఆ మాల వనితను, కూడి, సురత - సౌఖ్యంబు = సంభోగ సౌఖ్యము,అనుభవించెన్, అంతన్.

తాత్పర్యము: తరువాత మన్మథ సౌందర్యమును క్రింద చేయు సౌందర్య సంపదగల ఆ బ్రాహ్మణుడు సుర సిద్ధ గంధర్వ విద్యాధరుల క్రీడార్థమైన వగలాడుల యొయ్యారములను పరిహసించు నొయ్యారములు గల ఆ మాలెతను గూడి సంభోగ సుఖము ననుభవించెను. పిమ్మట. తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: చేడియ - చేడె (రూపాం.)

ఉ. కాయజ విక్రియం[1]బడఁగ గాని కులంబున సంభవించి య
న్యాయము సేయునే యిటు దురాత్ముఁడు వీడు[2] త్రపాభిమానముల్
మాయగఁదట్టి యంచు నతిమాత్రము లజ్జితుడైన కైవడిం
దోయజషండ బాంధవుఁడధోముఖుండయ్యె నభోఽంగణమ్మునన్. 93

అర్థము: దురాత్ముడు = దుర్మార్గుడు (అగు), వీడు = ఈతడు - సుకుమారుడు, కాయజ - విక్రియన్ + పడగన్ + కాని -కులంబునన్ = మన్మథవికారములందు పడరాని కులము నందు - పవిత్రమైన బ్రాహ్మణ కులమున ననుట, సంభవించి = పుట్టి, త్రపా + అభిమానముల్ = సిగ్గు, పౌరుషము, మాయగన్ + తట్టి = నశింపజేసి, ఇటు, అన్యాయము + చేయునే = అధర్మము చేయునా, అంచున్, అతి - మాత్రము = మిక్కిలి, లజ్జితుడు = సిగ్గుపడినవాడు, ఐన, కైవడిన్ = విధమున, తోయజ - షండ - బాంధవుఁడు = పద్మ, సమూహమునకు, బంధువు అగు సూర్యుడు, నభస్(ః) అంగణమ్మునన్ = ఆకాశ ప్రదేశమునందు, అధః + ముఖుండు = క్రిందైన ముఖముగలవాడు, తలవంచు కొనినవాడు, అస్తమించినవాడు, అయ్యెన్.

తాత్పర్యము: ఈ దుర్మార్గుడు సుకుమారుడు మన్మథవికారముల కతీతమైన పవిత్రబ్రాహ్మణ వంశమున నుద్భవించి సిగ్గును, పౌరుషమును ఉజ్జగించి ఇట్లధర్మము చేయునా యని మిక్కిలి లజ్జించెనా యనునట్లు సూర్యుడు ఆకాశమున తలవంచుకొనిన వాడయ్యెను - క్రిమొగము గలవాడయ్యెను.

విశేషములు: ఇంద్రియ నిగ్రహము బ్రాహ్మణుని లక్షణములలో ప్రధానమయినది. సుకుమారుడట్టి పవిత్రమైన బ్రాహ్మణ వంశమున బుట్టి, మన్మథవికారములకు

1. తా. బు లమభవించెనంత. 2. ము. బడయఁ 3. వ్రతాభిమానముల్

లోనయినాడు. లజ్జాభిమానములను విడిచి పెట్టినాడు అని సూర్యుడు సిగ్గుపడి తలవంచుకొని నాడు. సూర్యుడధోముఖుడగుటకు కారణమతడు సుకుమారుని ప్రవర్తనమునకు సిగ్గుపడుట కాదు. అతడు కాలానుసారముగా నస్తమించుచు క్రీమొగము గలవాడయ్యెను. కారణము కానిదానిని కారణముగా చెప్పుటచే నలంకారము హేతూత్ప్రేక్ష. అధోముఖుడు - సిగ్గు పడినవాడు తలవంచుకొనును. అస్తమించునపుడతడు క్రిందుగా నేగును. అధస్ + ముఖుండు - సకారమునకు విసర్గాదేశము, అధః + ముఖుండు. ఇట్లే నభస్ + అంగణము - నభః + అంగణము హ్రస్వ అకారము తరువాత వచ్చు విసర్గమునకు హ్రస్వ అకారము గాని, మృదుహల్లులు (హశ్శులు) గాని పరములగునపుడు `ఉ' ఆదేశముగా వచ్చి పూర్వమందున్న అకారముతో గూడి గుణసంధిననుసరించి `ఓ' గా మాఱును. అధోముఖుడు, నభోంఽగణము. నభో + అంగణము - పదాంతగతములైన ఏ, ఓ లకు హ్రస్వమైన అకారము పరమగునపుడు ఆ అకారము ఏ, ఓ లలో లీనమైపోవును. అదృశ్యమైన హ్రస్వ అకారమునకు సూచనగా `ఽ'(అవగ్రహము) నుంతురు. నభోంఽగణము. ఈ పద్యము ననుసరించియే కాబోలు పెద్దన తన మనుచరిత్రమున ప్రవరుడు వరూధినిని తిరస్కరించి పోయినపుడు సూర్యాస్తమయమును వర్ణించుచు సరిగా నిట్టి పద్యమునే రచించుట గమనింపదగినది.

ఉ. తరుణి ననన్యకాంత నతిదారుణ పుష్పశిలీముఖవ్యథా
భర వివశాంగి నంగభవుబారికి నగ్గము సేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయదీధితిన్.

మను.తృ.10

కులవిరుద్ధమైన పని చేసినందులకు సుకుమారుని జూచి ధర్మోచితముగా సిగ్గుపడెననుట యుచితముగా నున్నది. కాని బ్రాహ్మణ ధర్మోచితముగా వేశ్యను తిరస్కరించి యింద్రియ నిగ్రహమును పాటించిన ప్రవరుని `క్రూరు'డని, `అధము'డని, `అహంకృతితో' నేగెనని సూర్యుడు కోపించెననుటంత యుచితమా? అదేమియుగాదు. శ్రీనాథుని పద్యమువంటి పద్యమును వ్రాయుటయే పెద్దన ధ్యేయము. అంతే.

గీ. గగన యానవేగంబున గలబరించి
కడుపు నిండంగఁ గ్రోలిన కమలమధువుం
గ్రక్కెనో నాగ గగనమార్గంబునందు
భానుబింబంబు రక్తాతపంబుగాసె. 94

అర్థము: గగన - యాన - వేగంబునన్ = ఆకాశప్రయాణము నందలి వేగముచే, గలబరించి = డోకుపుట్టి, కడుపు - నిండంగన్ = కడుపు నిండుగా,

క్రోలిన = త్రాగిన, కమల - మధువున్ = తామరల తేనెను, క్రక్కెనో = క్రక్కుకొనినాడో, నాగన్ = అనగా, భాను - బింబంబు = సూర్యబింబము, గగన - మార్గంబు + అందున్ = ఆకాశపు త్రోవలో, రక్త + ఆతపంబున్ = ఎఱ్ఱని యెండను, కాసెన్.

తాత్పర్యము: ఆకాశమున ప్రయాణించు వేగముచే డోకుపుట్టి తానంతకుముందు కడుపునిండ త్రాగిన పద్మమరందమును క్రక్కుకొనెనో యనునట్లు సూర్యబింబము ఆకాశవీధిలో నెఱ్ఱని యెండను కాసెను.

విశేషములు: యానవేగమున వికారము పుట్టి గలబరించుట సహజము. అందును పొట్టపూటుగా త్రాగిన వాని సంగతి చెప్పనక్కరలేదు. కమల - మధువు - విశేషముగా `మధు'=`మద్య' పానమును చేసిన వాడు త్రోవలోనే క్రక్కుకొనుట సహజము. రక్తాతపము - సంధ్యాసమయమున నెండ యెఱ్ఱగా నుండును. అలంకార ముత్ప్రేక్ష. ఆంధ్రసారస్వత పరిషత్ప్రతిలో `గలమరించు' అను పాఠము గలదు. ఆంధ్రసాహిత్య పరిషత్ప్రతిలో `కలమరించు' అను పాఠము గలదు. ఈ రెండు శబ్దములును నిఘంటువులలో కానరావు. సూ.ని. గలబరించు = డోకు అని యిచ్చి దాని కుదాహరణముగా నిదే చూపెను. కావున `గలబరించు' అనునదియే స్వీకరింపబడినది.

శా. వ్రాలెం బశ్చిమశైల శృంగము పయింబ్రత్యగ్ర[1]మధ్వాగమో
న్మీల త్కింశుక కోరకస్తబక కాంతిన్ భానుమన్మండలం
బాలంబించె మరుండు హస్తమున దాక్షారామ లీలావతీ
భ్రూలేఖా నిభ విభ్రమాభ్యుదయముం బుండ్రేక్షుకోదండమున్. 95

అర్థము: భానుమత్ + మండలంబు = సూర్యబింబము, ప్రత్యగ్ర...... కాంతిన్: ప్రత్యగ్ర = నూతనమైన, మధు + అగమ = తేనె యొక్క ప్రాప్తితో, ఉన్మీలత్ = వికసించుచున్న, కింశుక = మోదుగు యొక్క, కోరక = మొగ్గలయొక్క, స్తబక = గుత్తి యొక్క, కాంతిన్ = వర్ణముతో, పశ్చిమ - శైల - శృంగముపయిన్ = పడమటి కొండ శిఖరము మీద, వ్రాలెన్, మరుండు = మన్మథుడు, దాక్షా....... భ్యుదయమున్: దాక్షారామ = దాక్షారామమునందలి, లీలావతీ = ఒయారకత్తెల యొక్క, భ్రూ - లేఖా = బొమరేఖతో, నిభ = సమానమైన, విభ్రమ = విలాసము యొక్క, అభ్యుదయమున్ = పెంపుగల దానిని, పుండ్ర + ఇక్షు - కోదండమున్ = నలుపుగలసిన యెఱ్ఱ నామాల చెఱకు వింటిని, హస్తమునన్ = చేతితో, ఆలంబించెన్ = పట్టుకొనెను.

తాత్పర్యము: సూర్యమండలము క్రొత్తగా నేర్పడిన తేనెతో వికసించు చున్న మోదుగ మొగ్గల గుత్తి రంగుతో పడమటి కొండకొనపై వ్రాలెను. అదే సమయమున

---

1. తా. నుద్వాగ

మన్మథుడు దాక్షారామము నందలి యొయారకత్తెల బొమరేఖతో సమానమైన విలాసాతిశయముగల నలుపు గలసిన యెఱ్ఱ చెఱకువింటిని చేత నవలంబించెను.

విశేషములు: కింశుకము - `పలాశే కింశుకః పర్ణో వాతపోథః' `కించి చ్ఛుకవ న్నీలత్వా త్కింశుకః' - ఇంచుకంత పచ్చనై చిలుక వలె నుండునది. మోదుగు. అమరము. `చిలుక ముక్కువంటి పువ్వులు గలది - మోదుగు - (సూ.ని.) భానుమండలము అస్తమించునప్పుడెఱ్ఱగా నుండును. శ్రీనాథుడు దాక్షారామలీలావతులను, పంచారామ లీలావతులను విడిచి పెట్టడు. కోదండము భ్రూలేఖ వలెనే యుండును. మధు + ఆగమ = మధ్వాగమ - యణాదేశ సంధి. హ్రస్వదీర్ఘములైన ఇ,ఉ,ఋ, అను నచ్చులకు అసవర్ణములైన అచ్చులు పరములగునపుడు క్రమముగా య్,వ్,ర్,ల్ అనునవి ఆదేశములగును. భానుమత్ + మండలంబు - అనునాసిక సంధి - భానుమన్మండలంబు. భానుమద్మండలంబు కూడ గావచ్చును. మరుడు (వికృతి) - స్మరుడు (ప్రకృతి). ఆగమ + ఉన్మీలత్ = ఆగమోన్మీలత్, పుండ్ర + ఇక్షు = పుండ్రేక్షు - గుణ సంధులు. `ప్రత్యగ్ర..... కాంతిన్' ఇందు వాచక శబ్దము లోపించుటచే లుప్తోపమాలంకారము. దాక్షారామ.... విభ్రమాభ్యుదయమున్ - ఉపమ.

క. క్రుంకె విభాకరబింబము
పంకజషండములు మొగిడెఁ బ్రత్యగ్వీథిం
గంకేలీ తరుపల్లవ
సంకాశచ్ఛాయఁ గొమరుసంజ జనించెన్. 96

అర్థము: విభాకర - బింబము = సూర్యబింబము, క్రుంకెన్ = అస్తమించెను, పంకజ - షండములు = పద్మసమూహములు, మొగిడెన్ = ముడుచుకొనెను, ప్రత్యక్ + వీథిన్ = పశ్చిమ దిక్ప్రదేశమున, కొమరు - సంజ = అందమైన సంధ్య, కంకేలీ..... ఛాయన్: కంకేలీ - తరు = అశోకవృక్షము యొక్క, పల్లవ = చివురులతో, సంకాశ + ఛాయన్ = సమానమైన కాంతితో, జనించెన్ = పుట్టెను.

తాత్పర్యము: సూర్యబింబము గ్రుంకెను. పద్మములు ముకుళించెను. పడమటి దిక్కున మనోజ్ఞమైన సంధ్య అశోక వృక్షపల్లవముల కాంతివంటి కాంతితో నేర్పడెను.

విశేషములు: కంకేలీ ......ఛాయన్ - అలంకారముపమ. సంకాశ + ఛాయ = సంకాశచ్ఛాయ. హ్రస్వమునకు ఛకారము పరమగుచుండగా ఛకారమునకు ద్విత్వము. సంజ (వికృతి) - సంధ్య (ప్రకృతి).

ఈ పద్యమును, వెనుకటి పద్యమును జాచినచో మనుచరిత్రము నందలి యీ క్రింది పద్యము స్ఫురింపగలదు.

శా. శ్రేణు ల్గట్టి నభోంఽతరాళమునఁ బాఱెం బక్షు. లుష్ణాంశుపా
షాణవ్రాతము కోష్ణమయ్యెఁ; మృగతృష్ణా వార్థు లింకెం; జపా
శోణం బయ్యెఁ బతంగబింబము; దిశాస్తోమంబు శోభాదరి,
ద్రాణం బయ్యె సరోజషండములు నిద్రాణంబు లయ్యెం గడున్.'

పెద్దన శివరాత్రి మాహాత్మ్యము నెఱిగినవాడనుట కీ పద్యముల సారూప్యము తోడ్పడుచున్నది.

గీ. పద్మినీషండములనుండి పాసి చనియెఁ
గోకమిథునంబు లత్యంతశోకపరతఁ
దోన యేతెంచె భ్రమరసందోహ మపుడు
కంతలోహార్గళంబుల కరణి [1]మొఱయ. 97

అర్థము: కోక - మిథునంబులు = జక్కవలకవలు, అత్యంత - శోక - పరతన్ = అధిక దుఃఖపరత్వముతో, పద్మినీ - షండముల నుండి = పద్మలతల సమూహముల నుండి, పాసి = వీడి, చనియెన్ = పోయెను, అపుడు, తోన్ + అ = వెంటనే, భ్రమర - సందోహము = తుమ్మెదల బారు, కంత - లోహ + అర్గళంబుల - కరణిన్ = కంతమునందలి ఇనుపగడియల విధమున, మొఱయన్ = ధ్వనింపగా, ఏతెంచెన్ = వచ్చెను.

తాత్పర్యము: జక్కవల కవలు మిక్కిలి దుఃఖముతో పద్మలతల సమూహమును వీడిపోయెను. అపుడు వెంటనే తుమ్మెదలబారు కంతమునందలి యినుప గడియల విధమున ధ్వనించుచు వచ్చెను.

విశేషములు: సూర్యుడస్తమింపగనే చక్రవాకీ చక్రవాకములొండొంటిని పాసి విరహముతో బాధపడును. కావుననే అత్యంత శోక పరత.నవి పద్మలతలను వీడుట. ఆ సమయమున పద్మములు ముకుళించుటచే నందనుక నందున్న తుమ్మెదలు బారులుగట్టి ఇనుపగడియల వలె ధ్వని చేయుచు పైకి వచ్చెను. `కంతలోహార్గళంబుల కరణి మొఱయ' - అలంకారముపమ. షండములనుండి - షండముల వలన నుండి - `ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు.' బాల. కారక. 11.

వ. ఇవ్విధంబునం బ్రతీచీకర్ణపూరరక్తోత్పలంబును, జక్రవాక చక్రవాళ కుల చక్రవర్తియు నగు మార్తాండుండు లోకాంతరంబున కవతరించినం గ్రమంబున

1. ము. మెఱయ.

నంబరతటాక వికచకమలిని సంజ మంజు మంజిష్ఠా పరా సౌష్ఠవంబు[1] సంధించె`;
గృష్ణాగురు పంక వల్లికల యుల్లాసంబు నుల్లసంబాడుచుం జిలుప చిలుప చీకటి
సిద్ధ విద్యాధర నితంబినీ జనంబుల చెక్కుటద్దంబుల తోడం జరలాడె;[2]
సాంధ్యదేవార్చనా బలిపిండంబులుంబోలె గగన మండలంబున వెండి[3]తగడుం దెగడి
క్రిక్కిఱిసి చుక్కలు వొడిచె ఁబురుహూతాంతఃపుర పురంధ్రీ విలాస దర్పణంబు
దర్పకుని[4]మాటు బొంది చందురుం డుదయగిరి శృంగశృంగాటకంబున [5]బటికంబుగుండు
చందంబొందె; నప్పుడు చండాల* (కుల) వరారోహ వాహకుండెక్కి విడిచిన వారు
వంపు గొదమయుంబోలె సంభోగంబునం దృప్తిచని తని వోవని కౌతుకంబున
సుకుమారుం గౌగిటం జేర్చి యిట్లనియె. 98

అర్థము: ఈ + విధంబునన్, ప్రతీచీ - కర్ణపూర - రక్త + ఉత్పలంబును = పశ్చిమ దిశ (యనెడు స్త్రీ)కు, కర్ణ భూషణమైన, ఎఱ్ఱకలువయును, చక్రవాక - కుల - చక్రవర్తియున్ = జక్కవలయొక్క సమూహమునకు కులపతి అగు, మార్తాండుండు = సూర్యుడు, లోక + అంతరంబునకున్ = మఱియొక లోకమునకు, అవతరించినన్ = దిగగా (పోవగా), క్రమంబునన్,

అంబర - తటాక - వికచ - కమలిని = ఆకాశమనెడి, చెఱువు నందు, వికసించిన, పద్మిని, అగు, సంజ = సంధ్య, మంజు - మంజిష్ఠా -పరాగ - సౌష్ఠవంబున్ = మనోహరమైన, ఎఱుపు మించిన పసుపు వర్ణముగల వస్త్రవిశేషము యొక్క, పుప్పొడి యొక్క, అందమును, సంధించెన్ = కూర్చెను (పొందెను), కృష్ణ + అగురు - పంక - వల్లికల = నల్ల అగురు యొక్క బురదయొక్క, తీగల యొక్క, ఉల్లాసంబున్ = ప్రకాశమును (కాంతిని), ఉల్లసంబు + ఆడుచున్ = పరిహసించుచు, చిలుప - చిలుప - చీకటి = అత్యల్పమైన చీకటి, సిద్ధ - విద్యాధర - నితంబినీ - జనంబుచిలుప - చిలుప - చీకటి = అత్యల్పమైన చీకటి, సిద్ధ - విద్యాధర - నితంబినీ - జనంబుల = సిద్ధ, విద్యాధర స్త్రీ సమూహముల యొక్క, చెక్కు + అద్దంబులతోడన్ = అద్దము ల వంటి చెక్కిళ్లతో, చరలు + ఆడెన్ = క్రీడించెను, సాంధ్య - దేవతా (దేవ యను పాఠము కంటె దేవతా యను `తా' పాఠమే మేలు) + అర్చనా - బలి - పిండంబులున్ + పోలెన్ = సంధ్య అనెడి దేవత యొక్క, పూజార్థమైన, బలుల ముద్దల వలె, గగన - మండలంబునన్ = ఆకాశప్రదేశమునందు, వెండి - తగడున్ = వెండి ఱేకును, తెగడి = నిందించి (పరిహసించి), క్రిక్కిఱిసి, చుక్కలు, పొడిచెన్ = ఉదయించెను. పురుహూత + అంతఃపుర - పురంధ్రీ -

1. తా. నధిష్ఠించె. 2. తా సంధ్యా దేవతార్చన. 3. ము. తగటు. 4. తా.మారటం 5.తా. పటికంపు గుండు చందంబునుం బొందె. *. తాళపత్రమున లేదు.

విలాస - దర్పణంబు = ఇంద్రుని భార్య యైన శచి అనెడు స్త్రీ యొక్క, వేడుక కొఱకైన అద్దము, అగు, చందురుండు, దర్పకుని = మన్మథుని యొక్క, మాటున్ = మఱుగును, పొంది, ఉదయ - గిరి - శృంగ - శృంగాటకంబునన్ = తూర్పు కొండయొక్క శిఖరమనెడి, మొగయందు, పటికంపుగుండు (పటికము + గుండు - తా.లోని యీ పాఠమే మేలు) = స్ఫటిక శిల యొక్క, చందంబు = విధము, ఒందెన్ = పొందెను. అప్పుడు, చండాల - కుల - వరారోహ = మాల కుల మందలి, సుందరి, వాహకుండు = రౌతు, ఎక్కి, విడిచిన, వారువంపు గొదమయున్ + పోలెన్ (వారువము + కొదమయున్ + పోలెన్) ('బు' ముద్రాదోషము) గుఱ్ఱపు బిల్ల వలె, సంభోగంబునన్ = రతి క్రీడయందు, తృప్తిచని = తృప్తిచెంది, తని + పోవని - కౌతుకంబునన్ = తృప్తి చెందని కోరికతో, సుకుమారున్, కౌగిటన్ = కౌగిటియందు, చేర్చి, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: ఈ విధముగా పడమటి దిక్కనెడు స్త్రీకి కర్ణాభరణమైన యెఱ్ఱకలువయైన వాడును, చక్రవాకముల సమూహమునకు కులపతి అగు సూర్యుడు అన్యలోకమున కేగగా క్రమమున ఆకాశమనెడు చెఱువునందు వికసించిన పద్మిని యనెడు సంధ్య మనోజ్ఞమైన ఎఱుపుమించిన పసుపువన్నెగల వస్త్రముయొక్క పుప్పొడి రీతిని పొందెను. కొలది కొలది చీకటి నల్లయగలు అనెడు బురద తీగల కాంతిని పరిహసించుచు సిద్ధుల విద్యాధరుల స్త్రీల అద్దములవంటి చెక్కిళ్లతో నాటలాడెను. సంధ్య యను దేవతకు పూజార్థమైన బలుల ముద్దల వలె నాకాశమున వెండితేకును పరిహసించి క్రిక్కిఱిసి నక్షత్రములు పొడమెను.

తూర్పుదిక్కనెడు స్త్రీకి వేడుక కొఱకైన అద్దమగు చంద్రుడు మన్మథుని మఱుగు పొంది తూర్పుకొండ కొనయను కూడలియందు స్ఫటికశిల విధమును పొందెను.

అప్పుడు మాలెత రౌతు ఎక్కి విడిచిన గుఱ్ఱపు బిల్లవలె రతిక్రీడయందు తృప్తిపడి, తీఱని కోరికతో సుకుమారుని కౌగిలించుకొని వానితో నిట్లు పలికెను.

విశేషములు: ప్రతీచీ యను సంస్కృత స్త్రీ లింగ పద ప్రయోగముచే పడమటి దిక్కును స్త్రీగా రూపించుట సంభావ్యము. సూర్యుడే రక్తోత్పల మనుటచే రూపకము.

సంధ్య ఆకాశమనెడి సరస్సున వికసించిన పద్మినియే. రూపకము. మంజిష్ఠ - ఒక విధమైన చెట్టు. మంజిడి. దీని పువ్వులెఱ్ఱగా నుండును. నితంబిని = 'కాన్తా లలనా చ నితమ్బినీ' - పృథుర్నితమ్బః కటి పశ్చాద్భాగః సోஉస్యా అస్తీతి నితమ్బినీ. గొప్ప పిఱుదులు గలది - స్త్రీ. అమరము. చెక్కు + అద్దము = చెక్కుటద్దము - 'కర్మధారయంబులం దుత్తునకచ్చు పరంబగునపుడు టుగాగమంబగు.' బాల. సంధి. 28. క్రిక్కు +ఇఱియు = క్రిక్కిఱియు. చుక్కలు + పొడిచె = చుక్కలు వొడిచె.

గసడదవాదేశము. బాల. సంధి. 13. పురుహూతాంతఃపుర..... దర్పణంబు - చంద్రుడు తూర్పున నుదయించుటచే నతడు ఆ దిక్కున కధిపతియగు నింద్రుని యిల్లాలికి దర్పణమనుట. వరారోహ - 'వరారోహా మత్తకాశి న్యుత్తమా వరవర్ణినీ' - పుంసా ఆరుహ్యత ఇతి ఆరోహః కటిః. వరః శ్రేష్ఠః ఆరోహోఽ స్యా ఇతి వరారోహా. పురుషుని చేత ఆరోహింపబడునది గనుక ఆరోహమనగా పిఱుదు. శ్రేష్ఠమైన పిఱుదులు గలది. స్త్రీ. అమరము. వారువంపుం గొదమ - వారువము + కొదమ. ముపర్ణకమునకు పుంప్వాదేశము - బాల. సంధి. 32, పుంపులకు పరుషము పరమగుచుండగా నుగాగమము - బాల. సంధి. 25. పిమ్మట ద్రుతకార్యము. బాల. సంధి. 16,17.

ఉ. అల్లదె వేఁటపల్లె; యట నావల మా వెలివాడ; యావలన్
భల్లనిపాతమాత్రమునఁ బర్వత నిర్ఝర సింధు; వావలం
దెల్లని గోపురంబుల నతి ప్రమదావహమైన రోహిణీ
వల్లభమౌళిభామిని నివాసము; (లా మహిత) ప్రదేశముల్. 99

అర్థము: అల్ల + అదె = అక్కడ అదే, వేట - పల్లె, అటన్, ఆవల = ఆపైని, మా, వెలివాడ = మాలపల్లె, ఆవలన్, భల్ల - నిపాత - మాత్రమునన్ = అమ్ముమేటు దూరముననే, పర్వత - నిర్ఝర - సింధువు = కొండ యేటి ప్రవాహము, ఆవలన్, ఆ - మహిత - ప్రదేశముల్ = ఆ గొప్ప ప్రదేశములు, తెల్లని - గోపురంబులన్ = తెల్లని గోపురములతో, అతి - ప్రమద + ఆవహము = మిక్కిలి సంతోషమును గలిగించునది, ఐన, రోహిణీ - వల్లభ - మౌళి - భామిని = రోహిణీ ప్రియుడు (చంద్రుడు) శిరస్సున గలవాని యొక్క (శివుని) భార్య అగు పార్వతి యొక్క, నివాసములు = ఉండు చోట్లు.

తాత్పర్యము: ఆ దూరమున కనిపించునదే వేటపల్లె. దాని పైది మా మాలపల్లె. ఆపైని అమ్ముమేటు దూరమాత్రమున కనుపట్టునది సెలయేటి ప్రవాహము. ఆ మీదనున్న ఆ గొప్ప ప్రదేశములు తెల్లని గోపురములతో మిక్కిలి సంతసమును గూర్చు పార్వతీ దేవ్యాలయములు.

విశేషములు: ఆవల - ఆ + వలను.

గీ. ప్రతిభ సతతంబుఁ గొల్తు రా భద్రకాళి
జగతి నేఁబదియాఱు దేశముల వారు
దశదినంబులు సింహకేతనము నిలిపి
హూణభూమికి దైవ మీ యుత్పలాక్షి. 100

అర్థము: జగతిన్ = లోకమునందు, ఏబది + ఆఱు - దేశముల వారు, దశ - దినంబులు = పది దినములు, సింహ - కేతనము = సింహధ్వజము, నిలిపి,

ప్రతిభన్ = తెలివితో, ఆ - భద్రకాళిన్, సతతంబున్ = ఎల్లప్పుడును, కొల్తురు = సేవింతురు, ఈ - ఉత్పల + అక్షి = కలువల వంటి కన్నులు గలది - స్త్రీ - భద్రకాళి, హూణ - భూమికిన్ = హూణదేశమునకు, దైవము = దేవత.

తాత్పర్యము: లోకమునందలి యేబదియాఱు దేశములందలి ప్రజలును పదిదినములు సింహధ్వజమును నిలిపి యెప్పుడును ఆ భద్రకాళిని ప్రతిభతో సేవింతురు. ఆమె హూణభూమికి దేవత.

వ. నీ వమ్మహాస్థానంబున వసియింపు మేను నీకు నా యా వేళల బరిచర్య[1]సేయుచు వంచన బయల్పడకుండ మెలంగెద సర్వకలా విశారదుండ వైన నీకుం బ్రాకారగోపుర ద్వార వేదికా* (ప్రాకార) ప్రఘాణ కుట్టిమహట్ట సౌధవీథీ విటంకంబులం గావ్యగోష్ఠి పరిహాస కథా బిందుమతీ భిత్తికా ప్రహేళికా భావన సుభాషిత శ్రవణంబు, వార విలా సినీ దర్శనంబు, వైతాళిక స్తుతి పాఠకంబు, దురోదర క్రీడ చిత్రకర్మంబు వీణా స్ఫాలనంబు మొదలయిన వినోదంబులం [2]బ్రొద్దుపుచ్చం గలిగెడి వెండియు. 101

అర్థము: నీవు, ఆ +మహత్ (మహా) - స్థానంబునన్ = ఆ గొప్పచోట (దేవ్యాలయమున), వసియింపుము, ఏను, నీకున్, ఆ + ఆ - వేళలన్ = ఆయా సమయములందు, పరిచర్య = సేవ, చేయుచు, వంచన = (మన) మోసము, బయలు + పడక + ఉండన్, మెలంగెదన్ = వర్తింతును, సర్వ - కలా - విశారదుండవు = ఎల్ల కళల యందును నేర్పుగలవాడవు, ఐన, నీకున్, ప్రాకార....... విటంకంబులన్ : ప్రాకార = ప్రహరి యందలి, గోపుర = గోపురము యొక్క, ద్వార = ద్వారము నందలి, వేదికా = అరగు నందును, ప్రాకార, ప్రఘాణ = వాకిలి ముందరి నలు చదరపు జోటి యందలి, కుట్టిమ = నెలకట్టునందు, హట్ట = అంగడి యందు, సౌధ - వీథీ - విటంకంబులన్ = మేడల, వరుసల, పయిభాగములయందు, కావ్య - గోష్ఠి = కావ్యచర్చలు, పరిహాస - కథా = హాస్యరస ప్రధాన కథలు, బిందుమతీ = బిందుమతి యను రచనా విశేషములను, భిత్తికా = రచనకాశ్రయమైన గోడ, గోడమీది రచనా విశేషము (?), ప్రహేళికా భావన.

సుభాషిత - శ్రవణంబు = సుభాషితములను వినుట, వారవిలాసినీ = వేశ్యల యొక్క, దర్శనంబు, వైతాళిక - స్తుతి - పాఠకంబు = స్తోత్రపాఠకుల స్తోత్రపాఠము, దురోదర - క్రీడ = జూదమాడుట, చిత్ర - కర్మంబు = చిత్తరువు వ్రాత, వీణా + ఆస్ఫాలనంబు = వీణయందలి నేర్పు, మొదలు + అయిన, వినోదంబులన్ = వేడుకలతో, ప్రొద్దుపుచ్చన్ + కలిగెడిన్ = కాలక్షేపమగును, వెండియున్ = మఱియును.

1. తా. సేయుదు. 2. తా. ప్రొద్దు పుచ్చుచుండం గలిగెడు.

తాత్పర్యము: నీవు ఆ దేవి యాలయమునందు నివసింపుము. నేను నీకు ఆయా సమయములందు సేవలు చేయుచు మన. మోసము బయలుపడకుండ వర్తింతును. అన్నికళలలోను ఆరితేఱినవాడవైన నీకు ప్రహరి గోపురద్వార వేదిక యందును, ప్రహరి ముందరి నలుచదరపు జోటియందలి నెలకట్టు నందు, అంగడియందు, మేడల వరుసల పయిభాగములందు, కావ్యచర్చ, పరిహాస కథలు, బిందుమతి, భిత్తిక, ప్రహేళికా భావన సుభాషిత శ్రవణము, వేశ్యల దర్శనము, స్తోత్ర పాఠకుల స్తోత్ర పాఠము, ద్యూతము, చిత్తరువు వ్రాత, వీణా నైపుణ్యము మున్నగు వినోదములతో కాలక్షేపమయ్యెడిని - మఱియును. తరువాతి పద్యముతో నన్వయము.

క. వెలివాడకుఁ గడుఁజేరువ
సెలయేటికిఁ బొరువు [1]తాళ్ళుఁ జిట్టీదులు నా
వలఁ దఱచు భద్రకాళీ
నిలయం బది లెస్స నీకు నెలవు వసింపన్ 102

అర్థము: వెలివాడకున్ = మాల పల్లెకు, కడున్ = మిక్కిలి, చేరువన్ = దగ్గఱలో, సెలయేటికిన్, పొరువు = ప్రక్క, ఆవలన్, తాళ్ళున్ = తాటిచెట్లును, చిట్టీదులున్ = చిట్టీత చెట్లును, తఱచు = దట్టము, నీకున్, వసింపన్, నెలవు = చోటు, భద్రకాళీ, నిలయంబు = ఆలయము, అది, లెస్స = మంచిది.

తాత్పర్యము: మాలపల్లెకు మిక్కిలి దగ్గఱలోని సెలయేటి ప్రక్క తాటి చెట్లును, చిట్టీతచెట్లును దట్టముగా నుండును. నీవు నివసించుటకు భద్రకాళి ఆలయము మంచి చోటు.

గీ. ప్రొద్దు వోకుండ[2]ముందటఁ బొదమ నీవు
కాళికాస్థానమునకు నీ[3]కాలిత్రోవ
విప్రగృహమున నీకు నే విందొనర్తు
ధర్మమిషమున నింటిపెద్దలకుఁ జెప్పి. 103

అర్థము: ప్రొద్దు + పోక + ఉండన్ = సూర్యుడస్తమింప కుండ, నీవు, ముందటన్ = ముందుగా, ఈ - కాలి - త్రోవన్ = ఈ కాలిబాటను, కాళికా - స్థానమునకున్ = కాళి ఆలయమునకు, పొదము + అ = పొమ్మా, నీకున్, నేను, ధర్మ - మిషమునన్ = ధర్మము నెపమున, ఇంటి - పెద్దలకున్ = ఇంటి యందలి పెద్దవారికి, చెప్పి, విప్ర - గృహమునన్ = బ్రాహ్మణుల యింట, విందు + ఒనర్తున్ = విందు చేయుదును.

1. ము. త్రాళ్ళు. 2. తా. ముందరం బొదము. 3. తా. కాలుద్రోవ

తాత్పర్యము: సూర్యుడస్తమింపకుండ ముందర నీవు ఈ కాలిబాటను కాళికాదేవి యాలయమునకు పొమ్ము. ధర్మము నెపమున నింటిలోని పెద్దలకు చెప్పి నీకు నేను బ్రాహ్మణులయింట విందు చేయుదును.

విశేషములు: మాలెత యయ్యును ఆమె ధర్మ పరాయణత్వము మెచ్చదగినది. ఆమె కున్న అపాటి జ్ఞానము బ్రాహ్మణుడైన సుకుమారునకు లేక పోవుట గమనింప దగినది.

ప్రొద్దువోక - ప్రొద్దు + పోక - గసడదవాదేశము. బాల. సంధి. 13. పొదము - 'పోవునకు దుజ్ముత్తులు ముజుంబరంబులగునపుడు వులోపంబుం బొదపదలును విభాషనగు.' బాల. క్రియ. పొదము - పోవుము, పదము, పొమ్ము (రూపాం.)

వ. (అని చండాలి) చెలికత్తెయు దానును వేఱొక్క తెరువును నిజనివాసంబు నకుంజనియె సుకుమారుండు చెఱువుకొమ్ము దాపలం బట్టుకొని విపినషండంబు నడుమగా బక్కణంబునకు దక్షిణంబు (న వెలివాడ) యొరసి కొనిపోయి [1]కాలిత్రోవం జని సెలయేఱు గడచి ముందట. 104.

అర్థము: అని, చండాలి, చెలికత్తెయున్, తానును, వేఱు + ఒక్క = మఱియొక, తెరువునన్ = మార్గమున, నిజ - నివాసంబునకున్ తనదైన యింటికి, చనియెన్ = పోయెను, సుకుమారుండు, చెఱువు కొమ్ము = చెఱువు కొన, దాపలన్ = ఎడమవైపు, పట్టుకొని, విపిన - షండంబు = అడవుల సమూహము యొక్క, నడుమగాన్, పక్కణంబునకున్ = బోయపల్లెకు, దక్షిణంబునన్, వెలివాడ, ఒరసికొని, పోయి, కాలిత్రోవన్, చని, సెలయేఱు, కడచి = దాటి, ముందటన్ = ఎదుర.

తాత్పర్యము: అని మాలెత చెలికత్తెయును తానును మఱి యొక మార్గమున తన యింటికి పోయెను. సుకుమారుడు చెఱువు కొన కెడమ వైపు దారి పట్టుకొని యడవి నడుమగా బోయపల్లెకు దక్షిణ దిక్కున మాలపల్లె ప్రక్కగా పోయి కాలిబాటను పోయి సెలయేఱు దాటి యెదుర - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: చండాలి చెలికత్తెయును నిజనివాసంబునకు జనియె 'ఆత్మార్థంబభిహితం బగుచో దల్లింగ సంఖ్యాభిధాయి వచనంబు ధాతు విశేషణంబులకగు.' బాల. క్రియ. 120. చెలికత్తె - 'కా- కత్తియలు కొండొకవానికి స్వార్థంబునంజూపట్టెడు.' బాల. తద్ధిత. 13.

సీ. [1]బ్రహ్మ యెక్కెడి జాలపాదంబునకుఁ గేలి
వసతియైన సరోజవాటితోడ

1. తా.బ్రహ్మ.

నైంద్రవాహనమైన యైరావణగ (జంబు
నోరూర్చు మోక యిందువులతోడ)
వైష్ణవరథమైన వైనతేయున [1]కాఁగ
నిరవైన ప్రాకారపరిధితోడఁ
గౌమారయాన శిఖావళంబునకుఁదాం
డవమాడ సొబగైన గవనితోడ

గీ. వేడ్క [2]మాహేశుఁడెక్కెడి వృషభరాజు
దాఁక నిల్చిన కేలిభూధరముతోడ
సకల[3]శక్తి నివాసమై చాల నొప్పు
చండిభవనంబు సొత్తెంచె సచివసుతుఁడు 105

అర్థము: సచివ - సుతుఁడు = మంత్రి కొడుకు - సుకుమారుడు (కర్త), బ్రహ్మ, ఎక్కెడి, జాలపాదంబునకున్ = హంసకు, కేలి - వసతి = క్రీడార్థమైనబస, ఐన, సరోజ - వాటితోడన్ = పద్మవనముతోను, ఐంద్ర - వాహనము = ఇంద్ర సంబంధమైన వాహనము, ఐన, ఐరావణ - గజంబు = ఐరావతమనెడి ఏనుగు, నోరు + ఊర్చు = నోరూరించు, మోక - ఇందువులతోడన్ = లేత ఇందువు చెట్లతోను, వైష్ణవ - రథము = విష్ణుసంబంధమైన వాహనము, ఐన, వైనతేయునకున్ = గరుత్మంతునకు (వినత కొడుకు), ఆగన్ = ఆగుటకు, ఇరవు + ఐన = చోటయిన, ప్రాకార - పరిధితోడన్ = ప్రహరి అవరణముతోను, కౌమార = కుమారస్వామికి సంబంధించిన, యాన = వాహనమైన, శిఖావళంబునకున్ = నెమలికి, తాండవము + ఆడన్ = నృత్యము చేయుటకు, సొబగు + ఐన = అందమైన, గవని తోడన్ = గోపురముతోను, వేడ్కన్ = వేడుకతో, మాహేశుండు = ఈశ్వరుడు, ఎక్కెడి, వృషభ - రాజు = శ్రేష్ఠమైన ఎద్దు, తాకన్ = తాకునట్లు, నిల్చిన = ఉన్నట్టి, కేలి - భూధరముతోడన్ = క్రీడాపర్వతముతోను, సకల - శక్తి - నివాసము = ఎల్ల శక్తులకును ఆవాసము, ఐ, చాలన్ = మిక్కిలి, ఒప్పు, చండీ - భవనంబు = చండికాలయము, చొత్తెంచెన్ = ప్రవేశించెను.

తాత్పర్యము: మంత్రికొడుకైన సుకుమారుడు చండీదేవ్యాలయమును ప్రవేశించెను. అది బ్రహ్మకు వాహనమైన హంస వినోదమునకు బసచేయుటకు వీలయిన పద్మవనముతోను, ఇంద్రుని వాహనమైన ఐరావతమను గజమునకు నోరూరజేయు లేత ఇంధుగు చెట్లతోను, విష్ణువు వాహనమైన గరుత్మంతుడాగుటకు చోటయిన ప్రహరి వలయముతోను, కుమారస్వామి వాహనమైన నెమిలి తాండవమాడుటకు అనువైన గోపురముతోను, మహేశ్వరుడు వేడుకతో నెక్కు వృషభరాజు తాకునట్లు

1. తా.కుఁగా 2. ము. మాహేశ్వరంబైన. 3. ము. భక్తనివాసమై.

నిల్చిన క్రీడా పర్వతముతోను, ఎల్ల శక్తులకును తావలమై మిక్కిలి యొప్పుచుండును.

విశేషములు: చండ్యాలయమునకు బ్రహ్మ, ఇంద్రుడు, విష్ణువు, కుమారస్వామి, ఈశ్వరుడు అనువారి వాహనములతో సంబంధమును చెప్పుటచే తన్మహిమ తెలియుచున్నది. అది యెల్ల శక్తులకు నివాసము. ఇందు చెప్పబడిన దేవతల మహిమల కనియైనను, వివిధ నామములతో బరగు నమ్మవారల కనియైనను చెప్పవచ్చును. ఏనుగునకు ఇందువు (ఇందుగు) చెట్టు చాల ఇష్టము. `ఇందువు - ఇందుగు (రూపాం.) - చిల్లచెట్టు. ఐరావణ - ఐరావత (రూపాం.) జాలపాదము - హంస - (వ్యు) వల వంటి పాదములు గలది. వైనతేయుడు - వినతి కొడుకు. అపత్యార్థక తద్ధిత రూపము. శిఖావళ - `శిఖావల శ్శిఖీ కేకీ మేఘనాదానులాస్యపి' - శిఖా చూడా అస్యాస్తీతి శిఖావలః - చుంచుగలది - నెమలి - అమరము. ఇంద్ర - ఐంద్ర విష్ణు - వైష్ణవ, కుమార - కౌమార - మహేశ - మాహేశ. సంబంధార్థక తద్ధితరూపములు.

చొత్తెంచు - చొచ్చు + తెంచు - `తెంచుధాతు వగ్వాదుల కనుప్రయుక్తంబగు (నగుచో నుత్వంబు పయిని దాని తకారంబు దకారంబగు.') బాల. క్రియ. 110. `అయ్యాది పరంబగునపుడు చువర్ణంబు లోపించు.' బాల. క్రియ. 112 చొత్తెంచు.

మ. [1]తన దౌశ్శీల్యము తా నెఱుంగుట వెలిన్ దౌదవ్వుల న్నిల్చి దు
ర్జనుఁడాతండు లలాటభాగమున హస్త ద్వంద్వమున్ మోపి యొ
య్యన లోలోన నమస్కరించెఁ బటుగర్వారంభ సంరంభశుం
భనిశుంభప్రథనక్రమప్రకటబాహాకేళికిం గాళికిన్. 106

అర్థము: దుర్జనుఁడు = దుష్టుడు (అగు), ఆతండు = సుకుమారుడు, తన - దౌశ్శీల్యము = దన దుష్ట స్వభావము, తాను, ఎఱుంగుటన్ = ఎఱుగుట చేత, వెలిన్ = (గుడికి) బయట, దౌ - దవ్వులన్ = దూరదూరమున, నిల్చి, లలాట - భాగమునన్ = నుదుట, హస్త - ద్వంద్వమున్ = రెండుచేతులను, మోపి = ఉంచి, పటు.... కేళికిన్: పటు = అధికమైన, గర్వ = అహంకారము యొక్క, ఆరంభ = త్వరయొక్క, సంరంభ = ఉద్రేకము గల, శుంభ - నిశుంభ = శుంభుడు, నిశుంభుడు అనువారి తోడి, ప్రథన = యుద్ధము యొక్క, క్రమ = ఆచరణమునందు, ప్రకట = స్పష్టమైన, బాహా = చేతుల యొక్క, కేళికిన్ = క్రీడగలది, అగు, కాళికిన్ = కాళికాదేవికి, ఒయ్యన = ఒప్పుగా, లోలోనన్ = మనస్సునందు, నమస్కరించెన్.

తాత్పర్యము: దుష్టుడైన యా సుకుమారుడు తన దుష్టస్వభావమును తానెఱిగిన వాడగుటచే గుడి బయట దూరదూరమున నిలిచి నొసట చేదోయి గీలించి మిక్కిలి

1.ము. తనదౌ శీలము.

గర్వితులగు శుంభ నిశుంభులతోడి యుద్ధమున స్పష్టమైన బాహుబలముగల కాళికాదేవికి ఒప్పుగా లోలోన నమస్కరించెను.

విశేషములు: దౌశ్శీల్యము - దుశ్శీలము యొక్క భావము, దవ్వు - దవు, దౌ - (రూపాం.) ఒయ్యన - వాక్యాలంకారము - ఒప్పిదముగా నని యర్థము. శుంభ నిశుంభులు - రాక్షసులు. శివుని వరముచే వీరికి పురుషుని వలన మృతి సంభవింపదు. గౌరిశరీరము నుండి పుట్టిన కాళికను వీరు కామించిరి. తనతో యుద్ధము చేసి గెలిచినవారిని పెండ్లాడెదనని ఆమె పలికెను. వారు యుద్ధమున నామెచే నిహతులైరి. ఆరంభసంరంభ శుంభనిశుంభ - వృత్త్యను ప్రాసము. కేళికిన్ - కాళికిన్ అంత్యాను ప్రాసము. ప్రథనక్రమప్రకట - పరుషాక్షరమగు రేఫము పౌనః పున్యముచే పారుష్యము స్ఫురించుచున్నది.

ఉ. మాలెత విందు బ్రాహ్మణకుమారుఁడు పక్కణవాని వేణుకం
డోలమునందుఁ దెచ్చినఁ గఠోరిత చంద్రిక నిర్ఝరాపగా
కూలమునన్ భుజించి ఘనగోపుర వేదిక నిద్రవోయె న
య్యాలరి బ్రాహ్మణుండు తుహినాచలకన్యక యాశ్రమంబునన్. 107

అర్థము: మాలెత - విందున్ = మాలెత యొక్క భోజనమును - మాలెత యేర్పాటు చేసిన భోజనమును, పక్కణ - వాని = బోయపల్లెలో నుండు వాడు, అగు, బ్రాహ్మణ - కుమారుఁడు = ఒక బ్రాహ్మణులకులమువాడు, వేణు - కండోలమునందున్ = వెదురు గంపయందు, తెచ్చినన్ = తేగా, ఆ + ఆలరి - బ్రాహ్మణుడు = ఆ దుష్టస్వభావుడగు బ్రాహ్మణుడు - సుకుమారుడు, కఠోరిత - చంద్రికన్ = నిండైన వెన్నెల యందు, నిర్ఝర + ఆపగా = సెలయేటి యొక్క, కూలమునన్ = ఒడ్డునందు, భుజించి = తిని, తుహిన + అచల - కన్య - ఆశ్రమంబునన్ = మంచు కొండకూతురైన పార్వతి యొక్క ఆలయమునందు, ఘన - గోపుర = వేదికన్ = గొప్ప గోపురపు టరగుపయి, నిద్ర + పోయెన్ = నిద్రించెను.

తాత్పర్యము: మాలెత యిదివఱకు చెప్పిన ప్రకారము బోయ పల్లెలోని యొక్క బ్రాహ్మణ గృహమున సుకుమారుని కొఱకు భోజనము చెప్పగా దాని నా బ్రాహ్మణ కుమారుడు వెదురు గంపలో పెట్టుకొని తీసికొని రాగా, నా దుష్టస్వభావుడగు బ్రాహ్మణుడు - సుకుమారుడు నిండు పున్నమి వెన్నెలలో సెలయేటి యొడ్డున భుజించి యా పార్వతీదేవి యాలయమునందలి గోపురపుటరగుపై నిద్రించెను.

విశేషములు: బోయపల్లె యయ్యును అందొకటియో ఆరయో బ్రాహ్మణుల కొంప యుండ వచ్చును. మాలెత ఆ యింట సుకుమారునకు-భోజనము చెప్పెను. మాలెతకు గల సముదాచార సంపద మెచ్చదగినది. కఠోరిత - చంద్రిక - నిండు వెన్నెల యందు - `కఠోరతారాధిప లాఞ్ఛనచ్ఛవిః' - శిశు. 1-20. `కఠోర గర్భ

గుర్వీం' - ఉ.రా 1-49.

వ. మఱునాడు ప్రాతఃకాలంబున నిర్ఝరాంతః ప్రవాహం బున నవగాహనంబు చేసి కపట సంధ్యా వందనంబును గృతక జపంబును (మిథ్యా) సూర్యోపాస్తియు నడపి బ్రాహ్మణ[1]బ్రువుండు. 108

అర్థము: మఱునాడు, ప్రాతఃకాలంబునన్ = ఉదయమున, బ్రాహ్మణ - బ్రువుండు = బ్రాహ్మణుడనని చెప్పుకొనువాడు - బ్రాహ్మణాధముడు, సుకుమారుడు, నిర్ఝర + అంభస్ + ప్రవాహంబునన్ = సెలయేటి నీటి ప్రవాహమునందు, అవగాహనంబు - చేసి = స్నానము చేసి, కపట - సంధ్యావందనంబును = మోసపు సంధ్యా వందనమును, కృతక - జపంబును = కృత్రిమమైన జపమును, మిథ్యా - సూర్య + ఉపాస్తియును = అసత్యపు సూర్య పూజయును, నడపి.

తాత్పర్యము: మఱునాడుదయమున బ్రాహ్మణాధముడయిన సుకుమారుడు సెలయేటి నీట మునిగి, కపటమైన సంధ్యా వందనమును, కృత్రిమ జపమును, అసత్యపు సూర్యోపాసనయును చేసి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: బ్రాహ్మణ బ్రువుడు - చెప్పికొనుటచేతనే బ్రాహ్మణుడు గాని ప్రవర్తనముచే కాదనుట. బ్రువుండు - దీనికి వృత్తి యందు నిందావాచకత్వముండును. ఉత్తర పదముగా ప్రయోగింప బడును. కపట - కం - బ్రహ్మను గూడ, పటతి = అచ్ఛాదించునది.

సీ. దంతి దంతార్గళ స్తంభ భారముతోఁడ
రాజిల్లు ఘనగోపురములు సూచి
గండశైలచ్ఛేదఘటితమై యొరపైన
మేటికొమ్మలతోఁడి కోట సూచి
యమృతదీధితిలోని హరిణంబు వెఱపించు
సౌధాగ్రసింహధ్వజములు సూచి
యాటమండపముపై నభ్ర ముల్లేఖించు
జాంబూనదత్రిశూలంబు సూచి

గీ. చమురుగా (కులు కుసు) మగుచ్ఛములు వోలె
సకల శాఖోపశాఖల సంశ్రయింపఁ
బుష్పితాశోక [2]పాదపంబులును బోని
నింబములు సూచి యతఁ డద్భుతంబు సెందె. 109

1. తా. ప్రవరుండు. 2. ము. పాదపంబులను జూచి.

అర్థము: అతండు = సుకుమారుడు (కర్త)

దంతి - దంత - అర్గళ - స్తంభ - భారము తోడన్ = ఏనుగు దంతములతో నిర్మింపబడిన గడియల యొక్క, కంబముల యొక్క బరువుతో, రాజిల్లు = ఒప్పునట్టి, ఘన - గోపురములు = పెద్దద్వారములు చూచి. గండ - శైల + ఛేద - ఘటితము + ఐ = పెద్దశిలలయొక్క ముక్కలతో గూర్పబడినదై, ఒప్పు + ఐన = ఒప్పయిన, మేటి - కొమ్మల తోడి = పెద్దశృంగములతో గూడిన, కోట, చూచి. అమృత - దీధితిలోని = చంద్రునిలోని, హరిణంబున్ - లేడిని, వెఱపించు = భయపెట్టు, సౌధ + అగ్ర - సింహ - ధ్వజములు = మేడల కొనలందలి సింహపతాకలు, చూచి, ఆట - మండపము పైన్ = క్రీడార్థమైన మండపము మీద, అభ్రము = మేఘము, ఉల్లేఖించు = రచించు, జాంబూనద - త్రిశూలంబు = బంగారు త్రిశూలము, చూచి. చమురు - కాకులు = చిత్రవర్ణముగల కాకులు, కుసుమ - గుచ్ఛములు + పోలెన్ = పూల గుత్తులవలె, సకల - శాఖా + ఉపశాఖలన్ = ఎల్ల కొమ్మలను, రెమ్మలను, సంశ్రయింపన్ = ఆశ్రయింపగా, పుష్పిత + అశోక పాదపంబులును + పోని = పూచిన అశోక వృక్షములను బోలిన, నింబములు = వేపచెట్లు, చూచి, అద్భుతంబు + చెందెన్ = ఆశ్చర్యపడెను.

తాత్పర్యము: ఏనుగు దంతములతో చేయబడిన గడియలయు, కంబములయు భారముతో నొప్పు పెద్దగోపురములను, గండ శిలల శకలములతో కూర్పబడి యొప్పుగానున్న పెద్ద శృంగములతో గూడిన కోటను, చంద్రునిలోని వేడిని భయపెట్టు మేడల కొనల యందలి సింహపతాకలను, చమురుకాకులు పూలగుత్తులవలె నెల్ల కొమ్మలందును రెమ్మలందును ఆశ్రయింపగా పూచిన అశోక వృక్షముల వలె నున్న వేపచెట్లను సుకుమారుడు చూచి ఆశ్చర్యపడెను.

విశేషములు: అమృత దీధితి.... ధ్వజములు - చంద్రుని లోని మచ్చను లేడి యనుట గలదు. `సౌధసుధాప్రభా ధవళిత ప్రాలేయ రుఙ్మండలీ - హరిణంబై' - మను. పతాకల యందు సింహము బొమ్మలు లిఖితములైనవి. వానిని జూచి చంద్రుని లోని వేడి భయపడెనట. చంద్రునిలోని హరిణమునకును, పతాకల యందలి సింహములకును సంబంధము లేకున్నను ఉన్నట్లు వర్ణితమగుటచే నలంకారము సంబంధాతిశయోక్తి. ఆ సౌధాగ్రములు చంద్రుని సమీపించునంత యున్నతములని భావము. హరిణమునకు పతాకలందలి సింహ చిత్రములయందు సత్యసింహ భ్రాంతి యగుటచే భ్రాంతి మదలంకారమును గలదు. ఆట మండపము పై.....త్రిశూలంబు: క్రీడామండపముపై మేఘము బంగరు త్రిశూలమును లిఖించుచున్నది. మండపము మేఘమండలము దాక వ్యాపించి యున్నదనుట. ఇదియు సంబంధాతిశయోక్తి. మేఘము త్రిశూలాకారమును బంగరురంగుతో లిఖించుచున్నది. సూర్యకాంతి వలన

మేఘము వివిధ వర్ణములు గలదిగా నగుచుండును. వేప చెట్లను కాకులాశ్రయించినవి. కాకులు పూలగుత్తులవలె నున్నవి. వానితో నవి పూచిన అశోకవృక్షములను బోలి యున్నవి. ఉపమాలంకారము.

గోపురములు + చూచి - గసడదవాదేశము. గోపురములు సూచి. బాల. సంధి. 13. శైల +ఛేద =శైలచ్ఛేద. హ్రస్వమునకు పరమైన ఛకారమునకు ద్విత్వము. పోని - పోలిన అను క్రియా జన్య విశేషణము సంక్షిప్తవికృత రూపము. పాదపంబులును బోని - `ప్రథమాంతముల మీది పోలెబలె పోని శబ్దంబులు ద్రుత పూర్వకంబులు విభాషనగు.' ప్రౌఢ. సమాస. 39.

ఉ. కాళిక దివ్య మందిరము (కట్టెదురం బశుకంఠ) నాళకీ
లాలరసంబు గ్రోలు నభిలాషమునం జనుదెంచి యున్న వే
తాళగణంబు వోలె నతి దైర్ఘ్యమునన్ దివి దాకియున్న హిం
తాళవనంబు గన్గొని యతండు మహాద్భుతమందె నాత్మలోన్. 110

అర్థము: కాళిక - దివ్య - మందిరము - కట్టెదురన్ = కాళికా దేవి యొక్క దివ్యమైన ఆలయము యొక్క ఎట్టయెదుట, పశు - కంఠ - నాళ - కీలాలరసంబు = (బలి యీబడిన) పశువుల యొక్క కుత్తుక గొట్టము నందలి రక్త ద్రవమును, క్రోలు + అభిలాషమునన్ = త్రాగు కోరికతో, చనుదెంచి + ఉన్న = వచ్చియున్న, వేతాళ - గణంబు + పోలెన్ = పిశాచముల యొక్క సమూహము వలె, అతి - దైర్ఘ్యమునన్ = మిక్కిలి పొడవు తో, దివి = ఆకాశము, తాకి + ఉన్న = అంటియున్న హింతాళ - వనంబు = గిరక తాటి తోపును, అతండు = సుకుమారుడు, కన్గొని = చూచి, ఆత్మలోన్ = మనస్సులో, మహత్ (మహా) + అద్భుతము + అందెన్ = మిక్కిలి ఆశ్చర్యపడెను.

తాత్పర్యము: సుకుమారుడు కాళికాదేవి దివ్యదేవాలయము నెదుట హింతాళ వనమును చూచి మిక్కిలి ఆశ్చర్యపడెను. ఆ హింతాళ వృక్షములు ఆ దేవికి బలి యీబడిన పశువుల కుత్తుక గొట్టము లందలి రక్తమును త్రావు కోరికతో వచ్చియున్న పిశాచములవలె మిక్కిలి నిడుపులై ఆకాశమునంటుచున్నవి.

విశేషములు: వేతాళగణంబువోలె - అలంకారముపమ. కట్టెదురన్ = కడు + ఎదురన్. `కుఱుచిఱు కడు నడు నిడు శబ్దముల అడల కచ్చు పరంబగునపుడు ద్విరుక్త టకారంబగు.' బాల. సంధి 12 కట్టు + ఎదురన్. `ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు.' బాల. సంధి. క్రోలు + అభిలాషము. `ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు.' బాల. సంధి. 33. దివి దాకి యున్న - సంబంధాతిశయోక్తి.

ఉ. పైపయి గర్భగేహమునఁ [1]బన్నిక మీఱి వెలుంగు మాలికా
దీపశిఖా ప్రరోహములు దేఱఁగ జూచి యనుస్మరించె లో
నా పృథివీసురుండు మహిషాసుర మస్త (క శోణితార్ద్ర) దు
ర్గాపరమేశ్వరీపదనఖంబుల [2]రూపము సంవదించినన్. 111

అర్థము: ఆ - పృథివీసురుండు = ఆ బ్రాహ్మణుడు - సుకుమారుడు, పైపయి = మీదమీద, గర్భగేహమునన్ = గర్భాలయము నందు, పన్నిక = అందము, మీఱి = అతిశయించి, వెలుంగు = ప్రకాశించు నట్టి, మాలికా - దీప - శిఖా - ప్రరోహములు = వరుసగా నున్న దీపముల శిఖల మొలకలు, తేగన్ = కలుగగా, చూచి, మహిషా.... రూపమున్: మహిష + అసుర = మహిషరాక్షసుని యొక్క, మస్తక = శిరస్సునందలి, శోణిత = రక్తముచే, ఆర్ద్ర = తడిసిన, దుర్గా = దుర్గయను పేరుగల, పరమేశ్వరీ = పార్వతియొక్క, పద = అడుగుల యొక్క, నఖంబుల = గోరుల యొక్క, రూపమున్ = ఆకారమును, సంవదించినన్ = సరిపోలగా, లోన్ = మనసునందు, అనుస్మరించెన్ = జ్ఞప్తికి దెచ్చుకొనెను.

తాత్పర్యము: ఆ బ్రాహ్మణుండు - సుకుమారుడు గర్భగృహమున పైపై నందముగా వెలుగొందు మాలాకారపు దీప శిఖల మొలక లుండుట చూచి మహిషాసురుని శిరో రక్తముచే తడిసిన దుర్గా దేవి పాదముల గోరుల నవి సరిపోలుటను జ్ఞప్తి చేసికొనెను.

విశేషములు: దీపశిఖా ప్రరోహములు దుర్గ పదనఖములను సంవదించు ననుటచే నలంకార ముపమ. మహిషాసురుడు దితి కొడుకు. అతడు స్త్రీవలననే మరణము కలుగ శివుని వరమును పొందెను. దేవతలు తమ నారీతేజముల నొక్కటిగ జేర్ప, నందుండి దుర్గయనుదేవి యావిర్భవించి మహిషుని సంహరించెను.

గీ. [3]సదన వనవాటికా నికుంజముల యందు
నెలుక లధరోష్ఠసంపుటంబులు గదల్ప
శక్తి మంత్రాక్షరంబులు జపముసేయు
నవియు వలె నున్న నద్భుతం బందె నతఁడు. 112.

అర్థము: ఎలుకలు, సదన - వన - వాటికా - నికుంజముల యందున్ = ఆలయోద్యాన ప్రదేశములందలి పొదలలో, అధర + ఓష్ఠ - సంపుటంబులు = దొప్పల వంటి క్రింది పెదవులు, కదల్పన్ = కదలింపగా, శక్తి - మంత్ర + అక్షరంబులు = దేవీ మంత్రాక్షరములు, జపము + చేయు + అవియు - వలెన్ =

1. తా. పన్నిన 2. ము. దంబుల సంచరించినన్ 3. ము. సరస.

జపము చేయుచున్నవి. పోలె, ఉన్నన్ = ఉండగా, అతండు = సుకుమారుండు, అద్భుతంబు + అందెన్ = ఆశ్చర్యమందెను.

తాత్పర్యము: ఆ దేవి యాలయమున గల యుద్యానము నందలి పొదలలో నెలుకలు క్రింది పెదవులను గదలించు చుండగా, నవి శక్తి మంత్రాక్షరములను జపము చేయుచున్నవానివలె నుండుట చూచి సుకుమారుడాశ్చర్యమందెను.

విశేషములు: అచ్చట తిర్యక్కులైన యెలుకలుగూడ దేవీ మంత్రమును జపించుచున్నట్లుండుటచే నతని కాశ్చర్యమయ్యెను. అవి పెదవులను గదలించుట దేవి మంత్రాక్షరములను జపించుచున్నట్లు సంభావించుటచే నలంకార ముత్ప్రేక్ష. అధర + ఓష్ఠ - ఇచ్చట వృద్ధి రాలేదు. పరరూప మేకాదేశమయినది. సమాసమున అకారాంతపదములకు ఓతు, ఓష్ఠ అను పదములు పరములగునపుడు వృద్ధ్యాదేశము వైకల్పికము. వృద్ధిరానిచో పరరూపమేకాదేశ మగును. అధరౌష్ఠ (వృద్ధి), అధరోష్ఠ (పరరూపము).

సీ. మంత్రవాదుల తోడి మైత్రి సంపాదించు
యంత్రవాదులగని యాదరించు
సిద్ధయోగీశ్వరశ్రేణి సంసేవించు
ధాతువాదులకు వందనము సేయుఁ
గదలి [1]వశ్యాశ్చర్యకథ లెఱుంగగఁ గోరు
బిలము సాధింప నపేక్ష సేయు
బహుదేశభాష లభ్యాసింప వాంఛించు
శల్యతంత్రము మీద జాఁపు మనసు.

గీ. (ఘుటిక కట్టగం) బెన్నిధి [2]గుద్దలింప
నింద్రజాలంబు వన్నంగ నిచ్చగించు
[3]గట్టి భవనములకు సురంగములు ద్రవ్వ
నేర్చుకొనుఁ బ్రత్యహంబును నీచబుద్ధి. 113

అర్థము: నీచ - బుద్ధి = అల్పమైన బుద్ధి గలవాడగు సుకుమారుడు, ప్రతి + అహంబును = ప్రత్యహంబును = ప్రతిదినమును, మంత్ర - వాదులతోడి = కనుకట్టు విద్యలు చేయువారితోడి, మైత్రి = స్నేహము, సంపాదించున్; యంత్రవాదులన్ = యంత్రములు వేయువారిని, కని = చూచి, ఆదరించున్. సిద్ధ - యోగి + ఈశ్వర - శ్రేణిన్ = ఇంద్రజాలాదుల నారితేఱిన యోగి శ్రేష్ఠుల సమూహమును, సంసేవించున్ = కొలుచును, ధాతు - వాదులకున్ = రసాయనాదులచేత బంగారము వెండిమున్నగునవి

1. తా. వనాశ్చర్య 2.ము. గుద్దలించు. 3. తా. గట్టు బాళములును.

చేయువారికి - రసవాదులకు, వందనము + చేయున్ = నమస్కరించును. కదలి = తిరిగి, వశ్య + ఆశ్చర్య - కథలు = పెట్టుమందుల యచ్చెరువు గొలుపు వృత్తాంతములు, ఎఱుంగగన్ + కోరున్ = తెలియగోరును. బిలము = రంధ్రము, సాధింపన్, అపేక్ష + చేయున్ = కోరును. బహు - దేశ - భాషలు = పెక్కుదేశముల భాషలు, అభ్యాసింపన్ = నేర్చుకొనుటకు, వాంఛించున్ = కోరును, శల్య - తంత్రము మీదన్ = బాణవిద్యపై, మనసున్ = మనస్సును, చాపున్ = పోనిచ్చును. ఘుటిక - కట్టగన్ = గుళికలు కట్టుటకును, పెన్నిధిన్ (పెను +నిధిన్) = పెద్ద పాతును. గుద్దలింపన్ = పెల్లగించుటకును, ఇంద్రజాలంబు = కనుకట్టు విద్య, పన్నంగన్ = కావించుటకు, ఇచ్చగించున్ = కోరును. గట్టి - భవనములకున్ = దృఢమైన యిండ్లకు, సురంగములు = సొరంగములు, త్రవ్వన్, నేర్చుకొనున్.

తాత్పర్యము: అల్పబుద్ధియగు సుకుమారుడు ప్రతిదినమును కనుకట్టు విద్యలు చేయువారితో స్నేహము చేయును. యంత్రములు వేయు వారిని చూచి యాదరించును. ఇంద్రజాలాదుల నారితేఱిన యోగి శ్రేష్ఠులను కొలుచును. రసవాదులకు నమస్కరించును. పెట్టుమందుల వింతగొలుపు కథలు తెలియగోరును. దేనికైన రంధ్రము పెట్టువిధమును తెలిసి కొన గోరును. బహుదేశభాషల నభ్యసింప గోరును. బాణ విద్యపై మనసు పోనిచ్చును. గుళికలు కట్టుట, పెన్నిధులు పెల్లగించుట, ఇంద్రజాలము చేయుట తెలియగోరును. దృఢములైన భవనములకు సొరంగములు త్రవ్వ నేర్చును.

విశేషములు: అట్టి నీచములైన కోరికలను గోరువాడగుట చేతనే అతడు నీచబుద్ధి. `నీచబుద్ధి' యను విశేషణము సాభిప్రాయమగుటచే నలంకారము పరికరము.

ప్రత్యహము - ప్రతి + అహము = యణాదేశ సంధి. చాపు - చాగు ధాతు ప్రేరణ రూపము. `అట్లు చు క్పుగాగమంబు లడంగ్వాది మాయ్వాదుల కగు నగుచో వాని కడవ్రాలు లోపించు.' బాల. క్రియ. 76. చాచు, చాపు, చాగించు. (రూపాం.) బాహుళకంబునంజేసి కొన్నింటి కించు క్పు క్పుగాగమంబులు మూడును నగు ననుటచే `చాగు' ధాతువు వానిలోనిది.

చ. [1]బతిచెడి మాంసభుక్తి మధుపాన జనంగమ వంశభామినీ
రతిఁబరతంత్రుఁడై నడుపుఁ [2]బ్రత్యహమున్ ధరియింపుచుండు న
వ్రతితుఁడు గంగమట్టియుం బ్రన్నని నున్నని నీరుకావిదో
వతులును (బ్రహ్మసూత్ర)ములు వంశ్యులయిండ్ల [3]భుజించుకోరికన్. 114

---

1. ము. స్థితిచెడి మాంసభో (జనముసేసి) యనంగమ. 2. ము. బ్రత్యయమున్ 3. తా.భుజించున్ గోరికన్

అర్థము: అప్పతితుఁడు (అ+పతితుడు) = భ్రష్టుడైన యా సుకుమారుడు, బతి - చెడి = పంక్తి బాహ్యుడై చెడి మాంస.... రతిన్: మాంస - భుక్తి = మాంసభోజనమునందును, మధు - పాన = కల్లు త్రావుట యందును, జనంగమ - వంశ - భామినీ = చండాలకుల స్త్రీ యందును, రతిన్ = ప్రీతిని, పరతంత్రుడు + ఐ = అధీనుడయి, నడుపున్ = చేయును, ప్రత్యహమున్ (ప్రతి + అహమున్) = ప్రతిదినమును, వంశ్యుల + ఇండ్లన్ = సద్వంశమువారి యిండ్లయందు, భుజించు - కోరికన్ = భుజించు కోరికతో, గంగ మట్టియునున్ = గంగ మట్టియును (గంగా మృత్తికయును), ప్రన్నని = చక్కని, నున్నని = మృదువులైన, నీరు కావిదోవతులును = లేతకావి రంగు వస్త్రములును, బ్రహ్మసూత్రములున్ = యజ్ఞోపవీతములును, ధరియింపుచున్ + ఉండున్ = తాల్చుచుండును.

తాత్పర్యము: బ్రాహ్మణ ధర్మభ్రష్టుడైన యా సుకుమారుడు పంక్తి బాహ్యుడై, మాంస భోజనము, మద్యపానము, చండాల స్త్రీ యనువానియందు తదధీనుడై ప్రీతిని జూపును. కులీనుల యిండ్ల భుజించు కోరికతో నతడు ప్రతిదినమును నొసట గంగ మట్టి నలదుకొని, చక్కని నున్నని లేతకావి వస్త్రములను ధరించి, యజ్ఞోపవీతమును దాల్చును.

విశేషములు: బ్రాహ్మణులు చేయరాని మాంసభుక్తి, మధుపాన, జనంగమ వంశభామినీ రతిని చేయుటయే సుకుమారుడు బతి చెడుట. అట్టివి చేసి పంక్తి బాహ్యుడై భ్రష్టుడగుటచేతనే యతనిని పతితుడనుట. సద్వంశ్యుల యిండ్ల భోజనము చేయగోరి యతడు దినదినమును పవిత్రునివలె గనుపట్టుటకు నొసట గంగ మట్టినలదుకొనును. నీరుకావి మడుగు దోవతులను తాల్చును. యజ్ఞోపవీతమును ధరించును. బతి - ఈ మాట నిఘంటువుల కనబడలేదు. వ్రతము (ప్రకృతి) - బతము (వికృతి) కావున ప్రకరణముననుసరించి యట్లర్థము చెప్పబడినది. `స్థితి చెడి మాంసభోజనము సేసి యసంగవంశభామినీ - రతి' నను అం.సా.ప. ప్రతిపాఠమున కర్థము: స్థితి - చెడి = బ్రాహ్మణ స్థితి చెడి, మాంసభోజనము + చేసి, అసంగమ - వంశ - భామినీ - రతిన్ = సంగమము లేని (మాల) వంశపు స్త్రీ రతి యందు. మాంసభుక్తి, మధుపాన, జనంగమభామినీ అను సిద్ధద్వంద్వ సమాసముతో `రతి' యన్వయించునట్లు చెప్పబడినది. `ప్రత్యయమున్' అను పాఠముకంటె `బ్రత్యహమున్' అను పాఠమే మేలయినదిగా భావింపబడినది. ధరియింపుచుండు అనుదానికంటె ధరియించుచుండు అనునది లక్షణ సమ్మతము. గంగమట్టియను నొసట దాల్చుట, నీరు కావి దోవతులను గట్టుట, బ్రహ్మసూత్రధారణము పవిత్రత కొఱకు. సద్బ్రాహ్మణుడుగా గనుపట్టుటకు - సద్బ్రాహ్మణుల యింట భోజనము నిరాతంకముగా సాగుటకు.

గీ. మాధుకరభిక్షలను స్వయంపాకములను
సత్రభోజనములఁ బితృశ్రాద్ధములను
విందులను దేహయాత్ర గావించునతఁడు
వేదశాస్త్రపురాణప్రవీణుఁడగుట 115

అర్థము: అతఁడు = సుకుమారుడు, వేద - శాస్త్ర - పురాణ - ప్రవీణుండు = వేదములందును, శాస్త్రములందును, పురాణము లందును నేర్పుగలవాడు, అగుటన్ = అగుట చేత, మాధుకర - భిక్షలను = ఇల్లిల్లు తిరిగి కూర్చుకొను బిచ్చములచేతను, స్వయంపాకములను = స్వయముగా జేసికొను వంటల చేతను, సత్ర - భోజనములన్ = ధర్మశాలలందు భుజించుటచేతను, పితృ - శ్రాద్ధములను = పితృదేవతలకు బెట్టు అబ్దికముల చేతను, విందులను = విందు భోజనములచేతను; దేహ - యాత్ర = శరీర స్థితిని, కావించున్ = చేయును.

తాత్పర్యము: సుకుమారుడు వేద శాస్త్ర పురాణములందు పండితుడగుటచే మాధుకర వృత్తి చేతను, స్వయంపాకములచేతను, సత్రములందు భోజనములచేతను, ఆబ్దికములచేతను, విందులచేతను శరీరమును నిలుపుకొనును.

విశేషములు: మాధుకర భిక్ష - మధుకరము (తుమ్మెద) పూవుపూవునకు దిరిగి మధువును సేకరించునట్లు, ఇల్లిల్లు తిరిగి భిక్ష సేకరించు పద్ధతి.

సీ. నీరాట నెపముగా నిర్ఝరంబుల కేఁగి
సవిధవానీర కుంజముల [1]నొండె.
భూధరంబుల కిప్పపువ్వు దే నని పోయి
కందరా మధ్యభాగముల[2]నొండె
[3]శిశిర భూధర కన్య సేవింప నని పోయి
[4]నక్తమూలముల నెన్నడుమ[5]నొండెఁ
గలమ సస్యక్షేత్రములకుఁ గూళ్ళొగి మోసి
శణవాటికాప్రదేశముల [6]నొండె

గీ. నెట్టు [7]కనుఁబ్రామి వచ్చునో యింటి వారి
[8]నెట్టు (వెరవదొ యొం)టిమై నిక్కకరుగ
నతివ పగలైన మాపైన నతని తోడ
నిచ్చ [9]నొకసారి సాగించు నిధువనంబు. 116

1.2. ము. నొందు, 3. ము. (శిఖరీంద్రవర) కన్య. 4. తా. నక్తతమాల నెన్నడుమ, 5.6. ము. నొందు, 7. తా. కనువామి. 8. ము. నెట్లు (చీకటినొం) టెమై నిక్క కరుగు, 9. తా. నొకవాలు.

అర్థము: అతివ = స్త్రీ (మాలెత). నీరాట = స్నానము, నెపముగాన్ = వంకతో, నిర్ఝరంబులకున్ = సెలయేఱులకు. ఏగి, సవిధ - వానీర - కుంజములన్ + ఒండెన్ = సమీపమునందలి ప్రబ్బలి పొదలలోనైనను, భూధరంబులకున్ = పర్వతములకు, ఇప్పపువ్వు, తేన్ + అని - పోయి = తెచ్చుటకనిపోయి, కందరా - మధ్య - భాగములన్ + ఒండెన్ = గుహల నడిమి ప్రదేశములందునో, శిశిర - భూధర - కన్యన్ = మంచుగొండ కూతురగు పార్వతిని, సేవింపన్ + అని - పోయి = కొలుచుట కని చెప్పివెడలి, నక్తమాలముల = కానుగు చెట్లయొక్క, నెన్నడుమన్ (నె + నడుమన్) + ఒండెన్ = మధ్యముననో. కలమ - సస్య - క్షేత్రములకున్ = వరిపంటభూములకు, కూళ్ళు = అన్నములు, ఒగిన్ = క్రమముగా, మోసి, శణ - వాటికా - ప్రదేశములన్ + ఒండెన్ = జనుము పండు భూభాగములనో. ఇంటివారిన్ = ఇంట నున్న వారిని, ఎట్టు, కనుఁబ్రామి = మోసగించి, వచ్చునో, ఒంటిమైన్ = ఒంటరిగా, ఇక్కకున్ = ఇంటికి, అరుగన్ = పోవుటకు, ఎట్టు, వెఱవదొ = భయపడదో, పగలు + ఐనన్, మాపు + ఐనన్ = రాత్రియైనను, అతనితోడన్ = సుకుమారునితో, నిచ్చన్ = ప్రతిదినమును, ఒకసారి, నిధువనంబున్ = మైథునమును, సంభోగమును, సాగించున్ = నడపును.

తాత్పర్యము: మాలెత - యింటిలోని వారి నెట్లు వంచించి వచ్చునో, ఎటు లొంటరిగా నింటికి బోవ వెఱవదో - స్నానమిషమున సెలయేఱుల కేగి సమీపమునందలి ప్రబ్బలి పొదలలోనో, పర్వతముల కిప్పపువ్వు తెచ్చుట కని చెప్పిపోయి గుహల నడుమనో, పార్వతిని సేవించుట కని పోయి కానుగు చెట్ల నడుమనో, వరి పంట చేలకు కూడు తీసికొని పోయి జనుప చేలలోనో, నిత్యమును పగలైనను రేయైనను నొకసారి యతనితో రతిక్రీడ నడపును.

విశేషములు: నిభము (ప్రకృతి) - నెపము, నెవము (వికృతి), సవిధ - `సదేశాభ్యాస సవిధ సమర్యాద సవేశవత్` - సమానా విధా ప్రకారోఽస్యేతి సవిధః - సమానమైన ప్రకారము గలది - దాపు. (అమరము). వానీర - వేతసే రథా భ్రపుష్పవిదుల శీత వానీర వఞ్జులాః.'దాహ శమనార్థం వన్యత ఇతి వానీరః - దాహశమనార్థము పొందబడునది - ప్రబ్బలి. (అమరము) నక్తమాల - `చిరిబిల్వో నక్తమాలః కరజశ్చ కరఞ్జకే. నక్తమలతి మణ్డయతీతి నక్తమాలః - రాత్రి నలంకరించునది - కానుగు చెట్టు - అమరము. నెఱ + నడుము = నెన్నడుము. `అన్యంబులకు సహిత మి క్కార్యంబులు కొండొకచో గానంబడియెడి. బాల. సంధి. 39. కూడు (ఏకవచనము) - కూళ్ళు (బహువచనము) కూడు + లు. `బహువచనము పరంబగునపుడు డ - ల - ట - ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు.' బాల. అచ్ఛిక. 12. కూడ్ + లు `బహువచన శ్లిష్టంబులయి యద్విరుక్తంబులయిన డకారలకారంబుల కలఘు లకారంబు నిత్యంబుగ నగు.' బాల. అచ్ఛిక. 4 కూళ్లు. ఒండె - పక్షాంతరమును

దెలుపు ద్రుతాంతమైన అవ్యయము. నిధువన - 'వ్యవాయో గ్రామ్యధర్మో మైథునం నిధువనం రతమ్.' నిధూయన్తే అఙ్గాన్యత్రేతి నిధువనం - దీనియందు అంగములు కదలును. (అమరము) - స్త్రీసంగము.

వ. [1]ఒక్కనా డక్కనిష్ఠవర్తనుండు పక్కణశబరులం గూడి కరి క్రవ్యాదంబు (లగు కుక్కలంబట్టు) కొని ప్రత్యుషః కాలంబున విపిన వీథుల [2]నీవార భసల విఘటిత సరఃకమల షండ సౌరభోద్గార భరిత దిక్కటాహంబు కరటి మార్గం బిదె, విదళిత సమస్త ముస్తా శకల సారంబు వరాహ యూథపథం బిదె, కఠిన [3]విషాణ కోటి విభిద్యమాన వల్మీక ధూళి పాళికా నిచుళిత తరుపలాశంబు మహిషవర్త్మం బిదె, దూర్వా ప్రవాళ చర్వణ [4]హరిచందన పరిపాండు రంబు. [5]హరిణ మార్గం బిదె, [6]కటు దీర్ఘఘుర్ఘుర వ్యాక్రోశంబు కర్కరేటు కుల కులాయస్థానం బిదె, కహ (కహారా) వంబు, దాత్యూహ వ్యూహ ప్రదేశంబు ననుచు నాఖేట కౌతుకంబున నాఖేలన క్రీడా విహారంబుల [7]నృశంసుండై, ప్రాణిహింస [8]యొనర్చుచు వెండియు.117

అర్థము: ఒక్కనాడు, ఆ + కనిష్ఠ - వర్తనుండు = నీచమైన నడవడి గల ఆ సుకుమారుడు, పక్కణ - శబరులన్ = బోయపల్లెయందలి బోయవాండ్రను, కూడి, కరి - క్రవ్యాదంబులు = ఏనుగుల మాంసమును తిను నవి, అగు, కుక్కలన్, పట్టుకొని, ప్రత్యుషస్ + కాలంబునన్ = వేకువ యందు, విపిన - వీథులన్ = అడవి ప్రదేశములందు, నీవార...... దిక్కటాహంబు: నీవార = నివ్వరుల చేతను, భసల = తుమ్మెదల చేతను, విఘటిత = వేఱుచేయబడినట్టిదియు, సరస్( ) + కమల = సరస్సునందలి తామరల యొక్క, షండ = సమూహము యొక్క, సౌరభ = పరిమళము యొక్క, ఉద్గార = క్రక్కుట చేత, భరిత = నిండిన, దిక్ + కటాహంబు = మూకుడు వంటి దిక్కులు గలదియు (అగు,) కరటి - మార్గంబు = ఏనుగుల త్రోవ, ఇది + ఎ = ఇదె = ఇదియే. విదళిత....... సారంబు : విదళిత = చీల్పబడిన, సమస్త = ఎల్ల, ముస్తా = తుంగ ముస్తెల యొక్క, శకల = ముక్కల యొక్క, సారంబు = ముఖ్యాంశము గలది, (అగు), వరాహ - యూథ - పథంబు = పందుల యొక్క, సమూహము యొక్క, మార్గము, ఇదె. కఠిన .... పలాశంబు: కఠిన = పరుషములైన, విషాణ = కోల యొక్క, కోటి = అంచుల చేత, విభిద్యమాన = విశేషముగా భేదింపబడుచున్న, వల్మీక = పుట్టల యొక్క, ధూళి = దుమ్ముల యొక్క, పాళికా = వరుసల చేత, నిచుళిత = కప్పబడిన, తరు = చెట్లయొక్క, పలాశంబు = ఆకులు గలది, (అగు), మహిష = దున్నల యొక్క, వర్త్మంబు = మార్గము, ఇదె. దూర్వా....... పాండురంబు: దూర్వా = గఱికయొక్క,

1. తా. ఒక్కొక్కనాఁడ, 2 తా. నిదె రభస విఘటిత, 3. ము. పాషాణ, 4. తా. హరిచ్ఛందన పరిపాండురంబు, 5. తా. హరిద్వారం బిది, 6. తా. కదా, 7. ము. ఁగృశుండై, 8. తా. యొనర్చుచు.

ప్రవాళ = చిగురుల యొక్క, చర్వణ = తినుట గలట్టియు, హరిచందన = మంచి గంధపు చెట్లచే, పరిపాండురంబు = మిక్కిలి తెల్లనిది, (అగు), హరిణ - మార్గంబు = లేళ్లయొక్క త్రోవ, ఇదె. కటు...... క్రోశంబు: కటు = పరుషమయినట్టియు, దీర్ఘ = నిడుపయినట్టియు, ఘర్ఘర = ఘర్ఘర అను, వ్యాక్రోశంబు = అఱపు గలదీ, (అగు,) కర్కరేటు - కుల - కులాయ - స్థానంబు = పెద్దకొక్కెరల యొక్క, సమూహము యొక్క, గూడుల యొక్క, చోటు, ఇదె. కహకహ + ఆరావంబు = కహకహయను ధ్వని గలదీ, దాత్యూహ - వ్యూహ - ప్రదేశంబున్ = చాతకపక్షులయొక్క, సమూహముయొక్క చోటును, అనుచున్, ఆఖేట - కౌతుకంబునన్ = వేట యందలి, వేడుక చేతను, అఖేలన - క్రీడా - విహారంబునన్ = ఆటలయందు విహరించుటచే, నృశంసుండు + ఐ = మనుష్యులమ హింసించువాడు (క్రూరుడు) అయి, ప్రాణి - హింస = జీవుల యొక్క చంపుట, ఒనర్చుచున్ = చేయుచు, వెండియున్ = మరల.

తాత్పర్యము: ఒకనాడా నీచుడైన సుకుమారుడు బోయపల్లెయందలి బోయలను గూడి యేనుగు మాంసమును తిను నట్టి కుక్కలను తీసికొని వేకువ సమయమున నడవులలో నివ్వరులు, తుమ్మెదలు వేఱు చేయబడినట్టియు, సరస్సునందలి తామరల సమూహము యొక్క పరిమళము యొక్క వెల్లిగ్రక్కుట తో నిండిన మూకుడు వంటి దిక్కులు గలదియునగు నేనుగుల మార్గ మిదే. చీల్చబడిన యెల్ల తుంగ ముస్తెల సారము గల అడవి పందుల గుంపుల మార్గమిదే. పరుషములైన కోల కొనలచే భేదింపబడుచున్న పుట్టల ధూళి కణముల సమూహముచే కప్పబడిన చెట్ల ఆకులు గల అడవి దున్నల మార్గమిదే. గఱికచివురుల దినుట గలట్టియు, మంచి గంధపు జెట్లచే మిక్కిలి తెల్లనిదియునగు లేళ్ల మార్గమిదే. పరుషము, దీర్ఘము నైన ఘర్ఘరయను అఱపుగల పెద్దకొక్కెరల గుంపుల గూండ్లు గల చోటు ఇదే. కహకహధ్వని గల చాతక పక్షుల గుంపుగల చోటు ఇదే అనుచు వేటయందలి తమకముచే క్రీడల విహరించుచు క్రూరుడై ప్రాణులను హింసించుచు, మఱియును - తరువాతి పద్యముతో సన్వయము.

విశేషములు: కరటులు నీవారములను, భసలములను విఘటితము (చెల్లాచెదరు) చేసెను. సరఃకమల షండమును గలచివైచుటచే తత్సౌరభము దిక్కటాహము నిండినది. వరాహములు ఎల్ల ముస్తెలను చీల్చి వైచెను. మహిషములు తమ విషాణములచే వల్మీకములను భేదింపగా తద్ధూళి కణములను చర్వణము చేసినవి. వాని మార్గము హరిచందనములచే పరిపాండురమయినది. కటువులు, దీర్ఘములు నైన వ్యాక్రోశములు గలవి కర్కరేటువుల గూండ్లు. దాత్యూహ వ్యూహముల ప్రదేశము వాని కహకహారావముతో నిండినది.

గీ. పాపకర్ముండు కాంతారపథమునందు
[1]నదరిపా టొంటినంటి బ్రాహ్మణుల మొత్తి
యపహరించిన విత్త మన్యాయపరత
నంత్యజస్త్రీయుఁ దానును ననుభవించు. 118

అర్థము: పాప - కర్ముండు = పాప కార్యములు గలవాడు - సుకుమారుడు, కాంతార - పథమునందున్ = అడవి దారిలో, అదరిపాటు + ఒంటిన్ + అంటి - దీనికంటె - 'అదరిపాటున నొంటి' యను ముద్రిత ప్రతి పాఠమే మేలని పించుచున్నది - అదరిపాటునన్ = అకస్మాత్తుగా, ఒంటిన్ = ఒంటరిగా, బ్రాహ్మణులన్, మొత్తి = కొట్టి, అపహరించిన = దొంగిలించిన, విత్తము = ధనము, అన్యాయ - పరతన్ = అధర్మ పరత్వముతో, అంత్యజ - స్త్రీయున్ = మాల పడతియును, తానును, అనుభవించున్.

తాత్పర్యము: పాపకర్ముడగు సుకుమారుడు అడవిలో త్రోవగాచి అకస్మాత్తుగా ఒంటరిగా నున్న బ్రాహ్మణులను కొట్టి దొంగిలించిన ధనమును అన్యాయపరుడై మాలెతయును తానును అనుభవించును.

విశేషములు: అదరిపాటునన్, అనియో అదరిపాటుగా అనియో లేక పోవుటచే నన్వయమంత సుగమముగా లేదు. అందుచే ముద్రితప్రతిపాఠమే స్వీకరింపబడినది. పాపకర్ముండు అంత్యజస్త్రీయు దానును ననుభవించు - 'ఆత్మార్థంబభిహితం బగుచోం దల్లింగ సంఖ్యాభిధాయి వచనంబు ధాతు విశేషణంబుల కగు.' బాల. క్రియ. 120

గీ. ఇవ్విధంబున సుకుమారుఁ[2]డీలు వుడిగి
మాల చిగురాకుబోఁడితో మనువు మనఁగ
వచ్చె నొయ్యన మధుమాసవాసరములు
[3]వాసితాశోకసత్ఫుల్ల కేసరములు. 119

అర్థము: సుకుమారుడు, ఈ + విధంబునన్, ఈలువు + ఉడిగి = కులాచారము విడిచి, మాల - చిగురాకు బోడితోన్ = చిగురాకు వంటి మేను గల మాలెతతో, మనువు - మనగన్ = కాపురముండగా, వాసి...... కేసరములు: వాసిత = పరిమళింప జేయబడిన, ఆశా = దిక్కులుగల, ఉల్లసత్ = మిక్కిలి ప్రకాశించుచున్న, ఫుల్ల = వికసించిన, కేసరములు = అకరువులు గలవి, (అగు), మధుమాస - వాసరములు = వసంతపు దినములు, ఒయ్యనన్ = క్రమముగా, వచ్చెన్.

1. ము. నదరి పాటుననొంటి 2. తా. డిల్లు. 3. వాసితాశోక సంఫుల్ల

తాత్పర్యము: ఈ రీతిగా సుకుమారుడు కులాచారము విడిచి మాలెతతో కాపురము చేయుచుండగా దిక్కులను పరిమళితములు చేయు వికసిత కేసరములు గల వాసంతదినములు క్రమముగా వచ్చెను.

విశేషములు: వాసరములు - కేసరములు - అంత్యప్రాసము. చిగురాకుబోడి - చిగురాకు వంటి మేను గలది - బహువ్రీహి. చిగురాకు + మేను. `బహువ్రీహిని స్త్రీవాచ్యం బగుచో నుపమానంబు మీది మేనునకు బోడియగు.' బాల. సమాస. 23.

సీ. కామినీగండూషకాదంబరీధారఁ
బులకించె నారామభూమిఁ బొగడ
చివురాకుం జవి చూచి చవిచూచి [1]యెలుగించెఁ
బంచమస్వరమునఁ బరభృతంబు
సంఫుల్లకోరకస్తబకాచితం బైన
కొరవిపై [2]భ్రమరించె గొదమ తేఁటి
పరిపక్వసహకారఫలరసాస్వాదన
[3]మదమునం గీరంబు చదువఁ దొణఁగె.

గీ. విట విటీ సముదయములు వివిధవిధుల
నుపవనక్రీడ సల్పిరి యుబ్బు మిగిలి
యఖిలజనులకు సంతోష మావహించె
మాసరములైన [4]మధుమాస వాసరములు. 120

అర్థము: ఆరామ - భూమిన్ = తోటలో, పొగడ = పొగడ చెట్టు, కామినీ - గండూష - కాదంబరీ - ధారన్ = స్త్రీల యొక్క, పుక్కిటి, మద్యము యొక్క ధారచేత, పులకించెన్ = గగుర్పాటు గలదియయ్యెను - మొగ్గతొడిగిన దయ్యెను. పరభృతంబు = కోకిల, చివురాకున్, చవిచూచి - చవిచూచి = రుచిచూచిచూచి, పంచమ - స్వరమున్, ఎలుగించెన్ = కూసెను. కొదమ - తేఁటి = పిల్లతుమ్మెద, సంఫుల్ల - కోరక - స్తబక + అచితంబు + ఐన = మిక్కిలి వికసించిన మొగ్గల యొక్క, గుత్తులచే, కూర్పబడిన దైన, కొరవిపైన్ = ఎఱ్ఱగోరంట = కురవకముమీద, భ్రమరించెన్ = తిరిగెను. కీరంబు = చిలుక, పరిపక్వ .....మదమునన్: పరిపక్వ = బాగుగా పండిన, సహకార - ఫల = తీయమామిడి పండ్లయొక్క, రస = రసము యొక్క, ఆస్వాదన = త్రావుట వలని, మదమునన్ = క్రొవ్వుతో, చదువన్ + తొణంగెన్ = చదువనారంభించెను. విట - విటీ - సముదయములు = జారుల యొక్కయు, జారిణుల యొక్కయు, సమూహములు, ఉబ్బు = గర్వము, మిగిలి =

1. ము. యెలిఁగించె 2. ము. భ్రమయించె. 3. ము. మదమున. 4. తా.యమ్మాన వాసరములు.

అతిశయించి, వివిధ - విధులన్ = పెక్కు రీతుల, ఉపవన - క్రీడ = ఉద్యానవన విహారము, సల్పిరి = చేసిరి. మానరములు + ఐన = మనోజ్ఞము లైన, మధుమాస - వాసరములు = వాసంత దినములు, అఖిల - జనులకున్ = ఎల్లవారికిని, సంతోషము, ఆవహించెన్ = కలిగించెను.

తాత్పర్యము: ఉద్యానవనములో పొగడ' చెట్లు స్త్రీల మద్యపు పుక్కిలుల ధారచే మొగ్గతొడిగెను. కోకిల చివురాకులను రుచిచూచి చూచి పంచమ స్వరమున కూసెను. పిల్లతుమ్మెద మిక్కిలి వికసించిన మొగ్గల గుత్తులుగల కొరవిపై (ఎఱ్ఱగోరంట మీద) తిరుగాడెను. చిలుక బాగుగా పండిన తీయమామిడి పండ్ల రసమును త్రావుటవలని క్రొవ్వున చదువనారంభించెను. జారులయు జారిణులయు సమూహము మిక్కిలి గర్వించి యనేక విధముల నుద్యానవన విహారమును గావించిరి. మనోజ్ఞములైన వాసంత దివసములు ఎల్లవారికి సంతోషదాయకము లయ్యెను.

విశేషములు: కామినీ గండూష..... బొగడ: పొగడ - కేసరము - వకుళము. దీనికి దోహదము. ముఖసీధువు. `వకుళో ముఖసీధునా.' కామినీ గండూష కాదంబరీధార యనగా ముఖసీధువే. పులకించుట యనగా గగుర్పాటు చెందుట. ఇచ్చట మొగ్గతొడుగుట యని భావము. కొరవి = ఎఱ్ఱగోరంట, కురవకము. `కొరవి నాఁ గ్రోవినాఁ గ్రొమ్మినాఁగఁ, గురవక నామమౌ.....' అం.భా. 2-63.

వ. ఇట్లు *సకలజన మనోహరంబులగు మధుమాస వాసరంబుల (యందు) [1]నప్పాపిష్ఠుండు చండాలకన్యకం దగిలి యొండెఱుంగక లజ్జ యుజ్జగించి మానం బూనంబు చేసి కులంబు పదటం గలిపి శీలంబు పరిత్యజించి దిట్ట కూళయై కన్నుగానక కావరం బెత్తి తిరుగుచుండం గర్ణాకర్ణి నతని దుశ్చారిత్రంబు లెల్ల విని [2]యెక్కడెక్కడ నాడికొనం దొణంగి రంత నెంతేనియుం [3]దేటతెల్లయైన యతని దుర్వర్తనంబు ప్రసంగించి ప్రకాశంబుగా నాడుచుండిరంత. 121

అర్థము: ఇట్లు, సకల - జన - మనోహరంబులు = ఎల్ల జనులకు నింపు, అగు, మధుమాస - వాసరంబుల యందున్ = వసంత దినములలో, అ + పాపిష్ఠుండు (అప్పాపిష్ఠుండు) = మిక్కిలి పాపి యగు నా సుకుమారుడు, చండాల - కన్యకన్ = మాలపడుచును, తగిలి = కూడి, వలచి, ఒండు + ఎఱుంగక = మఱియొకటి తెలియక, లజ్జ = సిగ్గు, ఉజ్జగించి = విడిచి, మానంబు = గౌరవము, ఊనంబు + చేసి = తక్కువచేసి, కులంబు, పదటన్ + కలిపి - బూడిదలో గలిపి, నాశనము చేసి, శీలంబు = సత్స్వభావము, పరిత్యజించి = విడిచి, దిట్టకూళ + ఐ = మిక్కిలి అవివేకియై, కన్ను + కానక = అంధుడై, కావరంబు + ఎత్తి = గర్వమతి

* తాళపత్రమున లేదు, 1. ము. నప్పాపిష్ఠి, 2. ము. యక్కడక్కడ 3. తా. తేటతెల్లంబయిన

శయించి, తిరుగుచున్ + ఉండన్, కర్ణాకర్ణిన్ = వినికి వరుసను, అతని, దుశ్చారిత్రంబులు = దుష్ప్రవర్తనములు, ఎల్లన్ = సర్వమును, విని, ఎక్కడన్ + ఎక్కడన్ = ఏయేచోటను, ఆడికొనన్ = చెప్పికొన, తొణంగిరి = మొదలిడిరి, అంతన్, ఎంత + ఏనియున్ = మిక్కిలి, తేటతెల్ల + ఐన = స్పష్టమైన, అతని, దుర్వర్తనంబు = చెడునడవడి, ప్రసంగించి = ప్రస్తావించి, ప్రకాశంబుగాన్ = పైకి, ఆడుచున్ + ఉండిరి = చెప్పికొనుచుండిరి, అంతన్.

తాత్పర్యము: ఈ రీతిగా ఎల్లజనులకు నింపును గూర్చు వసంతదినములలో నా పాపిష్ఠుడు మాలెతను వలచి యితర మెఱుగక సిగ్గువిడిచి అభిమానమును తక్కువచేసి, సద్వంశమును బూడిద గలిపి శీలమును విడిచి మిక్కిలి అవివేకియై కన్నులు గానక గర్వ మతిశయించి సంచరించుచుండగా ఆచెవి నుండి ఆ చెవిగా నతని దుష్ప్రవర్తనము లన్నియు విని యెల్లయెడలను చెప్పికొన నారంభించిరి. అంత మిక్కిలి స్పష్టమైన యతని చెడునడవడిని గూర్చి బాహాటముగా పలుకు చుండిరి. అంత - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: పాపిష్ఠ - పాపి + ఇష్ఠ = ఈయస్, ఇష్ఠప్రత్యయములు తరతమార్థములందు చేరును. ఇవి చేరునప్పుడు అనేక స్వరములగు పదముల తుది యచ్చును, దాని తరువాత హల్లున్నచో నదియును లోపించును. కూళ (వికృతి) - క్రూర (ప్రకృతి). తొడఁగు - తొణఁగు. `అడంగ్వాదుల డాకు ణకారంబు విభాషనగు.' బాల. ప్రకీర్ణ. 13.

క. క్రూరాత్ముఁడీతఁడనఁగా
జోరుండితఁ డనఁగ నితఁడశుద్ధుఁడన దు
శ్చారుండితఁ డనఁగా సుకు
మారున కపకీర్తి హూణమండలిఁ బ్రబలెన్. 122.

అర్థము: ఈతఁడు, క్రూర + ఆత్ముఁడు = క్రూర స్వభావుడు, అనగాన్, ఇతడు, చోరుండు = దొంగ, అనగన్, ఇతడు, అశుద్ధుఁడు = అపవిత్రుఁడు, అనన్ = అనగా, ఇతఁడు, దుశ్చారుండు = చెడుగా ప్రవర్తించువాడు, అనగాన్, సుకుమారునకున్, హూణ - మండలిన్ = హూణమండలము నందు, అపకీర్తి = చెడ్డపేరు, ప్రబలెన్ = మిక్కిలి వ్యాపించెను.

తాత్పర్యము: ఇతడు క్రూరుడు, చోరుడు, అపవిత్రుడు, చెడునడవడి గలవాడు అని సుకుమారునకు హూణమండలమున నపకీర్తి మిక్కిలి వ్యాపించెను.

విశేషములు: దుశ్చారుడు - దుః(స్) + చారుండు - ఊష్మపరకములు కాని చఛ, టఠ, తథలు పరములగునపుడు విసర్గము సకారముగా మాఱి చఛలు పరమగునపుడు శ్చుత్వమును, టఠలు పరమగునపుడు ష్టుత్వమును పొందును.

వ. అంత నొక్కనాఁ డతండును నదియును బాతాళపంక కలుషంబగు మహాజలధిపూరంబునుం బోలె నంధకారంబు తోరంబై దిక్కుల బిక్కటిల్ల బహుళపక్షంబు * (నాటి) రాత్రి కాళికా గోష్ఠంబు కెలన జీర్ణోద్యానంబు నడుమ నక్తమాల తరు షండంబులో దార కల్పించిన సంకేత స్థలంబునం దృణ కుటీరంబునం గోద్రవ [1]పలాల పర్యంకంబున మదిరా మదోద్రేక సంభవంబైన మదనా వేశంబున మనోభవశరఁ సీత్కారంబులనుం బోలె [2]సీత్కారంబుల వలనను బంచ బాణ మాణిక్య కంకణ క్వణితంబులునుం బోని మణితం బుల వలనను బ్రద్యుమ్న రథ రథ్య రాజకీర హేషా కలకలం బులం బోలె గులుకు టెలుంగుల వలనను శంబరారాతి నికేతన లీలోద్యాన వాటికా తరులతా సంవేష్టన బంధనం బులుంబోని యాలింగ ప్రబంధంబుల వలనను, మకరధ్వజో పహార ద్రాక్షా ఫల రసపానాను బింబంబులుబోని చుంబ నంబుల వలనను, గుసుమ కోదండ దండయాత్రాసమారంభ జృంభమాణ విజయ తుత్తుంభ గంబీర బాంకారం బులకుం దాతలుం బోని ముష్టిఘాతల వలనను, బహువిధోపచార సంపన్నంబైన సురతంబు సాగించిరప్పుడు. 123

అర్థము: అంతన్, ఒక్కనాడు, అతండును, అదియును, పాతాళ - పంక - కలుషంబు = పాతాళ మనెడి బురదచే గలగినది, అగు, మహత్ (మహా) - జలధి పూరంబునున్ + పోలెన్ = మహా సముద్రప్రవాహము వలె అంధకారంబు = చీకటి తోరంబు + ఐ = అధికమై, దిక్కులన్ = దిక్కులందు, పిక్కటిల్లన్ = వ్యాపింపగా, బహుళ - పక్షంబు - నాటి - రాత్రి = కృష్ణపక్షపు నాటి రేయి, కాళికా - గోష్ఠంబు - కెలనన్ = కాళికా దేవి ఆలయము (?) ప్రక్కను, జీర్ణ + ఉద్యానంబు = పాడు వడిన తోట యొక్క, నడుమన్, నక్తమాల - తరు - షండంబులోన్ = కానుగుచెట్ల సమూహమునందు, తారు + అ = తామే, కల్పించిన = ఏర్పఱుచుకొన్న, సంకేత - స్థలంబునన్ = కూటమికి గుఱుతు పెట్టుకొన్నచోట, తృణ - కుటీరంబునన్ = పూరిగుడిసెయందు, కోద్రవ - పలాల - పర్యంకంబునన్ = ఆరిక గడ్డి పాన్పున, మదిరా - మద + ఉద్రేక - సంభవంబు = కల్లువలని మత్తు యొక్క విజృంభణము వలన పుట్టినదయిన మదన + ఆవేశంబునన్ = మన్మథావేశమున, మనోభవ - శర - సీత్కారంబులన్ + పోలెన్ = మన్మధుని యొక్క, బాణముల యొక్క, 'స' అను ధ్వనుల వలె (వంటి), సీత్కారంబుల వలనను = రతి సమయమునందు గలుగు ధ్వని విశేషముల వలనను, పంచబాణ - మాణిక్య - కంకణ - క్వణితంబులునున్ + పోని = మన్మధుని యొక్క, మణి నిర్మితములైన హస్తాభరణముల యొక్క ధ్వనులను బోలిన మణితంబుల వలనను = రతికాలమున స్త్రీ చేయు నవ్యక్త ధ్వని విశేషముల (రతి కూజితముల) వలనను ప్రద్యుమ్న - రధ - రధ్య - రాజకీర - హేషా - కలకలంబులన్ + పోలెన్ = మన్మధుని యొక్క రధము యొక్క

* తాళపత్రమున లేదు 1 ము పలాశ 2 తా శరాత్కారంబులునుంబోలె

గుఱ్ఱమైన (వాహనమైన), రాచిలుక యొక్క, సకిలింత (కూత) ల వంటి, కులుకు + ఎలుంగుల వలనను = మనోజ్ఞమైన కంఠస్వరముల వలనను, శంబరా. .బంధనంబులున్: శంబర + అరాతి = శంబరుడను రాక్షసుని శత్రువు అగుమన్మథుని యొక్క, నికేతన = ఇంటి యొక్క, లీలా + ఉద్యాన - వాటికా = క్రీడార్థమైన ఉద్యానవన ప్రదేశమునందలి తరు = చెట్లయు, లతా = తీగలయు, సంవేష్టన - బంధనంబులున్ + పోని = ఒండొంటిని పెనవైచు కొనుటయను బంధనములను బోలిన, ఆలింగ - ప్రబంధంబుల వలనను = కౌగిలింతలందలి ప్రకృష్టములైన బంధముల వలనను, (బిగింపులవలనను) మకర ...బింబంబులున్ + పోని మకర - ధ్వజ = మొసలి ధ్వజ చిహ్నముగా గలవాడు, అగు, మన్మథునకు, ఉపహార = కానుకలైన, ద్రాక్షా - ఫల = ద్రాక్షపండ్ల యొక్క, రస = రసము యొక్క, పాన = త్రాగుటకు, అను బింబంబులున్ + పోని = ప్రతిబింబముల వంటి, చుంబనంబుల వలనను = ముద్దుల వలనను, కుసుమ... భాంకారంబులకున్: కుసుమ - కోదండ = పూలు బాణములుగా గలవాడు, అగు, మన్మథుని యొక్క, దండయాత్రా = యుద్ధయాత్ర యొక్క, సమారంభ = ఉపక్రమము నందు, జృంబమాణ = విజృంభించుచున్న, విజయ - తుత్తుంభ = జయతమ్మటముల యొక్క (తుత్తుంభ శబ్దము గాక తుత్తుంభికా శబ్దము నిఘంటువు లందు గనవచ్చుచున్నది) (తుత్తుంభము = తమ్మటము, వాద్యవిశేషము) గంభీర = పెద్ద (మంద్రమైన), భాంకారంబులకున్ = భామ్మను ధ్వనులకు, తాతలున్ +పోని = తాతల వంటి, ముష్టి - ఘాతల వలనను = పిడికిటి దెబ్బలవలనను, (ఘాత - మువర్ణకలోపమునకు) దీనిని చరిత్రాదులలోనిదిగా పరిగణింపవచ్చునా?

బహు - విధ + ఉపచార - సంపన్ననంబు = పెక్కురీతులైన సేవలతో గూడినది, ఐన, సురతంబున్ = సంభోగక్రియను, సాగించిరి = నడపిరి, అప్పుడు

తాత్పర్యము: అంత నొకనాడు సుకుమారుడును మాలెతయు పాతాళ మనెడి పంకముచే గలగిన మహాసముద్రము వలె చీకటి యధికముగా దిక్కులందు వ్యాపింప కృష్ణపక్షము నాటి రేయి కాళి కాలయము ప్రక్క పాడువడిన యుద్యానము నడుమ కానుగు చెట్ల సమూహములో తామే కల్పించుకొన్న సంకేత స్థలము నందలి పూరిగుడిసెలో నారిక గడ్డి పాన్పున కల్లు తావిన మైకము పెంపున పుట్టిన మన్మథావేశముతో మన్మథుని మణిమయ కంకణముల ధ్వనుల వంటి మణితములతోను, మన్మథుని రథవాహనమగు రా చిలుక కూతల కలకలములవంటి మనోజ్ఞములైన యెలుగులతోను, మన్మధుని యింటి క్రీడావనమునందలి వృక్షములయు, లతలయు పెనగులాటల వంటి కౌగిలింతల బిగింపులతోను, మన్మథునకు కానుకలైన ద్రాక్షాసవపానముల వంటి ముద్దులతోను, మన్మథుని దండయాత్రలో విజృంభించు విజయతుత్తుంభికల గంభీరములయిన భాంకారముల తాతల వంటి పిడికిటి

పోటులతోను, పెక్కు రీతులైన సేవలతోను కూడిన రతి క్రీడను నడపిరి ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: సముద్రము ఆ పాతాళగంభీరమయినది. పాతాళమనెడి పంకము చే కలగి నల్లనై యుంధకారమువలె నున్నది. ఉపమ. రతి క్రీడకు వలయు సకల సన్నివేశములను కవి కల్పించుట గమనార్హము అంధకారము - బహుళపక్షరాత్రి జీర్ణోద్యానము, నక్తమాలముల సమూహము, తృణ కుటీరము, అరికగడ్డి పఱపు - కల్లుమైకము - ఇక మన్మథ విజృంభణమున కేమి కావలయును? మనోభవ శర.... ముష్టిఘాతల వలనను - ఇవి యన్నియు నుపమాలంకారములు తాతలుంబోని - ముష్టిఘాతల ధ్వనులు తుత్తుంభ భాంకారములను మించినవి యనుట. ద్రాక్షాఫల రసపానాను బింబములు - చుంబనములు ఫల రసపానమునకు ప్రతి బింబములవలె - సమానముగా నున్నవనుట. సురత సమయమున ప్రేయసీ ప్రియులొండొరుల కనేకవిధములయిన యుచారములను చేసికొందురు

శా
హాలాపానమదాతిరేకమున నయ్యబ్జాక్షి గుంజాఫల
ప్రాలంబంబు నటింప జూపెను [రతి ప్రౌఢిన్ స్వపుంభావమున్]
దాళీ గర్భపలాశ కల్పిత బృహత్తాటంక చక్రద్వయీ
డోలా డోలనముల్ మనోభవభుజాటోపంబు రూపింపగన్ 124

అర్థము: ఆ + అబ్జ + అక్షి = తామరలవంటి కన్నులు గల ఆ మాలెత, హాలా - పాన - మద + అతిరేకమునన్ = కల్లు త్రావుట వలని మత్తు యొక్క అతిశయముతో, గుంజా - ఫల - ప్రాలంబంబు = గురివెంద పూసలపేరు, నటింపన్ = నాట్యము చేయగా - కదలగా, తాళీ.. డోలనముల్. తాళీ = తాటి చెట్టు యొక్క, గర్భ = నడిమి, పలాశ = ఆకుచేత, కల్పిత = కల్పింపబడిన - చేయబడిన, బృహత్ = పెద్దవి యగు, తాటంక = చెవికమ్మల యొక్క, చక్ర - ద్వయీ = వలయముల జంట యొక్క డోలా - డోలనముల్ = ఊయలూగుటలు, మనోభవ = మన్మథుని యొక్క, భుజా + ఆటోపంబు = భుజముల యొక్క, గర్వము, రూపింపగన్ = నిర్ణయింపగా రతి - ప్రౌఢిన్ = సంభోగము నందలి నైపుణ్యమున స్వ పుంభావమున్ = తనదైన పురుషత్వమును, చూపెను. అనగా పురుషాయితత్వమును చూపెనని బావము

తాత్పర్యము: తామరల వంటి కన్నులు గల ఆ మాలెత, మద్యపానము వలని మైకము పెంపున, మెడలోని గురివెందపూసల పేరు నాట్యము చేయుచుండగను, తాటినడిమి యాకుతో చేయబడిన పెద్ద చెవికమ్మల వలయముల జంట ఊయల వలె నూగుటలు మన్మథుని భుజగర్వము నిరూపించుచుండగను రతి క్రీడా నైపుణ్యముతో పురుషాయితత్వమును చూపెను.

విశేషములు: కవి యిందు ఉపరతిని వర్ణించినాడు ఆమె `స్వపుంభావమును చూపుటకు కారణము రతి యందు ప్రౌఢయగుటయే ఆ ప్రౌఢికి `హాలాపానమదాతి రేకము తోడయ్యెను. ఆమె దరించిన ఆభరణములు ఆమె కులమున కుచితములుగా నున్నవి ఆమె చెవులకు పెట్టుకొనిన లేదాటియాకుల తాటంకవలయముల ఊగులాట మన్మధుని బుజాటోపమును స్పష్టపఱుచుచున్నది. సుశీల విషయమున గూడ నీ పురుషాయిత కేళిని `బహుదినముల్` (2 50) పద్యములో కవి వర్ణించియున్నాడు.

వ. అనంతరంబు 125

అర్థతాత్పర్యములు: తరువాత

ఆ వె కేలుగేలఁ బెనగఁ గాల్గాల బెనఁగంగ
వారు చొక్కి [1]సురత పారవశ్య
నిద్రఁజెంది రపుడు నిశ్శ్వాసమారుత
ప్రమదములను నట్టి సమయములను 126

అర్థము: అపుడు, నిశ్శ్వాస - మారుత - ప్రమదములను = నిట్టూర్పు గాలుల వలని సంతోషము గల, అట్టి - సమయములను = ఆ కాలములందు, వారు = మాలెతయును, సుకుమారుడును, కేలు - కేలన్ = ఒకరి చేయి యింకొకరి చేతితోను, పెనఁగంగన్ = పెనవైచు కొనగా, కాల్ + కాలన్ = ఒకరి కాలు ఇంకొకరి కాలి తోను, పెనగంగన్ = పెనగులాడగా, చొక్కి = వివశతనొంది, సురత - పారవశ్య - నిద్రన్ = రతిపారవశ్యమువలని నిద్రను, చెందిరి

తాత్పర్యము: ఒకరి నిట్టూర్పు గాలి యింకొకరికి సంతోషమును గూర్చు నా సమయములందు వారు చేతులు చేతులతోను, కాళ్లు కాళ్లతోను పెనగులాడు చుండగా నపుడు వివశత్వమునొంది రతిపారవశ్యమున నిద్రించిరి

మ. కనియెన్ నిద్దురవోయి మేలుకొనియెంగర్బుబ్బఁగాదారి ప్రొ
ద్దున వానీరము పువ్వురాల్చుతఱి ముత్తో కంకటింగూడి యొ
య్యన గోర్కొయ్యలు పశ్చిమాచలము డాయంబోవఁగాత్యాయనీ
వనమధ్యంబున బ్రహ్మబంధువు కుటీవాసాంతరాళంబునన్ 127

అర్థము: బ్రహ్మబంధువు - నిందితుడగు బ్రాహ్మణుడు - సుకుమారుడు, కాత్యాయనీ - వన - మధ్యంబునన్ - కాత్యాయనీ (పార్వతి) వనము నడుమ, కుటీ - వాస + అంతరాళంబునన్ = పర్ణశాలలోపల కాదారి ప్రొద్దునన్ = (కాదారిప్రొద్దున) - అర్ధరాత్రము నందు, వానీరము = నీటి ప్రబ్బలిచెట్టు, పువ్వు రాల్చుతఱిన్ =

1 తా ము యితర

ముత్తయిదువగు అరుంధతితో గూడిన మంచమును - అరుంధతీ నక్షత్రముతోడి మంచము నాకారమున నుండు సప్తర్షిమండలముతో గూడి, ఒయ్యనన్ = మెల్లగా, కోర్కొయ్యలు = కొఱుకొయ్యలు - ఆఱునక్షత్రముల మండలము, పశ్చిమ + అచలమున్ = పడమటి కొండను, డాయన్ + పోవన్ = సమీపింపబోవగా - అస్తమించుచుండగా, గర్లుబ్బన్ = ప్రక్కలుబ్బునట్లుగా, కనియెన్ = (రతిపారవశ్యమును) పొందెను, నిద్దుర + పోయెన్ = నిద్రించెను, మేలుకొనియెన్ = నిద్రలేచెను.

తాత్పర్యము: నింద్యుడైన బ్రాహ్మణుడగు నా సుకుమారుడు కాత్యాయనీ వనము నడుమ పర్ణశాలలోపల నర్ధరాత్రమున నీటి ప్రబ్బలిచెట్టు పువ్వులురాల్చు సమయమునందు, నరుంధతీనక్షత్రముతో గూడిన సప్తర్షిమండలముతో గూడి మెల్లగా నాఱు నక్షత్రముల మండల మస్తమించుచుండగా రతి పారవశ్య సుఖమును పొందెను. నిద్రపోయెను, ప్రక్కలుబ్బునట్లు (ఒడలు విఱుచుకొనుచు) నిద్ర మేల్కాంచెను.

విశేషములు: ముత్తో అనగా ముత్తయిదువు ఆమె అరుంధతి. అరుంధతీ నక్షత్రముతోడి సప్తర్షి మండలము మంచము నాకారమున నుండును. కోర్కొయ్యలు - కొఱుకొయ్యలు - ఇవి ఆఱు నక్షత్రముల సముదాయము. ఇవి యస్తమించు సమయమున - అనగా తెల్లవారుజామున నని భావము. ఆ సమయముననే నీటి ప్రబ్బలి చెట్టు పువ్వురాల్చు చుండును. గర్లుబ్బన్ - గఱి + లు - గఱి యనగా ఱెక్క, దాని బహువచనము గఱులు - శకట రేఫము లుప్తాచ్క మగుచో గర్లు. అవి యుబ్బుచుండగా ననగా ప్రక్కలుబ్బుచుండగా-ఒడలు విఱుచుకొనుచు. రతిపారవశ్యమును పొంది, కొంతసేపు నిద్రించి, మేల్కాంచెనని భావము. కాదారి ప్రొద్దు - కాదారి మాదారి ప్రొద్దు - అర్ధరాత్రము.

వ. మేలుకాంచి తన దౌర్జన్యంబు కారణంబుగా హూణమండలంబునం బుట్టిన రట్టుసడి నిమిత్తంబునం దన కచిరకాలంబునం గాఁగల ప్రాణాభిమాన భంగంబుం దర్కించి పరదేశంబునకుం బోవువాఁడై చండాలిక మనంబునుం దనమీఁదఁ గల యనురాగంబునుం దెలియుపొంటెం దత్కాలంబున మేలుకని యున్నదానితో నిట్లనియె 128

అర్థము: మేలుకాంచి = మేలుకొని, తన, దౌర్జన్యంబు = దుర్జనత్వము (చెడ్డతనము), కారణంబుగాన్, హూణ-మండలంబునన్, పుట్టిన, రట్టు-సడి = గోల, నింద, నిమిత్తంబునన్ = హేతువుగా, తనకున్, అచిర - కాలంబునన్ = కొలది కాలమునందు, కాగల = కాబోవు, ప్రాణ + అభిమాన -భంగంబున్ = ప్రాణభంగమును, మాన భంగమును తర్కించి - ఊహించి, పర-దేశంబునకున్ = మఱియొక దేశమునకు, పోవు వాడు + ఐ, చండాలిక = మాలెత యొక్క, మనంబునున్ = మనస్సును, తన మీఁదన్, కల, అనురాంగబునున్ = ప్రేమమును, తెలియు పొంటెన్ =

తెలియుట కొఱకు, తద్ + కాలంబునన్ = ఆ సమయమున, మేలుకని + ఉన్న - దానితోన్, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: (సుకుమారుడు) మేలుకొని తన దుర్మార్గత్వము కారణముగా హూణ మండలమున పుట్టిన నింద వలన తనకు కొలది కాలములో సంభవింపగల ప్రాణ భంగమును, మానభంగమును నూహించి మఱియొక దేశమునకు పోవనెంచి మాలెత మనస్సులో తనపైగల ప్రేమము నెఱుగదలచి యా సమయమున మేల్కొనియున్న యామెతో నిట్లు పలికెను.

విశేషములు: రట్టు, సడి - రెండును సమానార్థకములే. తెలియు పొంటెన్ - `చతుర్థికిం బొంటె వర్ణకంబు నగు ప్రౌఢ కారక 9 `కొఱకు కంటె పొంటెలు పరంబులగునపుడు భావార్థక టవర్ణకంబునకు లోపంబు విభాషనగు ప్రౌఢ. క్రియ 14 తెలియుట పొంటె, తెలియుపొంటె

క. సడియును రట్టును రవ్వయుఁ
బొడమె న్నా కిపుడు హూణభూమండలిలోఁ
బడితిని (ని) నిట నీ దేశము
విడచి చనన్వలయు నకృతవిషయంబునకున్ 129

అర్థము: సడియును, రట్టును, రవ్వయున్ = నింద, గోల, నాకున్, ఇపుడు, హూణ - భూ -మండలిలోన్ = హూణ మండలమునందు, పొడమెన్ = పుట్టెను, ఇటన్ = ఇచ్చట, పడితిని = పొందితిని, ఈ-దేశమున్, విడిచి, అకృత-విషయంబునకున్ = తెలియని (క్రొత్త)దేశమునకు, చనన్ +వలయున్ = పోవలయును

తాత్పర్యము: ఇపుడు నా కీ హూణమండలములో నపకీర్తి సంభవించెను కావున నేనీదేశమును విడిచి క్రొత్త దేశమునకు పోవలయును

విశేషములు: సడి, రట్టు, రవ్వ - ఇంచుమించు సమానార్థకములు విషయము = (నానా) ఇంద్రియార్థము, పదార్థము, సంగతి, దేశము.

గీ. మగువ పరదేశమున కేఁగి మగుడి వత్తుఁ
గొంతకాలంబునకు నన్యచింత యుడిగి
యుండు నీ (వు) పుట్టింటి యం దోర్పుగలిగి
మరలి రాఁ డెట్టు [1]పరదేశ మరిగి మగఁడు 130

అర్థము: మగువ = ఓ యింతీ ! పర-దేశంబునకున్ =దేశాంతరమునకు, ఏఁగి = వెడలి, కొంత- కాలంబునకున్ మగుడి=తిరిగి, వత్తున్, నీవు, అన్య-

1 తా. పరదేశి

చింత=వేఱు తలపు, ఉడిగి =మాని, పుట్నింటియందున్ = పుట్టి నింటిలో, ఓర్పు + కలిగి, ఉండు = ఉండుము, మగఁడు = భర్త, పర-దేశము = ఇతర దేశము, అరిగి మరలి రాఁడు + ఎట్టు = తిరిగిరాడా?

తాత్పర్యము: ఓ యింతీ . నేను దేశాంతర మేగి కొంతకాలములో తిరిగి వచ్చెదను నీవు వేఱు తలపు మాని పుట్టినింట నోర్పుతో నివసింపుము. అన్యదేశము వెడలిన భర్త మరల నెట్లు రాకుండును? తప్పక వచ్చు ననుట.

విశేషములు: మగుడు + ఇ = మగిడి కావలయును `ఇత్వంబున కిత్వం బగు బాల క్రియ 85 ఇట మగుడి అనియుండుట విశేషము. పుట్నింటియందు = పుట్టిన + ఇంటియందు = పుట్టినింటియందు - అని కావలసియుండగా, పుట్నింటియందు అని యుండుట విశేషము.

వ. అని పలికిన నిర్ఘాతపాతంబునకంటె నిర్ఘృణంబైన యమ్మాటకు శిరీష కుసుమ సుకుమారంబైన తన మానసంబున నుస్సురంచుం బుల్కని యాననంబు వాంచి నిట్టూర్పు నిగుడించుచు నూరకుండె నప్పుడు 131

అర్థము: అని, (సుకుమారుడు), పలికినన్, నిర్ఘాంత-పాతంబున కంటెన్ = పిడుగుపాటుకంటెన్, నిర్ఘృణంబు +ఐన = క్రూరమైన, ఆ +మాటకున్, పుల్కని = మాలెత, శిరీష - కుసుమ-సుకుమారంబు +ఐన = దిరిసెన పువ్వువలె మృదువయిన, తన, మానసంబునన్ = మనస్సునందు, ఉస్సురు + అంచున్ = ఉస్సురు మనుచు, ఆననంబు = ముఖము, వాంచి = వంచి నిట్టూర్పు (నిడు+ఊర్పు) = నిగుడించుచున్ = పుచ్చుచు, ఊరక + ఉండెన్, అప్పుడు.

తాత్పర్యము: అని సుకుమారుడు పలుకగా పిడుగుపాటుకంటెను ఘోరమైన అతని మాటకు మాలెత దిరిసెన పువ్వు వలె మృదువయిన తన మనస్సున నుస్సురనుచు ముఖము వంచి నిట్టూర్పు పుచ్చుచు నూరకుండెను. అప్పుడు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు: నిడు + ఊర్పు = నిట్టూర్పు. బాల సంధి. 12 నిట్టు + ఊర్పు - బాల. సంధి. 1 నిగుడించుచు = నిగిడించుచు మగుడి, మగిడి వంటిదే

చ. కువలయపత్రనేత్ర కనుఁగొల్కులయం దుదయించె బాష్పబిం
దువులు ధరాసురుండు తనుఁ దోడ్కొని [1]పోవ కుపేక్ష సేయన
న్న వదరవింద చక్ర మిథునంబు లసహ్యవశాంగజాగ్నిచే
రవులు కొనంగఁ బుట్టిన నిరంతరధూమము సోఁకియో యనన్ 132

1 తా పోవ కుపేక్ష సేయున, న్నవదినప్పు చక్రమిథునంబు ము పోక యుపేక్ష సేయన

అర్థము: ధరాసురుండు = బ్రాహ్మణుడు - సుకుమారుడు ఉపేక్ష + చేయన్ = ఒప్పరికింపగా - నిరాకరింపగా, ఆ +నవత్ +అరవింద -చక్రమిథునంబులు = ఆ క్రొత్తవియగు చున్న పద్మములును, జక్కవల జంటలును, అసహ్య-వశ-అంగజ + అగ్నిచేన్ = సహింపరాని వశముగాని - సహింపశక్యముగాని మన్మదాగ్ని (చే), రవులు కొనంగన్ = రాజుకొనగా, పుట్టిన నిరంతర - దూమము = సంతతమైన పొగ, సోకియో అనన్ = సోకుట చేతనో యనునట్లుగా, కువలయ-పత్ర-నేత్ర కలువతేకులవంటి కన్నులు గల ఆ మాలెత యొక్క కనుఁగొల్కుల యందున్ = కంటి కొనలయందు, బాష్పబిందువులు = కన్నీటి చుక్కలు ఉదయించెన్ = పుట్టెను.

తాత్పర్యము: సుకుమారుడు తన్ను వెంటతీసికొనిపోవుటకు నిరాకరింపగా కలువకంటి యగు నా మాలెత కనుతుదలందు బాష్పబిందువు లుదయించెను కన్నులకు పొగ సోకినచో నీరు కాఱును మాలెత కన్నులకు పొగ సోకుటచే నవి నీరు కార్చుచున్నవి ఆ పొగ యెక్కడిదనగా - సూర్యుడస్తమించుటచే పద్మములును, చీకటి పడుటచే జక్కవ కవలును విరహమునొంది తట్టుకొనలేని విధమున తపించుచుండును. ఆ మన్మథాగ్ని రాజుకొనగా నందుండి నిరంతరమును - తెల్లవాఱువఱకును -పొగ పుట్టును ఆ పొగ సోకుట చేతనా యనునట్లు మాలెత కనుగొలుకులనుండి నీటిబిందువులు కాఱుచుండెను.

విశేషములు: సూర్యాస్తమయము కాగానే పద్మములకు తత్ప్రియుడైన సూర్యునితో విరహము అందుచేతనే యవి ముకుళించును అదియే వాని దుస్సహమైన మన్మథాగ్ని చీకటి పడగానే చక్రవాక పక్షులు జంటలకు ఒండొంటితో విరహము అందుచే నవియును మన్మథాగ్నికి దుస్సహమైన రీతిగా లోనవును అగ్నియున్నచోట పొగ యుండును. పొగ సోకినచో కన్నుల నుండి నీరు కాఱును సుకుమారుడు తన్ను వెంట దీసికొని పోవనన్నాడు అందుచే నా మాలెత యేడ్చుచు కన్నీరు విడుచు చున్నది ఆమె కన్నీళ్లు పద్మముల, జక్కవల మన్మథాగ్నిచే పుట్టిన పొగ సోకుటచేత పొడమినవా యనునట్లుండెనని కవి యుత్ప్రేక్షించుచున్నాడు ఆమె కన్నీళ్లకు వాని మన్మథాగ్నిచే పొడమిన పొగ హేతువు కాదు హేతువు కాని దానిని హేతువుగా నూహించుటచే నలంకారము హేతూత్ప్రేక్ష ఇందు `ఉపేక్ష సేయ న-న్నవదర వింద చక్రమిధునంబులు అనుదాని కర్థము తృప్తికరముగా లేదు, పాఠాంతర మేదయిన నున్నదేమో తెలియదు

గీ. చామ హృదయంబు మీఁద హస్తంబు వైచె
నతఁడు తనుఁ బాసి యేఁగునో యనెడు బీతి
నుల్లమునయందు వసియించియున్న తన్ను
వెడలిపోకుండ [1]నడ్డపెట్టెడు విధమున 133

1 ము అడ్డు పెట్టిడి

అర్థము: అతఁడు = సుకుమారుడు, తనున్ = తన్ను, పాసి = విడిచి, ఏగునో = పోవునో, అనెడు - బీతిన్ = అను బయముచే, ఉల్లమున యందున్ = హృదయములో, వసియించి = ఉన్న = నివసించియున్నట్టి, తన్నున్ = అతనిని - సుకుమారుని, వెడలిపోక + ఉండన్ = వెడలిపోవకుండ, అడ్డుపెట్టెడు = అడ్డుపెట్టునట్టి, విధమునన్ = రీతిగా, చామ = స్త్రీ - మాలెత హృదయంబు మీదన్ = తన హృదయముమీద హస్తంబున్ = చేతిని, వైచెన్ = పెట్టుకొనెను

తాత్పర్యము: సుకుమారుడు తన్ను విడిచి వెడలి పోవునోయను బయమున మాలెత తన హృదయములో నున్న యతడు వెడలి పోకుండ నడ్డగించుటకా యనునట్లు తన హృదయముపై చేయి వైచుకొనెను

విశేషములు: మాలెత తన హృదయముపై చేయి వైచుకొనుటకు కారణము అందున్న సుకుమారుడు వెడలిపోకుండ నడ్డుపెట్టుటకు గాదు ఆమె సహజముగనే తన గుండెపై చేయివైచుకొని పరుండెను కారణము కాని దానిని కారణముగా నూహించుటచే నలంకారము హేతూత్ప్రేక్ష. చామ-`సకియ జక్కవచంటి చామ చిల్కల కొల్కి గుబ్బెత ప్రోయాలు కొమ్మ పడఁతి - సాంబ.ని = స్త్రీ ఉల్లమునయందు - `ఉదంతములగు నమహత్తుల కందు వర్ణకము పరంబగునపుడు నగాగమంబు కొన్ని యెడలం గానంబడియెడి ప్రౌఢ. శబ్ద. 21 అడ్డుపెట్టెడు - అడ్డము+పెట్టెడు- `పడ్వాదులు పరంబులగునపుడు మువర్ణకంబునకు లోపపూర్ణబిందులు విబాషనగు బాల. సంధి 46

వ. అనంతరంబ యా చాండలి యతనికిట్టులనియె 134

తాత్పర్యము: వెంటనే యా మాలెత సుకుమారునితో నిట్లు పలికెను

గీ. ఎట్టు వేగింతు సంసార మిచట నుండి
యేల నినుఁ బాసి యొంటి నా కిచట నుండఁ
గలుగనిమ్ము[1] బంధువులు పెక్కండ్రు నాకు
[2]బంధువు గలండె నాకు నీ పాటివాఁడు 135

అర్థము: ఇచటన్ = ఈచోట, ఉండి సంసారము = కాపురము, ఎట్టు- ఏరీతిగా, వేగింతున్ = నిర్వహింతును, నాకున్, నినున్, పాసి, ఒంటిన్ = ఒంటరిగా, ఇచటన్, ఉండన్, ఏల, నాకున్, బంధువులు = చుట్టములు, పెక్కండ్రు = అనేకులు, కలుగనిమ్ము = ఉండనిమ్ము, నాకున్, బంధువు, నీపాటివాడు = నీయంతటివాడు, కలండె = ఉన్నాడా?

1 ము పెక్కండ్రు బంధులును నాకు 2 తా బంధువుఁడు నాకుఁ గలఁడె

తాత్పర్యము: ఇచ్చట నుండి సంసార మెట్లు చేయుదును? నిన్ను విడిచి నే నిచట నొంటరిగా నుండనేల? నాకు బంధువులు పెక్కురు ఉండనిమ్ము నీయంతటి బంధువు నాకు గలడా? లేడనుట

శా ఇచ్చోటన్ మదుపానగోష్ఠి సురతం బిచ్చోట మానోదయం
బిచ్చోటం బరిపాటి నీ కలకలం [1]బిచ్చోట మానోదయం
బిచ్చోనంచు బవద్వియోగమునఁదా నెవ్వారికిం బ్రీతిగాఁ
జచ్చున్ మన్మదవేదనానలమునం జండాలి విప్రోత్తమా? 136

అర్థము: విప్ర + ఉత్తమా = బ్రాహ్మణ శ్రేష్ఠుడా, ఇచ్చోటన్ =(ఈ +చోటన్) = ఈ తావున, మదు-పాన-గోష్ఠి= మద్యపాన వ్యవహారము ఇచ్చోటన్ సురతంబు = సంబోగము, ఇచ్చోటన్ సంగీతకంబు = గానము ఇచ్చోటన్, పరిపాటిన్ = క్రమముగా, ఈ - కలకలంబు = ఈ సందడి, ఇచ్చోన్ (ఈ+చోన్), = ఇచ్చట మాన +ఉదయంబు =(ప్రణయ) కోపము గలుగుట, అంచున్, చండాలి =మాలెత, బవత్ + వియోగమునన్ = నీతోడియెడబాటున తాను మన్మద - వేదనా +అనలమునన్ = మదన తాప మనెడి అగ్నియందు, ఎవ్వారికిన్ = ఎవ్వరికి, ప్రీతిగాన్ =సంతోషముగా చచ్చున్

తాత్పర్యము: బ్రాహ్మణోత్తమా `ఇచ్చట మద్యమును సేవించితిమి ఇచ్చట సంబోగించితిమి ఇచ్చట పాటలుపాడుకొంటిమి. ఇచ్చట క్రమముగా సందడిగా నుంటిమి ఇచ్చట ప్రణయ కోపమును వహించితిమి అని మాలెత నీతోడి యెడబాటున విరహతాపమనెడి యగ్నిలో నెవరు సంతోషించునట్లు చచ్చును?

విశేషములు: ఈ = చోటన్ `త్రికంబుమీది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు బాల సమాస 14ఈ+చ్చోటన్ `ద్విరుక్తంబగు హల్లు పరంబగునపుడాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు ఇచ్చోటన్ బాల సమాస 13 ఇచ్చోన్ ఇచ్చోటన్-`ఉత్తరపదంబగు చోట శబ్దము టాక్షరమునకు లోపంబు విబాషనగు ఇచ్చోన్ వేదనానలము = వేదన యనెడి అనలము - రూపకము బవత్ + వియోగము - బవద్వియోగము ఝల్లునకు హశ్శుపరమగు చుండగా తృతీయవర్ణాదేశము ఉత్తమ పురుషమున గాక `చండాలి చచ్చున్' అని చండాలియే మాటాడుచు ప్రదమపురుషము నుపయోగించుట గమనింపదగినది

మ. కరవీరప్రసవచ్ఛదారుణ[2]పయః కాషాయ వస్త్రంబుతో,
శరతూల చ్ఛవి యజ్ఞ సూత్రములతో, జాంబూనద స్ఫూర్తిత
స్కరమృత్స్నా నిటలోర్ధ్వ పుండ్రకముతో, సాక్షా[3]చ్ఛుక బ్రహ్మతోఁ
దరమౌ నిన్ను మహాత్మ రేపకడ సందర్శించినం జాలదే 137

1 ము బిచ్చో మనోజోదయం 2 ము రజః 3 తా త్తుక

అర్థము: మహాత్మ (మహత్ = మహా + ఆత్మ) = మహానుబావా , కరవీర వస్త్రంబుతోన్ కరవీర - ప్రసవ = కరవీర పుష్పము = గన్నేరుపూవు - యొక్క, ఛద = ఱేకువలె అరుణ = ఎఱ్ఱనైన, పయః - కాషాయ - వస్త్రంబుతోన్ = నీరుకావి గుడ్డతోను, శర సూత్రములతోన్ శర = ఱెల్లు యొక్క, తూల = దూదియొక్క చవి = కాంతివంటి కాంతిగల యజ్ఞసూత్రములతోన్ = యజ్ఞోపవీతములతోను జాంబూ పుండ్రకముతోన్ జాంబూనద = బంగారము యొక్క స్ఫూర్తి = ప్రకాశము యొక్క తస్కర = దొంగయైన, మృత్స్న = మట్టితోడి, నిటల + ఊర్ధ్వ - పుండ్రకముతోన్ = నొసటి నిలువు బొట్టుతోను, సాక్షాత్ + శుక - బ్రహ్మతోన్ = సాకారుడైన - శుకమహర్షితో తరము + ఔ = సమానుడవగు, నిన్నున్, రేపకడ = ప్రొద్దున సందర్శించినన్ = చూచిన, చాలదే = సరిపోదా?

తాత్పర్యము: మహాత్మా గన్నేరు పూఱేకులవలె నెఱ్ఱనైన నీరుకావి దోవతి తోను, బంగరు కాంతిని దొంగిలించు మట్టితో పెట్టుకొనిన నొసటి నిలువు బొట్టుతోను సాక్షాచ్ఛుకమహర్షితో సమానుడవైన నిన్ను ప్రొద్దుననే చూచిన సరిపోవదా సరిపోవుననుట.

విశేషములు: పయః కాషాయ - నీరుకావికి సంస్కృతము, జాంబూనద స్ఫూర్తి తస్కర మృత్స్న - బంగరు కాంతిని దొంగిలించు మట్టి - బంగరు కాంతి వంటి గల మట్టియనుట శుకబ్రహ్మ - శుక మహర్షి - వ్యాసుని పుత్త్రుడు రేపకడ = ఉదయముననే మహాత్ములను సందర్శించుట పాపపరిహారకము మాలెతకు తన ప్రియుడైన సుకుమారుడు శుకబ్రహ్మవలె కనిపించుట యబ్బురముకాదు ఎవరి కంపు వారి కింపు గదా ప్రసవ + చద = ప్రసవచ్ఛద = తూల + ఛవి = తూల చ్ఛవి హ్రస్వమునకు పరమైన ఛకారమునకు ద్విత్వము సాక్షాత్ + శుక = వర్ణముల మొదటి నాల్గక్షరముల (ఝయ్యుల) కంటె పరమగు శవర్ణమునకు అచ్చులుకాని, అంతస్థములుకాని, అను నాసికములు కాని హకారము కాని (అట్టులు) పరమై యున్నప్పుడు ఛకారము వైకల్పికముగా నాదేశమగును సాక్షాత్ + ఛుక, సాక్షాత్ + శుక సకార త వర్గములకు శవర్ణ చ వర్గములతో పూర్వమందైనను, పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్ణ చవర్గ వర్ణము లాదేశమగును సాక్షా చ్ఛుక, సాక్షాచ్ఛుక తరము = సాటి. సవతు మాద్రి యుద్ది జత తరంబు పురుడు నాఁగ సదృశమున కివి యాఖ్యలౌ `ఆం.సం స్థా. 34 శరము (నానా)ఱెల్లు, బాణము, నీరు

ఉ ధీరతఁ బూని నీవు పరదేశము వోవఁగ నేను రాక యీ
యూరనె[1] యుంటినే ద్విజకులోత్తమ [2]నిత్యముఁగాళికాగృహ
ద్వార వితర్దికా స్థలము దవ్వులఁ జూచిన యప్పుడెట్లొకో
కూరిమి పేర్మి గుండియ దిగుల్లని తల్లడ మందునో సుమీ 138

1 తా యూరన 2 తా నిన్నును

అర్థము: ద్విజ - కుల + ఉత్తమ = బ్రాహ్మణ వంశ శ్రేష్ఠుడా! నీవు, ధీరతన్ = ధైర్యమును, పూని, పర-దేశము = దేశాంతరము, పోవఁగన్ = వెడలగా, నేను, రాక = రాకుండ, ఈ + ఊరనె = ఈ యూరియందే, ఉంటిన్ + ఏన్ = ఉంటినేని, నిత్యమున్ = ఎల్లప్పుడును, కాళికా - గృహ - ద్వార - వితర్దికా - స్థలమున్ = కాళికాదేవి యొక్క, ఆలయము యొక్క, ద్వారము నందలి, అరగు చోటిని, దవ్వులన్ = దూరమున, చూచిన + అప్పుడు, ఎట్లు + ఒకో = ఎట్టులో కదా ! కూరిమి - పేర్మిన్ = అనురాగాతిశయమున, గుండియ = గుండె, దిగుల్లు + అని = జల్లుమని, తల్లడము + అందునో - సుమీ = కలత చెందునేమో సుమా!

తాత్పర్యము: ఓయీ బ్రాహ్మణ వంశ శ్రేష్ఠుడా! నీవు ధైర్యముతో దేశాంతరము వెడలగా నేను నీతో రాక యీ యూరియందే యుందునేని ప్రతిదినమును కాళికాదేవి యాలయపుటరగును దూరము నుండి చూచి, నీవు దానిపై లేకపోగా నెట్లో కదా! అనురాగాతిశయమున నా గుండె జల్లుమని కలత చెందునో యేమో!

విశేషములు: పరదేశము + పోవఁగన్ = పరదేశము వోవఁగన్ -గసడదవాదేశము బాల. సంధి 13 అరగును జూచినప్పుడు మాలెలకు గుండె దిగుల్లనుటకు కారణము నిత్యము నా యరగుపై కూర్చుండు తన ప్రియుడు సుకుమారుడు కనబడకపోవుటయే ద్విజ - (నానా) బ్రాహ్మణుడు, పక్షి, దంతము.

సీ. తను నిద్ర మేల్కొలిపినమాత్రమున జర
 త్కారుండు విడువఁడే ధర్మపత్ని
జమదగ్ని కొడుకుచేఁ జంపింపఁడే భార్య
 లవ మంత దోష ముల్లమున [1]నిల్ప,
[2]యొకమాటి తప్పు గావక యహల్యాదేవి
 నక్షపాదుఁడు శాయి యగు మనండె
స్రుక్కి సన్నంబుగాఁ జూడఁడే కోపించి
 సతి నరుంధతి వసిష్ఠర్షివరుఁడు

గీ. తగవు ధర్మంబు పాడి పంతంబు నిజము
పువ్వుబోఁడులయెడ లేదు భూసురులకుఁ
బ్రథమమున నీవు చేసిన బాస నమ్మి
మోసపోయితిఁ [3]గులములో నీసు వడితి 139

అర్థము: తనున్ - తన్ను, నిద్ర మేల్కొలిపిన - మాత్రమునన్ = నిద్రనుండి మేలుకొలిపినంత మాత్రముననే, జరత్కారుండు, ధర్మపత్నిన్ = భార్యను, విడువడే

1. ము. నిల్పి. 2. ము. యొకమాటు 3. ము. కులమునందీసు.

= విడిచిపెట్టడా? లవము +అంత = ఇంచుకంత దోషము = తప్పు, ఉల్లమునన్ = మనసునందు, నిల్పి, జమదగ్ని కొడుకుచేన్ = కుమారుడైన పరుశురామునిచే, బార్యన్ చంపింపడే అక్షపాదుండు = గౌతుముడు (పాదమున కన్ను గలవాడు), ఒకమాట = ఒక్కసారిది, అగు, తప్పున్, కావక మన్నింపక, అహల్య - దేవిన్, ఱాయి, అగుము + అనండు + ఎ = ఱాయి యగుమని శపింపడా ? వసిష్ఠ + ఋషి - వరుండు = వసిష్ఠుడను ముని శ్రేష్ఠుడు, కోపించి, సతిన్ = పతివ్రత అగు అరుంధతిన్ స్రుక్కి = కృశించి సన్నంబు+కాన్ = సన్నపడునట్లు చూడడే భూసురులకున్ = బ్రాహ్మణులకు, పువ్వుబోఁడుల యెడన్ = స్త్రీల విషయమున, తగువు = న్యాయము ధర్మంబు పాడి, పంతంబు, న్యాయము, నిజము = సత్యము లేదు నీవు, ప్రధమమునన్ = మొదట చేసిన బాసన్ = ప్రతిజ్ఞను నమ్మి, మోసపోయితిన్ కులములోన్, ఈసు = నింద, పడితిన్ = పొందితిని

తాత్పర్యము: జరత్కారుడను ముని తన్ను నిద్రమేలుకొలిపినంత మాత్రమునకే ధర్మపత్నిని విడువలేదా? దోషలేశమును మనస్సునందుంచుకొని కొడుకు అగు పరుశురామునిచేత జమదగ్ని భార్యను చంపింపలేదా? ఒకసారి చేసిన తప్పును మన్నింపక గౌతము డహల్యను ఱాయిగా శపింపలేదా? వసిష్ఠ మునీశ్వరుడు పతివ్రతయైన తన భార్య నరుంధతిని కోపమున కృశించి పోజూడలేదా? బ్రాహ్మణులకు న్యాయము ధర్మము, పాడి, పంతము సత్యము స్త్రీలయెడ లేవు మొదట నాకు చేసిన బాసను నమ్మి మోసపోయితిని కులములో నిందపడితిని

విశేషములు: జరత్కారుడు ఒక బ్రాహ్మణుడు బ్రహ్మచర్యమును పాటింప వివాహము నొల్లక తపస్సుచేసికొనుచుండెను అతడొకనాడు చెట్టునకు తలక్రిందులుగా వ్రేలాడు తన పితృదేవతలను జూచి ఆత్మ సంతాన రాహిత్యము వలన వారి కుత్తమ గతులు కలుగమి యెఱిగి తనపేరు గల కన్యనే పెండ్లియాడదలచి యట్టిదానికై అన్వేషించు చుండెను ఇతని పుత్త్రుడు జనమేజయుని సర్పయాగమును మాన్పగలడని యెఱిగి వాసుకి తన చెలియలగు జరత్కారువు నతని కిచ్చి వివాహము చేసెను ఒకనాడితడు నిద్రపోవుచుండగా సంధ్యాసమయ మతిక్రమించుచున్నదని భార్య జరత్కారు వితనిని మేలుకొలిపెను నిద్రాభంగమును గావించి తన్నవమానపఱిచి నందులకు జరత్కారుడు కోపించి యామెను విడిచి పోయెను ఈ దంపతుల కుమారుడైన ఆస్తీకుడు జనమేజయుని సర్పయాగమును మాన్పెను

జమదగ్ని: రేణుక యీ ముని బార్య ఈమె జలము కొఱకు పోయి, యట స్నానము చేయుచుండిన చిత్రరధుని ప్రేమముతో చూచుచు నుండి ఆలస్యముగ నీరు తెచ్చెను జమదగ్ని యది యెఱిగి యామె చిత్ర రథునితో వ్యభిచరించెనని యామెను వధింప తన పుత్త్రుల నాదేశించెను మాతృవధ చేయమని మొదటి

నలువురును నిరాకరింప జమదగ్ని వారిని శపించెను అయిదవవాడగు పరుశురాముడు తల్లిని వధించెను తండ్రి యితని ధైర్యమునకు వినయమునకు మెచ్చి వరము వేడు మన నతడు తల్లిని బ్రతికింపను సోదరులను శాపవిముక్తులను చేయను వేడెను జమదగ్ని వాని కోరికలను నెఱవేర్చెను

అహల్య. గౌతముని బార్య ఈమెను పొందఁగోరి యింద్రుడు అర్ధరాత్రమున కోడియై కూసెను. గౌతముడు తెల్లవాఱినదని యెంచి స్నానార్థ మిల్లు వెడలెను ఇంద్రుడంత గౌతముని వేషమున నహల్యతో క్రీడించెను ఇంకను చాల రాత్రి యుండుట యెఱిగి గౌతముడింటికి వచ్చి యా దృశ్యమును జూచి బార్యను ఱాతివి కమ్మని శపించెను

అరుందతి: వసిష్ఠుని బార్య

పువ్వుబోఁడి - పువ్వువంటి మేనుగలది - బహువ్రీహి మోసపోయితి =మోసము +పోయితి `పద్వాదులు పరంబులగునపుడు ము వర్ణకంబునకు లోప పూర్ణబిందులు విబాష నగు బాల సంది 46 బాస =(నా నా) బాష ప్రతిజ్ఞ ఈసు (వికృతి)-ఈర్ష్య (ప్రకృతి) వసిష్ఠర్షి = వసిష్ఠ +ఋషి - గుణసంది అ ఆ లకు ఇ ఉ ఋ ఌ లు పరములగుచుండగా వరుసగా ఎ ఓ అర్ అల్ ఏకాదేశములగును

సీ పద్మాకరమునకుఁ బసపాడఁ దెచ్చిన
దైవంబు చలము సాధ్యంబు గాఁగ
ననురాగరసము నా మనములో నూన్చిన
నయనేంద్రియములకుఁ బ్రియము గాఁగ
విడువ ని న్నెన్నండు విశ్వసింపవవె యన్న
నీ సత్యమునకుఁ బున్నియము గాఁగ
నిక్షుకోదండ మెక్కిడి బాణ మరిఁబోయు
కందర్పునకు మహోఖ్యాతి గాఁగ

గీ [1]నెపుడు నీవు ననుఁ బాసి యేఁగి గాఁగ
నీర నైనను నురినైన నెగడి నైన
విడుతుఁ బ్రాణంబు [2]లిపుడ నీ యడుగులాన
పలుమఱును బెక్కుమాటలు వలుకనేల? 140

అర్థము: పద్మ + ఆకరమునకున్ = సరస్సునకు, పసపాడన్ = (పసపు + ఆడన్) = పసుపుబూఁకొని స్నానము చేయుటకు, తెచ్చిన = తీసికొని వచ్చిన

1 తా యెప్పు డేనేని ననుఁబాసి యేఁగి తపుడు 2 ము లపుడు

దైవంబు = దేవుని యొక్క చలము = పంతము, సాధ్యంబు + కాగన్ = నెఱవేఱదగినది కాగా - సుకుమారుడామెతో కలసి యున్ననే దేవుని పంతము సాధ్యమగును వీడుచోకాదు అందుచే వ్యతిరేక లక్షణచే సాధ్యము అను దానికి అసాధ్యమని యర్థము చెప్పలయును అన్నిట నిట్లే గ్రహింపవలయును అనురాగ - రసమున్ = ప్రేమమనెడి రసమును నా - మనములోన్ = నామనసులో ఊన్చిన = కలుగజేసిన నయన + ఇంద్రియములకున్ = కన్నులనెడి యింద్రియములకు, ప్రియము + కాగన్ = సంతోషముకాగా - ఇచ్చట ప్రియమనగా అప్రియమని బావము నిన్నున్ ఎన్నడున్ = ఎప్పుడు విడువన్ = విడువను విశ్వసింపవె = నమ్మవా అన్న = అని పలికిన నీ - సత్యమునకున్ = నీ నిజమునకు పున్నియము + కాగన్ = పుణ్యముకాగా పున్నియమునకు పాపమని యర్థము చెప్పవలయును ఇక్షు - కోదండము = చెఱకు విల్లు ఎక్కు + ఇడి = ఎక్కుపెట్టి బాణము అరి బోయు = సంధించునట్టి, కందర్పునకున్ = మన్మధునకు మహత్ (మహా) + ఖ్యాతి + కాగన్ = గొప్పకీర్తికాగా - ఇచ్చట ఖ్యాతికి అపఖ్యాతి యని యర్థము నీవు ఎపుడు ననున్ పాసి, ఏగితి (వి) + అపుడు + ఎ వెడలితివో అప్పుడే నీరన్ + ఐనను = నీటియందయినను ఉరిన్ + ఐనన్ = ఉరి పోసికొనియైనను నెగడిన్ + ఐనన్ = అగ్నికుండముననైనను ఇపుడు + అ = ఇప్పుడే (వెంటనేయనుట) ప్రాణంబులు విడుతున్ నీ + అడుగులు + ఆన = నీ పాదములపై నొట్టు పలుమఱును = పెక్కుమాఱులు, పెక్కుమాటలు పలుకన్ + ఏల

తాత్పర్యము: తామరకొలనికి స్నానము చేయ నన్ను గొనివచ్చిన దేవుని యత్నము నెఱవేఱకుండను నా మనస్సులో ప్రేమ రసమును పుట్టించిన నేత్రేంద్రియమున కప్రియము కాగను `నిన్నెప్పటికిని విడువను నన్ను నమ్ముమను నీ సత్యవాక్యమునకు భంగము గలుగునట్లును చెఱకు వింట బాణమును సంధించు మన్మధునకు గొప్ప యపఖ్యాతి కలుగునట్లును నీవు నన్నెప్పుడు వీడిపోవుదువో అప్పుడే నేను నీటిచేనైన, ఉరి పోసికొనియైన అగ్నిచే నైన ప్రాణములు వీడుదును నీ పాదములపై నొట్టు ఇన్ని మాఱులిన్ని మాటలు పలుకనేల?

విశేషములు: మాలెత కొలనికి వచ్చి సుకుమారుని గాంచుట దైవికమే కదా సుకుమారుడు తన్ను వీడిపోవుచో వారిని కలుప దలచిన దేవుని యత్నము విఫలమగుననుట మాలెత యతనిని చూచుట వలననే యామె మనసులో ననురాగ రసము జనించెను అందుచే నామెతో నతడు కూడియుండుట కంటికి ప్రియము వీడి పోవుట అప్రియము నీవు నన్ను విడుచుచో నన్నెప్పుడు వీడినను నీమాట కసత్యదోషము వాటిల్లి పాపము గలుగుననుట చెఱకువింట బాణమును సంధించి మనలను గూర్పనెంచిన మన్మధునకు నన్ను నీవు వీడిపోవుచో అతని పూనిక వ్యర్థమై గొప్ప యపఖ్యాతి గలుగు ననుట పున్నియము - పున్నెము (రూపాం)

(వికృతి) - పుణ్యము (ప్రకృతి). ఏగితివి + అపుడె - లిద్వ్యకారమునకు లోపము. బాల. క్రియ 16 ఏగితి +ఇ+ అపుడె మధ్యమపురుష క్రియలయందిత్తునకు సంధియగును. బాల సంధి 7. నెగడి = పిశాచము అని సాంబ నిఘంటువు. `గాలి గాము నెగడి, కొఱవిరాలుపు బూచి సోఁకుడు పిసాసి దయ్యమనగఁబిశాచాభిధానము లగు సాంబ ని దేవవర్గు - 19 అగ్ని కుండమనియు (సూ ని)

గీ. అనినఁ జిఱునవ్వు నవ్వి నీ మనసు చూడ
నంటిఁగా కేను నినుఁ బాసి యరుగఁ గలనె
యిట్టి పట్టున నెవ్వరు నెఱుఁగకుండఁ
[1]బోవుటయ లెస్స యీ హూణభూమి విడిచి 141

అర్థము: అనినన్ = అని మాలెత పలుకగా (సుకుమారుడు) చిఱు నవ్వు నవ్వి నీమనసు చూడన్ = పరీక్షించుటకు అంటిన్ + కాక = వెడలుదునంటిని గాని, ఎను నినున్ పాసి = వీడి, అరుగన్ + కలనె = పోవగలనా? ఇట్టి -పట్టునన్ = ఈ సమయమున - నిందపడిన యిప్పుడు ఎవ్వరున్ ఎఱుఁగక + ఉండన్, ఈ- హూణ - భూమిన్ విడిచి, పోవుట + అ = పోవుటయే, లెస్స = మంచిది

తాత్పర్యము: అని చడాలాంగన పలుకగా సుకుమారుడు చిఱునవ్వు నవ్వి "నీ మనస్సును పరీక్షింప వెడలిపోవుదు నంటినే కాని నేను మాత్రము నిన్ను విడిచి పోగలనా? మిక్కిలి నిందపడిన యీ సమయమున నెవ్వరు జూడకుండ నీ హూణ భూమిని విడిచి పోవుటయే మంచిది "

గీ ఎల్లి శ్రీ భద్రకాళికి నిద్ధభక్తి
యాత్ర యొనరించి వెళ్ళుద మర్ధరాత్ర
మీ విచారంబు చెప్పకు మెవ్వరికిని
వారిజానన రట్టువడ్డార మిచట 142

అర్థము: వారిజ + అనన = తామరవంటి ముఖము గలదానా, ఎల్లి = రేపు, శ్రీ - భద్రకాళికిన్, ఇద్ధ - భక్తిన్ = నిర్మలమైన భక్తితో, యాత్ర, ఒనరించి = చేసి అర్ధరాత్రము = నడురేయి, వెళ్ళుదము = వెడలుదము, ఎవ్వరికిని, ఈ - విచారంబు = ఈ ఆలోచన చెప్పకుము, ఇచటన్ = ఈ హూణ భూమిలో, రట్టు + పడ్డారము = నిందపడితిమి

తాత్పర్యము: పద్మముఖీ రేపు శ్రీ భద్రకాళికి పరిశుద్ధమైన భక్తితో యాత్ర గావించి నడురేయి వెడలి పోదము. ఈ యాలోచన యెవరికిని చెప్పకుము ఈ హూణభూమిలో నింద: ,తిమి

విశేషములు: యాత్ర (ప్రకృతి) - జాతర (వికృతి) అర్ధరాత్రము - సంఖ్యావాచకము కాని అవ్యయముకాని ఏకదేశవాచకము (పూర్వ, అపర వంటి) కాని, సర్వ, సంఖ్యాత, పుణ్యశబ్దములు కాని పూర్వపదములుగా గల రాత్రి శబ్దమునకు `అ అను సమాసాంత ప్రత్యయము వచ్చును. అప్పుడు తుది `ఇ వర్ణము లోపించును. ఈ మార్పు దానికి ద్వంద్వ సమాసమున `అహన్ శబ్దము పూర్వపదముగా నున్నప్పుడు కూడ వచ్చును. రట్టు + పడ్డారము - రట్టు వడ్డారము - గసడదవాదేశము. బాల. సంధి 13. పడ్డారము. పడినవారు + ము - ప్రథమాంతంబులగు యుష్మదస్మ ద్విశేషణంబుల కేకత్వంబున వునులును బహుత్వంబున రుములు నంతాగమంబులు ప్రాయికంబుగ నగు. బాల కారక 33`ఈ యాగమంబులు పరంబులగునపు దుత్వంబున కత్వంబగు. బాల కారక 34 పడినవారము `ఉన్న కల నవర్ణకంబుల మీది తచ్ఛబ్ద వకారంబునకు లోపంబు విభాషనగు బాల. క్రియ 117 పడిన + అరము `పడ్వాదుల నవర్ణకంబున కత్వంబును గడవాల్లునకు ద్విత్వంబును విబాషనగు బాల. క్రియ. 51 పడ్డ + అరము. `అత్తునకు సంధి బహుళంబుగానగు. `బాల సంధి. 4 బాహుళకంబుచే నిట సంధి నిత్యంబు (117) - పడ్డారము

ఉ. సంగరసవ్యసాచి [1]వరశాస్త్రవిశారద దేశికేశ్వరా
మంగళగీత వాద్యపరిమండిత [2]ముద్రక కుండలీ కళా
భంగురనృత్త భవ్యపరిభాసిత సంతత నిర్మలాత్మకా
యంగజసన్నిభ ప్రథిత హట్ట విశేషమనోజ్ఞవర్తనా 143

అర్థము: సంగర - సవ్యసాచి = యుద్ధమునందు అర్జునుడైనవాడా, వర - శాస్త్ర - విశారద = శ్రేష్ఠములయిన శాస్త్రములందు నేర్పరియైనవాడా, దేశిక + ఈశ్వరా = గురుశ్రేష్ఠుడా మంగళ - గీత - వాద్య - పరిమండిత = శుభావహములయిన గీతము, వాద్యము, అను వానిచే మిక్కిలి అలంకరింప బడినవాడా. ముద్రక - కుండలీ - కళా + అభంగుర - నృత్త = ముద్రకమనెడి అభినయ హస్త విశేషము గల కుండలాకార నృత్య కళ అనెడి స్థిరమైన నృత్తము గలవాడా భవ్య - పరిభాసిత - సంతత - నిర్మల + ఆత్మకా = శుభము, మిక్కిలి ప్రకాశించునట్టిది, ఎల్లప్పుడు పవిత్రమైనది అగు మనస్సుగలవాడా అంగజ - సన్నిభ - ప్రథిత - హట్ట - విశేష - మనోజ్ఞ - వర్తనా = మన్మథునితో సమానము, ప్రసిద్ధము, అంగడివీథి యందసాధారణము, సుందరమునైన నడవడిగలవాడా - కృతి భర్తయగు ముమ్మయ శాంతయ్య సంబుద్ధులు

తాత్పర్యము: యుద్ధరంగమున నర్జునుడైనవాడా, శ్రేష్ఠములైన శాస్త్రములందు నేర్పరియైనవాడా, గురుశ్రేష్ఠుడా మంగళగీత వాద్యములచే నలంకరింపబడినవాడా,

1 ము నయ 2 ము మంద్రకరుండలీకళా

ముద్రాహస్తాభినయము గల కుండలాకార నృత్యకళ గలవాడా శుభము మిక్కిలి ప్రకాశించునది, నిత్యము నిర్మలము నైన మనస్సుగలవాడా, మన్మధునితో సమానము ప్రసిద్ధము, అంగడిలోన సాదారణము, సుందరమునైన నడవడి గలవాడా - కృతి భర్త్ర సంబోదనములు

క గౌరీ వల్లభ సేవా
పారీణ విరాజి విభవ భక్తిప్రతిభా
బారోన్నత దివ్యాంగా
సారసగర్భప్రభావ సర్వజ్ఞనిధీ 144

అర్థము: గౌరీ .ప్రతిబా· గౌరీ = పార్వతి యొక్క వల్లభ = ప్రియుడైన యీశ్వరునియొక్క, సేవా = సేవయందు, పారీణ = పారము ముట్టినట్టియు, విరాజి = ప్రకాశించునట్టి విభవ = వైబవముగల భక్తి - ప్రతిబా = భక్తియు ప్రతిభయుగలవాడా, భార + ఉన్నత - దివ్య + అంగా = బరువైనది ఎత్తైనది దివ్యమైనది అగు శరీరము గలవాడా సారసగర్భ - ప్రబావ = బ్రహ్మ మహిమవంటి మహిమ గలవాడా, సర్వజ్ఞ = అన్నియు దెలిసినవాడా, నిధీ = ఆశ్రయమైన వాడా.

తాత్పర్యము: ఈశ్వరుని సేవయందు పారము ముట్టినట్టియు, ప్రకాశించు వైభవము గలట్టియు భక్తిప్రతిబలు గలవాడా బారము, ఉన్నతము, దివ్యమునైన శరీరము గలవాడా, బ్రహ్మ మహిమవంటి మహిమ గలవాడా, అన్నియు దెలిసినవాడా ఆశ్రయమైనవాడా - కృతిపతియగు ముమ్మయ శాంతయ సంబోధనములు

మాలిని.సరససుఖవినోదా సారశైవార్థమోదా
పరమపదవివేకా బానుతుల్యప్రభాకా
ధరణిధరసుధైర్యా దండసంగ్రామశౌర్యా
నిరుపమగుణధామా నిత్యకల్యాణసీమా 145

అర్థము: సరస - సుఖ - వినోదా = రసవంతములైన సౌఖ్యములయొక్క వేడుక గలవాడా, సార - శైవ + అర్థ - మోదా = శ్రేష్ఠములైన, శివ సంబంధములైన విషయముల వలన సంతోషము గలవాడా, పరమపద - వివేకా = మోక్షజ్ఞానము గల వాడా, భాను - తుల్య - ప్రబాకా = సూర్యునితో సమానమైన కాంతి గలవాడా ధరణి - ధర - సు - ధైర్యా = పర్వతము వలె మంచి ధైర్యము గలవాడా, దండ - సంగ్రామ - శౌర్యా = కఱ్ఱ యుద్ధమున లేదా వ్యూహ యుద్ధమున పరాక్రమము గలవాడా నిరుపమ - గుణ - ధామా = సాటిలేని గుణములకు స్థానమైన వాడా, నిత్య - కల్యాణ - సీమా = ఎడతెగని శుభములకు హద్దయినవాడా

తాత్పర్యము: సరస సౌఖ్యములతో వినోదించువాడా, సారవంతములైన శైవార్థములచే సంతోషించువాడా, మోక్షవిషయకమైన జ్ఞానము గలవాడా సూర్యునితో సమానమైన కాంతి గలవాడా, సూర్యునితో సమానమైన కాంతి గలవాడా, పర్వతము వలె ధైర్యము గలవాడా కజ్జయుద్ధము నందు - వ్యూహరచనల తోడి యుద్ధమున పరాక్రమము గల వాడా, సాటిలేని గుణములకు నిలయమైన వాడా, ఎడతెగని శుభములకు ఎల్ల యైనవాడా - కృతి భర్తయగు ముమ్మయశాంతన సంబుద్ధులు

విశేషములు : మాలిని : పాదమున న,న,మ,య,య అను గణములుండును మొదటి యక్షరమునకు తొమ్మిదవ యక్షరమునకు యతిమైత్రి ప్రాసనియమము గలదు

గీ అమల జొన్నలగడ్డ వంశాబ్ధి విధుఁడు
ఖ్యాత మృత్యుంజయాభిఖ్యుడైనవాఁడు
పరంగ శ్రీనాథకవిసార్వభౌమ రచిత
భవ్య శివరాత్రి మాహాత్మ్య కావ్యవరముఁ
బ్రతిపదార్థవిశేషతాత్పర్యకలన
స్పష్ట మొనరించు `చంద్రికా వ్యాఖ్య యిద్ది.

శివరాత్రిమాహాత్మ్యము
(సుకుమార చరిత్రము)
చతుర్థాశ్వాసము

క. శ్రీతరుణీ [1]సితవిలసన,
జాత శివానూన భక్తి సంపద్గురువి
ఖ్యాత, [2]నుతకీర్తి సితజీ
మూత [3]సితాఖిలదిగంత ముమ్మయశాంతా. 1

అర్థము: శ్రీ - తరుణీ - సిత - విలసన = లక్ష్మి యనెడు కాంత యొక్క, తెల్లని, ప్రకాశముగలవాడా, జాత - శివ + అనూన - భక్తి - సంపద్ - గురు - విఖ్యాత = పుట్టిన, శివుని యందలి, తక్కువ కాని భక్తియనెడు సంపదగల, గురువులచే మిక్కిలి ప్రసిద్ధుడైన వాడా, నుత - కీర్తి - సిత - జీమూత - సిత + అఖిల - దిక్ + అంత = పొగడబడు, తెల్లని మేఘము వంటి యశస్సుచేత, తెల్లనైన దిక్కుల కొనలు గలవాడా, ముమ్మయశాంతా.

తాత్పర్యము: లక్ష్మిదేవి తెల్లని కాంతి గలవాడా, తక్కువ కాని శివభక్తి సంపదగల గురువులచే ప్రసిద్ధుడా, తెల్లనిమేఘము వంటి పొగడబడుకీర్తి చేత తెల్లనైన దిక్కుల కొనలు గలవాడా, ముమ్మయశాంతా - కృతిపతి సంబోధనములు.

విశేషములు: కీర్తి సితజీమూత = సిత జీమూతము వంటి కీర్తి - ఉపమానోత్తర పదకర్మ ధారయము. నుతకీర్తి సిత జీమూత సితాఖిల దిగంత - తద్గుణాలంకారము - `తద్గుణ స్స్వగుణత్యాగా దన్యదీయ గుణగ్రహః' స్వగుణమును విడిచి యన్యగుణమును గ్రహించుట తద్గుణము. ఇచట దిగంతములు తమ కాంతిని విడిచి కీర్తిదగు తెల్లని కాంతిని గ్రహించెను. కావున తద్గుణము.

ఆ. అక్కథకుండు శౌనకాదులైన మహాము
నీంద్రులకుఁ బ్రియమున నిట్టు లనియె
నట్లు భూమి విడిచి యరుగవలయు నింక
ననుచు మాటలాడు నవసరమున 2

---

1 తా సుర 2 తా తరకీర్తి 3 తా.శివాసిత.

అర్థము: అ + కథకుండు = కథను జెప్పునట్టి అ సూతుడు శౌనక + ఆదులు + ఐన = శౌనకుడు మొదలగు వారైన, మహత్ (మహా) + ముని + ఇంద్రులకున్ = గొప్ప ముని శ్రేష్ఠులకు ప్రియమునన్ = ఇష్టముతో, ఇట్టులు అనియెన్. అట్లు భూమిన్ = హూణమండలమును, విడిచి, ఇంకన్ అరుగవలయున్, అనుచున్ మాటలు + ఆడు + అవసరమునన్ = పలుకు సమయమున.

తాత్పర్యము. కదను చెప్పు సూతుడు శౌనకాదిమహామునులకు ప్రీతితో నిట్లనియెను ఆ విధముగా `నింక మనము ఈ హూణ భూమిని విడిచి పోవలయు నని సుకుమారుడు పలుకు సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు: అక్కథకుండు = అ + కదకుండు - త్రికసంధి శౌనకాదులు (శౌనక + ఆదులు), మునీంద్రులు (ముని + ఇంద్రులు) - సవర్ణదీర్ఘసంధులు. ఆడునవసరము = ఆడు + అవసరము = `ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు. బాల సంధి 33

క తెలతెలవాఱుచు వచ్చెం
బలపలనయ్యెం బయోదపథమునఁదారల్
[1]కలవింకంబుల కోమల
కలకలములు చెలఁగె [2]గాళికావిపినమునన్. 3

అర్థము: తెలతెల వాఱుచున్ + వచ్చెన్ : తెలతెలవాఱ జొచ్చెను, పయోద పథమునన్ = మేఘమార్గమున - ఆకాశమున, తారల్ = నక్షత్రములు, పలపలన + అయ్యెన్ = కాంతి హీనము లయ్యెను కాళికా - విపినమునన్ = కాళికా దేవి ఆలయ సమీపమందలి అడవిలో, కలవింకంబుల = పిచ్చుకల, కోమల = మృదువులైన, కలకలములు = కలకలధ్వనులు, చెలఁగెన్ = ఒప్పెను

తాత్పర్యములు: తెలతెలవాఱజొచ్చెను. ఆకాశమున చుక్కలు కాంతి విహీనము లయ్యెను. కాళికాలయ సమీపాటవిలో పిచ్చుకల మృదువైన కలకలారావములు ఒప్పెను.

విశేషములు: స్వభావోక్తి. కలవింకము - `చటకః కలవిఙ్కస్స్యాత్ కం సుఖం యథా భవతి తథా లపతి కలవిఙ్కః సుఖముగా పలుకునది- పిచ్చుక - అమరము

సీ. సంభోగ పరిఖిన్న శబర సీమంతినీ
స్వేద వార్బిందు విచ్ఛేదకారి

1 ము. కలకలవింకల కోమల 2. తా కాళి విపినములోనన్

విఘటమానాంభోజ విపినషండమధూళి
పరిమళా సార సంపర్క సురభి
సమదకాంతార కాసరయూథ [1]రోమంథ
సంభూత డిండీర శకలవాహి
లలిత లుంగ లవంగలవలీ మతల్లికా
లాస్యోపదేశలీలా గురుండు

గీ. యామినీ శేష తుహిన ధారానుషంగ
జడిమ భర మంద [2]సంచార చతురశాలి
యల్లనల్లనఁ [3]బొలుపారె నడవిలోన
గాల్య సంధ్యా సుగంధుండు గంధవహుఁడు. 4

అర్థము: సంభోగ........ కారి: సంభోగ = రతిక్రీడచేత, పరిఖిన్న = మిక్కిలి యలసిన, శబర - సీమంతినీ = బోయపడతుల యొక్క, స్వేద - వార్ = చెమట నీటియొక్క, బిందు = బిందువుల యొక్క, విచ్ఛేద - కారి = నాశనమును జేయువాడు. విఘటమాన.......... సురభి: విఘటమాన = వికసించుచున్న, అంభోజ = తామరల యొక్క, విపిన = వనముల యొక్క, షండ = సమూహము యొక్క, మధూళి = మకరందము యొక్క, పరిమళ = వాసనయొక్క, ఆసార = జడితోడి, సంపర్క = సంబంధముచేత, సురభి = పరిమళించువాడు. సమద..... వాహి: స - మద = మదముతోగూడిన కాంతార - కాసర = అడవి యెనుబోతుల యొక్క, యూథ = గుంపు యొక్క, రోమంథ = నెమరువలన, సంభూత = పుట్టిన, డిండీర = నురుగుయొక్క, శకల = ముక్కలయొక్క, వాహి = మోయువాడు. లలిత.......గురుండు: లలిత = మనోహరములైన, లుంగ = లుంగ వృక్షముల (పుల్ల మాది ఫలము) యొక్కయు, లవంగ = లవంగముల యొక్కయు, లవలీ - మతల్లికా = శ్రేష్ఠములయిన తీగలయొక్క, లాస్య = నృత్యము యొక్క, ఉపదేశ = బోధమనెడి, లీలా = క్రియ యందు, గురుండు = గురువైన వాడు. యామినీ...... శాలి: యామినీ = రాత్రియొక్క, శేష = మిగులు భాగమునందలి, తుహిన = మంచుయొక్క, ధారా = చాలుల తోడి, అనుషంగ = కూడికవలని, జడిమ = మాంద్యము యొక్క, భర = బరువుచేత, మంద = మెల్లని, సంచార = వీచుటయందు, చతుర - శాలి = నేర్పుగల యొప్పువాడు ('సంచార చతురశాలి' యను పాఠము కంటె, ము. లోని 'చతుర సంచారకారి' యను పాఠమే విగ్రహమున కనువుగా నుండుటచే మేల్తరమని పించుచున్నది.) చతుర - సంచార - కారి = నేర్పుగల సంచారమును చేయువాడు. అగు, కాల్య - సంధ్యా - సుగంధుండు = ప్రాత స్సంధ్యా సమయమునందలి

1. ము. సమ్మర్ద. 2. ము. చతుర సంచారకారి 3. ము. బొలపారునడననడుమ

(పుష్పాది) సువాసనలు గలవాడు) - వర్తకుడు, అగు, గంధవహుడు = (గంధమును మోయువాడు) వాయువు, అడవిలోనన్, అల్లన + అల్లనన్ = అల్లనల్లనన్ = మెల్లమెల్లగా, పొలుపారెన్ = ఒప్పెను.

తాత్పర్యము: రతిక్రీడచే మిక్కిలి యలసిన బోయతల చెమట నీటి బొట్టులను పోగొట్టువాడును, విచ్చుచున్న తామరతోపుల తేనె వాసనల జడితోడి సంబంధముచే పరిమళించువాడును, మదించిన యడవి యెనుబోతుల గుంపులనెమరు నురుగు కణములను మోయువాడును, లలితములైన లుంగ లవంగలతలకు నాట్యమును బోధించు గురువైనవాడును, రేయి మిగులు భాగమున కురియు మంచుచాలుల తోడి కూడిక వలని జడత్వపు బరువుచే మెల్లగా వీచువాడును, ప్రాతస్సంధ్యా కాలపు వణిజుడును అగు వాయువు (గంధవణిజుడు) అడవిలో మెల్లమెల్లన ఒప్పెను.

విశేషములు: ఇందు వాయువు సుగంధుడుగా చెప్పబడినాడు. సుగుంధుడనగా (పుష్పాది) సువాసనలు గలవాడు. వర్తకుడనియు (సూ.ని.) A trader (Apte). ఇతడు గంధవహుడు - వాసనా ద్రవ్యముల వర్తకుడు. A trader in scents. మంచి గాలికి మూడు లక్షణములుండును. అవి మాంద్యము, శైత్యము, సౌరభ్యము - అనునవి, ఈ వాయువున కా మూడు లక్షణములును గలవు. `విఘటమానాంభోజ.......సురభి' యనుటచే సౌరభము, `సమదకాంతార...... వాహి' యనుటచే శైత్యము, `యామినీ......శాలి' యనుటచే మాంద్యము దానికి లభించుచున్నవి. స్త్రీ చేయు నృత్యమునకు లాస్యమని పేరు. `లవలీ' శబ్దము స్త్రీలింగము గాన ఇట లాస్యశబ్దము సముచిత ప్రయుక్తము. యామినీ శేష - తెల్లవాఱు జామున మంచు కురియును. జడ శబ్దము ఇమనిజంతరూపము జడిమ, జడిమము.

ఉ. క్షోణిరుహాగ్రభాగముల జోకలుగట్టి వనీశిఖావళ
శ్రేణుల తాండవంబు లొనరింపఁగ మంద్రగభీరభంగి శ
ర్వాణి గృహంబులోని బలివైభవలీలకు మ్రోసెం గంచుని
స్సాణము మాటిమాటికనుశబ్దముః లీనఁగ గోపురంబు[1]నన్. 5

అర్థము: వనీ - శిఖావళ - శ్రేణులు = అడవి నెమళ్ల వరుసలు, క్షోణిరుహ +అగ్రభాగములన్ = చెట్ల కొనలయందు, జోకలు + కట్టి = గుంపులుగా నేర్పడి, తాండవంబులు = నృత్యములు, ఒనరింపగన్ = చేయగా, శర్వాణి -గృహంబు - లోని = పార్వతి (కాళి) ఆలయమునందలి, బలి - వైభవ - లీలకున్ = పూజావైభవము యొక్క విలాసమునకు, కంచు - నిస్సాణము = కంచుతో చేయబడిన చర్మవాద్య విశేషము, గోపురంబునన్, మాటిమాటికిన్, అను శబ్దములు = ప్రతి ధ్వనులు,

1. తా. లన్

ఈనఁగన్ = పుట్టగా, మంద్ర - గభీర - భంగిన్ = గంభీరమైన విధమున, మ్రోసెన్ = మ్రోగెను.

తాత్పర్యము: అడవి నెమళ్లు గుంపులుగట్టి చెట్లకొనలయందు కాండవము చేయుచుండగా కాళికా దేవ్యాలయములోని పూజావైభవ విలాసమునకు అందలి కంచు చర్మవాద్యము గోపురమున మాటిమాటికి ప్రతిధ్వనులీనుచుండ గంభీరముగా మ్రోయుచుండెను.

విశేషములు: కాళికాలయములో పూజ వైభవముగా జరుగుచుండగా నెమళ్లు చెట్లపై తాండవము చేయుచుండెను. గుడిలో చర్మవాద్యము మ్రోయుచుండెను. ఇట్లు పూజా సమయమున దేవి కయత్నసిద్ధముగా నృత్యవాద్యములు సమకూరెను. స్వభావోక్తి. నెమళ్లకు మేఘధ్వని యనిన ప్రీతి. మేఘధ్వని కవి సంతోషముతో నృత్యము చేయును. కావుననే నెమలికి మేఘనాదానులాసిని యనిపేరు. ఇచ్చట గుడిలోని కంచు నిస్సాణపు మంద్ర గంభీర ధ్వని, యెత్తైన గోపురమున ప్రతిధ్వనించుచుండుటచే దానిని వినిన నెమళ్ల మేఘధ్వని యని భ్రమించి తాండవము చేయుచుండెను. మేఘధ్వని మంద్రముగానే యుండును. కంచు నిస్సాణము మాటిమాటికి మ్రోయుచుండెననగా, దేవి పూజ యెంత నిరంత రాయముగా జరుగుచుండెనో యూహింప నగును. పూజకు వైభవము నిరంతరాయముగా జరుగుటయే. శిఖావళము - శిఖాశబ్దమునకు `వల' అను మతుబర్థప్రత్యయము. `శిఖావల శ్శిఖీ కేకి మేఘనాదానులాస్యపి' శిఖా చూడా అస్యాస్తీతి శిఖావళః. శిఖ = చుంచుగలది కనుక శిఖావళము - నెమలి. అమరము. మాటిమాటికిన్ - మాటికిన్ + మాటికిన్. `ఆమ్రేడితంబు పరంబగునపుడు విభక్తి లోపంబు బహుళంబుగనగు.' నిస్సాణము (ప్రకృతి) - నిస్సహాణము (వికృతి). శర్వాణి - `శివా భవానీ రుద్రాణీ శర్వాణీ సర్వమఙ్గళా' - శర్వస్య పత్నీ శర్వాణీ. శర్వుని భార్య - పార్వతి. అమరము. గృహము (ప్రకృతి) -గీము (వికృతి), మ్రోసె - మొరసె (రూపాం.)

శా. నిష్ఠాసంపద నర్ఘ్యపాణులగుచు న్విప్రుల్ ప్రశంసింప మం
జిష్ఠారాగము లంబరంబున నధిష్ఠింపన్ నిలింపా[1]ద్రి భూ (ధి)
కాష్ఠా మధ్యమునందుఁ దోఁచెను శతాంగప్రష్ఠ సర్పద్విష
జ్జ్యేష్ఠుం[2]డప్పుడు నిష్ఠుర ప్ర[3]దర బంహిష్ఠద్యుతి శ్రేష్ఠతన్.(స.) 6

అర్థము: అప్పుడు = ఆ వేకువయందు, విప్రుల్ = బ్రాహ్మణులు, నిష్ఠా - సంపదన్ = శ్రద్ధయను సంపదతో, అర్ఘ్య - పాణులు = పూజాద్రవ్యములు చేతులందు గలవారు, అగుచున్, ప్రశంసింపన్ = స్తోత్రము చేయగా, మంజిష్ఠా - రాగములు = ఎఱ్ఱని రంగులు, అంబరంబునన్ = ఆకాశమునందు, అధిష్ఠింపన్ = నెలకొనగా,

1. ము.ధి. 2. తా. దర్కుఁడు 3. ము. ప్రసర

(వ్యాపింపగా), శతాంగ - ప్రష్ఠ - సర్ప - ద్విషత్ + జ్యేష్ఠుండు = (సూర్య) రథము పై నగ్రేసరుడు, అగు, గరుత్మంతుని (పాములకు శత్రువు) యొక్క అన్న యగు అనూరుడు, నిష్ఠుర....శ్రేష్ఠతన్: నిష్ఠుర = కఠినమైన (తీక్ష్ణమైన), ప్రసర = వ్యాప్తిగల, బంహిష్ఠ = మిక్కిలి బహుళమైన, ద్యుతి = కాంతియొక్క, శ్రేష్ఠతన్ = శ్రేష్ఠత్వముతో, నిలింప + అధిభూ - కాష్ఠా - మధ్యమునందున్ = దేవతల ప్రభువైన ఇంద్రుని యొక్క, దిక్కగు, తూర్పునడుమ, తోచెను = కననయ్యెను.

తాత్పర్యము: వేకువ సమయమున బ్రాహ్మణు లర్ఘ్యమును చేతులందు దాల్చి స్తోత్రము చేయుచుండగా, ఆకాశమున నెఱ్ఱని కాంతులు వ్యాపించుచుండగా, సూర్యరథమునందగ్రేసరుడగు సర్పశత్రువు, గరుత్మంతుని యన్న అగు అనూరుడు తీక్ష్ణమైన వ్యాప్తిగల మిక్కిలి బహులమైన కాంతి శ్రేష్ఠతతో దేవతా ప్రభువగు నింద్రుని దిక్కున (తూర్పు) కననయ్యెను.

విశేషములు: పద్యమున ష్ఠ కార పౌనఃపున్యముచే నా ద్యుతి నిష్ఠురత్వము తెలియుచున్నది. మంజిష్ఠా రాగము - మంజిష్ఠాలత నుండి తీయు నెఱ్ఱని రంగు. ఇది మిక్కిలి కాంతిమంతముగా నుండును. (సూ.ని.)

అంబరము = (నానా.) ఆకాశము, వస్త్రము. అర్ఘ్యపాణులు = అర్ఘ్యము పాణియందుగలవారు - బహువ్రీహి. `నిలింపాద్రిభూ' అను పాఠము కంటె ము. లోని `నిలింపాధిభూ' అను పాఠమే బాగు. అధిభూ = అధిపతి. నిలింప + అధిభూ = నిలింపాధిపతి = ఇంద్రుడు. కాష్ఠా = దిక్కు. `దిశస్తు కకుభః కాష్ఠా ఆశాశ్చ హరితశ్చ తాః' - కాశన్తే ప్రకాశన్త ఇతి కాష్ఠాః - దిక్కులు (అమరము) - శతాంగ ప్రష్ఠసర్ప ద్విషజ్జ్యేష్ఠుండు - శతాంగమునందు ప్రష్ఠుడైన సర్పద్విషత్తు యొక్క జ్యేష్ఠుడు - అనూరుడు. వినత కొడుకులలో అనూరుడు పెద్దవాడు, గరుత్మంతుడు రెండవవాడు. ప్రష్ఠ - పురోగాగ్రే సరప్రష్ఠాగ్రతస్సర పురస్సరాః, పురోగమః పురోగామీ' - ప్రతిష్ఠతే పురో గచ్ఛతీతి ప్రష్ఠః. ముందు నడచువాడు. అనూరుడు ముందును, సూర్యుడు తరువాతను కనుపట్టుదురు. అనూరునకే అరుణుడనియు పేరు. సూర్యోదయము కంటె ముందరుణోదయమగును. అప్పుడాకాశము మంజిష్ఠారాగము గలదై యుండును. `నిష్ఠుర ప్రదర' పాఠము కంటె `నిష్ఠురప్రసర' అను ముద్రిత పాఠము మేలుగా తోచుట వలన నది స్వీకరింపబడినది. బంహిష్ఠ - బహుల + ఇష్ఠ = బంహిష్ఠ ఇష్ఠ తమప్రత్యయార్థక ప్రత్యయము. బహుల + ఈయస్ = బంహీయస్ ఈయస్ తర ప్రత్యయార్థక ప్రత్యయము. ప్రశస్య - శ్రేయస్, జ్యాయస్, (comparative) - శ్రేష్ఠ జ్యేష్ఠ (Superlative)

వ. ఆ దివసంబున. 7.

తాత్పర్యము: ఆ దినమున

ఉ. జాతరచేసె బ్రాహ్మణుఁడు చండికిఁ గమ్మని పిండివంటతో
నేతులతోడ మద్దికడ నిర్మలినాన్నముతో రసావళీ
చూతఫలాలితోడ వరసూపముతో జిఱువాలతోడుతన్
[1]నీతులతోడనప్పు డకనిష్ఠతరంబగు నిష్ఠపెంపునన్. 8.

అర్థము: బ్రాహ్మణుఁడు = బ్రాహ్మణుడైన సుకుమారుడు, అప్పుడు = ఆ సూర్యోదయసమయమున, మద్ది కడన్ = మద్దిచెట్టు దగ్గఱ, అకనిష్ఠతరంబు = అల్పిష్ఠముకానిది - అధికమైనది, అగు, నిష్ఠ - పెంపునన్ = శ్రద్ధాతిశయముతో, చండికిన్ = పార్వతికి - భద్రకాళికి, కమ్మని - పిండివంటతోన్, నేతులతోడన్, నిర్మలిన + అన్నముతోన్ = పరిశుద్ధమైన అన్నముతో, రస + ఆవళీ - చూత - ఫల + ఆలి తోడన్ = పేయములైన రసముల సమూహములతోను, మామిడి పండ్ల సమూహముతోను, వర - సూపముతోన్ = శ్రేష్ఠమైన పప్పుతోను, చిఱువాల తోడుతన్ = ఇగురగాచిన పాలతోను (ఆనవాలతోను), నీతులతోడన్= ధర్మములతోను, జాతర - చేసెన్.

తాత్పర్యము: బ్రాహ్మణుడగు సుకుమారుడు మద్దిచెట్టుకడ చండికి ఆ ఉదయసమయమున నధిక తరమగు శ్రద్ధతో కమ్మని పిండివంటతోను, నేతులతోను, పరిశుద్ధాన్నముతోను, రసములతోను, మామిడిపండ్లతోను, మంచిపప్పుతోను, ఆనవాలతోను జాతరచేసెను.

విశేషములు: చిఱువాల = చిఱు + పాలు. ఇగురగాచిన పాలు, ఆనవాలు. 'ఆనవాలన జిఱువాలు నా నెసంగు, గర్దమీకృతదుగ్ధంబు' ఆం.భా. 2.158 అకనిష్ఠతర - అల్పిష్ఠ, కనిష్ఠ (Superlative) - అల్ప - అల్పీయస్, కనీయస్ (Comparative) - అల్పిష్ఠ, కనిష్ఠ (Superlative) - Superlative పై మరల తరప్రత్యయము. కనిష్ఠతర. న + కనిష్ఠతర = అకనిష్ఠతర = కనిష్ఠతరము గాని - మిక్కిలి గొప్పది.

వ. నాటిరాత్రి *(నిశా) సమయంబునం గాలకంఠకంఠ మూల కాకోల విషమషీ కళంకచ్ఛాయా సముల్లాసంబు *(నుల్లసనంబు) నుల్లసంబాడు నిబిడాంధ కారంబున[2]నన్నెలవు గదలి చండాలియుండాను సుకుమారుండు దుర్గమాటవీ [3]విషయంబు హూణదేశంబు గడచి ప్రతిదిన ప్రయాణంబుల నెడనెడం బక్కణ గ్రామ ఘోషంబుల భిక్షాహార గో రసక్షౌద్రం బులనుం గందమూలంబులనుం గర్కంధూ[3]వికుచ కదలి చూత మాతులుంగ లవలీ జంబూ తాల తిందుక

1. తా. నేతుల * తాళపత్రమున లేదు * తా. నన్నెలవులం గదలి. 2. తా. విషయంబనుంగా 3. తా. వితికుచ.

ద్రాక్షాఫలంబులను శరీరయాత్ర నడుపుచు గంధసింధుర ఘటా కరటఫలకతట గళిత మద జలాసార ధారా సారిణీ సంపర్క చంద్రకిత [1]బంధకిని యగు సింధురనది యుత్తరించి, యుత్తరాభిముఖుండై జంబూద్వీప విశ్వంభరా నితంబ బింబ జాంబూనద మేఖలా పాశంబగు కాంభోజదేశం బతిక్రమించి, యభ్రంకష విశంకట శిఖరోత్సేధ బహుల మహీధర స్కంధ సంకులం బగు కిరాతమండలంబు సొత్తెంచి యందు బృందారకనగర సౌందర్యంబు ధిక్కరించు వైభవాధిక్యంబునం బ్రసిద్ధిగాంచి [కాంచీ] పట్టణంబునకుం జుట్టంబన, నవంతికి సామంతంబన, మధురకుం బ్రతి యన, మాయకుం బ్రతిచ్ఛాయనా నయోధ్య కధ్యాహారం బన, ద్వారవతికిం బ్రతియనఁగా శికింగీస వెలితి. యన నొప్పు వణిక్పృథంబను [మ] హానగరంబు ప్రవేశించి.

అర్థము: నాటి - రాత్రి - సమయంబునన్ = సుకుమారుడు జాతర చేసిననాటి రేయి, కాలకంఠ.....సముల్లాసంబున్: కాలకంఠ = నల్లని కంఠముగల శివుని యొక్క, కంఠ - మూల = కంఠప్రదేశమునందలి కాకోల - విష = కాకోల మనెడి విషముయొక్క, మషీ = మసివలని, కళంక + ఛాయా = నల్లని కాంతియొక్క, సముల్లాసంబున్ = అతిశయమైన ప్రకాశమును, ఉల్లసంబు + ఆడు = పరిహసించు, నిబిడ + అంధకారంబునన్ = దట్టమైన చీకటి యందు, ఆ + నెలవు = ఆచోటు, కదలి, చండాలియున్ + తానును = మాలెతయును తానును, సుకుమారుడు, దుర్గమ + అటవీ - విషయంబు = చొరరాని అడవి ప్రదేశము, అగు, హూణదేశంబు, కడచి = దాటి, ప్రతి - దిన - ప్రయాణంబులన్ = అను దినము చేయు పయనములచే, ఎడనెడన్ = అక్కడక్కడ, పక్కణ - గ్రామ - ఘోషంబులన్ = బోయపల్లెలందును, పల్లెలందును, గొల్లపల్లెలందును, భిక్షా + ఆహార - గోరస - క్షౌద్రంబులనున్ = బిచ్చపు గూడు, మజ్జిగ, తేనె అనువానిచేతను, కంద - మూలంబులనున్ = దుంపల, వేరులచేతను, కర్కంధూ = రేగులు, లికుచ = గజనిమ్మలు, కదలీ = అరటులు, చూత = మా మిడులు, మాతులుంగ = మాదిఫలములు, లవలీ = లవలియను తీగలు, జంబూ = నేరేడులు, తాల = తాటిపండ్లు, తిందుక = తుమ్మికి పండ్లు, ద్రాక్షా ఫలంబులను, శరీర - యాత్రన్ = దేహయాత్రను, నడుపుచున్ గంధ.... బంధకిని: గంధ - సింధుర = మదగజముల యొక్క, ఘటా = గుంపులయొక్క, కరట - ఫలక - తట = పలకలవంటి (ఏనుగు) చెక్కిళ్ల ప్రదేశమునుండి, గళిత = కాఱిన, మద - జల + ఆసార = మదజలము యొక్క జడుల యొక్క, ధారా = ప్రవాహము యొక్క, సారణీ = కాలువలతోడి సంపర్క = సంబంధము వలన, చంద్రకిత - మయూర పింఛము వలె విచిత్ర వర్ణములు గల, బంధకిని = ఆనకట్ట గలది అగు, సింధుర - నది, ఉత్తరించి = దాటి, ఉత్తరా + అభిముఖుండు + ఐ

1. తా. బంధకిణి యగు

= ఉత్తర దిశగా మొగముగలవాడయి, జంబూ.....పాశంబు: జంబూద్వీప = నేరెటిదీవి యనెడు, విశ్వంభరా = భూదేవి యొక్క, నితంబ - బింబ = కటిమండలము నందలి, జాంబూనద = బంగారు, మేఖలా - పాశంబు = మొలనూలు, అగు, కాంభోజ - దేశంబు, అతి క్రమించి = దాటి, అభ్రం....... సంకులంబు: అభ్రంకష = ఆకాశము నొరయునట్టి, వికంకట = పెద్దదైన, శిఖర = కొనలయొక్క, ఉత్సేధ = పొడవుగల, బహుల = పెక్కు, మహీధర = కొండల యొక్క, స్కంధ = మూపుల చెత - సమూహముచేత, సంకులంబు = సంకీర్ణమయినది, అగు, కిరాత - మండలంబు, చొత్తెంచి = ప్రవేశించి, అందున్, బృందారక - నగర - సౌందర్యంబున్ = దేవతల పట్టణమగు అమరావతి యొక్క చక్కదనమును, ధిక్కరించు = తిరస్కరించునట్టి, వైభవ + ఆధిక్యంబునన్ = వైభవాతిశయముచే, ప్రసిద్ధి + కాంచి = పేరుపొంది, కాంచీ - పట్టణంబునకున్, చుట్టంబు + అనన్ = బంధువనగను, అవంతికిన్, సామంతంబు + అనన్ = చుట్టమనగను, మధురకున్, ప్రతి + అనన్ = సాటి అనగను, మాయకున్ = మాయయను నగరమునకు, ప్రతి + ఛాయ - నాన్ = ప్రతిబింబమనగను, అయోధ్యకున్, అధ్యాహారంబు + అనన్ = సాటి అనగను, ద్వారవతికిన్ = ద్వారకకు, ప్రతి + అనన్, కాశికిన్, కీస- వెలితి + అనన్ = ఇంచుక తక్కువ అనగను, ఒప్పు, వణిక్పథంబు + అను, మహత్ (మహా) + నగరంబు = గొప్పపట్టణము, ప్రవేశించి.

తాత్పర్యము: సుకుమారుడు కాళికాదేవికి జాతర చేసిన నాటి రాత్రి శివుని కంఠమునందలి విసపు మసినలుపును బరిహసించు చిమ్మచీకటిలో నా చోటు వీడి మాలెతయును దానును చొరరాని యడవులుగల హూణదేశమును దాటి దిన దినము ప్రయాణించుచు, నక్కడక్కడ బోయపల్లెలందును, పల్లెలందును, గొల్లపల్లెలందును బిచ్చపుగూటిచేతను, మజ్జిగచేతను, తేనె చేతను దుంపల తోను, రేగుబండ్లు, నిమ్మపండ్లు, అరటిపండ్లు, తాటిపండ్లు, తుమ్మికిపండ్లు, ద్రాక్షపండ్లు అనువానితో ప్రాణములను నిలుపుకొనుచు, మదించిన యేనుగుల గుంపుల పలకల వంటి చెక్కిళ్ల నుండి కాఱిన మదజల అగు సింధురనదిని దాటి, ఉత్తర దిక్కుగా నేగుచు, నేరెటి దీవియను భూదేవికి బంగరు మొలనూలగు కాంభోజదేశమును దాటి, ఆకసమునొరయు కొనలు గల పెక్కు కొండలతో నిండిన కిరాతమండలమును ప్రవేశించి, అందు అమరావతి చక్కదనమును తిరస్కరించు వైభవాతిశయముతో పేరుగాంచి, కాంచీ నగరమునకు చుట్టమనగను, అవంతీ పట్టణము నకు బంధువనగను, మధురానగరమునకు సాటియనగను, మాయా నగరమునకు ప్రతిబింబమనగను, అయోధ్యకు సాటి యనగను, ద్వారవతికి సమాన మనగను, కాశికించుక తక్కువ యనగను నొప్పు వణిక్పథమను మహానగరమును ప్రవేశించి. తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: కాలకంఠ..... నిబిడాంధకారంబునన్ = శివుని కంఠమునందలి విసపు నలుపు కంటెను నల్లనైన చిమ్మచీకటిలో. జంబూద్వీప..... కాంభోజదేశంబు = కాంభోజదేశము నేరెటి దీవియను భూకాంత బంగరుమొలనూలి వలె నున్నది · నేరెటి ద్వీపమున కది యలంకారమైన దనుట. జంబూ ద్వీప - విశ్వంభరా · రూపకము.

చొత్తెంచు - చొచ్చు + తెంచు - `తెంచుధాతు వగ్వాదుల కనుప్రయుక్తంబగు..... బాల. క్రియ. 110. `అయ్యది పరంబగునపుడు చువర్ణంబు లోపించు.'- చొత్తెంచు. బాల. క్రియ. 112 చుట్టము, సామంతము, ప్రతి, ప్రతిచ్ఛాయ, అధ్యాహారము - ఇవి యన్నియు ఇవార్థకములు.

ఉ. ఎంతయుఁ గాల ముండెను మహీసురుఁడప్పురమందు వేదవే
దాంత పురాణ తత్త్వవిదులైన ధరామరు లుద్ధరింపగా
శాంతియు దాంతియున్ ధృతియు సత్యము శౌచము బాహ్యవృత్తి య
భ్యంతరవృత్తి ధౌర్త్యమునుఁ బాయక యెప్పుడుఁ జెల్లుచుండఁ గన్. 10

అర్థము: మహీ - సురుండు = బ్రాహ్మణుడు - సుకుమారుడు, వేద - వేదాంత - పురాణ - తత్త్వ - విదులు = వేదములు, ఉపనిషత్తులు, పురాణములు అనువాని తత్త్వము తెలిసినవారు, ఐన, ధరా + అమరులు = బ్రాహ్మణులు, ఉద్ధరింపగాన్ = రక్షింపగా, బాహ్య - వృత్తి = పయినడవడి, శాంతియున్ = శమమును, దాంతియున్ = దమమును (ఇంద్రియ నిగ్రహమును), ధృతియున్ = ధైర్యమును, సత్యమున్, శౌచమున్ = శుచిత్వమును, అభ్యంతర - వృత్తి = లో నడవడి, ధౌర్త్యమును =ధూర్తత్వమును - వంచకత్వమును, పాయక = విడువక, ఎప్పుడున్, చెల్లుచున్ + ఉండగన్ = సాగుచుండగా, ఆ + పురి + అందున్ =. ఆ వణిక్పథపురమున, ఎంతయున్ + కాలము = చాలకాలము, ఉండెను = నివసించెను.

తాత్పర్యము: బ్రాహ్మణుడైన సుకుమారుడు వేదములయు, ఉపనిషత్తులయు, పురాణములయు తత్త్వ మెఱిగిన బ్రాహ్మణులు కాపాడుచుండగా, పయికి శమదమ ధైర్య సత్యశౌచములు నటించుచు, లోన వంచకత్వమును వీడక యెప్పుడును సాగుచుండగా నా వణిక్పథపురమున చాలకాలముండెను.

విశేషములు: సుకుమారుడు `వేద శాస్త్రపురాణ ప్రవీణుండు' (3-115), కావున నా యూరిబ్రాహ్మణుల కతనిపై నభిమానము. మఱియు నతడు పైకి శమదమాదులను నటించుచుండెను. లోనిధౌర్త్యమెవరికి దెలియును? కావుననే నచ్చటి బ్రాహ్మణులతని నుద్ధరించు చుండిరి. ఈ నటన ద్వైవిధ్యము వలననే యతడా పురియందు చాలకాల ముండగలిగెను.

గీ. బ్రహ్మపురివాడలో వణిక్పృథమునందు
జరిగె సంస్పృష్టి దోషంబు జరభికతన
నెవ్వ రేలాగువారొ యెట్లెఱుఁగవచ్చు ?
జగతిఁగల [1]దిజ్యదోష మజ్ఞానకృతము 11

అర్థము: వణిక్పృథము నందున్ = వణిక్పృథ పురములో, బ్రహ్మపురి - వాడలోన్ = బ్రాహ్మణుల వీధియందు, జరభి - కతనన్ = అసతి - మాలెత కారణముగా, సంస్పృష్టి - దోషంబు = అంటు దోషము, జరిగెన్ = సంభవించెను, ఎవ్వరు, ఏ - లాగువారొ = ఎటువంటి వారో, ఎట్లు, ఎఱుగన్ + వచ్చున్ = తెలియనగును? అజ్ఞాన - కృతము = తెలియక చేసినది, అగు, ఇజ్య - దోషము = సంగదోషము, జగతిన్ = లోకమునందు, కలదు.

తాత్పర్యము: ఆ వణిక్పృథపురము నందలి బ్రాహ్మణుల వీథిలో నా యసతియగు మాలెత కారణముగా నంటుదోషము సంభవించెను. ఎవ రెటువంటి వారో యెట్లు తెలియనగును? పూజ్యులైన వారు తెలియక దోషముచేయుట లోకమున గలదు.

విశేషములు: పూజ్యులగు నచ్చటి బ్రాహ్మణులామె మాలెతయని తెలియక యట నివసింపనిచ్చి యంటుదోషమును పొందిరి. లోకమున నిట్లే యజ్ఞాన కృతమైన సంగదోషము కలుగు చుండునని భావము. విశేషాంశము సామాన్యాంశముచే సమర్థింపబడుటచే నలంకార మర్థాంతరన్యాసము.

గీ. విభవముల [2]వడ్గు పెండ్లిండ్లు విందు వీడు
భోజన ప్రతిభోజనమ్ములను వ్రతము
లాదిగాఁ గల తిథులందు నతనిఁ గూడి
వ్యవహరించెను వీట బ్రాహ్మణకులంబు 12

అర్థము: విభవములన్ = వైభవములందును, వడ్గు = ఉపనయనములు, పెండ్లిండ్లు, విందు, వీడు = విడిపోవుట భోజన, ప్రతిభోజనములను, వ్రతములు, ఆదిగాన్ = మొదలుగా, కల, తిథుల + అందున్, అతనిన్ = సుకుమారుని, కూడి = కలిసి, వీటన్ = నగరమందు, బ్రాహ్మణ-కులంబు = బ్రాహ్మణుల సమూహము, వ్యవహరించెను - పాల్గొనెను.

తాత్పర్యము: ఆ వణిక్పృథపురమునందలి బ్రాహ్మణుల సమూహము విభవములందును, ఉపనయనములు, పెండ్లిండ్లు, విందులు, భోజనములు, ప్రతిభోజనములందును, వ్రతములు మొదలగు తిథులందును సుకుమారునితో కలిసి పాల్గొనెను.

1. ము. దిజ్ఞ. 2. తా. వడుగు

గీ. నెలఁత బొమ్మంచు పుట్టంబు నెఱికి .గట్టుఁ
గాంత ధరియించుఁ బచ్చ నక్షతల బొట్టు
నింత యొడికంబుగా వాడు నిల్లు బట్టు
వీటి విప్రాంగనలు దన్ను వినుతి సేయ 13

అర్థము: వీటి - విప్ర + అంగనలు = ఊరియందలి బ్రాహ్మణ స్త్రీలు, తన్నున్, వినుతి + చేయన్ = పొగడగా, నెలఁత = స్త్రీ మాలెత, బొమ్మ + అంచు = బొమ్మల అంచులు గల, పుట్టంబున్ = వస్త్రమును (చీరను).నెఱికగట్టున్ - కుచ్చెళ్లుపోసికట్టును, కాంత = స్త్రీ, పచ్చని + అక్షతల-బొట్టున్ = పచ్చని అక్షింతల బొట్టును, ధరియించున్ = పెట్టుకొనును, ఇంతి స్త్రీ, ఇల్లు బట్టు = ఇంటిని ఒడికంబుగాన్ = అందముగా, వాడున్ = తీర్చును.

తాత్పర్యము: మాలెత త న్నూరిలోని బ్రాహ్మణ స్త్రీలు మెచ్చుకొనగా బొమ్మల యంచులు గల చీరను కుచ్చెళ్లు పోసి కట్టును. ఆమె పచ్చని యక్షింతల బొట్టును పెట్టుకొనును. ఇంటిపట్టును సుందరముగా తీర్చును.

విశేషములు: నెఱికగట్టు = కుచ్చెళ్లు పోసికట్టు (సూ.ని.) సీ. అంచవన్నియతోడ, నందమైన మడుంగు - నిద్దంపుఁ బుట్టంబు నెఱికగట్టి కాశీ. 3.212

సీ. కృపకు నాధారంబు, కీర్తి కావాసంబు,
దానధర్మముల కాధానకంబు,
మూలంబు కాంతి, కావాలంబు దాంతికి,
నఖిల విద్యలకును నాలయంబు,
మంగళంబుల కిక్క, మద వికారములకు
దూరంబు, [1]నురువు సాధుత్వమునకు,
దావానలము రాగతరుపల్లవములకు,
నవలేపతిమిరసంహతికి హేళి)

గీ. [2]పట్టణము బ్రహ్మపురివాడ బ్రహ్మలోక
మునకు సయిదోడు, మోసల మోక్షమునకు,
దూషితంబయ్యె సంసర్గదోషకలన
నంటు ముట్టునఁ గలుషితంబయ్యె నాఁడు 14

అర్థము: కృపకున్ = దయకు, ఆధారంబు, కీర్తికిన్, ఆవాసంబు = స్థానము, దాన - ధర్మములకున్, ఆధానకంబు = కారకము, కాంతికిన్, మూలంబు =

1. ఉరు ఉ. 2. ము. గీ. గ్రామఘోషంబు పురివాడ బ్రహ్మలోకము...డు మొగసాల మోక్షమునకు, దూషితంబయ్యె సంసర్గదోషకలన, నంటు ముట్టునఁ గలుషితం బయ్యెనాఁడు.

మొదటి కారణము, దాంతికిన్ = ఇంద్రియ నిగ్రమునకు, ఆవాలంబు = పాదు, అఖిల - విద్యలకును = ఎల్ల విద్యలకును, ఆలయంబు = ఇల్లు - స్థానము,

మంగళంబులకున్ = శుభములకు, ఇక్క = స్థానము, మద-వికారములకున్ = గర్వము వలని వికృతులకు, దూరంబు = దవ్వు, సాధుత్వమునకున్ = మంచితనమునకు, ఉరవు = అనుకూలమయినది. రాగ- తరు - పల్లవములకున్ = ప్రేమ మనెడి చెట్టు యొక్క చివురులకు, దావ + అనలము = కార్చిచ్చు, అవలేప-తిమిర-సంహతికిన్ = గర్వమనెడి చీకటుల సముదాయమునకు, హేళి = సూర్యుడు.

బ్రహ్మలోకమునకున్ = సత్యలోకమునకు, సయిదోడు = తోబుట్టువు, మోక్షమునకున్, మోసల = ముంగిలి, అగు, పట్టణము-బ్రహ్మపురివాడ = వణిక్ప్రథపురము నందలి బ్రాహ్మణులవీథి, సంసర్గ-దోష-కలనన్ = అంటుదోషము పొందుటచే, దూషితంబు + అయ్యెన్ = నిందింపబడిన దయ్యెను. నాడు = దేశము, అంటు ముట్టునన్ = అంటరానిదానిని తాకుటచే, కలుషితంబు + అయ్యెన్ = మైలపడెను.

తాత్పర్యము: దయ కాశ్రయ మయినదియు, కీర్తికి స్థానమయినదియు, దానధర్మములకు కారణ మయినదియు, కాంతికి మూల మయినదియు, ఇంద్రియ నిగ్రహమునకు పాదయినదియు, విద్యల కెల్ల నిలయ మయినదియు, శుభములకు స్థానమయినదియు, మదము వలని వికృతులకు దవ్వయినదియు, మంచితనమునకు యోగ్యమయినదియు, రాగమనెడి చెట్టు చివురులకు కార్చిచ్చయినదియు, గర్వమనెడి చీకటుల సముదాయమునకు సూర్యుడయినదియు, సత్యలోకమునకు దోబుట్టు వయినదియు, మోక్షమునకు ముంగిలి యయినదియు నగు పట్టణ బ్రాహ్మణాగ్రహారము సంసర్గ దోషము వలన నిందిత మయ్యెను. అంటరాని దాని నంటుటచే నాడంతయు మైలపడెను.

విశేషములు: ఉల్లేఖాలంకారము. రాగ-తరు = రాగమనెడి తరువు -రూపకము మోసల - (రూపం) మోసాల, మొగసాల (వికృతి)-ముఖశాల (ప్రకృతి)సయిదోడు - (రూపాం)సైదోడునాడు = నాడు కాలవాచకమయినప్పుడే కాక, దేశవాచకమయినప్పుడు కూడ నాఁడు సబిందుకమేయని (సూ.ని.).

క. తనయల (నిద్ద)నిద్దఱు
తనయులనుం గాంచి కాలధర్మము నొందెన్
[1]వనజాస్య [2]గట్టి వయసునఁ
దనయుఁడు పరలోకవిధులు తల్లికిఁ [3]జేసెన్ 15

1. తా. వనజాక్షి 2. తా. గండివయసున 3. తా. దీర్చెన్

అర్థము: తనయలన్ = కూతులను, ఇద్దఱు = ఇరువురను, ఇద్దఱు-తనయులనున్ = ఇరువురు కొడుకులను, కాంచి = కని, వనజ + ఆస్య = తామరవంటి ముఖము గలది - మాలెత, గట్టి వయసునన్ = నడువయస్సున, కాల ధర్మమున్ + ఒందెన్ = మరణించెను, తనయుఁడు = కొడుకు, తల్లికిన్ పర-లోక-విధులు = ఉత్తరక్రియలు, చేసెన్.

గీ. ఏమి చెప్పంగ [1]నఱువదియేండ్ల వయసు
ముసలి సుకుమారుఁ డేకాంతమున రమించెఁ
గూఁతు లిద్దఱ బొమలపైఁ గురులు వ్రాలు
నంత మాత్రపుఁ జిన్నిప్రాయంబువారి 16

అర్థము: ఏమి - చెప్పంగన్ = చెప్పుట కేమున్నది? చెప్పుటకు గూడ నతి ఘోరమైన పాపకార్యమనుట, అఱువది + ఏండ్ల-వయసు-ముసలి-సుకుమారుడు, బొమలపైన్ = కనుబొమల మీద, కురులు = ముంగురులు, వ్రాలు, అంతమాత్రము + చిన్నిప్రాయంబు వారిన్ = అంతమాత్రమే అయిన చిన్ని వయసువారిని, కూతులు + ఇద్దన్ = ఇరువురు కూతులను, ఏకాంతమునన్ = రహస్యమున, రమించెన్ = అనుభవించెను.

తాత్పర్యము: అఱువదేండ్ల ముసలి సుకుమారుడు కురులు బొమలపై వ్రాలు లేతవయసు కూతుల నిరువురను ఏకాంతమున ననుభవించెను. చెప్పుట కేమున్నది?

విశేషములు: బొమలపై కురులు వ్రాలు నంతమాత్రపు చిన్ని ప్రాయంబు వారిన్ - వయసువచ్చు కొలది కురులు పొడవుగా నెదుగును. కురులు బొమలపై వ్రాలు వయసనగా మిక్కిలి లేత వయసని భావము.

కూతు లిద్దఱన్ `సర్వనామ సంఖ్యాభిధాన తద్విశేష్యంబులయం దెయ్యది ముందు ప్రయోగింపంబడు దాని ద్వితీయాదులకుం బ్రథమ బహుళంబుగా నగు' బాల కారక. 26 దానిచే `కూఁతులు' ప్రథమలో నున్నది. పక్షమున కూఁతుల నిద్దఱన్ ఇద్దఱన్ కూతులన్, ఇద్దఱుగూఁతులన్.

వ. అంతం గొంతకాలంబునకు వాని దుశ్చేష్టితంబు లెఱిగి బ్రాహ్మణులు *(వానిని) బహివెట్టి యూరు వెడల నడిచి యారూఢ పతితుండైన వాని సంసర్గంబునం బుట్టిన దోషంబు బుద్ధి పూర్వకంబు గాదు కావున గొందఱు పవసించియుం గొందఱు తప్త కృచ్ఛ్రంబులనుసరించియుం గొందఱు కృచ్ఛ్రాతి కృచ్ఛ్రంబులు నడిపియుం గొందఱు చాంద్రాయణంబు లాచరించియు (నెట్టకేలకు విశుద్ధి గావించిరి సుకుమారుండును) 17

1. తానిరువది. * తాళపత్రమున లేదు.

అర్థము: అంతన్, కొంతకాలంబునకున్, వాని = సుకుమారుని యొక్క, దుశ్చేష్టితంబులు = చెడ్డపనులు, ఎఱింగి, బ్రాహ్మణులు వానిని = సుకుమారుని, బహి + పెట్టి = వెలివైచి, ఊరు, వెడలన్ +అడిచి = వెడలన్గొట్టి, ఆరూఢ-పతితుండు + ఐన = మిక్కిలి భ్రష్టుడైన, వాని = సుకుమారుని యొక్క, సంసర్గంబునన్ = సహవాసము వలన, పుట్టిన, దోషంబు = పాపము, బుద్ధి-పూర్వకంబు-కాదు + కావునన్ = కావలయునని చేసినది. కాదు కావున, కొందరు = కొంతమంది బ్రాహ్మణులు, ఉపవసించియున్ = ఉపవాసము చేసియు, కొందఱు, ఉత్తప్త - కృచ్ఛ్రంబులు = మిక్కిలి సంతాపమును గలిగించు బాధలు, అనుసరించియున్ = పొందియు, కొందరు, కృచ్ఛ్ర + అతి కృచ్ఛ్రంబులు = ఘోరాతి ఘోరములైన కష్టములు, నడిపియున్, కొందరు, చాంద్రాయణంబులు, = భుజింపదగిన పదియేను కబళములలో చంద్రుని క్షయవృద్ధుల ననుసరించి, క్రమమున కృష్ణ పక్షమందు నొక్కొక్క కబళము తగ్గించుచు, శుక్లపక్షమందు నొక్కొక్క కబళము హెచ్చించు నాచరించెడి వ్రతములు, ఆచరించియున్ = చేసియు, ఎట్టకేలకున్ = చివరకు, విశుద్ధి = పవిత్రత, కావించిరి = చేసిరి, సుకుమారుడును.

తాత్పర్యము; తరువాత కొంతకాలమునకు వాని పాపకార్యము నెఱిగి బ్రాహ్మణులు వానిని వెలివైచి యూరినుండి వెడల గొట్టి మిక్కిలి భ్రష్టుడైన వాని సహవాసము వలన గలిగిన పాపము కావలయునని చేసినది కాదు కావున కొందఱు బ్రాహ్మణులు ఉపవసించియును, కొందరు మిక్కిలి సంతాపమును గలిగించు కష్టముల ననుభవించియును, కొందరు మిక్కిలి కష్టములను నడిపియును, కొందు చాంద్రాయణ వ్రతముల నాచరించియు నెట్టకేలకు పవిత్రత నొందిరి. సుకుమారుండును - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. (చెలికాఱు లంజనాచల గండ) శిలలకు,
యమదూతలకు నభిధాంతరములు,
ప్రతిబింబములు కాళరాత్రి యామములకుం,
బుత్త్ర సంతానంబు భూతములకు,
నశుభకర్మముల కన్వాదేశములు, మౌని
శాపాక్షరములకు సంగడీలు,
[1]కలి కాలమునకు డగ్గిన చుట్టంబులు,
ధూమకేతువులకుఁ దోడు నీడ

1. తా కలికాలములకు

గీ. లంధకారంబులకు విందు లనఁగ గిరుల
యందు వర్తించు చెంచుల నాశ్రయించి
మనువు మనెఁ గూఁతులును దాను మహిసురుండు
కొంతకాలంబు ఘనములోఁ గుత్స లేక 18

అర్థము అంజన + అచల - గండ - శిలలకున్ = కాటుక కొండయొక్క పెద్దఱాలకు, చెలికాఱులు = మిత్రములు, యమ-దూతలకున్ = యముని బంటులకు, అభిధా + అంతరములు = మాఱు పేర్లు.కాళ-రాత్రి-యామములకున్ = చీకటిరేయి జాములకు, ప్రతిబింబములు = ప్రతిమలు (సమానములు), భూతములకున్ = పిశాచములకు, పుత్త్ర - సంతానంబు = సుకుమార సంతతి,

అశుభ - కర్మములకున్ = అమంగళ కార్యములకు, అను + ఆదేశములు = ప్రతిబింబములు, మౌని - శాప + అక్షరములకున్= మునుల యొక్క శాపములందలి అక్షరములకు, సంగడీలు = మిత్రులు (సమానులని భావము)

కలి-కాలమునకున్, దగ్గఱి - చుట్టంబులు = దగ్గఱి బంధువులు, ధూమకేతువులకున్ = తోకచుక్కలకు, తోడు -నీడలు = కూడనుండు నీడలు - సమానములని భావము. అంధకారంబులకున్ = చీకటులకు, విందులు = చుట్టములు (సమాసము లనుట),

అనంగన్, గిరుల యందున్ = కొండలలో, వర్తించు = ఉండునట్టి, చెంచులన్ = బోయలను, ఆశ్రయించి = చేరి, మహిసురుండు = బ్రాహ్మణుడు - సుకుమారుడు, కొంతకాలంబు, మనములోన్ = మనస్సునందు, కుత్స-లేక = నిందలేక, కూతులును - తానున్, మనువు-మనెన్ = కాపురము చేసెను.

తాత్పర్యము: కాటుక కొండ బండలకు మిత్రములును, యముని బంటులకు మాఱుపేరులును, చీకటిరేయి జాములకు ప్రతి బింబములును, పిశాచములకు పుత్త్ర సంతతియును, అమంగళ కార్యములకు సమానులును, మునిశాపాక్షరములకు చెలికాండ్రును, కలియుగమునకు దగ్గఱిచుట్టములును, ధూమ కేతువులకు తోడునీడలును, చీకటులకు చుట్టములును అనునట్లు కొండలలో సంచరించు చెంచుల నాశ్రయించి సుకుమారుడు మనస్సులో నిందలేక కొంతకాలము కన్న కూతులతో కాపురము చేసెను.

విశేషములు: ఈ చెంచుల వర్ణనము కాదంబరిలోని శబర సైన్య వర్ణనమును పోలియున్నది. పోలి యుండుటయేకాదు -అందలి కొన్ని వాక్యములకివి యాంధ్రీకరణములే యనుట గమనింపనగును.

అభిముఖ మాపతన్తం చ తస్మా ద్వనాన్తరా దర్జున భుజ దండ సహ విప్రకీర్ణ మివ నర్మదా ప్రవాహం, అనిలబలచలిత మివ తమాల కాననం, ఏకీభూత మివ కాలరాత్రీణాం యామ సఙ్ఘాతం, అంజన శిలా స్తమ్భ సమ్భార మివ క్షితి కమ్ప విఘూర్ణితం, అన్ధకార పూరమివ రవి కిరణాకులితం, అంతకపరి వార మివ పరిభ్రమన్తం, అవదారిత రసాతల లోద్గత మివ దానవలోకం, అశుభ కర్మ సమూహ మివైకత్ర సమాగతం, అశేష దణ్డకారణ్య వాసి మునిజన శాప సార్థ మివ సఞ్చరన్తం, అనవరత శరనికర వర్షి రామ నిహత ఖర దూషణ బల మివ తదపధ్యానాత్ పిశాచ తా ముపగతం, కలికాల బంధువర్గ మివ ఏకత్ర సఙ్గతం, సలిలావగా హోత్థిత ప్రస్థిత మివ వన మహిష యూథం, అచల శిఖర స్థిత కేసరి కరాకృష్టి పతన శీర్ణ మివ కాలమేఘపటలం, అఖిలరూప వినాశాయ ధూమకేతుజాల మివ సముద్గతం, అన్ధకారి తాశేషకాననం, అనేక సహస్ర సంఖ్యం, అతి భయజనకం, ఉత్పాద వేతాల వ్రాతమివ శబరసైన్య మద్రాక్షమ్.

చెలికా.......శిలలకు: అంజన శిలా........విఘూర్ణితం, యమదూతలకు.... నభిధాంతరములు:అన్తకపరివారమివ....పరిభ్రమన్తమ్ ప్రతి బింబములు.....యామములకు: ఏకీభూతమివ.....యామసఙ్ఘాతమ్ పుత్త్ర సంతానంబు భూతములకు: అనవరత ..... పిశాచతా ముపగతమ్ అశుభకర్మముల కన్వాదేశములు అనవరత....పిశాచతా ముపగతమ్ అశుభకర్మముల కన్వాదేశములు: అశుభకర్మ....సమాగతమ్. మౌని శాపాక్షరములకు సంగడీలు : అశేష దణ్డ...... సఞ్చరన్తమ్. కలికాలమునకు......చుట్టంబులు :కలికాల బన్ధు....సఙ్గతమ్. ధూమకేతువులకుం దోడునీడలు; అఖిలరూ..... ధూమకేతు జాలమివసముద్గతమ్ అంధకారంబులకు విందులు: అన్ధకారపూరమివ \రవి కిరణాకులితమ్.

అన్నిటను సామాన్యధర్మము లోపించుటచే లుప్తోపమాలంకారము. చెలికాఱులు, అభిధాంతరములు, ప్రతిబింబములు పుత్త్రసంతానము, అన్వాదేశములు, సంగడీలు, చుట్టములు తోడునీడలు, విందులు - ఇవి యన్నియు ఇవార్థకములు - ఉపమా వాచకములు ఒకే వస్తువు (చెంచులు) పెక్కింటితో పోల్పబడుటచే నుల్లేఖము. చెలి కాఱులు - చెలికాఁడు (ఏకవ) చెలికాఱు (బహువ)కాకత్తియలు కొండొకవానికి స్వార్థంబునం జూపట్టెడు' బాల తద్ధిత 13. `కాప్రత్యయంబు మీఁది బహువచన లకారంబునకు లఘ్వలఘు రేఫంబులును, లఘురేఫంబునకు ముందు పూర్ణబిందు పూర్వక డకారంబునగు - చెలికాండ్రు, చెలికాఱు ఇచ్చట బహువచనాంతముపై మరల బహువచన ప్రత్యయము వచ్చుట విశేషము. `చెలికాండ్రు' అని సంశ్లిష్ట బహువచనాంత తుల్యమయినచో దానిపై బహువచనము వచ్చి `చెలికాండ్రు రంజనాచలు' అని యున్నచో నిర్బాధము. అన్వాదేశము - పూర్వము చెప్పిన దానినే ఏకార్యము

విధించుటకై మరల చెప్పుట (సూ.ని.) ప్రతిబింబము, సాటి యని భావము. `సీ. వినిమయంబో కాని విధున కన్వాదేశమో కాని యత్రి నేత్రోద్భవునకు' కాశీ. 4,191 సంగడీలు - సంగడి + ఈఁడు - `అటమటాదులకు మతుబర్థంబునం దీవర్ణకంబు పుంస్త్వంబునందగు' `అపదాది స్వరసంధి'-బాల. సంధి. IIసంగడీఁడు (ఏకవ.) - సంగడీలు (బహువ.) విందు = చుట్టము, అతిథి, భోజనము (నానా) మనువు మనెగూఁతులును దాను మహిసురుండు - `ఆత్మార్థంబ భిహితం బగుచోఁ దల్లింగ సంఖ్యాభిదాయి వచనంబు ధాతు విశేషణంబుల కగు' బాల క్రియ 120మనము (రూపాం)-మనసు, మనస్సు `సాంతంబుల తుది సకారంబునకు లోపంబు బహుళంబుగా నగు' బాల తత్సమ. 80

క. ఎనుబది యేఁడుల వార్ధక
మున [1]భ్రాజనశక్తి యుడిగి పో దాతనికిం
దినియెడిది పెద్ద మాంసము
కొనియెడి[2]యది కల్లు మనసు క్రొవ్వెట్టుడుగున్? 19

అర్థము: ఎనుబది యేడుల = ఎనుబదేండ్ల, వార్ధకమునన్ = ముసలితనము నందు, ఆతనికిన్ = ఆ సుకుమారునకు, భ్రాజన-శక్తి =(ప్రకాశించు శక్తి (`ము'పాఠము-ప్రాక్తన-శక్తి = పూర్వపు శక్తి), ఉడిగిపోదు = నశింపదు, తినియెడిది (తినియెడి + అది) = తినునట్టిది, పెద్ద-మాంసము, కొనియెడి + అది = పుచ్చుకొనునది = త్రావునది, కల్లు, మనసు- క్రొవ్వు, ఎట్టు = ఎట్లు, ఉడుగున్ = నశించును ?

తాత్పర్యము: ఆ సుకుమారునకు ఎనుబదియేండ్ల ముసలి వయస్సున సైతము స్త్రీసంగమ శక్తి నశింపదు. అతడు తినునది మాంసము, త్రావునది కల్లు - ఇంక మనసు క్రొవ్వెట్లు నశించును" నశింపదని భావము

విశేషములు: భ్రాజన శక్తి యుడిగిపోవమి యను సమర్థనీయార్థమును మాంసభక్షణ మద్యపానములచే సమర్థించెనుగాన. -కావ్యలింగాలంకారము తినియెడి + అది - `అది యవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగ నగు' బాల. సంధి 45 తిని యెడిది. కొనియెడి + అది - పయి సూత్రముననుసరించి `ఇదంతమగు తద్ధర్మ విశేషణము మీదిది గాన అది శబ్దము నత్వమునకు నిత్యముగ లోపము రావలయును. కాని యిచ్చట కొనియెడి యది యని యుండుట చింత్యము. కొనియెడునది యని యున్నచో నిర్బాధము.

1. ము. ప్రాక్తన. 2. ము. దిది

గీ. కాంచె నిద్దఱు సుతుల న క్కామినులకు
వావి వర్ణంబు మాలిన వద రతండు
శాస్త్రములఁ జెప్పఁ[1]బడిన దోషంబు లెన్ని
యన్నియునుఁ జేసె నాతఁ డేమనంగఁ గలదు ? 20

అర్థము: వావి-వర్ణంబు = వరుస, కులము, మాలిన = లేని, వదర + అతండు = ఆ నీచుడు, - సుకుమారుడు, ఆ + కామినులకున్ = ఆ స్త్రీలకు - కూతులకు, ఇద్దఱు-సుతులన్ = ఇరువురు కొడుకులను, కాంచెన్ = కనెను, శాస్త్రములన్, చెప్పఁబడిన, దోషంబులు, ఎన్ని, ఆతడు, అన్నియును, చేసెన్, ఏమి +అనంగన్ + కలదు = ఏమనుట కేమి యున్నది?

తాత్పర్యము: వావి వరుసలు లేని ఆ నీచుడైన సుకుమారుడు కామినులైన తన కూతులకు నిరువురు కొడుకులను గనెను. అతడు శాస్త్రములందెన్ని విధములయిన దోషములు చెప్పబడినవో, అన్నివిధములయిన దోషములను చేసెను. ఇంక నేమనుట కేమున్నది !

వ. అంత :

తాత్పర్యము: తరువాత.

క. హేమంతము శరదాగమ
సామంతము [2]తుహినకణ విసంస్థులశబరీ
సీమంతము మదనబల
శ్రీమంతము [3]డాసె భువనసీమంతంబై 22

అర్థము: శరద్ + ఆగమ - సామంతము = శరదృతువునకు పొలిమేర నున్నదియు, తుహిన......సీమంతము: తుహిన-కణ = మంచుబిందువులచే, విసంస్థుల = కలతనొందిన, శబరీ = బోయతలయొక్క, సీమంతము = పాపటలు గలదియు, మదన - బల - శ్రీమంతము = మన్మథునియొక్క బలమనెడి సంపద గలదియు, అగు, హేమంతము = హేమంతర్తువు, భువన - సీమంతంబు + ఐ = లోకమునకు సరిహద్దు రేఖయై, డాసెన్ = సమీపించెను.

తాత్పర్యము: శరదృతువునకు పొలిమేఱనున్నదియు, మంచు బిందువులచే కల శబరస్త్రీల పాపటలు గలదియు, మన్మథ బల సంపదగలదియునగు హేమంతము భువనములకు సరిహద్దు రేఖయై సమీపించెను.

---

1. తా. బద్ధ. 2. ము. తుహినకణ విసంజ్ఞిత శబరీ. 3. తా. సకలభువన సీమంతంబై.

విశేషములు: అంత్యప్రాసము `విసంస్థుల' యని పుస్తకమున గలదు. `విసంష్టుల'యని Apteలోను, `విసంష్ఠుల'యని సూ. ని. లోను గలదు.

మ. బలుసు ల్పండెను, దొండముక్కువడియెం బ్రాసంగుచే, ల్పోకమో
కల పూఁబాళల తావిఁ గ్రోలి[1]పొదలెం గౌ బేరదిగ్వాయువుల్,
ఫలినీ వల్లి మతల్లి వల్లరులపైఁ బైపై నలివ్రాతముల్
పొలసె, న్మంచులు రాలె రాత్రి కరిణీ ఫూత్కారవార్బిందువుల్ 23

అర్థము: బలుసుల్ = బలుసు మొక్కలు, పండెను, ప్రాసంగుచేల్ = ప్రాసఁగు వరిచేలు, దొండముక్కువడియెన్ = పండబాఱి యెఱ్ఱని కొనలతో గూడిన గింజలతో నిండియుండెను, పోకమోకల = పూఁబాళల = పోక చెట్లయొక్క కప్పు (డిప్ప)తోడి పూలగుత్తుల యొక్క, తావిన్ = పరిమళమును, క్రోలి - త్రావి, కౌబేర-దిక్ + వాయువుల్ = ఉత్తరదిక్కునుండి వీచు గాలులు, పొదలెన్ = వ్యాపించెను, అలి - వ్రాతముల్ = తుమ్మెదల గుంపులు, ఫలినీ-వల్లి-మతల్లి-వల్లరులపైన్ = శ్రేష్ఠములైన ప్రేంకణపు దీగలపై, పైపైన్ = అధికముగా, పొలసెన్ = వ్యాపించెను, రాత్రి - కరణీ-ఫూత్కార-వార్ + బిందువుల్ = రాత్రియనెడు ఆడేనుగు యొక్క, ఫూత్కృతములందలి, నీటి బిందువులు, అగు, మంచులు, రాలెన్.

తాత్పర్యము: ఆ హేమంత సమయమున బలుసు తుప్పలు పండెను. ప్రాసంగు వరిచేలు పండబాఱి దొండపండువలె నెఱ్ఱని కొనలతో గూడిన గింజలతో నిండియుండెను. పోక చెట్లు డిప్పతోడి పూలగుత్తుల పరిమళమును ద్రావి యుత్తరదిశ నుండి కొండగాలులు వీచెను. తుమ్మెదల గుంపులు ప్రేంకణపుదీగలపై నధికముగా వ్రాలెను. రాత్రి యనెడు నాడేనుగు చేయు ఫూత్కారముల నీటి బిందువుల వంటి మంచుబిందువులు రాలెను.

విశేషములు: హేమంతర్తు విశేషము లీ పద్యమున స్వభావ రమణీయముగా వర్ణింపబడెను గావున నిందలి యలంకారము స్వభావోక్తి `మంచులు రాలె రాత్రి కరిణీ ఫూత్కార వార్బిందువుల్ - రాత్రి యనెడు కరణి, ఫూత్కార వార్బిందువులనెడు మంచులు - రూపకాలంకారములు. పూఁబాళలు - పూవు+పాళలు `సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చు మీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు' పూ + పాళలు `బాల.సంధి. 36 `లుప్తశేషంబునకుం బరుషములు పరము లగునపుడు నుగాగమంబగు' పూ+న్ + పాళలు - బాల సంధి 37 ద్రుతకార్యము-బాల.సంధి. 16,17కౌబేర = కుబేర సంబంధి, కుబేరు డుత్తర దిగధిపతి కావున కౌబేర దిక్కనగా నుత్తరదిక్కు.

1. ము. పొరలెం.

చ. కలమవనాళికాకణిశకంటకకోటులచేతఁ జూడ్కి కిం
పలవడిచెన్ ధరిత్రి తుహినాగమవేళఁ దటాక సారణీ
సలిలము పాఱి పండిన యజాంగల సీమము లెన్ని యన్నిటం
దలమగు సీతుపేర్మి గరు దాల్చిన భావము ప్రస్ఫుటంబుగన్ 24

అర్థము: ధరిత్రి = భూమి, తుహిన + ఆగమ - వేళన్ = హేమంత సమయమున, తటాక -సారణీ-సలిలము = చెఱువులక్రింది కాలువలందలి నీరు, పాఱి = ప్రవహించుటచే, పండిన, అజాంగల - సీమములు = పల్లపు నేలలు, ఎన్ని = ఎన్నో, అన్నిటన్ = అన్నిటియందును, దలము + అగు = అధికమగు, సీతు - పేర్మిన్ = చలిపెంపు చేత, గరు + తాల్చిన - భావము = గగుర్పొడిచిన భావము = రోమాంచితత్త్వము, ప్రస్ఫుటంబుగన్ = మిక్కిలి స్పష్టము అగునట్లు, కలమ-వన+ఆళి = వరి చేల వరుస, కాకణి శ - కంటక - కోటుల చేతన్ = వెన్నులందలి నూగు (?) అనెడి ముండ్ల సమూహముల చేత, చూడ్కికిన్ = చూచుటకు, ఇంపు + అలవడిచెన్ = అందగించెను.

తాత్పర్యము: హేమంత సమయమున చెఱువుల క్రింది కాలువలందు నీరు ప్రవహించుటచే పల్లపు నేల లన్నియును పండినవి. వానియందు వరిచేలు వెన్నుల నూ గనెడి ముండ్లు గలిగియుండెను. వాని చేత భూమి చలిపెంపు వలన గగుర్పాటు చెందినట్లు స్పష్టమై చూడ రమణీయముగా నుండెను.

విశేషములు: `కాకణిశ' శబ్దము నిఘంటువులందు కనుపట్టినది కాదు. సందర్భానుసారముగా నర్థము చెప్పబడినది. చలి అధికమగుచో నొడలు గగుర్పొడుచుట సహజము. కాలువలందలి నీటిచే పల్లపు నేలల వరిచేలు బాగుగా పండి నూగు పట్టెను. ఆ నూగు ముండ్లవలె నుండి చలి పెంపువలన భూమి గగుర్పాటు చెందినట్లు చూడ రమణీయముగా నుండెను అలంకార ముత్ప్రేక్ష. జాంగలము =- మెరకనేల (శ.ర.) అజాంగల - పల్లపునేల.

క. కలవింక కలకలాకుల
వలభీ గర్భములు సౌధవాటములు పురం
బులయందుఁ దుహిన[1]వేళలఁ
జలి [2]గులగులఁ గూయునట్టి చందం బొందెన్ 25

అర్థము: పురంబులయందున్ = పట్టణములందు, కలవింక = పిచ్చుకల యొక్క, కలకల = కలకల ధ్వనులచేత, ఆకుల = నిండిన, వలభీ - గర్భములు

1. తా. వేళన్ 2. తా. కులంకుల

= ముంజూరుల లోపలి భాగములు గలవి, అగు, సౌధ - వాటములు = మేడల ఆవరణములు, తుహిన - వేళలన్ = మంచు సమయములందు - హేమంతమునందు, చలిన్ = చలిచేత, గులగులన్ = గులగులమని, కూయు + అట్టి, చందంబు = విధము, ఒందెన్ = పొందెను.

తాత్పర్యము: పట్టణములలోని మేడల ఆవరణములు పిచ్చుకల కలకలా రావములతో నిండిన ముంజూరులలోపలి భాగములు గలవై హేమంతమున చలిచే గులగులకూయుచున్నవా యను నట్లుండెను.

విశేషములు: గులగులఁ గూయు - చలిగా నున్నప్పటి కూత అనుకరణము అలంకార ముత్ప్రేక్ష.

క. పెనుఁజలి గడగడ [1]వణఁకుచు
వనదేవత [2]దంతవీణ వాయించె నొకో
యన మోక ప్రేంకనంబుల
[3]ననగుత్తుల మొరసె నలిగణము విపినములన్ 26

అర్థము: పెను + చలిన్ = మిక్కుటమగు చలిచేత, గడగడ - వణకుచున్ = వడకుచు, వన-దేవత, దంత-వీణ =ముఖవీణ-మోర్సింగు, వాయించెన్ + ఒకో = వాయించెనా, అనన్ = అనగా, విపినములన్ = అడవులందు, మోక-ప్రేంకనంబుల = మొక్క ప్రేంకనముల (ప్రియాళువుల) యొక్క, నన-గుత్తులన్ = పూలగుత్తులందు, అలి-గణము = తుమ్మెదల గుంపు, మొరసెన్ = ధ్వని చేసెను.

తాత్పర్యము: మిక్కుటమగు చలికి గడగడ వడకుచు వన దేవత దంతవీణ వాయించెనా యనునట్లు అడవులలోని మొక్క ప్రేంకనముల పూల గుత్తలందు తుమ్మెదల గుంపులు రొద చేసెను.

విశేషములు: దంతవీణ = ముఖవీణ (మోర్సింగు),చలిమిక్కుటమై నప్పుడు ప్రాణులు పండ్లు చప్పుడు చేయుచు వణకుట సహజము. ఆ పండ్ల చప్పుడును దంతవీణ వాయించుటగా కవి చెప్పుచున్నాడు. అలంకార ముత్ప్రేక్ష.

శా. బింబోష్ఠీకుచకుంభభారము లురః పీఠంబులన్ హత్తి మో
దంబారన్ మృదుకేలి శయ్యల శుభాంతర్గర్భ గేహంబులం
దాంబూలీ దళ పూగపూరిత ముఖుల్ ధన్యాత్మకుల్ శీతకా
లం బెంతేనియు నిద్రవోదురు నిశల్ సంభోగలీలావధిన్ 27

1. తా. వడఁకుచు. 2. తా.దండవీణ. 3. తా.ననగుత్తులు.

అర్థము: తాంబూలీ - దళ -పూగ - పూరిత - ముఖల్ = తమల పుటాకులు, వక్క అనువానితో నిండిన ముఖములు (నోరులు)గలవారు, అగు, ధన్య + ఆత్మకుల్ = అదృష్టవంతులు, శీత-కాలంబు = చలికాలము (నందు), నిశల్ = రేలు, సంభోగ-లీలా + అవధిన్ = రతి క్రీడల నడిమి కాలమునందు, శుభ + అంతః + గర్భ-గేహంబులన్ = మంగళకరములైన లోపలి భాగములు గల యిండ్లయందు, మృదు-కేలి-శయ్యలన్ = మెత్తని సెజ్జలందు బింబ + ఓష్ఠీ- కుచ-కుంభ-భారములు = దొండపండువంటి క్రింది పెదవిగల స్త్రీల కడలవల వంటి స్తనముల బరువులు, ఉరస్ (రః) + పీఠంబులన్ = (తమవైన), వక్షః స్థలములందు, హత్తి = ఉంచి, మోదంబు + అరన్ = సంతోషము నిండునట్లుగా, ఎంత +ఏనియున్ = మిక్కిలి, నిద్ర + పోదురు = నిద్రింతురు.

తాత్పర్యము: శీతకాలపు రేల నిండ్లలోపలి భాగములందలి మెత్తని పాన్పులపై రతిక్రీడల వ్యవధియందు తమలపుటాకులు వక్క నములుచు నదృష్టవంతులు దొండపండువంటి క్రింది పెదవి గల తమ ప్రియురాండ్ర స్తనభారములు తమ వక్షఃస్థలముల నుంచి సంతోషాతిశయముతో నిద్రింతురు.

విశేషములు: శుభాంతర్గర్భ గేహంబులన్ - ఇంటి లోపలి భాగములందు చలిలేక వెచ్చగా నుండును. తాంబూల సేవనము గూడ వెచ్చదనమును కలిగించును. సంభోగ లీలావధిన్ = రతిక్రీడకు రతిక్రీడకు నడిమి కాలమున - అలయిక పోవుటకు బింబోష్ఠీ కుచ కుంభ భారములు - ప్రియురాలి స్తనభారమును దన వక్షమునకు హత్తించుటవలనను వెచ్చగానుండును. మృదుకేళిశయ్యల - మెత్తని పఱపు సుఖ నిద్రకు హేతువు. ఇన్ని విధముల చలిని పోగొట్టుకొని వెచ్చగా నిద్రింప గలుగుటచేతనే వారు ధన్యాత్మకులు' ఇది ఉపరతియో, సహజ రతియో ఏదయిన గావచ్చును.

బింబ + ఓష్ఠీ - సమాసమున అకారాంత పదములకు ఓతుః, ఓష్ఠః అను పదములు పరములగునపుడు వృద్ధ్యాదేశము వైకల్పికము. వృద్ధి రానపుడు పరరూప మేకాదేశమగును. ఉరస్ + పీఠము - సకారమునకు విసర్గాదేశము. ఈ విసర్గము పకార పరకము గావున నుపధ్మానీయము. అంతస్ + గర్భ - స్వస్,అంతస్, ప్రాతస్, పునస్, అహస్ శబ్దముల సకారమునకు క, ఖ, చ, ఛ, ట, ఠ, త, థ, ప, ఫ, శ, ష, స వర్ణములకంటె భిన్నములైన హల్లులును, అచ్చులును పరములగునపుడు రేఫమాదేశ మగును - అంతర్గర్భ శీతాకాలంబు, నిశల్ - `కాలాధ్వములకుం బ్రాయికంబుగాఁ బ్రథమయగు' బాల. కారక. 25 అలంకారము స్వభావోక్తి.

ధనదశుద్ధాంతకాంతాపయోధర [1]భార
సంవ్యాన పల్లవస్రంసనములు,
కైలాసగిరికూటకల్పద్రుమాటవీ
కుసుమగుచ్ఛ రజోఽవ[2]గుంఠనములు,
చంద్రభాగా సరిత్సలిలవీచీఘటా
ప్రేంఖోలికా కేళి రింఖణములు,
[3]రాధా పురీ హర్మ్య రత్న హేమగవాక్ష
సంవేశనక్రియాసౌష్ఠవములు

వలనుగాఁ జంపకారణ్య [4]వాటిఁ దఱిసి,
కాశి యొరసి, కళింగాంధ్రదేశ సరణి
దక్షిణము సాఁగెను సపాద లక్షశైల
[5]కటకబంధవు దగ్దిశాఘంధవహుండు 28

అర్థము: సపాద లక్ష-శైల-కటక-బంధుండు = ఒక లక్షయు నిరువది యైదు వేల కొండల నడిమి భాగములకు చుట్టము, అగు, ఉదక్ =దిశా-గంధవహుఁడు = ఉత్తరదిక్కునుండి వీచు వాయువు.

ధనద.......స్రంసనములు: ధనద = కుబేరుని యొక్క, శుద్ధాంత - కాంతా = అంతఃపురస్త్రీల యొక్క, పయోధర = పాలిండ్ల యొక్క, భార = బరువు నందలి, సంవ్యాన - పల్లవ = చిగురువంటి ఉత్తరీయము యొక్క, స్రంసనములు = జాఱుటలు. కైలాస......వగుంఠనములు : కైలాస-గిరి = కైలాస పర్వతము యొక్క కూట = శృగమునందలి, కల్పద్రుమ = అటవీ = కల్పవృక్షముల యడవి యందలి, కుసుమ-గుచ్ఛ పూల గుత్తుల యొక్క, రజస్ = అవగుంఠనములు = పుప్పొడుల మేలు ముసుగులు.

చంద్రభాగా - సరిత్ = చంద్రభాగా నదియందలి, సలిల-వీచీ = నీటి యలల యొక్క, ఘటా = సమూహము యొక్క ప్రేంఖోలికా - కేలి = ఊయలాటల, రింఖణములు = ప్రాకుటలును, రాధాపురీ ....సౌష్ఠవములు: రాధాపురీ = రాధాపురము నందలి, హర్మ్య - రత్న = శ్రేష్ఠములయిన మేడల యందలి, హేమ - గవాక్ష + బంగరు కిటికీల యందు, సంవేశన - క్రియా = సురత క్రీడల యొక్క, సౌష్ఠవములు = చక్క దనములును, వలనుగాన్ = ఒప్పిదముగా, చంపక + అరణ్య - వాటిన్ = సంపెగ వనముల ప్రదేశమును, తఱిసి = ప్రవేశించి, కాశి, ఒరసి = చేరి, కళింగ

1. తా.భాస. 2. తా.వకుంఠనములు. 3. తా. రాధరాపురి. 4. తా.పాళి. 5. తా. కటక బంధుండు తద్దిశా.

+ ఆంధ్ర - దేశ-సరణిన్ = కళింగ, ఆంధ్ర దేశముల మార్గమున, దక్షిణము సాఁగెను = దక్షిణమునకు వీచెను.

తాత్పర్యము: ఒక లక్షయు నిరువదియైదు కొండల నడిమి భాగములకు చుట్టమైన ఉత్తర దిగ్వాయువు కుబేరుని యంతఃపుర స్త్రీల పాలిండ్లపైగల చివురులవంటి యుత్తరీయముల జాఱుటలును, కైలాస పర్వత శిఖరములందలి కల్పవృక్ష వనముల పూలగుత్తుల పుప్పొడుల మేల్మిసుగులును, చంద్ర భాగానదీ జలతరంగ సమూహముల ఊయలాటల ప్రాకుటలును, రాధాపురమునందలి మేలైన మేడల బంగరు సోరణము లందు రతిక్రీడల చక్కదనములును, గలిగి సంపెగ తోటలందు ప్రవేశించి, కాశి చేరి, కళింగాంధ్ర దేశముల మార్గమున దక్షిణముగా వీచెను.

విశేషములు: ఆ యుత్తర దిగ్వాయువులకు `ధనదశుద్ధాంత.....రజో² వ గుంఠనము' లను దానిచే సౌరభమును, `చంద్రభాగా సరిత్ .....రింఖణము'లను దానిచే శైత్యమును లభించి వాని యుత్తమత్వము తెలియుచున్నది.

గీ. చలి ప్రవేశించు నాగులచవితినాఁడు
మెఱయు వేసవి రథసప్తమీదినమున
నచ్చసీతు ప్రవేశించు బెట్టు పెరిఁగి
[1]మార్గశిరపౌషమాసాల మధ్యవేళ 29

అర్థము: నాగుల చవితినాడు, చలి, ప్రవేశించున్, రథ సప్తమీ-దినమునన్ = రథసప్తమినాడు, వేసవి, మెఱయున్=ప్రకాశించును, మార్గశిర-పౌష మాసాల = మార్గశిరము, పుష్యము అను మాసముల యొక్క, మధ్య-వేళన్ = నడిమి సమయమున అచ్చ-సీతు = అచ్చమైన చలి, పెచ్చుపెరిగి = మిక్కిలి అతిశయించి, ప్రవేశించున్.

తాత్పర్యము: నాగుల చవితినాడు చలి మొదలిడును. రథ సప్తమినాడు వేసవి మొదలగును. మార్గశిర పుష్యమాసముల నడిమి కాలమున చలి మిక్కిలి మిక్కుటముగా నుండును.

విశేషములు: నాగుల చవితి కార్తీక శుద్ధ చతుర్థి. మాఘ శుద్ధ సప్తమి రథసప్తమి మార్గశిరము పుష్యము అను మాసముల నడిమి కాలమున చలి విపరీతముగా నుండును అచ్చము + సీతు = అచ్చ సీతు = కేవలము చలి `అచ్చము'లో ముపర్ణకమునకు వృత్తియందు వైకల్పికలోపము. మార్గ శిరము - మార్గశీర్షము - మృగశిర నక్షత్రముతో గూడిన పున్నమి గల నెల పౌషము - పుష్యనక్షత్రముతో గూడిన పున్నమి గల నెల

---

1. తా. మార్గపౌషమాసంబుల మధ్యవేళ

గీ. ఇనుఁడు కోదండరాశి మీఁ దెక్కువేళ
నిక్షుకోదండవల్లి యెక్కిడు మరుండు
సమదవేదండసమ మహాసత్త్వుఁ డయ్యు
జనుఁడు కోదండమును బోలెఁదనువు వంచు. 30

అర్థము: ఇనుఁడు = సూర్యుడు, కోదండ రాశి మీదన్ = ధనూరాశి మీద, ఎక్కువేళన్, ధనూరాశిలో ప్రవేశించునప్పుడు, మరుండు = మన్మథుడు, ఇక్షు-కోదండ-వల్లి = తీగవంటి చెఱకు వింటిని, ఎక్కు + ఇడున్ = ఎక్కుపెట్టును, జనుఁడు = మనుష్యుడు, స-మద-వేదండ-సమ-మహత్ (మహా)-సత్త్వుండు = మదముతోగూడిన, ఏనుగుతో, సమానమైన, గొప్ప బలము గలవాడు అయ్యున్ = అయినను, కోదండమును + పోలెన్ = వింటి వలె, తనువు = శరీరము, వంచున్.

తాత్పర్యము: సూర్యుడు, ధనూరాశిలో ప్రవేశించినప్పుడు మన్మథుడు చెఱకువింటి నెక్కు పెట్టును. ఆ సమయమున మద గజముతో సమానమైన గొప్ప బలము గలవాడైనను జనుడు శరీరమును వింటివలె వంచును.

విశేషములు: జనుడు శరీరమును వంచుట చలిపెక్కువ వలన. ఇనుడు `కోదండ' రాశిలో ప్రవేశించినప్పుడు మరుడు ఇక్షు `కోదండ'ము నెక్కిడును జనుడు `కోదండము' వలె మేను వంచును. అని `కోదండ' శబ్దమును పలుమాఱులుపయోగించుట రమ్యము.

గీ. ఇండ్ల మొదలను నీ రెండ [1]నీరికలను
ననుఁగుఁదమ్ముడు నన్నయు నాటలాడు
నత్తయును గోడలును గుమ్ములాడుఁ గుమ్ము
[2]గాంచుచోటికి మకరసంక్రాంతివేళ 31

అర్థము: మకర-సంక్రాంతి - వేళన్ = మకర సంక్రమణ సమయమున ఇండ్ల - మొదలను - ఇండ్ల ముంగిట, నీ రెండన్ = లే యెండలో, ఈడికలను = గడ్డి మొదలగు వానిని దెచ్చెడి బండి వంటి సాధనములందు, అనుఁగు + తమ్ముడున్ + అన్నయున్ + ప్రియమైన తమ్ముడును, అన్నయును, ఆటలాడున్, అత్తయును, కోడలును కుమ్ము-కాఁచు-చోటికిన్-చలికాఁచుకొనుఉముక నిప్పున్నచోటికి, కుమ్ములు + ఆడున్ = పోట్లాడును.

తాత్పర్యము: మకర సంక్రమణ సమయమున అన్నదమ్ములింటి ముంగిట నీరెండలో గడ్డిబండి మీద నాడుకొందురు. అత్తయును కోడలును చలికాచుకొనుటకై

1. ము. నీడికలను. 2. తా. గాయు చోటికి

కుమ్ము ఉన్నచోటి కొఱకు కలహింతురు.

విశేషములు: సూర్యుడు ధనూరాశి నుండి మకర రాశిలో ప్రవేశించుటకు మకర సంక్రాంతి యనబడును. నాటి నుండి యుత్తరాయణము ప్రారంభ మగును. ఆ సమయమున చలి మిక్కుటముగా నుండును. అందుచేతనే అన్నదమ్ములు పని పిల్లలు వెచ్చగా నుండునని యీరెండలో నాడుకొనుట. గడ్డి బండియు వెచ్చదనము గలిగించును `కుమ్ము'వెచ్చగా అత్తయు, గోడలు పోట్లాడుట స్వభావోక్తి. ఈ రెండు నీరెండ -రెండును గలవు. ఈ రికలను' అనుపాఠము కంటె, ము. పాఠమగు `ఈడికలను'అను పాఠమే మేలనిపించినది. అందుచే అది స్వీకరింపబడినది. ఈ రికలనగా గుడ్డపేలికలు, మొలకలు-ఇక్కడ సరిపడదు. అనుఁగు తమ్ముడు-ఉదంత స్త్రీ సమమునకు పరుషము పరమగు చుండగా నుగాగమము - బాల. సంధి. 25.అనుఁగు + ను + తమ్ముఁడు - ద్రుతకార్యము - బాల సంధి. 16, 17 అనుఁగుఁ దమ్ముఁడు అనుఁగుఁ దమ్ముండు నన్నయు నాటలాడు, అత్తయును గోడలును గుమ్ములాడు: వీనిలో బహువచన కర్తల కేకవచన క్రియలుండుట చింత్యము. ఆత్మార్థ మభిహితమైనచో నిర్బాధమై యుండెడిది.

సీ. కాశిలోఁ జక్రపుష్కరిణి [1]దుష్కృత శుష్క
గహనావళీ దావదహన జిహ్వఁ
గుక్కుటేశ్వర వరకుండి [2]పిఠాపురి
నఘతమస్కాండ చండాంశుదీప్తి
దక్షవాటంబు సప్తర్షి గోదావరిఁ
గలిదోషపాషాణకు లిశధార
గౌతమీతటిని మార్కండేయు పురిమ్రోల
దురితాహిసంఘాతగరుడమూర్తి

గీ. నిన్నిటను దీర్థ మాడంగ నేఁగుదెంతు
రఖిలమునులుఁ బ్రభాతసంధ్యాగమముల
గ్రహగణేశుండు కోదండరాశి బాసి
మకరమున కేఁగుదేరఁగ మాఘవేళ 32

అర్థము: గ్రహ -గణ + ఈశుండు = గ్రహముల సమూహమునకు ప్రభువైన సూర్యుడు, కోదండ-రాశిన్ = ధనూరాశిని, పాసి = విడిచి, మకరమునకున్ = మకరరాశికి, ఏగు దేరఁగన్ = రాగా, మాఘవేళన్ = మాఘమాసమునందు - అఖిల-మునులున్ = ఎల్ల మునులును, ప్రభాత - సంధ్యా + ఆగమములన్ = తొలి

1. ము. దుష్కర శుష్క. 2. ము. పీఠపురి శంకాతమస్కాండ

సంజలందు. కాశిలోన్, దుష్కృత.....జిహ్వాన్ : దుష్కృత = పాపములనెడి, శుష్క = ఎండిన, గహన + ఆవళీ = అడవుల వరుసకు, దావ - దహన - జిహ్వాన్ - కార్చిచ్చు జ్వాలయైన, చక్ర పుష్కరిణిన్ = చక్రపుష్కరిణీ తీర్థమందును. అఘ....దీప్తిన్ అఘ = పాపములనెడి, తమస్ + కాండ = చీకటుల సమూహమునకు, చండ + అంశు - దీప్తిన్ =సూర్యకాంతి యైన, కుక్కుటేశ్వర ......పిఠాపురిన్ = కుక్కుటేశ్వరుని శ్రేష్ఠమైన కుండము గల పిఠాపురమునందును, కలి - దోష - పాషాణ - కులిశ - ధారన్ = కలికాలమునందలి, పాపములనెడి ఱాలకు, వజ్రాయుధపుటంచు అగు, దక్షవాటంబు-సప్త + ఋషి-గోదావరిన్ = దక్షరామమునందలి సప్తగోదావరము నందును.

కలి-దోష-పాషాణ-కులిశ-ధారన్ = కలికాలము నందలి, పాపములనెడి, ఱాలకు, వజ్రాయుధపుటంచు అగు, దక్షవాటంబు- సప్త + ఋషి-గోదావరిన్ = దక్షారామము నందలి సప్తగోదావరము నందును.

మార్కండేయు-పురి- మ్రోలన్ = మార్కండేయుని పురము (రాజమహేంద్రవరము) నెదుట, దురిత.......మూర్తిన్ : దురిత = పాపములనెడి, అహి = పాముల యొక్క, సంఘాత = సమూహమునకు, గరుడ - మూర్తిన్ = గరుత్మద్రూపము, అగు, గౌతమీ-తటినిన్ = గోదావరీ నది యందును. ఇన్నిటను - ఇన్ని తీర్థములందును, తీర్థము + ఆడంగన్ - స్నానము చేయుటకు, ఏఁగుదెంతురు - వత్తురు.

తాత్పర్యము: గ్రహరాజగు సూర్యుడు ధనూరాశిని విడిచి మకరరాశిలో ప్రవేశించు మాఘమాసమున తొలిసంజ వేళల మునులంద ఱును కాశిలోని పాపాటవీ దావాగ్ని జ్వాలయైన చక్ర పుష్కరిణి యందును, పీఠికాపురిలోని పాపాంధకార పటలీ సూర్యకాంతియగు కుక్కుటేశ్వర స్వామి కుండమునందును (పాదగయా తీర్థమునందు), కలికాలజ దోషములనెడి పాషాణములకు వజ్రపుటంచు అగు దక్షవాటీ సప్తగోదావరము నందును, - ఇట్లు ఇన్ని తీర్థములందును స్నానము చేయవత్తురు.

విశేషములు: దుష్కృత....జిహ్వా, అఘ...... దీప్తి, కలిదోష ...... ధార, దురితాహి ...... గరుడమూర్తి - ఇవియన్నియు రూపకాలంకారములు. తీర్థమాడంగ - తీర్థమందాడంగ -`ఒక్కొక్క చో జడంబు సప్తమికిం బ్రథమయు నగు' ప్రౌఢ. కారక . 20

మ. పఱివోయెం దుహినంబు, పండె వరి, యిప్పల్వ్రాసె శైలంబులన్
[1]గఱిగట్టెన్ వలరాజు తేఁటి యెఱకం గాండప్రకారంబులం,
జఱపించెన్ గ్రహరాజు [2]మాఠరకునిం జక్రాద్రికూటంబునం
దఱిఁ గౌబేరదిగంతరిక్షపథయాత్రాజైత్ర తుత్తుంభమున్ 33

1. తా. గరినుండెన్. 2. తా. మాఠరునిచే

అర్థము: తుహినంబు = మంచు, పఱివోయెన్ = క్షీణించెను, వరి, పండెన్, శైలంబులన్ = కొండలయందు, ఇప్పల్ = ఇప్పచెట్లు, పూసెన్ = పుష్పించెను, వలరాజు = మన్మథుడు, కాండ - ప్రకాండంబులన్ = శ్రేష్ఠములైన బాణములందు, తేఁటి + ఎఱకన్ = తుమ్మెద ఱెక్కతో, గఱి + కట్టెన్ = ఱెక్కగట్టెను, గ్రహరాజు = సూర్యరాజు, తఱిన్ =(ఆ) సమయమునందు, చక్ర + అద్రి - కూటంబునన్ = చక్రవాళ పర్వత శిఖరమున, మాఠరకునిన్ = మాఠరునిచేత (మాఠరుడు సూర్యుని పరివార గణములో నొక్కడు) కౌబేర .....తుత్తుంభమున్ కౌబేర - దిక్ = కుబేర సంబంధమయిన దిక్కు (ఉత్తరదిక్కు) నందలి, అంతరిక్ష - పథ = ఆకాశ మార్గము యొక్క, యాత్రా ప్రయాణమునందు, జైత్ర - తుత్తుంభమున్ = జయభేరిని, జఱిపించెన్ = జరుగునట్లు చేసెను (మ్రోయించెను)

తాత్పర్యము: సూర్యుడు మకరరాశిలో ప్రవేశించు మాఘమాసమున మంచు తగ్గెను. వరి పండెను. కొండలలో నిప్ప చెట్లు పుష్పించెను. మన్మథుడు తుమ్మెద ఱెక్కతో తన శ్రేష్ఠములైన బాణములకు ఱెక్క గట్టెను ఆ సమయమున సూర్యుడు తనయనుచరుడగు మాఠరునిచేత చక్రవాళ పర్వత శిఖరమున నుత్తర దిక్కునందలి గగనమార్గయాత్రలో జయభేరిని మ్రోయించెను.

విశేషములు: మాఘమాసమున కనుపట్టు ప్రకృతి దృశ్యములను శ్రీనాథుడిందు వర్ణించెను. చక్రాద్రి కూటము - చక్రవాళ పర్వత శిఖరము - చక్రవాళము - లోకాలోకపర్వతము - ఈ పర్వతము భూమండలము చుట్టును కడపటి యెల్లగాఁ చుట్టుకొనియున్నదని పురాణప్రసిద్ధి.

వ. వెండియుం జకోరలోచనల కుచమండలంబులకుం గర్పూర ఖండ క్షోదంబుల మేదించిన చందనానులేపనైపథ్యం బపథ్యం బయ్యె. రథ్య వేగంబున ననూరు సారథి రథంబు ప్రతివిఘట్టనక్షుణ్ణ నక్షత్రక్షోద పాళీ ఛ్ఛుళుకితోర్ధ్వాండభిత్తియై యుత్తరాయణంబు గైకొని కులూత శాతోదరీకపోల ముకుర బింబంబులం బ్రతిబింబించె. సవ్యాపసవ్యక్రమంబునం జక్ర మిథునంబుల నెట్టుకొని బిట్టేసియేసి విసిగి నిల్చి మనోభవుండు నిగిడించిన నిట్టూర్పునుంబోలె నిశాసమయంబుల నిండు వెన్నెలలలోనం జిన్ని చిన్ని నులివేఁడి వడి పొడచూపె. కేదారక్షేత్రంబులం గలమ గోపిక లొడికంబుగాదంచి (సడించిన) నిద్దంబులగు[1]దుద్దుగడు ప్రాసంగుఁ బ్రాలు సద్యోమార్జనా వశంబున నతి స్నిగ్ధ వర్ణంబులై కర్ణాటకదేశ [2]తాటంకినీ దశన వజ్రాంకురంబుల కాంతి సంపదలం[3] దలపించె. నీహార వ్యపాయంబున బహుళ పక్ష ప్రదోషంబులయందుం దారకంబులు వికచకుముద కోరకంబులు *(కెలంకులం)

1. తా. మది పుడుం బ్రాలు నిగ సిగని డాలు సద్యోమార్జావకాశంబున విశుద్ధస్నిగ్ధ వర్ణంబులగు
2. తా. తాటంకినుల, 3. ముదలంచె * తాళపత్ర గ్రంథమున లేదు.

గొలం కుల లోనం ప్రతిబింబించి మదకల కలహంస త్రోటి కోటీ విఖండిత మృణాల దండ ఖండంబుల భావంబు భజించె. హృదయోత్కంఠాతిరేకంబునం గంతమూల కఠోర కాలకూట విషమషీ కళంక పంకచ్ఛాయచ్ఛటా[1]కంఠోక్త భువనరక్షా దాక్షిణ్యుండు దాక్షారామ భీమేశ్వరుండు దక్షిణ జలధి వేలా వలయితంబులగు నేలా లవంగ లవలీ మతల్లికా కుడుంగ క్రోడంబులం గ్రీడించుటకునై సారంగలోచనలుం దానును గొరంగివెడలె [2]వలవలని మఁచుఁమప్పర ముసురు జడిం దడిసి జడను పడి[3]వేగుఁ బోకల పోఁకపూఁబాళల పరిమళంబులం [4]బుక్కిలించి యుమియుచు, బక్కణంబులలోన నల్ల నల్లం బొలుపారు నడవి కరువలి యసమ సమ విషమ కుసుమ ఫల క్రీడా మతల్లికల [5]మల్లు పెనంగి డస్సిన భిల్ల పల్ల వాధరల గల్ల ఫలకంబులం గ్రొత్త యుదయించు చెమట చిత్తడి యుడిపె. కాశి శ్రీశైల [6]కుంభ ఘోణ కోణార్క కాంచీ కాంచన సభా కాళహస్తి కురుక్షేత్రాది పుణ్య స్థానంబులం గూప వాపీ తటాక కుండికా [7]ప్రవణ స్రోతస్వినులం బ్రత్యూషకాలం బులం బరమర్థి సార్థంబు తీర్థం బాడె నివ్విధంబున మాఘ మాస వాసరంబులు వసంత సమయ సామంతంబులు జరుగుచుండ నాచండాలాది మనుష్యులకు భుక్తి ముక్తులు ప్రసాదింపంజాలి మాహేశ్వరులకు మహోత్సవంబు, పాశుపతులకుం బ్రీతి, కాలాముఖుల కవలంబంబు, మునులకు మనికి, జటాధారుల కాధారంబు, పరివ్రాట్టులకుం బట్టుఁ గొమ్మ, వేదాంతులకు సంతోషం, బాగమికులకు భాగ ధేయంబు, మాంత్రికులకు మనువు, తాంత్రికులకుం దావలంబు, పౌరాణికులకుం [8]బ్రాణం, బౌపనిషదుల కుపాయంబు, ముముక్షులకు రక్ష, శంభునకు విస్రంభస్థానంబు, శాంభవికి [9]హృత్కరంబంబు, హేరంబునకుం బ్రియంబు, తండువునకుం బండువు, కుమారస్వామికిం బ్రేమాస్పదంబు, భృంగిరిటికిం దంగెటి జున్ను, దురిత తరు షండ ఖండనంబునకు గండ గొడ్డలి, యఘ పటల తిమిర [10]సముదాయాహిమ ఘృణి సంతానంబు, సంతాపశాంతికి భాగీరథీ ప్రవాహంబు శివరాత్రి పుణ్యకాలం బేతెంచిన. 34

అర్థము: వెండియుం......బపథ్యం బయ్యెఁ; వెండియున్ = మఱియును, చకోర - లోచనల = వెన్నెల పులుగుల వంటి కన్నులు గల వారి యొక్క - స్త్రీలయొక్క, కుచ-మండలములకున్ = స్తనప్రదేశములకు, కర్పూర-ఖండ-క్షోదంబులన్ = కప్పురపు ముక్కల పొడులతో, మేదించిన = పూసిన, చందన + అనులేప - నైపథ్యంబు - మంచిగందపు బూత అలంకారము, అపథ్యంబు = హితము కానిది, అయ్యెన్.

రథ వేగంబున.....బ్రతిబింబించె: రథ-వేగంబునన్ గుముల వేగముచే, అనూరు -సారథి -రథంబు = అనూరుడు సారథిగాగల - (సూర్య)రథము, ప్రతి విఘట్టన =

1. కుందు భువన. 2. తా.పల పలని. 3. ము. వ్రేఁకలగు పోఁక. 4. తా. బుక్కిలించు మియుచు 5. తా. మల్లు వెనంగి. 6. తా. కుంభ కోణ కోణార్క. 7. ప్రస్రవస్రోతస్వినులం 8. తా. బ్రాణం. 9. ము. హృదయోత్కంఠయు. 10. తా. సముదయాహి

ఒరయికచేత, క్షుణ్ణ = నలగ గొట్టబడిన, నక్షత్ర = నక్షత్రముల యొక్క, క్షోద - పాళీ = పిండియొక్క రాశిచేత, చుళుకిత = పుడిసిలింపబడిన, ఊర్ధ్వ + అండ - భిత్తి + ఐ = బ్రహ్మాండపు పయిగోడ గలదియై, ఉత్తరాయణంబు = ఉత్తరప్రయాణము, కైకొని = స్వీకరించి, కులూత = కులూతదేశపు, శాత +ఉదరీ =స్త్రీల (పలుచని యుదరము గలది = స్త్రీ) కపోల - ముకుర- బింబంబులన్ = అద్దములవంటి చెక్కిళ్ల ప్రదేశములందు, ప్రతిబింబించెన్ = ప్రతిఫలించెను.

సవ్యాప సవ్య......పొడచూపె : సవ్య + అపసవ్య - క్రమంబునన్ = ఎడమ, కుడి వరుసను, చక్ర - మిథునంబులన్ = జక్కవ కవలను, నెట్టుకొని = పూని, బిట్టు + ఏసి + ఏసి = మిక్కిలి కోట్టి కొట్టి, విసిగి, నిల్చి, మనోభవుండు = మన్మథుడు, నిగిడించిన = విడిచిన, నిట్టూర్పునున్ + పోలెన్ = దీర్ఘ నిశ్వాసము వలె, నిశా - సమయంబులన్ = రాత్రి వేళలందు, నిండు- వెన్నెలలోనన్, చిన్ని-చిన్ని = కొంచె కొంచెము, నులి-వేడి-వడి = ఇంచుక .వెచ్చదనపు దీక్షత, పొడచూపెన్ = కనుపట్టెను.

కేదార.........దలపించె : కేదార = క్షేత్రంబులన్ = వరి మడులయందు, కలమ - గోపికలు = వరులనుగాచు స్త్రీలు, ఒడికంబుగాన్ = ఒప్పుగా, దంచి, సడించిన = బాగు చేసిన, నిద్దంబులు + అగు = నున్ననివి యగు, దుద్దుగడు - ప్రాసంగు + ప్రాలు = ప్రాసంగు భియ్యము, సద్యస్ (కః)+మార్ధనా-వశంబునన్ = అప్పుడే బాగు చేసినవగుటచే, అతి-స్నిగ్ధ-వర్ణంబులు + ఐ = మిక్కిలి తెల్లనివై, కర్ణాట-దేశ-తాటంకినీ =కన్నడ దేశపు స్త్రీల యొక్క, దశన-వజ్ర+అంకురంబుల = వజ్రపు మొలకలవంటి పండ్లయొక్క, కాంతి-సంపదలన్ = కాంతి వైభవములను, తలపించెన్ = స్ఫురింపజేసెను.

నీహార.......భజించెన్ : నీహార-వ్యవసాయంబునన్ = మంచు తొలగుట చేత, నిర్మలంబులు + ఐ = స్వచ్ఛములయి, బహుళ - పక్ష - ప్రదోషంబులయందున్ = కృష్ణ పక్షపు ముని మాపుల యందు, తారకంబులు = నక్షత్రములు, వికచ-కుముద-కోరకంబులు = వికసించిన కలువపూల మొగ్గలు, కెలంకులన్ = పార్శ్వములందు కొలంకుల లోనన్ = సరస్సులలో, ప్రతిబిబింబించి, మద-కల-కలహంస-మదముచే అవ్యక్త మధుర ధ్వనిగల, రాయంచల యొక్క, త్రోటి - కోటీ = ముక్కుల కొనలచేత, విఖండిత = ముక్కలు చేయబడిన, మృణాల-దండ-ఖండంబుల - భావంబు = తామరతూటి ముక్కలయొక్క, భావమును, భజించెన్ = పొందెను. హృదయోత్కంఠా .... వెడలె : హృదయ + ఉత్కంఠా + అతి రేకంబునన్ = మనసు తహతహ యొక్క అతిశయముచేత, కంఠమూల = కుత్తుకయందలి, కఠోర = తీక్ష్ణమైన, కాలకూట - విష-మషీ = కాలకూట మనెడి విసపు మసి యనెడు,

కళంక = మచ్చయనెడు బురుదయొక్క, ఛాయ + ఛటా = కాంతుల సమూహము చేత, కంఠ + ఉక్త = ఎలుగెత్తి చెప్పబడిన, భువన-రక్షా-దాక్షిణ్యుండు = లోక రక్షణమునకైన దయగలవాడు, అగు, దాక్షారామ - భీమేశ్వరుండు = దక్షారామమునందలి భీమేశ్వర స్వామి, దక్షిణ - జలధి -వేలా - వలయితంబులు = దక్షిణపు సముద్రము యొక్క తీరము చేత చుట్టబడినవి, అగు, ఏలా - లవంగ - లవలీ-మతల్లికా - కుడుంగ -క్రోడంబులన్ =ఏలకి, లవంగములు అను శ్రేష్ఠములైన తీగల పొదరిండ్ల యొక్క, లోపలి భాగములందు, క్రీడించుటకున్ + ఐ = విహరించుట కొఱకు, సారంగ-లోచనలున్ = స్త్రీలును (లేడికన్నుల వంటి కన్నులు గలవారు = స్త్రీలు), తానును, కోరంగి - వెడలెన్ = కోరంగికి వెడలెను.

వలవలని........యుడిపె: వలవలని = వలవల కురియునట్టి ('పలపలని' = పలపల కురియునట్టి అను తా. పాఠము మేలనిపించు చున్నది), మంచు +తుప్పర - ముసురు - జడిసెన్ = మంచు బొట్టుల జడివానయందు, తడిసి, జడను- పడి=మందమయి, వేగు +పోకల = వేకువ సమయములందు (వ్రేఁకలు + అగు = బరువులగు) పోఁక - పూఁబాళల = పోఁక పూలగుత్తుల యొక్క, పరిమళంబులన్ = సువాసనలను, పుక్కిలించి = పుక్కిటఁ బట్టి (గ్రహించి), ఉమియుచున్ =విడుచుచు, పక్కణంబుల లోనన్ = బోయపల్లెలలో, అల్లనల = మెల్లగా, పొలుపారు = ఒప్పునట్టి, అడవి, - కరువలి = అడవిగాలి, అసమ = సాటిలేని, సమ-విషమ- కుసుమ-ఫల-క్రీడా-మతల్లికలన్ = సమములు, సమములు కానివి యైన పూల, పండ్ల శ్రేష్ఠములైన ఆటలతో. మల్లు-పెనంగి = మల్లయుద్ధము చేసి, డస్సిన = అలసిన, భిల్ల = పల్లవాధరల (పల్లవ + అధర = స్త్రీ) = బోయతలయొక్క, గల - ఫలకంబులన్ = పలకవలె చదునైన, చెక్కిళ్లయందు, క్రొత్త + ఉదయించు = క్రొత్తగా పుట్టు చెమట-చిత్తడి = చెమటవలని కొంచెపాటి తడి, ఉడిపెన్ = పోగొట్టెను.

కాశి........తీర్థంబాడె : కాశి, శ్రీశైల, కుంభ ఘోణ, కోణార్క, కాంచీ, కాంచనసభా, కాళహస్తి, కురుక్షేత్ర + ఆది -పుణ్య-స్థానంబులన్ -పుణ్యక్షేత్రములందు, కూప-వాపీ- తటాక-కుండికా-ప్రస్రవణ -స్రోతస్వినులన్ =నూతులు, దిగుడు బావులు, చెఱువులు, కుండములు, చెలమలు, నదులు అను వానియందు, ప్రత్యూష-కాలంబులన్ = ఉదయ సమయములందు, పరమ + ఋషి - సార్థంబు = మహామునుల సమూహము, తీర్థంబు + ఆడెన్ = స్నానము చేసెను.

ఇవ్విధంబున.........బేతెంచిన: ఈ + విధంబునన్, మాఘ-మాస-వాసరంబులు = వసంతమాసపు దినములు, వసంత - సమయ -సామంతంబులు = వసంత కాలమునకు చేరువ నున్నవి, జరగుచున్ + ఉండన్ - జరుగుచుండగా, ఆ - చండాల + ఆది - మనుష్యులకున్ = మాలవాండ్రు మున్నుగా గల మనుష్యులకు,

భుక్తి - ముక్తులు = కూడును, మోక్షమును, ప్రసాదింపన్ + చాలి = అనుగ్రహింప సమర్థమయి, మహేశ్వరులకున్ = శైవులకు, మహత్ (మహా) + ఉత్సవంబు = గొప్ప పండుగను, పాశుపతులకున్ = శివభక్తులకు (పాశుపతాగమాను యాయులకు), ప్రీతి = సంతోషమును, కాలాముఖులకున్, అవలంబంబు = ఆధారమును, మునులకున్, మనికి = జీవనమును, జటా-రులకున్ = జడదారులకు, ఆధారంబు, పరివ్రాట్టులకున్ = యతులకు, పట్టు + కొమ్మ = ఆధారమును, వేదాంతులకున్, సంతోషంబు, ఆగమికులకున్ = వేదపండితులకు, భాగధేయంబు = భాగ్యమును, మాంత్రికులకున్ = సిద్ధాంతులకు, తావలంబు = ఉనికిపట్టును, పౌరాణికులకున్, ప్రాణంబు, ఔపనిషదులకున్ = ఉపనిషద్వేత్తలకు, ఉపాయంబు, ముముక్షులకున్ = మోక్షమును గోరువారికి, రక్ష, శంభునకున్ = ఈశ్వరునకు, విస్రంభ - స్థానంబు = విశ్వాస స్థానమునున్ శాంభవికిన్ = పార్వతికి, హృద్ + కరంబంబు = మనస్సునకు ప్రీతికరమైన దధి మిశ్ర సక్తు విశేషమును, హేరంబునకున్ = విఘ్నేశ్వరునకు, ప్రియంబు, తండుపునకున్ = నందికేశ్వరునకు, పండువు = ఉత్సవము, కుమార - స్వామికిన్, ప్రేమ + ఆస్పదంబు = ప్రీతిస్థానము, భృంగిరిటికిన్ = భృంగికి (శివపరిచారకుడు) తంగెటి -జున్ను (తంగెడు + జున్ను) = తంగెడు పూల తేనె (సులభ ప్రాప్యమనుట),దురిత-తరు-షండ-ఖండనంబునకున్ =పాపములనెడి చెట్ల సమూహము యొక్క నఱకుటకు, గండగొడ్డలి, అఘ - పటల - తిమిర -సముదాయ + అహిమ-ఘృణి-సంతానంబు-పాపముల యొక్క సమూహ మనెడి చీకట్ల యొక్క, సమూహమునకు, సూర్యుల సమూహమును, సంతాప-శాంతికిన్ = మిక్కిలి తాపము యొక్క ఉపశమమునకు, భాగీరథీ - ప్రవాహంబు = గంగానదీ ప్రవాహము, (అగు), శివరాత్రి-పుణ్య-కాలంబు = శివరాత్రి యను పవిత్ర సమయము,ఏతెంచినన్ = రాగా.

తాత్పర్యము: మఱియును మాఘమాసమునందు స్త్రీలు తమ పాలిండ్లపై కప్పురపుపొడులతోడి గందపుపూత నిష్టపడరైరి. గుఱ్ఱముల వేగముచే సూర్యరథము క్రిందబడి నలగిపోయి పొడియైన నక్షత్రములు బ్రహ్మాండపుపయిగోడ నాక్రమింపగా, నా రథము ఉత్తర దిక్కుగా ప్రయాణించి, కులూత దేశపు స్త్రీల అద్దమువంటి చెక్కిళ్లయందు ప్రతిఫలించెను. మన్మథుడు ఎడమ కుడి వరుసను జక్కవ కవలను బూని కొట్టి కొట్టి విసిగి, విడిచిన నిట్టూర్పువలె రాత్రి వేళలందు నిండు వెన్నెలలో నించుక వేడిమి పొడచూపెను. వరి మడులలో వరుల కావలి కత్తెలు ఒప్పుగా దంచి బాగుచేసిన ప్రాసంగు బియ్యము మిక్కిలి స్నిగ్ధములై కన్నడదేశపు స్త్రీల వజ్రపు మొలకలవంటి దంతముల కాంతిని స్ఫురింపజేసెను. మంచు తొలగుటచే నిర్మలములయి కృష్ణ పక్షపు ముని మాపులయందు నక్షత్రములును, వికసించిన కలువపూ మొగ్గలును పార్శ్వములందలి సరస్సులలో ప్రతిబింబించి మదముచే నవ్యక్త మధుర ధ్వని గల రాయంచల ముక్కుల కొనలచే ఖండితములయిన

తామరతూటి ముక్కలవలె కనుపట్టెను. మనసు తహతహ పెంపుచే కుత్తుకయందలి కాలకూట విషమనెడు కళంకముచే ఎలుగెత్తి చాటబడిన లోకరక్షణార్థమైన దయగల దక్షారామ భీమేశ్వరస్వామి దక్షిణ సముద్ర తీరస్థలములయిన ఏలాలవంగలతల పొదరిండ్లలో విహరింప స్త్రీలతో కోరంగి వెడలెను. మంచుబిందువుల జడివానయందు తడియుటచే మందములయి, వేకువసమయముల పోక పూలగుత్తుల పరిమళముల పుక్కిలించి యుమియుచు బోయపల్లెలలో మెల్లగా వీచు నడవి గాలులు పుష్పఫల క్రీడలచే డస్సిన బోయతల చెక్కిళ్లయందలి క్రొత్తగాపుట్టు చెమటచిత్తడి ముడిపెను. కాశి, శ్రీశైలము, కుంభకోణము, కోణార్కము, కంచి, కాంచన సభ, కాళహస్తి, కురుక్షేత్రము అను పుణ్య స్థలములందలి నూతులు, దిగుడు బావులు, చెఱువులు, కుండములు, చెలమలు, నదులు అనువాని యందు ఉదయసమయముల మహామునులు స్నానము చేసిరి.

ఈ రీతిగా వసంతమునకు చేరువలైన మాఘమాసపు దినములు జరుగుచుండగా చండాలురు మున్నగు మనుష్యులకు భుక్తి ముక్తుల నొసగ సమర్థమయి, మహేశ్వరులకు, మహోత్సవమును, పాశుపతులకు ప్రీతియు, కాలాముఖులకు అలంబును, మునులకు మనికియు, జడదారులకు ఆధారమును, యతులకు పట్టు గొమ్మయు, వేదాంతులకు సంతోషమును, ఆగమికులకు భాగ్యమును, మాంత్రికులకు మనువును, తాంత్రికులకు తావలమును, పౌరాణికులకు ప్రాణమును, ఉపనిషద్వేత్తలకు ఉపాయమును, ముముక్షువులకు రక్షణమును, శంభునకు విశ్వాస స్థానమును, పార్వతికి విఘ్నేశ్వరునకు ప్రియమును, నందికేశ్వరునకు పండువును, కుమారస్వామికి ప్రీతిని, భృంగికి తంగెటి జున్నును, అయి, పాపములనెడి చీకట్లను నశింప జేయ సూర్య సమూహమును, సంతాపోపశమనమునకు భాగిరథీ ప్రవాహమును అగు శివరాత్రి పుణ్యకాలము రాగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: కపోలముకుర -రూపకము, నిట్టూర్పునంబోలె-ఉత్ప్రేక్ష. దశన వజ్రాంకురముల-ఉపమిత సమాసము- వజ్రాంకురముల వంటి దశనములందు నీహార వ్యపాయంబున.......భజించె-ఉపమ. సారంగలోచనమలుం దానును గోరంగి వెడలె - 1 ఆత్మార్థంబ భిహితం బగుచోఀ దల్లింగ సంఖ్యాభిధాయి వచనంబు ధాతు విశేషణంబుల కగు' బాల క్రియ 120వలవలని మంచుఀ దుప్పర....యుడిపె. స్వభావోక్తి. తీర్థంబాడె. - తీర్థమందాడె జడ సప్తమికిం బ్రథమ-ప్రౌఢ కారక 20 దురిత తరు షండ ఖండనంబునకు గండ గొడ్డలి - రూపకము. అఘపటల తిమిర సముదాయాహిమ ఘృణి సంతానము-రూపకము. సంతాపశాంతికి భాగీరథీ ప్రవాహము రూపకము.

సీ. ఆ వణిక్పథమున కనతిదూరంబున
గవ్యూతియెడ నుదక్పశ్చిమమునఁ,
బర్వతోపత్యకాపర్యంతతటమున,
సికతా[1]తి నిర్మలక్షేత్రసీమ,
మాలూరతరుషండ మధ్యభాగంబునఁ,
బ్రవణాపగాపార్శ్వభూమిఁ
గుసుమవాటికలలో గువలయాంభోరుహ
కుముదమండితమైన కొలనితోడఁ

గీ. గోటతో, గోపురములతోఁ గుట్టిమాట్ట
మండపంబులతో మహామహిమ నొప్పు
[2]నాది మధ్యాంత నాగేశ మనఁగ నొక్క
పుణ్యతీర్థంబు [3]త్రైలోక్యపూజితంబు 35

అర్థము: ఆ - వణి క్పథమునకున్ = ఆ వణిక్పథపురమునకు, అనతి - దూరంబునన్ = ఇంచుక దవ్వున, గవ్యూతి + ఎడన్ = రెండు కోసుల దూరమున (గవ్యూతి = ఒక కోసు-వాచ), ఉదక్ + పశ్చిమమునన్ = వాయవ్యమున. పర్వత + ఉపత్యకా-పర్యంత-తటమునన్ = కొండ చేరువ నేల పరిసర భూమియందు, సికతా + అతి-నిర్మల -క్షేత్ర-సీమన్ = ఇసుక చే మిక్కిలి నిర్మలమైన క్షేత్రమందు, మాలూర-తరు-షండ-మధ్య-భాగంబునన్ =మారేడు చెట్ల సమూహము నడిమి ప్రదేశమునందు, ప్రవణ + ఆపగా - పార్శ్వ -భూమిన్ = ప్రవణ నది ప్రక్కనేలయందు, కుసుమ-వాటికలలోన్ = పుష్పోద్యానములందు, కువలయ + అంభోరుహ-కుముద-మండితము = నల్ల కలువలు, తామరలు, తెల్ల కలువలు అను వానిచే అలంకరింపబడినది, ఐన, కొలనితోడన్ = సరస్సుతోను, కోటతోన్, గోపురములతోన్, కుట్టిమ + అట్ట - మండపంబులతోన్ = నెలకట్టులు, అంగడులు, మండపములు అనువానితో, ఆది మధ్యాంతనాగేశము + అనంగన్, త్రైలోక్య పూజితంబు = ముల్లోకములచేత పూజింపబడినది, (అగు), ఒక్క-పుణ్య-తీర్థంబు, మహత్ (మహా)-మహిమన్ = గొప్ప మహిమతో, ఒప్పున్.

తాత్పర్యము: ఆ వణిక్పథ పురమున కించుక దవ్వున రెండు కోసుల దూరములో వాయవ్యదిశను కొండ చేరువనేల పరిసరమున, మారేడు చెట్ల నడుమ, ప్రవణ నదీ పార్శ్వ భూమిని, పుష్పోద్యానములలో కువలయములు, పద్మములు, కుముదములు నను వానిచే నలంకరింపబడిన కొలనితోను, కోటతోను, గోపురములతోను,

1. తా. వినిర్మల 2. తా. నాదిమధ్యంబు 3. తా. నాగేశపూజితంబు

నెలకట్టులు,అంగడులు, మండపములు అనువానితోను గూడి ఆది మధ్యాంత నాగేశమను పేర ముల్లోకములచే పూజితమైన యొక్క పుణ్యతీర్థము మహామహిమతో నొప్పును.

విశేషములు: గవ్యూతి - `గవ్యూతి స్స్త్రీ క్రోశయుగమ్' గవోః క్రోశయోః యూతిః మిశ్రణం గవ్యూతిః, గోవనగా క్రోశము, రెండు క్రోశముల కూటమి గవ్యూతి- 'అమరము. ఒక కోసు అని వాచస్పత్యము. ఉపత్యక-`ఉపత్య కాద్రే రాసన్నా భూమి రూర్ధ్వమధిత్యకా' ఉప సమీపే భూమి రుపత్యకా - పర్వత సమీప భూమి - అమరము పర్వతముమీద నున్న భూమి అధిత్యక కువలయ - కువలయ మిన్దీవరం చ నీలాబ్జమ్ - అమరమాల. నల్ల కలువ. కుముద - `సితే కుముద కైరవే "కౌ మోదత ఇతి కుముదమ్' భూమి యందు మోదించునది - తెల్ల కలువ.

గీ. అంద శేషప్రతిష్ఠతుం డమృతదివ్య
లింగమంగళమూర్తి ఖట్వాంగపాణి
యర్ధశశిమౌళి నాగేశ్వరాహ్వయుండు
ప్రతివసించు ననేకకల్పములనుండి 36

అర్థము: అందున్ = ఆ ఆది మధ్యాంత నాగేశ మనెడి పుణ్య క్షేత్రమునందు, శేష-ప్రతిష్ఠతుండు=శేషుని చేత ప్రతిష్ఠింప బడినవాడు, అమృత-దివ్య-లింగ-మంగళ-మూర్తి = అమృతము, దివ్యమునైన లింగము యొక్క శుభకరమైన ఆకారము గలవాడు, ఖట్వాంగ-పాణి = ఖట్వాంగ మనెడి ఆయుధము చేతియందు గలవాడు, నాగేశ్వర + ఆహ్వయుండు = నాగేశ్వరుడను పేరుగలవాడు, (అగు),అర్ధ-శశి-మౌళి = అర్ధచంద్రుడు శిరస్సున గలవాడు - శివుడు, అనేక -కల్పముల నుండి = పెక్కుయుగముల నుండి, ప్రతివసించున్ = నివసించును.

తాత్పర్యము: ఆదిమధ్యాంత నాగేశ మనెడి యా పుణ్యక్షేత్రమున శేషునిచే ప్రతిష్ఠింపబడినవాడును, అమృతము, దివ్యమునైన మంగళకర లింగాకారము గలవాడును, ఖట్వాంగమనెడి ఆయుధమును చేత ధరించినవాడును, నాగేశ్వరుడను పేరుగల వాడును అగు శివుడు పెక్కు యుగములనుండి నివసించును.

వ. ఆ శివరాత్రిపుణ్యకాలంబున 37

తాత్పర్యము: ఆ శివరాత్రి పవిత్రకాలమునందు-తరువాతి పద్యముతో నన్వయము.

సీ. శివగంగఁ బుణ్యాభిషేకంబుఁ దీర్చిరి,
దరి నొనర్చిరి [1]మూఁడు తర్పణములు,

1. పుణ్యతర్పణములు.

ధరియించి రంబునిర్ధౌతవస్త్రంబుల,
నాదరించిరి బ్రహ్మయజ్ఞతంత్ర,
మర్ఘ్యాంజలి క్షేపణానంతరమ్మునం
దొనరించి రంశుమంతున కుపాస్తి
గృహదేవతార్చనక్రియ లాచరించిరి,
యభ్యాగతులకు నర్హణలు నడిపి

గీ. రవని[1]సురు లెల్ల నాగేశ్వరాలయమున
కేఁగు దెంచిరి ప్రణమిల్లి రీశ్వరునకు,
(జాగరమునకు) నాలుగుజాలుఁ బూజ
[2]కాదిసంకల్ప మొనరించి రభవు మ్రోల 38

అర్థము: అవని సురులు + ఎల్లన్ = బ్రాహ్మణులందఱును, నాగేశ్వర + ఆలయమునకున్, ఏఁగుదెంచిరి = వచ్చిరి, శివగంగన్ = శివగంగయందు, పుణ్యా + అభిషేకంబున్ + పవిత్ర స్నానమును, తీర్చిరి = చేసిరి, దరిన్ = ఒడ్డునందు, మూఁడు - తర్పణములు, ఒనర్చిరి = చేసిరి. అంబు - నిర్ధౌత - వస్త్రంబులన్ = నీటియందు బాగుగా నుదుకబడిన వస్త్రములను, ధరియించిరి = తాల్చిరి, బ్రహ్మయజ్ఞ - తంత్రము = బ్రహ్మయజ్ఞ మనెడి తంత్రమును, ఆదరించిరి = చేసిరి. అర్ఘ్య + అంజలి-క్షేపణ + అనంతరమ్మునందున్ = అర్ఘ్యపు దోసిలి నిచ్చిన పిమ్మట, అంశుమంతునకున్ = సూర్యునకు (కిరణములు గలవాడు), ఉపాస్తి - పూజ, ఒనరించిరి = చేసిరి. గృహ-దేవతా + అర్చన-క్రియలు = ఇలువేల్పుల పూజలనెడి పనులు, ఆచరించిరి, అభ్యాగతులకున్ = వచ్చినవారికి, అర్హణలు =పూజలు నడిపిరి.

ఈశ్వరునకున్, ప్రణమిల్లిరి = నమస్కరించిరి, నాలుగు-జాలున్ = నాలుగు జాములును జాగరమునకున్ = మేలుకొనుటకు, అభవు - మ్రోలన్ = ఈశ్వరు నెదుట, పూజకున్, ఆది-సంకల్పము = ప్రథమ సంకల్పము, ఒనరించిరి = చేసిరి.

తాత్పర్యము: ఎల్ల బ్రాహ్మణులును నాగేశ్వరాలయమునకు వచ్చిరి. వారు శివగంగయందు పవిత్రస్నానములు చేసిరి. తీరమున మూడు తర్పణములు గావించిరి. ఉదికిన వస్త్రములను ధరించిరి. బ్రహ్మయజ్ఞతంత్రమును నెఱపిరి. సూర్యు నర్ఘ్య ప్రదానపూర్వకముగా నుపాసించిరి. గృహదేవతల నర్చించిరి. అభ్యాగతులను పూజించిరి. ఈశ్వరునకు ప్రణమిల్లిరి. రాత్రి నాలుగు జాములును జాగరము చేయుటకు నీశ్వరుని మ్రోల పూజకు ప్రథమసంకల్పమును చేసిరి.

1. తా. బుధులెల్ల 2. ము. నాది

విశేషములు: అభ్యాగతుండు-తిథి, పర్వము, ఉత్సవము మొదలగు సందర్భములందు ద్రవ్యాపేక్షతో వచ్చినవాడు అతిథి = తిథ్యాది నిమిత్తము లేకుండ క్షుత్పిపాసా నివారణార్థము వచ్చినవాడు- భోజన సమయమున వచ్చువాడు

జాలు జాములు-జాము+లు `బహువచనంబు పరంబగునపు డావు ప్రభృతుల తుది యక్షరంబునకు లోపంబు విభాష నగు' బాల అచ్చిక. 22

గీ. ఆదరంబున సమ్మార్జనానులేప
ధూపపటువాసనలు తైలదీపములును
సంఘటించిరి వివిధసంస్కారవిధుల
బ్రాహ్మణులు నర్హులైనట్టి పౌరజనులు 39

అర్థము: బ్రాహ్మణులున్, అర్హులు + ఐన + అట్టి = తగినవారగు, పౌర - జనులున్ = పురజనులును, ఆదరంబునన్ = ఆదరముతో, సమ్మార్జన +అనులేప - ధూప -పటు-వాసనలు = తుడుచుట, పూయుట, ధూపముల తీక్ష్ణములైన వాసనలు, తైల - దీపములును = నూనె దీపములును, వివిధ -సంస్కార-విధులన్ = వివిధములైన సంస్కారములతో, సంఘటించిరి = కూర్చిరి.

తాత్పర్యము: బ్రాహ్మణులును, అర్హులైన పురజనులును ఆదరముతో తుడుచుట, పూయుట, ధూపములు వేయుట, నూనె దీపములను వెలిగించుట అనువానిని వివిధసంస్కారములతో కూర్చిరి.

సీ. కాంస్యతోరణమాలికలు సంఘటించిరి
ప్రాసాదగోపురాభ్యంతరముల,
రంభాతరుస్తంభసంభారములు సము
త్పాటించి రొగిఁ బ్రతి ద్వారమునను,
బూజోపకరణ పాత్రీజాత మఖిలంబు
సంస్కరించిరి భస్మసలిలశుద్ధిఁ
గరమొప్పు వృషభపుంగవకేతనంబులు
నిలువంగఁ బెట్టిరి వలభులందుఁ

గీ. గమల నీలోత్పలంబులుఁ గర్ణికార
[1]మాలతీకుందములు హేమమరువకములు
మల్లికా కింశుకము లపామార్గ వకుళ
పాటలంబులుఁ గూర్చి రపారములుగ 40

---

1. తా. మాలతీ కందుక హేమాంబుమరువకములు.

అర్థము: ప్రాసాద - గోపుర + అభ్యంతరములన్ = దేవాలయములలోను, గోపురములలోను, కాంస్య - తోరణ - మాలికలు = కంచు తోరణముల మాలలు, సంఘటించిరి = కూర్చిరి. ప్రతి-ద్వారమునను = ద్వార ద్వారమునందును, ఒగిన్ = క్రమముగా, రంభా - తరు-స్తంభ-సంభారములు = అరటి చెట్ల భస్మ-సలిల-శుద్ధిన్ =భస్మ మనెడి నీటితో పవిత్రము చేయుటచే, సంస్కరించిరి = చక్కజేసిరి.కరము + ఒప్పు = మిక్కిలి ఒప్పునట్టి, వృషభ-పుంగవ-కేతనంబులు = శ్రేష్ఠములయిన వృషభ ధ్వజములు, వలభుల + అందున్ = ఆలయమున నడి కొప్పులందు, నిలువంగన్ + పెట్టిరి.

కమల-నీల + ఉత్పలంబులున్ = తామరలు, నల్ల కలువలును, కర్ణికార - మాలతీ-కుందములున్ = కొండ గోగుపూలు, మాలతీ పుష్పములు, మొల్ల పూలును, హేమ - మరువకములున్ = సంపెంగలును (ఉమ్మెత్తలును), మరువకములును, మల్లికా - కింశుకములున్ = మల్లెలును, మోదుగుపూలును, అపామార్గ -వకుళ-పాటలంబులున్ = ఉత్తరేనులు, పొగడలు, కలిగొట్టుపూలును, అపారములుగన్ = అధికముగా, కూర్చిరి.

తాత్పర్యము: దేవాలయమునందును, గోపురమునందును కంచు తోరణముల మాలలు కట్టిరి. ప్రతిద్వారమునందును అరటికంబములు నెలకొల్పిరి. పూజా సాధనములు గల పాత్రముల సమూహము నంతను భస్మమనెడి జలముతో శుద్ధి చేసి సంస్కరించిరి. ఆలయపు నడి కొప్పులందు వృషభధ్వజములు నిలువ బెట్టిరి. తామరలు, నల్లకలువలు, కొండగోగులు, మాలతులు, మొల్లలు, సంపెంగలు, మరువములు, మల్లెలు, మోదుగులు, ఉత్తరేనులు, పొగడలు, కలిగొట్టు పూవులు అధికముగా కూర్చిరి.

గీ. అపుడు సుకుమార కాహ్వయుం[1]డపర సంజ
నేఁగుదెంచెను నాగేశ్వరేశు గుడికిఁ
బుష్పవాటికలోఁ [2]గమ్మపువులఁ గోసి 41
పొలఁతులకు నిద్దఱకుఁ గొంచుఁబోవఁ దలఁచి

అర్థము: అపుడు, సుకుమారక + ఆహ్వయుండు = సుకుమారుడను పేరు గలవాడు, అపరసంజన్ = సాయంసంధ్యవేళ, పుష్ప-వాటికలోన్ = పూదోటలో, కమ్మ-పూవులన్ = వాసనగల పువ్వులను, కోసి, పొలతులకున్ = స్త్రీలకు (భార్యలకు), ఇద్దఱకున్ = ఇరువురికిని, కొంటున్ + పోవన్ + తలంచి = తీసికొని పోవనెంచి, నాగేశ్వర + ఈశు-గుడికిన్ = నాగేశ్వరేశ్వరాలయమునకు, ఏగుదెంచెను = వచ్చెను.

1. తా. డదరు నజ్జ. 2. తా. గొమ్మపువుష

విశేషములు: అపర సంజ - సంధ్య - (ప్రకృతి) -సంజ (వికృతి) కేవల సంస్కృత శబ్దమును వికృతి శబ్దమతో సమసింపజేయుటచే దుష్టము. అపర సంధ్య అనుచో నిర్బాధము కొంచున్ = కొనుచున్ `చువర్ణకంబు పరంబగునపు డన్వాదుల కుత్వలోపంబేని నుస్థానంబున బిందువేని వి భాష నగు' బాల. క్రియ. 55 ఏగుదెంచెను - `తెంచు ధాతు వగ్వాదుల కనుప్రయుక్తంబగు' బాల. క్రియ 110 `అభ్యాగతి నరుగ్వాదుల కయ్యాది యనుప్రయుక్తంబగు నగుచోఁ గువర్ణంబు విభాషను లోపించు'బాల.క్రియ.111ఏతెంచెను (రూపాం.)

క. కుడిచేత మాసఖండము
[1]లెడకేలను మద్యరససహితమగు కంచుం
గుడుకయు ధరించి మదమున
వడ వణఁకులు గొనుచు నతఁడు వచ్చెన్ గుడికిన్ 42

అర్థము: అతడు = ఆ ,సుకుమారుడు, కుడిచేతన్ = కుడిచేతితో, మాంస -ఖండములు = మాంసపుముక్కలు, ఎడ-కేలను = ఎడమ చేతితో, మద్య-రస-సహితము + అగు = కల్లుతో గూడినది అగు, కంచు + కుడుకయున్ = కంచు పాత్రమును, ధరించి = తాల్చి, మదమునన్ = మత్తుతో, వడ-వణంకులు + కొనుచున్ = మిక్కిలి వడకుచు, గుడికిన్, వచ్చెన్.

తాత్పర్యము: సుకుమారుడు కుడిచేతితో మాంసపు ముక్కలను, ఎడమ చేతితో కల్లుతో గూడిన కంచు పాత్రమును పూని మత్తుతో మిక్కిలి వడకుచు నాగేశ్వరాలయమునకు వచ్చెను.

విశేషములు: కంచు + కుడుక ఉదంత స్త్రీ సమంబునకుం బరుషము పరమగుచుండఁగా నుగాగమమును, (బాల. సంధి. 25), పిమ్మట ద్రుతకార్యమును (బాల. సంధి. 16, 17)కంచుంగడుక

వ. జన్మాంతరస్థుండు వోలె, రూపాంతరగతుండు వోలె, నావిష్టుండు వోలె, భూతాధిష్ఠితుండు వోలె, గ్రహగృహీ తుండు వోలె, [2]నున్మత్తుండునుం బోలె మదిరా మదాతి రేకంబునం దన్ను దా నెఱుంగక పరిసర లతా కంటకాను షజ్యమానాంశుకోత్తరీయుండును, నజ్ఞాత సమ విషయ మేదినీ భాగ విన్యాస ప్రస్ఖలిత పాదద్వయుండును నై పలిత పాండురంబులగు శిరోరుహంబులు విరిసి వీఁపునం బడ నొయ్యనొయ్యన నేతెంచి నిర్లజ్జుండును నిస్స్నేహుండును నృశంసుండును నగు నక్కర్మ చండాలుండు గర్భ గేహంబునకుం జక్కం గట్టెదుర నిలిచి రక్త కమల దళ చ్ఛాయంబులగు కన్నులు దెఱచి విఘూర్ణమాన తార కంబైన

1. తా. పెడ 2. తా. ఉన్మత్తుండపోలె

[1]వికారాలోకనంబున నలవోకయుం బోలె నిర్మల స్ఫటిక మండ పాధ్యాసీనుండును, నమృతమయ జ్యోతిర్లింగ మూర్తియు, ముక్తాఫల ధవల కాంతియుం ద్రిభువన వందిత చరణుండును, జరాచరగురుండును నగు నాగేశ్వరుని దర్శించి యమ్మహా దేవు[2]మౌళి కపాల మాలికా మండన ఖండేందు[3] శకలంబులకు గగన గంగా ప్రవాహ డిండీర ఖండంబులకు నుష్ణీష ఫణి ఫణా ఫలకంబులకుం జెలికారంబు సేయంజాలి పాంచజన్య సహోదరంబు లన, దుగ్ధాంబు రాశి హృదయంబు లనం, జంద్రికా [4]శరణంబు లన [5]నంగఝాట్ట హాసచ్ఛేదంబులన, మెండుకొని యున్న పుండరీకంబుల పూజ గనుగొని వెండియు 43

అర్థము: జన్మ + అంతరస్థుండు + పోలెన్ = మఱియొక జన్మ మెత్తిన వానివలెను, రూప + అంతర - గతుండు + పోలెన్ = మఱియొక రూపమును పొందిన వాని వలెను, ఆవిష్టుండు + పోలెన్ = భూతాదులచే గ్రహింపబడిన వానివలెను, భూత + అధిష్ఠితుండు + పోలెన్ = భూతములు పట్టుకొనినవానివలెను, గ్రహ -గృహీతుండు + పోలెన్ = గ్రహములచే పట్టుకొనబడిన వాని వలెను, ఉన్మత్తుండునున్ + పోలెన్ = వెఱ్ఱియెత్తినవాని వలెను, మదిరా - మద + అతిరేకంబునన్ = కల్లు వలని కైపు యొక్క విజృంభణము చేత, తన్నున్ + తాన్ + ఎఱుంగక.

పరిసర-లతా-కంటక + అనుషజ్యమాన + అంశుక + ఉత్తరీయుండును = సమీపములైన తీగలు, ముండ్లు అనువానికితగులుకొనుచున్న, పై బట్ట కలవాడును, అజ్ఞాత-సమ-విషమ-మేదినీ-భాగ-విన్యాస-ప్రస్ఖలిత-పాద-ద్వయుండునున్ = తెలియబడని సమము సమముకానిది అగు భూ భాగమునం దుంచుటచే జాఱుపాటు నొందిన రెండు పాదములు గలవాడును, ఐ, పలిత - పాండురంబులు = నరయుటచే తెల్లనైనవి, అగు, శిరోరుహంబులు = తలవెండ్రుకలు, విరిసి = విడిపోయి, వీపునన్ = వీపునందు, పడన్ = పడగా, ఒయ్యనన్ + మెల్లమెల్లగా, ఏతెంచి = వచ్చి, నిర్లజ్జుండును = సిగ్గులేనివాడును, నిస్స్నేహుండును - స్నేహము లేనివాడును, నృశంసుండునన్ = ఘాతుకుండును, అగు, ఆ +కర్మ - చండాలుండు = జన్మము చేతగాక, కర్మములచే చండాలుడైన, ఆ సుకుమారుడు, గర్భ - గేహంబునకున్ = 'గర్భగుడికి', చక్కన్ + కడు + ఎదురన్ = సరిగా నెట్ట యెదుట, నిలిచి, రక్త - కమల + ఛాయంబులు + అగు = ఎఱ్ఱ తామరల కాంతి గలవి యగు, కన్నులు, తెఱచి, విఘూర్ణ మాన - తారకంబు + ఐన = తిరుగుడుపడుచున్న కను గ్రుడ్లు గలది యగు వికార + ఆలోకనంబునన్ = వికారపు చూపుతో, అల వోలకయున్ =

1. శా. కేకరాలోకబున. 2. తా. మౌళింగపాల 3. తా. శకంబునకు.4. తా. ధవళంబులన 5. ము. నంగజాట్ట హాసంబు

పోలెన్ = దైవికముగా, నిర్మల - స్ఫటిక - మండప + అధ్యాసీనుండును = స్వచ్ఛమైన, స్ఫటిక శిలానిర్మితమైన, మండపమునందు, ఉన్నవాడును, అమృతమయ-జ్యోతిర్లింగ - మూర్తియున్ = అమృత మయమైన జ్యోతిర్లింగపు ఆకారము గలవాడును, ముక్తాఫల - ధవల -కాంతియున్ = ముత్యములవలె తెల్లని కాంతి గలవాడును, త్రిభువన - వందిత - చరుణుండును = ముల్లోకములచేత, నమస్కరింపబడిన, పాదములు గలవాడును, చర + అచర -గురుండునున్ = చరములు, అచరములు నగు వానికి గురువును, అగు, నాగేశ్వరునిన్, దర్శించి = చూచి,

ఆ + మహత్ (మహా) + దేవు = ఆ యీశ్వరుని యొక్క మౌళి-కపాల-మాలికా-మండన-ఖండ + ఇందు-శకలంబులకున్ = శిరస్సునందలి, పూలదండలకు అలంకారము అగు చంద్రకళ యొక్క ముక్కలకును, గగన-గంగా-ప్రవాహ-డిండీర-ఖండంబులకున్ = ఆకాశ గంగా ప్రవాహమునందలి, నురుగు, ముక్కలకును, ఉష్ణీష-ఫణి-ఫణా-ఫలకంబులకున్ = తలపాగ యైన పాము యొక్క పలకలవంటి పడగలకును, చెలికారంబు + చేయన్ + చాలి = మైత్రి చేయజాలి - పోలినవయి, పాంచజన్య - సహోదరంబులు + అనన్ = విష్ణుని శంఖమగు పాంచజన్యమునకు తోబుట్టువులనగను, దుగ్ధ + అంబురాశి -హృదయంబులు = అనన్ =క్షీరసముద్రము యొక్క ఆత్మలనగను, చంద్రికా - శరణంబులు + అనన్ = వెన్నెలకు స్థానములనగను, అంగజ +అట్టహాస+ఛేదంబులు +అనన్ = మన్మథుని పెద్దనవ్వు ముక్క లనగను, మెండుకొని + ఉన్న = అధికమయి యున్న, పుండరీకంబుల - పూజ = తెల్ల తామర పూల పూజ, కనుంగొని = చూచి, వెండియున్ = మఱియును.

తాత్పర్యము: సిగ్గు, స్నేహము లేనివాడును, ఘాతుకుడును, పుట్టుకచేగాక కర్మములచే చండాలుడనయిన యా సుకుమారుడు మఱియొక జన్మమెత్తిన వానివలెను, రూపాంతరమును పొందిన వాని వలెను, భూతాదులచే గ్రసింపబడినవాని వలెను, భూతము పట్టుకొనిన వాని వలెను, గ్రహములచే పట్టు కొనబడిన వానివలెను, వెఱ్ఱియెత్తిన వానివలెను, కల్లు త్రాగిన కైపుచే దన్ను తానెఱుగక, పై బట్ట పరిసర లతలకును ముండ్లకును తగులు కొనగా, నెత్తు పల్లములు గల నేలపై బాద వెంద్రుకలు విచ్చి వీపునబడగా, మెల్ల మెల్లగా వచ్చి, గర్భగుడి' కెట్టయెదుట నిలిచి, నిర్మల స్ఫటిక శిలా నిర్మిత మండపమునందున్నట్టియు, నమృతమయ మైన జ్యోతిర్లింగ మూర్తిగలవాడును, ముత్యములవలె తెల్లని కాంతి గలవాడును, ముల్లోకములచే నమస్కరింపబడు పాదములు గలవాడును, చరా చరములకు గురువైనవాడును అగు నాగేశ్వరుని ఎఱ్ఱతామరల వంటి కన్నులు తెఱచి, తిరుగుడువడు కను గ్రుడ్ల తోడి వికారపు జూపుతో దైవికముగా జూచి, ఆ మహాదేవుని శిరసునందలి పూల దండలకును, అలంకారమగు చంద్రకళ ముక్కలకును, ఆకాశ గంగా ప్రవాహము

నందలి నురుగు ముక్కలకును, తలపాగయైన పాము పడగ పలకలకును మిత్రము లనజాలిన వయి, పాంచజన్యమునకు తోబుట్టువులనగను, క్షీరసముద్రము నాత్మలనగను, వెన్నెలకు స్థానములనగను, మన్మథుని అట్టహాస ఖండములనగను నున్న పెల్లగు పుండరీకముల పూజ గనుగొని మఱియును -తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: జన్మాంతరస్థుండు వోలె, రూపాంతరగతుండు వోలె -కల్లు ద్రావినవాడు తాను తానుగా నుండ డనుట. వాని చేష్టలు గ్రహములు, భూతములు, పట్టుకొనినవాని చేష్టలవలెను, వెఱ్ఱివాని చేష్టల వలెను నుండును. అలంకారము స్వభావోక్తి, ఉత్ప్రేక్షయు. పరిసర......నేతెంచి - అలంకారము స్వభావోక్తి, అలవోకయుం స్వభావోక్తి, ఉత్ప్రేక్షయు. పరిసర......నేతెంచి - అలంకారము స్వభావోక్తి, అలవోకయుం బోలె - అతడు శివుని చూడవలయునని చూడలేదు. దైవికముగా జూచె ననుట బోలె - అతడు శివుని చూడవలయునని చూడలేదు. దైవికముగా జూచె ననుట ఇందు శకలములు, గంగా డిండీర ఖండములు, ఫణిఫణా ఫలకములు -ఇవియన్నియు తెల్లనివే కావుననే పుండరీకముల కుపమానములు. అలంకారము ఉపమ చెలికారంబు చేయంజాలి - ఉపమావాచకము పాంచజన్య ......, దుగ్ధాంబురాశి ...., చంద్రికాశరణంబులనన్, అంగజాట్టహాసముచ్ఛేదంబులనన్ - అలంకారములు ఉత్ప్రేక్షలు.

కట్టెదుర - కడు + ఎదుర -`కుఱు చిఱు కడు నడు నిడు శబ్దముల అడల కచ్చు పరంబునపుడు ద్విరుక్త టకారంబగు'- కట్టు + ఎదురు - బాల. సంధి. 12 ఉత్తున కచ్చుపరంబగునపుడు సంధియగు'- బాల. సంధి 1. కట్టెదుర. కమల దళ + ఛాయంబులు = కమల దళచ్ఛాయంబులు - హ్రస్వమునకు పరమైన ఛకారమునకు ద్విత్వము.

ఉ. చాయన భోగిరాట్కటకసన్నిధి దీపితదీపమాలికా
చ్ఛాయఁ బురఃప్రదేశమునఁ జాఁగిన నిర్ఝరవాహినీమహా
తోయము సావి చీర యెగఁద్రోచి చొరంగఁ దలంచెనెంతలోఁ
తోయని కొంకి కొంకి పతితుం డతఁ డాసవపానవిక్రియన్ 44.

అర్థము: పతితుండు + అతడు = భ్రష్టుడైన యా సుకుమారుడు, ఆ సవ - పాన - విక్రియన్ = కల్లు త్రావుటవలని వికారముచేత, చాయన్ + అ = సమీపమునందే, భోగి-రాట్ + కటక-సన్నిధిన్ = సర్పరాజు కడియముగా గల యీశ్వరుని యొక్క సామీప్యమునందు, దీపిత - దీప-మాలికా +ఛాయన్ = ప్రకాశించిన దివ్వెల యొక్క వరుసయొక్క, కాంతిని, పురస్ (కః) +ప్రదేశమునన్ = ముందు భాగమున, చాఁగిన =(చాగిన) = ప్రవహించినట్టి, నిర్ఝర -వాహినీ-మహత్ (మహా)-తోయము - సావి = సురనది (ఆకాశగంగ) యొక్క, గొప్ప, జలము (ప్రవాహము)అని, ఎంత - లోఁ తో +అని, కొంకి-కొంకి = మిక్కిలి సంకోచించి, చీర = బట్ట, ఎగన్ +త్రోచి = పైకి పట్టుకొని, చొరంగన్ + తలంచెన్ = ప్రవేశింపనెంచెను.

తాత్పర్యము: భ్రష్టుడైన యా సుకుమారుడు కల్లు త్రావుట వలని వికారము చేత సమీపమునందే నాగాభరణుడైన యీశ్వరుని దగ్గఱ ప్రకాశించు దీపపంక్తి కాంతిని చూచి, ముందు భాగమున ప్రవహించు నట్టి ఆకాశగంగా మహా ప్రవాహ మని భ్రాంతిపడి, యెంతలోతో యని మిక్కిలి జంకుచు వస్త్రమును పయి కెగ ద్రోచుకొని ప్రవేశింపనెంచెను.

విశేషములు: దీప పంక్తి కాంతి యం దతనికి నిర్ఝర వాహినీ మహాతోయ భ్రాంతి గలుగుటచే నలంకారము భ్రాంతిమంతము. అతని యా భ్రాంతికి కారణము ఆసవపాన విక్రియ కల్లు పెల్లుగా త్రావిన వాడిట్లు ఒక వస్తువును జాచి యింకొక వస్తువని భ్రాంతి జెందుట సహజము. దీపకాంతి నాకాశ గంగా ప్రవాహముగా భ్రమించుట మత్తులోనే పొడసూపిన యించుక తెలివి, దీపకాంతియు, సురగంగయు రెండును తెల్లగానే యుండుట యాతనికి భ్రాంతికి మూలము సావిసవి (రూపాం) = అని - (అవ్యయము), చీర = వస్త్ర సామాన్యము. స్త్రీ ధరించు వస్త్రమని వాడుకలో నర్థ విపరిణామము చెందినది. చీరము (ప్రకృతి) -చీర (వికృతి) కల్లు త్రాగిన వాని ప్రవర్తనమును సహజముగా వర్ణించుటచే స్వభావోక్తియు. మాలికా +చాయ = మాలికాచ్ఛాయ, మాలికాఛాయ. దీర్ఘమునకు పరమైన ఛకారమునకు ద్విత్వము వికల్పము. ఛాయ (ప్రకృతి) - చాయ (వికృతి) = కాంతి, సమీపము, నీడ (నా.నా)భోగి-భోగము (పడగ, పాము శరీరము)కలది - 'భోగి = పాము. భోగిరాజము కటకముగా గలవాడు -శివుడు పురస్ + ప్రదేశము - సకారమునకు హల్లు పరమగు చుండగా విసర్గాదేశము. అది పకారపరకముగావున నుపధ్మానీయము.

గీ. పవనవశమునఁ గేతకీప్రసవధూళి
యంగమున హత్తియుండంగ నాతఁడపుడు
విమలభస్మసముద్ధూళన మొనరించి
పాశుపతదీక్ష గైకొన్నభంగి నుండె 45

అర్థము: పవన - వశమునన్ = గాలి వలన, కేతకీ - ప్రసవ-ధూళి = మొగలి పూల పుప్పొడి, అంగమునన్ = శరీరమునందు, హత్తి + ఉండంగన్ = అంటుకొని యుండగా, అపుడు = ఆ సమయమున, అతడు = ఆ సుకుమారుడు, విమల - భస్మ-సమ్ + ఉద్ధూళనము = నిర్మలమైన విభూతియొక్క పూత, ఒనరించి = చేసి, పాశుపత-దీక్షన్= శైవ దీక్షను, కైకొన్న-భంగిన్ = స్వీకరించినవాని విధమున, ఉండెన్.

తాత్పర్యము: •లికి మొగలి పూల పుప్పొడి సుకుమారుని శరీరమున కంటుకొనగా, నతడు నిర్మలమైన విభూతి యొడలి కలదుకొని పాశుపత దీక్షను స్వీకరించినవానివిధమున నుండెను

విశేషములు: కేతకీ ప్రసవ ధూళియు, విమల భస్మము నొకే రంగు గలిగియుండును. పాశుపత దీక్ష స్వీకరించినవాడు శరీరమునకు విభూతిని పూసికొనవలయును. అలంకార ముత్ప్రేక్ష. కేతకి (ప్రకృతి) - గేదంగి (వికృతి)ప్రసవము -నా.నా) పువ్వు, కాన్పు. ఆ పాపునకు కడపట భ్రాంతిచేనైన పాశుపతదీక్ష నిప్పించుట గమనింపదగినది.

చ. కలఁగఁగఁ బాఱె నాతని యఘంబులు పంచహృషీక సంభవం
బులు బహుకాల సంకలితముల్ దవ వహ్ని చిట చ్చిట ధ్వనిం
గల గఁగఁ బాఱు పక్షుల ప్రకారమునం దొలు జాము పూజకై
బలు పటహమ్ము ఠమ్మనుచు భర్గుని గేహమునందు మ్రోసినన్ 46

అర్థము: భర్గుని - గేహమునందున్ = నాగేశ్వరాలయము నందు, తొలు - జాము -పూజకై = మొదటి జామునచేయు పూజకొఱకు, బలు-పటహమ్ము = పెద్ద తప్పెట, ఠమ్మనుచున్ = `ఠం' అను ధ్వనిచేయుచు, మ్రోసినన్ = మ్రోయగా, పంచ-హృషీక-సంభవంబులు = అయి దింద్రియముల వలన పుట్టినవి, బహు-కాల-సంకలితముల్ = చిరకాలమునుండి ప్రోగు చేయబడినవి, అగు, ఆతని-అఘంబులు = ఆ సుకుమారుని పాపములు, దవ-వహ్ని-చిటచ్చిట-ధ్వనిన్ = కార్చిచ్చుయొక్క చిట చిట మను చప్పుడు చేత, కలంగగన్ + పాఱి = కలతజెంది యెగిరిపోవునట్టి, పక్షుల - ప్రకారమునన్ = పక్షుల విధమున, కలఁగఁగన్ + పాఱెన్ = నశించెను.

తాత్పర్యము: నాగేశ్వరాలయమునందు ప్రథమయామమున జరుగు పూజకయి పెద్ద తప్పెట ఠమ్మని మ్రోయగా, అయి దింద్రియముల వలన కలిగినవియు, చిరకాలమునుండి ప్రోగు పడినవియు నగు నా సుకుమారుని పాపములు కార్చిచ్చు చిట చిట ధ్వనిచే కలగి చెదరిపోవు పక్షుల విధమున నశించెను.

విశేషములు: అలంకార ముపమ. పంచ హృషీక - పంచేంద్రియ - త్వక్కు (చర్మము), చక్షువు (కన్ను), శ్రోత్రము (చెవి), జిహ్వ (నాలుక), ఘ్రాణము (ముక్కు) - ఇవి జ్ఞానేంద్రియములు. వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థము-ఈ యైదును కర్మేంద్రియములు. ఈ సందర్భమున నే అయిదయినను గావచ్చును. హృషీక - `హృషీకం విష యాన్ద్రియమ్'- హృష్యన్త్యనే నేతి హృషీకమ్. దీనిచేత సంతోషింతురు - ఇంద్రియము - అమరము చిట చ్చిట - కాలుటయందు ధ్వన్యనుకరణ శబ్దము
ఠమ్మనుచు - మ్రోగుట యందు ధ్వన్యనుకరణ శబ్దము.

వ. ఆ శివరాత్రి పుణ్యకాలంబునం బురాణంబులు వినిపించు వారును, నితిహాసంబులు చదువువారును, బంచాక్షరీ పంచ బ్రహ్మాది మంత్రంబులు జపించువారును, నీలకంఠస్తోత్రంబులు పఠించువారును, బ్రాణాయామంబు లను

సంధించువారును, బ్రత్యాహారంబులు నడుపు వారును, [1]బ్రదక్షిణంబులు సేయువారును, భస్మోద్ధూళనంబులొనర్చు వారును, దురోదరంబుల వినోదించు వారును, నష్టావధానంబులఁ గ్రీడించువారును, వీణ లాస్ఫాలించువారును, గావ్యగోష్ఠి సలుపువారును, బరిహాసం బాదరించు వారును, బిందుమతి యభ్యసించు వారును, బ్రహేళికలు భావించువారును, నాడువారునుఁ, బాడువారును, మేష కుక్కుట[2]కరేటు లావుక కపింజల యుద్ధంబులు వీక్షించువారును, గుబ్జ వామన కిరాత బర్బర జరఠమూక జన వికారంబు లవలోకించువారు నై జాగరంబులు సలుపుచునుండిరి. సుకుమారుండును నొక్కించుక యన్నుం [3]దేటికొని వారిం జూచుచుండె నప్పుడు శివ గంగా నిర్ఝర జల తరంగ శీకర జాల జనిత జడిమంబులు, నంది రోమంథ ఫేనబిందువాహంబులుం, గుమార శిఖి కలాప విధూనన క్రియాలలితంబులుం, బశుపతి జటా బద్ధ వాసుకి నిపీత శేషంబులు, హేరంబ గండ మండల నిష్యందమాన దాన ధార కలుష గంధ లహరీ పాణింధమంబులు, భృంగి రిటి నికుంభ కుంభోదర ప్రముఖ నిఖిల గణ పరిషదుద్ధూళిత[4]భసిత ధూళికా విసరంబులు మాతృకా శ్రవణావతంసకహ్లార కోరక ప్రేంఖోళన ప్రక్రియా సమభిహారానుమే యావతరణంబులు, మహిసాక్షి గుగ్గులు ధూపధూపకంబులు మాలూర కిసల యామోద మేదురంబులు నగు మహాదేవ నిశా మారుతంబు లతని మీఁదంబొలుపారి పాతకంబులు దూల రాల్చె నట్టి సమయంబున 47

అర్థము: ఆ శివరాత్రి....సలుపుచుండిరి : ఆ - శివరాత్రి - పుణ్యకాలంబునన్, పురాణంబులు, వినిపించువారును, ఇతిహాసంబులు = పూర్వచరిత్ర ప్రతిపాదక గ్రంథములు - భారతాది, చదువు వారును, షంచాక్షరీ = నమః శివాయ, పంచబ్రహ్మ + ఆది - మంత్రంబులు = పంచబ్రహ్మము మున్నగు మంత్రములు జపించువారును, నీలకంఠ స్తోత్రంబులు = శివస్తుతులు, పఠించు వారును = చదువు వారును, ప్రాణాయామంబులు = ప్రాణవాయువును మంత్ర పూర్వకముగా నిరోధించుట, అనుసంధించువారును = చేయువారును, ప్రత్యాహారంబులు = చిత్తమును, ఇంద్రియములను విషయముల నుండి మరలించుటలు, నడుపు వారును, ప్రదక్షిణంబులు + చేయువారును, భస్మ + ఉద్ధూళనంబులు = విభూతిని పూసికొనుటలు, ఒనర్చువారును = చేయువారును, దురోదరంబులన్ = జూదములతో, వినోదించు వారును - క్రీడించువారును, అష్టావధానంబులన్, క్రీడించువారును, వీణలు, ఆస్ఫాలించువారును = వాయించువారును, కావ్య-గోష్ఠి-సలుపువారును = కావ్యములను గూర్చిన ప్రసంగములను చేయువారును, పరిహాసంబు + ఆదరించువారును = నవ్వులాటలను మన్నించువారును, బిందుమతి, అభ్యసించువారును = నేర్చువారును, ప్రహేళికలు,

1. తా. అంగప్రదక్షిణంబులు 2. తా. సక్రకరలావుక 3. తా. తేటికొన. 4. తా. భసిత దవచిత ధూళికా ధూళి పాళికా సరంబులు

భావించువారును, ఆడువారునున్, పాడువారును, మేష - కుక్కుట-కరేటు-లావుక-కపింజల -యుద్ధంబులు = పొట్టేళ్ల, కోళ్ళ, పెద్ద కొక్కెరల, లావుక పిట్టల, కముజుల పందెములు, వీక్షించువారును = చూచువారును, కుబ్జ-వామన-కిరాత-బర్బర-జరత-మూక-జన-వికారంబులు = గూనువాండ్రు, పొట్టి వాండ్రు, కిరాతులు, అనార్యజాతి వాండ్రు ముసలి వాండ్రు, మూగవాండ్రు, (అగు), జన=మనుష్యుల యొక్క, వికృతపుజేష్టలు, అవలోకించు వారునున్ = చూచు వారును, ఐ, జాగరంబులు =మేలుకొనుటలు, సలుపుచున్ + ఉండిరి = చేయుచుండిరి.

సుకుమారుండును.......చూచుచుండె: సుకుమారుండును, ఒక + ఇంచుక = ఒక కొంచెము, అన్నున్ + తేకొని = ఒడలెఱుగమి నుండి తెప్పిఱిల్లి, వారిన్, చూచుచున్ + ఉండెన్.

అప్పుడు........సమయంబుల: అప్పుడు, శివ...........జడిమంబులు: శివ-గంగా = శివగంగయనెడు, నిర్ఝర=తుంపరలయొక్క, జాల = సమూహమునుండి, జనిత = పుట్టిన, జడిమంబులు = మాంద్యము గలవియు, నంది.........వాహులున్ = నంది = నందియొక్క, రోమంథ = నెమరు లందలి, ఫేన = నురుగు యొక్క, బిందు = కణముల యొక్క (ను), వాహులున్ = మోయు నవియును, కుమార .... లలితంబులున్ కుమార = కుమార స్వామి యొక్క, విధూనన = కదలుట యనెడి, క్రియా = పనిచేత, లలితంబులు = మృదువైనవియును, పశుపతి ....శేషంబులు : పశుపతి = శివునియొక్క, జటా = జడలకు, బద్ధ = కట్టబడిన, వాసుకి = వాసుకి యను సర్పరాజుచేత, నిపీత = త్రాగ బడగా, శేషంబులు = మిగిలినవియును, హేరంబు.........పాణింధమంబులున్ ; హేరంబు = విఘ్నేశ్వరుని యొక్క, గండ-మండల=చెక్కిళ్ల ప్రదేశములనుండి, నిష్యందమాన = కాఱుచున్న, దాన = మదజలము యొక్క, ధారా = ప్రవాహము చేత, కలుష - మలినమైన, గంధ = వాసనల యొక్క, లహరీ = అలల యొక్క, పాణింధమంబులన్ =కొలిమితిత్తులైనవియును, భృగిరిటి - నికుంభ-కుంభోదర.....విసరంబులున్ ; భృంగిరిటి, నికుంభుడు, కుంభోదరుడు, ప్రముఖ - మున్నుగాగల, నిఖిల =ఎల్ల, గణ = ప్రమథ గణములయొక్క, పరిషద్ = సభ - సమూహముచేత, ఉద్ధూళిత = పూయబడిన, భసిత = విభూతియొక్క, ధూళికా = ధూళుల యొక్క, విసరంబులున్ = సమూహములు గలవియును, మాతృకా........తరణంబులన్: మాతృకా = సప్త మాతృకల యొక్క, శ్రవణ + అవతంస = కర్ణాభరణము లయిన, కహ్లార-కోరక = కువ మొగ్గలయొక్క, ప్రేంఖోళన - ప్రక్రియా = ఊగుటయను పనియొక్క, సమభిహార = అధిక్యముచేత, అనుమేయ = ఊహింపదగిన, అవతరణంబులున్ = దిగుట కలవియును, మహిసాక్షి = గుగ్గిలము, గుగ్గులు = గుగ్గిలము అను, ధూప-ధూమకంబులున్-సుగంధి ద్రవ్యముల యొక్క,

పొగలు గలవియును, మాలూర - కిసలయ + ఆమోద - మేదురంబులున్ = మారేడు, చిగుళ్లయొక్క, పరిమళముచేత, సాంద్రమయినవియును, అగు మహాదేవ -నిశా-మారుతంబులు = శివరాత్రియందలి గాలులు, అతని మీదన్ = సుకుమారుని పయిని, పొలుపారి = ఒప్పి, పాతకంబులు = పాపములు, తూలన్ = రాల్చెన్ = హరించెను, అట్టి - సమయంబునన్.

తాత్పర్యము: ఆ శివరాత్రి పుణ్యకాలమునందు పురాణములు వినిపించు వారును, ఇతిహాసములు చదువు వారును, పంచాక్షరీ పంచబ్రహ్మాది మంత్రములు జపించువారును, శివస్తుతులు పఠించువారును, ప్రాణాయామములు చేయువారును, మనస్సును ఇంద్రియములను విషయములనుండి మరలించువారును, ప్రదక్షిణములు చేయువారును, విభూతి పూసికొనువారును, జూదములచే ప్రొద్దుపుచ్చువారును, అష్టావధానములతో క్రీడించువారును, పరిహాసముల నాదరించు వారును, బిందుమతి నభ్యసించువారును, ప్రహేళికలు భావించువారును, ఆడువారును, పాడువారును, పొట్టేళ్ల, కోళ్ల, కరేటువుల, లావుకముల, కపింజముల పందెములను చూచువారును, కుబ్జులు, వామనులు, కిరాతులు, బర్బరులు, ముసలివారు, మూగవారునగు జనుల వికృతపు చేష్టలను చూచువారును నయి జాగరము చేయుచుండిరి. సుకుమారుడును ఇంచుక ఒడలు తెలిసి వారిని చూచుచుండెను. అప్పుడు శివగంగయను సెలయేటి అలల తుంపరల సమూహముచే పుట్టిన మాంద్యము గలవియు, నంది నెమరు నురుగు బొట్టులను వహించునవియు, కుమారస్వామి నెమలి పింఛము నాడించుటచే మృదువులయినవియు, ఈశ్వరుని జడలయందు బంధింపబడిన వాసుకి త్రావగా మిగిలినవియు, విఘ్నేశ్వరుని చెక్కిళ్ల నుండి కాఱుచున్న మదజల ప్రవాహములచే కలుషములయిన వాసనల అలల నతిశయింప జేయునవియు, భృంగిరిటి, నికుంభుడు, కుంభోదరుడు మున్నుగా గల యెల్ల ప్రమథగణములచే పూయబడిన విభూతి పొడుల సమూహములు గలవియు, సప్తమాతృకల కర్ణాభరణములగు కలువ మొగ్గల యూగుటల అధిక్యముచే నూహింపదగిన ఉనికిగలవియు, మహిసాక్షి, గుగ్గులు అను సుగంధి ద్రవ్యముల ధూమములు గలవియు, మారేడు చిగురుల పరిమళములచే సాంద్రమయినవియు, నగు శివరాత్రి సమయ వాయువులు అతనిపై నొప్పి పాపములను హరించెను. ఆ సమయమునందు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: జాగరము చేయుటకు వివిధమనః ప్రవృత్తులు గలవారవలంబించు పద్ధతులు వివరింపబడినవి. పద్ధతి యేదయినను శివరాత్రినాడు జాగరము ముఖ్యమనుట. పురాణ -పురా పూర్వస్మిన్ భూత మితి పురాణమ్. పూర్వమందైనది గనుక పురాణము- అమరము. సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరము, వంశాను చరితము లనెడి పంచ లక్షణములు గలది పురాణము. ఇతిహాస - ఇతిహ పారంపర్యోపదేశః ఆస్తే అస్మిన్నితీతిహాసః ఇతిహ అనగా పారం పర్యోపదేశము. అది దీనియందు

గలదు. అమరము. భారతాదులితిహాసములు. శివరాత్రి వాయువులకు శైత్య మాంద్య సౌగంధ్యములు చెప్పబడినవి, శివగంగా......'నంది రోమంధ' అనువానిచే శైత్యమును, కుమార శిఖి........అను దానిచే మాంద్యమును, హేరంబ గండ మండల........ అనుదానిచే తను, `మహి సాక్షి గుగ్గులు...' `మాలూర కిసల యామోద........'అనువానిచే సౌగంధ్యమును ఆ వాయువులకు చెప్పబడినవి. మాతృకా శ్రవణావతంస.....మాతృకలు ధరించిన శ్రవణాభరణములూగుటచే గాలి వీచుట యూహింపదగి యున్నదనుట పాణింధమము = కొలిమి తిత్తి గంధలహరీ పాణింధమములు. పాణింధమము అగ్నిని రగుల్కొలుపునట్లు, వాయువులు గంధలహరులను వ్యాపింప ,జేయు ననుట బిందుమతి-అను స్వార త్యాగముచేత అర్థాంతరమును ఒసగునట్టి కవనము రచించు క్రీడ. ఉదాహరణము.`సా హంసే నా శ్రితా పద్మాలయే జలదాత్యయే, అర్ణవస్యాభిసరణే రంహో ముఞ్చతి వాహినీ.' ఇందు `హసేన' `రహో' అని బిందుత్యాగము చేసినను శ్లోకమున కర్థము పొసగును.

గీ. అర్థరాత్రంబు దాఁక నయ్యధమవృత్తి
[1]శివనిశావైభవంబు వీక్షించి చనియెఁ
దానకమునకు నది యాదిగా నతండు
విడిచెఁ దొల్లింటి [2]తన నీచవృత్తి బుద్ధి. 48

అర్థము: ఆ + అధమ - వృత్తి = నీచమైన వర్తనముగల ఆ సుకుమారుడు, అర్థరాత్రంబు దాకన్ = నడురేయి వఱకును, శివ-నిశా-వైభవంబు = శివరాత్రి వైభవము, వీక్షించి = చూచి, తానకమునకున్ = నెలవునకు, చనియెన్ =వెడలెను. అది - ఆదిగాన్ = అది మొదలుకొని, అతండు = సుకుమారుడు, తొల్లింటి = పూర్వపు, తన, నీచ =వృత్తి-బుద్ధి-నీచమైన నడవడియందలి బుద్ధి, విడిచెన్.

తాత్పర్యము: నీచవర్తనుడైన యా సుకుమారుడు నడురేయి వఱకును శివరాత్రి వైభవమును జూచి తన నెలవునకు పోయెను. అప్పటి నుండి యతడు తన నీచ ప్రవర్తనాబుద్ధిని విడనాడెను.

విశేషములు: అర్థరాత్రము - అహన్, సర్వసంఖ్యాత, పుణ్య శబ్దములకును, సంఖ్యావాచకములకును, అవ్యయములకును, ఏక దేశవాచకములకును, గణ, చిర, బహు, కతిపయ శబ్దములకును పరమైన `రాత్రి'శబ్ద `ఇ'కారమునకు `అ'ప్రత్యయము వచ్చును. ఆ + అధమ = ఆ + యధమ - యడాగమము `త్రికంబు మీఁది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు' బాల సమాస 14ఆ + య్యధమ `ద్విరుక్తంబగు హల్లు పరంబగునపు డాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు' బాల. సమాస 13 అయ్యధమ'

1. ము. శివు. 2. ము. నీచపువృత్తి బుద్ధి.

వ. అంతం గొంతకాలంబునకు 49

తాత్పర్యము: పిమ్మట కొంతకాలమునకు - తరువాతి పద్యముతో నన్వయము.

క. కుక్కలలో శబరులలో
గక్కెర చిమ్మటలలోనఁ గార్కోళులలోఁ
బక్కణము గుడిసె నడుమను
గుక్కిపయిం జచ్చె నతఁడు ఘోరవ్యాధిన్ 50

అర్థము: అతండు = సుకుమారుడు, ఘోర-వ్యాధిన్ = భయంకరమైన రోగముతో, కుక్కలలోన్, శబరులలోన్ = బోయలలో, కక్కెర - చిమ్మటలలోనన్ = కక్కెర అనుపక్షులలోను, చిమ్మటలను పురుగులలోను, కార్కోళులలోన్ = అడవి కోళ్ళలోను, పక్కణము -గుడిసె -నడుమను = బోయపల్లెలోని పూరింటి నడుమ, కుక్కి పయిన్ = కుక్కిమంచముమీద, చచ్చెన్.

తాత్పర్యము: ఆ సుకుమారుడు భయంకరమైన రోగముతో కుక్కలలోను, కిరాతులలోను, కక్కెర పిట్టలలోను, చిమ్మట పురువులలోను, అడవి కోళ్ళలోను బోయపల్లెలోని పూరింటినడుమ కుక్కిమంచముపై చచ్చెను.

విశేషములు: కోళులు - కోడి +లు `- ఇత్తునకు బహువచనంబు పరంబగునపుడు త్వంబగు' బాల తత్సమ 45 కోడు+లు `బహువచనంబు పరంబగునపు డసంయుక్తంబు లయి యుదంతంబు లయిన డ-ల-ర-ల కలఘులకారంబు బహుళంబుగానగు' బాల. అచ్చిక 13కోళులు. రూపాం. కోడులు, కోళులు, కోళ్లు `చచ్చె' నను పదము కవికి సుకుమారు నెడగల జుగుప్సను సూచించును.

క. శ్రీ నాగేశ్వర శంభు
స్థానంబున [1]గిరిశ రాత్రి జాగర మలవో
కైనను గనుఁ గొన్నట్టి క
తానను విగతాఘుఁడై యతఁడు మృతిఁబొందెన్ 51

అర్థము: అతఁడు = సుకుమారుడు శ్రీ-నాగేశ్వర-శంభు-స్థానంబునన్ = శ్రీమంతుడైన నాగేశ్వరుడనెడి-శంభు-స్థానంబునన్ = శ్రీమంతుడైన నాగేశ్వరుడనెడి యీశ్వరుని ఆలయమునందు, గిరిశ-రాత్రిన్ = శివరాత్రినాడు, జాగరము = మేలుకొనుట అలవోక + ఐనను = దైవికముగానైనను, కనుఁగొన్న + అట్టి-కతానను = చూచిన కారణమున, విగత + అఘుండు +ఐ = పోయిన పాపములు గలవాడయి, మృతిన్ + పొందెన్ =మరణించెను.

---

1. ము. గిరిశురాత్రి జాగరములు.......నను.

తాత్పర్యము: సుకుమారుడు శ్రీనాగేశ్వరుని యాలయమున శివరాత్రినాడు జాగరమును దైవికముగానైనను జూచిన కారణమున పాపములు నశించినవాడై మరణించెను.

విశేషములు; అలవోకైనను - అతడు శివరాత్రి జాగరమును కావలయునని కనుగొనలేదు. అది దైవికముగా జరిగెను అయినను-అనుట కతాన-కతము+న-`లు-ల-న-లు పరంబులగునపుడొకానొకచో ముగాగమంబునకు లోపంబును దత్పూర్వస్వరంబునకు దీర్ఘంబును విభాషనగు" బాల. తత్సమ43

సీ. క్రిమి కంఠ కుహర మార్గమున కడ్డము దొట్టి
పెద్దయేనియు బాధ పెట్టకుండ
శ్లేష్మ ముద్రేకించి సెలవి రంధ్రము వాయ
మెఱసి నుచ్చిళ్ళు గ్రమ్మింపకుండ
దృగ్గోళకంబుల దిరుగంగఁ[1]బడి దృష్టి,
యంధకారంబులో నణఁగకుండ,
నెఱిదప్పి యుచ్ఛ్వాసనిశ్వాసపవమాన
పరివాహగతు[2]లోటువడకయుండఁ,

గీ. బరమయోగీశ్వరుఁడు వోలె బ్రహ్మరంధ్ర
వీథిఁ బ్రాణంబు విడిచె నవ్విప్రకులుఁడు
పుణ్యశివరాత్రి నలవోక వోలె నైన
నురగధరుచెంత జాగరం బుండెఁగాన 52

అర్థము: ఆ + విప్ర-కులుండు = బ్రాహ్మణ వంశము వాడయిన ఆ సుకుమారుడు, పుణ్య - శివరాత్రిన్ = పవిత్రమైన ఆ శివరాత్రి యందు, అలవోక +పోలెన్ +ఐనన్ = యాదృచ్ఛికముగా నైనను, ఉరగ-ధరు-చెంతన్ =పాములను ధరించువాడయిన ఈశ్వరుని సమీపమున, జాగరంబు, ఉండెన్ +కానన్ = ఉండెను గావున. క్రిమి = కృమి, పురుగు, కంఠ - కుహర - మార్గమునకున్ = కంఠనాళపు దారికి, అడ్డము దొట్టి = ఆటంకము గలిగించి, పెద్ద +ఏనియున్ = అంతయెక్కువగా, బాధ పెట్టక +ఉండన్ = బాధింపకుండను. శ్లేష్మము = కఫము, ఉద్రేకించి = అతిశయించి, సెలవి = పెదవి మూల, రంధ్రము + పాయన్ = కన్నపుజీలిక యందు, మెఱసి = విజృంభించి, క్రమ్మింపక +ఉండన్ = వ్యాపింపజేయకుండను, దృక్ + గోళకంబులు = కనుగ్రుడ్లు, తిరుగంగన్ + పడి = తిరుగుడువడి, దృష్టి = చూపు, అంధకారంబులోన్ = చీకటిలో, అణంగక + ఉండన్ = నశింపకుండను,

1. ము. దృష్టియు. 2. తా. లొంటి బడకయుండ.

ఉచ్ఛ్వాస - నిశ్శ్వాస -పవమాన-పరివాహ-గతులు-ఎగ యూపిరి దిగ యూపిరుల గాలులు పోవు దారులు, నెఱి + తప్పి = క్రమము తప్పి, ఓటు + పడక + ఉండన్ = భంగపడకుండను, పరమ-యోగి + ఈశ్వరుండు + పోలెన్ = గొప్ప యోగి శ్రేష్ఠునివలె, బ్రహ్మ-రంధ్ర-వీథిన్ = బ్రహ్మరంధ్రమార్గమున, ప్రాణంబు - విడిచెన్.

తాత్పర్యము: బ్రాహ్మణవంశమువాడయిన ఆ సుకుమారుడు పవిత్రమైన శివరాత్రినాడు యాదృచ్ఛికముగానైనను శివుని సన్నిధిని జాగరముండెను గావున క్రిములు కంఠనాళమార్గము నడ్డగించి యంత యెక్కువ బాధపెట్టకుండను, కఫ మతిశయించి పెదవుల మూలల విజృంభించి వ్యాపింపకుండను, కనుగ్రుడ్లు తిరుగుడువడి చూపు నశింపకుండను, ఉచ్ఛ్వాస నిశ్వాస మార్గములు క్రమ.ము తప్పి భంగ పడకుండను మహాయోగి శ్రేష్ఠునివలె బ్రహ్మరంధ్ర మార్గమున ప్రాణములు విడిచెను.

విశేషములు: ఇందు చెప్పబడిన వన్నియు ప్రాణి ప్రాణావసాన సమయమున పడు బాధలు సుకుమారున కట్టి బాధ లేమియు కలుగ లేదనుట బ్రహ్మరంధ్రము = శిరోరంధ్రము పరమయోగులు బ్రహ్మరంధ్రమార్గమున ప్రాణములు విడుతురు. ఉచ్చిలి = నురుంగు = ఉచ్చిలి + లు - `ఇత్తునకు బహువచనంబు పరంబగు నపు డుత్వంబగు `బాల. తత్స.మ 45.ఉచ్చిలు + లు `బహువచనంబు పరంబగునపుడు డ-ల-ర-ట-ల యత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు బాల. అచ్చిక. 12 ఉచ్చలి+లు `బహువచన శ్లిష్టంబు లయి యద్విరుక్తంబు నిత్యంబుగనగు' బాల. అచ్చిక 14- ఉచ్చిళ్లు దృక్ + గోళకంబులు = ఝల్లునకు హళ్ళు పరమగుచుండగా తృతీయవర్ణాదేశము.

వ. ఆ కాలంబునం గాలకింకరులు మృత్యుదేవతా సహితులై ముసల ముద్గర (ఖడ్గ)తోమరాది ప్రహరణంబుల తో(డం గదిసి) అతని లింగ శరీరంబు వరుణ పాశంబుల బంధించుకొని పోవం గణంగిన నవ్వేళ శివదూతలు శివాజ్ఞా వశంబున శూలాంకుశ గదాభిండ వాల పరిఘ పరశ్వథ (పాణులై యేతెం)చి దవ్వుల నాకాశమార్గంబున.

అర్థము: ఆ-కాలంబునన్ = ఆ సమయమున, కాల - కింకరులు = యముని భటులు, మృత్యు - దేవతా - సహితులు + ఐ = మృత్యు దేవతతో గూడిన వారయి, ముసల = రోకలి వంటి ఆయుధము, ముద్గర = సమ్మెటవంటి ఆయుధము, ఖడ్గ = కత్తి, తోమర + ఆది = ఇనుప గుదియ మున్నగు, ప్రహరణంబులతోడన్ = ఆయుధములతో, కదిసి = సమీపించి, అతని = సుకుమారుని యొక్క, లింగ - శరీరంబున్ = సూక్ష్మశరీరమును, వరుణ -పాశంబులన్ =వరుణుని పాశాయుధముతో, బంధించుకొనిపోవన్ = కట్టుకొని పోవుటకు, కణంగినన్ = ప్రయత్నింపగా, ఆ +

వేళన్ = ఆ సమయమున, శివ - దూతలు = శివుని భటులు, శివ + ఆజ్ఞా- వశంబునన్ = శివుని ఆనతికి లోబడి, శూల + అంకుశ -గదా-భిండివాల-పరిఘ- పరశ్వథ - పాణులు + ఐ = శూలములు, అంకుశములు, గదలు, భిండివాల (భిండిపాల, భిందిపాల) ములనెడి ఆయుధ విశేషములు, ఇనుపకట్ల గుదియలు, గండగొడ్డళ్లు, చేతియందు గలవారయి, ఏతెంచి = వచ్చి, దవ్వులన్ = దూరమున, ఆకాశ - మార్గంబునన్ మింటిత్రోవను-

తాత్పర్యము: ఆ సమయమున యమభటులు మృత్యుదేవతతో గూడినవారయి ముసలములు, ముద్గరములు, ఖడ్గములు, తోమరములు మున్నగు నాయుధములతో సమీపించి సుకుమారుని సూక్ష్మ దేహమును వరుణుని పాశములతో కట్టి తీసికొని పోవ యత్నింపగా, ఆ వేళ శివుని దూతలు శివుని ఆజ్ఞచొప్పున శూలములు, అంకుశములు, గదలు, భిండివాలములు, పరిఘలు, పరశ్వథములు చేత బూని వచ్చి దూరముగా నాకాశమార్గమున-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు; లింగ శరీరము = పంచ తన్మాత్రములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచప్రాణములు, మనోబుద్ధి చిత్తాహంకారములు అను చిహ్నములు గలిగి లోకాంతరమున సుఖ దుఃఖముల ననుభవించు సూక్ష్మ శరీరము (సూ.ని.) కణంగు - కడంగు-`అడంగ్వాదుల డాకు ణకారంబు విభాషనగు' బాల ప్రకీర్ణక. 13

ఆ.వె. ఓరి యముని దూతలార! యీ బ్రాహ్మణుం
గరుణ మాలి యేల కట్టినారు
విడుఁడు శివుని[1]యాన మృడునాజ్ఞ [2]దాఁటి మీ
మీ రాజు (చెడుట యెఱుం) గరా మదించి 54

అర్థము: ఓరి యముని దూతలారా!, ఈ -బ్రాహ్మణున్, కరుణ - మాలి = దయలేక, ఏల, కట్టినారు?, విడుఁడు = విడిచి పెట్టుడు, (ఇది), శివుని + ఆన =శివుని యాజ్ఞ, మీ -రాజు =మీ ప్రభువైన యముడు, మృడు+ఆజ్ఞన్ = శివుని యాజ్ఞను, దాటి = మీఱి, చెడుట =భంగపడుట, మదించి = గర్వించి, ఎఱుంగరా?

తాత్పర్యము: ఓరీ యమభటులారా! ఈ బ్రాహ్మణుని నిర్దయులై యేల బంధించితిరి" విడిచిపెట్టుడు. ఇది శివుని యాజ్ఞ. శివుని యాజ్ఞనతిక్రమించి మీ ప్రభువైన యముడు భంగపడుట క్రొవ్వి యెఱుగరా?

విశేషములు: ఆజ్ఞ (ప్రకృతి) - ఆన (వికృతి), మృడు+ఆజ్ఞ `షష్ఠీ సమాసంబునం దుకార ఋకారంబుల కచ్చు పరంబగునపుడు నుగాగ మంబగు' - బాల సంధి 34

1. తా. యాజ్ఞ. 2. ము. దాఁట.

మృడు నాజ్ఞ. శివునాజ్ఞనతిక్రమించి యముడు భంగపడిన ఘట్టములనేకములు గలవు. అట్టివానితో మార్కండేయుని వృత్తాంతమొకటి - ప్రసిద్ధము.

మాలిని. విడుఁడు విడుఁడు వీనిన్ విప్రునిన్ భాగ్యవంతున్
మృడుఁడు కరుణతోడన్ మిక్కిలిం గారవించెన్;
జడుల కొరుల కేలా సంభవించున్ యథార్థం
బడర మఱి మృ(డానీశానుకం) పాలవంబుల్? 55

అర్థము: భాగ్యవంతున్ - విప్రునిన్ -వీనిన్ = అదృష్టవంతుడైన యీ బ్రాహ్మణుని, విడుఁడు, విడుఁడు, మృడుఁడు = ఈశ్వరుడు, కరుణతోడన్ = దయతో, మిక్కిలిన్ = ఎంతయును, గారవించెన్ = ఆదరించెను, మఱి యథార్థంబు + అడరన్ = నిజమతిశయిఁపగా, మృడానీ + ఈశ + అనుకంపా-లవంబుల్ = పార్వతియొక్కయు, ఈశ్వరుని యొక్కయు దయా లేశములు, జడులకున్ + ఒరులకున్ = మందులైన యితరులకు, ఏలా = ఎట్లు, సంభవించున్ = కలుగును?

తాత్పర్యము: అదృష్ట వంతుడైన యీ బ్రాహ్మణుని విడిచి పెట్టుడు. ఈశ్వరుడు వీనిని దయతో మిక్కలి ఆదరించెను. మఱి నిజమునకు పార్వతీశ్వరుల దయయందు లేశములయినను మందభాగ్యులైన యితరుల కేల కలుగును?

విశేషణులు: భాగ్యవంతున్ = శివరాత్రి పుణ్యకాలమున శివాలయమున నేకారణముచే నైనను జాగరముండుటయే సుకుమారుని భాగ్యము. మృడుండు - `గిరీశో గిరిశో మృడః'-మృడతి సుఖయతి భక్తా నితి మృడః - భక్తులను సుఖింపజేయువాడు - శివుడు. అమరము మృడానీ - ఇంద్ర, వరుణ, భవ, శర్వ, రుద్ర, మృడ, హిమ, అరణ్య, యవ, యవన, మాతుల, ఆచార్య శబ్దములకు `ఈ' ప్రత్యయమును, అంతకు ముందు `ఆన్' అను నాగమమును వచ్చును. మృడుని భార్య = పార్వతి. మృడ శబ్దము (విశేషము) సాభిప్రాయముగా ప్రయుక్తమయినది కావున నలంకారము పరికరాంకురము. మాలిని - నాలుగు పాదములుండును. ప్రతిపాదమునను ననమయయ అను గణములుండును. మొదటి యక్షరమునకు తొమ్మిదవ యక్షరమునకును యతిమైత్రి. ప్రాసనియమము గలదు.

గీ. [1]యజ్ఞదాన తప స్స్వాన్నృతాదులైన
పుణ్యకర్మం బొనర్చిన పురుషునందు
నెట్లు సంతోషమందు నర్ధేందుమౌళి
యట్టి సంతోష మితనియందావహించె 56

1. ము. అన్నదాన.

అర్థము: యజ్ఞ -దాన-తపస్-సూనృత + ఆదులు + ఐన = యజ్ఞము, దానము, తపస్సు, సత్యము మొదలగు, పుణ్య-కర్మంబు =పుణ్య కార్యము, ఒనర్చిన =చేసినట్టి, పురుషునందున్ = పురుషునియందు, అర్ధ + ఇందు - మౌళి = సగము చంద్రుడు శిరస్సున గలవాడు - శివుడు, ఎట్లు = ఏ రీతిగా, సంతోషము + అందున్ = సంతోషపడునో, అట్టి - సంతోషము, ఇతని + అందున్ = ఈ బ్రాహ్మణునియందు, ఆవహించెన్ = పూనెను.

తాత్పర్యము: యజ్ఞము, దానము, తపస్సు సత్యము మున్నగు పుణ్య కర్మముల నాచరించిన పురుషుని విషయమున చంద్ర కళావతంసుడైన శివుడెట్లు సంతోషపడునో, ఈ బ్రాహ్మణుని యందట్టి సంతోషమును పూనెను.

వ. అనిన యమకింకరులు శంకరకింకరుల కిట్లనిరి 57

అర్థము: అనినన్, యమ - కింకరులు = యముని భటులు, శంకర - కింకరులకున్ = శివుని భటులకు, ఇట్లు +అనిరి.

తాత్పర్యము: అని శివుని భటులు పలుకగా యమకింకరులు వారి కిట్లనిరి.

విశేషములు: కింకర - `నియోజ్య కింకర ప్రేష్య భుజిష్య పరిచారకాః' - కిమపి కరోతీతి కింకరః - దేనినైనను చేయువాడు - బంటు. అమరము.

సీ. [1]ఏ కార్యమునకయి యెచ్చోటి కరిగెద
[2]రరుగుఁడు మీరు మహాత్ములార!
యితని క్లేశము చూచి యతికృపాపరతమైఁ
బు (రుషార్థ మొన)రింపఁ బూనినారె?
హరు కింకరుల మన్న నాశ్చర్య మయ్యెడు
సదసద్వివేకంబు చాల కునికి
భవభక్తులకు నడ్డుపడుట ధర్మము మీకు
నే మేల పట్టుద మీకు భక్తి

గీ. నితఁడు కల్లుద్రాగె జంకాడె [3]నెఱచిఁ దినియె
నిలిచి మూత్రించెఁ జండాలలలనఁ [4]గూడెఁ
గూఁతు రమియించెఁ దెరువాటుగొట్టెఁ బ్రజలఁ
జెంచురాజుల సేవించెఁ జెఱిచెఁగులము 58

అర్థము: మహత్ (మహా) +ఆత్ములారా, మీరు, ఏ-కార్యమునకున్ + అయి = ఏ పని కొఱకు, ఏ +చోటికిన్, అరిగెదరు, అరుగుండు. ఇతని, క్లేశము = కష్టము,

---

1. తా. ఏ కార్యమునకునై. 2. తా. అరుగుఁడా. 3. తా. సతిని విడిచె. 4. తా. గవిసె

చూచి, అతి-కృపా-పరతమైన్ =అధిక దయా పరత్వముతో, పురుషార్థము = పురుష ప్రయోజనము - మోక్షము, ఒనరింపన్ = చేయుటకు, పూనినారె? = యత్నించితిరా? సత్ + అసత్ + వివేకంబు = మంచి చెడ్డల విచక్షణ జ్ఞానము, చాలక + ఉనికిన్ = చాలకుండుటచే, హరు -కింకురులము + అన్నన్ = శివుని దూతల మనిన, ఆశ్చర్యము + అయ్యెడున్. భవ- భక్తులకున్ = శివుని భక్తులకు, అడ్డము + పడుట, మీకున్, ధర్మము -న్యాయము, ఏము = మేము, ఈశు - భక్తున్ =ఈశ్వర భక్తుని, ఏల, పట్టుదము? ఇతడు, కలు +త్రాగెన్, ఱంకు+ఆడెన్ = వ్యభిచరించెన్ = మూత్రమును విసర్జించెను, చండాల-లలనన్=మాలపడతిని, కూడెన్, కూతున్, రమియించెన్ = సంభోగించెను, ప్రజలన్, తెరువాటు + కొట్టెన్ = దారిదోపిడి చేసెను, చెంచు రాజులన్ = కిరాతనాయకులను, సేవించెన్ = కొలిచెను, కులమున్, చెఱిచెన్ = పాడుచేసెను.

తాత్పర్యము: మహానుభావులారా! మీరేపని మీద నెచ్చటి కరిగెదరో అచ్చటి కరుగుడు. పాప మితని కష్టము చూచి మిక్కలి జాలిపడి మోక్షము ననుగ్రహింప బూనితిరా? మంచి చెడ్డల విచక్షణా జ్ఞానము చాలని మీరు శివభక్తులమనుట మా కాశ్చర్యమగుచున్నది. మీరు శివభక్తుల కడ్డుపడుట ధర్మము. శివ భక్తుని మే మేల పట్టుదుము? ఇతడు కల్లు త్రాగెను. వ్యభిచరించెను. మాంసమును తినెను. నిలిచి మూత్ర విసర్జనము చేసెను. మాలెతతో క్రీడించెను. కూతుతో సంభోగించెను. ప్రజలను దారికట్టి కొట్టెను. కిరాత ప్రభువులను కొలిచెను. బ్రాహ్మణ కులమును పాడుచేసెను.

సీ. కేలుదో యెత్తి మ్రొక్కెనె పాశుపతులకు?
శరణార్థి [1]యనియెనే జంగములకు?
ఫాలభాగమునందు భస్మంబు పూసెనే?
యఱుతఁ దాలిచెనె రుద్రాక్షపూస?
శివమంత్ర ముచ్చరించెనె జిహ్వా[2]తుదయందు?
నరిగెనె యన్నండె నభవు గుడికిఁ?
బఠియించెనే మహాప్రమథచారిత్రంబు?
తిరిగెనే మృదు పుణ్యతీర్థములకు?

[3]దోసములు పెక్కుఁ జేసినఁ జేసెఁ గాని
కాలగళు భక్తి యావంతఁ గలిగెనేని
యడ్డపడ ధర్మమౌఁ[4]గాక యనఘులార!
యర్థమే యీ దురాత్మున కడ్డపడఁగ ?

1. ము. ననియెనే 2. ము. నేప్రొద్దు. 3. ము. దానములు పెక్కుఁజేసినదానఁగాని, 4. తా. గాన.

అర్థము: పాశుపతులకున్ = శైవులకు, కేలుదోయి + ఎత్తి = రెండుచేతులెత్తి, మ్రొక్కెనె = నమస్కరించెనే? జంగములకున్ = జంగమ దేవరలకు, శరణ + అర్థి +అనియెనే? = శరణని పలికెనా? ఫాల - భాగమునందున్ = నొసట, భస్మంబు = విభూతి, పూసెనే? అఱుతన్ = మెడయందు, రుద్రాక్ష పూస, తాలిచెనె. జిహ్వా-తుదయందున్ =నాలుక కొనయందు, శివ-మంత్రము, ఉచ్చరించెనె, ఎన్నండేన్ = ఎప్పుడైనను, అభవు -గుడికిన్ = శివాలయమునకు, అరిగెనె, మహత్ (మహా)+ప్రమథ -చారిత్రంబు = గొప్పవారయిన ప్రమథుల చరిత్ర, పఠియించెనే = చదివెనా? మృడు-పుణ్య-తీర్థములకున్ = శివుని పుణ్యక్షేత్రములకు, తిరిగెనే? అనఘులార = ఓ పాపరహితులారా! దోసములు, పెక్కున్, చేసినన్ +చేసెన్ +కాని = పెక్కు దోషములు చేసినను, కాల-గళ-భక్తి = గరళకంఠుని (శివుని)యందు భక్తి, అవంత (అవ+అంత) = కొంచెము, కలిగెన్ = ఏని = ఉన్నచో, అడ్డము +పడన్, ధర్మము, ఔన్ + కాక = అగును గాక, ఈ - దురాత్మనకున్ = దుర్మార్గునకు అడ్డము + పడంగన్, అర్హమే = తగునా - తగదనుట.

తాత్పర్యము: ఓ పాప రహితులారా! ఇతడు పాశుపతులకు రెండు చేతులెత్తి నమస్కరించెనా? జంగమ దేవరులకు శరణని పలికెనా? నొసట విభూతి యలదెనా? మెడలో రుద్రాక్షమాలను దాల్చెనా? జిహ్వాగ్రమున శివమంత్రము నుచ్చరించెనా? ఎప్పుడైనను శివాలయమున కరిగెనా? మహాప్రమథుల చరిత్రను పఠించెనా? శివుని పుణ్యక్షేత్రములకు యాత్రచేసెనా? ఎన్ని దోషములు చేసినను శివభక్తి యించుక గలిగినచో నడ్డపడుట మీకు భావ్యము గాని యీ దుర్మార్గున కడ్డపడుట తగునా?

ఉ. ఎట్టుగ నేఁగుదెంచితిరి యిందు కళాధర [1]భృత్యులార యీ
చెట్ట దురాత్మునిన్ హరుని [2]చెంతకునుంగొనిపోవువారలై
యెట్టొకొ శంకరుండొకని నెవ్వని నేఁ గొనితేరఁ బంపినం 60
బట్టఁగ [3]వచ్చినారొ తడఁబాటున వీని మతిభ్రమంబునన్?

అర్థము: ఇందు-కళా-ధర-భృత్యులారా = చంద్రకళను దాల్చువాని (శివుని) సేవకులారా! ఈ - చెట్ట - దురాత్మునిన్ = ఈ దుర్మార్గుని, హరుని - చెంతకున్ = శివుని సమీపమునకు, కొనిపోవు వారలు + ఐ, ఎట్టుగన్ ఎట్లు, ఏగుదెంచితిరి=వచ్చితిరి, ఎట్టొకొ = ఇది యెట్లు? శంకరుండు = శివుడు, ఎవ్వనినిన్ + ఏన్ - ఒకనిన్ = ఎవనినైన నేంకొకనిని, కొనితేరన్ = కొని తెచ్చుటకు, పంపినన్, తడబాటునన్ = తొఱుమాఱుగా, మతి-భ్రమంబునన్ = బుద్ధి చలించుటచే, వీనిన్, పట్టంగన్ - వచ్చినారో = పట్టవచ్చితిరో.

1. తా. భక్తులార. 2. తా. చేరువకుం. 3. తా. వచ్చినారు.

తాత్పర్యము: ఓ శివభక్తులారా! ఈ దుర్మార్గుని శివుని దగ్గఱకు కొనిపోవ నెట్లు వచ్చితిరి? ఈశ్వరుడొకనిని తెండని పంపగా మీరు మతి చలించి తాఱుమాఱుగా వీనిని గొనిపోవ వచ్చితిరా యేమి?

విశేషములు: (మీరు) వచ్చినారొ - `ప్రథమాంతంబులగు యుష్మ దస్మ ద్విశేషణంబుల కేకత్వంబున వునులును బహుత్వంబున, రుములు నంతాగమంబులు ప్రాయికంబుగ నగు' బాల. కారక. 33`ఈ యాగంబులు పరంబులగునపు డుత్వంబున కత్వంబగు.' కాని `తచ్ఛబ్దాంతములగు ధాతుజ విశేషణంబులమీద నరు చూపట్టదు' అని ప్రౌఢవ్యాకరణము చెప్పి, మీరేయే గిరుల్ చూచినారు, ఏయే ద్వీపముల్ మెట్టినారు' అని పెద్దన గారి ప్రయోగములను లక్ష్యముగాచూపెను. ఇదియు నట్టిదే. ఏఁగుదెంచితిరి యిందు కళాధర భృత్యులార =`మధ్యమ పురుష క్రియల యం దిత్తునకు సంధియగు' బాల.సంధి.7దీనిచే ఏఁగు దెంచితి రిందుకళాధర భృత్యులార అని కావలసియుండగా, నిట విసంధిగా నుండుట విచార్యము.

సీ. అని హేతువులును దృష్టాంతంబులును జూపి
 యమ (భృత్యు లియరైరి)యవనిసురుని,
నూరకయుండె మృత్యువు నోర్గదల్పక
 భవునిచే మును పడ్డపాటుఁ దలంచి,
వరుణపాశములచే [1]వ్యథితచేతస్కుఁడై
 సుకుమారుఁడెంతేని (సుక్కుచుండె,
నెదురు చూడఁ దొఱంగి (రీశ్వర యములును)
 తారు పంచినవారు తడయుటయునుఁ

గీ. గాలయాపనమునకు నిగ్రహముఁ బూని
శంభుకింకరు లపు డవష్టంభ మెసఁగ
నౌడు గఱచుచు నప్పు డేకాంతముండి
సమధికం బైన సాహసోత్సాహ[2]వృత్తి 61

అర్థము: అని, యమ-భృత్యులు, హేతువులును = కారణములును, దృష్టాంతములును = ఉదాహరణములును చూపి, అవనిసురునిన్ = బ్రాహ్మణుని, ఇయరు +ఐరి = ఈరైరి. మృత్యువు = మృత్యు దేవత, శివునిచేన్, మును = పూర్వము, పడ్డ పాటున్ = పడిన యవమానమును, తలంచి = స్మరించి, నోర్ + కదల్పక = నోరు మెదపక, ఊరక + ఉండెన్. సుకుమారుడు, వరుణ - పాశములచేన్ - వరుణుని పాశములచేత, వ్యథిత - చేతస్కుండు + ఐ = బాధపడిన మనస్సు

1. తా. వ్యథితమనస్కుఁడై. 2. తా. మమర.

గలవాడయి, ఎంత + ఏని = మిక్కిలి, గ్రుక్కుచున్ + ఉండెన్ = దుఃఖించుచుండెను. ఈశ్వర - యములును = ఈశ్వరుడును, యముడును, తారు = తాము, పంచినవారు = పంపినవారు, తడయుటయును = ఆలస్యము చేయుటచే, ఎదురు చూడన్ + తొణంగిరి = ఎదురుచూడ దొడగిరి. అపుడు, శంభు - కింకరులు, కాల - యాపవమునకున్ = ఆలస్యమునకు, నిగ్రహమున్ = కోపమును, పూని, అవష్టంభము = గర్వము, ఎసగన్ = అతిశయింపగా, ఔడు+కఱచుచున్ = పెదవి కొఱుకుచు, అప్పుడు, సమధికంబు + ఐన = మిక్కిలి యెక్కువయిన, సాహస + ఉత్సాహ- వృత్తిన్ = సాహసము, ఉత్సాహము తోడి వర్తనముతో, ఏకాంతము = ఉండి = రహస్యగోష్ఠి నుండి.

తాత్పర్యము: యమదూత లా రీతిగా కారణములను, ఉదాహరణములను జూపి బ్రాహ్మణు నీరైరి. శివునిచే తాను పూర్వము పడిన భంగపాటును దలచి మృత్యు దేవత నోరు మెదప కుండెను. సుకుమారుడు వరుణ పాశబద్ధుడై మనసున బాధ పడుచు దుఃఖించుచుండెను. తాము పంపిన వారాలస్యము చేయుటకు శివుడును యముడును ఎదురుచూడదొడగిరి. అపుడు శివుని సేవకులు కోపించి గర్వ మతిశయింప పెదవి కొఱుకుచు మిక్కిలి సాహసోత్సాహములతో రహస్య గోష్ఠినుండి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ఇయరైరి `ఇచ్చునకు సర్వంబున కీ యగు'- బాల. క్రియ 92 అనుదానిచే `ఈరు'కావలయును. ఇయరు దుష్టము. యమభృత్యులీరైరి యనుచో సరిపోవును. ఈరైరి - `భూతంబున లజికి లిడంతంబగు నగుధాతు వనుప్రయుక్తంబగు' బాల క్రియ 114 ఏకాంతముండి - `ఒక్కొకచో జడంబు సప్తమి కిం బ్రథమయు నగు' ప్రౌఢ. కారక. 20 పక్షమున ఏకాంతమందుండి ఔడు - (రూపాం) అపుడు ఔడుగఱచుచునప్పుడేకాంత ముండి - నిత్యసమాసవిశ్రాంతి.

ఉ. బిత్తరి దండిమాట లిటు ప్రేలెదరే యమరాజు సేవకుల్
చిత్తజవైరి యాజ్ఞ యొక చీరికిఁ గైకొన కంచు నుద్ధతి
న్మిత్తిని వారినిం గదిసి నిర్భరభూరిభుజాబలంబునన్
మొత్తిరి [1]యుర్కి బాహువులు [2]మోడిచి పట్టి వృషాంకకింకరుల్ 62

అర్థము: యమ-రాజు-సేవకుల్-యమధర్మరాజు భటులు, చిత్తజ - వైరి = మన్మథవిరోధియగు శివుని, ఆజ్ఞ, ఒక-చీరికిన్ + కైకొనక = లక్ష్యపెట్టక, బిత్తరి- దండి-మాటలు=మిక్కిలి శౌర్యోక్తులు, ఇటు = ఈరీతిగా, ప్రేలెదరు + ఏ = వాగుదురా?, అంచున్, ఉద్ధతిన్ = గర్వముతో, మిత్తినిన్ = మృత్యువును, వారినిన్

1. తా. యుల్కి. 2. తా. మోడ్చిరి.

= యమభటులను, కదిసి = సమీపించి, వృష+అంక-కింకరుల్ = ఎద్దు ధ్వజముగాగలవాని (శివుని) సేవకులు, నిర్భర-భూరి_భుజా-బలంబునన్ = సంపూర్ణము, అధికము నైన భుజ పరాక్రమముతో, ఉర్కి = ఉఱికి, బాహువులు = చేతులు, మోడిచి-పట్టి = వంచి, మొత్తిరి =కొట్టిరి.

తాత్పర్యము: `యమధర్మరాజు భటులు శివుని యాజ్ఞను లెక్క గొనక-మిక్కిలి శౌర్యోక్తులు ఈ రీతిగా వాగెదరా? యని శివసేవకులు గర్వముతో మృత్యుదేవతను, యముని భటులను సమీపించి సంపూర్ణము, అధికమునైన భుజ పరాక్రమముతో నుఱికి వారి చేతులు వంచి పట్టి కొట్టిరి.

విశేషములు: మృత్యువు (ప్రకృతి)-మిత్తి (వికృతి), ఉఱికి-(రూపాం) ఉర్కి, ఉఱుకు - అచ్ఛికంబులం బదమధ్యంబుల నలడరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు' బాల ప్రకీర్ణక. 17 `అలఘురేఫము లుప్తాచ్క మగుచో లఘురేఫంబగు' ప్రౌఢ. ముక్త. 2 ఉర్కు. దాని క్త్వార్థరూపము-ఉర్కి.

క. కడవసములఁ బ్రహరించిరి
యడిచిరి లాతముల మొత్తి రహివలయములం
బిడికిళ్ళను ఘట్టించిరి
తడఁబడ మృడు భటులు దండధరు కింకరులన్ 63

అర్థము: మృడు -భటులు = శివుని బంట్లు, దండధరు - కింకరులన్ = యముని భటులను, తడఁబడన్ = కలతజెందునట్లు, కడవసములన్ = ధరించుట కుపయోగించు తోళ్లతో, ప్రహరించిరి = కొట్టిరి, లాతములన్ = సన్న్యాసులు ధరించుదండములతో, అడిచిరి = కొట్టిరి, అహి-వలయములన్ = పాప కడియములతో, మొత్తిరి = కొట్టిరి, పిడికిళ్ళను = పిడికిళ్ళతో, ఘట్టించిరి = గ్రుద్దిరి.

తాత్పర్యము: శివుని భటులు యమ కింకరులను తడబడునట్లు కడవసములతోను, లాతములతోను, పాప కడియములతోను కొట్టిరి. పిడికిళ్ళతో గుద్దిరి.

విశేషములు: కడవసములు, లాతములు, అహివలయములు - ఇవి యన్నియును శైవ సులభములైన వస్తువులే యగుట గమనింప దగినది. కడవసము - (రూపాం) కడావసము, కళవసము, కళాసము `ధార్య చర్మ నామము కడాసము కడవసమన. అం.భా 2.177 లాతము (రూపాం) లాతము. పిడికిలి + లు = పిడికిలులు - 1ఇత్తునకు బహువచనంబు పరంబగునపుడుత్వంబగు, బాల. తత్స. 45 . `బహువచనంబు పరంబగునపుడు డ ల ట ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు - బాల. అచ్ఛిక 12 `బహువచన శ్లిష్టంబు లయి యద్విరుక్తంబు లయిన డకార లకారంబుల కలఘు లకారంబు నిత్యంబుగనగు - పిడికిళ్లు బాల.

అచ్చిక. 14 `జడంబు తృతీయా సప్తములకు ద్వితీయ బహుళంబుగ నగు' బాల. కారక. 22పిడికిళ్లను. ఇట తృతీయకు ద్వితీయ

వ. *(ఇట్లు) మొత్తువడి యమకింకరులు [1]శంకరకింకరులకుం బ్రతిఘటింపక సుకుమారునిం బరివేష్టించి యమలోకంబున కభిముఖులై యతని గొనిపోవం దొణంగి రప్పుడు రుద్రాక్ష మాలికా వక్షఃస్థలుండును, జంద్రార్ధ కృత శేఖరుండును, భస్మో ద్ధూళిత లలితాంగుండును, త్రిలోచనుండును, [2]నతి ప్రమాణ కాయుండును నగు నీలలోహిత ప్రమథుండు కాలాంబుద ధ్వాన గంభీరం బైన కంఠస్వనంబున నిట్లనియె.64

అర్థము: ఇట్లు, మొత్తు + పడి = దెబ్బలు తిని, యమ - కింకరులు, శంకర - కింకరులకున్, ప్రతిఘటింపక = ఎదురుకొనక, సుకుమారునిన్, పరివేష్టించి = చుట్టుకొని, యమ - లోకంబునకన్, అభిముఖులు + ఐ = మొగము గలవారయి, అతనిన్, కొనిపోవన్ + తొణంగిరి = కొనిపోవ యత్నించిరి, అప్పుడు, రుద్రాక్ష - మాలికా - వక్షస్ + స్థలుండును = రుద్రాక్షమాల ఉరఃప్రదేశమున గలవాడును, చంద్ర + అర్ధ - కృత - శేఖరుండును = అర్ధచంద్రునిచే, చేయబడిన, శిరోభూషణము గలవాడును, భస్మ + ఉద్ధూళిత - లలిత + అంగుండును = విభూతితో, పూయబడిన, మృదువైన, శరీరము గలవాడును, త్రిలోచనుండును = మూడు కన్నులు గలవాడును, అతి - ప్రమాణ - కాయుండును = మిక్కిలి పెద్ద శరీరము గలవాడును, అగు, నీలలోహిత - ప్రమథుండు = నీలలోహితుడను ప్రమథుడు, కాల + అంబుద - ధ్వాన - గంభీరంబు = ప్రళయ సమయమునందలి, మేఘముల, ధ్వనివలె, గంభీరమయినది, ఐన, కంఠ - స్వనంబునన్ = ఎలుగున, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: ఇట్లు దెబ్బలు దిని యమభటులు శివభటుల నెదిరింపక సుకుమారుని చుట్టుకొని యమలోకముదెస మొగములు గలవారయి యతనిని తీసికొని పోవ యత్నించిరి. ఆ సమయమున రుద్రాక్షమాల లురమున ధరించిన వాడును, అర్ధచంద్రుడు శిరోభూషణముగా గలవాడును, విభూతి శరీరమున పూసికొనినవాడును, త్రినేత్రుడును, మహాకాయుడును అగు నీలలోహితుడను ప్రమథుడు ప్రళయ సమయ మేఘధ్వనిగంభీరమైన యెలుగున నిట్లు పలికెను.

సీ. పడసె నెవ్వని కృప బ్రహ్మ బ్రహ్మత్వంబు
విష్ణుఁడు విష్ణుత్వవిభ్రమంబు?
నీరేడు జగములు నెవ్వాని కుక్షిలో
నొక్కడొక్కంటితో నొరయుచుండు?
నంధకేభజలంధరాది దానవకోటి
గ్రాఁగించె నెవ్వాని కంటిమంట?

తాళపత్రములో లేదు. 1. తా. శంకరభటులకుం. 2. తా. అతిప్రమాణోపాయుండును.

యామ్నాయశాఖాసహస్రంబు లెవ్వని
నాసికా రంధ్రనిశ్వాసధార?

గీ. లమ్మహాదేవు లెంకల మైన మేము
భర్తయానతి నిర్వహింపంగఁ [1]దలప
మమ్ముఁ జీరికిఁ గైకోక మదము పేర్మి
నెట్టుకొని పోయెదరు విప్రునెఱయఁ గట్టి. 65

అర్థము: ఎవ్వని, కృపన్ = దయచేత, బ్రహ్మ, బ్రహ్మత్వంబున్, విష్ణుండు, విష్ణుత్వ - విభ్రమంబున్ = విష్ణుత్వమనెడి విలాసమును, పడసెన్ = పొందెనో, ఎవ్వాని, కుక్షిలోన్ = కడుపులో, ఈ రేడు - జగములున్ = పదునాలుగు భువనములును, ఒక్కండు = ఒకటి, ఒక్కంటితోన్ = మఱియొక దానితో, ఒరయుచున్ + ఉండున్ = రాచుకొనుచుండునో, ఎవ్వాని, కంటి - మంట, అంధక + ఇభ - జలంధర + ఆది - దానవ - కోటిన్ = అంధకుడు, గజాసురుడు, జలంధరుడు మున్నగు రాక్షసుల సమూహమును, క్రాగించెన్ = తపింపజేసెనో, ఎవ్వని, నాసికా - రంధ్ర - నిశ్వాస - ధారలు = ముక్కు రంధ్రములందలి, నిశ్వాసముల ప్రవాహములు, ఆమ్నాయ - శాఖా - సహస్రంబులు = వేల కొలది వేదశాఖలో, ఆ + మహాదేవు - లెంకలము = ఆ మహేశ్వరుని భటులము, ఐన, మేము, భర్త + ఆనతిన్ = ప్రభువునాజ్ఞను, నిర్వహింపంగన్ = నెఱవేర్చుటకు, తలఁపన్ = ఎంచగా, మదము - పేర్మిన్ = గర్వాతి శయముతో, మమ్మున్, చీరికిన్ + కైకోక = లక్ష్యపెట్టక, విప్రున్ = బ్రాహ్మణుని, నెఱయన్ + కట్టి - గట్టిగాగట్టి, నెట్టుకొని - పోయెదరు = త్రోసికొని పోయెదరు.

తాత్పర్యము: ఎవని దయచేత బ్రహ్మ బ్రహ్మత్వమును, విష్ణుడు విష్ణుత్వపు సొగసును పొందెనో, ఎవని కడుపులో పదునాలుగు భువనములును ఒకదానితో నొకటి యొరసి కొను చుండునో, ఎవని కంటిమంట అంధకుడు, గజాసురుడు, జలంధరుడు మున్నగు రాక్షసుల సమూహమును తపింపజేసెనో, ఎవని ముకు రంధ్రముల వెడలు నిట్టూర్పులు వేలకొలది వేదశాఖలో, ఆ మహాదేవుని భటులమైన మేము స్వామి యాజ్ఞను నెఱవేర్పనెంచగా గర్వాతిశయముతో మమ్ము లెక్కచేయక బ్రాహ్మణుని గట్టిగా గట్టి త్రోసికొని పోయెదరు!

విశేషములు: అంధకుడు - ఒక రాక్షసుడు. సింహికా విప్రచిత్తుల కుమారుడు. ఇతడు బ్రహ్మను గూర్చి తపస్సు చెసి పొందిన వరముల వలన గర్వించి పార్వతిని బెదరింప జొచ్చెను. వీనిని శివుడు సంహరించెను. గజాసురుడు - మహిషాసురుని

1. తా. దగదా

కుమారుడు. ఇతడు శివుని గూర్చి తపస్సు చేసి వరములను పొందెను. వరగర్వమున నితడు దేవతలను బాధించుచుండ, వారు శివునితో చెప్పి కొనిరి. శివుడాతనిని శిక్షింపనేగ నతడు వానితో నీచేత చావవలయుననియే నేనిట్టిపనులను చేయుచున్నాను. నీవు నన్ను చంపి నా చర్మమును ధరింపు' మన శివుడట్లే చేసెను. జలంధరుడు - సముద్రుని కొడుకు. ఇతడు శివుని రూపము దాల్చి, కొందఱు రాక్షసులు ప్రమథులుగా పార్వతి కడకు వచ్చెను. పార్వతి భయపడి విష్ణువును స్మరించెను. ప్రత్యక్షమైన విష్ణువుతో `నీవు జలంధరుని భార్యయగు బృంద పాతివ్రత్యమును చెఱుపుము. అప్పుడు గాని జలంధరుడు లొంగ' డని పార్వతి చెప్ప, నతడట్లుచేసెను. జలంధరుడు పార్వతిని మోసపుచ్చదలచెనని తెలిసికొని శివుడు వానిని సంహరించెను. కైకోక - కైకొను - `కజీ వ్యతిరేక క్త్వార్థంబున నగు.' బాల. క్రియ. 39 కైకొను + కజీ. `ముజ్జు పరంబగునపుడు కోశబ్దంబు కొనునకు బహుళంబుగా నగు - బాల. క్రియ. 60 అను సూత్రమునందలి బహుళ శబ్దమువలన దీనికి నొకానొకచోనతిచారము. కావుననే `కజీ' అను జీత్తు పరమగునపుడును కోశబ్దమాదేశమయినది. కైకోక.

ఉ. బుద్ధియ కల్గెనేని కొనిపోకుఁడు ధర్మము సూక్ష్మమి [1]యసం
బద్ధములైన న్యాయములఁ బంతము వచ్చునె [2]మేము [3]దెంపుమై
యుద్ధము సేయజాలకయ యోహరిసాహరి నెంత చెప్పిన
[4]న్నిద్ధరణీతలామరుని నీరు చలంబున మీకుఁ దక్కునే. 66

అర్థము: బుద్ధి + అ-కల్గెన్ + ఏని = బుద్ధియే యున్నచో, కొని పోకుఁడు = తీసికొనిపోవకుడు, ధర్మము, సూక్ష్మము = సున్నితము, ఈ + అసంబద్ధములు + ఐన = ఈ అసంగతములైన, న్యాయములన్ = ధర్మములందు, పంతము = పట్టుదల, వచ్చున్ + ఎ = తగునా?, మేము, తెంపు-మైన్ = సాహసముతో, యుద్ధము, చేయన్ + చాలక + అ = చేయలేకా? ఓహరి సాహరిన్ = అహమహమికతో - సాహంకారముగా, ఎంత-చెప్పినన్ - ఈ + ధరణీ-తల + అమరునిన్ = ఈ భూసురుని, చలంబునన్ = పట్టుదలతో, ఈరు = ఒసగరు, మీకున్, తక్కునే = లభించునా?

తాత్పర్యము: ఓ యమభటులారా! మీకు బుద్ధి యున్నచో వీనిని గొనిపోవకుడు. ధర్మము సున్నితమయినది. ఇట్టి అసంగతములయిన న్యాయములందు పంతము తగునా? మేము సాహసముతో యుద్ధము చేయలేకా? చేయగల మనుట, అహమహమికతో మే మెంత చెప్పినను పట్టుదలతో మీరీ బ్రాహ్మణు నీకున్నారు. ఇతడు మీకు లభించునా?

---

1. తా. మిట్లు, 2. తా. యేము, 3. తా. నగ్గలింపఁగా, 4. తా. న్నిద్ధరణీసురోత్తముని.

విశేషములు: ఓహరిసాహరి - అహమహమికతో, సాహంకారముగా, (సూ.ని.)- అహమహమిక పేరు రహికెక్కు నో హరి సాహరి యనంగను ఆం.భా. 2.221,ఎంత చెప్పినన్ + ఈద్ధరణీ - ఎంత చెప్పినన్నిద్ధరణీ.....అచ్చు పరమగుచుండగా ద్రుతమునకు ద్విత్వము. `కొన్నియెడలం బ్రామాణిక ప్రయోగంబులం ద్రుతంబునకచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి' ప్రౌఢ. సంధి. 3.

గీ. ఎంత చెప్పిన విన[1]రేమి యీకు మాకు
హరుని యా[2]జ్ఞయ బలవంత మల్ప మెట్టు
[3]చాక నొవ్వక మీరు మా కాఁకఁ జెడక
[4]యిద్ధరామరు మా కిప్పుడిచ్చు టొప్పు 67

అర్థము: ఎంత-చెప్పినన్, వినరు + ఏమి, ఈకున్ = మీకును, మాకున్, హరుని = శివునియొక్క, వినరు + ఏల, ఈకున్ = మీకును, బలవంతము = బలముగలది - దాటరానిది యనుట, అల్పము + ఎట్టు = తక్కువది యెట్లగును, మీరు, చాక = చావక, నొవ్వక = బాధపడక, మా - కాఁకన్ = మేము పెట్టుతాపముచే, చెడక = నశింపక, మాకున్, ఇప్పుడు, ఈ + ధరా + అమరున్, ఇచ్చుట, ఒప్పున్.

తాత్పర్యము: ఎంతచెప్పినను మీరు వినరేమి? మీకును మాకుని శివుని యాజ్ఞ దాటరానిదిఅది యల్పముగాదు. మీరు మాచే చావక, బాధలు పడక, మేము పెట్టు తాపముచే నశింపక యీ బ్రాహ్మణుని మా కిప్పు డిచ్చుట మంచిది.

విశేషములు: ఈక = మీకు - చాక - చచ్చు + కజీ - `కజీ వ్యతిరేకార్థంబునం దగు.' బాల. క్రియ 39. చావు నోవులు చచ్చు నొచ్చుల కగు.' బాల. క్రియ. 94. చావు + కజీ. `జీత్తు పరంబగునపుడు వాని వువర్ణంబు విభాషను లోపించు.' బాల. క్రియ. 95 చాక. పక్షమున - చావక. కాఁగు - కృదంతరూపము కాఁక. `కవర్ణకం బలుగ్వాదుల కగు.' బాల. కృదంత. 3.

క. నావుడును యముని దూతలు
భావభవారాతి [5]ప్రమథవర్గముతోడన్
సేవకధర్మము తగవును
లావును బంతంబు [6]దృఢబలంబును మెఱయన్. 68

అర్థము: నావుడును = అని శివభటులు పలికినంతనే, యముని దూతలు, భావ - భవ + అరాతి - ప్రమథ - వర్గము తోడన్ = మన్మథునకు శత్రువగు శివుని

1. తా. నేమి నేము మీకు. 2. తా. యు. 3. తా. చాలనొప్పక పరిభూతిఁజటుల పడక. 4. తా. యీధరాసురవరుని మాకిచ్చుటొప్పు 5. ప్రముఖ భటవర్గముతో. 6. తా. కడుఁజలంబును.

ప్రమథ గణముతో, సేవక - ధర్మము = సేవకుల ధర్మము, తగవును = న్యాయమును, లావును = ధైర్యమును, పంతంబున్ = పట్టుదలయును, దృఢ - బలంబును = అతిశయమైన బలమును, మెఱయన్ = ప్రకాశింపగా.

తాత్పర్యము: అని శివభటులు పలుకగానే యమభటులు శివుని ప్రమథగణములతో సేవక ధర్మము, న్యాయము, ధైర్యము, పంతము, అధికబలమును మెఱయగా - తరువాతి వచనముతో నన్వయము.

వ. [1]ఇట్లని పలికిరి. 69

తాత్పర్యము: ఈ విధముగా పలికిరి.

క. చత్తుము చెఱఁబడుదుము కడు
నొత్తుము మీ చేత నెట్టునుందగవు మముం
బుత్తెంచిన పతి సన్నిధి
నుత్తర మెట్లిత్తు మాజ్ఞ యుపహతిఁ బొందన్. 70

అర్థము: మీ - చేతన్, చత్తుము, చెఱన్ + పడుదుము = బంధింపబడుదుము, కడున్ = మిక్కిలి, నొత్తుము = బాధపడుదుము, ఎట్టునున్ - తగవు = ఎట్లును న్యాయము, మమున్, పుత్తెంచిన = పంపినట్టి, పతి = సన్నిధిన్ = స్వామి ద్రోల, ఆజ్ఞ, ఉపహతిన్ + పొందన్ = దెబ్బతినగా, ఉత్తరము = సమాధానము, ఎట్లు + ఇత్తుము?

తాత్పర్యము: మీచేత చత్తుము. బంధనమున పడుదుము. మిక్కిలి బాధనందెదము. ఎట్లును ధర్మము వలయును. మమ్ము పంపిన మా స్వామి యాజ్ఞ దెబ్బతినగా, నతని ద్రోల మేమేమని సమాధానమిత్తుము?

విశేషములు: పుచ్చు - 'తెంచు ధాతు వగ్వాదుల కనుప్రయుక్తంబగు' - బాల. క్రియ. పుచ్చు + తెంచు. అయ్యది పరంబగునపుడు చువర్ణంబు లోపించు ' - బాల. క్రియ. 112. పుత్తెంచు.

సీ. చర్చించి చూడుఁడా చంద్రార్ధమౌళికి
యమరాజు నిజభృత్యుఁ డౌనొ కాఁడొ
యభవుఁ డిచ్చిన యట్టి యధికారమోఁ గాదొ
యముఁడు గూర్చున్న ధర్మాసనంబు
త్రిపురాసురాంతకు [2]దివ్యదేహమ్ము గాదొ.

1. తా. ఇట్లు పలికి. 2. తా. దివ్యాజ్ఞయోఁగాదొ.

[1]వేదస్మృతులు తత్త్వవిధిఁ దలంప
శిష్టరక్షయు దుష్టశిక్షయు శూలికి
(ననుమతంబౌఁగాదొ) యాత్మలోన

గీ. నవకరము లెన్ని యన్నియు [2]నాచరించెఁ
బాపియగు వీని నరకకూపమునఁ ద్రోచి
బాధపెట్టంగవలసిన పట్టునందుఁ
బంతమే విడుఁడంట యో ప్రమథులార! 71

అర్థము: ఓ - ప్రమథులార! యమరాజు, చంద్ర + అర్ధ - మౌళికిన్ = అర్ధచంద్రుడు శిరసునందు గలవానికి - శివునకు, నిజ - భృత్యుండు = తన సేవకుడు, ఔనొ, కాడొ, చర్చించి - చూడుడా = ఆలోచించి చూడుడు. యముడు, కూర్చున్న, ధర్మ + ఆసనంబు = న్యాయపీఠము, అభవుండు = శివుడు, ఇచ్చిన + అట్టి, అధికారము, ఔన్ + కాదొ = అగునోకాదో! - తప్పక అగునని భావము. తత్త్వ - విధిన్ = సత్య విధమును, తలంపన్ = ఆలోచింపగా - నిజమాలోచింపగా ననుట, వేద - స్మృతులు = వేదములును, వేదాంతములును, త్రిపుర + అసుర + అంతకు = త్రిపుర రాక్షసులను నాశనము చేసిన శివుని యొక్క, దివ్య - దేహము + కాదొ = దివ్యమైన శరీరము కాదా? అగుననుట. శూలికిన్ = శూలము గలవానికి - శివునకు, ఆత్మలోనన్ = మనస్సులో, శిష్ట - రక్షయున్ = మంచివారి యొక్క, రక్షణమును, దుష్ట - శిక్షయున్ = చెడ్డవారియొక్క, శిక్షించుటయును, అనుమతంబు = అంగీకారము, ఔన్ + కాదొ = అగునుగదా. అవకరములు + ఎన్ని = నీచకార్యము లెన్ని, అన్నియున్, ఆచరించెన్ = చేసెను, పాపి + అగు - వీనిన్ = పాపాత్ముడగు వీనిని, నరక - కూపమునన్ = నరకమనెడి నూతి యందు, త్రోచి, బాధపెట్టంగన్ - వలసిన - పట్టునందున్ = బాధింపవలసిన సమయమున, విడుడు + అంట = విడిచి పెట్టుడనుట, పంతము + ఏ = న్యాయమా?

తాత్పర్యము: ఓ ప్రమథులారా! యముడు శివునకు సేవకుడగునో కాడో విమర్శింపుడు. యముడు అధిష్ఠించిన ధర్మ పీఠము శివుడిచ్చిన యధికారమే కదా! తత్త్వమాలోచింప వేదములును, వేదాంతములును శివుని దివ్యదేహము కాదా? శివునకు శిష్టరక్షణము, దుష్టశిక్షణము ఆత్మలో నంగీకారమే కదా! ఇతడెన్ని నీచ కార్యములు గలవో అన్నిటి నాచరించెను. పాపాత్ముడగు వీని నరక కూపమున త్రోసి బాధింపవలసిన సమయమున విడిచిపెట్టుడనుట మీకు న్యాయమా?

విశేషములు: అంట - అనుట. 'తిదుటలు పరంబు లగునపుడన్వాదుల నుస్థానంబున సున్నయు నుండు దులోపంబును విభాషనగు.' బాల. క్రియ. 58.

1. తా. వేదస్తుతులు, 2. నాచరించి.

ఉ. చచ్చిననేమి మూర్ఛ (నరసచ్చిన) నేమి, ప్రహార వేదనన్,
నొచ్చిన నేమి పండ్లు చెవి నోరు కరాంగుళి నేత్రగోళముల్,
ముచ్చిన నేమి [1]పట్టువడి [2]మొక్కలి బంధనశాలలోనికిన్
వచ్చిన నేమి, భృత్యునకు [3]నచ్చిన యేలిక యాజ్ఞపట్టునన్. 72

అర్థము: నచ్చిన + ఏలిక + అజ్ఞ - పట్టునన్ = ఇష్టుడైన, ప్రభువు యొక్క, అన, విషయమున, భృత్యునకున్ = సేవకునకు, మూర్ఛన్ = మూర్ఛతో, చచ్చినన్ + ఏమి = చచ్చినను నష్టము లేదు, ప్రహార - వేదనన్ = దెబ్బలవలని బాధతో, అర + చచ్చినన్ + ఏమి = సగము చచ్చినను నష్టము లేదు, పండ్లు = దంతములు, చెవి, నోరు, కర + అంగుళి = చేతి వ్రేళ్లు, నేత్ర - గోళముల్ = గుండ్రని కన్నులు, ముచ్చినన్ + ఏమి = పోయినను నష్టము లేదు, పట్టుబడి = బంధితుడయి, మొక్కలిన్ = మిడిసిపాటున, బంధన - శాలలోనికిన్ = కారాగృహము లోనికి, వచ్చినన్ + ఏమి?

తాత్పర్యము: తన్ను ఆదరించు స్వామి అజ్ఞా పాలనమునందు భృత్యుడు మూర్ఛతో చచ్చిన నేమి? చావుకంటెను, స్వామి అజ్ఞానిర్వహణము ముఖ్యమనుట. దెబ్బలు తిని ఆ బాధచే సగము చచ్చిన నేమి? పండ్లు, చెవి, నోరు, చేతివ్రేళ్లు, గుండ్రని కన్నులు పోయిననేమి? బంధితుడయి ఔద్ధత్యమున కారాగృహములోనికి వచ్చిననేమి?

గీ. తగవు ధర్మంబు పాడి పంతంబు దెలిసి
యనుపుఁడీ బ్రాహ్మణుని బాధ లనుభవింప
నొండె దురమున మమ్ము మృత్యువు జయించి
విప్రుఁ గొనిపొండు మాటలు వేయునేల? 73

అర్థము: తగవు, ధర్మంబు, పాడి, పంతంబు = న్యాయము, తెలిసి = ఎఱిగి, బ్రాహ్మణునిన్, బాధలు, అనుభవింపన్ = అనుభవించుటకు, అనుపుడీ = పంపుడు, ఒండెన్ = లేదా, దురమునన్ = యుద్ధమునందు, మమ్మున్, మృత్యువున్ = మృత్యుదేవతను, జయించి = గెలిచి, విప్రున్, కొనిపొండు, మాటలు, వేయున్ + ఏల? = వేయేల?

తాత్పర్యము: శివభటులారా! తగవు, ధర్మము, పాడి, పంతము తెలిసి బ్రాహ్మణుని బాధ లనుభవించుటకు చంపుడు. లేదా యుద్ధమున మమ్మును. మృత్యువును గెలిచి విప్రుని దీసికొని పొండు. ఇన్నిమాటలెందులకు?

1. ము. పట్టపతి, 2. తా. మొక్కలి, 3. తా. వచ్చిన.

విశేషములు: పోవు ధాతువు ప్రేరణార్థకరూపము అనుపు. (రూ.పాం.) పుచ్చు, పనుచు, పంచు, పనుపు, పంపు, అనుచు, అంచు, అంపు.

క. మీకును మీ పతి యానతి
మాకును మా భర్త యాజ్ఞ మన్నింపఁదగున్
[1]వాకోవాక్యమ్ముల వెడ
వాకాట్లం బల్ఛజంబు వలవదు సేయన్. 74

అర్థము: మీ - పతి + ఆనతి = మీ స్వామి ఆజ్ఞ, మీకును, మా - భర్త + ఆజ్ఞ = మా స్వామి ఆజ్ఞ, మాకును, మన్నింపన్ + తగున్ = పాటింపదగును, వాకోవాక్యమ్ములన్ = మాటకుమాటగా, వెడ = వ్యర్థములైన, వాకాట్లన్ = వాగ్వాదములతో, బల్ఛజంబు - సేయన్ - వలవదు = తృణీకరింపవలదు.

తాత్పర్యము : మీ స్వామి యాజ్ఞ మీకును, మా స్వామి యాజ్ఞ మాకును పాటింపదగును. మాటకు మాటయైన వ్యర్థవాగ్వాదములతో తృణీకరింపవలదు.

క. అని యముని భటులు పలికిన
విని శంకరభటులు తద్వివేకంబునకున్
మనమున సంతోషించియు
[2]మనసిజహరు శాసనమును మన్నించుటకై. 75

అర్థము: అని, యముని - భటులు, పలికినన్, శంకర - భటులు = శివుని బంట్లు, విని, తద్ + వివేకంబునకున్ = వారి విచారణ చేయు శక్తికి, మనమున్ = మనస్సునందు, సంతోషించియున్ = ఆనందించియును, మనసిజ - హరు = మన్మథనాశకుని (శివుని), శాసనమును = ఆజ్ఞను, మన్నించుటకై = పాటించుటకయి.

తాత్పర్యము: అని యమభటులు పలుకగా విని శివభటులు వారి విచారణ శక్తికి మనస్సున సంతోషించియు, శివునానతిని పాటించుటకయి - తరువాత పద్యముతో నన్వయము.

సీ. పొడి కచ్చడములపైఁ బులితోలు ననుసేలు
కటిభారమునఁ గాసెకట్టు గట్టి
యభినవంబైన రుద్రాక్ష యొడ్డాణంబు
నాభిచక్రము లోనుగా భరించి
ప్రిదిలి జాఱకయుండఁ బెనుఁబాఁప [3]ప్రోఁగులు
[4]శ్రవణభాగమునందు సంతరించి

1. తా. వాకోపవాక్యములు. 2. తా. మనసిజహరు శాసనమున. 3. తా. ప్రోగ్గళ్ళు. 4. తా. శ్రవణ. పాశమునందు.

యల్లిబిల్లిగ జటావల్లీ మతల్లులు
గూర్చి పెంపొందఁ గీల్కొప్పు వెట్టి

గీ. భసితధూళి శరీర మభ్యంగ మార్చి
యుద్ధవిడి బారిషదయోధులొక్కఁడొకఁడ
యాయుధంబులు ధరియించి యట్టహాస
డమరుకధ్వాన సింహనాదములతోడ. 76

అర్థము: పారిషద - యోధులు = శివానుచరులైన వీరులు, ఒక్కండు, + ఒక్కడు + అ = ఒక్కొక్కడే, పొడి - కచ్చడములపైన్ = చిన్నవియగు, గోచి గుడ్డలమీద, పులితోలు - నునుసేలు = పులితోలనెడు నున్నని సన్నవస్త్రము, కటి - భారమునన్ = మొలనిండుగా, కాసెకట్టు - కట్టి = దట్టిబిగియగట్టి, అభినవంబు + ఐన = క్రొత్తది యగు రుద్రాక్ష + ఒడ్డాణంబు = రుద్రాక్షల యొడ్డాణము, నాభి - చక్రము - లోనుగాన్ = నాభీవలయము క్రిందుగా - బొడ్డుక్రిందికి, భరించి = వహించి - ధరించి, పెను + పాప - ప్రోగులు = పెద్ద పాముల కర్ణాభరణములు, ప్రిదిలి = సడలి, జాఱక + ఉండన్ = జాఱిపోవకుండునట్లు, శ్రవణ - భాగమునందున్ = చెవులందు, సంతరించి = పెట్టి, అల్లిబిల్లిగన్ = పెనవైచుకొని, జటా - వల్లీ - మతల్లులు = శ్రేష్ఠములైన తీగలవంటి జడలు, కూర్చి = కూడు నట్లు చేసి, పెంపొందన్ = పెద్దదిగా, కీల్కొప్పు + పెట్టి = వెంద్రుకలముడి వైచి, భసిత - ధూళిన్ = విభూతి పొడితో, శరీరము, అభ్యంగము + ఆర్చి = తలంటు ఆడించి - అంతటను పూసికొనియనుట, ఉద్దవిడిన్ = వెంటనే, ఆయుధంబులు, ధరియించి, అట్టహాస - డమరుక - ధ్వాన - సింహనాదములతోడన్ = పెద్దనవ్వులు, డమరువుల (చర్మవాద్యవిశేషము) ధ్వని, సింహనాదములతోడన్ = సింహధ్వనులు - అనువానితో.

తాత్పర్యము: శివానుచరులైన వీరు లొక్కొక్కడే చిన్నిగోచి గుడ్డలపై పులితోలు నును సన్నవస్త్రమును మొలకు దట్టిగా గట్టి, క్రొత్తవియగు రుద్రాక్ష యొడ్డాణములు బొడ్డుక్రిందికి బిగించి, సడలి పోయి జాఱిపోవకుండు లాగున పెను బాముల చెవి ప్రోగులు చెవుల బెట్టుకొని, ఒకదానితో నొకటి పెనవైచుకొనునట్లు తీగల వంటి జడలను గూర్చి పెద్దది యగు కొప్పు పెట్టి, విభూతి నొడలి నిండ బూసికొని, వడిగా నాయుధములు ధరించి, అట్టహాసములయు, డమరువులయు, సింహగర్జనలయు ధ్వనులతో - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ప్రమథ వీరుల యుద్ధ సన్నద్ధత రమణీయముగా వర్ణింపబడినది. అది శైవముగనే సాగుట గమనింపదగినది. సేలు - (రూపాం.) సాలు, పొడి = అల్పము - పొడి తెమ్మెర = పిల్ల వాయువు, పాపప్రోగులు - పాము + ప్రోగులు - 'కొండొకచో సమాసంబులందు నామ్వాది కనుమ్వాదుల మువర్ణంబులు ప

జ్ఞ్వర్ణంబులగు.' బాల. సమాస. 19 అభ్యంగము - అభ్యంజనము.

శా. ఆటోపారభటీ సముద్భటతరాహంకారబాహాధను
ర్జ్యా టంకార రవంబు లంబుజభవాండా భ్యంతరంబున్ సమా
స్ఫోటింపంగ లలాటలోచన భుజిష్యుల్దండభృద్భృత్యులన్
ధాటీ సంభ్రమలీలఁ దాఁకిరి వడిన్ ధారాధరాధ్వంబునన్. 77

అర్థము: లలాట - లోచన - భుజిష్యుల్ = నుదుట కన్ను గలవాని (శివుని), సేవకులు, ఆటోపా...... రవంబులు: ఆటోప = వేగిరపాటు యొక్క, ఆరభటీ = అతిశయము చేత, సముద్భటతర = మిక్కిలి అధికమైన, అహంకార = గర్వముతోడి, బాహా = భుజములందలి, ధనుస్ + జ్యా = వింటి యొక్క, నారి యొక్క, టంకార = టంకృతి యొక్క, రవంబులు = ధ్వనులు, అంబుజ - భవ + అండ + అభ్యంతరంబున్ = బ్రహ్మాండము లోపలి భాగమును, సమాస్ఫోటింపంగన్ = పగుల గొట్టగా, దండ - భృత్ + భృత్యులన్ = దండధరుని (యముని) యొక్క, సేవకులను, ధారా - ధర + అధ్వంబునన్ = మేఘమార్గమున - ఆకాశమునందు, ధాటీ - సంభ్రమ - లీలన్ = దాడియొక్క వేగిరపాటు యొక్క విలాసముతో, వడిన్ = వేగముతో, తాకిరి = మార్కొనిరి.

తాత్పర్యము: ఫాలాక్షుని సేవకులు ఆటో పాతిశయముచే అధికతరమైన గర్వము తోడి భుజము లందలి విండ్లనారుల టంకృతి ధ్వనులు బ్రహ్మాండమును పగులగొట్టగా యమభటులను దాడి వేగముతో నాకాశమార్గమున వడిగా మార్కొనిరి.

విశేషములు: వీర రసానుగుణముగా శార్దూలవృత్తము స్వీకరింపబడినది. ఆరభటీ వృత్తి కనుకూలముగా పరుషాక్షర బంధముతో రచన సాగినది. సమాసదైర్ఘ్యము నిటలాక్షభటుల పటుతరాటోపమును సూచించు చున్నది. `అత్యుద్ధతార్థ సందర్భా వృత్తి రారభటీ స్మృతా.' ధనుస్ + జ్యా = పదాంత సకారమునకు విసర్గాదేశము - ధనుః + జ్యా. అఆ లు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులు గాని మృదుహల్లులుగాని పరములగునపుడు రేఫమాదేశమగును. ధనుర్జ్యా. భుజిష్య - `నియోజ్య కింకర ప్రేష్య భుజిష్య పరిచారకాః.' భుఙ్క్తే వేతన మితి భుజిష్యః - కూలిని భుజించువాడు = బంటు. అమరము.

సీ. ద్రాఘిష్ఠకఠినదంష్ట్రాదండసంఘట్ట
కటుఘోర కిటకిటాత్కార మగుచుఁ
జటుల ఝుంఝుమరు ఝంపా పరంపరా
సన్నిభ ఘ్రాణ నిశ్వాస మగుచు

[1]వికలతారకచంద్రవిభ్రాంతి భీషణ
స్ఫార చక్షుర్ద్వయీ భయద మగుచు
[2]నిటల వీథీ విటంక నిర్భర భ్రూకుటీ
నటన క్రియాటోప [3]పటహమగుచుఁ.

గీ. గాలమృత్యువు శాణచక్రమునఁ బట్టి
చికిలి చేసిన యడిదంబుఁ జేతఁ దాల్చి
జేగుఱించిన మొగముతోఁ జిత్తజారి
ప్రమథవర్గంబుఁ దాఁకె నాగ్రహ మెలర్ప. 78

అర్థము: కాల - మృత్యువు = క్రూరమైన, మృత్యువు, ద్రాఘిష్ఠ.......మగుచున్: ద్రాఘిష్ఠ = దీర్ఘతమములైనవియు, కఠిన = పరుషములయినవియు, అగు, దంష్ట్రా - దండ = కఱ్ఱలవంటి కోఱల యొక్క, సంఘట్ట = మిక్కిలి రాపిడిచే, కటు = (కర్ణ) కఠోరము, ఘోర = భయంకరము, అగు, కిటకిటాత్కారము = కిటకిటయను ధ్వనిగలది, అగుచున్, చటుల .... మగుచున్ : చటుల = చలించు, ఝుంఝూ - మరుత్ = వానతో గూడిన గాలి యొక్క, ఝుంపా = దూకుటల యొక్క, పరంపరా = వరుసతో, సన్నిభ = సమానమైన, ఘ్రాణ - నిశ్వాసము = ముక్కునందలి నిట్టూర్పులు గలది, అగుచున్, వికల...... మగుచున్ : వికల = క్షుబ్ధమైన (వికట = భయంకరమైన - అను తా. పాఠమే మేలని తోచుచున్నది), తారక - చక్ర = చక్రముల వంటి కను గ్రుడ్ల యొక్క, విభ్రాంతి = తిరుగుటచే, భీషణ = భయంకరమైన, స్ఫార = విస్తృతమైన, చక్షుస్ + ద్వయీ = కన్నుల జంట చేత, భయదము = వెఱపు గొలుపునది, అగుచున్, నిటల...... మగుచున్ : నిటల - వీథి - విటంక = నొసటి ప్రదేశమునందు, నిర్భర = తీవ్రమైన, భ్రూకుటీ = బొమముడి యొక్క, నటన = నాట్యమనెడి, క్రియా = పనియొక్క, ఆటోప = సంరంభమనెడి, పటహము = ఉద్యమము గలది అగుచున్, శాణ - చక్రమునన్ = పదును పెట్టు చక్రమునందు, పట్టి = పదునుపెట్టి, చికిలి చేసిన = వాడి చేసిన, అడిదంబున్ = కత్తిని, చేతన్ = చేతియందు, తాల్చి, జేగుఱించిన = ఎఱ్ఱబడిన, మొగముతోన్ = ముఖముతో, ఆగ్రహము = కోపము, ఎలర్పన్ = అతిశయింపగా, చిత్తజ + అరి = మన్మథశత్రువైన శివుని యొక్క, ప్రమథ - వర్గంబున్ = ప్రమథగణముల సమూహమును, తాకెన్ = మార్కొనెను.

తాత్పర్యము: దీర్ఘతమములు, పరుషములు నైన దండముల వంటి కోల రాపిడి చే కర్ణకఠోరము, భయంకరమునైన కిటకిటధ్వని గలదియు, చలించు

1. తా. వికట, 2. తా. నిటలభేరి, 3. తా. లటహ

ఝుంఝూమారుతము దూకుటల వరుసతో సమానమైన నాసికా నిశ్వాసములు గలదియు, భయంకరమైన చక్రముల వంచి కను గ్రుడ్లు తిరుగుటచే భీషణమై విప్పారిన కనుదోయిచే వెలుపు గొలుపునదియు, నొసట తీవ్రమైన బొమముడి నాట్య సంరంభమనెడి ఉద్యమము గలదియు అగుచు క్రూరమైన మృత్యువు పదును చక్రమున పదునుపెట్టి వాడిచేసిన కత్తిని చేత ధరించి, ఎఱ్ఱబడిన మొగముతో కోపమతిశయింప శివుని ప్రమథగణములను మార్కొనెను.

విశేషములు: మృత్యు వర్ణన మతి భయంకరముగా చేయబడినది. ఇందలి దీర్ఘసమాసముల త ద్రాఘిష్ఠ కఠిన దంష్ట్రాదండములను, చటుల ఝుంఝూమరుజ్ఝంపా పరంపరా సన్నిభ ఘ్రాణ నిశ్వాసములను, శాణ చక్రమున బట్టిచికిలి చేసిన తత్తడమును స్ఫురింప జేయుచున్నవి. ద్రాఘిష్ఠ - దీర్ఘ + ఇష్ఠ = దీర్ఘ - ద్రాఘీయస్ - ద్రాఘిష్ఠ. మరుజ్ఝంపా - మరుత్ + ఝంపా - ఝల్లునకు హశ్శ పరమగు చుండగా తృతీయ వర్ణాదేశము - మరుద్ + ఝంపా. సకార తవర్గములకు శవర్గ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక కలుగునపుడు క్రమముగా శవర్గ చవర్గ వర్ణము లాదేశమగును. మరుజ్ఝంపా. చక్షుస్ + ద్వయీ - పదాంత సకారమునకు విసర్గా దేశము - చక్షుః + ద్వయీ - అఆ లు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులుకాని మృదు హల్లులు కాని పరములగునపుడు రేఫమాదేశమగును. చక్షుర్ద్వయీ.

వ. తవణి [1]తమరువు తమతమ నినదము తవణించుచుఁ దచ్చటుల (తర) [2]తమామిత డంబర విష్కంభము కాష్ఠా కటాహముల నుద్ఘాటింప, దినకర కరచ్ఛాయాచ్ఛేదాధి గమమున ధగద్ధగితములగు నిస్త్రింశ కుఠారా ద్యాయుధ దీప్తులు రణలక్ష్మి నివాళింపంగ, నపుడు విద్యాధర పన్నగ యక్షగరుడ గంధర్వాదులు మది నాహ్లాదింపంగ, సురముని [3]కుంచె యాడింపంగ, నిలింపపదమున భవుని లెంకలు శమన కింకరులును బాహావష్టంభ విజృంభణ మప్రతి హతముగ నొండొరువుల దాకిన భండనంబు ఘోరంబయ్యెను. 79

అర్థము: తవణి (తవిణ = డంకా? సూ.ని.), తమరువు = డమరువు? అను వాద్య విశేషముల యొక్క, తమతమ - నినదము = తమతమయను ధ్వని, తవణించుచున్ = కలిగించుచు, తద్ + చటుల - తర = వాని యొక్క, మిక్కిలి మనోహరమైన, తమా మిత - డంబర - విష్కంభము = తమామిద శబ్దములయాడంబరము గల ఆయుధవిశేషములు. కాష్ఠా - కటాహములన్ = దిక్కులనెడి బాణలులను, ఉద్ఘాటింపన్ = పగులగొట్టగా, దినకర - కర + ఛాయా + ఛేద + అధిగమమునన్ = సూర్యుని యొక్క, కిరణముల యొక్క, కాంతియొక్క, ఖండముల యొక్క, పొందుటచే,

1. తా. డమరువు ధమధమ, 2. తా. డమావిరడ వాడంబర నిరష్కంధము, 3. తా. కుంచియ.

ధగద్ధగితములు + అగు = ధగధగ మెఱయునట్లు చేయబడినవి అగు, నిస్త్రింశ - కుఠార + ఆది + ఆయుధ - దీప్తులు = ఖడ్గములు, గండగొడ్డళ్లు, మున్నగు, ఆయుధముల, కాంతులు, రణ - లక్ష్మిన్ = యుద్ధమనెడి లక్ష్మిని, నివాళింపంగన్ = ఆరతి కల దానినిగా జేయగను, అపుడు = ఆ సమయమున, విద్యాధర - పన్నగ - యక్ష - గరుడ - గంధర్వ + ఆదులు = విద్యాధరులు, పన్నగులు, యక్షులు, గరుడులు, గంధర్వులు మున్నగు వారు, మదిన్ = మనస్సునందు, ఆహ్లాదింపంగన్ = సంతోషింపగను, సుర - ముని = దేవ మౌని యగు నారదుడు, కుంచె + ఆడింపంగన్ = గుత్తిగా గట్టిన నెమిలి పురికట్టు వీచుచుండగను, నిలింప - పథమునన్ - ఆకాశమునందు, భవుని - లెంకలున్ = శివుని బంటులును, శమన - కింకరులును = యముని భటులును, బాహా + అవష్టంభ - విజృంభణము = భుజబల గర్వము యొక్క అతి శయము, అప్రతిహతముగన్ = అడ్డు లేకుండునట్లు, ఒండొరువులన్ = ఒకరి నొకరు, తాకినన్ = మార్కొనగా, భండనంబు = యుద్ధము, ఘోరంబు + అయ్యెను = భయంకరమయ్యెను.

తాత్పర్యము: తవిణ (డంకా) యును, డమరువును తమతమ ధ్వనులను గలిగించుచు దిక్కుల నెడి బాణలులను పగులగొట్టగా, సూర్యకిరణముల కాంతుల ఖండములు పడుటచే ధగధగమని ప్రకాశించు ఖడ్గములు, గండగొడ్డళ్లు, మున్నగు నాయుధముల కాంతులు యుద్ధమనెడి లక్ష్మికి ఆరతి పట్టగను, ఆ సమయమున విద్యాధరులు, పన్నగులు, యక్షులు, గరుడులు, గంధర్వులు మున్నగువారు మనసునందు సంతోషింపగను, కలహాభోజనుడగు దేవముని నారదుడు సంతోషమున కుంచె వీవగను, ఆకాశమున నీశ్వర భటులును, యమభటులును భుజబల గర్వాతిశయ మడ్డు లేకుండునట్లు ఒకరి నొకరు మార్కొనగా పోరు ఘోర మయ్యెను.

విశేషములు: తవిణ, తమరువు, తమతమ, తవణించు అను వానిలోని తవర్ణ పౌనఃపున్యముచే నా వాద్యముల ధ్వని చెవుల నిండు చున్నది. సూర్యకిరణముల కాంతి ఖండములు పడుటచే మొదలే పదునైన ఖడ్గాదులు మఱింత ధగధగలాడుచుండెను.

ఆ ధగధగకాంతులు యుద్ధలక్ష్మి కారతి పట్టుచుండెను. నారదుడు కుంచె వీచుట సంతోషాతిశయమున. సంతోషము కలహాభోజనుడు కావున. తచ్చటుల - తద్ + చటుల. అనునాసికాంతస్థ భిన్నములైన హల్లులకు (ఝల్లులకు) కఠినహల్లులు (ఖర్రులు) పరమగునపుడు వాని వర్గము లందలి ప్రథమ వర్ణంబులు (చర్రులు) ఆదేశముగా వచ్చును. తత్ + చటుల. సకార తవర్గములకు శవర్గచవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్ణ చవర్గ వర్ణము లాదేశ మగును. తచ్చటుల. కర + ఛాయా - హ్రస్వమునకు పరమైన

ఛకారము ద్విరుక్తమగును. కరచ్ఛాయా. ఛాయా + ఛేద = ఛాయాచ్ఛేద. ఆ, మాలయందు దప్పమిగిలిన పదాంత దీర్ఘాచ్చులకు పరమైన ఛకారము ద్విరుక్తమగుట వైకల్పికము. ఛాయాఛేదముగావచ్చును. రణలక్ష్మి - రణమనెడి లక్ష్మి - రూపకము. కాష్ఠకటాహములు = కాష్ఠలనెడి కటాహములు - రూపకము.

క. శంకరభటులును నంతక
కింకరులు మిథఃప్రహారకీలాలసటా
పంకిలతనులయి కుసుమిత
కంకేలీతరుల భంగిఁ గనుపట్టి రనిన్. 80

అర్థము: శంకర - భటులును, అంతక - కింకరులున్ = యముని భటులును, మిథః....తనులు - మిథస్ = పరస్పరములైన ప్రహార = దెబ్బల వలని, కీలాల = నెత్తురుల జడలతో, పంకిల = బురదగల, తనులు = శరీరములు గలవారు, అయి, కుసుమిత = పూచిన, కంకేలీ - తరుల - భంగిన్ = అశోక వృక్షముల వలె, అనిన్ = యుద్ధము నందు, కనుపట్టిరి = చూపట్టిరి.

తాత్పర్యము: శివభటులును, యమభటులును పరస్పర ఘాతముల వలని నెత్తురుల జడలచే బురదయైన శరీరములుగల వారయి, పుష్పించిన అశోక వృక్షముల వలె యుద్ధమున జూపట్టిరి.

విశేషములు: నెత్తురుల తోడి శరీరము ఎఱ్ఱని పుష్పములుగల అశోక వృక్షము వలెనె యుండును. అలంకార ముపమ.

వ. అప్పుడు కింకరులయందొక్కరుండు యముని సన్నిధికిం జని [2]యతని కిట్లనియె. 81

తాత్పర్యము: అప్పుడు యమభటులలో నొకడు యముని కడకు పోయి యతనితో నిట్లు పలికెను.

సీ. దేవ దేవర యాజ్ఞ ధృతి [3]నేము దలఁబూని
మృత్యుతోఁ గూడి భూమిస్థలమున
[4]కరిగి వణిక్ప్రథమను పట్టణమునకు
ననతిదూరమున శైలాంతరమున
నడవిలో నొక మృగవ్యాధ పక్కణమునం
[5]దరిగి గేహమునఁ గుష్ఠామయమునఁ
జెడిపె కూఁతురు కాళ్లకడ నుండి యేడ్వంగఁ
బంచత్వమొందిన పాపకర్ము

1. తా. కృత రుధిరసటా, 2. తా. యతనితో నిట్లనియె 3. తా.తోడ 4. ము. ఁజని వణిక్ప్రథమను ఘన పట్టణమునకు. 5. ము. గుష్ఠామయమునఁ గుతిలపడఁగ.

గీ. బ్రహ్మబంధుని సుకుమారుఁబట్టి [1]తేఁగ
నభవు దూతలు [2]రానీక యాగినారు
మాకు వారికి దురమయ్యె నాకసమున
నెఱుఁగ జెప్పంగ వచ్చితి నిత్తెఱంగు. 82

అర్థము: దేవ = ప్రభూ! దేవర + ఆజ్ఞన్ = తమ యాజ్ఞను, ధృతిన్ = ధైర్యముతో, ఏము = మేము, తలన్ + పూని = శిరసావహించి, మృత్యుతోన్ = మృత్యువుతో, కూడి = కలిసి, భూమి - స్థలమునకున్ = భూలోకమునకు, అరిగి = వెడలి, వణిక్పథము + అను, పట్టణమునకున్, అనతి - దూరమునన్ = కొలది దూరమున, శైల + అంతరమునన్ = కొండలలోపల, అడవిలోన్, ఒక, మృగవ్యాధ - పక్కణమునందున్ = బోయపల్లెయందు, అరిగి = వెడలి, గేహమునన్ = శరీరమున, కుష్ఠ + ఆమయమునన్ = కుష్ఠవ్యాధితో, చెడిపె - కూతురు = అంకుటాలగు కూతురు, కాళ్ల - కడన్, ఉండి, ఏడ్వంగన్, పంచత్వము = మరణము, ఒందిన = పొందిన, పాప - కర్మున్ = పాపపుపనులు గలవానిని, బ్రహ్మబంధునిన్ = నీచ బ్రాహ్మణుని, సుకుమారున్, పట్టి, తేగన్ = తీసికొనిరాగా, అభవు - దూతలు = శివభటులు, రానీక, ఆగినారు = ఆపిరి, మాకున్, వారికిన్, ఆకసమునన్, దురము = యుద్ధము, అయ్యెన్, ఈ - తెఱంగు = ఈ విధమును, ఎఱుంగన్ = తెలియునట్లు, చెప్పంగన్, వచ్చితిన్.

తాత్పర్యము : ప్రభూ! మేము తమ యాజ్ఞను శిరసావహించి మృత్యువుతో గలిసి భూలోకమున కరిగి వణిక్పథము అను పట్టణమున కించుక దూరమున కొండలనడుమ నడవిలో నొక బోయపల్లెలో నొక యింట కుష్ఠవ్యాధితో, అంకుటాలయిన కూతురు కాళ్ల దగ్గఱనుండి యేడ్చుచుండగా, మరణించిన పాపాత్ముడు, నీచ బ్రాహ్మణుడునగు సుకుమారుని పట్టితీసికొని వచ్చుచుండగా శివుని దూతలు మమ్ము రానీక యడ్డగించిరి. మాకును వారికిని ఆకాశమున యుద్ధమయ్యెను. ఈ విధమును మీకు చెప్పవచ్చితిమి.

విశేషములు: మృత్యుతోన్. `పువర్ణకేతర విభక్తి పరమగుచో నుకారాంతంబులకు బహుళంబుగా గోశబ్దంబునకు నిత్యంబుగా వుగాగమంబగు - పక్షమున మృత్యువుతో.

వ. అనిన *(విని) కృతాంతుండు సమధిక క్రోధావేశ వివశ స్వాంతుండై యులుంబరుండను సేనాని రావించి యతనితో నిట్లనియె. 83

అర్థము: అనినన్, కృతాంతుండు = యముడు, విని, సమధిక - క్రోధ + ఆవేశ = వెల్లగు కోపావేశముచే, వివశ = వశము దప్పిన, స్వాంతుండు =

1. తా. తేర. 2. రాకుండ నాఁగినారు. * తాళపత్రమున లేదు.

మనస్సుగలవాఁడు, ఐ, ఉలుంబరుండు, అను, సేనానిన్ = సేనానాయకుని, రావించి, అతనితోన్, ఇట్లు, అనియెన్.

తాత్పర్యము : అని భటులు పలుకగా యముడు విని అమిత కోపావేశమున మనసు వశము తప్పినవాడయి ఉలుంబరుడను పేరుగల సేనానాయకుని రప్పించి యతనితో నిట్లు పలికెను.

విశేషములు: సేనాని - (నానా.) సేనానాయకుడు, కుమారస్వామి.

గీ. చను ములుంబర! వృషభలాంఛనుని లెంక
లాఁగినారఁట మనవాండ్ర నాకసమున
నొక్క పాపాత్ముఁగొని రాఁగ నుద్దవిడిని
నేఁగి యా జటాధారుల నెగిచి రమ్ము. 84

అర్థము: ఉలుంబర, చనుము = వెడలుము, వృషభ - లాంఛనుని = ద్వజముగా గలవాని యొక్క, (శివునియొక్క) లెంకలు = సేవకులు, ...్రన = మనవారిని, ఒక్క, పాప + ఆత్మన్ = దుర్మార్గుని, కొనిరాగన్ = తిసికొని వచ్చుచుండగా, ఆకసమునన్ ఆగినారు + అట = అడ్డగించినారట, (నీవు), ఉద్దవిడిని = వెంటనే, ఏగి, ఆ, జటా - ధారులన్ = జడదారులను శివుని భటులను, ఎగిచి = తఱిమి, రమ్ము.

తాత్పర్యము: ఓయి ఉలుంబరా! ఒక పాపాత్ముని తీసికొని వచ్చుచుండగా మన వారిని శివుని దూత లాకాశమున నడ్డగించినారట. నీవు వెంటనే వెడలి యా జడదారులను శిక్షించి రమ్ము.

క. గబ్బున [1]నెదిరించిన నొక
దెబ్బగొను (ము నీకు) నెదురె త్రిజగమున నొరుల్?
తబ్బిబ్బుగ జంగములకుఁ
బబ్బంబులు వెట్టు ముష్టిసంఘట్టనలన్. 85

అర్థము: గబ్బునన్ = గర్వముతో, ఎదిరించినన్ = (వారు నిన్ను) మార్కొనినచో, ఒక, దెబ్బ + కొనుము = కొట్టుము, త్రిజగమునన్ = ముల్లోకములందును, ఒరుల్ = ఇతరులు, నీకున్, ఎదురె = ప్రతిఘటింప జాలినవారా? ముష్టి - సంఘట్టనలన్ = పిడికిటి పోటులతో, జంగములకున్ = శివుని భక్తులకు - శివదూతలకు, తబ్బిబ్బుగన్ = తడబాటుగా, పబ్బంబులు + పెట్టు = భోజనము పెట్టుము. వ్యతిరేకలక్షణచే బాధింపుమని యర్థము.

---

1 తా. నేతెంచిన.

తాత్పర్యము: ఓయీ ఉలుంబరా! వారు నిన్ను గర్వముతో నెదిరించినచో నొక దెబ్బతీయుము. ముల్లోకములందును నిన్ను ప్రతిఘటింపగల యితరులు గలరా? లేరనుట. పిడికిటి పోటులతో నీవు శివదూతలకు తడబాటగునట్లు భోజనము పెట్టుము.

విశేషములు: గబ్బు - (నానా.) గర్వము, కంపు, త్రిజగము - సమాహారద్విగువు. త్రయాణాం జగతాం సమాహారః - త్రిజగత్. సమాహార ద్విగు వేకవచనమును నపుంసకమును నగును. పబ్బము (వికృతి) - పర్వము (ప్రకృతి). పబ్బంబులు + పెట్టు = పబ్బంబులువెట్టు - గసడదవాదేశము.

గీ. వ్యాధు లష్టోత్తరశతంబు వచ్చుఁగాక
తోడ నేతెంచుఁ గాక మృత్యువులు నూఱు
పంపినారము మున్నాడి భటులఁ గూర్చి
కాలమృత్యువు గెల్చు శంకరుని హితుల. 86

అర్థము: వ్యాధులు = రోగములు, అష్ట + ఉత్తర - శతంబు = నూట యెనిమిది, వచ్చున్ + కాక, మృత్యువులు - నూఱు, తోడన్ = వెంట, ఏతెంచున్ + కాక = వచ్చునుగాక, మున్నాడి = ముందుగా, భటులన్ + కూర్చి, పంపినారము, కాల - మృత్యువు = క్రూరమైన మృత్యువు, శంకరుని - హితులన్ = శివుని మిత్రులను - దూతలను, గెల్చున్.

తాత్పర్యము: నూట యెనిమది రోగములు మీతో వచ్చును గాక. నూఱు మృత్యువులు మీ వెంట వచ్చును గాక. ముందుగా భటులను గూర్చి పంపితిమి. కాలమృత్యువు శివుని దూతలను గెలుచును.

వ. అని పల్కిన వల్లె యని యులుంబరుండు వివిధవ్యాధి పరివృతుండై కదలి యుద్ధవిడిం దూర్యంబులు మొరయఁ బ్రమథానీకంబు దాకి శస్త్రజాలంబులు నిగుడ్చి పేర్చి యార్చినం గోపించి పంచవదను భటులు కుటిల భ్రూ భంగ భీషణంబులగు మొగంబులు జేవురింప నట్టహాసంబు చేసి యదల్చి డమరు డిండిమ ఢమఢమధ్వానంబుతో గీనాశకింకరుల ముసల భిండివాల తోమర మండలాగ్ర త్రిశూల పట్టి సంబులం బ్రహరించిన విచ్ఛిన్న బాహూరు చరణ వక్షః (కటి కంఠ) లలాట కృకాటులై విచ్చియు, నొచ్చియుం, జచ్చియుం, దెరలియుం, బొరలియుం, దోగియు, డాగియు (గొంచియు, జలించియు,) గ్రుస్సియు, డస్సియుం గందియుం గుందియుం దారియు(దేరియు) మ్రొగ్గియు డగ్గియు నలసియు సొలసియు [1]వికావికలై దిక్కామొగంబులై యొరు సొరులై [2]గురియై బందబందై భండనంబు విడిచి వలియ (బాఱి వెళ్లబాఱుచు) *(వెలవెలం బోయి కృతాంతుని సన్నిధికిం బోయిరి. ఇట జటాధారులు సుకుమారుని

1. తా. పికాపికలై బిక్కామృగంబులై, 2. తా. గురిగురిలై బందు బందై, * తాళపత్రమున లేదు.

బంధనంబులూడ్చి యతని మున్నిడుకొని [1]హాన్నాళంపుం గరాచూరి చాయలం బంటించు మింటి తెరువునం జనిరి. అప్పుడా [2]సుకుమారుండు పుణ్యశివరాత్రి వ్రతాలోకనప్రభావంబున. 87

అర్థము: అని, పల్కినన్, వల్లె + అని = అంగీకరించి, ఉలుంబరుండు, వివిధ - వ్యాధి - పరివృతుండు + ఐ = పెక్కురీతులైన రోగములతో చుట్టబడినవాడై (కూడిన వాడయి), కదలి, ఉద్దవిడిన్ = శీఘ్రముగా, తూర్యంబులు = వాద్యములు, మొరయన్ = ధ్వనింపగా, ప్రమథ + అనీకంబున్ = ప్రమథుల సైన్యమును, తాకి = ఎదిరించి, శస్త్ర - జాలంబులు = శస్త్రముల సమూహములు, నిగుడ్చి = ప్రయోగించి, పేర్చి = విజృంభించి, అర్చినన్ = బొబ్బవెట్టగా, పంచ - వదను = అయిదు మొగములు గలవాని (శివుని) యొక్క, భటులు = వీరులు, కోపించి, కుటిల - భ్రూ - భంగ - భీషణంబులు = వక్రములైన, బొమముడులచే భయంకరమైనవి, అగు, మొగంబులు, జేవుఱింపన్ = ఎఱ్ఱబడగా, అట్టహాసంబు + చేసి = పెద్దనవ్వు నవ్వి, అదల్చి = గద్దించి, డమరు - డిండిమ - ఠమఠమ - ధ్వానంబులతోన్ = డమరువు, డిండిమము అను వాద్యవిశేషముల యొక్క ఠమఠమ యను ధ్వనులతో, కీనాశ - కింకరులన్ = యముని యొక్క, భటులను, ముసల - భిండివాల - తోమర - మండలాగ్ర - త్రిశూల - పట్టిసంబులన్ = ముసలములు, భిండివాలములు, తోమరములు, ఖడ్గములు, త్రిశూలములు, పట్టిసములు అను ఆయుధవిశేషములతో, ప్రహరించినన్ = కొట్టగా, విచ్చిన్న.... కృకాటులు + ఐ = విచ్చిన్న = మిక్కిలి ఖండింపబడిన, బాహు = చేతులు, ఊరు = తొడలు, చరణ = కాళ్లు, వక్షస్ = ఱొమ్ములు, కటి = పిఱుదులు, కంఠ = మెడలు, లలాట = నుదురులు, కృకాటులు + ఐ = మెడయందలి యెత్తైన ప్రదేశములు - ముచ్చిలి గుంటలు, గలవారయి, విచ్చియున్ = చెల్లాచెదరయి, నొచ్చియున్ = బాధపడియు, చచ్చియున్, తెరలియున్ = తొలగియు, పొరలియున్ = దొరలియు, తోగియున్ = మునిగియు - (కూడియు?), డాగియున్ = దాగియు, కొంచియున్ = జంకియు, చలించియున్ = వణకియు, క్రుస్సియున్ = వెనుదీసియు, డస్సియున్ = అలసియు, కందియున్ = వాడియు, కుందియున్ = బాధపడియు, తారియున్ = తొలగియు, తేరియున్ = ఉడిగియు, మ్రొగ్గియున్ = తొట్రువడియు, డగ్గియున్ = దగ్గియును, అలసియున్, సొలసియున్ = మూర్ఛిల్లియు, వికావికలు + ఐ = చెల్లాచెదరయి, దిక్కామొగంబులు + ఐ = కాందిశీకులై - తోచిన దిక్కుగా పాఱిపోవువారయి, ఔరు సౌరులు + ఐ = నశించినవారయి, (డస్సినవారియి), గురి + ఐ = బందబంద + ఐ = లొంగినవారయి, భండనంబున్ = యుద్ధమును, విడిచి, వలియబాఱి = డస్సి, వెల్లబాఱుచున్ =

1. తా. హన్నాళంబు కారాచోళి చాయలం బట్టించు, 2. తా. బ్రాహ్మణుండు

వెడలిపోవుచు, వెలవెలంబోయి = తెల్లబోయి, కృతాంతుని = యముని యొక్క, సన్నిధికిన్ = సమీపమునకు, పోయిరి. ఇటన్ = ఇక్కడ, జటా - ధారులు = శైవులు - ప్రమథులు, సుకుమారుని - బంధనంబులు = సుకుమారుని యొక్క, కట్లు, ఊడ్చి = విప్పి, అతనిన్, మున్ను + ఇడికొని = ముందర బెట్టుకొని, హొన్ను + నాళము + కరాచూరి = బంగరు పిడిగల కత్తియొక్క, చాయలన్ = కాంతులతో, పంటించు = ఉండు, మింటి - తెరువునన్ = ఆకాశమార్గమున, చనిరి = వెడలిరి, అప్పుడు, అ - సుకుమారుడు, పుణ్య - శివరాత్రి - వ్రత + ఆలోకంబున - ప్రభావంబునన్ = పవిత్రమైన శివరాత్రి వ్రతము యొక్క దర్శనము యొక్క మహిమ చేత.

తాత్పర్యము: అని యముడు పలుకగా నులుంబరుడట్లేయని వివిధ వ్యాధులతోను, మృత్యువుతోను గూడిన వాడయి కదలి వెంటనే వాద్యములు ధ్వనింపగా ప్రమథసేనను తాకి శస్త్రములను ప్రయోగించి విజృంభించి యార్చెను. అంత శివభటులు కోపించి వక్రములైన బొమముడులచే భయంకరములై మొగము లెఱ్ఱబడగా పెద్ద నవ్వు నవ్వి డమరు డిండిమ వాద్యముల తమతమధ్వనులతో యమభటులను ముసలములు, భిండివాలములు, తోమరములు, ఖడ్గములు, త్రిశూలములు, పట్టిసములు అనువానితో కొట్టగా, వారు బాహువులు, తొడలు, కాళ్లు, వక్షములు, కటులు, కంఠములు, లలాటములు, ముచ్చిలి గుంటలు తెగి విచ్చియు, నొచ్చియు, చచ్చియు, తెరలియు, పొరలియు, దోగియు, డాగియు, జంకియు, చలించియు, వెనుదీసియు, అలసియు, కందియు, కుందియు, చలించియు, వెనుదీసియు, క్రుంగియు, డగ్గియు, డస్సియు, మూర్ఛిల్లియు చెల్లాచెదరయి కాందిశీకులై యలసిన వారయి, గురియై లొంగిన వారయి యుద్ధరంగము విడిచి పాఱి తెల్లబోయి యముని కడకు వెడలిరి. ఇచ్చట ప్రమథులు సుకుమారుని బంధవిముక్తుని గావించి వానిని ముందిడికొని బంగరు పిడిగలకత్తి కాంతులు గల యాకాశమార్గమున పోయిరి. అప్పుడా సుకుమారుడు పుణ్యశివరాత్రి వ్రత దర్శన మహిమచే - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: అనీకము - (నానా.) సమూహము, సేన, కుటిల భ్రూభంగ భూషణములని కాక భీషణములని యుండవలయునని తోచుచున్నది. కీనాశ - (నానా.) యముడు, రాక్షసుడు విచ్చి, నొచ్చి, చచ్చి, తెరలి, పొరలి, తోగి డాగి మున్నగు ననురూప శబ్దముల ప్రయోగము నరయునది. దిక్కామొగంబులు - `కాందిశీకుడగు దిక్కా మొగంబనగును.' ఆం.భా. 3.9. `దిక్కా మొకము లైరి దిగధిపతులు' - పాఠి 5.37 (రూపాం.) దిక్కమొగము. ఔరుసౌరు - అవురు సవురు. హొన్నాళ - హొన్ను + నాళ = తొలియచ్చు మీదివర్ణములకు లోపము, మీది హల్లునకు ద్విత్వము. కరాచూరి - కరాచురి (రూపా

తాళవృత్తము: దవుదొవుల గాంచెం గైలాసము తరుణేందు కళాధరునినివాసము
దశహరి [దవధి] స్థాన స్థపుటిత ధవళచ్ఛాయాచ్ఛేద విలాసము
ధ్రువమండల [వీథీ] సంరోధి స్థూల శృంగశృంగాటక విహరత్
ఖచర గరుడ గంధర్వ [1]ప్రమదా స్తోమ విహితలీలా పరిహాసము
నవలేపాటోప సముద్భట విఘ్నాధిపదీర్ఘ విషాణ ప్రఘణ
వ్యాఘట్టన [[2]హర] పాదాద [ళితస్ఫటిక] ప్రస్థతటధ్వనివిసరము
[3]నవిహిత లాక్షాముద్రా నిగద వ్యాఖ్యాతాశోక లతా పల్లవ
[4]యాథాతథ్య విజిత్వ [ర] నీహారాద్రి సుతాచరణా [ధి] న్యాసము.
88.

అర్థము: పూర్వవచనము నందలి సుకుమారుడు కర్త.

తరుణేం .... నివాసమున్: తరుణ = లేత, ఇందు = చంద్రునియొక్క, కళా = కళను, ధరుని = ధరించిన శివుని యొక్క, నివాసమున్ = స్థానమును, దశ.... విలాసము: దశ = పది, హరిత్ = దిక్కుల యొక్క, అవధి = అంతముల యొక్క, స్థాన = ప్రదేశము, స్థపుటిత = నిమ్నోన్నతముగా జేయబడిన, ధవళ + ఛాయా = తెల్లని కాంతియొక్క, ఛేద = ఖండముల యొక్క, విలాసమున్ = తళుక్కుమని మెఱయుట గలదానిని, ధ్రువ..... పరిహాసమున్: ధ్రువ - మండల - వీథీ = ధ్రువ మండల ప్రదేశమునందు, సంరోధి = అడ్డగించునట్టి, స్థూల = పెద్దవియగు, శృంగ = శిఖరములు గల, శృంగాటక = పర్వతమునందు, విహరత్ = క్రీడించుచున్న, ఖచర = దేవతల, గరుడ = గరుడుల, గంధర్వ = గంధర్వుల, ప్రమదా = స్త్రీలయొక్క, స్తోమ = సమూహముచే, విహిత = చేయబడిన, లీలా = విలాసము యొక్క, పరిహాసమున్ = గేలి కలదానిని, అవలేప.... విసరమున్: అవలేప = గర్వము యొక్క, ఆటోప = వ్యాపనము యొక్క, సముద్భట = అతిశయముగల, విఘ్న + అధిప = విఘ్నేశ్వరుని యొక్క, దీర్ఘ = పొడవైన, విషాణ - ప్రఘణ = ఇనుపగుదియ వంటి దంతము యొక్క, వ్యాఘట్టన = రాపిడిగలిగి, హర = హరుని యొక్క, పాద = పాదములచేత, ఆదళిత = బాగుగా మర్దింపబడిన, స్ఫటిక - ప్రస్థ = స్ఫటిక శిలలతోడి చరియల యొక్క, తట = కొనల వలని, ధ్వని - విసర = ధ్వనుల ప్రసారమును,

అవిహిత ...... న్యాసమున్: అవిహిత = విధింపబడని, లాక్షా = పారాణి యొక్క, ముద్రలచే, నిగద - వ్యాఖ్యాత = నోరువిప్పిచెప్పిన, అశోక - లతా -

---

1. తా. ప్రమథ, 2. ము. పారద. తా. హపార, 3. ము. ననిహిత రూక్షా, 4. ము. యాథాతవ్యయ విజిత్వ నీహారాద్రి, తా. యాథాతష్యయ విజిత్వర.

పల్లవము యొక్క, యాథాతథ్యమును జయించు నట్టి, నీహారాద్రి సుత యొక్క, చరణముల యొక్క, అధిన్యాసము = మోపుట

సీ. కామధుగ్ధేను సం(ఘముల) తొఖ్ఖులు గాంచెఁ,
గాంచెఁ గాంచన రత్నకందరములు,
కాంచెఁ గల్పకవాటికాసహస్రంబులు,
సిద్ధరసాపగాశ్రేణిఁ గాంచె,
బహుహిరణ్మయమహాప్రాకారములు గాంచె,
నమలిన (స్ఫటిక సౌ) ధములు గాంచెఁ,
బ్రబలచింతామణీస్పర్శవేధులఁ గాంచె,
నానావిమానరత్నములు గాంచె,

గీ. హావభావ విలాస రేఖా విశేష
హారి [1]మూర్తుల రుద్రకన్యకలఁ గాంచె,
(నంది దోడ్కొ)ని పోవ నర్ధేందుమౌళి
గాంచె సుకుమారుఁడంబికాకాంతు శివుని. 99.

అర్థము: సుకుమారుడు - కర్త, నంది - తోడ్కొనిపోవన్ = నందీశ్వరుడు వెంటదీసికొని పోవగా, కామధుక్ + ధేను - సంఘముల = కోరికలను పిదుకునట్టి - కోరికల నిచ్చునట్టి, ధేను = ఆవుల యొక్క, సమూహముల యొక్క, తొఖ్ఖులు = పశువులు, కాంచెన్ = చూచెను, కాంచన - రత్న - కందరములు = బంగారపు, రత్నముల, గుహలు, కాంచెన్. కల్పక - వాటికా - సహంబులు = కల్పవృక్షముల వనముల వేలను - వేలకొలది కల్పవృక్ష వనములను, కాంచెన్, సిద్ధ - రస + అపగా - శ్రేణిన్ = శుద్ధమయిన, జలము గల, నదుల - వరుసను, కాంచెన్. బహు - హిరణ్మయ - మహత్ (మహా) - ప్రాకారములు = పెక్కు, బంగారపు, గొప్ప, ప్రహరులు, కాంచెన్, అమలిన - స్ఫటిక - సౌధములు = నిర్మలములయిన, పటికశిలాల, మేడలు - కాంచెన్. ప్రబల - చింతామణీ - స్పర్శవేధులన్ = గొప్పవియగు, చింతామణిని, పరుసవేదిని, కాంచెన్, నానా - విమాన - రత్నములు = శ్రేష్ఠములయిన, అనేకములయిన, విమానములు, కాంచెన్, హావ - భావ - విలాస - రేఖా - విశేష - హారి - మూర్తులన్ = భ్రూనేత్రాది వికారముల చేత కొంచెము తెలియదగిన మనోవికారములు, భావములు, శృంగార చేష్టావిశేషముల మనోజ్ఞాతిశయము చేత, మనోహరములైన ఆకారములు గల, రుద్ర - కన్యకలన్ = రుద్రాంగనలను, కాంచెన్. అర్ధ + ఇందు - మౌళిన్ = చంద్రకళ శిరస్సున గలవాడును, అంబికా కాంతున్ = పార్వతి భర్తయు, అగు, శివునిన్, కాంచెన్.

---

1. తా మూర్తులు

తాత్పర్యము: సుకుమారుడు నందీశ్వరుడు వెంటగొనిపోగా కోరికలను పిదుకు కామధేను సమూహములను, సువర్ణరత్నమయ గుహలను, కల్పవృక్షవన సమూహములను, శుద్ధోదకము గల నదుల వరుసను, పెక్కు బంగారపు గొప్పప్రహరులను, నిర్మల స్ఫటిక శిలామయము లయిన సౌధములను, గొప్పవియగు చింతా మణిని పరుసవేదిని, పెక్కు శ్రేష్ఠములయిన విమానములను, హావభావ విలాసములచే మనో హరములైన యాకారములు గల రుద్రాంగనలను చంద్రకళావతంసుడును, పార్వతీ భర్తయునగు శివుని గాంచెను

విశేషములు: కామదుక్ = కామాన్ దోగ్ధీతి = కామములను పిదుకునది తొఱ్ఱు - పశువు. 'గోమహిష్యాదుల నామముల్ పసి తొఱ్ఱు తొడుకు పసరము నడరు' ఆం.భా. 2.261

వ. కాంచి దండప్రణామంబులు చేసి చేతులు [1]మోడ్చి (సుకుమారుండు) నమశ్శంకరాయ, శశాంకమూర్ధాలంకారాయ, [2]త్రిపుర పురంధ్రి నీరంధ్ర స్తనకుంభ [3]సముత్తంభిత కస్తూరికా స్థాసక ముద్రా ద్రోహి బాహార్గళస్తంభాయ, జంబారి ప్రముఖ నిఖిలదేవతా కోటి హాటక కిరీట కోటి విటంక [4]సందానిత మందారమాలికా మకరంద బిందు నిష్యంద ధారా ధౌత చరణారవిందాయ, జలంధరాసుర కంధరా పీఠికా విఘట్టన క్రియా గరిష్ఠనిష్ఠురతా శశ్వ [5]ద్విభంగ ఖట్వాంగ పాణయే, పశ్యల్లలాటాయ, మదన మదగదాగదంకారాయ, సంధ్యానటాయ, కరకలితడమరు [6]డాంకార బృంహిత బ్రహ్మాండ మండలాయ, చండికాధిపతయే నిరస్త సమస్తోపాధికాయ, సచ్చిదానంద స్వరూపాయ, *(స్వమహా మహిమ ప్రతి ష్ఠాయ, నిరుపాధిక నిరవధిక నిర్నిరోధ నిరవ గ్రహ నిరబిసంధి నిర్భర కృపాసంపత్సంపూర్ణ మేధసే [7]సృకపాల మాలికా భరణాయ సముద్దండ పుండరీక) క్రవ్యాద కృత్తి కంథా ధురంధర స్కంధ బాగాయ, బగవతే ధన్యోఽస్మి కృతపుణ్యోఽస్మి *(నమస్తే నమస్తే) అని పలికి వెండియు. 90

అర్థము: సుకుమారుండు, కాంచి = చూచి, దండప్రణామంబులు = సాష్టాంగ నమస్కారములు చేసి చేతులు, మోడ్చి = ముడిచి, శంకరాయ = శంకరునకు, శశాంక - మూర్ధ + అలంకారాయ = చంద్రుడు శిరోభూషణముగా గలవానికి, త్రిపుర . స్తంభాయ: త్రిపుర = మూడు పురములందలి, పురంధ్రి = కుటుంబినుల యొక్క, నీరంధ్ర = రంధ్రములేని - ఒకదాని కింకొకదానికి ఎడములేని, స్తన - కుంభ = కుండల వంటి కుచముల చేత, సముత్తంభిత = వహింపబడిన, కస్తూరికా - స్థాసక - ముద్రా = కస్తురి కుంకుమ తిలకము యొక్క(నకు), ద్రోహి = కీడుచేయునట్టి బాహా + అర్గళ - స్తంబాయ = గడియ కంబము వంటి భుజములు

*తాళపత్రమున లేదు 1 తా మొగిడ్చి 2 ము త్రిభువన 3 తా సమస్త సంభిత, 4 ము సంవాసిత 5 తా ద్విఘుంటాలంఘు పాణయే 6 ము ఠాంకార, 7 ము వృషాంక

గలవానికి, జంబారి విందాయ జంభ + అరి = జంబుడను రాక్షసునకు శత్రువైన ఇంద్రుడు ప్రముఖ = మున్నగు నిఖిల = ఎల్ల దేవతా - కోటి = దేవతల సమూహము యొక్క హాటక = బంగారు, కిరీట - కోటి - విటంక = కిరీటములయొక్క, సమూహము యొక్క, శిఖరములందు, సందానిత = కట్టబడిన, మందార - మాలికా = మందారపుష్పమాలల యందలి మకరంద - బిందు = తేనె బొట్టుల యొక్క, నిష్యంద - ధారా = స్రావముల ప్రవాహము చేత, ధౌత = కడుగబడిన చరణ + అరవిందాయ = తామరలవంటి పాదములు గలవానికి జలంధ పాణయే: జలంధర + అసుర = జలందరుడను రాక్షసుని యొక్క కంధరా - పీఠికా = పీటవంటి మెడయొక్క విఘట్టన - క్రియా = ఎడబాపుట (నరకుట) అనెడి పని యందు, గరిష్ఠ = మిక్కిలి గొప్ప నిష్ఠురతా = కాఠిన్యము గల, శశ్వత్ = శాశ్వతముగా మొక్కవోని, ఖట్వాంగ - పాణయే = ఖట్వాంగమనెడి యాయుధము గలవానికి, పశ్యత్ + లలాటాయ = చూచుచున్న నుదురు గలవానికి - నుదుట కన్నుగలవానికి మదన = మన్మథుని యొక్క మద = గర్వమనెడి, గద = రోగమునకు, అగదంకారాయ = వైద్యుడయినవానికి సంధ్యా - నటాయ = సంధ్య యందు నటనము చేయువానికి కర .మండలాయ. కర = చేతులందు, కలిత = ధరింపబడిన, డమరు = డమరువనెడి వాద్యవిశేషము యొక్క డాంకార = `డాం అను ధ్వనియనెడు, బృంహిత = గీకగల, బ్రహ్మాండ - మండలాయ = బ్రహ్మాండవలయము గలవానికి, చండికా + అధిపతయే = పార్వతి యొక్క భర్తయైన వానికి, నిరస్త - సమస్త + ఉపాధికాయ = పోయిన ఎల్ల, ఉపాధులు ((గుణుతులు) గలవానికి, సత్ + చిత్ + ఆనంద - స్వరూపాయ = సత్తు (సత్యము), చిత్తు = జ్ఞానము, ఆనందము అనువాని ఆకారమైనవాడా, స్వ - మహత్ (మహా) - మహిమ - ప్రతిష్ఠాయ = తనదైన గొప్పమహిమ యొక్క స్థాపించుట గలవానికి, నిరుపాధిక మేధసే· నిరుపాధిక = ఉపాధిరహితమైన నిరవధిక = హద్దులు లేని, నిర్నిరోధ = అడ్డులేని, నిరవగ్రహ = క్షామములేని, నిరభి సంధి = మోసములేని, నిర్భర = సంపూర్ణమైన కృపా - సంపద్ = దయయనెడి సంపదతో సంపూర్ణ = బాగుగా నిండిన, మేధసే = బుద్ధిగలవానికి నృ - కపాల - మాలికా + ఆభరణాయ = నరుల యొక్క, పుఱ్ఱెల యొక్క, దండలు అలంకారముగా గలవానికి సముద్దండ .భాగాయ· సముద్దండ = మిక్కిలి బయంకరమైన, పుండరీక = బెబ్బులి యనెడు, క్రవ్యాద = క్రూరమృగము యొక్క, కృత్తి = చర్మమనెడు, కంథా = బొంత యొక్క, ధురంధర = భారమును వహించు, స్కంధ - బాగాయ = మూపు ప్రదేశముగలవానికి, భగవతే = భగవంతుడైన వానికి, నమః = నమస్కారము, ధన్యః + అస్మి = ధన్యుడనగుచున్నాను కృత - పుణ్యః + అస్మి = చేయబడిన పుణ్యము గలవాడను, అగు చున్నాను, నమః + తే = నీకు నమస్కారము, నమః + తే, అని, పలికి, వెండియున్ = మఱియును

తాత్పర్యము: సుకుమారుడు శివుని జూచి సాష్టాంగ నమస్కారములు చేసి చేతులు జోడించి - చంద్రుడు శిరోభూషణముగా గలవాడును త్రిపురాసురుల బార్యల పెద్దవియగు కుండల వంటి పాలిండ్లయందలి కస్తూరీకుంకుమ తిలకమును పాపు నట్టి గడియ కంబముల వంటి భుజములు గలవాడును - అనగా త్రిపురాసురులను వధించి వారి బార్యలకు వైదవ్యమును పొందింపగల బుజ పరాక్రమము గలవాడని బావము, ఇంద్రుడు మున్నగు నెల్ల దేవతాసమూహముల బంగారు కిరీట శిఖరములచే ధరింపబడిన మందార పుష్పమాలల తేనె బొట్టుల ప్రవాహముచే కడుగబడిన పాదపద్మములు గలవాడును - అనగా నింద్రాది దేవతలు నమస్కరించుటచే వారు తమ కిరీటములందు ధరించిన మందార మాలలనుండి వించుతేనె బొట్టులు శివుని పాద పద్మములను కడుగుచున్నవని బావము, జలంధరుడను రాక్షసుని మెడను నఱకు పని యందు మిక్కలి కఠినమైన ఖట్వాంగమను నాయుదమును చేత దాల్చిన వాడును, నొసట కన్నుగలవాడును, మన్మథుని గర్వమనెడి రోగమునకు వైద్యుడును - మన్మదుని గర్వమనెడి రోగమును కుదుర్చువాడనుట, సంధ్యాసమయమున నాట్యము చేయువాడును, చేత దాల్చిన డమరు ఢాంకారముచే పగులగొట్టబడిన బ్రహ్మాండ మండలము గలవాడును సచ్చిదానందముల స్వరూపమైన వాడును, నిజమహామహిమను స్థాపించినవాడును నిరుపాదికము, నిరవదికము, నిర్నిరోధము, నిరవగ్రహము, నిరబిసంధి, నిర్భరమునైన దయా సంపదతో నిండిన తెలివిగలవాడును, నరుల పుఱ్ఱెలనెడి మాలలు ఆబరణముగా గలవాడును, మిక్కలి బయంకరమైన పులి చర్మమనెడి బొంతను వహించు మూపు గలవాడును అగు బగవంతునకు శంకరునకు నమస్కారము ధన్యుడను, పుణాత్ముడను అగుచున్నాను అని పలికి మఱియును - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు: ఖట్వాంగపాణి - శివుని యాయుదముపేరు ఖట్వాంగము, పశ్యల్లలాట - పశ్యత్ + లలాట = తవర్గవర్ణములకు లకారము పరమగుచో పరసవర్ణమాదేశమగును అగదంకార - `రోగహార్యగద జ్కారో బిష గ్వైద్య చికిత్సకే. అగదం అరోగం కరోతి ప్రాణిన మి త్యగదజ్కారః - ప్రాణిని రోగము లేనివాని గా చేయువాడు - వైద్యుడు - అమరము పుండరీకము - (నానా) పులి తెల్లతామర, వెల్లగొడుగు క్రవ్యాద - క్రవ్యం మాంస మత్తీతి క్రవ్యాత్ - మాంసమును బక్షించునది - క్రూరమృగము మేధసే - మేధా శబ్దము ఆకారంతమయ్యు, సు, దుస్, వ్యతిరేకార్థక న ఞ్, అ పూర్వపదముగా నుండు బహువ్రీహి సమాసమున మేధస్ అని మాఱును ధన్యోఽస్మి = ధన్యః + అస్మి `హ్రస్వ అకారము తరువాత వచ్చు విసర్గమునకు హ్రస్వ అకారముకాని, మృదు హల్లులు (హశ్శులు) కాని పరములగునపుడు ఉ ఆదేశముగా వచ్చి పూర్వమందున్న అకారముతో గూడి గుణసంధి ననుసరించి ఓ గా మాఱును నమస్తే - నమస్ + తే - సకారమునకు విసర్గాదేశము నమః + తే

ఊష్మ పరకములు కాని త,ధ లు పరములగునపుడు విసర్గము సకారముగా మాఱును నమస్తే సచ్చిత్ - సత్ + చిత్ - సకార తవర్గములకు శవర్ణ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగు నపుడు క్రమముగా శవర్ణ చవర్గ వర్ణము లాదేశమగును చిత్ + ఆనంద = చిదానంద - యుల్లునకు అచ్చు పరమగుచుండగా తృతీయ వర్ణాదేశము

విషమవృత్తము

జయజయ శంకర జయజయ పురహర
జయజయ (కరుణా) గుణ వరుణాలయ
జయజయ తుహిన క్ష్మాధర కన్యా
సహచర శాక్వర వర శుభకేతన
జయజయ మందర కుధరోల్లురనా
సంక్షుభిత మహాక్షీరోదన్వత్
జరర క్రోడ ప్రభవద్గరళ 91
జ్వలన గిళన కల్మాషిత కంధర

అర్థము: శంకర = ఓ శివా! జయజయ, పురహర = పురములను హరించిన వాడా, కరుణా గుణ - వరుణ + ఆలయ = దయ అనెడి గుణమునకు సముద్రుడైన వాడా., తుహిన - క్ష్మా ధర కన్యా - సహచర = మంచు గొండ కూతురగు పార్వతి యొక్క సహచరుడా! శాక్వర - వర - శుభ - కేతన = ఎద్దు అనెడి శ్రేష్ఠము, శుభమునైన ధ్వజము గలవాడా! మందర. కంధర మందర - కుధర + ఉల్లురనా = మందరమను పర్వతము యొక్క తిరుగుటచే, సంక్షుభిత = మిక్కిలి కలగిన మహత్ (మహా) = గొప్ప, క్షీర + ఉదన్వత్ = పాలసంద్రము యొక్క, జరర = గర్భము యొక్క, క్రోడ = లోపలి భాగమునుండి, ప్రభవత్ = పుట్టుచున్న, గరళ = విషము యొక్క, జ్వలన = అగ్ని యొక్క, గిళన = మ్రింగుటచేత కల్మాషిత = మలినముగా చేయబడిన కంధర = కంఠము గలవాడా!

తాత్పర్యము: శంకరా పురహరా! దయా సముద్రా! పార్వతీ సహచరుడా! వృషభధ్వజా. మందర పర్వతము తిరుగుటచే మిక్కిలి కలగిన క్షీర సముద్ర గర్భమున నుండి పుట్టిన విషాగ్ని కబళనముచే కల్మషముగలదిగా చేయబడిన కంఠము గలవాడా - జయము జయము విశేషములు: శాక్వరః = An Ox - Apte ఉదన్వత్ - `ఉదన్వా నుదధి స్సిన్ధు స్సరస్వాన్ సాగరోఽర్ణవః ఉదక మస్మి న్నస్తీ త్యుదన్వాన్ - ఉదకము గలది

1 ము కంధరకంధర

వ. అని యనేక ప్రకారంబులం బ్రస్తుతించిన సుకుమారునిమీఁదఁ గరుణా కటాక్షవీక్షణంబు లొలయించుచు విరూపాక్షుండతనికిఁ గామగమనంబును హేమ కింకిణీ మాలికా సనాదంబును రుద్రకన్యాసహస్ర [1]సంకులంబును నగు దివ్యవిమానం బొసంగి ప్రమదత్వంబు కృపచేసెఁ బుణ్యవంతుల భాగ్యంబునకుం గొలది గలదె యింక నెయ్యది [2]యడిగెద రడుగుండని సూతుండు నైమిశారణ్య నివాసులగు మహామునులకు సవినయంబును సస్నేహంబును సగౌరవంబునుగా విన్నవించిన 92

అర్థము: అని, అనేక - ప్రకారంబులన్ = పలురీతుల, ప్రస్తుతించిన = పొగడిన సుకుమారుని మీదన్, కరుణా - కటాక్ష - వీక్షణంబులు = దయతోడి క్రీగంటి చూపులు, ఒలయించుచున్ = ప్రసరింపజేయుచు, విరూప + అక్షుండు = సూర్యచంద్రాగ్ని రూపము లగు మూడు విదములైన కన్నులు గలవాడు - శివుడు, అతనికిన్, కామ - గమనంబును = కోరినచోటికి పోవజాలు శక్తి గలదియును, హేమ - కింకిణీ - మాలికా - సనాదంబును = బంగారు చిఱుగంటల మాలలతో గూడినదియును రుద్ర - కన్యా - సహస్ర - సంకులంబునన్ = రుద్రకన్యలు వేవురతో నిండినదియును అగు, దివ్య - విమానంబు = దేవతాసంబంధమైన విమానము ఒసంగి, ప్రమదత్వంబు = ప్రమథ బావమును కృప - చేసెన్ = అనుగ్రహించెను, పుణ్యవంతుల = పుణ్యాత్ముల యొక్క బాగ్యంబునకున్ = అదృష్టమునకు, కొలది = మితి, కలదె ఇంకన్, ఎయ్యది (ఏ +అది), అడిగెదరు, అడుగుండు, అని, సూతుండు నైమిశ + అరణ్య - నివాసులు + అగు = నైమిశమను నరణ్యమున నివసించువారు అగు, మహత్ (మహా) + మునులకున్, సవినయంబును = అడకువతో గూడు కొనునట్లును, స స్నేహంబును = మైత్రి తో గూడుకొనునట్లును సగౌరవంబును + కాన్ = గౌరవముతో గూడుకొనునట్లును గా, విన్నవించినన్ = మనవి చేయగా

తాత్పర్యము: అని పెక్కు రీతుల పొగడిన సుకుమారునిపై దయతోడి క్రీగంటి చూపులు ప్రసరింపజేయుచు శివుడు అతనికి యధేచ్ఛముగా పోజాలునదియు, బంగరు చిఱుగంటలతో గూడినదియు వేవురు రుద్రకన్యలతో నిండిన దియు నగు దివ్యవిమానము నిచ్చి ప్రమదత్వము ననుగ్రహించెను పుణ్యాత్ముల బాగ్యమునకు మితిలేదు మీరిక నేది యడిగెదరో యడుగు డని సూతుడు నైమిశారణ్యము నందలి మహామునులకు వినయ స్నేహగౌరవములతో విన్నవింపగా - తరువాతి సద్యముతో నన్వయము

విశేషములు: పుణ్యవంతుల బాగ్యంబునకు కొలది గలదె - విశేషాంశము సామాన్యాంశముచే సమర్థింపబడుచున్నది కావున అర్థాంతరన్యాసాలంకారము నైమిశ - రదనేమి పడినచోటు నైమిశము విన్నవించు (వికృతి) - విజ్ఞాపించు (ప్రకృతి)

1 తా సంనుతంబును 2 ము (వినవలతు)

గీ పరమమునులు సూత్యాహసంబవుని సూతు
భక్తిఁ బూజించి యధిక తాత్పర్య [1]గరిమ
బటులు ప్రమదులచే బంగపడుట చూచి
చిన్నవోయి యముండేమి చేసెఁ బిదప? 93

అర్థము: పరమ - మునులు = మహర్షులు సూత్యాహ సంబవునిన్, సూతున్ = సూతుని, అధిక - తాత్పర్య - గరిమన్ = గొప్ప ఆసక్తి యొక్క అతిశయముతో భక్తిన్ = భక్తితో, పూజించి భటులు = యమ బటులు ప్రమధులచేన్, బంగపడుట = అవమాన పడుట చూచి, యముండు, చిన్న + పోయి = ఖిన్నుడయి పిదపన్ = తరువాత, ఏమి - చేసెన్

తాత్పర్యము: మహర్షులు సూతుని మిక్కిలి భక్తి తాత్పర్యములతో పూజించి `తన బటులు ప్రమధులచే నవమానమునొందుట చూచి యముడు ఖిన్నుడయి తరువాత నేమి చేసెను?

విశేషములు: భంగపడు - భంగము + పడు - `పడ్వాదులు పరంబులగునపుడు ము వర్ణకంబునకు లోపపూర్ణబిందులు విభాషనగు. బాల సంధి. 46

మ కరుణాసాగర శైవశాస్త్రకలనా గాంభీర్యశౌర్యోన్నతా
తరుణీ మన్మధ రాజపూజితకళా [2]ధర్మక్రియా సంస్తుతా
వరనీతి ప్రతిభావిశేషకలనా వాగీశసంకాశ శ్రీ
తరుణీనాధ మనోజ్ఞరూప [3]విలసత్కావ్యార్థ సంబోధనా 94

అర్థము: కరుణా - సాగర = దయా సముద్రుడా. శైవ - శాస్త్ర - కలనా - గాంభీర్య = శైవశాస్త్ర గ్రంధములందలి జ్ఞానము వలని గాంభీర్యము గలవాడా!, శౌర్య + ఉన్నతా = పరాక్రమమునందు గొప్పవాడా! తరుణీ - మన్మధ = స్త్రీలకు మన్మధుడైన వాడా రాజ - పూజిత - కళా = రాజుచేత పూజింపబడిన కళలు గలవాడా , ధర్మ - క్రియా - సంస్తుతా = ధర్మకార్యములచే మిక్కిలి పొగడబడువాడా., వర - నీతి - ప్రతిభా - విశేష - కలనా - వాక్ + ఈశ - సంకాశ = శ్రేష్ఠమైన నీతి శాస్త్రమునందలి ప్రతిభాతిశయము తోడి జ్ఞానమునందు బృహస్పతితో, సమానుడా శ్రీ - తరుణీ - నాధ - మనోజ్ఞ - రూప = శ్రీదేవి యొక్క భర్తయగు విష్ణువు యొక్క సుందరమైన ఆకారమువలె విలసత్ = ప్రకాశించుచున్న కావ్య + అర్థ - సంబోధనా = కావ్యముల యొక్క అర్థములందలి పిలుపు గలవాడా!

తాత్పర్యము: దయాసముద్రుడా. శైవ శాస్త్రగ్రంధములందలి జ్ఞానము వలని గాంభీర్యము గలవాడా! శౌర్యమునందు గొప్పవాడా! స్త్రీలకు మన్మథుడైనవాడా!

1 తా గతియమ 2 తా ధామ 3 తా విలసత్కార్యార్థసంబోధనా

రాజులచే పూజింపబడిన కళలు గలవాడా దర్మకార్యములచే పొగడబడువాడా! శ్రేష్ఠమైన నీతి శాస్త్ర ప్రతిబా విశేష జ్ఞానము నందు బృహస్పతితో సమానమైన వాడా విష్ణువు వలె సుందరమైన ఆకారము వలె ప్రకాశించుచున్న కావ్యార్థముల పిలుపు గలవాడా! కృతిబర్తయగు ముమ్మయశాంతయ్య సంబోధనములు

క   దర్మార్థాలయ వరగుణ
నిర్మాణవిశేషవిబవ నిరుపమకార్యా
కర్మోత్కట బహు [1]గుణ వృత
నిర్మల సుజ్ఞాన [2]చతుర నిశ్చలదైర్యా 95

అర్థము: ధర్మ + అర్థ + ఆలయ = ధర్మవిషయములకు నిలయమైన వాడా! వర - గుణ - నిర్మాణ - విశేష - విబవ = శ్రేష్ఠములైన గుణముల యొక్క నిర్మాణమునందు అధికమైన సంపదగలవాడా! నిరుపమ - కార్యా = సాటిలేని కార్యములు గలవాడా! కర్మ + ఉత్కట - బహు - గుణ - వృత = కర్మములచే నధికమైన పెక్కుగుణములచే వరింపబడినవాడా. నిర్మల - సుజ్ఞాన - చతుర = స్వచ్ఛమైన, మంచి జ్ఞానమునందు నేర్పరియైన వాడా నిశ్చల - దైర్యా = చలింపని ధైర్యము గలవాడా!

తాత్పర్యము: ధర్మవిషయములకు నిలయమైన వాడా! శ్రేష్ఠములైన గుణములుగల నిర్మాణములందు అదికమైన సంపదగలవాడా! నిరుపమానములైన కార్యములు గలవాడా! కర్మములచే నధికమైన పెక్కు గుణములతో గూడిన వాడా! నిర్మలమైన మంచి జ్ఞానము నందు నేర్పరియైనవాడా! చలింపని ధైర్యము గలవాడా! - కృతిపతి సంబోధనములు.

మాలిని.   శతధృతి[3]మతిదీపా సారనిర్మాణరూపా
సతతసుఖవినోదా సామగానప్రమోదా
వితతకవివరేణ్యా [4]వీరశైవాగ్రగణ్యా
[5]యతులబలవివేకా హర్షనైర్మల్యపాకా 96

అర్థము: శతధృతి - మతి -దీపా = బ్రహ్మయొక్క బుద్ధియనెడు దీపము గలవాడా! సార - నిర్మాణ - రూపా = శ్రేష్ఠమైన నిర్మాణముగల ఆకారము గలవాడా! సతత - సుఖ - వినోదా = ఎడతెగని సుఖముల వేడుక గలవాడా! సామ - గాన - ప్రమోదా = సామవేదము యొక్క గానము చేత సంతోషము గల వాడా!, వితత - కవి - వరేణ్యా = గొప్పకవిశ్రేష్ఠుడా , వీర - శైవ - అగ్రగణ్యా =

1 తా గణవృత 2 తా చరిత 3 ము ధృత 4 తా విస్ఫురత్పుణ్య గణ్యా 5 ము యతుల ఫలవివేకా

వీరశైవులందు మొదట లెక్కింపదగినవాడా!, అతుల - బల - వివేకా = సాటిలేని బలముగల వివేకముగలవాడా హర్ష - నైర్మల్య - పాకా = సంతోషము స్వచ్ఛత అనువాని చక్కని వృద్ధిగలవాడా!

తాత్పర్యము: బ్రహ్మ బుద్ధియనెడు దీపము గలవాడా! - బ్రహ్మబుద్ధి వంటి బుద్ధిచే వెలుగొందువాడా యనుట. శ్రేష్ఠమైన నిర్మాణముగల ఆకారము గలవాడా! ఎడతెగని భోగములచే వినోదించువాడా! సామగానముచే సంతోషించువాడా. గొప్పకవిశ్రేష్ఠుడా. వీరశైవులలో మొదట లెక్కింపదగిన వాడా! సాటిలేని బలముగల వివేకము గలవాడా! హర్షనైర్మల్యముల పరిపాకమైన వాడా కృతి పతి సంబోధనములు.

గద్యము: ఇది శ్రీమత్కమలనాభ పౌత్ర మారయామాత్యపుత్ర *(సకల విద్యాసనాథ) శ్రీనాథ నామధేయ ప్రణీతంబయిన శివరాత్రి మాహాత్మ్యంబునందుం జతుర్థాశ్వాసము

దీనికి వ్యాఖ్య పూర్వాసాంతగద్యల వ్యాఖ్యలకు వలెనే

శివరాత్రిమాహాత్మ్యము
(సుకుమార చరిత్రము)
పంచమాశ్వాసము

క   శ్రీదయితప్రియసేవక
భూదివిజాశీర్వివృద్ధ భూరిశ్రీ పు
ణ్యోదయ సమస్తజనసం
మోదనసుఖకర వసంత ముమ్మయశాంతా   1

అర్థము: శ్రీ - దయిత - ప్రియ - సేవక = లక్ష్మీ దేవి భర్తయగు విష్ణువు యొక్క ప్రియమైన సేవకుడా, భూ దయ భూదివిజ = బ్రాహ్మణుల యొక్క, ఆశీస్ + వివృద్ధ = దీవెనలచే, మిక్కిలి పెరిగిన, భూరి = అదికమైన, శ్రీ - పుణ్య + ఉదయ = పుణ్యమనెడు సంపదయొక్క, వృద్ధిగలవాడా. సమస్త.. వసంత: సమస్త = ఎల్ల జన = మనుష్యుల యొక్క సంమోదన - సుఖ - కర = సంతోష సౌఖ్యమును గూర్చు, వసంత = వసంతుడైనవాడా ముమ్మయ శాంతా

తాత్పర్యము: విష్ణువునకు ప్రియమైన భక్తుడా బ్రాహ్మణుల దీవెనలచే మిక్కిలి పెరిగిన అధిక పుణ్యసంపద్వృద్ధి గలవాడా. ఎల్ల జనులకు ఆహ్లాదమును గూర్చు సౌఖ్యమును కలిగించుటలో వసంతుడైన వాడా ముమ్మయశాంతా

విశేషములు: కృతి భర్తయగు ముమ్మయ శాంతయ వీరశైవాగ్రణియే కాదు. విష్ణుభక్తుడు కూడ ననుటకు పెక్కుచోట్ల గ్రంథస్థ నిదర్శనములున్నవి శ్రీతరుణీనాథ మనోజ్ఞ .సంబోధనా- 4 94, `శ్రీ దోరంతర దేవ. ...దార్ఢ్య - 3-1 శ్రీ పుణ్య = పుణ్యమనెడి శ్రీ యని యర్థము చెప్పబడినది. వసంతుడు సర్వప్రాణులకు సంతోషమును గూర్చునట్లు, ముమ్మయ శాంతయయు సకల జనులకు సంతోష సౌఖ్యమును గూర్చునని బావము అలంకారము రూపకము

వ అక్కథకుం డిట్లని చెప్పె నివ్విధంబున నుక్కు మిగిలి ముక్కంటి ప్రమధులు ఘంటా హుడుక్కా డమరు ఢాం కారారవంబుగా వెంటాడించి తోలినఁ బలాయితులై యమకింకరులు వసంత కాల కుసుమిత కంకేళి పాదపంబుల భంగి బారిషద వీర ఘోర త్రిశూల ప్రహరణ ప్రహరంబులం బ్రభవించు క్రొత్త నెత్తురుల జొత్తిల్లుచు నెదిరి కేతెంచిన పరివారంబునకుం బాటిల్లిన పలాయనత్వంబునకు జటాధారుల దౌష్ట్యంబునకు దుర్వృత్తుండగు సుకుమారునుత్త(మ) పద ప్రాప్తికిం

జిత్తంబున విషాదంబునొందుచు జిత్రగుప్తు రావించి కృతాంతుండతనితో నిట్లనియె 2

అర్థము: ఆ + కథకుండు = కథను జెప్పు ఆ సూతుడు, ఇట్లు + అని, చెప్పెన్, ఈ + విధంబునన్, ఉక్కు - మిగిలి = బలమతిశయించి, ముక్కంటి - ప్రమథులు = ఈశ్వరుని ప్రమథులు, ఘంటా - హుడుక్కా - డమరు - ఢాంకార + ఆరవంబు + కాన్ = గంటలు, బుడుబుడుక్కలు, డమరుకము (ఇవియన్నియు శైవుల వాద్య విశేషములు) అనువాని ఢాంకార మనెడి ధ్వని యగునట్లుగా, వెంటాడించి - తోలినన్ = వెనుదఱుమగా, యమ - కింకరులు, పలాయితులు + ఐ = పాఱిపోయిన వారయి, వసంత - కాల - కుసుమిత - కంకేళీ - పాదపంబుల - భంగిన్ = వసంతర్తువు నందు, పూచిన, అశోక వృక్షముల విధమున, పారిషద - వీర - ఘోర - త్రిశూల - ప్రహరణ - ప్రహారంబులన్ - ప్రమధవీరుల యొక్క, భయంకరములైన, త్రిశూలములనెడు ఆయుధముల వలని దెబ్బలచేత, ప్రభవించు = పుట్టు, క్రొత్త -నెత్తురులన్, జొత్తిల్లుచున్ = ఎఱ్ఱబడుచు, ఎదిరికిన్, ఏతెంచిన = వచ్చిన, పరివారంబునకున్ = పరిజనమునకు, పాటిల్లిన = సంభవించిన, పలాయనత్వంబునకున్ = పాఱిపోకకును,జటాధారుల = శైవుల యొక్క, దౌష్ట్యంబునకున్ = చెడ్డతనమునకును, దుర్వృత్తుండు + అగు = చెడునడవడి గలవాడగు, సుకుమారు + ఉత్తమ-పద-ప్రాప్తికిన్ = సుకుమారుని ఉత్తమ పద లాభమునకును, చిత్తంబునన్ = మనస్సునందు, విషాదంబున్ = విచారమును, ఒందుచున్, చిత్రగుప్తున్, రావించి, కృతాంతుండు = యముడు, అతనితోన్, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: కథకుడైన యా సూతుడీ విధముగా చెప్పెను ఈ రీతిగా శివుని భటులు బల మతిశయించి ఘంటలు, హుడుక్కలు డమరువులు అను వాద్యములు ఢాం కారధ్వని చేయుచు వెనుదఱుమగా యమ భటులు పాఱిపోయినవారయి వసంతర్తువున పూచు నశోకవృకములవలె ప్రమధవీరుల భయంకరములైన త్రిశూలాయుధముల దెబ్బల వలన పుట్టు క్రొన్నెత్తురులతో నెనగుచు నెదిరికి వచ్చిన పరిజనమునకు సంభవించిన పలాయనావమానమునకును, శివభటుల దుష్టత్వమునకు, దుర్వర్తనుడగు సుకుమారున కుత్తమ పదము లభించుటకును మనస్సున విచారించుచు, చిత్రగుప్తుని రప్పించి యముడతనితో నిట్లనియెను.

విశేషములు: ముక్కంటి - మూడు కన్నులుగలవాడు - శివుడు - బహువ్రీహి, సుకుమారు + ఉత్తమ - `షష్ఠీసమాసంబునం దుకార ఋకారంబులకచ్చు పరంబగునపుడు నుగాగమంబగు-సుకుమారునుత్తమ - బాల. సంధి 34. చిత్రగుప్తుడు - యముని లేఖకుడు. ఇతడు సర్వప్రాణులు గావించిన కార్యాకార్యములను లిఖించుచుండును కృతాంత - `కృతాన్తో యమునా భ్రాతా శమనో యమరాడ్యమః - కృతః అన్తః వినాశో యేన సః-కృతాన్తః ఇతనిచే వినాశము చేయబడును-యముడు - అమరము.

చ. కవిలియ విచ్చి చెప్పు గణకత్వ విశారద చిత్రగుప్త సం
భవదశ యాది గాఁగ సుకుమారుఁడు చేసిన పుణ్యపాపముల్
వివరములైన వేదము [ఖ] విద్యలకుం బదునాలుగింటికి
న్శివుడు ప్రబంధకర్తయట నేరక చేసె ననంగ వచ్చునే? 3

అర్థము: గణకత్వ - విశారద = లేఖకత్వమున నేర్పరియైనవాడా చిత్రగుప్త = చిత్రగుప్తుడా. సంభవ - దశ = పుట్టిన స్థితి, ఆది + కాగన్ = మొదలుగా, సుకుమారుడు, చేసిన, పుణ్య - పాపముల్ = పుణ్యములును, పాపములును, కవిలియ = లెక్కల పుస్తకము, విచ్చి = తెఱచి, చెప్పు = చెప్పుము, శివుడు, వివరములు + ఐన = విస్తృతములైన, వేద - ముఖ - విద్యలకున్ = వేదములు మొదలగు విద్యలకు, పదునాలుగింటికిన్, ప్రబంధ - కర - అట = గ్రంథరచయిత అట, (అతడు), నేరక = తెలియక, చేసెన్, అనంగన్ + వచ్చునే = అనవచ్చునా?

తాత్పర్యము: లెక్కలలో నేర్పరివైన యో చిత్రగుప్తుడా సుకుమారుడు పుట్టినది మొదలుగా చేసిన పుణ్యాపాపములను కవిలె విప్పి చెప్పుము. విస్తృతములైన వేదము లాదిగాగల పదునాలుగు విద్యలకును శివుడు రచయిత యట అతడు తెలియక చేసెననుట సరికాదు గదా!

విశేషములు: శివుడు తెలియక చేసె ననరామినతడు వేదాది విద్యలకు పదునాలుగింటికిని కర్తయను కారణముచే సమర్థించెను గావున నలంకారము కావ్యలింగము కవిలియ - (రూపాం) కవిలె. పదునాలుగు విద్యలు - ఋక్కు, యజుస్సు, సామము, అథర్వము అను నాలుగు వేదములు, శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అను ఆఱు వేదాంగములును. మీమాంస, న్యాయము, పురాణము, ధర్మశాస్త్రము అను నాలుగును. `అఙ్గాని వేదా శ్చత్వారో మీమాంసా న్యాయ విస్తరః, పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతా శ్చతుర్దశ `శిక్షా వ్యాకరణం ఛన్దో నిరుక్తం జ్యోతిషం తథా, కల్పశ్చేతి షడఙ్గాని వేద స్యాహుర్మనీషిణః `విద్యలు పదునాలుగింటికి నతండొనరించెఁ జతుర్దశత్వమున్. శృం.నై. 1.47

వ. అనినం జిత్రగుప్తుండు కవిలియ సమ్ముఖంబునకు దెచ్చి పాయపుచ్చి జంబూద్వీపంబున నార్యావర్త విషయంబున వింధ్యాచలోత్తర భాగంబున నైరావతీ శతద్రూ విపాశా సింధు [1]వితస్తా నదీ మధ్యంబున హేమాంగదుండను రాజు రాజధాని రత్నపురంబున యజ్ఞదత్తుండను బ్రాహ్మణుని భార్య సుశీలకుం బ్రభవించిన కుమారుండు సుకుమారుండు 4

అర్థము: అనినన్ = అని యముడు పలుకగా, చిత్రగుప్తుండు, కవిలియ,

1 తా వితస్తానది మధ్యంబున

సమ్ముఖంబునకున్ = ఎదుటికి తెచ్చి పాయ - పుచ్చి = విడదీసి జంబూ - ద్వీపంబునన్, ఆర్యావర్త - విషయంబునన్ = ఆర్యావర్త దేశమునందు, వింధ్య + అచల + ఉత్తర - బాగంబునన్ = వింధ్యపర్వతమున కుత్తర దిక్కున ఐరావతీ శతద్రూ విపాశా, సింధు వితస్త - నదీ - మద్యంబునన్ = ఐరావతి శతద్రువు విపాశ, సిందు, వితస అను నదుల నడుమ, హేమాంగదుండు + అను రాజు రాజదాని (అగు), రత్నపురంబునన్, యజ్ఞదత్తుండు + అను, బ్రాహ్మణుని, బార్య సుశీలకున్, ప్రబవించిన = పుట్టిన, కుమారుండు = కొడుకు సుకుమారుడు

తాత్పర్యము: అని యముడు పలుకగా విని చిత్రగుప్తుడు కవి లెను అతని యెదుటికి దెచ్చి వడిదీసి, జంబూద్వీపము నందలి యార్యావర్త దేశమున వింధ్యపర్వతమున కుత్తరమున ఐరావతి, శతద్రువు, విపాశ, సింధు, వితస్తయను నదుల నడుమ హేమాంగదుడను రాజు రాజధాని యగు రత్నపురమునందు యజ్ఞదత్తుడను బ్రాహ్మణుని భార్యయగు సుశీల కుద్భవించిన కొడుకు సుకుమారుడు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు: జంబూద్వీపము, భూమియందలి సప్తద్వీపములలో నొకటి ఆర్యావర్తము = పూర్వ పశ్చిమ సముద్రములకును, వింధ్యహిమాలయ పర్వతములకును నడిమి భూమి

సీ. జూదంబు లాడెను శూద్రాన్నము భుజించెఁ
గలవారి గృహములు కన్నపెట్టెఁ
గొండెంబు చెప్పెను గురుల నిర్భర్త్సించె
బ్రాహ్మణాచారంబు పదటఁ గలిపె
మదిర యాస్వాదించె మాల తొయ్యలిఁ గూడె
గంజాయిఁ దినె [1]నన్యకాంతఁ జెఱిచె
వెలివాడ యోషిత్తు వలన సంతతి గాంచెఁ
గన్నకూఁతు రమించెఁ [2]గావరమున

గీ జెంచు సేవించె నిట్లాఁడించుకొనియె
నధిప సుకుమారుఁ డిట్టి పాపాత్ముఁ డనిన
శ్రవణములు మూసికొనియె హస్తముల యముఁడు
హరహర శ్రీమహాదేవ యటవ యనుచు 5

అర్థము: జూదంబులు, ఆడెను శూద్ర + అన్నమున్ = శూద్రుల అన్నమును, భుజించెన్ = తినెను, కలవారి - గృహములు = ఉన్నవారి యిండ్లు, కన్నము +

1 తా కనత్కాంత 2 [illegible]

పెట్టెన్ = కన్నమువైచెను కొండెంబు = చాడీ చెప్పెను గురులన్ = పెద్దవారిని నిర్భర్త్సించెన్ = తిరస్కరించెను, బ్రాహ్మణ + ఆచారంబు = బ్రాహ్మణుల ఆచారము పదటన్ + కలిపెన్ = బూడిదగలిపెను - నాశనము చేసెననుట మదిర = కల్లు, ఆస్వాదించెన్ = త్రాగెను, మాల - తొయ్యలిన్ = మాల పడతిని కూడెన్ = రమించెను గంజాయిన్ తినెన్, అన్య - కాంతన్ = పరస్త్రీని చెఱిచెన్ = పాడుచేసెను వెలివాడ - యెషిత్తు వలనన్ = మాల వనితవలన, సంతతిన్ = సంతానమును కాంచెన్ కావరమునన్ = పొగరుతో, కన్న - కూతున్, రమించెన్ = కూడెను చెంచున్ = కిరాతుని, సేవించెన్ = కొలిచెను, ఇల్లు + ఊఱడించుకొనియెన్, అదిప = ప్రభూ సుకుమారుడు ఇట్టి పాప + ఆత్ముండు అనినన్ యముడు, హరహర - శ్రీ మహాదేవ - అబవ + అనుచున్ హస్తములన్ = చేతులతో, శ్రవణములు = చెవులు, మూసికొనియెన్

తాత్పర్యము: `జూదమాడెను శూద్రుల అన్నమును భుజించెను ధనవంతుల యిండ్లను దోచుకొనెను కొండెములు చెప్పెను పెద్దలను తిరస్కరించెను బ్రాహ్మణాచారమును బుగ్గిపాలు చేసెను. కల్లు త్రాగెను. మాలపడతిని గూడెను. గంజాయిని ద్రావెను పరస్త్రీని చెఱిచెను మాలెత వలన సంతానమును వడసెను. క్రొవ్వెక్కి కన్నకూతును రమించెను బోయవానిని కొలిచెను.

ప్రభూ సుకుమారుడిట్టి పాపాత్ముడని చిత్రగుప్తుడు చెప్పగా యముడు `హరహరా శ్రీ మహాదేవా అబవా అనుచు చేతులతో చెవులు మూసికొనెను.

విశేషములు: పదటన్ - పదటు పదడు అనువాని సప్తమ్యేక వచన రూపము పదటి రూపాంతరము. శ్రవణములను మూసికొనుట ఆపై వినలేక. `హరహర శ్రీ మహాదేవ యంతయు నేక సమాసమను కొనవలయును. లేనిచో శ్రీ పూర్వాక్షరము గురువు కామి గణభంగమగును

వ. కృతాంతుండు గొంతతడవు విచారించి చిత్రగుప్తుంగనుంగొని. 6

అర్థము: కృతాంతుండు = యముడు కొంత - తడవు = కొంత సేపు, విచారించి = ఆలోచించి చిత్రగుప్తున్, కనుంగొని = చూచి

తాత్పర్యము: యముడు కొంతసేపాలోచించి చిత్రగుప్తుని జూచి - తరువాతి పద్యముతో నన్వయము

శా ఏలా యీ యధమాధికారము పరాధీనత్వదుఃఖాఢ్యమున్
కైలాసంబున కేఁగియున్ శివుని శ్రీకంఠున్ విరూపాక్షునిన్
త్రైలోక్యాధిపు సంస్తుతించెద మదధ్యక్షత్వ చిహ్నంబు 'ము
ద్రాలంకారము పాదపద్మమణిపీఠాగ్రంబునం బెట్టెదన్
7

అర్థము: పర + అధీనత్వ - దుఃఖ + ఆఢ్యమున్ = ఇతరుల వశమున నుండుట యనెడు దుఃఖముతో గూడినదియును, అగు ఈ, అదమ + అదికారము = నీచమైన అధికారము, ఏలా = ఎందులకు కైలాసంబునకున్, ఏగియున్ శ్రీ - కంఠున్ = విషము కంఠమందు గల వాడును, విరూప + అక్షునిన్ = విరూపములైన కన్నులు గలవాడును త్రైలోక్య + అధిపున్ = ముల్లోకములకు అధిపతియైన వాడును, అగు, శివునిన్, సంస్తుతించెన్ = స్తోత్రము చేసెదను మత్ + అధ్యక్షత్వ - చిహ్నంబు,= నా ప్రభుత్వమునకు గుఱుతైనది అగు, ముద్రా + అలంకారము = అలంకారము అగు నధికారముద్రను, పాద - పద్మ మణి - పీఠ + అగ్రంబునన్ = తామరలవంటి పాదముల యొక్క, మణిమయమైన పీఠము మీద పెట్టెదన్

తాత్పర్యము: ఇతరులకు వశపడి యుండుట యను దుఃఖముతో గూడిన యీ అధమమైన అధికారము నాకెందులకు? నేను కైలాసమున కరిగి గరళకంఠుడును, విరూపాక్షుడును, త్రిజగత్పతియు నగు శివుని స్తోత్రము చేసెదను. నా అధ్యక్ష్యచిహ్నమైన అలంకార ప్రాయమైన నా యధికారముద్రను ఆ శివుని పాదపద్మముల మణిమయమైన పీఠముపై నుంచెదను.

విశేషములు: పరాధీనత గల అధికారమున్నను లేకున్నను నొక్కటేయని యముని అభిప్రాయము. శివునే స్తోత్రము చేయుచుండెదను ఈ మాట నిజముగా నన్నది కాదు కోపము తోను, బాదతోను అన్నది. ముద్ర - అద్యక్షత్వమునకు చిహ్నముగా ముద్రయుండును అధికారమే లేనప్పుడు ముద్రయేల? అలంకారప్రాయమైన దానిని శివుని పాదపీఠముపై నుంతు నని యముడు పలికెను. గ్రంథమున `ముగ్రాలంకారము అని కలదు అది ముద్రాలంకారమయి యుండునని తోచుచున్నది ముగ్రాలంకారము అర్థరహితము.

సీ విడువరో [1]యెందేని విహరింపఁ జనుఁ గాని
కరవాడి ముక్కుల కాకిపిండు
ఖండింపరో వంటకాష్ఠంబులకుఁ గాఁగ
నసిపత్రములతోడి [2]యవనిజములఁ
దోలింపరో వజ్రతుండ కీటంబులఁ
బ్రాకారపరిఖాంబుపార్శ్వములకు
నార్పరో ఘటసహస్రాంబు పూరంబులఁ
బ్రబలకుంభీపాకపావకములు

---

1 తా యందేని 2 తా యవని జలము

గీ శార్యమున నైనఁ బరిహాస సరణినైన
శంభునైనను హరినైన సంస్మరించి
పాపు లేఁగుచు నున్నారు పరమగతికి
నా రకము (వీడి) యీ యధికార మేల? 8

అర్థము: పాపులు = పాపకార్యములు చేసిన వారు, శార్యమునన్ + ఐనన్ = కపటముననైనను, పరిహాస - సరణిన్ + ఐనన్ = వేళాకోళపు మార్గమున నైనను, శంభున్ + ఐనను + శివునైనను, హరిన్ + ఐనన్ = విష్ణువునైనను, సంస్మరించి = తలచి, నారకమున్ = నరకమును వీడి = విడిచి, పరమ - గతికిన్ = ఉత్తమమైన గతికి, ఏగుచున్ + ఉన్నారు = పోవుచున్నారు, ఈ + అధికారము + ఏల? = నా కింక నీ అధికారమెందులకు? (కావున), ఎందున్ + ఏని = ఎచ్చటనైనను, విహరింపన్ + చనున్ + కాని = విహరింపబోవును గాక కరవాడి = మిక్కిలి వాడియైన, ముక్కుల = ముక్కులు గల, కాకి - పిండున్ = కాకుల సమూహమును, విడువరో = విడిచి పెట్టరా? విడువుడనుట. అసి పత్రములతోడి = కత్తివలె వాడియైన ఆకులతో గూడిన, అవనిజములన్ = చెట్లను, వంటకాష్ఠములకున్ + కాగన్ = వంటకట్టియలక్రై, ఖండింపరో = నఱకరా? నరకుడనుట. వజ్ర - తుండ - కీటంబులన్ = వజ్రము వంటి తొండములు గల పురుగులను, ప్రాకార - పరిఖా + అంబు - పార్శ్వములకున్ = ప్రహరి చుట్టు నుండు, అగడ్తలందలి, నీటి, సమీపములకు, తోలింపరో = వెడల గొట్టింపరా? తోలింపుడనుట ప్రబల - కుంబీపాక - పావకములు = మిక్కుటమైన కుంభీపాక మనెడి నరకము నందలి అగ్నులు, ఘట - సహస్ర + అంబు - పూరంబులన్ = వేలకొలది కుండల జల ప్రవాహములచే, ఆర్పరో = ఆర్పివేయరా? అర్పుడనుట

తాత్పర్యము: కపటముననైనను, పరిహాసముననైనను శంభుని గాని, హరిని గాని స్మరించి పాపులు నరకమును విడిచి ఉత్తమ గతులను పొందుచున్నారు ఇక నాకీ వ్యర్థాధికార మెందులకు? కావున మిక్కిలి వాడి గల ముక్కులు గల కాకుల గుంపులను ఎక్కడనైన విహరింపబోవునట్లు విడిచి పెట్టుడు కత్తులవలె వాడియైన ఆకులు గల వృక్షములను వంటకట్టియలక్రై నఱికి వేయుడు వజ్రముల వంటి తొండములు గల పురువులను ప్రాకారము చుట్టు నుండు నగడ్తల నీటిలోనికి ప్రాఁఅదోలుడు. ప్రబలములైన కుంభీపాక నరకమునందలి యగ్నులను వేలకొలది కుండల నీటితో నార్పివేయుడు ఇక నా కాకాదులతో పనిలేదు

విశేషములు: ఇందు చెప్పిన కాకాదులు వివిధనరకములలో పాపులను బాధింప నుపయోగపడు సాధనములు పాపులందును వంచననో పరిహాసముననో హరుని గాని, హరిని గాని స్మరించి నరకమును వీడి యుత్తమ లోకములకు పోవుచుండగా నిక వానితో పనియేమి? నాకీ వృధాధికారమేల? యనుట

వ అని యా క్షణంబ చిత్రగుప్తాదులతోడం గూడి యముండు విరూపాక్ష సందర్శనార్థంబు శివలోకంబున కరుగువాడు త్రయోవింశతి సంఖ్యాకంబులైన స్వర్గలోకంబు (లు) గడచి సప్తర్షి మండలంబు లంఘించి మహర్లోకంబు దాటి సత్యలోకం బతిక్రమించి, సర్వలోకోత్త మోత్తమంబును ద్వాత్రిం శత్కోటి యోజన విస్తారంబును, జాంబూనద విమాన సహస్ర సంకులంబును, బహ్వాశ్చర్యదుర్యంబును నగు మహాస్థానంబు ప్రవేశించి బహు యోజన విస్తీర్ణంబులును, నానా ద్వార సమంచితంబులును మణి తోరణ సంయుక్తంబులును హేమ రత్న వితర్ది కోటి శోభితంబులు శాతకుంభ స్ఫటిక రత్న స్తంభ సంభరితంబులు మహాకాళ భృంగిరిటి కుంభకుంభోదర ప్రముఖ ప్రమదగణా కీర్ణంబులు దళిసి పూర్వ ద్వారంబున 9

అర్థము: అని, ఆ - క్షణంబ = అప్పుడే, యముండు చిత్రగుప్త + ఆదుల తోడన్ = చిత్రగుప్తుడు మున్నగు వారితో కూడి, విరూప + అక్ష - సందర్శన + అర్థంబు = శివుని జూచుట కొఱకు శివ - లోకంబునకున్ అరుగు వాడు, త్రయో - వింశతి - సంఖ్యాకంబులు = ఇరువది మూడు సంఖ్యలు గలవి, ఐన స్వర్గ - లోకంబులు + కడచి = దాటి, సప్త + ఋషి - మండలంబు లంఘించి = దాటి మహర్లోకంబు దాటి, సత్య - లోకంబు = బ్రహ్మలోకమును, అతిక్రమించి = దాటి సర్వ - లోక + ఉత్తమ + ఉత్తమంబును = ఎల్లలోకములందును శ్రేష్ఠాతిశ్రేష్ఠమును ద్వాత్రింశత్ + కోటి = ముప్పది రెండు కోటుల, యోజన = ఆమడల (ఎనిమిదిమైళ్లు) విస్తారంబును = పొడవు గలదియును, జాంబూనద - విమాన - సహ - సంకులంబును = బంగారు విమానముల వేలచే నిండినదియును, బహు + ఆశ్చర్య - దుర్యంబునన్ = పెక్కు వింతలను వహించి నదియును, అగు మహాస్థానంబు ప్రవేశించి, బహు - యోజన - విస్తీర్ణంబులును నానా - ద్వార - సమంచితంబులును = పెక్కుద్వారములతో ఒప్పునవియును, మణి - తోరణ - సంయుక్తంబులును = మణులతో గట్టబడిన తోరణములతో గూడినవియును హేమ -రత్న - వితర్ది - కోటి - శోభితంబులున్ = బంగారముతోను, మణుల తోను కట్టబడిన వేదికల కోటులచే ప్రకాశించునవియును, దివ్య - రత్న - విమాన + ఆఢ్యంబులున్ = దివ్యములైన మణులతో నిర్మింపబడిన విమానములతో సంపన్నములును దివ్య - పతాకా + చత్ర - విచిత్రంబులున్ = దివ్యములు అగు ధ్వజములు, గొడుగులు అనువానిచే ఆశ్చర్యకరమైనవియును, శాతకుంభ - స్ఫటిక .- రత్న - స్తంభ - సంభరితంబులున్ = బంగారముతోను, పటికఱాలతోను మణులతోను నిర్మింపబడిన కంబములతో నిండినవియును మహాకాళ - భృంగిరిటి - కుంభ - కుంభోదర - ప్రముఖ - ప్రమద - గణ + ఆకీర్ణంబులున్ = మహాకాళుడు, భృంగిరిటి, కుంభుడు కుంభోదరుడు మున్నగు ప్రమదుల సమూహములతో వ్యాపించినవియును, అనంత + ఆశ్చర్య - యుక్తంబులున్ = అంతము లేని అచ్చెరువుతో గూడినవియును అగు

దివ్య - కక్ష్యా + అంతరంబులు = దివ్యములైన లోగిండ్లలోపలి బాగములు తఱిసి = దాటి పూర్వ - ద్వారంబునన్ = తూర్పుద్వారమునందు

తాత్పర్యము: అని యముడు వెంటనే చిత్రగుప్తుడు మున్నగు వారితో గూడి శివుని చూడ శివలోకమున కరుగువాడు ఇరువది మూడు స్వర్గలోకములు గడచి సప్తర్షి మండలమును గడచి, మహర్లోకము దాటి, సత్యలోకము నతిక్రమించి, ఎల్లలోకములందును శ్రేష్ఠాతిశ్రేష్ఠమగు లోకమును ముప్పది రెండు కోట్ల ఆమడల విస్తృతియును వేలకొలది బంగారు విమానములతో నిండినదియును, పెక్కువింతలతో గూడినదియును అగు మహాస్థానమును ప్రవేశించి, పెక్కామడల విస్తీర్ణములును, అనేక ద్వారములతో నొప్పునవియును, మణిమయ తోరణములతో గూడినవియును, సువర్ణ మణిమయ వేదికల కోటిచే ప్రకాశించునవియును, దివ్యరత్న విమానములతో సంపన్నములును దివ్యధ్వజములతోను గొడుగులతోను ఆశ్చర్యకరములును, బంగారముతోను స్ఫటిక శిలలతోను రత్నములతోను కట్టబడిన కంబములతో నిండినవియును మహాకాళుడు బృంగిరిటి, కుంబుడు, కుంబోదరుడు మున్నగు ప్రమధ గణములతో వ్యాపించినవియును, అంతములేని ఆశ్చర్యములతో గూడినవియును అగు దివ్యములైన లోగిండ్ల లోపలి భాగములను గడచి తూర్పు ద్వారమున తరువాతి పద్యముతో నన్వయము

క [1]సుయశోధీ ధన కాంతా
దయితుని బసిత త్రిపుండ్ర ధవళ లలాటున్
నయనాబిరామమూర్తిన్ 10
నియతాత్ముని నందికేశునింబొడఁ గనియెన్

అర్థము: సు - యశస్(సః) + ధీ - ధన - కాంతా - దయితునిన్ = సద్యశస్సు, బుద్ధి, ధనము, కాంతలు అనువానికి పతియైన వాడును బసిత - త్రిపుండ్ర - ధవళ - లలాటున్ = విబూతి నామములచే తెల్లనైన నొసలు గలవాడును నయన + అబిరామ - మూర్తిన్ = కన్నులకు మనోహరమైన ఆకారము గలవాడును, నియత + ఆత్మనిన్ = నియమములతో గూడిన ఆత్మగలవాడును, అగు నందికేశునిన్ = నందికేశ్వరుని పొడగనియెన్ = చూచెను

తాత్పర్యము: యముడు సద్యశము, బుద్ధి ధనము కాంతలు అనువానికి పతియైనవాడును, విబూతి నామముచే తెల్లనైన నుదురు గలవాడును, కన్నుల కందమైన ఆకారము గల వాడును, నియమములతో గూడిన వాడును అగు నందికేశ్వరుని చూచెను

1 తా సు యశోభీధనకాంతా

వ. కాంచి దండప్రమాణంబు చేసి శైలాది కిట్లని విన్నవించె. 11

అర్థము: కాంచి = చూచి, దండ ప్రమాణంబు = సాష్టాంగనమస్కారము, చేసి, శైలాదికిన్ = నందికేశ్వరునకు ఇట్లు + అని, విన్నవించెన్ = మనవి చేసెను.

తాత్పర్యము: యముడు నందికేశ్వరుని జూచి సాష్టాంగ నమస్కారము చేసి వానికిట్లు విన్నవించెను

సీ దర్శింప వచ్చితిఁ దరుణేందు శేఖరు
నఖిలలోకాధీశు నమరవంద్యు
కార్యంబు లెన్నేని గలవు విన్నపము సే
యంగ (నే) నధికారి నౌదుఁగానొ
[1]నీ శరణ్యుండనై నీవు ప్రతిష్ఠింప
ననఘ యున్నాఁడ ధర్మాసనమున
భృత్యభూతుండ నీకు సత్యంబు పల్కెద
నిన్నుఁదప్పంగ నే [2]నెన్ననొరుల

గీ. ననుచుఁ బ్రియమాడు యమరాజు నాదరించి
నంది శంభుని [3]సన్నిదానమున కేఁగి
మ్రొక్కి హస్త సరోరుహంబులు మొగిడ్చి
వినయ మొప్పంగ నిట్లని విన్నవించె. 12

అర్థము: అఖిల - లోక + అధి + ఈశున్ = ఎల్లలోకములకు అధిపతియు, అమర - వంద్యున్ = దేవతలచే నమస్కరింపదగినవాడును, అగు, తరుణ + ఇందు - శేఖరున్ = చంద్రకళావతంసుని (శివుని), దర్శింపన్ + వచ్చితిన్ = చూడవచ్చితిని. విన్నపము + చేయంగన్ = విన్నవించుటకు, కార్యంబులు = పనులు, ఎన్ని + ఏని = ఎన్నియో, కలవు, నేను, అధికారిన్ = అధికారము గలవాడను, ఔదున్ + కానొ = అగుదునో కానో. అనఘ = పాపరహితుడా నీ - శరణ్యుండన్ + ఐ = నిన్ను శరణుజొచ్చిన వాడనయి, నీవు ప్రతిష్ఠంపన్ = స్థాపింపగా, ధర్మ + అసనమునన్ = ధర్మపీఠమున, ఉన్నాడన్ నీకున్, భృత్య - భూతుడన్ = సేవకుడనైన వాడను, సత్యంబు + అ = సత్యమే, పల్కెదన్, నిన్నున్ + తప్పంగన్ = నిన్ను దప్ప, నేను, ఒరులన్ = ఇతరులను, ఎన్నన్ = గణింపను. అనుచున్ ప్రియము + ఆడు = మంచిగా మాటాడు, యమరాజున్ = యమధర్మరాజును, నంది, ఆదరించి = మన్నించి, శంభుని - సన్నిధానమునకున్ = శివుని దగ్గఱకు, ఏగి మ్రొక్కి, హస్త - సరోరు హంబులు = తామరలవంటి చేతులు, మొగిడ్చి =

1 తా నిశరవాండైన 2 తా నెఱుఁగ 3 తా సన్నిధానమునకు నేఁగి

మోడ్చి వినయము = అడకువ, ఒప్పగన్ ఇట్లు + అని విన్నవించెన్

తాత్పర్యము: పాపరహితుడవైన నందీశ్వరా నేను ఎల్లలోకములకు నధిపతియు, దేవ వంద్యుడు నగు చంద్రకళావతంసుని శివుని జూడ వచ్చితిని అయనకు నేను మనవిచేయ వలసిన విషయము లెన్నియో కలవు నేను అదికారి నౌదునా కానా? నిన్ను శరణు చొచ్చినవాడనై నీవు ప్రతిష్ఠింప దర్మాసనమున నున్నాడను నీకు నేను బృత్యడను నీకు సత్యము చెప్పెదను నిన్ను దప్ప నే నొరులను గణింపను." అని మంచి మాటలు పలుకు యమదర్మరాజును నంది ఆదరించి శివుని దగ్గఱకేగి మ్రొక్కి కరకమలములు మోడ్చి వినయమున నిట్లు విన్నవించెను

సీ ఓ జగన్నాద యో యుడురాజశేఖర
యో కృపాంబోరాశి యో త్రినేత్ర
యో విష్ణుధాత్రాది దేవతా కోటీర
పరిచిత శ్రీపాదపద్మయుగళ
యో జలందర వైరి యో గంధ కరి కృత్తి
[1]కంధా ధురంధర స్కందపీఠ
యో నీలలోహిత యో లలాటాంబక
జ్వలన జిహ్వాదగ్ధ శరబచిహ్న

గీ దక్షిణాశాదిపతి దండదరుఁడు దాను
జిత్రగుప్తుండు దేవర సేవసేయ
నరుగుదెంచినవాఁడు తే నవసరంబు
ననువుపడ దుండు మందమో యానతిమ్ము 13

అర్థము: ఓ - జగత్ + నాధ = ఓ లోక ప్రబూ ఓ - ఉడు - రాజ - శేఖర = ఓ చంద్రావతంసా ఓ - కృపా + అంబోరాశి = ఓ దయాసముద్రుడా , ఓ - త్రినేత్ర = ఓ ముక్కంటీ ఓ - విష్ణు యుగళ ఓ - విష్ణు - ధాతృ + అది = ఓ విష్ణువు, బ్రహ్మ మున్నగు, దేవతా = దేవతలయొక్క, కోటీర = కిరీటములచేత పరిచిత = తెలియబడిన శ్రీ = మంగళకరములయిన, పాద - పద్మ = అడుగు దామరలయొక్క, యుగళ = జంట గలవాడా ఓ - జలంధర - వైరి = ఓ జలంధరునకు శత్రువయిన వాడా , ఓ గంధ పీఠ ఓ - గంధ - కరి = ఓయి మద గజము యొక్క కృత్తి = చర్మమనెడి కంధా = బొంతయొక్క, ధురంధర = బారమును వహించు, స్కంధ - పీఠ = మూపు ప్రదేశము గలవాడా ఓ - నీల - లోహిత = ఓ, కంఠమున నీలవర్ణమును కేశముల రక్తవర్ణమును గలవాడా ఓ -

1 తా కంఠా

లలాటాం.. చిహ్న ఓ - లలాట + అంబక = ఓయి, నొసటి కంటి యొక్క, జ్వలన = అగ్ని యొక్క, జిహ్వా = జ్వాలలచేత, దగ్ధ = దహింపబడిన శరబ - చిహ్న దక్షిణ + ఆశా + అధిపతి = దక్షిణ దిక్కునకు ప్రభువైన వాడు, (అగు) దండ - ధరుండు = దండమును దరించువాడు - యముడు, తాను, చిత్రగుప్తుడు, దేవర = తమయొక్క సేవ + చేయన్ = సేవచేయుటకు, అరుగుదెంచిన వాడు = వచ్చినాడు, తేన్ + అవసరమ్ము = తీసికొని వచ్చుటకు సమయము అనువుపడదు = వీలుపడదు, ఉండుము + అందమో = ఉండుమందమా ఆనతి + ఇమ్ము = సెలవిమ్ము

తాత్పర్యము: ఓ జగత్పతీ ఓ చంద్రమౌళీ ఓ దయాసముద్రా ఓ ముక్కంటీ విష్ణుబ్రహ్మాది దేవతల కిరీటములకు తెలిసిన పాదపద్మద్వయము గలవాడా - విష్ణు బ్రహ్మాదులు తమ కిరీటములు సోక నమస్కరించు పాదపద్మములు గలవాడని బావము ఓయి జలందరవిరోధీ మదగజము చర్మము బొంతగా దరించు మూపు గలవాడా ఓ నీలలోహితా నొసటి కంటి మంటచే దహింపబడిన దక్షిణ దిగధిపతి యగు యముడు తానును చిత్రగుప్తుడు తమసేవ చేయవచ్చెను తమ కడకు గొని వచ్చుటకు ఇప్పుడు సమయమా? లేక వీలుకాదు కొంతసేపుండు మందమా? సెలవిమ్ము

విశేషములు: దండదరుడు తాను చిత్రగుప్తుడు దేవర సేవ సేయ నరుగు దెంచినవాడు `ఆత్మార్థంబ బిహితం బగుచో తల్లింగ సంఖ్యాబిదాయి వచనంబు ధాతు విశేషణంబులకగు. బాల క్రియ 120

వ. అని పలికి శివుని ముఖ ప్రసాదంబు నింగితం బెఱింగి నందికేశ్వరుండు తన్నుం బ్రవేశింపంజేయం జిత్రగుప్తసహితుండై చనువాడు ముందట 14

అర్థము: అని పలికి, శివుని యొక్క, ముఖ ప్రసాదంబు + ఇంగితంబు = ముఖానుగ్రహము యొక్క అబిప్రాయము, ఎఱింగి నందికేశ్వరుండు, తన్నున్ ప్రవేశింపన్ + చేయన్ = ప్రవేశపెట్టగా చిత్రగుప్త - సహితుండు = చిత్రగుప్తునితో గూడిన వాడు, ఐ, చనువాడు = పోవువాడు, ముందటన్ = ఎదుట

తాత్పర్యము: అని పలికి శివుని ముఖప్రసన్నతచే నతని అంగీకార బావము నెఱింగి నందికేశ్వరుడు తన్ను ప్రవేశపెట్టగా యముడు చిత్రగుప్తునితో గూడిన వాడయి పోయి యెదుట - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు: ముఖ ప్రసాదంబు + ఇంగితంబు - `షష్ఠీ సమాసమునందుకార ఋకారంబుల కచ్చు పరంబగునపుడు నుగాగమంబగు ముఖప్రసాదంబు నింగితంబు

- బాల సంది 34

సీ దేవదేవుని పూర్వ దిగ్భాగమున యందుఁ
బరమ (మా) హేశులఁ బాశుపతుల

*గీ వికట పాటల ఘన జటా మకుట కోటి
ఘటిత కుటిల శశాంక రేఖా కలాప
భూషితులఁ జతుర్బాహుల భూరిబలుల
శ్రాద్ధదేవుండు చూచి విస్మయము బొందె 15

అర్థము: శ్రాద్ధ - దేవుండు = యముడు దేవదేవుని = వేల్పులకు వేల్పయిన శివుని యొక్క, పూర్వ - దిక్ + బాగమునయందున్ = తూర్పుదిక్కున, పరమ - మాహేశులన్ = పరమ మాహేశ్వరులగు పాశుపతులన్,

వికట భూషితులన్ వికట = పెద్దవియైన, పాటల = తెలుపు మించిన యెఱుపు గల ఘన = గొప్పవి యగు, జటా = జడలనెడి, మకుట = కిరీటముల యొక్క కోటి = అంచులందు ఘటిత = కూర్పబడిన కుటిల = వంకరయైన, శశాంక - రేఖా = చంద్రకళ యనెడు కలాప = అలంకారముచే భూషితులన్ = అలంకరింపబడిన వారిని చతుర్ + బాహులన్ = నాలుగు చేతులుగలవారిని భూరి - బలులన్ = గొప్పబలము గలవారిని, చూచి, విస్మయమున్ = ఆశ్చర్యమును పొందెన్

తాత్పర్యము: యముడు శివునకు తూర్పుదిక్కున పెద్దవియు, పాటల వర్ణము గలవియు నగు గొప్ప జడల కిరీటముల కొనలందు కూర్పబడిన కుటిల చంద్రకళాభరణములచే నలంకరింపబడిన వారును నాలుగు భుజములు గలవారును, అధికబలము గలవారును అగు పరమ మాహేశ్వరులయిన పాశుపతులను జూచి ఆశ్చర్యము నందెను

గీ దక్షిణంబున వీక్షించె దండపాణి
యజునిఁ బాండురపుండరీకాసనస్థు
నంగిరో వామదేవ కణ్వాక్షపాద
కపిల సనక వసిష్ఠాది గణముతోడ 16

అర్థము: దండ - పాణి - దండము చేతి యందు గలవాడు - యముడు, దక్షిణంబునన్ = శివునికి దక్షిణపు వైపున, పాండుర - పుండరీక + ఆసన - స్థున్ = తెల్లని వెలితమ్మి పూవనెడు ఆసనమునందు ఉన్నవాడు (అగు) అజునిన్ =

* ఈ పాదములకు సరిపోవునంత స్థలము తాళపత్రమున ఊరక విడువబడినది

బ్రహ్మను, అంగిరో... తోడన్ అంగిరస్ = అంగిరుడు వామదేవ = వామదేవుడు, కణ్వ = కణ్వుడు, అక్షపాద = కన్నుపాదమునందు గలవాడు - గౌతముడు, కపిల = కపిలుడు, సనక = సనకుడు, వసిష్ఠ = వసిష్ఠుడు, ఆది = మొదలగువారి గణముతోడన్ = సమూహముతో, వీక్షించెన్ = చూచెను.

తాత్పర్యము : యముడు శివుని దక్షిణదిక్కున వెలిదమ్మి పీఠముపై గూర్చున్న బ్రహ్మను అంగిరుడు, వామదేవుడు, కణ్వుడు, గౌతముడు, కపిలుడు, సనకుడు, వసిష్ఠుడు మున్నుగా గలవారి సమూహముతో కూడియుండగా చూచెను.

విశేషములు: పుండరీక మన తెల్ల తామరపువ్వు `పాండుర విశేషణ మనావశ్యకము అంగిరోవామదేవ - అంగిరస్ + వామదేవ - సకారమునకు విసర్గాదేశము అంగిరః + వామదేవ హ్రస్వ అకారము పూర్వమందు గల విసర్గమునకు హ్రస్వ అకారము కాని, మృదు హల్లులు (హశ్శులు) కాని పరములగునపుడు ఉ ఆదేశముగా వచ్చి పూర్వమందున్న అకారముతో గూడి గుణసంధియై ఓ గా మాఱును అంగిరోవామదేవ.

సీ. బ్రాహ్మి [1]మాహేశ్వరి వారాహి కౌమారి
చాముండ యైంద్రి వైష్ణవి యనంగ
మాలతి నాఁగ సుబాలిక నా బల
[2]ప్రమథిని నా వికరాళి యనఁగ
కాళరాత్రి కరాళికా ప్రచండు లనాఁగ
బ్రాహ్మ్యాది మాతృకా పరికరంబు
పార్వతి ప్రముఖబల......
ప్రమదనాదిక భూత పరికరములు

గీ. ప్రమథవర్గంబు లయకాల భైరవుండు
పాశుపతములు చండకోప ప్రచండ
చండ చండార్చులును ఘోరశారభముల
శివుని పడమటి యెడ నిరీక్షించె యముఁడు. 17

అర్థము: బ్రాహ్మి, మాహేశ్వరి, వారాహి, కౌమారి, చాముండ, ఐంద్రి, వైష్ణవి అనగన్, మాలతి, నాగన్ = అనగను, సుబాలిక, నాన్ = అనగను, బలప్రమథిని, నాన్, వికరాళి, అనగన్, కాళరాత్రి, కరాళికా - ప్రచండులు = కరాళిక, ప్రచండి, అనాగన్ = అనగను, బ్రాహ్మీ = ఆది - మాతృకా - పరికరంబు = బ్రాహ్మి మొదలగు మాతృకల పరివారము, పార్వతీ - ప్రముఖుల = పార్వతి మున్నగు

1 తా మాహిషి 2 తా పమథిసేనా

వారిని, ప్రమథన + ఆదిక - భూత - పరికములు = ప్రమధనుడు మున్నగు భూతముల పరివారములు, ప్రమథ వర్గంబు = ప్రమధ గణము, లయ - కాల - భైరవుండు = ప్రళయ సమయము నందలి భైరవుడు, పాశుపతములు, చండ - కోప - ప్రచండ - చండ - చండార్చులును = చండకోపుడు, ప్రచండుడు, చండుడు, చండార్చియును, ఘోర - శారబములన్ = భయంకరములైన శరభములను, యముడు, శివుని - పడమటి + ఎడన్ = పడమటి దిక్కున, నిరీక్షించెన్ = చూచెను.

తాత్పర్యము: యముడు శివుని పడమటి వైపున బ్రాహ్మి, మాహేశ్వరి, వారాహి, కౌమారి, చాముండ, ఐంద్రి, వైష్ణవి, మాలతి, సుబాలిక, బలప్రమథిని, వికరాళి, కాళరాత్రి, కరాళిక, ప్రచండి, అనువారిని బ్రాహ్మి మున్నుగా గల సప్త మాతృకలను, పార్వతి మున్నుగా గలవారిని, ప్రమథనుడు మొదలగు భూత గణములను ప్రమధగణములను, కాలభైరవుని, పాశుపతములు, చండకోపుడు, ప్రచండుడు, చండుడు, చండార్చి అనువారిని ఘోర శరభములను జూచెను.

విశేషములు: బ్రాహ్మ్యాది మాతృకా - బ్రాహ్మి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ అనువారు సప్తమాతృకలు. వీరు రుద్రపరిచర్యాశీలలు.

వ. శంఖ చక్రధరుండును, బీతాంబరుండును, గౌస్తుభోద్భాసిత వక్షఃస్థలుండును, గిరీట కటకహార నూపుర గ్రైవేయ కంఠికాది నానావిధ దివ్యాభరణ భూషితుండును, లక్ష్మీసహాయుండును నై పురాణ పురుషోత్తముండును, నష్టవసువులును, ద్వాదశాదిత్యులును, సిద్ధ విద్యాధర గంధర్వాక్షీణ యక్ష భుజంగ గుహ్యకులును మొదలుగా గల వారును మఱియునుం గలవారల హరుని యుత్తరదిక్కునం గాంచి వైవస్వతుం డద్భుతం బందుచు నభ్యంతరమందిరంబు ప్రవేశించి 18

అర్థము: శంఖ - చక్ర - ధరుండును = శంఖము, చక్రము ధరించిన వాడును, పీత + అంబరుండును = పచ్చని బట్టలు గలవాడును, కౌస్తుభ + ఉద్భాసిత - వక్షస్ +స్థలుండును = కౌస్తుభమనెడి మణిచే, మిక్కిలి ప్రకాశించు, ఱొమ్ముగలవాడును, కిరీట -కటక - హార - నూపుర - గ్రైవేయ - కంఠికా + ఆది - నానా - విధ - దివ్య + ఆభరణ - భూషితుండును = కిరీటము, కడియము, హారము, అందె, కంఠాభరణము, కంటె మున్నగు పెక్కురీతులైన దివ్యాభరణములచే నలంకరింపబడిన వాడును, లక్ష్మీ - సహాయుండును = లక్ష్మీదేవితో గూడినవాడును, ఐ, పురాణ - పురుషోత్తముండును = శ్రేష్ఠుడయిన విష్ణువును, అష్ట - వసువులును = ఎనమండ్రు వసువులును, ద్వాదశ + ఆదిత్యులును = పంద్రెండు గురు సూర్యులును, సిద్ధ - విద్యాధర - గంధర్వ + అక్షీణ - యక్ష - భుజంగ -గుహ్యకులును = సిద్ధులు, విద్యాధరులు, గంధర్వులు, అక్షీణులు, యక్షులు, భుజంగులు, గుహ్యకులు, మొదలుగాన్ + కలవారును, మఱియునున్ + కలవారలన్, వైవస్వతుండు =

యముడు - వివస్వంతుని = సూర్యుని కుమారుడు, అద్భుతంబు + అందుచున్ = ఆశ్చర్యపడుచు, అభ్యంతర - మందిరంబు = అంతఃపుర బవనము, ప్రవేశించి

తాత్పర్యము: యముడు శివుని యుత్తర దిక్కున శంఖచక్రములను దరించిన వాడును, పీతాంబరుడును, కౌస్తుభమణిచే ప్రకాశించు వక్షము గలవాడును కిరీటము, వలయము, హారము, అందె, కంఠహారము, కంఠాబరణము మున్నగు పెక్కురీతుల దివ్యాబరణములచే నలంకరింపబడిన వాడును, లక్ష్మీ దేవితో గూడినవాడును అగు పురుషోత్తముని, ఎనమండ్రు వసువులను, పన్నిద్దఱు సూర్యులను, సిద్ధులు, విద్యాధరులు, గంధర్వులు, అక్షిణులు, యక్షులు, భుజగులు, గుహ్యకులు మున్నగు దేవయోని విశేషములను, ఇంకను తక్కిన వారిని జూచి ఆశ్చర్యపడుచు నంతఃపుర మందిరమును ప్రవేశించి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు: విష్ణుని శంఖము పాంచజన్యము, చక్రము సుదర్శనము. అష్టవసువులు - ఆపుడు, ధ్రువుడు, సోముడు, అధ్వరుడు అనిలుడు, ప్రత్యూషుడు, అనలుడు, ప్రబాసుడు. ద్వాదశాదిత్యులు ఇంద్రుడు దాత, పర్జన్యుడు, త్వష్ట పూష, అర్యముడు, బగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు.

సీ. వేదోక్త మగు క్రియావిధిఁ బాశుపత మహా
  వ్రత దీక్షఁ గైకొన్న వ్రతులఁ జూచె
విచ్ఛిన్నపాశువై విరహిత ద్వంద్వులై
  విమలాత్ము లైన యుత్తములఁ జూచె
[1]నద్వైత తత్త్వ విద్యా రహస్యజ్ఞాన
  సంపన్నులగు యతీశ్వరులఁ జూచె
నిగమాంత వివిధోపనిషదర్థ వాసనా
  ఘనులైన యోగి పుంగవులంజూచె

గీ. దివ్య సింహాసనాసీను ఁద్రిపురహరునిఁ
[2]బర్వతోద్భవా పరిపూర్ణ పార్శ్వ బాగుఁ
గాలకంఠునిఁ జంద్రరేఖాకిరీటు
శ్రీ మహాదేవునభవు వీక్షించె యముఁడు.

అర్థము: యముడు వేద + ఉక్తము + అగు = వేదములందు చెప్పబడినది యగు, క్రియా - విధిన్ = క్రియ యొక్క విధమున, పాశుపత - మహత్ (మహా) +వ్రత - దీక్షన్ = పాశుపతమనెడి గొప్ప వ్రతము యొక్క దీక్షను, కైకొన్న =

1 తా అద్వైత తత్త్వ వేద ద్వ్యరహస్యజ్ఞాన 2 తా బర్వతోద్భవా పూర్ణుంబారబాగు

స్వీకరించిన వ్రతులన్ = మునులను, చూచెన్ ఛి-చ్ఛిన్న - పాశులు + ఐ = త్రెగిన పాశములు గలవారయి, విరహిత - ద్వంద్వులు + ఐ = సుఖదుఃఖములు మున్నగు ద్వంద్వములు లేని వారయి విమల + ఆత్ములు = నిర్మలములయిన మనస్సులు గలవారు, ఐన, ఉత్తములన్ = మంచివారిని చూచెన్ అద్వైత - తత్త్వ - విద్యా - రహస్య - జ్ఞాన - సంపన్నులు = జీవేశ్వరుల యైక్యమును చెప్పు తాత్త్వికవిద్యారహస్య జ్ఞానముతో గూడిన వారు, అగు, యతి + ఈశ్వరులన్ = ముని శ్రేష్ఠులను చూచెన్. నిగమ + అంత - వివిద + ఉపనిషద్ + అర్థ - వాసనా - ఘనులు = వేదాంతములైన పలురీతి ఉపనిషత్తులందలి విషయమును గూర్చిన జ్ఞానముచే గొప్పవారు, ఐన, యోగి - పుంగవులన్ = యోగి శ్రేష్ఠులను, చూచెన్ దివ్య - సింహాసన + ఆసీనున్ = దివ్యమైన సింహాసనము నందు గూర్చున్నవాడును, త్రిపుర - హరునిన్ = త్రిపురాసురులను సంహరించినవాడును, పర్వత + ఉద్భవా - పరిపూర్ణ - పార్శ్వ - భాగున్ = పార్వతితో నిండిన (వామ) పార్శ్వభాగముగలవాడును, కాల - కంఠునిన్ = నల్లని కంఠము గలవాడును, చంద్ర - రేఖా - కిరీటున్ = చంద్రకళ కిరీటముగా (శిరోభూషణముగా) గలవాడును శ్రీమహాదేవున్, అభవున్ = పుట్టుకలేని వాడును అగు శివుని, వీక్షించెన్ = చూచెను

తాత్పర్యము: యముడు వేద విహితముగా పాశుపత మహావ్రత దీక్షను గైకొనిన మునులను, తెగిన పాశములు గలవారును, ద్వంద్వరహితులు నయి నిర్మల మనస్కులగు నుత్తములను, అద్వైత తత్త్వ విద్యా రహస్య జ్ఞానవేత్తలగు యతీశ్వరులను, వివిధోపనిషదర్థముల జ్ఞానముచే గొప్పవారగు యోగి శ్రేష్ఠులను, దివ్యసింహాసనాధిష్ఠితుడును, త్రిపుర సంహారుడును, పార్వతీ పరిపూర్ణ వామ పార్శ్వుడును, కాలకంఠుడును, చంద్రకళా వతంసుడును అభవుడును అగు శ్రీ మహాదేవుని చూచెను.

వ. వీక్షించి దండప్రణామంబు చేసి నిలిచి చేతులు మొగిడ్చి మహేశు నిట్లని స్తుతించె 20

అర్థము: (యముడు) వీక్షించి = చూచి, దండ - ప్రణామంబు = సాష్టాంగ నమస్కారము, చేసి, నిలిచి, చేతులు, మొగిడ్చి = జోడించి, మహేశున్ = ఈశ్వరుని, ఇట్లు + అని, స్తుతించెన్.

తాత్పర్యము: యముడు ఈశ్వరుని చూచి, సాష్టాంగ నమస్కారము చేసి, నిలిచి, చేతులు మోడ్చి యిట్లు స్తోత్రము చేసెను

రగడ :జయజయ సచరాచర సర్వజగత్సర్గ స్థితి సంహార తిరోభా
(వా) నుగ్రహలీలా పంచ విధ వ్యవహార వినోదైక పరాయణ
జయజయ హాటక గర్భకిరీట స్థాపిత బహువిధమణి ఘృణి పటల

వ్యతికర కిమ్మీరిత [1]పాదాబ్జ ద్వంద్వ పీఠికోపాంత వసుంధర
అహరహ [2]రహమహమికయా త్వా మభివన్దే పృథుగోధి వీథికా
దృ గ్ధామ ధ్వజ జిహ్వా [3]రంహో మృత్కణాయమాన ప్రసవాయుధ
మహిమానం తవ కోవా స్తోతుం ప్రభవతి విషనిధి విషకల్మాషిత
కంఠమూల కంఠోక్త్రాశేష జగత్సంరక్షా దాక్షిణ్యక్షమ
శరణం మమ తవ చరణం భూయా త్సరసిరుహ పలాశోదరారుణం
ఫణధర పరివృఢకాభర (ణాంచిత) పరమకృపాగుణకింకర శంకర
కురు మయి దాక్షిణ్యం ప్రాలేయక్షోణీధర దుహితృస్తన కుంభ
స్థల (కస్తూరీ) స్థాసకముద్రాస్థగిత విపుల వక్షఃపీఠాంతర
హరశంభో విశ్వేశ మహాదేవాసుర వల్లభ శివ సర్వాత్మన్
నీలకంఠ శంకర వృషభధ్వజ [4]నిటాలలోచన భర్గ పాహి మాం
ధరణీధర కోదండ శింజినీ దండశూక పరివృఢగుణ టాంకృతి
ధారా నిర్భిన్న త్రిపురాసురదార హృదయ సంపుట మాం పాలయ
సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ స్వప్రతిష్ఠిత మాద్యమనాద్యం
తమనాధారం వ్యోమ్ని పతే [5]సంతతం సమస్తోపాధి ధ్రువమితి
నిత్యం నిత్యవివేకశాలినో నియతా శ్శాంతా నిరహంకారా
ధ్యాయన్తి మహాయోగిపుంగవా యం తస్మై భవతే నమశ్శివ
జ్వాలా జాలకరా(ళ) జ్వలన స్తంభరూప మభిబిభ్రతా త్వయా
త్రైలోక్యాతిశయాళు మోహితౌ తామరసాసన కైటభాంత కౌ
లీల యోర్ధ్వభాగాధోభాగోల్లేఖ కుతూహల [6]హంస పోత్రిణౌ
కింపచాన విజ్ఞానవైభవాః [7]కే వయం భవన్తం జ్ఞాతుం భ్రమ
స్ఖలితగతి రతద్వ్యావృత్త్యా యం చకిత మభిధత్తే శ్రుతిరపి భవాన్
[8]కస్య హి వాచా సంస్తోతవ్యః [9]కతివిధగుణకః కస్య హి విషయః
హర శంభో వృషభధ్వజ శూలిన్ హాలా(హల) ధర శంకరగిరిశే
త్యహరహ (రహం) పఠామి (తైః) కుఠారాయుధస్థితైర్ఘ్రాయా సుస్థిత
మున్నతై ర్ఘ్రాయా చ్చరణాంబురుహ మున్నతం దీర్ఘాయుష్యాయ ((మమ)
జటాదిపలాస్తే భూయాసుః మమ (?)
ప్రత్యాసీదతి సంధ్యాసమయే ప్రారబ్ధజగత్సంస్థియా విధౌ
దండపాణి చంక్రమణోత్సాహి తాండవ కేళి [10]శీలినః (?) 21

1 తా. పాదాంభోరుజద్వంద్వ పీఠిపోపాంత 2. తా మహమేకయా 3 తా రహస్త్యకరుణాయమాన
4 తా నిటల. 5. తా. సంట్ట తమస్త సమస్తోపాధిద్రుమ మితి. 6 తా.హల పవిత 7 తాకైవయం
భవత్తం జ్ఞాతుం 8 తా కస్యైకయోవాచా. 9. తా కతివిధగుణయన్ హలమిహభిరుహ్యై ర్నై.
10 తా. శోభినః

అర్థము: జయజయ సచరాచర...... పరాయణ స - చర + అచర = చరములు అనువానితో గూడిన, జగత్ = జగత్తుయొక్క, సర్గ = సృష్టి, స్థితి = ఉనికి, సంహార = లయము, తిరోభావ = మఱుగుపాటు, అనుగ్రహ = ప్రసాదము, అనెడి, లీలా = క్రీడల యొక్క, పంచవిధ = అయిదురీతులైన, వ్యవహార = వ్యాపారములనెడి, వినోద = వేడుక యందు, ఏక = ముఖ్యమైన, పరాయణ = ఆసక్తి గలవాడా., జయ-జయ = జయింపుము, జయింపుము

జయజయ హాటక...... వసుంధర: హాటక - గర్భ = హిరణ్య గర్భుని (బ్రహ్మ) యొక్క, కిరీట = కిరీటము నందు, స్థాపిత = తాపబడిన, బహు - విధ = పెక్కురీతులైన, మణి = రత్నముల యొక్క, ఘృణి = కాంతుల యొక్క, పేటల = సమూహము యొక్క, వ్యతికర = కలయికచే, కిమ్మీరిత = చిత్ర వర్ణము గలదిగా చేయబడిన, పాద + అబ్జ = అడుగు దామరల యొక్క, ద్వంద్వ = జంటయొక్క, పీఠికా = పీఠము యొక్క, ఉపాంత = సమీపమునందలి, వసుంధర = భూమి గలవాడా. జయజయ

అహరహ .... ప్రసవాయుధ పృథు = పెద్దదియగు, గోధి - వీథికా = నొసటిప్రదేశము నందలి, దృక్ = కంటియొక్క, ధూమ - ధ్వజ = అగ్నియొక్క, జిహ్వా = జ్వాలయొక్క, రంహస్ = వేగముచేత, మృద్ + కణాయమాన = మట్టివేశములుగా నగుచున్న, ప్రసవ + ఆయుధ = పుష్పబాణుడా (మన్మథుడా) - శివా., అహన్ + అహన్ = అహరహః = ప్రతి దినమును, అహమహమికయా = నేను నేనని పోటీపడుచు, త్వాం = నిన్ను, అభివన్దే = నమస్కరించుచున్నాను

మహిమానం......... క్షమ: విషనిధి = సముద్రమునందలి, విష = హాలాహలము చేత, కల్మాషిత = కల్మషము గలదిగా చేయబడిన, కంఠమూల = కంఠప్రదేశముచేత, కంఠ + ఉక్త = సృష్టికరింపబడిన, అశేష = ఎల్ల, జగత్ = లోకముల యొక్క, సంరక్షా = బాగుగా కాపాడుటయందలి, దాక్షిణ్య = దయయందు, క్షమ = సమర్థుడయినవాడా. తవ = నీ యొక్క, మహిమానం = మహిమమును, స్తోతుం = స్తుతించుటకు, కః + వా = ఎవడు, ప్రభవతి = సమర్థుడగుచున్నాడు?

శరణం మమ......... శంకర: ఫణధర = పాముల యొక్క, పరివృఢక = రాజు - వాసుకి, అనెడు, ఆభరణ = అలంకారము చేత, అంచిత = ఒప్పిన వాడా, పరమ - కృపా - గుణ = గొప్పదయ యను గుణముతో, కింకర = సేవకులకు (భక్తులకు), శం - కర = సుఖమును కలుగచేయువాడా పరమ - కృపా - గుణ = గొప్పది యగు దయయనెడు గుణముగలవాడా కింకర - శంకర = బక్తులకు శుభమును చేయువాడా అని వ్యస్తముగానైన చెప్పవచ్చును - శివా సరసిరుహ - పలాశ = తామరపాకుయొక్క ఉదర = నడిమి బాగము వలె, అరుణం = ఎఱ్ఱనైన,

తవ = నీయొక్క చరణం = పాదము మమ = నాకు శరణం = శరణు, భూయాత్ = అగుగాక

కురు మయి .... పీఠాంతర: ప్రాలేయ - క్షోణీధర = మంచు గొండ యొక్క, దుహిత్రు = కూతురైన పార్వతి యొక్క స్తన - కుంభ - స్థ = కుండలవంటి కుచముల ప్రదేశము నందలి, కస్తూరీ - స్థాసక = కస్తూరీ తిలకము యొక్క ముద్రా = గుఱుతు చేత, స్థగిత = ముద్రితమైన, విపుల = విశాలమైన, వక్షస్ () + పీఠ + అంతర = ఱొమ్ము ప్రదేశము యొక్క నడిమి భాగము గలవాడా శివా మయి = నాయందు, దాక్షిణ్యం = దయను కురు = చేయుము

హర.............పాహి మాం : హర = హరుడా, శంబో = శంబుడా, విశ్వ + ఈశ = జగత్ప్రభూ! మహాదేవ, అమర - వల్లభ = దేవతలకు ఇష్టుడా శివ సర్వ + ఆత్మన్ = శివా, నీల - కంఠ = నల్లని కంఠముగలవాడా - శివా , శంకర = శుభమును గలుగజేయువాడా. - శివా, వృషభ - ధ్వజ = ఎద్దు కేతనముగా గలవాడా , నిటాల - లోచన = నుదుట కన్ను గలవాడా, భర్గ = శివా, మాం = నన్ను, పాహి = రక్షింపుము

ధరణీధర .... పాలయ : ధరణీధర = (మేరు) పర్వత మనెడు వింటి యొక్క, శింజినీ = నారియైన, దందశూక - పరివృఢ = పాముల ఱేడనెడు, గుణ = నారియొక్క, టాంకృతి = టంకారముల యొక్క ధారా = పరంపరచే నిర్భిన్న = భేదింపబడిన, త్రిపుర + అసుర = త్రిపుర రాక్షసుల యొక్క, దార = భార్యల యొక్క, హృదయ - సంపుట = బరణుల వంటి హృదయములు గలవాడా శివా మాం = నన్ను, పాలయ = పాలింపుము.

సత్యం .... నమశ్శివ : సత్యం = సత్యము, అనంతం = అంతములేని, జ్ఞానం = జ్ఞానము, బ్రహ్మస్వప్రతిష్ఠితం = తపోదనముచేత ప్రతిష్ఠింపబడినది, ఆద్యం = మొదటిది, అనాద్యంతం = మొదలు తుది లేనివాడు, వ్యోమ్ని = ఆకాశమునందు, అనాధారం = ఆధారము లేనివాడు సంతతం = శాశ్వతుడు, సమస్త + ఉపాధి - ధ్రువం = అన్నిటికి ఉపాధియైన నిశ్చయుడు, ఇతి = అని, నిత్యం = ఎల్లప్పుడును, నిత్య - వివేక - శాలినః = స్థిరమైన జ్ఞానము చే ప్రకాశించువారును, నియతాః = నియమము గలవారును, శాంతాః = శాంతులును, నిరహంకారాః = అహంకారము లేని వారును, అగు, మహత్ (మహా) + యోగి - పుంగవాః = గొప్ప యోగి శ్రేష్ఠులు, యం = ఎవనిని, ధ్యాయన్తి = ధ్యానము చేయుదురో, తస్మై - భవతే = అట్టి నీ కొఱకు, పతే = నాధా , శివ = శివుడా, నమః = నమస్కారము

జ్వాలా జాల........... హంసపోత్రిణౌ : త్రైలోక్య + అతిశయాళు = ముల్లోకముల నతిక్రమించు స్వభావముగల, జ్వాలా = మంటలయొక్క, జాల = సమూహముచే, కరాళ = భయంకరమైన, జ్వలన - స్తంభ - రూపం = అగ్గికంబము నాకారమును, అబిబిభ్రతా = తాల్చునట్టి, త్వయా = నీచేత, ఊర్ధ్వభాగ + అధోభాగ = మీది, క్రింది భాగముల యొక్క, ఉల్లేఖ = ఒరయుట యందు, కుతూహల = వేడుకగల, హంస - పోత్రిణౌ = హంసము, వరాహమునైన, తామరస + ఆసన - కైటభ + అన్తకౌ = బ్రహ్మవిష్ణువులు, లీలయా = క్రీడచే, మోహితౌ = మోహము నొందింపబడిరి.

కింపచాన............... విషయః : శ్రుతిః + అపి = వేదము కూడ, భ్రమ - స్ఖలిత - గతిః = భ్రాంతిచేత తడబాటు పొందిన దయి, అతద్వ్యావృత్త్యా = తచ్ఛబ్దమును వదలుకొనకయే - `అదికాదు అదికాదు అని నిశ్చయజ్ఞానము లేకయే, చకితం = భయముతో గూడికొనునట్లు, యం = ఎవనిని, అభిధత్తే = పలుకుచున్నదో, అట్టి, భవన్తం = నిన్ను, జ్ఞాతుం = తెలిసికొనుటకు, కింపచాన - విజ్ఞాన - వైభవాః = అల్పవిజ్ఞానముగల వారమైన, వయం = మేము, కే = ఎవరము? హి = కావున, భవాన్ = నీవు, కస్య = ఎవనికి, వాచా = వాక్కుతో, సంస్తోతవ్యః = స్తుతింపదగనవాడవు?, కతి -విధ - గుణకః - ఎన్ని విధములైన గుణములు గలవాడవు?, కస్య = ఎవనికి, విషయః = గోచరుడవు?

హరశంభో............ పఠామి : అహం = నేను, అహరహః = దినదినమును, హర, శంభో, వృషభధ్వజ, శూలిన్, హాలాహల - ధర = విషమును ధరించినవాడా, శంకర = శుభమును చేయువాడా, గిరిశ = కొండయందు శయనించు వాడా, ఇతి = అని, పఠామి = పఠించుచున్నాను.

ఇటనుండి పాఠము సరిగాలేమి దుర్బధముగా నున్నది

త్తైః కుఠారాయుధస్థితై ర్భూయాసు స్థితమున్నత్తైః ?

భూయాచ్చరణ....... మమ.

తే = నీ యొక్క, ఉన్నతం = గొప్పదియగు, చరణ + అంబురుహం = పాదపద్మము, మమ = నాకు, దీర్ఘ + ఆయుష్యాయ = దీర్ఘాయుస్సు కొఱకు, భూయాత్ = అగుగాక.

జటాదిపలాస్తే భూయాసుః మమ ?
ప్రత్యాసీదతి......... తాణ్డవకేళి శీలినః?

తాత్పర్యము: చరాచరములతో గూడిన జగత్తు యొక్క సృష్టి స్థితి లయ తిరోభావానుగ్రములనెడి అయిదు రీతులైన వ్యాపారములనెడి వినోదమునం దాసక్తి గలవాడా - శివా! జయము జయము. బ్రహ్మ కిరీటమునందలి బహువిధ మణుల

కాంతులచే చిత్రవర్ణముగలదిగా చేయబడిన పాదపద్మద్వయ పీఠభూమిగలవాడా జయము జయము. నొసటి కంటి మంటల వడిచే మన్మధుని మట్టిచేసినవాడా నిన్ను నే నహరహము నహమహమికతో నమస్కరించుచున్నాను సముద్రహాలాహలము చే కలుషితమైన కంఠముచే స్పష్టీకరింపబడిన సకల జగద్రక్షా దాక్షిణ్యాము గలవాడా నీ మహిమమును స్తుతింపనెవడు సమర్థుడు? భుజగరాజాభరణా. పరమదయాగుణా భక్తులకు శుభములను గలిగించువాడా తామరపాకు నడిమి బాగమువలె అరుణమైన నీ పాదము శరణమగుగాక పార్వతీ కుచ కుంభములందలి కస్తూరీతిలక ముద్రచే ముద్రితమైన వక్షఃస్థలము గలవాడా శివా నన్ను దయజూడుము హరా శంభూ విశ్వేశా మహాదేవా అమరవల్లభా శివా, సర్వాత్ముడా నీలకంఠా శంకరా వృషభధ్వజా ఫాలనయనా. బర్గుడా నన్ను రక్షింపుము. కొండవింటి పాప అల్లె టంకారములచే త్రిపురాసుర బార్యల హృదయ పుటములను బేదించిన వాడా నన్ను పాలింపుము

సత్యము, అనంత జ్ఞానము తపోధన ప్రతిష్ఠితుడు, ఆద్యుడు ఆద్యంత రహితుడు, ఆకాశమున నిరాదారుడు, శాశ్వతుడు, సర్వోపాధి నిశ్చయుడు అని యెల్లప్పుడును నిత్యజ్ఞానశాలులు, నియతులు, శమగుణ సంపన్నులు, నిరహంకారులునైన మహాయోగివర్యులు ధ్యానించునో శివా నీకు నమస్కారము. ముల్లోకముల నతిక్రమించు స్వభావముగల మంటలచే భయంకరమగు నగ్గికంబపు టాకారమును దాల్చు నీచే హంసయై మీదికి పోయిన బ్రహ్మయు, వరాహమయి క్రిందికి పోయిన విష్ణువును మోహము నొందింపబడిరి వేదము గూడ బ్రాంతి చే తడబాటు గలదయి `అదికాదు అదికాదు అని నిశ్చయజ్ఞానము లేక భయముతో గూడికొనినట్లు పలుకు చున్నదన్నచో, నల్పజ్ఞానులమైన మేము నిన్ను దెలిసికొన నెవరము? నీవు ఎవనికి సంస్తుత్యుడవు? నీ గుణములెన్ని? నీ వెవనికి గోచరుడవు? నేను ప్రతిదినమును నిన్ను హరా, శంభూ, వృషభధ్వజా, శూలీ, హాలాహలధరా శంకరా, గిరిశా యని ప్రార్థించుచున్నాను ఉన్నతమైన నీ పాదద్వయము నాకు దీర్ఘాయువు నిచ్చుగాక.

విశేషములు : ఇందు శ్రీనాదుడు పుష్పదంత కృత మహిమ్నఃస్తవము నందలి - ` అతీతః వన్థానం తవ చ మహిమా వాఙ్మనసయో రత ద్వ్యావృత్త్యా యం చకిత మబిధత్తే శ్రుతి రపి స కస్య స్తోత్రవ్యః కతివిధగుణః కస్య విషయః పదే త్వర్వాచీనే పతతి న మనః కస్య న వచః అను శ్లోకమును - `కింపచాన జ్ఞానవైబవాః . కస్య హి విషయః అను భాగమును సంగ్రహించినాడు

మఱియును సనత్కుమార సంహితార్గత శివతత్త్వసుధానిధి యందలి శివనామస్మరణాధ్యాయ మందున్న

`హర శంభో మహాదేవ విశ్వేశామరవల్లబ

అను శ్లోకమును గూడ శ్రీనాదుడిందు పొందు పఱుచుట చూడనగును

సీ హరినీల లింగంబునందు దైత్యారాతి
మణిలింగమున నగ్రమాధవుండు
కమలరాగాశ్మలింగమునందు సప్తార్చి
కమనీయ రత్నలింగమున నేను
నీల లింగమునందుఁ బౌలోమ్యధీశుండు
కరువలి వజ్రలింగంబునందు
గరుడ దానవ యక్ష గంధర్వకిన్నర
ఖచరులు లోహలింగంబునందు

గీ భక్తిఁ బూజించి తమతమ పదవులొంది
రేను నా యదిరాజ్యంబు నేలికొంటి
నర్థి నెవ్వని కృపఁజేసి యట్టి నిన్ను
సంస్తుతించెదఁ జంద్రార్ధశకలమౌళి. 22

అర్థము: అర్థిన్ = కోరికతో, ఎవ్వని - కృపన్ + చేసి = ఎవని దయచేత, దైత్య + అరాతి = రాక్షసవిరోధియగు విష్ణువు, హరి - నీల - లింగంబునందున్ = ఇంద్రనీలమణి లింగము నందును, అగ్ర - మాధవుండు = మణిలింగమునన్, సప్త + అర్చి = అగ్ని (ఏడు జిహ్వాలు గలవాడు), కమల - రాగ + అశ్మ - లింగమునందున్ = పద్మరాగమణి లింగము నందును, నేను కమనీయ = రత్న - లింగమునన్ = మనోహరమైన రత్నమయ లింగమునందును, పౌలోమీ + అధి + ఈశుండు = శచి భర్తయైన ఇంద్రుడు, నీల - లింగమునందున్, కరువలి = వాయువు, వజ్రలింగము నందున్, గరుడ, దానవ, యక్ష గంధర్వ, కిన్నర, ఖచరులు, గరుడులు, దానవులు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు అను దేవతలు, లోహ - లింగంబునందున్ = ఇనుపలింగము నందును, భక్తిన్ = భక్తితో, పూజించి, తమ - తమ = వారివారి పదవులు ఒందిరి, ఏనున్, నా + అధిరాజ్యంబున్ = నా గొప్పరాజ్యమును, ఏలికొంటిన్ = పాలించితిని, (నో), అట్టి, నిన్నున్ = నిన్ను చంద్ర + అర్థ - శకల - మౌళి = చంద్రునిలో సగము ముక్క శిరస్సున గలవాడా - చంద్రకళా వతంసుడా - శివా, సంస్తుతించెదన్

తాత్పర్యము: విష్ణువు ఇంద్రనీల మణిలింగమునందును, మణిలింగము నందును, అగ్ని పద్మరాగమణి లింగమునందును, నేను మనోహరమైన రత్నలింగమునందును, ఇంద్రుడు నీల లింగము నందును, వాయువు వజ్రలింగమునందును, గరుడ దానవ యక్ష గంధర్వ కిన్నర ఖేచరులు లోహలింగము నందును భక్తితో పూజించి యెవని దయచే తమతమ పదవుల నొందిరో, నేను నా గొప్ప రాజ్యము నేలితినో అట్టి నిన్ను

`ఓ చంద్రకళావతంసా సంస్తుతింతును

వ సర్వజ్ఞ [1]సకల సృష్టి స్థిత్యంత కారణ వరేణ్యా భక్తిగమ్యా సకల కల్మషాపహ శ్రీపాద పద్మ వేదాగమ పురాణేతిహాస సంహితా మహాఫలభూత సర్వభూత హృదయస్థిత అఖిల దేవమయ మహాదేవ నీకు నమస్కరింతు

అర్థము : సర్వజ్ఞ = అన్నియు తెలిసినవాడా సకల - సృష్టి - స్థితి + అంత - కారణ - వరేణ్యా = అన్నిటి సృష్టి స్థితిలయములకు కారణమైన వారిలో శ్రేష్ఠుడా భక్తి - గమ్యా = భక్తిచే పొందదగినవాడా సకల - కల్మష + అపహ - శ్రీ - పాద - పద్మ = ఎల్ల పాపములను పోగొట్టు శుభకర పాదపద్మములు గలవాడా వేద + ఆగమ - పురాణ + ఇతిహాస - సంహితా - మహత్ (మహా) - పల - భూత - సర్వ - భూత హృదయ - స్థిత = వేదములు ఆగమములు పురాణములు ఇతిహాసములు, సంహితలు (మంత్రరూప వేద బాగములు) అనువానికి గొప్ప ఫలములయిన యెల్ల ప్రాణుల యొక్క హృదయములందున్నవాడా, అఖిల - దేవ - మయ = ఎల్ల దేవతల స్వరూపమైన వాడా, మహాదేవ నీకున్, నమస్కరింతున్

తాత్పర్యము : సర్వజ్ఞా అన్నిటి సృష్టి స్థితిలయములకు కారణములైనవారిలో శ్రేష్ఠుడా భక్తి గమ్యుడా, సకల పాపహరమైన శ్రీపాదపద్మములు గలవాడా వేదాగమ పురాణేతిహాస సంహితల ఫలములగు సర్వప్రాణుల హృదయములందుండు వాడా సర్వదేవతాస్వరూపా నీకు నమస్కరింతును

సీ. ఎవ్వానియందుండు నెల్ల భూతంబులు
సింధువునందు వీచికలు వోలె
నెవ్వాడు వసియించు నెల్ల భూతములందు
నంబు వుల్లోలంబునందుఁ బోలె
నెల్ల భూతంబుల హృదయంబులందును
వసియించు నెవ్వఁడాకసమువోలె
నొకఁడు పెక్కై తోఁచు నుదధిఁ జంద్రుఁడు వోలె
నెవ్వఁ డజ్ఞానమూఢేంద్రియులకుఁ

గీ. పురుషుఁడని బ్రహ్మమని యజ్ఞపురుషుఁడనియు
నర్కుఁడని వాయువని శక్రుఁడని హరియని
చంద్రుఁడని కొల్తు రాయాయి సరణి వారు
భక్తి నెవ్వాని నట్టి నీ బంట నభవ 24

1 తా సకలసిత[illegible]

అర్థము: అభవ = ఈశ్వరా, ఎల్ల - భూతంబులున్ = అన్ని ప్రాణులును, సింధువు నందున్ = సముద్రమునందు, వీచికలు + పోలెన్ = అలలవలె, ఎవ్వాని యందున్ = ఎవనియందు ఉండున్ ఎవ్వాడు, ఎల్ల - భూతములందున్ = అన్ని ప్రాణులందును, అంబువు = నీరు, ఉల్లోలంబునందున్ + పోలెన్ = పెద్దఅలయందు వలె, వసియించున్ = ఉండును ఎవ్వడు, ఎల్ల - భూతంబుల = సర్వప్రాణుల యొక్క హృదయంబులందున్, ఆకసము + పోలెన్ = ఆకాశము వలె, వసియించున్ = ఉండును ఎవ్వడు అజ్ఞాన - మూఢ + ఇంద్రియులకున్ = తెలివిలేమిచే, మందములైన, ఇంద్రియములు గలవారికి ఒకడు, ఉదధిన్ = సముద్రమునందు, చంద్రుడు + పోలెన్ = చంద్రుడువలె, పెక్కు + ఐ = అనేకమయి, తోచున్ = కనబడును పురుషుడు + అని, బ్రహ్మము + అని, యజ్ఞ - పురుషుడు + అనియున్, అర్కుండు = సూర్యుడు, అని, వాయువు + అని, శుక్రుండు + అని = ఇంద్రుడని హరి = విష్ణువు, అని, చంద్రుఁడు + అని, ఆయాయి + సరణివారు = ఆయారీతులవారు, భక్తిన్ = భక్తితో, ఎవ్వానిన్ = ఎవనిని కొల్తురు = సేవింతురు, అట్టి నీ - బంటన్ = నీ సేవకుండను

తాత్పర్యము: ఈశ్వరా ఎవని యందు సర్వభూతములును సముద్రము నందలల వలె నుండునో, ఎవడు పెద్దయల యందు నీరువలె సర్వప్రాణులందు నుండునో, ఎవడు సర్వప్రాణుల హృదయము లందును ఆకాశమువలె వసించునో ఎవడు అజ్ఞానముచే మూఢములైన యింద్రియములు గలవారికి సముద్రము నందు చంద్రుడు వలె నొకడు పెక్కుగా తోచునో, ఎవనిని ఆయా మార్గముల వారు పురుషుడని, బ్రహ్మమని, యజ్ఞపురుషుడని, సూర్యుడని, వాయువని, ఇంద్రుడని విష్ణువని, చంద్రుడని భక్తితో సేవింతురో అట్టి నీ సేవకుడను.

విశేషములు: ఉపమాలంకారము ఆయాయి = ఆ + ఆ - `ఆకారంబున కామ్రేడితంబునకుం దదర్థకంబున కయి యాయి యను శబ్దంబులు విభాషనగు. బాల సమాస 21, ఆయయి, ఆయాయి, అయ్యయి, అయ్యాయి, ఆయై, అయ్యై, ఆయా - అనునవి రూపాంతరములు.

వ. ఒక విన్నపంబవధరింపుమా 25

తాత్పర్యము: ఒక మనవి శ్రద్ధతో వినుము

సీ ధర్మాసనమున [1]కాద్యతఁ గృపచేసితి
[2]దక్షిణాశాధిపత్యంబు నొసఁగి

---

1 తా కాద్యత 2 తా దక్షిణేశాధిపత్యంబు

పాపులఁ బా(పా)నురూప దండంబుల
దమియించుటకు నియోగము ఘటించి
చనవరింజేసి [1]పంచిన నాటి నుండియు
నేర్చిన చందాన నియమపరత
దేవరయాజ్ఞ యేదియు వెలిగాకుండ
వర్తిల్లుదును సమవర్తి నగుచు

గీ నభవ యెన్నండు నా దూత [2]లాటువడరు
భర్గ యెన్నండు నా యాజ్ఞ పలుచ గాదు
శర్వ సుకుమారుఁ[3]డనెడు దుర్జాతి పుట్టి
చావఁబట్టి యే నష్టకష్టములఁ బడితి 26

అర్థము: దక్షిణ + ఆశా + అదిపత్యంబున్ = దక్షిణది క్ప్రభుత్వమును ఒసఁగి = ఇచ్చి దర్మ + అసనమునకున్ = దర్మపీఠమునకు ఆధ్యతన్ = సంపన్నతను, కృప - చేసితి = అనుగ్రహించితివి పాపులన్ = పాపము చేసినవారిని, పాప + అనురూప - దండంబులన్ = వారి పాపములకు తగిన శిక్షలచే దమియించుటకున్ = అణచుటకు, నియోగము = ఆజ్ఞ, ఘటించి = కూర్చి చనవరిన్ + చేసి = ఆప్తుని జేసి పంచిన - నాటి నుండియున్ = నియమించినప్పటి నుండియును, నేర్చిన - చందానన్ = తెలిసిన రీతిని, నియమ - పరతన్ = విదియందలి అసక్తితో, దేవర + ఆజ్ఞ = తమ ఆనతి ఎదియున్, వెలి + కాక + ఉండన్ = వర్జితము కాకుండ - విడువకుండ సమవర్తిన్ = సమానముగా ప్రవర్తించువాడను, అగుచున్ వర్తిల్లుదును అభవ = శివా, నా - దూతలు = నాబంట్లు, ఎన్నండున్ = ఎప్పుడును, ఆటు + పడరు = తగ్గరు, భర్గ = శివా నా + ఆజ్ఞ, ఎన్నండున్, పలుచ + కాదు = చులుకనకాదు, శర్వ = శివా, సుకుమారుఁడు + అనెడు దుర్జాతి = దుష్టుడు, పుట్టి, చావన్ + పట్టి = చచ్చుట కారణముగా, ఏన్ = నేను,అష్ట - కష్టములన్ = ఎనిమిది (పెక్కు) కష్టములను, పడితిన్ = అనుభవించితిని.

తాత్పర్యము: నాకు నీవు దక్షిణదిక్ప్రభుత్వము నొసగి ధర్మ పీఠసంపన్నత ననుగ్రహించితివి పాపులను వారి పాపముల కనుగుణములయిన దండములచే శిక్షింపనాజ్ఞాపించి నన్నాప్తునిగా చేసి నియోగించినప్పటి నుండియును నేను నా నేర్చిన భంగి విధి పరత్వముతో తమ యానతి యేదియు విడువక సమవర్తినయి మెలగుదును అభవా నా బంటులెన్నడును జంకరు భర్గుడా నా యాజ్ఞయెన్నడును చులుకగాదు, శర్వా సుకుమారుడను పేరుగల యొక దుర్మార్గుడు పుట్టి చచ్చుట కారణముగా నే నష్టకష్టముల బడితిని

1 తా పంపితి 2 తా లోటు 3 తా డనియెడి

విశేషములు: చనవరి - చనవు + అరి - `అరివర్ణకంబు మతుబర్థంబున జాలాదులకగు బాల తద్ధిత 17 అపదాదిస్వర సంది బాల సంది 11. చందాన - చందము + నన్ `లు ల నలు పరంబగునపుడు దత్పూర్వస్వరంబునకు దీర్ఘంబునగు బాల తత్సమ 43 సమవర్తి - సమముగా వర్తిల్లువాడు - యముడు - `దర్మరాజః పితృపతిస్సమవర్తీ పరేతరాట్ - సమం వర్తితుం శీల మస్యేతి సమవర్తీ - అమరము. బర్గః - `బర్గస్త్ర్యంబక స్త్రిపురాంతకః - బర్గతే కామకాలాదీ నితి బర్గః కామకాలాదులను కాలపాకమును పొందించినవాడు - శివుడు. - అమరము శర్వః - ఈశ్వరశ్శర్వ ఈశాన శ్శంకర శ్చంద్రశేఖరః - ప్రళయే భూతాని శృణాతి హినస్తీతి శర్వః ప్రళయ మందు భూతములను హింసించువాడు - శివుడు. అమరము చావబట్టి = చావన్ + పట్టి చచ్చు - తుమర్థ బావ లక్షణంబులందు నుజియగు చచ్చు + నుజి. బాల క్రియ. 40 `చావు నోవులు చచ్చు నొచ్చుల కగు బాల క్రియ 94 చావు + నుజి. జీత్తు పరంబగునపుడుత్వంబున కత్వంబగు. బాల క్రియ 20 చావ + ను `పట్టివర్ణకంబు హేతువులగు గుణ క్రియల కగు చావను + పట్టి బాల. కారక 14 పిమ్మట ద్రుతకార్యము బాల. సంధి - 16 17. అష్టకష్టములు - ఎనిమిది కష్టములు- 1 దేశాంతరము, 2 భార్యావియోగము, 3 ఆపత్కాలమున బంధు దర్శనము, 4 ఉచ్ఛిష్టబక్షణము, 5 శత్రుస్నేహము, 6. పరాన్నప్రతీక్షణము 7 బంగము, 8 దారిద్ర్యము. నిజమునకు యమునకి కష్టములు లేవు లేకున్నను ఎన్నో కష్టములనుటకు దీనిని వాడుదురు. నష్టకష్టములు నష్టములును, కష్టములును అని ద్వంద్వము చేసినచో నీ అష్టకష్టములుండవు

గీ అభవ నీ కింకరుండు ఖట్వాంగహేతి
కాలమృత్యువు [1]మునిపండ్లు రాల మొత్త
మూలఁబడి యున్నయది ముండమోపిపోలె
నిల్లువెడలక యది మహాహ్రీభరమున. 27

అర్థము: అభవ = ఈశ్వరుడా ఖట్వాంగ - హేతి = ఖట్వాంగము అనెడి ఆయుధము కత్తిగా గలవాడు, అగు, నీ - కింకరుండు = నీ బటుడు, కాల - మృత్యువు = క్రూరమృత్యువు యొక్క మునిపండ్లు = ముందరి పండ్లు, రాలన్ = రాలునట్లు, మొత్తన్ = కొట్టగా, అది = కాలమృత్యువు, మహత్ (మహా) - హ్రీ - భరమునన్ = మిక్కలి సిగ్గు వెరపున ఇల్లు - వెడలక = ఇంటిలోనుండి బయటికి రాక, ముండమోపి + పోలెన్ = ముండమోసిన దానివలె - విదవవలె, మూలన్ + పడి + ఉన్న + అది = మూలబడియున్నది

---

1 తా ముకుబండ్లు

తాత్పర్యము: అభవా ఖట్వాంగమును దరించిన నీ సేవకుడు కాలమృత్యువు మునిపండ్లను రాలగొట్టగా నది సిగ్గుపెంపున నింటిలో నుండి వెలికి రాక ముండమోసిన దానివలె మూలబడి యున్నది

విశేషములు: మునిపండ్లు - మును శబ్దమునకు వృత్తియం దుత్తరపదము పరమగునపుడు వికల్పముగా `ముని అగును పల్లు + లు `ఔప విభక్తికంబుల లివర్ణ సలలు వర్ణంబులకు బహువచనంబు పరంబగునపుడు పూర్ణబిందుపూర్వక డువర్ణంబు బహుళంబుగానగు బాల అచ్ఛిక 16 పండు + లు - `బహువచనంబు పరంబగునపుడు డలటరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగానగు బాల అచ్ఛిక. 12 - పండ్లు ముండమోపి - మోపి యన్నను విధవ యను నర్థముగలదు శ. ర, చి. ని., బ్రౌ ఇల్లు వెడలక - ఇంటిని వెడలక ఇంటి వలన నుండి వెడలక - ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగనగు. బాల కారక. 11 ఇంటి నుండి వెడలక - `వలనకాదేశంబును ద్వితీయా సప్తముల మీది యుండికి లోపంబు బహుళంబుగానగు ఇంటిని వెడలక ప్రౌఢ కారక 11 `జడంబు ద్వితీయకుం బ్రదమ బహుళంబుగానగు బాల కారక 24 ఇల్లు వెడలక. హరిగతి రగడ.

[1]అయయో మొఱ్ఱో యబ్రహ్మ(ణ్యం)
[2]బనుచును నాక్రోశించుచు (ను మహా)
భయ విహ్వాలులై యేతెంచిరి మ
త్పార్శ్వమ్ములకు మదీయ కింకరులు
[3]జయనాద హలా సమధిక లీలా
సంరంభంబున దేవర ప్రమథులు
పయికొని వచ్చిరి పులికళవసములఁ
[4]బ్రహరించుచు వీఁపుల వెంటాడఁగ. 28

అర్థము: మదీయ - కింకరులు = నా బటులు, అయయో = అయ్యయ్యో మొఱ్ఱో, అబ్రహ్మణ్యంబు = చంపవలదని, అనుచును, ఆక్రోశించుచును = ఏడ్చుచు, మహత్ (మహా) + భయ - విహ్వాలులు + ఐ = గొప్పవెఱపు వలన గలగినవారయి, మత్ + పార్శ్వమ్ములకున్ = నా ప్రక్కలకు, ఏతెంచిరి = వచ్చిరి. దేవర - ప్రమథులు = తమ ప్రమథులు, పులి - కళవసములన్ = పులితోలులతో, వీపులన్, ప్రహరించుచున్ = కొట్టుచు, వెంట + అడంగన్ = వెన్నాడగా, జయనాద - హలా = జయధ్వనులతోడి `హలా అను సంబోధనములతో, సమధిక = మిక్కిలియైన, లీలా-సంరంభంబునన్ = విలాస సంభ్రమముతో, పయికొని-వచ్చిరి =మీదికి వచ్చిరి

1 తా అయిదో మొరయో 2 తా బని యాక్రోశించుచు 3 జయవాది 4 తా వీఁపులు ప్రహరించుచు వెంటాడింపంగను

తాత్పర్యము: నా భటులు అయ్యో మోఱ్ఱో చంపవలదని యేడ్చుచు గొప్ప వెఱపువలన కలగిన వారయి నా ప్రక్కల కేతెంచిరి. తమ భటులు పులితోలులతో గొట్టుచు మా వారిని వెన్నాడుచు జయజయ ధ్వనులతో నొండొరులను పిలుచుకొనుచు మిక్కిలి సంభ్రమముతో మీదికి వచ్చిరి.

విశేషములు: హరగతి రగడ - నవవిధ రగడలలో నొకటి. ప్రతిపాదమునను నల, స, భ, గగ అను గణములలో నేవైనను నెనిమిది గణములుండవలయును. మొదటి యక్షరమునకును, నాల్గవ గణము మొదటి యక్షరమునకును, యతిమైత్రి, ప్రాస నియమము గలదు. ఇందలి రెండవ పాదమున గణభంగమయినది. పాఠాంతర మేదయిన నున్నదేమో పరిష్కర్తలు చూపలేదు.

భయవి, హ్వలులై, యేతెం,చిరి మ,

త్పార్శ్వ.మ్ములకు ను, మత్కం, కరులును

అని యున్నచో సరిపడును

మ అవుఁగాకేమి జగజ్జనిస్థితిలయ వ్యాపారపారంగతుం
డవు నీ లెంకలచేత శిక్షఁబడు టెగ్గా మద్భటశ్రేణి కీ
యవినీతాత్మునకై పిశాచమునకై యాభాసదుర్బ్రాహ్మణ
బ్రువ చండాలునకై [1]పెనంబడుటకై భూతేశ! సిగ్గయ్యెడిన్. 29

అర్థము: భూత + ఈశ = ఈశ్వరా! అవున్ + కాక + ఏమి = అది యట్లుగాక మఱేమి? (నీవు), జగత్... గతుండవు: జగత్ = జగత్తుయొక్క, జని = పుట్టుక - సృష్టి, స్థితి = ఉనికి, లయ = నాశము, అను, వ్యాపార = కార్యములందు, పారంగతుండవు = ఆవలి తీరమును పొందిన వాడవు - మిక్కిలి సమర్థుడవు. అందులో సందేహము లేదనుట, మత్ + భట - శ్రేణికిన్ = నా బంటుల యొక్క సమూహమునకు, నీ - లెంకలచేతన్ = నీ భటులచేత, శిక్షన్ + పడుట + ఎగ్గా? = శిక్షను పొందుట తప్పా - తప్పుగాదనుట, (కాని) ఈ + అవినీత + ఆత్మునకున్ + ఐ = ఈ నీతి మాలిన వాడను, పిశాచమునకున్ + ఐ = దయ్యమును, (అగు), ఆ భాస - దుస్ + బ్రాహ్మణ - బ్రువ - చండాలునకున్ + ఐ = పైకి బ్రాహ్మణుని వలెగనుపట్టు నీచబ్రాహ్మణుడైన మాలవానికి, పెనంబడుటకై = బంధమున పడుటకు, సిగ్గు + అయ్యెడిన్.

తాత్పర్యము: ప్రమథాధిపా! నీవు జగత్సృష్టి స్థితిలయములనెడి కార్యములందు పారీణుడవే. అది యట్లుగాక మఱేమి! నాభటులు నీభటులచే శిక్షింపబడుటలో తప్పులేదు కాని నీతిమాలినవాడును, దయ్యేమును, పైకి బ్రాహ్మణుని వలె

[1] తా పెనుంబడుటకై

గనుపట్టు నీచబ్రాహ్మణ రూపుడైన మాలడును అగు సుకుమారుడు కారణముగా మావారు బంధింపబడుటకు నాకు సిగ్గగుచున్నది

విశేషములు: తన లెంకలు శివుని కింకరులచే నొచ్చుటకు యముడు బాధపడుటలేదు కాని మగడు కొట్టినందులకు గాక తోడికోడలు దెప్పినందులకు బాధపడునిల్లాలి వలె యముడు నీచబ్రాహ్మణుడైన సుకుమారుని మూలమున తనవారు తన్నులు తినవలసివచ్చినందులకు బాదపడుచున్నాడు. బ్రాహ్మణబ్రువ - బ్రాహ్మణుడనని చెప్పుకొనువాడు - బ్రువ - దీనికి వృత్తియందు నిందావాచకత్వముండును. ఉత్తరపదముగ ప్రయోగింపబడును - నీచ బ్రాహ్మణుడని యర్థము జగజ్జని = జగత్ + జని - సకార తవర్గములకు శవర్ణ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునప్పుడు క్రమముగా శవర్ణ చవర్గ వర్ణములాదేశమగును పెనంబడు - పెనన్ + పడు - పెన (= బంధము) యందుబడు - బందింపబడు

సీ ముట్టైన చండాలి [1]ముట్టెనో ముట్టడో
యడుగంగరాదె యీ యదమజాతి
నన్యకామినుల ఱంకాడెనో యాడడో
యడుగంగ రాదె యీ యధమజాతిఁ
ద్రావెనో త్రావడో [2]తాళ్ళ హాలారసం
బడుగంగరాదె యీ యదమజాతి
గారాపుఁ గన్నియఁ గవిసెనో కవియఁడో
యడుగంగరాదె యీ యధమజాతి

గీ రాజరేఖా విభూషణా రాజసంపు (ఁ)
[3]తప్పుదండువు లేకుంట తద్యమయ్యె
నిట్టి పాపాత్ము సర్వలోకేశ్వరుండు
[4]వెనుక నిడుకొన్న మాకు నేమనఁగ వచ్చు 30

అర్థము: రాజ - రేఖా - విభూషణా = చంద్రకళాలంకారుడా? శివా ముట్టు + ఐన = రజస్వలయైన, చండాలిన్ = మాలెతను, ముట్టెనో - ముట్టడో = తాకెనో లేదో - కూడెనోలేదో ఈ అధమ - జాతిన్ = ఈ దుర్మార్గుని, అడుగంగన్ - రాదె అన్య - కామినులన్ = పరస్త్రీలతో, ఱంకు + ఆడెనో - ఆడడో = వ్యబిచరించెనో లేదో, ఈ + అధమ జాతిన్, అడుగంగన్ + రాదె తాళ్ళ - హాలా - రసంబు = తాటికల్లు, త్రావెనో - త్రావడో, ఈ + అధమజాతిన్ అడుగంగన్ + రాదె. గారాపు

1 తా ముట్టునో 2 తా త్రాళ్ళ 3 తా తప్పు తండువు 4 తా వెనకకు

గన్నియన్ (గారాము + కన్నియన్) = అనుగుగూతును కవిసెనో - కవియడో = కూడెనోలేదో, ఈ + అధమ జాతిన్ అడుగంగన్ + రాదె రాజసంపు తప్పుదండువు = రాజసము + తప్పు - దండువు = రాజాపరాదమునకు శిక్ష, లేక + ఉంట = లేకుండుట, తథ్యము + అయ్యెన్ = సత్యమయ్యెను, ఇట్టి, పాప + ఆత్మున్ = పాపస్వబావుని సర్వ - లోక + ఈశ్వరుండు = సకల జగత్పతి, వెనుకన్ + ఇడుకొన్నన్ = వెనుకవేసికొన్నచో (రక్షించుచో), మాకున్, ఏమి + అనగన్ + కలదు

తాత్పర్యము: చంద్రమౌళీ ముట్టుత యగు చండాలిని ముట్టెనోలేదో, పరస్త్రీలతో వ్యభిచరించెనో లేదో కన్నకూతుతోనే రమించెనో లేదో యీ దుర్మార్గునే అడుగ రాదా? ఇతనికి రాజదండము పడకుండుట సత్యము ఇట్టి పాపిని సకల జగత్పతి వెనుకవేసికొని వచ్చుచో, నిక మే మేమనగలము?

గీ ప్రమథు లవనిసురుని మేన బందమూడ్చి
వరుణ పాశంబు లెచ్చోట వైచినారొ
యరసి తెప్పింపు వానిఁ జంద్రావతంస
నాకు నెరవిచ్చినాఁ డంబునాయకుండు 31

అర్థము: చంద్ర + అవతంస = చంద్రుడు శిరోభూషణముగా గలవాడా. శివా ప్రమథులు, అవని - సురుని - మేనన్ = బ్రాహ్మణుని యొక్క శరీరమున, బంధము = కట్టు ఊడ్చి = తీసివైచి, వరుణ - పాశంబులు = వరుణదేవుని ఆయుధములైన పాశములు (త్రాళ్ళు), ఏ + చోటన్ = ఎచ్చోట, వైచినారో, అరసి - వెదకి, వానిన్ = ఆ పాశములను, తెప్పింపు(ము), అంబు - నాయకుండు = జలాధిపతి, నాకున్, ఎరవు + ఇచ్చినాడు.

తాత్పర్యము: చంద్రశేఖరా మీ ప్రమదులు బ్రాహ్మణుని మేని యందలి బంధములను తీసివైచి యా వరుణ పాశముల నెచ్చట పడవైచిరో. వెదకి వానిని తెప్పింపుము నాకు వానిని వరుణు డెరవిచ్చినాడు

విశేషములు: తెప్పింపు - తెప్పింపుము. `మధ్యమ పురుష ముపర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విబాషనగు బాల సంధి. 47

సీ జలధరంబులనుండి స్రవియించు జలధార
లెన్నవచ్చిననేని యెన్నవచ్చు
గగనమండలిఁ దారకా చక్రవాళంబు
లెన్నవచ్చిన నేని యెన్నవచ్చుఁ,

బాగీరదీ మహాపగలోని సికతంబు
లెన్నవచ్చిన నేని యెన్నవచ్చుఁ
గలశపాథోరాశి కల్లోల మాలిక
లెన్న వచ్చిన నేని యెన్నవచ్చుఁ

గీ గాని నరునకు నెన్న శక్యంబు గావు
పాయ కీతండు చేసిన పాతకములు
బర్గ యేమని విన్నవింపంగ నేర్తు?
నిట్టి పాపాత్ముఁ బొడఁగాన [1]మెన్నఁ డేని 32

అర్థము: బర్గ = శివా

జలధరంబుల నుండి = మేఘముల వలన నుండి స్రవియించు = కాఱునట్టి, జలధారలు = నీటిధారలు ఎన్నన్ + వచ్చినన్ + ఎని = లెక్కపెట్టవలసినచో, ఎన్నన్ + వచ్చున్ = లెక్కింపవచ్చును గగన - మండలిన్ = ఆకాశప్రదేశమున, తారకా - చక్రవాళంబులు = నక్షత్రముల యొక్క స మూహములను, ఎన్నవచ్చిననేని యెన్నవచ్చున్ బాగీరథీ - మహత్ (మహా) + ఆపగ - లోని = గంగయను గొప్పనది యందలి, సికతంబులు = ఇసుకలను, ఎన్నవచ్చిననేని యెన్నవచ్చున్. కలశ - పాదస్ + రాశి = పాలసంద్రము యొక్క కల్లోల - మాలికలు = అలల వరుసలు, ఎన్నవచ్చిననేని యెన్నవచ్చున్ కాని, పాయక = విడువక, ఈతండు = ఈ సుకుమారుడు, చేసిన పాతకములు = పాపములు, నరునకున్ = మనుష్యునకు, ఎన్నన్ = లెక్కించుటకు, శక్యంబు + కావు = తరముగాదు, ఏమి + అని, విన్నవింపంగన్ + నేర్తున్ = విన్నవింపగలను? ఇట్టి, పాప + ఆత్మున్ ఎన్నడు + ఏని = ఎప్పుడైనను, పొడగానము = చూడము.

తాత్పర్యము: శివా మేఘములనుండి కాఱు నీటి ధారలను ఆకాశమునందలి నక్షత్రసముదాయమును, గంగా మహానది లోని యిసుక రేణువులను, క్షీరసముద్రపుటలల వరుసలను లెక్కింప వలయునన్న లెక్కింపవచ్చును కాని యీ సుకుమారుడు విడువక చేసిన పాపములను లెక్కింప నరునకు శక్యము గాదు. ఇక నేనేమని విన్నవింపగలను ఇట్టి పాపునెన్నడును చూడము

గీ ఎన్ని శాస్త్రంబు లీక్షించియేని నేరఁ
డెట్టి విద్వాంసుఁడైన నర్ధేందు మౌళి
యితఁడు చేసిన పాతకం బింతటిదియ
[2]యనఁగ దానికి నిష్కృతి యాచరింప 33

అర్థము: అర్ధ + ఇందు - మౌళి = సగము చంద్రుడు (చంద్రకళ) శిరస్సున గిలవాడా శివా. ఎట్టి, విద్వాంసుఁడు + ఐనన్ = ఎంతటి పండితుడైనను, ఎన్ని - శాస్త్రంబులు ఈక్షించి + ఏని = చూచియైనను, ఇతఁడు = ఈ సుకుమారుడు, చేసిన, పాతకంబు = పాపము, ఇంతటి + అది + అ = ఇంతటిదే, అనగన్ = అనుటకును, దానికిన్ = ఆ పాపమునకు, నిష్కృతి = ప్రాయశ్చిత్రము, ఆచరింపన్ = చేయుటకును నేరడు = ఎఱుఁగడు

తాత్పర్యము: చంద్రార్ధశేఖరా ఎంతటి పండితుడైనను, ఎన్ని శాస్త్రగ్రంథములను చూచియైనను, ఈ సుకుమారుడు చేసిన పాపమింతేయనగను, దానికి ప్రాయశ్చిత్రము చేయుటకును ఎఱుగడు

విశేషములు: ఇంత + అది = ఇంత + టి + అది `అదియవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగానగు బాల. సంధి. 45 ఇంతటిది

గీ [1]అపరతంత్రుడవని చెప్ప నాగమములు
నిగమములు నీక చెప్పుదు నీలకంఠ
యీ దురాత్ముని కతన నీ కెఱుకపడితి
[2]నపరతంత్రుండ వైతి మా కందఱకును. 34

అర్థము: నీల - కంఠ = నల్లని కంఠముగలవాడా. శివా అగమములున్ = శాస్త్రములును, నిగమములున్ = వేదములును, అపరతంత్రుండవు + అని - చెప్పన్ = పరాధీనుడవు కావు - స్వతంత్రుడవు అని చెప్పగా, నీకున్ + అ = నీకే, చెప్పుదున్, ఈ - దురాత్ముని - కతనన్ = ఈ దుర్మార్గుని కారణమున నీకున్ ఎఱుకపడితిన్, మాకున్ + అందఱకును, అపరతంత్రుండవు + ఐతి (వి) = స్వతంత్రుండవైతివి

తాత్పర్యము· నీలకంఠా శాస్త్రములును, వేదములును స్వతంత్రుడవని చెప్పు నీకే చెప్పుదును. ఈ దుర్మార్గుడు కారణముగా నీకెఱుకపడితిని. నీవు మా కందఱకును స్వతంత్రుడవైతివి

విశేషములు: ఐతి = ఐతివి `లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాషనగు బాల క్రియ 24

వ. అని దండప్రణామంబు చేసి కరకమలంబులు మొగిడ్చి నిలిచి యున్నం గనుంగొని మందస్మిత సుందరవదనారవిందుండై యిందుదరుండిట్లనియె 35

1 తా అవిర 2 తా వపర

అర్థము: అని, (యముడు), దండ - ప్రణామంబు = సాష్టాంగనమస్కారము చేసి, నిలిచి + ఉన్నన్, ఇందు - ధరుండు = చంద్రమౌళి, కనుంగొని, మంద - స్మిత - సుందర - వదన + అరవిందుండు = చిఱునవ్వుచే నందమైన ముఖపద్మముగలవాడు, ఐ, ఇట్లు + అనియెన్

తాత్పర్యము: అని యముడు సాష్టాంగ నమస్కారము చేసి కేలుదామరలు మొగిడ్చి నిలిచియుండ, శివుడు చూచి చిఱునవ్వుచే నందమయిన ముఖపద్మము గలవాడయి యతనితో నిట్లు పలికెను.

సీ. మకరరాశిస్థుఁడై మార్తాండుఁ డుండంగ
సమకొన్న మాఘమాసంబునందు,
సిత చతుర్దశి నిశి శివరాత్రి యనుపేరఁ
బ్రఖ్యాతి గనిన యా రాత్రియందు,
[1]నట్టి నాల్జాలును నవధానపరత [2]మై
జాగరవ్రతచర్య జరుపవలయు,
నా జాగరవ్రతం బనఘప్రాజాపత్య
సత్ఫలం బీనోపు సాధకునకు,

గీ. నవనిసురుఁడాది చండాలుఁ డాది గాఁగ
నీ వ్రతము సేయఁగా నర్హు లెల్లవారు
నన్ని చందాల నీ వ్రతం బలము ఘోర
పాతకంబుల నెల్లఁ గాల్పంగఁ జాలు. 36.

అర్థము: మార్తాండుఁడు = సూర్యుడు, మకర - రాశి - స్థుడు + ఐ = మకర రాశియందున్న వాడయి, ఉండంగన్, సమకొన్న = కలిగిన, మాఘ - మాసంబునందున్, సిత - చతుర్దశి - నిశన్ = శుక్ల పక్షచతుర్దశి నాటి రాత్రి, శివరాత్రి, అను - పేరన్, ప్రఖ్యాతి + కనిన = ప్రసిద్ధి పొందిన, ఆ - రాత్రియందున్, అట్టి, నాల్ + జాలును = నాలుగు జాములును, అవధాన - పరతమైన్ = ఏకాగ్రతతో, జాగర - వ్రత - చర్య = మెలకువగా నుండు వ్రతము అనెడి కర్మము, జరుపన్ + వలయున్, అనఘ = పాపరహితుడా!, ఆ - జాగర - వ్రతంబు, సాధకునకున్ = వ్రతము చేయువానికి, ప్రాజాపత్య - సత్ + ఫలంబు = ప్రజాపతిత్వమనెడి ఉత్తమ ఫలము, ఈన్ + ఓపున్ = ఇచ్చుటకు సమర్థమగును. అవని - సురుడు + ఆది = బ్రాహ్మణుడు మొదలుకొని, చండాలుడు + ఆది - కాగన్ = మాలవాడు మొదలుగా, ఎల్ల - వారున్ = అందఱును, ఈ - వ్రతము,

1. తా. నాఁటి 2. తా.యి.

చేయగాన్, అర్హులు = తగినవారు, అన్ని - చందాలన్ = అన్ని విధములను, ఈ - వ్రతంబు, అలఘు - ఘోర - పాతకంబులన్ = మిక్కిలి భయంకరములైన పాపములను, ఎల్లన్ = అన్నిటిని, కాల్పంగన్ + చాలున్ = దహింపగలుగును.

తాత్పర్యము: సూర్యుడు మకరరాశి యందున్నప్పుడు వచ్చు మాఘమాస శుక్లపక్ష చతుర్దశి రాత్రి శివరాత్రి యన ప్రసిద్ధిపొందెను. ఆ రాత్రి నాలుగు జాములును ఏకాగ్రబుద్ధితో జాగర వ్రతమును చేయవలయును. ఆ జాగర వ్రతము సాధకునకు ప్రాజాపత్య సత్ఫలము నొసగగలదు. బ్రాహ్మణుడుగాని, చండాలుడుగాని యెవ్వరయినను ఈ వ్రతము చేయనర్హులు. అన్ని విధముల నీవ్రతము భయంకరములైన పాపములను దహింపజాలును.

విశేషములు: నాల్జాలు - నాలుగు + జాలు - `నాలుగు శబ్దమునకు వృత్తియందు నాలు, నాల్, నల్ అను రూపము లగును జాలు - జాము + లు. `బహువచనంబు పరంబగునపుడావు ప్రభృతుల తుది యక్షరంబునకు లోపంబు విభాషనగు. శివరాత్రి మాఘబహుళ చతుర్దశి కాగా, నిందు `సిత చతుర్దశి = శుక్ల చతుర్దశి యని యున్నది. 39 వ పద్యమున `మాఘ కృష్ణ చతుర్దశి యనియే యున్నది.

శా. జ్ఞానాజ్ఞాన కృతంబు లయ్యుఁబశుహింసా బ్రహ్మహత్యాసురా
పానస్తేయము లాదిగాఁ గలుగు పాపంబుల్ దహించు న్నిమే
షానన్ శంభు నిశావ్రతంబు ప్రబల జ్వాలా వృతం బగ్ని [1]యె
ట్లేనింగాలుచు నార్ద్రశుష్కముల నొక్కంతిధ్మభారంబులన్. 37

అర్థము: శంభు - నిశా - వ్రతంబు = శివరాత్రి యను వ్రతము, ప్రబల - జ్వాలా - వృతంబు + అగ్ని = మిక్కిలి తీక్షమైన జ్వాలలతో గూడినదగు నగ్ని, ఆర్ద్ర - శుష్కములన్ = తడిసినవి ఎండినవి యగు, ఒక్క + ఇంత + ఇధ్మ - భారంబులన్ = కొంచెపాటి కట్టెల బరువులను, ఎట్లు + ఏనిన్ = ఏవిధముగా, కాలుచున్ = దహించునో, (అట్లే) జ్ఞాన + అజ్ఞాన - కృతంబులు + అయ్యున్ = తెలిసి చేసినవైనను, తెలియక చేసినవైనను, పశు - హింసా - బ్రహ్మహత్యా - సురా - పాన - స్తేయములు = ప్రాణి హింస, బ్రాహ్మణ హత్య, కల్లు త్రాగుట, దొంగతనము అనునవి, ఆదిగాన్ = మొదలుగా, కలుగు, పాపంబుల్ = పాపములు, నిమేషానన్ = నిమిషకాలములో, దహించున్ = కాల్చును.

తాత్పర్యము: మిక్కిలి తీక్షములైన జ్వాలలతో గూడిన యగ్ని తడిసిన వయినను, ఎండినవయినను కొంచెపాటి కట్టెల బరువులను ఎట్లు కాల్చునో, అట్లే శివరాత్రి వ్రతము తెలిసి చేసిన వైనను, తెలియక చేసినవైనను ప్రాణి హింస, బ్రహ్మహత్య,

1 శా య.

మద్యపానము, దొంగతనము మున్నగు పాపములను నిమిషకాలములో దహించును

విశేషములు: ఉపమాలంకారము నిమేషానన్ - నిమేషము + నన్ `లు ల న లు పరంబులగునపుడొకానొకచో ముగాగమంబునకు లోపంబును దత్పూర్వస్వరంబునకు దీర్ఘంబును విభాషనగు. బాల. తత్సమ. 43

వ. ఈ సుకుమారుండు. 38

తాత్పర్యము: ఈ సుకుమారుడు - తరువాతి పద్యముతో నన్వయము

గీ మకరరాశిస్థుఁడై (యంశుమాలి) యుండ
మాఘ (కృష్ణ) చతుర్దశి (మధ్య) రాత్రి
నన్నుఁ (బూజింప) [1]వీక్షించినాఁడు జను (లు)
(నట్టి)(కతమునఁ) (బుణ్యాత్ముఁ)డయ్యెనితఁడు. 39

అర్థము: అంశుమాలి = సూర్యుడు, మకర - రాశి - స్థుడు + ఐ = మకరరాశియందున్నవాడయి, ఉండన్, మాఘ - కృష్ణ - చతుర్దశి - మధ్య - రాత్రిన్ = మాఘమాస బహుళపక్ష చతుర్దశినాటి యర్ధరాత్రమునందు - శివరాత్రినాడు, జనులు, నన్నున్, పూజింపన్ = పూజింపగా, వీక్షించినాడు = చూచినాడు అట్టి - కతమునన్ = ఆ కారణముచెత, ఇతఁడు, పుణ్య + ఆత్ముఁడు = పుణ్యము చేసినవాడు, అయ్యెన్,

తాత్పర్యము : సూర్యుడు మకర రాశి యందుండగా మాఘమాస బహుళపక్ష చతుర్దశి యైన శివరాత్రి నాడు జనులు నన్ను పూజింప నీ సుకుమారుడు చూచెను. ఆ కారణముచేత నితడు పుణ్యాత్ముడయినాడు

విశేషములు : ఇందు మూడవపాదమున `జనులు అని ప్రథమగాక, `జనుల అని ద్వితీయ యున్నచో నన్వయము బాగుగా నుండెడిది అప్పుడు `జనులన్ ఇతడు పుణ్యాత్ముడయ్యె నని యన్వయింపవచ్చును. అజడంబు సప్తమికి ద్వితీయ వచ్చినట్లగును. ప్రౌఢ కారక 18.

వ. అదియును. తరువాతి పద్యముతో నన్వయము 40

గీ. కూఁతుఁ జండాలి నాలిఁగాఁగోరి రాత్రి
పుష్పములు గోయ నేతెంచి పువ్వుఁదోఁట
పార్శ్వమున నుండఁగాంచె నా భక్తజనులు
నన్నుఁ బూజించి జాగరణం(బు) సేయ. 41

[1] తా వీక్షించునాడు

అర్థము: నా - భక్త - జనులు = నాభక్తులైన జనులు, నన్నున్, పూజించి, జాగరణంబు + చేయన్ = మేలుకొని యుండుట అను వ్రతమును చేయగా, కూతున్ + చండాలిన్ = కూతురైన మాలెతను, ఆలిన్ + కాన్ = భార్యనుగా, కోరి, రాత్రి, పుష్పములు + కోయన్ = పూలు కోయుటకు, ఏతెంచి = వచ్చి, పువ్వు + తోట-పార్శ్వమునన్ = పుష్పోద్యానము ప్రక్కను,ఉండన్ = ఉండగా, కాంచెన్ =చూచెను

తాత్పర్యము: నా భక్తులైన జనులు శివరాత్రి నాడు నన్ను పూజించి జాగరము చేయగా నీ సుకుమారుడు తన కూతురైన మాలెతను భార్యనుగా గోరి రాత్రి పూలుకోయ వచ్చి పూదోట ప్రక్కనుండి చూచెను

విశేషములు: పువ్వుదోట- పూవు + తోట. ఉదంత స్త్రీ సమమునకు పరుషము పరముగా నుగాగమము, పిమ్మట ద్రుత కార్యము బాల. సంధి 25, 16 17.

సీ. తీర్థ మాడింపంగ దివ్యాంబరము గట్టి
చందనంబలఁదఁ బుష్పములు పూన్ప
ధూపంబు లర్పింప దీపంబు ముట్టింప
ఘంట వాయింప శంఖంబులూఁద
నైవేద్య మొసఁగంగ నాగవల్లీ పూగ
మునఁ గప్పురంబు తాంబూల మిడఁగ
నద్దంబు సూపంగ నాలవట్టము ద్రిప్ప
సురటి వట్టంగఁ జామరము వీవ

గీ బహువిధస్తుతులు పఠియింపంగ వినియుఁ
గోయతనమునఁ బువ్వులు గోయ వచ్చి
చూచి శివయామినీ వ్రతస్థులను నన్నుఁ
దత్ఫలంబున గణపతిత్వంబు నొందె 42.

అర్థము: తీర్థము + ఆడింపంగన్ = స్నానము చేయింపగను, దివ్య + అంబరము + కట్టి = దివ్యమైన వస్త్రమును గట్టి, చందనంబు = మంచి గంధము, అలఁదన్ = పూయగను, పుష్పములు, పూన్పన్ = వహింపజేయగను, ధూపంబులు, అర్పింపన్, దీపంబు, ముట్టింపన్, ఘంట = గంట, వాయింపన్ = మ్రోయింపగను, శంఖంబులు, ఊదన్, నైవేద్యము + ఒసఁగంగన్, నాగవల్లీ - పూగమునన్ = తమలపాకులతోడి వక్కతో, కప్పురంబు తాంబూలము = కర్పూరపుతాంబూలము, ఇడఁగన్, అద్దంబు + చూపంగన్, ఆలవట్టము = ఎండతగలకుండ పట్టెడుసాధనము - గుడ్డవీవన, త్రిప్పన్, సురటి = వీవన, పట్టంగన్, చామరము - వీవన్ = వింజామరము వీవగను, బహు - విధ - స్తుతులు = పెక్కురీతులయిన స్తోత్రములు,

పఠియింపంగన్ = చదువగను, వినియున్, కోయతనమునన్ = బోయతనమున, పువ్వులు, కోయన్ + వచ్చి, శివ - యామినీ - వ్రత - స్థలను = శివరాత్రి వ్రతము నందున్న వారిని, నన్నున్, చూచి, తద్ + ఫలంబునన్ = దాని ఫలితముగా, గణపతిత్వంబున్ = ప్రమథగణ నాయకత్వమును ఒందెన్ = పొందెను.

తాత్పర్యము. స్నానము చేయించి, దివ్య వస్త్రమును గట్టి, మంచిగంధము పూయను, పూలతో పూజింపను, ధూపములు వేయగను, దీపము పెట్టగను, గంట మ్రోయింపను, శంఖము లూదను, నైవేద్యము పెట్టగను తమలపాకులు, వక్కలతో, కప్పురపు తాంబూల మొసగగను, అద్దము చూపగను ఆలవట్టము త్రిప్పగను, వింజామరము వీవను, పలు రీతులయిన స్తోత్రములు పఠింపను, బోయతనమున పూలుగోయవచ్చిన సుకుమారుడు శివరాత్రివ్రత మాచరించు వారిని, నన్నును చూచి, తత్ఫలితముగా ప్రమథాధిపత్యము నొందెను.

విశేషములు: ఆలవట్టము - ఆలావర్తము (సంస్కృతము) - `వ్యజనము, విసనకఱ్ఱ సురటి వీవన యంచన నవి యెండమఱుఁగిడ నాల వట్టమన విరాజిల్లును' ఆం.భా 2-168. ఇందు శివరాత్రివ్రతాచరణ విధాన మంతయు చెప్పబడినది.

వ. వేదసారంబున శివునిఁ బూజింపుచు శివరాత్రి వ్రతంబు చేసి బ్రహ్మ బ్రహ్మత్వంబు నొందె. విద్యాసారంబున శివునిఁ బూజింపుచు శివరాత్రి వ్రతంబు చేసి వసురుద్రాదిత్యులు దేవత్వంబు గైకొనిరి. రాజసూయ సహస్రంబును నశ్వమేధాయుతంబును గపిల ధేనుకోటి దానంబును బుణ్యక్షేత్ర నివాసంబును తీర్థావ గాహంబును నొనర్చిన ఫలంబు కోటి గుణితంబై సుకుమారునకు సిద్ధించె నితండు సర్వతపస్వులకును నిఖిల పుణ్యవంతులకును సకలభాగ్యాధికుండు వణిక్పథంబున గల్పాంత పర్యంతం బనేక భోగం (బుల) నుభవించి కాలాంతరంబున దధీచుండనం (బరంగు) మహేశ్వ (రుండై) భూమి యందు జన్మింపంగలండు ఇట్టిది శివ (రాత్రి) పుణ్య వ్రతమాహాత్మ్యంబు. 43.

అర్థము: బ్రహ్మ, వేద - సారంబునన్, శివునిన్, పూజింపుచున్ (పూజించుచున్), శివరాత్రి - వ్రతంబు, చేసి, బ్రహ్మత్వంబున్, ఒందెన్, వసు - రుద్ర + ఆదిత్యులు = వసువులు, రుద్రులు, ఆదిత్యులు, విద్యా - సారంబునన్, శివునిన్ పూజింపుచున్, శివరాత్రి - వ్రతంబు, చేసి, దేవత్వంబు, కైకొనిరి, రాజసూయ - సహస్రంబును = వేయి రాజసూయ యాగములును, అశ్వమేధ + అయుతంబును = పదివేల అశ్వమేధయాగములును, కపిల - ధేను - కోటి - దానంబును = కోటి కపిల గోవుల దానమును, పుణ్య - క్షేత్ర - నివాసంబును, తీర్థ + అవగాహంబును = తీర్థము నందు మునుగుటయు ఒనర్చిన - ఫలంబు = చేసిన ఫలితము కోటి - గుణితంబు + ఐ = కోటిరెట్లయి, సుకుమారునకున్, సిద్ధించెన్ = లభించెను ఇతండు, సర్వ -

తపస్వులకును = ఎల్ల మునులకును, నిఖిల - పుణ్యవంతులకును = ఎల్ల పుణ్యాత్ములకును, సకల - భాగ్య + అధికుండు = ఎల్ల అదృష్టముల చేతను, ఎక్కువైనవాడు, వణిక్పథంబునన్, కల్ప + అంత - పర్యంతంబు = ప్రళయము వకును, అనేక - భోగంబులు = పెక్కుసుఖములు, అనుభవించి కాల + అంతరంబునన్ = మఱియొక కాలమున దధీచుండు + అనన్ + పరంగు = దధీచుడన నొప్పు, మహేశ్వరుండు + ఐ, భూమియందున్, జన్మింపన్ + కలడు = పుట్టగలడు, శివరాత్రి - పుణ్య - వ్రత - మాహాత్మ్యంబు = శివరాత్రి యను పుణ్య వ్రతము యొక్క మహిమ, ఇట్టి + అది = ఇట్టిది

తాత్పర్యము: బ్రహ్మ వేదసారముచే శివుని పూజించుచు శివరాత్రి వ్రతము చేసి బ్రహ్మత్వమును పొందెను వసువులు, రుద్రులు, ఆదిత్యులు విద్యాసారముచే శివుని పూజించుచు శివరాత్రి వ్రతము చేసి దేవత్వమును పొందిరి. వేయి రాజసూయములును, పదివేల యశ్వమేధములును, కోటి కపిలధేనువుల దానమును, పుణ్యక్షేత్ర నివాసమును తీర్థ స్నానమును చేసిన ఫలము కోటి రెట్లయి సుకుమారునకు సిద్ధించెను. ఇతడు సకల బాగ్యములచేతను సర్వమునులకును, పుణ్యాత్ములకును అధికుడు వణిక్పథపురమున కల్పాంతము వఱకు పెక్కు భోగములనుభవించి తరువాతి కాలమున దధీచుడనబరగు మహేశ్వరుడై భూమియందు పుట్టగలడు. శివరాత్రి పుణ్యవ్రత మాహాత్మ్యమిట్టిది.

గీ. అనిన విని యంతకుఁడు పురాంతకునకు
భక్తిఁ బ్రణమిల్లి పరమతాత్పర్య మొప్ప
దేవదేవునిచే నుపదేశ మంది
యభవు రాత్రి యముండు సేయంగఁబూని. 44.

అర్థము: అనినన్ = శివుడు పలుకగా, అంతకుండు = యముడు, విని, పుర + అంతునకున్ = పురనాశకునకు (శివునకు) భక్తిన్ = భక్తితో, ప్రణమిల్లి = నమస్కరించి, పరమ - తాత్పర్యము = గొప్ప ఆసక్తి, ఒప్పన్, దేవ - దేవునిచేన్ = దేవతలకు దేవుడైన శివుని వలన, ఉపదేశము + అంది, యముండు, అభవు - రాత్రి = శివరాత్రి, చేయంగన్ + పూని = చేయబూని.

తాత్పర్యము: శివుని మాటలను విని యముడు అతనికి భక్తితో నమస్కరించి మిక్కిలి శ్రద్ధతో శివుని వలన నుపదేశమొంది, శివరాత్రి వ్రతమును చేయబూని - తరువాతి పద్యముతో నన్వయము

వ. పుణ్య శివరాత్రి వ్రతంబు చేయబూని యభవుతో 'దేవా! నీ భక్తులు మాననీయులు వారి లక్షణంబులు నాకుం దెలియ వలయు నానతి మ్మనుటయుం బ్రసన్నహృదయుండై పరమేశ్వరుండు 45

అర్థము: (యముడు) పుణ్య - శివరాత్రి - వ్రతంబు చేయన్ + పూని, అభవుతోన్ = శివునితో, దేవా నీ - భక్తులు మాననీయులు = మాన్యులు వారి - లక్షణంబులు, నాకున్, తెలియవలయును, ఆనతి + ఇమ్ము = సెలవిమ్ము అనుటయున్, పరమ + ఈశ్వరుండు = మహేశ్వరుడు, ప్రసన్న - హృదయుండు + ఐ = నిర్మలమైన హృదయము గలవాడయి - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. అఖిలాంగకముల భస్మాలేప మొనరించు
నతని నా భక్తుఁగా నాత్మఁదలఁపు
భసితత్రిపుండ్రంబు బాలపట్టికఁ దీర్చు
నతని నా భక్తుగా నాత్మఁ దలఁపు
రుద్రాక్షమాలికల్ రూఢిగా ధరియించు
నతని నా భక్తుఁగా నాత్మఁదలఁపు
లింగపూజాసక్తి లీనమానసుఁడైన
నతని నా భక్తుఁగా నాత్మఁదలఁపు

గీ. (ప్రణవ శత రుద్ర్య)మును [1]నధర్వంబు శిఖియుం
[2]బవనగీతియుం ద్వరితంబుం బౌరుషంబు
నీల రుద్ర్యంబుం బరియించు నియతి నెవ్వం
డతని నా కూర్మి భక్తుంగా నాత్మందలంపు 46

అర్థము: అఖిల + అంగకములన్ = ఎల్ల యవయవములందును భస్మ + ఆలేపము = విభూతి పూత ఒనరించు + అతనిన్ = చేయువానిని, నా - భక్తున్ + కాన్ = నా భక్తునిగా, ఆత్మన్ = మనస్సునందు, తలంపు = భావింపుము బాల - పట్టికన్ = పలకవంటి నుదుటి యందు భసిత - త్రిపుండ్రంబు = విభూతి నామము, తీర్చు = పెట్టు, అతనిన్, నా - భక్తున్ + కాన్, ఆత్మన్ + తలంపు రుద్రాక్ష - మాలికల్ = రుద్రాక్షమాలలు, రూఢిగాన్ = ప్రసిద్ధముగా, ధరియించు +అతనిన్, నా - భక్తున్ + కాన్, ఆత్మన్ + తలంపు లింగ - పూజా - సక్తి - లీన - మానసుడు = శివలింగము యొక్క పూజయందలి ఆసక్తి యందు అధీనమైన మనస్సు గలవాడు, ఐనన్, అతనిన్, నా భక్తుగాన్, ఆత్మన్ + తలంపు ఎవ్వఁడు, నియతిన్ = నియమముతో, ప్రణవ శతరుద్ర్యమును = ఓంకారముతోడి యజుర్వేదాంతర్గతమైన నమకమను వేద భాగమును అథర్వంబున్, శిఖియున్, పవన - గీతియున్, త్వరితంబున్, పౌరుషంబున్, నీల రుద్ర్యంబున్ పరియించున్, అతనిన్, నా - కూర్మి - భక్తున్ + కాన్ = నా ప్రియ భక్తునిగా, ఆత్మన్, తలరపు

1 తా నధ్వరంబు 2 తా బాపనీతియు

తాత్పర్యము: ఎల్ల యవయవములందును విభూతి నలదుకొను వానిని, విభూతినామమును నుదుట పెట్టుకొనువానిని, రుద్రాక్ష మాలలను తాల్చువానిని శివలింగ పూజను శ్రద్ధతో చేయు వానిని ప్రణవశతరుద్ర్యమును, అధర్వమును, శిఖిని, పవనగీతిని, త్వరితమును, పౌరుషమును పఠించు వానిని నా ప్రియ భక్తునిగా మనస్సున తలంపుము

విశేషములు: తలంపు - తలంపుము - `మధ్యమ పురుష మువర్ణకంబు నకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విభాషనగు. బాల. సంధి. 47

వ. అనిన విని ప్రీత చేస్కుండై యముండు "మహేశ్వరుండును, దక్షిణా మూర్తియు మృగాంకధరుండును, నీలకంఠుండును నగు పరమేశ్వరునకు నభివాదనంబు చేసి `దేవ సుకుమారుని నిమిత్తంబున దేవరచేతం బుణ్యశివరాత్రీ వ్రత మాహాత్మ్యంబును, భస్మోద్ధూళన త్రిపుండ్ర మాహాత్మ్యంబును, రుద్రాక్ష మాహాత్మ్యంబును నెఱిగితిం గృతార్థుండనైతి నని పలికి పునఃప్రణామం బాచరించి సముచిత ప్రకారంబున వీడ్కొని యముండు నిజపురంబునకుం జని సభామధ్యంబున ధర్మాసనాసీనుండై [యౌలు]లంబరా దులం దన దూతల రావించి యందం [గలయం] గనుంగొని యిట్లనియె. 47

అర్థము: అనినన్ = శివుడట్లు పలుకగా, యముండు, విని, ప్రీత - చేతస్కుడు + ఐ = సంతోషించిన మనస్సుగలవాడయి, మాహేశ్వరుండును, దక్షిణామూర్తియున్ = ఋషులకు జ్ఞానోపదేశము చేయుట కవతరించిన శివమూర్తియు, మృగాంక - ధరుండును = చంద్రుని ధరించువాడును, నీల - కంఠుండును = నల్లని కంఠము గలవాడును, అగు, పరమేశ్వరునకున్, అభివాదనంబు = నమస్కారము, చేసి, దేవ! సుకుమారుని, నిమిత్తంబునన్ = కారణమున, దేవర చేతన్ = తమచేత, పుణ్యా - శివరాత్రీ - మాహాత్మంబును, భస్మ + ఉద్ధూళన - త్రిపుండ్ర - మాహాత్మ్యంబును = విభూతి పూత, నామము అను వాని మహిమయును, రుద్రాక్ష - మాహాత్మ్యంబును, ఎఱింగితిన్, కృత + అర్థుండన్ = ధన్యుండను, ఐతిన్, అని, పలికి, పునః + ప్రణామంబు = తిరిగి నమస్కారము, ఆచరించి = చేసి, సముచిత - ప్రకారంబునన్ = తగిన విధమున, వీడ్కొని = సెలవు పుచ్చుకొని, యముండు, నిజ - పురంబునకున్ = తన పురమునకు, చని, సబా - మధ్యంబునన్ = సభ నడుమ, ధర్మ + ఆసన + ఆసీనుండు + ఐ = ధర్మపీఠమున కూర్చున్నవాడయి, ఔలుంబర + ఆదులన్ = ఔలుంబరుడు మున్నగు వారిని, తన - దూతలన్, రావించి, అందఱన్, కలయన్ = అంతటను కనుగొని, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: అని శివుడు పలుకగా యముడు విని మనస్సున సంతోషించి మాహేశ్వరుడును, దక్షిణా మూర్తియు, చంద్రమౌళియు, నీలకంఠుడును అగు

పరమేశ్వరునకు నమస్కరించి `దేవా సుకుమారుడు కారణముగా నేను తమవలన పుణ్యశివరాత్రీ వ్రత మాహాత్మ్యమును విభూతి పూత నామము అనువాని మాహాత్మ్యమును రుద్రాక్షమహిమను ఎఱిగితిని ధన్యుడనైతి నని పలికి మరల నమస్కరించి తగిన రీతిని సెలవు పుచ్చుకొని తన పురమునకు పోయి కొలువు నడుమ దర్మపీఠము నదివసించి యౌలుంబరాదులైన తన దూతలను రావించి యందఱను చూచి యిట్లు పలికెను.

విశేషములు: రావించు - వచ్చు + ఇంచు `ఇంచు క్చుక్పుగాగ మంబులు పరంబులగునపుడాగ మాదేశ లోపంబులు పెక్కుదెఱంగులం గానంబడియెడి బాల క్రియ 77. (రూపాం) రప్పించు.

గీ వినుఁడు బటులార యవధానవృత్తి మీరు
శంబుబాషిత ముడుగుండు సంశయంబు
ధరణి నెచ్చోట నై [న] నుం దిరుగునప్పు
డిందుశేఖరు బక్తుల నెఱుఁగుకొనుఁడు 48

అర్థము: భటులార., మీరు అవధాన - వృత్తిన్ = శ్రద్ధగా శంబు - బాషితము = శివుని వాక్యము, వినుండు సంశయంబు = సందేహము, ఉడుగుడు = విడువుడు, ధరణిన్ = భూమియందు ఏ + చోటన్ + ఐననున్ = ఎచ్చటనైనను తిరుగు + అప్పుడు = తిరుగువేళ, ఇందు - శేఖరు - బక్తులన్ = చంద్రావతంసుని (శివుని) భక్తులను, ఎఱుఁగుకొనుండు = తెలిసికొనుడు

తాత్పర్యము: బటులారా మీరు శివుని వాక్యమును శ్రద్ధగా నాలింపుడు సందేహము విడువుడు. భూమి యందెచ్చటనైనను తిరుగునప్పుడు మీరు శివభక్తులను తెలిసికొనుడు

వ. వారి లక్షణంబు లెటువంటి వనిన 49

తాత్పర్యము: శివబక్తుల లక్షణము లేవియనిన - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. కమియ బస్మోద్ధూళనము శరీరంబున
బసిత త్రిపుండ్రంబు బాలమునను
బ్రణవమంత్ర జపంబు రసనాంచలంబున
సావిత్రి హృదయాంబుజంబునందు
శతరుద్ర శివసూత్ర జ[ప] మహాదేవాది
నామావళీ కీర్తనము గళమున
శివపురాణాగమ శివకథా శివకీర్తి
శివ మహత్త్వంబులు శ్రవణములను

గీ. నలవరించినవారు పురారి భక్తు
లట్టివారల దొల నందంద కాంచి
భక్తి నంజలి చేసి తాత్పర్యమొప్పఁ
దొలఁగి పొండెల్లకాలంబు దూతలార. 50.

అర్థము: దూతలార, శరీరంబునన్, కమియన్ = ఎక్కువగా, బస్మ + ఉద్ధూళనము = విభూతి పూత, భాలముననుు = నుదుట, బసిత - త్రిపుంద్రంబున్ = విబూతి నామమును, రసన + అంచలంబునన్ = నాలుక కొనను, ప్రణవ - మంత్ర - జపంబున్ = ఓంకార మంత్ర జపమును, హృదయ + అంబుజంబు + అందున్ = హృదయ పద్మమున, సావిత్రి = సావిత్రీ మంత్రమును, గళమునన్ = కంఠమున, శతరుద్ర - శివ - సూత్ర - జప - మహాదేవ + ఆది - నామ + ఆవళీ - కీర్తనమున్ = శతరుద్రియము, శివసూత్ర జపము, `మహాదేవ మున్నగు నామముల వరుస యొక్క పఠనమును, శ్రవణములను = చెవులందు, శివపురాణ + ఆగమ, శివ - కదా - శివకీర్తి - శివ మహత్త్వంబులున్ = శివపురాణములును, శైవాగమములును, శివకదలును, శివకీర్తియు శివుని మహిమలును, అలవరించినవారు = చేయువారు, పుర + అరి - బక్తులు = పురవిరోధి (శివుని) బక్తులు అట్టివారలన్ దొలవ్ = దూరమున, అందంద = అచ్చటచ్చట కాంచి = చూచి, తాత్పర్యము + ఒప్పన్ = ఆసక్తి ఒప్పుగా బక్తిన్ = బక్తితో అంజలీ - చేసి = నమస్కరించి ఎల్ల - కాలంబున్ = ఎప్పుడైనను, తొలగిపొండు

తాత్పర్యము: దూతలారా. శరీరమున నెక్కవగా విభూతి నలదుట, నుదుట విభూతి నామమును పెట్టుట, జిహ్వాగ్రమున ఓంకారమంత్రమును జపించుట, హృదయ పద్మమున సావిత్రీ మంత్రమును జపించుట, కంఠమున శత రుద్రియ శివసూత్రజపము, మహాదేవాది నామావళి పఠనము, చెవులతో శివపురాణ, శైవాగమ, శివకథా శివకీర్తి శివ మహత్త్వమును వినుట, చేయువారిని శివభక్తులని తెలియుడు. వారిని మీరు దూరమున కాంచినంతనే భక్తి తాత్పర్యములతో నమస్కరించి యెప్పుడును తొలగిపొండు.

సీ. మృగటంకధరుఁడైన మీనాంకదమనుని
రక్త వర్ణంబైన రాజమౌళిఁ
బంచాననుండైన పరమేశ్వరుని దక్షి
ణామూర్తి యైన పినాకపాణి
నర్తకుండైన పన్నగ పతి గ్రైవేయు
నర్థ నారీశ్వరుండైన శివుని
దివిజ వంద్యుండైన త్రిపురాసురాంతకు
(బహుమూర్తి యుతుఁడైన ఫాల) నయను

గీ. నాత్మ నెవ్వండు చింతించు (ననవరతము)
నతని శివభక్తుఁగాఁ దెలియంగ వలయు
వందనం బాచరింపంగవలయు నతని
కర్థి (ని)బ్రదక్షిణంబు సేయంగవలయు 51

అర్థము: మృగ-టంకధరుఁడు = చంద్రుని ధరించినవాడు, ఐన, మీన+అంక-దమనునిన్=చేప చిహ్నముగా గలవాడైన మన్మథు నణచిన వానిని - శివుని, రక్త-వర్ణంబు + ఐన = ఎఱ్ఱని రంగుగల, రాజ-మౌళిన్ = చంద్రుడు శిరస్సున గలవానిని-శివుని, పంచ + ఆననుండు = అయిదు మొగములు గలవాడు, ఐన, పరమ + ఈశ్వరునిన్ = పరమేశ్వరుని, దక్షిణామూర్తి + ఐన, పినాక-పాణిన్ = పినాకము అను విల్లు చేతియందుగలవానిని (శివుని) నర్తకుండు + ఐన = నటుడైన, పన్నగ-పతి-గ్రైవేయున్ = పావతేడయిన వాసుకి కంఠహారముగా గలవానిని, అర్ధ-నారి + ఈశ్వరుండు + ఐన = సగము స్త్రీయు సగము ఈశ్వరుడునైన, శివునిన్, దివిజ-వంద్యుండు = దేవతలకు నమస్కరింపందగినవాడు + ఐన, త్రిపుర + అసుర +అంతకున్ = త్రిపురరాక్షసనాశకుని, బహుమూర్తి-యుతుఁడు = పెక్కాకారములతో గూడినవాడు (శివుడష్టమూర్తి గావు నిట్లనుట), ఐన, ఫాల-నయునన్= నుదుటకన్నుగలవానిని,

ఎవ్వండు, ఆత్మన్ = మనస్సునందు, అనవరతమున్ =ఎల్లప్పుడును, చింతించున్ = తలచును, అతనిన్, శివభక్తున్ + కాన్=శివభక్తునిగా, తెలియంగవలయున్ అతనికిన్, అర్థిని = కోరికతో, వందనంబు = నమస్కారము, ఆచరింపంగన్ వలయును, ప్రదక్షిణంబు, చేయగవలయున్.

తాత్పర్యము: చంద్రధరుడైన మన్మథహరుని, రక్త వర్ణుడైన చంద్రశేఖరుని, పంచముఖుడైన పరమేశ్వరుని, దక్షిణామూర్తియైన పినాక హస్తుని, నటుడైన సర్పరాజభూషణుని, అర్ధనారీశ్వరుడైన శివుని, దేవ వంద్యుడైన త్రిపురహరుని, అష్టమూర్తియైన ఫాలాక్షుని, ఎవడెప్పుడును మనస్సునందు ధ్యానించునో, అతనిని శివభక్తుడని ఎఱుగవలయును. అతనికి కోరికతో వందన మాచరించి ప్రదక్షిణము చేయవలయును.

సీ. కడు నేకకాలద్వికాలత్రికాలఁబు
నంగంబులందు భూ తలఁదిరేని
యజ్ఞానమునఁ బ్రమత్తాలస్యమున నైన
దవళాంశుకోటీరుం దలఁచి రేని
మృడునకు నై యష్టమీ చతుర్దశులందు
నుపవాస ముండంగ నోపిరేని

షట్కాలములయందు సర్వలోకేశ్వరు
శ్రీమహాదేవుఁ బూజించిరేని

గీ. వారు మాన్యులు పార్వతీవల్లభునకు
వారె వంద్యులు మముబోఁటి వారికెల్ల
నట్టివారల మన్నింపరైతి రేని
ద్రోహమగు మీకు నాకు నద్రోహులార! 52

అర్థము: అద్రోహులార = భక్తులారా! ఏక - కాల-ద్వి-కాల-త్రికాలంబున్ = ఒకటి రెండు మూడు కాలములందు, అంగంబులందున్ = అవయములందు, కడున్, మిక్కిలిగా, భూతి = విభూతి, అలఁదిరి + ఏని = పూసిరేని.

అజ్ఞానమునన్ = తెలియకయైనను, ప్రమత్త + ఆలస్యమునన్ + ఐనన్ = మిక్కిలి క్రొవ్వి అలసత్వము చే నైనను, ధవళ +అంశు-కోటీరున్ = తెల్లని కిరణములు గలవాడు (చంద్రుడు) కిరీటముగా గలవానిని (శివుని), తలంచిరి + ఏని = ధ్యానించిరేని, మృడునకున్ + ఐ = ఈశ్వరునకై, అష్టమీ-చతుర్దశలందున్ = అష్టమి యందును, చతుర్దశియందును, ఉపవాసము, ఉండగన్, ఒపిరి + ఏని = ఉపవసింపగలిగిరేని, షట్ + కాలములయందున్ = ఆఱు కాలములయందును, సర్వ-లోక + ఈశ్వరున్ = అఖిల జగత్పతిని, శ్రీ మహాదేవున్ పూజించిరి +ఏని. వారు, పార్వతీ - వల్లభునకున్ = పార్వతీ ప్రియునకు, మాన్యులు = గౌరవింపదగినవారు, వారె = వారే, మముబోఁటివారికిన్ = మావంటివారికి, ఎల్లన్, వంద్యులు = నమస్కరింపదగినవారు, (మీరు), అట్టివారలకున్, మన్నింపరు + ఐతిరి + ఏని = గౌరవింపనిచో, మీకున్, నాకున్, ద్రోహము + అగున్ = కీడగును.

తాత్పర్యము: భక్తులారా! ఒక మాఱులో రెండుమాఱులో మూడుమాఱులో అవయములందు మిక్కిలిగా భస్మము నలదు వారును, తెలియకయో, క్రొవ్వుట వలని యలసత చేతనో చంద్రశేఖరుని తలచు వారును, అష్టమీ చతుర్దశులందు శివుని గూర్చియుపవాసముండ గలుగువారును, షట్కాలములందును సర్వలోకేశ్వరుడైన శ్రీ మహాదేవుని పూజించువారును పార్వతీ ప్రియునకు గౌరవాస్పదులు వారే మావంటివారి కందఱకును నమస్కార్యులు మీరట్టివారిని మన్నింపనిచో మీకును నాకును కీడగును.

విశేషములు: మన్నింపరైతిరి - మన్నించు వ్యతిరేకంబునలజీయగు' బాల.క్రి7. మన్నించు+ లజీ జీత్తు పరంబగునపు దుత్వంబగు బాల.క్రి. 20 మన్నించ + లజీ ముజ్జీత్తులుముత్తు నాఁబడు బాల.క్రి. 'ఆగమాద్యచకారంబుల కద్విరుక్తంబులకు ముత్తుపరంబగునపుడు ప, వ, లగు.' బాల. క్రి. మన్నింప + లజీ లకారంబునకు డుఁబువురును ముజ్జాగు. బాల.క్రి. మన్నింపరు. మన్నింపరు + ఐతిరి - 'భూతంబున

లటికి లిడంతంబగు నగుధాతు వనుప్రయుక్తంబగు బాల. క్రియ 114 లిడంతంబగు నగుధాతు మధ్యమపురుష బహువచనరూపము - ఐతిరి. మన్నింపరైతిరి = మన్నించితిరి కారని భూతార్థకము.

క. శివు నెడ భక్తియు నెప్పుడు
శివ భక్తులఁ జూచినపుడు శివుఁడను తలఁపున్
శివ శివ కలిగిన వారల
[1]శివ సాదృశ్యులను మీరు చేరకుఁ డెపుడున్. 53

అర్థము: ఎప్పుడున్, శివు+ ఎడన్ = శివునియందు, భక్తియున్, శివ-భక్తులన్, చూచిన + అపుడు, శివుఁడు +అను, తలఁపున్ = భావమును, కలిగిన వారలన్ = కలిగినవారగు, శివ-సాదృశ్యులను = శివునితో సమానత్వముగలవారిని, శివశివ = హరహరా! మీరు, ఎపుడున్, చేరకుఁడు = సమీపింపకుండు.

తాత్పర్యము: ఎల్లప్పుడును శివునియందు భక్తియును, శివభక్తులను చూచినప్పుడు శివుడనెడి భావమును కలిగినట్టి శివసమానులను శివ శివా! మీ రెన్నడును చేరకుడు.

విశేషములు: శివు + ఎడ = శివునెడ `షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు' బాల. సంధి. 34 `శివ శివ యనునది శివసాదృశ్యులను చేరుట యెంత హానికరమో సూచించును.

క. అలవోకయుఁ గలలోనను
మలహరు భక్తులను నీశు మన్నించిన వా
రల (భక్తవరుల)శైవులఁ
దలఁపకుఁడీ దూతలార!దండింపంగన్ 54

అర్థము: దూతలారా! అలవోకయున్ = యాదృచ్ఛికముగానైనను, కలలోనను మల-హరు-భక్తులను, = పాపములను బోగొట్టు శివునియొక్క, భక్తులను, ఈశు-మన్నించిన వారలన్ = ఈశుడు గౌరవించిన వారును, భక్త-వరులన్ = భక్త శ్రేష్ఠులను, అగు, శైవులన్, దండింపంగన్ = శిక్షించుటకు, తలఁపకుఁడీ.

తాత్పర్యము: దూతలారా! మీరు యాదృచ్ఛికముగానైను, కలలోనైనను పాపహరుడైన శివుని భక్తులను, శివుడాదరించు శైవభక్త శ్రేష్ఠులను దండింప నెంచకుడు.

విశేషములు: ఈశు మన్నించిన-ఈశుడు మన్నించిన `ధాతుజ విశేషణ భావార్థక

---

1 తా. శివసాదృశ్యులురు.

పూర్వవ్యవహితా వ్యవహిత ప్రథమకుందఱచుగ యొక్క షష్ఠియగు ప్రౌఢ.కారక. 15 `యొక్కకు లోపంబు బహుళంబు -ప్రౌఢ కారక. 16.

ఆ.వె. పాపకర్మునైన భాగ్యహీనుని నైనఁ
బట్టి చూడ మీకుఁ బాడి గాదు
శైవవరులఁ జేరి సేవించువారలు
పురహరుండ కాఁగ బుద్ధిఁ గనుఁడు 55

అర్థము: శైవ- వరులన్ = శైవ శ్రేష్ఠులను చేరి, సేవించువారలు, పుర-హరుండు + అ = త్రిపురాంతకుడైన శివుడే, కాఁగన్ = అగునట్లు, బుద్ధిన్ + కనుఁడు = మనస్సున భావింపుడు, (అట్టివానిని) పాపకర్మున్ + ఐనన్ = పాపాత్మునైనను, భాగ్యహీనునిన్ + ఐనన్ = అదృష్టము లేని వానినైనను, పట్టి-చూడన్ = బంధించి చూచుటకు, మీకున్, పాడి+కాదు = ధర్మము కాదు.

తాత్పర్యము: శివభక్తులను చేరి సేవించువాడు శివుడనియే భావింపుడు. అతడు పాపకర్ముడైనను, భాగ్యహీనుడైనను, వానిని బంధించుట మీకు ధర్మము గాదు

ఆ.వె. జంతుకోటిలోన శంకర పాదాబ్జ
సేవ సేయువారిఁ [1]జేర కెపుడు
దూరమందుఁ దొలఁగి దూషింప కెంతయు
భక్తిఁ గొలువవలయు [2]భటులు మీరు. 56

జంతు-కోటిలోనన్ = ప్రాణుల సమూహములో, శంకర-పాద + అబ్జ - సేవ = శివుని పాద పద్మముల సేవ, చేయు - వారిన్, ఎపుడున్, చేరక = సమీపింపక దూరమందున్ + తొలఁగి = దూరముగా తొలగి, దూషింపక = నిందింపక ఎంతయున్ = మిక్కిలి, భక్తిన్ = భక్తితో, కొలువవలయున్ = సేవింపవలయును.

తాత్పర్యము: భటులారా ! ప్రాణి సమూహములో శివుని పాదపద్మములను సేవించు వారిని మీరెప్పుడును సమీపింపక, దూరముగా తొలగి, దూషింపక మిక్కిలి భక్తితో సేవింపవలయును.

విశేషములు: కొలువవలయు భటులు మీరు. `మధ్యమ పురుష యోగంబునం దారాగాగమంబు విభాష నగు. బాల. తత్సమ. 37 ఇచ్చట `కొలువవలయు ననునది సర్వపురుష సామాన్యక్రియ యయ్యెను, `మీరు అను యుష్మదర్థక కర్తచే

1 తా జేయ 2 తా భటుల

నది మధ్యమపురుష క్రియయే యగుచున్నది. కావున సంబోధ్యవాచకమున కార
గాగమము వికల్పమయినది.

క ప్రాసాదము నిర్మాల్యము
వాసితొ పాదోదకంబు వైభవ మలరన్
[1]డాసినఁ గైకొనువారలఁ
దా సేవింపంగవలయుఁ దథ్యము సుండీ 57

అర్థము: ప్రాసాదమున్ = దేవాలయమును, నిర్మాల్యమున్ = దేవ పూజానంతరము తీసివేసిన పుష్పాదికమును, వాసిత = పరిమళము గలదిగా చేయబడిన, పాద + ఉదకంబున్ = దేవతా పాద జలమును, వైభవము = మహిమ, అలరన్ = ఒప్పుగా, డాసినన్ = సమీపించినను, కైకొను వారలన్ = స్వీకరించిన వారలను, తాన్ = తాను, సేవింపంగ వలయున్, తథ్యము-సుండీ = సత్యముసుండీ

తాత్పర్యము: దేవాలయమును, నిర్మాల్యమును, పరిమళితమైన దేవతా పాద జలమును వైభవ మొప్పుగా డాసిన వారిని, స్వీకరించు వారిని కొలువవలయును ఇది తథ్యము సుండీ

విశేషములు: 'వ్రాసి ముద్రా రాక్షసమయి యుండును. 'వాసిత అని యున్నచో సరిపడును. కావుననే మార్పబడినది 'వాసితో అనునది అసంగతము.

వ. అని కృతాంతుండు తామసాధ్వానంబు (?) నొలుంబరాదులకుం జెప్పి యీ ప్రకారంబులయందు ఘంటా ధ్వానంబులతో సర్వజంతు విజ్ఞాపనంబుగాఁ జాటుండని యంతర్ధానంబు గావించె. దూతలు నట్లు కావించిరి. ఈ ప్రకారంబున శౌనకాదులకు రోమహర్షణముని ప్రవరసుతుండు సూతుండు చెప్పెనంత 58

అర్థము: అని, కృతాంతుండు = యముడు, తామ సధ్వానంబున్, ఔలుంబర + అదులకున్, చెప్పి, ఈ - ప్రకారంబుల యందున్ - ఈ విధములందు, ఘంటా + ఆరావంబులతో = గంటల ధ్వనులతో, 'సర్వ-జంతు-విజ్ఞాపనంబు + కాన్ = ఎల్ల ప్రాణులకొఱకైన విన్నపముగా, చాటుండు + అని, అంతర్ధానంబు + కావించెన్ = మాయమయ్యెను, దూతలున్, అట్లు, కావించిరి, ఈ - ప్రకారంబున నన్ - ఈ విధమున, శౌనక + ఆదులకున్ = శౌనకుడు మున్నగు వారికి, రోమహర్షణ-ముని-ప్రవర-సుతుండు = మునిశ్రేష్ఠుడగు రోమహర్షణుని కుమారుడు, అగు, సూతుండు, చెప్పన్, అంతన్.

తాత్పర్యము: అని యముడు ఔలుంబ రాదులకు చెప్పి 'యీ విషయములను సర్వ ప్రాణులకును గంటల ధ్వనులతో మనవిగా చాటింపుడు? అని పలికి

1 తా దాసిన

అంతర్హితుడయ్యెను. దూతలు నట్లు చేసిరి. ఈ విధముగా శౌనకాది మునులకు సూతుడు చెప్పెను అంత -

విశేషములు: `తామ సాధ్వానంబు అననేమో దుర్బోధముగా నున్నది.

శా. రామామన్మథ భోజరాజకవితారమ్య ప్రభావో (న్న)తా
సామగాన విశేషశాస్త్రకలనా సంభావ్యసారోదయా
సోమార్కానల నేత్ర తేజ గురు శుశ్రూషాత్మ సంవర్ధితా
(హేమాద్రీశ్వర ధైర్య! దాన ఖచరా)1యిద్ధ ప్రతాపోన్నతా 59

అర్థము: రామా-మన్మథ =స్త్రీలకు మన్మథుడైనవాడా', భోజ-రాజ- కవితా-రమ్య-ప్రభావ + ఉన్నతా = భోజ రాజు యొక్క కవిత్వము వలె సుందరమైన ప్రభావము చేత గొప్పవాడా, సామ + ఆగాన - విశేష-శాస్త్ర-కలనా = సామవేదము యొక్క, మిక్కిలియైన గానముచేత, అధికమైన శాస్త్రములయొక్క, జ్ఞానము గలవాడా!, సంభావ్య-సార + ఉదయా = సంభావింపదగిన, బలము యొక్క వృద్ధిగలవాడా, సోమ + అర్క+ అనల- నేత్ర-తేజ = చంద్రుడు, సూర్యుడు, అగ్ని కన్నులుగా గలవాని (శివుని) తేజస్సువంటి తేజస్సు గలవాడా!, గురు-శుశ్రూషా + ఆత్మ - సంవర్ధితా - గురు సేవ యొక్క స్వరూపముచేత వృద్ధి పొందినవాడా!, హేమ + అద్రి + ఈశ్వర - ధైర్య = బంగరు కొండతేని (మేరువు యొక్క) - ధైర్యము వంటి ధైర్యము గలవాడా!, దాన-ఖచరా = ఈవియందు, వేలుపయినవాడా!, ఇద్ధ - ప్రతాప + ఉన్నతా = అప్రతిహతమైన, పరాక్రమముచేత, గొప్పవాడా! (కృతిభర్తయగు ముమ్మయ శాంతయ సంబోధనములు)

తాత్పర్యము: స్త్రీలకు మన్మథునివలె సుందరుడా! భోజరాజు కవిత్వము వలె రమ్యమైన ప్రభావముచే నున్నతుడా! సామవేదగానముచే నధికమైన శాస్త్రజ్ఞానము గలవాడా! సంభావింపదగిన బలము యొక్క వృద్ధి గలవాడా! చంద్ర సూర్యాగ్నులు నేత్రములుగాగల శివుని తేజస్సువంటి తేజస్సు గలవాడా! మేరు సమానధీరుడా! ఈవియందు వేలుపయినవాడా!! అప్రతిహత ప్రతాపముచే నున్నతుడా!

క. లింగార్చ(నదే)హా! నవ
సంగత శైవార్థ తత్త్వ సముదిత మోహా!
శృంగారార్థ విశేషా!
మంగళసంధానకృత్య ! మహిమోన్నత్యా 60

1 తా. యుద్ధ

అర్థము: లింగ + అర్చన - దేహా = శివలింగ పూజగల శరీరము గలవాడా నవ-సంగత-శైవ + అర్థ-తత్త్వ-సముదిత-మోహా = క్రొత్తగా కూడిన శైవార్థముల యొక్క తత్త్వమునందుదయించిన వలపు గలవాడా శృంగార + అర్థ- విశేష = శృంగారమునకు సంబంధించిన అర్థముల ఆధిక్యము గలవాడా మంగళ - సంధాన - కృత్య = శుభములను గూర్చునట్టి పనులు గలవాడా . మహిమ + ఔన్నత్యా = మహిమము యొక్క ఉన్నతిగలవాడా కృతిపతియగు ముమ్మయ శాంతయ్య సంబోధనములు.

తాత్పర్యము: శివలింగము నర్చించు శరీరము గలవాడా! క్రొత్తగా సంగతములైన శైవార్థముల తత్త్వమునం దుదయించిన వలపు గలవాడా! శృంగారార్థముల ఆధిక్యము గలవాడా మంగళములను గూర్చు పనులు గలవాడా. మహిమము యొక్క ఉన్నతి గలవాడా

మాలిని *పరమపరకలాపా బాసురానంగరూపా
సురుచిరశుభమూర్తీ శో(బితా)నంద వర్తీ

అర్థము: పరమ - పర-కలపా = ఉత్కృష్టములు, శ్రేష్ఠములునైన భూషణములు గలవాడా. భాసుర + అనంగ - రూపా = ప్రకాశించు మన్మథుని రూపమువంటి రూపము గలవాడా., సురుచిర - శుభ-మూర్తీ = మిక్కిలి మనోహరము, మంగళమునైన ఆకారము గలవాడా , శోభిత + ఆనంద - వర్తీ = ప్రకాశించు నానందము నందు వర్తిల్లువాడా. - ముమ్మయ శాంతయ్య విశేషణములు.

తాత్పర్యము: మిక్కిలి ఉత్కృష్టములైన అలంకారములు గలవాడా!, ప్రకాశించు మన్మథ రూపము గలవాడా. మిక్కిలి మనోహరము మంగళ కరము నైన ఆకారము గలవాడా! ప్రకాశించు నానందమున వర్తిల్లువాడా!

గద్యము: ఇది శ్రీమత్కమల నాభ పౌత్ర మారయామాత్య పుత్ర సకల విద్యా సనాథ శ్రీనాథనామధేయ ప్రణీ తంబయిన శివరాత్రి మాహాత్మ్యంబునందుం బంచమాశ్వాసము. దీని వాఖ్య పూర్వాశ్వాసాంతగద్యలవ్యాఖ్యవలెనే.

గీ. అమల జొన్నలగడ్డ వంశాబ్ధి విధుఁడు
ఖ్యాత మృత్యుంజయాభిఖ్యుఁడైనవాఁడు
పరఁగ శ్రీనాథ కవిసార్వభౌమ రచిత
భవ్య శివరాత్రి మాహాత్మ్య కావ్యవరముఁ
బ్రతి పదార్థ విశేష తాత్పర్య కలన
స్పష్ట మొనరించు `చంద్రికా వ్యాఖ్య యిద్ది.

* తాళపత్రమున రెండుపాదములే యున్నవి

అకారాది

పద్యానుక్రమణిక

అ ఆ

ఆ

గ

చ

బ

భ

మ

య

ర


ల

వ

శ

స

హ



శ్రీ శివరాత్రి మాహాత్మ్యం

శ్రీనాథ మహాకవి

వ్యాఖ్యాత
డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

శ్రీనాథ కవి సార్వభౌముని కావ్యాలలో శివరాత్రి మాహాత్మ్యం పేరెన్నిక గలది.

తెలుగు సాహిత్యాకాశంలో ధ్రువతారగా నిలిచిన విద్వత్కవి శ్రీనాథుడు. అతడనుభవించని భోగాలుగానీ పొందని రాజసమ్మానాలు గానీ లేవు. శ్రీనాథ మహాకవి 14వ శతాబ్దంవాడు. ఈయన తెలుగు సాహిత్యాన్ని కావ్యమార్గంవైపు మళ్లించాడు.

'ఈశాన సంహిత' లో అతి సంగ్రహంగా ఉన్న కథను తీసుకుని శ్రీనాథుడు ప్రబంధంగా శివరాత్రి మాహాత్మ్యమును మలిచాడు. ఇందులో నాటి సామాజిక జీవనం ప్రతిబింబిస్తున్నది.

డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారు 'శివరాత్రి మాహాత్మ్యం'పై ఉన్న అన్ని వివాదాలను క్షుణ్ణంగా పరిశీలించి విపులమైన పీఠిక రాశారు. ఐదాశ్వాసాల ఈ గ్రంథానికి వివరణాత్మక వ్యాఖ్యానం ఇది.